A.P.G.O.M.L. & R.I. Series 9

# నారదీయపురాణము

అల్లాడు నరసింహకవి ప్రణీతము

## నారదీయపురాణ అమృతనవనీతం

(మహామథన సారామృతం)

పరిశోధనా రచన:
వాఙ్మయమహాధ్యక్ష
డాక్టర్. వడ్లమూడిగోపాలకృష్ణయ్య
"కళా-ప్రపూర్ణ"

ప్రచురణ :
డైరక్టర్,
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స
లైబ్రరీ అండ్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అఫ్జల్‌గంజ్, హైదరాబాదు.
O.U. Campus ప్రక్కన, తార్నాక.

# నారదీయపురాణ అమృతనవనీతం

## ఆర్ష వాఙ్మయం

"శ్రుతి, స్మృతి పురాణేతిహాసా" లన్నది అతి ప్రాచీనమై, అత్యంత సామాన్యమై, సత్యశ్రీ శోభితమైన వాక్యం. అయితే శ్రుతుల వెంటనే స్మృతు లుద్భవించాయనిగాని, ఆ వెనువెంటనే క్రమంగా, పురాణేతిహాసాలు అవతరించాయని గాని చెప్పడానికి అవకాశంలేదు. "అనంతావై వేదాః" అన్న వేదవాక్యం ప్రకారం, వేదాలుగాని, వేదదేవులుగాని, వేదర్షులు, వేదచ్ఛందస్సులుగాని, అనంతాలు. ఆర్ష విజ్ఞాన దృక్పథంతో చూచినప్పుడు వేదఋషులందరూ, వేదద్రష్టలే కాని, వేద స్రష్టలు కారు. మామూలుగా పండితులైనవారు కూడా గురుముఖతః నేర్చుకునేవి కాబట్టి గురువు నోటినుంచి ఉచ్చరించడంవల్ల వినడం ద్వారా నేర్చుకునేవి కాబట్టి, వేదాలకు, శ్రుతులన్న నామం వచ్చినట్లు గతంలో భావించడం జరిగింది. వాస్తవాని కిది మూలార్థంకాదు. వేదర్షులు వేదద్రష్టలయ్యారంటే చర్మచక్షువులైన నేత్రాల వల్ల చూడడంవల్ల కాలేదు. తమ అమోఘ తపస్సంపత్ఫలితమైన దివ్యజ్ఞానంతో, శ్రోత్రేంద్రియాలతో వినుకలి కారణంగానే వాటిని నేర్చుకొనడంవల్ల, అవి శ్రుతులుగా వర్ణించబడ్డాయి. ఈ దృక్పథంతోనేకాక వాస్తవిక దృక్పథంతోకూడా ఆలోచించినపుడు వేదాలు అపౌరుషేయాలుగా గోచరమౌతాయి. అసలు, అలౌకికమైన సంస్కృత భాషను మన ప్రాచీనులందరూ, ఏకకంఠంతో 'దేవభాష'–'అమర భాష' ఇత్యాద్యర్థ బోధకాలైన వివిధనామాలతో పేర్కొన్నారంటే, వేదాలు అపౌరుషేయాలని నిర్ద్వంద్వంగా ఉద్ఘాటించినట్లే. ఆర్ష విజ్ఞానం దృష్ట్యా వేదాలు అపౌరుషేయాలేనని ఆచరణ పూర్వకంగా తిరుగులేని విధంగా నిరూపించడానికి తగిన మార్గాలు కొన్ని నా పరిశోధనలలో లభ్యమైనాయి. అయినపుడు యథార్థస్థితిని గుర్తించలేక, ఆర్ష విజ్ఞానం లోతుపాతులు తెలియక, "వేదాలు పౌరుషేయాలా? అపౌరుషేయాలా?" అని చర్చించుకుంటూ, చారిత్రక దృష్టితో రకరకాల ఊహాగానాలు చేస్తున్నారంటే, ఇది నేలవిడిచిన సాముజవంటిదే కదా !

వేదాలు అనంతాలన్న మాటను అలా వుంచుదాం. వాస్తవానికి వేదం ఎంత గ్రంథమైనా, వేదం వేదమే కదా ! అంటే ఏకైకమేకదా మరి. అయితే కల్ప వృక్షం వలెనో, కామధేనువు వలెనో అనేకార్థదాయకాలైన ఈ వేదమంత్రా

లను బ్రహ్మ చతుర్ముఖాలనుంచి నాలుగు వేదాలు ఆవిర్భవించాయన్న మాటను విడిచిపెడితే తనకు లభ్యమైనంతలో విశిష్ట దృక్పథంతో వేదవ్యాసుడు ఋగ్యజు స్సామాథర్వ భేదాలతో నాలుగు వేదాలుగా విభజించినట్లు కనిపిస్తున్నది. యజు ర్వేదంలో ప్రత్యేకించి కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేద మని రెండు భేదా లున్నాయి. అనంతాలైన వేదాలను ఒక అనంతుడే తప్ప లేదా అనంతునివంటి వాడైనా తప్ప మానవమాత్రుడు మనీషి అయినా, మహర్షియే అయినా, పూర్తిగా అవలోడన చేయడం సాధ్యంకాదు. అతి ప్రాచీనకాలంలోనే వేదవిభజన జరిగిన తరువాత కూడా, మొత్తం వేదం మాట దేవుడెరుగునుకాని, విభజితాలైన వాటిల్లో ఒక్కొక్కదానైనా అవగాహన చేసుకొనడం మహర్షులకే కష్టసాధ్యం అయిపోయింది. కాగా వాటిని శాఖోపశాఖలుగా విభజించి కొందరు కొందరికి ఒక్కొక్క శాఖవంతున నేర్పి పరివ్యాప్తి చెందించడం జరుగుతూ వచ్చింది. కాల క్రమేణా వివిధ శాఖలను అభ్యసించి పరిరక్షించేవారే కరువైపోవడంతో, అనేక వేదభాగాలకు అసలుకే మోసం వచ్చింది.

ఋగ్యజుస్సామాథర్వ వేదాలు మనకు పూర్తిగా లభ్యమైనాయని కొందరు అనుకుంటున్నారు కాని అది వాస్తవంకాదు. పైలమహర్షి ఋగ్వేదాన్ని 21 శాఖలుగాను, వైశంపాయన మహర్షి యజుర్వేదాన్ని 101 శాఖలుగాను, జైమిని మహర్షి సామవేదాన్ని 1000 శాఖలుగాను, సుమంత మహర్షి అథర్వవేదాన్ని 9 శాఖలుగాను విభజించి ప్రచారంచేయడంలో ప్రవర్తకులై వర్తించినట్లు సంప్రదాయ సిద్ధమైన ప్రసిద్ధివున్నది. ఈ పైల, వైశంపాయన, జైమిని, సుమంత మహర్షులే రోమహర్షుడనే నామాంతరంగల సూతమహర్షికి వివిధ పురాణాలను ఉపదేశించి నట్లు వేరొక ప్రసిద్ధివున్నది.

## వేదాదుల్లో విభాగాలు

లభించిన ఋగ్వేదంలో వివిధ అష్టకాలతోపాటు మండలభాగాలు కూడా వున్నాయి. లభ్యమైన కృష్ణ, శుక్ల, యజుర్వేదాలలో అధ్యాయ విభాగా లున్నాయి. అష్టాదశపర్వ సంభృతమైన మహాభారతం పర్వ విభజనతో వున్నట్లు అందరికీ తెలిసిందే. అయితే సహస్ర శాఖాత్మకమైన సామవేదంలో, ఇప్పటికి లభ్యమైన కౌతుక-జైమిని-రాణాయణీయ నామకాలై మూడు శాఖలలోను ప్రత్యేకించి రాణాయణీయశాఖలో దశరాత్ర- అహీన- క్షుద్ర- ప్రాయశ్చిత్త- సత్ర- ఏకాః భేదాలతో వివిధ పర్వభాగాలున్నాయి. అంటే భారతంలో పర్వవిభజనకు సామవేదంలోని పర్వ విభజనమే మూలాధారం అన్నమాట. లభ్యమైన అథర్వ వేదంలోసైతం యజుర్వేదంలో వలెనే వివిధ అధ్యాయాలున్నాయి.

వాఙ్మయ మహోధ్యక్షుని

వేదాది గ్రంథాలలోవున్న విభాగాత్మకాలైన ప్రాచీన నామాలన్నీ ఆర్ష విజ్ఞాన పరమైనవే. ఋగ్వేదంలోని అష్టకవిభాగం మర్మపూర్వకమైనది. ప్రాణ పూర్వకమైనదికూడా. ఖగోళ, జ్యోతిష శాస్త్రాల దృష్ట్యా అష్టమం మర్మస్థానం, ఆయుస్థానంకూడా. అత్యంత నిగూఢాలూ ప్రాణప్రదాలూ అయిన అమూల్యా విషయాలు కొన్ని ముగిసిన తరువాత అష్టక విభాగాన్ని ఏర్పాటుచేసినట్లు కనిపిస్తున్నది. మండలవిభజన వైజ్ఞానికంగా చక్రనేమిక్రమాన్ని అనుసరించి యేర్పరచినట్లు కనిపిస్తున్నది. ఋగ్వేదం "కృ" పూర్వకమైన వివిధ సౌరమండలాల రహస్యాలను వెల్లడించేది కాగా, యజుర్వేదం అమృత శశికళాత్మకమై ఖగోళపరంగా పరమ వైజ్ఞానికంగా శుక్ల-కృష్ణ పక్షాత్మకమై ద్వివిధాలైనా విభిన్న భాగాలను దృష్టిలో పెట్టుకొని అధ్యాయాత్మకంగా అవతరించింది. సామవేదం శబ్ద-నిశ్శబ్దశక్తి సంపూర్ణమై బహుముఖ, గాన-(బహిర్గాన)-మౌనగాన (అంతర్గాన)-పర్వాత్మకమైనది. ఒక పర్వం పూర్తి అయినదంటే, ఒక పర్వం (పండుగ) అంటే ఒకానొక మహిమోత్సవం జరుపుకొన్నట్లే నన్నమాట.

"స్మృతి" జ్ఞానధారణ పటుత్వానికి సంబంధించిన జ్ఞాపకశక్తి విషయకమైనది. పురాణం అతిపురాతనతకు సృష్టిస్థితిలయాత్మకమైన ప్రకృతి స్వరూపస్వభావ చైతన్య సాంకేతిక, చారిత్రక కథారూపమైనది. బ్రహ్మాండ భాండంలో సృష్టి వ్యవస్థలో యేర్పడే పరిణామాలకు, ఫలితాలకు ప్రతిబింబకమైనది. ఇతిహాసమన్నది ఏదైనా ఒకానొక విశిష్టమైన, విచిత్రమైన వినవలసిన కథను విని చివరికి పెద్దపెట్టున కడుపుబ్బ నవ్వు పుట్టించేటటువంటిది. ఈ నవ్వులో అగాధమైన వేదాంతభావం పరిగర్భితమై వుంటుంది. భారతమంతా చదివి-ఉభయపక్షాలలో జరిగిన ప్రాణ నష్టాన్ని- దేశభ్రష్టతను- దృష్టిలో పెట్టుకొని పాండవులకు మిగిలిన విజయ ఫలితాన్ని చూచినా శ్రీకృష్ణ నిర్యాణానంతరం ప్రత్యేకించి అర్జునుడు, మిగిలిన సహోదరులు శక్తిహీనులై నామమాత్రులుగా మిగలడం చూస్తే "హరి, యెంత వెర్రివాళ్లురా' అని మనకు తోచి నవ్వు రాకతప్పదు. ఆ జగన్నాటక సూత్రధారి నడిపినకథకు ఫలితంగా మనకు మిగిలేది భగవద్గీతామయమైన తత్త్వచింతనమే. ఇది కూడా విష్ణుమాయలో, కృష్ణలీలలో ఒక హాసం వంటిదే.

కాండ, సర్గాది విభజనలుసైతం ఒకానొకవిధమైన విశిష్ట గ్రంథ విభజనను సూచిస్తూ యేర్పడినవే.

అనంతరకాలంలో కావ్యాదులలో వచ్చిన ఆశ్వాస, ఉచ్ఛ్వాస, ఉల్లాసాది విభాగాలుసైతం ఒక పెద్దకథను విన్న తరువాత "హమ్మయ్య" "హరి బాపురే" వంటి పదాల ననుకుంటూ నిట్టూర్పులు విడవడం, లేదా "భలేగా జరిగిందిరా! మహా

బాగా జరిగింది" అనుకోనడం రూపంగానో ఉత్సాహాన్ని అభివ్యక్తీకరించే సంఘటనలు దృష్టిలో పెట్టుకొని అవతరించినవే.

శ్రుతి, స్మృతి, పురాణేతిహాసా లన్నమాట యేవిధంగా యెప్పుడు రూపొందిందో సాధికారికంగా చెప్పలేము. శ్రుతులకు ఉపశ్రుతులు లేవుగాని, విశిష్టార్థంలో ఉపశ్రుతి శబ్దం ప్రాచీనకాలంనుంచి వ్యవహారంలో వున్నది. అయితే స్మృతులకు, ఉపస్మృతులు, పురాణాలకు ఉపపురాణాలు అవతరించాయి. కాని ఇతిహాసానికి ఉపేతిహాసాలు అవతరించలేదు. అయితే ఉపకథలు లేకపోలేదు. శ్రుతి, స్మృతి, పురాణాలు విభిన్నాలుగా వున్నట్లే, ఇతిహాసాలుకూడా విభిన్నాలుగా వున్నాయి. మహాభారతం వొక్కటే ఇతిహాసనామకమని చాలామంది అభిప్రాయం. కాని ప్రాచీనులు అద్భుతరామాయణం–అధ్యాత్మరామాయణం–ఆనందరామాయణం–గర్గసంహితవంటి గ్రంథాలనుకూడా ఇతిహాసాలుగానే పేర్కొన్నారు. అంతేకాదు. 'ఇతిహాస సముచ్చయం' అన్న పేరుతో వేరొక విశిష్టగ్రంథం కూడా వున్నది. కాగా ఇతిహాసం ఒక్కటిమాత్రమే కాదని గ్రహించక తప్పదు.

ఆర్ష వాఙ్మయంలో బ్రాహ్మణాలు–ఆరణ్యకాలు–ప్రాతిశాఖ్యాది గ్రంథాలే కాక వేదాంగాలుగా శిక్ష–వ్యాకరణం–ఛందస్సు–నిరుక్తం–ఆదిత్యాది వివిధ జ్యోతిష గ్రంథాలు–ఆశ్వలాయనాదుల అనేక కల్పగ్రంథాలు ఉన్నాయి. యాస్కకృతమైన ఒక్కనిరుక్తాన్ని విడిచిపెడితే మిగిలినవన్నీ ఆర్ష గ్రంథాలుగానే కనిపిస్తున్నాయి. శిక్షావ్యాకరణాలు కేవలపాణినీయాలు మాత్రమే అని చెప్పే అవకాశంలేదు. పాణినికి పూర్వకాలంలో శిక్షావ్యాకరణ గ్రంథాలు లేవని చెప్పడానికి బొత్తిగా ఆస్కారంలేదు. అదేవిధంగా పింగళునికి పూర్వం ఛందోగ్రంథం ఒక్కటికూడా అవతరించలేదని చెప్పలేము. ఇక జ్యోతిషకల్ప గ్రంథాల విషయంలో చర్చించడానికి అవకాశమే లేదు. ఉపనిషత్తులు, ఇతర సూత్రగ్రంథాలు, ఆగమాలు, బ్రహ్మసూత్రాలు, ఖగోళ, కామ, మంత్ర, తంత్ర, వైద్యగ్రంథాలు, న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, వేదాంత, మీమాంసాది గ్రంథాలు, ఇతర ధర్మశాస్త్రగ్రంథాలు, చివరికి రామాయణాది కావ్యాలు, లౌకిక వాఙ్మయంలో చేరినవే అయినా యేకొంతైనా ఆర్షవిజ్ఞానాన్ని యేదోవొక రూపంలో ప్రతిబింబించేవే. అయితే ఇవన్నీ శ్రుతి, స్మృతి పురాణేతిహాసాలు అన్న వాక్యంలో అంతర్భూతాలై నిండి నిబిడీకృతాలై లేవు. కాని శ్రుతులు అలౌకిక వాఙ్మయం కాగా, స్మృతి పురాణేతిహాసాలు లౌకిక వాఙ్మయంలో చేరిపోయాయి. ఉపనిషత్తులు వేదభాగాలని చాలామంది పండితులు భ్రమపడుతారు కాని వాస్తవానికి అవి వేదభాగాలు కావు. కొన్ని కొన్ని వేదమంత్రాలకు వ్యాఖ్యారూపంలో అవతరించిన గ్రంథాలే ఉపనిషత్తులు.

వాఙ్మయ మహోధ్యక్షుని

## వేదోత్పత్తి

శ్రుతులు అనంతాలని గతంలో పేర్కొనడం జరిగింది. అనంతాలైన శ్రుతులకు చతుర్విధాలుగా విభజనను, చతుర్ముఖుడైన బ్రహ్మను దృష్టిలో పెట్టుకొని విభజించి వుండవచ్చు. వాస్తవానికి వేదాల సృష్టికర్త బ్రహ్మకాదు. బ్రహ్మకు వేదాలను ఆమూలాగ్రం నేర్పినవాడు, వేదవిజ్ఞానాన్ని ప్రసాదించినవాడు శ్రీమహావిష్ణువు. అనేక సందర్భాలలో వేద విజ్ఞానాన్ని రాక్షసులు అపహరించినపుడు సృష్టి నిర్మాణంలో బ్రహ్మ అశక్తుడు కాగా మహావిష్ణువు వివిధ అవతారాలెత్తి వేదాలను అపహరించిన, ఆ రాక్షసులను సంహరించి, వేదాలను తీసుకొనివచ్చి బ్రహ్మకు తిరిగి వేదజ్ఞాన భిక్షను పెట్టిన సందర్భాలు అనేకం వున్నాయి. బ్రహ్మకు వేదాలను శ్రీ మహావిష్ణువే బోధించాడన్న విషయాన్ని ప్రస్తుత నారదీయ పురాణంలో "శ్రీహరి నాభికమలమునఁ జతుర్ముఖ బ్రహ్మ ముదయించిన" అనంతర ఘట్టంలో "ప్రణవంబునకుఁ గారణం బకారం, బకారంబున కర్థంబు పరబ్రహ్మంబగు నారాయణపదంబు. ఇట్లు ప్రణవంబు పలుకు నాత్మజుం గృపాదృష్టిం జూచి భగవంతుండు హర్షించి నాల్గువేదంబులు నర్థంబుతో నభ్యసింపఁ జేసె." (నార. 97. పుట. 18 వచనం.) అని విస్పష్టంగా వక్కాణించడం జరిగింది. అనంతుడైన విష్ణువు సృష్టించిన వేదాలకు అంతత్వమెక్కడిది? కాగా చతుర్విధాలుగా వేదాలను విభజించడం చతుర్ముఖుడైన బ్రహ్మను దృష్టిలో పెట్టుకొని జరిగివుంటుంది.

## అష్టాదశ సంఖ్యావైశిష్ట్యం

వేదాలను విడిచిపెడితే స్మృతులు, ఉపస్మృతులు పురాణాలు, ఉపపురాణాలు 18 విధాలుగా విభజింపబడ్డాయి. శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలలో చివర పేర్కొనబడిన ఇతిహాసం 18 ఇతిహాసాలుగా రచియింపబడ్డాయో లేదో గ్రంథాలు అలభ్యాలైన కారణంగా చెప్పలేము. కాని భారతేతిహాసం మాత్రం 18 పర్వాలతో విభజితమై రచింపబడ్డ విషయం విస్పష్టం.

మను, దక్ష, యమ, బృహస్పతి, శంఖ, పరాశర, యాజ్ఞవల్క్య, విష్ణు, అత్రి, అంగిరస, సంవర్త, శాతాతప, ప్రాచేతస, హారీత, ఆపస్తంభ, గౌతమ, ఉశనస, ఆశ్వలాయన, కృతాలైన స్మృతులు 18 వున్నాయి. వీటిలో బృహస్పతి, యాజ్ఞవల్క్య, సంవర్త, ఆపస్తంభ, ఆశ్వలాయన, స్మృతులకు మారుగా మరికొందరు బ్రహ్మ, యోగీశ్వర, సంవర్త, ఆపస్తంభ, లిఖిత, మహర్షి కృతాలైన స్మృతులను పేర్కొన్నారు.

జాబాలి, నాచికేతు, కంద, లౌగాక్షి, కాశ్యప, వ్యాస, సనత్కుమార, శాంతన, జనక, క్రతు, కాత్యాయన, జాతుకర్ణ్య, కపింజల, బోధాయన, కౌణాద, విశ్వామిత్ర, పైఠీన, గోబిల, నామకాలైన ఉపస్మృతులు 18 వున్నాయి. వీటిల్లో కూడా ఆశ్వలాయన, యజ్ఞవల్క్యాది మహర్షుల నామాలతో ఉపస్మృతులు కొన్ని వున్నాయి. ఏది యేమైనా స్మృత్యుపస్మృతులు 18 సంఖ్యకు పరిమితాలన్న సంగతి మనం విస్మరించరాదు.

మత్స్య, మార్కండేయ, భాగవత, భవిష్యత్, బ్రహ్మాండ, బ్రాహ్మ, బ్రహ్మ, వామన, వాయువ్య, విష్ణు, వరాహ, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద పురాణాలు 18 వున్నాయి. బ్రాహ్మ పురాణ స్థానంలో బ్రహ్మకైవర్త పురాణాన్ని, భాగవత స్థానంలో దేవీభాగవతాన్ని కొందరు పేర్కొన్నారు. ఈ అష్టాదశ పురాణాలను పేర్కొంటూ సంప్రదాయసిద్ధమైన శ్లోకం వొకటి పండిత లోకంలో ప్రసిద్ధంగా వున్నది. అది యిది—

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయం !
అ, నా, ప, లిం, గ, కూ, స్కా, ని పురాణాని పృథక్పృథక్ !

సనత్కుమార, నృసింహ, స్కాంద, శివధర్మ, నందికేశ్వర, దౌర్వాస, నారదీయ, కాపిల, మానవ, ఔశనస, వారుణ, కాళీ, సాంబ, సౌర, పరాశర, మారీచ, భార్గవ, లింగ, పురాణములు 18 ఉప పురాణాలుగా పేర్కొనబడుతున్నాయి. మరికొందరు స్కాంద పురాణానికి మారుగా బ్రహ్మాండ ఉప పురాణాన్ని పఠిస్తారు. మరికొందరు స్కాంద, నందికేశ్వర, పరాశర, మారీచ, భార్గవ, లింగపురాణాలకు మారుగా కౌమార, బ్రహ్మాండ, మాహేశ్వర, ప్రవర, శ్రీభాగవత, దేవీభాగవతాలను ఉపపురాణాలుగా పేర్కొంటారు. మరికొందరు స్కాంద, శివధర్మ ఉపపురాణాలకు మారుగా వాశిష్ఠ, అంగిరస, ఉపపురాణాలను పేర్కొంటారు.

కొందరు విద్యలు 18 అంటూ పేర్కొంటూ 4 వేదాలు, 4 ఉపవేదాలు, 6 వేదాంగాలు, 4 వేదోపాంగాలు ఉదాహరించారు. మరికొందరు ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వవేద, అర్థ శాస్త్రాలతోపాటు చతుర్దశ విద్యలను సమ్మేళనంచేసి 18 విద్యలని పేర్కొన్నారు.

ప్రాచీన మహర్షులు 18 విధాలైన సూత్రగ్రంథాలను రచించడం జరిగిందని అగస్త్యశాకల్యం, అగ్నివైశ్యం, ఆపస్తంభం, ఆశ్వలాయనం, కాత్యాయనం, కౌండిన్యం, కాపీతం, జైమినీయం, ద్రాహ్యాయనం, బోధాయనం, భారద్వాజం,

మాధ్యందినం, వాధూలం, వైఖానసం, శాంఖపీయం, శౌనకీయం, సత్యాషాఢి, హిరణ్యకేశి సూత్రగ్రంథాలను పేర్కొనడం జరిగింది.

ఇదేవిధంగా 18 విధాలైన పరిశిష్టలక్షణ గ్రంథాలు ఆవిష్కృతాలైనట్లు కూడా ప్రాచీనులు పేర్కొన్నారు. అవి యివి: ఉపలక్షణం, భాగలక్షణం, ప్రతిజ్ఞ, అనువాకసంఖ్య, శరణవ్యూహం, శ్రాద్ధకల్పం, శుల్బం, పార్శ్వదం, ఋగ్యజుస్సులు, ఇష్టకాపూరణం, ప్రవరాధ్యాయం, ఉక్థశాస్త్రం, క్రమసంఖ్య, నిగమం, యజ్ఞపార్శ్వం, హౌత్రికం, ప్రసవోత్థానం, కూర్మలక్షణం.

నాటిక, త్రోటిక, గోష్ఠి, సట్టకం, నాట్యరాసకం, ప్రస్థానం, ఉపలాస్యం, కావ్యం, ప్రేంకణం, రాసకం, సల్లాపకం, సృగాదికం, శిల్పకం, విలాసికం, దుర్మ్లికం, ప్రకరణికం, హల్లీశకం, భాణికం, అని నాటికలు 18 విధాలుగా ప్రాచీనులు పేర్కొన్నారు. కొందరు సట్టక, ఉపలాస్య, సృగాదికాలకు మారుగా నట్టక, ఉల్లాస్య, శ్రీగదిత భేదాలను పేర్కొన్నారు. వీటిని ఉపరూపకాలని కూడా అంటారు.

కావ్యాల్లో వర్ణనలు సైతం 18 గానే పేర్కొనబడ్డాయి. అవి యివి—నగర, సముద్ర, ఋతు, చంద్రోదయ, అర్కోదయ, ఉద్యానవన, జలక్రీడ, మధుపాన, రతోత్సవ, విప్రలంభ, వివాహ, పుత్రోత్పత్తి, మంత్ర, ద్యూత, ప్రయాణ, నాయకాభ్యుదయ, శైల, యుద్ధవర్ణనలు. మరికొందరు వీటిలో కొన్నింటిని తొలగించి, నది, స్త్రీ వర్ణనలను, బ్రాహ్మణాది చతుర్వర్ణ వర్ణనలను, చతురంగ సైన్యవర్ణనలను, వేదాంగవిచార వర్ణనలను సైతం చేర్చి మొత్తం 18 వర్ణనలుగా పేర్కొన్నారు. ఇదేవిధంగా కావ్యదోషాలను సైతం 18 సంఖ్యకే పరిమితం చేశారు. అప్రయుక్తం–అపుష్టార్థం–నేయార్థం–అసమర్థం–నిరర్థకం–గ్రామ్యం – చ్యుతసంస్కారం–గూఢార్థం-అన్యార్థం–అశ్లీలం- అప్రతీతం-అప్రయోజకం-క్లిష్టం- సందిగ్ధం- విపరీతథీప్రథం-అవిమృష్టవిధేయం-పరుషం ఈ 18 ప్రాచీనులు పేర్కొన్న కావ్యదోషాలు–బహుముఖమైన వాఙ్మయ విభేదాలకు యేంపచ్చింది కాని, అసలు భాషాభేదాలే 18 విధాలని వక్కాణించిన వారుకూడా లేకపోలేదు. ప్రాకృతభాషలు షడ్విధాలు. ఈ షడ్విధ ప్రాకృతాలలోనూ తత్సమ, తద్భవ, దేశ్య నామకాలుగా త్రివిధ భేదాలున్నాయి. అందువల్ల ప్రాకృత భాషాభేదాలు 18 పొమ్మన్నారు కొందరు. సంగీత పదార్థాలలో సైతం, నాదం-శ్రుతి-స్వరం-గ్రామం-మూర్ఛన-తానం-వర్ణం-అలంకారం-గమకం–జాతి-రాగం-గానం-భాష- భాషాంగం-విభాష-అంతర్భాష-ఉపాంగం-క్రియాంగం అని 18 పదార్థాలు శాస్త్రాలలో ప్రవచించబడ్డాయి. ఆ వరసకు

వస్తే ప్రస్తుత కాలంలో మనం ఆమోదించలేం కాని, అసలు మానవులలోనే అష్టాదశ జాతి భేదాలున్నాయని ప్రాచీనులన్నారు. మరింతగా పరిశీలించి చెప్పాలంటే ఆకలి, దప్పి, భయం, కోపం, సంతోషం, కోరిక, నిద్ర, వార్ధక్యం, మరణం, జననం, మదం, స్వేదం, దుఃఖం, జాగ్రత, స్వప్నం, బాల్యం, కౌమారం, యౌవనం, అని దేహ సంభవ గుణాలు 18 గా పేర్కొన్నారు. చివరికి మానవులలో వుండే వివిధ వ్యసనాలను కూడా 18కే పరిమితి చేశారు. వేట, జూదం, పగటినిద్ర, పరనింద, దివా మైథునం, మద్యపానం, నృత్యవ్యసనం, గానలోలత, వాద్యవ్యసనం, వ్యర్థదండనం, చాడీలు చెప్పడం, అతిసాహసం, ద్రోహచింత, కాపట్యం, అసహనం, పరుషభాషణం, దూషణం, అన్యాయదండన అని వీటిని కామ, క్రోధ జన్యాలుగా పేర్కొన్నారు. ఇంతటితో ఆగక మానవుని వివాదస్థానాలను కూడా 18 కే పరిమితంచేసి పేర్కొన్నారు. అవి యివి. అప్పు సకాలంలో తీర్చకపోవడం - ఇతరులవద్ద సొమ్ము దాచడం-హక్కులేని ఆస్తి అమ్మడం-ఉమ్మడి వ్యాపారం-దానమిచ్చి తిరిగిపుచ్చుకోనడం-కూలి వగైరాలు యివ్వకపోవడం-నియమోల్లంఘనం-క్రయ విక్రయాలలో మాట తప్పడం-పశుపాలకులతో సంబంధం-సరిహద్దుల విషయం-పరదూషణం-కొట్టడం - దొంగతనం-బందిపోటుతనం - స్త్రీలను చెరపట్టడం-స్త్రీ పురుష పరస్పర ధర్మాల యేర్పాటు-దాయభాగం వివిధ జూదాలు.

మానవులు పండించే వివిధ ధాన్యాలు కూడా 18 రకాలని పేర్కొన్నారు. అవి యవలు- గోధుమలు- వరి- నువ్వులు- కొఱ్ఱలు- ఉలవలు-మినుములు-పెసలు-సిరుసెనగలు - అనుములు - చామలు - ఆవలు - గవేధుకములు - నివ్వరిధాన్యం - కందులు- సతీనకాలు- సెనగలు-చీనధాన్యం. (ఈ ధాన్యాలలో ఇప్పుడు లభ్యమయ్యే ధాన్యాలు కొన్ని చేరివుండకపోవచ్చును.) పరోపకారబుద్ధితోగాని దోషారిష్టనివారణార్థంకాని, పుణ్య సముపార్జనార్థంగాని చేసే దానాలు కూడా అష్టాదశ సంఖ్యకే పరిమితాలని ప్రాచీనులు పేర్కొన్నారు. ఆ 18 దానాలు యివి. తులాపురుషం, హిరణ్యగర్భం- బ్రహ్మాదండం- స్వర్ణం- పంచలాంగలం- స్వర్ణధేనువు- సాలంకృత హేమవృషభం- సాలంకృతలక్ష్మీప్రతిమ - సాలంకృతసప్తాచలం- సప్తసముద్రం- గజం- స్వర్గచ్ఛాయ- భూగోళం- కనకపర్వతం- కామధేనువు- కల్పవృక్షం- రజత పర్వం- సహస్రధేనువు. ఈ దానాలు ఆర్షవిజ్ఞానపరమైనవేకాని మామూలు తిల తండులాది దానాలవంటివి కావు.

కాలం యెంత సుదీర్ఘమైనదైనా 18 రెప్పపాట్ల కాలాన్ని ప్రాచీనులు "కాష్ఠం"గా పేర్కొన్నారు. ఇంతెందుకు? అసలు మొత్తం భూమండలాన్నే 18 ద్వీపాలుగా మన మహర్షులు విభజించి వర్ణించారు. వాటికి రమ్యకం- రమణకం-

వాఙ్మయ మహోధ్యుని

ద్వారకం-సింహళం- కైవల్యం- మలయం- అశ్వభద్రం- కేతుద్వీపం- మాల్యవంతం- పుష్కరం- వృషభం- రైవతం- నిమ్నోచనం - నియామ్యం - పారావారం-చౌర కృతం- మాల్యద్వీపం- గోభిద్వీపం అని పేర్లు పెట్టారు. కొందరు రమణక ద్వీపాన్ని 'రమణిక' ద్వీపంగా పేర్కొన్నారు. ఈ భూమండలం మీదవున్న పాప ప్రణాశకాలు, అత్యంత పుణ్యప్రదాలైన తీర్థాలు కూడా 18 కే పరిమితమైనట్లు ఆర్షవిజ్ఞానులు పేర్కొన్నారు. ప్రస్తుతం తీర్థాలుగా భావిస్తున్న పెక్కు పుణ్య స్థలాలు వీటిల్లో లేనేలేవు. ఆర్షవిజ్ఞానులు పేర్కొన్న 18 పవిత్రమహాతీర్థాలు యివి. అంతర్గంగ- పాపనాశని- ప్రథమబ్రహ్మ- ఛాయా మల్లికార్జున- వేవసంగమేశ్వర- గణికాసిద్ధేశ్వర- మోక్షేశ్వర- భుజంగ- బ్రహ్మనారాయణ-మణికర్ణిక- ప్రయాగ మాధవ- సోమసిద్ధేశ్వర- దేవద్రోణ- నాదాతుంగసంగమ- కులకేశ్వర- నాగభోగే శ్వర- శుక్లేశ్వర- అగ్నేశ్వరమహాతీర్థములు.

కేవల తీర్థాలుమాత్రమే కాదు ఆదిశంకరాచార్యులు శక్తిపీఠాలు స్థాపించారని కొందరంటున్నారు కాని, అవి ఆది శంకరాచార్యులవారి కాలంలోనే స్థాపించ బడినవని నిరూపించడానికి పూర్తి అవకాశాలులేవు. అయితే వాటిని యెవరు యెప్పుడు నిర్మించారో చెప్పలేముకాని శక్తిపీఠాలుసైతం అష్టాదశ సంఖ్యకే పరిమితాలై నిర్మింపబడ్డాయి. ఈ 18 శక్తిపీఠాలు యివి- శ్రీలంకలో శాంకరీపీఠం- కంచిలో కామాక్షీపీఠం- మధురలో మీనాక్షీపీఠం— కాళహస్తిలో జ్ఞానప్రసూనాంబాపీఠం— ప్రద్యుమ్నస్థలంలో శృంఖలాపీఠం[1]—క్రౌంచపట్టణంలో చాముండీపీఠం[2]—అలం పురంలో జోగులాంబాపీఠం- శ్రీశైలంలో భ్రమరాంబాపీఠం- ఉడ్యానపట్టణంలో (విరజా) గిరిజాదేవిపీఠం[3]—పిఠాపురంలో పురుహూతికాపీఠం- మాణిక్యపట్టణంలో చిత్రకోటికాపీఠం- హాయశ్చిత్ర (అహిచ్ఛత్ర) పురంలో కామరూపిణీ (కామాఖ్య) పీఠం[4]—ప్రయాగలో మాధవీపీఠం[5]- కొల్లాపురంలో మహాలక్ష్మీపీఠం[6]- జ్వాలా పట్టణంలో జ్వాలాముఖీపీఠం[7] వాసరాపట్టణంలో సరస్వతీపీఠం-కాశీలో అన్నపూర్ణా

---

1. ఇప్పుడు బెంగాల్ దేశంలో పాండ్వా ప్రాంతంలో వున్నది.
2. ఇది పశ్చిమ సముద్రతీరంలో వున్నది.
3. వైతరణీ నదీతీరంలో ఇప్పటి జాజిపూర్ సమీపంలో వున్నది.
4. ఇది అస్సాం రాష్ట్రంలో వున్నది.
5. దీనినిప్పుడు అలోపిశాంకరీ పీఠం అంటున్నారు.
6. ఇది బొంబాయి రాష్ట్రంలో వున్నది. కరవీరపురంగా పేర్కొనబడింది. ఇదే కొల్హాపూర్.
7. కాంగ్రా ప్రాంతంలో వున్న దీనిని వైష్ణవీ పీఠంగా సైతం పేర్కొనడం జరుగుతున్నది.

పీఠం- గయలో మాంగల్యగౌరీ పీఠం- మధుర, కాళహస్తి, మాణిక్య, వాసరపట్ట ణాలలో వున్న శక్తిపీఠాలకు మారుగా కొందరు, మయూరపురంలో ఏకవీరి కాంబాపీఠం- ద్రాక్షారామం (తూర్పు గోదావరిజి_) లో మాణిక్యాంబా పీఠం- ఉజ్జయినిలో మహాకాళీ పీఠం- కాశ్మీరంలో సరస్వతీపీఠం- అన్న నాలుగు పీఠాలను పేర్కొంటున్నారు.

స్మృత్యుపస్మృతులు మొదలు బహుముఖ వాఙ్మయ రూపంలోను, ప్రకృతి రూపంలోనూ మాత్రమేకాక పవిత్ర దైవీయాలైన తీర్థశక్త్యాదుల రూపంలో సైతం అష్టాదశ సంఖ్యయే ప్రాధాన్యం వహించడం మనకు ఆశ్చర్యాన్ని కలిగించ వచ్చు. కాని, ఆర్ష విజ్ఞానం దృష్ట్యా, ఆమూలాగ్రంగా అవలోడన చేస్తే యిందులో ఆశ్చర్యపడవలసిన దేమీ కనిపించదు.

మన ప్రాచీన వేదర్షులు తమ దివ్యజ్ఞానంతో అనంతమైన ఖగోళవేధచేసి సృష్టి స్వరూపస్వభావాలను గుర్తించి వీటికిమూలభూతమైన విభిన్న దైవీయాలైన శక్తులను గుర్తించారు. మహావిష్ణువు మొదలు రకరకాలుగా అవతరించిన బహుముఖాలైన విభిన్నశక్తులుగల దేవగణాలు మొత్తం 18 వర్గాలుగా వున్నట్లు తమ అమూల్య పరిశోధనల ద్వారా గుర్తించి ప్రకటించారు. అమర-సిద్ధ-సాధ్య-గరుడ-కిన్నర-కింపురుష-గంధర్వ-యక్ష-విద్యాధర-భూత-పిశాచ - రుద్ర-ఉరగ - ముని - తుషిత-దైత్య-భాస్వర-గుహ్యక-గణాలుగా యీ దేవగణాలను పేర్కొన్నారు. వివిధ దేవగణాలు 18 వర్గాలుగా వున్నాయికాబట్టి వీటికి భిన్నమైన, అతీతమైన గణవర్గ శక్తులేవీ లేవన్న నిశ్చితాభిప్రాయంతో, దివ్యజ్ఞానంతో పరమవైజ్ఞానికంగా 18 గా విభజించి పేర్కొనడం జరిగింది. ఈ అష్టాదశ దేవగణాలలో భూత, పిశాచాలతో పాటు, దైత్యగణంకూడా చేరడం చాలామందికి ఆశ్చర్య సంభ్రమాలను కలిగించ వచ్చును. కాని, యిందులో అనార్షేయమూ, అవైజ్ఞానికమూ, అవాస్తవికమూ, అయిన విషయమేమీలేదు. వేదవిజ్ఞానందృష్ట్యా రాక్షసులు, భూతపిశాచాలు వాస్త వానికి దేవగణాలే. కారణాంతరాలవల్ల తాము చేసిన దుష్కర్మల ఫలితంగా వివిధ దేవగణాలలోనివారే దైవీయాలైన శాపశక్తులపాలై రాక్షస, భూతపిశాచాలుగా అవతరించడం జరిగింది. ప్రాచీన గ్రంథాలలో అనేక సందర్భాలలో రాక్షసులను "పూర్వదేవతలుగా" పేర్కొనడం జరిగింది. పూర్వదేవతలు అంటే మొట్టమొదట దేవతలుగానే వుండి కర్మవశాత్తు తరువాత రాక్షసత్వం పొందినవారని అర్థం. అందువల్లనే విభిన్నాలైన బహుముఖ దైవీయశక్తులు కేవల వివిధ దేవగణాల పరం మాత్రమే కాకుండా రాక్షసులకుకూడా సంక్రమించడం జరిగింది. అదే విధంగా భూత, పిశాచాలకు సైతం విభిన్నశక్తులు సంప్రాప్తమవడం జరిగింది. అయితే దైవీయాలైన అనంతశక్తులలో అన్నీ అందరివద్దా వుండాలని యెక్కడా

వాఙ్మయ మహోధ్యక్షుని

లేదు. అటువంటి ఏకైక వ్యవస్థకే స్థానముంటే ఈ విభిన్నవర్గాల ఉనికికి అవకాశమే లభించేదికాదు. కాగా విభిన్న దేవగణాలలో తరతమ భేదాలతోకూడిన విభిన్నశక్తు లుండవచ్చునని తేటతెల్లమవుతున్నది

వేదాలు తప్ప, ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థవేదం వంటి ఉపవేదాలతోసహా స్మృతులు, ఉపస్మృతులు, పురాణాలు, ఉపపురాణాలు, మాత్రమేకాక, వివిధ విభిన్న బహుముఖ శాస్త్రీయ గ్రంథాలన్నీ లౌకిక వాఙ్మయంగానే రూపొందాయి. స్మృత్యుపస్మృతి, పురాణోపపురాణాలు అష్టాదశ సంఖ్యకే పరిమితం కావడంచూస్తే అత్యంత ప్రాచీనకాలంలో ఇతిహాసనామక గ్రంథాలు సైతం 18 అవతరించి కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయేమో అనిపిస్తున్నది. ఉపనిషత్తులు మొదలైన గ్రంథాలు కొన్ని కొన్ని వేదమంత్రాలకు వ్యాఖ్యారూపంగా అవతరించిన గ్రంథాలైనందువల్ల వాటిల్లో అష్టాదశ సంఖ్యా పూర్వకమైన విభజనకు అవకాశం లేకుండాపోయింది.

అయితే అసలు దేవగణాలే 18 విధాలని ఆమోదించినపుడు దేవ వేదవాక్కులైన శ్రుతులుసైతం 18 విధాలుగా యెందుకు విభజింపబడలేదని కొందరికి సందేహం కలుగవచ్చును. "అనంతా వై వేదాః"అని మొట్టమొదటే పేర్కొనడం జరిగిందిగదా! దేవగణాలైతే 18 వర్గాలుగా వున్నట్లు తమ దివ్యదృష్టికి కనిపించడంవల్ల ప్రాచీన వేదర్షులు విభజించారు తప్ప, దైవీయాలైన అనేక కోట్లాదిగాగల, అనంత శక్తులను 18 వర్గాలుగా విభజించే అవకాశం వొక్క ఆర్షవిజ్ఞానం దృష్ట్యానే కాదు, ఆధునిక విజ్ఞానం దృష్ట్యా పరిశోధించినప్పటికి కూడా అణుమాత్రమైనాలేదు. వేదాలు బహుముఖాలై అనంతాలైన దైవీయాలైన శక్తులను ప్రతిబింబించే బహుళార్థదాయకాలు. కాగా వేదాలను 18 భాగాలుగా విభజించడానికి బొత్తిగా అవకాశంలేదు. అనేకార్థ దాయకాలైన వేద మంత్రాలను వొక్కొక్క విశిష్ట దృక్కోణంతో పరిశీలించడంవల్ల ఆ పరిశీలకుల దృష్టికి గోచరమైన విధంగా ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వ వేద, అర్థ వేదాలవంటి పరిమితార్థదాయకాలైన ఉపవేదాలు లౌకికంగా అవతరించాయేగాని అవి చతుస్సంఖ్యకే పరిమితం కావాలని యెక్కడాలేదు. అవి అష్టాదశ సంఖ్యకు పరిమితం కావాలనికూడా యెక్కడాలేదు. పైగా "అనంతావై వేదాః" అన్నట్లు బహుముఖార్థదాయకాలుగా విభిన్నాలుగా, ఉపవేదా లవతరించాలంటే అనంతాలుగానే కాదు అనంతానంతాలుగా అవతరించవలసి వుంటుంది. దైవీయాలైన ఆర్షశక్తులను విభిన్న దృక్పథాలతో ఆలోచించినప్పుడు వాటి అగాధత్వాన్ని దృష్టిలో పెట్టుకుంటే, ఒక్క ఆర్షవిజ్ఞానం దృష్ట్యానే కాదు, ఆధునిక విజ్ఞానం దృష్ట్యా పరిశీలించినప్పటికీ మనం అయోమయంలోపడక

తప్పదు. అందువల్ల ఉపవేదాలంటూ నాలుగు లౌకిక వేదాలను ప్రాచీనులు పేర్కొన్నారంటే మామూలుగా వేదాలు నాలుగన్న దృష్టితో దూరాలోచన లేకుండా ఆర్ష విజ్ఞానాన్ని విస్మరించి ఏకైక దృక్పథంతో వక్కాణించడమే జరిగింది కాని, అది వాస్తవం కాదు. అసలు వేదాలలోనే అష్టాదశ విభాగ విభజనకు, ఆస్కారం అణుమాత్రమైనా లేనప్పుడు వేదాలపై ఆధారపడి పరిమిత గ్రంథాలుగా అవతరించిన ఉపవేదాలలో యీ విభజనకు అసలే అవకాశం లేదు. కాగా, అష్టాదశ దేవగణాలమీద ఆధారపడి వేదాలను అష్టాదశ వేదాలుగా విభజించడానికి అవకాశంలేదని స్పష్టపడుతున్నది. అయితే స్మృత్యాది లౌకిక గ్రంథాలు, అష్టాదశ దేవగణవిభజనను దృష్టిలో పెట్టుకొని 18 భేదాలుగా అవతరించినట్లు తేటతెల్లమౌతున్నది. కాగా, పురాణ, ఉపపురాణాలు సైతం అష్టాదశ సంఖ్యకు పరిమితం కావడం ఆర్షవిజ్ఞానం దృష్ట్యా సమంజసమైనదీ, సత్యసమ్మతమైనదీ కాగలదు.

## పురాణాలు-ఉపపురాణాలు

పురాణాలగురించి, ఉపపురాణాలగురించి ప్రాచ్య పాశ్చాత్య పండితులనేకమంది వివిధ పరిశోధనలుచేసి, అనేకాభిప్రాయాలు వెల్లడించారు. శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలన్న వాక్యం ప్రకారం శ్రుతిభిన్నాలైన ఆర్షవిషయక గ్రంథాలను త్రోసిరాజని స్మృతుల తరువాత పురాణాలు స్థానం సంపాదించాయన్నమాట అక్షరాలా యథార్థం. అయితే అనంతరకాలంలో చతుర్దశ విద్యలలోను- కొందరి మతంలో చతర్దశకళలలోను, పురాణాలు ఒకటిగా పేర్కొనబడ్డాయి. అత్యంత పురాతనాలైన విషయాలను పెక్కింటిని తెలియచేసేవి కాబట్టి వీటికి పురాణాలన్న నామంవచ్చిందని అందరూ అభిప్రాయపడ్డారు. రామాయణం కావ్యంకాగా, భారతం ఇతిహాసం కాగా, యీ రెండింటికీ భిన్నమై శ్రుతి, స్మృతి భిన్నాలైన లౌకిక కవితా వాఙ్మయం పురాణ వాఙ్మయంగా పేర్కొనబడింది. రామాయణ, మహాభారతాలవలె మిత్రసమ్మితాలుగా శ్రవణ, పఠన వ్యవహారాలలో సార్వజనీనకాలై ప్రఖ్యాతిగాంచాయి. ఆర్షవిజ్ఞానాత్మకాలైన యీ పురాణాలు, ఉపపురాణాలు.

> " సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వన్తరాణిచ
> వంశాను చరితంచేతి పురాణం పంచలక్షణమ్ !! "

అని సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశాను చరితాలు వర్ణింపబడిన గ్రంథాలుగా లక్షణం చెప్పబడింది. పంచలక్షణాత్మకాలైన పురాణాలకు మాత్రంగానే పేర్కొనబడిన పైలక్షణాలు, ఉపపురాణాలకుకూడా వర్తిస్తాయి. ఈ లక్షణాలకనుగుణంగానే పురాణాలలో పూర్వసృష్టి, స్థితిలయాల గురించి, పునస్సృష్టి దేవతావంశక్రమాలను

వాఙ్మయ మహోధ్యక్షుని

గురించి బ్రహ్మర్షి, రాజర్షుల గోత్రక్రమాలగురించి, మన్వంతరాలగురించి, సూర్యచంద్రవంశరాజుల చరిత్రలగురించి, ఖగోళ, జ్యోతిర్మంత్రాది విషయాలతో యితర విషయాలనేకం వర్ణించడం జరిగింది. సంహిత, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తుల లోని విషయాలేకాక, రామాయణ భారతాలలో బీజప్రాయంగా సూక్ష్మంగావున్న అనేక విషయాలు వీటిల్లో వివరంగా వర్ణింపబడినాయని పెక్కుర భావించారు. ఒక పురాణంలోవున్న విషయాలే మిగిలిన పురాణాలలోకూడా వున్నాయని చెప్పడానికి బొత్తిగా అవకాశంలేదు. అయితే రామాయణ, భారతాలలో సూక్ష్మంగా పేర్కొనబడిన విషయాలు, వివరంగా యీ పురాణాలలో వర్ణింపబడినాయన్న కారణంతో, పురాణాలన్నీ రామాయణంకంటె ప్రాచీన తరాలయిన గ్రంథాలన్న మాటను త్రోసి రాజనడమేకాక మహాభారత కాలంకంటేకూడా, తరవాతి కాలంలోనే పురాణాలు సృజింపబడినాయని, యివి అతినవీనాలని కొందరు విమర్శకులు భావించారు. పురాణాలలో వొకదానిలోవున్న విషయం మరొక దానిలో లేక పోయినా, వీటన్నిటిమధ్యా ఒకానొక విధమైన ఏకీభావాన్ని సమకూర్చే సమన్వయం అంతర్గత సూత్ర దృక్పథం ఒకటి కనిపిస్తుంది. ఒకటి వాయుప్రోక్తంగా, వేరొకటి పరాశరప్రోక్తంగా, మరొకటి నారదప్రోక్తంగా, యీవిధంగానే విభిన్న పురాణాల కర్తృత్వం, విభిన్నవ్యక్తులకున్నట్లుగా విస్పష్టంగా గోచరమౌతున్నా, సామూహికంగా యివన్నీ వ్యాసప్రోక్తాలేనని, లేదా వ్యాసవిరచితాలేనని సర్వసామాన్యంగా ఒక అభిప్రాయం పాతుకుపోయింది. అందువల్ల వీటి కర్తృత్వం గురించి విమర్శకులెవరూ ఒక సుస్థిరమైన నిర్ణయాన్ని చేయలేకపోయారు. ఏ పురాణం, యే కాలంలో పుట్టిందో యీ విమర్శకులు గుర్తించలేకపోయారు. అష్టాదశ స్మృతులలోనూ దేనికదే ప్రాచీనమని కొందరు మూర్ఖంగా విశ్వసించగా ఆధునిక విమర్శకులు సైతం ఆవిధంగానే భావించి పురాణాలుకూడా దేనికదే ప్రాచీనమని అభిప్రాయపడి వీటి కాలం భారతంకంటే అధునాతనమని అభిప్రాయపడినా వీటిల్లో పూర్వాపరత్వాలను పరిశోధక విమర్శకులు పేర్కొనలేకపోయారు.

బ్రాహ్మణారణ్యకాలలో పురాణశబ్దం ప్రయోగింపబడినా, ఈ ప్రయోగాన్ని పరిశోధకులు గుర్తించికూడా—అసలు పురాణశబ్దార్థాన్నే విస్మరించి—అది ప్రాచీనగాథాపరమని భావించి పురాణాలన్నీ క్రీస్తుకు తరువాతివేనని చాలా మంది విమర్శకు లభిప్రాయపడ్డారు. ఆపస్తంభ ధర్మసూత్రాలలో భవిష్య పురాణ ప్రస్తావన వున్నది. 18 పురాణాల సారాన్ని సంగ్రహించి వ్యాసుడు భారతాన్ని రచించినట్లు పారాశర ఉపపురాణంలో పేర్కొనబడింది. 18 పురాణాలను వ్యాసుడే రచించాడని అన్ని పురాణాలలోను, ఉప పురాణాలలోనూ కనిపిస్తున్నది. పాద్మ, వరాహ, శ్వేతాదికల్పాలలో బ్రాహ్మ—పాద్మ—వాయువ్యాది పురాణాలు

అవతరించినట్లు మత్స్యాది పురాణాలు వక్కాణించాయి అయినా ఈ కల్పాది వ్యవస్థలనుగాని, వివిధ పురాణాంతర్గతాలైన ఆర్ష విజ్ఞాన, ఖగోళశాస్త్ర విష యాలనుగాని అంతరాంతరాల్లోకి వెళ్లి పరిశీలించకుండా— ప్రతిష్ఠాప్రతిష్ఠాల జోలికి పోకుండా కొందరు పాశ్చాత్య పరిశోధకులు పురాణాలు క్రీస్తుశకంనాటివన్నమాట దేవుడెరుగునుగాని వాటికాలం క్రీస్తుశకం 6 వ శతాబ్దందాటి అంతకుపూర్వానికి యే పరిస్థితులలోనూ వెళ్లజాలదని, పేర్కొనడం మరీ విడ్డూరంగా కనిపిస్తున్నది. ఉత్తర ధ్రువంగా ఒక అభిప్రాయమూ— దక్షిణధ్రువంగా వేరొక అభిప్రాయమూ ఒకరు యేదాడంటే మరొకరు కోదాడుగా వైజ్ఞానికమై స్థిరమై ప్రామాణికమైన దృక్పథం లేకుండా తమకు తోచినట్లు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

కొందరు ఆధునిక ప్రాచ్య పరిశోధకులు సైతం పురాణాల అవతరణగురించి వాటి వ్యవస్థగురించి రకరకాల అభిప్రాయాలు వెల్లడించారు. రామాయణ భారతాలలోని విషయాలేకాక హరివంశంలో వర్ణితమైన విషయాలుకూడా కొన్ని వాయు—విష్ణు—భాగవతాది గ్రంథాలలో కనిపిస్తున్నాయి. కాబట్టి పురాణాలు భారతాది రచనలకు ప్రాచీనాలనడానికి వీలులేదని వీ రభిప్రాయపడ్డారు. వైదిక గ్రంథాలలో పురాణేతిహాసాది సంజ్ఞలున్నప్పటికీ ఆపస్తంభాది సూత్రగ్రంథాలలో పురాణాలను పేర్కొన్నా వ్యాసవినిర్మితాలైన ఈ పురాణాలన్నీ ఇప్పటి నామాల తోనే పూర్వం వ్యవహరింపబడ్డాయని అభిప్రాయపడినా వీటి చరిత్ర వేదాంగాల పుట్టుకవంటిదని కొందరభిప్రాయ పడ్డారు.

అమరసింహుని కాలానికే పురాణం పంచలక్షణసమన్వితమని పేర్కొనబడడంవల్లనూ భాస, కాళిదాస, అశ్వఘోషాదులు పురాణజ్ఞానం కలవారుగా విస్పష్టంగా రూఢి అవుతున్న కారణంగానూ పురాణాలు క్రీస్తుశకానికి పూర్వపువని కొందరు విమర్శకులు భావించారు. వీరుకూడా పౌరాణికమైన, ఆర్ష—వైజ్ఞానిక— చారిత్రక విషయాలను లోతుగా పరిశీలించి యీ నిర్ణయానికి వచ్చినట్లు కనబడదు. అంతేకాదు. వీరు వెల్లడించిన మరొక అభిప్రాయంకూడా వున్నది. కర్మ-భక్తి— జ్ఞానమార్గాలను సులభంగా ఉపదేశిస్తూ, మధ్య మధ్య తలయెత్తుతున్న వివిధ నాస్తిక మతాల నణగద్రొక్కుతూ, శైవ వైష్ణవ మతాలను విగ్రహారాధనను పరివ్యాప్తి చెందించుతూ, అవతరించిన ఈ పురాణాలు, హరివంశానికీ, క్రీస్తుశక ప్రారంభానికి మధ్యకాలంలో అవతరించి వుంటాయనే వీ రభిప్రాయపడ్డారు. అంతే కాదు. క్రీస్తుశకానంతరం శైవ వైష్ణవాది మతాలు పరస్పరం యుద్ధాలను ప్రకటించుకున్నకాలంలో అంటే క్రీస్తుశకం 6, 7 శతాబ్దాలలోపల ఉపపురాణాలు ఆగ్నేయస్కాంధాది పెక్కు పురాణాలలోని వివిధ భాగాలు అవతరించి వుంటాయనికూడా వీ రభిప్రాయపడ్డారు.

వాఙ్మయ మహోధ్యక్షుని

పురాణాలు ఒక వర్గానికి చెందినవని ఇవి మహాపురాణాలని, ఉపపురాణాలని రెండువిధాలుగా వున్నట్లు కొందరభిప్రాయపడ్డారు. పురాణాలు 18 సంఖ్యకు పరిమితాలన్నది సర్వవ్యాప్తమైన విషయంగా కనిపిస్తున్నా పురాణ పురాణేతర గ్రంథవ్యవస్థలగురించి సరైన అవగాహనలేనందువల్ల పురాణాలు అష్టాదశసంఖ్యను మించి వున్నాయని కొంద రభిప్రాయపడ్డారు. కొందరు బ్రహ్మాండపురాణాన్ని విడిచి పెట్టి వాయుపురాణాన్ని గ్రహించగా, మరికొందరు వాయుపురాణాన్ని విడిచి పెట్టి బ్రహ్మాండపురాణాన్ని పరిగ్రహించారు. మహాపురాణాలలో దేవీభాగవతాన్ని కొందరు పరిగ్రహించగా మహాభాగవతగ్రంథాన్ని మరికొందరు పరిగ్రహించారు. కొందరు నారదీయపురాణాన్ని మహాపురాణంగా గ్రహించగా, మరికొందరు దాని నసలు పరిగ్రహించనేలేదు. మరి ఉపపురాణాలున్నైనం పేరుకు 18గా పరిమితాలే అయినా అవికూడా అష్టాదశాధికంగానే లెక్కకు వస్తున్నట్లు కొందరభిప్రాయ పడ్డారు. విష్ణుపురాణాన్నిబట్టి పరిశీలిస్తే ఈ క్రింది 18 మహాపురాణాలుగా వైష్ణవ–బ్రాహ్మ–శైవపురాణాలుగా కనిపిస్తున్నాయి.

| వైష్ణవీయ పురాణాలు | బ్రాహ్మమత పురాణాలు | శైవమత పురాణాలు |
|---|---|---|
| వైష్ణవం | బ్రహ్మాండం | మాత్స్యం |
| నారదీయం | బ్రహ్మకైవర్తం | కౌర్మం |
| భాగవతం | మార్కండేయం | లైంగం |
| గారుడం | భవిష్యం | శైవం |
| పాద్మం | వామనం | స్కాంధం |
| వారాహం | బ్రాహ్మం | ఆగ్నేయం |

వీటిల్లో వైష్ణవీయ పురాణాలు శ్రీమన్నారాయణుని సంస్తుతించేవి కాబట్టి సాత్వికాలూ మోక్షప్రదాలూ అయిన పురాణాలు అనీ–బ్రాహ్మమత పురాణాలు సరస్వతీ చతుర్ముఖ కుశానులను వర్ణించేవి కాబట్టి రాజసాత్మకాలూ స్వర్గప్రదాలూ అనీ–శైవమత పురాణాలు దుర్గామాహేశ్వర విఘ్నేశ కుమార స్వాములను వర్ణించేవి కాబట్టి అవి తామసాత్మక పురాణాలనీ, కాగా దుర్గతిదాయకాలనీ కొందరు ఆర్షవిజ్ఞాన విరుద్ధంగా, వాస్తవికతకు భిన్నంగా అభిప్రాయ పడ్డారు. ఇంకా విచిత్రమేమంటే శైవపురాణాలను కలలోనైనాసరే చూడకూడదనీ వాటిని విన్న వారికి మతి పోతుందనీ పారాశర్య ఉప పురాణంలో శివద్వేషులు అవైజ్ఞానికంగా, అజ్ఞాన పూర్వకంగా సృష్టించి పెట్టిన ఒక ప్రక్షిప్త శ్లోకాన్ని ఆధారంగా చేసుకొని కొంద రభిప్రాయపడ్డారు.

మహా మథన సారామృతం

విష్ణు పురాణంలోనే పైన పేర్కొన్న పురాణనామాలలోని నారదీయ-బ్రహ్మకైవర్త-వామన-పురాణాలకు మారుగా వాయువ్య-బ్రహ్మవైవర్త-మహాభాగవత-లేదా దేవీ మహాభాగవత పురాణాలు పాఠాంతరాలుగా పేర్కొనబడ్డాయి. నారసింహ పురాణాన్ని మరికొన్ని చోట్ల పేర్కొనడం జరిగింది. ఈ విధంగా చూస్తే మహా పురాణాలు 22 వరకూ తేలుతున్నాయని కొందరభిప్రాయపడ్డారు. అయితే శైవ వాయు పురాణాలు ఏకైక పురాణానికే నామాంతరాలని నిర్ణయానికి వచ్చినవారు కూడా లేకపోలేదు.

మత్స్య విష్ణుపురాణాదులను బట్టి పురాణాల అవతరణ గురించి కొంత విషయం తెలుస్తున్నది. అది యిది. అయితే ఈ మత్స్య విష్ణు పురాణాది విషయాల్లో సైతం పొరపాట్లు లేవని ప్రక్షిప్తాలు లేవని సాధికారికంగా చెప్పడానికి బొత్తిగా అవకాశం లేదు.

"కృతయుగంలో బ్రహ్మ శతకోటి ప్రవిస్తరం బ్రాహ్మ సాంజ్ఞాత్మకం అయిన పురాణసంహితా స్కంధాన్ని నిర్మించాడు. దాని సారాన్ని వేదవ్యాసుడు నాలుగు లక్షల శ్లోకాలకు సంగ్రహపరచి అష్టాదశపురాణ సంహితలుగా విరచించి సూతుడైన రోమహర్షణునికి చెప్పాడు. ఆ సూతుడు తన కొడుకైన ఉగ్రశ్రవసునికి బోధించాడు. తరువాత ఆ సూతుడే నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులకు ఈ అష్టాదశ పురాణాలనూ చెప్పాడు. పురాణాలన్నింటిలోనూ బ్రాహ్మ పురాణం మొట్టమొదటిది. బ్రహ్మమరీచి మహర్షి కుపదేశించిన యీ పురాణంలో 10 వేల శ్లోకాలున్నాయి. పద్మపురాణంలో 55 వేల శ్లోకాలున్నాయి. సర్వధర్మాత్మకమనిపించుకున్న విష్ణుపురాణంలోని శ్లోకాలు 6 వేలని కొందరూ, 8 వేలని ఇంకొందరూ, 9 వేలని మరికొందరూ, 10 వేలని వేరొక కొందరూ, 14 వేలని మరింకొందరూ అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాలన్నీ పాఠాంతరాలవల్ల యేర్పడినవే. అయితే శ్రీధరీయ, విష్ణుచిత్తీయ వ్యాఖ్యానాలతో ముద్రితమై లభిస్తున్న ప్రస్తుత విష్ణు పురాణంలో 6 వేలు శ్లోకాలు మాత్రమే వున్నాయి. శివ మాహాత్మ్యాన్ని వర్ణించేదిగా వాయు ప్రోక్తంగా పేర్కొనబడుతున్న శైవపురాణంలో 24 వేల శ్లోకా లున్నాయి. ఇందులో గాయత్రిని సైతం అధికరించి ధర్మం విస్తారంగా వర్ణించబడింది. భాగవతంలో 18 వేల శ్లోకాలున్నాయి. నారదీయ పురాణంలో 20 వేల శ్లోకాలున్నాయి. జైమిని మార్కండేయ సంవాదరూపమైన మార్కండేయ పురాణంలో 32 వేల శ్లోకాలున్నాయి. ఇష్టకాగణనాది అనేక క్రతు విషయాలనూ భృగు మహర్షి చయనోత్పత్తి విషయాలనూ తెలిపిన ఆగ్నేయ పురాణంలో 8 వేల శ్లోకాలున్నాయి. వ్యాస మహర్షి శిష్యుడైన సుమం

వాఙ్మయ మహోధ్యక్షుని

తుడు శతానీకున కుపదేశించిన ధర్మసార సమ్మిశ్రితమైన భవిష్య పురాణంలో 31 వేల శ్లోకాలున్నాయి. అంబరీశునకు వసిష్ఠ మహర్షి వివిధ వైష్ణవ ధర్మాలను బ్రాహ్మ-స్వర్గ స్వరూపాన్ని ఉపదేశించిన బ్రహ్మకైవర్త పురాణంలో 12వేల శ్లోకాలున్నాయి. నందీశ్వర ప్రోక్తమై ఈశానకల్ప వృత్తాంత సమ్మిశ్రితమైన లింగపురాణంలో 11 వేల శ్లోకాలున్నాయి. విష్ణుమూర్తి భూదేవికి చెప్పిన వరాహావతార మహాత్మ్యం వర్ణించబడిన వరాహ పురాణంలో 24 వేల శ్లోకాలున్నాయి. షణ్ముఖ ప్రోక్తమై మాహేశ్వర ధర్మచరిత్రలను వర్ణించిన స్కాందపురాణంలో లక్ష శ్లోకాలున్నాయి. త్రివిక్రమ మాహాత్మ్యాన్ని త్రిసర్గాలనూ, త్రిమూర్తులనూ వర్ణిస్తూ చతుర్ముఖబ్రహ్మ చెప్పిన వామన పురాణంలో 14 వేల శ్లోకాలున్నాయి. దేవేంద్రుడు తనయెదుట వుండగా మహావిష్ణువు కూర్మావతారంతో మహర్షులకు ధర్మార్థ కామ మోక్షాలను బోధిస్తూ చెప్పిన పురాణం కూర్మపురాణం. ఈ కూర్మ పురాణంలో 6 వేల శ్లోకాలున్నాయి. మహావిష్ణువు మత్స్యావతార మెత్తి మనువుకు నరసింహావతార విశేషాలను గూర్చి చెప్పగా రూపొందిన పురాణం మత్స్య పురాణం. ఇందులో 14 వేల శ్లోకాలున్నాయి. గారుడకల్పంలో విశ్వాండమంతా గారుడోద్భవమే నని విష్ణువు వర్ణించిన విశేషాలతో వున్న పురాణమే గారుడ పురాణం. 16 వేల శ్లోకా లిందులో వున్నాయి. బ్రహ్మ వర్ణితమైన అజాండ మహత్వంకల బ్రహ్మాండ పురాణంలో 12 వేల 200 శ్లోకాలున్నాయి. ఈ బ్రహ్మాండ పురాణంలో భవిష్యత్కల్పాల వృత్తాంతం వివరంగా వర్ణింపబడింది. వివిధ పురాణాలన్నింటిలోనూ సర్గప్రతిసర్గాది కర్త శ్రీ మహావిష్ణు వని మాత్రమే వర్ణించబడింది. ఈ విషయంలో పురాణాలు "యతోవా ఇమాని భూతా" నీత్యాది వేదవాక్యాల తాత్పర్యాన్ని పురాణాలు ప్రతిబింబించాయనడంలో సందేహ మేమాత్రమూ లేదు. విష్ణువే బ్రహ్మ, విష్ణువే శివుడు, విష్ణువే ఆదిత్యుడు. సర్వం విష్ణుమయం జగత్. ఇదే ఏకైకమైన సమస్త పౌరాణికమైన వాక్కు. అష్టాదశ పురాణాల్లోనూ, ఇటువంటి ఏకైక అద్వితీయ పురుషుణ్ణే వర్ణించడం జరిగింది. ఈ అద్వితీయ భావాన్ని అతిక్రమించిన వారు నరకం పాలౌతారు" అంటూ మత్స్యపురాణం పేర్కొన్నది. ఈ మత్స్య పురాణంలో పేర్కొన్న వివిధ పురాణాల శ్లోకాలసంఖ్య సరియైనదని మనం చెప్పలేము. ఈ మత్స్యపురాణంలో ప్రక్షిప్త శ్లోకాలు లేవని మనం చెప్పలేము. వాయుపురాణాన్నిబట్టి పరిశీలిస్తే మత్స్యపురాణంలో 14000- భవిష్యపురాణంలో 14500- మార్కండేయ పురాణంలో 9000- బ్రహ్మవైవర్తపురాణంలో 18000- బ్రహ్మాండ పురాణంలో 12100- భాగవతంలో 18000- బ్రాహ్మ్య పురాణంలో 10000- వామనపురాణంలో 10000- ఆగ్నేయ పురాణంలో 10600- వాయువ్య

పురాణంలో 23000— నారదీయపురాణంలో 23000— గరుడపురాణంలో 19000— పద్మపురాణంలో 55000—కూర్మపురాణంలో 17000—వరాహపురాణంలో 24000— స్కాందపురాణంలో 81000 శ్లోకాలున్నట్లుగా తెలుతున్నది. అష్టాదశపురాణాల శ్లోకసంఖ్యను పేర్కొంటున్న ఈ పురాణంలో 16 పురాణాల శ్లోక సంఖ్యలు మాత్రమే ప్రస్తుతం కనిపిస్తున్నాయి. విష్ణు, లింగపురాణాలకు సంబంధించిన నామాలు శ్లోకసంఖ్యలు పేర్కొన్న శ్లోకం లభ్యమైన వాయుపురాణంలో విలుప్తమై పోయింది. ఇది వ్రాయసగాని పొరపాటు కావచ్చును. ఏది యేమైనా అన్ని పురాణాలలోనూ రకరకాలుగా పేర్కొనబడిన, వివిధ పురాణాల శ్లోకసంఖ్యలు సరియైనవని నొక్కి వక్కాణించే అధికారం యెవరికీలేదు. సమస్త పురాణోప పురాణాలలోను సర్వసామాన్యంగా ప్రక్షిప్తగ్రంథాలు, అధికపాఠాలూ, మూలచ్ఛేదకాలైన విలుప్త భాగాలూ లేవని చెప్పడానికి బొత్తిగా అవకాశంలేదు. కాగా పురాణవిషయవ్యవస్థను గురించిగాని శ్లోకసంఖ్యావ్యవస్థను గురించిగాని సాధికారికంగా మాట్లాడే అవకాశం యెవరికీలేదు.

లండన్‌లోవున్న ఇండియా ఆఫీసులో అనేక సంస్కృత గ్రంథాలున్నాయి. ఆ సంస్కృత గ్రంథాల కేటలాగులోని పురాణ విషయ వివరణ పట్టికను చూస్తే మనకు అనేక విషయాలు తెలుస్తాయి. వాయు పురాణం, శైవ పురాణం భిన్న పురాణాలని కొందరు భావించగా మరి కొందరివి రెండూ ఒక్కటేనని అభిప్రాయపడ్డారు. మత్స్య పురాణంలో—

"యత్రతద్వాయవీయం స్యాద్రుద్ర మాహాత్మ్యసంయుతమ్
చతుర్వింశత్సహస్రాణి పురాణం శైవముచ్యతే"

అని వక్కాణించబడింది. మత్స్యపురాణ శ్లోకంవల్ల శైవపురాణంలో 24000 శ్లోకాలున్నట్లు విదితమవుతుండగా బొంబాయిలో ముద్రితమై ప్రకటితమైన వాయు పురాణంలోని శ్లోకాల సంఖ్య 12000 మాత్రమే పరిమితమైవున్నది. శివ, వాయు పురాణాలు ఒకటే అనడానికి వీలైన ఆధారాలు శైవసంజ్ఞ ముద్రిత వాయు పురాణంలో యెక్కడా లేవు. ఒకవేళ శివ, వాయు పురాణాలు ఏకైకాలైనా కాకపోయినా ముద్రిత వాయుపురాణం అసలు పురాణం కాకపోవచ్చును. ఉపపురాణమై వుండవచ్చును. కాగా అది 12000 శ్లోకసంఖ్యకు మాత్రమే పరిమితమై వుండడంలో అబ్బురంలేదు. లేదా వాయు పురాణంలో ఇది ఒక భాగంమాత్రమే అయి వుండాలి.

"ఇతి శ్రీవాయు పురాణం శివాపరాహ్వయం సమాప్తమ్—"

వాఙ్మయ మహోధ్యక్షుని

"ఇతి శ్రీవాయూక్త చతుర్వింశతి సహస్ర్యాం శివసం
హితాయా ముత్తరఖండే శ్రీనర్మదా మాహాత్మ్యే—"

"ఇతి. శ్రీ వాయు పురాణే లక్ష్మీ సంహితాయా మానందకానన
మాహాత్మ్యే—"

"ఇతి శ్రీ మహాపురాణే వాయు ప్రోక్తే ద్వాదశసాహస్ర్యాం
సంహితాయాం బ్రహ్మాండావర్తం సమాప్తమ్"—

"పంచదశ సహస్రాణి ఖండేస్మిన్ మునినా పురా,
గ్రంథ సంఖ్యాని గదితా-
ఇతి శ్రీ వాయు పురాణం శివా
పరాహ్వాయం సమాప్తమ్"—

అంటూ అనేక వాయుపురాణ వ్రాత ప్రతుల్లో విభిన్నాలైన గద్యలు కని పిస్తున్నాయి. వాయుప్రోక్తం కాబట్టి ఇది వాయుపురాణంగా ప్రసిద్ధిగాంచినా, ఇందులో శివ మాహాత్మ్య విషయాలే అత్యధికంగా వుండడంవల్ల దీనినే కొందరు శివపురాణంగా పేర్కొనగా, మరికొందరు సమగ్ర అవలోడన చేయకుండా గ్రంథాలను సరిపోల్చి చూడకుండా ప్రత్యేకించి లింగ పురాణం ఒకటున్నదన్న విషయం విస్మరించి వాయు, శివపురాణాలు విభిన్నాలని భావిం చడం జరిగింది. అయితే లింగపురాణాన్నే శివపురాణంగా పేర్కొన్నారేమోనని భావించడానికి కూడా అవకాశం ఉన్నది. "ఇతి వాయు పురాణే లక్ష్మీసంహితాయా మానందకానన మాహాత్మ్యే" ఇత్యాది వాయు పురాణాధ్యాయాంత్య గద్యను పరిశీ లించినపుడు వాయు పురాణంలో కేవలం శివమాహాత్మ్యం మాత్రమే వర్ణింపబడ లేదనీ వైష్ణవమాహాత్మ్య విషయాలు సైతం సందర్భవశాత్తూ పేర్కొనబడ్డాయనీ స్పష్టపడుతున్నది.

మహా భాగవత, దేవీ భాగవతాలు రెండింటిలోనూ మహా పురాణంగా దేన్ని పరిగణించాలన్న విషయంలో 200 సంవత్సరాలకు పూర్వమే చాలా తర్జన భర్జనలు జరిగాయి. ఈ చర్చలతో వివిధ పరిశోధనా గ్రంథాలవతరించాయి. ఇటు వంటి అభిప్రాయ భేదాలు దక్షిణభారతదేశ పండిత పరిశోధకులలో సైతం పొడ సూపకపోలేదు. మహాభాగవత దేవీభాగవత గ్రంథాలు రెండూ సుప్రసిద్ధ గ్రంథాలే. అయినా దేవీ భాగవతంకంటే మహా భాగవతం ఒక్క కవి పండిత మండలిలోనే గాక ఆబాలగోపాలమూ అతిసామాన్య ప్రజలలో సైతం ఒకానొక విశిష్టమైన స్థానాన్ని సంపాదించి ప్రఖ్యాతి సంపాదించిందనడంలో సందేహంలేదు. అయినప్పటికి

కేవల మతాభిమానాలు కారణంగా భాగవత మనార్షేయమని శైవులూ, దేవీభాగవతమనార్షేయమని వైష్ణవులూ తిరస్కార భావాలను వెల్లడించారు. కాశీలో నివసించిన దక్షిణాచార ప్రవర్తకుడైన గదాకాశీనాథభట్టు అనే పండితుడు "దేవీ భాగవతమే ప్రామాణిక గ్రంథం. మహాభాగవతం ఆర్షేయం కాదు. మహాపురాణాలలో పేర్కొనదగింది దేవీ భాగవతమే," అని నిర్ణయిస్తూ "దుర్జనముఖచపేటిక" అనే పేరుతో ఒక గ్రంథాన్ని రచించి భాగవత పక్షవాదులకు త్రోసిరాజన్నాడు. దీనికి తగినట్లుగా మహాభాగవత గ్రంథాన్ని వ్యాసుని పేరుమీద వోపదేవుడు రచించాడే గాని అసలు వ్యాసుడు మహాభాగవతాన్ని రచించనే లేదని మరొక వాదం బయలుదేరింది. ఈ వాదాలు రెండింటినీ తిరస్కరిస్తూ భట్టోజీ దీక్షితుల శిష్యుడైన రామాశ్రమ పండితుడు "మహాభాగవతం అనార్ష గ్రంథంకాదు. ఆర్షగ్రంథమే. అసలది వోపదేవ విరచితంకాదు. దేవీభాగవతం అసలు ఆర్షగ్రంథం కాదు. అనార్షం." అని నిరూపిస్తూ తిరిగి "దుర్జనముఖచపేటిక" అన్న పేరుతోనే వేరొక ఖండన గ్రంథం రచించి దేవీభాగవత పక్షవాదులను తిరస్కరించాడు. ఆ తరువాత వేరొక పండితుడు ఈ మహాభాగవత పక్షవాదాన్ని ఖండిస్తూ దేవీభాగవత ఆర్షత్వాన్ని నిరూపిస్తూ ''దుర్జనముఖపద్మపాదుక'' అన్న పరిశోధనా గ్రంథాన్ని రచించాడు. మహారాష్ట్ర భాషలో త్ర్యంబక గురునాథకాలే అనే విమర్శకుడు ''పురాణ నిరీక్షణ'' అనే విమర్శ గ్రంథం వ్రాసి అందులో ఈ రెండు భాగవతాల మహాపురాణత్వ విషయాల గురించి జరిగిన వాద ప్రతివాదాల సారాంశాన్ని సంపూర్ణంగా ఉటంకించాడు. విద్యానిధి యోగీశ చంద్రరాయ్ అనే విమర్శకుడు బెంగాలీలో కొంత పరిశోధనచేసి దేవీభాగవతం ఉపపురాణమేనని అభిప్రాయపడ్డాడు. బెంగాలీ సాహిత్య చరిత్రకారుడైన మణీంద్రమోహనవసు దేవీభాగవతం మహాపురాణాలలోనిదేనని అన్నాడు. తెలుగువారిలో పెక్కురు దేవీభాగవతాన్ని ఉపపురాణంగా భావించగా తాతా సుబ్బరాయ శాస్త్రిగారు మాత్రం మహాపురాణంగానే భావించారు. అయితే బృహద్ధర్మ పురాణాదులు కొన్ని—ఇవి అష్టాదశ పురాణాలలో చేరకపోయినా—అష్టాదశ పురాణాల గురించి పేర్కొంటూ మహాభాగవత—దేవీభాగవత గ్రంథాలను రెండింటినీ అష్టాదశ పురాణాలలోనివిగా పేర్కొన్నాయి. ఈ దృష్ట్యా ఈ రెండింటి ఆర్షేయత్వాన్ని గురించి శంకించవలసిన అవసరంలేదని కొందరు పండితులు భావించారు. అయితే మహాభాగవతం వోపదేవ విరచితమేనని అంగీకరిస్తే మహాభాగవత గ్రంథ ఆర్షేయత్వం యే విధంగా నిలుస్తుందన్నది సర్వసామాన్యంగా కలిగే ప్రశ్న.

క్రీస్తుశకం 1271-1309 మధ్యకాలంలో యదువంశంలో రామచంద్రుడనే నామాంతరం కలిగిన రామరాజు దేవగిరి రాజ్యాన్ని పరిపాలించాడు. అతని

వాఙ్మయ మహాధ్యక్షుని

ఆస్థానంలో హేమాద్రి అనే పేరుగల మహామంత్రి ఒక డుండేవాడు. ఈ హేమాద్రి కటకపుర నివాసియైన వామదేవుడనే నామాంతరంగల కామరాజుయొక్క పుత్రుడు. శ్రుతి, స్మృతి, పురాణేతిహాసవేత్త. గణకులలో అగ్రగామి. ఎంతో ఔదార్యవంతుడు. ఈ హేమాద్రి మిత్రుడు మహాపండితుడనిపించుకున్న వోపదేవుడు. ఈ వోపదేవుడు బహుశాస్త్రవేత్తయైన ధనేశ పండితుని శిష్యుడు. భిషగ్వరుడైన కేశవుని పుత్రుడు. ఉభయ గురువుల వల్లనూ అంటే ఇటు తండ్రివల్లనూ, అటు విద్యాగురువైన ధనేశపండితునివల్లనూ వోపదేవుడు బహుముఖ ప్రజ్ఞానిధి అయ్యాడు. సాహిత్య-వ్యాకరణ-వైద్య-జ్యోతిర్విషయాలలో అనేక గ్రంథాలు రచించిన మహామనీషి. ఈ వోపదేవుడు మహాభాగవతం సమస్తస్కంధాలలోనూ వున్న విష్ణురక్షణ-విష్ణుభక్తి-విష్ణుతత్త్వ ప్రతిపాదకాలైన శ్లోకాలనుద్ధరించి వాటిని "ముక్తాఫల"మన్న పేరుతో ఒక సంకలన గ్రంథంగా రూపొందించి దానికి "కైవల్య దీపిక" అనే పేరుతో ఒక వ్యాఖ్యానాన్ని రచించి దానికి తన మిత్రుడైన హేమాద్రి పేరు పెట్టాడు. ఈ విషయం కైవల్య దీపికా వ్యాఖ్యానంలో వున్న ఈ క్రింది శ్లోకాదులవల్ల తేటతెల్లమవుతుంది.

> "విద్వద్ధనేశ శిష్యేణ భిషక్కేశవసూనునా
> హేమాద్రి ర్వోపదేవేనముక్తాఫల మచీకరత్"
>
> "చతురేణ చతుర్వర్గచింతామణి వణిజ్యయా
> హేమాద్రిణార్జితం ముక్తాఫలం పశ్యత కౌతుకాత్"
>
> "తేన ముక్తాఫలం తేనే యచ్ఛ్లోక మనుగృహ్ణతా
> తత్రటీకాం యథాబుద్ధి కుర్వే కైవల్య దీపికామ్"
>
> "ఇహచస్వకర్తృకేఽపి యదురాజమహామంత్రిణాఽభ్యర్థిత ఆచార్యః
> (వోపదేవః) తత్కర్తృకత్వం (హేమాద్రి కర్తృకత్వం) ఖ్యాపితవాన్"
>
> "ఇతి శ్రీ వోపదేవకృతాముక్తాఫల టీకాసమాప్తా"
>
> "ఇతి శ్రీ హేమాద్రి కృతాముక్తాఫల టీకా కైవల్య దీపికాసమాప్తా"

ఈ విధంగా వోపదేవ, హేమాద్రి నామాలు రెండూ కనిపిస్తున్నా యీ రెండింటి కర్తాకూడా వోపదేవుడేనని సాధికారికంగా నిరూపితమవుతున్నది. అయితే ఈ సందర్భాన్నిబట్టే భాగవతానికి వోపదేవునికీ వున్న సంబంధమేమిటోకూడా బట్ట బయలవుతున్నది. మహాభాగవతంలోని వివిధ స్కంధాలలోవున్న విష్ణులక్షణ-భక్తి-తత్త్వ ప్రతిపాదకాలైన వివిధ శ్లోకాలను సంకలనంచేసి గుదిగుచ్చి "ముక్తాఫల" మన్న పేరుతో రూపొందించడమే తప్ప ఇంతకు భిన్నంగా మహాభాగవత శ్లోక రచనతో వోపదేవునికి సంబంధంలేదని విస్పష్టమవుతున్నది. అయితే ముక్తాఫలంగా

సంకలనంచేసిన మహాభాగవత శ్లోకాలకు వోపదేవుడు "కైవల్యదీపిక" అన్న పేరుతో వ్యాఖ్యానం వ్రాసినమాట వాస్తవమే! వ్యాఖ్యాకర్త అయినంత మాత్రంచేత, ఆ వ్యాఖ్యకు మూలభూతాలైన శ్లోకాలకుకూడా కర్త కాజాలడు కదా! అక్కడక్కడా వున్న వివిధ విషయకాలైన శ్లోకాలను సంకలనంచేసి గుదిగుచ్చడం ఆ శ్లోకాల మూలరచనకు, మూలకర్తృత్వానికి స్థానాన్ని ప్రసాదించదు కదా! హేమాద్రి పేరుమీద "కైవల్యదీపిక" వ్యాఖ్యను వోపదేవుడు రచించి వుండవచ్చు. ఇతరుల పేరుమీద గ్రంథాలు రచించేబుద్ధి వోపదేవునికి వున్నంత మాత్రంచేత—భాగవతానికి వోపదేవునికి యేదో వొకవిధమైన సంబంధం వున్నది గదా అని మొత్తం మహాభాగవతాన్ని వోపదేవుడే రచించాడనడం, మహాభాగవతం అనార్షేయమనడానికి దుర్బుద్ధితో కుయుక్తితో వెలువరించిన భావమేతప్ప వేరు కాదు—లోతుగా పరిశీలించినపుడు మహాభాగవత వోపదేవ కర్తృత్వవాదం అపహాస్యంపాలుకాక తప్పదు. గరుడ—మత్స్య—స్కందాది పురాణాలలో అనేక విధాలుగా మహాభాగవత పురాణ మాహాత్మ్యం అనేక సందర్భాలలో ప్రశంసించబడింది. వివిధ పురాణాలలో వున్న ఈ ప్రశంసలన్నింటినీ వోపదేవుడే పరికల్పించాడంటారా? అతని తరువాత పరికల్పితాలైనాయంటారా? అసలింతెందుకు? క్రీస్తుశకం 8 వ శతాబ్దికి చివరికాలంలో జీవించారని ఏకగ్రీవంగా అందరూ ఆమోదిస్తున్న ఆదిశంకరులు మహాభాగవతానికి వ్యాఖ్య రచించారని—మహాభాగవత ద్వైత వ్యాఖ్యాకర్తయైన విజయ ధ్వజాచార్యులు విస్పష్టంగా పేర్కొన్నారు. ఆదిశంకరాచార్యులు మహాభాగవత వ్యాఖ్యరచించారని విస్పష్టంగా వ్రాసిన ద్వైత వ్యాఖ్యాకర్తయైన విజయధ్వజాచార్యుల వాక్యాన్ని మనం త్రోసిరాజనలేంకదా. దీనిని బట్టి ఆదిశంకరులకాలానికే అంటే క్రీస్తుశకం 8 వ శతాబ్దానికే మహాభాగవత గ్రంథమున్నట్లు చారిత్రకంగా దృఢపడుతున్నదిగదా! కాగా క్రీస్తుశకం 8 వ శతాబ్దినాటికేవున్న మహాభాగవత గ్రంథాన్ని క్రీ.శ. 8వ శతాబ్దికి దాదాపు 450 సంవత్సరాల తరువాతి కాలంలోవున్న వోపదేవుడు రచించాడని చెప్పడం శుద్ధ అబద్ధమని తేలడం లేదా! మరి గరుడ-మత్స్యాది పురాణాలలో వర్ణించబడిన మహాభాగవతం పురాణ కాలంలోనిదేకాక ఆధునికగ్రంథం యెలా అవుతుంది?

పురాణాలు రామాయణ భారతాలకంటే గొప్పవి, ప్రాచీన తరమైనవి కూడా. అయినా పురాణాలకంటే రామాయణ మహాభారతాలకే భారతదేశం మొత్తంలో అత్యధికమైన ప్రాచుర్యమూ ప్రశస్తీ వచ్చింది. రామాయణ మహాభారతాల తరువాత మహాభాగవతానికి లభించినంత ప్రశస్తి మరేయితర పురాణానికీ రాలేదు. ద్వైతాద్వైత విశిష్టాద్వైత త్రిమతాల వారికీ అవలంబనాలైన బ్రహ్మసూత్రాలవలె ఉపనిషత్తులవలె భాగవతంకూడా జీవేశ్వరతత్త్వ ఆవిష్కరణలో ఒక

వాఙ్మయ మహోద్యతుని

అమూల్యమైన అవలంబనంగా నిలిచిందనడంలో అతిశయోక్తిలేదు. ఇటీవల ముద్రితాలై మనకులభిస్తున్నమహాభాగవత త్రిమత వ్యాఖ్యానాలేకాక వీటితోడు "సారార్థ దర్శిని-వైష్ణవతోషణి- సుబోధిని-భాగవత ప్రకాశం" మొదలైన ఇతర వ్యాఖ్యా నాలుకూడా లభించాయి. ఈ మహాభాగవతం ఆధారంగా భాగవతామృతం-భాగవత సందర్భం మొదలైన గ్రంథాలనేకం భాగవత గుణప్రోక్తాలుగా అవతరించాయి. ఏదియేమైనా దేవీభాగవత మహాపురాణత్వాన్నిగాని ఆర్షేయత్వాన్ని గాని నిలబెట్టడంకోసం మహాభాగవత ఆర్షేయత్వాన్ని-విష్ణుసంకీర్తన ప్రాచీనత్వాన్ని త్రోసిరాజనవలసిన పనిలేదు. ఇంతమాత్రంచేత దేవీ భాగవతాన్ని ఆర్ష విజ్ఞానం దృష్ట్యా తక్కువ గ్రంథంగా త్రోసిపుచ్చడానికి వీలులేదు. దేవీ భాగవతం కూడా అత్యంత ప్రాచీనకాలంనుంచీ, అత్యంత ప్రశస్తిపొందినమాట వాస్తవమే. కాని ఈ సందర్భంలో వున్నమాట ఒకటి చెప్పకతప్పదు. మహాభాగవతం అన్ని వర్గాల ప్రజలలోనూ ఆబాలగోపాలమూ ప్రశస్తి పొందింది. దేవీ భాగవతం మాత్రం కొన్ని వర్గాల ప్రజలలో మాత్రమే ప్రశస్తిపొందింది. కొందరు పరిశోధకు లభిప్రాయ పడినట్లు మహాభాగవతమే తొలుత అవతరించి అనంతరమే దేవీ భాగవతం అవతరించినట్లు కనిపిస్తున్నది. మహాభాగవతంలో ద్వాదశస్కంధా లుండగా, దేవీ భాగవతంలోకూడా ద్వాదశస్కంధా లున్నాయి. మహాభాగవతంలో 18000 శ్లోకాలుండగా దేవీ భాగవతంలో సైతం 18000 శ్లోకాలున్నాయి. మహాభాగవతాని కసలు పేరు "శ్రీమద్మహాభాగవతం" అని మహాభాగవతానికి మొదట లక్ష్మీవాచకమైన "శ్రీ" శబ్దం వున్నదికాబట్టి దేవీ భాగవతానికి మొదట "శ్రీ" శబ్దానికి మారుగా "దేవీ" శబ్దం చేర్చబడిందని కొందరు విమర్శకులు భావించారు. కాని ఇది సరికాదు, "శ్రీ" శబ్దం సర్వసామాన్య వాచకం. "శ్రీ" శబ్దం కేవలం లక్ష్మీపరమైనది మాత్రమేకాదు. దేవీ పరమైనది- సరస్వతీ పరమైనది కూడా. దేవీ భాగవతం అసలు పేరు దేవీ భాగవతం అని కానేకాదు. "శ్రీమద్దేవీభాగవతం" అని మాత్రమే. భాగవతాన్ని మహాభాగవతంగా పేర్కొన్నట్లుగానే, దేవీ భాగవతాన్ని సైతం "దేవీ మహాభాగవతం"గా పేర్కొన్నవారు కూడా లేకపోలేదు. అయితే ఒకటి విష్ణుమాయామయమైన కృష్ణలీలాశ్రయంకాగా, వేరొకటి పార్వతీ పరమేశ్వర విలాసాశ్రయం కావడమే వీటి వైశిష్ట్యం.

అష్టాదశపురాణాలలో బ్రహ్మవైవర్త-బ్రహ్మకైవర్త పురాణాలు రెండూ ఒక్కటే అని కొందరు విమర్శకుల అభిప్రాయం. ఉత్తర భారతీయులు బ్రహ్మవైవర్తమని వ్యవహరించగా, దాక్షిణాత్యులు బ్రహ్మకైవర్తమని వ్యవహరించారని వీరి అభిప్రాయం. అయితే ఒక్క బ్రహ్మవైవర్త పురాణ విషయంలోనే కాదు మిగిలిన పురాణాలన్నిటి విషయంలోనూ చివరికి రామాయణ భారతాల

విషయాల్లో సైతం ఉత్తర భారతదేశ ప్రతులకూ, దక్షిణ భారతదేశ ప్రతులకూ అనేక విషయాలలో కేవలం పాఠాంతరాలలోనేకాదు, గ్రంథ భాగాలలో సైతం విభిన్నత్వం గోచరమవుతున్నది.

వాస్తవానికి ఉపపురాణాలు 18 సంఖ్యకే పరిమితమైనా కొందరు ప్రాచీన రచయితలు కొన్నికొన్ని విశేష విషయాలకు ప్రాధాన్యమిచ్చి గ్రంథాలుగా రూపొందించి వాటిని ఉపపురాణాలలో చేర్చివేశారు. కాగా ఉపపురాణాల సంఖ్య 18 ని మించిపోవడంలో ఆశ్చర్యంలేదు. మరుగున పడిపోయిన ఉపపురాణాలు మరుగున పడిపోగా అసలు ఉపపురాణాలే కానివ్వండి, ఉపపురాణనామక యితర గ్రంథాలే కానివ్వండి, 34 గ్రంథాలవరకూ లభించాయి. ఆది-ఆదిత్య-ఔపనస-కల్కి-కాపిల-కాళిక-గణేశ - చండికా - దేవీ - దౌర్వాస - ధర్మ- నందీశ్వర - నాంద-నారదీయ-నారసింహ-పారాశర్య-బృహద్ధర్మ-బృహన్నందీశ్వర-బృహన్నారదీయ-బ్రహ్మాండ-భవిష్యోత్తర-భార్గవ-మానవ-మారీచ-లైంగ-వామన-వారుణ-వాశిష్ఠ-విష్ణుధర్మ-విష్ణుధర్మోత్తర-శివ-శివధర్మ-సనత్కుమారీయ-సాంబ వంటి ఉపపురాణాలు, ఉపపురాణ నామకాలు ఉపలభ్యమానాలైనాయి. వీటిల్లో మహాపురాణమైన బృహన్నారదీయం కూడా ఉపపురాణంగా చేర్చబడడం విచిత్రం.

వాస్తవానికి పురాణాలు 18 మాత్రమే కాబట్టి ఉపపురాణాలు సైతం 18 కే పరిమితం కావాలి. అంతేకాదు అష్టాదశ మహాపురాణాలు యే నామాలతో రూపొందాయో అదే అష్టాదశ నామాలతో అష్టాదశ ఉపపురాణాలు అవతరించడంలో ఔచిత్యమూ, యాధార్థ్యతా గోచరిస్తుంది.

"మద్వయం భద్వయంచైవ బ్రత్రయం వచతుష్టయం !
అ, నా, ప, లిం, గ, కూ, స్కాని పురాణాని పృథక్ పృథక్ !

అన్న ప్రాచీన కారిక ప్రకారం మత్స్య- మార్కండేయ- భాగవత- భవిష్యత్-బ్రహ్మాండ- బ్రాహ్మ- బ్రహ్మవైవర్త- వామన- వాయువ్య- వైష్ణవ- వారాహ-అగ్ని- నారద- పద్మ-లింగ- గరుడ- కూర్మ- స్కాంద పురాణాలు మాత్రమే 18 పురాణాలుగా నిలుస్తాయి. ఈ అష్టాదశ మత్స్యాది నామాలతోనే 18 సంఖ్యకు మాత్రమే పరిమితమై ఉపపురాణాలు కూడా నిలువవలసి వున్నది.

అసలు అష్టాదశపురాణాలను పురాణాలనే వ్యవహరించాలి. అత్యంత ప్రాచీనకాలంలో ఆ విధంగానే వ్యవహరించేవారు. "శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలు" అన్న వాక్యంలో అత్యంత ప్రాచీనకాలంనుంచి కూడా మనకి పురాణ శబ్దమే కనిపిస్తుంది. అయితే ఉపపురాణా లవతరించిన తరువాత ఆ యా ఉప

వాఙ్మయ మహోధ్యక్షుని

పురాణాలను, ఉపపురాణాలుగా పేర్కొనడంలో బద్ధకించిన పండితులు, ఉప శబ్దాన్ని విడిచిపెట్టి సులభాపేక్షతో, సౌఖ్యాపేక్షతో, ఉపపురాణాలనుసైతం పురాణాలని వ్యవహరించడం మొదలుపెట్టారు. కాగా అసలు పురాణాలేవో, ఉపపురాణాలేవో విస్పష్టంగా సులభతరంగా గుర్తించడంలో పండితలోకంలోనే తికమక లేర్పడ్డాయి. ఈ తికమకలనుంచి బయటపడడంకోసం పురాణాలుగా వ్యవహరింపబడుతున్న ఉపపురాణాలకూ, అసలు పురాణాలకూ భిన్నత్వం గోచరమవ్వాలనే దృష్టితో అసలు పురాణాలకు మొదట "మహా" శబ్దాన్ని చేర్చి వ్యవహరించడం మొదలుపెట్టారు. అందువల్ల అసలు పురాణాలు మహాపురాణాలై ఉపపురాణాలు పురాణాలై కూర్చున్నాయి. వాస్తవానికి అత్యంత విపులంగావున్న మూలపురాణంలోని అసలు విషయాన్ని అంతటినీ సంగ్రహించి చెప్పేది ఉపపురాణమై ఉండాలి. ఈ దృష్ట్యా అష్టాదశ మూలపురాణాలకు, అష్టాదశ ఉపపురాణాలు మాత్రమే అవతరించే అవకాశం వున్నది. అయితే ఉపపురాణాలు అష్టాదశ సంఖ్యను మించిపోయినట్లు కనిపిస్తున్నది. ఇందుకు కారణంకూడా లేకపోలేదు. వాస్తవానికి విష్ణు పురాణానికి ఉపపురాణంగా అవతరించిన, విష్ణు ధర్మ పురాణంలో, విష్ణు పురాణ సారాంశమంతా వున్నదో లేదో చెప్పలేము. మొట్టమొదట అది అవతరించినపుడు, అది విష్ణు పురాణ సారాంశ ప్రతిబింబకం అయ్యే అవతరించి వుండవచ్చును. తరువాతికాలంలో దానిలో కొంతభాగం శిథిలమై వుండవచ్చును. అప్పుడు మరొక పండితుడు తన కసమగ్రంగా లభ్యమైన విష్ణుధర్మ ఉపపురాణం సమగ్ర ఉపపురాణం కాదన్న భావంతో "విష్ణు ధర్మోత్తర ఉపపురాణం" అన్న పేరుతో విష్ణుపురాణం ఆధారంగానే వేరొక ఉపపురాణాన్ని రూపొందించి వుండవచ్చును. కాగా, విష్ణుపురాణానికి, వొకే వొక్క ఉపపురాణంగా వుండవలసిన గ్రంథం రెండు ఉపపురాణాలుగా, రెండు భిన్న గ్రంథాలుగా అవతరించి వుంటాయి. ఇదే విధంగా అత్యంత విపులమైన విభిన్న విషయాలకు ఆలవాలాలైన మూలపురాణాలలోని వివిధ విషయాలను వివరిస్తూ, భిన్న భిన్న గ్రంథాలుగా, వేరు వేరు ఉపపురాణాలుగా మరికొన్ని అవతరించి వుంటాయి. అంటే ఒకానొక విధమైన పురాణసారసూత్ర బద్ధమై సమగ్ర గ్రంథాలుగా అవతరించవలసిన ఉపపురాణాలు అసమగ్రాలై, సమగ్రనామక ఉపపురాణాలుగా అవతరించాయన్నమాట. ఈ దృష్ట్యా ఖండ ఖండాలుగా అవతరించిన విభిన్న ఉపపురాణ నామక గ్రంథాలు అసలు ఉపపురాణాలు కానేకావన్నమాట. అయితే మత్స్య-మార్కండేయాది అష్టాదశ పురాణాలు సుసమగ్రంగా, యథాతథంగా ప్రక్షిప్త పాఠ విరహితంగా మనకు లభించాయని చెప్పలేము. కాగా, అసలైన, సరైన ఉపపురాణాలుకూడా మనకు ఉపలభ్యమానాలైనాయని చెప్పడం నిస్సందేహంగా సందేహాస్పదమైన విషయమే.

### మహామథన సారామృతం

## పురాణాల కర్తృత్వం

అష్టాదశ పురాణాలన్నీ క్రీ.శ. 6 శతాబ్దం ప్రాంతంలో రచించబడినాయని కొందరు భావించినా, క్రీస్తుకు పూర్వమే యీ పురాణాలన్నీ వున్నాయని మరి కొందరు భావించినా చారిత్రకంగా వీటికాలంగురించి సాధికారికంగా చెప్పడానికి అవకాశం లేనట్లే యీ పురాణాల కర్తృత్వం గురించి ఇతమిత్థం అని సాధికారికంగా చెప్పడానికి అవకాశంలేదు. అష్టాదశ పురాణాలకు కర్త వేదవ్యాసుడే అన్న మాట అలావుండగా యీ పురాణాలలో రెండు పురాణాలు మాత్రమే వ్యాస ప్రోక్తాలని విస్పష్టంగా వక్కాణిస్తూ ప్రాచీనకాలంనుంచీ అనుస్యూతంగా, ఆర్యోక్తిగా ఒక కారిక నిలిచివున్నది.

"అష్టాదశపురాణేషు వ్యాసేనకథితం ద్వయం
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్"

దీని ప్రకారం అష్టాదశ పురాణాలకూ, వ్యాసుడే కర్త అన్నమాట అప్రామాణికమై అతని కర్తృత్వం రెండు పురాణాలకు మాత్రమే పరిమితం అవుతుంది. ఆర్ష విజ్ఞానదృష్ట్యా అసలు వ్యాసశబ్దం మహర్షినామం కాదు. వ్యాసమహర్షి అనబడుతున్న ఆ మహర్షి అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. వ్యాసశబ్దం అపసవ్యవాఙ్మయమైన ఆర్షవాఙ్మయాన్ని వ్యాసం చేసి అంటే విస్తృతం చేసి సవ్యంగా రూపొందించబడడంవల్ల అది వొక సిద్ధాంతనామంగా ప్రాచీనకాలంలో రూపొందింది. వ్యాస మహాభారతమన్నా, వ్యాసకృత మహాభారతమన్నా విస్తృతం చేయబడిన-సవ్యంగా రూపొందించబడిన మహాభారతం అనే అర్థంకాని, వ్యాసుడనే వ్యక్తిచేత రచింపబడిన మహాభారతమని అర్థంకాదు. వ్యాసః అని కాని వ్యాస మహర్షిః అని కాని ప్రాచీనకాలంలో ప్రయుక్తాలయ్యాయంటే వ్యాసం (విస్తృతం) చేసినవాడు-వ్యాసం (విస్తృతం) చేసిన మహర్షి అన్న విశేషార్థాలలోనే ప్రాచీనులు ప్రయోగించారు తప్ప, కేవల నామవాచకంగా మాత్రం ప్రయోగించలేదు. అయితే ఈ వ్యాస నామకులు కూడా వొక్కరుగానే లేరని, వేద వ్యాసుడు వేరని, పురాణ వ్యాసుడు వేరని, మహాభారత వ్యాసుడు వేరని యింకా యింకా అనేకమంది వ్యాస మహర్షు లున్నట్లు భావించినవారు కూడా లేకపోలేదు. భాగవతాన్ని బట్టిచూస్తే ప్రతిద్వాపర యుగంలోనూ వేదవ్యాసుని పేరుమీద స్వయంభువు, ప్రజాపతి, శుక్రుడు, బృహస్పతి, వశిష్ఠుడూ, త్రివర్షుడూ సనద్వాజుడూ, మొదలైన వారు వేదవ్యాసులుగా ఆర్ష విద్యలను విస్తరింపచేసినట్లు తెలుస్తున్నది. కాగా ఒక మన్వంతరంలో 72 చతుర్యుగాలలోనూ 72 మంది వేదవ్యాసనామకులు విభిన్నవ్యక్తులు అవతరించి ఆర్షవిజ్ఞానవ్యాప్తి చేస్తారని తేటతెల్లమవుతున్నది.

వాఙ్మయ మహాధ్యక్షుని

యీ లెక్క ప్రకారం చూస్తే 14 మన్వంతరాలలో 1008 మంది విభిన్న వేద వ్యాసులు అవతరిస్తారని భావించవలసి వున్నది. అయితే ప్రత్యక్ష, అప్రత్యక్షాది జీవిత విశేషాలతో కూడుకొన్న పరాశరసూనుడై కృష్ణ ద్వైపాయన నామకుడైన వ్యాస మహర్షి కాల నిర్ణయవిషయంలో కూడా — అతనిది భారత యుద్ధ కాలమేనని నిక్కచ్చిగా చెప్పలేము. పరాశరాదుల ఆయుఃప్రమాణ విషయం కూడా సందేహాస్పదమైనదే. అష్టాదశ పురాణాలను వ్యాసుడే రచించాడన్నా, అసలు వీటన్నింటికి మూలకర్త బ్రహ్మ యని పేర్కొన్నా, రకరకాలుగా వున్న యీ పురాణాలన్నింటికీ కర్తృత్వం అనేక విధాలుగా గోచరమౌతున్నది. వీటన్నింటికీ పురాణాలే ఆధారంగా వుండడం మరీ విచిత్రంగా కనిపిస్తున్నది. మత్స్య, విష్ణ్వాది పురాణాలను బట్టి చూస్తే, అసలు పురాణాల మూలకర్త బ్రహ్మ అని, ఆ బృహద్గ్రంథాన్ని 18 పురాణాలుగా వ్యాసుడు సంగ్రహించి రోమహర్షణునికి చెప్పగా, ఆ రోమ హర్షణుడు సూత మహర్షికి చెప్పగా, సూతుడు శౌనకాదులకు చెప్పినట్లు వొకచోట కనిపిస్తున్నది. ఇందుకు భిన్నంగా వాయు పురాణం వాయు ప్రోక్తంగానూ, నారదీయ పురాణం నారద ప్రోక్తంగానూ, మార్కండేయ పురాణం మార్కండేయ ప్రోక్తంగానూ, బ్రహ్మాండ పురాణం వశిష్ఠబ్రహ్మ ప్రోక్తంగానూ, లింగపురాణం నందికేశ్వర ప్రోక్తంగానూ, గారుడ, వరాహ పురాణాలు విష్ణు ప్రోక్తాలుగానూ, బ్రహ్మ, వామన, పురాణాలు బ్రహ్మ ప్రోక్తాలుగానూ, స్కాంద పురాణం స్కంద (షణ్ముఖ) ప్రోక్తంగానూ, కూర్మ పురాణం కూర్మావతార ప్రోక్తంగానూ, మత్స్య పురాణం మత్స్యావతార ప్రోక్తంగానూ, వక్కాణించారు. ఈ దృష్ట్యా అగ్ని పురాణం అగ్ని ప్రోక్తంగానూ, విష్ణుపురాణం విష్ణుప్రోక్తంగానూ భావించవలసి వుంటుంది. పద్మ పురాణం విష్ణుప్రోక్తమే అనుకున్నా, బ్రహ్మవైవర్త పురాణం, వైవర్త బ్రహ్మ ప్రోక్తంగా భావించినా, మిగిలిన భాగవత, భవిష్యత్ పురాణాలు వ్యాసకృతాలని చెప్పవలసి వుంటుంది. ఇవన్నీ పురాణ విషయాలమీద ఆధారపడి చెప్పినవే అయినా, వీటి కథాకథనం ప్రకారం పరిశీలిస్తే వాయు, నారదాది ప్రోక్తత్వాలుగా పేర్కొనడంలో—లౌకికంగా ప్రస్తుతం నిజమేనని నిరూపించడానికి అవకాశాలు లేకపోయినా—ఆర్ష విజ్ఞానదృష్ట్యా మాత్రం అగాధమైన పరిశోధనలు చేస్తే నిజం లేకపోలేదేమోనని అనిపిస్తుంది. మత్స్యాది పురాణాలను బట్టి చూస్తేనే, అష్టాదశ పురాణాలకు కర్త వ్యాసుడేనన్న మాట వాస్తవంగా నిలువదు. కాగా ఆయా పురాణాల కర్తృత్వ విషయంలో ఆ కర్తృత్వాన్ని వేరే మహర్షులకో, మనీషులకో, మనుషులకో ఆపాదించి నిర్ణయించడానికి పరిశోధకులకు యెటువంటి ఆధారాలూ లేవు, అధికారాలూ లేవు.

## మహామథన సారామృతం

## పురాణ రచనా కాల వ్యవస్థ

'శ్రుతి స్మృతి పురాణేతిహాసాలు' అన్న వాక్యం ప్రకారం శ్రుతుల తరువాత స్మృతులు వాటి తరువాత పురాణాలు అవతరించినట్లు కనిపిస్తుంది. శ్రుతులెప్పుడవతరించాయో సాధికారికంగా చెప్పలేనట్లే స్మృతుల అవతరణ గురించి కూడా చెప్పే అవకాశంలేదు. ఇదేవిధంగా పురాణాల అవతరణ గురించి, వాటి కాలం గురించి చెప్పడం ఎంత అగాధమైన పరిశోధనలు చేసినా సుసాధ్యంగా కనపడడంలేదు పురాణ శబ్దానికి పురాతన విషయాలు చెప్పేది అని పండిత విమర్శక లోకమంతా అర్థం చెప్పుకుంటున్నది. లోతుగా పరిశీలిస్తే పురాణమంటే పురాతన కాలంలో చెప్పబడింది అని మాత్రమే అర్థమేమోనని అనిపిస్తున్నది. పురాణాల ఆవిష్కరణ దశలను, గాథలను పరిశీలించినపుడు వొక్క భవిష్య పురాణమేకాదు. మొత్తం పురాణాలన్నీ భవిష్య పురాణాలుగానే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు వొక్క నారదీయపురాణమే తీసుకొందాం. ఈ నారదీయ పురాణంలో విష్ణుమాహాత్మ్యం గురించి వర్ణించడంతోపాటు, హిరణ్యాక్ష హిరణ్యకశిపుల జన్మాదికాలు, ప్రహ్లాద జననం, వరాహ నరసింహావతారాలు ఇత్యాది విశేషాలన్నీ భవిష్యత్తులో జరుగబోతున్నాయని నారదప్రోక్తమై వున్నది. అంటే వరాహ నరసింహావతారాలకు పూర్వమే-అది ఎంతపూర్వకాలంలోనో ఇదమిత్థంగా చెప్పలేము-నారదీయపురాణం ప్రోక్తమైనదన్నమాట. కాగా యిది భవిష్యద్వాణీ విలసితమేకదా!

బ్రహ్మ, పద్మ, వరాహ, శ్వేతాది కల్పాలలో, బ్రహ్మ, పద్మ, వరాహ, వాయువ్యాది పురాణాలు ఉత్పన్నాలయినాయని మత్స్యపురాణం పేర్కొంటున్నది. పురాణాలు కల్పాలలోకే ప్రవేశించాయంటే మనం ఒక అనంత ప్రపంచంలో అయోమయంలో పడిపోయామన్నమాట. ఆర్ష విజ్ఞానదృష్ట్యా కృత, త్రేత, ద్వాపర, కలియుగాలు నాల్గింటినీ చతుర్యుగాలని, మహాయుగమని పేర్కొంటారు. ఈ యుగాల కాలపరిమితి మానవ సంవత్సరాలలో 43,20,000 సంవత్సరాలు. ఇటువంటివి 74 చతుర్యుగాలయితే ఒక మన్వంతరం. పూర్వోత్తర సంధి కాలాలతో కలుపుకొని 14 మన్వంతరాల కాలం గడిస్తే ఒక కల్పంగా పరిగణన. స్వాయంభువ, స్వారోచిష, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష, వైవస్వత, సూర్యసావర్ణిక, దక్షసావర్ణిక, బ్రహ్మసావర్ణిక రుద్ర సావర్ణిక, ధర్మసావర్ణిక, రౌచ్య, భౌచ్య మనువుల అంతర కాలపరిమితి 432 కోట్ల సంవత్సరాలు. ఈ సంవత్సరాల కాలమే ఒక కల్పం అనబడుతుంది. యీ 432 కోట్ల సంవత్సరాలూ బ్రహ్మకు ఒక పగలు. దీన్ని ఉదయ కల్పం అని అంటారు. అనంతరంతిరిగి 432కోట్ల సంవత్సరాలు నడిస్తే అది బ్రహ్మకు రాత్రి. దీన్ని క్షయకల్పం అంటారు. అంటే 864 కోట్ల మానవ సంవత్సరాలు గడిస్తే బ్రహ్మకు పగలూ రాత్రితో కూడిన ఒకరోజు క్రింద లెక్క అన్నమాట. ఇటువంటి రోజులు

వాఙ్మయ మహోధ్యాతుని

365 అయితే బ్రహ్మకు ఒక సంవత్సరం. అంటే 3 లక్షల 15 వేల 410 కోట్ల మానవ సంవత్సరాలు గడిస్తే బ్రహ్మకు ఒక సంవత్సరం గడిచినట్లన్నమాట. ఇటువంటివి 100 సంవత్సరాలైతే బ్రహ్మకు పూర్ణాయుర్దాయం. అంటే 3 కోట్ల, 15 లక్షల, 41 వేల కోట్ల సంవత్సరాలు గడిస్తే బ్రహ్మ పరమాయు వన్నమాట. కల్పాల దృష్ట్యా బ్రహ్మ పరమాయుర్దాయకాలంలో పగలు, రాత్రిళ్ళుగా పరిగణించబడే వివిధ కల్పాల సంఖ్య 73 వేలకు పరిమిత మౌతుంది. ఒక కల్పానికి 432 కోట్ల సంవత్సరాల కాలమని అథర్వవేదం ఈ క్రింది మంత్రంలో విస్పష్టంగా వక్కాణించింది.

"శతంతే అయుతం హాయనాన్
ద్వేయుగేత్రీణి చత్వారి కృణ్మః
ఇంద్రాగ్ని విశ్వేదేవాస్తేను
మన్వంతా మహృణీయమానాః —(అథర్వ 8-1-2-21)

బ్రహ్మ, పద్మ, వరాహ, శ్వేతాది నామాలతో వివిధ కల్పాలకు నామాలున్నట్లు కనిపిస్తున్నది. అయితే బ్రహ్మ పరమాయుర్దాయంలో వచ్చే మొత్తం 73 వేల కల్పాలకు క్రమానుగతంగా ఒక పద్ధతి ప్రకారం నామాలు ఆర్షవిజ్ఞానం దృష్ట్యా యేర్పడి వుండవచ్చును కాని అవన్నీ మనకు లభ్యమైనట్లు కనపడదు.

అసలు స్వాభావికంగా సృష్టే చాలా విచిత్రమైనది. సూర్యోదయ, అస్తమయాలు క్రమబద్ధంగా నిర్ణీత కాలప్రకారం జరుగుతున్నట్లు చంద్రోదయ, అస్తమయాలు క్షీణాభివృద్ధి దశలు క్రమబద్ధంగా జరుగుతున్నట్లు, అశ్విన్యాది 27 నక్షత్రాలు ప్రతి 27 రోజులకు (అధికమాసాన్ని విడిచిపెట్టి) వొక్కసారి చంద్ర సామీప్యాన్ని పొందుతున్నట్లు మేషాది ద్వాదశరాసులు కాలబద్ధాలై క్రమంగా తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తున్నట్లు భూమ్యాదిగోళాలన్నీ యితర గ్రహనక్షత్రాలన్నీ తమచుట్టూ తాము తిరుగుతూ తమ అధిదేవత చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు సృష్టి మొత్తంలో అటు స్వరూపంలోనూ, యిటు స్వభావంలోనూ సైతం ఒకానొక విచిత్రమైన చక్రనేమి క్రమంతో కూడిన పునరావృత్తి పూర్వకమైన వ్యవస్థ వున్నట్లు అగాధమైన ఆర్షవిజ్ఞానందృష్ట్యానేకాదు ఆధునిక విజ్ఞానందృష్ట్యా కూడా మనం పరిశోధన చేస్తే మనకు గోచరమౌతుంది.

"చరిత్ర పునరావృత్త మౌతుంది" అన్న వాక్యం సర్వసామాన్యంగా అనేక సందర్భాలలో మనందరినోటా నలిగేమాట. ఇది యేదో అలవోకగా గాని, ఆషామాషీగా కాని, ఊసుపోకకాని, సృష్టించిన మాటకాదు. మనం అన్నమాట మళ్ళీ అంటున్నట్లు, చేసిన పని మళ్ళీ చేస్తున్నట్లు, చరిత్రలోనూ, సృష్టిలోనూ జరిగిన సంఘటనలే మళ్ళీ మళ్ళీ జరుగుతూ వుంటాయి. గత 116 సంవత్సరాల చరిత్రలో అమెరికాలో జరిగిన కొన్ని సంఘటనల విషయం యిక్కడ నేను బుద్ధిపూర్వకంగా నే

ఉటంకిస్తున్నాను. యివి యిటీవల బైటపడినవే. లింకన్ అనేవ్యక్తి అమెరికా ప్రసిడెంటుగా 1860లో ఎన్నికయ్యాడు. సరిగ్గా 100 సంవత్సరాలతరువాత కెనెడీ అనేవ్యక్తి 1960లో అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. వీరిద్దరూ కూడా తమ భార్యలు తమ దగ్గర వుండగానే శుక్రవారంనాడే కాల్చి చంపబడ్డారు. ఇద్దరికీ కూడా గుండ తలలోనుంచే దూసుకు పోయింది.

లింకన్ సెక్రటరీ పేరు కెనడి. సెక్రటరీ లింకన్‌కు సినీమాకు వెళ్లవద్దని సలహ యిచ్చాడు. కెనెడి సెక్రటరీ పేరు లింకన్. ఈ సెక్రటరీ కెనడీని "డెల్లాస్"కు వెళ్లవద్దని సలహా యిచ్చాడు. లింకన్ను చంపిన బూత్ అనే వ్యక్తి సినీమాహాలులో లింకన్ను చంపి వేర్ హౌస్‌లోకి పారిపోయాడు. కెనెడీని చంపిన ఆస్వాల్డ్ వేర్ హౌస్‌లో కెనెడీని చంపి సినీమాహాలులోకి పారిపోయాడు. లింకన్ తరువాత ఎన్నికైన ప్రెసిడెంట్ పేరు జాన్సన్. కెనెడీ తరువాత వచ్చిన ప్రెసిడెంట్ పేరు కూడా జాన్సనే. లింకన్ తరువాత వచ్చిన ప్రెసిడెంటు ఆండ్రోజాన్సన్ 1808 లో జన్మించగా, కెనెడీ తరువాత వచ్చిన ప్రెసిడెంటు లిండన్ జాన్సన్ 1909 లో జన్మించాడు. లింకన్ను చంపిన 'బూత్' 1813 లో జన్మించాడు. కెనెడీని చంపిన 'ఆస్వాల్డ్' 1913 లో జన్మించాడు. హంతకులైన బూత్, ఆస్వాల్డ్‌లు యిద్దరూ కూడా వారిమీద విచారణలు పూర్తికాకుండానే చంపివేయబడ్డారు.

పేర్లు తారుమారైనా మిగిలిన వివిధ సంఘటనలతో కూడిన విశిష్ట చరిత్ర అంతా స్పష్టంగా కళ్లకు కట్టినట్లు అద్దంలోని ప్రతిబింబంవలె పునరావృత్తంగా మనకు కనిపిస్తున్నది. అసలు సృష్టిలోనే సహజంగా యిటువంటి పునరావృత్తులు మాత్రమేకాదు, విభిన్నాలైన సర్వ విషయాలలోనూ చైతన్యవంతమైన పునరావృత్తి జరిగి తీరుతుందని ఆర్షవిజ్ఞానం వేనోళ్ల చాటుతున్నది. ఆధునిక వైజ్ఞానికులు సైతం, యీ పునరావృత్తి సిద్ధాంతాన్ని నిర్ద్వంద్వంగా కాదని త్రోసిపుచ్చే పరిస్థితులలో లేరు. కాగా సృష్టి స్థితిలయాలు స్వాభావికాలైనట్లే, అవి మరెన్నోసార్లు పునరావృత్తి కావడంకూడా స్వాభావికమే. అసలు సృష్టి వ్యవస్థకే పునరావృత్తికలిగే అవకాశమున్నప్పుడు, సృష్టిమీద ఆధారపడి రూపొందే వివిధ సంఘటనలకుగాని, చారిత్రక ఘట్టాలకు కాని పునరావృత్తి కలగదని చెప్పే అవకాశంలేదు. ఆర్షవిజ్ఞానందృష్ట్యా ప్రస్తుతకాలంలో ఆరు మన్వంతరాలు గడచి, ఏడవ మన్వంతరంలో మనం వున్నామని చెప్పగలం కాని, యిప్పటికి మొత్తం. అసలు కల్పాలెన్ని గడిచాయో చెప్పలేము. బ్రహ్మ, పద్మాది కల్పాలలో బ్రహ్మ, పద్మాది పురాణాలవతరించాయంటే ఆ కల్పాలెప్పుడు వెళ్లిపోయాయో, ఆ గ్రంథాలెప్పుడు అవతరించాయో, మనం చెప్పలేము. 73 వేల కల్పాల నామాలు క్రమబద్ధంగా మనకు లభించినప్పుడు ప్రస్తుత కల్పమేదో మనం గుర్తించగలిగితే, బ్రహ్మ, పద్మాది

వాఙ్మయ మహోధ్యయుని

కల్పాలలో అవతరించిన పురాణాలగురించి కొంతవరకైనా ఊహించడానికవకాశం వుంటుంది. కల్పాంత ప్రళయంలో సర్వస్వం నాశనమైనట్లు పురాణాలుకూడా పోయాయంటే, అనంతర ఉదయ కల్పసృష్టి వ్యవస్థలో తిరిగి పురాణాలు అవతరించాయని చెప్పవలసివస్తుంది. అయితే ఆయా కల్పాలలో పురాణాలవతరించాయన్నమాట. అవాస్తవికమనో, ప్రక్షిప్తమనో త్రోసిపారవేయవచ్చును కాని ఖగోళ వ్యవస్థను, తచ్చైతన్య చేష్టావ్యవస్థను తత్ప్రతిబింబకమైన భూమండల సృష్టివ్యవస్థా చైతన్య చేష్టా స్వరూప స్వభావ పరిణామక్రమాలను మనం త్రోసిపుచ్చలేము. ఇక్కడున్నది వొకటే చిక్కు. 'మఖానక్షత్రం'లో సప్తఋషులు వున్నప్పుడు మహాభారతయుద్ధం జరిగిందని అనుకుందాం. సప్తఋషి మండలం ఒక నక్షత్రం నుంచి మరొక నక్షత్రంలోకి జరుగుతూనే వుంటుంది. ఇది ఒకే వొకసారి జరిగి ఆగిపోయే వ్యవస్థకాదు. పునరావృత్తిపరంగా, యెన్నిసార్లయినా నక్షత్ర చలనం జరుగుతూనే వుంటుంది. ఈ దృష్ట్యా యిప్పటి కెన్నిసార్లు సప్తఋషిమండలం మఖా నక్షత్రంలోకి వచ్చి వెళ్లిందో యెంతటి వైజ్ఞానికులకైనా ఊహించి చెప్పడానికి వీలులేని విషయం. కాగా, ఆర్ష విజ్ఞానదృష్ట్యా పురాణాల ప్రాచీనత్వంగురించి సాధికారికంగా చెప్పాలంటే ఆయా పురాణాలలో వున్న వివిధ మన్వంతర ఖగోళ శాస్త్రాది విషయాలలో పరిశోధనచేసి సత్యాన్వేషణ చేయవలసివున్నది.

బ్రాహ్మణ, ఆరణ్యకాలలోనూ, ఆపస్తంభ సూత్రాలలోనూ పురాణ శబ్దం ప్రయోగించబడింది. పురాణాలన్నీ ఆధునికాలని అభిప్రాయపడిన విమర్శకులు పై గ్రంథాలలో వున్న పురాణశబ్ద ప్రయోగానికి ప్రాచీనమనే అర్థం చెప్పి తమ వాదాలను సమర్థించుకున్నారు. వాస్తవానికి బ్రాహ్మణాదులలో పేర్కొనబడిన పురాణశబ్దం అష్టాదశ పురాణాలలోని పురాణవాచకమే కాని తద్భిన్నంకాదు. శ్రుతి స్మృతిపురాణేతిహాసాలన్న వాక్యంప్రకారం పురాణాల తరువాతనే బ్రాహ్మణారణ్యకాదులూ, ప్రాతిశాఖ్యలూ యితర సూత్రగ్రంథాలూ, వేదాంగాలూ, ఉపనిషత్తులు అవతరించాయని చెప్పవలసివుంటుంది. అయితే పరస్పరవిరుద్ధంగా చరిత్రకు విరుద్ధంగా స్వవచన వ్యాఘాతాలుగా కనిపించే విషయాలు అనేకం మనకు పురాణాలలో గోచరమౌతాయి. ఉపనిషద్వాక్యాల ప్రసక్తులేకాక పాణిన్యాదిమహర్షుల నామాలూ, జైన, బౌద్ధ, ఇతర చార్వాక, పాషండాదిమతాల ఖండనంవంటి విషయాలూ వీటిల్లో మనకు గోచరమౌతాయి. వీటిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, ఆయా మహర్షుల మతకర్తల కాలం తరువాతనే పురాణాలు అవతరించాయని మనం ఆమోదించవలసి వుంటుంది. పురాణాలు బ్రాహ్మణాదులకంటే ప్రాచీనతమాలని మనం ఆమోదించినప్పుడు పరస్పర విరుద్ధాలూ, లేదా చారిత్రక విరుద్ధాలూ, స్వవచన వ్యాఘాతాలుగా వున్న పై విషయాల గురించి రెండు విధాలైన నిర్ణయాలలో యేదో

వొక నిర్ణయానికి మనం రావలసి వుంటుంది. పురాణాలను లోతుగా పరిశీలించినప్పుడు అవి అన్నీ భవిష్య పురాణంవలెనే భవిష్యద్వాణిగా అవతరించినట్లు మనం ఆమోదించవలసి వుంటుంది. ఆర్ష విజ్ఞానం దృష్ట్యా వేద విజ్ఞానం దృష్ట్యా భవిష్యద్విషయక వాఙ్మయం అవతరించడానికి పూర్తిగా అవకాశాలున్నాయి. కాగా పాణిన్యాది మహర్షుల ప్రసక్తి కాని, జైన, బౌద్ధాది మత ప్రవక్తల ప్రసక్తి కాని ఆధునిక విషయమనిపించు కున్నదేదైనా భవిష్యద్వాణిగా ఆమోదించినప్పుడు వాటి ఉనికిని గురించి మనం ఆక్షేపించవలసిన విషయమేదీ వుండదు. పురాణాలను, భవిష్యద్వాణిగా ఆమోదించ లేనప్పుడు వాటిల్లో ఆమూలాగ్రంగా వున్న పరమ వైజ్ఞానికాలైన వాస్తవిక విషయాలను సైతం మనం వాస్తవికాలు కావని, అప్రామాణికాలని త్రోసిపుచ్చినట్లవుతుంది. ఒకవేళ పురాణాలు భవిష్యద్వాణులు కావని మనం ఆమోదిస్తే, పాణిన్యాది మహర్షులకూ, జైనబౌద్ధాది మతకర్తలకూ, సంబంధించిన ఆధునిక విషయ విశేషాలకు సంబంధించిన వివిధ ప్రసక్తులన్నీ ప్రక్షిప్తాలని మధ్యలో కలుపబడినాయని మనం ఆమోదించవలసి వుంటుంది. కాని యీ దృష్ట్యాకూడా మరొకచిక్కు లేకపోలేదు. ఆధునిక విషయాలను ప్రక్షిప్తాలని మనం త్రోసిపుచ్చినా, అత్యంత ప్రాచీనకాలంలో జరిగిన–చరిత్రలో యెప్పుడు జరిగాయో చెప్పలేనటువంటి, నరసింహావతారాది కథలూ, ప్రహ్లాదాది చరిత్రలూ, వారి పితృ చరిత్రలూ వారివారి పూర్వజన్మలూ, భవిష్యజ్జన్మలూ మొదలైన విషయాలను గురించిన పరిపూర్ణగాథలన్నీ భవిష్యద్వాణిగానే పురాణాలలోవున్నాయి. వీటి భవిష్యద్వాణిత్వాన్ని ఆమోదించలేనివారు, అసలు భవిష్యద్వాణిత్వమనేదే ప్రక్షిప్తమని అనక తప్పదు. ఈ విధంగా ఆర్ష విజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకోకుండా సత్యాన్వేషణా పరత్వం లేకుండా అడ్డువచ్చిన వాటి నన్నిటినీ ప్రక్షిప్తాలనో, పరికల్పితాలనో అంటూ పోతే అసలు పురాణ వాఙ్మయస్వరూప స్వభావాల గురించికాని తద్రూపంగా వేదవాఙ్మయం గురించికాని, ఆర్ష విజ్ఞానం గురించి కాని మాట్లాడే అధికారం యీ విమర్శకులకు బొత్తిగా లేదని చెప్పవలసివస్తుంది. సత్యాన్వేషణతో ఆర్షవిజ్ఞానంలో పరిశోధన చేసేశక్తి సామర్థ్యాలు కాని, ఆ విజ్ఞానం గురించి అసలు ఆలోచించవలసిన అర్హతకాని యీ విమర్శక పరిశోధక శిఖామణులకు అణుమాత్రమైనా లేదని నిర్ద్వంద్వంగా, నిస్పష్టంగా, మహత్తర ఆర్షవిజ్ఞానిగా నేను యెలుగెత్తి చాటవలసి వస్తున్నది.

## పురాణాల తత్వం

పురాణాల గురించి స్కాందపురాణం పేర్కొన్న విషయాలనుబట్టి చూస్తే శైవ–భవిష్య–మార్కండేయ–లైంగ–వరాహ–స్కాంద–మత్స్య–కూర్మ–వామన బ్రహ్మాండపురాణాలు పదీ కూడా శైవ ప్రశంసా పూర్వకాలేనని, వీటిల్లో మూల

వాఙ్మయ మహోధ్యాకుని

భూతుడై శివుడే విరాజిల్లుతున్నాడని తోస్తుంది. విష్ణు-భాగవత-నారదీయ-గారుడ పురాణాలు నాలుగూ విష్ణు మాహాత్మ్యాన్ని వర్ణించేవని, బ్రాహ్మ పురాణం-పద్మ పురాణాలు రెండూ బ్రహ్మను వర్ణించేవని, అగ్ని పురాణం అగ్నిని వర్ణిస్తుందని, బ్రహ్మవైవర్త పురాణం, సవితృ దేవతను వర్ణిస్తుందని తెలుస్తుంది. గతంలో ఒక సారి పేర్కొన్నట్లు విష్ణుపురాణాన్ని బట్టి చూస్తే, పురాణవిషయాలూ, తత్త్వాలూ యిందుకు భిన్నంగా గోచరమౌతున్నాయి. విష్ణు-నారదీయ - భాగవత-గరుడ-పద్మ - వరాహపురాణాలు మహావిష్ణు తత్త్వమాహాత్మ్య ప్రతిపాదకాలనీ, బ్రహ్మాండ-బ్రహ్మవైవర్త - మార్కండేయ - భవిష్య - వామన- బ్రాహ్మ పురాణాలు సరస్వతీ చతుర్ముఖ కృశానుల మహత్త్వ తత్త్వాన్ని ప్రశంసించేవనీ, మత్స్య - కూర్మ - లింగ - శివ - స్కాంద - అగ్ని పురాణాలు దుర్గా శివలింగ విఘ్నేశ కుమారస్వాముల మాహాత్మ్య తత్త్వస్తోత్ర పూర్వకాలనీ పేర్కొనడం జరిగింది. విష్ణుపురాణ వక్కాణం ప్రకారం ఆరుపురాణాలు విష్ణుమాహాత్మ్య ప్రతిపాదకాలు, ఆరుపురాణాలు బ్రహ్మ మాహాత్మ్య ప్రతిపాదకాలు, ఆరుపురాణాలు శివ మాహాత్మ్య ప్రతిపాదకాలుగాను వున్నట్లు కనిపిస్తుంది. అయితే మహావిష్ణువును వర్ణించే పురాణాలు సాత్త్విక పురాణాలని, అవి మోక్షప్రదాలని, వాటికి ఉత్తమోత్తమస్థానం యివ్వడం జరిగింది. బ్రహ్మతత్త్వ ప్రతిపాదకాలైన ఆరు పురాణాలు రాజసగుణ ప్రధానాలని అవి స్వర్గ ప్రదాలని ఒక మెట్టు క్రిందికిదించి వర్ణించడం జరిగింది. శివమాహాత్మ్య ప్రతిపాదకాలైన మిగిలిన ఆరు పురాణాలు కేవల తామస పురాణాలని యీ ఆరూ దుర్గతి దాయకాలని వీటిని విన్నవారికి మతిపోతుందని అసలు యీ ఆరు పురాణాలను కలలోనైనా చూడకూడదని, స్మరించకూడదన్న ధోరణిలో తిరస్కృతాలుగా పేర్కొనబడ్డాయి. ఆర్ష విజ్ఞానం దృష్ట్యాగాని, వేదవిజ్ఞానం దృష్ట్యాగాని బ్రహ్మ, విష్ణు, శివతత్త్వ మాహాత్మ్య బహుముఖ స్వరూప స్వభావాల దృష్ట్యాగాని అష్టాదశ పురాణాల విషయాంతర్యం దృష్ట్యాగాని సాత్త్విక, రాజస, తామస, గుణపూర్వకత్వాలతో పురాణ విభజనచేసి ఆయాఫలితాలను పేర్కొనడం వాస్తవంగా కనిపించదు. పురాణాలన్నీకూడా త్రిగుణాత్మకాలే. ఒక్క పురాణాలేకావు వాటి మూలమైన వేదవాఙ్మయమంతా త్రిగుణాత్మకమే. వేదవాఙ్మయానికి, ఆర్ష విజ్ఞానానికే కాదు మొత్తం సృష్టికే మూలభూతు లనుకుంటున్న విష్ణు, బ్రహ్మ, మహేశ్వరులు ముగ్గురూకూడా త్రిగుణాత్ములే. సృష్టి స్థితులు రెండూ యెప్పుడైతే లయాత్మకాలయ్యాయో అప్పుడే అవి కేవల సాత్త్వికత్వానికే కాదు, రాజస, తామసత్వాలకు సైతం ఆలవాలాలయ్యాయి. అంటే మంచి చెడులన్నవిగాని, సుఖదుఃఖాలన్నవి కాని, వెలుగు చీకట్లుకాని సృష్టిలో నైసర్గికా లన్నమాట. వాటిల్లో ఒక్కొక్కప్పుడు హెచ్చుతగ్గుల వ్యవస్థ ఏర్పడవచ్చును. అది వేరుమాట. సాత్త్విక, రాజస,

తామస గుణతత్వ ప్రతిపాదకాల పేరుతో జరిగిన పురాణ గౌరవ, అగౌరవ ప్రదమైన నిర్ణయం సత్యాన్వేషణా పరమైనదికాదు. అసలు సత్యావిష్కరణా పరమైన దంతకంచేకాదు. వేదాలన్నింటిలోనూ సాత్విక, రాజస, తామసాత్మకాలైన వివిధ మంత్రాలున్నాయి. ఈ మంత్రాలు దేవాధిదేవతలైన కేవల విష్ణు బ్రహ్మ మహేశ్వరులకు సంబంధించినవి మాత్రమేకాదు. తదితర దేవతలకు సైతం సంబంధించినవిగా వున్నాయి. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సృష్టి స్థితిలయ కారకు లన్నప్పుడు లయకారకత్వం మహేశ్వరపక్షం కలది కాబట్టి, మహేశ్వరుణ్ని తామసాత్మకుడుగా కొందరు భావించివుంటారు. సృష్టికారకత్వం బ్రహ్మదికాబట్టి సృష్టిలో మంచి చెడు లన్నింటికి స్థానం వున్నది కాబట్టి కేవల వినాశకారిత్వాన్ని బ్రహ్మకు ఆపాదించలేక బ్రహ్మను రాజసాత్మకునిగా పేర్కొని వుంటారు. అటు సృష్టి వ్యవస్థకు, యిటు లయవ్యవస్థకు సంబంధంలేకుండా సృష్టియొక్క కేవల స్థితివ్యవస్థకే విష్ణువు పరిమితుడు కాబట్టి, విష్ణువును ప్రత్యేకదృష్టితో సాత్విక స్వరూపుడుగా భావించివుంటారు. అయితే అసలు సృష్టికి మూలభూతు డనిపించుకుంటున్న బ్రహ్మను సృష్టించడానికి మూలం ఆ శ్రీ మహావిష్ణువేకదా! విష్ణువుకు యిచ్చిన ప్రాధాన్యాన్నిబట్టి చూచినా బ్రహ్మ మహేశ్వరు లిద్దరికంటే విష్ణువు గొప్పవాడు మాత్రమే కాదు, వారిద్దరికీ కూడా మహావిష్ణువే మూలభూతుడు. కాగా మహావిష్ణు కారకత్వానికి చెందని రాజస తామసత్వాలు కేవల బ్రహ్మ మహేశ్వరపరాలు ఏ విధంగా అవుతాయి? ఆర్ష విజ్ఞానం దృష్ట్యా ఆంతరంగికమైన పరిశీలన చేయకుండా పై పై విషయాలను కొన్నింటిని దృష్టిలో పెట్టుకొని బ్రహ్మ మహేశ్వరులకు రాజస తామసత్వాలను ఆపాదించినట్లు కనిపిస్తున్నది. చేతబడులన్నవి క్షుద్ర ప్రయోగాలు వామాచార పద్ధతులు, మంత్ర శాస్త్రం దృష్ట్యా తీవ్రనిరసనకు గురిఅయ్యాయి. శైవమత పరంగా వామాచార పద్ధతులు అతిగా వ్యాప్తి చెందడాన్ని దృష్టిలో పెట్టుకొని శివునికి తామసత్వాన్ని ఆపాదించినట్లు కనిపిస్తున్నది. వాస్తవం పరిశీలిస్తే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ శుద్ధ సాత్విక స్వరూపులే. జగన్నాటక సూత్రధారి అని శ్రీ మహావిష్ణువును సామాన్యంగా పేర్కొంటామే గాని, బ్రహ్మ, మహేశ్వరులు సైతం జగన్నాటక సూత్రధారులే. వాస్తవం పరిశీలిస్తే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురికీ ఆయుధాలున్నాయి. విష్ణువు తన చక్రాన్ని యెన్నిసార్లు ఉపయోగించలేదు? యెన్నిసార్లు దుష్ట శిక్షణ చేయలేదు? అదే విధంగా బ్రహ్మ, మహేశ్వరులు మాత్రం యెంతమంది రాక్షసులను సంహరించలేదు. చేతబడులను, వామాచార ప్రయోగాలను, క్షుద్రవిద్యలని మన మందరం నిరసిస్తాం. కాని వేదోక్తాలైన ఆగ్నేయాస్త్రం, బ్రహ్మాస్త్రం, గారుడాస్త్రం, నాగాస్త్రం, శూలప్రయోగం, గదాప్రయోగం మొదలైన అనేక ప్రయోగాలతో

వాఙ్మయ మహోధ్యాయుని

పాటు విష్ణు చక్ర ప్రయోగపరమైన సుదర్శన ప్రయోగం సైతం ఒకానొక విశిష్ట మైన, ఉన్నత స్థాయికి చెందిన చేతబడి ప్రయోగాల వంటివే. యివి దుష్టశిక్షణార్థం యేర్పడి శత్రు వినాశనార్థం రూపొందించబడిన వివిధ మంత్ర ప్రయోగాలే. అయితే మహావిష్ణువు కాని, మహేశ్వరాది దేవతలు కాని, మహామాత గాయత్రి వంటి స్త్రీ దేవతలుకాని, యిటువంటి మహత్తర శక్తులను, దుష్ట శిక్షణార్థం శిష్ట రక్షణార్థం కేవలం లోక శ్రేయస్సు దృష్ట్యా మాత్రమే వీటిని వినియోగించినట్లు కనిపిస్తున్నది. అవసరమైనపుడు దేవతలందరూ తమవద్ద గల శక్తులను ఉపయోగించినవారే. అసలింతెందుకు? అటు దక్షిణాచార, యిటు వామాచార ప్రయోగాలన్నింటికీ మూలభూతమైన వేద వాఙ్మయం యెక్కడా శివుని తామసాత్మకునిగానూ, బ్రహ్మను రాజసాత్మకునిగాను, వర్ణించినట్లు కనబడదు. వాస్తవానికి హరిహరులకు భేదంలేదు. హరి హరనాథుణ్ని తిక్కన సోమయాజి-

కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా!
పరిష్క్రియాయాం బహుమన్యసేత్వమ్!
కిం కాలకూటః కిమువా యశోదా!
స్తన్యం తవ స్వాదువద ప్రభోమే!!

అని వర్ణించడం కొత్త విషయం యేమీకాదు. హరిహరుల అభేదత్వం తెలుగువారు తిక్కన సృష్టి అనుకోవడం శుద్ధ పొరపాటు. ఋగ్వేదం పురుష సూక్తంలో ఒక్క హరిహర బ్రహ్మలకే కాదు, దేవతలందరికీ అభిన్నత్వాన్ని చాటడం జరిగింది. ప్రత్యేకించి ఆ మహాఫణిశాయి అయిన హరికీ రాజఫణి భూషణభూషితుడై విరాజిల్లే హరునకూ అభేదత్వాన్ని గురించి పురాణ వాక్కును ఉటంకించాలంటే నారదీయ పురాణంలోనే యీ అభిన్నత్వం యెలుగెత్తి చాటబడిందని పేర్కొనవచ్చు. "కిం లక్షణా భాగవతా జాయంతే కేనకర్మణా" అని మార్కండేయుడు ప్రశ్నిస్తే, భగవంతుడు భాగవతోత్తమ లక్షణాలు వక్కాణిస్తూ

"శివప్రియాః శివాసక్తాః శివ పాదార్చనేరతాః
త్రిపుండ్ర ధారిణో యేచతేవై భాగవతోత్తమాః ॥
వ్యవహారింతిచ నామాని హరేః శంభో ర్మహాత్మనః
రుద్రాక్షాలంకృతా యేచతేవై భాగవతోత్తమాః ॥
యే యజంతి మహాదేవం క్రతుభిర్బహు దక్షిణైః
హరింవా పరయా భక్త్యాతేవ భాగవతోత్తమాః ॥
శివేచ పరమేశేచ విష్ణౌచ పరమాత్మని
సంబుద్ధ్యా ప్రవర్తంతే తేవై భాగవతాః స్మృతాః ॥

(నారదీయ పురాణం : పూర్వ. భా. 5. అధ్యా.)

అని హరిహరులకు అభేదం చాటడం జరిగింది. ఇదే విధంగా మరొక సందర్భంలో శివ కేశవులకు అభిన్నత్వాన్ని చెప్పినవారికి, భావించినవారికి ఇహ పర సౌఖ్యాలతో పాటు మోక్షప్రాప్తి కూడా కలుగుతుందని పేర్కొనడం జరిగింది. హరిహరుల అభిన్నత్వాన్ని వేదవాఙ్మయంతోపాటు పురాణవాఙ్మయంకూడా చాటుతున్నప్పుడు ప్రత్యేకించి విష్ణుతత్వ బోధకాలని, సాత్వికాత్మకాలని, భావించబడిన ఆరు పురాణాలలో వొకటైన నారదీయ పురాణంలోనే హరిహరుల అభిన్నత్వాన్ని చాటడం జరిగినపుడు శివతత్వ ప్రబోధకాలైన పురాణాలు తామసాత్మకాలనీ, పరిత్యాజ్యాలనీ యేమేమో వ్రాయడం అనాశ్లేయం కాదా? అవైజ్ఞానికం కాదా? అప్రామాణికం కాదా? ఇంతెందుకు? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ముగ్గురికీ అభిన్నతత్త్వాన్ని చాటుతూ యేర్పడిందే కదా దత్తాత్రేయ మూర్తిత్వం. ఈ దత్తాత్రేయత్వం సైతం అత్యంత ప్రాచీన తరమైనదే కాని కొందరనుకునే పురాణ కాలపు నాటిది కానేకాదు. ఈ దత్తాత్రేయత్వాన్ని శాస్త్రీయంగా కాని ఆర్ష విజ్ఞాన పరంగా కాని కాదని త్రోసిపుచ్చ గలవారు లేరు. కాగా అసలు దేవతలలోనే సత్వరజస్తమోగుణాల ప్రాధాన్యత లేనప్పుడు పురాణాలలో సాత్విక-రాజస-తామస-భేదాలను యేవిధంగా కల్పించగలము?

"తత్త్వమసి త్వమసి తత్"— "సోహం హంసః"—అన్న వేదార్థప్రతి పాదక వాక్యాల ఆంతర్యాన్ని గుర్తించిన వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల విభిన్నత్వాన్ని పరిగణించలేరు. "శివోఽహం," "అహం బ్రహ్మాస్మి," "విష్ణ్వహం" వంటి అర్థాద్వైత వాక్యాలను కాకుండా "శివోఽహం, అహమేవ శివః— "అహంబ్రహ్మాస్మి—, బ్రహ్మైవ అహమస్మి," "విష్ణ్వహం, అహమేవ విష్ణుః," వంటి పరిపూర్ణ సార్థక ఆర్షవిజ్ఞాన అద్వైత వాక్యాలను దృష్టిలోపెట్టుకుని ఆలోచించినప్పుడు త్రిమూర్తుల మత విభేదాలను విజ్ఞులెవరూ పరిగణనలోకి తీసుకొనబోరు. అద్వైత సిద్ధాంత మన్నది ఆదిశంకరులు క్రొత్తగా రూపొందించిన సిద్ధాంత మేమీకాదు. అనంతమైన వేద విజ్ఞాన ఆంతర్యాన్ని గుర్తించి ప్రపచించబడిన మతమేకాని అద్వైతమతం వేద భిన్నమైన అపూర్వ మతమేమీ కాదు. అసలు శివోఽహం, అహం బ్రహ్మాస్మి- విష్ణ్వహం వంటి మాటలు యెవరు పడితే వారు ఉపయోగించడానికి వీలైనవి కావు. కొంత కాలంగా కాషాయాంబరధారులైన ప్రతివారూ వీటిని ఉచ్చరిస్తూ ఉండవచ్చునుగాని అవి సార్థకంగా అతిప్రాచీనకాలం నుంచీ ఉపయోగించబడడం లేదు. వాస్తవానికి శివ పరమైన శక్తు లన్నింటినీ సంపాదించిన వాడే "శివోఽహం" అనడానికి అర్హుడవుతాడు. బ్రహ్మపరమైన శక్తులన్నీ తనవశం చేసుకొనగలవాడే "అహం బ్రహ్మాస్మి" అనడానికి సమర్థుడౌతాడు. ఇదేవిధంగా విష్ణుశక్తులన్నింటినీ సాధించగలిగినవాడే "విష్ణ్వహం" అనడానికి

వాఙ్మయ మహోధ్యక్షుని

యోగ్యత సంపాదించుకుంటాడు. ఇటువంటిశక్తులేమీ సంపాదించకుండానే ఆయా వాక్యాలను ఉచ్చరించడం ఆర్షవిజ్ఞాన సమ్మతం కాదు.

నరసింహాకృతి పౌండ్రక వాసుదేవుని సంహార సందర్భంగా యీ క్రింది పద్యం వ్రాయడం యెంతోసముచితంగా ఉన్నది.

చింతించి "యచ్యుతోఽహము
సంతోఽహం హరిరహమ్మురారి రహం శ్రీ
కాంతోఽహ"మ్మను నాతని
సంతంబందించె దానవాంతకుఁడంతన్

(నార. 337 పుట. 76 ప.)

దీని వల్ల ఒక్క సన్యాసులే కాదు యెంత మహాశక్తి సంపన్నులైనాసరే ఆ మహా విష్ణుశక్తి సముచ్చయాన్ని సంపాదించకుండా "అచ్యుతోఽహం" వంటివాటి నుచ్చరించరాదని స్పష్టపడడం లేదా ? ఒకవేళ వారు ఉచ్చరించినా పాపాత్ము లైతే సంహారయోగ్యులేనని తేలడంలేదా ? కాగా వేద వాఙ్మయాన్ని ప్రతి బింబించిన ఆర్ష విజ్ఞాన సాంకేతికాత్మకాలైన పురాణాలేవైనాసరే ఒకే ఒక్క కోవకు చెందినవనీ ఏకైక పరమార్థం కలవనీ మనం సత్యసమ్మతంగా భావించ వలసి ఉంటుంది.

## నారదుడు

నారదీయ పురాణ కర్తయైన నారదుణ్ణి మామూలుగా మనం మహర్షి అనుకుంటాంకాని అతడు మహర్షి మాత్రుడే కాదు. అసలు దేవర్షి. త్రిలోకసంచారి. త్రికాలజ్ఞుడు. మామూలుగా మనం శ్రీ మహావిష్ణువును జగన్నాటక సూత్రధారి అని అంటాంకాని లోతుగా పరిశీలిస్తే నారద మహర్షికూడా ఒక విశిష్టతకల జగన్నాటక సూత్రధారిగానే మనకు దృగ్గోచర మవుతాడు. దాదాపు నారదుని పాత్రలేకుండా యే దుష్టసంహారమూ, యే శిష్టరక్షణా లేదనియే చెప్పవచ్చును.

నారదుడు బ్రహ్మకంఠ ప్రదేశంనుంచి సంజనితుడయ్యాడని బ్రహ్మవైవర్త పురాణం పేర్కొనగా బ్రహ్మ తొడనుంచి ఆవిర్భవించాడని భాగవతం పేర్కొన్నది. బ్రహ్మ వైవర్త పురాణంలోనే వేరొకచోట బ్రహ్మ దత్తపుత్రికయైన ప్రియను వివాహం చేసుకోగా ఆ ప్రియా బ్రహ్మలకు నారదుడు సంజనితుడై నట్లు మరొకవిధంగా ఉన్నది. భాగవత ప్రవచనం ప్రకారం చూస్తేనే నారదుని జన్మ యింకొక విధంగా వేరొకచోట కన్పిస్తున్నది. అది యిది. ఉపబర్హణుడు

అన్న పేరుతో ఒకానొక గంధర్వు డుండేవాడు. అతడు సుందరాంగనలకు లోలుడై ప్రియుడై క్రీడిస్తూ ఉండేవాడు. విశ్వస్రష్టలైన బ్రహ్మలు "దేవసత్రం" అనే యాగం చేస్తూ శ్రీ మహావిష్ణువు కథలు గానం చేయడానికై గంధర్వులనూ, అప్సరసలనూ ఆహ్వానించారు. గంధర్వుడైన ఉపబర్హణుడు సైతం గంధర్వగణంతో కలిసి వెళ్ళి కొంతసేపు గానంచేసి అక్కడ ఉన్న అప్సరోవనితలను చూచి మోహితుడై గానాన్ని విడిచిపెట్టి వెళ్ళాడు. అందువల్ల "నీవు శూద్రయోనిలో పుట్టవలసిందని" ఉపబర్హణుని బ్రహ్మ శపించాడు. ఆ తరువాత ఉపబర్హణుడు ఒక దాసికి పుట్టి అనంతర జన్మలో శాపవిమోజనం జరిగి అంతకు పూర్వపు జన్మలో అంటే గంధర్వుడైన ఉపబర్హణుడుగా చిత్తశుద్ధితో శ్రీ మహావిష్ణుసంకీర్తనం చేసినందువల్ల నారద మహర్షిగా జన్మించాడు.

నారదుడు పూర్వజన్మంలో వేదవాదుల ఇంటిలో దాసికి పుట్టిన ఒకానొక వ్యక్తిగా చాతుర్మాస్య వ్రతంతో ఏకాంతవాసం చేస్తున్న మహర్షులకు పరిచర్య చేస్తూ ఉండేవాడు. చిన్నతనం నుంచీ మహర్షులనే ఆశ్రయించి ఉండడంవల్ల ఆ దాసీ పుత్రునికిసైతం బ్రహ్మజ్ఞానం అలవడింది. అతని తల్లి పాలుపితుకుతున్న సమయంలో పాముకాటుతో మరణించింది. ఆ విధంగా సంసారబంధం తెగిపోవడంతో ఆ దాసీ పుత్రుడైన బ్రహ్మజ్ఞాని మహదానందం పొంది ఉత్తరాభిముఖుడై ప్రయాణంచేసి ఒకానొక మహారణ్యంలో ప్రవేశించి అక్కడ మహేశ్వరుని గురించి తపస్సు చేస్తూ కూర్చున్నాడు. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమైనా అతడు చూడలేకపోయాడు. అనంతరం అతడు ఈశ్వరునికొక రూపాన్ని కల్పించుకొని మనస్సులో నిల్పుకుందామని ప్రయత్నం చేశాడు. కాని అది అతనికి సాధ్యం కాలేదు. "మహర్షివర్యులు చూడగల్గిన నా రూపాన్ని నీవు చూడలేవు. ఈ సృష్టి అంతా లయం చెందుతుంది. అప్పుడు నీవు యీ దేహాన్ని పరిత్యజించి ముందు జన్మలో నా అనుమతితో నా రూపాన్ని చూడగల్గుతావు." అన్న మహేశ్వర వాక్యం అతనికి వినపడింది. కొంత కాలానికి ప్రళయం రానే వచ్చింది. అప్పుడతను కర్మ స్వరూపమైన ఆ దేహాన్ని పరిత్యజించి హరికృపావనంలో శుద్ధ సత్వమహత్వంతో నిండిన దేహంలో ప్రవేశించి శ్రీ మహావిష్ణుమూర్తిలో నిద్రపోవాలని ఇచ్ఛగించే బ్రహ్మ ఉఛ్వాస నిశ్వాసల వెంట బ్రహ్మలో ప్రవేశించి బ్రహ్మ ప్రాణంతో మరీచి ప్రభృతి మునిముఖ్యులతో పాటు ఆ దాసీపుత్రుడైన బ్రహ్మజ్ఞానియే నారదుడై పుట్టినట్లు భాగవతం పేర్కొంటున్నది.

వరాహ పురాణ కథనంప్రకారం సారస్వతుడనే పేరు కలిగిన బ్రాహ్మణుడొకడుండేవాడు. ఆ సారస్వతుడు సంసార భారమంతా తన కొడుకుమీద పెట్టి

అడవికి వెళ్ళి విష్ణువు నుద్దేశించి ఘోరమైన తపస్సు చేశాడు. శ్రీ మహావిష్ణువు ప్రసన్నుడై ప్రత్యక్షమై సారస్వతు నుద్దేశించి నీకేం కావాలో వరం వేడుకోవలసిందని చెప్పగా అప్పుడు సారస్వతుడు శ్రీ మహావిష్ణువు సాయుజ్యాన్నే-నిత్యాతి సన్నిహితత్వాన్నే అభిలషించాడు. అప్పుడు శ్రీ మహావిష్ణువు "నాకు అతి సన్నిహితుడై నాతరువాత ఉండేవాడు బ్రహ్మ. నీవు బ్రహ్మకు పుత్రుడవై జన్మించి నా సాయుజ్యాన్ని పొందగలవు" అని అనుగ్రహించాడు. అంతేకాదు "నీవు పితృదేవతలకు "నారము"ను అంటే నీటిని యెల్లప్పుడూ యిస్తూ ఉంటావు, కాబట్టి నీవు నారదుడవని ప్రసిద్ధి పొందుతావు" అని వరం ఇచ్చినట్లు తెలుస్తున్నది.

భాగవతంలోనే మరొక సందర్భంలో పేర్కొన్న దాన్నిబట్టి చూస్తే అసలు శ్రీ మహావిష్ణువే నారదుడనే దేవర్షిగా పుట్టి కర్మనిర్మోచకమైన వైష్ణవ తంత్రాన్ని విరచించినట్లు తెలుస్తున్నది. నారద మహర్షి గురించి భాగవత- వరాహపురాణ-మార్కండేయ పురాణాది గ్రంథాలవల్ల అనేక విధాలైన మరికొన్ని విశేషాలు తెలుస్తున్నాయి. ఆ విశేషాలను సంగ్రహంగా యిక్కడ క్రోడీకరిస్తున్నాను.

—"నారదునికి సంసారంకాని సంతతికాని అసలు లేనేలేదు. అతడు అస్ఖలిత బ్రహ్మచారి. అతనికి యే లోకంలోనూ స్థిరత్వం లేదు. ఇందుకు కారణం దక్షుని శాపం. నారదుడు "మహతి" అనే పేరుగల వీణమీద సదా మహావిష్ణునామ గానం చేస్తూ త్రిలోకాల్లోనూ సంచరిస్తూ ఉంటాడు. ఆయా లోకాల్లోని విశేషాలు తెలుసుకుంటూ అవసరమైన వారికి తనకు చేతనైన ఉపకారంచేస్తూ ఉంటాడు. ఆపదల్లో చిక్కుకున్న వారికి భగవద్విలాసాన్ని గురించి చెప్పి వారి హృదయాలలో శాంతి కలుగజేస్తాడు. ఒకప్పుడు అకంపనుడనే వాడు తన పుత్రుడు మృత్యువాత పడగా ఏడుస్తుంటే నారదుడు అతనివద్దకు వెళ్ళి మృత్యు స్వభావంగురించి వివరించి అతనికి దుఃఖోపశమనం కావించాడు. సృంజయుడనే వానికి షోడశరాజుల చరిత్ర వివరించి అతని విచారాన్ని రూపుమాపి చనిపోయిన సృంజయుని కుమారుని బ్రతికించి తిరిగి అతనికి పుత్రభిక్ష పెట్టాడు. హిరణ్యకశిపుని భార్యయైన లీలావతిని యింద్రుడు సంహరించాలని చూడగా నారదుడు అడ్డుపడి లీలావతి సద్గుణాలనే కాక ఆమె గర్భంలో పెరుగుతున్న మహావిష్ణువుకు పరమ భక్తాగ్రేసరుడు కానున్న ప్రహ్లాదుని విషయంచెప్పి ఆమెను సంరక్షించాడు. అవసరమైనప్పుడల్లా ధర్మరాజుకు ప్రత్యక్షమై యెన్నెన్నో హితవులూ, సలహాలూ బోధించాడు. రామలక్ష్మణు లిద్దరూ ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రంతో బంధితులుకాగా నారదుడు వచ్చి గరుత్మంతుణ్ణి ప్రార్థించవలసిందిగా రామలక్ష్మణులకు బోధించి వారిని నాగాస్త్రవిముక్తులను కావించాడు. ఇదే విధంగా నారదుడు

అనేక మందికి అనేక విధాలైన ఉపకారాలు చేశాడు. స్త్రీల నోట్లో మాట దాగదన్నమాట నిజమో కాదో చెప్పలేము కాని – స్త్రీల నోట్లో నువ్వుగింజైనా నానదన్నమాట యేమోగాని నారదమహర్షి నోట్లోమాత్రం యేఒక్కమాటకూడా దాగదు. ఎంత రహస్యమైనా గూఢాతిగూఢమైనా విషయమైన సరే తాను ఇతరులకు చెప్పకుండా ఉండలేడు. విష్ణువు రామావతారం ఎత్తబోతున్నట్లు నారదుడే వాల్మీకికి ముందుగా తెలియచెప్పాడు. లోకంలో సామాన్యంగా తగాదాలు పెట్టే వ్యక్తిని నారదుడనడం పరిపాటి. ఇక్కడి వక్కడా అక్కడి విక్కడా చెప్పి తంపులు పెట్టడం నారదునికొక సరదా. అసలు తగాదాలు పెట్టకుండా నారదుడుండలేడు. అందుకే అతనికి కలహాభోజనుడు అనే పేరు వచ్చింది. తగాదాలు పెట్టడం నారదునికి మహదానంద దాయకంగా కనిపిస్తుంది. ఇంతటి తగాదాలమారి వాడైనా యితనినెవ్వరూ అగౌరవపరచిన సంఘటనలంతగా కనిపించవు. ఒకవేళ నారదుడు ఎటువంటి తగాదా పెట్టినా లోకక్షేమం దృష్ట్యా పెట్టినట్లే కనిపిస్తుంది గాని తద్భిన్నంగా కనిపించదు.

జలంధరాసురుణ్ణి యెంతోమంది దేవతలు ప్రయత్నంచేసి జయించలేకపోయారు. చివరికి వారంతా నారదునితో తమ గోడు మొరపెట్టుకున్నారు. నారదుడు అంతా విని తలపంకించి తగిన ఉపాయం ఆలోచిస్తానని చెప్పి వారిని ఓదార్చి సాగనంపి సరాసరి జలంధరుని వద్దకు వెళ్ళాడు. వెళ్ళి అనేక విధాల అతన్ని స్తుతించాడు. “జలంధరా! నీకు అశ్వరత్నాలూ, గజరత్నాలూ, సౌధ రత్నాలూ, యింకా యింకా అనేకం ఉన్నాయి సమస్త భోగభాగ్యాలూ ఉన్నాయి. కాని నీకు జాయారత్నం లేదు.” అని అసలు లోపాన్ని యెత్తి చూపించాడు. “ఆ లోపాన్ని నే నే విధంగా తీర్చుకోవాలి. నాకర్హురాలై సతిగా ఉండదగిన పడతి ఎవ్వరు?” అని జలంధరుడు నారదుణ్ణి ప్రశ్నించాడు. అప్పుడు నారదుడు “శ్మశానంలో ఉండే మహేశ్వరుడికి జగత్సుందరియైన పార్వతి యెందుకు? ఆమెను నువ్వు పట్టుకో” అని సలహా యిచ్చాడు. వెంటనే జలంధరుని హృదయం పార్వతికోసం ఆరాట పడింది. అందువల్ల శివ జలంధరులకు యుద్ధం తప్పలేదు. ఆ యుద్ధంలో జలంధరుడు దుర్మరణం పాలయ్యాడు. ఒకసారి నారదుడు గరుడుని వద్దకు వెళ్ళి “నీ బల మెక్కడ! సర్పాల బలమెక్కడ ? నిన్ను కన్న తల్లి వారికి దాసిగా ఊడిగం చేస్తూఉంటే నీవు మిన్నకుండడం గౌరవప్రదమేనా” అని గరుడుణ్ని పురికొల్పాడు. దానితో గరుడ సర్పవైరం యేర్పడి గరుడుడు సర్ప వినాశకుడుగా రూపొందాడు. ఉతథ్యుని అర్ధాంగిని వరుణుడు యెత్తుకొనిపోగా ఆ విషయాన్ని నారదుడు గ్రహించి ఉతథ్యునికి తెలియచేశాడు. కాగా వరుణుడు ఉతథ్యుని ఆగ్రహానికి గురయ్యాడు.

వాఙ్మయ మహోధ్యుని

కాలయవనుడనే మ్లేచ్ఛ రాజు మహాబలవంతుడై గర్వపోతుగా నా అంతటివాడు లేడని రొమ్ము విరచి తిరుగుతున్నాడు. శ్రీకృష్ణుడు జరాసంధుని పీచమడచిన తరువాత నారదమహర్షి కాలయవనుని వద్దకు వెళ్ళి "శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి ఓడించానని మహాగర్వంతో విఱ్ఱవీగుతున్నాడు. నీవు శ్రీకృష్ణుని యెరుగవా? లేకపోతే తెలిసికూడా భయపడి పిరికిపందవై ఊరుకున్నావా?" అని పురికొల్పి కాలయవనుడు మధురాపురం మీద దండెత్తేట్లుగా ప్రోత్సాహ పరిచాడు. దానితో కాలయవనుడు మధురపై దండెత్తి ముచుకుందునివల్ల సంహరింపబడ్డాడు. సత్యభామ కోరికపై దేవ పారిజాతాన్ని శ్రీకృష్ణుడు తీసికొనివచ్చి ఆమె యింటి ముందు పెట్టడం నారదుడు కారణంగానే. చెట్టు మాత్రమే అక్కడ ఉండి ఆ పారిజాత వృక్ష పుష్పాలన్నీ తెల్లవారేసరికి ప్రతినిత్యమూ రుక్మిణి యింట్లో ఉండడం సుప్రసిద్ధమైన విషయమే.

ఒకనాడు ఇంద్ర సభలో రంభాదులు మనోహరంగా గానం చేస్తూ నృత్యం చేస్తుండగా నారదు డక్కడికి వెళ్ళాడు. కొంత సేపైన తరువాత ఇంద్రుడు నారదుణ్ణి చూచి "మునీంద్రా! నీకు యెవరి గానం నచ్చింది?" అని ప్రశ్నిస్తాడు. అప్పుడు నారదుడు "ఎవ్వరు హావ భావాలతో విఱ్ఱవీగుతారో వారి సంగీతం బాగుంటుం"దని సమాధానం చెపుతాడు. అప్పుడు నేనెక్కువంటే నేనెక్కువనిఅప్సరో వనిత లంతా తమలో తాము వాదులాడు కుంటారు. చివరికి వారిలో యెవరు గొప్ప వారో నారదుడే నిర్ణయించాలని ఇంద్రుడు కోరతాడు. అప్పుడు నారదుడు యే వనిత దూర్వాస మహర్షిని చలింప చేయ గలుగుతుందో ఆమె గొప్పది అని సమాధానం చెపుతాడు. అప్పుడు వపువు అనే అప్సరోవనిత దూర్వాసుణ్ణి నేను చలింప చేయగలనని వెళ్ళుతుంది. మహాతపోనిమగ్నుడై ఉన్న దూర్వాస మహర్షి వద్దకు వెళ్ళి గానంచేస్తూ అతనికి తపోభంగం కలిగిస్తుంది. అప్పుడు దూర్వాస మహర్షి వపువును పక్షి రూపం దాల్చి భూమిమీద జన్మించవలసిందిగా శపిస్తాడు. తరువాత వపువు ప్రార్థించగా భారతయుద్ధ సమయంలో అర్జునుని బాణాహతిచే మృతురాలవై శాపవిముక్తి పొందగలవని అనుగ్రహిస్తాడు.

మహాభారతాన్ని బట్టి నారదమహర్షి మహిమ యెంతటిదో యీ క్రింది కథవల్ల తెలుస్తున్నది.

కొంతకాలం నారద పర్వతు లిద్దరూ సృంజయునివద్ద ఆతిథ్యం పొంది వెళ్ళ బోతూ సృంజయుని కేదైనా ఉపకారంచెయ్యాలనే దృష్టితో యేదైనా ఒక వరం కోరుకొమ్మంటారు. అప్పుడు సృంజయుడు "మీ అనుగ్రహం ఉండడంకంటె నాకు

వేరే వరంతో పనేముంది" అని అంటాడు. అప్పుడు నారదుడు సంతోషించి "నీకు దేవతలను మించగల పుత్రుడు సంజనితుడవుతాడు" అని వరమిస్తాడు. నారదుడు వరమిచ్చిన వెంటనే "అయితే ఆ పుట్టే పుత్రుడికి ఆయుష్కాలం తక్కువ" అని పర్వతుడంటాడు. పర్వతుని వాక్యం విని రాజెంతో దుఃఖితుడవుతాడు. సృంజయుని మీద ఉన్న కరుణతో నారదుడు అనుగ్రహించి "ఇంద్రుడు నీ కుమారుణ్ని చంపుతాడు. అప్పుడు నన్ను నీవు స్మరించుకో. నీ పుత్రుణ్ని నీకు పునర్జీవితునిగా చేసి నీకిస్తాను." అని చెప్పుతాడు. అనంతరం సృంజయునికి పుత్రుడు జన్మిస్తాడు. ఆ పుత్రుని నిష్ఠీవనాదులు అన్నీ సువర్ణమయాలుగా ఉండడంవల్ల "సువర్ణష్ఠీవి" అని ఆ బాలునికి పేరు పెట్టారు. అతని నిష్ఠీవనాదులన్నీ ఎప్పటికప్పుడు బంగారంగానే ఉంటూ వచ్చాయి. అయితే సువర్ణష్ఠీవి శరీరం అంతా బంగారమేనని భావించి కొందరు చోరులు అతనిని చంపి కోశారు. అప్పుడు సృంజయుడు నారదుని స్మరించుకొనగా నారదుడు ప్రత్యక్షమై దొంగలు చేసిన దుష్కృత్యాన్ని తెలియజేసి ఆ బాలుని బ్రతికించి సృంజయునికిచ్చాడు. అనంతరం కొంత కాలానికి సువర్ణష్ఠీవిని చూచి మహేంద్రుడు అసూయపడి బృహస్పతితో ఆలోచించి సువర్ణష్ఠీవి వనవిహారం చేస్తున్న సమయంలో తన వజ్రాయుధాన్ని శార్దూల రూపంలో పంపి అతన్ని చంపిస్తాడు. అప్పుడు సృంజయుడు నారద మహర్షిని స్మరించగా అతడు ప్రత్యక్షమై సువర్ణష్ఠీవిని తిరిగి బ్రతికించి సృంజయునికిచ్చాడు.

వరాహపురాణాన్ని పరిశీలిస్తే ఈ క్రింది విశేషాలు మరికొన్ని తెలుస్తున్నాయి. నారదుడొకసారి రావణాసురుని వద్దకు వెళ్ళాడు. రావణుడు నారదుడిని ఎంతో గౌరవించి ఏమిటి విశేషాలని అడిగాడు. అప్పుడు నారదుడు 'రావణా! నీవు నరులందరినీ జయించావు. దానివల్ల నీకు లభించిన లాభమేమిటి? దేవతలంతా ఎంతో గర్వించి వున్నారు. వారిలో యమధర్మరాజు మరీ మహాగర్వంతో ఉన్నాడు. వారినందరినీ ఓడించు' అని రావణాసురుణ్ణి పురికొల్పి దేవతల మీదికి రావణుడు యుద్ధానికి వెళ్ళడానికి ముందుగానే గబగబా నారదుడు యమధర్మరాజు వద్దకు వెళ్ళి "చూచావా! రావణాసురుడి గర్వం! వాడు నీమీదికి యుద్ధానికి రాబోతున్నాడు. వాడి పొగరు అణచి పారవెయ్యి" అని యమధర్మరాజుతో చెప్పాడు. అప్పుడు యమధర్మరాజుతో జరిగిన యుద్ధంలో రావణునికి గర్వభంగం జరిగింది.

మహిషాసురుడు కారణంగా దేవతలు యమయాతన పడుతున్నారు. అతనితో ఎంత యుద్ధంచేసినా దేవతలతన్ని ఓడించలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో నారదుడు మలయ పర్వతం మీద ఉన్న దేవీస్వరూపిణియైన నారాయణి వద్దకు వెళ్ళి "విన్నావా, మహిషాసురుని కళ్ళకావరం, వాడు నిన్ను వివాహం చేసుకుంటాడట.

వాడిని సంహారించు'' అని నారాయణికి చెప్పాడు. ఆ మాట నారాయణితో చెప్పి వెను వెంటనే బయలుదేరి మహిషాసురుని వద్దకు వెళ్ళి "ఓ అసుర రాజా! మలయ పర్వతం మీదఉన్న నారాయణిని సతిగా స్వీకరించని నీ యౌవనం యౌవనమేనా! నీకెంత బలపరాక్రమాలుండి యేమిలాభం! ఏ విధంగానైనా నీవు ఆమెను వివాహం చేసుకో!" అని చెప్పి మాయమయ్యాడు. అనంతరం మహిషాసురుడు తనను వివాహం చేసుకోవలసిందిగా నారాయణికి సందేశం పంపించాడు. చిట్టచివరికి దేవీ మహిషాసురులకు మహాయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో మహిషాసురుడు సంహారింపబడ్డాడు.

నారద మహర్షి ఒకసారి సరదాగా శ్వేత ద్వీపాన్ని చూద్దామని వెళ్ళాడు. అక్కడ మన్మథాకారులు అనేకమంది విష్ణు రూపులుగా గోచరం కావడంతో వారిలో అసలు మహావిష్ణువెవరో గుర్తించలేక విష్ణుమూర్తిని ప్రార్థించాడు. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై నీకేమి వరం కావాలో కోరుకో మన్నాడు. అప్పుడు నారదుడు నాకు విష్ణు మాయలు తెలియ జేయవలసిందని కోరాడు. అప్పుడు విష్ణువు సరే అని నారదుణ్ణి "అదుగో దగ్గరలో ఒక చెరువుంది. ఆ చెరువులో స్నానంచేసిరా!'' అని చెప్తాడు. అప్పుడు నారదుడు వెళ్ళి ఆ చెరువులోమునిగి లేచేసరికి స్త్రీ రూపం దాల్చుతాడు. అనంతరం నారదుడు స్త్రీగా చారుమతి అన్న పేరుతో కాశీరాజుకు కూతురుగా జన్మిస్తాడు. ఆ చారుమతికి శిబిరాజుతో వివాహమవుతుంది. చారుమతి శిబిరాజులకు నగ్నజిత్తి, విప్రజిత్తి, విచ్ఛిత్తి, చారువక్త్రుడు, చిత్తుడు, అనే కుమారులు పుడతారు. ఈ పుత్రులు తండ్రితోకలిసి అనేకమంది రాజులతో యుద్ధాలు చేస్తూ వారిని ఓడిస్తారు. చివరికి తమ తాత అయిన కాశీరాజు మీదకూడా వీరు దండెత్తుతారు. అయితే కాశీరాజు చేతుల్లో వీరు హతులుకాగా చారుమతి భర్తృ పుత్రవిహీనయై మహా దుఃఖితయై చితిపేర్చుకుని అందులో దూకబోగా తన పూర్వ రూపమైన నారద రూపం లభించింది. స్వస్వరూపం పొందిన నారదుడు మహాశ్చర్య పడి ఇదంతా కలయా! భ్రాంతియా! అని ఆలోచించి చివరికి ఇదంతా విష్ణుమాయ అని గ్రహిస్తాడు.

దేవీ భాగవతం నారద పరంగానే విష్ణుమాయ గురించి ఈ క్రింది విధంగా పేర్కొన్నది. నారదుడు రావడం చూచి మహావిష్ణువు ప్రక్కనున్న లక్ష్మిదేవి ప్రక్కకు తప్పుకుంటుంది. అప్పుడు నారదుడు నేను వృద్ధ మహర్షిని. నన్ను చూచి లక్ష్మి ప్రక్కకు తొలగడం బాగుండలేదు అని అంటాడు. అప్పుడు మహావిష్ణువు పర పురుషులను చూడటం మంచిది కాదుకదా. మాయ యెంతైనా చేయగలదు అని అంటాడు. అప్పుడు నారదుడు మాయా ప్రభావం చూపించవలసిందిగా కోర

తాడు. అప్పుడు విష్ణువు నారదుణ్ణి గరుత్మంతుని మీద యెక్కించుకుని కన్యాకుబ్జం తీసికొని వద్దకు వెళ్ళి అక్కడఉన్న చెరువులో నారదుణ్ణి స్నానం చేయవలసిందిగా చెపుతాడు. అప్పుడు నారదుడు కొలనులో స్నానం చేసిరాగా అతిలోక సుందరియైన ఒక యువతిరూపం తాల్చుతాడు. అనంతరం శ్రీ మహావిష్ణువు తన దారిని తాను వెళ్ళిపోతాడు. తరువాత ఈ సుందరిని తాళధ్వజుడనే రాజు చూచి మోహించి తన నగరానికి తీసికొని వెళ్తాడు. అనంతరం ఆ సుందరిని వివాహం చేసికొని పట్టపు రాణిని చేస్తాడు. ఈ దంపతులకు అనేకమంది పుత్రులు కలుగుతారు. కొన్ని సంవత్సరాలు గడచిన తరువాత శత్రురాజులు తాళధ్వజుని మీద దండెత్తి పుత్రులతోసహా తాళధ్వజుని సంహరిస్తారు. తాళధ్వజుని భార్య దుఃఖ సముద్రంలో మునిగి వుండగా శ్రీమహావిష్ణువు వృద్ధ బ్రాహ్మణ రూపంలో వచ్చి సంసారమూ పతీ పుత్రాదులూ శాశ్వతం కాదని తెలియజెప్పి తనవెంట రమ్మని తీసికొనివెళ్ళి ఒక చెరువులో స్నానం చెయ్యమంటాడు. వెంటనే ఆ పడతికి పూర్వరూపం వచ్చి నారదుడుగా రూపొందడం జరుగుతుంది. అప్పుడు నారదుడు అసలు విషయం గ్రహించి తన ఎట్ట యెదుట వున్న మహావిష్ణువును చూచి ఇదంతా అతని మాయా మాహాత్మ్యమని గ్రహిస్తాడు.

ఈ విశేషాలన్నీ వివిధాలుగా ఇలా ఉండగా అసలు నారదుడు బ్రహ్మచారి కానేకాదని అతడు వివాహం చేసుకుని సంసారం చేశాడనికూడా కొన్ని గాథ లున్నాయి.

"నారదుడు అతని మేనల్లుడైన పర్వతుడు త్రిలోకసంచారం చేస్తున్నారు. వారిద్దరూ ఒకరి హృదయంలో ఉన్నది ఒకరు దాచకుండా పరస్పరం విషయాలు చెప్పుకొనడానికి ఒక ఒప్పందం కుదుర్చుకుని ప్రమాణాలు చేసుకున్నారు. ఈ ఒప్పందానికి భిన్నంగా వారుభయుల్లోనూ ఏ విషయాన్నైనా దాచడం జరిగితే శాపగ్రస్తు లవడానికికూడా ఆమోదించారు. తరువాత ఒకరోజున వారిద్దరూ సృంజయుడనే రాజు వద్దకు వెళ్ళారు. ఆ రాజు తన పుత్రిక అయిన సుకుమారిని పరిచర్య చేయడానికై ఈ మహర్షులవద్ద నియమించాడు. సుకుమారిని చూచి నారదుడు ప్రేమించాడు. అయితే ఈ విషయాన్ని సిగ్గువల్ల నారదుడు పర్వతునికి చెప్పలేదు. నారదుని హృదయంలోని వాంఛను పర్వతుడు గ్రహించి "మన ఒడంబడిక ప్రకారం నీ హృదయంలోని విషయాన్ని నాకు చెప్పకుండా దాచి పెట్టావు కాబట్టి నీవు సుకుమారిని వివాహం చేసుకున్నతరువాత నీ ముఖం వానర ముఖం అవుతుంది" అని నారదుణ్ణి పర్వతుడు శపించాడు. అప్పుడు నారదునికి కోపంవచ్చి "నీవు నాకలోక సంచార విరహితుడవు అవుదువుగాక" అని ప్రతి

శాపం యిచ్చాడు. అనంతరం నారదుడు సృంజయరాజునడిగి తన హృదయంలోని విషయం చెప్పి సుకుమారిని వివాహం చేసుకున్నాడు. కొంతకాలం తరువాత నారదుడూ పర్వతుడూ కలుసుకున్నారు. గతాన్ని ఆలోచించుకుని వారిద్దరూ పరస్పర శాపవిమోచనం చేసుకున్నారు. శాపవిమోచన అనంతరం అంతకు పూర్వం వానర ముఖంగా ఉన్న నారద ముఖం మారిపోయి అసలు పూర్వ రూపం వచ్చినందువల్ల సుకుమారి అతన్ని గుర్తించలేక తన భర్త అయిన నారదుడు కాడని అనుకున్నది. అప్పుడు పర్వతుడు అతడు అసలు నారదుడేనని జరిగిన విషయమంతా తేటతెల్లం చేశాడు.'' అని మహాభారతంవల్ల తెలుస్తున్నది.

గతంలో ఒక సందర్భంలో శ్రీమహావిష్ణువు ఒక్కడే జగన్నాటక సూత్రధారి కాడని నారద మహర్షికూడా జగన్నాటక సూత్రధారి పదానికి సమర్థుడేనని పేర్కొనడం జరిగింది. ఈ మాట ఊరికే అనలేదు. నారదుడు యెన్నెన్ని విచిత్రాలు నడిపాడో శిష్టరక్షణార్థం దుష్టశిక్షణార్థం యెటువంటి మహత్తర సూత్రధారిగా వ్యవహరించాడో గతంలో గుర్తించాం. అక్కడితో నారదుని మహత్తర శక్తి ఆగలేదు. నారదుడు బ్రహ్మదేవుణ్ణి, లక్ష్మీనాతను చివరికి ఆ జగన్నాటక సూత్రధారియైన శ్రీ మహావిష్ణువునుసైతం అతని భక్తుడై ఉండికూడా శాపగ్రస్తులను చెయ్యడం జరిగింది.

దక్షప్రజాపతి కుమారులు తండ్రి ఆజ్ఞ ప్రకారం సృష్టి కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నారు. ఇంతలో నారదుడు వారి వద్దకు వెళ్ళి "మీరు ముక్తిసాధన గురించి ఆలోచించక ఈ సాంసారిక లంపటంలో పడి కొట్టుకుంటారేమిటి" అని బోధ చేసి వారు సృష్టికార్యక్రమాన్ని నిర్వర్తించకుండా ఆపివేయించాడు. తన పుత్రుల సృష్టికార్యక్రమానికి నారదుని వల్ల భంగం యేర్పడిందని దక్షుడు తెలిసి అతను బ్రహ్మవద్దకు వెళ్ళి ఆ విషయాన్ని తెలియజేశాడు. అప్పుడు బ్రహ్మ నారదుణ్ని దక్షపుత్రికకు నీవు సంతానంగా సంజనితుడవవుదువుగాక" అని శపిస్తాడు. అంతేకాదు దక్షుడుకూడా ఆగ్రహం పట్టలేక "నారదునికి యెక్కడా నిలకడ అనేదే లేకుండా పోవుగాక అతడు సంసారి అయినప్పటికీ సృష్టి కార్యక్రమానికి భంగం కలిగించాడు కాబట్టి అతడు అనపత్యుడవుగాక" అని శపిస్తాడు.

సృష్టిని అభివృద్ధి చెయ్యవలసిందిగా నారదుడిని బ్రహ్మ ఒకసారి కోరతాడు. కాని నారదుడు "నేను సంసారసాగర నిమగ్నుడనై ఉండలేను. నాకు మోహబంధనాలతో పనిలేదు. నేను సృష్టి కార్యక్రమాన్ని నిర్వర్తించలేను" అని తిరస్కరిస్తాడు. అప్పుడు బ్రహ్మ ఆగ్రహోదగ్రుడై "నీవు మహా కాముకుడవై స్త్రీలోలుడవై శూద్రయోనిలో జన్మించుదువుగాక. అనంతరం బ్రాహ్మణ సంపర్కంతో విష్ణుభక్తి కల

వాడవై కీర్తి పొందుదువుగాక" అని శపించి అనుగ్రహిస్తాడు. అప్పుడు నారదుడు బాధపడి మహోగ్రుడై "నీకు పూజాకవచాదులు దేవాలయాలు లేకుండా పోవుగాక" అని బ్రహ్మకు ప్రతిశాపం యిచ్చాడు. ఈ విషయాలు బ్రహ్మావైవర్త పురాణం వల్ల అవగత మవుతున్నాయి. ఈ కథలు వాస్తవాలు అనుకున్నా అవాస్తవికాలనుకున్నా అటు శాస్త్రపురాణాదుల్లో కాని ఇటు లోకంలో కాని బ్రహ్మకు సంబంధించిన అర్చనాది విషయాలు లేకపోవడం, దేవాలయాలూ విగ్రహపూజలూ లేకపోవడం అనేక శతసహస్ర అబ్దాలుగా మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నది.

అద్భుత రామాయణాన్ని పరిశీలిస్తే నారదుడు లక్ష్మిని రాక్షస గర్భంలో జన్మించవలసిందని రాక్షసులవల్ల కష్టాలు పొందవలసిందని శపించినట్లు కనిపిస్తున్నది. ఈ శాపానికి మూలభూతమైన విషయం యిది.

కౌశికుడు ఒకరోజున స్వర్గంలో గానంచేస్తుండగా లక్ష్మి ఆమె పరిచారకులూ, మునులూ నారదుడు మొదలైన వారుకూడా వింటున్నారు. అప్పుడు పరిచారకులు ఋషులను దూరంగా తొలగిఉండండని బెత్తాలు పుచ్చుకొని వారిని దూరంచేశారు. లక్ష్మి తుంబురుని పట్ల ఒకానొక విశిష్టమైన అభిమానం కలిగినదవడంవల్ల కౌశికునితో కలిసి గానం చేయవలసిందిగా కోరి తుంబురునికి పారితోషికం యిచ్చింది. అది నారదుడు అవమానంగా భావించి లక్ష్మిని రాక్షసగర్భంలో జన్మించవలసిందిగా శపించి రాక్షసుల వల్ల ఇదే విధంగా శిక్షింపబడుదువుగాక అని కూడా శపించాడు.

అప్పుడు విష్ణువు నారదుణ్ణి ఊరడించి "భక్తిగానం చెయ్యడం రూపంగా తుంబురునికి మహాగాన ప్రభావం లభ్యమయింది. నీకు కూడా అటువంటి ఉత్తమ గానం లభించాలంటే మానసోత్తర పర్వతం మీద "గానబంధువు" అనే గూబ ఉన్నది. దాని దగ్గరకు వెళ్ళి గానాభ్యాసం చేయవలసింది"గా సలహా యిచ్చాడు. అప్పుడు నారదుడు అక్కడకు వెళ్ళి గానబంధువు వల్ల సుశిక్షిత పొంది తిరిగి తుంబురుని వద్దకువచ్చి గాన విషయంలో తుంబురునితో సమానత్వాన్ని సాధించలేక అతనిమీద అసూయపడి తిరిగి శ్రీ మహావిష్ణువు వద్దకు వెళ్ళాడు. తనకు తుంబురుని గాన సామర్థ్యాన్ని మించగల గానాన్ని అనుగ్రహించవలసిందిగా కోరాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు నేను శ్రీకృష్ణుడుగా జన్మించినప్పుడు నీకు గానం నేర్పుతానని మాట యిచ్చాడు. శ్రీకృష్ణావతార కాలంలో గతంలో యిచ్చిన మాటప్రకారం నాకు గానాన్ని నేర్పవలసిందిగా శ్రీకృష్ణుణ్ణి కోరాడు. అప్పుడు శ్రీకృష్ణుడు మొదట జాంబవతివద్ద తరువాత శ్రీకృష్ణుని భార్యలవద్ద ఒక్కొక్క భార్యవద్ద ఒక్కొక్క సంవత్సరం వంతున గానం నేర్చుకోవలసిందిగా చెప్పాడు. ఆ ప్రకారంచేసినా నారదుడు సంపూర్ణ గానకౌశలం సంపాదించ లేనందువల్ల చివరికి శ్రీకృష్ణునివద్ద

వాఙ్మయ మహోధ్యక్షుని

గానాభ్యాసం చేసి మహా పండితుడై తుంబురుని పట్ల ఈర్ష్యారహితుడై సుఖంగా ఉన్నాడు.

శ్రీమహావిష్ణువు మానవుడుగా శ్రీరాముడుగా జన్మించడానికి నారదుడే మూలకారకుడని లింగ, శివపురాణాలు రెండూ పేర్కొంటున్నాయి. వాటివల్ల తెలుస్తున్న విషయాలు యివి.

నారదుడు హిమాలయ పర్వతంమీద తపస్సు చేసుకుంటూ ఉండగా తపో భంగం కలిగించడానికై ఇంద్రుడు దేవకన్యలను పంపిస్తాడు. నారదుడు తన దివ్య తపశ్శక్తితో శివారాధన చేస్తూ ఉంటాడు. దేవకన్యలు నారదుని మనస్సుని చలింప చేయాలని యెంత ప్రయత్నం చేసినా శివ ప్రభావంవల్ల నారదుని హృదయం నిశ్చలంగా నిలిచి ఉన్నది. అందువల్ల నారదునికి "నా హృదయాన్ని దేవకన్యలు సైతం చలింపచేయలేకపోయారు కదా" అని బాగా గర్వం వచ్చింది. తన మహిమవల్లనే మన్మధుడిని జయించగలిగానని కూడా నారదుడు అనుకుంటూ ఉండేవాడు. నారదుడు తపస్సు ముగించి శివ దర్శనం చేసి తరువాత బ్రహ్మనూ, శ్రీ మహావిష్ణువునూ చూడడానికి వెళ్ళాడు. విష్ణువు శివమాహాత్మ్యాన్ని గుర్తించినప్పటికీ కూడా నారదుడు తన శక్తి సామర్థ్యాలవల్లనే కామాన్ని జయించానని యితరుల సమక్షంలోనే కాదు విష్ణు సమక్షంలో సైతం చెప్పుకునేవాడు. నారదుడు విష్ణు దర్శనంచేసి తిరిగి వెళ్ళేటప్పుడు అతను ప్రయాణం చేసే మార్గంలో ఒక సుందరతరమైన నగరాన్ని నిర్మించి ఆ నగరంలో మహా సౌందర్యవంతురాలైన శ్రీమతి అనే సుందరాంగిని విష్ణువు సృష్టించాడు. నారదుడు ఆ శ్రీమతిని చూచి మోహించాడు. అనంతరం నారదుడు శ్రీమతి స్వయంవరానికి వెళ్ళేముందు శ్రీ మహావిష్ణువు వద్దకు వచ్చి విషయం చెప్పి విష్ణు రూపాన్ని తనకు అనుగ్రహించవలసిందిగా కోరతాడు అని ఒక అసమగ్ర కథ.

నారదుడూ, పర్వతుడూ లోకసంచారం చేస్తూ అంబరీష నగరానికి వచ్చి అతని సమ్మానాదులందుకుని అతని యింట్లో వున్న అతిలోక సుందరియైన అతని పుత్రిక శ్రీమతిని చూస్తారు. ఈ కన్య యెవరని వారిద్దరూ అడుగుతారు. అప్పుడు అంబరీషుడు ఆమె తన కుమార్తె అని చెప్తాడు. ఆమెను తమ కీయవలసిందని నారద పర్వతులిద్దరూ కోరతారు. అప్పుడు అంబరీషుడు "ఒకే కన్యను ఇద్దరికివ్వడం సాధ్యంకాదు కదా! మీ ఇద్దరిలో ఆమె ఎవ్వరిని వరిస్తే వారికిస్తా"నని చెప్తాడు. అనంతరం శ్రీమతి కొక రోజున స్వయంవరం యేర్పాటు చెయ్యడం జరిగింది. అంతకు పూర్వమే నారద పర్వతులిద్దరూ ఒకరి కొకరు తెలియకుండా శ్రీమహావిష్ణువు దగ్గరకు వెళ్ళి శ్రీమతి స్వయంవర సందర్భంగా పర్వతుని ముఖం వానర ముఖంగా

చేయవలసిందని నారదుడూ, నారదుని ముఖం వానరముఖంగా చేయవలసిందని పర్వతుడూ కోరతారు. విష్ణువు వారిద్దరి కోరికను మన్నించి అనుగ్రహిస్తాడు. శ్రీమతి స్వయంవరానికి అనేకమంది వెళ్ళారు. నారద పర్వతులే కాక శ్రీమహా విష్ణువు కూడా వెళ్ళాడు. నారద పర్వతుల వానరముఖాలను చూచి అందరూ నవ్వారు. శ్రీమతి పవిత్ర దివ్యసుందర రూపుడైన మహావిష్ణువును వరిస్తుంది. ఆమెను విష్ణువు స్వీకరించి వెళ్ళిపోయాడు. నారద పర్వతులిద్దరికీ కోపం వచ్చింది. అప్పుడు వారిద్దరూ "మా యిద్దరిలో ఒకరి కిస్తానని మాట యిచ్చిన నీవు శ్రీమతిని మా యిద్దరిలో ఏ ఒక్కరికీ ఇవ్వకుండా ఇతరునికి ఇచ్చావు కాబట్టి నీవు తమో మయుడవు అవుదువు గాక" అని అంబరీషుణ్ని శపించారు. ఆ వెంటనే శ్రీమహా విష్ణువుచక్రంవచ్చి నారదపర్వతులనువెంటాడం మొదలు పెట్టింది. వారిద్దరూ సరాసరి వైకుంఠానికి పరుగెత్తి శ్రీ మహావిష్ణువు వద్ద ఉన్న శ్రీమతిని చూచారు. "మా ముఖాలు వానర ముఖాలుగా చేసి అంతకు పూర్వమే మేము ప్రేమించిన పిల్లను నీవు తెచ్చు కున్నావు. కాబట్టి నీవు నరుడవై జన్మించి భార్యా వియోగ దుఃఖాన్ని అనుభవించి చిట్ట చివరికి వానరుల సహాయంతో నీ భార్యను నీవు పొందుతావు." అని శ్రీ మహా విష్ణువును శపిస్తారు. అప్పుడు విష్ణువు ఇదంతా మహేశ్వరుని ప్రభావంతో జరిగిందని నారదునికి వివరించి చెప్పి అదృశ్యమవుతాడు. ఈ శాప కారణంగానే విష్ణువు రామావతారం పొందడం, భార్యా వియోగ దుఃఖాన్ని అనుభవించడం, ఆంజ నేయాది వానరుల సహాయంతో రాముడు తన భార్యయైన సీతను పొందడం సంభవించింది.

ఈ విధంగా శ్రీమహావిష్ణువును శపించడం లక్ష్మీమాతను శపించడం రూపంగా సీతారామ అవతారాలకు మూలకారకుడైన నారదుణ్ని, మహాసృష్టికి మూలభూతుడైన విష్ణుపుత్రుడై విష్ణుసాన్నిధ్యంలో తనకంటె ముందుగా ప్రథమ స్థానంలో ఉన్న బ్రహ్మకు పూజార్చనాదులు లేకుండా చెయ్యడంలో కూడా పాత్ర వహించిన నారదుణ్ని, మొత్తం దేవరాక్షస వ్యవస్థల్లో దుష్టులను శిక్షించడంలోనూ, శిష్టులను రక్షించడంలోనూ బహుముఖాలుగా పాత్ర వహించిన నారదుణ్ని అపర జగన్నాటక సూత్రధారి అంటే తప్పేముంది. అందుకే మొట్టమొదటే శ్రీ మహావిష్ణువే జగన్నాటక సూత్రధారి అనుకుంటాం గాని నారదమహర్షి కూడా జగన్నాటక సూత్రధారియే అని పేర్కొనడం జరిగింది.

## సంస్కృత నారదీయ పురాణం

అపూర్వ మహర్షిగా దేవర్షిగా అపర జగన్నాటక సూత్రధారిగా పేర్కొనదగిన ఈ నారదమహర్షి చేత ప్రోక్తమైన సంస్కృత నారదీయ పురాణంలో అసలు

వాఙ్మయ మహోధ్యాఖుని

మొట్టమొదట యెన్నిపాదాలు యెన్నిఅధ్యాయాలు యెన్నిశ్లోకాలు ఉన్నాయో సాధికారంగా ప్రమాణ పురస్సరంగా మనం యేమీ చెప్పలేము. లభ్యమై నారదీయ మహాపురాణం పేరుతో ముద్రితమైన నారదీయపురాణంలో పూర్వోత్తర భాగాల పేరుతో రెండు భాగాలున్నాయి. పూర్వార్థం నాలుగు పాదాలుగా విభజింపబడి ఉత్తరార్థం పాదవిభజన రహితంగా ఉన్నది-పూర్వార్థంలో నూట యిరవైయైదు అధ్యాయాలూ ఉత్తరార్థంలో యెనభై రెండు అధ్యాయాలుగా మొత్తం గ్రంథం 207 అధ్యాయాలతో ఉన్నది. పూర్వార్థంలో 12,774 శ్లోకాలుండగా ఉత్తరార్థంలో 4,525 శ్లోకాలున్నాయి. అంటే ముద్రితమైన నారదీయపురాణంలో మొత్తం 17,299 శ్లోకా లున్నాయన్నమాట.

ముద్రితమైన ఈ నారదీయపురాణంలో అధ్యాయ విభజనాత్మకంగా వివిధ శ్లోకాలలో ఈ క్రింది విషయాలు వర్ణితాలైనాయి.

## ప్రథమః పాదః

| | |
|---|---|
| ధర్మకామార్థ మోక్షోపాయా న్వేదితుం శౌనకాదిభిః కృతే ప్రశ్నే సూతస్య నారదాయ సనకాదిభిర్నిరూపిత పురాణస్య నారదీయస్య కథనోపన్యాసే పురాణమాహాత్మ్య కథనమ్ ॥ | 1వ అధ్యాయం |
| బ్రహ్మసభా ప్రస్థిత సనకాదీనాం గంగాతీరే విష్ణు ప్రసాదనోపాయబోధనాయ నారదప్రశ్నే పురాణోపన్యాసే విష్ణుస్తుతిః॥ | 2వ ,, |
| భగవద్విరచిత సృష్టినిరూపణ ప్రసంగేన భూగోళవర్ణన భరతఖండోత్పత్తి ప్రాశస్త్య వర్ణనమ్ ॥ | 3వ ,, |
| హరిభక్తి నిరూపణే మృకండ మునేస్తపసా తోషితస్య భగవతోఽహం తవపుత్రతాం యాస్యామీతి మనోభీష్ట వరప్రదానమ్ ॥ | 4వ ,, |
| మార్కండేయస్య ప్రళయ దర్శనాంతే పురాణ సంహితాం విరచ్య పరంపద మేష్యసీతి మహేశ్వర వితరణమ్ ॥ | 5వ ,, |
| గంగాయమునయోః సమాగమా త్ప్రయాగక్షేత్ర ప్రశంసా పూర్వకం గంగా మాహాత్మ్య కథనమ్ ॥ | 6వ ,, |
| గంగా మాహాత్మ్య ప్రసంగేన రిపుజితస్య బాహు భూమిపతేరౌర్వ మునే రాశ్రమ సవిధే మృతస్య గర్భవత్యాః సహ గమనోద్యతాయాః ప్రియపత్న్యా మునికృతః సహగమన నిషేధః॥ | 7వ ,, |

మహామథన సారామృతం

జాహ్నుసుత సగరాన్వయ జాత భగీరథ నృపానీత గంగా సంగమాత్ కపిలమహాముని కోపానలదగ్ధ తత్పూర్వజానాం పరమ పదావలంబనమ్ ॥ 8వ అధ్యాయం

కులగురు వసిష్ఠమహర్షి శాపలబ్ధ రాక్షసదేహస్య సౌదాస నృపతేః గంగోదక సంబంధాచ్ఛాప మోచనమ్ ॥ 9వ ,,

గంగోత్పత్తి ప్రసంగేన దేవాసురయుద్ధే దేవపరాజయ దుఃఖితాయా హిమాద్రౌ భగవదారాధనోద్యతాయాః అదితేర్వి నాశా యోత్పాదితేగ్నౌ దైతేయ వినాశః ॥ 10వ ,,

త్రైలోక్య రాజ్యమింద్రాయ పునః ప్రదాతుం గృహీత వామనావతారస్య బలియజ్ఞ మాస్థితస్య భగవతస్త్రి విక్రమస్య చరణ తలాద్గంగోత్పత్తిః ॥ 11వ ,,

ధర్మాఖ్యానే సత్పాత్ర బ్రాహ్మణలక్షణం, మహావనే తడాగ బంధనాత్ వీరభద్రనృపతే రుత్తమలోకావాప్తిరితి భగీరథాయ ధర్మరాజ ద్విజనివేదనంచ ॥ 12వ ,,

దేవతాయ తనవాపీ కూపతడాగాది నిర్మాణం, నానా దానాది నిరూపణంచ ॥ 13వ ,,

శ్రుతిస్మృతి ప్రతిపాదిత వర్ణత్రయ ధర్మనిరూపణే పాతక ప్రాయశ్చిత్త నివేదనం, శ్రాద్ధపంచక కథనంచ ॥ 14వ ,,

పాతకినాం పృథక్ పృథఙ్నరయ యాతనావర్ణన పూర్వకం నృపపూర్వజానాం నరకోద్ధారాయ ధర్మరాజ ద్విజస్య భూతలే గంగానయనార్థ భాగీరథయో ద్యోతనమ్ ॥ 15వ ,,

ద్విజరూపిణో ధర్మస్య వచనాత్పితౄద్ధరణాయభూతలే భగీరథస్య గంగా నయనం, నిజకులోద్ధారశ్చ ॥ 16వ ,,

వ్రతాఖ్యానే మార్గశీర్ష మారభ్య కార్తికమాస పర్యంతం సోద్యాపనం శుక్ల ద్వాదశీ వ్రత కథనమ్ ॥ 17వ ,,

ప్రతిమాసం పౌర్ణిమాయాం సోద్యాపన విధి లక్ష్మీనారాయణ వ్రతం ॥ 18వ ,,

కార్తికస్య శుక్లపక్షే దశమ్యాం హరిమందిరే ధ్వజారోపణ వ్రతమ్॥ 19వ ,,

వాఙ్మయ మహాధ్యక్షుని

ధ్వజారోపణ ప్రసంగాత్సోమ వంశోద్భవ నరపతేః సుమతే ర్విభాండక మునయే స్వపూర్వ జన్మేతిహాస కథనమ్॥ 20వ అధ్యాయం

మార్గశీర్ష శుక్లపక్షే దశమీ మారభ్య పౌర్ణమాసీ పర్యంతం హరి పంచరాత్ర వ్రతమ్॥ 21వ ,,

ఆషాఢ శ్రావణ భాద్రపదాశ్వినే ష్వేకస్మిన్మాసే మాసోప వాస వ్రతమ్॥ 22వ ,,

ఏకాదశీవ్రత ప్రసంగేన భద్రశీల ద్విజోపాఖ్యానమ్–॥ 23వ ,

బ్రాహ్మణ క్షత్రియ విశాం స్త్రీ శూద్రాణాంచ సదాచర వర్ణనమ్॥ 24వ ,,

వర్ణాశ్రమ ధర్మిణాం స్మార్తాచారేషు అధ్యయనాన్నధర్మ నిరూపణమ్॥ 25వ ,,

ద్విజాతీనాం స్మృతి నిరూపిత వేదాధ్యయనాది ధర్మ నిరూపణమ్ ॥ 26వ ,,

సదాచారేషు గృహస్థ వానప్రస్థ సన్యాసినాం ధర్మ నిరూపణమ్॥ 27వ ,,

శ్రాద్ధ కృత్య వివరణమ్ ॥ 28వ ,,

ప్రాయశ్చిత్త పూర్వకం తిథ్యాదినిర్ణయమ్ ॥ 29వ ,,

పంచ మహాపాతకినా ముపపాతకినాంచ ప్రాయశ్చిత్త కథన పూర్వకం, పాతక నివృత్తయే భగవదుపాసనా కథనమ్ ॥ 30వ ,,

పుణ్య పాపవతాం నృణాం సుఖదుఃఖ ప్రదస్య యమ మార్గస్య సమ్యుక్తయా నిరూపణమ్ ॥ 31వ ,,

సంసార నానావిధ యాతనా కథన పూర్వకం తన్ని వృత్తయే హరేరాధన కథనమ్ ॥ 32వ ,,

భగవద్భక్తి మతాం పాపక్షయే భోధైక లభ్య మోక్షోపాయ భూత యమాద్యష్టాంగయోగ నిరూపణమ్ ॥ 33వ ,,

ఐహలౌకిక, పారలౌకిక సుఖావాప్తి సాధన హరిభక్తి లక్షణ నిరూపణమ్ ॥ 34వ ,,

కర్మపాశ విచ్ఛేదక భగవద్భక్తి మాహాత్మ్య నిరూపణే వేదమాలి ద్విజేతిహాస కథనమ్ ॥ 35వ ,,

మహామథన సారామృతం

| | | |
|---|---|---|
| విష్ణుసేవా ప్రభావేణ యజ్ఞమాలి సుమాలి ద్విజయో రుత్తమ లోకావ్యాప్తి కథనమ్॥ | 36వ | అధ్యాయం |
| విష్ణు మాహాత్మ్య గులికాభిధలుప్త కోత్తం కేతిహాస కథనమ్॥ | 37వ | ,, |
| భగవత్స్నవనాదుత్తంక మునేర్విష్ణు పదవాప్తి కథనమ్॥ | 38వ | ,, |
| హరి మందిర సమ్మార్జన దీప దానకర్తుర్జయధ్వజ నరపతే రితిహాస కథనమ్॥ | 39వ | ,, |
| సుధర్మోదిత బ్రహ్మకల్ప మధ్యే మను మన్వంతరేంద్ర దేవతా నిరూపణమ్॥ | 40వ | ,, |
| యుగ చతుష్టయస్థితి కథన పూర్వకం కలౌ భగవన్నామ స్మరణత ఏవ ముక్తిరితి నామ మాహాత్మ్య కథనమ్॥ | 41వ | ,, |


## ద్వితీయః పాదః


| | | |
|---|---|---|
| భరద్వాజ భృగు సంవాదే జగత్సృష్టి నిరూపణమ్॥ | 42వ | ,, |
| సృష్టి నిరూపణే వర్ణాశ్రమ ధర్మ కథనమ్॥ | 43వ | ,, |
| భూతసృష్టి ప్రసంగేన ధ్యానయోగ కథనమ్॥ | 44వ | ,, |
| జనక పంచశిఖ సంవాదేన మోక్ష ధర్మ నిరూపణమ్॥ | 45వ | ,, |
| ఆది దైవికాది తాపత్రయ నిరాసాయ భవోపర మాయ చాధ్యాత్మ కథనమ్॥ | 46వ | ,, |
| చిత్తవృత్తి నిరోధతో భగవద్ధ్యానే నాత్మ పదావాప్తి నిరూపణమ్॥ | 47వ | ,, |
| భరతస్య రాజర్షేరేణ శావక సంగేన జన్మత్రయ గ్రహణే తిహాసః॥ | 48వ | ,, |
| భరతముని రహుగణయోః సంవాదే మోక్షధర్మా విష్కరణమ్॥ | 49వ | ,, |
| శుకముని చరిత్రే వేద చతుష్టయస్య స్వర వర్ణవ్యవస్థా వర్ణనమ్॥ | 50వ | ,, |
| నక్షత్ర వేదసంహితాది కల్ప నిరూపణమ్॥ | 51వ | ,, |
| వ్యాకరణ నిరూపణమ్॥ | 52వ | ,, |

నిరుక్తి నిరూపణమ్॥ 53వ అధ్యాయం

జ్యోతిషే గణితభాగ విచారణమ్॥ 54వ ,,

జ్యోతిర్నిరూపణే జాతక భాగావిష్కరణమ్॥ 55వ ,,

గ్రహ విచారణ పూర్వకం, నానావిధ మహోత్పాతాది నిరూపణమ్॥ 56వ ,,

సంక్షేపతశ్ఛందో వర్ణనమ్॥ 57వ ,,

జనక రాజగృహగమన పర్యంతం శుకేతిహాస నిరూపణమ్॥ 58వ ,,

జనకశుక సంవాదేనాధ్యాత్మ తత్త్వ నిరూపణమ్॥ 59వ ,,

వ్యాసాశ్రమే శుక సనక సంవాద గ్రథిత మోక్షార్థ సాధక జ్ఞాన వివరణమ్॥ 60వ ,,

దేహధారిణా మనేకాపాయ దర్శన పూర్వకం నివృత్తి ధర్మ మహాత్వ వర్ణనమ్॥ 61వ ,,

శుకేతిహాస ముఖేన మోక్ష ధర్మ నివేదనమ్॥ 62వ ,,

## తృతీయః పాదః

సంసార బంధవిచ్ఛేదాయ పాశుపత దర్శన తత్త్వ నిరూపణమ్॥ 63వ ,,

మంత్రసిద్ధిద దీక్షా విధి నిరూపణమ్॥ 64వ ,,

శ్రీపాదుకా మంత్ర కథన పూర్వకం మంత్ర జపవిధి కథనమ్॥ 65వ ,,

గాయత్రీ మంత్ర జపవిధి కథన పూర్వకం సంధ్యాది నిరూపణమ్॥ 66వ ,,

అర్ఘ్య పాద్యాది విధాన సహిత షోడశోపచార యుక్త దేవతా పూజా నిరూపణమ్॥ 67వ ,,

గణేశ మంత్ర తద్విధి నిరూపణమ్॥ 68వ ,,

రవి సోమ మంగళ బుధ గురు శుక్రాణాం యంత్ర విధి పూజావిధి పూర్వకం మంత్ర జపవిధి కథనమ్॥ 69వ ,,

పూజావిధి పూర్వకం మహావిష్ణు మంత్ర జప విధానమ్॥ 70వ ,,

మహామథన సారామృతం

శ్రీ నృసింహాస్య యంత్ర కథన పూర్వకం మంత్రోపాసన గాయత్ర్యాది నిరూపణమ్॥ 71వ అధ్యాయం

పీఠ దేవతా సహిత పూజా విధి పురస్సరం హయగ్రీవ మంత్రోపాసనా నిరూపణమ్॥ 72వ ,,

శ్రీ లక్ష్మణ మంత్ర సహిత శ్రీరామ మంత్రజప విధానమ్॥ 73వ ,,

హనుమన్మంత్ర నిరూపణమ్॥ 74వ ,,

మంత్రాంతర కథన పూర్వకం హనుమద్దీపదాన విధి ప్రకరణమ్॥ 75వ ,,

శ్రీ దత్తాత్రేయ ప్రసాదలబ్ధ మాహాత్మ్య కార్తవీర్యనృప మంత్ర దీప కథనమ్॥ 76వ ,,

శ్రీ కార్తవీర్య కవచ నిరూపణమ్॥ 77వ ,,

హనుమత్కవచ కథనమ్॥ 78వ ,,

హనుమచ్చరిత వర్ణనమ్॥ 79వ ,,

సకలాభీష్టప్రద పూజా విధాన పూర్వకం కృష్ణ మంత్రారాధన కథనమ్॥ 80వ ,,

పీఠ దేవతారాధన పూర్వకం కామనాభేదేన కృష్ణ మంత్ర భేద నిరూపణమ్॥ 81వ ,,

కైలాసే నారదాయ శ్రీ శివ నిరూపిత మనేక కామనా పూర్వకం శ్రీ రాధాకృష్ణ సహస్ర నామస్తోత్రమ్॥ 82వ ,,

మంత్రారాధన పూర్వకం రాధాంశ భూత పంచప్రకృతి లక్షణ నిరూపణమ్॥ 83వ ,,

జప హోమ విధి సహిత దేవీమంత్ర నిరూపణమ్॥ 84వ ,,

వాగ్దేవతావతార భూత కాల్యాది యక్షిణీ మంత్ర భేద నిరూపణమ్॥ 85వ ,,

మహా లక్ష్మ్యవతార భూత భగలాది యక్షిణీ మంత్ర సాధన నిరూపణమ్॥ 86వ ,,

విధాన సహిత దుర్గామంత్ర చతుష్టయ నిరూపణమ్॥ 87వ ,,

శ్రీ రాధావతార భూతషోడశ దేవతానాం మంత్ర యంత్ర పూజావిధి నిరూపణమ్॥ 88వ ,,


వాఙ్మయ మహోధ్యక్షుని

విజయాది సకల కామనా సిద్ధయే కవచసహిత లలితా సహస్ర నామస్తోత్ర నిరూపణమ్॥ 89వ అధ్యాయం
అర్చనావిధి సహితం నిత్యాపాటల కథనమ్॥ 90వ ,,
స్తోత్రసహిత శ్రీమహేశ్వర మన్త్రవిధి నిరూపణమ్ 91వ ,,

## చతుర్థః పాదః

సంక్షేపతో బ్రహ్మ పురాణేతిహాస నిరూపణమ్ 92వ ,,
పంచఖండ సహిత పద్మపురాణస్థిత విషయానుక్రమ కథనమ్ 93వ ,,
పురాణశ్రవణఫలకథనసహితం విష్ణుపురాణానుక్రమ కథనమ్ 94వ ,,
వాయుపురాణానుక్రమ నిరూపణమ్ 95వ ,,
శ్రీమద్భాగవత ద్వాదశస్కంధ నిరూపిత విషయానుక్రమ కథనమ్ 96వ ,,
శ్రీనారదీయ పురాణానుక్రమ కథనమ్ 97వ ,,
మార్కండేయ పురాణానుక్రమ నిరూపణమ్ 98వ ,,
అగ్నిపురాణస్థిత విషయానుక్రమ నిరూపణమ్॥ 99వ ,,
భవిష్య పురాణస్థిత విషయానుక్రమ నిరూపణమ్॥ 100వ ,,
బ్రహ్మవైవర్త పురాణస్థిత విషయానుక్రమ వర్ణనమ్॥ 101వ ,,
లింగపురాణస్థిత విషయానుక్రమ నిరూపణమ్॥ 102వ ,,
వారాహ పురాణస్థిత విషయానుక్రమ కథనమ్॥ 103వ ,,
స్కంద పురాణోక్త విషయానుక్రమ నిరూపణమ్॥ 104వ ,,
వామన పురాణస్థిత విషయానుక్రమ నిరూపణమ్॥ 105వ ,,
కూర్మ పురాణస్థిత విషయానుక్రమ నిరూపణమ్॥ 106వ ,,
మత్స్య పురాణస్థిత విషయానుక్రమణీ కథనమ్॥ 107వ ,,
గరుడ పురాణస్థిత విషయానుక్రమ కథనమ్॥ 108వ ,,
బ్రహ్మాండ పురాణస్థిత విషయానుక్రమ నిరూపణమ్॥ 109వ ,,
చైత్రాది ద్వాదశ మాసగత ప్రతిపద్వ్రత నిరూపణమ్॥ 110వ ,,
ద్వాదశ మాసగత ద్వితీయావ్రత కథనమ్॥ 111వ ,,

ద్వాదశ మాసగత తృతీయావ్రత నిరూపణమ్॥ 112వ ఆధ్యాయం
ద్వాదశ మాసస్థిత చతుర్థీవ్రత నిరూపణమ్॥ 113వ ,,
ద్వాదశ మాసస్థిత పంచమీవ్రత నిరూపణమ్॥ 114వ ,,
ద్వాదశ మాసగత షష్ఠీవ్రత నిరూపణమ్॥ 115వ ,,
ద్వాదశ మాసగత సప్తమీవ్రత నిరూపణమ్॥ 116వ ,,
ద్వాదశ మాసస్థితాష్టమీవ్రత నిరూపణమ్॥ 117వ ,,
ద్వాదశ మాసగతశ్రీరామనవమ్యాదినవమి వ్రతనిరూపణమ్॥ 118వ ,,
ద్వాదశ మాసగత దశమీవ్రత నిరూపణమ్॥ 119వ ,,
ద్వాదశ మాసస్థితైకాదశీ నామనిర్దేశ పూర్వకం దినత్రయ సాధ్యవ్రత కథనమ్॥ 120వ ,,
ద్వాదశ మాసగత ద్వాదశీవ్రత నిరూపణమ్॥ 121వ ,,
ద్వాదశ మాసగత త్రయోదశీవ్రత కథనమ్॥ 122వ ,,
ద్వాదశ మాసగత చతుర్దశీ వ్రత నిరూపణమ్॥ 123వ ,,
ద్వాదశ మాసస్థిత పౌర్ణమీ వ్రత నిరూపణమ్॥ 124వ ,,
ఏవం పురాణం సంశ్రావ్య సనకాది మహర్షిషు గతేషు నారదస్య కైలాస గమనం, తత్ర శంకరాత్పాశుపత జ్ఞాన మవాప్య నారాయణాశ్రమగమనం, సూతేన శౌనకాదిభ్యః పురాణ మాహాత్మ్య కథనంచ॥ 125వ ,,

—:ఉత్తరార్థస్థిత విషయానుక్రమణికా:—

వసిష్ఠం ప్రతి పాపేంధనస్య దాహకః కోవహ్నిరితి మాంధాతుః ప్రశ్నే ఏకాదశీవ్రత రూపోగ్ని రశేష పాపేంధనదాహక ఇతి తద్వ్రతస్య మాహాత్మ్య నిరూపణమ్॥ 1వ అధ్యాయం
దేవ పితృ కార్యేషు తిథీనాం పూర్వాపర తిథి విద్ధానాం కీదృశీ గ్రహణ వ్యవస్థేతి శౌనకాదీనాం ప్రశ్నః కేషుకేషు కార్యేషు తిథీనాం పూర్వాపర వేధగ్రహణ మితి సూతస్య కథనోపక్రమ స్తత్రైవైకాదశీ పూర్వవిద్ధా నకర్తవ్యేతి విశేషతో నిరూపణమ్॥ 2వ ,,

వాఙ్మయ మహోధ్యాయుని

దురితౌఘ నివారణాయ భగవద్భక్తేః ప్రాధాన్య ముక్త్వా
తత్ప్రసంగేన రుక్మాంగదస్య నరపతేః ప్రజాభిః సహైకాదశీ
వ్రతం కుర్వాణస్య రాష్ట్రేమృతానాం సహపితృభిః స్వర్గా
సేనశూన్య నిజలోకావలోకనేన పరితప్తస్య యమస్య బ్రహ్మ
లోక గమనమ్॥ 3వ అధ్యాయం

కార్యమకృత్వా ప్రభో ర్వేతన గ్రహణమతి పాపకరం యత
ఏకాదశీవ్రత కరణాన్నిరయాధిష్ఠిత పూర్వజైః సహాధునా
రుక్మాంగద రాష్ట్రవాసినాం స్వర్లోకావస్థానా చ్ఛూన్యలోక పరి
పాలన మశ్రేయస్కరమితి యమవాక్య నిరూపణమ్॥ 4వ ,,

దండం పటంచాగ్రేసంస్థాప్య యమస్య విలాపకరణమ్॥ 5వ ,,

ఏకాదశీవ్రత కర్తౄణాం పాపినామపి స్వర్గావాసోనియతం
భవిష్యతి సః తైర్విరోధం కర్తుం నాహంపారయిష్యే ఇతి బ్రహ్మ
వాక్య నిరూపణమ్॥ 6వ ,,

యమాగ్రహాత్ మోహినీనామ్నీం యోషిద్వారా ముత్పాద్య
రుక్మాంగదస్య నృపంత రేకాదశీవ్రత భంగాయ బ్రాహ్మణో
నిర్దేశకారణమ్॥ 7వ ,,

బ్రాహ్మణో నిదేశ మంగీకృత్య మోహిన్యాం మందరాచల
గమనమ్॥ 8వ ,,

రాజ్య ధురం వోఢుం క్షమే ధర్మాంగద పుత్రే రాజ్యం
న్యస్య సహ ప్రజాభిరేకాదశీవ్రతం పాలనీయమితి సందిస్య మృగ
యార్థం గంతు మిచ్ఛామీతి రాజ్ఞోభార్యాయై కథనమ్॥ 9వ ,,

వనవిహారణోద్యతస్య నరపతే ర్వామదేవాశ్రమగమనం, తత్ర
వామదేవాయ సర్వసంపత్త్ప్రాప్తి ర్మమె తజ్జన్మసంపాదితా వా
పూర్వ సంపాదితేతి ప్రశ్నకరణంచ॥ 10వ ,,

వామదేవకృతం నరపతేః ప్రాక్జన్మవృత్త వర్ణనం. రాజ్ఞో
మంద రాచల గమనం. గిరిశోభావలోకనప్రసంగేన మోహినీ
దర్శనంచ॥ 11వ ,,

మోహినీరూప మోహితస్య నరపతేస్తస్యాసహ యాచిత
దానే సమయ కరణం, స్వవృత్తకథనం తద్వృత్తశ్రవణంచ॥ 12వ ,,

రుక్మాంగదస్య నరపతే రాత్మవినాశాయ మోహిన్యా సహ
వివాహో గిరేరవతరణంచ॥ 13వ ,,

మహామథన సారామృతం

మోహిన్యా సహ ప్రస్థితస్య నరపతే రశ్వఖురాగ్ర ప్రహృతాయా గృహగోధాయాః ప్రాగ్జన్మ వృత్త కథనం. విజయైకాదశీ పుణ్యదానేన తస్యా ఉద్ధారశ్చ॥ 14వ అధ్యాయం

గృహగోధాముద్ధృత్య సహ భార్యయా నరపతేర్నిజ నగర గమనం సమ్ముఖాగతేన ధర్మధ్వజపుత్రేణ సహవార్తాలాప కరణంచ॥ 15వ ,,

ధర్మ ధ్వజేన వస్త్రాలంకారాదిభిః పూజితాయా మోహిన్యాః సేవార్థం సంధ్యా వల్యా నియోజనం తత్ప్రసంగేన పతివ్రతోపాఖ్యానమ్॥ 16వ ,,

సంధ్యావల్యోపాస్యమానయా మోహిన్యాః సన్నిధౌ నరపతే రాగమనం తస్యాస్తేన సహ సంవాదః॥ 17వ ,,

ధర్మ ధ్వజస్య సుతస్యాగ్రహాత్సంధ్యావలీ ప్రభృతిభిర్వస్త్రాలంకార పూజితాభిర్నృపస్త్రీభిః సహ మోహిన్యా విలాసోపభోగార్థం నృపస్యాభ్యనుజ్ఞానమ్॥ 18వ ,,

మోహిన్యాసహ నృపస్య విలాసవర్ణనమ్॥ 19వ ,,

ధర్మ ధ్వజస్య మలయే విద్యాధరాన్ విజిత్య పంచమణీనాం ఆహరణం, నాగలోకే నాగన్ విజిత్యాయుత నాగకన్యా హరణం, దిగ్విజయం కృత్వానానావిధ ద్రవ్యాహరణం పిత్రే సర్వవృత్తి నివేదనంచ॥ 20వ ,,

ధర్మధ్వజస్య నాగకన్యా భిర్మహోత్సవేన వివాహకరణం రాష్ట్రే ప్రజానాం శిక్షా నిరూపణంచ॥ 21వ ,,

విషయాభి సేవన రతస్య నరపతే రుక్మాంగదస్యాగామి కార్తిక మాసస్మరణం. మోహిన్యై కార్తికమాస మాహాత్మ్య కథనంచ॥ 22వ ,,

మోహిన్యనురోధాన్నృపస్య సంధ్యా వల్యై కార్తిక మాసోప వాస కరణానుజ్ఞానం. మోహిన్యారుక్మాంగద సమీపే సమయానుసారే హ్యైకాదశ్యాం భోజన సంబంధేన యాచనా కరణంచ॥ 23వ ,,

ఏకాదశ్యాం నాహంభోక్ష్యేఇతి రాజ్ఞోనిశ్చయంజ్ఞాత్వా మోహిన్యా గౌతమాది బ్రాహ్మణేభ్యో రాజ్ఞోపవాస కరణం యుక్త మయుక్తమితి ప్రశ్నకరణమ్॥ 24వ ,,

ఏకాదశ్యాం భోజనే నతే దోషఃఇతి ద్విజవాక్య శ్రవణాత్ పరమకృద్ధస్య వ్రతభంగమ సహమానస్య నరపతేర్వచనాత్ ప్రస్థితాయా మోహిన్యా ధర్మధ్వజస్య వినయాన్నునః పరావర్తనమ్॥ 25వ అధ్యాయం

ధర్మాంగద సమీపేమోహిన్యై అన్యత్సర్వమపి ప్రయచ్ఛామి నత్వేకాదశ్యాం భోక్ష్యఇతి రాజ్ఞోనిశ్చయ పూర్వకం వచనమ్॥ 26వ ,,

సుత వచనాన్మోహినీ మనునేతు ముద్యతాయాః సంధ్యావల్యాః కాష్ఠీలా దేహమాపన్నాయాః కౌండిన్య భార్యాయాః పూర్వవృత్తి కథనమ్ ॥ 27వ ,,

ధనాశయా స్వభార్యాం పరిత్యజ్య సముద్ర మధ్యగతస్య కౌండిన్యస్య రాక్షసావసథగమనం, రాక్షసంహత్వారాక్షస్యా సహాధనం గృహీత్వా రాక్షసాహృతాం రత్నావలీం స్వావసథం ప్రేషయితుం కాశ్యామాగమనమ్॥ 28వ ,,

బ్రహ్మాణఃశిరః కర్తనే హస్తేలగ్నంశిరః పాతయితు మశక్తస్య శివస్య బ్రహ్మహత్యా పీడితస్య కాశ్యాముభయ నివృత్తౌ తత్రైవ హరేరాజ్ఞయా నివాస ఇతి కాశ్యా రాక్షసీకృత మాహాత్మ్య వర్ణనమ్ ॥ 29వ ,,

రాక్షసీ సమ్మత్యా రత్నావల్యాః పాణిగ్రహణం కృత్వా స్వనగర మాగతస్య ప్రథమభార్యాం సత్కృత్యభార్యాభిస్తిసృభిః కౌండిన్యస్య సంసారకరణం, భర్తృవంచనా పాపాత్ ప్రథమ భార్యాయాః కాష్ఠీలాదేహావాప్తి కథనంచ ॥ 30వ ,,

మాఘమాస పుణ్యప్రదానేన కాష్ఠీలాయా ఉత్తమలోకావాప్తి కథనం పత్యుర్థే జీవిత మపిదాస్యామీతి మోహి న్యగ్రే సంధ్యావల్యాః కథనమ్ ॥ 31వ ,,

ఏకాదశీ వ్రతభంగమనిష్టం మన్యసేచేత్స్వపుత్రస్యశిరః పత్యాసహ నికృత్యదీయతామితి మోహిన్యా వచనం శృత్వా సభార్యస్య విరోచనస్యాఖ్యాయికాముక్త్వా సంధ్యావల్యాస్తద్వచోఽంగీకరణమ్ ॥ 32వ ,,

మహామథన సారామృతం

మోహిన్యాః ప్రియచికీర్షయా స్వపుత్రం హన్తుంభర్తురగ్రే సంధ్యావల్యా అభ్యర్థనా రాజ్ఞోఽన్య వరార్థే మోహిన్యాః ప్రార్థనా ధర్మాంగదస్యపితరం ప్రతిస్వశిరః కృంతనేఽనునయ కరణంచ ॥ 33వ అధ్యాయం

సంధ్యావల్యాసహ విషణ్ణేన రాజ్ఞాసుతస్యశిరః కృంతనాత్ భగవత్ప్రాదుర్భావః సభార్యస్య రాజ్ఞః సుతేనసహభగవత్సాయుజ్యలాభః తత్ప్రసంగేన మోహిన్యా అనుతాపకరణంచ ॥ 34వ ,,

మోహినీం ప్రతిబోధయితుం దైవతానాం తత్సన్నిధావాగమనం, సాంత్వన పూర్వకం వరప్రదాన యోద్యతానాం దేవతానామగ్రే రాజ్ఞః పురోహితేనస్య ధిక్కారపూర్వకం మోహిన్యై శాప ప్రదానమ్ ॥ 35వ ,,

బ్రహ్మశాప దగ్ధాయాస్త్రైలోక్యేఽపి స్థానమాలభమానాయా మోహిన్యాగతిప్రదానాయ సహదేవై ర్బ్రహ్మణో రాజపురోహితాశ్రమగమనం, తత్ప్రసాదనంచ ॥ 36వ ,,

బ్రహ్మణః ప్రార్థన యా దశమీ విద్ధైకాదశ్యాం మోహిన్యై స్థాన ప్రదానం, బ్రహ్మశాప దగ్ధాయా మోహిన్యాః పురోహితానుమత్యా పునః స్వశరీరలాభః సహదేవై ర్బ్రహ్మణో నిజలోక గమనంచ ॥ 37వ ,,

మోహిన్యా స్వపాపక్షాలనాయ ప్రార్థితేన వసుపురోహితేన తీర్థయాత్రా ప్రసంగాత్కృతం గంగా మాహాత్మ్య వర్ణనమ్ ॥ 38వ ,,

గంగాస్నాన మాహాత్మ్య వర్ణనమ్ ॥ 39వ ,,

గంగాయాం స్థలవిశేషేణ స్నానఫల కథనమ్ ॥ 40వ ,,

గంగాతీరే ఆరామాదికరణ నానావిధ దానఫల కథనమ్॥ 41వ ,,

గంగాతీరే గుడధేన్వాది దశధేను దాన విధానం, ఆ సంవత్సరం గంగార్చన విధి కథనంచ ॥ 42వ ,,

మాఘశుక్ల దశమ్యాం దశహరాయ గంగాయాః పూజన విధానం తన్మాహాత్మ్య కథనంచ ॥ 43వ ,,

విశాలనృపేతిహాస కథన పూర్వకం గయాయాం పిండ దానాత్ పితౄణాం నరకపతితానామప్యుత్తమ లోకావాప్తి రితి గయా మహాత్మ్య కథనమ్ ॥ 44వ ,,

గయాయాం ప్రథమ ద్వితీయ దినయోః శ్రాద్ధ పిండ దాన విధి నిరూపణమ్ ॥ 45వ అధ్యాయం

గయాయాం తృతీయ చతుర్థ దినయోః విష్ణ్వాదిపదే పిండదాన విధి నిరూపణమ్ ॥ 46వ ,,

గయాయాం పంచమేఽహ్ని గయాకూపాంతం స్నాన శ్రాద్ధ పిండ దానాది విధి మాహాత్మ్య నిరూపణమ్ ॥ 47వ ,,

కాశీక్షేత్ర స్థితి నానావిధ శివలింగ నిరూపణ పూర్వకం కాశీ మాహాత్మ్య కథనమ్ ॥ 48వ ,,

కూపహ్రద వాపీకుండాదిషు స్నాన శివపూజా పూర్వకం కాశ్యా స్తీర్థయాత్రా వర్ణనమ్ ॥ 49వ ,,

యాత్రాకాల కథనపూర్వకం నానావిధ శివలింగ స్థాప నేతిహాస కథనం తత్తల్లింగదర్శన పూజనఫల కథనం చ ॥ 50వ ,,

కాశ్యాం గోదాయా ముత్తర వాహిన్యాం పంచనదే చ స్నాతృణాం మహాపాతక నిరసన పూర్వకం శివలోకా వాప్తి కథనమ్ ॥ 51వ ,,

దక్షిణోదధితీరే ఉత్కలదేశే పురుషోత్తమక్షేత్రే సుభద్రాకృష్ణ సంకర్షణారాధనే నేంద్ర ద్యుమ్న నృపతే ర్భగవత్పాదా వాప్తి రిత్యాఖ్యాయికా కథన పూర్వకం పురుషోత్తమ (జగన్నాథ) క్షేత్ర మాహాత్మ్య వర్ణనమ్॥ 52వ ,,

ఉత్కలదేశే పురుషోత్తమక్షేత్రే అశ్వమేధయాజినా, భగవన్మూర్తి లబ్ధుకామే నేంద్రద్యుమ్న నృపేణ కృతా భగవత్స్తుతిః ॥ 53వ ,,

నృపతిస్తవేన సంతుష్టో భగవాన్రాత్రౌ స్వప్నేతం ప్రబోధ్య సింధోః కూలాశ్రితం వృక్ష ముత్పాట్యతస్య మూర్తి విధాయ స్థాపనీయా ఇత్య శిక్షయత్. నరపతిః ప్రభాతే సింధు కూలం గత్వా వృక్షముత్పాట్య తత్ర విష్ణు విశ్వకర్మాణావ పశ్యత్, భగవ న్నిర్దేశాత్ కృష్ణ రామ సుభద్రామూర్తి ర్విధాయ సుముహూర్తేఽస్థాపయత్. తతో భగవదర్చన తో రాజ్ఞో మోక్షా వాప్తిః పురుషోత్తమక్షేత్ర మాహాత్మ్యం చ॥ 54వ ,,


మహామథన సారామృతం

జ్యేష్ఠశుక్ల ద్వాదశ్యాం పురుషోత్తమక్షేత్ర మభిగమ్య యాత్రా విధేయా, తత్ర మార్కండేయహ్రదే శివంప్రణమ్య కల్పవృక్షం దృష్ట్వా పురుషోత్తమ దర్శనం. తత్రైవ నృసింహారాధన విధానమ్॥ 55వ అధ్యాయం

అనత మత్స్య మాధవశ్వేతమాధవ దర్శన ఫలనిరూపణం. జ్యేష్ఠమాసే పౌర్ణిమాయాం జ్యేష్ఠా నక్షత్రే తత్ర సముద్రస్నాన విధి నిరూపణంచ॥ 56వ ,,

సముద్రతీరే మండలకరణపూర్వకం మండలే భగవదర్చన విధిపల కథనమ్॥ 57వ ,,

పురుషోత్తమక్షేత్రే స్నానదాన పితృశ్రాద్ధాది ఫల నిరూపణం, రాధికాశాపేన సింధుజలస్య క్షారత్వ కథనం, గోలోక నివాసి రాధా కృష్ణ తత్వనిరూపణ ప్రసంగేన రాధా కృష్ణతపవాఖిల బ్రహ్మాండోత్పత్తి కథనంచ॥ 58వ ,,

గోలోకస్థిత రాధాకృష్ణయోః పంచధా రూపగ్రహణనిరూపణమ్॥ 59వ ,,

జ్యేష్ఠశుక్ల దశమీ మారభ్య పౌర్ణమాసీ పర్యంతం రామ కృష్ణ సుభద్రా దర్శనే మహాయాత్రా ఫలావాప్తి కథనం పౌర్ణిమాయాం భగవత్స్నాన విధినిరూపణంచ॥ 60వ ,,

పురుషోత్తమ మాహాత్మ్యసహితం తత్క్షేత్రయాత్రా విధి ఫల కథనమ్॥ 61వ ,,

తీర్థరాజప్రయోగ తీర్థవిధిప్రసంగేన స్నానదాన శ్రాద్ధ ముండనాది విధినిరూపణమ్॥ 62వ ,,

మకర సంక్రమణగతే రవౌ పంచయోజన పరిమాణ ప్రయాగరాజ స్థితానేక విధ తీర్థస్థాన మాహాత్మ్య వర్ణనమ్॥ 63వ ,,

కురుక్షేత్ర మాహాత్మ్యే క్షేత్రప్రమాణాది నిరూపణమ్॥ 64వ ,,

కురుక్షేత్ర గత కామ్యకాదివనేషు సరస్వత్యాది తీర్థేషుచ దక్షేశ్వరాది శివలింగపూజావిధి సహితం, తీర్థయాత్రావిధి వర్ణనమ్॥ 65వ ,,

స్వపితుర్గృహే మహాన్యజ్ఞోత్సవం ఇతిశ్రుత్వైకాకినీ దాక్షాయణే శివమనాదృత్య ప్రాప్తాశివాపమానం యత్రదృష్ట్వా ప్రాణాన్ జహౌ తదేవ "హరిద్వార సంజ్ఞకంక్షేత్రం" తత్రత్య తీర్థయాత్రా వర్ణనమ్॥ 66వ ,,

వాఙ్మయ మహోధ్యక్షుని

బదరీక్షేత్ర ప్రతిష్ఠిత నరనారాయణ మాహాత్మ్య పూర్వకం తత్క్షేత్ర యాత్రా విధివర్ణనమ్॥ 67వ అధ్యాయం

గంగాతీరాదిష్ఠిత కామోదాఖ్య దేవీక్షేత్ర యాత్రా విధి నిరూపణమ్॥ 68వ ,,

శ్రీసిద్ధనాథ చరిత్ర సహితం కామాక్షీ మాహాత్మ్యవర్ణనమ్॥ 69వ ,,

నానావిధతీర్థ శివలింగ విరాజిత ప్రభాసక్షేత్ర యాత్రా విధి మాహాత్మ్య వర్ణనమ్॥ 70వ ,,

యాత్రావిధాన పూర్వకం పుష్కరక్షేత్ర మాహాత్మ్య వర్ణనమ్॥ 71వ ,,

తపః ప్రభావేతిహాస కథన పూర్వకం గౌతమాశ్రమ మాహాత్మ్య వర్ణనమ్॥ 72వ ,,

పుండరీకపురే జైమిని మునేః శివసాక్షాత్కార సంతుష్టస్య గణైః సహ శివస్య తాండవ నృత్యాత్పరాం ముద ముపగతస్య వేద పాదేనస్తుతిం కుర్వాణస్యాభ్యర్థనయా శివస్య నివాసాత్ తత్పురస్య క్షేత్ర నిరూపణం, త్ర్యంబకేశ్వర క్షేత్ర యాత్రా నిరూపణంచ॥ 73వ ,,

సార్ధా యోజన ప్రమాణ పశ్చిమ సముద్రతీర స్థిత గోకర్ణ క్షేత్ర మాహాత్మ్య వర్ణనమ్॥ 74వ ,,

సంక్షేపేణ రామలక్ష్మణ చరిత ముక్త్వాంతే రామవచనాన్ని ష్క్రాంతో లక్ష్మణో యస్మిన్నచలే యోగధారణ యాతను మజహాత్, తస్య లక్ష్మణాచలస్య మాహాత్మ్య నిరూపణమ్॥ 75వ ,,

దక్షిణో దధితీరే రామ స్థాపిత రామేశ్వర శివలింగ మాహాత్మ్య సహిత సేతు మాహాత్మ్య వర్ణమ్॥ 76వ ,,

నర్మదా తీర్థసంగ్రహ మాహాత్మ్య నిరూపణమ్ 77వ ,,

శ్రీ మహాకాళేశ్వరాధిష్ఠితావంతికా క్షేత్ర యాత్రా మాహాత్మ్య వర్ణనమ్॥ 78వ ,,

పద్మభువార్థితస్య భగవతోఽవతార గ్రహణాన్మథురా మాహాత్మ్య వర్ణనమ్॥ 79వ ,,

నారదాఖ్యాయికా కథన పూర్వకం బృందావన మాహాత్మ్య వర్ణనమ్॥ 80వ ,,

వసుర్న రపత్యుగ్ర పాధ్యాయో మోహిన్యై తీర్థయాత్రా విధిముక్తాతాం యాత్రా కరణాయ నియోజ్రబహ్మాణే మోహినీ వృత్తం, నివేద్యాతో బృందావనే తపస్తప్తుం గతవాన్, తత్ర తస్య నారదముని నిరూపిత భావికృష్ణావతార చరిత్ర విలోక నౌత్సుక్యా న్నివాస వర్ణనమ్॥ 81వ అధ్యాయం

మోహిన్యాః స్తీర్థయాత్రా కరణే నోత్తమలోకా వాప్తి వర్ణనం, దశమీవేధే మోహిన్యా వస్థానాత్ ద్వాదశీ విద్ధైకాదశీ వ్రతస్యై వోక్త ఫల దాతృ నిరూపణమ్. శ్రీ నారదీయ పురాణోత్తర ఖండ పఠన శ్రవణ ఫల వర్ణనం చ॥ 82వ ,,

ఇన్నిన్ని విషయాలతో యీ నారదీయ పురాణం ఉన్నా పూర్వార్థ గ్రంథం నాలుగు పాదాలుగా విభజింపబడడం ఉత్తరార్థ గ్రంథం అసలు పాదవిభజనతో విభజింపబడకపోవడం—మొత్తం పురాణంలో లక్షకుపైగా శ్లోకాలు ఉండవలసి ఉండగా కేవలం 17,299 శ్లోకాలకు మాత్రమే యీ ముద్రిత సంస్కృత నారదీయ మహాపురాణగ్రంథం పరిమితం అయివుండడం చూడగా యిది సుసమగ్ర పురాణం కానేకాదని స్పష్టపడుతున్నది.

గతంలో పేర్కొన్న ఉపపురాణాలలో నారదీయ పురాణానికి సైతం ఉప పురాణం ఉన్నట్లు గుర్తించాము. అసలు పురాణాలన్నింటికీ ఉపపురాణ లున్నాయి గదా! నారదీయ పురాణం అసలు అష్టాదశ పురాణాలలోనే ఒకటిగా ఉన్నప్పుడు దానికి ఉపపురాణం ఆవిష్కృతం అవడంలో విచిత్రంకాని విప్రతిపత్తికాని వుండ డానికి అవకాశమేలేదు. అయితే ఒక విశేషాన్ని యీ సందర్భంలో మనం గుర్తిం చక తప్పదు. గతంలో పేర్కొన్న సంస్కృత ఉపపురాణాలలో నారదీయ పురాణంతోపాటు "బృహన్నారదీయం" అన్న పేరుతో కొందరి మతంలో వేరొక ఉపపురాణం ఉన్నట్లు కూడా గుర్తించి వ్రాయడం జరిగింది. అయితే అసలు నారదీయ ఉపపురాణం మనకు యిటీవల కాలంలో ప్రచురితమైనట్లు కనపడదు. అది ఉపలభ్యమానమైందని కూడా చెప్పలేము. కాని తెలుగులోకి ప్రాచీనకాలంలో అనువదింపబడిన బృహన్నారదీయ పురాణ విషయాలకు నారదీయ మహాపురాణంగా—అంటే—అసలు పురాణంగానే భావింపబడి ముద్రింపబడిన 207 అధ్యాయాలతోను 17,299 శ్లోకాలతోను ఉన్న సంస్కృత నారదీయ పురాణ విషయాలకు సాజాత్యం గోచరమవుతున్నది. ముద్రిత సంస్కృత నారదీయ మహాపురాణంలో ఉన్న విషయాలు అధ్యాయాత్మకాలుగా యథాతథంగా పూర్వమే ఉటంకించడం జరిగింది.

వాఙ్మయ మహోధ్యక్షుని

## తెలుగులో నారదీయపురాణాలు

తెలుగులో క్రొత్తలంక విశ్వనాథకవికి పుత్రుడైన మృత్యుంజయకవి రచించిన 'బృహన్నారదీయం' అన్న పేరుతో వొకటి – కంజర్ల చెన్నయామాత్య పుత్రుడైన శ్రీమదల్లాడు నరసింహకవి విరచించిన 'నారదీయపురాణం' అన్న పేరు గల కృతి వొకటి కనిపిస్తున్నది. మృత్యుంజయకవి విరచితమైన 'బృహన్నారదీయ' తాళపత్ర ప్రతులు మద్రాసుప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోనూ, కాకినాడలో వున్న ఆంధ్ర సాహిత్య పరిషత్తులోనూ వున్నాయి. ఇటీవల పిఠాపురంలోని శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంవారు సేకరించి భద్రపరచి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్‌కు అప్పగించిన 160 తాళపత్ర గ్రంథాలలోనూ మృత్యుంజయకవి విరచితమైన 'బృహన్నారదీయం' ఆరాశ్వాసాలగ్రంథంగా కొంత అసమగ్రంగా లభించింది. కీర్తిశేషులు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు ప్రకటించిన ముద్రితా ముద్రిత గ్రంథసూచికా గ్రంథంలో కాకినాడ, మద్రాసు, తంజావూరులలోవున్న తాళపత్ర గ్రంథనామాది విషయాలు ప్రకటించడం జరిగింది. ఈ గ్రంథం ప్రకారం చూస్తే మద్రాసులోని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోవున్న మృత్యుంజయకవి రచించిన "బృహన్నారదీయం" అసమగ్రంగా వున్నట్లు, కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తులోవున్న 'బృహన్నారదీయపురాణం' సమగ్రంగా వున్నట్లు పేర్కొనబడింది. అల్లాడు నరసింహకవి విరచించిన 'నారదీయ పురాణం' ప్రతి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తులో అసమగ్రంగా వున్నది. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోమాత్రం నరసింహకవికృతమైన 'నారదీయపురాణం' సమగ్రంగావున్నది. అయితే నరసింహకవి విరచించిన నారదీయపురాణం ముద్రితమై మనకు లభిస్తున్న సంస్కృత నారదీయ మహా పురాణంతో సరిపోల్చిచూస్తే యిది మహాపురాణానికి సంపూర్ణమైన అనువాదం కాదని ముందుముందు నిరూపితమౌతుంది. అయితే మృత్యుంజయకవి రచించిన బృహన్నారదీయం లభ్యమైనదానినిబట్టి చూస్తే మృత్యుంజయకవి నారదీయ మహా పురాణాన్ని సంపూర్ణంగా తెలుగులోకి అనువాదం చేయాలని సంకల్పించాడేమో నని అనిపిస్తుంది. మృత్యుంజయకవి అవతారికలో తన వంశాదిక విషయాలను ప్రస్తావిస్తూ—

> "సకలవిద్వత్కవీంద్రుని సమ్మతించి
> ప్రస్తుతింపంగఁ గావ్యముల్ విస్తరించి
> పలుకనేర్తును నుభయ భాషలను నేను
> నబ్బురంబుగ మృత్యుంజయాఖ్య కవిని."

మహామథన సారామృతం

అని తనను గురించి తాను పేర్కొని ఆ తరువాత తాను రచింప బూనిన బృహన్నారదీయం గురించి యీ క్రింది విధంగా ఉటంకించినట్లు కనిపిస్తున్నది.

"నేనాంధ్రభాష రచియింపఁబూనిన బృహన్నారదీయంబునకు నాఖ్యాయికా ప్రకారం బెట్టిదనిన నిప్పురాణంబు నందు వివరింపనైన యపి యఁలాలకింపుఁడు.

నైమిశ వనవాసులైన మహామునులు ధర్మార్థ కామమోక్ష సాధనోపాయంబులడుగ శౌనకు నొద్దకుఁ జనుటయు, నతండు అమ్మునులతోఁ గూడ సిద్ధాశ్రమంబున నున్న సూతుంజూడ నరుగుటయు, నా సూతుని తోడఁ దమరు విననందలఁచిన యర్థంబులడుగుటయు, నతండు నారద సనత్కుమార సంవాదంబైన బృహన్నారదీయంబను పురాణంబు చెప్పం దలచి తన్మాహాత్మ్యంబు గొనియాడుటయు, మేరు శృంగంబున నారద సనత్కుమార సంయోగంబును, సనత్కుమారుండు తమకు వినం దగిన యర్థంబులు నారదు నడుగుటయు, నారదుండనేక ప్రకారంబుల హరిం బ్రశంసించుటయు, సృష్టి ప్రకారంబును, భారత వర్ష మాహాత్మ్యంబును, భక్తి ప్రశంసయు, నాచార ప్రశంసయు, మృకండు మహాముని తపంబు సేయుటయు. నా తపంబునకు వెరచి దేవత లందరు హరిశరణంబు వేడుటయు, వారి కతండు ప్రత్యక్షంబై యభయం బిచ్చుటయు, నద్దేవుండు మృకండునికి సాక్షాత్కారం బగుటయు, హరితాన మృకండునకు కుమారుండనై పుట్టెదనని వరంబిచ్చుటయు, మార్కండేయ సంభవంబును, నతని కచ్యుతుండు సకల పురాణ సంహితలు దెలుపుటయు, నేకార్ణవంబున హరి పవ్వళించుటయుఁ, గాల ప్రమాణ పరికీర్తనంబును, మార్కండేయ మహామునికి సర్వేశ్వరుండు భాగవత లక్షణం బానతిచ్చుటయు, గంగా మహాత్మ్యంబును, హరిహర భేద రాహిత్యంబును, పురాణ శ్రవణ గంగా గాయత్రీ తులసి భక్తి విశేషంబులును, బాహు నృపతి భూపాలనంబును, నతని కహంకారంబు ప్రవేశించుటయు, హైహయులకు నోడి బాహు నృపతి భార్యాసమేతంబుగావనంబున కరుగుటయు, నతని పత్నికి శత్రువులు గరళంబు వెట్టుటయు, వారు కార్వాశ్రమంబు ప్రవేశించి యుండుటయు, నచ్చట బాహు నృపతి మరణంబును, గర్భిణియైన తత్పత్ని యనుగమనంబుసేయు తలంపెరింగి వచ్చి యౌర్వముని వారించుటయు, నక్కాంతకు సగరుండను కుమారుండు పుట్టుటయు, నతండౌర్వునివలన సకలశాస్త్రంబులు చదివి ప్రబుద్ధుండై శత్రువుల పైఁజని మహాయుద్ధంబుచేసి వార్తల వధించి నిజరాజ్యంబు చేకొనుటయు, సగరుండు నిద్దర భార్యల వివాహం బగుటయు, నొక్క భార్యకు నరువది వేవురు పుట్టుటయు నొకర్తెకు వంశకరుండైన సుతుండొకండు పుట్టుటయు, నా యరువది వేవురును జగత్తులకు బాధగావించుటయు, నసమంజసుఁడను నేకపుత్రునకు నంశుమంతుండు

వాఙ్మయ మహోధ్యక్షుని

పుట్టుటయు, సగరుం డశ్వమేధంబు సేయ నుపక్రమించి విడిచిన యశ్వంబును నింద్రుు డెత్తుకొనిపోయి పాతాళంబున కపిల సన్నిధానమున నునుచుటయు, సాగరు లరువది వేలును నచ్చటికిం జని కపిలుని కోపంబున నిహతులగుటయు, నంశుమంతుం డచ్చటికిం జని కపిలానుగ్రహంబున నశ్వంబు గొనివచ్చి యాగ పూర్తిగావించుటయు నయ్యంశుమంతునకు దిలీపుండును, దిలీపునకు భగీరథుండును జన్మించుటయు, సౌదాసుండను రాజు వసిష్ఠు శాపంబున రాక్షసత్వంబు నొంది గంగాజల కణమాత్ర స్పర్శనంబున శాపవిముక్తుం డగుటయు, బలి మహా దైత్యుండు దేవ, స్వర్గంబు మొదలైన దేవపదంబులు తానాక్రమించి ప్రబలుండై యున్న యతని భంగించుటకై యదితి తపంబు చేసిన, యాయమకు హరి ప్రత్యక్షంబై తద్గర్భంబున వామనాకారంబున జనియించి, బలి యింటి కరిగి తత్క్షణంబ త్రివిక్రమాకారంబున సకల లోకంబులు నాక్రమించు నవసరంబునఁ దదీయాంగుష్ఠంబు సోకి బ్రహ్మాండంబు భిన్నంబై తద్ద్వారంబున బాహ్య జలంబు ప్రవహించిన నది గంగ యనం బ్రసిద్ధం బగుటయు, నంత బలిని బంధించి పాతాళంబున కనిచి, దేవతలకు రాజ్యంబిచ్చి వామనుండు తపంబు సేయ నరుగుటయు, దాన ప్రతిగ్రహంబుల యందు పాత్రాపాత్రంబులు వివరించుటయు, యముండు భగీరథుండను రాజుం జూడ వచ్చి యతనికి పుణ్యంబులు తత్ఫలంబులైన స్వర్గాది భోగంబులు, పాపంబులు తత్ఫలంబులైన నరక యాతనలు చెప్పుటయును, నంత భగీరథుండు గంగావతరణ నిమిత్తంబు శీతాచలంబు నందు తపంబు సేయందలంచి చనుచు, నా నడుమ భృగు మహామునిం జూచి యతనివలనఁ గొన్ని ధర్మంబులు దెలుసుకొని యంత నతనిచేత ననుజ్ఞాతుండై చని నాథేశ్వరం బన్న క్షేత్రంబునం దపంబు సేయుటయు, నతనికి విష్ణుండు ప్రత్యక్షుండై మనోరథంబు ఫలియించు శివుని నారాధించుమని చెప్పిన నతండట్లు చేసిన హరుండును ప్రసన్నుండై జటాజూటంబున నున్న గంగను భగీరథున కిచ్చిన నమ్మహానదియు నతని వెంటంజని, సాగర భస్మ రాసులపైఁ బ్రవహించిన, వారందరు నూర్ధ్వ లోకంబునకుం జనుటయు, ద్వాదశీ వ్రతమహాత్మ్య కీర్తనంబును బూర్ణిమా వ్రత ప్రశంసయును, ఇతిహాస యుక్తంబైన ధ్వజారోపణ వ్రత కథ నంబును, హరి పంచక ప్రకాశంబును మాసోపవాస వ్రతలక్షణంబు ప్రకటించుటయు, నేకాదశీ వ్రత సమాచరణంబు నితిహాస పూర్వకంబుగా నుగ్గడించుటయు, వర్ణాశ్రమాచారంబులు దెలుపుటయు, పితృకార్య ప్రకారంబును, తిథి నిర్ణయంబును, ప్రాయశ్చిత్త విధానంబులును, యమపుర మార్గంబు వివరించుటయు, జీవులు భూలోకంబునకు వచ్చి నానావిధ శరీరంబులు ధరియించు చందంబును, యోగ లక్షణంబు తేటపరచుటయు, హరిభక్తి మహిమంబును, వేదమాలి చరితంబును,

నతని పుత్రుఁడైన యజ్ఞమాలి సుమాలులు మోక్షంబు నొందుటయు, నుదంక మాహాత్మ్యంబును, జయధ్వజుఁడను రాజు చరిత్రంబును, నింద్ర సధర్మ సంవాదంబును జతుర్యుగ ధర్మంబులును, కీర్తితంబులయ్యె."

ఈపైన పేర్కొన్న విషయాలన్నీ మొత్తం అసలు నారదీయ మహాపురాణానికి అనువాద గ్రంథంగా అవతరించనున్న విషయాలతో కూడిన బృహన్నారదీయ పురాణ విశేషాలుగా కనిపిస్తున్నాయి. ఈ పై వచనంలో సూచితాలైన విషయాలన్నీ మృత్యుంజయకవి రచించిన ఆరాశ్వాసాలకృతిలో యిమిడివున్నాయి. అయితే యీ ఆరాశ్వాసాలలోనూ వర్ణించబడిన విషయాలను, సంస్కృత నారదీయ మహాపురాణంతో సరిపోల్చి చూస్తే యివి సంస్కృత పురాణంలో ప్రథమ పాదంలోని 41 అధ్యాయాలకు మాత్రమే పరిమితమై వున్నట్లు స్పష్టపడుతున్నది. అయితే బృహన్నారదీయ ఆశ్వాసాంత గద్యలలో "మృత్యుంజయ నామధేయ ప్రణీతంబైన బృహన్నారదీయంబను మహాపురాణంబునందు" అని బృహన్నారదీయం మహాపురాణ గ్రంథంగా విస్పష్టంగా వక్కాణించడం జరిగింది. కాని మృత్యుంజయకవి రచనగా లభించిన ఆరాశ్వాసాల గ్రంథమే సంపూర్ణ గ్రంథం అయ్యేట్లైతే అది సంపూర్ణ నారదీయ మహాపురాణం కాజాలదు. అవతారికలో మృత్యుంజయకవి రచించిన "నేనాంధ్ర భాష రచియింపఁ బూనిన బృహన్నారదీయంబునకు నాఖ్యాయికాప్రకారం బెట్టిదనిన, నిప్పురాణంబునందు వివరింపనైన యవి యాలకింపుడు." అన్న వాక్యం సరిగ్గా మృత్యుంజయకవి రచించినట్లుగా యథాతథంగా వున్నదో? లేదో? చెప్పలేకుండా వున్నాము. కేవలం ఒక మహా పురాణంలోని ప్రథమ పాద విషయానికి మాత్రమే తన అనువాద కృతిని పరిమితంచేసి, దాన్ని సంపూర్ణ మహాపురాణంగా మృత్యుంజయకవి పేర్కొంటాడని మనం భావించలేము. అవతారికలో పేర్కొన్న "నేనాంధ్ర భాష రచింపఁబూనిన" ఇత్యాది వాక్యంలో "నిప్పురాణంబునందుఁ బ్రథమ పాదంబునందలి వివరింపనైన యవి యాలకింపుడు'' అని మృత్యుంజయకవి కేవల ప్రథమ పాద విషయాలను మాత్రమే వివరించాడా! ఆరాశ్వాసాల తరువాత సప్తమాశ్వాస ప్రారంభంలో ద్వితీయపాద విషయాలను యిదేవిధంగా క్రమానుగతంగా అనేకాశ్వాసాలతో కూడిన బృహన్నారదీయపురాణంలో పాదాత్మకంగా విషయాలను విభజించి మృత్యుంజయకవి విషయానుక్రమణికను పేర్కొనదలచాడా! అని అనిపిస్తున్నది. అయితే యీ సందర్భంలో 'ప్రథమ పాదంబునందలి' అన్న పదాలను అసలు మృత్యుంజయకవి బృహన్నారదీయకృతికి ప్రతి వ్రాసిన వ్యక్తులు విడిచిపెట్టి వుంటారని మనం భావించవలసి వుంటుంది. కాని యీ అభిప్రాయానికి వొక విప్రతిపత్తి సైతం లేకపోలేదు. ఒక సంస్కృత మహాపురాణాన్ని తెలుగులోకి

వాఙ్మయ మహోధ్యాతుని

అనువదించదలచిన యే కవియైనా అవతారికలో ఆ మహాపురాణంలోని విషయాలను చెప్పదలిస్తే విభాగాలతోకాని పాదాధ్యాయాలతోకాని, ప్రమేయంలేకుండా మొత్తం మహాపురాణగత విషయాలనన్నింటినీ పేర్కొంటాడే తప్ప, కేవలం ఏకైక పాదానికి పరిమితంకాగల విషయాలను మాత్రమే పేర్కొని అనౌచిత్యానికి పాల్పడతాడా ! అన్నదికూడా ఆలోచించవలసిన విషయమే. గ్రంథగత విషయ వివరణాన్ని చేసినపుడు అవతారికలో గ్రంథవిషయ సర్వస్వాన్ని సమకూర్చినట్లు నన్నయభట్టు ప్రభృతుల భారతాది గ్రంథాలు సాక్ష్యమిస్తున్నాయి. ఏతత్ సాంప్రదాయానికి విరుద్ధంగా మృత్యుంజయకవి నారదీయ మహాపురాణగత విషయాలన్నింటినీ పాదాత్మకాలుగా విభజించి పేర్కొంటాడా ! అన్నది సందేహాస్పదంగా వున్నది. అయితే వొక విషయంమాత్రం నిస్పష్టంగా, వాస్తవంగా ఆశ్వాసాంత్య గద్యలను చూచినపుడు నారదీయ మహాపురాణాన్ని మృత్యుంజయ కవి సుసమగ్రంగా అనువదించాలని అభిప్రాయపడ్డాడని, తన బృహన్నారదీయ పురాణం సంస్కృత నారదీయ మహాపురాణ అనువాద గ్రంథంగానే భావించాడని మనకు తేటతెల్లమౌతుంది. ఈ దృష్ట్యా ప్రథమాశ్వాసగత అవతారికలో పేర్కొన్న విషయాలు సంస్కృత మహాపురాణంలోని ప్రథమ పాదగత విషయాలు మాత్రమే అవడంవల్ల సంప్రదాయభిన్నంగా పాదాత్మకంగా విషయవివరణ చేసి బృహన్నారదీయపురాణాన్ని రచించాలని మృత్యుంజయకవి సంకల్పించి వుంటాడని మనం భావించవలసి వస్తుంది. కాగా మనకు ఉపలభ్యమానమైన తెలుగు బృహన్నారదీయం ఆరాశ్వాసాలకు మాత్రమే-అంటే సంస్కృతంలో నారదీయ మహాపురాణ ప్రథమ పాదానికి మాత్రమే పరిమితమై వున్నందువల్ల మృత్యుంజయకవి నారదీయ మహాపురాణాన్ని పరిపూర్ణంగా అనువదించాడో లేదో చెప్పలేము. మృత్యుంజయకవి పూర్ణానువాదమే చేసివుంటే సప్తమాశ్వాసాదిగా గల గ్రంథం మనకు లభ్యం కాలేదని భావించవలసి వుంటుంది. మృత్యుంజయకవి ఆరాశ్వాసాల తరువాత మిగిలిన భాగాన్ని ఆనారోగ్యాదికారణాలవల్లకాని, అకాల మరణంవల్లకాని విరచించి వుండకపోవచ్చునని ఊహించవలసి వున్నది. అయితే మృత్యుంజయకవి రచించబూనిన ఆరాశ్వాసాల గ్రంథంగా రచించిన బృహన్నారదీయ పురాణం మాత్రం అసలు సంస్కృత నారదీయ మహాపురాణాన్ని, అంటే యిప్పుడు మనకు ముద్రితమై లభ్యమౌతున్న నారదీయమహాపురాణాన్ని అనుసరించి అనువదింపబడిందనడం యదార్థం. ఈ మృత్యుంజయకవి క్రీస్తుశకం 17వ శతాబ్దంలో వున్నట్లు కనిపిస్తున్నది.

అల్లాడు నరసింహకవి కృతమైన తెలుగు నారదీయపురాణం యెనిమిది ఆశ్వాసాలతో 2317 గద్య పద్యాలతో వున్నది. మద్రాసులోని ప్రాచ్య లిఖితపుస్తక

భాండాగారంలో ఆర్. సి. నెం. 547, కె-1-59 గా 8 కాగితపు సంపుటాలలో యీ యెనిమిది ఆశ్వాసాల కృతి 1918 లో తాళపత్ర ప్రతిని చూచి కాపీ వ్రాయడం జరిగింది. కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్తులో సైతం నరసింహా కవి కృతమైన నారదీయ పురాణ తాళపత్రప్రతి వొకటున్నది కాని అది అస మగ్రంగా వున్నది. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భండాగారంలోని 8 సంపుటాలలో వున్న వ్రాతప్రతి ఆధారంగా ప్రస్తుత నారదీయ పురాణం పరిష్కరించి ప్రకటించడం జరిగింది.

నరసింహాకవి కృతమైన యీ నారదీయ పురాణం ముద్రితమైన సంస్కృత నారదీయ మహాపురాణానికి అనువాదం కాదు. నారదీయ ఉపపురాణం మనకు ఉపలభ్యమానం కానందువల్ల నరసింహాకవి కృతమైన యీ నారదీయ పురాణం ఆ ఉపపురాణానికి అనువాద గ్రంథమని దృఢంగా చెప్పలేము. సామాన్యంగా ఉపపురాణాలు తొలుత మహాపురాణాలకు సంగ్రహ స్వరూపంగా అవతరించినవే అయినా వాటిలో అనంతరకాలంలో వివరణాత్మకాలుగా-మూల పురాణాలలో లేనటువంటి విషయాలు - ఆ పురాణాలకు అనంతరకాలంలో అవతరించిన వివిధ విభిన్న శాస్త్రీయాలైన విశేషాలు చొప్పించడం జరిగింది. దీని వల్ల ఉపపురాణాల ప్రామాణికత దెబ్బతిన్నది. మృత్యుంజయ కవి రచించిన బృహన్నారదీయం పూర్వార్థంలోని ప్రథమ పాదానికి మాత్రమే పరిమితమై 41 అధ్యాయాలతో కూడిన సంస్కృత మూలానికి ఆరాశ్వాసాల అనువాద గ్రంథంగా మనకు ఉపలభ్యమానమైనది. నారదీయ మహాపురాణంలో పూర్వార్థమంతా అనువాదం కావాలంటే, మరి మూడు పాదాలు, 84 అధ్యాయాలతోను మొత్తం 9545 శ్లోకాలతో వున్న (ప్రథమపాదం-3229 శ్లో. ద్వితీయ, తృతీయ, చతుర్థ పాదాలు 9545 శ్లో. - అనగా నాలుగు పాదాలలో మొత్తం 12774 శ్లోకాలు వున్నాయి) మిగిలిన భాగం అనువదించవలసి వున్నది. విచిత్రమేమంటే నరసింహా కవి కృతమైన నారదీయ పురాణం 99 పాళ్లు సంస్కృత మూల నారదీయ మహా పురాణంలోని ఉత్తరార్థంలో వున్న కొన్ని విషయాలకు మాత్రమే పరిమితమై సంగృహీతమై వున్నది. అయితే సంస్కృత నారదీయ పురాణంలో పూర్వార్థంలో ప్రథమపాదం చివర వర్ణింపబడిన చతుర్యుగ ధర్మాలలోని కలియుగ ధర్మాలు తెలుగులో కొన్ని వివరింపబడ్డాయి. ఒకవేళ మృత్యుంజయకవి నారదీయ మహా పురాణ పూర్వభాగాన్ని మొత్తం అనువదించి వుంటే, అతని తరువాతి కాలంలోనే వున్న నరసింహాకవి దానికనుబంధంగా ఉత్తరార్థాన్ని పరిగ్రహించి దీన్ని రచించాడా అని సందేహం కలుగుతున్నది. అయితే మృత్యుంజయకవి బృహన్నారదీయ పురాణ రూపంగా అనుసరించిన అనువాద పద్ధతికి, నరసింహాకవి అనుసరించిన

వాఙ్మయ మహోధ్యాయుని

అనువాద పద్ధతికి బొత్తిగా సాజాత్యం కనిపించడంలేదు. మూలపురాణంతో నరసింహకవి నారదీయ పురాణాన్ని పరిపోల్చి చూచినపుడు ఉత్తరార్ధంలో 8వ అధ్యాయం మొదలు 37వ అధ్యాయం వరకూ వున్న రుక్మాంగద చరిత్ర దాదాపు తెలుగులో వర్ణింపబడింది. మిగిలిన మోహినీ సంబంధ వృత్తాంతం - ఆమె గంగాది పుణ్యక్షేత్రాలను సందర్శించిన విషయం తెలుగులో లేదు. అంతేకాక కాశీ ప్రయాగాది పుణ్యక్షేత్రాలలో పిండదాన విధి నిర్ణయం-వివిధ క్షేత్ర మాహాత్మ్యాలూ-గంగాతీరస్థ జగన్నాథ క్షేత్రాది మాహాత్మ్యాలూ యీ అనువాదంలో పరిత్యక్తాలయ్యాయి. భావి కృష్ణావతార చరిత్రాది విషయాలు మాత్రం అత్యంత సంక్షిప్తంగా పేర్కొనబడ్డాయి. సంస్కృత నారదీయ మహాపురాణంలోని పూర్వార్థాన్ని అనువాదంలో పరిగ్రహించాలన్న దృష్టి అసలు నరసింహకవికి వున్నట్లే కనపడదు. అందువల్ల సంస్కృత నారదీయ పురాణం పూర్వభాగంలోగల వివిధ శాస్త్రాది విషయాలూ సృష్టి నిరూపణ ప్రసంగం - భూగోళ వర్ణనం-భరత ఖండోత్పత్తి ప్రాశస్త్య వర్ణనలూ-మొదలైనవి అనేకవిషయాలు యథాతథాలుగా అనూదితాలు కాకపోవడం ఆశ్చర్యకరంకాదు. అయితే సంస్కృత పూర్వార్థంలో వున్న కొన్ని కొన్ని విషయాలు—ఒక క్రమపద్ధతిలో కాకుండా బహువ్యత్యస్తాలుగా విభిన్న ప్రదేశాలలో సంగ్రహంగా ఉటంకించడం జరిగింది. కాని సంస్కృతంలో ప్రథమాధ్యాయంలో వర్ణింపబడిన నారదీయ పురాణానికి మూలభూతాలైన పురాణ మాహాత్మ్య కథనాది విశేషాలు కూడా తెలుగు నారదీయ పురాణ ప్రారంభంలో నరసింహకవి వర్ణించక పోవడంవల్ల అసలు గ్రంథ ప్రాశస్త్యాన్నే విస్మరించి నట్లవుతున్నది. అసలు నారదీయ పురాణ పూర్వోత్తరార్ధాల్నే సంగ్రహపరచి వ్యత్యస్తం చేసి ఇష్టంవచ్చినచోట్ల కొన్నికథలను వివరించి రచించాడో, తనకు లభ్యమైన అసమగ్ర ఉపపురాణం మీద ఆధారపడి యీ నారదీయ పురాణ కృతిని రచించాడో, ఇదమిత్థంగా చెప్పలేము. అయితే నరసింహకవి అనువాద పద్ధతి మాత్రం నన్నయాదుల భారతాది గ్రంథాల అనువాద పద్ధతిలోనే నడచిందని చెప్పవచ్చును. కాని లభ్యమైన సంస్కృత నారదీయ మహాపురాణాన్ని దృష్టిలో పెట్టుకొని చూచినపుడు నరసింహకవి కృతమైన నారదీయ పురాణంలో అసలు సంస్కృత మూలంలో లేనటువంటి అనేక విషయాలు కనిపిస్తున్నవి.

తెలుగు నారదీయపురాణ ద్వితీయాశ్వాసంలో వున్న కల్యాణ తీర్థోత్పత్తి-మహిమ, సుచరిత్రుని చరిత్ర, కనకమాలిని యదుశేఖరుల కథ, యాదవాద్రి వర్ణనం, చతుర్వేది కథ, ఇత్యాది విషయాలు మూల నారదీయపురాణంలో అసలు కనిపించడం లేదు. తెలుగు నారదీయపురాణంలో తృతీయాశ్వాసంలో వర్ణించిన పాషండ మత భేదం, వ్యాఘ్రముఖనరకిరాత సంవాదం, నాళీజంఘుని కథ, తులసీమాహాత్మ్యం, ధర్మ

కేతువుచేసిన నారాయణార్చనా విధానం, విష్ణుచిత్తుని కథ, వ్యాసమాహాత్మ్యం, వంటివి మూల సంస్కృతపురాణంలో కానరావడంలేదు. తెలుగునారదీయపురాణంలో షష్ఠాశ్వాసంలోవున్న వైష్ణవ మతవిషయాలూ, వైకుంఠలోక పంచావరణ వర్ణనాది విషయాలూ, సంస్కృత మహాపురాణంలో కానరావడంలేదు. సప్తమాష్టమాశ్వాసాలలోవున్న ప్రహ్లాదచరిత్రకాని, ప్రసంగవశాత్తూ మధ్యలో వర్ణించబడిన ధ్రువచరిత్ర కాని సంస్కృత మూలంలో కానరావడంలేదు. ఒక వేళ నరసింహకవికి లభించిన సంస్కృత ఉపపురాణ ప్రతిలో యివన్నీ వున్నాయేమో మనం చెప్పలేము. పురాణ ఉప పురాణాలలో భారత, భాగవతాది గ్రంథాలలోవలెనే ఉత్తర, దక్షిణ భారత దేశ ప్రతులలో విభిన్నత్వమున్నట్లు గతంలోనే ఒక సందర్భంలో పేర్కొనడం జరిగింది. ప్రస్తుతం ప్రచురితమై లభిస్తున్న సంస్కృత నారదీయ మహాపురాణాన్ని మృత్యుంజయకవి అనుసరించగా వేరొక దక్షిణాది సంస్కృత పురాణ ప్రతిని నరసింహ కవి అనుసరించి యీ కృతిని రచించాడో యేమో చెప్పలేము. సరైన మూల ప్రతి లభించనప్పుడు యిటువంటి వాటినన్నింటినీ ఉహించి చెప్పవలసిందే కాని సరైన నిర్ణయంచేసి ఇదమిత్థమని తేల్చి చెప్పలేముకదా! ఒక వేళ అతనికి లభించిన మూల గ్రంథంలో వుండివుంటే, అవి అతని స్వకపోలకల్పిత వర్ణనలు కాజాలవు. పాఠక పరిశోధక విమర్శకుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సంస్కృతమూల నారదీయ పురాణ భాగాలను, నరసింహకవి కృత నారదీయ పురాణంలోని ఘట్టాలను కొన్నింటిని తులనాత్మక పరిశీలనా దృష్టితో యీ క్రింద పేర్కొంటున్నాను. వీటిల్లో కొన్ని యథామూలానువాదాలుగానూ, కొన్ని అత్యంత సంగ్రహీతాలు గానూ, మరికొన్ని మధ్యమంగానూ విరచింపబడినట్లు కనిపిస్తున్నాయి.

పాపేంధనస్య ఘోరస్య శుష్కార్ద్రస్య ద్విజోత్తమ ।
కోవహ్నిర్దహతే తస్యతద్భావాన్వక్తు మర్హతి ॥

నాజ్ఞాతం త్రిషులోకేషు చతుర్ముఖసముద్భవః ।
విద్యతే తవ విప్రేంద్ర త్రివిధస్య సునిశ్చితం ॥

అజ్ఞాతం పాతకం శుష్కంజ్ఞాతం చార్ద్రముదాహృతం ।
భావ్యం వాప్యథవాతీతం వర్తమానం వదస్వనః ॥

వహ్నినాకేన తద్భస్మ భవేదేతన్మతం మమ ।

వసిష్ఠోవాచ :

శ్రూయతాం నృపశార్దూలవహ్నినాయేనతద్భవేత్ ॥

భస్మశుష్కంతథార్ద్రంచ పాపమస్యహ్యశేషతః ॥

అవాప్య వాసరం విష్ణోర్యో నరః సంయతేంద్రియః ।
ఉపవాసపరో భూత్వా పూజయేన్మధుసూదనం ॥

సధాత్రీస్నానసహితో రాత్రౌ జాగరణాన్వితః ।
విశోధయతి పాపాని కితవో హి యథా ధనం ॥

(సం.నార. ఉత్తరార్థం-ప్ర. అ-౨౪శ్లో. నుండి ౨౫శ్లో. వరకు)

కం. ఏపున శుష్కార్ద్రములౌ
పాపేంధనకోటులెల్ల భస్మము సేయన్
దీపించు వహ్ని యెయ్యది
తాపస కులనాథ ! తెలుపు దయతో మాకున్.

సీ. మూఁడులోకంబుల మునినాథ ! నీ వెఱుం
గని యది లేదు నిక్కముగఁ ద్రివిధ
కర్మ నిశ్చితము విఖ్యాతమైన జాత
కలుషంబులెంచ శుష్కములు జాత
కలుషంబు లార్ద్రములగా విన్నవించితి
వార్తకెక్క నతీతవర్తమాన
భావికాలోచిత పాపేంధనంబు లే
వహ్నిచే నడఁగుఁ బావన చరిత్ర

తే.గీ. యనిన హరివాసరము నియతాత్మమనుజుఁ
డుపవసించి హరి భజించి యుచితభక్తిఁ
గాంచి నిశినెల్లఁ దామేలుకాంచి ధనము
జూదరియుఁ బోలెఁ బాతకస్తోమమడఁచు.

(తె.నార. చతుర్థాశ్వాసము - 189పుట. 3, 4 ప.)

ఏకాదశీ సమాఖ్యేన వహ్నినా పాతకేం ధనం ।
భస్మతాం యాతి రాజేంద్ర అపిజన్మశతోద్భవం ॥

నేదృశం పావనం కించిన్నరాణాం భూప విద్యతే ।
యాదృశం పద్మనాభస్య దినం పాతక హానిదం ॥

తావత్పాపాని దేహేస్మిం స్తిష్ఠంతిమనుజాధిప ।
యావన్నోప వసేజ్జంతుః పద్మనాభదినం శుభం ॥

మహామథన సారామృతం

అశ్వమేధ సహస్రాణి రాజసూయ శతానిచ ।
ఏకాదశ్యుపవాసస్యకలాం నార్హంతి షోడశీం ॥

ఏకాదశేంద్రియైః పాపం యత్కృతం భవతిప్రభో
ఏకాదశ్యుపవాసేన తత్సర్వం విలయంవ్రజేత్ ॥

ఏకాదశీ సమం కించిత్ పాపనాశం నవిద్యతే ।
వ్యాజేనాపికృతారాజన్నదర్శయతి భాస్కరీం ॥

స్వర్గమోక్షప్రదాహ్యేషా రాజ్యపుత్రప్రదాయినీ ।
సుకలత్రప్రదాహ్యేషా శరీరారోగ్యదాయినీ ॥

(సం. నార. ఉత్తరార్థం-ప్ర. అ-10 నుండి 16 శ్లో.)

వ. వినుము రాజేంద్రా ! ఏకాదశీ సముద్భవానలంబుచే జన్మశతోద్భవంబులైన పాతకేంధనంబులు భస్మంబగు. హరిదివసంబువంటి దివసంబు లేదు. హరి వాసరంబున నుపవసించు తన కనేక దేహంబుల పాపంబులుడుగు. హరివాస రోపవాస షోడశాంశంబునకు నశ్వమేధసహస్రంబులు వాజపేయశతంబులు సమంబులుగావు. హరివాసరోపవాసంబున నేకాదశేంద్రియకృత పాపంబు లన్నియునాశంబునొందు. హరివాసరసమంబుగాఁ బాపంబులవలన రక్షించునది యొక్కటి లేదు. ఒక్కొక్క వ్యాజంబున హరివాసరోపవాస మాచరించి దండధరునిం జూడఁడు. స్వర్గమోక్షప్రదంబును, శరీరారోగ్యకరంబును, సుకళత్ర సుపుత్రలాభకారణంబును నగు. మఱియును,

(తె. నార. చతుర్థాశ్వాసము – 190పుట. 5 వ.)

నగంగా నగయా భూప నకాశీ నచ పుష్కరం ।
నచాపి కౌరవం క్షేత్రం నరేవా నచదేవికా ॥

యమునా చంద్రభాగాచ పుణ్యా భూప హరేర్దినాత్ ।
అనాయాసేన రాజేంద్ర ప్రాప్యతే హరి మందిరం ॥

రాత్రౌ జాగరణం కృత్వా సముపోష్య హరేర్దినం ।
సర్వపాప వినిర్ముక్తో విష్ణులోకేవ్రజేన్నరః ॥

దశైవ మాతృకే పక్షే దశ రాజేంద్ర పైతృకే ।
భార్యయా దశ పక్షేచ పురుషానుద్ధరేత్తథా ॥

ఆత్మానమపి రాజేంద్ర సనయేతద్వైష్ణవం పురం ।
చింతామణి సమాహ్యేషా అథవాపి నిధేస్సమా ॥

వాఙ్మయ మహోధ్యక్షుని

సంకల్ప పాదప ప్రఖ్యాస్తేన వాక్యేన మాధవా ।
ద్వాదశ్యాం యే ప్రపన్నాహి నరా నరవరోత్తమ ॥
తే స్వంద్య బాహావో జంతా నాగరీకృత వాహనాః ।
స్రగ్విణః పీత వస్త్రాశ్చతే యాంతి హరిమందిరం ॥
ఏష ప్రభావోహి మయా ద్వాదశ్యాః పరికీర్తితః ।
పాపేంధనస్య ఘోరస్య పావకాఖ్యో మహీపతే ॥
హరేర్దినం సదోపోష్యం నరైర్ధర్మ పరాయణైః ।
ఇచ్ఛద్భిర్విపులా న్భోగాన్పుత్ర పౌత్రాదికాం స్తథా ॥
హరిదిన మిహమర్త్యోయః కరోత్యాదరేణ
నరవర సతు కుక్షిం మాతురాప్నోతి నైవః ।
బహువృజిన సమేతోఽపి కామతః కామతో వా
వ్రజతిపదమనంతం లోకనాథస్య విష్ణోః ॥

(సం. నార. ఉత్తరార్ధం-ప్ర. అ. 17 నుండి 26 శ్లో.)

కం. కురుగంగా కాశీ పు
ష్కర రేవా వేణికా వికర్తన తనయా
సరయూ గయాది తీర్థము
లరయన్ సరియనఁగఁ దగునె హరిదినమునకున్.

మ అవనీనాయక ! కల్గులోకుల కనాయాసంబునన్ నేఁడు వై
ష్ణవధామంబుపవాస జాగరము లిచ్చంజేయ నేకాదశిన్
సవిశేషంబుగ మాతృపక్ష పితృపక్ష స్వప్రియా పక్ష వం
శవతంసంబులు వార్తగాఁ బదియు మోక్షంబందుఁ దానుందగున్.

కం. ఏకాదశి చింతామణి
యేకాదశి కామధేను వింద్ర మహీజం
బేకాదశి మోక్షప్రద
మేకాదశి వేదమార్గ మేకాదశియే.

శా. ద్వాదశ్యుత్సవ మాచరించు నరుఁడుద్యద్ధ్వోశ్చ తుష్కరంబుతోఁ
గాదేనాహిత దివ్యవాహనముతోఁ గౌశేయ వస్త్రంబుతో
నాదిత్యుల్ గొనియాడ నా హరిపురోదంచన్మణీ వేదికన్
మోదంబందుచునుండు వైష్ణవ సభాముఖ్యుల్ ప్రశంసింపఁగన్.

మహోమధన సారామృతం

కం. హరి వాసరోపవాసాం
తరమున జన్మాంతరములఁ దరలని పాపాం
తరములు జననీ గర్భాం
తర విణ్మూత్రాది లిప్తతయుఁ దొలఁగు ధరన్.

(తె. నార. - చతుర్థాశ్వాసము, 190-191 పుటలు-6 నుండి 10 ప.)

వసిష్ఠ ఉవాచ :-

ఇమమేవార్థముద్దిశ్య నైమిశారణ్య వాసినః ।
ప్రప్రచ్ఛుర్మునయః సూతం వ్యాసశిష్యం మహామతిం ॥

సతుపృష్టో మహాభాగ ఏకాదశ్యాః సువిస్తరం ।
మాహాత్మ్యం కథయామాస ఉపవాస విధిం తథా ॥

తద్వాక్యం సూత పుత్రస్య శ్రుత్వాద్విజవరోత్తమాః ।
మాహాత్మ్యం చక్రిణశ్చాపి సర్వ పాపౌఘ శాంతిదం ॥

పునః ప్రప్రచ్ఛురమలం సూతంపౌరాణికం నృప ।
అష్టాదశ పురాణాని భవాన్ జానాతి మానద ॥

కానీనస్య ప్రసాదేన మహాభారత మప్యుత ।
తన్నాస్తి యన్నవేత్సిత్వం పురాణేషుస్మృతిష్వపి ॥

చరితే రఘునాథస్య శతకోటి ప్రవిస్తరే ।
అస్మాకం సంశయః కశ్చిద్హృదయే సంప్రవర్తతే ॥

తంభవానర్హతి ఛేత్తుం యాథార్థ్యేన సువిస్తరాత్ ।
తిథేః ప్రాంతముపోష్యంస్యాదాహోస్విన్మూలమేవచ ॥

దైవేపైత్ర్యే సమాఖ్యాహి నావేద్యం విద్యతేతవ ।

సౌతిరువాచ :-

తిథేః ప్రాంతం సురాణాంహి ఉపోష్యం ప్రీతివర్ధనం॥

మూలం తిథేః పితౄణాంతు కాలజ్ఞైః ప్రియమీరితమ్ ।

అతః ప్రాంతముపోష్యంహితిథేర్దశ ఫలేప్సుభిః ॥

మూలంహి పితృ తృప్త్యర్థం విజ్ఞేయం ధర్మకాంక్షిభిః ।

(సం.నార.ఉత్తరార్థం-ద్వి.అ. ప్రథమపాదం 1నుండి 10శ్లో.)

వాఙ్మయ మహోధ్యతుని

వ. ఈ ప్రశ్నంబె నైమిశారణ్య వాసులు వ్యాసశిష్యుండగు సూతునిం జూచి మహాభారతంబు మొదలుకొని యష్టాదశ పురాణంబులు నీవెఱుంగనివి లేవు. వేదశాస్త్ర పురాణస్మృతులందు లేనిది యెద్దియును లేదు. కావున సర్వంబును నీ వెఱుంగుదువు. మా హృదయంబుల నింత సంశయంబున్నది. తత్సంశయంబుదీర విస్తరంబున నెఱింగింపు. తిథి ప్రాంతంబున నుపవసింప వలయునో ? తిథి మూలంబున నుపవసింపవలయునో ? అందు దేవ పితృ కార్యంబులకు నుపయోగించిన యవి యెఱింగింపవే యని యడిగిన నా సూతుండు శౌనకాదుల కట్లనియె. తిథ్యంతంబున దేవ పితృహితంబుగా నుప వసింప వలయును. తిథిమూలంబునఁ బైతృకం బాచరింపవలయు.

(తె. నార-చతుర్థాశ్వాసము- 191 పుట. 41 వ.)

పూర్వ విద్ధానకర్తవ్యా ద్వితీయాచాష్టమీ తథా ॥

షష్ఠీచైకాదశీ భూపధర్మ కామార్థలిప్సుభిః ।
పూర్వ విద్ధాద్విజ శ్రేష్ఠాః కర్తవ్యా సప్త మీసదా ॥

ధర్మశ్చ పౌర్ణమాసశ్చ పితుః సాంవత్సరం దినం ।
పూర్వ విద్ధాని మాల స్త్యక్త్వా నరకం ప్రతి పద్యతే ॥

హానించ సంతతే ర్నూప దౌర్భాగ్యం సమవాప్నుయాత్ ।
ఏత చ్ఛృతం మయావిప్రాః కృష్ణద్వైపాయనాత్పురా ॥

ఆదిత్యో దయవేలాయాం యాతో కాపితిథిర్భవేత్ ।
పూర్వ విద్ధాతు మంతవ్యా ప్రభూతానోదయం వినా ॥

(సం.నార.ఉత్తరార్ధ.ద్వి.అ.10శ్లో. నుండి 14 శ్లో.)

ఆ. సాధులా ద్వితీయషష్ఠి యష్టమి భూత
తిథి హరి దివసములఁ దెలిసి పూర్వ
విద్ధమైన దాని విడువనగుఁ ద్రివర్గ
కాంక్షులు పవసింపఁగాదు ధరను.

సీ. వాసిగాఁ బ్రాతి సాంవత్సరీక దశమి
పౌర్ణమాసీ దరశి భవ్యతిథులు
పూర్వ విద్ధములైనఁ బూని సేయఁగఁ దగు
నట సేయకుండిన నతఁడు ఘోర

వ. ఈ ప్రశ్నంబె నైమిశారణ్య వాసులు వ్యాసశిష్యుండగు సూతునిం జూచి మహాభారతంబు మొదలుకొని యష్టాదశ పురాణంబులు నీవెఱుంగనివి లేవు. వేదశాస్త్ర పురాణస్మృతులందు లేనిది యెద్దియునులేదు. కావున సర్వంబును నీ వెఱుంగుదువు. మా హృదయంబుల నింత సంశయంబున్నది. తత్సంశయంబుదీర విస్తరంబున నెఱింగింపు. తిథి ప్రాంతంబున నుపవసింప వలయునో? తిథి మూలంబున నుపవసింపవలయునో? అందు దేవ పితృ కార్యంబులకు నుపయోగించిన యవి యెఱింగింపవే యని యడిగిన నా సూతుండు శౌనకాదుల కిట్లనియె. తిథ్యంతంబున దేవ పితృహితంబుగా నుప వసింప వలయును. తిథిమూలంబునఁ బైతృకం బాచరింపవలయు.

(తె. నార-చతుర్థాశ్వాసము- 191 పుట. 41 వ.)

పూర్వ విద్ధానకర్తవ్యా ద్వితీయాచాష్టమీ తథా ॥

షష్ఠీచైకాదశీ భూపధర్మ కామార్థలిప్సుభిః ।
పూర్వ విద్ధాద్విజ శ్రేష్ఠాః కర్తవ్యా సప్తమీసదా ॥

ధర్మశ్చ పౌర్ణమాసశ్చ పితుః సాంవత్సరం దినం ।
పూర్వ విద్ధాని మాలస్త్యక్త్వా నరకం ప్రతి పద్యతే ॥

హానించ సంతతే ర్నాప దౌర్భాగ్యం సమవాప్నుయాత్ ।
ఏత చ్ఛృతం మయావిప్రాః కృష్ణద్వైపాయనాత్పురా ॥

ఆదిత్యో దయవేలాయాం యాత్రో కాపితిథిర్భవేత్ ।
పూర్వ విద్ధాతు మంతవ్యా ప్రభూతానోదయం వినా ॥

(సం.నార.ఉత్తరార్ధ.ద్వి.అ.10శ్లో. నుండి 14 శ్లో.)

ఆ. సాధులాద్వితీయషష్ఠి యష్టమి భూత
తిథి హరి దివసములఁ దెలిసి పూర్వ
విద్ధమైన దాని విడువవగుఁ ద్రివర్గ
కాంక్షులు పవసింపఁగాదు ధరను.

సీ. వాసిగాఁ బ్రాతి సాంవత్సరీక దశమి
పౌర్ణమాసీ దరశి భవ్యతిథులు
పూర్వ విద్ధములైనఁ బూని సేయఁగఁ దగు
నటసేయకుండిన నతఁడు ఘోర

అల్పాయామథ విప్రేంద్ర ద్వాదశ్యా మరుణోదయే ।
స్నానార్చన క్రియాకార్యా దానహోమాది సంయుతా ॥
త్రయోదశ్యాంహి శుద్ధాయాం పారణే పృథివీ ఫలం ।
శతయజ్ఞాధికం వాపినరః ప్రాప్నోత్యసంశయం ॥
ఏతస్మాత్కారణాద్విప్రాః ప్రత్యూషః స్నానమాచరేత్ ।
పితృతర్పణ సంయుక్తం న స్పృష్ట్వా ద్వాదశీ దినం ॥
మహాహాని కరాహ్యేషా ద్వాదశీలంఘితాన్నృభిః ।
కరోతి ధర్మహరణమస్నాతేవ సరస్వతీ ॥
క్షయే వాప్యథవావృద్ధౌ సంప్రాప్తేవా దినోదయే ।
ఉపోష్యా ద్వాదశీపుణ్యా పూర్వవిద్ధాం వివర్జయేత్ ॥
(సం.నార.ఉత్తరార్థం-ద్వి.అ.21నుండి21శ్లో.)

కం. ద్వాదశి యల్పమయిన నరు
డోదయమున లేచి స్నానహోమార్చన దా
నాదికము సేయఁదగు నా
వేదజ్ఞులకెల్ల ధర్మవృత్తి యెసంగన్.

కం. శుద్ధిఁ ద్రయోదశి సత్కా
రోద్ధతిఁ బారణయొసర్చి యురుధాత్రీ దా
నోద్ధత బలమున్నత య
జ్ఞోద్ధరణబలంబు మనుజుఁ డొందుచునుండున్.

సీ. అదిగాన ద్వాదశి యల్పమయినను స్నా
న పితృతర్పణము లెన్నంగనాడి
జరపి తద్ద్వాదశి సాధింపవలయు సా
ధింపకుండిన మహాదీర్ఘవర్ణ
హానియు నిజధర్మహానియునగు సమ
గ్రముగ నస్నాత సరస్వతి గతి
భూరిదోషంబులు పుట్టిన నణఁగించి
వర్తించు శ్రీహరి వాసరంబు

తే.గీ. నకును ద్వాదశియే మహోన్నత ఫలప్ర
దయగు వృద్ధి దినక్షయాంతరములందు
నపరిమితభక్తి ద్వాదశియందు నుపవ
సింపఁగాఁదగు విద్ధ వర్జింపవలయు.
(తె.నార.చతుర్థాశ్వాసము-192, 193 పుట. 11నుండి 17 వ.)

మహామథన సారామృతం

బ్రాహ్మణ ఉవాచ :—

యదాచ ప్రాప్యతేసూత ద్వాదశ్యాం పూర్వసంభవా ।
తదోపవాసోహికథ కర్తవ్యో మానవైర్వద ॥

ఉపవాసదినంవిద్ధం యదాభవతి పూర్వయా ।
ద్వితీయేఽహ్ని యదానస్యాత్స్వల్పాప్యేకాదశీతిథిః ॥

తత్రోపవాసో విహితః కథం తద్వద సూతజ !

(సం.నార.ఉత్తరార్థం-ద్వి.అ.26నుండి 28శ్లో.)

వ. మఱియు ద్వాదశి పూర్వసంయుతయై యొప్పుచుండు నప్పు డుపవాసంబు నరు లెల్లంజేయవలయుననను నుపవాసదినము పూర్వవిద్ధయై ద్వితీయ దినము నందు లేకయుండిన నేకాదశి యెట్లాచరింప వలయు ననిన సూతుం డిట్లనియె.

(తె.నార.చతుర్థాశ్వాసము-193 పుట. 18 వ.)

యదా నప్రాప్యతే విప్రా ద్వాదశ్యాం పూర్వసంభవం ।
రవిచంద్రార్క జాహంతు తదో పోష్యం పరం దినం ॥

(సం.నార-ఉత్తరార్థం-శ్లో.28, 2వపాదం-నుండి శ్లో.29, 1వ పాదం.)

తే.గీ. ద్వాదశీ దినమునఁ బూర్వవాసరంబు
నందునేనియు సూర్య చక్రార్థ మాత్ర
మొందినను బరదినమున నుపవసింప
యుక్తమైయుండు సజ్జనులుల్లసిల్ల.

(తె.నార. చతుర్థాశ్వాసము-193 పుట. 19 వ.)

బహ్వాగమ విరోధేషు బ్రాహ్మణేషు వివాదిషు ।
ఉపోష్యా ద్వాదశీ పుణ్యాత్రయోదశ్యాంతుపారణం ।

(సం. నార-ఉత్తరార్థం-ద్వి. అ-శ్లో.29, 2వ పాదంనుండి-శ్లో.30 1వ, పాదం)

వ. అనేకాగమ విరోధంబులు నైననేమి? బ్రాహ్మణులు వివాదించిన నేమి? ద్వాదశ్యుపవాసంబునుం ద్రయోదశి పారణయుం జేయవలయు.

(తె. నార.చతుర్థాశ్వాసము-193 పుట. 20 వ.)

ఏకాదశ్యాంతు విద్ధాయాం సంప్రాప్తే శ్రవణేతథా ।
ఉపోష్యా ద్వాదశీ పుణ్యాపక్షయో రుభయోరపి ॥

(సం. నార.ఉత్తరార్థం-ద్వి. అ-శ్లో. 30, 2వ పాదంనుండి శ్లో. 31, 1వ పాదం)

వాఙ్మయ మహోధ్యాయుని

తే.గీ. అరయ నేకాదశి యవిద్ధ యైననేని
శ్రవణమునఁ గూడిపాప సంక్షయ మొసర్చు
నట్టి ద్వాదశి యుపవాస మందవలయు
ఘనతమై శుక్లకృష్ణపక్షముల యందు.

(తె. నార. చతుర్థాశ్వాసము-193 పుట. 21 ప.)

ఏషవో నిర్ణయ ప్రోక్తోయయా శాస్త్ర వినిర్ణయాత్ ।
కిమన్య చ్ఛ్రోతు కామాహి తద్భవంతో బృవంతుమే ॥

ఋషయః ఊచుః :—

యుగాదీనాం వద విధిం సౌతేసమ్యగ్యథాతథం ॥

(సం. నార. ఉత్తరార్థం—శ్లో. 31. 2వ, పాదంనుండి శ్లో. 32 వరకు)

వ॥ ఏకాదశీ ద్వాదశీ నిర్ణయంబు తెలిపితి మఱియుం దెలియ వలయునవి యడుగుం డనిన ఋషులు యుగాది నిర్ణయంబడిగిన సూతుండిట్లనియె.

(తె. నార. చతుర్థాశ్వాసము-193 పుట. 22 వ.)

సౌతిరువాచ:—

ద్వేశుక్లే ద్వేతథా కృష్ణేయుగాద్యాః కవయో విదుః ।

శుక్లే పూర్వాహ్ణికేగ్రాహ్యా కృష్ణేగ్రాహ్యా పరాహ్ణికే ।
అయనం దిన భాగధ్యం సంక్రమః షోడశః ఫలః ॥

పూర్వేతు దక్షిణేభాగే వ్యతీతే చోత్తరోమతః ।
మధ్యకాలేతు విషువేత్వతయాపరికీర్తితా ॥

జ్ఞాత్వా విప్రాస్థితిం సమ్యక్సాంవత్సర సమీరితాం ।
కర్తవ్యో హ్యుపవాసస్తు అన్యథా నరకం వ్రజేత్ ॥

పూర్వ విద్ధాం ప్రకుర్వాణోనరో ధర్మం నికృంతతి ।
సంతతేస్తు వినాశాయ సంపదాం హరణాయచ ॥

ఫలవేధేపి విప్రేంద్రా దశమ్యా వర్జయేచ్ఛివాం ।
సురాయా విందునాస్పృష్టం యథాగంగా జలంత్యజేత్ ॥

శ్వహతం పంచగవ్యంచ దశమ్యా దూషితాంత్యజేత్ ।
ఏకాదశీం ద్విజ శ్రేష్ఠాః పక్షయోరుభయో రపి ॥

పూర్వవిద్ధా పురాదత్తా సాతిథిర్యదుమౌలినా ।
దానవేభ్యో ద్విజశ్రేష్ఠాః ప్రీణనార్థం మహాత్మనాం ॥

అకాలే యద్ధనం దత్తమపాత్రేభ్యో ద్విజోత్తమాః ।
సంక్రుద్ధైరపి యద్దత్తం యద్దత్తం చాప్యసత్కృతం ॥

పూర్వ విద్ధతి థౌదత్తం తద్దత్తమసురేష్వథ ।
యదుచ్ఛిష్టేన దత్తంతు యద్దత్త పతితేష్వపి ॥

స్త్రీజితేషుచ యద్దత్తం యద్దత్తంజలవర్జితం ।
పునఃకీర్తన సంయుక్తం తద్దత్తమసురేష్వవై ॥

తస్మాద్విప్రానకర్తవ్యా విద్ధాప్యేకాదశీతిథిః
యథాహంతిపురా పుణ్యం శ్రాద్ధంచ వృషలీపతిః ॥

దత్తం జప్తం హుతం స్నాతంతథాపూజాకృతాహరే
తిథౌ విద్ధేక్షయంయాతి తమః సూర్యోదయేయథా ॥

జీర్ణం పతింయౌవన గర్వితాయథా
త్యజంతినార్యో ఝషకేతునార్దితాః ।

తథాహివేదం విబుధాస్త్యజంతి
తిథ్యంతరం ధర్మ వివృద్ధయే సదా ॥

(సం. నార. ఉత్తరార్థం. ద్వి. అ. శ్లో. 33, 2 వ పాదం నుండి శ్లో. 46 వరకు)

సీ. అనఘాత్ములార ! యుగాదులు శుక్ల ప
క్షమునందుఁ గృష్ణపక్షమునందు
రెండు రెండఁగ వర్తిల్లు వైశాఖ శు
క్ల తృతీయయుం గార్తిక సితపక్ష
నవమి నభస్య కృష్ణ త్రయోదశి మాఘ
పంచదశమియును బావనములు
గ్రాహ్యంబు శుక్లపక్షమునఁ బౌర్వాహ్ణిక
మాపరాహ్ణికము గ్రాహ్యంబు కృష్ణ

తే.గీ. పక్షమున నయనము దినభాగకంబు
సంక్రమణము షోడశాంశంబునదియె
నిదియెఱింగి బుధోత్తము లెల్ల సకల
దానములు సేయవలయు ననూన మహిమ !

వాఙ్మయ మహోధ్యక్షుని

తే.గీ. ఉత్తరాయణ ముడిగి సూర్యుండు వేగ
దక్షిణాయనమున కేఁగు తఱి మెలంగు
మధ్యకాలంబు విషమమై మహిఁ జెలంగు
నదియె ముక్తక నామధేయము వహించు.

మ. తిథి సాంవత్సరికోపదేశమున బుద్ధింజాల శోధించి సు
ప్రథిత శ్రీ నుపవాస మున్ననగు ధర్మంబున్ శుభంబున్ మనో
రథముల్ సద్గతులున్, మహాదురిత చర్యంబూర్వ సంవిద్ధయౌ
తిథియందే యుపవాసమున్నఁగలదే తేజంబు పుణ్యస్థితుల్.

తే.గీ. ఉత్తమోత్తమమైన గంగోదకంబు
నందు సురబిందు మాత్రంబునందెనేని
యతి పవిత్రంబుగాని యట్లయ్యె దశమి
హరి దినమునఁ గళా మాత్రమంటెనేని.

ఆ. ఉభయ పక్షముల మహోత్తముండగు కుశ
కేతుఁ డఖిల దనుజజాతి యాత్మఁ
బొంగి సన్నుతింపఁ బూర్వ విద్ధము లైన
తిథుల నుపవసింపఁ దెలిపె మున్ను.

సీ. తర్కింపఁగ నకాలదత్తమ పాత్ర ద
త్తంబసత్కాల దత్తంబు క్రోధ
దత్తంబు పూర్వ విద్ధతిథి దత్తంబును
చ్ఛిష్ట దత్తంబును క్రీతజనైక
దత్తంబు పతిత దత్తంబేక వస్త్రతా
దత్తంబు జలవరదత్త మగ్ర
కీర్తన దత్తంబు కేవలాసురజన
ప్రీతికరంబు ధాత్రీస్థలమున

తే.గీ. నట్లుగావున విద్ధమౌ హరిదినమున
నుపవసించినఁ బూర్వపుణ్యోత్కరంబు
లణఁగు వృషలీపతి యొనర్చినట్టి శ్రాద్ధ
కర్మమును బోలె సకల లోకములు నెఱుఁగ.

తే.గీ. చక్రధరనామ కీర్తన స్తవన భజన
జప్తదత్త వ్రాతస్నాత సవన ముఖ్య
ములును బోవుఁ దిథిని వేధమున మహోద్భ
టాంధతమసంబు సూర్యోదయమునఁ బోలె.

మహామథన సారామృతం

కం. ముదిసిన మగనిన్ యౌవన
మదవతులైయున్న సతులు మనసిజకేళిన్
గదియని యట్లనె వేదా
స్పదమగు తిథియందు ధర్మసంఘము దొలఁగున్.

(తె.నార.చతుర్థాశ్వాసము-194,195 పుటలు. 23నుండి 30 ప.)

ఋషయః ఊచుః :—

విస్తరేణ సమాఖ్యాహి విష్ణోరారాధన క్రియాం ।
యయాతోషం సమాయాతి ప్రదదాతి సమీహితం ॥

లక్ష్మీభర్తా జగన్నాథోహ్యా శేషాఘౌఘనాశనః ।
కర్మణాకేన సప్రీతో భవేద్యః సచరాచరః ॥

సౌతిరువాచ :—

భక్తిగ్రాహ్యో హ్యృషీకేశోనధనైర్ధరణీధర ।
భక్త్యా సంపూజితో విష్ణుః ప్రదదాతి మనోరథం ॥

తస్మాద్విప్రాః సదాభక్తిః కర్తవ్యాచక్రపాణినః ।
జలేనాపి జగన్నాథః పూజితః క్లేశహాభవేత్ ॥

పరితోషం వ్రజత్యాశు తృషితస్తుజలైర్యథా ।
అత్రాపిశ్రూయతే విప్రా ఆఖ్యానం పాపనాశనం ॥

రుక్మాంగదస్య సంవాద మృషిణా గౌతమేనహి

(సం.నార.ఉత్తరార్థం-న్వ.అ. 1వ శ్లో. నుండి 6వ శ్లో.1 పాదంవరకు)

వ. అనిన విని ఋషులు శ్రీ భగవదారాధనక్రియ విస్తరంబున నెఱింగింపు మెందున హరి ప్రసన్నుండై సమీహితంబులిచ్చుననిన సూతుండు భక్తియే ప్రధానంబు. భక్తియుక్తుండై జడుండేని భగవంతుం బూజించినఁ గ్లేశంబు లణంగు తృష్ణ నొందినవాఁడు జలంబునఁ దృప్తుండైన కరణిఁ బూజించిన మాత్రనె హరి పరితోషంబు నొందు నిందునకుఁ బాపనాశనం బగు. ఋషి గౌతమ సంవాదంబు నందునైన రుక్మాంగదోపాఖ్యానంబు విన్నవించెద వినుండు.

(తె.నార.చతుర్థాశ్వాసము-195 పుట. 31వ.)

వాఙ్మయ మహోధ్యక్షుని

## నారదీయపురాణ కృతికర్త వంశాదికం-కాలం

అసాధారణమైన ఒకానొక విశిష్టతగల తెలుగు కృతిగా నారదీయ పురాణాన్ని విరచించిన అల్లాడు నరసింహకవి ఈ క్రింది పద్యాలలో తన వంశాది విశేషాలను వర్ణించాడు.

శ్రీమద్వేద మయాంగు శోభనకళా శృంగార లీలా మహో
ద్దామున్ శ్రీరమణీ మనోహర హయోత్తంసంబు, సమ్యక్పురా
ణామోఘార్థ శుభాంజనంబుఁ బతగాధ్య క్షోత్తముంగన్న యా
ధీమద్గ్రామణి కశ్యపాహ్వయుఁడు కీర్తిన్ మించె లోకంబులన్.

తద్వంశంబున

కరుణాకర మంత్రీంద్రుఁడు
కరుణా వరుణాలయుండు గంభీరుండా
తరుణార్క దివ్యతేజుం
డరుణానుజ రాజరాజితాత్ముఁడు గలిగెన్.

ఆ మహామహుభార్య విఖ్యాతచర్య
సారగుణధుర్యయైన నాంచారు చారు
భాగ్య సౌభాగ్యకీర్తి యాపద్మసద్మ
సద్మముననుండి కావించె సద్వ్రతముల.

రామానుజాచార్య రత్నకల్పిత చతు
స్సింహాసనస్థసుశ్రీ భజించి
యుభయ వేదాంత మహోన్నత సాత్వికా
చారలక్షణ సత్ప్రశస్తిఁగాంచి
శ్రీకృష్ణపూజా విశేషలబ్ధ సమస్త
సౌశీల్యగరిమచేఁ జాలమించి
ప్రాక్తన దివ్య ప్రబంధాను సంధాన
సంతత మహిమఁదేజము వహించి

వెలసె వైష్ణవ మాత్రుఁడె విబుధకోటి
యాశ్రయింపంగ సద్భక్తి నాదరించె
సిరులనల్లాడు చెన్నప్ప శ్రీకరంపు
భావభావుక కీర్తి ప్రపన్నమూర్తి.

మా జనకుఁడు చెన్నప్పర
మా జనక గభీరతా సమగ్రత మించెన్
రాజోత్తములున్ వైష్ణవ
రాజోత్తములున్ నుతింపఁ బ్రజ్ఞాశక్తిన్.

మహామథన సారామృతం

అంబకుజోడు పంచవిశిఖాంబకుజోడు విదేహరాజజా
తాంబకుజోడు సాయకశయాంబకుజోడు పతంగలోక రా
జాంబకుజోడు మజ్జననియై భువనంబుల మించినట్టి కృ
ష్ణాంబ గుణావలంబ విబుధావళినేలు భళీభళీయనన్.

లక్ష్మిసమాఖ్యయా లలనతో గృహమేధి
భావంబుచేఁ జాలఁ బ్రబలినాఁడఁ
గవిత వైభవులు సింగన్న యనంతుండు
నాదిగా పుత్రుల నందినాఁడ
శోభితాప స్తంభ సూత్ర పవిత్ర కీ
ర్తిస్ఫూర్తిచే వర్తిల్లినాఁడ
నఖిలవైష్ణవరహస్యార్థోపదేశంబు
లనుపమభక్తిమై నందినాఁడ

నందనందన పూజనందవార్ధి
నోలలాడుచు సద్గోష్ఠినున్నవాఁడ
సూరిమాన్యుండ నల్లాడు నరసింహ
నామకుఁడ సంతతగురు ప్రణామకుండ.

ఈ పై పద్యాల ననుసరించి నారదీయపురాణ కృతికర్తయైన అల్లాడు నరసింహాకవి వంశం ఈ క్రింది విధంగా అవతరించినట్లు అవగతమవుతున్నది.

కశ్యపుడు
|
కాశ్యప వంశం
ఆ వంశంలో
|
అల్లాడుమంత్రి—నాంచారు (భార్య)
|
చెన్నప్ప—కృష్ణాంబ (భార్య)
|
నరసింహాకవి—లక్ష్మి (భార్య)
|
సింగన్న　అనంతుడు　ఇంకా మరికొందరు పుత్రులు.

వాఙ్మయ మహోధ్యమని

నరసింహకవి తాతయైన మంత్రి ఉదారశీలుడుగాను, దయామయుడుగాను, అతని భార్యయైన నాంచారు గొప్పవ్రతశీలిగాను వర్ణించబడింది. నరసింహకవి తండ్రియైన చెన్నప్ప మహాపండితుడై శ్రీకృష్ణభక్తుడై ఉభయవేదాంత మహాసారలక్షణ లక్షితుడై రామానుజాచార్య రత్నమయ చతుస్సింహాసనా ప్రవృద్ధకారకుడై ప్రాక్తన దివ్యప్రబంధానుసంధాన నిరంతర మహిమకలవాడై వైష్ణవులలో అగ్రగామిగా మహాకీర్తి వహించాడట. చెన్నప్ప సతీమణి కృష్ణాంబ మహాసౌందర్యవతియై సద్గుణ శోభితగా విద్వాంసురాలుగా అనేక ప్రశంస లందుకున్నదట.

లక్ష్మీనరసింహకవి దంపతులకు సింగన్న, అనంతుడు మొదలైన పుత్రులు కలిగారట. వీరికెందరు పుత్రులుగలిగారో వారందరినీ పేర్కొనలేదు. సింగన్న, అనంతుల నామాలు రెండు మాత్రమే పేర్కొన్నాడు. తన పుత్రులు సైతం కవితా వైభవులుగా చాటుకున్నాడు. శ్రీకృష్ణభక్తుడు. అనుపమమైన భక్తితో సమస్త వైష్ణవ రహస్యార్థాల నన్నింటినీ గురువులద్వారా ఉపదేశంపొందిన పండితుడు. ఈ నరసింహకవి తనది ఆపస్తంభ సూత్రంగా పేర్కొన్నాడు. నరసింహకవి యింటిపేరు "అల్లాడు" వారుగా కొన్నిచోట్ల "అల్లాడ" వారుగా మరికొన్ని చోట్ల కనిపిస్తున్నది. నరసింహకవి తన కవితా పాండితీ బహుముఖ ప్రతిభలకు మూలకారకులైన తన గురువు కొండమాచార్యులగురించి వారి వంశం గురించి ఈ క్రింది పద్యాలు విరచించాడు.

ఏదేశికాధీశుఁ డిద్ధ బుద్ధి స్ఫూర్తి
బ్రహ్మరాక్షసుల శాపంబణంచె
నేదేశికోత్తముఁ డెదిరించి నిలిచిన
శక్తికిఁ జక్రాంక శక్తి యొసఁగె
నేదేశి కాధ్యక్షుఁడేక శిలాపురి
నిజమతంబంతయు నిర్వహించె
నేదేశిక శ్రేష్ఠుఁడాదియై రామాను
జా చార్య విజయ ధ్వజాంకమయ్యె

నతఁడు వైష్ణవ వీరసింహాసనస్థుఁ
డుభయ వేదాంత విద్యామహోన్నతుండు
శుద్ధసాత్విక ధర్మ ప్రసిద్ధ కీర్తి
శాలి కంచర్ల కేశవార్యమౌళి.

తద్వంశంబున

సిరులన్ సద్గురు శేఖరుం డనఁగ మించెన్ గొండమార్యుఁ డా
హరియే యీ ఘనుడంచు శిష్యవరు లాత్మాయత్తులై కొల్వఁగా
వర వేదాంత రహస్యవేదియు భరద్వాజర్షి గోత్రాబ్ధి భా
సుర శీతాంశుఁడునై ప్రసిద్ధి వెలసెన్ సూరుల్ ప్రశంసింపఁగన్.

ప్రాచీన కాలంలో కంచర్ల కేశవాచార్యుడనే వైష్ణవ మతస్థుడైన మహాను భావుడు మంత్రోపాసనార్చనా బలంతో, విష్ణుమహిమతో ఉభయ వేదాంత విద్యా మహోన్నతుడై వీర వైష్ణవ పీఠాధిపుడై ప్రఖ్యాతి వహించాడట. బ్రహ్మ రాక్షసుల్ని శాపంతో అణచాడట. ఈ సందర్భంలో నరసింహకవి వ్రాసిన "ఏదేశికాధీశుఁడిద్ధ బుద్ధి స్ఫూర్తి బ్రహ్మరాక్షసుల శాపంబణంచె" అన్నపాదానికి బ్రహ్మరాక్షసులను శాపంతో అణచాడనీ, బ్రహ్మరాక్షసులను శాప విముక్తులుగా చేశాడనీ రెండు విధాలుగానూ అర్థం చెప్పవచ్చును. కేశవాచార్యుడు తన్నెదురొడ్డి నిలిచిన ఒకానొక శక్తిని సైతం లొంగదీసుకొని చక్రాంకితాలు వేశాడట! వరంగల్లును వైష్ణవ మతమయంగా మార్చి తన హస్తగతం చేసుకొని రామానుజా చార్యుని విజయధ్వజాంకంగా నిలిచాడట! ఈ కేశవాచార్యుని వంశంలో భరద్వాజ గోత్రికుడై సాక్షాత్తు శ్రీహరియే యీ కొండమాచార్యులుగా అవతరించాడు అని శిష్యవరులు కొలువగా వేదాంత రహస్యజ్ఞుడై యెంతో కీర్తి వహించాడట. ఈ కొండమాచార్యులే ప్రస్తుత నారదీయపురాణ కృతికర్తయైన అల్లాడు నరసింహ కవికి గురువు. ఈ కొండమాచార్యులు కీర్తిశేషులైన తరువాతనో సజీవులై వుండగనేనో ఒకనాడు నరసింహకవికి స్వప్నంలో కనిపించి నారదీయ సాత్త్విక పురాణాన్ని లోకోపకారార్థంగా ఆంధ్రభాషలో విరచించి శ్రీకృష్ణుని కంకిత మీయవలసిందిగా ఆజ్ఞాపించాడట. తదాజ్ఞమేరకు శ్రీకృష్ణాంకితంగా ఈ నారదీయ పురాణాన్ని నరసింహకవి రచించాడు.

నరసింహకవి సంస్కృత కవులలో క్రీస్తుశకం 11వ శతాబ్దంలో వున్న జయ దేవకవిని సంస్తుతించాడు. తెలుగు కవుల్లో ప్రత్యేకించి కవిత్రయాన్ని మాత్రమే ప్రస్తుతించాడు. కవిత్రయంలో మూడవవాడైన ఎఱ్ఱాప్రగడ క్రీ. శ. 13వ శతాబ్ది లోని వాడు, కాబట్టి మన ఈ అల్లాడు నరసింహకవి క్రీస్తుశకం 13వ శతాబ్దికి తరు వాతి వాడేనని దృఢంగా చెప్పవచ్చును.

కవి ప్రారంభంలో ఇష్టదేవతాస్తుత్యాదికం చేస్తూ శ్రీకృష్ణుణ్ని-రుక్మిణీదేవిని-ఆదిశేషునును- చింతామణిని- పంచాయుధుని- విడివిడి పద్యాలలో కీర్తించాడు.

వాఙ్మయ మహోధ్యాయుని

ద్రావిడ వేదానికి మూలకర్తయైన పరాంకుశ మహాయోగిని - భాష్యకారాది ఆచార్యవర్యులను ఒక సీసపద్యంలో నుతించాడు. అనంతరం రామాయణ భారత కర్తలైన వాల్మీకి వ్యాసులను ఒక పద్యంలో నుతించి, కాళిదాసు - భవభూతి-మురారి-మయూర-బాణ-శంకర-జయదేవ-మాఘ ప్రభృతులైన సంస్కృత కవి వర్యులను వేరొక పద్యంలో ప్రస్తుతించాడు. తరువాతి పద్యంలో తెలుగులో కవి త్రయంగా ప్రసిద్ధివహించిన నన్నయ-తిక్కన-ఎఱ్ఱనలను నుతించి వేరొకపద్యంలో కుకవులను ఘోర ఘూకోత్కారాలుగా తిరస్కరించాడు. నరసింహకవి నారదీయ పురాణాన్ని ఎనిమిదాశ్వాసాల గ్రంథంగా విరచించాడు. ప్రథమాది అష్టమాశ్వాసాంత్యపర్యంతం ఆయా ఆశ్వాసాలపరంగా ఈ క్రింది విధంగా వచనాలు పద్యాలు వున్నాయి.

ప్రథమాశ్వాసం— 516
ద్వితీయాశ్వాసం—252
తృతీయాశ్వాసం—189
చతుర్థాశ్వాసం— 354
పంచమాశ్వాసం—235
షష్ఠాశ్వాసం— 264
సప్తమాశ్వాసం—230
అష్టమాశ్వాసం—277

మొత్తం నారదీయ పురాణంలో అవతారికా పద్యాలతో సహా కలిపి మొత్తం 2317 పద్యాలు వచనాలు వున్నాయి.

నారదీయపురాణం అష్టాశ్వాస సంభరితమే కానీ వాస్తవానికి కేవల నారదీయ పురాణానికి సంబంధించిన గ్రంథం ఏడాశ్వాసాలు పైగా మాత్రమే వున్నది. ప్రథమాశ్వాసంలో వున్న మొత్తం 516 పద్య గద్యాలలోను ఇష్టదేవతాస్తుత్యాదికాలుగా 24 పద్య గద్యాలను, నారదీయపురాణ కథా ప్రారంభాదిగా వున్న మొత్తం 36 పద్య గద్యాలను తొలగిస్తే మిగిలిన 456 పద్యగద్యాలలో నారదీయ పురాణ కృతిపతియైన శ్రీకృష్ణ చరిత్రను అతిలోక కవితా వైభవంతో వర్ణించడం జరిగింది.

"ఆ మహాగురు శిఖామణియొక్కనాఁడు స్వప్నంబున నన్నుఁగరుణించి నారదీయ సాత్త్విక పురాణంబు లోకోపకారార్థంబుగా నాంధ్రభాష రచియించి

మహామథన సారామృతం

శ్రీకృష్ణాంకితంబు సేయుమని యానతిచ్చిన మేల్కాంచి కృష్ణభగవంతుని మనంబున నిడుకొని రచియింపంబూనితిఁ దదవతార క్రమంబెట్టిదనిన" అని నరసింహాకవి కృష్ణావతార క్రమాన్ని 456 పద్యాలలో దాదాపు ప్రథమాశ్వాసం తుదివరకూ అత్యంత మధురమై మంజులమైన కవితతో వర్ణించాడు. "మథురాపురవర్ణన-శ్రీకృష్ణ జననము- శ్రీకృష్ణలీలలు, దుష్టసంహారము- శ్రీకృష్ణుఁడు దావాగ్నిని గ్రోలుట-వర్షాగమము-వసంతాగమము-గోపికావిహారము-నందుఁ డేకాదశి నుపవసించుట-అక్రూరుఁడు యమునాజలముల రామకృష్ణులఁ గాంచుట-శ్రీకృష్ణుఁడు కంసుని సంహరించుట-శ్రీకృష్ణుఁ డుద్ధవుని గోపికలకడకంపుట-శ్రీకృష్ణుఁడు జరాసంధ కాలయవనుల జయించుట-శ్రీకృష్ణుఁడు రుక్మిణీ సత్యభామల పరిణయ మాడుట-నరక సంహారము, పారిజాతాపహరణము - ప్రద్యుమ్న వృత్తాంతము-శ్రీకృష్ణుఁడు బాణాసురుని నోడించుట-నృగమహారాజు వృత్తాంతము, పౌండ్రక వాసుదేవుఁడు - కౌరవ పాండవ సంబంధము-కుచేలోపాఖ్యానము-శ్రీకృష్ణుఁడు వృకాసురుని బంధించుట-అర్జునుఁడు సుభద్రఁగొంపోవుట-ద్వారకలో శ్రీకృష్ణుని జీవితము." అన్న వివిధ శీర్షికలతో శ్రీకృష్ణుని అవతార విశేషాలను వర్ణించాడు. అనంతరం కృతిపతియైన శ్రీకృష్ణ సమర్పణంగా ఐదు షష్ఠ్యంతాలైన కంద పద్యాలను రచించి, అసలు నారదీయ పురాణంలో "మునులు నారాయణుని దర్శించడం"తో కథా ప్రారంభం చేశాడు.

నన్నెచోడుడు మొదలుకొని అనేకమంది కవులు యీ షష్ఠ్యంతాలు ప్రయోగించారు- అయితే కొందరు సార్థకంగా షష్ఠ్యంతాల పుట్టుకను దృష్టిలో పెట్టుకొని ప్రయోగించగా మరికొందరు నిరర్థకంగా ప్రయోగించారు.

## షష్ఠ్యంతాల చరిత్ర

శ్రీకృష్ణాంకితమైన యీ నారదీయ పురాణంలో నరసింహాకవి అత్యంత సార్థకంగా షష్ఠ్యంత కందపద్యాలు విరచించాడు. ప్రాచీనకవు లనేకమంది తమ కావ్యాలలో షష్ఠ్యంతాలు రచించారు గాని అవన్నీ సార్థకాలుగా విరచించారన డానికి అవకాశం లేదు. 1960 వ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి మాసాలలో కర్నూలు ఉస్మానియా కళాశాలలో నన్నయ వర్ధంతి సందర్భంగాను-ఉస్మానియా విశ్వవిద్యాలయం కళాశాలల దశమాంధ్ర అభ్యుదయోత్సవాల సందర్భంగానూ నన్నయ భారతరచనలో ఉన్న వైశిష్ట్యాన్ని గురించి ఉపన్యసిస్తూ షష్ఠ్యంతాల గురించి కొన్ని మాటలు చెప్పాను. నన్నయ కవితా విషయిక ప్రసంగానికే యెక్కువ అవకాశం ఉన్న ఆ సభలో షష్ఠ్యంతాల చరిత్ర విషయమై సామాన్యం

గాను సూక్ష్మంగాను ప్రస్తావించాను. అప్పటి నా ఉపన్యాసాల సారాంశం జనవరిలో ఆంధ్రప్రభ ప్రచురింపగా నేను షష్ఠ్యంతాలపై సామాన్యంగా వెలువరించిన భావాలు ఈ క్రింది రూపం దాల్చినాయి.

—"ఎకాడమీ బహుమానం పొందిన వేదం వెంకటరాయశాస్త్రిగారి కుమారసంభవ విమర్శలో నన్నెచోడుడు తిక్కనకు పైతం తర్వాతి వాడని కేవలం షష్ఠ్యంతాల మీదనే ఆధారపడి వ్రాయడం జరిగింది. ఇది కేవలం షష్ఠ్యంతాల చరిత్రను గమనించకపోవడం వల్లనే జరిగిం దనుకుంటాను. కేశవాయ నమః నారాయణాయ నమః మాధవాయ నమః ఇత్యాదిగాఉన్న కేశవనామాలను ఆధారం చేసుకునే తెలుగులో షష్ఠ్యంతాలు వెలిశాయి. సంస్కృతంలో చతుర్థ్యంతాలుగా ఉన్న పదాలు తెలుగులో సహజంగా షష్ఠ్యంతవిభక్తి కువర్ణాంతాలుగా ఉంటాయి.

తెలుగులో రామునికొరకు సీతనిచ్చెను అనడం అస్వాభావికం. రామునికి సీతనిచ్చెననడమే స్వాభావికంగా ఉంటుంది. అందువల్ల కేశవనామాల్లో ఉన్న చతుర్థీ విభక్తులను అనుసరించి తెలుగుకు స్వాభావికమైన షష్ఠీవిభక్తి కుప్రత్యయ ప్రయోగంతో షష్ఠ్యంతాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ షష్ఠ్యంతాలు కేశవనామాల వలెనే మొదట దైవపరంగా—అంటే—కావ్యాన్ని దేవునికే అంకితమిచ్చినప్పుడే యీ షష్ఠ్యంతాలు ఉపయోగింపబడేవి అని అనిపిస్తుంది. దైవపరంగా ఉపయోగింపబడే యీ షష్ఠ్యంతాలను మానవపరంగా చేసిన మొదటికవి నన్నెచోడుడే. నన్నెచోడుడు తన గురువైన మల్లికార్జునుని దేవుడుగా భావించాడు. శివుడికి మల్లికార్జునుడికి అభేదంచేసి తన కావ్యాన్ని గురువుకే అంకితమిచ్చి దేవునికిచ్చినట్లే సంతృప్తి చెందాడు. దేవుడికి తన గురువుకి అభేదం చేసినందువల్ల దైవపరంగా వాడబడుతున్న షష్ఠ్యంతాలను తన గురుపరంగా కూడా వాడినాడు. ఇలా మానవపరంగా వాడబడిన కుమారసంభవంలోని షష్ఠ్యంతాలను చూచే తిక్కన ఉత్తరరామచరిత్రలో మనుమసిద్ధికి షష్ఠ్యంతాలు వేశాడు. నన్నయ్య భారతాన్ని రాజరాజుకి వినిపించినట్లు వ్రాసినాడే కాని అంకితమివ్వలేదు. అసలు నన్నయ తన భారతాన్ని ఎవ్వరికీ అంకిత మివ్వలేదు. అందువల్ల భారతంలో షష్ఠ్యంతాలు వెయ్యవలసిన అవసరం కనిపించలేదు—" (భారతరచనలో వెల్లివిరిసిన నన్నయ కవితాప్రాభవం—ఆంధ్రప్రభ దినపత్రిక. 1960 జనవరి 10.)

సామాన్యంగా చెప్పిన యీ షష్ఠ్యంతాల విషయమైన పై వాక్యాలు చూచి వాటిలోని భావాలకే చిలువలు పలువలు చేర్చి అసంబద్ధాలైన అనేక విషయాలతో కూడిన ఒక వ్యాసం "షష్ఠ్యంతముల పుట్టు పూర్వాలు" అన్న శీర్షికతో భారతిలో ప్రచురింప బడింది. యీ వ్యాసకర్త ఆంధ్రప్రభలోని పై వాక్యాలు చూచినట్లు

తన వ్యాసంలో పేర్కొనకపోయినా యీ రెండూ చూచినవారికి వస్తుస్థితి బోధ పడకుండా ఉండదు. నిజానికి "షష్ఠ్యంతముల పుట్టుపూర్వాలు" అన్న శీర్షికతో వెలువడిన యీ వ్యాస విషయాలు అసలు షష్ఠ్యంతాల చరిత్రను ప్రాచీన కావ్యాల కృత్యవతారికా విషయాలను వెల్లడించలేదు సరిగదా వాస్తవ విషయాలకు దృగ్గోచర మవుతున్న పరమసత్యాలకు విరుద్ధాలుగా వెలువడడం విచారనీయమైన విషయం.

నా ఉపన్యాస వాక్యాల సారాంశంగా నాటి ఆంధ్రప్రభలో వెలువడిన వాక్యాలు అతిసామాన్యమైనవి. అంతకు మించి షష్ఠ్యంతాల చరిత్ర గురించి మనం గమనించవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. వాస్తవ విషయాలన్నిటినీ కూలంకషంగా విమర్శించి నిగ్గును తేల్చి యీ క్రింది విషయాలు వెల్లడించాను.

"నన్నెచోడుడు తన కుమారసంభవమును భక్తితో గురువగు మల్లికార్జుననకు అంకితము గావించినాడు. కాని నన్నయవలె విన్పింపలేదు. ఇట్లనుటచే మల్లికార్జునునకు కుమారసంభవము బొత్తిగా వినిపింపలేదనుటకాదు. ఆయనను కేవలము శ్రోతగా గ్రహింపలేదనుట మాత్రమే. అనగా మల్లికార్జునుడు కుమారసంభవమునకు కృతిపతియే కాని కృతి శ్రోత కాదనుట. కనుకనే కుమారసంభవమునందాశ్వాసాద్యంత పద్యములలో సంబోధనాంతముల కవకాశము లేకపోయినది. పైగా చోడుడు తనగురువునకును శివునకును అభేదమును గల్పించి యాశ్వాసాంతములలో శివునివర్ణన వచ్చునట్లు కూర్చుకొని యాశ్వాసాద్యంత పద్యములను కృతినాయక కృతిపతుల కిరువురకు (కథానాయక కృతిపతుల కిరువురకు అని ఈ రచయిత భావం కాబోలు) నన్వయించునట్లు విభిన్న విభక్తికములుగా రచించినాడు. ఇక్కడ కృతి ప్రదానము కలదు గనుక షష్ఠ్యంతముల రచనకు ప్రసక్తి కలిగినది"— అని ఒకరు వ్రాశారు.

ఈ అభిప్రాయాలన్నీ చాలా ప్రమాదభరితాలు. నన్నెచోడుడు తన కుమారసంభవాన్ని మల్లికార్జుననకు అంకితం యిచ్చాడనడం ఒక పొరపాటు. నన్నయవలె మల్లికార్జుననికి వినిపింపలేదనడం రెండవపొరపాటు. మల్లికార్జునుని కృతి శ్రోతగా యెంచి కుమారసంభవ రచన చెయ్యలేదు. కావుననే సంబోధనాంతాల కవకాశం లేకపోయిందనడం మూడవ పొరపాటు. నన్నెచోడుడు కృతి ప్రదానం చేసినాడు కాబట్టే షష్ఠ్యంతాల రచనకు ప్రసక్తి కలిగిందనడం నాల్గవ పొరపాటు. సూక్ష్మంగా, వివరంగా కుమారసంభవాది గ్రంథాలు పరిశీలించకుండా వ్యాస రచనకు దొరకొన్న యీ రచయిత యీ నాల్గు పొరపాటు భావాలేకాదు

వాఙ్మయ మహోధ్యాయుని

మరెన్నో విషయాలు పొరపాటుగా పేర్కొన్నారు. క్రమానుగతంగా వాటి నన్నిటిని చర్చించుదాము.

షష్ఠ్యంతాలు ఉన్న కావ్యం ప్రతిదీ అంకితం యివ్వబడిందేననీ కృతి సమర్పణ విషయకంగానే షష్ఠ్యంతాలు వేయబడినవనీ, ఒక దురభిప్రాయం దేశంలో పాతుకు పోయింది. ఇది కేవలం భ్రమాపూరితమైన భావం. ఈ భ్రమ కారణంగానే నన్నెచోడుని కుమారసంభవంలో షష్ఠ్యంతాలున్నవి కాబట్టి ఆ కావ్యం మల్లికార్జునునికి అంకితమిచ్చాడనే భావం యేర్పడింది. కృతి సమర్పణ సందర్భంగానైనా షష్ఠ్యంతాలు వ్రాశాడా అన్న విషయమూలోచించిన వారేలేరు. తన గురుదేవుడైన మల్లికార్జునుని కేవల శ్రోతగానే గ్రహించి కుమారసంభవ రచనకు నన్నెచోడుడు దొరకొన్నాడే గాని, తన కావ్యాన్ని అంకితమివ్వలేదు. *తాను అంకితమిస్తున్నట్లు ఏ పద్యంలోనూ చెప్పలేదు. పైగా

గురువున కిష్టదైవమునకుం
బతికిం గృతి చెప్పి పుణ్యమున్
వరమును దేజముం బడయ
వచ్చు జగంబుల నిశ్చయంబు మ
ద్గురువును నిష్టదైవమును
గూర్చు నిజేశుడు దాన నాకుంగా
కొరునకు నిట్లు సేకురునె
యొక్కట లాభము లెన్నియున్నియన్.

(కు. ప్ర. ఆ. 50. ప.)

అని స్పష్టంగా 'కృతిచెప్పి' అని వాడి తన కావ్యాన్ని మల్లికార్జునునికి వినిపిస్తూ చెప్పినట్లే భావించాడు.

మల్లికార్జునునికి కథానాయకుడైన ఈశ్వరునికి అభేదం చాటినందువల్ల మల్లికార్జునుని ఎక్కడ పేర్కొన్నా, కథానాయకుడుగానే పేర్కొన్నాడుగాని కృతినాయకుడుగా పేర్కొనలేదు. నన్నెచోడుడు స్వవిషయం, కృతివిషయం మొదలైనవి చెప్పగా పోతన రచనలో ఒక పద్యానికి మార్గదర్శకమైన "రవికుల శేఖరుండు కవిరాజ శిఖామణి" అన్న పద్యంలో (కు. ప్ర. ఆ. 57ప) కూడా "సత్కథాధిపతి భవ్యుడు జంగమ మల్లికార్జునుండు'' అని కథాధిపతిగానే పేర్కొన్నాడు గాని కృతి

*నన్నెచోడుడు కుమార సంభవాన్ని మల్లికార్జునునికి సతిగా అంకిత మివ్వలేదనీ అతనిపేర సంతానంగా వెలయించాడనీ ''సప్త సంతానాలలో కృతి సతియా? సుతయా?'' అన్న బృహద్ వ్యాసంలో నిరూపించాను. (కృష్ణాపత్రిక 1961, ఆగస్టు, సెప్టెంబరు.)

కథిపతిగా పేర్కొనలేదు. అంతేకాదు, నన్నెచోడుడు వేసిన షష్ఠ్యంతాలు కృతి సమర్పణ సందర్భమయినవి కానేకావు. "మునిజన ముఖమణి ముకురుం డైన జంగమ మల్లికార్జునదేవునకు" అని షష్ఠ్యంతంగా వచనం ముగించి (58 ప్ర. ఆ) ఎనిమిది షష్ఠ్యం తాల తరువాత కావ్యారంభానికి పూర్వం "పరమభక్తియుక్తి నావర్జిత హృద యుండ నైన సకల భువన భవనావతార కారకుం డైన పరమేశ్వరు నవతారంబగుట యుందదంశావతారంబుగా వర్ణించి, నా చెప్పంబూనిన దివ్య కథాసూత్రం బెట్టి దనిన అని వచనం వ్రాసి "సతి జన్మంబున్" అని కథా ప్రారంభం చేశాడు. ఈ వచ నానికి పూర్వంలో ఉన్న యెనిమిది షష్ఠ్యంత పద్యాలు నా చెప్పంబూనిన అన్న పదాలతో అన్వయిస్తాయి. వినుత బ్రహ్మర్షికి...వ్యావర్ణించి చెప్పబూనిన, అత్యను పమ సంయమికి...నా చెప్పంబూనిన, సజ్జనాభరణునకు...నా చెప్పంబూనిన మల్లి కార్జున మునికి...నా చెప్పంబూనిన అని షష్ఠ్యంతముల కన్వయం. నన్నెచోడుడు వేసిన షష్ఠ్యంతాలన్నీ, మల్లికార్జునుని శ్రోతగా యెంచి అతనికి తాను కృతి చెప్పు తున్నట్లుగా వేసినవే గాని కృతి సమర్పణ (అంకితం) సందర్భంగా వేసినవి మాత్రం కావు.

షష్ఠ్యంతాలు వ్రాయడంలో నన్నెచోడునే ఆదర్శంగా తీసుకున్న తిక్కన కూడా తన భారతాన్ని హరిహరనాథునకు అంకిత మిచ్చినప్పటికీ, తాను వేసిన షష్ఠ్యంతాలు కృతి సమర్పణ పరంగా వ్రాయలేదు. తాను మహాభారతగాథను హరిహరునకు విన్నపం చేస్తున్న సందర్భానికి అనుగుణంగా వేశాడు. "కృతిపతిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ" అని హరిహరనాథుడే స్వయంగా స్వప్నంలో అన్నట్లు తిక్కన పేర్కొన్నాడు. "ఇట్టి పదంబుగాంచి పరమేశ్వరునిం కృతినాథుచేసి" అని తిక్కన కూడా స్వయంగా చెప్పాడు. కాబట్టి భారతాన్ని హరిహరనాథునికి అంకిత మిచ్చాడనే విషయం విస్పష్టం. కాని షష్ఠ్యంతాలు మాత్రం తిక్కన కృతి సమర్పణ పరంగా వెయ్యనే లేదు. "మహాకవిత్వ దీక్షావిధి నొంది, పద్యముల గద్య ములం రచియించెదన్ గృతుల్" అని పూని యీ దృశంబులగు పుణ్య ప్రబంధం బులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధన విశేషంబగుటం జేసి" అని వచనం వ్రాసి, అనంతరం "ఓంకార వాచ్యునకు ఇత్యాది అయిదు షష్ఠ్యంతాలు రచియించి, ఏను విన్నపంబు సేయు తెరంగుగా" నని వ్రాశాడు. ఓంకార వాచ్యు నకు అని మొదలుపెట్టి "భక్తపరతంత్రునకున్" అని షష్ఠ్యంతాలు ముగించి, "ఏను విన్నపంబు చేయు తెరంగుగా'' అనడంవల్ల ఈ షష్ఠ్యంతాలు అయిదూ హరిహరనాథునకు విన్నప సందర్భంగా వేసినవే కానీ, కృతి సమర్పణ విషయకంగా వ్రాసినవి కావని తేటతెల్లమవుతున్నది. అంకితం యివ్వడానికి, షష్ఠ్యంతాలు వెయ్య డానికీ తిక్కన భారతంలో బొత్తిగా సంబంధం లేదు.

వాఙ్మయ మహోధ్యాయుని

తిక్కన భారతంకంటే ముందుగా అవతరించి, తిక్కననే వరించిన కావ్యం కేతన దశకుమారచరిత్ర, తిక్కన కేతనను సగౌరవంగా రావించి "నీవు సంస్కృతానేక భాషాకావ్య రచనా విశారదుండవగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యంబు రచియించి నన్ను గృతిపతిం జేయవలయునని సగౌరవంబుగా బ్రార్థించిన నేనును మత్కావ్య కన్యకు దగిన వరుండగు నతని మనోరథంబు సఫలంబు గావింపం దలంచి" తాను దశకుమారచరిత్ర రచనకు ఉపక్రమించినట్లు కేతనే చెప్పాడు కాబట్టి తన కావ్యాన్ని అంకితమిచ్చాడనటం సుస్పష్టం. కేతన అవతారికలో తిక్కనవంశాన్ని వర్ణించి తుదకు తిక్కన గుణగణాలు అభివర్ణించి, "కొమ్మనామాత్యుతిక్కన కోలది సచివులింక నొక్కరు డెన్నంగ నెందు గలడు?" అని తిక్కన వర్ణన ముగించి "ఈదృశ గుణ భూషణునకు" ఇత్యాదిగా ఏడు షష్ఠ్యంతాల అనంతరం తిరిగి షష్ఠ్యంతాలుగానే మూడు (శార్దూలం, కందం, మాలిని) పద్యాలు ఆశ్వాసాంతాలుగానూ వేసి తిరిగి ద్వితీయాశ్వాసాదిగా షష్ఠ్యంత కందం వేసి, ఆ కందం చివర "తిక్కనామాత్యునకున్" అన్న ప్రయోగం చేసి, "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నాచెప్పంబూనిన కథానికాయంబను సురలతాలవాలం బెట్టిదనిన" అని కృతి రచించాడు. కేతన వేసిన షష్ఠ్యంతాలు కూడా తిక్కనను శ్లాఘించి వేసినవేగాని తిక్కనకు కృతి సమర్పిస్తున్నట్లుగా వేసినవి కావు. అనగా దశకుమార చరిత్రలో కూడా కృతిసమర్పణకూ, షష్ఠ్యంతాలకూ సంబంధం లేదని తాత్పర్యం.

మారన మార్కండేయ పురాణాన్ని నాగయ గన్నయకు అంకిత మిచ్చినట్లు స్పష్టంగానే చెప్పాడు.

నాగయ గన్నయ మార్కండేయ పురాణం వినవలెనని కుతూహలం వున్నట్లు నిండుసభలో వెల్లడించడం (మార్కండేయాఖ్య మహాపురాణము వినంగా కుతూహలం బయ్యెడిన్) మారన తనరచనను అతనికి వినిపిస్తున్నట్లుగానే సంబోధనాంత పద్యాలతో సహా వ్రాయడం జరిగింది. మారన నాగయ గన్నయకు షష్ఠ్యంతాలు వేశాడుగాని, అవి కృతి సమర్పణ విషయికంగానూ వ్రాయలేదు. కృతి శ్రోతృత్వ పరంగానూ వెయ్యలేదు. "మేరుధీరుడు నాగయమేచశౌరి" అని వ్రాసి, పిదప మూడు షష్ఠ్యంతాలు వ్రాసి, "గన్నరథినీపతికిన్" అని మూడవ షష్ఠ్యంత పద్యం ముగించి, రమకళ్యాణ పరంపరాభివృద్ధిగా నారచియింపంబూనిన యిమ్మహా పురాణంబునకుం గథాక్రమం బెట్టిదనిన అని పురాణం ప్రారంభించాడు. ఈ సందర్భాన్నిబట్టి చూస్తే, "గన్నరథినీపతికి పరమ కళ్యాణ పరంపరాభివృద్ధి" కలుగునట్లు వేసినషష్ఠ్యంత పద్యాలేగాని కృతి సమర్పణ సందర్భంగా వేసినవి కావని సుస్పష్టంగా తెలుస్తుంది.

మహామథన సారామృతం

ఎఱ్ఱాప్రగడ తన నృసింహ పురాణం అహోబల నృసింహస్వామికి అంకిత మిచ్చాడు. ఆ స్వామినే శ్రోతగాచేసి, ఆశ్వాసాద్యంతాలతో సంబోధనాంతాలు వేశాడు. నృసింహ పురాణంలో ఎఱ్ఱన షష్ఠ్యంతాలు వేసినా అతడు తిక్కనవలె "నృసింహ పురాణాన్ని నృసింహస్వామికి విన్నపం చేస్తున్నట్లే షష్ఠ్యంతాలు వేశాడు. "అత్యుదాత్త భక్తిప్రయుక్తోల్లాస భాసితుండనై, కృతి చేయందొడంగి" అని వచనం వ్రాసి, ఆతర్వాత పదకొండు షష్ఠ్యంతాలు వేసి పదకొండవ షష్ఠ్యంతాన్ని "భక్త చింతామణికిన్" అని ముగించి "ఏను విన్నపంబు సేయంగల లక్ష్మీ నృసింహావతారంబును పురాణకథకుఁ బ్రారంభం బెట్టెదనిన" అని కథాప్రారంభం చేశాడు. కాబట్టి ఎఱ్ఱన వేసిన షష్ఠ్యంతాలు సైతం కృతిసమర్పణకు సంబంధించినవి కావని కృతి విజ్ఞాపనానికి సంబంధించినవని తేటతెల్ల మవుతున్నది.

నన్నెచోడుడు తనకావ్యాన్ని అంకితం యివ్వనేలేదు-కాబట్టి అతను వేసిన షష్ఠ్యంతాలకు అంకితానికి సంబంధం మొదటనే సున్నగదా! తిక్కన, కేతన, మారన, ఎఱ్ఱాప్రగడలు అంకితం యిచ్చినా తాము వేసిన షష్ఠ్యంతాలు అంకిత విషయికంగా వెయ్యనేలేదు.

అంకితం పరంగా వ్రాయబడిన షష్ఠ్యంతాలు పోతన భాగవతంలో కనిపిస్తాయి. పోతన తన వంశావతారం వర్ణించి తననుగురించి ఒక పద్యం వ్రాసి "అయిన నేను నాచిత్తంబున శ్రీరామచంద్రుని సన్నిధానంబు కల్పించుకొని—హారికి నందగోకుల విహారికి" అంటూ షష్ఠ్యంతాలుగా నాలుగు ఉత్పలమాలలు రచియించాడు. షష్ఠ్యంతాల తరువాత (శేషశాయికిన్) "సమర్పితంబుగా నేనాంధ్రంబున రచియింపఁబూనిన భాగవత పురాణంబునకున్ గథాక్రమంబెట్టి దనిన" అని కథాప్రారంభం చేశాడు. షష్ఠ్యంతాలతో సమన్వయమయ్యే విధంగా, సమర్పిత శబ్దాన్ని ప్రయోగించడంతో శ్రీహరికి అంకితమిచ్చే సందర్భంగా షష్ఠ్యంతాలు వేసినవాడయ్యాడు. పోతన వేసిన పద్ధతిలో షష్ఠ్యంతాలు కృతి సమర్పణ సందర్భంగా తిక్కన, మారన, కేతన, ఎఱ్ఱయలు వెయ్యలేదు. వారు వేసిన సందర్భాలు కృతి సమర్పణకు సంబంధించినవి కానేకావు. కృతి ప్రదానం ఉన్నప్పుడే షష్ఠ్యంతాల రచనా ప్రసక్తి కలిగిందనుకొనడం పొరపాటు. నన్నెచోడుడు తన కావ్యాన్ని అంకితం ఇవ్వకుండానే మల్లికార్జునిపై షష్ఠ్యంతాలు రచించాడుగదా!

కుమారసంభవంలో ఆశ్వాసాద్యంతాలలో సంబోధనాంతాలైన పద్యాలు లేకపోవడంచేత కుమారసంభవానికి మల్లికార్జునుడు శ్రోతకాడనడం సబబుకాదు. మల్లికార్జునుని శ్రోతగా చేసుకొని అతనికే ఈ కృతి తాను చెప్పుతున్నట్లు నన్నెచోడుడు

వాఙ్మయ మహోద్యమని

యెలుగెత్తి చాటిన విషయం మొదటే పేర్కొన్నాను. ఇంకా ఆశ్వాసాద్యంత పద్యాల రచనలో కుమారసంభవానికి భారతాది గ్రంథాలకు ఉన్న తేడాను గురించి చర్చించుకొందాము.

భారత కృతి శ్రోతగా రాజరాజు నుంచి భారత ఆశ్వాసాద్యంతాలలో రాజరాజును సంబోధించి సంబోధనాంతాలైన పద్యాలు రచియించాడు నన్నయ. ఈ సంబోధనాంతాలు నన్నయ భారతం ప్రథమాశ్వాసం చివరనుంచి రచియించాడే కాని ఆది నుంచి రచియించకపోవడం ఒక లోపమనే చెప్పాలి. శ్రీవాణీ గిరిజాశ్చిరాయ ఇత్యాది ప్రథమ శ్లోకం దగ్గరనుంచి "సారమతింగవీంద్రులు'' అన్న పద్యం వరకూ ఉన్నది నన్నయ భారతావతారిక. రాజరాజు నన్నయను రావించి తనకిష్టమైన వేవేవో వివరించి "పాండవోత్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్టమెమ్మెయిన్'' అని పచించి భారతం ''తెనుగున రచియింపుమధిక ధీయుక్తిమెయిన్'' అని ఆనతిస్తాడు. తరువాత నన్నయ భారత రచనలో ఉన్న కష్టమును వర్ణించి "అయినను దేవా! నీయనుమతంబున .... నిక్కావ్యంబు రచియించెద" అని పేర్కొన్నాడు. తన భారతాన్ని రాజరాజును వినవలసిందిగా అవతారికలో నన్నయ పేర్కొలేదు. ''సారమతింగవీంద్రులు....జగద్ధితంబుగాన్" అన్న పద్యం తరువాత "తత్కథాక్రమం బెట్టి దనిన" అని భారత కథాప్రారంభం చేస్తాడు. కృత్యవతారిక పూర్తికాగానే అనగా—సారమతింగవీంద్రులు అన్న పద్యం తరువాత రాజరాజును సంబోధించి రెండు మూడు పద్యాలుగాని కనీసం ఒక పద్యం గాని నన్నయ రచించి ఉండవలసింది. భారత కథాప్రారంభానికి ఆదిలో సంబోధనాంత పద్యాలు రాజరాజునుద్దేశించి వెయ్యకపోవడంతో భారతానికి రాజరాజు శ్రోతఅనే విషయం కావ్యాదిని మరుగుపడిపోయినది. ప్రథమాశ్వాసం చివరికి వెళ్తేనేగాని నన్నయ భారతాన్ని "రాజరాజుకు వినిపిస్తున్నట్లు వ్రాశాడు" అన్న విషయం బోధపడదు. కాబట్టి కథాప్రారంభానికి ఆదిలో సంబోధనాంతాలు వెయ్యకపోవడం ఒకలోపంగానే తేలుతుంది.

నన్నయ్య చేసిన యీ పొరపాటును తిక్కన గమనించి తనరచనలో యిటువంటి పొరపాటు రాకుండా సర్దుకున్నాడు. తిక్కన విరాటపర్వాదిని కథాప్రారంభానికి ముందు (హరిహరనాథునకు) "ఏను విన్నపంబు సేయు తెరంగుగా నంత సన్నిధిం గలిగించుకొని యమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు చేసెద" అని వ్రాసి హరిహరు నుద్దేశించి మూడు సంబోధనాంత పద్యములువ్రాసి ఆ తర్వాత "దేవా! దివ్యచిత్తంబున నవధరింపుము'' అనిగాని భారత కథాప్రారంభం చెయ్యలేదు. తిక్కన హరిహరుణ్ని సంబోధించిన విధంగా నన్నయకూడా కథాప్రారంభానికి

ఆదిలో రాజరాజును సంబోధిస్తూ ఒక పద్యం వ్రాసినా కనీసం ఒక వాక్యం వ్రాసినా ఆయన కృత్యాది నిర్దుష్టంగా ఉండేది. నన్నయ చేసిన యీ పొరపాటును పొరపాటుగా గుర్తించలేక, తిక్కన చేసిన సర్దుబాటులో విశిష్టతను సంపూర్ణతను గుర్తించలేక అనేకమంది తర్వాతి కవులు నన్నయ విధానాన్నే అనుసరించి తమ తమ కావ్యావతారికలను లోపభూయిష్టమే చేశారు. మారన, పోతన, శ్రీనాథుడు, పెద్దన, పింగళి సూరన, రామరాజభూషణుడు, కృష్ణదేవరాయలు, తెనాలి రామకృష్ణుడు మొదలైన ప్రముఖ కవులంతా నన్నయ పద్ధతినే అనుసరించి—అనగా—కృతి శ్రోతను కథాప్రారంభానికి పూర్వం సంబోధించకుండానే తమ రచన సాగించారు. నాచనసోముడు తిక్కన చేసిన సర్దుబాటును గమనించాడు కాబోలు! తమ కావ్యకథా ప్రారంభానికి ముందు హరిహరనాథుణ్ని ఉద్దేశించి సంబోధనాంతంగా కందం వ్రాసి "దేవా" అని వచనంతో కూడా సంబోధించి "వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె" అన్నమాట వ్రాసిగాని కథాప్రారంభం చెయ్యలేదు. పైన పేర్కొన్న మారనాదుల కావ్యాలన్నిటిలోనూ ప్రథమాశ్వాసం చివరినుంచే (భాగవతంలో ప్రథమస్కంధం చివరినుంచే) గాని సంబోధనాంత పద్యాలు కానరావు. తిక్కన సవరించినా తిక్కనను, సోముడను సరించినా ప్రమాదభరితంగా మొదట నన్నయ రచనలో జరిగిన పొరపాటును గమనించని తర్వాతి కవులంతా తమ తమ రచనలను కూడా ప్రమాద భరితాలుగా చేశారు.

ఇంక నన్నెచోడుని ఆశ్వాసాద్యంత పద్యాలను గురించి, తిక్కన నిర్వచనోత్తర రామాయణం, కేతన దశకుమార చరిత్రల ఆశ్వాసాద్యంత పద్యాలను గురించి చర్చించవలసి ఉన్నది.

నన్నెచోడుడు కేవలం మహాకవే కాదు. గొప్ప మేధావి కూడా. అడుగడుగునా ఏదో ఒక ప్రత్యేకత లేకుండా అతని రచన సాగనే సాగదు. తన గురుదేవుడైన మల్లికార్జునునికీ కావ్యకథానాయకుడైన ఈశ్వరునికీ అభేదం చేసినందువల్ల ఆశ్వాసాద్యంత పద్యాలను ప్రతి ఆశ్వాసంలోనూ కథకు అనుగుణంగా పూర్వాపరాన్వయాలకు సందర్భాలకు సరిపోయే విధంగా రచియించాడు. నిజానికి కుమారసంభవం పన్రెండు ఆశ్వాసాలున్న కావ్యమే అయినా ప్రతి ఆశ్వాసానికీ చివర ఉన్న గద్యలు తొలగించివేస్తే మొత్తం కుమారసంభవం ఆశ్వాసాద్యంత పద్యాలలో ఏ ఒక్కదాన్నీ తొలగించకుండా లేదా విడిచిపుచ్చకుండా చదివితే ఏకాశ్వాసకావ్యంగా రూపొందుతుంది. కుమారసంభవం ఏకాశ్వాసకావ్యంగా కూడా రూపొందడానికి ఆశ్వాసానికి ఆశ్వాసానికీ మధ్యలో ఉండే ఆద్యంత

వాఙ్మయ మహోధ్యతుని

పద్యాలను సైతం కథలో కలిసే విధంగా రచియించడమే కారణం. ఉదాహరణకు ఏ ఆశ్వాసాన్నైనా పరిగ్రహించవచ్చును, దక్షుడు తన అల్లుళ్ళను అందరినీ చూచి చివరికి పరమేశ్వరుణ్ని చూదామని రజతనగానికి వెళ్తాడు. "పరమేశ్వరు నాస్థానంబున కరిగి" అనడంతో ప్రథమాశ్వాస కథాభాగం ముగుస్తుంది. ఆ తర్వాత అయిదు ఆశ్వాసాంత పద్యాలూ రెండవ ఆశ్వాసం మొదటిపద్యమూ ద్వితీయాంతాలుగా ఉన్నాయి. ద్వితీయాశ్వాసం కథాభాగం మొదటి పద్యంలో "సతినవ్వించుచు నవ్వుచున్న పరమున్ సర్వేశు దక్షప్రజాపతి గాంచెన్" అని దక్షుడు ఈశ్వరుణ్ణి చూచినట్లు చెప్తాడు. ప్రథమాశ్వాసాంత పద్యాలు, ద్వితీయాశ్వాసం ఆదిపద్యం ద్వితీయాంతాలైన యీశ్వర విశేషణ యుక్తాలుగా సమన్వయం కుదిరి ప్రథమ ద్వితీయాశ్వాసాలకు ఏకవాక్యత యేర్పడుతుంది.

ఈశ్వరుని రోషభీషణాగ్నికి గురైన దక్షుడు తిరిగి ఆ పరముని దయావీక్షణంతో బంధముక్తుడై శంకరుని స్తుతించడంతో ద్వితీయాశ్వాసం ముగుస్తుంది. ఆ ముగింపులో కవి వాక్యంగా "అని యనేక ప్రకారంబులఁబరమ భక్తి యుక్తిం బ్రస్తుతింప దక్షునకుం బ్రత్యక్షుండై తదీయాధ్వర ఫలంబు సఫలంబుగాఁ బ్రసాదించి దక్షుంబ్రజాపతి నియోగంబునందు నియోగించి'' అని వ్రాసినాడు. ఆ తర్వాత తృతీయాశ్వాసంలో యీశ్వరుడు సర్వముని దేవతా పరివృతుడై పరమానందంతో ఉన్నట్లు పేర్కొంటాడు. ఆ కారణంగా ద్వితీయ తృతీయాశ్వాసాలకు ఏకవాక్యత కుదరడానికై ద్వితీయాశ్వాసాంత పద్యాలను తృతీయాశ్వాసాది పద్యాన్ని ప్రథమాంతాలుగా రచియించాడు. ఇదే పద్ధతిలో సమస్త ఆశ్వాసాలకు కథాభాగంతో ఐక్యత కుదురుతుంది. ఈ విధంగా కుమారసంభవం ఏకాశ్వాసకావ్యంగా రూపొందటం నన్నెచోడుని రచనలో బుద్ధిపూర్వకంగా జరిగిన పనేగాని కాకతాళీయంగా జరిగిన పనికాదు. అయా ఆశ్వాసాలకాదిలో కథాభాగంతో ఆశ్వాసాద్యంత పద్యాలు సమన్వయించే విధంగా రచించాలని నన్నెచోడుడు సంకల్పించుకున్నాడు కాబట్టే తత్తత్కథా సందర్భాల కనుగుణంగా అన్వయం కుదిరే విధంగా పూర్వపర కథావిధానాల ననుసరించి ఆశ్వాసాలతుదిని ఆదిని తగు విభక్త్యంతాలుగా పద్యాలు నిర్మించాడు. పరమేశ్వరునికి మల్లికార్జునుడనే పేరుండడం, తన గురువు పేరు మల్లికార్జునుడు కావడం ప్రత్యేకంగా తనగురువుకు పరమేశ్వరునికి అభేదాన్ని చాటడం పరమేశ్వరుడే తన కావ్యకథానాయకుడు కావటం, యివన్నీ ఒకచోట సమకూరడంతో తనకావ్యాన్ని నన్నెచోడుడు ఏకాశ్వాసకావ్యంగాసైతం రూపొందేట్లుగా కథాకథనంలో ఆశ్వాసాల మధ్య సంపూర్ణమయిన సమన్వయాన్ని సాధించగల్గాడు. కుమారసంభవం మొదటినుండి చివరి వరకూ ఏకవాక్యంగల కావ్యమనీ, ఆశ్వాసాంత్య గద్యలు తొలగించితే అది

ఏకాశ్వాస కావ్యంగా రూపొంది ఆశ్వాసాలన్నింటి మధ్య సమన్వయం కుదరడానికి తగిన వాక్య నిర్మాణంతోనే సృజించబడిందనీ, తిక్కన కేతనాదులు మొదట గ్రహించిఉంటే ఆశ్వాసాల తుదిని వివిధవిభక్త్యంతాలుగా పద్యములు వ్రాయడానికి ఉపక్రమించేవారు కారనుకుంటాను. కథానుగుణంగా సమన్వయానికి తగేట్లు వివిధ విభక్త్యాంతాలుగా రచించడంలో నన్నెచోడుని ఆంతర్యం తిక్కనాదులు గ్రహించకపోవడంవల్లనే అతడువ్రాసిన విధంగానే ఆశ్వాసాద్యంత పద్యాలను వివిధ విభక్త్యంతాలుగా వ్రాయాలని ప్రయత్నించి, కొన్నిచోట్ల అన్వయ రహితా లయిన పద్యాలను సృష్టించి పెట్టారు. ఇది పులిని చూచి నక్క వాతపెట్టుకున్న ట్లున్నది. తిక్కన నిర్వచనోత్తర రామాయణ ఆశ్వాసాద్యంత పద్యాల రచనలో కుమార సంభవంలోని ఆశ్వాసాద్యంతపద్యాలను దృష్టిలో ఉంచుకుని తానుకూడా ఆ విధంగా వివిధ విభక్త్యంతాలుగా వ్రాయాలనే వ్రాశాడు. ప్రథమా విభక్త్యం తాలుగా వ్రాసిన పద్యాలకు మామూలుగా కథతో సంబంధం లేకపోయినా, సమన్వయం ఎక్కడయినా కుదురుతుంది. కాని తిక్కన రెండవ ఆశ్వాసం చివర, ఆశ్వాసం మొదట ద్వితీయాంతాలైన పద్యాలు వ్రాశాడు—నాలుగవ ఆశ్వాసం చివర, అయిదవ ఆశ్వాసం మొదట తృతీయావిభక్త్యంతాలయిన పద్యాలు వ్రాశాడు. అయిదవ ఆశ్వాసం చివర ఆరవ ఆశ్వాసం మొదట, షష్ఠ్యంతాలు వ్రాశాడు. ఈ ద్వితీయ, తృతీయ షష్ఠీ విభక్త్యంత పద్యాలలో ఏ ఒక పద్యా నికీ సమన్వయం కుదరనే కుదరదు. ఉదాహరణకు ఒక్క పద్యం చూడండి.

> శ్రీరమ్యుతా నిరూఢమ
> హో రస్కుం బుణ్యసంప దుదిత యశస్కుం
> గారుణ్యార్ద్ర మనస్కుఁ బ్ర
> జా రంజనశీలు మనుమ జగతీ పాలున్

అని నిర్వచనోత్తర రామాయణం తృతీయాశ్వాసాదిలో మనుమసిద్ధి పరంగా నున్న పద్యం యిది. "హరిగని దేవ దూ" అని యీ పద్యం తరువాత ద్వితీయా విభక్తి యుక్తమై కథాప్రారంభ మవుతుంది. అయితే మనుమసిద్ధిపై ద్వితీయావిభక్త్యంతంగా పద్యంవ్రాయాలని యెక్కడున్నది ? పోనీ అలా వ్రాసినప్పుడు ఆ పద్యానికి అన్వయం కుదిరేట్లు దాని తరువాత మరో వచనమయినావ్రాయాలికదా ! అటువంటి వచనం ఏమీ లేకపోవడంవల్ల పై పద్యం అంతకు ముందున్న రెండవ ఆశ్వాసాంత పద్యాలు నిరర్థకాలవుతున్నాయి కదా! " మనుమ జగతీ పాలున్ " అని ముగించితే అది సంపూర్ణ వాక్యయుక్తం కాలేదు గదా ! " మనుమసిద్ధిని శ్రీరాముడు రక్షించునట్లుగా నాచెప్పంబూనిన యనంతర

వాఙ్మయ మహాధ్యక్షుని

కథా క్రమం బెట్టిదనిన" అని యిటువంటి వాక్యం యేదయినా ఉంటేనేగాని సమన్వయం కుదరదుకదా ! ఈ విధంగానే "శ్రీ రమణ.... పతిచే...మను వసుమతీ వల్లభు చేన్" అని తృతీయాంత పద్యం (5వ ఆశ్వా. 1 ప) ఉన్నది. దీనికి అన్వయ మెక్కడ ? మనుమసిద్ధిచేత యేమైనట్లు ? ఈ విధంగానే కేతన వ్రాసిన ద్వితీయాది విభక్త్యంత పద్యాలు నిరర్థకాలుగా ఉన్నాయి. కేతన వ్రాసిన సంబోధనాంతాలకు సైతం సమన్వయం కుదరదు. (మా దశ. 3 ఆ. చివర 4 ఆ. ఆదిని) 4 ఆ. ఆది పద్యం తర్వాత "తిక్కనామాత్యా ! తరువాతికథ నవధరింపు" మన్నట్లుగా ఒక వాక్యం ఉంటేనేగానీ సమన్వయం కుదరదు. భారతరచన నాటికి తిక్కన తన ఉత్తర రామాయణంలో జరిగిన పొరపాటును గుర్తించబట్టే మాట్లాడకుండా భారతంలో ఆశ్వాసాద్యంత పద్యాలను సంబోధనాంతాలుగా వ్రాశాడు.

మారన మార్కండేయ పురాణంలో ఆశ్వాసాద్యంతాలలో సంబోధనాంత పద్యాలే వేసినా, ప్రథమాశ్వాసం చివర మాత్రం ఒక పద్యం అనవసరంగా రచించి, ప్రథమ, ద్వితీయాశ్వాసాల మధ్య సమన్వయం కుదరకుండా చేశాడు. "హరిశ్చంద్రుడు...దివంబు కరిగెనని చెప్పి" అని వచనం ముగించి, ఆశ్వాసాంత పద్యాలు వ్రాయడానికి మారుగా హరిశ్చంద్ర కథాశ్రవణ ఫలాన్ని చెప్పాలని "సమకూర్చున్ వివిధార్థ సంపదలు" (మా. పు. 1 ఆశ్వా. 285 ప.) అన్న పద్యం వ్రాసి తర్వాతి ఆశ్వాసంలోని కథతో సమన్వయాన్ని సంబంధాన్ని త్రుంచివేశాడు. ఆ కారణంగా "దివంబున కరిగెనని చెప్పి" అన్నదానిలోని చెప్పి అనే అసమాపక క్రియ రెండవ ఆశ్వాసంలోని "పరమ జ్ఞానచతురులయిన పక్షులు ఆ జైమిని కిట్లనియె" అన్న వాక్యంతో పొంతన కుదుర్చుకోకుండా పోతున్నది. "దివంబునకరిగి" అన్న దానికి పూర్వంలోనైనా యీ పద్యం ఉంచినా సమన్వయం కుదిరేది.

సామాన్యంగా యే కావ్యమైనా ఆశ్వాసాల అద్యంతాలలో ఉన్నటువంటి కృతి పతులకో, శ్రోతలకో సంబంధించిన పద్యాలను తొలగించితేనే యేకాశ్వాస కావ్యంగా రూపొందుతుంది. కాని నన్నెచోడుని కుమారసంభవంలో మాత్రం ఆశ్వాసాంతాలలోనూ, ఆదిలోనూ ఉన్న మల్లికార్జునుని మీది పద్యాలను తొలగించినా, తొలగించకపోయినా అది ఏకాశ్వాసకావ్యంగా రూపొందుతుంది. ఇది కుమార సంభవాశ్వాసాద్యంత పద్యాలలోని విశిష్టత.

నన్నెచోడుడు మల్లికార్జునునికి కృతి శ్రోతపరంగా షష్ఠ్యంతాలు వేశాడని మొదటే పేర్కొన్నాను. నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన అయిదవ ఆశ్వాసం చివర, ఆరవ ఆశ్వాసం మొదట షష్ఠ్యంతాలు వేశాడు. షష్ఠ్యంతాలు కృతి సమర్పించినప్పుడే (అంకిత మిచ్చినప్పుడే) వ్రాయబడతాయన్న పొరపాటు

భావం సకారణంగా లోగడే త్రోసిపుచ్చబడింది. కావ్యం మధ్యలో వేసినా, కృత్యాదిలో వెయ్యకపోయినా మనుమసిద్ధిపై షష్ఠ్యంతాలను తిక్కన వ్రాశాడు. ఇప్పుడు అంకితమిచ్చినప్పుడే షష్ఠ్యంతాలు రచియించబడతాయన్న భావం సరికాదని నిరూపించబడింది. కాబట్టి తిక్కన కృతిసమర్పణ సందర్భంగా షష్ఠ్యంతాలు వెయ్యకపోయినా తర్వాత మానవపరంగా షష్ఠ్యంతాలు వ్రాసినవాడు తిక్కనే కాగలడు.

"కేతన తన దశకుమార చరితమును తిక్కనకు భక్తితో అంకితము గావించినాడు, కనుక కృత్యాదిని షష్ఠ్యంతములకు ప్రసక్తి కలిగినది." అని యీ వ్రాతరి పేర్కొన్నారు.

కేతన వ్రాసిన షష్ఠ్యంతాలు అంకిత విషయమునకు సంబంధించినవి కావని లోగడనే నిరూపింపబడింది గదా! ఇంక కేతన దశకుమార చరిత్రను తిక్కనకు గౌరవంగా అంకితమిచ్చాడని చెప్పడానికి అవకాశం ఉన్నది గాని, భక్తితో యిచ్చాడనడానికి అవకాశం లేదు. "ఆసనార్ఘ్య పాద్యతాంబూలాంబరాభరణ దానాద్యుపచారంబులఁ బరితుష్ట హృదయుంజేసి నీవు సంస్కృతాద్యనేక భాషా కావ్యరచనా విశారదుండ వగుట జగత్ప్రసిద్ధంబు గాన నొక్క కావ్యంబు రచియించి నన్నుఁ గృతిపతిం జేయవలయునని సగౌరవంబుగాఁ బ్రార్థించిన" అని కేతన తనను తిక్కన సగౌరవంగా బ్రార్థించాడని స్పష్టంగా చెప్పుతున్నప్పుడు, ప్రార్థింపబడిన వారికి ప్రార్థించిన వారిపట్ల గౌరవభావం ఉండడానికి అవకాశం ఉన్నది గాని భక్తిభావం ఉండడానికి అవకాశంలేదు. కేతన తిక్కనకు శిష్యుడు కాడన్న విషయం యీ సందర్భంలో జ్ఞప్తి తెచ్చుకోవాలి. (చూ-ఆంధ్ర భాషా భూషణం-దివ్య ప్రభా వివరణ సహితం- నా పీఠిక).

"కేతన గూడ నన్నెచోడునివలెనే యెనిమిది షష్ఠ్యంత కందములను వ్రాసినాడు" అని గూడ యీ వ్రాతరి వ్రాశారు.

ఆశ్వాసాంత్య పద్యాలుగా మూడు పద్యాలను తొలగించితే కేతన వేసిన షష్ఠ్యంత కందాలు యేడు మాత్రమే మొట్టమొదటగా వీరేశలింగంగారు ప్రచురించిన ప్రతిలో యేడు పద్యాలు మాత్రమే ఉన్నాయి. ఆశ్వాసాంత్య పద్యాలై షష్ఠ్యంతాలుగానే ఉన్న తిక్కనవి మూడూ కలిపితే మొత్తం పది పద్యాలు.

"ఎనిమిది షష్ఠ్యంతములకుఁ జివర మూఁడాశ్వాసాంత పద్యములను షష్ఠ్యంతములుగాఁ బ్రథమాశ్వాసము ముగించి ద్వితీయాశ్వాసాదిని గూడనట్లే కందమును షష్ఠ్యంతముగా వ్రాసెను. ఇది యీతని యందలి ప్రత్యేకత. దీనిని గమనింపక

వాఙ్మయ మహాధ్యక్షుని

కొందరు కేతన షష్ఠ్యంత కందముల మధ్య దూలము వంటి శార్దూలములను వేసెనని విమర్శించిరి''— అని యీ వ్యాసకర్త వ్రాశారు.

ఇందులో యీ వ్యాసకర్త వెల్లడించ గలచినభావం సువ్యక్తం కాలేదు. సామాన్యంగా షష్ఠ్యంతాలు కంద పద్యాలుగానే నన్నెచోడాదులు వ్రాయడం చూచి "షష్ఠ్యంతాలు కంద పద్యాలుగానే ఉండా" లన్న అభిప్రాయానికి వచ్చిన వారు కొందరు షష్ఠ్యంతాలలో శార్దూలం కేతన వెయ్యడం బాగుండలేదని విమర్శించారు. తర్వాతి వారనేకులు షష్ఠ్యంతాలుగా కందాలనేకాక యితర వృత్తాలను సైతం వ్రాశారు. పోతన షష్ఠ్యంతాలన్నీ ఉత్పలమాలలుగానే వ్రాశాడు గదా! ఆశ్వాసాంత పద్యాలలో మొదట ఉత్పలమాల—చంపకమాల—శార్దూల—మత్తేభాలలో ఒక పద్యం, ఆ తర్వాత కందం—ఆ తర్వాత మాలిని మూడూ వరుసనే వెయ్యాలని కేతన నియమంగా పెట్టుకొన్నట్లు కనిపిస్తుంది. అందువల్ల తాను వేసిన యేడు షష్ఠ్యంతాల తర్వాత షష్ఠ్యంతాలుగా—శార్దూలం—కందం—మాలిని మూడు పద్యాలనూ వేసి ప్రథమాశ్వాసం ముగించాడు. ఆశ్వాసాంతంలో కేతన పెట్టుకొన్న మూడు పద్యాల నియమాన్ని గమనించనివారు చివరి మాలిని వృత్తాన్ని ఒక్కదానినే ఆశ్వాసాంత పద్యంగా గ్రహించి మాలినికి పైనున్న "దేవేంద్ర విభునకు" ఇత్యాది కంద పద్యాన్ని కూడా మామూలు షష్ఠ్యంత కందాల మధ్య దూలంవంటి శార్దూలం వేశాడని కేతనను విమర్శించారు.

పింగళి సూరన్న ప్రభావతీ ప్రద్యుమ్నంలో ఆశ్వాసాద్యంత పద్యాలు సంబోధనాంతాలుగా వ్రాయకుండా విభిన్నవిభక్త్యంతాలుగా వ్రాయడానికి కారణం కృతిపతి అయిన సూరన తండ్రి మృతి పొందినందువల్ల అతనిని శ్రోతగా యెంచడానికి అవకాశం లేకపోవడమేననడం కేవలం పొరపాటు. శ్రోతగా యెన్నుకొనడానికి బ్రతికి నిజంగానే వింటూ ఉండనక్కరలేదు. మృతి పొందిన మానవుని కూడా శ్రోతగా భావించి సంబోధించి కృతి చెప్పవచ్చును.

నన్నయ రాజరాజును శ్రోతగావించి భారత రచన చేశాడంటే అది భావంలోనే. నిజంగానే ప్రతిమాటా ప్రతిపద్యమూ అతనికి వినిపిస్తూనే వ్రాశాడనడం, రాజరాజు సమక్షంలోనే భారతం వ్రాశాడనుకొనడం పొరపాటు—కొంతకొంత భాగం వ్రాసి రాజరాజుకు వినిపించుతూ వ్రాశాడనడం సమంజసంగా ఉంటుంది. శ్రోతగా యెంచుకొనడమనేది దృగ్గోచరుడు కాని భగవంతుని పట్లే చెల్లగా చనిపోయిన మానవుని పట్ల యెందుకు చెల్లదు? శ్రోతగా యెన్నడమనేది హృద్గతభావమే గాని యిరవై నాల్గు గంటలూ శ్రోత యెదురుగా కూర్చుని వ్రాస్తున్నదల్లా వింటూ ఉండాలనుకొనడం సరికాదు. సూరన విభిన్న విభక్త్యంతాలుగా ఆశ్వాసాంత్య పద్యాలు వ్రాయడం

అతను తిక్కనాదులను ఆదర్శంగా తీసుకొనడం వల్లనే జరిగిఉంటుంది తప్ప మరి వేరు కాదు. నిర్వచనోత్తర రామాయణం, దశకుమార చరిత్రలోని ఆశ్వాసాద్యంత పద్యాలకు పట్టిన నిరర్థకత్వం అనన్వితత్వం. ప్రభావతీ ప్రద్యుమ్నంలోని ప్రథమేతర విభక్త్యంతాలైన ఆశ్వాసాద్యంత పద్యాలకు సైతం పడుతుంది.

షష్ఠ్యంతాల విషయమై ఆశ్వాసాద్యంత పద్యాల విషయమై తుదకు సంబోధనాంతాల విషయమై కూడా యింతగా చర్చించవలసిన విశేషాలుండగా కృత్యవతారికలు గాని పూర్వాపర పద్య గద్య సమన్వయాలు గాని వేటినీ పరిశీలించకుండా షష్ఠ్యంతాల చరిత్రకు పూర్తిగా విరుద్ధమైన విషయాలను షష్ఠ్యంతాల చరిత్రగా వ్రాయడం విచారణీయమైన విషయం. (ఆంధ్రప్రభ—దినపత్రిక– 3 జూలై 1960.)

ఇంతకూ యీ షష్ఠ్యంతాల చరిత్రను దృష్టిలో పెట్టుకొన్నప్పుడు కేశవ నామాదులపై ఆధారపడి అవతరించిన షష్ఠ్యంతాలు నరసింహకవి రచించిన నారదీయ పురాణంలో శ్రీకృష్ణపరంగా సార్థకమై విరచింపబడ్డాయనే చెప్పవచ్చు. నారదీయ పురాణం శ్రీకృష్ణాంకితమైంది కాబట్టి యిందులోని షష్ఠ్యంత పద్యాలు సైతం శ్రీకృష్ణ వర్ణనాత్మకాలై ఉండడం రూపంగా షష్ఠ్యంతాల సంజనితత్వానికి సార్థకతను సమకూర్చాయనే చెప్పవచ్చు.

కృష్ణావతార వర్ణనలో అత్యంత శక్తివంతమైన తనసహజ కవితా మాధుర్యాన్ని, వైదుష్యాన్ని నరసింహకవి బహుముఖాలుగా చూపించాడు. ప్రబంధకవుల పోకడలను మనస్ఫురణకు తీసుకొని రాగలిగినట్లుగా తన కవితా ధౌరంధర్యత్వాన్ని ప్రకటించాడు. మధురాపురవర్ణనాపరమై నరసింహకవి శబ్ద శక్తికి ప్రతీకగా నిలువగల యీ క్రింది పద్యాన్ని తిలకించండి.

శ్రీ రాజవశ్యమై శ్రీ రాజవశ్యమై
యఖిలలోకముల విఖ్యాతిఁగాంచి
కల్యాణ ధామమై కల్యాణ ధామమై
యఖిలలోకముల విఖ్యాతిఁగాంచి
సుమనోభిరామమై సుమనోభిరామమై
యఖిలలోకముల విఖ్యాతిఁగాంచి
సత్కళా పూర్ణమై సత్కళా పూర్ణమై
యఖిలలోకముల విఖ్యాతిఁగాంచి

వాఙ్మయ మహోధ్యతుని

ప్రబలెం భ్రాంతాభ్ర శుభ్రతరంగిణీత
రంగ రంగన్మహో ఘౌన రాజి రాజి
తా జర పయస్సుధాలేప నాంచితోచ్చ
గోపుర శ్రీలనగు మధురా పురంబు.

కృతిపతి అయిన శ్రీకృష్ణావతార వర్ణనానంతరం కథా ప్రారంభంకాగా మహర్షులు శ్రీమన్నారాయణుని దర్శించి నుతించి యాదవ శైల క్షేత్ర మాహాత్మ్యాన్ని గురించి వివరించవలసిందిగా ప్రార్థిస్తారు. అప్పుడు విష్ణువు యాదవ శైలక్షేత్ర మాహాత్మ్యాన్ని బ్రహ్మ సనత్కుమారునికి వివరించగా ఆ సనత్కుమారుని ద్వారా నారద మహర్షి తెలుసుకున్నాడనీ ఆ నారదుడే ఆయా యాదవశైలక్షేత్రమాహాత్మ్యాలను మీకు వివరంగా తెలియచేస్తాడనీచెప్పి విష్ణువు అదృశ్యమవుతాడు. ఈ విధంగా కథాప్రారంభం కాగా ఆ తరువాత నారదుడు మహర్షులకు ప్రత్యక్షమై యాదవశైలక్షేత్ర మాహాత్మ్యం వర్ణన పేరుతో యీ మొత్తం నారదీయ పురాణ విశేషాలను చెప్పినట్లు స్పష్టపడుతున్నది. కాగా యీ పురాణం మూలగ్రంథం నారదప్రోక్తమై నారదీయ పురాణంగా అవతరించింది. (చూడు-తె. నార. పు. 79, 80, 93, 94, 105 పుటలు)

## నారదీయపురాణం-శ్రుతులు

శ్రుతి స్మృతి పురాణేతిహాసాలన్నది సంప్రదాయసిద్ధంగా అనాదికాలం నుంచీ వస్తున్న అనుశ్రుత వాక్యంగా గతంలో పేర్కొనడం జరిగింది. తత్కారణంగా పురాణాలలో గాని వాటి సంగ్రహరూపంగా అవతరించిన ఉపపురాణాలలో గాని వేద ప్రామాణ్యం గురించి పేర్కొనబడడంలో ఆశ్చర్యకరమైన విషయమేమీ లేదు.

అయితే శ్రుతి ప్రామాణ్యం దృష్టితో చూచినప్పుడు ఆర్య ద్రావిడ భాషా కుటుంబ భేదాలను అనేకమంది పరిశోధకులు విభిన్నమైనవిగా పేర్కొనడం జరిగింది. ఈ రూపంగా మూలద్రావిడ భాషాకూ ప్రాచీన సంస్కృత భాషకూ సంబంధం లేదని పెక్కుమంది భాషాశాస్త్రవేత్తలు ఒకానొక విశిష్టనిర్ణయానికి రావడంకూడా జరిగింది. కాని గత పదిసంవత్సరాలుగా ఆర్ష విజ్ఞానం దృష్ట్యా సృష్టి-మానవ జాత్యుత్పత్తి-భాషోత్పత్తి-భాషోత్పత్తికి మూలభూతమైన ముఖయంత్ర ప్రక్రియా సంచలనాది విశేషాలను మూలాధారంగా చేసుకుని నేను చేసిన అగాధమైన పరిశోధనలవల్ల ఆర్య ద్రావిడ భాషాకుటుంబాలు ఏకైక కుటుంబకాలన్న సంగతి తిరుగులేని విధంగా నిరూపితమైంది. ఈ సత్యాన్వేషణాలక్ష్యంతో నృత్య సంగీతాలలో-ఛందో విశేషాలలో-రసాలంకారాదులలో—"మార్గ-దేశి" భేదాలు లేవని దేశి మార్గాంతర్గత

మైన ఒక భాగమేనని యీ రూపంగా ఆర్యద్రావిడ భాషాకుటుంబ భేదాలకు అవకాశం లేదని నిస్పష్టంగా అజేయమైన పద్ధతిలో నా పరిశోధనారచన "మార్గ-దేశి" గ్రంథంలో నిరూపించి ఉన్నాను. ఈ గ్రంథంలోనే "మార్గ-దేశి" భేదాల పేరుతో భాషాపరంగా సైతం ఆర్యద్రావిడ భాషాకుటుంబాల భిన్నత్వాన్ని వక్కాణించే అవకాశం లేదనికూడా నేను సుదృఢంగా సూక్ష్మరూపంలో వెల్లడించాను. భాషాపరమై బహుముఖమైన నా మహత్తర పరిశోధనాగ్రంథం వెలుగు చూస్తేనే తప్ప యీ ఆర్యద్రావిడభాషా కుటుంబ భేదాలు రూపుమాయవు. అయితే యీ సందర్భంలో ప్రాచీనకాలంలోనే ఆర్యద్రావిడ భాషాభేదాలు లేవన్న దృష్టితో నరసింహకవి నారదీయ పురాణ అవతారికలో

"ధరణి వేదంబులు ద్రావిడంబుగ జేయు
శ్రీ పరాంకుశయోగి శేఖరులను"

(నార-2 పుట. 7 ప.)

అని ఘంటాపథంగా వక్కాణించాడు. అలౌకిక వాఙ్మయంగా అపౌరుషేయాలుగా భావించబడుతున్న సంస్కృత వేదాలను శ్రీ పరాంకుశయోగి ద్రావిడీకరించినట్లు పై పద్యపాదంలో నరసింహకవి సూటిగా వక్కాణించాడు. వైష్ణవమతస్థుడై ద్రావిడ వేదాధ్యయన పరుడైన నరసింహకవి ద్రావిడ వేదానికి మూలం సంస్కృత వేదమే నన్న సంగతిని విస్పష్టంగా పేర్కొన్నాడంటే దీనిని అంత తేలికగా మనం త్రోసిపుచ్చడానికి ఏ మాత్రమూ అవకాశం లేదు. అసలు ద్రావిడ వేదాన్ని ప్రాణప్రదంగా భావించే వైష్ణవ మతస్థులే సంస్కృత వేదాలను ద్రావిడంగా మార్చారనే అభిప్రాయంలో ఉన్నప్పుడు ద్రావిడ వాఙ్మయానికి మూలభూతం శిరోమాణిక్యం వంటిదైన ద్రావిడ వేదానికి స్వతంత్ర ప్రతిపత్తి లేదని యెలుగెత్తి చాటినట్లేకదా! కాగా సంస్కృత వేదాలు మూలంగా అవతరించిన ఆర్యభాషాకుటుంబం ద్రావిడ వేదాల మూలంగా అవతరించిన ద్రావిడ భాషాకుటుంబం విభిన్నమైనవని మనం చెప్పడం చాలా దుస్సాహసమే కాగలదు. పరాంకుశయోగి వేదాలను ద్రావిడంగా మార్చారని స్పష్టంగా వక్కాణించిన నరసింహకవి వాక్యం కేవలం నరసింహకవి పరికల్పితమని చెప్పడానికి అసలు అవకాశమే లేదు. అందువల్ల ఆర్యద్రావిడ భాషాకుటుంబాలు యేకైకాలేనని మనం నిస్సంకోచంగా నిర్ణయించుకొన వచ్చును.

సంస్కృతవేదాలను పరాంకుశయోగి ద్రావిడీకరించారంటే ద్రావిడవేదం కంటే సంస్కృతవేదాలు ప్రాచీనాలన్న సంగతి నిర్ద్వంద్వంగా నిరూపితమవుతున్నది. అయితే సంస్కృత శ్రుతి, స్మృతుల మూలంగా అవతరించిన పురాణాలలో ఆయా

వాఙ్మయ మహోధ్యతుని

శ్రుతి, స్మృతుల ప్రసక్తులుగాని వాటి ప్రామాణికతలుగాని పురాణోపపురాణాల్లో పేర్కొనబడడంలో విశేషంలేదు. సంస్కృత వేదాలకంటే ఆధునికమైన ద్రావిడ వేదాన్ని పురాణోపపురాణాల్లో-ప్రత్యేకించి వైష్ణవపురాణాల్లో నైనా సరే ప్రామాణ్యంగా ఉదాహరించకపోవడంలో అసలే విశేషంలేదు. వివిధ దృక్కోణాలలోను ప్రామాణికత అప్రామాణికతలు సహజంగానే మనకు ప్రత్యక్షమవుతాయి. కాగా పురాణోపపురాణ వాఙ్మయం దృష్ట్యా చూచినా ద్రావిడ వేదానికి ప్రామాణ్యత కాని విశిష్టపరిగణన గాని లేదని స్పష్టపడుతున్నది. కాగా ఆర్య భాషాకుటుంబేతరమైన ద్రావిడ భాషాకుటుంబ వాదం త్రోసిరాజనబడక తప్పదు.

గతంలో వేదాల ఉత్పత్తి గురించి కొంత చర్చించడం జరిగింది. మామూలుగా మనం వేదాలు నాలుగూ బ్రహ్మ చతుర్ముఖాలనుంచే వెలువడ్డాయని అనుకొనడం జరుగుతున్నది. అయితే అసలు 'త్రయీవేదాః' అన్న వాక్యం వేదవాక్యంగానే మొదట వేదాలు మూడేనన్న సంగతిని స్పష్టపరుస్తున్నది. అయితే మొట్టమొదట ఋగ్యజుస్సామవేదాలు మూడూ బ్రహ్మ త్రిముఖాలనుంచి వెలువడ్డాయనీ కాగా ఈ మూడు వేదాలూ బ్రహ్మ మూడు ముఖాలనుంచే వెలువడినా ఈ వేదాలలోనే ఉన్న వివిధ అస్త్ర ప్రయోగ మంత్రాలను వినియోగించడానికి బ్రహ్మ తన నాలుగవ ముఖాన్ని ఉపయోగించాడని తద్రూపంగా వివిధ అస్త్ర మంత్ర తంత్ర యంత్ర విషయాలకు ఆలవాలాలైన వేదమంత్రాలతో అథర్వవేదం రూపొందిందనీ మనం భావించవచ్చును. కాని త్రేతనుండైన పురూరవుడు మొట్టమొదట ఏకైకంగా ఉన్న వేదాన్ని మూడు వేదాలుగా విభజించినట్లు భాగవతం పేర్కొంటున్నది. అయితే వేదాలు తొలి వాక్కులుగా పేర్కొనబడడంవల్ల అవి బ్రహ్మ చతుర్ముఖాలనుంచి అవతరించాయనే దృష్టితో చూస్తే భాషోత్పత్తికి మూలదేవత బ్రహ్మగా మనకు గోచరిస్తాడు. కాని మన గ్రంథాలు సరస్వతిని విద్యలన్నింటికీ మూలభూతురాలుగా పేర్కొనడంకూడా కద్దు. అయినప్పుడు భాషామూల దేవతావ్యవస్థ బ్రహ్మనుంచి సరస్వతికి సంక్రమిస్తుంది. సరస్వతి బ్రహ్మ ముఖవాసినిగా వర్ణింపబడడంవల్ల - ఒకవేళ నాలుగు వేదాలూ బ్రహ్మ చతుర్ముఖాలనుంచే వెలువడినా అవి వాణీ ముఖస్థాలుగా అవతరించినట్లుగా చెప్పక తప్పదు. అయితే వీటికి విరుద్ధంగా అసలు భాషలకు మూలకర్త మహేశ్వరుడే నన్న వాదం మరొకటి ఉన్నది.

"నృత్తావసానే నటరాజరాజో ననాద ఢక్కాం నవ పఞ్చవారమ్ ।
ఉద్ధర్తు కామస్సనకాది సిద్ధానేతద్విమర్శే శివసూత్రజాలమ్ ॥"

అన్న ప్రాచీన సంప్రదాయసిద్ధమైన శ్లోకం ప్రకారం మహేశ్వరుడు సనకాది మహర్షులను అనుగ్రహించే ఉద్దేశ్యంతో నృత్తావసానంలో పధ్నాలుగుసార్లు తన ఢక్కను వాయించగా భాషకు మూలభూతాలైన అక్షర సముచ్చయాదులు అవతరించినట్లు తేటతెల్లమవుతున్నది. ఈ దృష్ట్యా భాషకు మూలభూతుడు మహేశ్వరుడు

కాగా భాషామయమైన వేదాలకు మహేశ్వరుడే మూలకారకుడు కావలసి ఉన్నది. భాషలేనిదే వేదంలేదుకదా. భాష మహేశ్వరపరమైనప్పుడు వేదమూలకత్వం బ్రహ్మకు చెందడంలో ఔచిత్యం కనపడదు. లేదా వేదమూలకత్వం చతుర్ముఖ బ్రహ్మకు చెందినప్పుడు భాషామూల కారకత్త్వం మహేశ్వరునికి చెందడానికి వీలు లేదు. ఈ విషయాల గురించి కొంతవరకు నేను నా "మార్గదేశి" పరిశోధనా రచనలో వివరంగా చర్చించి వున్నాను.

అయితే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో విష్ణువుకొక విశిష్టమైన ప్రత్యేకత ఉన్నదని గతంలోనే నేను సాధికారంగా ఉటంకించాను. దీనికి తగినట్లు వేదాల మూలకారకత్వాన్ని అటు మహేశ్వరులకుగాని ఇటు వాణీ చతుర్ముఖులకుగాని చెందనివ్వకుండా నారదీయ పురాణంలో వేదాలకు మూలభూతుడు శ్రీ మహావిష్ణువేనని విష్ణువే బ్రహ్మకు వేదవిద్యలను నేర్పాడని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. శ్రీహరి నాభికమలం నుంచి చతుర్ముఖ బ్రహ్మ ఉదయించిన తరువాత బ్రహ్మ "హరిః ఓమ్" అని వేదానికి ఆదిభూతమైన అక్షరాలను ఉచ్చరించగా మహావిష్ణువు "ఇట్లు ప్రణవంబుపలుకు నాత్మజుం గృపాదృష్టింజూచి భగవంతుండు హర్షించి నాల్గు వేదంబులు సర్థంబుతో నభ్యసింపఁజేసె రహస్యం బెద్దియుఁ బ్రథమ పుత్రునకుఁ బ్రియ శిష్యునకు నెఱిగింపరానిదిలేదు గావున సర్వంబు బోధింపవలయు" (నార. 97పుట. 18వ) అని విష్ణువు బ్రహ్మకు అనేక రహస్యాలు చెపుతాడు. నారదీయ పురాణంలోనే వేరొక సందర్భంలోకూడా "వైకుంఠనాథునిచే సాక్షాత్కారంబున శ్రుత్యంత క్షీర సాగరమువలన సముద్భూత సారంబై విధాతకు నుపదేశంబయ్యె" (నార. 378 పుట. 247 వ.) అని శ్రుతిసారాన్ని విధాతకు విష్ణువుపదేశించినట్లు మరొకసారి వక్కాణించడం జరిగింది. అంతేకాదు. బ్రహ్మ విష్ణోపదిష్టమైన వేద విజ్ఞాన సంభరితుడై సృష్టి కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నా ప్రళయాంతంలోనో మరొకప్పుడో రాక్షసుల బాధకు గురైకాని యితర విధాలగాని బ్రహ్మ వేద విజ్ఞానాన్ని కోల్పోయి సృష్టికర్మను నిర్వర్తించడంలో పెక్కుసార్లు నిస్సహాయుడయ్యాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు మత్స్య, హయగ్రీవాది అవతారాలను యెత్తి వేదాలను అపహరించిన రాక్షసులను సంహరించి తిరిగి బ్రహ్మకు వేదవిజ్ఞాన భిక్ష పెట్టి బ్రహ్మచేత సృష్టికర్మను యథావిధిగా నిర్వర్తింపచేసినట్లు పెక్కుపురాణాలు పేర్కొంటున్నాయి.

ఈ దృష్ట్యా వేదాలు బ్రహ్మ చతుర్ముఖాలనుంచి మొదట వెలువడనే లేదని బ్రహ్మకు సార్థకంగా మహావిష్ణువు వాటిని ఉపదేశించాడని స్పష్టపడుతున్నది. కాగా వేదవాఙ్మయ మూలకత్త్వం ఇటు బ్రహ్మ సరస్వతులకుగాని అటు మహేశ్వరునకు

వాఙ్మయ మహోధ్యక్షుని

గాని చెందకుండా శ్రీమహావిష్ణువుకే చెందుతున్నది. భాషామయమైన వేద మూల కత్వం విష్ణువుకే చెందినప్పుడు భాషా మూలకత్వం మాత్రం విష్ణువుకు చెందదా !

వేదాలకు మూలకర్త మహేశ్వరుడే అయినా, సరస్వతే అయినా, చతుర్ముఖ బ్రహ్మే అయినా, ఆ శ్రీమహావిష్ణువే అయినా వేదాలు వేదాలే. వేదాలు దైవీయాలే. "అనంతా వై వేదాః" అన్న వేదవాక్యం ప్రకారం దేవ వేదాలు, అనంత శాఖాత్మకాలు. ఈ విషయాన్ని నారదీయపురాణంలో నరసింహకవి ధర్మాధర్మాభిమాన దేవతలు ఆత్మవృత్తి ప్రకారం గురించి చెప్పే సందర్భంలో "మాకు సాక్షి యనంతశాఖ వేదాభిమానము గలిగిన నిత్యదేవత. ఈ నిత్యదేవత పలికిన పల్కు శంకించరాదు. నిరామయమైనది." (నార. 399 పుట. 49. వ) అని వేదాలు అనంతాలుగా పేర్కొన్నాడు. ఈ అనంతకాలంలో అనంత వేద విజ్ఞానం బహుముఖంగా వ్యాప్తి చెందినపుడు అపౌరుషేయమైన అమర వాఙ్మయం పౌరుషేయ వాఙ్మయంవలె మానవుల నోళ్ళల్లో పడినప్పుడు వాటిల్లో భ్రమ ప్రమాదాలవల్ల కానివ్వండి, మరొక కారణంచేత కానివ్వండి కొన్ని కొన్ని మార్పులు వచ్చి విభిన్న సిద్ధాంత బోధకాలైన విషయాలు విరుద్ధార్థాలు తొంగి చూడడం అసహజం కాదు. కాగా వేద వ్యాఖ్యానాలలోగాని, స్మృతుల ప్రవచ నాలలోగాని భిన్నత్వం గోచరం కావడం అబ్బురం కాదు. ఈ దృష్ట్యానే "హరి వాసరంబున భుజింపుమనువారు సత్పురుషులు గారు. భుజింపుమనినవి స్మృతులుగావు. వేదములు గావు." అని నారదీయపురాణం (279 పుట. 70 వ) స్పష్టంగా ఉగ్గడించింది. దీనినిబట్టి వేదపాఠాలలోను, స్మృతుల పాఠాలలోను విభిన్న భావాత్మకాలైన పాఠాలున్నట్లు మనకు తేట తెల్లమౌతున్నది. అపౌరుషేయమైన వేదవాఙ్మయం మానవుల నోళ్ళల్లో పడిన తరువాత అది ఎంత దేవ వాఙ్మయం అయినా దైవీయాలైన శక్తులులేని మానవుల నోళ్ళల్లో పడినందువల్ల కేవలం అర్థ భావాలలోనే కాక శబ్ద స్వరాది విషయాలలో సైతం విభిన్నత్వం మహర్షుల కాలంలోనే తొంగిచూచింది. ఈ విషయాన్ని నరసింహకవి "విస్వరంబగు యజుర్వేదంబునుంబోలె స్వర హీనంబగు సామంబునుంబోలెఁ బదహీనయగు ఋక్కునుంబోలె (నార. 308 పుట 191. వ) అని యజుర్వేదంబులో విస్వరత్వం యేర్పడినట్లు, సామవేదంలో స్వర హీనత్వం చోటు చేసుకున్నట్లు, ఋక్కులలో పద హీనత్వం సైతం తొంగిచూచినట్లు స్పష్టంగా పేర్కొన్నాడు. స్వర హీనత్వం వేరు, విస్వరత్వం వేరు. అసలు స్వరమేలేకపోవడం స్వరహీనత్వం కాగా, దుష్ట స్వరాలేర్పడడం విస్వరం అనబడుతుంది. పురమే లేనప్పుడంతఃపురం యెక్కడ వుంటుందన్నట్లు, ఋక్కులలో అసలు పదమే లేకపోతే మనం స్వరం గురించి చెప్ప గలిగిందేమీ ఉండదు కదా ! వేద వాఙ్మయంలో విస్వరత్వమే యేర్పడినా, స్వర

హీనత్వమే యేర్పడినా పద భ్రష్టతయే కలిగినా కేవల మానవ దృష్టితో కాక ఆర్ష విజ్ఞానం దృష్ట్యా దైవీయ దృక్పథంతో చూచినప్పుడు దేవత్వానికి, వేదత్వానికి భిన్నత్వం గోచరంకాదు. ఆర్ష భాషా వాఙ్మయ విజ్ఞానాలను దృష్టిలో పెట్టుకొని మనం పరిశీలించినప్పుడు స్వర పదాదుల అనులోమ, విలోమత్వాలతో అసలైన ఘన స్వరూపం నిరూపితమౌతుంది. ఒకానొక సందర్భంలో "ఘనము ఘనమని ఘనాఘనమని ఘన ఘనమ్ముగ నెరుగు ఘనుడే జటావల్లభుడవు నతండే నిటాలాక్షుండగు నతండే" అని నేను వ్రాసిన చరణం నిజమైన దేవవేద ఘనాపాఠిత్వానికి నిర్వచనం. అసలు ఘనాపాఠిలోని ఘనాశబ్దార్థమే తెలియని వేదపండిత నామకులు దేవవేద స్వరూపాన్ని కాని, వేదదేవ స్వరూపాన్ని కాని గుర్తించగలరనుకొనడం హాస్యాస్పదం కాగలదు. "దేవ" శబ్దాన్ని స్వరాలతో పాటు అక్షరాలను సైతం వ్యత్యస్తం చేస్తే "వేద" శబ్దం రూపొందుతుంది. ఇదే విధంగా "వేద" శబ్దాన్ని స్వరాలతో పాటు అక్షరాలను వ్యత్యస్తం చేస్తే "దేవ" శబ్దం రూపొందుతుంది. వేదఅనుష్ఠాన పద్ధతిగాని, ఆర్ష విజ్ఞాన రహస్యంగాని యీ వ్యత్యస్త పదతిలోనే పరిగర్భితమై వున్నది. ఈ రహస్యాన్ని దృష్టిలో పెట్టుకొనే వేదాలు దైవీయాలుగా పేర్కొనడం జరిగింది. మానవాళి అజ్ఞానంవల్ల పొరపాట్లు దొర్ల వచ్చును గాని, భ్రమప్రమాదాలకు లోను కావచ్చునుగాని, యేమైనా దేవవేదాలు దేవవేదాలే గదా! ఈ విషయాన్ని నరసింహాకవి "విష్ణుమహిమ—ఉభయపదప్రాప్తి" అన్న విషయాలను వివరిస్తూ "మహౌదార్య, సుశీలత్వ, వాత్సల్యాది నిజసద్గుణంబులతోఁ గూడినవాడై సర్వదేవవేద హృదయాహ్లాదముచే సిద్ధచతుర్దశ మహాలోకంబులందు శ్రీ వైకుంఠ శ్వేత ద్వీప క్షీరాబ్ధుల యందును" (నార. 365–పుట, 193–వ) అని వేద దేవత్వాన్ని విస్పష్టంగా వక్కాణించాడు.

నరసింహాకవి విభిన్నాలైన వేద విషయాలను వివిధ సందర్భాలలో నారదీయ పురాణంలో వివరించాడు. కాలచక్రం గురించి వర్ణిస్తూ అది అధోముఖమై పరిభ్రమిస్తూ ఉంటుందని, త్రిగుణాత్మకమైన మధ్యభాగ నాభి మిళితమై ఉంటుందని యీ క్రింది పద్యంలో స్పష్టంగా పేర్కొన్నాడు:

"ఘనతరమయి యసంఖ్యమయి బ్రహ్మలోక
మౌనట్టి పరవ్యోమ మరయ నెద్ది
యదియ విశుద్ధ తత్త్వాఖ్య తత్వంబు సు
షిరమున నామించి చెలఁగెనది త్రి
పాద్భూతితదురు త్రిపాద్భూత్యధో భాగ
మధ్య దేశైక సమాశ్రయమునఁ
దగునతర్క్యాద్భుత తరశక్తికంబుగ
వ్యయమునసైన కాలాఖ్య తత్వ

వాఙ్మయ మహోద్యతుని

మది యథోముఖ చక్రమై యంటి తిఱుగుఁ
బరగుఁ దదవస్థలీ మధ్యభాగ నాభి
మిళితమై త్రిగుణాత్మయై మెలఁగ నాయు
జాదులకునైన తెలియఁగ శక్యంబెదాని."

(నార. 370-పుట. 214-ప)

ఇందులో కాలంలో త్రినాభి విభాగం గురించి నరసింహకవి స్పష్టంగా పేర్కొన్నాడు. శుక్ల, కృష్ణ పక్షాలు కలిస్తే ఒక మాసమని, రెండు మాసాలు ఒక ఋతువని, ఆరు మాసాలు ఒక అయనమని యీ రూపంగా సంవత్సరాత్మక మైన కాలచక్రానికి రెండయనాలు, ఆరు ఋతువులు, పన్నెండుమాసాలు అని మాసంలో శుక్ల, కృష్ణ భేదాలతో రెండు పక్షాలని ప్రాచీనకాలంనుంచి అందరూ భావిస్తున్నారు. నిజానికి రెండు మాసాలొక ఋతువైనట్లుగా, రెండు ఋతువులు ఒక నాభికాలమై కాల స్వరూప స్వభావాలనుబట్టి ఆరు ఋతువులను రెండేసి ఋతువుల కొక నాభి వంతున మూడు నాభులుగా—ఉష్ణనాభి, జలనాభి, శీతనాభులుగా—వేదర్షి గుర్తించి యీ క్రింది ఋగ్వేద మంత్రాల్లో ఒకటికి రెండుసార్లు ప్రకటించాడు.

ద్వాదశ ప్రధమః చక్రమేకం
త్రీణినభ్యానిక ఉతిచ్చికేత

(ఋగ్వే.1 మం.24 సూక్తం-48 ఋక్కు)

త్రినాభి చక్రమజరమనర్వం
యత్రేమా విశ్వాభువనాధి తస్థుః

(ఋగ్వే.1 మం.164 సూక్తం—2 ఋక్కు)

ఈ నాభికాల విభజన గురించి మన ప్రాచీన ఖగోళాది శాస్త్రవేత్తలు యెక్కడా ప్రస్తావించకపోవడం చూస్తే మన వేదవిజ్ఞానం యెంత దుస్థితికి దిగజారిందో మనకు తేటతెల్లమౌతుంది. కాలంలో నాభి భాగం గురించి గతంలో (ఆంధ్రప్రభ-దిన పత్రిక-9-9-1962) ఒక వ్యాసంలో నేను వివరంగా చర్చించి ఉన్నాను. ఈ త్రినాభి కాల విభజనను దృష్టిలో పెట్టుకొనే మన సామాన్యప్రజానీకంలో నాలుగు మాసాలు అంటే రెండు ఋతువులు ఒకనాభి అయినట్లు—నాలుగు మాసాల కాలం ఒక కాలవిభాగంగా - వేసాకాలం - వర్షాకాలం - శీతాకాలంగా చిర కాలంగా వ్యవహారంలో పాతుకొనివున్నది. ఈ త్రికాలనాభి వ్యవస్థ ఇటు సామాన్య ప్రజానీక వ్యవహారంలోనూ, అటు ఋగ్వేదంలోనూ సకృత్తుగా నారదీయ పురాణంవంటి గ్రంథాలలోను నిలిచి వున్నదేగాని, యీ మధ్య అవతరించిన

శాస్త్ర వాఙ్మయంలో మాత్రం మటుమాయమైపోయింది. ఇదే నాభికాల విభాగం గురించి మహాకవి కాళిదాసు తన కుమారసంభవంలో పార్వతీతపోవర్ణనా సందర్భంగా శ్లేషాత్మకంగా యీ క్రింది శ్లోకంలో ఉటంకించాడు:—

"స్థితాః క్షణం పక్ష్మసుతాడితా ధరాః
పయోధరోత్సేధ నిపాత చూర్ణితాః
వలీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే
చిరేణ నాభిం ప్రథమోదబిందవః"

(కుమా. 5–సర్గ, 24–శ్లో)

మేఘాలు ఒకదాని నొకటి ఒరుచుకొనడం ద్వారా మొట్టమొదట బృహత్తర బిందువుల రూపంలో పైనుంచి వర్షం ప్రారంభమవడం, రానురాను క్రిందికి వచ్చేసరికి చిన్న చిన్న ముక్కలుగా విడిపోవడం, వర్షం కురిసిన తరువాత భూమిమీద వివిధ ప్రదేశాలలో నీరునిలవడం, తిరిగి అది సూర్యరశ్మి కారణంగా ఆవిరి రూపందాల్చి మూలస్థానానికి అంటే నాభిస్థానానికి చేరుకుంటుందన్న విశిష్ట వైజ్ఞానిక శ్లేషార్థాన్ని మల్లినాథ సూరి గుర్తించక పోవచ్చునుగాని వేదవిజ్ఞాన ప్రతిబింబకమైన యీ శ్లోకంలోని శ్లేషార్థాన్ని విశిష్ట శబ్ద ప్రయోగాలను మనం కాదని త్రోసిపుచ్చలేము.

నరసింహకవి శ్రుతులతోపాటు స్మృతులను సైతం ప్రామాణికాలుగా గ్రహించాడు. "ధర శ్రుతి స్మృతి వైరుధ్య తరము చైత్య సేవనాదిక కర్మముల్ సేయుచుండ్రు........." (నార. 442–పుట. 219–వ) అని కేవల శ్రుతివైరుధ్య కర్మలనే కాక స్మృతి వైరుధ్య కర్మలను సైతం ఆచరించే మూఢులను తిరస్కరించాడు. "అఖిలము నేనె నాకంటె నన్యం బెద్దియును లేదన్యంబు గలదనుట వేదోక్తంబు గాదు. ద్విజులమైన మనకు వేదమ్ప్రమాణ మనరాదు. వేద ప్రామాణ్యా విసంవాదము బహువాదులకుంగలదని వినంబడియె. లోకాయతనాగత కాణాదులు" (నార. 430 – పుట. 169–వ) అని వేదామోదాన్ని తిరుగులేని వేద ప్రామాణ్యాన్ని ఒకసారి పేర్కొనడమే కాక "శ్రుతి ప్రామాణ్యా విశ్వాస పరత వైదికాచార రుచియు వేదాంత వేద్యుండైన హరియందు భక్తి యనల్పతపము (నార. 440. పుట. 210–వ) అని వేరొకసారి వేద ప్రామాణ్యాన్ని పునరుద్ఘాటించాడు. అంతేకాదు. వేదాలు సత్కార్య పరాలని, సత్ఫలదాయకాలని "సమస్త వేదంబులును గార్యపరంబు, శ్రేయస్సును గార్యపరమే; శ్రుతి తాత్పర్య గోచరమైన శ్రేయస్సు దానికంటె మరియొకటి కాదు;" (నార. 402. పు. 51–వ) అని విస్పష్టంగా ఉగ్గడించాడు.

వాఙ్మయ మహోధ్యతుని

విభిన్నాలైన వేదభాష్యా లేవిధంగా ఉన్నా అనేకార్థదాయకాలై, బహుముఖాలైన వేద విషయాల ఆంతర్యాన్ని నరసింహకవి కొంత ఆకళించుకున్నట్లు కన్పిస్తున్నది. వేదాలు గూఢార్థకాలని, చిత్రార్థకాలని, వివిధార్థకాలని, కొన్ని సందర్భాలలో విస్పష్టంగా నరసింహకవి వక్కాణించాడు.

సాంగంబులై సరహస్యంబులైన వేదంబులు చదివి వ్యుత్పత్తి లేశజనిత తద్వేదార్థ వివేక రేఖలు గలవారై తద్బోధ శోధన నయములను గురుముఖంబులు వలనం దెలిసి యశేషమూర్తియైన స్వామిని సుగమార్గంబుగా నెఱుంగంగలరు.

మ. హరిపాదాబ్జ యుగంబు గొల్చి సరహస్యాశేష వేదస్ఫుర
త్పురుషోత్తంస నిజాశయం బెఱిఁగి యుద్బోధామృతాస్వాదులై
పరమోత్కృష్టులఁజేసి తత్పదరజః పట్టాభిషేకంబుతో
దురసంతామరు లెన్న దుండెదరొ సాధుల్మెచ్చ పీతార్థులై.

మ. అని యీరీతి దయాళు దివ్యనివహోత్యంతైక శోచ్యక్రియా
ఘనదుర్బోధ నివిష్టచిత్తుల వృథాగర్వాంధులన్ వేదవి
త్తనిరోధార్థకరాత్ములం గని వినీతత్వంబునన్ మ్రొక్కి మ
న్నన నీక్షించి ప్రియంబు వల్కఁ దగదెన్నన్ సజ్జనుం డెన్నఁడున్.

(నార. 406-పుట-51-వ 52, 53-ప)

ఆర్ష విజ్ఞానమయాలైన వేదాలకు తద్విజ్ఞాన రహితులైన పండితనామకులు వేదాలకు అప్రామాణికాలైన భాష్యాలు రచించి అసలు మనమహర్షుల వేద విజ్ఞానానికే యెసరు పెట్టారని నేను గతంలో అనేకసార్లు పేర్కొన్నాను. గత పదిహేను సంవత్సరాలలోనూ ఆంధ్రప్రభ, గోల్కొండ పత్రికవంటి దినపత్రికలలోనూ, అనేకాలైన ఆకాశవాణి ప్రసంగాలలోనూ ప్రాచీన వేదాలలో వున్న పరమ వైజ్ఞానిక రహస్యాలను బహుముఖాలుగా, సప్రామాణికంగా, తిరుగులేని విధంగా నిరూపించాను. ఈ దృష్ట్యా విద్యారణ్యుల వేద భాష్య మనబడిన సాయణభాష్యం సైతం ప్రత్యక్షర ప్రామాణికం కాదని నిర్ద్వంద్వంగా పెక్కు వ్యాసాలలో నిరూపించాను. నరసింహకవి ధర్మాధర్మాభిమాన దేవతలు, ఆత్మవృత్తి ప్రకారం గురించి వర్ణించిన సందర్భాన్ని పురస్కరించుకుని వేదాభిమాన దేవతా ప్రసక్తి తెచ్చి తద్దేవతా తత్వవేది యయిన వ్యాసమహర్షిచేత యీ క్రింది విధంగా పలికించాడు.

"వత్సా! యీ దుర్వాదృగ్వాది జన్మ నిమిత్తంబు నీ వెఱింగియును దద్వాక్యంబులకు క్షుద్ర నయార్థిత్వ ప్రసిద్ధికొఱకు నడిగితివి. విను; మిటువలె వాదించు వాదులం బూర్వంబునందు నందికేశ్వరునిచేత శపింపఁబడిన దేవద్వేషులు భూమి

యందుఁ బెక్కండ్రు నిర్భాగ్యద్విజులై కుమేధస్సులై పుట్టి యయాథాభిధైక దేశ లేశులై తోఁచినట్లు వేదార్థ నిర్ణయమునందు నింతయనియెడు పరిమితి నివేదంబునందు నింతయన్న పరిమితిని, కూప కూర్మ సమానాభిమానులై వేదాంత సాగరంబుల నసంఖ్యేయంబులఁగా నెఱుఁగక దేవ మాయా మోహితులై తలంచిరి. సమస్త వేదంబులును గార్యపరమే కావలయునని తన్నియంబునం బలికి వేదంబునందును బదవాచ్య బుద్ధిలోక వ్యుత్పత్తి మూలమైనదియె; కార్యానన్వీత సిద్ధార్థ విషయమై లోకంబునందుఁ బదసంగతి లేదు."

(నార.402,పుట.51-ప.)

ఈ సందర్భంలో బ్రాహ్మణులు దేవద్వేషులై, నిర్భాగ్య ద్విజులై, కుమేధస్సులై భూమిమీద పుట్టి వేదార్థ విధ్వంసం చేస్తారని నరసింహకవి సూటిగా వ్యాస మహర్షి చేత చెప్పించాడు. నరసింహకవి వెల్లడించిన యీ యభిప్రాయం నేను గత పదిహేను సంవత్సరాలుగా బహుముఖాలుగా పరిశోధనలు చేసి రచించి ప్రకటించిన అనేక వ్యాసాలలో, రేడియో ప్రసంగాలలో ప్రాచీన వేదభాష్యాలు ప్రత్యక్షర ప్రామాణికాలు కావని నిరూపించిన విషయాన్ని సుదృఢంగా బలపరుస్తున్నది.

నరసింహకవి వివిధ వేదాలలో పరిశ్రమించాడనడానికి సాక్షీభూతంగా తన నారదీయ పురాణంలో వివిధ సందర్భాలలో విభిన్న వేదమంత్ర భాగాలను ఉటంకించాడు. "ఆత్మ-దేహాదుల" గురించి వివరిస్తూ వేద పురుషుడు నాకు తెలుసునని చెప్పే "వేదాః మేతం పురుషం మహాంతమ్" అనే వేద వాక్యాన్ని (నార. 327. పుట. 35-వ) ఉదాహరించాడు. బ్రహ్మవిద్యా రహస్య వివరణ సందర్భంగా

ఇలలోన బ్రహ్మ విద్యా
కలితులకుఁ బునర్భవములు గలుగవు పరుఁడై
వెలయు హరి నెఱిఁగి మృత్యు
ప్రళయముఁ దాఁటునని శ్రుతి తిరంబుగఁ బలికెన్.

(నార. 327-పుట, 40 ప)

అని శ్రుతి ప్రమాణ విషయాన్ని పేర్కొన్నాడు. ఆ తరువాత "శ్రీవిష్ణుధామంబు పునరావృత్తి రహితంబని పార్థసారథి 'యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ' అని యానతిచ్చె." అని భగవద్గీతా వాక్యాన్ని ఉదాహరించినా "యేష దేవోపమో బ్రహ్మ పథానేన పరంగతా ఇమమ్ మానవ మావర్తంతే" యను శ్రుతి యున్నయది గానఁ బునరావృత్తి రహితంబని పార్థస్ఫురద్ధాములగు వారికి పునరావృత్తి యెక్కడిది యని కొందఱాడుదురు" అని శ్రుతి ప్రామాణ్యాన్ని

వాఙ్మయ మహోధ్యతుని

వక్కాణించాడు. (నార. 328 పుట. 41-ప). అనంతరం ఈ బ్రహ్మ విద్యా రహస్య విషయకంగానే ఒకవంక శ్రుతి ప్రామాణ్యాన్ని పేర్కొంటూనే మరోవంక బ్రహ్మసూత్ర ప్రామాణ్యాన్ని సైతం పేర్కొన్నాడు.

"భవాదృశ బ్రహ్మ విత్పాద పద్మసేవాసుధ లేక ఊమ మానవ హీంసు లైన వారికిఁ బ్రజ్ఞాజ్ఞప్తి పుష్టత యెక్కడిది. యజ్ఞాది శ్రుతి వలన బ్రహ్మ విద్య కర్మాంగకంబె యని వినంబడియె. ఆ బ్రహ్మవిద్యకు నశ్వంబునకు గమన సాధనంబులం బలె బ్రహ్మవిద్యకు సర్వాపేక్షయుం గలదని 'సర్వాపేక్షాచ యజ్ఞాదిశ్రుతే రశ్వవత్త'ని సూత్రం బొనర్చితివి అయినను నొక సందేహంబుగల దడిగెద."

(నార. 331-332-పు. 54-వ)

తరువాత పరబ్రహ్మ రహస్యార్థాన్ని వర్ణిస్తూ "అత్రాయం పురుషః పరంజ్యోతి రూపం సంపద్య స్వేనరూపేణాభి నిష్పద్యతే" అవహత పాప్మా విజరోప మృత్యు ర్విశోకో విజిఘత్సో విపిపాసన సత్యకామ సత్ సంకల్ప" (నార. 343-పు, 112-ప) అని శ్రుతి వాక్యాన్ని ఉదాహరించాడు. ఇదే విధంగా వైకుంఠ లోకాన్ని గురించి ఆవరణ పంచకంగురించి వివరించే సందర్భంలో "మధ్యే మధ్యేత్వ సంఖ్యే యా స్తత్ర ద్వ్యూహన్" (నార. 358-పు, 171 వ) అని శ్రుతి వాక్యాన్ని ప్రామాణికంగా పేర్కొన్నాడు. అనంతరం విష్ణు మహిమ, ఉభయ పదప్రాప్తి గురించి వర్ణిస్తూ మహావిష్ణువుయొక్క మహాశక్తిని అపూర్వ అమేయ శక్తిని బహుముఖంగా వర్ణించే వేద మంత్రాన్ని సవివరంగా ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు. ఈ సందర్భంలో శ్రుతులతోపాటు స్మృతులతో సైతం తదర్థ నిర్వాహకాలని శ్రుతుల తరువాత స్మృతులకు స్థానమిస్తూ స్పష్టీకరించాడు. నరసింహకవి అమోఘమైన విష్ణు శక్తిని గురించి వేదమంత్ర ప్రామాణ్యంతో వివరించిన ఘట్టమిది.

"అపాణి పాదోజ వనోగ్రహీతాపశ్యంత చక్షుః సశ్రుణోనకంనః
సవేత్యవేద్యం నచనశ్యవేత్తా తమాహు రగ్ర్యం పురుషం మహాంతమ్
నకస్యకార్యం కరణంచ విద్యతే నతత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే
పరాస్య శక్తే ర్వివిధైవ శ్రూయతే స్వాభావిక జ్ఞాన బలక్రియాచ"

యనిన నది హస్తంబులులేక పట్టును. పాదంబులులేక పఱువెత్తును. చక్షువులులేక చూచును. కర్ణంబులులేక వినును. అవేద్యంబైన యది యెఱుంగును. తన్నెఱుంగ లేఁడు. అతండు మహాపురుషుం డని యెంతురు. అతనికిఁ గార్యకరణంబులు లేవు. అతనికి ముందు నధికుండులేఁడు. అతని శక్తి వివిధంబైన యదియై స్వాభావికంబులు జ్ఞాన బల క్రియలు. అతని వినుతింప నలవియగునె. భగవంతుని

శక్తు లవాఙ్మాన గోచరంబులని పురాణంబులం జెప్పంబడియె. ఉత్పత్తి స్థితి లయంబులయందు సర్వశక్తులు భగవంతునికే కలవు. శ్రుతి స్మృతులే తదర్థ నిర్వాహకంబులై యుండు." (నార. 364-పు. 189-వ) ప్రత్యేకించి ఈ ఉభయ పదప్రాప్తి విషయక సందర్భంగానే ఈ క్రింది వచనంలో నరసింహకవి వాక్య సైతంగా యజుర్వేద ప్రామాణికతను పేర్కొన్నాడు.

"ఈ యజుర్వేదంబు సత్వరవాఙ్మానస విత్తముండవై నన్నెఱుంగక యట్లు "సహోవాచ వ్యాసః పారాశర్య" యని నిర్వోదేరితార్థంబునందు నే వచనము ప్రమాణంబుగాఁ బలికె నింతకంటె నిన్ను నెట్లు నుతింపవచ్చు నీవే లోకోత్తరుండ వగుట." (నార.366-పు.195.వ.) నరసింహకవి అన్యస్థలాలలో జీవ పరమాత్మలకు భేదం సిద్ధమై ఉంటుందని జీవ బ్రహ్మలూ దేహ దేహివత్త్వాలను పొందుతారని వేదమంత్ర ప్రమాణ పూర్వకంగా నిరూపించాడు. శ్రుతికి వ్యాకరణం అంగం అని పేర్కొంటూ "శ్రోతామాన్తా" అని వేదోక్త చేతనాన్యత్త్వాన్ని వక్కాణించి అనంతరం జీవ పరమాత్మల భేద సిద్ధిని వక్కాణిస్తూ ఈ క్రింది వేద మంత్రాన్ని ఉదాహరించాడు.

> "క్షరం ప్రధాన మమృతోఽక్షరః
> క్షరాత్మనా విశతే దేవమేకం,
> భోక్తా భోజ్యం ప్రేరితారం చమత్వా
> జుష్టస్తస్మాదమృతత్వమేతి." (నార. 389-పుట. 14-వ)

ఈ సందర్భంలోనే అఖిల హేయ ప్రతిభటత్వం విష్ణువు సొమ్ముగా వర్ణిస్తూ "తమేవ విధి" ఇత్యాది "మృత్యుమేతీ" త్యాది "వేదవాక్యంబ విద్యా విషయ భూతుండ"—(నార. 392-పు. 22-వ) అని వేదవాక్యాలను ఉదాహరించాడు. ధర్మాధర్మాభిమాన దేవతలు ఆత్మవృత్తి ప్రకారంగురించి తెలుపుతూ "వేదార్థం బైన మిక్కిలియుం న్నెఱుంగరు; సర్వ శబ్దంబులకును లోకంబుల యందుఁ గార్యాన్వితార్థత గల దాలిజాదికంబునకు లౌకికంబునందుఁ గార్యాన్వితార్థత్వంబు లేదు గాని లౌకికమైన 'గామాన' యేతి వాక్యంబునం దానయము కార్యంబుగా దాపద మేమిటి చేతఁ గార్యాన్వితార్థ మయ్యెడి" (నార. 404-పు. 51 వ) అని వేద విషయాలను వివరించాడు.

నరసింహకవి అపూర్వ అమేయ వేదాభిమాన దేవతకు పరమ భక్తుడుగా కనిపిస్తున్నాడు. తనకున్న అనుపమానమైన వేదాభిమానాన్ని ఎలుగెత్తి చాటడం కోసం సనకాదులను విష్ణువు కరుణించినవిధం గురించి వర్ణించిన ఘట్టంలో వేద వైశిష్ట్యంగురించి పేర్కొంటూ వేద విజ్ఞానరహితులైన వ్యక్తులు జీవించడంకంటే

అని మాత్రమే కాదు వేద విజ్ఞాన విరుద్ధ బుద్ధులైన మానవులను ఆశ్రయించి బ్రతకడం కంటే చావడం మేలని స్పష్టంగా పేర్కొన్నాడు. ఈ సందర్భంగా నరసింహకవి "నిగమాంత నిషేధకులైన వారి నాశ్రయించి బ్రతుకుటకంటెఁ దను త్యాగంబు సేయుట మేలని బాహ్య దృష్టులు లేని దేశంబునకుఁ జని నైమిశాది పుణ్యక్షేత్రంబుల విజ్వరులై పరబ్రహ్మోపనిషద్ భావనం కొందఱు ప్రవర్తిల్లుదురు" (నార. 377-పు. 247-వ) అని స్పష్టంగా పేర్కొన్నాడు. ధర్మాధర్మాభిమాన దేవతలతోపాటు ప్రత్యేక విశిష్టతతో వేదాభిమాన దేవతనుసైతం ఒక అపూర్వ దేవతగా వర్ణించిన నరసింహకవికి ఇంతటి వేదాభిమానముండడంలో మనం ఆశ్చర్య పడవలసిం దేమీలేదు. నరసింహకవి ప్రబోధనీ మహిమ గురించి వర్ణించిన సందర్భంలో వేద వాఙ్మయం యొక్క మహత్త్వంగురించి యెంతో మహోన్నత దృక్పథంలో వర్ణించాడు.

"బహుళవాదమూలమై భాషించు వేదంబు
యజ్ఞకర్మ క్రియాద్యంబు వేద
మఖిల గృహస్థాశ్రమస్ఫూర్తి వేదంబు
స్మృతి మర్మవిద్య యా హృద్యవేద
మమిత పురాణ రహస్య తంత్రము వేద
మాదిత్య పురుష జన్మములు జగము
లన్నైన వాఙ్మయంబంతయు నీ పురా
ణంబులయందె ధన్యత వహించె

నట్లు గానఁ బురాణార్థ మధికతరము
తెలియ వేదార్థముకంటె వెలయుననుచు
సుప్రతిష్ఠము చేసిరి సూటిగాఁ బు
రాణములయందు వేద తంత్రంబులెల్ల.

పరమార్థం బెఱుంగలేక యల్పశ్రుతులైన వారు మదర్థం బితిహాస పురాణ స్మృతి నిర్ణీతంబైన దానిం జెలుతు రని వేదంబులు పలుకు. వేదంబునందు గ్రహ సంచారంబును లగ్నశుద్ధియుఁ దిథి వృద్ధి క్షయంబులు గాన్పింపవు: యాజ్యా యాజ్యులు నేర్పడరు; బ్రహ్మహత్యాదులకుఁ బ్రాయశ్చితాదులు నిర్ణయింపఁ బడవు"— (నార. 275 పు. 54-వ) అని నరసింహకవి వేద వాఙ్మయ మహ త్త్వాన్ని వర్ణించి వేదంలో గ్రహ సంచారాది విషయాలులేవని విస్పష్టంగా పేర్కొనడం ద్వారా తన వేద ఖగోళ విషయ అనభిజ్ఞతను వెల్లడించాడు. వాస్త వానికి వేద వాఙ్మయం బహుముఖమైన ఖగోళ జ్యోతిర్మంత్ర తంత్రాది విషయాలకు

మహాకల్పవృక్షం వంటిది. "దశదిశో నానా సూర్యాః" అని సౌరమండలాలు అనేకం ఉన్నాయని పేర్కొన్న వేదవాఙ్మయంలో "సూర్యఏకాకీ చరతి చంద్రమా జాయతే పునః" అని సూర్యుడు స్వతంత్రంగా వెలుగొందుతున్నాడని సూర్య తేజః ప్రభావంతో చంద్రుడు ప్రకాశిస్తున్నాడని స్పష్టంగా పేర్కొన్న వేద వాఙ్మయంలో గ్రహగతులు గురించి వర్ణింపబడలేదనడం హాస్యాస్పదమైన విషయం. 1964 సెప్టెంబరు 13 వ తేదీన ఆకాశవాణి హైద్రాబాదు కేంద్రం నుంచి ప్రసార మైన నా ప్రసంగంలో వేదఋషుల ఖగోళ విజ్ఞానంగురించి వివరంగా పేర్కొంటూ ఋగ్వేద ఋషి సధ్రి — మామూలుగా మన శాస్త్రాలు చెప్పినట్లు తొమ్మిది గ్రహాలు కాక — మొత్తం 36 గ్రహాలున్నట్లుగా గుర్తించి ఒక ఋక్కులో స్పష్ట పరచినట్లు నేను బయటపెట్టాను.

"షట్త్రింశాంశ్చ చతురః కల్పయన్త
శ్ఛన్దాంసిచ దధత ఆద్వాదశమ్ ।
యజ్ఞం విమాయ కవయో మనీష
ఋక్సామాభ్యాం ప్రరథం వర్తయన్తి ॥

(ఋగ్వే-10 మం-8 అష్ట-114 సూక్తం-6 ఋక్కు).

వేదర్షియైన సధ్రి "షట్త్రిశాంశ్చ" ఇత్యాదిగా ఉన్న ఈ ఋక్కులో తొమ్మిదీ, పదీ, ఇరవైకావు మొత్తం 36 గ్రహాలున్నట్లు పేర్కొన్నాడు. ఈ 36 గ్రహసంఖ్యనే సంఖ్యా శాస్త్రానుగుణంగా తరువాత జ్యోతిశ్శాస్త్రవేత్తలు 3 + 6 = 9 గా-నవగ్రహాలుగా తగ్గించి పేర్కొన్నట్లు స్పష్టమవుతున్నదని అప్పటి నా ఆకాశ వాణి ప్రసంగంలో సప్రామాణికంగా నిరూపించాను. యజుర్వేదం శుక్ల కృష్ణ యజుర్వేదాలుగా రెండుగా విభజింపబడి శుక్ల బహుళపక్ష పరమై "దశదిశో నానా చంద్రమాః" అన్నట్లు అనేకానేక చంద్రగోళాల రహస్యాలను వాటి వృద్ధి క్షయాలను శుక్ల కృష్ణ పక్షాలపరంగా ఖగోళ విజ్ఞాన ప్రతిబింబమై ప్రత్యక్ష ప్రమాణంగా వెలుగొందుతూ ఉండగా వేద వాఙ్మయంలో తిథుల వృద్ధి క్షయాల గురించి పేర్కొనలేదనడం నరసింహకవి వేద ఖగోళ విజ్ఞాన అనభిజ్ఞతకు గీటు రాయిగా గోచరమవుతున్నది. సూర్య చంద్రోదయాస్తమయాలను వర్ణించిన వేదాలు వివిధ రాసులనేకాక దశదిక్కులనేకాక అష్టదిగ్గజాలనుసైతం ఖగోళశాస్త్ర పరంగా పరమవైజ్ఞానికాలుగా వర్ణించగా లగ్నవిషయాలను వర్ణించలేదనడం కేవలం అజ్ఞాన విలసితమే కాగలదు. ఏమైనా వేద వాఙ్మయంపట్ల నరసింహ కవికున్న అధ్యయనాభివేశాన్ని అభిమాన గౌరవాలను మనం హృదయపూర్వకంగా ప్రశం సించవలసిందే.

వాఙ్మయ మహోధ్యక్షుని

# నారదీయపురాణం - ఉపనిషత్తులు

శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలన్న వాక్యం ప్రకారం గతంలో ఉటంకించిన భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు, ఉపనిషత్తులు సైతం వాస్తవానికి పురాణాల కంటే ఆధునికాలుగానే పరిగణించవలసి వున్నది. కాని ఉపపురాణ, పురాణాలలో సైతం అనేక సందర్భాలలో ఉపనిషద్విషయాలను పేర్కొనడం తద్గత వాక్యాలను ఉదాహరించడం కూడా జరిగింది. అయితే యివి ప్రక్షిప్తాలుగా అనంతర కాలంలో చేర్చబడ్డాయేమోనని అనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో సంస్కృత మూల పురాణోప పురాణాలలో లేనిచోట్లకూడా అనువాదకర్తలు తమ ప్రతిభా పాండిత్యాలను ప్రదర్శించడంకోసం తామధ్యయనం చేసిన బహుళ గ్రంథాల విషయం యితరులకు తెలపడం కోసం పూర్వాపరకాల వ్యత్యాస నిర్ణయాల ఊహ లేకుండా చారిత్రక దృష్టికి భిన్నంగా పెక్కు విషయాలు ఉటంకించారు. ఇదే పద్ధతిలో నరసింహాకవి సైతం వివిధ సందర్భాలలో ఉపనిషద్విషయాలను పేర్కొన్నాడు. కొన్ని సందర్భాలలో ఉపనిషద్విషయం అని పేర్కొంటూ మరికొన్ని సందర్భాలలో అసలు ఉపనిషద్వాక్యాలను సైతం ఉదాహరించాడు. ఉపనిషత్తులలో వేదమంత్రాలు పేర్కొనబడి వ్యాఖ్యాతాలౌతాయి. కాబట్టి ఉపనిషత్తులలో పేర్కొనబడిన వేదమంత్ర భాగాలను సైతం ఉపనిషద్వాక్యాలుగానే పేర్కొనడం జరిగింది. పరబ్రహ్మతత్త్వం గురించి వివరించే సందర్భంలో సూర్యునివల్ల ఆరోగ్యం, నలునివల్ల సంపద, శంకరునివల్ల బోధ, విష్ణువువల్ల ముక్తి పొందాలని ఉపనిషత్ప్రోక్తమైనట్లు నరసింహా కవి యీ క్రింది పద్యంలో పేర్కొన్నాడు.

> "అర్కుని వలన నారోగ్య మాయె నలుని
> వలన సిరియును శంకరు వలన బోధ
> మచ్యుతు వలన ముక్తియు నందవలయు
> ననఁగ నుపనిషదుక్తి యుక్తార్థముగను"

(నారా. 327 పు. 37 ప.)

పరబ్రహ్మ రహస్యార్థ విశేషాలను వర్ణిస్తూ, అనేక ఉపనిషద్విషయాలను ప్రత్యేక విశిష్టతతో వివరించాడు. త్రిపాద్విభూత్యుపనిషత్తు వొకటి వున్నట్లు విజ్ఞులందరికీ తెలిసిన విషయమే. అయితే పరబ్రహ్మ రహస్యార్థ విద్యాసాధనలో పురుషుడు అధిగమించవలసిన అత్యున్నతమైన లౌకిక శక్తులలో త్రిపాద్విభూతి శక్తి వొకటి. త్రిపాద్విభూత్యుపనిషద్విషయాలను జీర్ణించుకొని సిద్ధిపొందిన వ్యక్తి తద్విషయాలను అతిక్రమించగలడు. ఈ విషయాన్ని వేద ప్రామాణ్యంగా వక్కాణిస్తూ నరసింహాకవి యీ క్రింది పద్యం రచించాడు.

"తెలివగఁ ద్రిపాద్విభూతి నతిక్రమించి
యే పురుషుఁడుండు శుద్ధ సమిద్ధ మహిమ
నాతఁడాద్యుండు పరమాత్మ యవ్యయుండు
ఘనతరుండు పరంజ్యోతి యనియెశ్రుతియు."

(నార. 344. పు : 113. ప).

ఉపనిషద్విద్యల పరంగా నరసింహకవి వివిధ ఆవరణల విషయాలను పండితైక వేద్యంగా, వేదవేదాంత వేద్యంగా, అతి విపులంగా వర్ణించాడు.

"ఏ యే యావరణంబుల
నే యే లోకంబులుండు నెఱిఁగింపుము నా
కా యుపనిషదుక్తుల విని
యా యజ ముఖ్యులు నిజాలయస్పృహ విడువన్.

(నార. 345. పు : 120. ప).

అని శుకునిచేత ప్రశ్నింపజేసి పంచావరణాగణ్య నియతలోకాలను పరాశరాత్మజుని ద్వారా, ప్రకృష్టంగా తెలియజేశాడు. వైష్ణవుల వైశిష్ట్యం గురించి వర్ణించే సందర్భంలో "ఇది మొదలుగా నేతద్వాక్యోప బృంహిత మహోపనిషదాద్యుపనిషత్తుల యందును హరి లాంఛనంబు వహింపఁగా వలయునని వినంబడియె మరియు" (నార. 351 పు : 136. వ.). వైష్ణవ ప్రతికూలానుకూలానుభయ భేదాలను వివరించే సందర్భంగా—

"గురుభక్తిమైఁ బ్రతికూలానుకూలాను
భయ భేదముల నేరుపడిన చేత
నుల నెఱింగి సుధీజనుండు నిజాధిక
రోచితంబుగఁ దగు నాచరింప
నుపనిషన్మత వాక్య యోజన నూహించి
హరి సమాధిక రహితాత్ముఁడనిన"

(నార. 353. పు : 150 ప.)

అని వైష్ణవ విభేదాలన్నీ ఉపనిషన్మత సమ్మతాలుగానే పేర్కొన్నాడు. అనంతరం వేదాంత మత వైశిష్ట్యం గురించి వివరిస్తూ "బాహ్యా దృష్టులు లేని దేశంబునకుం జని నైమిశాది పుణ్యక్షేత్రంబుల విజ్వరులై పరబ్రహ్మోపనిషద్భావనం గొందరు ప్రవర్తిల్లుదురు" (నార. 377. పు : 247. వ.) అని పరబ్రహ్మోపనిషద్విషయాన్ని ఉదాహరించాడు. తరువాత ఉపనిషద్విషయ వ్యతిరేకులైన దుష్టులు సత్పురుషులను దుర్మార్గాలలో యేవిధంగా పెడతారో పేర్కొంటూ "మరియు

వాఙ్మయ మహోధ్యక్షుని

నుపనిషత్పుంజంబున కాక్షేపంబు పుట్టించి ప్రాణసంహార పర్యంతంబు నను దినంబును భయంబు నొందించి ఖలులు సత్పురుషులచేతఁ దప్పుడుంబు విడిపించిరి. కొందఱు బాహ్యాగమత విషాబ్ధి మునింగిరి. కొందఱు నూరునూరులు వహ్నిపరీతంబు లైన భవనంబులు విడిచిన యట్లు నిజదేశంబులువిడిచి చనిరి. బాహ్యాగమ్య దేశంబుఁ బ్రవేశించి నూరులు మఱికొందఱు దీనులై కానంబడక విష్ణువును భజించిరి. సంసార విష వారాశియందు నమృతంబైన వేదాంత దర్శనంబు తద్ద్వేషోదధి నిమగ్నంబై యుండిన విషయకాంతులగు సురలకు వేదాంత విచారంబులు వలువదు. సాత్వికు లాసుర భయంబున వేదాంతంబునుడప వెఱతు రదిగావున వైష్ణవులకిచ్చుట నిలువం జనదని సనకాదులు హరి మాయాప్రభావంబు ప్రశంసింపుచు బ్రహ్మాండంబు వెడలి మహా భూతావరణంబునకుం జని.'' (నార. 378. పు. 249. వ) అని వివరించాడు. శ్రీ మహావిష్ణు మహత్తర శక్తిని వర్ణిస్తూ "శ్రీ మద్విభూతిం దనరు నితండు సర్వోపనిషదర్థంబు, మహాప్రభువు." (నార. 499 పు. 235. వ.) అని సర్వోపనిషదర్థ స్వరూపుడుగా పేర్కొన్నాడు.

పరబ్రహ్మతత్త్వాన్ని వివరించే సందర్భంలో సర్వాంతర్యామి అయిన హరిని వర్ణిస్తూ "ఇందునకు 'యో బ్రహ్మాణం విదధాతిపూర్వ' మ్మను నుపనిషద్వాక్యంబు గలదు." (నార. 326. పు. 33. వ.) అని ఉపనిషద్వాక్యాన్ని ఉదాహరించాడు. నరసింహకవి అనేక ఉపనిషత్తులను ప్రత్యేకంగా పరిశోధించినట్లు కనిపిస్తున్నది. మామూలుగా పండితమండలిలో ఉపనిషత్తులు అష్టోత్తర శతసంఖ్యాకే పరిమితాలని ఒక అభిప్రాయం వున్నా కల్పితాలుగానో, కాకుండానో 120 వరకూ ఉపనిషత్తులు అవతరించాయి. నరసింహకవి 'విశ్వైక్యోపనిషత్తు' అనే పేరుగల ఒక ఉపనిషత్తును పరిశోధించినట్లు జీవపరమాత్మల భేద సిద్ధిగురించి వివరించే సందర్భంలో "తేజంబు వోయిన వెనుక మందిరం బంధకారావృతంబయిన నంధకారంబ యని యందురు ; ఇత్తెఱంగున విశ్వైక్యోపనిషద్వాక్యంబులకు గతి గలిగియుండుటం జేసి యైక్యవాక్యంబులకు శ్రుత్యపికావగత మహాదార్ఢ్యచేత నైక్య వాక్యంబులకు ముఖ్యార్థహీనత యెక్కడిది ?" (నార. 390. పు. 14. వ.) అని విశ్వైక్యోపనిషద్విషయాన్ని పేర్కొన్నాడు. అంటే నరసింహకవి కాలంలో వున్న విశ్వైక్యోపనిషత్తు మన కిప్పుడు లభ్యంకాలేదు కాబట్టి, ప్రాచీనకాలంలో ప్రామాణికాలుగా భావించబడిన ఉపనిషత్తులు కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయని మనకు తేటతెల్లమవుతున్నది. విష్ణు మహిమ—ఉభయపద ప్రాప్తి గురించి వర్ణిస్తూ "శ్రుతి స్మృతులే తదర్థ నిర్వాహకంబులై యుండు" (నార. 364. పు. 189. వ. అని ఉపనిషత్తులను విడిచిపెట్టి శ్రుతి, స్మృతులను మాత్రమే ప్రామాణికాలుగా పేర్కొన్నాడు. అయితే ఆధునికా లనబడుతున్న ఉపనిషత్తులు

మహామథన సారామృతం

నరసింహాకవి దృష్టిలో నరసింహావతార కాలంకంటే పూర్వమే స్థానాన్ని సంపాదించుకొన్నాయి. హిరణ్యకశిపుడు బ్రహ్మవల్ల వరాలు పొందిన తరువాత పేరోలగంలో సూట్లాడుతూ "ఉపనిషత్తులకు సిద్ధవస్తు విషయంబైన ప్రామాణ్యం బంగీకరింపఁ బడదు." (నార. 431. పు. 169. వ.) అని ఉపనిషత్తుల ప్రామాణికత్వాన్ని తిరస్కరించినట్లు పేర్కొన్నాడు. ఈ సందర్భంలో ఉపనిషత్తులు నరసింహావతార కాలానికి పూర్వమే ఆవిర్భవించినట్లు స్థానం సంపాయించుకున్నాయన్నమాట, అలావుండగా- శౌరి, సనకాదులకు కర్మకాండాది విషయాలు తెలిపే సందర్భంలో అసలు విష్ణువే "ఇట్లు నాకు స్వాధీన విశ్వత్వ ముపనిషత్తులు పలికెనట్లనే నాకుఁ గర్మకాండంబును సావకాశంబగ్యె నిందునకు సందేహంబు లేశంబును లేదు; నన్ను నెవ్వి యడుగవలయు రహస్యం బడిగెద రది యెఱింగింతు వినుండు.'' (నార. 413-పు. 83. వ) అని ఉపనిషత్తుల గురించి పేర్కొన్నట్లు నరసింహకవి రచించాడు. కొన్ని సందర్భాలలో కేవల శ్రుతి స్మృతులే పరమప్రామాణికాలని నరసింహాకవి పేర్కొన్నా, అసలు ఉపనిషత్తులుకూడా వేదాలవలెనే దేవ వాఙ్మయంగా భావించినట్లు కనిపిస్తున్నది. సర్వేశ్వరుని సర్వజనేచ్ఛానువృత్తిని గురించి వివరించే సందర్భంలో ప్రత్యక్షమైన విష్ణువును నుతించిన తరువాత వైష్ణవేతరులైన మూర్ఖుల గురించి చెబుతూ

కొందఱు మూఢులు గురుతత్త్వధీహత
భావతాపన్మాత్ర దేవతోప
నిషదాగమములు కొన్ని యెఱింగికొని స్వమ
నీషానుసారైక నియత మహిమ''

(నార. 382 పు 269. వ.)

అని ఉపనిషదాగమాలు దేవవాఙ్మయంగా విస్పష్టంగా వక్కాణించాడు. నరసింహకవి ఉపనిషత్తులను వేదాలవలె దేవ వాఙ్మయంగా భావించబట్టే, అటు హిరణ్యకశిపుని నోటివెంట, యిటు శ్రీ మహావిష్ణువు నోటితోసైతం ఉపనిషద్విషయాలను ప్రస్తావింపజేసినట్లు కనిపిస్తున్నది.

## పురాణగాథల కాల నిర్ణయంలో వ్యత్యాసాలు - స్వవచన వ్యాఘాతాలు

పురాణం వివిధ వేదార్థాలను సూటిగా ప్రతిబింబిస్తాయని నరసింహా కవి యీ క్రింది పద్యంలో విస్పష్టంగా వక్కాణించాడు.

''బహువాదమూలమై భాషించు వేదంబు
యజ్ఞకర్మ క్రియాద్యంబు వేద
మఖిల గృహస్థాశ్రమస్ఫూర్తి వేదంబు
స్మృతి మర్మవిద్యయా హృద్య వేద

వాఙ్మయ మహోద్యతుని

మమిత పురాణరహస్య తంత్రము వేద
మాదిస్య పురుష జన్మములు జగము
లలైన వాజ్మయంబంతయు నీపురా
ణంబులయందె ధన్యతవహించె

నట్లుగాన బురాణార్థ మధికతరము
తెలియ వేదార్థమునకంటె వెలయుననుచు
సుప్రతిష్ఠము చేసిరి సూటిగా బు
రాణములయందు వేదతంత్రంబులెల్ల.''

(నార.275.పు.53.వ.)

అయితే కొన్ని సందర్భాలలో ఉపనిషత్తులకు తరువాత-పురాణాలమాట చెప్పలేము కాని - ఉపపురాణాలు అవతరించాయన్న భావంతో నరసింహకవి అనేక సందర్భాలలో ఉపనిష ద్వాక్యాలను ఉదాహరించాడు. ఆత్మ దేహాదుల విషయమై వివరించే సందర్భంగా "క్షరం ప్రధాన మమృతాక్షరమ్మ" నియెడి యుపనిష ద్వాక్యంబుగలదు............' ఏకోదేవ సర్వభూతేషు' అనియెడి యుప నిషద్వాక్యంబుగలదు.................. 'సపర్యగాచ్ఛుక్రమకాయ మవ్రణమ్మ'ను ఉపనిషద్వాక్యంబుగలదు... 'నిత్యోనిత్యానామ్' అనియెడి యుపనిషద్వాక్యంబు గలదు.'' (నార. 325. పు: 29. వ.) అని అనేక ఉపనిషద్వాక్యాలను ప్రామాణి కాలుగా ఉదాహరించాడు. ఇదే విధంగా వేదాంత రహస్యంగురించి వివరించే సందర్భంలో సైతం విప్రుడనేవాడు అంగాలతో సహా ఉపనిషత్పూర్వకాలుగా వేదాలు చదవాలని యీ క్రింది పద్యంలో స్పష్టంగా పేర్కొన్నాడు.

''సాంగోపనిష త్పూర్వక
ముంగా వేదములు చదవిమురజిత్సేవా
సంగంబులేని విప్రుడు
వెంగలి తజ్జన్మ మెల్లవిఫలం బెంచన్.''

(నార. 335. పు: 68. వ.)

వాస్తవం పరిశీలిస్తే పురాణగాథలుకాని, ఉపపురాణగాథలు కాని సూత్ర ప్రాయంగా ఏకైక సూత్ర బద్ధాలేనని పూర్వాపర కాలవ్యత్యాసాలకు అవకాశం కల్పించేవికావనీ, కల్పాలపరంగా కాని, యుగాలపరంగా కాని మనం ఆమోదించ వలసివుంటుంది. కాని దేశభాషలలోకి పురాణోపపురాణాలను అనువదించేటప్పుడు అనువాదకులు యీ పూర్వాపరకాల వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకొని భూత

భవిష్యద్వర్తమానకాలాది క్రియలను ప్రయోగించినట్లు కనపడదు. నారదీయ పురాణాన్ని చదివితే ప్రహ్లాదుడు సంజనితుడవ్వడానికి పూర్వమే ప్రహ్లాదాది చరిత్రలు నారదుడు చెప్పినట్లు అర్థమవుతుంది. కాని కొన్ని సందర్భాలలో భూత భవిష్యద్వాచకాలైన క్రియలను ఉపయోగించడంలో నరసింహాకవి తికమకలు పడి నట్లు స్పష్టంగా విదిత మౌతున్నది. విష్ణుచిత్తుడు ప్రహ్లాదునికంటె పూర్వుడు. విష్ణు చిత్తునికథా వర్ణనా సందర్భంలో నరసింహాకవి యీ క్రింది పద్యం రచించాడు.

"విష్ణుచిత్తా! నినుంజూడ వేడ్కగలిగి
యరుగుదెంచితిఁ బ్రహ్లాదుఁ డంద్రునన్ను
నీ మహత్వంబు విని వినినీరజాక్షు
భక్తినిష్టా పరత్వ మేర్పడఁగఁ గంటి."

(నార. 168. పు. 105. ప).

ఆ తరువాత విష్ణుచిత్తునికి విష్ణువు ప్రత్యక్షమైన విషయాన్ని వర్ణించి "కాంచి మ్రొక్కినుతించి బ్రహ్మాది లోకంబులు నిరసించిన యమ్మహానుభావుండు సద్యో ముక్తుండయ్యెనని చెప్పిన, ఋషులు విని నారదునకిట్లనిరి." (నార. 169.పు. 112. వ.) అని నరసింహాకవి వ్రాయడంద్వారా-ప్రత్యేకించి "సద్యోముక్తుం డయ్యె" అన్న భూత కాలక్రియను ప్రయోగించి నారదుడు చెప్పినట్లుగానే వ్రాయడంద్వారా ప్రహ్లాదాది చరిత్రలు జరిగిన అనంతరమే నారదుడు ఋషులకి కథను చెప్పినట్లు ద్యోతకమవుతున్నది. రత్నావళి వృత్తాంత వర్ణనా సందర్భంగా ఒక రాక్షసుడు కాశీపతి పుత్రియైన రత్నావళిని హరించిన సందర్భంలో నరసింహ కవి "దశాననుండు సీతంబోలె హరించి, మొఱలిడనంకంబున నిడికొని" (నార. 288. పు. 118. వ.) అని సీతను రావణాసురుడపహరించిన విషయంతో పోల్చి నరసింహావతారానికి పూర్వమే వ్రాయబడిన నారదీయపురాణం రామాయణం తరువాత రచింపబడిందన్న అభిప్రాయం కలిగేట్లుగా నరసింహాకవి పూర్వాపర దృష్టి లేకుండాం రచించాడు. పరబ్రహ్మ రహస్యార్థంగురించి వివరించే సందర్భంలో నరసింహాకవి "ప్రథితేతి హాసపురాణోప బృంహితోపనిషన్మతము పరబ్రహ్మపరమ ధామాక్షరాదిపద విశిష్టసంజ్ఞక మాగమేతరదూరమనఘతరము" (నార. 342. పు. 105. ప) అని భారతేతిహాసాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసినట్లు కనిపిస్తున్నది. ఇదే విధంగా మోహిని, రాజు ధర్మాంగదుణ్ని చంపాలని కోరేసందర్భంలో "పురందరునకుఁ గర్ణుండు చర్మంబొప్పింపఁడె?" (నార. 302. పు. 168. వ.) అని ధర్మాంగదుని కథ భారతగాథానంతరం జరిగినట్లుగా పొరపాటున పేర్కొన బడింది. ఇదేవిధంగా నరసింహాకవి మోక్షోపాయత హితాన్ని వివరించే సందర్భంగా

వాఙ్మయ మహోధ్యక్షుని

"ఖట్వాంగుఁడను రాజర్షి ముహూర్తాయుః ప్రమాణం బెఱింగి సర్వంబు విసర్జించి హరిం జెందె. పరీక్షితుండు సప్తాహంబు జీవితావధిగాఁ దెలిసి నిఖిలంబుం బరిత్యజించి యపవర్గంబు గాంచె నట్లగుట న్యాసవిద్య సర్వఫలప్రద." (నార. 340పు. 95.వ) అని ద్వాపర యుగాంతంలో వున్న పరీక్షిత్తు గురించి పేర్కొని "అపవర్గంబు గాంచె" అని భూతకాల క్రియను ప్రయోగించడం రూపంగా యీ నారదీయ పురాణం పరీక్షిత్తుకు తరువాతనే అంటే కలియుగంలో రచించబడిందన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాడు. ఇదే విధంగా అనేక సందర్భాలలో కలియుగంలో బాగా ఆధునికా లనుకొన్న విషయాలను సైతం "అంగవేదియైన పాణిని యజిధాతువును దేవపూజయందు విధించెను." (నార.400.పు.49.వ.) అని "విధించెను" అనే భూతార్థక క్రియను వాడడంద్వారా నారదీయపురాణం పాణినికి తరువాత రచింపబడిందన్న అభిప్రాయాన్ని కలిగించాడు. ఈ నరసింహకవే శౌరి సనకాదులకు కర్మకాండాది విషయాలు తెలిపే సందర్భంగా "అనీశ్వరాత్ములై కర్మములందు స్వతంత్రులు గానివారికిఁ గర్తృత్వ మెక్కడిది ? పాణిని స్వతంత్రః కర్తా యనఁడు గాన, "(నార.409.పు.63.వ.)అని 'అనఁడు' అను భవిష్యదర్థకమైన క్రియను ప్రయోగించడంద్వారా "భవిష్యత్తులో పాణిని చెప్పడు" అని శౌరి పేర్కొన్నట్లు స్పష్టంగా ఉటంకించాడు. "వేదాంత మతమునకంటె నన్యమగు మతము మంచిదికాదని తెలియక యీ వేదాంత మతము నాదరించక యీ ప్రకారమునను స్వగోష్ఠినిష్ఠులైన ఛాందసులైన వారి మనస్సులను నల్పులైన వారల నతికల్పనులైన మోహంబు నొందించి రప్పుడు.

మహిని సురాచార్య మతము లోకాయత
మతమును సౌగత మతము భార
తీశ మతంబు మిహేశ మతంబును
జైమిని మతమును జైనమతము
కాణాదమతమును గౌతమ మతమును
గపిల మతంబును ఘనతకెక్క
నంతకంటెను బ్రశస్తంబె వేదాంత మ
తంబు సభా సమ్మతంబె తెలియ

నభ్రపుష్పోపమంబు వేదాంతమతము
తన్మహాసౌరభాఘ్రాణ తత్పరాభి
మాన మాయామిళిందాయమాన మాన
మానవులు గొందరంధ్రు దుర్మత్సరమున.

మహామథన సారామృతం

అద్దురాత్ములు పలికినట్లపుడె నమ్మి
యందుఁబడి యాసురాత్ములై యఖిలజనులు
వైదికాచార విముఖులై వైష్ణవులును
విష్ణుదేవుని నిందించి విమతులైరి.''

(నార.377.పుట;244,245,246.ప)

ఇత్యాది సందర్భాలలో భూతకాల క్రియలను ఉపయోగించడం ద్వారా పురాణ ప్రామాణికతను, ప్రాచీనతను ఆధునిక యుగానికి తీసుకొనివచ్చి, అసలు పురాణాలు భవిష్యద్వాణిగా ప్రోక్తాలయ్యాయనే అభిప్రాయానికి గొడ్డలిపెట్టుగా ప్రాచీనాధునాతన కాల చరిత్ర జ్ఞాన విరహితత్వంవల్ల స్వవచన వ్యాఘాతంగా రచన కొనసాగించాడు. అనేకానేకాలైన ఆధునిక మతాలను పేర్కొనడంద్వారా చివరికి ''జైమినియందు జైనవీరులయందు మొదలు సత్పురుషులకు విశ్వాసంబు పుట్టింపుచున్నవాఁడై యతివాదంబుచేతం గర్మైక ప్రాధాన్యాదికంబును సూచించె." (నార.406.పు.51.వ.)

అమరగురు బుద్ధకణ భుగక్షపాజ్జినేంద్ర
గౌతమాదులు సాధులోక ద్విషద్భృ
మంబుగావింప బాహ్యశాస్త్రంబులెల్ల
మేరమీఱఁగఁ గొన్ని నిర్మించి రంత"

(నార.441.పు.216.వ.)

అని బుద్ధమతాలన్నే కాక, జైనవీర మతాన్నిసైతం పేర్కొనడంద్వారా నారదీయపురాణ ప్రాచీనత్వాన్ని అర్వాచీనంచేసి అప్రామాణికం చేశాడు. చివరికి హిరణ్యకశిపుని వర్ణించిన సందర్భంలోసైతం "ఆజ్ఞాసిద్ధ శ్రౌతహింస జైనుండుఁ బోలె దూషింపుచు." (నార.433.పు.176.వ.) అని హిరణ్యకశిపుని జైనమతస్థునితో పోల్చి నరసింహకవి తన పూర్వాపరకాల అనభిజ్ఞతను నిరూపించుకున్నాడు. నరసింహకవి తృతీయాశ్వాసంలో పాషండ మతభేదాల గురించి చెపుతూ భవిష్యద్వాణిగా కాణాద, శాక్త్య, పాషండ, జైనాది మతాలు భవిష్యత్తులో తలయెత్తుతాయని యీ క్రిందివిధంగా పేర్కొన్నాడు. " అనిన (నతఁడు వారికి) నిట్లనియె. కాణాద శాక్త్య పాషండ జైన ప్రముఖులు నరకాంగార వర్ధనులై విజ్ఞానం బొకానొకప్పుడు చెలఁచి దేహ వ్యతిరిక్తంబైన యాత్మలేదు. కేవలమును దేహమె యాత్మ యనుట యథార్థంబని తెలియంబడుచున్నది గాన దేహాను

వాఙ్మయ మహోధ్యక్షుని

రూపంబుగా వర్ణింపవలయు. తపోయజ్ఞదాన యోగార్చనంబులు సేయుట వృథా యాసంబులని పత్త్వంబునం జూచువారిని మహీతలంబున మోహంబు నొందింతురు. కొంద ఱాత్మదేహ భిన్నంబని యెఱింగియు నా దేహంబునకు క్షణ వినాశత్వంబు తర్క కర్కశులై పల్కుదురు. (నార. 147, 148. పు. 5. ప.) అని ఈ సందర్భంలో నారదుడు మునులకు చెప్పినట్లుగా సూతుడు శౌనకాదులకు చెప్పిన ప్రవచనంలో భవిష్యదర్థకమైన "పల్కుదురు" అన్న క్రియను విస్పష్టంగా ప్రయోగించడం మనం గుర్తించవలసి వున్నది. అనంతరం సరిగ్గా నాలుగు పద్యాల తరువాతనే "శఠులఁ బాషండ జినులను సంహరించె" అని శాండిల్యుడనే మహర్షి పాషండ జైనులను సంహరించినట్లు భూతార్థక క్రియను సూటిగా ప్రయోగిస్తూ నరసింహ కవి యీ క్రిందిపద్యం రచించాడు.

"రూఢి శాండిల్యుఁ డను మునీంద్రుండు మున్ను
పాంచరాత్ర ప్రమాణ ప్రభావశక్తి
నాగమార్థంబు వ్యర్థమౌ నట్లొనర్చు
శఠులఁ బాషండ జినులను సంహరించె."

(నార. 149. పు. 10. ప.)

ఇదేవిధంగా ప్రహ్లాదుడు సభలో నిలిచి తన పాండిత్య తత్త్వ విష్ణుభక్తి మహాత్మ్యాలను వివరించే సందర్భంలో—

"పాషండ మతగర్వ పర్వతంబుల మీఁద
దంభోళియై మహోద్ధతి వహించి
చార్వాకమత మహాసాగరావళి మీఁద
నౌర్వానలస్ఫూర్తి నాక్రమించి
బౌద్ధ దంతావళోద్భట ఘటార్భటి మీఁద
సింహరాజంబు ప్రసిద్ధి నెదిరి
జైన మహారణ్య సంఘాతముల మీఁద
నతుల దావానలంబై స్ఫురించి

కపిలాక్షపాద కాణాద వైరించ
మత ఘనాంధతమస మండలార్క-
మండల ప్రకాండ ఖండనోద్దండత
నట జయించె నాక యాధసుతుఁడు."

(నార. 445. పు. 5. ప.)

మహోమతన సారామృతం

ఇందులో చార్వాక, బౌద్ధ, జైనాది మతాలను నరసింహాకవి తనకు పూర్వకాలంలో అవతరించి వ్యాప్తిచెందిన వాటి నన్నిటిని పేర్కొన్నాడు. నారదుడు మునులకు చెప్పినట్లు సూతమహర్షి శౌనకాదులకు చెప్పిన పద్ధతిచూస్తే, శాండిల్య మహర్షితో పాటు వివిధ పాషండమతాలన్నీ నారదమహర్షికి పూర్వకాలంలోనే వున్నట్లు మనం భావించవలసి వస్తుంది. నరసింహాకవి తన రచనను కొనసాగించేటప్పుడు, సరైన ఆలోచనాక్రమంలేకుండా, పూర్వాపరకాల విచక్షణ లేకుండా భూతార్థక క్రియలు ప్రయోగించడంవల్ల లేనిపోని తికమకలు తెచ్చిపెట్టాడు. ఇదేవిధంగా ఏకాదశీ మాహాత్మ్య వర్ణన సందర్భంలో

"సరణిఁ గానరు యోగంబు సాంఖ్య యోగ
మనఁగ వినరెన్నఁడేని స్వాధ్యాయమైన
హవనకృత్యంబుఁ జేయరు దివిరి వారు
హరిపదముఁ గాంచి రిట్ల యత్యద్భుతంబు."

(నార. 201. పు. 59. ప.)

అని ఆధునిక మతమైన సాంఖ్య యోగప్రసక్తి తెచ్చి "కాంచిరి" అని భూతార్థక క్రియను సైతం ప్రయోగించాడు.

సుచరితునకు కల్యాణతీర్థ మహిమను గంగానది చెప్పిన సందర్భంలో నరసింహాకవి భూమండలంమీద ద్రవిడ దేశాన్ని దారిద్ర్య వారణుడనే రాజు పరిపాలిస్తున్నట్లు "భూతలమునందు ద్రవిడదేశం బేలు దారిద్ర్యవారణుండను రాజు వేఁడిన యంతకంటెఁ దెలివితో నిచ్చునసుచు బోధింప" (నార. 115. పు. 107 ప.) అని తద్ధర్మార్థకమైన 'ఇచ్చు' ధాతుప్రయోగంతో పద్యం రచించినా అనంతర విషయాన్ని బట్టి దారిద్ర్యవారణుడు సుచరితుని సమకాలికుడైనట్లు వీరు నారద మహర్షికి పూర్వులైనట్లు మన కవగతమవుతుంది. అయితే కృతయుగానికి పూర్వం నుంచీ కూడా ద్రావిడదేశం, ద్రావిడజాతి వున్నదన్న అభిప్రాయం స్పష్టమవు తున్నది. పూర్వ దేవత లనబడిన రాక్షసులు, మొట్టమొదట దేవతలుగానే వుండి, శాపవశానో, కర్మవశానో రాక్షసులుగా ఆవిర్భవించినప్పటినుంచీ 'విద్రావణ' శబ్దంమీద ఆధారపడి విధ్వస్థకారకులుగా 'వి' విలుప్తమై 'ద్రావణ' శబ్దం 'ద్రావడ' 'ద్రావిడలు'గా మారి అతి ప్రాచీన కాలంలోనే పరిణామంచెందినట్లు కనిపిస్తున్నది.

నరసింహాకవి చతుర్వేదికి భాగవతానుగ్రహంతో బ్రహ్మరాక్షసత్వం తొలగిన విధాన్ని వర్ణించిన సందర్భంలో "గృధ్ర రూపులైయున్న భార్యా పుత్రులును

దానును హరిభక్తి దర్శన కీర్తనంబుల హృదయంబు ప్రసన్నంబైన ఆ విష్ణుభక్త పదాంభోజ సంగపూత జలంబు దృష్టిపథంబునమున్నఁ బానంబుచేసి యా రాక్షసుండు వైకుంఠ తద్భక్త భుక్తశిష్ట పాత్రక్షాళనతోయ పరికీర్ణాన్న కబళంబులు భుజించి, గృధ్రంబులు దాను జాతిస్మరత్వంబు నొంది వైవస్వతుఁ డానతి యిచ్చిన క్రమంబుఁ దలంచుకొని విష్ణు భక్తాంఘ్రి తీర్థంబున ముక్తియె ఫలియించె" (నార. 139. పు. 213. ప.) అని వైవస్వతుడు ఆనతియిచ్చిన క్రమాన్ని తలచుకొన్నాడని పేర్కొనడం ద్వారా వరాహ నరసింహాది అవతారాలు వైవస్వత మన్వంతరంలోనే జరిగినట్లు నరసింహకవి అభిప్రాయపడినట్లు కనిపిస్తున్నది. ఏకాదశీ మాహాత్మ్యాన్ని వర్ణిస్తూ "వైమనస్య మందె వైవస్వతుం డంతఁ! జిత్రగుప్త లేఖ్య పత్ర లిఖిత! దురిత పుణ్య లిపుడు తుడుపులు పడిరి తద్విష్ణుదివస మహిమ వింత కాదె!" (నార. 197. పు. 39. ప.) అని వైవస్వతుని తరువాతనే నారదీయ పురాణ రచన జరిగిందన్న భావాన్ని వ్యత్యస్తంగా వ్యక్తీకరించాడు. గతంలో పురాణాల చరిత్రను గురించి అవతరణను గురించి చర్చించిన సందర్భంగా వివిధ కల్పాలలో విభిన్న పురాణాలు అవతరించినట్లు ప్రాచీను లభిప్రాయపడిన విషయం అభివ్యక్తం చేయబడింది. కాగా నరసింహకవి దృక్పథంతో ప్రస్తుత వైవస్వత మనువు ఆనతి గురించి విస్పష్టంగా, ఇదమిత్థంగా, చతుర్యుగాలపరంగా మనం యేమీచెప్పలేము. వైవస్వత మన్వంతరంలోనే యిప్పటికి 26 చతుర్యుగాలు నడచి 27 వ చతుర్యుగంలో చివరిదైన కలియుగం నడుస్తున్నది. ఈ దృష్ట్యా వేలకొలది అవతారాలను పేర్కొన్న వేదవాఙ్మయాన్ని ప్రమాణంగా తీసుకొన్నప్పుడు, దశావతారాలు కేవలం పరిమితాలై యుగకాల నిర్ణయాలలో ఒక విస్పష్టమైన అభిప్రాయానికి రావడానికి నిక్కచ్చిగా తోడ్పడుతాయని మనమేమీ చెప్పలేము.

నిజానికి నారదీయపురాణం యెపుడో కృతయుగంలోనే (ఏ కృతయుగం లోనో చెప్పలేము) వ్రాయబడిందని, లేదా నారద ప్రోక్తమైందని, నారదీయ పురాణంవల్లనే మనకు సుస్పష్టం అవుతున్నది. రామగాథ భవిష్యత్తులో జరుగ బోతున్నదని, భవిష్యద్వాణిగా యీ కృతిలో పేర్కొనబడడమే కాక, ఆ రూపంగా రామగాథకు పూర్వమే యీ కృతి రచింపబడిందని యీ క్రింది పద్యంవల్లనే స్పష్టమవుతున్నది.

"రాఘవుని యాజ్ఞ సౌమిత్రి రణమునందు
నింద్రజిత్తునిఁ దునుమ నా యింద్రజిత్తుఁ
డతి సహాయంబు తానెయై యవనియందుఁ
గలి పురుషుఁ బాయక చరించుఁ గలుషవృత్తి."

(నార. 173. పు. 126. ప.)

ఈ సందర్భంలో 'తునుమన్' అని అన్నఁ తార్థక క్రియను 'చరించున్' అని తద్ధర్మార్థక క్రియను ప్రయోగించడం ద్వారా యిది భవిష్యత్తులో జరుగబోతుందన్న విషయాన్ని నరసింహాకవి తేటతెల్లం చేశాడు. ఇదేవిధంగా నరసింహాకవి రత్నావళీ వృత్తాంత వర్ణనా సందర్భంలో భవిష్యద్భారత పురాణ విషయాన్ని భవిష్యత్తులో జరుగనున్న విషయంగానే యీ క్రిందివిధంగా పేర్కొన్నాడు. "భవిష్యద్భారత పురాణంబున హిడింబి యను రాక్షసి భీమసేనుం డను పాండవునకు భార్య గాఁగలదు. అతనికంటె బలాధికుండైన ఘటోత్కచుండను తనయుండు జనియింపఁ గలండు. వాని నే శస్త్రంబుల వధింపఁ దరంబుగాదు. ఇంద్రశక్తి చేత సాధ్యుండు గాఁగలఁడు.'' (నార. 290. పు. 129. వ.). నిజానికి నారదీయ పురాణం వరాహ నరసింహావతారాలకు పూర్వమే ప్రోక్త మయిందని శౌరి సనకాదులకు మోక్షప్రాప్తి విధానాన్ని యెరిగించిన సందర్భంలో విస్పష్టంగా తేటతెల్ల మవుతున్నది.

''ఔరసపుత్రుఁడై శ్రుతి శిఖార్థములాడుచు మామకుం డొకం
డీరస మొప్పఁ దండ్రిఁ గవయించఁగ మీఁదనె తీర్చువాదులన్
సూరలగెల్చి శౌరి నిదె చూపెద నెందు నటంచు నాడినం
జేరి మహోగ్ర వీరనరసింహ నిజాకృతిఁ గాంచి నిల్చెదన్.

పాటిల్లెదు నీ మాయా
నాటక సూత్రంబునందు నా ప్రతిహారుల్
మేటులు జయ విజయులు ని
త్యాటోపులు మత్ప్రయోజనాయత్తు లిలన్.

(నార. 417. పు. 102, 104. ప.)

ఈ సందర్భంలో విష్ణువు జయ విజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా సంజనితులవ్వడానికి పూర్వమే తన నరసింహావతార విశేషాన్ని గురించి విస్పష్టంగా వక్కాణించినట్లు ద్యోతక మవుతున్నది. అంతేకాదు, నారద ప్రోక్తమైన యీ పురాణంలో నారదుని కంటే అతి ప్రాచీనకాలంలోనే జరిగిన చతుర్వేది కథను నారదుడు మునులకు వివరించిన పద్ధతి చూడగా నారదీయపురాణ ప్రాచీనత్వమేకాదు, నారద ప్రోక్తత్వంసైతం స్పష్టంగా తేటతెల్ల మవుతున్నది. ''అనిన మునులం జూచి నారదుండు మద్గురుండు నాకు నానతి యిచ్చిన క్రమంబు వినుం డెఱింగించెదనని యిట్లనియె'' (నార. 129. పు. 166. వ) అని నారదుడు తనకు తన గురువు చెప్పిన రాజపురోహితుడైన చతుర్వేది కథ చెపుతాడు. ఈ కథారూపంగా చతుర్వేది బ్రహ్మరాక్షసు డవ్వడం, అనంతరం భాగవతానుగ్రహంతో

ఆ బ్రహ్మారాక్షసత్వం పోవడం, తద్రూపంగా విష్ణుభక్తి మాహాత్మ్యాన్ని వివరించడం జరిగింది.

ప్రహ్లాదుని విద్యాభ్యాస వర్ణనా సందర్భంగా—నరసింహావతారానికి పూర్వమే విష్ణువు నుద్దేశించి- యీ క్రింది పద్యంలో కృష్ణావతారం జరగకముందే 'కృష్ణ' శబ్దాన్ని ప్రయోగించాడు.

"ఘన దైవ పౌరుషాగత
ధనమంతయు నాశ్రిత జనతతి వీడ్కొని తా
ననుభవమునకుం గొనుపా
వని కృష్ణుఁడు జగతిలోన ఒక వృత్తియగున్.

(నార. 442. పు. 223. వ.)

దీనివల్ల కృష్ణావతారానికి పూర్వమే విష్ణువుకు కృష్ణ నామం వున్నదని మనం ఆమోదించవలసి వస్తుంది. విష్ణువును మహత్తర దైవ స్వరూపునిగా మనం ఆమోదించినపుడు అతని సహస్ర నామాత్మునిగా సైతం ఆమోదించి కృష్ణావతారానికి పూర్వమే విష్ణువుకు కృష్ణనామం వున్నట్లు మనం ఆమోదించవలసి వుంటుంది. నారదీయ పురాణం భవిష్యద్వాణిగా నారద ప్రోక్తంగా మనం ఆమోదించినప్పుడు సైతం భవిష్యత్తులో రాబోయే రామ, కృష్ణావతారాల గురించి నారదుడు చెప్పడం సమంజసమే కాబట్టి విష్ణుపరంగా కృష్ణ శబ్దాన్ని ప్రయోగించడంలో మనకు విప్రతిపత్తి యేమీ కనిపించదు.

## విశిష్ట విషయాలు

నరసింహకవి కృత్యవతారికలో కృతిపతి అయిన శ్రీకృష్ణుని అవతార విశేషాలను అనేక విధాలుగా దాదాపు కృష్ణచరిత్రను వర్ణనారూపంగా చిత్రీకరించాడు. శ్రీకృష్ణ జాంబవంతులకు జరిగిన యుద్ధంలో జాంబవంతుడు ఓడిపోయిన తరువాత అతనికి శ్రీకృష్ణుడు శ్రీ మహావిష్ణువుగానే కాక శ్రీరామచంద్రుడుగా సైతం కనిపించినట్లు ఈ క్రింది పద్యంలో స్పష్టంగా జాంబవంతుని స్తుతి రూపంలో వర్ణించాడు.

జాంబవంతుఁ డాత్మశక్తి జయించిన
శక్తిగలుగు కృష్ణు జగముఁ బ్రోచు
నాదిదేవుఁ డా చరాచరకర్త నా
రాయణుండె యనుచుఁ బ్రస్తుతించె.

మహామథన సారామృతం

జయ జయ రఘుకుల చక్రేశ తాటకా
హరణ, విశ్వామిత్ర యాగభరణ,
అనఘ, యాహల్యాఘహారి, శంకర ధను
ర్భంజన, జానకీ ప్రాణనాథ,
భార్గవభుజదర్పభంజన, పితృవాక్య
పాలన, ఖరముఖ ప్రళయకాల,
సుగ్రీవవరద, యశోనిధి, వాలి మ
ర్దన, వారిబంధన, దర్పితోగ్ర
కుంభకర్ణాతి కాయాది కుటిలదైత్య
వీరసంహార, రావణ ద్విపమృగేంద్ర,
పుష్పకాన్విత సాంకేతపురినివేశ,
రామ, శైలతనూజాభి రామనామ.

(నార.54 పు. 301,302 ప.)

నాళీజంఘుని కథను వర్ణించిన సందర్భంలో పరాశరునకు దత్తాత్రేయునకు జరిగిన సంభాషణా సందర్భంగా సీతారామ లక్ష్మణులు రాజ్యాన్నివిడిచి అడవులకు వెళ్ళిన తరువాత పర్ణశాలను ఉత్తరభారత దేశంలో కళ్యాణ తీర్థానికి ఉత్తరంగా ఉన్న పరాశర ఆశ్రమానికి పశ్చిమతీరంలో పంచ భాగవతస్థానం ఉన్నదనీ, ఆ పంచ భాగవత స్థానానికి సమీపంలో వరాహ దేవతాస్థానం ఉన్నదనీ దానికి దక్షిణదిశలో సీతారణ్యం ఉన్నదనీ ఆ సీతారణ్యంలోనే లక్ష్మణుడు పర్ణశాల కట్టాడనీ నరసింహకవి నారదీయ పురాణ విషయంగా ఈ క్రింది పద్యంలో వర్ణించాడు.

తనదు కల్యాణ తీర్థమునకుఁ గించిదు
త్తర భాగమున మహోదారమగు ప
రాశరాశ్రమ మఘరాశి మాలానల
మాతీర్థమణి ప్రతీచ్యంతరమునఁ
దగు పంచభాగవతస్థాన మాతీర్థ
మున కెంచఁ బ్రాగ్భాగమున వరాహ
దేవతాస్థాన మాతీర్థంబు దక్షిణ
స్థలిని సీతారణ్యమలరుసచట
లక్ష్మణుఁడుగట్టెఁ బర్ణశాలా గృహంబు
రామ జనకసుతా మనోరమముగాఁగ
స్థానములు నాల్గు నిట్టివి సంభవించె
నట్టి పుణ్యస్థలంబున యతివరేణ్య!

(నార.153-154పు.30.ప)

వాఙ్మయ మహోధ్యక్షుని

రామాయణంమీద పరిశోధనలు చేసిన అనేకమందికి సీతారాముల పర్ణశాల ఉన్నదని తెలుసునుగాని నారదీయపురాణ రూపకంగా బయటపడిన సీతారణ్యం అనే పేరుగల అరణ్యం ఉన్నదన్న సంగతి అసలు తెలియనే తెలియదు.

నరసింహకవి యాదవశైలం అక్కడి విశేషాలు వర్ణించిన సందర్భంలో వివిధ తీర్థాలను వర్ణిస్తూ "ఈ నారాయణ హ్రదంబునకు దక్షిణంబునఁ గల్యాణ తీర్థంబునకు నుత్తరంబునఁ బారాశర తీర్థంబు గలదు. మన్నియోగంబుచే మద్భక్తుండగు పారాశర్యుండు విష్ణుపురాణంబుఁ దత్తటంబున రచియించె "(నార. 87, పు. 501.వ.) అని వ్రాసి కల్యాణ తీర్థానికి ఉత్తరంలో ఉన్న పారాశర తీర్థంలో పారాశర్యుడు విష్ణుపురాణాన్ని విరచించినట్లు వెల్లడించాడు.

నరసింహకవి రత్నావళీ వృత్తాంతాన్ని వర్ణించిన సందర్భంలో వివిధ ధర్మాలను గురించి వ్రాస్తూ రత్నావళి రాజునితో ఈ క్రింది విధంగా చెప్పినట్లు పేర్కొన్నాడు.

పరిణయము లేని కన్యను
గరిమన్ రతిసల్పఁ బాతకంబని శాస్త్రం
బరములఁ బల్కిరి ధరణీ
సురవర్యులు వినవె ధర్మసూక్ష్మ క్రమముల్.

(నార. 291.పు. 131. వ.)

ఈ సందర్భంలో శాస్త్రాంతరాల ధర్మ సూక్ష్మాన్ని చెపుతూ వివాహం కానటువంటి కన్యతో సంభోగం చెయ్యడం పాపమని పేర్కొనడం ద్వారా వివాహితురాలైన స్త్రీతో అతిచరించడం పాపంకాదని చెప్పినట్లవుతున్నది.

విష్ణుచిత్తుని కథకూ దానికి సంబంధించిన యితర గాథలకూ శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్తమాల్యదాది గ్రంథాల విమర్శనా సంధర్భంలో పెక్కు ప్రాచీనమూలగ్రంథాలున్నట్లు పరిశోధకులు పేర్కొన్నారు. అయితే నారదీయ పురాణంలో వర్ణింపబడిన విష్ణుచిత్తుని కథలో విష్ణుచిత్తుడు ప్రహ్లాదుని కంటె పూర్వుడనీ ప్రహ్లాదుడు విష్ణుచిత్తుని దర్శించి ధన్యుడయ్యాడనీ ఈ క్రింది పద్యంలో పేర్కొనబడడం ద్వారా విష్ణుచిత్తుడు నరసింహావతారానికి పూర్వమే ఉన్నాడని తేటతెల్లం చేసినట్లయింది.

విష్ణుచిత్తా! నినుంజూడ వేడ్కగలిగి
యరుగు దెంచితిఁ బ్రహ్లాదుఁ డంద్రు నన్ను

నీ మహత్వంబు విని విని నీరజాక్ష
భక్తి నిష్టాపరత్వ మేర్పడఁగ గంటి

(నార. 189-పు. 105-ప.)

బ్రహ్మ విష్ణు మహేశ్వరాది దేవతల గురించి తపస్సు చేసిగాని వారిని భక్తితో పూజించి గాని వివిధ వరాలనూ ఐశ్వర్యాదులను పొందవచ్చునన్న విషయం సర్వ విదితం. కుబేరుడు మహైశ్వర్యవంతుడనీ ధనాగారాలకు మూలభూతుడని కూడా అందరికీ తెలిసిన విషయమే. అయితే విశిష్టంగా నరసింహకవి నలమహారాజువల్ల సంపదలు పొందవచ్చునని నారదీయపురాణ వచనంగా ఈ క్రింది పద్యంలో ఉటంకించాడు.

అర్కుని వలన నారోగ్యమాయె నలుని
వలన సిరియును శంకరువలన బోధ
మచ్యుతు వలన ముక్తియు నందవలయు
ననఁగ నుపనిషదుక్తి యుక్తార్థముగను.

(నార. 327-పు. 37. ప)

ఇది అత్యంత విపులంగా వర్ణించబడిన వివిధ నలచరిత్రలలో కూడా కానరాని విశిష్ట విషయం.

నరసింహకవి వైకుంఠలోక ఆవరణ పంచకాలను వర్ణిస్తూ వైకుంఠలోకంతో పాటు దానికి చుట్టూ వివిధ దిక్కులలో ఉన్న అనేక లోకాలను వర్ణించాడు. "విశేషంబున మరియు వైకుంఠలోకంబు వర్ణించెద వినుము. ప్రాగవాచిని శ్రీలోకంబును బశ్చిమంబున శ్రీవైకుంఠంబునకు దక్షిణంబున నిత్యానందంబు నిధియు సద్భక్తవరదుండు నగు సంకర్షణ విభుండుండు. ఆ సంకర్షణ లోకంబునకు పశ్చిమంబున నిర్మలానంద నీరధి నిత్యంబునగు సరస్వతి లోకంబులఁ దగు ప్రత్యగవాచిని సరస్వతి లోకంబున కుత్తరంబునఁ బ్రద్యుమ్న లోకంబు చెలంగు. ప్రతీచీనయుతార్కేందు ప్రభ దీపించి నిర్మల శర్మదంబై ప్రద్యుమ్న పదంబు దగ్గర రవిదిక్కున నిత్యాప్సరోఽలంకృతంబై రతిలోకంబు విరాజిల్లుఁ దక్షిణాప్రాచీన నిరుద్ధ లోకంబు రాణించు నుదీచిం బ్రకాశించి యానంద వారిధి యగు నా యనిరుద్ధ లోకంబునకు బ్రాచి యగు విదిక్కున సద్గుణ సాగరంబగు శాంతి లోకంబు విజృంభించు. ఇవి చతుర్వ్యూహంబులు నాలుగు శ్రీకళలు. నాలుగును బ్రదక్షిణ క్రమంబునఁ బ్రాచ్యాద్యష్ట దిక్కులం బ్రకాశించు నీ వ్యూహాష్టకంబు ప్రథమావరణంబున నుండు. 'మధ్యే మధ్యేత్వ సంఖ్యే యాస్తత్ర వ్యూహా'మ్మనిన శ్రుతివలన ననేక వ్యూహంబులు గలవు. ద్వితీయావరణంబునం బ్రాచ్యాది దిక్కుల

వాఙ్మయ మహోధ్యక్షుని

వరాహ జామదగ్న్య శ్రీ నరసింహ రఘువల్లభ శ్రీధర వామన హయగ్రీవ వాసు దేవ లోకంబులు గలవు. తదధిపతులు విభవేశ్వరులు నిత్యులు. వీరు వ్యూహోష్ట విశిష్ట శ్రీ వైకుంఠేశ్వర ప్రీతి సాధనంబైన బ్రహ్మ విద్య సర్వార్చిన ప్రాకృత భూముల నవతరించి ప్రకాశింపఁ జేయుదు రీమూర్తులం గొల్చిన నపవర్గంబు లభించు. తృతీయావరణంబున నెనిమిది దిక్కుల పాంచజన్య ముసల చక్ర ఖడ్గ గదా శార్ఙ్గాది వైజయంతంబులు నిలుచు. నిత్యానవధిక నిరతిశయానందంబగు భగవత్సేవ గావించు. చతుర్థావరణంబునఁ గుముద కుముదాక్ష పుండరీక వామన శంఖుర్ణ సర్వనేత్ర సుముఖ సుప్రతిష్ఠితులు నిత్యులు. నిత్యముక్తులతో నీశ్వరు నారాధింపుదురు. పంచమా వరణంబున నింద్రానల దండధర నిరృతి యాదసాంపతి గంధవాహ ధనేశానులు నిత్యనిర్జరు లుండుదురు. ఇది యావరణపంచకంబు. (నార. 358, 359-పుట 171వ.) అని వివిధ లోకాలను వివరించి అనంతరం "తృతీయావరణ బహిర్దేశంబున విష్వ క్సేను లోకంబు గలదు,'' (నార. 360. పు. 176 వ.) అని తృతీయావరణలో విష్వ క్సేను లోకం ఉన్నట్లు పేర్కొన్నాడు. వేద ఖగోళ శాస్త్రాల దృష్ట్యా ఆర్ష విజ్ఞానం దృష్ట్యా ఆధునిక ఖగోళ విజ్ఞానం దృష్ట్యా కూడా శేషశాయి అయిన శ్రీ మహా విష్ణు నక్షత్రాలను దృష్టిలో పెట్టుకొని ఆయా వివిధ లోకాల గురించి ఆధునిక వైజ్ఞానికులు పరిశోధనలు కొనసాగించవలసి ఉన్నది.

## ఖగోళ విశేషాలు

నరసింహకవి వివిధ సందర్భాలలో అనేక వేద ఖగోళ శాస్త్రాది విశేషాలను తెలియచేశాడు. ధ్రువుని చరిత్రను వర్ణించే సందర్భంగా "యవికృత నిజరూపుండ వగుట నీకు వివిధ భావము మాయచే విరుద్ధంబు గాదు. దినకర కరజాల మూషర స్థాన సంగంబున నవికృతమేనియు నిజరూప వికారంబు వహించునట్లు నీ రూపంబు వైకృతఁబును గారణంబునన వినంబడియె. ఆ వైకృతరూపము జగత్తని వేదంబులు పలికె. కారణంబగునవి బ్రహ్మమును, సత్తునని విన్నవించు నట్టి దేవ వంద్యంబులైన యీ రెండు రూపంబులు భజించెద. విశ్వమూర్తి ! నిన్ను వేదంబులు దశశతముఖు నింగా, సహస్రాక్షిపాదునింగాఁ బలికె. మఱియును సహస్రముఖ పాదాక్షిబాహూరు నింగాఁ బలికె. వితతునింగా నణువుంగాను దీర్ఘునింగాను పలికె. బ్రహ్మభూతుండవై వితత విమల రూపుండవైన నీయందు నివిశ్రుతము వేత్తైయున్న యదియుంబోలెఁ జూడంబడి స్వాశ్రయాభిన్నంబయ్యె. జలమయంబగు ఫేనంబు గాన్పించి లయకాలం బున వేఱుగాని యట్లు వివిధ రూపంబు లన్నియు నిన్నుంగలయు.'' (నార. 450, 451 పు. 29 వ.) అని పురుషసూక్త విషయాలను సంగ్రహపరిచాడు. నారాయణగిరి మహత్వ వర్ణనా సందర్భంలో "అది దక్షిణదేశంబున" ఇత్యాది పదాలను

ప్రయోగించడం ద్వారా భూమండలాన్ని స్ఫురణకు తెచ్చినా "దక్షిణోత్తర భేదంబున నాకు రెండాశ్రమంబులు గలవు. సర్వోత్తరంబులు ; ఆధిక్యంబున నదియే సర్వోత్తరగిరి యగు. గుణత్రయ భేదంబున నరులకుం బ్రకృతి భిన్నంబైన నారాయణాద్రి నిష్ఠులకు రజస్తమో గుణంబులులేవు వినుండు" (నార. 82. పు. 472.వ). అని ఖగోళగతమైన సర్వోత్తరగిరిని, వైకుంఠాద్యచ్యుతస్థాన లోకసార మైన యదుశైలాన్ని వర్ణించాడు. బ్రహ్మ మోహినికి కర్తవ్యాన్ని ఉపదేశించిన సందర్భంలో నరసింహకవి మందరగిరి ఉనికినిగురించి, మందరగిరి కైవారంగురించి, తన్మందరగిరి మీద వున్న దివ్య శివలింగం గురించి సూక్ష్మదృష్టితో వర్ణించాడు. మందరగిరి భూమిమీద వున్నదని మనం సామాన్యంగా అనుకుంటాం. కాని అది ఖగోళంలో అత్యున్నత స్థానంలోవున్న క్షీర మహాసముద్ర నామకాలైన (Thick Milky way) నక్షత్రాల గుంపు మధ్యలో వున్నదని నరసింహకవి వేద ఖగోళాన్ని దృష్టిలో పెట్టుకొని స్పష్టంగా పేర్కొన్నాడు. మందరగిరిగురించి, దాని కైవారం గురించి, దాని మీదవున్న దివ్య శివలింగాన్ని గురించి నరసింహకవి యీ క్రింది విధంగా వర్ణించాడు.

"ప్రబల సురాసుర ప్రవరుల కెడలింప
నలవిగాని నగేంద్ర మరయనెద్ది ?
హరికి వ్యాము గ్రాహ్యమై భుజాంగదసము
త్కాపసారంబైన గ్రావమెద్ది ?
పుక్కిటి బంటిగాఁ బూర దుగ్ధాంభోధి
నోలలాడెడు మహాశైల మెద్ది?
భూత జాలావృత పురమర్దనైక వి
హారసౌధంబైన యచల మెద్ది ?

దివిజులకు రచ్చ, తాపస ప్రవరులకుఁ ద
పంబు పంట, సురాధిప భామలకు ర
తి ప్రవర్తన వశ్యాధి దేవత, వివి
దౌషధంబుల కాకరం బట్టి శిఖరి.

అయుతము వేయు యోజనము లగ్గిరి మూలము దానియంతయే
నియతముగా వెడల్పును వినిర్మల కాంచన రత్నశృంగముల్.

సప్తయోజన విశ్రుత శక్రనీల
కలిత తచ్ఛిల దివ్యలింగంబు మెఱయు

వాఙ్మయ మహోధ్యాపుని

నది వియల్లింగ మన దశహస్తమిత మ
హోచ్ఛ్రయము నిస్సడి వెడల్పు నొనరి వెలయు.

(నార. 211. పు- 106, 107, 109. ప.)

ప్రహ్లాదుడు హరి స్మరణ మహిమను ప్రశంసించే సందర్భంలో "స్వభిన్నునింగా నీశ్వరుని వేరుగాఁ దలంచినవాడు విషయార్థ ప్రత్యగాత్ముడైన యీశ్వరు నెట్లు సేవించు ? యామ్యదిశకుం బోయినవాఁడు మేరునగంబు విలోకించునే ?" (నార. 475. పు 140. ప) అని మేరుపర్వతం యామ్యదిశలో లేదని సూటిగా పేర్కొన్నాడు. అయితే గతంలో కొందరు పరిశోధకులు మేరుపర్వతం భూమిమీదనే వున్నదని అభిప్రాయపడడంలో వాస్తవికత లేదని "శ్రీ విరూపాక్ష-శ్రీరామ శాసనములు-ఆఱవీటి వంశ చరిత్ర"* అన్న నా పరిశోధనా గ్రంథంలో సవివరంగా "శ్రవణా నక్షత్రానికి అత్యంత ఉన్నతస్థానంలో వున్న విష్ణుస్థానానికి కొంత దిగువుగా యీ మేరుస్థానం వున్నట్లు" తెలియజేశాను. (చూ. CXV-CXVI. పు.)

మామూలుగా వైజ్ఞానిక దృక్పథంతోనేకాక, సంప్రదాయసిద్ధంగా కూడా సూర్యోదయ సమయంలోని యెండ ఆరోగ్యకరం కాదని, సూర్యాస్తమయ కాలంలోని వృద్ధాతపం చాలా ఆరోగ్యప్రద మయినదని, భావించడం జరుగుతున్నది. నారదీయపురాణంలో నృసింహావిర్భావం తరువాత "సదా సూర్యుండు బహు యోజన సహస్రంబు లక్షణంబునఁ బోవుచు వేగంబున జనుల యాయువు క్షయింపం జేయు నార్తప్రమత్త సుప్తవ్యాదిత్తులైన వారి నుష్ణధాముండు గ్రాసంబు నొందించుంగాని విడంబంబు సేయండు" (నార. 509. పు. 273. ప) అని అసలు సూర్యుడే మానవుల ఆయుర్దాయాన్ని క్షయింపచేస్తాడని నరసింహాకవి యే మూలగ్రంథం ఆధారంగానో పేర్కొంటున్నాడు. ఆర్ష విజ్ఞాన దృక్పథంతో వున్న యీ విషయాన్ని ఆధునిక వైజ్ఞానికులు పరిశీలించవలసి వున్నది.

నరసింహాకవి యుగాదినిర్ణయ వివరణా సందర్భంలో సూర్యుడు ఉత్తరాయణాన్ని విడిచి దక్షిణాయణంలో ప్రవేశించే మధ్యకాలం విషమకాలమని, దాన్ని ముక్తకకాలం అంటారని యీ క్రింది పద్యంలో తెలియచేశాడు.

"ఉత్తరాయణ ముడిగి సూర్యుండు వేగ
దక్షిణాయనమున కేఁగుతఱి మెలంగు
మధ్యకాలంబు విషమమై మహిఁ జెలంగు
నదియె ముక్తక నామధేయము వహించు."

(నార. 194. పు. 24 ప.)

---

* ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స లైబ్రరీ అండ్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రచురణ.

ఇదికూడా ఆధునిక విజ్ఞానం దృష్ట్యా పరిశోధించవలసిన విషయమే. "సూర్య ఏకాకీ చరతి చంద్రమా జాయతే పునః" అని వేదం సూర్యుడు స్వతంత్రంగా ఏకైకుడై సంచరిస్తున్నాడనీ సూర్యునివల్లనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడనీ స్పష్టంగా పేర్కొన్నప్పటికీ సూర్యుడు కేవలం ఒక్కడేనని మాత్రం వేదం ఆమోదించలేదు. ఈ సృష్టిలో ఏయే దిక్కుల్లో ఎన్నెన్ని సౌరమండలాలు ఉన్నాయో చెప్పడం సాధ్యపడదన్న ధోరణిలో "దశ దిశో నానా సూర్యాః" అని అష్టదిక్కుల్లోనే కాదు దశదిశల్లోనూ అనేకమంది సూర్యులున్నారని వేదం పేర్కొన్నది. అయినా ఈ అనంతమైన వేద విజ్ఞానాన్ని గుర్తించలేక కొందరు వ్యక్తులు పురాణాలలో సూర్యపరంగా సూర్యుడొక్కడేనని ఆ సూర్యుడే చైత్రాది ద్వాదశ మాసాలలోనూ ద్వాదశ నామాలతో పేర్కొనబడతాడని ఆ రూపంగా ఏకైకుడైన ఆదిత్యుడే ద్వాదశాదిత్యులుగా పరిగణనలోకి తీసికొనడం జరిగిందని ఈ క్రిందివిధంగా పేర్కొనబడడం జరిగింది. చైత్రమాసంలో సూర్యుణ్ణి "ధాత" అంటారనీ అతనికి కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్తు, పులస్త్యుడు, తుంబురులు పరిజనంగా ఉంటారనీ పేర్కొన్నారు. వైశాఖ మాసంలో సూర్యుడు "అర్యముడుగా" పేర్కొనబడి పులహ, ఓజ, ప్రహేళి, పుంజకస్థలి, నారద, కంజనీరులు పరిజనంగా వెలుస్తారని ఉటంకించారు. జ్యేష్ఠ మాసంలో సూర్యుడు "మిత్ర" నామకుడై అత్రి, పౌరుషేయ, తక్షక, మేనక, హాహా, రథస్వనులనబడే పరిజనంతో విరాజిల్లుతాడన్నారు. ఆషాఢ మాసంలో "వరుణుడు"గా పేర్కొనబడే సూర్యుడు వశిష్ఠ, రంభ, సహజన్య, హూహూ, శుక్ర, చిత్రస్వనులు పరిజనంగా విరాజిల్లుతాడు. శ్రావణ మాసంలో సూర్యుడు "ఇంద్ర" నామకుడై విశ్వావసు, శ్రోత, ఏలాపుత్ర, అంగిరస, ప్రమ్లోచి, చర్ములనబడే పరివారంతో భాసిల్లుతాడు. భాద్రపద మాసంలో "వివస్వంత" నామకుడై సూర్యుడు ఉగ్రసేన, వ్యాఘ్ర, ఆసార, భృగు, అనుమ్లోజ, శంఖపాల నామకులైన పరిజనంతో విలసిల్లుతాడు. ఆశ్వీయుజ మాసంలో సూర్యుడు 'త్వష్ట' నామకుడై అంబళాస్వ, తిలోత్తమ, బ్రహ్మోపేత, శతజిత్, ధృతరాష్ట్ర, ఇషంభరులు పరివారంగా ఉంటాడు. కార్తీక మాసంలో సూర్యుడు "విష్ణువు"గా విరాజిల్లుతూ అశ్వతర, రంభ, సూర్యవర్చస, సత్యజిత్, విశ్వామిత్ర, మఘోపేత నామకులైన పరివారంతో ప్రకృష్టుడై ఉంటాడు. మార్గశిర మాసంలో సూర్యుడు "తుర్యమ" నామకుడై కశ్యప, తార్క్ష్య, ఋతసేన, ఊర్వశి, విద్యుచ్ఛతు, మహాశంఖనామకులైన పరిజనావృతుడై ఉంటాడు. పుష్యమాసంలో సూర్యుడు "భగ" నామకుడై స్ఫూర్జ, అరిష్ఠనేమి, ఊర్ణ, ఆయు, కర్కోటక, పూర్వజిత్తి నామకులైన పరివారంతో విరాజిల్లుతాడు. మాఘమాసంలో సూర్యుడు "పూష" నామకుడై ధనంజయ,

వాత, సుషేణ, సురిచి, ఘృతాచి, గౌతమ నామకులైన పరివారంతో నిలిస్తుంటాడు. ఫాల్గుణ మాసంలో సూర్యుడు "క్రతు" నామకుడై వర్చస, భరద్వాజ, సేనజిత్, విశ్వ, ఐరావత, నామ్నులైన పరివారంతో ప్రకృష్టు చేస్తుంటాడు. ఈ విధంగా చైత్రాదిగా ఫాల్గుణాంతంగా ఉన్న ద్వాదశ మాసాలలోనూ ఏకైక సూర్యుడే ద్వాదశభిన్న నామాలతో ద్వాదశాదిత్యులుగా పరిగణించబడతాడని పేర్కొన్నారు. మరికొందరు తుర్యము, క్రతుపులకు ధాతలకు మారుగా అంశుమంత, పర్జన్య, అజులను గ్రహించారు. మరికొందరు అర్క శబ్దాన్ని సైతం గ్రహించారు. వేద విజ్ఞానానికి భిన్నంగా మనకు కనిపిస్తున్న ఏకైక సూర్యుణ్ణే చైత్రాది వివిధ మాసాలలో ద్వాదశాదిత్యులుగా పరిగణించారు. కాని నరసింహకవి రుక్మాంగద చరిత్రలో అతని రాజ్యకాలంలో అతనితోపాటు ప్రజలందరూకూడా రాజాజ్ఞానువర్తులై ఏకాదశీ వ్రతనిష్ఠులై కేవలం పరమ పదాన్నే చేరుకుంటున్నారని అటు స్వర్గానికికాని ఇటు యమలోకానికిగాని ఎవ్వరూ రావడంలేదని యమధర్మరాజు బ్రహ్మతో మొరపెట్టుకుంటాడు. ఈ సందర్భంలో తనకు యమధర్మరాజపదవే అక్కరలేదని వక్కాణిస్తూ " ఈ నియోగంబు నేనొల్ల. యజ్ఞ తీర్థ దాన యోగ సంయోగంబుల నిటువంటి సద్గతి లేదు. ధాత్రీఫలాను లిప్తులై వాంఛలుడిగి, రసభోజనోద్భవ వాంఛలు విడిచి విభ్రష్ట కర్ములేని హరి లోకంబు గాంచిరి. గళరజ్జు బంధనంబుల మద్దూతలు తెచ్చిన వారల హరి దూతలు శిక్షించికొని చనిరి. ద్వాదశాదిత్య తీవ్రతాప దుర్గమంబైన మన్మార్గంబు భగ్నంబయ్యెనేమి విన్నవింతునింక '' (నార. 201-పు. 60. వ) అని అంటాడు. ఈ సందర్భంలో పేర్కొనబడిన ద్వాదశాదిత్యులు ఇతర పురాణాలవలె ఏకైకాదిత్య విభిన్న చైత్రాది మాసగత విశిష్ట నామకులుకారు. యమధర్మరాజు మార్గం ద్వాదశాదిత్య తీవ్రతాప దుర్గమ మయినదట. అంటే ద్వాదశాదిత్యులు విభిన్నంగా ఉన్నారనీ ఒకేసారిగా ఆ పన్నెండు సూర్యుల తీవ్రతాపం ప్రసరించే మార్గం యమధర్మరాజు మార్గమనీ అర్థమవుతున్నది. చైత్రాది మాసాలలో విభిన్న నామాలతో విరాజిల్లే ఏకైక సూర్యుని తాపం ఏకమాసాత్మకంగా ప్రసరించడానికి వీలున్నది గాని ద్వాదశ మాసాలతో సంకలితమైన పరిపూర్ణతాపం ఒకేసారి యమలోక మార్గంమీద ప్రసరించడానికి వీలులేదని స్పష్టపడుతున్నది. ద్వాదశాదిత్యుల తీవ్రతాపం ఒకేసారిగా ప్రసరిస్తున్నదన్నాడంటే నారదీయపురాణ కర్త దృష్టిలో ద్వాదశాదిత్యులు మాసాత్ములుగాకాక విభిన్న సౌరమండలాలకు చెందినవారని విదితమవుతున్నది. ఆర్షవిజ్ఞానం దృష్ట్యా ద్వాదశాదిత్యులుగా పేర్కొనబడినవారు విభిన్న సౌరమండలాలలో ఉన్న ప్రత్యేక సూర్యులేనని చైత్రాది ఫాల్గుణాంతంవరకూ ద్వాదశ మాసాలలోనూ ఉన్న మాసాత్మకుడై

ద్వాదశనామకుడైన ఏకైక సూర్యుడు కాడని తేటతెల్ల మవుతున్నది. కాగా "దశదిశో నానా సూర్యాః" అన్న వేదవాక్యంలో ఒక భాగంగానే ఈ ద్వాదశా దిత్యులు నారదీయ పురాణోక్తంగా విరాజిల్లారని పరమ వైజ్ఞానికంగా ఆమోదించ వలసి ఉంటుంది.

ఆర్ష విజ్ఞానం దృష్ట్యానేకాక ఆధునిక విజ్ఞానందృష్ట్యా కూడా ఖగోళంలో తోకచుక్కలు, అనేకరకాలైనవి ఉన్నవి. వాటిల్లో రకరకాల శక్తులున్నవి కూడా వున్నాయి. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క తోకచుక్క పొడిస్తే యెవరో వొక మహాపురుషుడో, మహాత్ముడో, గొప్పపరిపాలకుడో అంతరిస్తాడని లోకంలో వాడుకవున్నది. నరసింహకవి కల్యాణతీర్థ మహిమను గురించి వర్ణిస్తూ దుర్భిక్షాన్ని సైతం కలిగించి లోకాన్ని సంక్షోభపరిచే తోకచుక్క వుంటుందని యీ క్రింది పద్యం ద్వారా తెలియచేశాడు.

"అశ్మవర్ష నిపాభిహాత సమస్త
సస్య సంపత్సమృద్ధియై జగతియందుఁ
బొడమె దుర్భిక్ష మొకయేఁడు పూర్ణమగుచు
ధూమకేతువు చిందులు ద్రొక్కఁదొణఁగె."

(నార. 115. పు. 105. ప.)

కాగా వివిధ అరిష్టాలకు మూలకాలైన విభిన్న ధూమకేతువు లున్నాయని పరమ వైజానికంగా మన మామోదించక తప్పదు.

వివిధ మన్వంతరాలలో సప్తఋషులు విభిన్నులుగా వున్నట్లు శాస్త్రీయంగానూ, ఆర్షవాఙ్మయం దృష్ట్యానూ, పౌరాణికంగా సైతం మనకు తెలుస్తున్నది. స్వాయంభువ మన్వంతరంలో మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు అనే మహర్షులు-స్వారోచిష మన్వంతరంలో ఔర్వ, వసిష్ఠపుత్ర, స్తంబ, కశ్యప, ప్రాణ, బృహస్పతి, దత్త, చ్యవనాత్రులు అనే మహర్షులు-ఉత్తమ మన్వంతరంలో గురు వాసిష్ఠులు, ఊర్జులును, హిరణ్యగర్భులు అనే మహర్షులు- తామస మన్వంతరంలో పృథుడు, కావ్యుడు, అగ్ని, జహ్నుడు, ధాత, కపీవంసుడు, అకపీవంసుడు అనే మహర్షులు- రైవత మన్వంతరంలో యదుధ్రుడు, వేదశిరుడు, హిరణ్యరోముఁడు, పర్జన్యుడు, ఊర్ధ్వబాహుడు, సత్యనేత్రుడు, దేవబాహుడు అనే మహర్షులు—చాక్షుష మన్వంతరంలో భృగుడు, నభుడు, వివస్వంతుడు, సుధాముడు, విరజుడు, అతినాముడు, సహిష్ణుడు, అనే మహర్షులు—వైవస్వత మన్వంతరంలో వసిష్ఠ, అత్రి, గౌతమ, కశ్యప, భరద్వాజ, జమదగ్ని, విశ్వామిత్రాదులయిన మహర్షులు-సూర్యసావర్ణిక మన్వంతరంలో గౌతమ, అజర, శరద్వంత,

కౌశిక, కాశ్యప, ఔర్వులు అనే మహర్షులు—దక్షసావర్ణిక మన్వంతరంలో మేధాతిథి, వసువు, సత్యుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, సవనుడు, హవ్యవాహనుడు అనే మహర్షులు బ్రహ్మసావర్ణిక మన్వంతరంలో రామ, వ్యాస, ఆత్రేయ, దీప్తిమంత, బహుశ్రుత, భరద్వాజ, ద్రౌణి (అశ్వత్థామ), అనే మహర్షులు ఉన్నారు. ఇదేవిధంగా ధర్మసావర్ణిక, రౌచ్య, భౌచ్య మన్వంతరాలలో విభిన్నులైన సప్తర్షులు ఉన్నట్లు ప్రాచీన గ్రంథాలు పేర్కొన్నాయి. ధర్మ, సూర్యసావర్ణిక మన్వంతరాలలో ఒకదానికి మారుగా మేరు సావర్ణిక మన్వంతరాన్ని కొందరు పరిగ్రహించారు. కాగా వివిధ మన్వంతరాలలో విభిన్న సప్తఋషి మండలాలు ఉన్నట్లు మనకు తేటతెల్ల మవుతున్నది.

మన్వంతరాలలో విభిన్నులైన సప్తమహర్షులకు స్థానం వున్నట్లుగానే మనువులకు కూడా ఆ స్థానం శాశ్వతంకాదని తెలుస్తున్నది. అంటే వైవస్వత మన్వంతర మన్నది వొకటున్నదిగదా! ఆ మను స్థానంనుంచి వైవస్వతుణ్ని తప్పించి సమర్థుడైన మరొక వ్యక్తి ఆ స్థానాన్ని పొందవచ్చు నన్నమాట. గృహగోధి మోహినుల సంభాషణా సందర్భంలో "అట్లు గావునఁ దత్ఫలంబు నాకు నొసంగి ధర్మమూర్తి! వైవస్వత పదధ్వంసీ! పాలించవే యని గృహగోధి పల్కిన విని మోహిని యిట్లనియె." (నార. 233. పు. 213. వ.) అని నరసింహకవి పేర్కొనడంద్వారా వైవస్వతాది మను పదాలకు కాదు, మను పదస్థులైన వైవస్వతాది మహర్షులకు సైతం పిభ్రష్టత్వం తప్పదని తెలియజేశాడు.

ఇదేవిధంగా కుబేరు డొకడున్నాడని అనేక గ్రంథాలద్వారా సుప్రసిద్ధమైన విషయం. కాని సప్తఋషులవలెనే కుబేరత్వానికిసైతం మార్పు వున్నదని నారదీయపురాణంవల్ల తెలుస్తున్నది. సప్తఋషులు మన్వంతరాలలో మారగా కుబేరుడు కల్పాంతంలో మారుతాడని నారదీయపురాణం పేర్కొంటున్నది. కల్యాణతీర్థ మహిమావర్ణనలో నరసింహకవి "కల్యాణతీర్థ తీరంబున ధనం బొకనికిం జాలున ట్లొసంగినఁ గల్పాంతరంబునఁ గుబేరుండై జనించు" (నార. 184. 185 పు. 178. వ.) అని పేర్కొనడంద్వారా కుబేరత్వంసైతం శాశ్వతంకాదని తేటతెల్లం చేశాడు. అసలు నరసింహకవి పేర్కొనని ఆర్ష విజ్ఞాన రహస్యం మరొకటి వున్నది. కుబేరుడు వొక్కడే ధనవంతుడుకాడు. దౌర్జన్యంతో రాక్షసులనే కాక వివిధ చక్రవర్తుల నందరిని సైతం వోడించి ధనరాసులను నిలువ చేసుకున్నవాడు "కుబేరుడు". నిజానికి ఆర్ష విజ్ఞానందృష్ట్యా కుబేరుడంటే "దుర్ధనవంతుడ"ని అర్థం. ఈ దృష్ట్యానే సద్ధర్మ పథంలో సవ్యంగా మహత్తరమైన సంపదను ప్రోది చేసినవాడు కుబేరుడు కాడు. సుబేరు డనబడుతాడు. ఆర్షవిజ్ఞానం అడుగంటిన కారణంగా యీ కుబేర, సుబేర విభిన్నత్వాన్ని ప్రాచీను లెవరూ గుర్తించలేదు.

### మహామథన సారామృతం

## మంత్ర శాస్త్రాది విశేషాలు

“క్షరం ప్రధాన మమృతాక్షరమ్” (నార. 325. పు. 29. వ.) అని ఉపనిషద్వాక్యం పేర్కొన్నట్లు ధ్వన్యాత్మకాలు, శబ్దాత్మకాలయిన వర్ణాలన్నింటిని మనం మామూలుగా అక్షరాలంటున్నాం కాని అది యదార్థం కాదు. ‘అకారాదిక్షకారాంతాః వర్ణాః’ అన్న వాక్యం ప్రకారం అక్షర శబ్ద మన్నది యేర్పడిందని కొందరంటారు కాని అది కూడా యదార్థం కాదు. వర్ణాలన్నీ అక్షరాలు కావు. క్షరాలు, అక్షరాలని ఆర్షవిజ్ఞానం దృష్ట్యా వర్ణాలు ద్వివిధాలు. అమృతసిద్ధి కలిగించేవి మాత్రమే సార్థకమైన అక్షరాలు. తద్భిన్నాలైనవన్నీ నామమాత్రపు అక్షరాలైన క్షరాలు. అయితే అమృత బీజాలు కానటువంటి అక్షరాలు శక్తిరహితాలని చెప్పడానికి బొత్తిగా అవకాశంలేదు. క్షరంకాని, అక్షరంకాని యే వర్ణమైనాసరే శక్తివంతమైనదే. ధ్వన్యాత్మకమైన శబ్దం శక్తివంతం కాగా, అదే ధ్వన్యాత్మకమైన నిశ్శబ్దశక్తి మహాశక్తివంతమైనది. కాగా, వివిధ శబ్దాత్మకాలైన విభిన్న మంత్రాలకు, విభిన్న శక్తులున్నా యన్నమాట యదార్థం. ఏ మంత్ర సిద్ధిలోనైనా, మానసికజపం మహాశక్తి వంతమైందన్న ఆర్ష విజ్ఞానదృష్టి, ఆధునిక వైజ్ఞానిక దృక్పథంలోకూడా సత్య సమ్మతమైనదే. అనంత మంత్రాలతో, అపూర్వ శక్తుల కాలవాలాలైన, వేదాలను ప్రతిబింబించిన పురాణాలలో వివిధ మంత్రశక్తుల ప్రసక్తులుండడం అబ్బురంకాదు. విష్ణు, బ్రహ్మ, మహేశ్వరాది దేవతలందరికీ విభిన్న రాక్షసులెల్లరకూ, ఉన్న ఆయుధాలన్నీ, బహుళ మంత్రశక్తి సంభరితాలే. నరసింహకవి రత్నావళి వృత్తాంత సందర్భంలో “రాక్షసి నిజమందిరంబునంగల సకలధనంబులు సంగ్రహించుకొని ఖరేణురూపంబున బ్రాహ్మణునిం బైనిడుకొని రాజపుత్రియైన రత్నావళి నదృశ్య కరణశక్తిం దోడుకొని తృతీయ ముహూర్తంబున శంకరాలయమున కరుదెంచి, కాశీపురంబు చూపి యిది పాపహరుకుతారంబు” (నార. 294. పు. 144. వ). అని రాక్షసివల్ల ‘ఖరేణురూప అదృశ్యకరణశక్తి’ మంత్ర ప్రయోగాలను చూపించాడు. ఇదే విధంగా కాశీరాజు పుత్రికను కౌండిన్యునకిచ్చి వివాహం జరిపించిన సందర్భంలో రాక్షసి కరణిరూపం ధరించి రత్నావళిని నిజపురానికి తోడ్కొనివచ్చిన సందర్భంగాను, వివిధ మంత్ర, తంత్ర విద్యల ప్రభావాలను చూపించినట్లు పేర్కొన్నాడు. అయితే మంత్రోపాసనలో, సన్మంత్రోపాసనలు, దుర్మంత్రోపాసనలు, యెప్పుడూ వుండనే వుంటాయి. నరసింహకవి కలియుగ ధర్మాలను వివరించే సందర్భంలో “ద్విజాధములు నారాయణు వర్జించి దేవతాంతర సేవకులై యుంద్రు. దుష్ట ద్రవ్యంబుచేత దుర్గారాధన క్రియలు హరి బాహ్యులగు నృపద్విజులు ప్రాణిహింసచేఁ గావింపుదురు. శ్మశాన దేవతార్చనంబు శ్రేయస్కరంబని యొనరింపుదురు.

వాఙ్మయ మహోధ్యకుని

హరి పదంబెఱుంగక యహోరాత్రంబు స్వోదరపూరకులై నరులు వర్తింపుదురు. (నార. 174. పు. 131. వ). అని వామాచారపరమైన శ్మశానపూజలను గురించి పేర్కొన్నాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ని విషప్రయోగాదులతో బాధించినపుడు రాక్షస బ్రాహ్మణులు అనేక అభిచారక్రియలు చేసినట్లుకూడా వర్ణించాడు. చివరికి దైత్య యాజ్ఞికులైన మాంత్రికులు పావకోదితమైన కృత్తికను సైతం ప్రహ్లాదునిమీద ప్రయోగించినట్లు నరసింహకవి వర్ణించాడు. (చూ. నార. 483. పు. మొదలు. 494. పు. వరకు.) శ్రీకృష్ణ, బాణాసుర యుద్ధసమయంలో హరుడు త్రిశిర ఘోరమూర్తియైన ఉగ్రజ్వరాన్ని కల్పించగా దాని నతిశీతలజ్వరాన్ని కల్పించడంతో హరి హరించాడని నరసింహకవి పేర్కొన్నాడు. (నార. 63. పు. 369. వ). ఈ సందర్భంలో జ్వరీకరణమహామంత్ర ప్రయోగాన్ని, దానికి విరుగుడుగా నిలువగలిగిన శీతలీమంత్ర ప్రయోగాన్ని నరసింహకవి విస్పష్టపరచాడు.

బ్రాహ్మణ వృత్తాంత వర్ణనా సందర్భంగా శాకలాపురంలో దురాచారుడైన బ్రాహ్మణునికి లభ్యమైన వేశ్యాకాంత అనేక వశ్యమోహకాలైన ఔషధాలు ప్రయోగించి అతని భార్యనుంచి, అతని మనస్సును విరిచి వశ్యంచేసుకొన్నట్లు పేర్కొనడం జరిగింది (నార. 242. పు. 260. వ.). మోహినీరాజుల సంభాషణ సందర్భంగా "తద్వశీకరణౌషధాంతరములడుగ" (నార. 230. పు. 203. వ.) అని వశీకరణ ఔషధాల విషయం పేర్కొన్నాడు. అయితే ఒక యోగిని యిచ్చిన వశీకరణ ఔషధాలను ఉపయోగించిన విధాన్ని పేర్కొని యిటువంటి వశీకరణౌషధ ప్రయోగాలవల్ల వివిధ రోగాలు సంభవిస్తాయంటూ "ఈ చూర్ణంబు క్షీరంబులతోఁ గూర్చి భర్తకుఁ ద్రావించిన, వాఁడు నీ దాసుండగు నీ రక్ష నీవు గళంబునం దాల్చిన నిఖిల వశీకారం బగునని నియోగించిన నేను నట్ల కావించితి. తన్మహిమచే భర్త దినదినంబును గృశియించి ముఖంబున వ్రణంబులు పుట్టి తద్వ్రణంబులం గ్రిమిసహస్రంబులు వొడిమ నస్థిచర్మావశిష్టుండై యుండి నన్నుం బిలిచి నీ దాసుండనైతి నన్యగృహంబులకేఁగ నన్నుం గటాక్షింపవే యనిన నేను దద్యోగిని విన్నవించిన యుపశమనౌషధంబు దెచ్చిఁ స్వస్థునిఁ జేసితి నంత." (నార. 231. పు. 205. వ.) అని నరసింహకవి వివరించి యీ దుష్టౌషధాలకు విరుగుడుగా పనిచేయగల సదౌషధాలుకూడా వుంటాయన్న సంగతిని మంత్ర, తంత్ర, వైద్యశాస్త్రాలరీత్యా సూచించాడు.

## రుక్మాంగద చరిత్ర విశేషాలు

రుక్మాంగదుడు విష్ణుభక్తులలో చాలా గొప్పవాడు. పెక్కు రాజ్యాలను జయించినవాడు. అనేకమంది భార్యలతో సుఖభోగ లాలసుడైనవాడు.

చంద్రవంశపు రాజైన యయాతి దేవయానిని వివాహం చేసుకోవడం, అనంతరం దేవయాని దాసీయైన శర్మిష్ఠతో సంగమంచేసిన కారణంగా శుక్రశాపానికి గురియై వార్ధక్యాన్ని పొందడం, చివరికి ధర్మసూక్ష్మ వివరణతో శుక్రుని అనుగ్రహంవల్ల పుత్ర యౌవనాన్ని యయాతి స్వీకరించి చిరకాలం శృంగారప్రియుడై, సకల భోగోపజీవియై జీవించి తనకు యౌవనాన్ని అడిగినవెంటనే యిచ్చివేసిన తన పుత్రుడైన పూరునికి తన యౌవనాన్ని తిరిగి యిచ్చి రాజ్యపట్టాభిషిక్తుని చేసి, ఆశ్రమవాసానికి వెళ్లడం సుప్రసిద్ధమైన కథ. యయాతి జీవితంలో అకాలంలో వార్ధక్యం రావడం, తన పుత్రుడైన పూరుని యౌవనాన్ని తాను పొంది అనేక సంవత్సరాలు శృంగారప్రియుడై సుఖలాలసుడై జీవించడం కేవలం దేవయాని తండ్రియైన శుక్రాచార్యుని శాపానుగ్రహాలవల్లనే జరిగింది కాని, సహజంగా జరగ లేదు. కాని రుక్మాంగదుని జీవితంలో, ఉద్దేశపూర్వకంగా బ్రహ్మ విశిష్టంగా సృష్టించిన మోహినిని మందరనగసీమనుంచి పరిగ్రహించి, ఆమె మోహానికి లోనౌతాడు. నిజానికి కప్పటికి రుక్మాంగదుని కుమారుడైన ధర్మాంగదుడు యువకుడైనాకాడు. కుర్రవాడు. కాని రుక్మాంగదుడు వార్ధక్యదశలోనే మోహినిని పరిగ్రహిస్తాడు. సప్తద్వీప పరీత భూవలయాన్ని పరిపాలింప వలసిందిగా తన పుత్రుడైన ధర్మాంగదుడిమీద రుక్మాంగదుడు భారం పెడతాడు. అయితే జగన్మోహినియైన మోహినితో విహరించడానికి తగిన యౌవనశక్తి రుక్మాంగదునికి లేదు. కాని ధర్మాంగదుడు తెచ్చిన మణుల కారణంగా రుక్మాంగదుడు, యౌవనం పొంది చిరకాలం భోగా లనుభవించినట్లు కనిపిస్తున్నది. వృద్ధుడైన రుక్మాంగదునికి యౌవనప్రాప్తిలో యయాతి చరిత్రలోవలె, యెటువంటి శాపానుగ్రహాల ప్రసక్తి లేదు. "నీవు సుతుండవైన కతన నాకు నీ జగన్మోహినియైన మోహినితోడ విహరింపంబున ర్యౌవనప్రాప్తి యయ్యెడు. మనుష్యలోకంబున వృద్ధునకు సురతాను రాగంబుగలుగుట హాస్యకరంబు. మేనుజీర్ణంబయ్యె. శిరోరుహంబులం బలితంబువోడమె. జీర్ణుండనైన నీచే నజీర్ణుండనై భోగంబు లనుభవించెద. నేనీ కాంత నాకాంతంబు విడిచి నాకాంతయై వచ్చుటంజేసి భవద్బాహు గుప్తుండనై బహ్వానిర్ఝరదివ్య నదీ తటంబుల విహరింతు నీపురంధ్రి మత్ప్రాణంబు. దివ్యకాంత. ఏతన్నిమిత్తంబుగా దేవతలు ఖేదంబునొందుచుం జనిరి. దీని సంరక్షింపవలయుననిన తండ్రి వాక్యంబులు విని యుపచారంబులు గావింప నాజ్ఞానువర్తుల నియోగించి రాజ్యభారంబు వహింపు చుండె." (నార.253. పు.309.వ.) ఆర్ష విజ్ఞానులైన రుక్మాంగద, ధర్మాంగదులు కేవలం తమ మహత్తరాలైన మణుల శక్తుల వల్లనే నిత్యయౌవన, శక్తులను సముపార్జన చేసుకున్నట్లు అర్థమవుతున్నది. విధిశాపురాధిపతియైన రుక్మాంగదుని కుమారుడు ధర్మాంగదుడు తండ్రిని మించిన తనయుడు. సప్తద్వీపాలను సైతం

వాఙ్మయ మహోధ్యతుని

జయించి పరిపాలించగల సమర్థుడు ధర్మాంగదుడు. మీదు మిక్కిలి పితృవాక్య పరిపాలకుడు. రుక్మాంగదుడు అకలంక అచంచల మహావిష్ణుభక్తి వ్రతనిష్ఠుడు. రుక్మాంగదుణ్ని విష్ణుభక్తి నుంచి మరలించి, అతని ధ్వంసనార్థమై బ్రహ్మ మోహినిని సృష్టించి కర్తవ్యం ఉపదేశించి పంపిస్తాడు. మోహినీ రుక్మాంగదుల వివాహం అయిన తరువాత కొంత కాలానికి మోహిని బ్రహ్మ కిచ్చిన మాట ప్రకారం రుక్మాంగదుని విష్ణు వ్రతానికి భంగం కలిగించాలని విశ్వప్రయత్నం చేస్తుంది. మోహిని కోరిక మేరకు సప్త ద్వీప విజేతయై, పితృ వాక్య పరిపాలకుడై తండ్రిని మించిన కొడుకనిపించుకొన్న ధర్మాంగదుణ్ని రుక్మాంగదుడు వధించడానికి సైతం సంసిద్ధుడవుతాడు తప్ప, విష్ణుపరమైన ఏకాదశీ వ్రతనిష్ఠను విసర్జించడానికి మాత్రం ఆమోదించడు. మోహిని కోరికప్రకారం, ధర్మాంగదుని వధకు రుక్మాంగదుడు సంసిద్ధుడు కాగా, అతని విష్ణుభక్తి తత్పరతకు బ్రహ్మాది దేవతలంతా ఆశ్చర్యపడి ప్రసన్నులై యెటువంటి విపరిణామం జరుగకుండా సంరక్షిస్తారు. ఈ రుక్మాంగదుని చరిత్ర సావిత్రీ సత్యవంతుల జీవితం తరువాత జరిగినట్లు కనిపిస్తున్నది. రుక్మాంగదుని భార్య అయిన సంధ్యావళి మోహినిని అనునయించే సందర్భంలో

"భర్త సువ్రత మొనరింప భార్య యాత్మ
నాను కూల్యంబు పాటించి యాచరించి
యుండుఁ బోఁబుణ్య లోకంబు లమితకీర్తి
వెలయు సావిత్రివోలెఁ బవిత్ర యగుచు."

(నార. 284. పు. 102. ప.)

అని సావిత్రిని ఉపమానంగా పేర్కొనడం ద్వారా, సావిత్రీ సత్యవంతులకథ రుక్మాంగదునికంటె ప్రాచీనమైనదని నరసింహంకవి తెలియచేశాడు.

రుక్మాంగదుని కుమారుడైన ధర్మాంగదుడు తనకు తొమ్మిదవ యేటనే మహాబల పరాక్రమవంతుడై మలయపర్వతంమీద వున్న విద్యాధరుల్ని యుద్ధంలో గెల్చి మణులతో సహా ఆ విద్యాధరుల భార్యలను తీసుకొనివచ్చి మోహినికి సైరంధ్రులుగా నియమించాడు. సామాన్యంగా మణిత్రయమని మణులు త్రిసంఖ్యాకే పరిమితాలైనట్లు ప్రసిద్ధి. అవి కౌస్తుభం, చింతామణి, శ్యమంతకమణులు. ఇవికాక సూర్యకాంతమణులు చంద్రకాంతమణులు వేరుగా విశేషంగా వున్నాయి. కౌస్తుభమణి విష్ణువు ధరించేది కాబట్టి దానిని ధర్మాంగదుడు తీసుకొని రాలేదన్న విషయం స్పష్టం. ధర్మాంగదుడు తెచ్చిన మణులలో విభిన్నాలైన అపూర్వ శక్తివంతాలైన పెక్కు చింతామణులు తెచ్చినట్లు స్పష్టపడుతున్నది.

కాని ధర్మాంగదుడు అయిదుగురు విద్యాధరులను గెల్చి విభిన్నాలై మహత్తర శక్తివంతాలైన అయిదు మణులను తీసుకొనివచ్చి తండ్రి పాదాలముందు వుంచినట్లు నరసింహకవి యీ క్రింది విధంగా వర్ణించాడు. ఈ వర్ణనవల్లనే నాగశతావృతమైన భోగవతిని జయించి, అయుత నాగకన్యలను, ఫణిఫణా రత్నాలను, యింకా యింకా అనేకానేక విజయఫలాలను తెచ్చి తండ్రికి సమర్పించినట్లు స్పష్టపడుతున్నది.

"అప్పన దెచ్చె విద్యాధరుల జయించి
మణులేను నిజశక్తి మహిమ నొకటి
హాటకమయ లక్షకోటి ప్రదంబగు
నొకటి సహస్ర శతోత్తమ పట
దాయకం బొక్కటి తారుణ్య సంపద్వి
ధాయక నవసుధాధార లొలుకు
నొకటి గృహ ప్రధానోత్కట ధాన్య సా
ధనమయి కీర్తిని దనరు నొకటి
వ్యోమగమనంబు నొందించు నొరవు మెఱయ
నట్టి మణి రాజములు దెచ్చి యధిక శౌర్య
ధనులు విద్యాధరాగ్రణుల్ దారు నశ్రు
పూర్ణ నేత్రాంతలై తదంభోజ ముఖులు.

వెంటరా ధర్మాంగదుండు రుక్మాంగద క్షితీశు పదంబులపై వ్రాలి వీరె యేవురు విద్యాధరులు మలయాచలంబున వీరి జయించితి వీడింపు మేతద్భార్యలు సైరంధ్రులయి యీ మణులచే మోహినీకాంత నలంకరింతురు. సర్వకామ ప్రదంబులై పునర్యౌవన దాయకంబులై యుండు నీ మణులు దాల్చిన జీర్ణవంతులేని లావణ్యవంతులగుదురు. ఈ మణులు వళిపలిత నాశకంబులు. వస్త్ర హర్మ్య సువర్ణాది చింతితసిద్ధిమూలంబులు. చింతామణులే కాని యితర మణులు గావు. గంధర్వులు నేనును ముప్పది దినంబులు రణం బొనర్చి నీ తేజంబున జయించి యప్పన గొంటి. ఏను సముద్రంబు ప్రవేశించి సముద్రగర్భంబున నొక యేడు వర్తించితి. నాగశతావృతమైన భోగవతి నిర్జించి యయుత నాగకన్యలం గొనివచ్చితి. ఫణిఫణా రత్నంబులు దెచ్చితి. నచ్చట దానవ మందిరంబున కేగి యెనిమిది వేవుర దానవీ కన్యకలనాహరించితి. శతకోటి రత్నంబులు దీపార్థంబుగా నాపాదించితి. యుష్మత్పరాక్రమ పాలితుండనై రసాతలస్థితంబగు వారుణ లోకంబు చొచ్చి వరుణుంగాంచి బ్రతుకవలసెద నేని మా తండ్రి యాజ్ఞం దిరుగు మనంగ నలిగి యుద్ధసన్నద్ధుండై యొక

వాఙ్మయ మహోధ్యక్షుని

వత్సరంబు పోరె. అతని నారాయణాస్త్రంబునందూలించిన సమీర వేగంబులై విజితచంద్ర ప్రభాభోగంబులై యొక్కొక కర్ణంబు శ్యామంబై తృణతోయంబులు లేక బ్రతుకు తురంగాయుతంబును బుష్కరానుజుయైన త్రిలోకసుందరి యగు నొక కన్యను భార్యార్థంబుగా సమర్పించె. "(నార. 255, 256. పు. 318. ప, 319. వ.). ఈ సందర్భాన్నిబట్టి ఆ యీ మణులు యెంతటి మహత్తర శక్తి వంతాలో మణిధారణా ప్రభావంతో రుక్మాంగదు డేవిధంగా ప్రవృద్ధుడైనా పునర్యౌవన వంతు డయ్యాడో స్పష్టపడుతుంది.

పూర్వజన్మలలో యెన్ని జన్మలలోనైనాసరే చేసిన యెంతటి ఘోరాతి ఘోరాలైన పాపాలనైనా పోగొట్టి పవిత్రాత్ములుగా చేయగల శక్తి "పూర్వ దుర్గతినాశినీ" మంత్రానికి వున్నదని మన మహర్షులు పేర్కొన్నారు. ఇదే విధంగా ప్రబోధనియైన కార్తిక శుక్లైకాదశినాడు యథావిధిగా ఉపవసించి విష్ణ్వర్చన చేస్తే యెంతటి బ్రహ్మహత్యాది పాపాలైనా నశించుతాయని నరసింహకవి రుక్మాంగ దుని ద్వారా మోహినికి యీ క్రింది పద్యాలలో వివరించాడు.

"అక్లేశకరము కార్తిక
శుక్లైకాదశి యముండు చూడ వెఱచు రో
షక్లిన్నాత్ముండై హరి
విక్లబులను గావఁగాఁ దవిలి మేల్కనఁగన్.

బ్రహ్మ హత్యాది దుస్తర పాతకములు
కామచార కృతంబులై కలిగిన యవి
యైన విలయంబు నొందు సన్న్యాసమహిమ
నిది ప్రబోధని యంద్రు యతీంద్రవరులు.

(నార. 270; పు. 28, 29. ప.)

## ప్రహ్లాద కథా వైశిష్ట్యం

భాగవతాది యితర పురాణాలలో వున్న ప్రహ్లాదుని కథకు, నారదీయ పురాణంలో వున్న ప్రహ్లాదుని కథకు మౌలికంగా కొంత భిన్నత్వం గోచర మవుతున్నది. శ్రీ మహావిష్ణువు ద్వారపాలకులైన జయ, విజయు లిద్దరూ మునులవల్ల శాపగ్రస్థులై రాక్షసులుగా జన్మించిన విషయం సుప్రసిద్ధం. కృత యుగంలో జయ విజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మించి, బ్రహ్మకు, మహేశ్వరునకూ భక్తులై మహావిష్ణువుపట్ల త్రికరణశుద్ధిగా విద్వేషభావాన్ని వహించినట్లు అనేక గ్రంథాలవల్ల మనకు ద్యోతక మవుతున్నది. అయితే నారదీయ

పురాణంలో మాత్రం, హిరణ్యకశిపునకు ఆంతరంగికంగా విష్ణుభక్తి వున్నట్లు విష్ణుభక్తి లేనివానివలె అతడు పైకి, అతని జీవితకాలం మొత్తంలో విష్ణువిద్వేషిగా నటించినట్లు అనేక సందర్భాలలో స్పష్టంగా పేర్కొనబడింది "ఇట్లు వివిధ భోగంబు లనుభవించుచు భోక్త నారి యని లోనందలంపుచు స్వేశ శేషత్వ దృష్టి జనితప్రీతిం జనింపంబడుచు, బాహ్యుండునుంబోలె బాహ్యంబున మాయానాటక సూత్రంబున నడపుచుఁ జార్వాకుండునుంబోలె దేహాత్మాభేద సూచక క్రియలు గావింపుచుఁ గైశికివృత్తి కామినులంగూర్చి కబ్బంబు లొనర్చుచు, 'కాము కేషు సుఖాలాభ' యనుచు నొకానొకచోటం బల్కుచు జగంబు శూన్యశేషంబని మాధ్య మికుండునుంబోలె నుచ్చరింపుచు, బహిర్దేశంబున, నేష్టవస్తువులు చూడని యట్లుండి హృదయంబున భావించు యోగియునుం బోలె సర్వంబు నంతరంగంబుననే చూచుచు, బాహ్యంబున లేదని యాడుచు" ......... "బాహ్యంబున దైత్యుఁ డంతరంగంబునం బరమ వైష్ణవుండై వర్తించు నమ్మాయావివలన". (నార. 432, 433. పు. 176. వ.) అని వొకటికి రెండుసార్లు హిరణ్యకశిపుని ఆంతరంగిక విష్ణు భక్తి గురించి స్పష్టంగా ఉటంకించడం జరిగింది అనంతరం తన పుత్రుడైన ప్రహ్లాదుని మహత్తర విష్ణుభక్తి గురించి హిరణ్యకశిపు డాంతరంగికంగా యెంతో సంతోషపడినట్లు యీ క్రింది పద్యంలో నరసింహకవి మరింత విస్పష్టంగా పేర్కొన్నాడు.

సంపూర్ణ కళాలక్ష్మీ
సంపన్నుండైన సుతు నిశాచరపతి వీ
క్షింపుచు నానందము నను
కంపయు నుప్పొంగఁ బలికెఁ గడు మన్ననతోన్.

(నార. 464. పు. 89 వ.)

అంతేకాదు నరసింహకవి హిరణ్యకశిపుడు హరిభక్తి విడిచిపెట్టవలసిందని ప్రహ్లాదుణ్ని మందలించిన సందర్భంలో ప్రహ్లాదుడు తండ్రితో మాట్లాడుతూ, అసలు హిరణ్య కశిపుడు విష్ణ్వంశతోనే సంజనితుడైనట్లు ప్రహ్లాదుని నోటివెంటనే చెప్పించాడు.

"దైత్యేంద్ర ! యిన్నియుఁ దగుఁ ద్రిజగజ్జయ
సంపదనీకు; నో స్వామి; నేఁడు
ప్రాకృతుండవు నీవు పరమాత్మయైన యా
హరి నిజాంశంబున నవతరించి
యిట్లు యుండకయున్న నీశౌర్య మీశక్తి
యీ మహైశ్వర్యంబు నేలకలుగు;"

(నార. 461. పు. 76. వ.)

వాఙ్మయ మహాధ్యక్షుని

విష్ణువు సనకాదులకు మోక్షప్రాప్తి విధానంగురించి వివరించిన సందర్భంలో విష్ణువే రాక్షసులు బాహ్యంగా కుదృష్టి, ఆంతరంగికంగా విష్ణుభక్తి కలిగివుంటారన్న భావంతో "దీపించి బాహ్య కుదృష్టి సమ్మతమైన మతమునఁ బ్రియతమస్థితి నహించి." (నార.417.పు.100.వ.). "అవైష్ణవులంబోలె నాయందు ద్వేషంబు గావింపుచుఁ గపటంబునం దిరుగుచు, జితత్రిలోకాధిపతులై జగత్త్రయంబున ఖ్యాతినొందుచుఁ దామసులు తన వారన తామసోపాస్య చరణులై వారలకుం బ్రత్యయంబుగా బ్రహ్మ రుద్రాద్యుపాస్తి గావించి వారలవలన బహు వరంబులు గావించి యత్యాద్యైశ్వర్య పరాక్రమ వయోనిధులై విరోధులుంబలె నటించి మత్పదాంభోజంబు లందెదరు. బాహ్యంబున నసురతాఖ్యాతికై సురల బాధించెదరు". (నార. 417. పు.101.వ.) అని పేర్కొనడమేకాక యీ మాయానాటక సూత్రంలో విష్ణు ప్రయోజనాయత్తులై, జయ విజయులు రాక్షసులుగా జన్మిస్తారని విష్ణువే చెపుతాడు.

ప్రహ్లాదుడు పూర్వజన్మలో ధర్మవత్సలుడనే పేరుతో వేద వేదాంగవేత్తయై ఒకానొక పండిత సభలో యశోనిధియైన ధర్మబంధు వనే మునీశ్వరుణ్ని వాద ప్రతివాదాలలో గెలుపగా, అతడాగ్రహించి, దైత్యకుల ముఖ్యుడవవుతావని మొదట శపిస్తాడు. అపడు తిరిగి ధర్మవివేకోద్దీపితుడై బ్రహ్మవిద్యారూపుడైన ధర్మవత్సలుణ్ని, అకారణంగా శపించానని బాధపడి, రాక్షసముఖ్యుడవైనప్పటికికూడా బ్రహ్మవిద్యా వివేక పరిపూర్ణుడవై వర్ధిల్లుతావని పలుకుతాడు. ఆ ధర్మవత్సలుడే హిరణ్యకశిపునకు కృతయుగంలో ప్రహ్లాదుడై పుడతాడు. జయవిజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా సంజనితు లయ్యారని గతంలోనే పేర్కొనబడింది. త్రేతాయుగంలో ఆ జయ విజయులే రావణ కుంభకర్ణులై పుడితే, ధర్మవత్సలుడు విభీషణుడుగాను, ద్వాపరయుగంలో శిశుపాల, దంతవక్త్రులై పుడితే, ధర్మవత్సలుడు సహదేవుడై తత్త్వబోధ నిరూపణం చేస్తాడని విష్ణువే పలుకుతాడు. ఈ కృత, త్రేత, ద్వాపర, కలియుగాలలో తాను నరసింహ, రామ, కృష్ణ, కల్కి నామాలతో అవతరించి దుష్ట సంహారం చేస్తానంటాడు. కల్కి అవతారం సంభవించి, దుష్టులను సంహరించేది కలియుగ చతుర్థ పాదంలోనే, నరసింహావతారానికి పూర్వం విష్ణువే వరాహావతారమెత్తి హిరణ్యాక్షుణ్ని సంహరించిన విషయం విస్పష్టం. హిరణ్యకశిపుడు త్రేతాయుగంలో రావణాసురుడుగాను, ద్వాపరయుగంలో శిశుపాలుడుగాను, జన్మించి రామకృష్ణావతారాలచేత సంహరింపబడతాడు. అతనికి పునర్జన్మ తిరిగిలేదు. అంతే కాదు. "కృష్ణాశ్రయంబైన క్రోధంబును, కృష్ణాశ్రయంబైన కామంబును దైత్యులకు గోపికలకు మోక్షహేతువు" (నార.509. పు.273 వ.) అనికూడా విస్పష్టంగా వక్కాణించడం జరిగింది. మామూలుగా భాగవతాది గ్రంథాలలో హిరణ్యకశిపుడు,

మహోదగ్రుడై, తన సభాస్థలిలో వున్న ఒక స్తంభంలో విష్ణువును చూపవలసిందని ప్రహ్లాదుణ్ని అడుగగా విష్ణువు నరసింహావతారంలో అవతరించి హిరణ్యకశిపుని సంహారించినట్లు ప్రసిద్ధమైన విషయం. భాగవతాది గ్రంథాలలో ప్రహ్లాదాదులందరికీ నరసింహావతారంగానే విష్ణువు మొట్టమొదట ప్రత్యక్షమవుతాడు. అయితే నారదీయపురాణంలో దీనికి భిన్నంగా హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ని యమయాతనలు పెట్టి, నాగపాశబద్ధుణ్ని చేసి, సముద్రంలోకి తోయించినపుడు విష్ణువు ప్రహ్లాదునికి విష్ణు స్వరూపుడుగానే ప్రత్యక్షమై ప్రహ్లాదుణ్ని అనునయించి వరం వేడుకోమంటే నీ పాదారవిందాలు చూడడంకంటే నాకు వేరే కోరిక లేదని ప్రహ్లాదు డంటాడు. చివరికి విష్ణువు ప్రహ్లాదుణ్ని మోక్షలక్ష్మీ సామ్రాజ్య పట్టభద్రుడుగా అనుగ్రహించినప్పటికీ ప్రహ్లాదుడు విష్ణుపద భక్తి తప్ప వేరొకటి కోరనంటాడు. చివరికి విష్ణువు నేను క్షీరాబ్ధిలో వున్నవిధంగా నీ హృదయంలో వుంటానంటూ మూడురోజులకు నరసింహావతారంలో తిరిగి నన్ను నీవు చూస్తావని యీ క్రింది విధంగా పేర్కొంటాడు.

" ప్రియవత్స ! నీకు నభీష్ట మెయ్యది యది
　　ప్రాపించు ; సుఖమున బ్రతుకు మింక ;
నంతర్హితుండనై యరిగిన ఖేదంబు
　　నొందకు ; క్షీరాబ్ధినున్న యట్లు
నీ హృదయంబున నిల్తు ; లక్ష్మికి నాకు
　　భక్త హృదయమె శోభన గృహంబు ;
వైకుంఠ దుగ్ధాబ్ధివాస వర్ణన నిత్య
　　శోభయె తెలియ ; రక్షోభయములు

తలఁగఁ జేయుదు దారుణ తనువు గాన
మందిరము నిలుపుకొనఁగ మనుజసింహ
మూర్తిననుఁ జూచెదవు ; భక్తి మూఁడు దివస
ములకు ననియేగె విస్మయమున భజింప"

(నార. 501 పు. 247 ప.)

కాగా, యితర గ్రంథాలలోవలే కాక నారదీయపురాణంలో ప్రహ్లాదునికి విష్ణువు హిరణ్యకశిపు సంహార సందర్భంలో నరసింహావతార రూపంలోనే కాక, అంతకు పూర్వమే అసలు సహజ విష్ణు స్వరూపంలోనే, ప్రత్యక్షమైనట్లు స్పష్టపడుతున్నది.

పేరోలగంలో హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ని ఉద్దేశించి యీ స్తంభంలో విష్ణువును చూపించవలసిందని స్తంభాన్ని చేతితో కొట్టినట్లు, పిడికిలితో గుద్దినట్లు,

వాఙ్మయ మహోధ్యక్షుని

కాలితో తన్నినట్లు, గదతో మోదినట్లు వివిధ గ్రంథాలలో పేర్కొనబడింది. కాని నారదీయపురాణంలో మాత్రం "అని 'స్తంభంబునం జూపు' మని ఖడ్గంబున స్తంభంబుం దాటించిన." (నార. 504 పు. 257 వ.) అని కత్తితో కొట్టినట్లు కనిపిస్తున్నది.

ప్రహ్లాదుని విద్యాభ్యాస వర్ణనా సందర్భంలో కాణాదాది సిద్ధాంతాలు ప్రహ్లాదునికి పూర్వమే వున్నట్లు

> " అంత నద్దైతేయుఁ డాత్మజు ప్రతిన స
> త్యము సేయఁ దలంచి యుదగ్రబుద్ధి
> గురు సుగత కాణాద గిరిశార్క దరిపా
> ద విరించి కపిలశాస్త్రజ్ఞ వాది
> వరులనందఱఁ బిల్చి వాదింపుఁ డితనితో "
>
> (నార. 443. పు. 227 వ.)

అన్న పద్యంద్వారా స్పష్టపడుతున్నది. అయితే యీ సిద్ధాంతాలు కృతయుగం లోనే ప్రశస్తిగాంచివున్నాయని ఆధునిక చరిత్రకారులుగాని, శాస్త్రజ్ఞులుగాని అంగీకరించక పోవచ్చును. కాని వేదవాఙ్మయ ఆర్షవిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలించినపుడు, ఆ యా అణుపరమాణ్వాది సిద్ధాంతాలు, అత్యంత ప్రాచీనాలని ఆమోదించక తప్పదు.

ప్రహ్లాదుడు దైత్యకుమారులకు పరమార్థరహస్య బోధ పేరుతో ఆత్మానాత్మ వివేకం దగ్గరనుంచి, అణిమాద్యష్ట సిద్ధులతోసహా అన్నింటినీ తిరస్కరించి అనేక తత్వవిషయాలను ప్రబోధించి " విష్ణుసేవియైన జనునకు విముక్తియే సత్ఫలంబు " అని విపులంగా, సునిశితంగా తత్వబోధ చేస్తాడు. (చూడు. నార. 480. పు. మొ. 487. పు. వరకు.)

హిరణ్యకశిపుని సంహారానంతరం నరసింహావతారంలో వున్న విష్ణువు ప్రహ్లాదుని చేరదీసి, అనుగ్రహించి, రాజ్యాధినేతను చేస్తాడు. అనంతరం ప్రహ్లాదుడు చాలాకాలం రాజ్యపరిపాలన చేస్తూ, ఆ రాజ్య భోగతృష్ణలో మునిగితేలక, కేవల జ్ఞానాచ్యుతాంఘ్రి భక్తి రాజ్యాన్ని సైతం అనుభవిస్తూ చిరకాలం జీవించినట్లు కనిపిస్తున్నది. (నార.508.పు.268.వ.)

మహామథన సారామృతం

## ప్రహ్లాదుడు

ప్రహ్లాదుడు అనన్యసామాన్యమైన మహా విష్ణుభక్తుడు. ఇతని తండ్రి హిరణ్యకశిపుడు. తల్లి లీలావతి. హిరణ్యకశిపుడు బ్రహ్మనుద్దేశించి ఘోరమైన తపస్సు చేయడానికి పూనుకొనగా దేవతలు రాక్షసులమీదకు యుద్ధానికి వెళ్లారు. ఆ యుద్ధంలో రాక్షసులంతా వోడిపోయారు. అప్పుడు ఇంద్రుడు హిరణ్యకశిపుని భార్య గర్భవతియైన లీలావతిని పట్టుకొనగా నారదుడడ్డుపడి లీలావతి సచ్చరిత్ర అనీ, ఆమె గర్భంలోవున్న బాలుడు, మహా విష్ణుభక్తు డవుతాడనీ, ఆమెను చంప వద్దని చెప్పి, విడిపించి, తన ఆశ్రమానికి తీసుకొనివెళ్లి కాపాడి, పోషించి ఆమెకు ఆమె గర్భస్థుడైవున్న ప్రహ్లాదునికి మహత్తరమైన విష్ణు తత్త్వోపదేశం చేశాడు. ఈ విషయంతోపాటు మిగతా విషయాలన్నీ, భాగవతాది గ్రంథాలద్వారా విజ్ఞులకు సువిదితాలే. అయితే దేవీ భాగవత, భారత, వామన పురాణాలవల్ల మరికొన్ని విశేషాలు తెలుస్తున్నాయి. అవి ప్రహ్లాదుని జీవిత మధ్య, ఉత్తర చరిత్రలకు సంబంధించినవిగా కనిపిస్తున్నాయి.

వాటిని యీ క్రింద సంగ్రహంగా ఉటంకిస్తున్నాను. ప్రహ్లాదుని అర్థాంగి పేరు దేవి. ఈ దంపతులకు ఆయుష్మంతుడు, శిబి, విరోచనుడు, కుంభుడు, నికుంభుడు అనే అయిదుగురు పుత్రులు కలిగారు. ప్రహ్లాదుడొకసారి ఒక మునీశ్వరుణ్ని అవమానించాడు. అతని శాపం కారణంగా ప్రహ్లాదుడు విష్ణుభక్తి రహితుడై పోయాడు. అనంతరం విష్ణుమూర్తికి, ప్రహ్లాదునికి పరస్పరం యుద్ధం సంభవించింది. ఆ యుద్ధంలో ప్రహ్లాదునికి శాపవిముక్తితోపాటు, తిరిగి విష్ణుభక్తి ప్రబుద్ధమైనది.

ఒకసారి చ్యవనుడు స్నానంచేస్తూ వుండగా, అతనిని పాతాళలోకవాసులు, పాతాళానికి యీడ్చుకొనిపోయారు. అప్పుడు పాతళంలోవున్న ప్రహ్లాదుడు చ్యవనుణ్ని చాలా గౌరవించాడు. అపుడు చ్యవనుడు తానుచేసిన తీర్థయాత్రల మాహాత్మ్యాలనుగురించి వివరంగా వర్ణించి చెప్పగా, ప్రహ్లాదుడు చ్యవనునితోపాటు తీర్థయాత్రలు చేయడానికి సపరివారంగా వెళ్లాడు.

ప్రహ్లాదుడు తీర్థయాత్రలుచేస్తూ, నరనారాయణులు తపస్సు చేసుకుంటున్న ప్రదేశానికివెళ్లి, వారినీ, వారిసమక్షంలోవున్న వివిధ అస్త్రాలనూచూచి "వీరు నిజంగా మునీశ్వరులే అయితే వీరికి అస్త్రాలతో పనేంవున్నది. బహుశా వీరు వంచకులై వుంటారు." అని అన్నాడు. ఆ మాటలువిన్న నరనారాయణులకు ఆగ్రహంవచ్చి వారు ప్రహ్లాదునితో యుద్ధానికి తలపడ్డారు. ఆ పోరాటంలో ప్రహ్లాదుడోడిపోయి శ్రీ మహావిష్ణువును ప్రార్థించాడు. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై నరనారాయణు

వాఙ్మయ మహోధ్యక్షుని

లిద్దరూ తన అంశతో జనించినవారే అని వివరిస్తాడు, అని దేవీ భాగవతంవల్ల తెలుస్తున్నది.

ప్రహ్లాదుని పుత్రుడైన విరోచనుడూ, సుధన్వుడనే బ్రాహ్మణుడూ ఒక కన్యా ప్రతిగ్రహ విషయంలో వాదులాడుకుంటారు. అప్పుడు వారు తమ యిద్దరిలో, గుణగణాలలో గొప్పవాడెవ్వరో నిర్ణయించి చెప్పవలసిందని యిద్దరూ కూడా ప్రహ్లాదుని వద్దకే వెళ్తారు. అప్పుడు సుధన్వుడు నీవు ధర్మాధర్మాలను విచారించకుండా పక్షపాతంతో యేదైనా నిర్ణయానికి వచ్చేట్లయితే, నీ తల ముక్కలు చెక్కలవుతుందని అంటాడు. ఈ మాటలకు ప్రహ్లాదుడు భయపడి కశ్యపుని వద్దకు వెళ్లి, విషయమంతా వివరిస్తాడు. అప్పుడు కశ్యపుడు "సాక్షీభూతుడైనవాడు, ధర్మదర్శుడు, విధి తప్పకూడదు. ఎవ్వరైనా ధర్మం చెప్పవలసిందని వచ్చినప్పుడు, ధర్మం చెప్పకపోతే పాపం చుట్టుకుంటుంది. కాబట్టి ధర్మాధర్మాలను విచారించి ధర్మోద్ఘాటన చేయవలసిం" దని చెబుతాడు అప్పుడు ప్రహ్లాదుడు, విరోచన, సుధన్వుల గుణగణాలను విమర్శించి, సుధన్వుడే గుణవంతుడని మేటి అని, నిష్పక్షపాతంగా చెప్పినట్లు భారతం పేర్కొంటున్నది.

ప్రహ్లాదుని పుత్రుడైన విరోచనుడు, సుధన్వుడు ఒక సందర్భంలో పందెం వేసుకొని తను తమ ప్రాణాలను పణంగా వొడ్డుతారు. అనంతరం తమ తగవు తీర్చవలసిందని వీరిద్దరూ ప్రహ్లాదునివద్దకు వెళ్తారు. విరోచనుడు తన పుత్రుడనికాని, సుధన్వుడన్యుడనికాని, తలంచకుండా సుధన్వునికి న్యాయం సమకూరుస్తూ, ధర్మబుద్ధితో తీర్పుచెప్పి తన తనయుని ప్రాణాలు పోగొట్టడాని కంగీకరిస్తాడు. అయితే తరువాత ప్రహ్లాదుడు ఆ సుధన్వుని వల్లనే తన తనయుని జీవితాన్ని దానంగా గ్రహించి విరోచనుణ్ని పునర్జీవితుణ్ని చేస్తాడని భారతంలో మరొకచోట పేర్కొనబడింది.

ప్రహ్లాదుని మనుమడు విరోచనుని పుత్రుడైన బలి రాజ్యంచేస్తూ వుంటాడు. "ఇప్పుడు దైత్యుల మహిమ, శక్తి, యుక్తులు, క్షీణించిపోతున్నాయి. ఇందుకు కారణం యేమి"టని ప్రహ్లాదుణ్ని బలి ప్రశ్నిస్తాడు. మహావిష్ణువు కారణంగానే దైత్యుల శక్తి క్షీణిస్తున్నదని ప్రహ్లాదుడు చెపుతాడు. అప్పుడు బలి "ఆఁ! విష్ణుమూర్తి అంటే యెంత? అతణ్ని ఓడించగలిగిన వీరులు మనలో లేరా?" అని బలి విష్ణుధిక్కరణతో మాట్లాడుతాడు. అప్పుడు ప్రహ్లాదుడికి కోపంవచ్చి "నీవు విష్ణుమూర్తి వల్లనే అణగద్రొక్కబడతావు" అని బలిని శపిస్తాడు. అని వామన

పురాణంవల్ల తెలుస్తున్నది. విష్ణుమూర్తి వామనావతారందాల్చి, బలిని అణగ ద్రొక్కిన విషయం సుప్రసిద్ధమే కదా!

బలికి ప్రహ్లాదుడు వివిధ ధర్మ విశేషాలన్నీ చెప్తూ వుండేవాడు. విష్ణుమూర్తి వామనావతారంతాల్చి బలిని అణగత్రొక్కుతుంటే ప్రహ్లాదుడడ్డుపడి, "బలి హంతవ్యుడు కాడు. సద్ధర్మపరుడు నీతిపరుడు కాబట్టి అతనిని కాపాడవలసింది"గా విష్ణువును ప్రార్థించగా అప్పుడు విష్ణువు అతనిని సంహరించకుండా విడిచిపెట్టాడని కూడా వామన పురాణం పేర్కొంటున్నది.

## అవతారాలు

వేదవాఙ్మయం ప్రకారించూస్తే, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు సంబంధించి అనేకానేకావతారా లున్నాయి. ఒక్క విష్ణువుకు సంబంధించి సుప్రసిద్ధమైనవి పది అవతారాలేయైనా వేదవాఙ్మయంలో మాత్రం విష్ణ్వవతారాలు అతీతదశ దశాలు గానే కాదు, దశ శతాలకంటే యెక్కువగానే వున్నాయి. సుప్రసిద్ధాలై యిప్పటి కవతరించిన తొమ్మిది అవతారాలలోనూ, వరాహ, నృసింహ, కృష్ణావతారాలు మాత్రమే, అన్య శక్తులవల్ల శ్రీ మహావిష్ణువులో అంతర్లీనమైనట్లు కనిపిస్తున్నవి. హిరణ్యాక్ష సంహారణార్థం మహావిష్ణువు వరాహావతార మెత్తి హిరణ్యాక్షుని రకాన్ని త్రాగి మదించి స్వైరవిహారం చేస్తూ లోకాలన్నింటినీ భయపెడుతూ, ఆ వరాహ రూపంలోనే సంచరిస్తుండగా బ్రహ్మాది దేవతలందరూ భయపడి, మహేశ్వరునితో మొరపెట్టుకొన్నారు. అప్పుడు మహేశ్వరుడు శరభ రూపంతాల్చి ఆ స్వైరవిహారం చేస్తున్న ఆదివరాహం బృహద్దంతాన్ని లాగివేసి దాని పీచమడ గించినట్లు భాగవతస్కాందపురాణాలు పేర్కొంటున్నాయి. నారదీయపురాణంలో నరసింహావతారం ముగింపుగురించి ప్రత్యేకంగా యేమీ పేర్కొనలేదు. కాని శివపురాణ లింగపురాణాల ప్రకారం హిరణ్యకశిపుని సంహారానంతరం ఆ నరసింహుడు సగర్వంగా, విచ్చలవిడిగా తిరుగుతుంటే శివుడు శరభరూపంతాల్చి నరసింహావతారాన్ని ముగింపచేసి ఆ చర్మంతీసి తాను కప్పుకొన్నాడని తెలుస్తున్నది. అనంతరం ఆ నరసింహావతారంలోని నరరూపం నరుడుగాను, సింహరూపం నారాయణుడుగాను రూపొందినట్లు కూడా శివ-లింగ-పురాణాలు పేర్కొంటున్నవి మహేశ్వరుడు గజచర్మ ధారిగా, అజినాషాఢ ధరుడుగా, ప్రసిద్ధివున్నది కాని నరసింహ చర్మధారుడుగా యే విధమైన ప్రసిద్ధిలేదు. యీ విషయంలో ఒక్క శివ లింగ పురాణాలవాక్కు తప్ప మరే యితర శాస్త్రాధారం కూడా కనిపించడంలేదు. పరశురాముడు రాముని చేతిలో వోడిపోయినా, సుదీర్ఘ కాలం

అంతర్ముఖుడై తపోనిధిగా కాలంగడిపినట్లు కనిపిస్తున్నది. రామావతార కాలంలో రాముడు వాలిని సంహరించిన సందర్భంగా వాలి సుగ్రీవులకు భార్యగా విరాజిల్లిన తారశాపం కారణంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడుగా అవతరించిన తరువాత అవతారాంతిమదశలో-త్రేతాయుగంలో వాలిగా జీవించి, ద్వాపరయుగంలో ఒక బోయవాడుగా జన్మించిన వ్యక్తి వేసిన బాణాహతితో పాదాంగుష్ఠ విచ్ఛేదనం జరిగి శ్రీకృష్ణావతారం ముగుస్తుంది. శ్రీకృష్ణుడు ఒక చెట్టుక్రింద కాళ్లు చాపుకొని కూర్చొని వూపుకుంటూ పిల్లనగ్రోవి ఊదుతూ వుండగా దూరంగావున్న బోయవాడు కదలాడుతున్న కాలి బొటనవ్రేలిని చూచి చెవులపిల్లి (కుందేలు) చెవి ఆడిస్తున్న దనుకొని గురిచూచి బాణం వేయగా ఆ బాణం శ్రీకృష్ణుని బొటనవ్రేలికి తగిలి, కృష్ణుడు అవతారం చాలిస్తాడు.

## మ హా వి ష్ణు వు

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఖగోళ శాస్త్రరీత్యాగాని, మంత్రశాస్త్రరీత్యాగాని, మరేదృష్టితో చూచినా విష్ణువుకు ఒక అసాధారణమై, అపూర్వామేయమైన స్థానం వున్నదని మనం ఆమోదించక తప్పదు. శ్రీ మహావిష్ణువు గురించి వేదవాఙ్మయంలో బహుముఖంగా వర్ణించబడింది. శ్రీసూక్తం బహుముఖాలైన విశేషార్థాలతో లక్ష్మీపరమై అవతరించగా, అదేవిధంగా పురుషసూక్తంమహావిష్ణుపరమై అవతరించింది. గతంలో అనేకమంది ప్రాచ్యపాశ్చాత్య పరిశోధకులు వేదకాలంలో మహావిష్ణువు కంటే ఇంద్రుడికి మహోన్నతస్థానం యివ్వబడిందనీ, ఆ కాలంలో ఇంద్రునికంటె విష్ణువు తక్కువవాడుగా చూడబడ్డాడనీ అభిప్రాయపడడం జరిగింది. వీరిలో యీ అభిప్రాయం కలగడానికి మూలకారణం విష్ణు పర్యాయపదాలతో "ఉపేంద్ర" శబ్దం ఉపయోగించబడడమే. ఉపేంద్ర శబ్దానికి "చిన్నయింద్రుడు" అని ఈ పరిశోధక విమర్శకులు అర్థంచెప్పుకొని, విష్ణువును ఇంద్రునికంటె తక్కువవానిగా వేదకాలంలో భావింపబడినట్లు పేర్కొన్నారు. ఇంద్రుడు వర్షాధిదేవత కావచ్చును. వర్షాలకోసమై ప్రాచీనకాలంలో కొందరు 'ఇంద్రస్తుతి' అత్యధికంగా చేసివుండవచ్చును. వాస్తవానికి ఆర్షవిజ్ఞానందృష్ట్యా వర్షాధిదేవత వరుణుడేకాని ఇంద్రుడు కాడు. అసలు 'ఉపేంద్ర' శబ్దానికి ఆర్షవిజ్ఞానందృష్ట్యావున్న అర్థమే వేరు. ఉపేంద్రుడంటే చిన్నయింద్రుడని ప్రాచ్యపాశ్చాత్య పరిశోధక విమర్శకులు చెప్పిన అర్థం పూర్తిగా పొరపాటు. నరసింహాకవి నారదీయపురాణంలో హిరణ్యాకశిపుడు విష్ణువును కించపరుస్తూ, తూలనాడుతూ, ప్రహ్లాదునితో సంభాషించిన సందర్భంలో "అటు పల్కెద వేనిచ్చిన సుఖంబు విడిచి యుపేంద్రునివలన నేమి యనుభవించెదవు? నా యాజ్ఞ శిరంబునం దాల్చిన దేవేంద్రునిం జూడవే ?" (నార.47౩. పు.125.వ.)

అని దేవేంద్రునికంటే ఉపేంద్రుడైన విష్ణువు తక్కువవాడన్న అభిప్రాయం వ్యక్తీకరింపచేయడం జరిగింది. వాస్తవానికి ఉపేంద్ర శబ్దానికి చిన్నయింద్రుడని అర్థం కాదు. ఇంద్రునికి సమీపంలో వుండేవాడనికూడా అర్థంకాదు. 'తన సమీపంలో ఇంద్రుడు కలవాడు' అని మాత్రమే అర్థం. "ఉపసమీపే ఇంద్రః యస్యసః ఉపేంద్రః" అని అసలైన అర్థం. ఎక్కడో కోట్లాది మైళ్ళ దూరంలో మహోన్నత స్థానంలో ఖగోళంలో నక్షత్రరూపంలో క్షీరసముద్రం (Thick Milky way) అనబడిన పాల పుంతలో శేషశాయి అయివున్న మహావిష్ణు నక్షత్రాలెక్కడ ? జ్యేష్ఠాధి దేవతయైన దేవేంద్ర నక్షత్రా లెక్కడ ? ఉన్నత స్థానంలోగాని, వైశాల్యంలోకాని, మహత్తర శక్తిమత్త్వంలో విష్ణు నక్షత్రాలకు, దేవేంద్ర నక్షత్రాలకు పొంతనయే లేదు. అందువల్ల ఉపేంద్ర శబ్దానికి చిన్నయింద్రుడని కాకుండా, "తన సమీపంలో ఇంద్రుడు కలవాడు"— "ఇంద్రున కాశ్రయభూతుడైనవాడు" అని విశేషార్థాన్ని అసలైన, సిసలైన మూలార్థాన్ని చెప్పి, మహావిష్ణు స్థానానికున్న శాస్త్రీయమైన వాస్తవికతను మనం గుర్తించవలసివున్నది. కాగా దేవేంద్రుడు ఉపేంద్రునికంటే తక్కువవాడే కాని, యెక్కువవాడని చెప్పడానికి అవకాశం లేనేలేదని గ్రహించాలి. నారదీయపురాణంలో రెండు సందర్భాలలో విష్ణుపరంగా 'ప్రభువు' అనే అర్థంలో ఈశ్వర శబ్దంసైతం ప్రయోగితమయింది, "సనకాదులు శపించుట విని దయాబ్ధియు భక్తవత్సలుండును నగు నీశ్వరుండు." (నార.421. పు.119.వ.)

"కాననేనును స్వప్రసిద్ధ కలితసర్వ
శక్తియుక్తుండనైన యీశ్వరుఁడనస్మ
దాజ్ఞచే లోకములకు సర్వాగమములు
నీశత వహించెనిఁక నిన్నియెంచనేల ?"

(నార.432. పు.172.వ.)

ఈ సందర్భాలలో ఈశ్వరుడంటే మహేశ్వరు డనికాక మహావిష్ణువని మాత్రమే అర్థం చెప్పుకోవాలి.

నారదీయపురాణంలో వైకుంఠలోకం ఆవరణపంచకాలను గురించి వేద ప్రామాణికత్వంతో యీ క్రింది విధంగా వర్ణింపబడింది. "ప్రాగవాచిని శ్రీ లోకంబును బశ్చిమంబున శ్రీవైకుంఠంబునకు దక్షిణంబున నిత్యానందంబు నిధియు సద్భక్తవరదుండునగు సంకర్షణ విభుండుండు, ఆ సంకర్షణ లోకంబునకుఁ బశ్చిమంబున నిర్మలానంద నీరధి నిత్యంబునగు సరస్వతి లోకంబులందగు ప్రత్యగవాచిని సరస్వతి లోకంబున కుత్తరంబునఁ బ్రద్యుమ్న లోకంబు చెలంగు. ప్రతీచీనయు తార్కేందుప్రభ దీపించి నిర్మల శర్మదంబై ప్రద్యుమ్న పదంబు దగ్గర రవి దిక్కున

వాఙ్మయ మహోధ్యాయుని

నిత్యాప్సరోఽలంకృతంబై రతిలోకంబు విరాజిల్లు. తత్ప్రాచీన అనిరుద్ధ లోకంబు రాణించు నుదీచిం బ్రకాశించి యానంద వారధియగు నా యనిరుద్ధ లోకంబునకుఁ బ్రాచియగు విదిక్కున సద్గుణ సాగరంబగు శాంతిలోకంబు విజృంభించు. ఇవి చతుర్వ్యూహంబులు నాలుగు శ్రీకళలు. నాలుగును బ్రదక్షిణ క్రమంబునఁ బ్రాచ్యాద్యష్ట దిక్కులం బ్రకాశించు నీ వ్యూహాష్టకంబు ప్రథమావరణంబున నుండు. "మధ్యే మధ్యేత్వ సంఖ్యేయాస్తత్ర వ్యూహా" మ్మనిన శ్రుతివలన ననేక వ్యూహంబులుగలవు. ద్వితీయావరణంబునం బ్రాచ్యాది దిక్కుల వరాహ జామదగ్న్య శ్రీనరసింహ రఘువల్లభ శ్రీధర వామన హయగ్రీవ వాసుదేవ లోకంబులు గలవు. తదధిపతులు విభవేశ్వరులు నిత్యులు. వీరు వ్యూహాష్ట విశిష్ట శ్రీవైకుంఠేశ్వర ప్రీతిసాధనంబైన బ్రహ్మవిద్య నర్వాచీన ప్రాకృత భూముల నవతరించి ప్రకాశింపఁ జేయుదు రీ మూర్తులం గొల్చిన నపవర్గంబు లభించు. తృతీయావరణంబున నెనిమిది దిక్కుల పాంచజన్య ముసల చక్ర ఖడ్గ గదా శార్ఙ్గాది వైజయంతంబులు నిలుచు. నిత్యానవధిక నిరతిశయానందంబగు భగవత్సేవగావించు. చతుర్థావరణంబును గుముద, కుముదాక్ష పుండరీక వామన శంకుకర్ణ సర్పనేత్ర సుముఖ సుప్రతిష్ఠితులు నిత్యులు. నిత్యముక్తులతో నీశ్వరు నారాధింపుదురు. పంచమావరణంబున నింద్రానల దండధర నిర్బ్బతి యాదసాంపతి గంధవాహ ధనేశానులు నిత్య నిర్జరులుండుదురు" (నార. 358. 359. పు. 171. వ.) దీనినిబట్టి విష్ణుమూర్తి వహించిన వివిధావతారాది లోకాలు సైతం, విభిన్నాలుగా వున్నట్లు స్పష్టమవడమే కాక, ప్రాగవాచిలో శ్రీలోకం, పశ్చిమంలో శ్రీవైకుంఠం, అంటే మహావిష్ణుస్థానం వుండగా, పంచమావరణలో ఇంద్రానలాదుల స్థానం వున్నట్లు శ్రుతిప్రామాణికత్వంతో ద్యోతకమవుతున్నది. ఇదేవిధంగా అపూర్వమైన మహావిష్ణు శక్తి గురించి, వేద మంత్ర ప్రామాణికత్వంతో నరసింహకవి యీ క్రిందివిధంగా వర్ణించాడు. "శ్రుతియు విష్ణునకు 'అపాణి పాదోజవనో గ్రహితా పశ్యంత్యచక్షుః సశ్రుణోనకం నః సవేత్య వేద్యం నచసశ్య వేత్తా తమాహు రగ్ర్యం పురుషం మహాంతమ్ నకస్యకార్యం కరణంచ విద్యతే నతత్స మశ్చాభ్యధికశ్చ దృశ్యతే పరాస్యశక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ" యనిన నది హస్తంబులులేక పట్టును. పాదంబులులేక పఱువెత్తును. చక్షువులులేక చూచును. కర్ణంబులులేక వినును. అవేద్యంబైనయది యెఱుంగును. తన్నొకం డెఱుంగ లేఁడు. అతండు మహాపురుషుం డని యెంతురు. అతనికిఁ గార్య కరణంబులు లేవు. అతనికి ముందు నధికుండు లేఁడు. అతని శక్తి వివిధంబైన యదియై స్వాభావికంబులు జ్ఞాన బల క్రియలు." (నార. 364. పు. 189. వ.) మహావిష్ణు మాహాత్మ్యం గురించి యెంత వర్ణించినా వొక్క మానవ భాషలలోనేకాదు, దేవ

భాషలోసైతం సమర్థమైన, సంపూర్ణమైన పదజాలం లేదనే చెప్పవచ్చును. విష్ణు వాక్యాలుగానే నరసింహకవి వర్ణించిన విష్ణుశక్తిని కొంతలో కొంతైనా ప్రతి బింబించగల యీ క్రింది పద్యం చూడండి.

"విశ్వసృష్టి స్థితి లయాది వివిధ కర్మ
ములకు స్వాతంత్ర్యమగు నెట్ల మొదల శేషి
నైన నా కిట్ల శేష వృత్త్యంతరముల
నాత్మలకునైన స్వాతంత్ర్య మమరియుండు.

(నార. 411. పు. 78. ప.)

ఈ అనంత విశ్వసృష్టి స్థితిలయాలలో శ్రీమహావిష్ణువు తానొక మాయానాటక సూత్రధారినని తనకై తాను నరసింహకవి కవితా రూపంలో యీ క్రిందివిధంగా వెల్లడించాడు.

"ప్రకటంబగు మాయానా
టక సూత్రము నడప నతి దృఢస్థితిగలనే
నొక సూత్రధారుఁడను హృ
ద్వికలతయిఁక నేల విడువుఁడు మీరల్.

(నార. 420. పు. 117. ప.)

ఇటువంటి మాయా నాటక సూత్రధారియైన మహావిష్ణు మహిమను యెంత కొనియాడినా తనివితీరదు. ఎంతగా యెన్నెన్ని విధాలుగా యెన్నెన్ని రూపాలలో అర్చించినా యెన్నిజీవితాలైనా చాలవు. ఎన్నెన్ని జన్మలైనా చాలవు. అయితే విష్ణ్వర్చనలో 21. సంఖ్యకు ఒకానొక విధమైన వైశిష్ట్యం, ప్రత్యేకత వున్నట్లు కనిపిస్తున్నది.

## విష్ణ్వర్చనలో 21. సంఖ్యావైశిష్ట్యం

నారదుఁడు విష్ణుభక్తి ప్రాశస్త్యం గురించి, మునులకు వివరిస్తూ "విష్ణు భక్తాంఘ్రి రేణువులచే నణువేని పర్వతంబగు. తదవమానంబునం బర్వతంబేని యణు వగుం గావునఁ గొన్ని దినంబులు దత్పలాశ తీరంబుననుండి తీర్థాంతరంబుల నిరువది యొక్క దినంబు నిలిచి పాపంబులం బాసి కల్యాణతీరంబున కేఁగి తపో విద్యాశీల వయో విశేషంబులం బెద్దయగు రోమశ మహామునిం గాంచి పాదంబులం బడి'' (నార. 170. పు.117. వ.) అని వివిధ తీర్థాలలో 21 రోజులు నిలిచి పాపక్షాళనం చేసుకొన్నట్లు వక్కాణించాడు.

వాఙ్మయ మహోధ్యక్షుని

ఈ యేకవింశతి సంఖ్యకున్న వైశిష్ట్యాన్ని గురించి సంగ్రహంగా యిక్కడ ఉటంకిస్తున్నాను. సంగీతశాస్త్రంలో 21 మూర్ఛన లున్నాయి. ఉత్తర మంద్ర, రంజని, ఉత్తరాయత, శుద్ధషడ్జ, మత్సరీకృతు, అశ్వక్రాంత, హిరుగ్గత, యివి యేడూ షడ్జగ్రామాంతర్గత మూర్ఛనలు. ఖ, ఆలాప, చిత్ర, చిత్రవతీ, సుముఖీ, విశాలా, నంద, యివి యేడు గాంధార గ్రామాంతర్గతాలు. సవ్వీరి, హరిణాశ్వ, కలోపగత, శుద్ధమధ్య, మార్గ, కౌరవి, హృశ్య, అని యేడు మధ్య గ్రామాంతర్గత మూర్ఛన లున్నాయి. వీటిల్లో గాంధార గ్రామాంతర్గత మూర్ఛనలు నారదుడు స్వర్గంలోని వారి కుపదేశించినట్లు ప్రసిద్ధి. మన శాస్త్రాల్లో వీటికి వ్యవహృతి లేదు. వీటిని గురించి సంగీతశాస్త్రజ్ఞులకు మాత్రమేకాదు, సంగీతశాస్త్రకారులకు సైతం తెలియదని చెప్పవచ్చును

కాలంలో మహాదోషాలుగా పరిగణింపబడిన యేకవింశ న్ముహూర్త దోషాలున్నాయి. అవి పంచాంగ శుద్ధి, సూర్య సంక్రాంతి, కర్తరి, షష్ఠాష్టరి, (షకటంపు దోషాలు) ఉదయాంత శుద్ధి, దుర్ముహూర్త దోషం, గండదోషం, కుజాష్టమ దోషం, భృగుషట్క దోషం, లగ్నాష్ట దోషం, చంద్ర సగ్రహ దోషం, గ్రహణోత్పాత దోషం, క్రూరవిరుద్ధం, విషనాడీ ఘటిక దోషం, క్రూరసంయతం, కునవంశ, వారజనిత దుర్ముహూర్తం, ఖర్జూరిక సమాంఘ్రి, అకాలగద్యుతం, మహాపాతం, వైధృతిదోషం. యీ యిరవై యొకటి ముహూర్తగతాలైన దోషాలుగా శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

వాక్యగతాలైన కావ్యదోషాలను సైతం 21 సంఖ్యకు పరిమితంచేసి లక్షణ కర్తలు పేర్కొన్నారు. అవి అక్రమం, విసంధి, ప్రక్రమభంగం, పునరుక్తి, అపూర్వం, వాక్యసంకీర్ణం, వ్యాకీర్ణం, అధికపదదోషం, వాచ్యవివర్జితం, అరీతి, న్యూనోపమ, అధికోపమ, సమాప్తపునారాప్తం, అస్థానసమాసదోషం, ఛందోభంగం, యతిభంగం, పతత్ప్రకర్షం, భిన్నలింగం, భిన్నవచనం, అక్రియ, (అశరీరదోషం), సంబంధ వివర్జితదోషంగా లక్షణకారులు పేర్కొన్నారు.

విరాగ మోక్షాలైన దీక్షలు సైతం 21 సంఖ్యకు పరిమితాలుగా తత్త్వవేత్తలు పేర్కొన్నారు. ఇవన్నీ శాంభవ నిర్మితాలని సంప్రదాయజ్ఞులంటారు. వీటిని శివ దీక్షలని సైతం పేర్కొంటారు. ఈ 21 మహాదీక్షలు యివి. ఆజ్ఞ, ఉపమ, కలాభిషేచన, స్వస్తికారోహణ, భూతిపట్టా, ఆయత్త, స్వాయత్త, యీ యేడు దీక్షలు క్రియా దీక్షాంతర్గతాలు. ఏకాగ్ర, వృథవ్రత, పంచేంద్రియార్పణ, అహింస, లింగ నిజ, మనోలయ, సద్యోముక్తి, దీక్షలు యేడూ మనుదీక్షాంతర్గతాలు. సమయ, నిస్సంసార, నిర్వాణ, తత్త్వ, అధ్యాత్మ, అనుగ్రహ, సత్వశుద్ధి, నామకాలైన యీ యేడు దీక్షలు వేధాదీక్షాంతర్గతాలు.

మహాభారతోక్తి ననుసరించి ప్రజాపతులు సైతం 21 సంఖ్యకే పరిమితమై కనిపిస్తున్నారు. బ్రహ్మ, స్థాణు, మనువు, దక్షుడు, భృగువు, ధర్ముడు, యముడు, మరీచి, అంగీరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు, పరమేష్ఠి, సూర్యుడు, సోముడు, కర్దముడు, క్రోధుడు, అర్వాకుడు, క్రీతుడు.

గణపతి లీలా విశేషాలుగా ఏకవింశల్లీల లున్నట్లు గణపతి పురాణం పేర్కొం టున్నది. వీటన్నిటికి మూలంగా శ్రీమహావిష్ణువు ఏకవింశతి అవతారాలను దాల్చి తన మాయావిలసనాన్ని విరాజిల్లచేయడమేనని కనిపిస్తున్నది. మామూలుగా మనం దశావతారాలనే విష్ణ్వవతారాలుగా భావిస్తాంకాని శతాధికంగా అవతారాలున్నట్లు వేదప్రమాణంగానే వున్నట్లు గతంలో పేర్కొనడం జరిగింది. అయితే విశిష్ట దశావ తారాలకు భిన్నంగా, ఆ దశావతారాలతోసహా, మరికొన్ని అవతారాలనుకలిపి మహా విష్ణువు అవతారాలు ఏకవింశతి సంఖ్యకు పరిమితాలైనట్లు వైష్ణవీయ గ్రంథాలలో కనిపిస్తున్నది. విధాత, యజ్ఞవరాహ, నారద, నరనారాయణ, కపిలసిద్ధ, దత్తాత్రేయ, యజ్ఞ, ఉరుక్రమ, (ఋషభ), పృధుచక్రవర్తి, మత్స్య, కూర్మ, ధన్వంతరీ, మోహినీ, నృసింహ, వామన, భార్గవ, (పరశురామ), వ్యాస. శ్రీరామ, బలరామ, శ్రీకృష్ణ, బుద్ధ, లేదా కల్కి అవతారాలుగా యీ 21 ని పేర్కొనడం జరుగుతున్నది. బుద్ధ, కల్కి, అవతారాలకు మారుగా కుమారస్వామి అవతారాన్ని సైతం వొక అవతారంగా పేర్కొన్న గ్రంథాలు లేకపోలేదు. కేవలం విష్ణ్వవతారాలేకాక అటు గణపతిలీలలూ, చివరికి శివదీపలు సైతం 21 సంఖ్యకు పరిమితమువడం చూస్తే, మొత్తంమీద శ్రీమహావిష్ణువుదాల్చిన 21 అవతారాల వైశిష్ట్యం ప్రసిద్ధిలోకి వచ్చిన రోజుల్లో కేవలం విష్ణుపరంగానేకాక, అటు శివపరంగా సైతం వేదోక్తమైన హరిహరాభేదం లక్ష్యంగా యీ 21 సంఖ్యకు పరిమితంచేసి అటు విష్ణ్వర్చనలను, యిటు శివదీపలను ప్రాచీను లేర్పరచినట్లు కనిపిస్తున్నది. ఈ దృష్ట్యానే అటు విష్ణ్వ ర్చనలోనూ, యిటు శివార్చనలోనూ దీపారాధన చేయడంలో విడివిడిగా 21 వత్తు లతో దీపాలుగల కుందెనుపెట్టి వెలిగించి యేకవింశ ద్దీపజ్యోతులతో ఆరాధనచేసే సంప్రదాయం ఉభయమతాల్లోనూ ఒకానొక వైశిష్ట్యంతో అత్యంత ప్రాచీనకాలం నుంచీ నేటివరకూ కూడా ఆచరణలోవున్నది.

## వర్ణనలు - ప్రత్యేకత

నరసింహకవి నారదీయపురాణంలో కొన్నికొన్ని సందర్భాలలో ఒకానొక వైశిష్ట్యంకల వర్ణనా విశేషాలను ప్రదర్శించాడు. తులసీ హరివాసరాది మహత్వ వర్ణనలోనూ ధర్మకేతుడనే రాజు భక్తితోచేసే నారాయణార్చనా విధానం గురించి

వాఙ్మయ మహోధ్యక్షుని

చెపుతూ భగవద్దర్శనం యే విధంగాచేయాలో పేర్కొంటూనూ, తులసీ మాహాత్మ్యం గురించి చక్కగా వర్ణించాడు. తులసీపద ఉచ్చారణతోనే విష్ణుపాదార్చనా సత్ఫలితాన్ని పొందుతాడని పేర్కొంటూ "దర్శన శ్రవణ కీర్తన పరిస్పర్శన స్మరణంబు లొనరించు జనులనెల్లఁ దులసీవనము పవిత్రులఁజేయు వెనుకటి పదితరంబులు మీఁది పదితరములు తులసీదళంబు లెందు వసించు" (నార. 159. పు. 57. ప.) అని తులసీశక్తిని మహత్తరంగా వర్ణించాడు. ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రాల ప్రకారం చూస్తే తులసి కృష్ణతులసికాని, లక్ష్మీతులసికాని యేదైనా అష్టాదశ కుష్ఠురోగాలను నిర్మూలించడమేకాక, హృదయాన్ని బలవత్తరంగా రూపొందించి ఘాతాది వివిధ బాధలను సైతం తొలగింప చేస్తుందని తెలుస్తున్నది. బ్రహ్మవైవర్త పురాణాన్నిబట్టి చూస్తే విష్ణుపూజలో ప్రత్యేకత వహించిన తులసికి మూలభూతమైన చరిత్ర యీ క్రిందివిధంగా తెలుస్తున్నది. లక్ష్మ్యంశతో మాధవీ, ధర్మధ్వజ దంపతులకు తులసి అనే పేరుగల కూతురు పుట్టింది. ఈమె చిన్నతనంలోనే బదరీవనంలో ఘోరమైన తపస్సు చేసింది. ఆ తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై వరం వేడుకొనవలసిందని అంటే, విష్ణుమూర్తి తనకు భర్త అగ్యేట్లుగా వరమిమ్మని కోరుతుంది. బ్రహ్మ ఆ వరం యిచ్చి "నీవు విష్ణు శాపంవల్ల వృక్షరూపం పొంది, అతి పవిత్రతతోపాటు వాస్తవంగానే విష్ణువును పొందగలవని చెపుతాడు. తులసి విరహవేదనతో వనంలో సంచరిస్తూ వుండగా యీమెను శంఖచూడుడనే రాక్షసుడు చూచి మోహించి దరిచేరి "నీ వెవ్వరవు ? ఇక్కడెందుకు తిరుగుతున్నావు ?" అని సంభాషణ ప్రారంభిస్తాడు. కొద్దిసేపట్లోనే వారిరువురి మనోభావాలు వొకరివొకరు తెలుసుకుంటారు. ఇంతలో నారదుడు వచ్చి "యీ తులసికి శంఖచూడుడే అర్హుడు. యీ శంఖచూడునకు తులసియే తగును. మీ రిద్దరూ తప్పక వివాహం చేసుకోండి" అని చెపుతాడు. అనంతరం వారిద్దరూ గాంధర్వ వివాహం చేసుకొంటారు. శంఖచూడుడది మొదలుకొని దేవతలతో యుద్ధం చేయడం మొదలుపెడతాడు. అనేకమంది దేవతలతని చేతిలో ఓడిపోతారు. చివరికి కాళికాదేవి కూడా వోడిపోతుంది. దేవతల ప్రార్థనమీద కుమారస్వామి రంగంలోకి వచ్చి, మూర్ఛ పోతాడు. చివరికి శివుడు స్వయంగా శంఖచూడునిపై దండెత్తి అతణ్ని సంహరిస్తాడు. అనంతరం శివుడు శంఖచూడుని కవచం తీసుకొని, అతని రూపంతోపాటు కవచాన్నికూడా ధరించి తులసి యింటికి వెళ్తా . తులసి తనభర్త యుద్ధంలో విజయం సంపాదించి వచ్చాడని తలంటిస్నానం చేయించి, భోజనంపెట్టి పర్యంకం మీదకు చేరుతుంది. వారనేకవిధాలుగా రతిక్రీడలలో మునిగితేల్తారు. మాయా రూపంలో వున్న శంఖచూడుణ్ని నిజమైన శంఖచూడుడని భావించి, సంభాషించడం

మొదలు పెట్టి, కొద్దిసేపట్లోనే తాను వంచింపబడినట్లు తులసి గ్రహిస్తుంది. గ్రహించిన వెంటనే గభుక్కునలేచి, దూరంగా నిలబడి, వికలమనస్కతతో చూస్తూవుంటుంది. అప్పుడు శివుడులేచి, ఒకవేళ తులసి శపిస్తుందేమోనని సందేహించి తాను శివుడనని, తనను వివాహంకాగోరి నీవు తపస్సు చేయడంవల్ల యిది జరిగిందనీ, శంఖచూడుడు నిన్ను వివాహంచేసుకోవాలని తపస్సు చేయడంవల్ల అతనితో వివాహం జరిగిందనీ వివరిస్తాడు. అప్పుడు తులసి తానుకోరిన విష్ణువే శివునిరూపంలో వచ్చాడని గ్రహించి సంతోషపడి ఆమె ఆ శరీరాన్నివిడిచి వృక్షరూపం ధరించింది. శివ పురాణాన్ని బట్టిచూస్తే తులసి పుట్టుక మరొకవిధంగా తెలుస్తున్నది. కాలనేమికి 'వృంద' అనే పుత్రిక పుట్టింది. వృంద భర్త జలంధరుడు. జలంధరుడొకసారి పార్వతి వద్దకు శివునిరూపంలోవెళ్ళి, ఆమెను వంచించుదామనుకున్నాడు. ఈ విషయం గ్రహించిన పార్వతి జలంధరుని భార్యఅయిన వృంద పాతివ్రత్యాన్ని భంగపరచవలసిందిగా విష్ణువును కోరుతుంది. జలంధర మహేశ్వరులకు యుద్ధం సంభవించింది. తనభర్త మహిషాన్నెక్కి దక్షిణదిశవైపు వెళ్ళుతున్నట్లూ, అతని నగరం తగలబడుతున్నట్లూ వృందకు స్వప్నాలు వచ్చాయి. ఇవన్నీ అపశకునాలని ఆమె భావించి వ్యాకులమైన మనస్సుతో యేమీతోచక ఉద్యానవనానికి వెళ్లింది. అక్కడ కూడా ఆమెకు మతిస్థిమితంలేక, అడవులలోకి వెళ్లింది. ఒకచోట చెట్టు క్రింద మహావిష్ణువు వృద్ధముని రూపంలో కూర్చొనివున్నాడు. అదే చెట్టుమీద రెండు కోతులు కూడా కూర్చొని వున్నాయి. ఈ వృద్ధమునివద్దకు వృంద వెళ్లి "ఓ మునీశ్వరా! మీ వంటి వారికి తెలియనివిలేవు. నా భర్త క్షేమంగా వున్నాడా? లేడా! చెప్పవలసిం"దని వేడుకుంటుంది. ఆ ముని "నీ భర్త శివునివల్ల చచ్చి పోయాడని" చెపుతాడు. వెంటనే ఆమె మూర్ఛపోయి కొంతసేపటికి తేరుకొని "అయ్యా! నీ మహత్వం సామాన్యమయినదికాదు. నా భర్త నెట్లాగైనా బ్రతికించండి" అని అతిదీనంగా వేడుకుంటుంది. అప్పుడతడు సరే అని, ఆమె నక్కడే వుండవలసిందని చెప్పి, సమీపంలోవున్న చెరువులో ఆ వృద్ధముని మునిగి, తానే జలంధరుని రూపంతాల్చి, వృందవద్దకు వస్తాడు. అతడు తన భర్త అని నమ్మి వృంద కౌగలించుకుంటుంది. మాయాజలంధరుడు వృందను ముద్దాడి, రతికేళిలో తేలిస్తాడు. చివరికామె వంచింపబడినట్లు గ్రహించి శరీరత్యాగం చేయాలనే నిర్ణయానికి వచ్చి, చితిపేర్చుకొని తాను వంచిపబడడంవల్ల కలిగిన దుఃఖాన్నీ, కోపాన్నీ ఆపుకోలేక ఆ మాయాజలంధరుణ్ని "నీవుకూడా నీ భార్యావియోగ దుఃఖాన్ని పొంది వానరుల సహాయంతో నీ భార్యను తిరిగి పొందుతావ"ని శపించి వృంద చితిలో దూకి కాలిపోతుంది. ఆ శాపవాక్కులు విని విష్ణువు నివ్వెరపోయి నిలిచి వుండగా దేవతలంతా వచ్చి విష్ణువును యథాస్థితికి తెచ్చి, వృంద శరీరభస్మం మీద కొన్ని గింజలు చల్లారు. అవి తులసి, ఉసిరి, మాలతి, మొక్కలుగా మొలిచాయి.

— వాఙ్మయ మహోధ్యాయుని

అప్పటినుండి తులసి విష్ణ్వర్చనలో ముఖ్యస్థానాన్ని పొందడమేకాక ప్రత్యేకించి విష్ణు మంత్రజపంలో తులసి పూసల మాలకు ఒకానొక విశిష్ట ప్రతిపత్తి లభించింది. ఈ కథనుబట్టి చూస్తే రామావతారానికి మూలం తులసిగా కనిపిస్తుంది కాని గతంలో నారదునిగురించి తెలుసుకున్న విశేషాలలో రామావతారానికే కాక, అటు లక్ష్మికూడా రాక్షస గర్భంలో పుట్టి రాక్షసులచేత బాధింపబడుతుందని నారద పర్వతులవల్ల శాపాలు కారణంగా సీతారాముల గాథ జరిగినట్లు గుర్తించాము. ఏది యేమైనా ప్రాచీన ఆయుర్వేద వైద్యశాస్త్రాల ప్రకారమే కాకుండా ఆధునిక వైద్యశాస్త్రాల దృష్ట్యాకూడా, తులసికొక వైశిష్ట్యం వున్నది. తులసిలో వున్న మహత్తరమైనశక్తి హృచ్ఛక్తిని పెంపొందింపచేయడం. మంత్ర సిద్ధులకై చేసే మామూలు జపంలోకాని, ప్రత్యేకించి మానసిక జపంలోకాని తులసి హృచ్ఛక్తిని పెంపొందించడంద్వారా మానవులలో మహత్తరమైన శక్తిని ఉద్భవింపచేయగలదు. అందువల్లనే తులసీమాల ధారణకు వైశిష్ట్యం యేర్పడింది. శ్రీకృష్ణుడు బృందావన విహారిగా వర్ణింపబడడంలోకూడా తులసికున్న హృచ్ఛక్తి మత్త్వం సువ్యక్తమవుతుంది.

ఏకాదశీ మాహాత్మ్యం గురించి, వైశిష్ట్యంగురించి నారదీయపురాణంలో రుక్మాంగద చరిత్రలో విపులంగా వర్ణించబడింది. తులసీ మాహాత్మ్యం వర్ణనం తరువాత ఏకాదశీవ్రత ప్రాశస్త్యంగురించి యీ క్రిందివిధంగా శ్రుతి ప్రమాణంగా పేర్కొనబడింది.

> "ఏకాదశి వంటి వ్రతం
> బేకలుషాత్ముండు సేయఁడిల నెన్నిక దా
> నా కలుషాత్ముని సుకృతం
> బా కడ భస్మాహుతి యగు ననియెన్ శ్రుతియున్.
>
> (నార. 160. పు. 61. ప.)

ఖగోళ శాస్త్రరీత్యా కూడా కీర్తిశేషులు, మిత్రులు శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు "నక్షత్రములు" అన్న గ్రంథంలో వివరించిన విధంగా మహావిష్ణుపరంగా ప్రతి ఏకాదశికి ప్రత్యేకించి ప్రతి మాసంలోనూ ప్రతి శుక్లపక్ష ఏకాదశికి విశేషమైనస్థానం వున్నది. ఆషాఢ శుక్ల ఏకాదశినాడు సూర్యాస్తమయం కాగానే మహావిష్ణు నక్షత్రాలు ఉత్తరాకాశంలో శయనించినట్లుగా చక్కగా కనిపిస్తాయి. చాతుర్మాస్యవ్రతం యీ యేకాదశినుంచే ప్రారంభమవుతుంది. విష్ణుశయన మాసాలలో నాల్గింటిలోనూ యిది మొట్టమొదటి యేకాదశి

కాబట్టి దీనిని తొలి యేకాదశి అంటారు. ఇదే శయన ఏకాదశి కూడా. తిరిగి భాద్రపద శుక్ల ఏకాదశి నాటికి విష్ణునక్షత్రాలు పశ్చిమాన అంతర్హితమవుతూ వుంటాయి. అందువల్ల భాద్రపద శుక్ల ఏకాదశిని పరివర్తన ఏకాదశిగా పేర్కొంటారు. శ్రావణ భాద్రపదమాసాలలో, భాద్రపద శుక్ల ఏకాదశినాటికి ఉత్తర దిక్కునుండి పశ్చిమ దిక్కుకు వొత్తిగిలినట్లు, ప్రక్క మారినట్లు విష్ణునక్షత్రాలు కనిపిస్తాయి. కాబట్టి యిది సార్థకంగా పరివర్తన ఏకాదశి అనబడింది. తరువాత సరిగ్గా రెండు నెలల కాలం పరివర్తనస్థితిలోనుండి దిశమార్చి కార్తీక శుక్లఏకాదశినాడు తూర్పు దిక్కున సూర్యోదయం కంటే పూర్వం విష్ణు నక్షత్రాలు కనిపిస్తాయి. కాబట్టి కార్తీక శుద్ధ ఏకాదశిని ఉత్థాన ఏకాదశి, బోధన ఏకాదశి అని వ్యవహరించడం జరిగింది. కార్తీక శుక్ల ఏకాదశినాడు ఆ మహావిష్ణు నక్షత్రాలు నిద్రనుంచి లేచినట్లుగా కనిపిస్తాయి. ఈ యేకాదశినే ప్రబోధినీ మహిమగా (నార. 270. పు.) నరసింహకవి రుక్మాంగద చరిత్రలో వర్ణించాడు. కార్తీక శుక్ల ఏకాదశి తరువాత మార్గశిర శుక్ల ఏకాదశినాడు విష్ణు నక్షత్రాలలో ఉపరి అర్థ భాగ నక్షత్రాలు మాత్రం కనిపిస్తాయి. వాస్తవానికి నరసింహకవి పేర్కొన్నట్లు "కార్తికసమంబైన మాసంబును, కృతయుగ సమంబైన యుగంబును," (నార. 260. పు. 337. వ.) లేవన్నట్లుగా కార్తీక మాసానికున్న ప్రత్యేకత మరే యితర మాసానికీ లేదు. అయితే కృష్ణుడు భగవద్గీతలో "మాసానాం మార్గశీర్షోహమ్" అని పేర్కొనడం అర్జునునికి గీతోపదేశకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కృష్ణుడు అనూరుడైన రథసారథిగావుండి పేర్కొనడాన్ని దృష్టిలో పెట్టుకొని మార్గశిర మాసానికి వైశిష్ట్యం యివ్వబడిందే కాని కార్తీకం కంటే మార్గశిరం గొప్పదని కాదు. పుష్య శుక్లఏకాదశి నాటికి, విష్ణుమూర్తి నక్షత్రాలన్నీ సూర్యోదయాని కంటే ముందు తూర్పున ఉదయిస్తాయి. నక్షత్రరూపుడైన పరిపూర్ణమహావిష్ణువును మనం పుష్యశుద్ధ ఏకాదశినాడు తెలతెల్లవారే సమయంలో చూడవచ్చును. అందుకే దీనిని వైకుంఠ ఏకాదశి అని మన ప్రాచీనులు పేర్కొన్నారు. ఇదే విధంగా మాఘశుద్ధ ఏకాదశిని భీష్మైకాదశిగా, ఫాల్గుణశుద్ధ ఏకాదశిని కల్యాణ ఏకాదశిగా, చైత్రశుద్ధ ఏకాదశిని (శ్రీరామ పరంగా) సైతం కల్యాణ ఏకాదశిగా, మరికొందరు వైశాఖ శుక్లఏకాదశిని (రాధామాధవ పరమైన) కల్యాణ ఏకాదశిగా భావిస్తారు. జ్యేష్ఠశుద్ధ ఏకాదశినాడు త్రివిక్రమైకాదశిగా భావించి మహావిష్ణువును త్రివిక్రమునిగా పూజిస్తారు. (చూడు నక్షత్రములు, 157. పు. నుంచి 164. పు. వరకు).

నరసింహకవి సూర్యోదయ హీనమైన దశమిని ఏకాదశీ సంకలితమైనప్పటికి కూడా పుణ్యప్రదం కాదని త్రోసిపుచ్చాడు.

వాఙ్మయ మహోధ్యాయుని

"ఆదిత్యోదయ హీనత
నా దశమీ ప్రాంతమున్న హరి దివసముగా
నాదటఁ గైకొని యుండెదు
నా దుర్మదుఫలము నీకు నర్పించు నీఁకన్.

సూర్యహీనంబగు దశమీ ప్రాంతం బేకాదశీ మిశ్రంబు నాశంబు నొందించిన నుపవాసవ్రత దాన జాగరణంబులచే నార్జించిన పుణ్యంబు నీకగు." (నార. 316 పు. 229 ప. 230 వ.) అని ఏకాదశీ మిశ్రితమైన దశమినాడు చేసిన ఉపవాసాది అర్చనల ఫలితాలన్నీ ఆ పూజలు చేసిన వారికి దక్కవని స్పష్టపరిచాడు.

నారదుడు విష్ణుమాహాత్మ్యంగురించి, అర్చనా విశేషాలనుగురించి, విధానాల గురించి వివరంగా పేర్కొంటూ విష్ణుచిత్తుని కథావివరణ సందర్భంలో న్యాస విద్యా మహాత్మ్యం గురించి విశేషంగా వర్ణించాడు. అంగన్యాస కరన్యాసాలమించి మాత్రమేకాక భూమ్యాదిగోళాల వివిధ విభిన్న ఆకర్షణ శక్తులకు సైతం లోబడక వాటి నతిక్రమించి యెక్కడికైనా పయనించగల స్వేచ్ఛాశక్తిని సైతం మించినదిగా వర్ణించబడిన యీ న్యాస వైశిష్ట్యం గురించి శక్తిమత్త్వాన్ని గురించి మాటల్లో యెంత వర్ణించినా దాని శక్తిని పరిపూర్ణంగా పేర్కొనలేము. న్యాసమాహాత్మ్యం గురించి నరసింహకవి అనేక విధాలుగా వర్ణించినదానిలో యీ క్రింది పద్యాలను రెండింటినీ చూస్తే న్యాసమాహాత్మ్య మెంతటిదో మనకు తేలిగ్గా అవగాహన మవుతుంది.

"ఒనర విద్యలకెల్ల నుత్తమోత్తమము లీ
పేర వేదాంతముల్ వివిధగతుల
విఖ్యాతమగు న్యాసవిద్య పూజ్యంబని
చాటి లోకములు ప్రశంససేయ
శరణాగతియును న్యాసము సంవదనము న్యా
సంబు న్యాసంబు త్యాగంబు ననఁగ
సకల పురాణ ప్రశస్తంబు న్యాసంబు
పాంచరాత్రములందుఁ ప్రబలె న్యాస
మఖిల ధర్మంబులను న్యాస మభిమతంబు
సర్వ నియమంబులందు న్యాసంబు ఘనము
సర్వ యత్నంబులందు న్యాసంబు శుభము
న్యాసమునకంటెఁగలదె యన్యతర మొకటి.

తపము శ్రేష్ఠంబు సత్యంబునకంటెను
తపమునకంటెను దమము యోగ్య
మా దమంబునకంటె నర్హంబు శమము శ
మంబునకంటె దానంబు ముఖ్య
మా దానమునకంటె నధికంబు ధర్మమా
ధర్మ రహస్య కృత్యమున కంటెఁ
బ్రవ్రజనము మహోభవ్యంబు తత్ప్రవ్ర
జనమున కంటె శస్త్రంబు వహ్ని

వహ్ని కంటెను యజ్ఞంబు వరతరంబు
మానసము యజ్ఞమునకంటె మహితతరము
ఘనము న్యాసంబు మానసగరిమ కంటెఁ
దద్విశేషంబు లెంచంగఁ దరముగావు.

(నార. 171, 172. పు. 120, 121. ప.)

రుక్మాంగదుడు వేటకు వెళ్ళిన సందర్భంలో నరసింహకవి చేసిన వర్ణన పరమాద్భుతంగా నరసింహకవి శబ్దశక్తికీ పదప్రయోగ నైపుణ్యానికీ బహుముఖమైన లోకానుభవానికీ ప్రతీకగా విరాజిల్లుతున్నది. రుక్మాంగదుడు “హరి కరిగిరి గండక కాసరగవయ తరక్షుబుభుక్షు శల్యకులంగోత్కర భీకర ఘోర వనాంతరములకు” ఉత్కంఠతో వేటకు వెళ్ళగా అనేకమంది చెంచుదొరలు నేల ఈనినట్లుగా రుక్మాంగదుని సమక్షంలో

పరిపక్వ బహువిధ ఫలశిక్యముల తోడ
క్షౌద్ర వీవధ సహస్రముల తోడఁ
బంచపసారంగ జాలోత్కరము తోడఁ
జంజరకీర డింభముల తోడఁ
బరిరటత్సంకు శాబక వితానము తోడఁ
గస్తూరికామృత గోత్కరము తోడఁ
బల్యంకికాదండ బహుకండముల తోడ
భవ్య చామర కదంబముల తోడ.

(నార. 218–పు. 143–ప.)

మొక్కి వయారపు మొనలుదీర్చి ఒకానొక విడ్డూరం వలె ఎంతో వింతగా విశిష్టంగా తమ తమ వేటల నేర్పరితనాన్ని ఉగ్గడిస్తూ విన్నవించారని నరసింహ

వాఙ్మయ మహోధ్యక్షుని

కవి చక్కని పదలాలిత్యంతో సార్థకమైన పద ప్రయోగాలతో తన లోకానుభవానికి ప్రతీకలుగా ఈ క్రింది పద్యాలు రచించాడు.

"గావు పట్టెదఁ దొలంగక నిల్చెనేని జె
బ్బులుల నెన్నిటినైనఁబూని తెత్తు
నెలుఁగుఁ గూల్చెద నొక్క యలుగున నిపుడునా
యెలుఁగునఁ గడకడ కేఁగకున్నఁ
ఒగరుతాఁకుల బోడతలలుగాఁ దాఁకింతుఁ
గారుపోతులఁ గొమ్ముగములు నిఱిచి
యొంటిగాఁ డెదురైన బంటు పోకు మటంచు
ఢాకమై విదిలింతు నీ కటారి
భీకరంబుగఁ దముఁ దామె పెట్టికొనిన
బిరుదు లేటికిఁ జూడు నా పెంపు సొంపు
పట్టనేటికి జముదాళిజాకు కిరుసు
సురియ విలునమ్ములును నేఁడు చూడు రాజ."

"పులి యెలుఁగు పంది దుప్పి కార్పోతు మన్ను
బింకి యననెంత నేఁడు నాచంక నిఱికి
వేనవేలుగఁ దెత్తు నా వేఁట చూడు
సామిఁ బంటుతనంబును సాహసమును."

"నూటి కొక్కండు నామూఁక పోటు బంటు
సామి! పులుఁగైన వేలుఁగైన నేమి విడువు
కత్తియుఁ గటారి నేఁటికి కదిసినపుడె
చంకఁ గొట్టి యడంతు నిశ్శంక వృత్తి."

(నార. 218, 219-పు. 144, 145, 146-ప.)

సూతుడు బ్రహ్మజ్ఞానతత్వం బోధించే సందర్భంగా నరసింహకవి ఒకానొక విశిష్ట చమత్కృతిగల యీ పద్యాన్ని విరచించాడు.

"ఆత్మవేదులు కర్మమర్మంబెసేయ
నంద్రు కొందఱు సూరులయ్యాత్మవేదు
లైనవారికిఁ గర్మమర్మంబె సేయ
నంద్రు కొందఱు సూరు లత్యంత మహిమ."

(నార. 323. పు. 25. ప.)

మహామథన సారామృతం

చక్కని పాండిత్యం, ప్రతిభాసంపద కలిగిన నరసింహాకవి చారిత్రకమైన ప్రాచీన, అర్వాచీన విషయజ్ఞానం లేనందువల్ల అనేకాలైన భ్రమ ప్రమాదాలకులోనై కొన్ని విషయాలు పేర్కొన్నట్లు గతంలో గుర్తించాము. ఇదేవిధంగా నారదీయపురాణ ప్రథమాశ్వాసంలో కృష్ణుడు దావాగ్నిని క్రోలిన తరువాత వర్షాగమాన్ని వర్ణిస్తూ, వివిధనదులు మహోజన పరిపూర్ణాలై పొంగినట్లు, దేశకాలోచిత భిన్నంగా యీ క్రింది పద్యాన్ని విరచించాడు.

"గంగా సరస్వతీ తుంగభద్రాయమున
నా కవేరసుతా పినాకినీ శ
రావతీ సింధు గోదావరి గోమతి
కృష్ణ వేణ్యా గండకీ మలాప
హారిణీ చంద్ర భాగాలక చర్మణ్వ
తీ నర్మదా బాహుదానదీశ
తద్రు పేనా విపాట్పాపి పయోష్ణి వ
యః ప్రవాహములు మిన్నందివేగఁ
దద్దయును బొంగుచును వితతాటములగు
తటజకుట జముల్వీచికాపటలిఁ దేల
దశదిశాచక్ర నిమ్నోన్నత స్థలంబు
లేకమైయుండ నిండె సమిద్ధ మహిమ."

(నార. 21. పు. 120. ప.)

"గండకీ చంద్రభాగ"వంటి నదులు ద్వాపరయుగంనుంచీ వున్నాయని చెప్పడానికి బొత్తిగా అవకాశాలులేవు. ఏది యేమైనా నరసింహాకవి సందర్భోచితాలైన, సార్థకాలైన శబ్దప్రయోగాలనుచేసి తన కవితాప్రౌఢిమను బహుముఖాలుగా నారదీయ పురాణంలో చూపించాడు. ప్రత్యేకించి హరిని స్తంభంలో చూపించవలసిందని హిరణ్యకశిపుడు కత్తితో కొట్టినప్పుడు వెనువెంటనే ఆ స్తంభంనుంచి నృసింహావతారరూపంలో విష్ణువు ఛట్‌ఫట్‌మని పెఠిల్లున ఆ స్తంభం పగిలిపోగా ఆవిర్భవించిన సందర్భంగా నరసింహాకవి తన బహుముఖ శబ్దార్థ పటిమా వీరభావ స్ఫోరకత్వాన్ని యీ క్రింది పద్యంలో ప్రస్ఫుటంగా మహాద్భుతంగా వెల్లడించాడు.

"పటపటత్కటు సముచ్చట పటుధ్వని విశీ
ర్యద్ఘన స్థూణాసభాంతరంబు
చట చటన్నట దుగ్ర చటులరంగస్ఫులిం
గాచ్ఛాద్య మాన గృహాంగణంబు

వాఙ్మయ మహోద్యతుని

తట తట స్ఫుర దురో దైతేయ శలభసం
ఘాత ప్రతాప నిర్భర తరంబు
కటకట దంష్ట్రాగ్ర ఘట్టిత కహాకహో
త్తర్జన గర్జాతి దుర్జయంబు
భూరిభూషణ తీవ్రవదంభోళి ఘోర
సారవారు సటాచ్ఛటా సంకులంబు
సంభ్రమాద భ్రధరణి తలాభ్రతలము
వీర నరసింహ రూప మావిర్భవించె.''

(నార. 505. పు. 258. వ.)

## విశేషాలు

నరసింహకవి గోపికావిహార వర్ణనలో ''అధరామృతము జిహ్వనానుకొనిన'' (నార. 29. పు. 159. వ.) అని అధరామృతపు రుచి గురించి పేర్కొన్నాడు. వాస్తవానికి సంస్కృతాంధ్రాది వాఙ్మయాలలో అధరామృతాస్వాదనం గురించి వర్ణించని ప్రాచీన కావ్యాలు లేవు. నిజానికి ప్రతి వ్యక్తి అధరోష్ఠంలోనూ అమృతం వుండదు. ప్రేమికులందరూ పరస్పరం యువతీయువకులు అధరోష్ఠాన్ని చీకవచ్చును. కాని వారికి తద్రూపంగా లభించేది ఉమ్మి, లేదా చొంగ, లేదా లాలాజలం వంటిదే కాని అమృతం మాత్రం కాదు. ఆర్షవిజ్ఞానం దృష్ట్యా వాస్త వానికి ఊర్వశీ, రంభా, మేనకా ప్రభృతులు అమృతసిద్ధి పొంది మహా తపః సంపన్నులైన మహర్షుల తపోభంగం కలిగించడానికో, లేదా వారిని సహజంగానే ప్రేమించి వారి సంభోగసుఖానుభూతిని అనుభవించడానికో వారి అధరామృతాన్ని ఆస్వాదించనీయవలసిందిగా అభ్యర్థించేవారు. అమృతసిద్ధి పొందిన వ్యక్తి లాలాజలం అత్యంత మధురంగా వుంటుంది. అందువల్ల అటువంటివారి అధరం నుంచి లభించే లాలాజలాన్ని అమృతంగా భావించేవారు. అమృతసిద్ధి పొందడంవల్ల అమృతమయమై మధురాతి మధురంగా వుండే లాలాజలం అమృతం కాక మరేమవుతుంది ? అయితే అమృతసిద్ధి పొందిన మహర్షి వంటి వారిపట్లనే అధ రామృత శబ్దాన్ని అతి ప్రాచీన కాలంలో వ్యవహరించేవారు. అయితే క్రమంగా, అమృతసిద్ధి పొందనటువంటి అతి సామాన్య మానవులకు సైతం శృంగార వర్ణనలలో యీ అధరామృత శబ్దం నిరర్థకంగా ప్రయోగించడం జరిగింది.

విగ్రహారాధన అత్యంత ఆధునిక కాలంలో ప్రారంభించబడిందని చాలా మంది పరిశోధకులు భావించారు. వాస్తవానికి విగ్రహారాధన యెంత ప్రాచీన

తరమైనదో చెప్పలేము. వేదాలెప్పటివో విగ్రహారాధన అప్పటిదేనని ఆమోదించవలసివుంటుంది. విష్ణువుకు సనకాదులు విన్నపం చేసుకున్న సందర్భంలో "నీకు నుపనిషద్వేద్యంబైన హేమదివ్య మంగళ విగ్రహం బుపాస్త్యర్థంబుగా నారోపింతురు."(నార. 383. పు. 261 వ.) అని విష్ణుమూర్తి హేమదివ్యమంగళ విగ్రహరూపంలో ఆరాధ్యదైవమని ఉపనిషత్తులు పేర్కొన్నట్లు నరసింహాకవి వక్కాణించాడు. అసలు శ్రీమహావిష్ణువు బ్రహ్మను సృష్టించిన తరువాత బ్రహ్మకు ఒకటికి రెండుసార్లు స్వయంగా తన విగ్రహాన్ని అర్చామూర్తిగా శ్రీ మహావిష్ణువే అనుగ్రహించి యిచ్చినట్లు వర్ణించడం జరిగింది.

"ఏల విషాదము నొందెదు
బాలక ! యిది యిమ్ము పరమభాగవత సభా
మౌళిమణికి నీకిత్తుఁ ద
యాళుత నొకదివ్య విగ్రహముఁ గొనుమింకన్.

అనుచుఁ గమలాగశాఖరణాంకశాలి
యైన నిజకరముననిచ్చె నాత్మ దివ్య
విగ్రహముఁ బ్రహ్మజునకు నా విగ్రహంబు
చక్కఁదనమునకై యాత్మఁ జొక్కనలువ."

(నార. 106 పు. 67, 68. ప.)

కాగా విగ్రహారాధన యెంత ప్రాచీనతరమో యెవ్వరూ చెప్పలేరు. శిల్పశాస్త్రం ప్రకారంచూచినా విష్ణ్వాదిమూర్తులకు రూపకల్పన మొట్టమొదట యెప్పుడు జరిగిందో సాధికారికంగా యెవ్వరూ చెప్పలేరు. వాస్తవానికి శిల్పాలను చెక్కే ప్రతివారూ చాలాకాలంగా శిల్పులుగా పరిగణింపబడుతున్నారు కాని వారంతా శిల్పులుగా పరిగణనకురారు. తపశ్శక్తితో, దివ్యదృష్టితో విష్ణ్వాదిమూర్తులను చూచి తాము చూచిన రూపానికి చిత్రరూపంలోనో, భాషాయుక్తమైన రచనా వర్ణనా రూపంలోనో, ఆయా మూర్తులకు మొట్టమొదట ప్రతి రూపకల్పన చేసినవారే శిల్పులు. అయితే దివ్య చక్షువుతో అసలు మూర్తిని కాంచకుండా యెవ్వరో మహర్షులు చిత్రరూపంలోనో శ్లోకరూపంలోనో మూర్తిలక్షణం నిర్వచించిన దానినిబట్టి, అంతే ఒక శిల్పాన్నిచూచి, మరొక శిల్పరచన చేసినవారు అసలైన శిల్పులుకారు. అటువంటివారిని ప్రాచీన శిల్పశాస్త్రాలలో శిల్పులుగా పేర్కొనలేదు సరికదా "కారుకులు"గా పేర్కొన్నారు. అయితే యిటీవలికాలంలో శిల్పాలు నిర్మించి, శిల్పులనిపించుకుంటున్నవారంతా అసలైన శిల్పులుకాకుండా కారుకులే నన్నమాట.

వాఙ్మయ మహోధ్యాయుని

విష్ణువును బ్రహ్మ సృష్టించి ఆ బ్రహ్మకు శ్రీమహావిష్ణువే వేద విజ్ఞాన భిక్షతో పాటు, అష్టాక్షర మంత్రోపదేశం కూడా చేయగా, ఆ అష్టాక్షర మంత్రావృత్తి ప్రభావంతో సమస్త దేవతలనూ, సమస్త ప్రపంచాన్ని సృష్టించాడట.

"ఏతన్మంత్ర రహస్యము
స్ఫాతి సృజించెదవు సకల జగదంతరముల్
ఖ్యాతిగ నధికారాంతం
బేతెంచిన నన్ను నాశ్రయించెదు మీఁదన్.

సారతర పరమమంత్ర స
మారబ్ధావృత్తి పూని యబ్జభవుఁడు స
ర్వారంభోన్ముఖుఁడై తా
నాయోధస్థితిఁ బ్రపంచమంత సృజించెన్.

(నార. 98 పు. 23, 24. ప.)

'సీత అయోనిజ' అని అనేక సందర్భాలలో పెక్కు గ్రంథాలలో పేర్కొనబడినా, ఆమె యోనిజ అనడానికి సైతం నిరాక్షేపణీయమైన కథ ప్రసిద్ధమై లేకపోలేదు. అయితే మహేశ్వరుని విషయంలో మాతాపితృ రహితుడని అనేక గ్రంథాలు వేనోళ్ల కీర్తించాయి. కాని తద్భిన్నంగా నారదీయపురాణంలో మహేశ్వరుడు బ్రహ్మపుత్రుడని యీ క్రింది విధంగా పేర్కొనడం జరిగింది.

"అక్షీణ శక్తిని విరూ
పాక్షుండన నొక్క పుత్రుఁడతనికిఁ గల్గెన్
దక్షుఁడు హరిభక్తి రతుం
డక్షయ విజ్ఞాన వైభవాధిక్యుండై."

అంత విధాత పురందరాది దివిజస్తుతుండై దేవదేవుండన వెలసిన తనయునకు భవోత్తారకంబుపదేశించి వేదవేదాంతంబులు చదివించిన నతండైశ్వర్యంబు వహించి సర్వభూతంబులకు నైహికంబులు కృపసేయుచునుండ.(నార. 99. పు. 25 ప. 26 ప.)

మామూలుగా పండిత పామరులంతా 'గాయత్రి' అని, 'గాయత్రీ మంత్రమని' అనుకుంటూ వుంటారు. వాస్తవానికి "తత్సవితుర్వరేణియం" ఇత్యాదిగా వున్న మంత్రం చాలామంది గాయత్రీ మంత్రమనుకుంటారు. నిజానికిది గాయత్రీ ఛందంలోవున్న సవితృదేవతాత్మకమైన మంత్రమని అనేకమంది పండితులకు కూడా తెలియదని చెప్పడంలో ఆశ్చర్యకరమైన విషయమేమీలేదు. అసలు గాయత్రీ ఛందం వేరు-గాయత్రీదేవతాత్మకాలైన మంత్రాలు వేరు. గాయత్రీ మంత్రాలలో విష్ణు గాయత్రి, బ్రహ్మ గాయత్రి, మహేశ్వర గాయత్రి, అని మూడు విధాలైన గాయత్రులున్నాయి. విష్ణు గాయత్రి గురించి నరసింహాకవి "పేనియంపు వ్యాప్య

మహామథన సారామృతం

వ్యాపక విశేషావభోధంబు గలుగుం గాన విష్ణు గాయత్రియుం దాఖ్యంబీ మంత్రంబు" (నార. 98. పు. 18 వ.) అని పేర్కొన్నాడు.

పుష్పకవిమానం గురించి దాని వైశిష్ట్యం గురించి చాలామంది పండితులకు తెలుసును. అయితే శ్రీహరి దివ్యవిమానానికున్న వైశిష్ట్యం పుష్పకవిమాన వైశిష్ట్యంకంటే మహత్తరమైన వైశిష్ట్యం కలది. బ్రహ్మ శ్రీహరి దివ్య విమానాన్ని పూజించే సందర్భంలో 40 లక్షల మైళ్ల ప్రమాణంకల ఆ విమానం పంచ పురుష మాత్రారూపానికే పరిమితమైనదని, శ్రీహరిసైతం స్వలీలతో తదంతః పరిమిత రూపాన్ని పొంది నిలిచాడని నరసింహాకవి వర్ణించాడు. (నార. 109 పు. 85. వ.)

శ్రీహరివలెనే లక్ష్మీమాత సర్వకామ వరప్రదాయని అన్న సంగతి అందరికీ తెలిసిందే. శ్రీ మహావిష్ణువు ఆయుధాలలో వొకటైన 'సుదర్శనం' శత్రుసంహారంలో తిరుగులేనిదన్న సంగతి కూడా ఆర్షవిజ్ఞానులైన వారందరికీ పూర్తిగా తెలుసును. సుదర్శన ప్రయోగానికి వ్యతిరేకంగా యెవరైనా యేదైనా ప్రయోగం చేస్తే ఆ ప్రయోగం చేసిన వ్యక్తి అస్త్రశస్త్ర సన్యాసం చేసి దాసోహం అని అనవైనా అనాలి, లేదా సుదర్శన శక్తికి ప్రాణాన్ని బలిగానైనా యివ్వాలి. ఈ విషయం ఆర్షవిజ్ఞానులకూ, మంత్రశాస్త్రవేత్తలకూ సువిదితమైనదే. కాని నరసింహకవి "విమాన పశ్చాద్భాగంబునఁ బ్రాకార మధ్యంబున సుదర్శనమును లక్ష్మియు సర్వకామంబుల నిచ్చుచుండు" (నార.95.పు.493 వ.) అని పేర్కొని లక్ష్మీమాతతో పాటు సుదర్శనం సైతం సర్వకామాలను ప్రసాదిస్తుందని నూతన విషయాన్ని తెలియచేశాడు.

గతంలో విష్ణు, బ్రహ్మ, మహేశ్వరుల సత్వరజస్తమోగుణాల గురించి కొంత చర్చించడం జరిగింది. కాని నరసింహకవి నారదీయపురాణ ప్రథమాశ్వాసంలో అర్జునుడు సుభద్రను తీసికొని వెడలిన తరువాత మునీశ్వరులు త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులను పరీక్షచేసి, వారి గుణాలను తెలుసుకొనవలసిందిగా భృగు మహర్షిని పంపగా ఆ మహర్షి ముగ్గురినీ పరీక్షించి, చివరికి మహావిష్ణువు మాత్రమే శుద్ధసత్వమూర్తి అని మునులకు చెప్పినట్లు పేర్కొన్నాడు. (నార. 71, 72, పు. 429 వ. 430, 431. ప. 432 వ.)మహావిష్ణువును శుద్ధసత్వమూర్తిగా పేర్కొనడంలో విశేషంలేదుకాని, మునులు భృగుమహర్షి ద్వారా త్రిమూర్తులను పరీక్ష చేయించారనడం విశిష్టమైన విషయం. గతంలో నారద పర్వతులు విష్ణువును శపించిన విషయం గుర్తించాం కాని త్రిమూర్తుల శక్తి స్వభావాలను మునులు పరీక్షించారన్న విషయం మాత్రం యీ సందర్భంలో మనం గుర్తించవలసిన విశేషం.

వాఙ్మయ మహోధ్యాయుని

నరసింహాకవి పాషండమతభేదాలను వచించే సందర్భంలో శాండిల్యుడనే మహర్షి పాషండ, జిన మత కారకులను వోడించడం కాదు వారిని సంహరించాడని యీ క్రింది పద్యంలో పేర్కొన్నాడు.

> "దూఢి శాండిల్యుడను మునీంద్రుండు మున్ను
> బాంచ రాత్రప్రమాణ ప్రభావశక్తి
> నాగమార్గంబు వ్యర్థమౌనట్లొనర్చు
> శటులఁ బాషండజినులును సంహరించె."

(నార. 149. పు. 10. ప.)

వెలుగును వెన్నంటి చీకటి వున్నట్లుగా కష్టసుఖాలు కావడికుండ లున్నట్లుగా ఆస్తికత్వానికి భిన్నంగా దాని వెనువెంటనే నాస్తికమతం ఆవిర్భవించడంలో విచిత్రం లేదు. నరసింహాకవి పేర్కొన్న సందర్భాన్ని పట్టిచూస్తే, పాషండ జిన మతాలు మన చరిత్రకారులూహించినంత ఆధునిక మతాలు కావని తేటతెల్లమవుతున్నది.

"అపకారికి నుపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి" అన్న భావం కేవలం సుమతీ శతక కర్తనాటి భావమే కాదు. నేర్పరితనం మాట దేముడెరుగును కాని విద్రోహులకు సైతం మేలే చేయాలని వేద దేవగణాలు హార్దికంగా అభిలషించి నట్లు వ్యాఘ్రవానర కిరాత సంవాదంలో నరసింహాకవి స్పష్టపరిచాడు. (నార. 149. 150. పు. 12వ, 13. 14.ప)

భస్మాసురుని కథ చాలా సుప్రసిద్ధమైనది. భస్మాసురుడు మహేశ్వరుని గురించి తపస్సు చేయడం, అతడు ప్రత్యక్షుడై వరం కోరుకోవలసిందిగా చెప్పడం, నేను యెవని శిరస్సుమీద చేయి పెడతానో అతడు భస్మం అవ్వాలని అతడు కోరడం, ఈశ్వరుడు సరే అని వరమివ్వడం, అసలు యీ వరం ఫలిస్తుందో లేదో చూస్తాను. నీ నెత్తిమీదే చేయి పెడతానని భస్మాసురుడీశ్వరుని వెంటపడడం, చివరికి శ్రీమహా విష్ణువు మహేశ్వరుణ్ని కాపాడడం అందరికీ తెలిసిన విషయమే. అయితే అటు పామరులకు కాని యిటు పండితులకు కాని, ఆ వరంపొందిన రాక్షసుని పేరు భస్మాసురుడనే అందరికీ తెలుసు. అసలు పేరు తెలియదు. ఈ భస్మాసురుని అసలు పేరు నరసింహాకవి విష్ణుచిత్తుని కథలో "వృకాసురుడు"గా తెలియచేశాడు. (నార. 167.పు. 99.వ.)

సంసార వివర్జితుడై సన్యాసిగా జీవించడమన్నది బౌద్ధమతం తరువాత పరివ్యాప్తిలోకి వచ్చినవిషయమే కాని ఆర్ష సంప్రదాయసిద్ధం కాదు. వాస్తవానికి సప్త ఋషులందరికీ భార్యలున్నారు. వివాహితుడు కాని మహర్షి యెంతటివాడైనా

తప్పటడుగులు వేసిన సందర్భాలు లేకపోలేదు. ఆర్షవిజ్ఞానం దృష్ట్యా సంసారిగా జీవిస్తూ ఉపవాసరహితుడైవుంటూ కూడా వివిధ ఆధ్యాత్మిక శక్తులు పొందవచ్చునని చెప్పవలసివుంటుంది. సంసారి అయివుండి నిత్యభోక్త అయివుండీ కూడా నియమితాచారం కలవాడై నారాయణ నామస్మరణచేస్తూ నిత్యోపవాసిగా నెగడొంద వచ్చునని వశిష్ఠునిచేత నరసింహకవి యీ క్రింది విధంగా చెప్పించాడు.

“ నియమంబున స్వభార్యనియతుండ నై యుక్త
కాలంబుననె రతికేలి సలిపి
యుండుట మఱినాకు యుక్తంబు బ్రహ్మచా
రిత్వంబు జగము వర్ణించి పొగడ
గాధి పుత్రుఁడు కమలాధిప భక్తిని
ష్ఠాపరాయణుఁడు ప్రశస్తి గాంచి
జాత్యాశ్రయ నిమిత్త సత్కర్మములు పూని
వీత దోషముగ నైవేద్య మొసఁగి
యదియు ననిషేధ కాలంబునందుఁ గృష్ణ
యనుచు గోవింద యనుచుఁ బరాత్మ యనుచుఁ
బ్రతికబళమును నుడువుచుఁ బరిభుజించె
వాసి నటుగాన నిత్యోపవాసి యయ్యె.’’

(నార.181.పు.165.ప.)

ఉపవాస, నిరుపవాస స్థితుల గురించి ఆగమ వాఙ్మయావిష్కరణకు పూర్వకాలంలోనే పెక్కువివాదాలు జరిగినట్లుకనిపిస్తున్నది. తిథి ఫల నిర్ణయాది విషయాలను వర్ణిస్తూ సూతుడు మునులకు వివరించిన సందర్భంలో “అనేకాగమ విరోధంబులు నైన నేమి ? బ్రాహ్మణులు వివాదించిన నేమి? ద్వాదశ్యుపవాసంబును త్రయోదశీ పారణయుం జేయవలయు” (నార. 193. పు. 20. వ.) అని విస్పష్టంగా ద్వాదశ్యుపవాసాన్ని త్రయోదశీ పారాయణను నియమంగా ఒనరించాలని పేర్కొన్నాడు.

మనకు మామూలుగా చాతుర్మాస్యవ్రతం గురించి అందరికీ తెలిసిన విషయమే. అయితే చాతుర్మాస్యవ్రతం వలెనే శ్రావణశుద్ధ విదియ మొదలు నాలుగు మాసాలపాటు అంటే మార్గశిర శుద్ధ విదియవరకూ శూన్య శయనవ్రతాన్ని సంశుద్ధితో విష్ణువు నర్చిస్తారని వామదేవుడు రుక్మాంగదునికి అతని పూర్వ జన్మ వృత్తాంతం తెలిపిన సందర్భంలో వివరించడం జరిగింది. (నార. 223. పు. 167. ప.)

బహుభార్యాత్వం అత్యంత ప్రాచీనకాలంనుంచీ వున్నది. దశరథుని కాలం నుంచే కాక అంతకుముందు కృతయుగంనుంచే బహుభార్యాత్వం వున్నదని

వాఙ్మయ మహోధ్యధుని

రుక్మాంగదుని చరిత్ర నిరూపిస్తున్నది. అయితే బహుభార్యాత్వ విషయంలో ప్రథమభార్య వుండగా, రెండవ వివాహం చేసుకునేట్లయితే రెండవ భార్యకిచ్చే ధనంకంటే (కన్యాశుల్కమన్నమాట) రెట్టింపుధనం ప్రథమభార్యకు యివ్వాలట. తృతీయ వివాహం చేసుకుంటే ఆ తృతీయభార్యకిచ్చే ధనంకంటే రెట్టింపు ధనాన్ని ద్వితీయభార్యకు, ద్వితీయభార్య కిచ్చిన ధనంకంటే రెట్టింపుధనాన్ని తిరిగి ప్రథమ భార్యకూ యిదేవిధంగా యెన్నెన్ని వివాహాలు చేసుకొన్నా క్రమానుగతంగా రెట్టింపుకు రెట్టింపుగా అంతకుపూర్వపు భార్యలకు ధనం యివ్వవలసిన నియమ మున్నట్లు నారదీయపురాణంలోని రుక్మాంగద చరిత్రవల్ల తెలుస్తున్నది. ఈవిధంగా రెట్టింపు ధనాన్ని పూర్వపు భార్యల కివ్వకుండానే పునర్వివాహాలు చేసుకుంటే భర్త పూర్వపు భార్యలకు ఋణగ్రస్థుడవుతాడని కూడా యీ సందర్భంలో నరసింహకవి యీ క్రిందివిధంగా స్పష్టపరిచాడు.

"వాసికెక్కు ద్వితీయ వివాహమునకుఁ
గూడి ప్రథమ పరిణయ ద్విగుణధనంబు
లొలి సేయంగఁదగుఁ గాకయున్న జ్యేష్ఠ
భార్యకు కాభర్త ఋణిఁడై పరఁగియుండు."

(నార. 251. పు. 303. ప.)

వాస్తవానికి శాస్త్రీయంగాచూస్తే సంభోగసమయాలు, దినాలు పరిమితంగా వుంటాయి. సంభోగం చేయవలసిన శుభదినాల గురించి, అశుభ దినాలగురించి అనేక సందర్భాలలో శాస్త్రాలలో విధి నిషేధాలు యేర్పరచడం జరిగింది. సామాన్యంగా దివామైథునం అన్నది ప్రాచీన కామాది శాస్త్రాల ప్రకారమేకాక, ఆధునిక విజ్ఞానం దృష్ట్యా కూడా ఆరోగ్యకరమైనది కాదు సరికదా ఆయుఃక్షీణకరమైనది కూడా. ఉత్తమ సంతానం సంజనితం కావాలంటే మంచిమంచి శుభ ముహూర్తాలను సంభోగ సమయాలుగా ప్రాచీన జ్యోతిశ్శాస్త్రవేత్తలు కొన్నిటిని పేర్కొన్నారు. కాని నరసింహకవి యిందుకు భిన్నంగా శాస్త్రీయమైన దృక్పథం లేకుండా చెప్పాడో, అతిశయోక్తిగా వర్ణించాడో, మూలాన్ననుసరించి చెప్పాడో లేదో మనం యేమీ చెప్పలేంకాని రుక్మాంగదుడు మోహినితో సుఖించిన విషయాన్ని వర్ణించిన సందర్భంలో "ఇది దినమిది రేయిది క్షణమిది జామిది పక్షమనుచు నెఱుఁగక భోగాస్పదమగు వదమున నా విభుఁడెదమాడి సుభోగభోగ మెసఁగ రమించెన్. (నార. 254. పు. 312. ప. ) అని సర్వ వేళలా శుభాశుభాలతో నిమిత్తంలేకుండా, రాత్రింబవళ్లతో పనిలేకుండా రుక్మాంగదుడు సుఖించినట్లు వర్ణించాడు.

మహామథన సారామృతం

మామూలుగా తండ్రి ఆస్తి సంతానానికి దక్కడం సర్వసామాన్యమైన విషయం. తల్లిదండ్రుల ఆస్తులమీద వారిపిల్లలకు హక్కుంటుందనడం కూడా సామాన్యమైన విషయమే. కొన్ని సందర్భాలలో తండ్రి ధనహీనుడై పుత్రుడు స్వార్జితమైన ధనంతో మిక్కిలి ధనవంతుడు కావచ్చును. తండ్రి పుత్రుని మీద ఆధారపడి పోషింపబడవచ్చును. కాని తండ్రి దగ్గర "ఈ ధనం నాది. నేను సముపార్జించినది." అని పుత్రుడు సగర్వంగా మాట్లాడితే ఆ భావం కలిగివుంటే ఆ పుత్రుడు నరకంలోకి పోతాడని నారదీయపురాణం చెపుతున్నది. ధర్మాంగదుడు అనేకమందిని జయించి రత్నరాసులనూ, వివిధ సంపదలనూ కొల్లగొట్టుకొనివచ్చి తండ్రి పాదాలవద్ద సమర్పించి వీటి ననుభవించ వలసిందని ప్రార్థించిన సందర్భంలో "పుత్రార్జిత విత్తంబు గ్రాహ్యంబు. శంకవలవదు. వ్యయంబు సేయుము. తండ్రి యెడనీధనంబు నే నార్జించితినని గర్వంబున నాడికొను పుత్రుండా భూతసంప్లవంబుగా నరకంబనుభవించు. కుతారంబునుంబలెఁ బిత్రధీనుండగు కుమారుండిచ్చెనని తండ్రియు ననుకొనందగదు." (నార. 256. పు. 319. వ.) అని నరసింహాకవి ఉటంకించాడు.

వైదిక బ్రాహ్మణ కుటుంబాలలో మాత్రం విధవలు, అకేశలుగా వుండడం చాలాకాలంనుంచి ఆచారంలో వున్నది. నియోగులలో లేదు. ఈ సంప్రదాయం యెప్పటినుంచి యేర్పడిందో చెప్పడానికి మనుసంస్కృతీ, చరిత్రను పట్టిచూస్తే సరైన ఆధారాలేవీ కనిపించడంలేదు. అయితే కొందరు సంప్రదాయజ్ఞులు పూర్వం దశరథుడు చనిపోయినప్పుడు కౌసల్యా సుమిత్రా కైకేయీలు శిరోముండనం చేయించుకున్నారని ఆ సంప్రదాయాన్ని మేమనుసరిస్తున్నామని చెప్పడంకద్దు. కాని యిందుకు ప్రామాణికంగా వాల్మీకి రామాయణంలో యెటువంటి శ్లోకమూ లేదు. కనీసం ప్రక్షిప్తమనదగినటువంటి శ్లోకమైనాలేదు. పైగా క్షత్రియులలో అసలీ సాంప్రదాయమే లేదు. అయితే నరసింహాకవి ధర్మాంగదుని వివాహానంతరం అతని పరిపాలనా వ్యవస్థను వర్ణిస్తూ "ఎచ్చటగూఢ విభవులై లోకులు వర్తింతు, రెచ్చట భర్తృమతియైనయింతి కంచుక రహితయై యిల్లు వెడలి తిరుగు నెచ్చట సకేశయై విశ్వస్తగనఁబడు, నెచ్చట నకేశయగుచుఁ బుణ్యాపురంధ్రి రాణించు." (నార. 258. 259. పు. 332. వ,) అని విధవలు సకేశలుగానూ, పుణ్యపురంధ్రులు అంటే పుంస్త్రీలు, సభర్తృకలైన స్త్రీలు అకేశలుగానూ ఉండరాదని పేర్కొన్నాడు.

1960వ సంవత్సరంలో ఒక సందర్భంలో నే నుటంకించినట్లుగా— వాస్తవానికి వేదర్షుల కాలంలో మృత భర్తృకలైన విధవలు శుభ కార్యాలలో పాల్గొనరాదన్న నియమం ఉన్నట్లు కానరాదు. వేదర్షులలో దీర్ఘతముడు గొప్పవాడు. కేవలం అర్షదృక్కుతోనేకాక అమేయ శక్తివంతాలైన తన

వాఙ్మయ మహోధ్యతుని

చర్మచక్షువులతో సైతం సూర్యాది మహాగ్నిగోళాలను బహుముఖంగా పరిశోధించి అఖండ ఖగోళవేధ చేసిన మహర్షి దీర్ఘతమునికి మామతేయు డనికూడా నామాంతరమున్నది. దీర్ఘతముడు సూర్యాద్యగ్నిగోళాలను అనవరతం పరిశోధనలు చేసి, నేత్రాలు పోగొట్టుకున్నాడు. అంధుడై పోయాడు. అమృతసిద్ధి పొందకుండా, చర్మచక్షువులతో సూర్యాద్యగ్నిగోళాల పరిశోధనకు దొరకొన్న ఫలితమిది. మహాభారత కథనం ప్రకారం దీర్ఘతముడు గ్రుడ్డివాడైన తరువాత భార్యాబిడ్డలను పోషించలేకపోయాడు. "భార్యను భరించి పోషించవలసిన బాధ్యత భర్తమీద వున్నది. నీవు నన్నూ, కుమారులనూ పోషించడంలేదు సరికదా యే విధమైన సంపాదనా లేకుండా నీవు మామీద ఆధారపడి బ్రతుకుతున్నావు. పైగా మమ్మల్ని సాధిస్తున్నావు. వేధిస్తున్నావు" అని దీర్ఘతముని భార్య ప్రద్వేషిణి ఆగ్రహించి మాట్లాడుతుంది. అప్పుడు దీర్ఘతముడు విపరీతంగా ఆగ్రహోదగ్రు డవుతాడు. అప్పుడు ప్రద్వేషిణి మరింతగా కినిసి "కుటుంబ పోషణ చేయలేని గ్రుడ్డివాడై అసమర్థుడైన మీ తండ్రిని ఒక తట్టలో కూర్చోపెట్టి, తీసుకొనివెళ్లి నదిలో వదిలిపెట్టవలసిం" దని పుత్రులకు చెపుతుంది. తల్లి ఆజ్ఞమేరకు దీర్ఘతముని పుత్రులు ఆ పనికి పూనుకుంటారు. అప్పుడు దీర్ఘతముడు తీవ్రమైన కోపంతో "పతి హీనలైన స్త్రీలకు సంఘంలో గౌరవస్థానం వుండదనీ, శుభకార్యాలలో పాల్గొనే అవకాశంలేకుండా పోవుగాక" అనీ శపిస్తాడు. ఈ దీర్ఘతముని శాపం తరువాతనే విధవలైన స్త్రీలకు సంఘంలో గౌరవస్థానం లేకుండాపోయి, శుభకార్యాలలో పాల్గొనే అవకాశం లేకుండాపోయినట్లు కనిపిస్తున్నది. మన సంఘంలో విధవలపట్ల యేర్పడిన యీ దుర్వ్యవస్థ దీర్ఘతముని శాపానికి పూర్వకాలంలో అప్పటి వేదర్షుల కాలంలో వున్నట్లు కనిపించదు.

ఒక మంచిపనిచేసినా, యేదైనా ఉత్తమ వస్తువును తయారుచేసినా, గ్రంథరచన చేసినా, వివిధ కళానైపుణ్యాలను చూపించినా సమర్థులై సమర్హులైన పెద్దల ఆమోదముద్రపడితే అది సార్థక మవుతుంది. ఇదేవిధంగా దైవార్చనలో ఉపయోగించే తీర్థాన్ని శంఖంలో పోస్తేనేతప్ప అది పవిత్ర తీర్థం కాదని ప్రాచీనకాలంనుంచీ వొక అభిప్రాయం వున్నది. ఏ సందర్భంలోనైనా సరే పెద్దల ఆమోదముద్ర కావలసినప్పుడు "శంఖంలో పోస్తేనేకాని తీర్థం కాదుకదా!" అన్న సామెత చిరకాలంగా జనుల నానుడిలో నానుతున్నది. నారదీయపురాణంలో యిందుకు భిన్నంగా శంఖంలో పోసిన నీరు త్రాగడం పాపకర్మగా పేర్కొనడం జరిగింది. ప్రబోధనీ మహిమగురించి మోహినికి రుక్మాంగదుడు వివరించిన సందర్భంలో "శంఖంబుతో జలంబు ద్రావుట, కూర్మ సూకర మాంసంబులు భక్షించుట పాపంబులని తెలియంబడియె నేకాదశి భోజనంబును నగమ్యాగమనంబును, నభక్ష్య

భక్షణంబును నకార్యకరణంబును గోసహస్రవధ తుల్యంబని యెఱింగించె. ఏకాదశి సర్వంబె భుజింప? ఏకాదశిని బురోడాశంబును భుజింపంగాదు" (నార. 274. పు. 49. వ.) అని పేర్కొని శంఖంతో జలం త్రాగడం పాపకర్మగా వక్కాణించాడు.

ఆర్షవిజ్ఞానంప్రకారం దైవారాధనలో యేస్థాయిలోనూ హింసకు స్థానం లేదు. కన్నులు పొడుచుకొనడం, ముక్కు, చెవులు, నాలుక కోసుకోవడం, కుత్తుక నుత్తరించుకొనడం యిటువంటివి స్వయంగా చేసుకొనడమేకాదు, చేయడం కూడా వేదవిజ్ఞానందృష్ట్యా, ధ్యానదృక్పథ ప్రత్యక్ష ప్రమాణ పరమైనవేకాని, ఆచరణపూర్వకమైనవి కావు. కాని వేదవిజ్ఞానం అంతర్ముఖంనుంచి సకలకాల స్వార్థశక్తులకారణంగా బహిర్ముఖమైపోయిన తరువాత హింసా ప్రక్రియ అవతరించాయి. నారదీయపురాణంలో మోహిని మాటప్రకారం ధర్మాంగదుడు తన్ను చంపవలసిందని తండ్రిని కోరిన సందర్భంగా "సర్వమేధ మఖంబున స్వసుతుఁ బశువుఁ జేసి వ్రేల్చిన తండ్రికి సిద్ధమై లభించు నుత్కృష్టపదము గాంభీర్యధైర్య శౌర్యశాలివి నీకింక శంకయేల?" (నార. 305. పు. 176. వ.) అని సర్వమేధ మఖంలో స్వపుత్రుణ్ని పశువుగా వ్రేల్చడం గురించి ఉత్కృష్టకార్యంగా పేర్కొనబడింది. కాగా ఆర్షవిజ్ఞానం వక్రముఖం దాల్చిన తరువాతనే యిటువంటి హింసా ప్రక్రియలు అవతరించాయని భావించవలసి వున్నది.

దేవతలనేకమంది వున్నారు. కాని నారదీయపురాణంవల్ల ధర్మదేవత, అధర్మదేవతలేకాక ధర్మాభిమానదేవత, అధర్మాభిమానదేవత, కాలాభిమానదేవత, వేదాభిమానదేవత, విద్యాభిమానదేవత వంటి విశిష్ట దేవతలగురించి విపులంగా వర్ణించడం జరిగింది. (చూడు. నార. 399, 400, 407, 408 పు.)

అంతరంగికంగా వాస్తవాన్ని పరిశీలిస్తే అస్తి, నాస్తి మతాలకు భిన్నత్వం లేదు. లఘు దీర్ఘాదికాల పరిమితులతో సృష్టి అంతా అశాశ్వతమే. ఈ దృష్ట్యా వివిధ దేవతలకుసైతం కాలపరిమితి వున్నది. అంతత్వం వున్నది. జగన్మిథ్య బ్రహ్మ సత్యమన్న సిద్ధాంతంతో జగత్తంతా వున్నదనీ దానికి శాశ్వతత్వం లేదనీ ఆమోదించడం జరుగుతున్నది. జగదతీతమైనశక్తి యేదీ లేదన్న దృష్టితో నాస్తికత్వం ప్రబలినా, సృష్టివ్యవస్థ గురించిన అశాశ్వతత్వాన్ని గురించి నాస్తికులు సైతం 'ఔనని' ఆమోదించక తప్పదు. వాస్తవానికి జగత్తు అస్తి, నాస్తివాదుల ఉభయుల దృష్టిలోనూ వున్నది. దీని అశాశ్వతత్వం కూడా ఉభయవాదులూ ఆమోదించే విషయమే. అయితే ఒక శక్తిని మించిన వేరొకశక్తి వున్నదా? లేదా? అంటే ఆస్తికులున్నదంటారు. నాస్తికులుసైతం దైవీయంపేరుతో

వాఙ్మయ మహోధ్యక్షుని

లేదన్నా, ఉన్నదని వైజ్ఞానికంగా సత్యసమ్మతంగా ఆమోదించక తప్పదు. ఈ దృష్ట్యానే నరసింహాకవి విష్ణువుగురించి వర్ణిస్తూ "అవ్యయుండును, నిరాధారుండును, నిష్ప్రపంచుండును, నిరంజనుండును, విష్ణుండును, శూన్యుండును, వేదస్వరూపుండును, ధ్యేయుండును, ధ్యేయవర్జితుండును'' అని పేర్కొనడమేకాక "అస్తి నాస్తి వాక్యవర్తియు, దూరవర్తియు సంతికవర్తియు'' (నార. 310. పు. 197. వ.) అని కూడా పేర్కొని అస్తి, నాస్తికత్వాల మూలతత్వం ఒకటే పొమ్మన్నాడు.

వ్యుత్పత్తి లోకవేద భేదాలతో ద్వివిధమై వుంటుందని నరసింహాకవి వివరిస్తూ అలౌకికులుగా జన్మించిన బాలకులు, జననం మొదలు లోకానుభూతితో లౌకికులుగా మారిపోతారని చక్కగా తెలియచేశాడు. ''ఆ మూక బాలకులు జన్మంబు మొదలుకొని నయనములు దెఱచి ప్రతి దివసంబునందును దృశ్యములు చూచుచు నున్నవారలై కార్యంబునందు స్వ పర వైషమ్యంబు దెలిసి తలిదండ్రులం జూచి దైవ వశంబునం బ్రథమ వాసన గలవారలై యంతఁ దాత యనియు నంబి యనియుఁ దన్నామంబులం బల్కుదురు. సత్సంజ్ఞా సంజ్ఞా సంబంధ జ్ఞాన జిజ్ఞాసులైన స్వకీయులచేత 'మీ తండ్రి యేఁడీ' యనియు 'మీ తల్లి యేది' యనియు నడుగంబడిన నా బాలకు లా తండ్రినిం దల్లినిఁ దర్జనిచేత నిరూపించి తాతాంబేత్యాది శబ్దములకు నా వాక్యంబునందుఁ గార్యాన్వితతగదా ? వారికిం బ్రథమ శబ్దమగుటంజేసి మున్ను గార్య పదాన్వయములేదు.'' (నార. 405. పు. 51. వ.) నిజానికి మాయ అంటే యేమో తెలియకుండా కుల, మత, జాతి వర్గాది భేదాలు లేకుండా ఈర్ష్యా ద్వేషాల కతీతంగా కేవల సచ్చిదానంద స్వరూపులుగా కనిపించే పసికందులు మాతా పిత్రాదులు కారణంగా, లోకంకారణంగా వచ్చి లౌకికులుగా మారిపోతారు.

భూమి బల్లపరుపుగా వుందని మన ప్రాచీనులు భావించినట్లు ఆధునిక హేతువాద నామకులు కొందరు విమర్శిస్తూ వుంటారు. కాని ప్రాచీనులెవ్వరూ భూమి బల్లపరుపుగా వున్నదని యెక్కడా చెప్పలేదు. పైగా "ధరణీచక్రము దిర్దిరం దిరిగె'' ఇత్యాది ప్రయోగాలతో అనేకమంది ప్రాచీన కవులు భూమిని చక్రాకారంలో వున్నట్లు పేర్కొన్నారు. నారదీయపురాణంలో ప్రహ్లాద చరిత్రలో మహావిష్ణువు తన ద్వారపాలకులు భూలోకంలో జన్మిస్తారని చెప్పే సందర్భంలో ''మద్ద్వారపాలురు మత్పూర్వసంకల్ప వైభవ మాయా నాటకంబున నధోలోక చక్రంబు బ్రవేశించి యీ శాపంబున నట్ల యవతరించి తరించెదరు'' (నార. 422. పు. 123. వ) అని భూలోకాన్ని అధోలోక చక్రంగా సార్థకంగా ప్రయోగించడం

జరిగింది. అంతేకాదు హిరణ్యకశిపుని పరిపాలనను వర్ణిస్తూ సమస్తదిశలను సైతం చక్రంగానే నరసింహకవి పేర్కొన్నాడు. "చక్రమును బోలి జితదిశా చక్రమునను" (నార. 429. పు. 159. ప.) కాగా దిశలన్నిటినీ కలిపి చూచినపుడు చక్రాకారంలో కనిపించడం అవాస్తవికమైన విషయంకాదు.

హిరణ్యకశిపునికి అంతరంగికంగా విష్ణుద్వేషం లేదని, బహిర్నాటకంగానే విష్ణుద్వేషాన్ని ప్రకటించాడని విశిష్టంగా గతంలో గుర్తించాం. సనకాదులకు మోక్షప్రాప్తివిధానం గురించి తెలియచేసిన సందర్భంలోనే అసలు రాక్షసులందరూ కూడా అంతరంగికంగా సద్దృష్టితోనూ, బాహిరంగా దుష్టప్రకృతంతోనూ సురద్వేషులై తన లీలవల్లనే వ్యవహరిస్తారని మహావిష్ణువు పేర్కొంటాడు.

"నా మా యా మయ మోహిని
పామర దానవుల భ్రాంతిపఱచుట యఱుదే;
నా మాయఁ దెలియఁ జిత్రము;
సామాన్యులకెల్ల నెఱుఁగ శక్యంబగునే ?

మన్నింద్రు కింకరుల్ మాననీయులు మున్ని
యోగంబు కతన ననూనయశులు
సత్య సంకల్పు లాసుర వంశమునఁ బుట్టి
తత్సమా కారేంగిత ప్రకార
శక్తి గుణోదయ సంపద తద్దైత్య
జాతికినెల్ల విశ్వాసమొదవ
దీపించి బాహ్య కుదృష్టిసమ్మతమైన
మతమునఁ బ్రియతమస్థితి వహించి
నిస్త్రయులు నిర్దయులు నతినీచతరులు
నగుచు ఘోరతరక్రియ లాచరించి
వైష్ణవ ద్రోహబుద్ధిమై వార్తకెక్కి
సాధు దూషణ పరిచితాచారులగుచు.

అవైష్ణవులంబోలె నాయందు ద్వేషంబు గావింపుచుఁ గపటంబునం దిరుగుచు, జితత్రిలోకాధిపతులై జగత్త్రయంబున ఖ్యాతి నొందుచుఁదామసులు తన వారన తామసోపాస్య చరణులై వారలకుం బ్రత్యయంబుగా బ్రహ్మ రుద్రా ద్యుపాస్తి గావించి వారలవలన బహువరంబులు గావించి యత్యాద్యైశ్వర్య పరాక్రమ వయోనిధులై విరోధులుంబలె నటించి మత్పదాంభోజంబు లందెదరు. బాహ్యంబున నసురతాఖ్యాతికై సురల బాధించెదరు" (నార. 416, 417.పు. 99.100.వ. 101.వ.)

వాఙ్మయ మహోధ్యక్షుని

అంతేకాదు అస లంతకుపూర్వమే మొత్త మసురులందరికీ విష్ణుసత్వ విజ్ఞానో దయాన్ని కలిగిస్తానని విస్పష్టంగా పేర్కొంటాడు.

"అఖిల వేదాంత వేద్య విశ్వాత్మశీల
మైన మత్సత్వ విజ్ఞాన మసురులకు జ
నింపఁ జేసెద మన్మనోన్నిద్ర శక్తి
ఘనతరంబైన సంసృతి క్రమమునందు."

(నార. 415. పు. 94. ప.)

ఈ లక్ష్యసిద్ధికై మహావిష్ణువు అనేకానేకావతారాలు ధరించాడు. ధరిస్తాడుకూడా.

నరసింహకవి హిరణ్యకశిపుని శక్తిమత్త్వాన్నిగురించి అతనిచేతనే చెప్పిస్తూ "గుణాన్వితత్వంబు వలన మానతయు దోషాన్వితత్వంబు వలన నమాన తయునగు; నిశ్చితంబైన మానత లేదు;" (నార. 431. పు. 169. వ.) అని మానతామానతల భిన్నత్వాన్ని ఉగ్గడించినా మానతకు నిశ్చితత్వం లేదు పొమ్మన్నాడు.

ప్రహ్లాదుని జననానంతరం అతడు ఓంకార నాదోచ్చారణచేస్తూ "సోఽహం"— "హంసః" అన్న శబ్దాలలోని లోచన బంధయోగానికి సంబంధించిన బ్రహ్మాను భవానుభూతితోపాటు అమృతసిద్ధిత్వాన్ని సైతం అధ్యాత్మానుభూతిపరంగా నరసింహకవి తేటతెల్లంగా వర్ణించాడు. (నార. 434. 435. పు. 182. వ.)

ప్రహ్లాదుడు తండ్రితో మాట్లాడుతూ మోక్షదాయకమైన దేవ వేద కర్మ పూర్ణమైన సద్విద్యగురించి చెపుతూ మోక్ష భిన్నమైనదంతా కేవల శిల్పంవంటి దంటాడు.

"ఏది బంధకంబు గాదిది సత్కర్మ
మరయ మోక్షమునకు నయ్యె నెద్ది
యది సువిద్య దుఃఖ మన్యకర్మము శిల్ప
మన్య విద్య నిశ్చయముగ వినుము."

(నార. 437. పు. 195. ప.)

వాస్తవం పరిశీలిస్తే దేవతలకు ప్రతికృతులైన శిల్పాలే అయినా, ఆ మహావిష్ణుమూర్తి శిల్పమే అయినా కారుకులు రూపొందించినవి మాత్రమేకావు. అసలు శిల్పాలు రూపొందించినవే అయినాసరే శిల్పాలు శిల్పాలే. విష్ణువు సర్వాంతర్యామి అయినప్పటికీ యెంత ప్రాణ ప్రతిష్ఠజరిగిన శిల్పమైనా అసలు విష్ణువుకు దీటురాదు

కదా! కాగా మోక్షజ్ఞానానికి భిన్నమైనదంతా శిల్పంవంటిదని అనడంలో అవాస్తవికత యేమీ లేదు.

ధ్రువచరిత్రను అనేక గ్రంథాలలో విపులంగా వర్ణించడం జరిగింది కాని, ధ్రువుడు తపోధ్యాననిమగ్నుడై జపించిన మూలమంత్రాన్ని యే గ్రంథమూ ఉటంకించలేదు. ధ్రువుడు "హిరణ్య గర్భపురుష ప్రధానావ్యక్త రూపిణే, ఓం నమో భగవతే వాసుదేవాయ శుద్ధజ్ఞాన స్వరూపిణే'' (నార. 448. పు. 21.వ.) అన్న వేదమంత్రాన్ని జపించి సిద్ధిపొంది మహావిష్ణుమూర్తి అనుగ్రహాన్ని పొందగలిగాడని నరసింహకవి పేర్కొన్నాడు.

నరసింహకవి వ్యాసమాహాత్మ్యన్ని వర్ణిస్తూ ప్రస్తావనవశాత్తు కలియుగంలో త్రివిధతత్వపాషండులు, దొంగవైదికులు, దొంగయాజ్ఞికులు జన్మించి ప్రతిభావిరహితులై దుర్దేశికులుగా జీవిస్తారని వేదప్రమాణంతో పేర్కొన్నాడు. (చూడు. నార. 173. పు 124. వ.)

వివాహాలలో మంగళసూత్రాలుకట్టడం, తలంబ్రాలు పోయడం యిటీవల నెలకొన్న సంప్రదాయం కాదని రుక్మిణీ పరిణయసందర్భంగా నరసింహకవి వర్ణించిన పద్యాలలో "శుభకరంబైన మంళసూత్రమపుడు కట్టెఁగృష్ణుండు రుక్మిణి గళమునందు"... "తలంబ్రాలువోసెఁ గృష్ణుండు కలకంఠీమణికి భీష్మకన్యకకు" (నార. 51. పు. 282, 283 వ.) అని నరసింహకవి కాలానికి కూడా మంగళసూత్రాలూ, తలంబ్రాలు ప్రసిద్ధమై ఆచారంలోవున్నట్లు స్పష్టపరిచాడు.

సామాన్యంగా పరిపాలకులు యుద్ధాలుచేసి అనేకరాజ్యాల నాక్రమిస్తూ వుంటారు. ఇటువంటి సందర్భాలలో అనేకమంది ప్రజల పరిపాలకుల భూమి విజయం చేపట్టిన పరిపాలకునికి స్వాధీనమవుతుంది. వీటిల్లో యితర పరిపాలకులు దానంగా యిచ్చిన భూములుకూడా వుండే వుండవచ్చును. విజయంచేపట్టిన పరిపాలకుడు తనకు లభించిన భూమిలో కొన్ని భాగాలను కొందరకు దానాలుగా యివ్వవచ్చును. ఇటువంటి సందర్భాలలో ఒకరు దానమిచ్చిన భూమినే తిరిగి మరొకరు దానంగా యివ్వడంకూడా జరుగుతుంది. అయితే ఒకసారి దానమిచ్చినదానిని తిరిగి దానమివ్వడం మహాదోషంగా మన ప్రాచీనులు భావించారు. కృష్ణునివలన కృకలాసవం శాప విముక్తి పొందిన ఘట్టంలో తాను పూర్వజన్మలో రాజునని, ఒకరికి దానంగా యిచ్చిన ధేనువును మరొకరికి దానంగా యిచ్చి ధారవోసినందువల్ల తాను ఒక విప్రుని ఆగ్రహానికి గురియై పరిశప్తుడనయ్యానని చెపుతూ "పేభవప్రీతిగా జగతీసురుల గణేయంబులగు ధేనువుల దానం బొనర్చితినందు నొకరికి నిచ్చిన ధేనువు

వాఙ్మయ మహాధ్యక్షుని

నొకనికి సజ్జలంబున ధారవోసి యిచ్చితి. అన్యోన్యమత్సరంబుననున్న యా భూమీసురులలో నొక విప్రుండు నన్నుఁ గృకలాసవంబగుమని శపియించె", (నార. 65 పు. 378 వ.) అని ఒకరు దానంగా యిచ్చినదాన్ని కాని, ఒకరికి దానంగా యిచ్చినదాన్ని కాని మరొకరికి దానంగా యివ్వకూడదని పేర్కొన్నాడు.

ధర్మాధర్మాభిమాన దేవతలు ఆత్మ వృత్తిప్రకారం గురించి తెలియజేసే సందర్భంలో వివిధ కాల క్రియా శబ్ద వాక్యాది వ్యాకరణ విశేషాలను నరసింహకవి తెలియచేశాడు. (నార. 404. 405. పు.)

## భాషాలంకార విశేషాలు

నరసింహకవి అత్యంత విశిష్టతగల యీ నారదీయపురాణ కృతిలో అనేక జాతీయ ప్రయోగాలను, నానుడులను, సామెతలను యితర విశేష ప్రయోగాలను కొన్నిటని ప్రయోగించాడు. కృష్ణుడు గోవర్ధనాన్ని యెత్తిన సందర్భంగా "ఉఫ్" అని తానూఁదనుండునే మింటిపైఁ బుక్కలావర్తకాంభోధరములు" (నార. 14. పు. 78. ప.) అని మనం మామూలుగా 'ఉఫ్' అని ఊదివేశాడు, అని వాడే 'ఉఫ్' పదాన్ని చక్కగా ప్రయోగించాడు. మామూలుగా పంచె కట్టుకొని పై పంచె వేసుకునేవారు ఆనందాతిరేకం కలిగినప్పుడు పై పంచె యెగరవేసుకుంటూ సంతోషంతో గంతులు వేయడం జరుగుతుంది. యాదవాద్రిమీద శ్రీహరి దివ్య విమానాన్ని సనత్కుమారుడు నిలిపినప్పుడు కల్యాణతీర్థంలోని ప్రజలు యెంతో సంతోషపడి పై పంచె లెగరవేస్తూ నర్తించారన్న విషయాన్ని నరసింహకవి యీ క్రిందివిధంగా వెల్లడించాడు. "ఆ విచిత్రతఁజూచి యారఁ శ్రీ నారాయణాది దేవుఁడు జగదద్భుతముగ నప్రమేయ ప్రమేయాకారముల రెంటఁ గనిపించె ననుచు వల్కలములంత బొడవుగా నెగసైచి పొగడినర్తింపుచు" (నార. 110. పు.86. ప.) మామూలుగా 'కుక్కతోకపట్టి గోదావరినీదడం', 'గోవుతోకపట్టి గోదావరినీదడం', 'ఓటి పడవనెక్కి ప్రయాణం చేయటం' వంటివి తెలుగులో నానుడులుగా వున్నాయి. నరసింహకవి కలియుగ ధర్మాలను వివరించే సందర్భంలో హరిభక్తి గొప్పదనం గురించి చెపుతూ హరిని మినహా యితర దేవతల నర్చించడం పగిలిన కుండ నాధారంచేసుకొని నది దాటాలని అనుకోనడం వంటిదని యీ క్రింది పద్యంలో చక్కగా వర్ణించాడు.

"హరిఁ దక్క నితరు నొక్కరు
శరణంబని తలఁచు టెల్ల సారతరంబై

తరిగలుగ భిన్నకుంభాం
తరమున నది దాఁట నాత్మఁ దలఁచుటగాదే! ”

(నార. 178. పు. 152. ప.)

జనవ్యవహారంలో ‘నివురు గప్పిన నిప్పు’ అన్నది ‘ధూళి దూసరితమైన రత్నం’ వంటి దన్నట్లుగా తరచు ప్రయోగించబడుతూ వుంటుంది. నివురు అంటే బూడిద అనే అర్థం. నిప్పుకణం తెల్లని బూడిదతో కప్పబడినప్పుడు అది నిప్పు లేని మామూలు వట్టి ఆరిపోయిన బొగ్గు అనుకొని దాన్ని అంటుకున్నా, తొక్కినా ఛుర్రుమని కాలి తీరుతుంది. నిత్యవ్యవహారంలోనూ, సాహిత్య ప్రపంచంలోనూ నివురు గప్పిన నిప్పు అని యీ సందర్భంలో ‘నివురు’ శబ్దాన్ని ఉపయోగించడమే ప్రసిద్ధమై వున్నది. బూడిద పర్యాయపదాలలో ‘నివురు’ తోపాటు ‘నీరు’ పదంకూడా వున్నది. ‘నీరు’ అంటే జలమని మాత్రమే అర్థంకాదు ‘బూడిద’ అనికూడా అర్థం వున్నది. జలార్థకమైన నీరుశబ్దం సాధురేఫయుక్తమని బూడిద అర్థం కలిగిన ‘నీఱు’ శబ్దం శకటరేఫ యుక్తమని మామూలు సాంప్రదాయసిద్ధంగా పండితులంటారు. అయితే సాధు, శకటరేఫల భిన్నవ్యవస్థ అతిప్రాచీనకాలంలోనే ప్రభ్రష్టమైనది. కలగా పులగమైనది. ‘నివురుగప్పిన నిప్పు’ అనడానికి మారుగా ‘నీరు గప్పిన నిప్పు’ అని విశిష్టంగా నరసింహాకవి వైకుంఠలోక ఆవరణ పంచకవర్ణనా సందర్భంలో “నీరుగప్పిన నిప్పులై నిష్ప్రభత్వపూర్తి పరధామ లోకోప భోగభోగ్యులయ్యు” (నార. 361. పు. 179. ప.) అని ప్రయోగించాడు.

ఎవరైనా మనకు యిష్టంలేనిపనిగాని, వ్యతిరేకమైన పనిగాని చేసినప్పుడు “ఫో, ఫో, మంచిది, మంచిది——వెళ్లు, వెళ్లు, బాగాచేశావ్, బాగాచేశావ్” వంటి పదాలను వికటంగా, అసహ్యంగా వెటకారంతో ఉపయోగిస్తాం. ప్రహ్లాదుడు మహా విష్ణుభక్తు డయ్యాడని తెలుసుకొన్న తరువాత లోకవ్యవహారాని కనుగుణంగానే హిరణ్యకశిపుడు గురువును చూచి “తద్గురుని వక్రంబుగాఁ జూచి పొమ్ము పొమ్ము లెస్స లెస్స! యీ శిశువునిట్లనే చేసితివి” (నార. 464, పు. 88. వ.) అని అన్నట్లు నరసింహాకవి జాతీయ ప్రయోగంచేశాడు. కొడుకును ‘బాబూ’ అనికాని ‘నాయనా’ అనికాని ‘నాన్నా’ అనికాని చివరికి ‘బిడ్డా’ అనికాని ప్రేమతో పిలవడం లోకంలో వ్యవహారంగా వున్నది. నరసింహాకవి కాలంలో కొడుకును ముద్దుగా ‘అన్నా’ అని పిలిచే అలవాటుకూడా వున్నదికాబోలు. సునీతి తన కుమారునితో మాట్లాడుతూ “అన్న! దుఃఖమేల యా సురుచి యథార్థమైన యట్లపల్కె” (నార. 447 పు. 18 ప.) అని కొడుకును “అన్న!” అని సంబోధించినట్లు ప్రయోగించాడు. శృంగార వర్ణనలలో ప్రత్యేకించి విరహవేదనలలో చందమామ

వాఙ్మయ మహాధ్యక్షుని

చల్లని వెన్నెలలు ఆతపకిరణాలవలే బాధించినట్లు వర్ణించడం కావ్యాల్లో తరచుగా చూస్తూ వుంటాం. చకోరాలు వెన్నెలను భక్షించి జీవిస్తాయనే విషయంకూడా సాహిత్య ప్రపంచంలో ప్రసిద్ధమైన విషయం. అయితే ఆ చకోరాలు సైతం మామూలు వెన్నెలను తట్టుకొని భక్షించి జీవించుతాయి తప్ప సాంద్రమైన చంద్ర కిరణాలను చకోరాలు ఓర్చుకోలేవని, ఆ దట్టమైన వెన్నెలలు, ఆతపాల వంటివై చకోరాలకు విజ్వరత్వాన్ని కలిగిస్తాయని నరసింహకవి శృంగార విరహ వర్ణనా సందర్భంలో కాదు, ఈశ్వరసాక్షాత్కార నిరంతరానంద వర్ణనా సందర్భంలో పేర్కొన్నాడు. "నిల్చిన సేవించి యుపాసీనులై పరబ్రహ్మానంద సింధువులగు జయాదికుల వెంట నిపురస వీచికా సంగతి నిపురసాంబోధినింబోలె నీశ్వర సాక్షాత్కారంబుగలిగి నిరంతరానందంబు వహించియున్నప్పుడొక యనిర్వా చ్యానందంబుగాంచి సాంద్ర చంద్రాతపాతంత్ర చకోరంబులుంబోలె విజ్వరత్వంబు నొంది యీశవిగ్రహం విన్యస్తదృష్టులై యనిమిషత్వంబు వహించి రప్పుడు" (నార. 379. పు 253 వ).

చిత్రా నక్షత్రయుక్తమైన పౌర్ణమిగల మాసం చైత్ర మాసంగాను, ఇదే విధంగా ఆయా నక్షత్రాలతో కూడిన పౌర్ణమిగల మాసాలకు, ఆయా నక్షత్ర సంబంధనామాలే మాసనామాలుగా యేర్పడ్డాయి. ఈ రూపంగా శ్రవణానక్షత్ర యుక్తమైన పౌర్ణమిగల మాసాన్ని శ్రావణ మాసమని అనడం వేద ఖగోళ శాస్త్ర బద్ధమైన విషయం. శ్రావణమాస ద్వాదశిఅని శ్రావణద్వాదశి అని అనడానికి మారుగా శ్రవణ ద్వాదశియని నరసింహకవి ఒక మత్తేభంలో విశిష్టంగా ప్రయో గించాడు. "శ్రవణద్వాదశినాఁటి పుణ్యమిడి రాజా! నన్ను రక్షించు" (నార. 232. పు. 210. వ.). ప్రాచీన వాఙ్మయంప్రకారం 'ఛాందస' శబ్దానికి వేద పండితుడు, ఛందశ్శాస్త్రవేత్తవంటి అర్థాలు మాత్రమే వున్నాయి. ఇటీవలి కాలంలో ఛాందసుడనే మాటకు పిచ్చిపిచ్చి నమ్మకాలున్నవాడని, మూఢవిశ్వా సాలూ, ఆచారాలూ కలవాడని అర్థంవచ్చింది. ఈ విధంగా ఛాందసశబ్దార్థం పరి ణామంచెందడం నరసింహకవి నాటికే జరిగిందని నారదీయపురాణంలోని యీ క్రింది ప్రయోగంవల్ల తెల్లమవుతున్నది." వేదాంత మతముకంటె నన్యమగు మతము మంచిదిగాదని తెలియక యీ వేదాంతమతము నాదరించక యీ ప్రకారమునను స్వగోష్టినిష్ఠులైన ఛాందసులైనవారి మనస్సులను నల్పులైనవారల నతికల్పనులైన మోహంబునొందించిరప్పుడు (నార.376. పు. 244 వ.).

ఆధునికయుగంలో పద్య, గేయ, వచనాత్మకంగా ఒకానొక వైశిష్ట్యంకలిగిన సాహిత్య ప్రక్రియ హరికథ పేరుతో అవతరించింది. హరికథా వాఙ్మయంలో

మొట్టమొదట 'హరికథ'నే అంటే విష్ణుపుకథనే మొట్టమొదటి రచనలో వర్ణించడంవల్ల దానికి 'హరికథ' అని పేరు వచ్చివుంటుంది. క్రమక్రమంగా 'హరికథ' అన్న పేరు ఆ ప్రత్యేక సాహిత్య ప్రక్రియకు రూఢనామంగా రూపొంది గిరికథ వర్ణింపబడినా, సిరికథ వర్ణింపబడినా మరే మహేశ్వర, రామాయణ, భారతాది కథలు, వివిధ ఉపాఖ్యానాలేకాక చివరకా సాహిత్య ప్రక్రియలో సాంఘిక చరిత్రకల కథచేరినా ప్రస్తుతకాలంలో 'హరికథ'గానే రూఢమైపోయి విపులంగా చలామణీ అవుతున్నది. అయితే నరసింహకవి యీ ఆధునిక సాహిత్య ప్రక్రియా వైశిష్ట్యంకల హరికథను దృష్టిలో పెట్టుకొని ఉండడనడం అక్షరాలా సత్యమేకాని 'విష్ణుకథ' అనే అర్థంలో ''హరికథ'' అని వొకసారి ''హరికథా సుధా'' అని వేరొకసారి రెండు సందర్భాలలో 'హరికథ' శబ్దాన్ని ప్రయోగించాడు. ''ఈశావిష్కృత గురుసత్కృప చేసైన యేవివక్షచేత నీ ప్రకారమున హరికథ మాకు రుచించునయ్యా వివక్షకోఅరు మఱియు మఱియు నమస్కారంబులు.'' (నార.424 పు.134.ప.).- ''సూతుండు శౌనకాదులకు హరికథాసుధా ప్రవాహంబు వెల్లివిరియ నిట్లనియె ననిన వారలు నిజశాస్త్ర ధౌరంధర్య ప్రాగల్భ్యంబున వచ్చినిలిచినయప్పుడు''(నార.445.పు.2.ప.).

మందరగిరి భూలోకంలో లేదనీ ఖగోళంలో యెక్కడో ఉత్తర దిగ్భాగంలో దూరతీరాలలో వున్నదనీ నారదీయపురాణం ఆధారంగానే వేదవిజ్ఞానపరంగా గతంలో గుర్తించాము. సంస్కృతంలో లౌకికవాఙ్మయం దృష్ట్యా గిరివాచకాలైన పర్యాయపదాలలో, భూధరం, ధరణీధరంవంటి శబ్దాలుకూడా చేరాయి. భూలోకంలో లేనటువంటి పర్వతాలను భూధరంవంటి పదాలతో వ్యవహరించడం శుద్ధ పొరపాటు. మందరగిరి భూమిమీదలేదని తెలిసిన నరసింహకవే 'భూధర' శబ్దాన్ని సర్వసామాన్య పర్వత వాచకంగా భావించి ''మందరభూధరోత్తమము'' అని మందర పర్వతవర్ణనా సందర్భంగా ప్రయోగించి పప్పులోకాలువేశాడు. ''దాని మందర భూధరోత్తమముఁ గాంచి'' (నార.224.పు. 172.ప.) కొండలు భూమండలం మీదనే ఉండాలని లేదు. ఏ గోళం మీదనైనా ఉండవచ్చును. భూమికి భిన్నమైన గోళాలలో ఉన్న పర్వతాలను భూధరాలని అనడానికి వీలులేదు.

అనుకరణంలో నమశ్శబ్దం విసర్గకు ఓత్వంవచ్చి 'నమో' అని రూపొందడం వ్యాకరణ సమ్మతమై ప్రాచీనకవి ప్రయోగ ప్రసిద్ధమైవున్నది. ప్రాచీనకవులే కొందరు అనుకరణవిరహితత్వంలో సైతం నమోశబ్దాన్ని ఓకారాంతంగానే ప్రయోగించారు. సంస్కృతంలో నమశ్శబ్దమేకాక 'నమో' అనే ఓదంత అవ్యయంకూడా ఒకటివున్నది. ఈ విషయం ప్రౌఢవ్యాకరణకర్త కూడా తెలియ చేశాడు. బ్రహ్మ శ్రీమన్నారాయణుని నుతించిన సందర్భంగా నరసింహకవి రచించిన యీ క్రింది పద్యంలో 'నమో' అనే అవ్యయాన్నికూడా ప్రయోగించినట్లు స్పష్టపడుతున్నది.

వాఙ్మయ మహోధ్యాతుని

'కారణాయ నమో రక్షకాయతే న
మో నమో నగతే నమోమునిజనైక
సకలదాయ పరేశ వైకుంఠవాసి
నే నమః శ్రీనివాసాయ నిఖిల శరణ.'

(నార.103.పు 48.ప.)

ఈ పద్యంలో "కారణాయ నమో—రక్షకాయతే నమో" అన్నప్పుడు అవ్యయాలైన "నమో" లను, మిగిలినచోట్ల నమశ్శబ్దాలను ప్రయోగించినట్లు స్పష్టపడుతున్నది.

ప్రాచీనకాలంలో కొందరు కవులు అనుకరణవిరహితంగా సంస్కృత వాక్యాలను ప్రయోగించిన సందర్భాలు లేకపోలేదు. ఇదే విధంగా నరసింహాకవికూడా "కథళీసకదాచన యనియనిరి"అని అనుకరణ సహితంగా ప్రయోగించవలసివుండగా ఈ క్రింది పద్యంలో అనుకరణ విరహితంగానే సంస్కృత వాక్యాన్ని ప్రయోగించాడు.

"చకచక నేమించినయా
ముకురానన యూరు యుగము మోహనకాంతుల్
ప్రకటించి మెఱయఁ "గదళీ
సకదాచన" యనిరి బుధజనంబులు భళిరే !"

(నార.49.పు.267.ప.)

తెలుగులో "అయి-అవులకు ఐ,ఔ"లు రావడం సుప్రసిద్ధమైన విషయం. వ్యావహారికంగానూ, గ్రాంథిక భాషాపరంగానూ యీ అయి, ఐ, అవు, ఔల మార్పులను దృష్టిలో పెట్టుకొని ప్రాచీనకాలంలో పండితకవులు సైతం తికమకలుపడి తారుమారులుచేసి 'ఐ,ఔ' లకు 'అయి, అవు'లను-ప్రత్యేకించి యీ మార్పు రావడానికి వీలు లేకుండా వుండే సంస్కృతంలో సహజంగా ఐకార, ఔకార యుక్తమైన పదాలలోని ఐ, ఔ లను కూడా అయి, అవులుగా మార్చి తప్పటడుగులు వేసి ప్రయోగించారని 20 సంవత్సరాల క్రిందట నేను రచించి ప్రకటించిన ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష, లేక "ధ్వని—లిపి—పరిణామం" అన్నపరిశోధనా గ్రంథంలో నిరూపించివున్నాను. నైవేద్య శబ్దం సంస్కృతంలో ఐ కార యుక్తమైన నకారాంకలది. ఇది వ్యావహారిక వశాత్తూ, ఐ—అయి గా మారి నైవేద్యశబ్దం నయివేద్యంగా మారిపోయింది. నరసింహాకవినాటికే యీ మార్పు వచ్చిందని "భక్తిమై సహస్రభార ప్రమిత నయివేద్య మిచ్చి" (నార. 156. పు. 44. ప.) అన్న ప్రయోగం ద్వారా రూఢి అవుతున్నది.

సంస్కృతీయమైన అచ్చుకు సాధారణంగా సంధిని ప్రాచీనులు ఆమోదించ లేదు. ప్రత్యేకించి సంస్కృతపదాలలో వున్న ఇత్వానికి సంధిని అసలే ఆమోదించ లేదు. కాని నరసింహకవి "పొగడినవరాహమూర్త్యగు భగవంతుని'' (నార. 85. పు. 488. ప.) అని మూర్తి+అగు అన్నప్పుడు సంధిచేసి "మూర్త్యగు" అని ప్రయోగించాడు. ఇది అగతికంగాచేసిన ప్రయోగంవలె కనిపిస్తున్నది.

నరసింహకవి నారదీయపురాణంలో వివిధ అలంకారాలను అనేక సందర్భా లలో ప్రయోగించాడు. అయితే రెండే రెండు సందర్భాలలో అత్యంత రమణీయమై, కమనీయమై హృదయానికి హత్తుకొనిపోయే విధంగా అనుపమానమైన ఉపమా ప్రయోగాలను నరసింహకవి చేశాడు. అత్యంత విశిష్టంగా మన దృష్టినాకర్షించే ఆ పద్య రత్నాలివి.

"అంబుజాక్షు నాత్మయందు నిల్పక యధ
మాధములఁ దలంచు టరయఁ దండ్రి
నాఁటి ధనము విడిచి నరుఁడు స్వప్నాగత
నిధి గృహంబునందు నిలిపికొనుట.''

(నార. 179. పు. 159. ప.)

"ఏఁ దక్క నితరుల కెఱుఁగంగ రాకుండఁ
జేసితినేనె విచిత్రమైన
మామక సంకల్ప మహిమ తద్భక్తిమై
మత్తత్త్వ ధీసుధా మధుర రసము
లసురులఁ గ్రోలింతు నతిరోగ శిశువులఁ
జక్కెర యనుచు నౌషధముఁ దల్లి
ద్రావించునట్లు తత్త్వజ్ఞాన ముదయింప
బోధించునట్టి దురోబ్ధమతుల''

(నార. 416. పు. 97. ప.)

## ఛందో విశేషాలు

నరసింహకవి సంస్కృతాంధ్రాలలో బహుముఖమైన పాండితీ ప్రతిభలు కలవాడు. మన ప్రాచీన కవులవలెనే నరసింహకవి కూడా ఉత్పలమాల, చంపక మాల, శార్దూల, మత్తేభాది సంస్కృత వృత్తాలను, కందం, సీసం, తేటగీతి, ఆట వెలది వంటి జాత్యుపజాతి పద్యాలనే కాక స్రగ్ధర, మహాస్రగ్ధర, లయగ్రాహి, కవి

వాఙ్మయ మహోధ్యాతుని

రాజ విరాజితం, భామిణి, మత్తకోకిల, మయూరవృత్తం, మాలిని, తరళవృత్తం వంటి వాటిని దండక, రగడలతో పాటు విశిష్ట గద్య రచనసైతం విరచించాడు.

దివ్య విమానస్థుడైన శ్రీహరి అర్చామూర్తిని మహేశుడు స్తుతించే సందర్భంలో తెలుగు యతిప్రాస నియమాలను పాటించి సంస్కృతభాషలో మత్తేభ వృత్తాన్ని రచించాడు. (నార. 108. పు. 79. ప.) ఇదేవిధంగా అంతకు ముందు బ్రహ్మ శ్రీమన్నారాయణుని స్తుతించిన సందర్భంలో కేవల తెలుగు ఛందస్సులనిపించుకుంటున్న రెండు తేటగీతులను, తెలుగు లక్షణం ప్రకారం అక్షర మైత్రి గల యతులను ప్రయోగిస్తూ సంస్కృత భాషలో రెండు పద్యాలు రచించాడు. (నార. 103. పు. 47. 48. ప.)

నారదీయపురాణంలో రెండు సందర్భాలలో ఆటవెలదులు గీత పద్యాలుగా "గీ" అని పేర్కొనబడడంద్వారా ముద్రితమయ్యాయి. (నార. 241. పు. 255. ప; 262 పు. 345. ప.) ఆటవెలదిని గీతంగా పేర్కొనడం పొరపాటని కొందరు భావించవచ్చును. నారదీయపురాణం వ్రాతప్రతిలో చాలావరకు ఆటవెలదులు గీతులుగానే పేర్కొనబడ్డాయి. వాస్తవానికి ఆటవెలదిని సైతం గీతమనడం దోషంకానేరదు. మన ప్రాచీన లాక్షణికులు గీతులు సమగీతులు, విషమగీతులని రెండు విధాలనీ, విషమగీతుల్లో యెత్తుగీతి, పదగీతి, మేళన గీతులువంటివి చేరగా, సమగీతులలో ఆటవెలది, తేటగీతి చేరినట్లు పేర్కొన్నారు. అందువల్ల ఆటవెలదిని తేటగీతిగా పేర్కొనరాదుకాని గీతంగా పేర్కొనడంలో పొరపాటు లేదు. ఈ గ్రంథపరిష్కర్తలలో ఒకరు మూలంలో ఆటవెలదులను గీతంగా పేర్కొన డంవల్ల ఆ పద్యాలన్నీ తేటగీతి లక్షణానికి విభిన్నంగా వున్నాయని భావించి నరసింహ కవి సహజంగా రచించిన ఆటవెలదులను, తమ భాష నుపయోగించి పరిష్కరణలో తేటగీతులుగా మార్చివేయడంజరిగింది. నరసింహకవి సహజంగా ఆటవెలదులనురచించి వాటిని గీతాలుగాపేర్కొనవచ్చునన్న అభిప్రాయంతో సలక్షణంగా పేర్కొన్నాడన్న విషయాన్ని గుర్తించకపోవడంవల్ల గీతి భేదాలలో ఆటవెలది వొకటన్నసంగతి గమనించనందువల్ల పొరపాటుగా నరసింహకవి పద్యాలను కొన్నింటిని సవరించి వేయడం జరిగింది. అయితే పరిష్కృతమైన నారదీయపురాణాన్ని మూలప్రతితో సరిపోల్చిచూచి నేను పునఃపరిష్కరణ కావించిన సందర్భంలో నరసింహకవి సహజ రచనలైన ఆటవెలదులను యథాతథంగానే వుంచడంజరిగింది. నరసింహకవి కల్యాణ తీర్థమహిమ - సుచరితుని కథను వర్ణిస్తూ మొదట సీసపద్యం వ్రాసి, సీసంలో తేట గీతిని విశిష్టంగా పంచపాదిగా రచించాడు. (నార. 112 పు. 94 ప.)

మహామథన సారామృతం

మామూలుగా మనం గద్యమన్నా, వచనమన్నా ఒకటేననుకుంటాము. రెండింటినీ పర్యాయపదాలుగా సైతం భావిస్తాము. సంస్కృతంలో సైతం యీ అభిప్రాయమేవున్నా సంస్కృతాంధ్రాలలో రెండింటా ఒకానొక పదబంధశయ్యా విశిష్టమైన వచన రచనను ప్రత్యేకించి గద్యగా పేర్కొనడం ప్రాచీనకాలంనుంచీవున్నది. నిజానికి చెప్పాలంటే వచనమన్నా గద్యమన్నా ఒకటేకాబట్టి సంస్కృతంలో శాకుంతలాది నాటకాలలోవున్న సంభాషణా రూపాలైన వచనాలను, వాక్యాలను గద్యాలనవలసి వుంటుంది. దశకుమారచరిత్ర, కాదంబరివంటి విశిష్ట గద్య కావ్యాలలోని గద్యాన్ని మనం మామూలుగా గద్యమని అంటాముకాని వచనమనికూడా పేర్కొనవలసి వుంటుంది. అదే తెలుగులో మామూలుగా గ్రాంధిక నాటకాలలోవుండే వచనాన్ని, చిన్నయసూరి నీతిచంద్రికలో ఉపయోగించిన విశిష్టపదగుంభనాశయ్యా భరితమైన రచననూ వచనమే అని మననుకుంటున్నా రెండింటిలోని భిన్నత్వాన్ని, వైశిష్ట్యాన్ని మనం గుర్తించలేకపోము. శివకవిగా ప్రసిద్ధికాంచిన పాల్కురికి సోమన ఒకానొక వైశిష్ట్యంగల వివిధ గద్యలను రచించాడు. నిజానికివి వచనరచనలే అయినా ఒక ప్రత్యేకతగల గద్యలుగా పేర్కొనబడడమేగాక సాహిత్యవేత్తలచేత పరిగణింపబడ్డాయి కూడా. ప్లవనామ సంవత్సరం ఉగాదినాడు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంవారు యేర్పాటుచేసిన "నాకు నచ్చిన వచన శైలి" అన్న విద్వద్గోష్ఠిలో గద్య, వచనాల విభిన్నత్వాన్ని, విశిష్టత్వాన్ని గురించి నేను విపులంగా ప్రసంగించాను. ఎంతటి పదబంధశయ్యాభరితమైన గద్యమైనా "బసవాంకగద్య" "శివాంక గద్య" "సాంబాంకగద్య" వంటి నామాలతో వ్యవహరించినట్లే "బసవాంక వచనం" "శివాంకవచనం" "సాంబాంకవచనం" వంటి వచన శబ్ద ప్రయోగాలతో కూడా గద్యలను వచనాలుగా పేర్కొనవచ్చును. అయినప్పటికీ జటిలపద సంభరితమై కూడా సమాస భూయిష్టమైన వచనాన్ని వచనమనడంకంటే గద్య మనడమే ప్రసిద్ధంగా వున్నది. ప్రత్యేకించి ఆశ్వాసాంతంలో ఉపయోగించే వచనాన్ని అది నిజానికి వచనమే అయినా దాన్ని యెవ్వరూ కూడా ఆశ్వాసాంత వచనంగా వ్యవహరించలేదు సరికదా, ఆశ్వాసాంత గద్యంగా మాత్రమే అతి ప్రాచీన కాలంనుంచి వ్యవహరించడం జరుగుతూ వచ్చింది. నారదీయపురాణంలో నరసింహకవి సైతం చిన్న పెద్ద వచనాలను పెక్కింటిని రచించాడు. కాని సనకాదులు యితర దేవతలు శ్రీమన్నారాయణుని నుతించిన సందర్భంలో నరసింహకవి గద్యము పేరుతో విశిష్ట సమాస భూయిష్టమైన గద్యాన్ని రచించాడు. (నార. 381. 382. పు. 259. గద్యము). నారదీయపురాణం మొత్తంలో వున్న యితర వచనాలకూ, యీ గద్యానికి రచనా విధానంలో హస్తిమశకాంతరం మనకు కనిపిస్తున్నది. వాస్తవానికి గద్య, వచన శబ్దాలు పర్యాయపదాలే అయినా రచనాపరంగా కొన్ని కొన్ని సందర్భాలలో గద్యం

ఒకానొక విశిష్టస్థానం సంపాదించింది. ఈ విశిష్టత ఆశ్వాసాంతాలలో గద్యంగా మాత్రమే పేర్కొనబడడంద్వారా మరింత దృఢపరచుకొన్నది.

ఛందశ్శాస్త్రవేత్త అయిన నరసింహాకవి మామూలు యతిప్రాసలనే కాక కవులు అరుదుగావాడే వృద్ధియతి, ఉభయయతులను, అభేదయతులను కూడా ప్రయోగించాడు.

"ఆజాను బాహులు నీలాంబుదనిభదేహులు
గౌస్తుభాభరణు లోకైకశరణు." (నార. 46 పు. 248 ప.)

ఈ సందర్భంలో లోకైకశబ్దంలో వృద్ధియతిక్రింద 'కై'లోని 'ఐ' కారానికి 'ఏక' లోని 'ఏ' కారానికి రెండచ్చులకూ యతి వేయవచ్చును. ఉభయయతి పేరుమీద అజ్ఝల్లులకు రెండింటికీ యతివేయవచ్చును. కాగా నరసింహాకవి "గౌస్తుభా" అన్నప్పుడు 'గౌ' కారానికి 'లోకైక' అన్నప్పుడు 'కై' కారానికి స్వరమైత్రియుక్తాలైన హల్లులకు వర్గవృద్ధ్యుభయయతిగా యతిని ప్రయోగించాడు. ఈ క్రింది పద్యంలో చివరి పాదంలో 'డ,ద'ల అభేదమైత్రినిపాటించి విశిష్టమైన అఖండయతినిసైతం నరసింహాకవి ప్రయోగించాడు.

"హరిభక్తిసమేతులఁగని
ధరలోపల శంఖచక్రధారణ ముసఖాం
వరముల నిందించినవాఁ
డరయఁగఁ బాషండులండ్రు రాజన్యవరుల్. (నార. 145 పు. 248.ప.)

నారదీయపురాణం 30 పు. 162 ప, పద్యమైన "సొగసుగా పింఛంబు" ఇత్యాది సీస పద్యంలో

"తళుకు బంగరు చీరగట్టించి గళమున
నవరత్నహారముల్ వైచివైచి"

అన్న మూడవపాదంలో "గట్టించి" అని ముద్రింపబడి యతితప్పినది అని ఫుట్‌నోట్‌లో పేర్కొనడం జరిగింది. వాస్తవానికిక్కడ నరసింహాకవిచేత ప్రయుక్తమైనపదం గట్టించికాక, ఘట్టించిగా కనిపిస్తున్నది. కాగా యతిదోషంలేదని గ్రహించాలి. ఇదేవిధంగా ఉపపాదంలో వైచివైచి అని ప్రయోగించడంద్వారా యతిలోపం పేర్కొనబడింది. కాని నవచి నవచి అని కవిహృదయంగా ప్రయుక్తమైనట్లు కనిపిస్తున్నది.

నారదీయపురాణం 34. పుట 108. సీసపద్యంక్రిది తేటగీతి ప్రథమపాదం "హస్తములఁబట్టి బిరబిరఁ ద్రిప్పి యార్చి" అని ముద్రితమై యతిభంగం జరిగినట్లు

కనిపిస్తున్నది. కాని వాస్తవానికి నరసింహాకవి ఆ పాదాన్ని హస్తములఁబట్టి బిరబిర నార్చి త్రిప్పి అని రచించివుంటాడని ప్రతివ్రాసిన వ్యక్తి పొరపాటున మాటలను ముందు వెనుకలుగా మార్చి వ్రాశాడని భావించవలసివున్నది.

నరసింహాకవి కొన్ని సందర్భాలలో అసాధారణమై ప్రాచీనకవులచేత సత్కృత్తులుగా ప్రయోగించబడి లాక్షణికులు గుర్తించనటువంటి కేవలస్వరయతిని కూడా ప్రయోగించాడు.

> "తరులతాకుంజఖగ మృగతతుల నడిగి
> గగన భూవారి పవనతేజో౽ంతరముల." (నార. 31. పు. 169.ప.)

ఈ పై తేటగీతిలోని రెండవపాదంలో గగన శబ్దగతమైన తొలి 'గ' కారంలోని 'అ'కారానికి "తేజో౽ంతర" అన్నప్పుడు పూర్వ రూపసంధిలో గూఢమైవున్న 'అంతర' శబ్దంలోని 'అ' కారానికి కేవల స్వరయతిగా విశేషయతి ప్రయోగం చేయబడింది.

నారదీయపురాణం 100వ, పుట 35 వ, పద్యమయిన సీసంలోని యీ క్రింది రెండవపాదంలో

> "అన్యగాథలు మాని నారాయణుని నభో
> భ్యంతరాళమున గానం బొనర్ప"

నభోభ్యంత అన్నప్పుడు 'భ్య'లోని 'య'కారానికి'గానం' అన్నప్పుడు 'న' వర్ణంలోని 'అ' కారానికి కేవలస్వరయతి ప్రయోగించబడింది. ఈ సందర్భంలో అభ్యంతరశబ్దాన్ని 'అభి + అంతర' అని విభజించినప్పటికి కూడా ఉపసర్గయతి దృష్ట్యా 'అంతర' లోని అకారస్వరానికి యతివేశాడని అనుకొన్నా 'న' వర్ణంలోని కేవల అకారస్వరానికి మాత్రమే యతిమైత్రిని పాటించాడని మనం ఆమోదించకతప్పదు.

> "అలఘులు వీతరాగులు – – – – – – – – – – –లా
> జలుగొన – – – – – – – – – – – – – – – – – – వై
> ద్యులువలె భూమిఁద్రిమ్మరుచుఁ బూర్ణదయాగుణవారిరాసులై.
> (నార.376.పు.240.ప.)

అన్న చంపకమాలలో మూడవపాదంలో యతిమైత్రిలో 'ద' కార 'బ' కారాలకు అసలు సంబంధం లేనేలేదు. "ద్యు"లోని 'యు'వర్ణానికో 'ఉ'స్వరానికో "బూ" లోని 'ఊ'కారంతో కేవలస్వరయతిని నరసింహాకవి ప్రయోగించాడని మనం విస్పష్టంగా గుర్తించవలసి వున్నది. ఇదే విధంగా యీ క్రింది తేటగీతి మూడవపాదంలో,

వాఙ్మయ మహాధ్యక్షుని

"కాన గోవింద మాహాత్మ్య కథలయందు
నిరుపమానంద మొంది వర్ణించి సన్ను
తించి నర్తించినట్టి యా నియమపరుఁడు
పరమభక్తుండు ఘనుఁడు సద్భాగవతుఁడు. (నార.453.పు.41.ప.)

"సన్నుతించి" శబ్దంలోవున్న 'ఇంచుక్'లోని 'ఇ'కారానికి 'నియమ'శబ్దంలోని 'ని' వర్ణగతమైన 'ఇ'కారానికి కేవల స్వరయతిని పాటించాడు. ఒకవేళ యిక్కడ నరసింహకవి కేవలస్వరయతిని ప్రయోగించలేదని అనుకున్నా అగ్రాహ్యావళులుగా కొందరు లాక్షణికులు తిరస్కరించిన "త-న" లమైత్రిని నరసింహకవి ఆమోదించి ప్రయోగించాడని మనం అంగీకరించవలసివస్తుంది. ఈ కేవల స్వరయతిని ప్రాచీన కాలంలో కొందరు ప్రామాణికులైన కవులు సకృత్తుగా ప్రయోగించారు. 1950—1951 సంవత్సరాలలో "అప్పకవీయ వివరణ విమర్శనాలేశము" అన్న శీర్షికతో "త్రిలిఙ్గ" వార పత్రికలో నేను వ్రాసిన వ్యాసపరంపరలోని 24వ వ్యాసంలో ఈ కేవలస్వరయతినిగూర్చి చర్చిస్తూ శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో (ప్ర. ఆ. 69. ప) కేవల స్వరయతిని ప్రయోగించాడని యీ క్రింది పద్యాన్ని ప్రమాణంగా ఉదాహరించాను.

"చాలదళంబుగాఁ బృథుల చంపకకీలనఁ బొల్చుబొందుఁడో
మాలెలనంగఁబండి మహిమండలిఁ జీఱుచు వ్రాలి గ్రంథమూ
ర్చాలసమైన భృంగతతి నాఁ దుద కప్పమకన్ఫలావళు
ల్వ్రీలి గెలల్సుగంధి కదళీవనపఙ్క్తులనొప్పు నప్పురిన్.

పై పద్యంలో మూడవపాదంలో 'మూర్చాలస' అన్నప్పుడు "అలస" శబ్దంలోని అకారానికి "నాన్" అన్నప్పుడు 'నా'కారంలోవున్న "ఆ"కారానికి కేవలస్వరయతిని వేయడం జరిగింది. వాస్తవానికి 'అనన్'అనే అన్నంత క్రియమీద 'నాన్' అనే రూపం రూపొందినప్పటికి లాక్షణికంగా "నాన్"లోని స్వరసహితమైన "నా" వర్ణానికే యతి వేయవలసివున్నదికాని'నా'లోని "ఆ"కారానికి స్వరయతిని వేయడం లాక్షణికం కానేరదు. కాగా యీ సందర్భంలో కృష్ణదేవరాయలు కేవల స్వరయతిని పాటించి ప్రయోగించాడని మనం ఆమోదించకతప్పదు. కరుణశ్రీ శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి సంపాదకత్వాన గుంటూరునుండి వెలువడిన "సుభాషిణి" మాసపత్రికలో 1951లో నేను అనంతుని ఛందస్సుపై వ్రాసిన పరిశోధనాత్మకాలైన విమర్శా వ్యాసాలలోసైతం యీ కేవలస్వరయతి ప్రయోగంగురించి సప్రామాణికంగా, సోదాహరణంగా చర్చించివున్నాను. ఇంతకూ యీ సందర్భంలో నేను పేర్కొనేదేమంటే కొన్ని పద్యాలలో నరసింహకవి ఉపయోగించిన కేవల స్వరయతి వినూతనమైందేమీకాదనీ ప్రాచీనప్రామాణిక కవులచేత ప్రయుక్తమైనదేనని మాత్రమే.

మహామథన సారామృతం

శివకవులు తదితర ప్రామాణిక కవులు రేఫయుక్తమైన అక్షరాలకూ రేఫ విరహితాలైన అక్షరాలకూ ప్రాసమైత్రిని పాటించారు. నరసింహాకవి యీ క్రింది సీసపద్యంలోని తేటగీతి మొదటిపాదంలో "వర్తిలుచుఁ గోటిసూర్య విస్ఫురితకోటి" (నార.369.పు.210.ప.) "వర్తి" అన్నప్పుడు వర్తిలోని "ర్తి" వర్ణానికి "స్ఫురిత" లోని "రి"వర్ణానికి సంయుతా సంయుత ప్రాసయతిని విశిష్టంగా పాటించాడు. ప్రాచీనకవులు సంయుతాసంయుత ప్రాసలో రేఫసహిత రహితత్వాలకే ప్రాధాన్యం యివ్వగా నరసింహాకవిమాత్రం రేఫస్థితిని యథాతథంగానే ఉంచి రేఫభిన్నమైన ఇతర హల్ విరహితంగా సంయుతాసంయుత ప్రాసను విశేషంగా ప్రయోగించాడు.

## ఉపసంహారం

నరసింహాకవి విరచించిన యీ నారదీయపురాణం అసలు సంస్కృత మూల పురాణానికిగాని, ఉపపురాణానికిగాని సరియైన అనువాదమని సాధికారికంగా చెప్పే అవకాశంలేదని గతంలోనే మనం గుర్తించాము. అయినా నరసింహాకవి విశిష్ట ప్రతిభాసంపన్నవంతమై బహుముఖ కవితావైభవంతో విరాజిల్లే యీ నారదీయ పురాణం ఆంధ్రవాఙ్మయంలో ప్రత్యేకస్థానం వహించుతుందనడంలో యేమాత్రమూ సందేహంలేదు. ఇంక దేవర్షిగా, త్రికాలజ్ఞుడుగా, త్రిలోకసంచారిగా, అపరజగన్నాటకసూత్రధారిగా, ఆచంద్రతారార్కుడై నిలిచిన నారదునివల్ల ప్రోక్తమై అవతరించిన నారదీయ పురాణకృతికి ప్రతికృతిగా అలవోకగా ఆవిష్కృతమై వెలసిన నరసింహాకవి తెలుగు నారదీయపురాణంలోని రవిశశి తేజోమయ నేత్ర సంకలితుడై, శంఖ చక్ర గదా శార్ఙ్గపాణియై, కౌస్తుభమణి శ్రీవక్షస్థల హృదయుడై, మహారాజఫణిశాయిగా, సృష్టి స్థితి సత్య శ్రీమహావిభుడై, అసాధారణ, అపూర్వ, అమేయ జయశ్రీ సంశోభితుడై నిరంతర నిర్వికార నిరంజనరూపుడై విరాజిల్లే జగన్నాటక సూత్రధారియైన ఆ శ్రీ మహావిష్ణుదేవుని శక్తిమత్తత్వ బోధాత్మకమైన అమృతరసాన్ని ఆస్వాదనంచేసి తరింతురుగాక.

ఇట్లు

అఫ్‌జల్‌గంజ్,
హైదరాబాదు.
1-11-1976.

వాఙ్మయ మహాధ్యక్ష
డాక్టర్. వడ్లమూడి గోపాలకృష్ణయ్య
కళా-ప్రపూర్ణ
డైరెక్టర్
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్
లైబ్రరీ అండ్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్.

వాఙ్మయ మహాధ్యక్షుని మహామథన సారామృతం

# నారదీయపురాణము

## ప్రథమాశ్వాసము

### ఇష్టదేవతాస్తుత్యాదికము

శా. శ్రీమైనుండు యువాంబుదంబు యమునా సింధూర్మి గాహోర్థమై
భూమింజెంది నిజాప్తబంధువయి యొప్పంగేకి భవ్యాంగమున్
దామౌళిం ధరియించెనోయన శిఖోత్తం సత్కలాపాంకుఁడై
శ్యామాత్యంత మనోజ్ఞమూర్తియగు కృష్ణస్వామి నన్నేలుతన్. 1

ఉ. సేవతటిన్ బ్రియాంఘ్రి సరసీజము హస్తమునందలిర్పఁగా
యౌవనరూప విభ్రమ దయాది గుణాంబుధియై నిజేందిరా
భావము నెయ్యపుంజెలుల భావమునన్ బ్రకటించు రుక్మిణీ
దేవి యొనర్పుఁగావుత మదీయ మనోగృహపాళిఁ గేళికల్. 2

ఉ. భాషితసార సౌరభ మపారముగా వెదచల్లుచున్ జగ
త్పోషక శేషిదంపతులు దూఁగ నతాంత లతాంతదోలికా
వేషమునన్ సుధోర్మ్య నిలవృత్తి వశంబునఁ బొంగి సోలునా
శేషుఁ డశేషవాఙ్మయ విశేషము లీవుత మాకజస్రమున్. 3

మ. వరలావణ్య విలాసరూపమును సర్వజ్ఞత్వమున్ దారకా
వరతేజో లసమాన [1]వక్త్రమును సేవా సన్నదాసావళీ
వరదాన ప్రతిభా విశేషమును తేవంగల్గి [2]వేడ్కందు త
ద్వరచింతామణి శౌరిపూన్గొని మదాత్మన్ వేగఁ దా [3]నిల్చుతన్. 4

మ. అతితేజోనిధులైన యా ద్విరదవక్త్రాద్యుల్ సువిద్యుల్ శత
క్రతు లత్యూర్జితభక్తిఁ గొల్వఁగ జగ [4]త్కధ్యాంతరాయంబుల
ద్భుతశక్తిన్ విరియించి మించిన జగత్ప్రాజ్యోదయుండైన య
చ్యుత సేనాని నిరంతరాంచిత శుభాభ్యుత్సాహమున్ జేయుతన్. 5

---

1. వక్రము.
2. వేడ్కంబి.
3. నిల్వుతన్.
4. త్కధ్వాంత.

మ. ప్రణతాత్మానుజనైకరక్షణ విలంబ ప్రాసహత్వంబు స
ద్గుణు లీక్షింపఁగఁజూపుకై వడి ముకుందుం డాత్మహస్తంబులన్
బ్రణుతస్ఫూర్తి వహింపఁగా వెలయు తత్పంచాయుధిం గొల్తుఁగా
రణమై నిత్యశుభంబు లిచ్చి నను సంరక్షింప నేవేళయున్. 6

సీ. ధరణివేదంబులు ద్రావిడంబుగఁ జేయు
శ్రీ పరాంకుశయోగి శేఖరులను
సకల సమ్మత మతస్థాపకుండైన శ్రీ
భాష్యకారుల రంగపతికినున్న
తావరణములు దివ్యారామమునొనర్చు
ఘనుల, గోదాహ్వయ కన్యనొసఁగు
యతిశిఖామణి, నిటలాక్షుఁ బాదాక్షిచేఁ
దర్జించు గురుకులోత్తంసు నియమ
తే. గీ. పరుల భూతసరో మహద్భట్టినాథ
ముఖ్యులగువారి నాళ్వారి మున్నవారి
తోత్సవంబున సేవించి యోగ్యతాభి
రామమూర్తుల వైష్ణవాగ్రణులఁ గొలుతు. 7

ఆ. వె. రామకృష్ణకీర్తి రత్న శాణనికష
కల్పితోక్తులయిన ఘనులఁ బుణ్య
తనుల మాన్యసత్యతనుల వాల్మీకి ప
రాశ రాత్మబవులఁ బ్రస్తుతింతు. 8

చ. హౌరిఁ బౌరిఁ గాళిదాస భవభూతి మురారి మయూర బాణశం
కర జయదేవ మాఘముఖ కావ్యల భవ్యల సంస్కృతోక్తి బం
ధురరచనా ధురంధరులఁ దోయజ మిత్రసమాన మూర్తులన్
సరసుల లక్షణజ్ఞులఁ బ్రసంగ గుణజ్ఞుల సన్నుతించెదన్. 9

ఉ. ఎన్నిక భారతీయ కథలెల్ల సమంచిత గోస్తనీరసా
చ్ఛిన్నధునీ ఝురంబులుగఁ జిత్రముగా రచియించి లోకముల్
సన్నుతిసేయ నాంధ్రపద చాతురినిల్పిన సత్కవీంద్రులన్
నన్నయభట్టుఁ దిక్క కవినాథుని నెఱ్ఱనమంత్రిఁ గొల్చెదన్. 10

క. అకలంక దివ్యతేజో
నికర సముజ్జృంభి సుకవినిచయార్క శ్రీ
[1]ప్రకరము నెదుటను నిలుచునె
కుకవి జనానీక ఘోర ఘూకోత్కరముల్. 11

వ. అని యిష్టదేవతా ప్రార్థనంబును శిష్ట కవిస్తోత్రంబును దుష్టకవి నిరాకర
ణంబునుం గావించి. 12

## కవివంశ వర్ణన

శా. శ్రీమద్వేదమయాంగు శోభనకళా శృంగార లీలామహో
ద్దాముణ్ శ్రీరమణీ మనోహర హయోత్తంసంబు, సమ్యక్పురా
ణామోఘార్థ శుభాంజనంబుఁ బతగాధ్యక్షోత్తముంగన్న యా
ధీమద్గ్రామణి కశ్యపాహ్వయుఁడు కీర్తిణ్మించె లోకంబులణ్ . 13

వ. తద్వంశంబున. 14

క. కరుణాకర మంత్రీంద్రుఁడు
కరుణా వరుణాలయుండు గంభీరుండా
తరుణార్క దివ్యతేజుం
డరుణానుజ రాజరాజితాత్ముఁడు గలిగెణ్. 15

తే. గీ. ఆ మహామహుభార్య విఖ్యాతచర్య
సార గుణధుర్యయైన నాంచారు చారు
భాగ్య సౌభాగ్యకీర్తి యా పద్మసద్మ
సద్మముననుండి కావించె సద్వ్రతముల. 16

సీ. రామానుజాచార్య రత్న కల్పితచతు
స్సింహాసనస్థుసుశ్రీభజించి
యుభయ వేదాంత మహోన్నత సాత్వికా
చార లక్షణ సత్ప్రశస్తిఁ గాంచి
శ్రీకృష్ణపూజా విశేష లబ్ధసమస్త
సౌశీల్య గరిమచేఁ జాలమించి
ప్రాక్తన దివ్య ప్రబంధాను సంధాన
సంతత మహిమఁ దేజమువహించి

---

1. ప్రకరుల యెదుటను.

తే. గీ. వెలసె వైష్ణవ మాత్రుఁడే విబుధకోటి
యాశ్రయింపంగ సద్భక్తి నాదరించె
సిరుల నల్లాడు చెన్నప్ప శ్రీకరపు
భావ భావుకకీర్తి ప్రపన్నమూర్తి. 17

క. మా జనకుఁడు చెన్నప్ప ర
మాజనక గభీరతా సమగ్రతమించెన్
రాజోత్తములన్ వైష్ణవ
రాజోత్తములన్ నుతింపఁ బ్రజ్ఞాశక్తిన్. 18

ఉ. అంబకుజోడు పంచవి శిఖాంబకుజోడు విదేహరాజ జా
తాంబకుజోడు సాయక శయాంబకుజోడు పతంగలోక రా
జాంబకుజోడు మజ్జననియై భువనంబుల మించినట్టి కృ
ష్ణాంబ గుణావలంబ విబుధావళి నేలు భళీ భళీయనన్. 19

సీ. లక్ష్మి సమాఖ్యయౌ లలనతో గృహమేధి
భావంబుచేఁ జాలఁ బ్రబలినాఁడఁ
గవితవైభవులు సింగన్న యనంతుండు
నాదిగాఁ బుత్రుల నంది నాఁడ
శోభితాపస్తంబ సూత్ర పవిత్ర కీ
ర్తిస్ఫూర్తిచేత వర్తిల్లినాఁడ
నఖిల వైష్ణవరహస్యార్థోపదేశంబు
లనుపమ భక్తిమై నందినాఁడ
తే. గీ. నంద నందన పూజ నానందవార్ధి
నోలలాడుచు సద్గోష్ఠి నున్నవాఁడ
సూరి మాన్యుండ నల్లాడు నారసింహ
నామకుఁడ సంతతగురు ప్రణామకుండ 20

సీ. ఏదేశికాధీశుఁ డిద్ధ బుద్ధిస్ఫూర్తి
బ్రహ్మరాక్షసుల శాపంబణంచె
నేదేశికోత్తముఁ డెదిరించి నిలిచిన
శక్తికి చక్రాంక శక్తియొసఁగె
నేదేశికాధ్యక్షుఁడేకశిలాపురి
నిజ మతంబంతయు నిర్వహించె
నేదేశికశ్రేష్ఠుఁ డాదిమై రామాను
జాచార్య విజయధ్వజాంకమయ్యె

తే. గీ. నతఁడు వైష్ణవ వీర సింహాసనస్థుఁ
డుభయ వేదాంత విద్యామహోన్నతుండు
శుద్ధ సాత్త్విక ధర్మ ప్రసిద్ధకీర్తి
శాలి [1]కంచెర్ల కేశవాచార్య మౌళి. 21

22
వ. తద్వంశంబున.

మ. సిరులన్ సద్గురు శేఖరుండనఁగ మించెన్ గొండమాచార్యుఁ డా
హరియే యీఘనుఁ డంచు శిష్యవరు లాత్మాయత్తులై కొల్వఁగా
వర వేదాంత రహస్యవేదియు భరద్వాజర్షి గోత్రాబ్ధి భా
సుర శీతాంశుఁడునై ప్రసిద్ధివెలసెన్ సూరులే ప్రశంసింపఁగన్. 23

వ. ఆ మహా గురుశిఖామణి యొక్కనాఁడు స్వప్నంబున నన్నుఁగరుణించి
నారదీయ సాత్త్విక పురాణంబు లోకోపకారార్థంబుగా నాంధ్రభాష
రచించి శ్రీకృష్ణాంకితంబు సేయుమని యానతిచ్చిన మేల్కాంచి కృష్ణ
భగవంతుని మనంబున నిడుకొని రచియింపంబూనితిఁ దదవతారక్రమం
బెట్టిదనిన. 24

## మధురాపుర వర్ణన

సీ. శ్రీ రాజవశ్యమై శ్రీ రాజవశ్యమై
యఖిలలోకముల విఖ్యాతిఁ గాంచి
కల్యాణధామమై కల్యాణధామమై
యఖిలలోకముల విఖ్యాతిఁ గాంచి
సుమనోభిరామమై సుమనోభిరామమై
యఖిలలోకముల విఖ్యాతిఁ గాంచి
సత్కళాపూర్ణమై సత్కళాపూర్ణమై
యఖిలలోకముల విఖ్యాతిఁ గాంచి
తే. గీ. ప్రబలెఁ బ్రాంతాభ్ర శుభ్రతరంగిణీత
రంగ రంగన్మహాఫేన రాజిరాజి
తాజరపయస్సుధాలేప నాంచితోచ్చ
గోపుర శ్రీలనగు మధురాపురంబు. 25

తే. గీ. [1]పరిఖయాదిమ కచ్ఛప భరణమగుట
సాలమ్రభ గజోదార సారమగుటఁ
బ్రబలి తత్పురి గజకచ్ఛపప్రహారి
కన్న సేమం బొసంగదే కనకమున్న. 26

తే. గీ. తద్రమాకాంతతోడ నా ధరణికాంత
కవిత నిజరత్న మేఖలగానుఁ[2]పింప
నంచిత శ్రీలు ముచ్చట లాడినట్లు
పరిఖయును కోటయునుమించె సిరులనందు. 27

క. మెండై యమరావతికిన్
భాండాగారంబువోలెఁ బ్రబలంబై బ్ర
హ్మాండమున వెలసె నప్పురి
నిండిన నవరత్న పూర్ణనిధులు చెలంగన్. 28

తే. గీ. తతమదస్ఫూర్తి నైరావతం బుదగ్ర
విగ్రహంబున నెదిరి గర్వించెనేని
తదురు సప్తాంగ హరణముద్ధతి నొనర్చి
తనరవేయందు భద్రదంతావళములు. 29

తే. గీ. [3]జలధిలో ధారలొత్తు నుచ్చైశ్రవంబు
బలగుణాఢ్యంబె కఠిన సాపత్న్యగర్వ
కలిత సంగర వినుతాధిక ప్రతార
ణాంకము వహించెననుఁ దదీయ హయచయము. 30

తే. గీ. నలువ మాకంటె ఘనుఁ డె యామ్నాయశక్తి
నేకవచనంబు వరబుద్ధి నెఱుఁగుఁ గాని
యుభయ వచన ప్రకాశక యుక్తియెఱుఁగఁ
డనుచు నవ్వీటఁ బ్రహసింతు రవనిసురులు. 31

క. పేరైయుందురు వైభవ
శూరత్వము పూర్ణదాన శూరత్వము ధీ
శూరత్వము రణధరణీ
శూరత్వము గలిగి రాజసుతులవ్వీటన్. 32

---

1. పరిఘ.
2. పించ.
3. జలధిలో దారవొత్తుఉచ్చైశ్రవంబు.

తే. గీ. అర్థవంతుండు దావిషమాక్షగోష్ఠి
సలిపె సంపన్నుఁ డగునె యీ జగతిననుచు
యక్షనాయకు నవ్వదు చప్పురమున
భవ్యనవ్యార్థధుర్యులా రవ్యవరులు. 33

తే. గీ. హస్తిపుర భేదనోగ్ర బాహాగ్ర జాగ్ర
దాగ్రహులు బహుభోగ భాగ్యాభిరాము
లధికబల శౌర్య సంపన్ను లతులకీర్తి
హారులవ్వీటి శూద్రులత్యంతఘనులు. 34

## శ్రీకృష్ణజననము

ఆ. వె. అతులశక్తినుండె నామధురాపురి
శూరసేనుఁ డనఁగ శూరసేనుఁ
డా దురంధరుండు మాధురశూరసే
నములు జనపదంబు లమరనేలె. 35

క. వసుదేవుఁ డతని పుత్రుఁడు
వసుదేవుఁడు వెలసె భోగవైభవలీలన్
వసుధాంతరమున ననుపమ
వసుధాన్యశ్రీసమృద్ధి వైచిత్రముగన్. 36

వ. దుష్టరాజన్య పీడితయై ధరణిగోరూపంబుఁదాల్చిన దాది గోరూపంబం
తయు విన్నవించినఁ బద్మజుండు పద్మనాభు కడకునేఁగి ప్రార్థించిన
యదుకులంబున జనియించి కంసాదుల శిక్షించెదనని శౌరి యానతి
యిచ్చిన విధాత సత్యలోకంబునకుం జనియెనంత నుగ్రసేన తనయుం
డగు కంసుం డా దేవకునకుం దనూజయగు దేవకి నవ్వసుదేవునకు
వివాహంబుచేసి తద్వధూవరుల నరదంబు మీద నిడుకొని పంపునప్పు
డాకాశవాణి యిట్లనియె. తదష్టమగర్భ సంభవుండు భవద్విరోధి యనిన
భయంబంది దేవకీ వసుదేవుల నిజ గేహంబుననుంచె నంత సప్తమ
గర్భంబున నుదయించిన కుమారుండు. 37

క. రాముఁడు శిశిరద్యుత్యభి
రాముఁడు శేషావతార రమణీయకళా
రాముఁడు గర్వితవైరివి
రాముఁడు రోహిణికి తనయ రత్నంబైనన్. 38

వ. అంత దేవకీదేవి యెనిమిదవ గర్భంబు వహించెనప్పుడు. 39

మ. పరితస్స్వన్న ముఖాంబు జాతము గిరిప్రాయీ భవత్సమ్మిళ
త్తరళోరోజ మనేక సంగ్రధిక హృత్కామంబు కేలీ సఖీ
సరసాలాప విధానము స్మృఖ నిజాంచద్భాగధేయంబు త
త్తరుణీరత్నము పూర్ణగర్భమతి చిత్రంబయ్యె నీక్షింపఁగన్. 40

ఆ. వె. యదుకులోద్వహుఁడు నిజాత్మనుండఁగఁ బాండు
జాతరుచి వహించె నాతిమోము
గరిమధార్తరాష్ట్ర గతివిశేషంబులు
నడకఁ గొంచెపఱచె నాఁట నాఁట. 41

క. తనువుం బ్రాణమునై యా
ఘనుఁడు జగద్వ్యాపి గర్భగతుఁడై యుండన్
దనువు తనువగుట చిత్రమె
తనువయ్యె విభూషణాలి తరళేక్షణకున్. 42

తే. గీ. మేఘములు నిల్చెఁ గొండల మీఁద ననఁగ
నాతికిని చూచుకంబులు నల్లనయ్యె
ఫలము దీపింప నలసాస్య పాండిమంబు
చిత్రమై కానుపించుచుఁ జెలువుచూప. 43

క. ఆరయ నానాభీగం
భీరతఁ దూలించునట్టి బిరుదు మగఁడు దు
ర్వారత నానాభీ గం
భీరత గర్భస్థుఁడగుచుఁ బెట్టుహరించెన్. 44

వ. ఒకనాఁడు దేవకి నెచ్చెలింజూచి ముచ్చటలన్ మెఱయ. 45

సీ. తెల్లని జడదారి దిట్టయై నడురేయి
తమిరేఁగి హెచ్చు గీతములు [1]వాడెఁ
దెరగంటి బోటులు దివినుండి యరుదెంచి
చెలఁగుచు ముందటఁ జిందులాడి

1. వాఁడె (సానుస్వారము).

రొగినాల్గు మోముల యొజ్జబాపఁడువచ్చి
గొదగొని యంటువోఁ జదివిపోయె
వలికె నెక్కిన బేసియలుఁగు జేజే దొర
వింతగాఁ గొంత దీవించి చనియె
తే. గీ. నుబ్బు మెఱయంగ ఖగరాగ యొర్తువచ్చి
తమ్మి కెంగేలఁ ద్రిప్పుచు నెమ్మెచూపి
యేకతంబున గర్భస్థు నేమిచేసి
[1]యేగెనోకాని యంతట నెఱుఁగనైతి. 46

క. నికటమునఁ గార్ముకముతో
నొక నల్లనిమేని మేటియువిదయుఁదానుఁ
వికవిక నవ్వుచు వరబా
లకుఁడై యుండంగఁ జూచు లాభముఁ గంటిఁ. 47

వ. [2]అక్కట రాత్రి నాకొదవిన యివ్విధంబు కలవలె నున్నది కాని
నిక్కంబయని మహోల్లాసంబుగాఁ బలికి. 48

సీ. రవిసింహముననుండ శ్రావణ కృష్ణాష్ట
మీ నిశీథమున మేలైనరోహి
ణీ తారయందు నెన్నిక గ్రహపంచకం
బుచ్చస్థమైయుండ యోగిజనులు
బ్రహ్మాది నిర్జర ప్రవరులు గొనియాడ
శంఖ చక్ర గదాసి శార్ఙ్గరమ్య
బాహాచతుష్టయ ప్రకట మాణిక్య కి
రీట కుండల శుభశ్రీలు దనరఁ
తే. గీ. గౌస్తుభా భరణము ఫుల్ల కమలలోచ
నములు పీతాంబరము నూపురములు గాంచి
కాంగదంబులు నూత్న నీలాభ్రరుచియు
గల కుమారుని దేవకి గనియెనంత. 49

1. యేఁగె (సానుస్వారము).
2. నిక్కట.

క. అప్పుడు వసుదేవుఁడు సుతుఁ
దప్పక వీక్షించి కన్నుఁ దమ్ములనశ్రుల్
చిప్పిల్ల హర్షగద్గద
మొప్పమెఱయ మేనఁ బులక లొదవం బలికెన్. 50

క. అజరుద్రాదులకైనను
భజియింపఁగ రాని నీదు పావన చరణాం
బుజ యుగళిఁ గంటి నీశ్వర !
గజవరద ! ముకుంద ! కృష్ణ ! కమలాధీశా ! 51

వ. అని పలికి దివ్యరూపోపసంహారార్థంబుగాఁ బ్రార్థించినఁ దదను మతం
బునఁజిఱుత బాలుఁడైన యాకృష్ణుని నందవ్రజంబుఁజేర్చి వసుదేవుండు
యశోధరాపుత్రికయగు మహామాయను నిజసతి సూతికాశయ్యనునిలిపె.
వసుదేవనందనుం డచటనంత. 52

## శ్రీకృష్ణలీలలు - దుష్టసంహారము

క. పూత నరనింద్య యగు నా
పూతన పీనులు నిమిరి యపుడు చన్నడఁగా
యాతన నొందాపుచు నా
యాతన [1]యార్భటి మురారి యడచెందానిన్. 53

వ. అంతటఁ గపట శకటంబు వికటంబుగా నుగ్గుచేసి తృణావర్తునార్తుం
గావించి మఱియును. 54

క. నవనీతచోరుఁ డని తను
నవనీతల జనులు పొగడ నలరి జననికిన్
వివరముగల యా దొరముఖ
వివరంబునఁజూపె విశ్వంబచటన్. 55

క. ఖలమర్దనుఁ డాతఁడులూ
ఖల కలన దలిర్ప మద్దికాయలరుచులున్
బెళుకుగ మద్దుల ద్రుంచెన్
మలయుచుఁ బ్రౌఢిమకు హద్దుమద్దులుగాగన్. 56

---

1. యార్భట.

వ. మఱియు నొక్కనాఁడు ॥ 57

చ. ఫలములు పీఁధినమ్మఁ గనిబాలకలీలలశౌరి ఘంటి కో
జ్జ్వల గతిరాఁ గ ధాన్యములుజారినయంజలిఁ జూచి నవ్వి త
త్ఫలతతియందునించి మణిఖాసి నిజోన్నత ఖాండపాలి కా
విలసనమీక్షచేసి ఫలవిక్రయిణీ మణిపొంగె వేడుకన్. 58

తే. గీ. ప్రేమ జలకేళి సలుపునాభీరసతుల
యంశుకంబులుగొని కదంబాగ్రసీమ
సొగసుగానిల్చి హరి ముద్దుమొగముఁ జూపె
జగములరఁ దత్పటంబులు మగుడ నొసఁగె. 59

వ. ఆ యంగనలకుం బ్రమోదంబుగా మఱియును. 60

తే. గీ. [1]చింతయిత్రుల బ్రహ్మాది సిద్ధమౌని
బహుతపః ప్రార్థనీయత్రిపాద్విభూతి
సతతసౌలభ్య సౌశీల్య శక్తిచూపి
మెచ్చి యిచ్చి మహోన్నతి నెచ్చుపఱిచె. 61

సీ. వలపు కుప్పలుగాక వలిచన్నులాయివి
యోహో యటంచు నోరూరి యూరి
గండు మీలగుఁ గాక కలికి కన్నులెయివి
యోహోయటంచు నోరూరి యూరి
యెనరు సుధల్గాక నునుబల్కులాయివి
యోహోయటంచు నోరూరి యూరి
హేమవల్లరిగాక యిది మృదులాంగమా
యోహోయటంచు నోరూరి యూరి
తే. గీ. చటుల యమునాతరంగిణీ తటనికుంజ
కుటకుటీరాంతరంబులఁ గొన్నినాళ్ళు
రాధతోఁ గూడి విహరించె రతికళత్ర
గురుఁడు సింధుసుతా మనోహరుఁడు గురుఁడు. 62

1. చింతయింతికి.

సీ. [1]జారుపయ్యెదయు నొయారి చూపుల ముగ్ధ
భావంబు మెరయించు భాషణములు
కలయికలోని ప్రాగల్భ్యంబు వింతలౌ
సింగారములు ముద్దు చిల్కునవ్వు
గుబ్బలు చెన్కనుల్కుచుఁ దానె పైకొను
నంగాంగసంగ తాలింగనములు
కంకణ మంజీర కాంచికా కింకిణీ
రవమొప్పు నొక మిటారంపు నడపు
తే. గీ. సిగ్గు సొగసును మురిపెంబు సిరియు వలపుఁ
గ్రుమ్మ రాచంగరాధతోఁ గూడిమెలఁ గె
నఖిల మోహాంతరాతీతుఁ డైనశౌరి
పన్నె యమునాతటీవనవాటికలను. 63

సీ. తానె పన్నీటితోఁ దళుకొత్తు కస్తూరి
బొట్టు వింతగ ఫాలమున నమర్చుఁ
దాన నెత్తావి వింతగ నేర్చి కట్టిన
[2]పూదండ లపుడు కొప్పున ఘటించుఁ
దానె కట్టాణి ముత్యాలు గ్రుచ్చినపట్టు
రవికె చన్నులమించ [3]నవదరించుఁ
దానె కర్పూరయుక్త పటీర రసమునఁ
దళుకుఁ జెక్కులను బత్రములువ్రాయు
ధవళదీర్ఘ విశాల నేత్రములయందు
శ్రీలు మెరయంగ నంజన రేఖదిద్దుఁ
దావి వెదజల్లు పుక్కిట తమ్మలంబు
నోరు నిండించు నాపూత నారితానె. 64

వ. ఇవ్విధంబున. 65

క. తీరని మమతల యమునా
తీరనికుంజముల వింత తీరనిపించెన్
వారక రాధామాధవ
సార కళాకేళి కుతుక సారస్యంబుల్. 66

---

1. చారు పయ్యెద.
2. నలదండలపుడుకొప్పున.
3. రవికెచన్నుల మించనలవరించు.

క. వ్రజసతులందఱు దివిజ
వ్రజసతులన్మించి మోహవశ చిత్తములన్
భజనము సేయ నతఁడు డిం
భ జనముతో నాలఁ గాచె మధురిపుఁ డచటన్. 67

క. నందాదులు సకలశతా
నందాదులు మెచ్చ నాదినారాయణుఁ డా
నందాదులతో సనకస
నందనముఖ్యులు భజింప నయము వహించెన్. 68

క. బృందావనమున నాశ్రిత
బృందావన శీలుఁ డహితభేదకుఁ డా గో
విందుఁ డు సజ్జనరక్షా
విందుఁ డు రాజత్పదారవిందుఁ డు వెలసెన్. 69

క. ధీరత్వము శూరత్వము
దారత్వము శోభనావతారత్వము గం
భీరత్వము సారత్వము
పారత్వము నెంచ గోపబాలుఁ డు నొంచెన్. 70

వ. అంత నింద్రోత్సవంబుసేయక యొక్క నాఁడనర్గళ దుర్గా మహోత్సవ
మొనర్ప నింద్రుండు కనలి ఘన ఘనాఘనంబుల నియోగించిన. 71

సీ. తొలుదొల్త తోనవాతూలంబులుత్తాల
శైలజాల విదారి శక్తి విసరె
నంతట దిశల గాఢాంధకారముగప్పె
తఱచుఁ గ్రొమ్మెఱుఁగులు మెఱసెనపుడు
ఘనమై నెరసెఁ గీటకర్పట గ్రామ ని
మ్నోన్నతైక్యము గల్గునురకరాశి
యఖిల లోకంబులు నందంద కంపింప
నమితార్భటుల గర్జితములు నిగిడె
తే. గీ. ఘోర ధారాళ ఘన శిలాధార మోలి
ఘోషజన ఘోషభీషణోత్కర్ష మొదవ
ఘోర రవముగఁ గురిసె దిక్కుహరమదరఁ
జెదరె భూచర ఖేచర శ్రేణియంత. 72

## శ్రీకృష్ణుఁడు గోవర్ధనంబునెత్తుట

వ. అప్పుడు నందాదులు. 73

క. ఆర్తత్రాణ పరాయణ
మూర్తీభవ దఖిలధర్మ మునిజనవరదా
కర్తవు భోక్తవునిన్నున్
గీర్తించెద మఖిలనాథ ! కృష్ణ ! ముకుందా. 74

వ. వర్షభయంబుఁ జెందిన మమ్ము రక్షింపు మని ప్రార్థించిన గోపాల శేఖ
రుండు గోవర్ధనం బొకవ్రేల నెత్తెనపుడు. 75

తే. గీ. వజ్రపంజరముననున్న వానిఁ గాంచి
గోప గోవత్స గోపికా గోగణములు
విస్మయమునొందె గీర్వాణ విభుఁడు మఱియుఁ
బూనియా కొండపై ఱాలవాన గురిసె. 76

ఆ.వె. కరుణఁ బ్రోచె శౌరి కనుగందకుండ నా
ధేను వితతి గోపసూను తతుల
నమృత [1]యుజులఁ జేసె నావేళ నిజశక్తి
నేమిసేయఁ జాలఁ డీశ్వరుండు. 77

సీ. "ఉఫ్"అని తానూఁద నుండునేమింటిపైఁ
బుష్కలా వర్తకాంభోధరములు
కట్టివ్రేయఁగలేఁడె గదిసి దామెనత్రాళ్ళ
నదలించి పర్జన్యు నైననపుడె
ఒక పిడికిటిలోన నుసుప నోపఁడె యని
వార్యంబులగు శిలావర్ష తతుల
నెలమిఁ బుక్కిటిలోన నిలుపఁ జాలఁడె ఘోర
వారి ధారోగ్ర ప్రవాహములను
తే. గీ. జిత్రముగ నమ్మహాత్ముండుసేయు మహిమ
లెన్ని లేవెన్ని గల్పింపఁ డెన్ని నిలుపఁ
డెన్ని మాయింపఁ డెఱుఁ గనివెన్ని చూపఁ
డతనికి నసాధ్య మెయ్యదియైనఁ గలదె. 78

1. భుజులం జేసె.

సీ. అలచుట్టు గట్టుచే నాగుణనిధి
యాలమందకు దొడ్డి యమర్చలేఁడె
కనకాద్రి యామేటి ఘనకేలి పాలు ? గం
తులకును దిబ్బగా నిలుపలేఁడె
హిమశైల రాజంబు నీదౌరనేర్పునఁ
బసుల కట్టుగఁ గేలఁ బట్టలేఁడె
వింధ్యంబు నీదంట వీక్షించి కడువింత
బంతిసేయఁగలేఁడె బాహుపటిమ
తే. గీ. వ్రేల నీకొండయెత్తుట వింతయగునె
యనుచుఁ దను సర్వఖేచర యక్షసిద్ధ
సాధ్య విద్యాధరాదులు సన్నుతింప
లీల మెరయించెనపుడు గోపాలవరుఁడు. 79

వ. అప్పు డింద్రుండు భీతింబొంది యాకృష్ణునకుమ్రొక్కి యిట్లని
వినుతించె. 80

క. నీవాఁడను నీవాఁడను
నీవాఁడను నాకుదిక్కు నీవేతండ్రీ!
కావక మానితెమును లో
కావక శరణన్నకల్మషాత్ములనైనన్. 81

తే. గీ. మదపరాధములైన నన్మహిమఁ గాతు
మదపరాధముఁ గావవే మాధవహరి !
కృష్ణ ! గోవింద ! వైకుంఠ ! కేశవ ! మధు
సూదన ! మురారి ! చక్రి ! యచ్యుత ! ముకుంద. 82

ఆ.వె. జయయుపేంద్ర ! కృష్ణ ! శౌరి ! నారాయణ !
జయపురాణపురుష ! చక్రహస్త !
జయపరేశ ! ఈశ ! స్వామి ! జగన్నాథ !
జయరమాకళత్ర ! జయపవిత్ర. 83

వ. అని నుతించిన. 84

క. దరహాస చంద్రికారస
భరమున సురరాజు తాపభయములణంచెన్
శరణాగత వత్సలుఁడా
హరి గోపకు లంది రద్భుతానందంబుల్. 85

వ. అంత. 86

క. కాళియ ఫణిపతి గరళ
జ్వాలాపాళీ విలోల జలజాప్తసుతా
కూలంకష జల మానుచు
నోలిన్ గోవితతిమూర్ఛ నొందినయంతన్. 87

వ. కృష్ణుం డొక్కకదంబ భూజంబెక్కి యమునాహ్రదంబులోనురికి. 88

క. తాండవముఁ జూపె కాళియ
చండ ఫణా మండలమున శౌరి యఖండో
ద్దండ మహాద్భుతచారీ
పాండిత్య విశాల తాళపద్ధతి మెఱయన్. 89

వ. అప్పుడు. 90

సీ. బాహుమూలంబులఁ బసిఁడి తళుక్కులు గ్రమ్మి
బిగువు కుప్పసములం దగటుసేయఁ
బయ్యెదల్ జాఱినఁ బాలిండ్ల నలువంక
జడివట్టి మెఱుఁగుల జళ్ళుగురియఁ
గలికికన్నుల వాలు కలువ పూవుల చాలు
బెళకించి యొకవింత నలుపు నీన
నతులభూషణమణి ద్యుతులకు నెమ్మేని
నిగనిగ సొగసు వన్నియలువెట్టి
తే. గీ. మంజు మంజీర శింజానరంజితకటి
మేఖలానూనరావముల్ మేరమీఱ
నాగకన్యలువచ్చి యానందసుతుని
యడుగుఁ దమ్ములమీఁద నెయ్యమునవ్రాలి. 91

క. పతిభిక్ష పెట్టవే శ్రీ
పతి పతితుని నితనిఁ గాచి పరమ దయా సు
వ్రత ః నీవు దక్కనెవ్వం
దతిదీనుని నితనిఁ గావ నాత్మఁ దలంచున్. 92

సీ. గంధసార ఫలాశిగణముతోఁ బెనఁగొని
యాపత్త్రక్రమం బెన్నఁడైనఁ గనఁడు
కంచుకి వర్గముత్కట వృత్తిఁ గొనియాడ
నతి గర్వ సంపద నధిగమించు
ఘనతర స్ఫటికాతికఠినాత్మ వర్తిల్లు
నైలబిల శ్రీల కానసేయు
నఖిల జగత్త్రాణహారి యయ్యునుమించి
నాకులలోన నాననముచూపుఁ
తే. గీ. దనకధోగతిగాని లేదనిజనంబు
లాడికొన్నను సుకృత మార్గాచరణము
నలువఁ డీతని నీక్షించి చనినవాని
కగునె శుభకార్య మెన్నటికైన ననఘ. 93

**వ.** అని బహువిధంబుల వినుతించినవారిం గటాక్షించి యాకాళియల సముద్ర మధ్యంబునకేఁ గుమనియనియె. అంతనొక్కనాఁడు యశోదానంద గోపికాజనంబులు కృష్ణుండున్న సమయంబున. 94

## శ్రీకృష్ణుఁడు దావాగ్నిని గ్రోలుట

(స్రగ్ధర)

ఆవిర్భూతోగ్ర కీలాహత చటుల కుటా
భ్యంత రోద్యన్మహాధూ
మ్యావేషో దీర్ణమేఘ వ్యతికర రహితా
శ్యామికాభావమై వ
న్యావీధి ద్రాగటాట్యానత శబరజన
త్యాజితా జీవమై సం
ద్రావన్నా నామృగాండోద్భవ విహిత విము
ద్భావమై దావమున్నన్. 95

వ. అయ్యమునాతటంబు డాయన్వచ్చునా వనహుతాశనుంజేరంజని. 96

క. వ్యాపృత కాళియ జయల
క్ష్మీ పరిణయుఁడైన గోపసింహము ఘనసం
దీపిత దవదహ నాత్మా
రోపణ మొనరించె ఖేచరులు గొనియాడన్. 97

వ. అంతమఱియును. 98

సీ. దధిఖండ సిక్త నలిన శాల్యన్న
విరళ శిక్షకపుంజ సరసఖండ
నాగరైలాచూర్ణ నారికేళశకల
లవణాంబు మిశ్రమై వివిధగంధ
మొనరఁ జిక్కముసఁ బెట్టిన చట్టిశృంగిబే
రామల కామవేత్రాంకురాగ్ర
బార్హత ముఖ్యశోభనము తానూరఁ గా
యలువ్రేళ్ళఁ బొసఁ గ నిజాప్తజన కృ
తే. గీ. తేష్ట సల్లాపగోష్ఠి తో నెలమిదగ భు
జించె గోపకులును దాను జిత్రరుచుల
సరవిమెచ్చుచు ఖేచరవితాన
మపుడు భుక్తోజ్ఝితములకు నాసపడఁగ. 99

వ. అప్పుడు. 100

క. మొలవంకరైన యుంగర
ములు గుంజాభూషణాంకములు మూపులపైఁ
జలకంబళములు దండము
లలరఁ గ గోపకులు నడిచి రావులవెంటన్. 101

క. విశదధ్వజాబ్జవజ్రాం
కుశశంఖ రథాంగ కల్పకుజచామరము
ఖ్య శుభ పదరేఖ లిలనస
దృశ చిత్రత కరప వాసుదేవుఁ డు నడచెన్. 102

వ. అప్పుడు జలజసంభవుండు వత్స వత్స పాలకులనపయింప శౌరితత్స్వ రూపంబులు దాన యగుటంజేసి యా చతురాననుండు లజ్జావనతాన నుండై భగవంతునిగని. 103

## దండకము

లక్ష్మీపతీ! నీ మహత్వంబు డెందంబునం దున్విచారింపఁ గా లేక మందుండనై దుష్టకర్మంబు గావించితిన్ మత్పతీ! యేరజోవృత్తివాఁ డన్ విమూఢుండ గర్వాంధుఁ డన్ నన్నుఁ బాలింపవే దీనకల్ప ద్రుమా! మించి

యాద్యుండవై వేదవైద్యుండవై యోగిహృత్కంజ సింహాసన [1]నస్థుండవై జ్ఞాన వైరాగ్య భృద్భక్త సంరక్షణోద్యత్క్రియా నిత్య ధన్యుండవై శాంబరీజాల సంధాన నీకాశ నానావిధా జాండ ఖాండ ప్రకాండ స్ఫురల్లోక నిర్మాణ దక్షుండవై యిందిరాభూమి నీళావధూ నీలసౌధాయ మానోల్ల సత్పీనవక్షుండవై చక్రకౌమోద కీశార్ఙ్గ ముఖ్యాయుధాధార బాహాచతుష్కాంతి భవ్యుండవై సూత్రవత్యాత్మ సాథాహిరాడ్వైనతేయాది సేవ్యుండవై సర్వలోకైక నాథుండవై పూర్ణభూతి స్థిరానందలక్ష్మీ సనాథుండవైయుండు బ్రహ్మంబవీవంచు తామంజు గుంజావళీ కుండల శ్రీలతో బర్హిబర్హావతంసంబుతోఁ బుష్పదామచ్ఛటోద్దామ కంఠంబుతో నవ్యనీరేరుహారణ్య విభ్రాజి పాదాంబుజచ్ఛాయతో నాయతోదార నేత్రాంత నిర్యద్దయాదృష్టితో వక్త్రచంద్రోల్లసచ్చంద్రికా మందహాసంబుతో గోప బృందంబు లానందముంజెంద వ్రేపల్లెలో భూజనశ్రేణి భాగ్యంబుచేనిల్చి యున్నాఁడవౌతంద్రి నీదివ్యరూపంబు నేఁ గానలేనైతి మౌళిస్ఫురన్నూత్న రత్నాళి నీరాజనశ్రీలు గన్పట్ట ప్రేమార్ద్ర మౌనేత్ర పాత్రాంతరాపూరితానంద బాష్పాంబు పూరంబు పాద్యంబుగా హృద్యమద్వాక్య పుష్పాళిచే నీకు నేఁ బూజఁ గావించెదన్ స్వామి కైకొమ్ము నానేరముల్‌గాచి రక్షింపవే కృష్ణ ! శౌరీ ! మురారీ ! హరీ ! కోటిసూర్య ప్రకాశంబు నీమూర్తి మచ్చిత్తకంజంబునన్ జాల భావించెదన్ సార సాక్షా ! నమస్తే ! నమస్తే ! నమస్తే ! నమః. 104

వ. అనినుతియించిన. 105

(లయగ్రాహి)

మౌళిశిఖి పింఛమును గేలవర వేణువును
  ఫాలమునఁ గస్తురి భుజాలతలగుంజా
మాలికల పట్టెడలు డాలొలుకువత్స వద
  ధూళి యలకంబుల విలోల వనయూథీ
జాలకము లాశ్రితుల శ్రీలు విలసిల్లెడుక
  పోలముల లేనగవు చాలఁ దగిమించన్
బాలుఁడగు దివ్యజన పాలుఁ డు సరోజభవు
  పాలిటికి నవ్యసురసాలమయిపొల్చెన్. 106

క. ననవిల్తు జనకుఁ డగు నా
ఘనుఁ డు దనుం గరుణఁ జూడఁ గాఁ దగు హర్షం
బునఁ జనియె సత్యలోకం
బునకు నలువపూర్ణభావములు రంజిల్లన్. 107

1. మాన్యుండవై.

తే. గీ. రాసభాకృతిధేను కరాక్షసుండు
రాసభాకృతిఁ దూలించి రాముఁ డొడిసి
పట్టఁ జేరి మహోద్భటార్భటి యశోద
పట్టి త్రుంచెఁ ద దాష్ట్రోగ్ర బలమునెల్ల. 108

తే. గీ. ఆదిఝషమైన హరియె యాహారమనుచు
మించి బకుఁ డచ్యుతుని నిజచంచు వివర
గతునిఁ గా మ్రింగనంతఁ దద్గళము చొరక
వాని వ్రయ్యలు గాఁ జేసె దానవారి. 109

క. బకుఁ డుచ్చలితారికదం
బకుఁ డు భయంకర మహాంధ భావ విరూపాం
బకుఁ డర్దన చిత్తాలం
బకుఁ డీల్గినఁ దీవ్రరోష పరవశుఁ డగుచున్. 100

ఆ.వె. అఘుఁడు వానితమ్ముఁ డరుదెంచి యజగరా
కృతిని దలను మ్రింగఁ గెరలివాని
నజగరంబువోలె హరివేగఁ జీరి తా
వచ్చె వత్సపాలవరులకడకు. 111

క. ఆవనమున నొకనాఁడు మ
హావిశ్వజనీనుఁ డైన హరిపంతంబుల్
గావించి హవ్యవాహక
భావంబున సఖులతోడఁ బన్నిదమాడెన్. 112

వ. అప్పుడు గోపాలవేషంబునం బ్రలంబుండు బలభద్రు మూపెక్కించు
కొని చనునంత. 113

శా. తాలాంకుండు విదారితాహిత మదోత్తాలాంకుఁ డత్యుద్ధతిన్
బ్రాలం [1]బాంత్రములెల్ల భూతతతికిన్ బ్రాలంబముల్ చేసెనా
భీల క్రూర భుజాశని ప్రహతిచే భేదించెనే తచ్ఛిర
శ్శైలంబుర్వరఁ జూర్ణభావము వహించన్ రాచెదద్గాత్రమున్. 114

1. శాత్రములెల్ల.

## వర్షాగమము

వ. అంత ॥ 115

క. తోరంబులయ్యెఁ [1]బ్రాచి ?
న్మారుతముల వాచికేఁ గె మబ్బులఁ బ్రతీచిన్
బేరయ్యె నింద్రచాపము
కారుమెఱుంగులును దివిని గడురంజిల్లెన్. 116

తే. గీ. అపుడు వర్షాగమ మహేశుఁ డతులశక్తి
ఖగపురంబులు దూలింపఁ గడఁగి తేరి
చక్రములు గట్టి కమ్ములు సంఘటించె
ననఁ గఁ బరివేషములు శశిహరులఁ జుట్టె. 117

క. చేరిక వర్షాలక్ష్మి ధ
రారమణిం గౌఁగిలింప రాలినకుచకుం
ఖోరుతర కుంకుమచ్ఛట
వైరాణించెన్ విచిత్ర హరిగోపంబుల్. 118

క. అవనీ పవనంబులచే
నవనీ పవనంబులెల్ల ననిచె బలాకల్
దివినుండెఁ గుశీరంబులు
భువినుండెన్ బాంథజనుల పొగులున్నిండెన్. 119

సీ. గంగా సరస్వతీ తుంగభద్రాయము
నా కవేరసుతా పినాకినీ శ
రావతీ సింధు గోదావరి గోమతి
కృష్ణవేణ్యా గండకీ మలాప
హారిణీ చంద్ర భాగాలక చర్మణ్వ
తీ నర్మదా బాహుదానదీ శ
తద్రుఫేనా విపాట్తాపి పయోష్ణి ప
య ః ప్రవాహములు మిన్నందివేగఁ

తే. గీ. దద్దయును బొంగుచును విటతాటములగు
తటజకుట జముల్వీచికా పటలిఁ దేల
దశదిశాచక్ర నిమ్నోన్నత స్థలంబు
లేకమైయుండ నిండెనమిద్ధ మహిమ. 120

---

1. ద్రోచిన్మారుతము.

తే. గీ. కులికెనొకసిరి యూధికా కుటజనీప
కేతకీ కుసుమములు ప్రభూత మహిమ
మొనసి ఘనతర వనదుర్గముల దళంబు
లేర్పడ ఘనుండు మన్నించె హెచ్చుగాఁగ. 121

వ. అప్పుడు. 122

క. మురళీనాదము చేసెను
హరి హరిణి మానసంబు లానందకళా
భరణీ భవభృతివద్వయ
శరణీ భవదమృతసార సాగరములుగన్. 123

వ. అంత. 124

క. పొదలె నరవిందసంపద
కదలెఁ దటిల్లతలవేశకాశజలక్ష్మల్
మెదలె, మరాళ గణములకు
వదలెంగడు మానసాధివాస ప్రేమల్. 125

సీ. అభ్రముల్ వెల వెల నయ్యెఁ బంకంబింకె
[1]నమ్ముల నెరితప్పె నభముతనరెఁ
తారలు మెఱసె జ్యో[2]త్స్నాపూరములుపొంగెఁ
గలమ సస్యము పక్వ కణిశమయ్యెఁ
గనుపట్టె సైకతోత్కరము నదుల్ స్రుక్కె
వృషభముల్ మత్తిల్లె విరిసెనత్త
పర్ణముల్ సొంపారె బాణాసినంబులు
ఘటజుపెంపున నీటఁ గలఁకదీరెఁ
జాతకంబుల యామని జాఱితారె
నలబలాకల సంభ్రమం బాళలెల్లఁ
జాల దీపించె రాజహంస గతినెరసె
ధరణి శరదాగమము వింత సరణిఁ జెలఁగ. 126

---

1. నమ్ములు = నెమళ్ళు.
2. త్స్నాన పూరము పొంగె.

వ. అప్పుడు. 127

మ. అవతంసాంచితనవ్య పుష్పములు నొయ్యారంపుఁజూపుల్ త్రిభం
గి విచిత్రాంగము పింఛలాంఛనము నాకీర్ణాంబుద చ్ఛాయయున్
నవలావణ్యముగల్గి గోపకుఁడు నానా రూప గాంధర్వతా
నవితానంబులచే ననన్యసుకరానందం బొనర్చెందగన్. 128

వ. తదనంతరంబున. 129

ఆ.వె. విసరెఁ జల్లగాలి వీగె నంభోజంబు
లా హసంతి మీదనయ్యెఁ బ్రేమ
నవనిపై హసంతియగు నాతి యింపయ్యె
మహిమతో హిమాగమంబు మెఱసె. 130

తే. గీ. మొనసి మధ్యాహ్న పర్యంతమును సమగ్ర
తుహినముంద్రొక్కవేగ మద్భుత బలంబు
హెచ్చహయములు రవిరథం బీడ్చుకతన
నహరహస్ఫూర్తి గనుసన్న మయ్యెనవుడు. 131

మ. గిరిశృంగాగ్ర గుహానివాసియగుచున్ గ్రీడించు గోపాల కో
త్తరయుక్తుండగు నయ్యదూత్తముఁడు నాదబ్రహ్మ మూలంబునన్
బరమంబై జగదద్భుతంబయి సుధా పానోపమంబై తగన్
మురళీనాదమొనర్చెఁ దత్స్వరఘు లామోదంబుతోఁ జొక్కఁగన్. 132

వ. ఒక్కనాఁడు శౌరి గోపకయుక్తుండయి విహరించుచుఁ దత్సమీపంబున
ఋషులు యజ్ఞంబుసేయఁ దద్దీక్షితపత్నుల నన్నంబువేఁడిన నానతులు
పొంగి. 133

మ. కలమాన్నంబున పూపసూపములు యోగ్యంబౌ నవీనాజ్యముల్
ఫలముల్ జీరక ఖండహింగు మరిచ ప్రాయంబులౌ కాయగూ
రలు పచ్చళ్ళు రసాయనంబులును శీర స్ఫారనీరంబు పె
క్కులు దధ్యాదులు నింపుగా నొసఁగి రా గోపాలక శ్రేణికిన్. 134

వ. అప్పుడా యన్నంబు గోపాలకులుం దానును భుజియించి యా హరిని
మన్నించిన యంతరంగంబులం బ్రమోదాంకురంబులు మొలవనా దీక్షి
తాంగనలు నిజనివాసంబులకుం జనిరప్పుడు. 135

## వసంతాగమము

ఉ. అంతధరిత్రిఁ [1]జైత్రకుసుమాయుధ యాత్రుఁడుచైత్రుఁడొప్పె శ్రీ
కాంత వనాంత భాస్వర వికస్వర సూన మరందపాన వి
శ్రాంతి విజృంభిత భ్రమర ఝుంకృతిగాన విధాన సంభ్రభ మా
క్రాంత ఘనప్రమోద గుణరాజిత భోగివరేణ్య మిత్రుఁడై. 136

క. మావి చిగురాకు డాలను
కావిరి గనుపట్టె నపుడు ఘనవనసీమన్
ద్రావి విగితేనె వానలు
వావిరి నిఁకఁ గురియుననఁగ వాసిదలిర్పన్. 137

తే. గీ. పంచశరుఁడుబ్బఁగా జీర్ణపటములూడ్చి
సన్నకావులు పూనిన సతులఁ బోలి
పండుటాకు గముల్ రాలఁ బరఁగునరుణ
కిసలముల నవవల్లరీ విసరమమరె. 138

తే. గీ. పోకుక్రియ నడ్డమై యవి పొంతపంక్తి
యమర భయమందుఁ బాంథమృగాళిఁబట్టఁ
దలఁచివైచెనొ పువ్వులవలమనోజుఁ
డనఁగఁ గ్రొవ్విరి జొంపముల్ పనితనర్చె. 139

సీ. కలయంగఁ బర్వు చీఁకటి [2]మ్రాఁకుగమి చాయ
యనత ఘనాఘన ఘన తనీనఁ
బల్లవ దళపుష్పపటు [3]భాకలాపమా
ఖండల చాపంబు దండిచూప
పక్వములై రాలు ఫలములచాలు డా
లింద్రగోపమ్ముల యెమ్మెఁ గూర్పఁ
గొదమ చిల్కలు రాయఁ జెదరిన యా కోర
కంబులు వడగండ్ల [4]పడపొనర్చ.

---

1. చైత్ర కుసుమాయుధ.
2. మ్రోకగమి.
3. భాక్కలావ.
4. యతికుదురుట లేదు.

తే. గీ. కలిత మదయుత చంచరీక ప్రకాండ
బహుర వాటోప ముఖముల బాగునెరప
జనము సన్నుతి సేయంగ వనము తేనె
వాన గురిసిన మోదము వాసిబెరసె. 140

వ. ఇట్లు సకలామోదకరంబై పుష్ప పరాగ రాగాక్రాంత వనాంతంబగు వసంతంబు విజృంభించుటయు నాకృష్ణుండు గోపికా కలాపంబులతోడ బృందావనంబుఁ బ్రవేశించెనపుడు ॥ 141

క. ఎలమావుల తావుల దీ
వుల పుప్పొడి ప్రోవులన్ మిపులఁ దగు మరుమా
వుల నునుబల్కుల దీవుల
దెలివిరిగమి తావులన్ [1]సతీతతియెసఁగెన్ ॥ 142

క. మాఁగిన పండ్లకుఁ దేనెలఁ
దోఁగిన మరువిండ్లకును మృదుల సుమగంధం
బాఁగిన పొదరిండ్లకుఁ [2]దమి
మూఁగిన తుమ్మెదలకున్ బ్రమోదంబొదవెన్ ॥ 143

సీ. చిగురులు చిదిమినదగు కేలుకెంజాయ
పల్లవస్ఫూర్తులఁ బాదుకొల్పఁ
బుప్పులు గోసిన నవ్వుల తేటలు
ప్రకట ప్రసూన వైభవమునిల్పఁ
దేటులఁ జోఁపిన నీటులౌ చూపులు
తుమ్మెద బారులు గ్రమ్మఁ జేయ
ఘనసుమన స్తబకంబులు ద్రుంచినఁ
గుచకాంతి క్రొవ్విరి గుత్తులునుప
తే. గీ. వన రమాప్తైక భావంబు వన్నెగాంచి
సరస మాధవుఁ డామోద గరిమ మెఱయ
వంజుల మరంద బృందాంక కుంజతతుల
హేళి విహరించె గోప కన్యాచయంబు ॥ 144

1. సతీతతి యొసఁగెఁ.
2. దముమూఁగిన

మ. కుచముల్ నిక్కఁగఁ గక్ష్యమూలముల తళ్కుల్ మించఁగా లోచన
ప్రచురశ్రీపయిఁ గ్రమ్మఁ బోకముడిజారన్ చిత్రమైసూక్ష్మమ
ధ్యచలత్వం బమరన్ విరుల్చిదిమెసొంపౌ తీవచేవంచి యొ
క్క చకోరాక్షి మరందలోలదలిఝంకారంబు తోరంబుగన్. 14

(రగడ)

ఉవిద పొదలెనోహోయెలమావులు
రవలిచేసె వలిరాయనిమావులు
పంత మటవె చెలి పజ్జన మెదలకు
నింత జళుకఁ దగునే తుమ్మెదలకుఁ
గ్రొవ్వున నాలతకుంబో నేటికి
జవ్వని యలరులు చాలున్నేటికి
మానిని యేమిఁక మదిలోఁగుందము
తో నీచేతికి దొరకెం గందము
వలదుతేనియల వానలనానకు
కలికియేలయుల్కవెమరునానకు
క్రమ్మెఁ దెమ్మెరలు కమ్మని తావుల
మమ్మిఁక విడువకుమా యీతావులఁ
గలిగెను రంభల కపురపుఁ బలుకులు
వెలసె గండుఁ గోవెల గమిపలుకులు
తరుణి పొగడగాఁ దగియెవనాంతము
ధరఁ గడుఁ బొగడందగియె వసంతము
కినుకలేక చొక్కితివెవరాశికి
నెనసె నసమనుతి యీ జవరాలికి
అరిది చిగురు చాయలు దగుఁ బొదలకు
గుబుచ నడల నిక్కులచేఁ బొదలకు
వెలసెను జెవిసుమ విరచిత హారము
కలిగెనె చెలువకుఁ గలిత విహారము
సొంపొదవెన్ నీ సొమ్ములకెంపుల
గుండ గుమోదుగు క్రొవ్విరి కెంపుల
బాగమరెన్ సతి పతకము పచ్చల
సోగతీగెగమి చొప్పడు పచ్చల
కలితేందిందిరకచయౌరాయని
తెలివి నుతింపఁగదే వలరాయని

నెమ్మె మెఱయనను నే యలవాటునఁ
గొమ్మలచే సుమగుచ్ఛము వాటున
మది చెదరకు సతి మరునసి వారికి
మదవతు లాడిన మాటల వారికి
హరిణ విలోచన యనుపమ రాగము
పొరిఁ బొరి నిలిచెం బుష్ప పరాగము
జగములు మెచ్చని శాఖల చాయల
నిగిడిన పుప్పొడి నిద్దపుఁ జాయల
నని సరసోక్తుల నందఱ నాడుచు
వినుత లాస్యముల వెలయగ నాడుచుఁ
జెలుపలు మెరసిన శృంగారంబునఁ
జెలువానిరి తను శృంగారంబున. 146

వ. తద్వనీకేళీ పరిశ్రాంతలై యున్న కాంతలుం దానును జలక్రీడ లొన
రింపంబూని యమున డాసెనప్పుడు. 147

తే. గీ. శ్యామనిన పుత్రిఁ దగిలి మా స్వామిమమ్ము
విడుచునోయని భయమున వెలఁదులతని
కరములంగుళులును మేను కటియుగమును
బాహువులు మూఁపు వదలక పట్టిరపుడు. 148

వ. అంతకు మున్న భూషణాదులు తత్తటంబునంబెట్టి చదురుకావులు ధరి
యించి కనకమయ శృంగంబులు కరంబులవహించి రత్నమయ సోపా
నంబుల వెంబడి నొయ్యన హరి తోడంజని యమునాహ్రదంబుఁ జొచ్చి
కృష్ణభుజ శాఖలంబోయి తదీయోత్తుంగ తరంగంబుల విహరించుచుఁ
గాంతానిచయం బన్యోన్య కుచకచంబులు గురులు చేసి వాసిగాఁ బుప్పొ
డులు గ్రమ్మ తమ్మిరేకులచాలు తేనెజాలు కొనంగుప్పిన జక్కవల
కవల తుమ్మెదల పొదుల యరులవైవం దొడంగి రవిసముల్లోల కల్లోల
పాలికా సంచల త్పద్మాంతరాళ చక్రవాక చంచరీకంబులు కడకుం
జనియె. [1]కొమ్మలు చిమ్మిన గ్రోవులం జిమ్మిన మకరందంబునఁగాంతా
కరక్షిప్త మృణాళంబులును నంగనల యధరంబుల బాహువులపైనంటి
నిజాప్త భావంబు వెలయించె నోయన మెరసెన్ గృష్ణుఁడు గోపికలు

1. కొమ్ములు.

చల్లిన స్తన కలశకుంకు మారుణోదకంబులు గ్రమ్మ ధాతుమయ నిర్ఝ రాంబు రక్తంబగు నంజనాచలంబు డంబు వహించె. ఇట్లు బహువిధ జలక్రీడలు గావించి తత్కేలి చాలించి తత్తటంబునకుం జనుదెంచి చలువలుగట్టి చిత్రమణి భూషణంబులు ధరియించి శీతల కుసుమ మాల్యంబులు సవరించి యుచిత విహారంబుల వెలయుచు నుండి రంత. 149

తే. గీ. కృష్ణుఁ డన్నది గోపికా కేళిపరత
నోలలాడంగఁ జూచి నోరూరి యటుల
పద్మినులతోడఁ గూడి యప్పాటన పర
జలధిఁ జేరిన కైవడిఁ జనియె నినుఁ డు. 150

తే. గీ. అట్లు పద్మాప్తుఁ డపరాబ్ధియందుఁ గ్రుంగె
నతని వెనుచను నవ్య రక్తాబ్జ లక్ష్మి
వోలె సంధ్యారుణప్రభా లీలమెఱసె
గగన కుంభీంద్ర సింధూర కలన వొసఁగ. 151

తే. గీ. అపరవారాశిఁ గసరెత్తనద్భుతముగఁ
దరణి మునిఁగిన తద్వసుతతులుదొరక
తేజము వహించె నపు డన్నిదిక్కులందు
హేతిమంతుండు జగమెల్ల నెన్నికొనఁగ. 152

సీ. ఆకాశ గంగా జలాంతరమ్ములయందుఁ
గొమరారు ఫేన ఖండములనంగ
నభ్రగజంబు దివ్య విమాన వితతివా
రకరాయరాలు హిమాంబులనఁగ
నర్కుండు చెరగొని యపరాద్రి విడువంగ
వచ్చిన నవకైరవంబులనఁగ
నలరు విల్తుండు సవ్యాప సవ్యముల ల
క్ష్యము వేయు కుంద బాణములనంగ
తే. గీ. సమయమిషమున ఖర కరస్వామి విదళి
తాంధకార గజేంద్ర కుంభాంతరాళ
కీర్యమాణ సమగ్రమౌక్తికములనఁగఁ
దారలుదయించె రుచిరజితారులగుచు. 153

మ. జనులోహోయనియచ్చుతాబ్ధిమునుఁగన్సాయాహ్నరాముండుతా
దినలంకాధి పునాభికుండలి సముద్దీప్తామృతశ్రేణి ప
త్రినికాయోద్ధతితెచ్చి నిల్పెనన నెంతేఁ బొల్చెఁబూర్వాద్రిపై
వనజాతారిరథాంగనామఖగగర్వధ్వంసియై యంతటన్. 154

మ. పురుషోత్తంసుఁడు నేఁడు [1]తద్రజ వధూపుంజానురాగంబు తోఁ
బరఁగెన్ మోహము మించమత్సుతఁదలం పంతంచుదుగ్ధాబ్ధి ని
ర్భరభక్తిన్ జనుదెంచి తత్పదముపై ప్రాలెంగదా యన్ని వి
స్ఫురణం జంద్రిక కాయజాస్త్రసుమనః పుంజంబుతోడందగెన్. 155

క. మధురాకృతితో మురళీ
మధురసుధానవధి గానమంజిమయుతుఁడౌ
నధునాతన విధునాతని
నధిగత పరమార్థలై యొయారము మెఱయన్. 156

వ. సేవించి గోపికలిట్లనిరి. 157

## గోపికావిహారము

క. ఈ వంతము లీగానము
లీపలుకీకళల బెళుకు లీవింతల మే
లీ పొలుపులు నీకేతగు
గోపాలక నిన్ను భక్తిఁ గొల్చెద మింకన్. 158

సీ. వారవట్టినఁ గాకతీరు నేమైకాఁక
యధరామృతము జిహ్వనానుకొనినఁ
దనువు లొక్కటిగాక తలకొనునేతృప్తి
కులుకు గుబ్బలి గ్రుచ్చుకొనినమాత్ర
గురి గళలంటన కరఁగకుండినఁ గాక
పారవశ్యంబు పైఁ బడినఁ గలదె
యనిమేషముగఁ జూపు లామతించినఁ గాక
బెళకించి చూచినఁ బ్రేమయగునె
ఆ. వె. తలఁచి తలఁచి పిలిచి పిలిచి నీ పదములు
గొలిచి గొలిచి చాల నలసి యలసి
మ్రొక్కి మ్రొక్కి చొక్కి చొక్కి నీ శుభమూర్తి
గాంచికాంచి మనుట కలిమి బలిమి. 159

1. తద్రవ్రత వధూపుంజ.

క. నినుఁ జూడని చూపేటికి
నినుఁ బొగడని జిహ్వయేల నీ దాస్యము సే
యని బ్రతుకేటికి నిత్యము
నినుఁ గొల్వని జన్మమేల నీరజనయనా. 160

వ. అని పలికి. 161

సీ. సొగసుగా పింఛంబు దిగిచి కొప్పుననున్న
యలరు దండలు సిగ నలమియలమి
బెడఁగొప్పరవికెపైఁ దొడిగించి కడుసొంపు
గులుకు సింగారముల్ కూర్చి కూర్చి
తళుకు బంగరుచీర [1] గట్టించి గళమున
నవరత్న హారముల్ [2] వైచివైచి
పూనిక మురళిక పూరింతు మనుచు రం
ధ్రాంతరం బొక వింత యాని యాని
తే. గీ. యాలవీవు మగలమేమయనుచుఁ దమకు
మగతనంబు లొనర్చుచు మలసి మలసి
నంద నందనుఁ డప్పు డానంద మంద
మంద గమనలొనర్చి రమందరతులు. 162

సీ. గుబ్బచన్నులఁ గ్రుమ్మి క్రుమ్మివైచిననైనఁ
దెరలక వెనువెంటఁ దిరిగి తిరిగి
బెళుకు పయ్యెదయును బీతాంబరంబును
ముడిగొనఁ బ్రేమతో [3]ముడిచి ముడిచి
కన్నులు మూసిన గళగళ మందుచు
దడబా(మా)టువేరున నొడివి నొడివి
కొప్పు నీడలనంటి కొనవ్రేళ్ళ మడమలు
ద్రొక్కుచు సొబగునఁ దూలితూలి
తే. గీ. పాడుమనఁ బాడి వింతగా నాడుమనిన
నాడి యచ్చోట నిల్వుమయనిన నిల్చి
యేఁగుమన నేఁగి యా మ్రాకు లెక్కుమనిన
నెక్కి తగహరి వలపించి రిందుముఖులు. 163

---

1. యతి తప్పినది.
2. యతి తప్పినది.
3. ముడిసి ముడిసి.

క. మనసెటిఁగి వయసెటిఁగి పొ
ల్చిన చూపులెఱింగి వలపు సిరులెటిఁగి వధూ
జనముల తోడన్ బృందా
వనవంజుల కుంజ పుంజ వసతుల మెలఁగెన్. 164

వ. ఇట్లు మెలఁగుచు ననేకదినంబులు విహరించి కృష్ణుండు గోపికల రతులఁ
గరఁగించి యొక్కనాఁడు తిరోహితుండైన. 165

క. కులిశాంకుశ వజ్రధ్వజ
జలజధనుశ్చక్రకూర్మ చామరరేఖల్
గల యడుగుల చొప్పరయుచుఁ
గలకంతులు వెదకిరపుడు కంజదళాక్షున్. 166

శా. హావేణుస్వర మాధురీ సరణు లాహామౌళి పింఛాంకమా
రావేదాంత శిఖావతంస పదసౌరభ్యం బయారే దయా
శ్రీవాల్లభ్య మహో మహిమలా శ్రీకృష్ణ కల్పద్రుమం
బేవేళన్ ఫలియించునో మనలతో నేమేమి భాషించునో. 167

వ. అని. 168

తే. గీ. తరులతాకుంజ ఖగ మృగ తతుల నడిగి
గగన భూవారి పవన [1]తేజోంతరముల
నడిగి వేద శిఖాగమ్యమైనయట్టి
బ్రహ్మముఁ దలంచి కానక పద్మముఖులు. 169

వ. మోహసంతాపంబులం బొరలుచున్నయప్పుడు సౌలభ్య సౌశీల్యాద్య
నంత కల్యాణ గుణ పూర్ణుండైన కృష్ణుండు కరుణాయత్త చిత్తుండై
యా గోపికలకుఁ బ్రత్యక్షంబై నిలిచి. 170

ఆ. వె. మ్రొక్కి కౌఁగిలించి ముద్దాడి పైఁ బడి
తియ్య మోవిజాలు తేనెయిచ్చి
పొదలఁ బొదల ప్రేమఁ బొదలిన కొంతల
నందఱనురమించి యాదరించె. 171

1. యతి చింత్యము

వ. అంత నార్చిక గాథిక సామిక స్వరాంత రౌడువ షాడవ సంపూర్ణంబు
లగు సప్తస్వరంబుల శ్రుతిజాతి భేదంబులెఱింగి మూర్ఛ నావిశేషంబున
గ్రామత్రయ రాగంబులు పరిసాధించి తత్తద్వేళానుసారంబున గ్రహ
సన్యాసంబులు పరిశీలించి మద్రకాది గీతంబులు విదారి ప్రమాణంబున
చతురశ్రత్రిశ్ర మిశ్రతాళ విశేషంబులఁ బాత కళాకళా కలాపంబు లుగ్గ
డింపుడుమార్గదేశి వివిధంబులపాదకటిపార్శ్వ బాహుహస్త వక్షద్వక్ష(?)
గ్రీవాధరనానేకా (?) భ్రూశ్రవణ నేత్రాంచల్ల లాటి శిరోముఖి తత్క
రణంబుల సాంగిక సాత్త్విక మానసికాభినయంబుల మెఱయించి భూత
వ్యోమచారి (?) గతులఁజొక్కింపుచు నంగనాద్వయ మధ్యమాధవ,
మాధవద్వయ మధ్యగాంగనా శోభితమండలంబైన రాసమండలంబునం
గృష్ణగోపకన్యలు లాస్యంబు నలిపిరపుడు. 172

ఆ.వె. ఒకతె చెక్కునొక్కి యొక్కతె ముద్దాడి
యొకతెఁ గౌగిలించి యొకతె మెచ్చి
యొకతె కూఁతయిచ్చి యొక్కతెమన్నించి
రాసకేలి గోపరత్న మలరె. 173

తే. గీ. కోటిసూర్య ప్రకాశుఁడై కోటి మదన
కోమలోజ్జ్వల మూర్తియై కోటి చంద్ర
శుభకళా మోహనుండునై సొంపుమెఱయు
నచ్యుతునిజూచి గోపకన్యాచయంబు. 174

వ. బహువిధ క్రీడలఁ గృష్ణునితో నలరుచు నుండునంత. 175

## నందుఁడేకాదశి నుపవసించుట

మ. పతితక్రూర నిషాద కీటక మహా పాపఘ్న మార్యస్తుతం
బతిలోకం బనవద్య మప్రతిమ మాద్యంబై హికాముష్మిక
స్థితినిర్వాహకమవ్రత ప్రళయ విచ్ఛేదక్రియా మూలమా
క్షితి నేకాదశియంచుఁ దానుపవసించెన్ నందుఁ డా నందియై. 176

వ. అంత ద్వాదశి నిమిత్తస్నానంబు సమయంబు నొనర్ప వరుణదూతలు
నందునిం గొనిపోవ నిజప్రభావంబున హరి మరలందెచ్చెనపుడు. 177

క. లోకోత్తరుఁ డాహరినిజ
లోకాభవ లోకధాతృ లోకబిడౌజో
లోకాదులైన యుత్తమ
లోకంబులు చూపె గోప లోకంబునకున్. 178

వ. అంత 179

సీ. నందాదులొకనాఁడు నవోత్సవంబున
నంబికావనమున కరిగి యా స
రస్వతి నది గ్రుంకి రహితో సుమామహే
శ్వరులఁ బూజించి భూసురులకెల్ల
గో హిరణ్యాంబరకోటులర్పించి య
న్నమువెట్టి తా ముదకములు ద్రావి
తద్వ్రతంబుననుండ దైవయోగంబున
నందుని నజగరమందునుండి
తే. గీ. మ్రింగహరిదానిఁద్రుంపఁబొసంగనదియుఁ
దాల్చె విద్యాధరత్వంబు దశదిశాంత
రాళ [1]దే దీవ్యమాన విశాలమౌళి
మాలికాలంకృతశ్రీల మహిమ మెఱసి. 180

వ. ఇట్లు మెఱసి యేను సుదర్శనుండను విద్యాధరుండ. మదీయప్రకా
రంబు విన్నవించెదనని యిట్లనియె. 181

తే. గీ. అంగిరసులుకురూపులై యరుగుదేరఁ
గాంచియే నవ్వఁ దత్పాతకమున నజగ
రంబవై యుండుమనిరి శాపంబు దొలఁగు
మీ పదాబ్జంబు సోఁకినమీదననిరి. 182

వ. మీకతంబున శాపవిముక్తుండ నైతినని విద్యాధరుండు యథేచ్ఛంబుగాఁ
జనియె. 183

సీ. రామకృష్ణులు వనరాజిలో నొకరేయి
వెన్నెల గాయనవీన మధుర
గానామృతము సోనకైవడి వెలయ గో
పాంగనల్ పరవశలైనవారి

1. దేదివ్యమాన —— శ్రీలమర మహిమ మెఱసి.

శంఖచూడుండనఁ జాలుయక్షేశ్వర
భటుఁడు దుర్ఘట మదోద్భటుఁడువచ్చి
యోగబలంబున నుత్తరంబునకుఁ దో
డ్కొనిపోవ హా కృష్ణ ! గోపగుణ గ
తే. గీ. భీరయను తత్సతుల విడిపించె శౌరి
యెచట చొచ్చిన విడువక యీడ్చి శౌరి
పూని దృఢముష్టిఁ జెండాడి వాని మౌళి
నున్న రత్నంబులెల్ల నింపూనికొనియె. 184

వ. ఇట్లు గైకొని యున్నంత 185

క. వాహంబై ఖరఘురవా
ర్వాహంబై కేశిదైత్యవర్యుఁడు రాఁద
ద్దేహంబు విరిచె నిస్సం
దేహంబునమింట సకల దివ్యులు పొగడన్. 186

వ. అంత 187

క. వృషభాసుర బలమణఁచెఁ
వృషభాసుర బలము నిలిపె వినివేశితగో
వృషభుఁడు సంరక్షితగో
వృషభుఁడు హరిశౌర్య ధైర్య వీర్యస్ఫూర్తిన్. 188

సీ. అవికలహృదయులై యవి కళలంగొంద
అవిపాలకత్వంబునంది కొంద
రవిచారులై వనాభ్యంతర సీమల
నాటలాడుచునున్న యపుడు చేరి
మయతనూజుం డతిమాయావి యని మూర్తు
లైన గోపాలుర నపహరించి
గుహలోన నిది హత్తుకొన నొక శిలవైచి
మరలి వచ్చిన జూచి మాధవుండు
తే. గీ. హస్తములఁ బట్టి బిర బిరఁ ద్రిప్పి యార్చి
కొండపైవేయ వ్రయ్యలై కూలెవాఁడు
కురిసె వింతగ మందార కుసుమవృష్టి
తోయ నిధులుబ్బె దివ్య దుందుభులుమ్రోసె. 189

వ. అప్పుడు గోపాలకుల విడిపించి తెచ్చి యచ్చక్రి సుఖంబున్నయెడ. 190

శా. సారజ్ఞాన కళాగుణైక ఖనియౌ శ్వాఫల్గుఁడక్రూరుఁ డా
త్మారాముం బొరిఁజేరి మ్రొక్కినది బ్రహ్మానందమున్ దెల్పు దృ
క్పీరేజంబుల బాష్పముల్ దొరుఁగఁగా నీరంధ్రరోమాంచుఁడై
సారంబేర్కొని గద్గదస్వరముమించన్ సన్నుతుల్ సేయుచున్. 191

క. వనజాతోద్భవ ముఖ్యులు
గననేరని నీదు పాదకంజాతములేఁ
గని ధన్యుఁ డనైతిన్ నా
జననంబు ఫలించెఁదంఘ్రిః శౌరిః మురారీ ! 192

ఆ. వె. స్వామి మీ కటాక్ష కామధేనువుగల్గ
నేమి సంభవింపదీశ ! దేవ
తాంతరముల సాధనాంతరములును మం
త్రాంతరములు నేల యరసిచూడ. 193

వ. అని నుతియించి రామకృష్ణులమథురకుం దోడ్కొనియేఁగుచు యమునా
తీరంబునందరుచ్ఛాయనమ్మహాత్ముని నిలిపి యక్రూరుండు తద్యమునా
జలంబులం గ్రుంకినం దన్మధ్యంబున. 194

## అక్రూరుఁడు యమునాజలమున
## రామకృష్ణులఁగాంచుట

తే. గీ. స్ఫటిక నీరదవర్ణుల శ్యామపీత
రుచిర పరిధానుల విచిత్రరూప తాళ
గరుడ కేతనుల శుభ ప్రకాశ నిధుల
రామకృష్ణులఁ గాంచె సారజ్ఞుఁ డతఁడు. 195

వ. కాంచి యరుణాతి శోభనాతి కోమలాతి ప్రసన్నంబులై యగణ్య లావణ్య ప్రవాహ సముత్ఫుల్ల హల్లక కింజల్క కాంతులు మొల్లంబై గనికట్టై ననరంజిల్లు పాదంబులును బాదంబులు భజియించు సురేంద్రముఖ్యులకు నిజాంశ చ్ఛత్ర చామరధ్వజ కులిశంబులు కృపచేసితిమని తెలిపినట్లు రాణించు తచ్ఛుభరేఖలును,సుధాపయోధి విహరించు తటిఁదదీయడిండీర ఖండంబులంటెననం జంద్రఖండసఖంబులై కలితయోగి మానస సుఖం బులగు నఖంబులును, నఖంబుల చెంగటఁ బాదంబున వెడలి గంగ ప్రవహించునెడంగదలక నిలిచి కచ్ఛప పోతంబులన రాణించు మీఁ గాళ్ళును, మీఁగాళ్ళ పొంతవింతలై కాంతుల దొంతరలు మెఱయ ఘనీభవ చ్ఛృంగార రసఘుటిక లగు గుల్భంబులును, గుల్భంబుల కేవలం గందర్ప శర శరదిందీవరపుంఖంబుల యొప్పు గుప్పళించు మడమ లును, మడమలపై స్థూ (?) ధ్వని ప్రశ్రుత మంజు మంజీర నీలప్రభా శలాకలోయన విజితమదన కాహళ శ్రీసంఘములై తనరు జంఘలును, జంఘల చేరికనమంద సౌందర్య నిధానంబు చూప వ్రాలిన ఖంజన ద్వయంబన జనంబులకు నానంద కరంబులైన జానువులును, జాను వుల మీదంబూచిన యతసీలతలు పెనఁగొనిన యనంటులన నమరు నూరుద్వయంబును,నూరుద్వయోపరిభాగంబున లావణ్యశ్రీకి మృగమద పంకంబున వయః కుంభకారుం డొనరించిన వరకుచకుంభ నిర్మాణ చక్రంబన ఘనంబగు జఘనంబును, జఘనాగ్రంబున వింతసిలి నివ్వె టిలు పొన్నపువ్వు కళనవ్వుచు వల్లవ లతాంగీ భృంగి మనోహరంబగు నాభికుహరంబును, నాభికుహరంబునంటి హరిసూక్ష్మరూప సంపత్కా శాసామ్య లగ్నంబగు నవలగ్నంబును, నవలగ్న ప్రాంతంబునఁ దను కాంతి తరంగిణీ తరంగంబుల తెరంగున రంగైన వళిత్రితయంబును, వళిత్రితయంబునకు నెదుట భూ నిశాసీమా విభాగద్యోతకంబై కవిత శృంగార రసకుల్యోల్లేఖయగు రోమరేఖయును, రోమ రేఖంగదిసి యిందిరావిహారరత్నవితర్దికయై చిత్ర భూషణకాంతి లక్షితంబగు వక్షంబును, వక్షంబునకు నిరువంకలఁగళిందనందనా హ్రదమండలంబు నిజపదంబు సోఁకిన పుణ్య విశేషంబున నైక్యంబునొంద నిలిచి నట్లుమెఱయు శ్రీవత్సంబును, గాఁగల యల్లుండని కౌఁగలించిన రవి బింబంబు తెఱంగున రాణించు చొక్కంబగు కౌస్తుభ మాణిక్యంబును, లక్ష్మీధామం బునకుంజుట్టుఁ గట్టిన చిత్రరత్నతోరణంబు ననుకరించు వైజయంతియును, శ్రీవత్స కౌస్తుభ వైజయంతీ సన్నిధానంబున

సంఫుల్లకుసుమ పుంజరంజితాతసీశాఖలనందగు బాహువులును, బాహు పరివేషం (శం) బు ననంజనాద్రి శిఖరంబులంబోలు నంసంబులును, నంసంబులండాసి విరజా[1] ఘనీఘనీభవత్కళా ధురంధరయగు కంధర యును, గంధరోర్ధ్వసీమను హరిదీనకల్పకంబగుటకుందగఁ గుసుమ పల్లవ శ్రీలుల్లసిల్లు చందంబున మందస్మితాన్వితంబైన యధరంబును, నధరంబు పొరువున భూనీశాశృంగారావలోకనముకురంబులనం బ్రకాశించు చెక్కులును, జెక్కులనుభయపార్శ్వంబుల సౌలభ్య సౌశీల్య వాత్సల్యాది గుణంబులంగలయది శ్రీ శ్రీయని చూపిన తెఱం గునంబ్రశంసించు శ్రీకారద్వయంబున మకర కుండల మణిమండల ప్రభాపూర్ణంబులగు కర్ణంబులును, గర్ణంబుల దండనఖండకరుణాకల్లో లినీ పుండరీకంబులనం జిత్రంబులైన విశాల నేత్రంబులును, నేత్రం బుల నడుమ యౌవ్వన కర్షకుండు శృంగార రససస్యంబు మొలిపించు టకు నేరువాకవాఱంగోరువెట్టెనోయనందంగి గంధఫల కళాచిక యగు నాసికయును, నాసిక యిరుచక్కి హరి హరులేనేయని తాల్చిన శార్ఙ్గ పినాకంబుల యట్లు రాణించు భ్రూయుగంబును, భ్రూ యుగంబు నెగువ ననుపమ కందర్ప ఫలకంబునుంబోలె లలిత కస్తూరికాతిలకం బగు నలికంబును, నలికప్రభాన్వితంబై పంకజనాభాంకస్థిత పంకజ నివాసినీ సందర్శనాగతాకలంక పరిపూర్ణ శశాంకుండోయన సకల కళాసదనంబగు వదనంబునుం గలిగి చిత్ర రత్న కిరీటంబుఁ దాల్చి హార కేయూర కంకణ ముద్రికాకటిసూత్ర కనకాంబరాలంకృతుండై నతీ జీవరత్నమయ సాలభంజికయో యన వివిధ మణిభూషణ భూషితయై కరుణా కటాక్ష సంరక్షిత సకలలోకయగు శ్రీకాంత మెఱుంగై కను పట్టి ఘనంబగు విగ్రహంబునం జూపట్టు నప్పుడు. 196

తే. గీ. ధరణి నీళయుఁ గంకణధ్వనులు వెలయఁ
గరములనువైచు చామరాగ్రములు సోఁకి
యిందు ధవళాతపత్రంబు నందుఁ జిందు
నమృత బిందూత్కరంబు లంగమునఁ గ్రమ్మ. 197

1. ఘనీఁగని భవత్కళా.

క. సనక సనందన ముఖ్యుల్
వినుతింపగ వివిధరత్న విరచిత సింహా
సనమునను శేష శేషా
శననిత్యులుగొల్వఁ గాఁ బ్రసన్నత వెలసెన్. 198

వ. ఉన్న హరికిం బ్రణామంబాచరించి. 199

తే గీ. మత్స్య కచ్ఛప సూకర మనుజసింహ
వామన భృగుకులజ రాఘవ బలభద్ర
బుద్ధ కల్కి హరిముకుంద భువననాథ
దీనరక్షక నీవు నా దిక్కునాకు. 200

వ. అని యక్రూరుఁ డచ్యుతు నుతియించి యమున వెల్వడివచ్చి రథంబున నున్న రామకృష్ణుల నవలోకించి కీర్తించి సూర్యనందనయందుఁ దాఁ గనినయట్టి యద్భుతంబు విన్నవించి మధురాపుర ప్రాంతంబున రామకృష్ణుల నందాదులతో నునిచి నిజగృహంబునకుంజనియె. రామకృష్ణులును మధురం బ్రవేశించి తత్పుర వీథిం జనునెడ. 201

చ. కనక లతాంగి యోర్తు హరిఁ గన్గొని కెంపుల తళ్కుజాలిచేఁ
గొనుచును నేఁగెఁ బూను నెడఁ గూడక వేడుకభర్మహర్మ్యమో
హనశిఖరాగ్ర వీథులకు †నార్తిని మూపునవాట్లఁబడ్డ వా
రిని సమయంబునన్ విడుతురే యమరీసమరీతిమానినుల్.* 202

మ. కలకంఠీమణియోర్తు కృష్ణుఁ డటు రాఁగాఁ జూచి గోవర్ధనా
చలమీ వెత్తుట యెంతయెత్తు మివె నాచన్గొండలిట్లైన నీ
బలసంపత్తి యెఱుంగవచ్చునని యొప్పన్ బిల్చె నాతళ్కు గు
బ్బలు గాన్పింపఁ గ సౌధవీథి నిలిచెన్ బంగారు బొమ్మోయనన్ 203

వ. ఇట్లు వివిధోజ్జ్వల నిజ చేష్టల నవలాలుచూడ నవలావణ్య ధాళధళ్యంబుతో మధురాపుర మధ్యంబున కేఁగుచు. 204

---

†నర్తను (పా).
*ఈపద్యభావము విశదముగాలేదు.

ఆ. వె. కడుమదమున వీగఁ బడివాలు మడివాలు
వసన భార భారి వరలుదాను
గంసమందిరమున కంసరాజితవేణి
హంసగములతోడ నరుగునపుడు. 205

వ. తమకు ధౌతవస్త్రంబులడిగిన నీక దుర్భాషలాడిన యా ఖలుఁ
భంజించి తద్వీథి మధ్యంబున నేఁగుచు. 206

క. పాయకమాలాకారులఁ
బాయక మన్నించి శౌరిబలుఁడుం దానుఁ
బాయక వర్గముతో నిర
పాయకళామహిమ మెఱసి పాటిలుచుండెఁ. 207

వ. అంత. 208

క. అను లేపనములు దెచ్చిన
ఘనపాణిని కుబ్జఁ గుజ్జుగాంచి పదమునఁ
దనువెల్ల మట్టియాయం
గననాకక కుబ్జఁ బోలఁగా నొనరించెఁ. 209

ఆ. వె. వాసియెఱిఁగి యెపుడు వాసుదేవుఁడు దాని
దాసి విరహ మర్మదాసిఁ జేసె
[1]శిలబునర్చుతోంఛ శిలఁ జేయు నాఘనుఁ
డేమిసేయ నేరఁడీ ధరిత్రి. 210

ఉ. ఆవలనుగ్ర చాపము మహాబలసంపదఁ ద్రుంచి దానికిఁ
గావలియున్న కాలభటకల్ప దురల్ప వికల్ప జల్ప లో
కావళి నుగ్గుగాను రుచిహావళిచేసె దురంత దుర్మదుల్
ధావన మాచరించి వసుధావన వీథులవెంట నేఁగఁగఁ. 211

## శ్రీకృష్ణుఁడు కంసుని సంహరించుట

వ. అంత. 212

తే. గీ. అపుడు సాయాహ్నశౌరి భావ్యతిశయమున
దివస మల్లునితోఁ బోరి ధృతిజయించి
తదురుగైరిక రక్తవస్త్రంబుఁ జించి
కేరి యెగవైచె నన సంజ కెంపుదనరె. 213

1. పాఠము అర్థవంతముగాలేదు.

తే. గీ. పద్మినీ ప్రియుఁడయ్యుఁ జాపలముఁ బూని
యినుఁడు నిస్తేజుఁ డై క్రుంకె నేమిచెప్ప
నపర కాంతాశఁ దిరిగిన యట్టివాఁడు
ధరణి వెలయునె యుద్దామ ధాముఁడైన. 214

తే. గీ. ఘోర చాణూర మల్లోగ్రఘోషశక్తి
నంబరంబెల్ల నట్లౌనె యనుచు ధాత
తఱచు వెండిచీలలు తాచినట్లు
తారకాజాల ముదయించె దట్టమగుచు. 215

సీ. దనుజారి కలహాభోజన మహాధృతి సమా
యాత ప్రహర్షి దేవర్షి యనఁగఁ
జాణూర మురళికా సంచల ద్భూతాళ
భర్త చిమ్మిన రౌప్య పాత్రమనఁగఁ
గంసశిరఃక్షిప్తకాల దండంబున
బెళకి నిక్కిన వజ్ర మలయ మనఁగ
జన్మదేశ స్పృహా సంధావదుదయాద్రి
విశ్రాంతి హరివాజి విభుఁడనంగఁ
తే. గీ. గామినీ కాముకానీక కలితహృదయ
కల్పితా నేక సంకల్ప కల్ప శాఖి
నిర్మలస్ఫూర్తి గైకొని నిలిచెననఁగ
సిరి దనరె నప్పు డుదయించె శీతకరుఁడు. 216

వ. అంత ప్రభాతం బగుటయు. 217

క కెంజిగురు జొంపములతో
మంజులరుచి దొరయు గుజ్జు మావియపోలెన్
రంజిల్లె నుష్మకరుఁ డు స
మంజస తేజంబుచేయ మాధవుఁ డలరెన్. 218

వ. అప్పుడు కంసుం డొడ్డోలగంబై యుండ రామకృష్ణులు యుద్ధ రంగాభి
ముఖులై చనునెడ. 219

సీ. కువలయా పీడమౌ కువలయా పీడంబు
మావంతుఁ డత్యంత మత్సరమున
మావంతుఁ డప్పుడు మట్టింపఁ బూనిన
దంతంబు వెఱికి తద్దంతముగ్ర
శక్తిగావించి యాశౌరి చాణూర ము
ష్టికుల ముష్టిహతి సంస్థితులఁ జేసి
దరము పెంపున నిజోదరము భంగమునొందఁ
గంసుఁడుగ్రారి చిక్రింసుఁ డగుచుఁ
దమకమున నుండఁ బడఁ ద్రోచి తగఁజయించి
తల్లి దండ్రులఁ బూజించి ధన్యుఁ డైన
యుగ్రసేనునిఁ బాదాగ్ర యుగ్రసేనుఁ
జేసి పట్టంబుగట్టె నూర్జితముగాగ. 220

వ. అంత నా కృష్ణుండు సాందీపునియొద్ద సకల విద్యా ప్రవీణుండై గురు దక్షిణ యొసంగెదనని విన్నవించినఁదద్దేశికుండు ప్రభాసతీర్థంబున మునింగిపోయిన పుత్రులందిరుగం దెచ్చిన నదియ నాకు దక్షిణయని ప్రార్థించిన. 221

క. పంచ జనాకృతిగల హరి
పంచజనాఖ్య దైత్యు భంజించి విను
ర్శించి కయికొనియెఁ గరమునఁ
జంచద్రుచి మించు పాంచజన్యమునంతన్. 222

వ. బాణాసన శరఖడ్గాది సాధన విచిత్రంబైన యరదంబెక్కి కమలనాభుం డతిరయంబున సంయమనీ పురంబుచేరి బ్రహ్మాండంబు పగులునట్లుగాఁ బాంచజన్యంబు పూరించిన. 223

క. దండధరుఁ డంతఁ గని యు
ద్దండ ధరోద్ధరణ బాహుదండునకు ముహు
ర్దండానతి సేయుచు బ్ర
హ్మాండానతి దృశ్యమహిమ యపుడు నుతించెన్. 224

వ. నుతియించి వైవస్వతుం డొసంగినం గురుపుత్రుల నా హరి గురువునకిచ్చి. 225

క. అతిమానుష మతిదివ్యం
బతిలోకము నతివిచిత్ర మతిగూఢతరం
బతిసమ మతి వైభవగుణ
మతని మహిమ మరయ నజహరాదులవశమే. 226

## శ్రీకృష్ణుఁడుద్ధవుని గోపికల కడకంపుట

వ. అని యందఱు నెన్నందగు నమ్మహానుభావుం డొకనాఁ డుద్ధవునిం బిలిచి యేకాంతంబున నిట్లనియె. 227

క. తనువుం బ్రాణము దైవము
దనువుఁ హృదయంబు పరమతత్త్వము నేనే
యని నమ్మి గోపకామిను
లనఘా! యేమైరొ వారి నరయఁగ వలయుఁ. 228

క. ఏ నమ్మికగల వారల
మానకరక్షింతుఁ జాల మన్నింతుననున్
మానవతులఁ జూడని యా
మానవతులకేమి కొఱఁత మహితార్థంబుల్. 229

వ. అనియనిచిన నతండు నందవ్రజంబునకరిగి నందునియింట నద్దినంబెల్ల నధివసించి, మఱునాఁడు గోపికలం బిలిపించి కృష్ణ సందేశంబు విని పించిన వారలలోఁ బ్రౌఢయగు గోపకన్యక యొక్కర్తు ప్రాంతభృంగం బుతోఁగృష్ణానురాగ ద్యోతకంబగు నర్థాంతరంబు వొడమనిట్లనియె.230

సీ. బృందావనాంతరా మందవంజుల మంజు
కుంజఖేలా మనోరంజనంబు
యమునాతరంగిణీ ప్రహదఫుల్ల హల్లక
మధ్య సంక్రీడా సమగ్ర లీల
వ్రజ భామినీమణి ప్రకరధమ్మిల్లాగ్ర
కుంద సేవంతికా బృందకలన
రాధావిలాసినీ రమణీయ మాలతీ
చారు శయ్యా తలాస్పందనంబు

తే. గీ. మఱచితేనీవు మన్నించి మమత మించి
పాయనట్లనె బ్రమయించి పంతగించి
యుల్ల మలర రమించి లోనూరడించి
కేవ లారామ పరివర్తి కృష్ణమూర్తి. 231

వ. అని యివ్విధంబునం బలికిన గోపికల నూరడించి యుద్ధవుండు మరలి
చనుదెంచెనంత. 232

క. సింధువు పొంగెనన జరా
సంధుఁడు పరిభూత సత్యసం†ధుఁడు వచ్చెన్
బంధుర సింధుర సైంధవ
బాంధవహిత రథిక వీరబలములతోడన్. 233

వ. వచ్చి మధురఁ జుట్టుకొని యెదుర్కొన్న శౌరింజూచి యిట్లనియె. 234

## శ్రీకృష్ణుఁడు జరాసంధ కాలయవనుల జయించుట

చ. దరము వహించినట్టి నినుఁ దవ్వక కాచితిఁ బొమ్ము పొమ్ము భీ
కర తరమైన నాదు విశిఖంబున కోర్వఁగ నీకు శక్యమే
నిరతము నీ మనంబు నవనీతమయంబు రణంబు కొంచెమే
సురభులఁ గాయుటో మఱచి చొక్కిన కంసునినేలఁద్రోయుటో. 235

సీ. కరుణించి విడిచితిఁగదకు నేఁగుము గూఢ
మైన భావంబు సొంపౌనె నాకు
మందరాగ ధృతినందంబు నొందెద
వొంటిగాఁడవు నట లూనఁదగునె
అడుగులోననె మించి తడఁబడఁ జేయుదు
పరశూరుఁడన మించఁ బాటియగునె
ఘనమహోదధి పయోగర్వ వర్ధనుఁడవు
నీ వహార్యస్ఫూర్తి నెరపినావు
తే. గీ. సతులవ్రతములు జెఱిచితి జగములెఱుఁగ
మ్లేచ్ఛకోటి నెదిర్చినమేర నిచట
పూని నిల్చెదు విక్రమ స్ఫూర్తి మెఱసి
తవిలిమముఁ బోరఁ గెలువ నీ తరమె కృష్ణ. 236

---

†సంధ్యుండు (పా)

వ. అనిన గృష్ణుం డిట్లనియె. 237

ఆ. వె. మాగధుఁడవుగాన మన్నించి నీవాడు
పలుకులెల్ల నాత్మఁ దలఁపనింకఁ
బ్రాణభయములేదు బ్రతుకుము పోపొమ్ము
నిజపరాక్రమంబు నెరపనేల. 238

వ. అని పలుకనంత యాదవ మాగధవీరులు రోషంబున నన్యోన్యంబును రణంబొనర్చునెడ. 239

సీ. కరవాల శూల తోమరగదాపట్టి స
ప్రాసముద్గర చాప పరశుముఖ్య
వివిధాయుధముల నవ్వీరులొనర్చిరి
రథికుండు రథికుండు ప్రాసధరుఁడు
ప్రాసధరుఁడు హాస్తిపకుఁడు హాస్తిపకుఁడు
సాదియు సాదియు శక్తిహేతి
శక్తిహేతియుఁ బరశ్వధహస్తుఁడును బర
శ్వధ హస్తుఁడును బోరిశక్తిచూప
ఆ. వె. మస్తబాహు పార్శ్వ హస్త పాదాగ్రోరు
చర్మమాంస రుధిర శల్యకేశ
కవచపట శిరస్త్ర కటక కిరీటాదు
లాహవోర్విఁ గప్పె నక్షణంబ. 240

వ. అంత నయ్యుద్ధరంగస్థలంబు రంగస్థలంబునుం బోలెఁ జటులాశికలాస్య వర్షిత పతాకాది విన్యాసంబును, దండ కారణ్యంబునుంబోలె సుతీక్ష్ణ శరభంగప్రాప్తి కలితంబును మేరుగిరి శృంగంబునుంబోలె గైరిక రక్త నిర్ఝర తరంగంబును, సూర్యాస్తమయ సమయంబునుంబోలె విశ కలితాతపత్రాణంబునునై జగదభ్నురక్తవాహినులుంగలిగి శరపుంజం బులు నాట నుత్తానశాయులై ఖావి భీష్మాకారంబులుదాల్చు వీర వారం బును, బ్రగ్గిన ద్విరదంబులును మ్రొగ్గిన యరదంబులును విరిగిన భేరు లును గూలిన వీరులును నర్తించు ఢాకినులును రణంబు కీర్తించు శాకి నులుం గలిగి ఘోరంబయ్యె. మఱియు నివ్విధంబునం దగు రణంబుల మాగధుండు పదియాఱు మాఱులు పోరి వీఁగి మఱియు రణంబున కెదిరిన. 241

క. హలి వానిం దురమున నా
హలాహళిఁ బట్టి వధింపఁబూననప్పుడు కృష్ణుం
డలఘుతర ప్రియ భాషల
వలదని వారింపఁ గార్యవశమున విడిచెన్. 242

వ. జరాసంధుండుయుద్ధసన్నద్ధుండై యున్నయెడ నారదుండుతెలిపిన. 243

ఆ.వె. కాలయవనుఁ డమిత కల్పిత రిపునాయ
కాలయవనుఁ డంతఁ గంసవైరి
పురముఁ జుట్టుకొనిన హరి నిరాయుధవృత్తి
నెదుట నిల్చి కడకు నేఁగునంత. 244

సీ. తేజితాశ్వమునెక్కి ధీరుఁడై యాకాల
యవనుండు చనుదేర నంటకుండ
వాయువేగమునఁ బోవఁగ వాడు నేతేర
నంత మనోవేగ మడర వెడలు
వెడలు డగ్గరువానికడ నదృశ్యతనొందు
నయ్యదృశ్యత మాని యార్చి పేర్చు
వెఱచునోయన నిల్చు విఱిగిన యట్లేఁగు
నలసిన యట్లుండు నడలిదూరు
తే. గీ. నపుడె బయలెక్కు నగుఁ గేరు నరసిచూచుఁ
గఠిన పాషాణ కుశకంటకప్రరోహ
కాపథంబునఁ గోమలకమలవిజిత
చరణముల నడచుటకోర్చి చక్రధరుఁడు. 245

తే. గీ. హరియొక నగంబు గుహదూరనంత వాఁడు
గడిమిఁ జనుదెంచి కృష్ణునిఁ గానలేక
యందు నిద్రితుఁ డగు ముచికుందుఁ దాఁకి
భస్మమైపోయె ఖేచరప్రతతియలర. 246

వ. అంత. 247

సీ. ఆజానుబాహు నీలాంబుద నిభదేహుఁ
గౌస్తుభాభరణు లోకైకశరణుఁ
బీతకౌశేయుఁ గంపిత మహా దైతేయు
ధవళాబ్జనేత్రు నుత్తమచరిత్రు
మానితాఖండలు మణిమయ కుండలు
సులలాటు వైఢూర్య శుభకిరీటు
భక్తజనాహ్లాదుఁ బద్మజ నుతపాదు
వేదాంతనుతలోలు విబుధశీలు
తే. గీ. విశదమందస్మితముఖారవిందవిందు
సమధిగమ్యు సమంచితాచార చారు
వైజయంతీశుభ్రశ్రీనివాసు వాసు
దేవుఁ గృష్ణుని ముదము సంధిల్లఁగాంచి. 248

ఆ. వె. నాతపః ఫలంబు నాభాగ్యదేవత
నామనోరథంబు నాబలంబు
నా మహోదయంబు నాపుణ్యసంపద
యిటు లభించెననుచు నిచ్చనలరి. 249

వ. ఆ ముచికుందుం డిట్లనియె. దేవా! నేనిక్ష్వాకు కులసంభవుండ, మాంధాత పుత్రుండ, ముచికుందుండ. దేవకార్యంబొనర్చి యలసి యిట నిద్రించుచున్నవాఁడ. శంకరపితామహచక్రహస్తేంద్రానలాగ్నిచంద్రసూర్యులలో నేఘనుండ వని యడిగిన. నేఁ గృష్ణుండ. నిన్నుం గృపాకటాక్ష వీక్షణంబున నీక్షింపవచ్చిన చక్రధరుండ. ఇంక నొండు జన్మంబున బ్రాహ్మణుండవై భజించి నను జెందెదవనిపల్కి భక్తానుగ్రహకారియై యతని వీడ్కొనియె.నంత జరాసంధుండు పునరాయోధన సన్నద్ధుండై యరుగుదేర విశ్వకర్మచే సముద్ర మధ్యంబున ద్వారకాపురంబుఁ గల్పించుకొని మధురాజన సహితుండై యా హరియం దధివసించె నప్పుడు. 250

## శ్రీకృష్ణుఁడు రుక్మిణీసత్యభామలఁ బరిణయమాడుట

ఆ. వె. ఘనుఁడు రైవతుండు కంజాతసంభవా
నుజ్ఞచేత నిజతనూజ సకల
లోకధన్య రేవతీకన్య నర్పించె
హలధరుండు బెండ్లియాడెఁ బ్రేమ. 251

క. కుండినపతి యధిగతలో
కుండిన తేజుండు భీష్మకుండనఘుండా
ఖండల వైభవుఁడవనీ
ఖండల సద్గుణకలాప కలితుఁడు వెలయన్. 252

తే. గీ. ఇలఁ దగిరి రుక్మ ముఖ్యులు హేమశైల
ధీరులనఘాత్మ లేవురాశూరుసుతులు
వారికవరజ రుక్మిణి వసుమతీశ
కన్యగాదెంచ నంబుధికన్యగాని. 253

తే. గీ. భోజకన్యకు మానసాంభోజ సీమఁ
గలితమై కృష్ణపక్షంబు గలుగు టరుదె
భవ్యతరమైన ధమ్మిల్ల బంధసీమఁ
గృష్ణపక్షంబు గరిమ మిక్కిలియుఁ దనర. 254

తే. గీ. అధిపు జన్మాష్టమీదినమాలతాంగి
ఫాల భాగాంతరంబునఁ బరిభవింప
నర్ధచంద్రుండు గాన్పించె నతిశయమునఁ
బర్వములలోన నుత్తమ పర్వమగుచు. 255

తే. గీ. అజుఁడు శృంగారరసధారలతివమోముఁ
దమ్మి యలరార నరుదుగాఁ దాల్చెననఁగ
నఖిలలోకములకుఁజోద్య మావహిల్ల
నలికులాసితవేణి బొమ్మలు దలిర్చె. 256

క. నిరత హరికథామృతరస
పరిపూర్ణత కూపలీల భాసిలు నా కుం
దరదనకర్ణంబులు సిరిఁ
బరఁగు త్రిదోషఘ్నరస శుభస్ఫూర్తిదగన్. 257

ఉ. చేరలమీఁద నెక్కుడగు చెల్వొనటింపఁ జకోరలక్ష్మితోఁ
దోరపుఁజాయ కల్మిఁదులఁదూఁగి మెఱుంగులుగాదె బోయె మిం
చౌ రహిఁ బూనికాయజ శితాస్త్రములేకరసానదేరె నా
నారమణీలలామకు నొయారముగుల్కుచుఁ బొల్చు నేత్రముల్. 258

తే. గీ. పసిఁడి సంపెంగ విరిచాయ భామమేను
నలువగావించెఁ గాకున్నఁ బొలఁతినాస
జిగికల తదీయ కళికచేఁ దగునొనర్చె
మనుజులకు మచ్చుచూపఁ బూనునె యతండు. 259

ఆ. వె. అంబుజంబు పూర్ణిమాంభోజవైరి యొ
క్కటియ కమ్మటంచు గారవించి
యతివ మోము చెంత నతనుండు తనవాలు
ముట్టనిలిపెననఁగ మోముదనరె. 260

క. ఘనవదన కళాప్తికి ముద
మునఁ జంద్రుఁడు రెండురూపములు గైకొని ని
ల్చెను నేఁడు రెండువంకలు
ననఁగా రాజాస్యచెక్కుటద్దము లమరెన్. 261

తే. గీ. రాజు తమ్ముల హెచ్చించి రహియొసంగఁ
దలఁపఁడనువార్త నిజముగా నెలఁతమోము
రాజలక్ష్మి వహించి నిరంతరంబు
తమ్ములను గొంచెపడఁ జేసి తానె మించె. 262

తే. గీ. అక్షియుగళి విశాలమాయ యరగౌనె
మధురభాషా చమత్కృతి మణిపురంబు
తను లతికగాఁగ సతికిఁ జిత్రంబె కంఠ
భాగమునఁ జూడ శంఖ సంపత్ప్రశస్తి. 263

క. లలనామణి భుజములు బిస
ములెయగుఁ గాకున్న సిరులువూనిన హస్తో
జ్జ్వల జలజములును రోజం
బుల పేరిటి జక్కవలును బొలుచునె చెంతన్. 264

తే. గీ. తగుబిలము పొన్నపువ్వును దెగడునాభి
చేరికఁ దనర్చు నింతినూగారు తీరు
నీలఫణి తేఁటి చాలును బోలియమర
మధ్యమాయానమాగత మహిమ మెఱయ. 265

తే. గీ. ఏతదీయాంశమేనుమీ యేనటంచు
నమ్మహీకాంత నిజమండలాకృతిం ద
దవయవంబులలోన నొండయ్యె ననఁగ
బెళుకుఁ జాయల నాయింతి పిఱుఁదు దనరె. 266

క. చక చక నేమించినయా
ముకురానన యూరుయుగము మోహనకాంతుల్
ప్రకటించి మెఱయఁ "గదళీ
నకదాచన" యనిరి బుధజనంబులు బళిరే. 267

తే. గీ. ధన్యతారుణ్య వీరరత్నంబు బాల్య
విగ్రహంబునకై వచ్చి విజయమంది
యపుడు కతనిల్పు శరధులయట్లు మెఱసెఁ
గలిత రుచిపొల్చుకన్య జంఘాయుగంబు. 268

తే. గీ. కలికిచాయ నిశాలీల కడకుఁ దరమఁ
బొదలె నరుణోదయస్ఫూర్తి పదములందు
నబ్జవికసనమును హంసకారవంబు
నచ్చటనె మోహనంబుగా నావహింప. 269

వ. పాదరేఖా కలితధ్వజ కలశాతపత్ర చిహ్నయై పరిపూర్ణ యౌవనయగు నా రుక్మిణీసుందరి కాంచనాంబరచందనానులేపనమహాభూషణ సురభి మాల్యాలంకారభాస్వరయైయున్నయంత నారుక్మిణికిం బరిణయంబు సేయుటకై 270

క. శిశుపాలుండర్హుఁడు హరి
పశుపాలుండనుచు రుక్మి పాణిగృహీతీ
వశగతు భీష్మ నొడంబడ
నిశితమతిందెలుప లగ్ననిశ్చయమైనన్. 271

వ. వారు శిశుపాలునిం బిలువనంపిన. 272

క. మాగధ సాళ్వాదులతో
సాగరముప్పొంగె ననఁగఁ జైద్యుఁడు మదవ
న్నాగరథ హయ పదార్భటి
నాగరకులు మెచ్చవచ్చె నవ్యస్ఫూర్తిన్. 273

వ. అప్పుడు. 274

ఆ. వె. శౌరి చక్కఁ దనము సత్వాతిశయలన
ద్గుణములఖిల విబుధకోటివలన
వింతవింతగాఁగ విని వినిశిత
కంతుకుంతనిహతిఁ గ్రాగి క్రాగి. 275

క. ఆరుక్మిణి యొకవిప్రుని
సారజ్ఞునిఁ బిలిచి కలిత సంకేత రహ
స్యారూఢ శోభనోత్సవ
చారుతరాత్మీయ వృత్తసందేశంబుల్. 276

వ. తెలియంబల్కి కృష్ణ సాన్నిధ్యమునకుం బంపిన నా భూసురుని వలనఁ గృష్ణుండు తద్వృత్తాంతంబంతయు విని యతిరయంబున దారుకానీత స్యందనంబెక్కి బలరామ సహాయంబుగాఁ గుండిన పురంబునకుంజని భీష్మకుం డెదురుకొని యొక్క యుచిత సౌధంబున నునుప నుండె నంత. 277

సీ. హరి యద్భుతముగాఁగ నరిగి రుక్మిణిఁ బట్టి
రథముపై నిడుకొని రామసహితుఁ
డై మాగధాదులతో మొనయై చైద్యుఁ
డని సేయఁ దద్బల మణఁచి వైచి
గర్వాంధుఁడై రుక్మి గవిసిన నతని యో
ధావళి నురుమాడి హరి కఠోర
కరవాలమున నొంపఁ గదిసిన భీష్మక
కన్యక విడిపింపఁ గనలివాని
తే. గీ. కచ విఖండనమొనరించి కాచి యనిచి
పాంచజన్యంబుఁ బూరించి బహుళ జైత్ర
చిత్రవాదిత్ర ఘోషంబు చెలఁగ ద్వార
కాపురంబున కేఁగె శృంగారలీల. 278

వ. ఇట్లు కృష్ణుండు ద్వారకాపురముఁ బ్రవేశించి రుక్మిణిం బరిణయంబగుటకు నుత్సాహంబు మెఱయనుండిన గర్గుండు శుభముహూర్తంబు నిశ్చయించెనప్పుడు. 279

సీ. ప్రతినికేతన చిత్రపటమంటపంబును
ప్రత్యంగణాంచిత భవ్యనవ్య
కర్పూర మృగమద గంధిలంబును ప్రతి
ద్వార రంభాస్తంభ దామకంబుఁ
బ్రతి రాజవీథి సద్భట తోరణంబును
బ్రతి నిమేషాహతపటహ రవము
ప్రతి భూసురాశీః ప్రపంచ సంధానంబు
ప్రత్యహనవనవారంభకంబు

తే. గీ. ప్రతి రథాశ్వగజశ్రీశుభక్రమంబు
ప్రతి కులస్త్రీ పురుషకళాభ్యంచితంబు
ప్రతి సమోజ్ఝితశృంగారబంధురంబు
నైననగరంబు కనుపండు వయ్యెనపుడు. 280

వ. అప్పుడు శోభనాలంకార భాసురంబైన తన నగరిలోనఁగృష్ణుండు మంగళ స్నానంబాచరించి వివిధభూషణ శోభితుండై కల్యాణగృహ వితర్దికపై బంధుజన సహితుండై రుక్మిణియుం బరిణయోచిత శృంగారంబుమెఱయ నెచ్చెలులు దోడ్కొనిరాఁగ నూత్నరత్న నిర్మితంబైన శోభనగృహంబు చెంత నిల్చెనప్పుడు వివిధ వాద్యధ్వనులు వసుదేవ బల భద్రోదిత తచ్ఛుభ సంభ్రమంబులును వెలసి యప్పుడు గర్గాదులిది శుభముహూర్తంబని వలుక మంత్రపూతంబైన హరిచేఁదనకు రుక్మిణి కన్యక యాత్మదానం బొనర్చినఁగైకొని భీష్మకునకు ధన్యత్వం బొసంగె నప్పుడు మరియును. 281

తే. గీ. శుభకరంబైన మంగళ సూత్రమపుడు
కట్టెఁ గృష్ణుండు రుక్మిణిగళమునందు
నకుహకోక్తుల మాధుర్య మందనుండు
గళమునకు మెచ్చొసంగిన కరణిగాఁగ. 282

క. తలఁబ్రాలువోసెఁ గృష్ణుండు
కలకంఠీమణికి భీష్మకన్యకకుఁ బయో
జలధి సుధాకణములతో
వెలువడి చనుదెంచు కమల విధమునఁదనరన్. 283

తే. గీ. హరికిఁ దలఁబ్రాలువోసె భోజ్యాలతాంగి
రాధికాధరబింబ ధారాళతరసు
ధారసోన్మిశ్రమోహౌషధంబు నిగ్గ
మించి తలకెక్కెననను వెడలించెననఁగ. 284

ఉ. ఒప్పులకుప్ప రుక్మిణి సహోదరనేయములైన లాజలిం
పొప్పరమాత్మమూర్తి మదినుండగ వేల్చెఁ గృశానునందుమైఁ
గప్పె వినీలధూమరుచికజ్జల సజ్జలబిందువారముల్
జిప్పిలె లోచనాబ్జములచెంత జనుల్ ప్రమదంబు నొందఁగన్ 285

తే. గీ. మంజుమంజీరమాణిక్యపుంజకాంతి
వాహినీమధ్యమున కరవనజ మత్స్య
మకరరేఖలు వెలయ నశ్మము వధూప
దమున మెట్టించె శౌరిచిత్తంబుగరఁగ. 286

తే. గీ. విమల శాల్యన్న మాజ్యాన్నపీనముద్గ
శర్కరాపూప ఫలరస క్షౌద్రదధి ప
రంబు లానందముగఁ బ్రమదంబుతో భు
జించిరప్పుడు భూసుర శ్రేష్ఠులచట. 287

క. గోపాల మౌళియాత్మా
రోపణ మగ్నికి ఘటించె రూఢింజైద్య
క్ష్మాపతి తేజః పావకు
నీవగిది హరింతుననుచు నెఱిఁగించుగతిన్. 288

వ. ఇవ్విధంబునం గల్యాణంబు పరిపూర్ణంబగుటయు నవ్వాసు దేవుండు ప్రమోదంబు వహించుచు సకలోత్సవంబులు ననుభవించె నంత నొక్కనాఁడు. 289

సీ. అఖిల విచిత్ర వాద్యములు గాంధర్వ వి
ద్యారూఢ వివిధ నృత్యములు భూసు
రాశీర్వచోఘోష మఖిలదేశాగత
రాజన్యమాన్యపరంపరలును
గంధమాల్యోల్లోచకంబులు పుణ్యా సా
ధ్వీశుభగీతముల్ దివిజముక్త
కుసుమ వర్షంబులు గురుతరోద్దీపిత
కరదీపకోటులు గజతురంగ

తే. గీ. గణము గొడుగులు పెక్కెముల్ కలితసుభట
వంది మాగధ జననుత వైభవంబు
దనరు శోభన మంటపాంతరము నందు
ననమమాణిక్య పీఠిక నధివసించి. 290

తే. గీ. పద్మమిత్రప్రసాదలబ్ధన్యమంత
కమణితో సత్రజిత్తురానమరుదద్వి
శాలరత్నంబు రవియని సంశయంబు
నపుడు దెలిసి మురాంతకుం దభిలషింప. 291

తే. గీ. బహుధనమునకు నీకయల్ప మతినేఁగె
నతఁడు తత్సోదరుఁడు మృగయావిహార
మునకు నామణిఁ బూని తాఁబోవనంత
నడవిలోపల మృగరాజ మతనినడఁచె. 292

తే. గీ. జాంబవంతుండు దానిఁ దత్సమయమున హ
రించి మణిఁ గొని గుహలో వసించె నంత
సత్రజిత్తుఁడు నిందింపఁ జక్రధరుఁడు
సత్రజిద్దేవముఖ్యులు సన్నుతింప. 293

వ. పౌరజనంబులు దానును నరణ్యానీకమధ్యంబునకు నేఁగి. 294

క. కూలిన హయముఁ ధరపై
వ్రాలిన నా ఘనుఁ బ్రసేను వధియించి ధరన్
దూలిన సింహముఁ దెలుపం
జాలిన భల్లూకపాద సరణియుఁ గాంచెన్. 295

వ. కాంచి తత్పాదసరణిఁజాంబవన్నివాసగుహాద్వారంబు చేరి. 296

ఉ. ఆ గుహవాతనందబనిజాప్తులనుంచి మురారిచొచ్చి తే
జోగరిమంబు కల్మి పరసూర్యుఁడపోలె వెలుంగు తన్మణి
శ్రీఁగని యంది పుచ్చుకొని చేరిన భల్లుకరాట్సుతాంగర
క్షాగతధాత్రి బొబ్బలిడ నా ముదియెల్గు మహోగ్రమూర్తియై. 297

వ. కదిసిన. 298

క. ఉద్ధతులై యిరువురును ని
యుద్ధముఁ గావించి రాగ్రహోద్ధవముల భూ
భృద్ధీరులు పరబల స
న్నద్ధులు జయకౌశలైక నయనిధులనఁగన్. 299

క. చరణంబులఁ జరణంబులఁ
గరములఁ గరములను గదల గదలన్ నఖరాం
తరముల నఖరాంతముల
నిరువదియెనిమిది దినంబులిరువురుఁబోరన్. 300

ఆ. వె జాంబవంతుఁ డాత్మశక్తి జయించిన
శక్తిగలుగు కృష్ణు జగముఁ బ్రోచు
నాదిదేవుఁడా చరాచరకర్త నా
రాయణుండె యనుచుఁ బ్రస్తుతించె. 301

సీ. జయ జయ రఘుకుల చక్రీశ తాటకా
హరణ, విశ్వామిత్రయాగభరణ,
అనఘ, యహల్యాఘహారి, శంకర ధను
ర్భంజన, జానకీ ప్రాణనాథ,
భార్గవ భుజదర్పభంజన, పితృవాక్య
పాలన, ఖరముఖ ప్రళయకాల,
సుగ్రీవవరద, యశోనిధి, వాలి మ
ర్దన, వారిబంధన, దర్పితోగ్ర
తే. గీ. కుంభకర్ణాతికాయాది కుటిలదైత్య
వీరసంహార, రావణ ద్విపమృగేంద్ర,
పుష్పకాన్విత సాకేతపురి నివేశ,
రామ, శైలతనూజాభిరామనామ. 302

క. దాసానుదాసుఁడను నేఁ
జేసిన యపరాధ మాత్మఁ జింతింపక సీ
తాసఖ నను రక్షింపవె
వాసుకికంకణ విరించివందితచరణా ! 303

వ. అని జాంబవంతుండు మఱియును బ్రస్తుతించిన. 304

సీ. హరి ప్రసన్నాత్ముఁడై యతనిఁ గౌగిటఁజేర్చి
యపవాద మొదవిన నరుగుదేర
వలసె శ్యమంత కాహ్వయ రత్నమిచ్చినఁ
దదపవాదము నాకుఁ దప్పెననిన
నా దివ్యరత్నంబు నాత్మజారత్నంబు
నతఁ డొసంగఁగఁ బురి కరుగుదెంచె
గుహలోనఁ దానుండి గురుతెఱుంగక వచ్చి
ప్రలపించి తిరిగెడు బంధువర్గ

తే. గీ. పౌరవర్గ సుధీవర్గ పార్థివేంద్ర
వర్గ మునివర్గములుమెచ్చ వాసుదేవుఁ
దమ్మణి యొసంగె సత్రాజితాఖ్యునకు ని
జాంతరంగమ్మునందు హర్షాబ్ధి విరియ. 305

తే. గీ. అతఁడు లజ్జించి యపరాధమణఁచికొనఁద
లంచియారత్నమును సుకశాకలాప
యైన యా సత్యభామ ప్రియాశయమున
వచ్చి సద్భక్తి కానుక యిచ్చె హరికి. 306

వ. అప్పుడు కృష్ణుండు సత్రాజిత్తునకు మణి మరలనిచ్చి సత్యభామం బరిగ్రహించె నంత నరకాసురకారాగృహగృహీతలైన రాజకన్యలు పదాఱువేవురును శౌరికి నిజవృత్తాంతంబెఱుకపడంజేసిన సంభ్రమంబు మెఱయనా హరి సత్యభామాసమన్వితుఁడగుచుఁ జతురంగబలయుతుండై తత్పురంబునకుం జనిన. 307

## నరకసంహారము — పారిజాతాపహరణము

క. అప్పుడు భౌముఁడు మదముల్
చిప్పిలు సింధురమునెక్కి క్షితినసిదీప్తుల్
కుప్పలుగాఁ దద్భువన క
కుప్పలల భుజుల్ భుజింపఁ గ్రోధోద్ధతుఁడై. 308

వ. ఎదిరిన యా కృష్ణుండును నతనిపైఁ గవిసి యనేక దివ్యబాణంబులేసిన నాధరానందనుండును నా కృష్ణుని బాణంబులం ............ నట్ల యిరువురు మచ్చరంబులెచ్చ బహువిధ శస్త్రాస్త్రఘాతంబు లొదవఁ బోరు

నెడ హరి సంతసిల్ల సత్యభామ యిప్పుడె నరకాసురుని ఖండించెద మదీయ యుద్ధచాతుర్యంబు చూడుమనిపల్కి వీరశృంగార రసనిధియై కుచంబులపై జారు పయ్యెదకొంగు పదిలంబుగా నవరించి కీలుగంటు బిగువుగా ముడిచి కరంబున శరచాపవల్లి మెఱయ జన్య సన్నాహంబు మెఱయనున్నయెడ. 309

క. ఆ చూపుఁగోపు సొగసును
నా చాపాకర్ణనంబు నా యుద్ధకళా
వైచిత్రియుఁ జిత్రంబై
గోచర గోచరుల కపుడగోచరమయ్యెన్. 310

ఆ. వె. చక్రధారుఁ ద్రుంచెఁ జక్రిదానవలోక
చక్రవర్తి శిరము చదలనమర
చక్రమెల్లఁ జూచి సంతోషమంద నా
చక్రవాళధరణిచక్రమద్రువ. 311

వ. అప్పుడు మణికుండలంబులును వైజయంతియు వరుణదత్తసితాతపవారణంబునొక మహాదివ్యరత్నంబునొప్పగించి భూదేవి మురారాతిం బొగడిమ్రొక్కి. 312

క. భగదత్తుండను తత్సుతు
నగణీయదయావిలోకనామృతవృష్టిన్
జగదేకపతీ! ప్రోవుము
తగునాశ్రితరక్షణంబు ధర్మాత్ములకున్. 313

వ. అని మఱియు నుతించిన యా భూదేవికిం బ్రసన్నుండై భగదత్తునకుఁ దద్రాజ్యాధిపత్యంబొసంగి. 314

క. కాంతులవింతల దగు చౌ
దంతుల వరరూపవిభవధన్యాకృతులన్
గాంతలఁ బదారు వేవుర
నంత మురాంతకుఁడు వంపె నా ద్వారకకున్. 315

వ. అప్పుడు కృష్ణుండు సత్యభామా సహితుండై గరుడాధిరోహణంబు మెఱయ నమరావతికిం జనిన సురాధినాథుం డెదుర్కొని సంభ్రమించి యింద్రుని నగరు ప్రవేశించి యందు. 316

తే. గీ. అదితి దేవికి దివ్యంబులైన కుండ
లంబులిడి యింద్రుచేఁ బూజనంబులొంది
నందనంబునకేఁగి సనందనాది
వందితుఁడు పారిజాతంబు వన్నెఁజూచె. 317

వ. చూచి యా దివ్య మహీజాతంబు గైకొని 318

క. ఖగరాజు మీఁద నిడుకొని
ఖగవీథిం జనఁగ శరనికరవర్షములన్
ఖగవాహనులై కురిసిరి
ఖగముఖ్యులు దివిజరాజు గర్వము మెఱయన్. 319

క. అపరాజితాధిపుఁడు హరి
యపరాజితమూర్తియైన యమరేంద్రుఁడు శౌ
ర్య పరాజితుఁడై యుండఁగ
నపరాజితుఁ జేసి యతని ననిచెన్ బురికిన్. 320

వ. ఇట్లనిచి కృష్ణుండు నిజనగరంబు ప్రవేశించి సత్యభామా గృహంబునఁ బారిజాతంబు నిల్పి యా రాజకన్యల ననేక రూపంబులు ధరియించి బహువిధ సుఖంబు లనుభవించుచు నుండెనంత. 321

## ప్రద్యుమ్న వృత్తాంతము

శా. వింతల్మీఱ నవంతిదేశపతులా విందానువిందుల్ శుభ
స్వాంతుల్ సోదరిమిత్రవిందకు ఘన స్వాయంవర శ్రీల న
త్యంతప్రీతిగ రాజులంబిలిచి యాస్థానిన్ విజృంభింపఁగా
నెంతే సంభ్రమమొప్పఁ గృష్ణుఁడు భుజోదీర్ణ ప్రతాపోగ్రుఁడై. 322

వ. ఆ మిత్రవింద నపహరించి నిజపురంబునకుం దెచ్చి యా కన్యకను వరించి హరి శుభంబున నున్నయంత. 323

ఉ. కోసల దేశమేలు నృపకుంజరుఁ డొప్పగు నగ్నజిత్సమా
ఖ్యానుభగుండు తత్తనయయై తగు నాగ్నజితిన్ దటిత్ప్రభా
భాసురగాత్రిఁ జక్రి వృషభప్రవరంబులమూఁటినాల్గిటిన్
గేసరియట్లు పట్టి పెళకించిజయించివరించెనంతటన్. 324

క. కరులొక తొమ్మిది వేలును
గరివరశతగుణములైన ఘనరథములు ద
ద్వర రథ శతగుణ హయములు
హరి శతగుణభటుల నృపతి యల్లునకొసఁగెన్. 325

వ. మఱియుఁ బదివేలు ధేనువులును సకల భూషాభిరామరామా సహస్ర త్రయంబునునగ్నజిత్తుతనకు నొసంగంగైకొనినాగ్నజితి సహితుండై ద్వారకానగరంబుఁ బ్రవేశించెనంత 326

క. భద్రయను మేనమఱఁదలి
భద్రగుణాన్విత దివ్యభామాజనశుం
భద్రత్నముఁ గైకేయిన్
భద్రవిమర్దనుఁడు శౌరి పరిణయ మయ్యెన్. 327

వ. అంత 328

క. మద్రనృపాలు సుతన్ రుచి
మద్రత్నము లక్షణన్ సమస్తారి మనో
మద్రాజగణము చూడ న
మద్రక్షకుఁడట వరించె మహితోత్సవుఁడై. 329

వ. మఱియుం బాండవులఁ జూడ నింద్రప్రస్థపురంబునకుంజని అర్జున సహితుండై వేఁటలాడుచుఁ గాళిందీపులినప్రదేశంబుననున్న కాళింది కన్యను వివాహంబై ద్వారావతికి వచ్చెనిట్లు. 330

తే. గీ. భవ్యయగు రుక్మిణియును జాంబవతి సత్య
భామ కాళింది మిత్రవిందా మృగాక్షి
నాగ్నజితి భద్రలక్షణా నలినముఖియు
ననఁగ నెనమండ్రు ప్రియభార్య లగుచునుండ. 331

వ. సంతోషంబున శౌరియుప్పొంగుచుండనంత నొక్కనాఁడు. 332

సీ. భోజకన్యాగర్భమున దర్పకుండు ప్ర
ద్యుమ్నాభిధానంబుతో జనింప
శంబరుఁ డరియని జలధి వైవ నతని
నొకమీను మ్రింగ మహోగ్రశక్తి

జాలికుల్ తెచ్చి తచ్ఛంబరదైత్యు మ
హానసంబున కపు డప్పగింప
యడబాలలంతట నా మీను శోధింప
నందుదయించిన యట్టి బాలుఁ
తే. గీ. గాంచి మాయావతీ సమాఖ్యన్ వసించు
రతికి నెఱిఁగింప నంత నారదుఁడు తత్క్ర
మంబుఁ దెలుపంగఁ దెలిసి శంబరుని నడిగి
చెలువ రతి తత్కుమారుఁ జోషించుచుండ. 333

క. చక్కఁదన మెమ్మె చూపఁగఁ
జక్కిలి గిలిగింతగొల్పె జవరాంద్రకుఁ దా
నక్కామరుండు మరుండగు
దక్కిన వారలకు నిట్టి తనుకళగలదే. 334

క. చిలుకుల వాలుంబువ్వుల
యలుగులెనాబాలువిల్లు ననిలరథంబున్
గల జగజోదితఁడని మదిఁ
దలఁచిరి శంబరుఁడు దక్కఁ దక్కినజనముల్. 335

చ. పలుకులలోన మోహములు పైకొని నవ్విన ముద్దునవ్వులున్
వలపులు వెల్లిగామెఱయు వాలుఁగనుంగవబొల్చు చూపులున్
గులికెడు బాహుమూల రుచి గుబ్బచనుంగవ చాయ వేఱులై
కలయఁగ నారతిప్రమదకంతునిఁ బైకొనియెం బ్రియంబునన్. 336

వ. అప్పుడప్పువ్వులవిలుతుండు రతివలనఁ దద్వృత్తాంతంబంతయుం
దెలిసి సర్వశత్రు వినాశినియైన మహామాయా విద్యంగాంచి. 337

క. శంబరదైత్యసముద్భట
శంబరయోదార ఘోరశాతాసితలన్
శంబరపోతమువోలెన్
శంబరనిధిశాయిసుతుఁడు చయ్యననోర్చెన్. 338

తే. గీ. అంతరతి గగనాధ్యంబునందుఁ బతియుఁ
దానుఁజని ద్వారకాపురోత్తంసహంస
మండలోద్దండ మాణిక్యమండలప్ర
కాండసౌధాగ్రమున నిల్చి కాననయ్యె. 339

క. రాజీవధ్వజుఁగని వర
తేజము రుచిరాంగనవ్యదీప్తియు ధవళాం
భోజములఁబోలుకన్నులు
రాజిల్లఁగ శౌరియనుచు రమణులు గదియన్. 340

ఆ. వె. ఆత్మ చల్లనగుట కానందబాష్పంబు
ధారలుప్పతిల్లఁ దగఁ గుచములు
చేపి పాలుగురియఁ జెంత రుక్మిణి నిజ
సఖులుఁ దానుఁ గొంత సంభ్రమించి. 341

క. జటిలాలకయై గంగా
తటినీతటినెట్టి తపముఁదగఁ జేసెనొ నేఁ
డిటువంటి కొడుకుఁగాంచిన
కుటిలాలక భాగ్యరేఖకుం గడ గలదే. 342

వ. అని పలుకుచున్న నారదునివలనందత్పూర్వ వృత్తాంతం బంతయు నెఱింగి కృష్ణుండు తత్సమీపంబునకుంజనుదెంచె వసుదేవదేవకీ బలరాములు తద్విధం బెఱింగి ప్రమోదాన్వితులైరి. భోజకన్యక తనకు వందనంబులు సేయు సుతునిం గోడలి నక్కునంజేర్చి చక్కనెత్తి బహూకరించె నంత వారలందఱును నిజస్థానంబులకుం జనునట్టియెడ. 343

క. ఆమ్నాయనికాయాజ
స్రామ్నాత సుకీర్తిశాలియగు హరికి లస
ద్యుమ్నరుచికి రుక్మిణికిఁ బ్ర
ద్యుమ్నుఁడతఁడు తిరుగఁగలిగి యుత్సవమొసఁగెన్. 344

వ. అంతఁ బూర్ణయౌవన కళాభివృద్ధిగాంచిన ప్రద్యుమ్నకుమారునకు. 345

క. రుక్మితనయ నొసఁగెదనన
రుక్మాంబరుఁడాప్తజనవరులు బాంధవులున్
రుక్మిణ్యాదులు రాఁగా
రుక్మరథంబెక్కి తగుసిరుల్ దళుకొత్తన్. 346

వ. కుండినపురంబునకుంజని రుక్మినందనం బ్రద్యుమ్నునకు వివాహంబు చేసినవిమ్మట. 347

తే. గీ. భద్రతరమూర్తియగు బలభద్రునెదిరి
దర్పమొప్పంగ రుక్మిజూదమునఁ గనలి
ప్రల్లదములాడఁ దీవ్రకోపమున వాని
శిరముఁద్రుంచెను వరఘోర సీరమునను. 348

వ. అంతఁ గృష్ణుండు తమవారినందఱిందోడ్కొని ద్వారకాపురంబున కుంజని సుఖంబుననుండునంత. 349

## శ్రీకృష్ణుఁడు బాణాసురుని నోడించుట

క. శోణపురము రిపుశోణిత
శోణపురస్థలమునేలు శూరుఁడు ఘనుఁడా
బాణుఁడు పరితోషితహరి
బాణుఁడు సంపూర్ణ కీర్తిపౌరుషమహిమన్. 350

క. చండీపతి తాండవమున
మెండైన మృదంగరవము మెరవడిచే ను
ద్దండత మెప్పించిన దో
ర్దండంబులు వేయుగలిగెఁ దద్దైత్యునకున్. 351

తే. గీ. తద్భుజాదండకండూతి దండినైన
దండినైనను తృణముగాఁ దలఁచి చంద్ర
ఖండజూటుని రమ్మను ఖండనమునఁ
గండనున్నట్టి రక్షఃప్రకాండమమర. 352

సీ. బాణాసురునిపుత్రి పరిపూర్ణయౌవన
నుషయను కన్య సౌధోపరిప్ర
దేశంబునందు నిద్రింప మోహనశుభా
కారుండు హితచాటుకారుఁడమల
శృంగారనిధిశుభశ్రీశాలి యనిరుద్ధుఁ
డనిరుద్ధుఁడై యదృశ్యత వహించి
ప్రథమ సంపర్కసంపద వెల్లివిరియించి
చనినమేల్కాంచి యాచంద్రవదన
తే. గీ. నాల్గువంకల నీక్షించి నవ్యదివ్య
గంధమాల్యానులేపనాక్రాంతతను ర
తాంతకళ దనకెంతయు వింతగాఁగ
హర్షఖేదంబు లుప్పొంగ నచటనిల్చి. 353

ఉ. ఎన్నఁడు గాంతు నాదు హృదయేశ్వరునెప్పుడు గౌఁగిలింతు నా
చన్నులతీపు నన్వేడలఁ జక్కెరమోవిసుధారసంబు నే
నెన్నడువిందుసేయుదు మహేంద్రుడొ చంద్రుఁడొయారతీంద్రుఁడో
యున్న మనుష్యమాత్రుఁడె యనూనమహత్వ విలాససంపదన్. 354

వ. నిద్రాసమయంబున ననుంగూడిన విభుండు కనుపట్టండయ్యెనని మదన బాణ మోహితయై యా యుషాకన్య యివ్విధంబునఁజిత్రరేఖయను చెలి కత్తెకు నెఱింగించిన నదిచిత్రపటంబునందుసురాసురనాగనరలోకంబుల ఘనులైన సౌందర్య నిధుల వ్రాసి చాతుర్యంబుమెఱయించినంజూచి యందుననిరుద్ధుంగాంచి లజ్జావనతముఖియై తదాసక్తభావంబుఁ దెలుప నా బాణతనయతోడ నీవిభుని సత్వరంబుగాఁ దెచ్చెదనని పలికి యా చిత్రరేఖ సంభ్రమంబున 355

ఆ. వె. ద్వారవతికినేఁగి యారామ మాయచే
నడరి దివ్యరత్నహర్మ్యడోలి
కాంతరస్థుఁడైన యాయనిరుద్ధుఁ జొ
క్కించి తెచ్చె పంతగించి యపుడు. 356

వ. తెచ్చినయతనితో బహుదినంబులు మదనకేళి విహరించుచునుండ నుషకు గర్భంబైనఁ దద్రక్షకులెఱింగి బాణునకు విన్నవించిన నతండు ఘోరాహవంబున ననిరుద్ధు నాగపాశబద్ధుంజేసె నంత నారదుని వలనఁ గృష్ణుండు తద్విధం బంతయు నెఱింగి. 357

క. బలభద్ర ప్రద్యుమ్నా
దులతో రథమెక్కివచ్చి దుర్వారభుజో
ద్బలమునఁ జక్రాద్యాయుధ
ములు మెఱయన్ శోణపురిని ముట్టడిచేసెన్. 358

తే. గీ. హరిహరులుగూఢ కర్ణకుంభాండ ముసల
హస్తులును సాంబ బాణాసురాత్మజులును
శంబరారాతి తారక శాత్రవులును
బాణ శైనేయులును రణక్షోణిఁ గదిసి. 359

క. శరకుంతముసలపట్టిస
కరవాలగదాస్త్రశస్త్రగణకోటులచే
సరిఁ బోరిరి జయకాంక్షా
పరులై బ్రహ్మాండమెల్లఁ బటపటఁ బగులన్. 360

వ. అప్పుడు. 361

క. బాణసుతుఁడేఁగెఁదనకుం
బ్రాణము దక్కించుకొని కృపాణము జారన్
బాణుఁడు వణఁకుచు సాత్యకి
బాణంబుల నిలువలేక భంగమునొందెన్. 362

క. ముసలధరుభయముకడువె
క్కసముగఁ గుంభాండగూఢ కర్ణులు చనిరా
యసమాన ఘోరసంగర
వసుధయు నేరికిని జూడ వశమే యెదుటన్. 363

తే. గీ. హరుఁడు బ్రహ్మాస్త్రముఖ్య దివ్యాస్త్రవితతి
శౌరిపైనేయ హరివాని సంహరించి
జృంభణాస్త్రంబుపైనేయ శంభుఁడంత
నుక్షకకుదాంతరంబుపై నొరిగి సోలె. 364

వ. తత్సమయంబున బాణుండెదిరి. 365

తే. గీ. పంచశతబాహువులను చాపములుదాల్చి
శాతసాయకములు వైవ శౌరి తచ్ఛ
రాసనంబులుద్రుంచి రథ్యములు నొంచి
సారథి హరించి యతని తేజంబణంచి. 366

వ. నిలుచునెడ. 367

క. కోటర పరిశుష్కవదన
కోటరయై సుతునిఁగావఁగ్రొమ్ముడివీడన్
శాటంబుజారభీతి ని
శాటంబు రణస్థలాగ్ర మప్పుడు చొచ్చెన్. 368

వ. బాణుండు భయంబున నిజపురంబు సొచ్చెనంత హరుండు త్రిశిరఘోర
మూర్తియగు నుగ్రజ్వరంబుఁగల్పించిన దాని నతిశీతల జ్వరంబు
గల్పించి హరి హరించెనంత. 369

ఆ. వె. కదిసె బాణుఁడెదిరి కయ్యంబుననుశౌరి
చక్రియును నుదార చక్రధార
నతని బాహుశాఖలన్నియు ఖండించె
నాల్గుదక్కఁదత్ క్షణంబునందు 370

వ. అంతహరుండు ప్రార్థించిన హరికరుణ వహించి ప్రహ్లాద వంశజుండు గావున వీనింగాచితి ప్రమథాగ్రేసరుండవైన నిన్నుఁగొలిచి యుండుంగాక యని బాణుని మన్నించియాహరుని వీడ్కొల్పిన నాఘనుండు నిజేచ్ఛం జనియె నంతఁ దనకూఁ తునకు ననిరుద్ధునకు ననేక శుభావహోత్సవంబులు గావించి యయ్యుషాజనకుండంపఁగృష్ణుండు తమవారిందోడ్కొని మంగళవాద్యంబులతో బలసన్నాహంబు మెఱయ ద్వారకాపురంబు ప్రవేశించెనంత. 371

## నృగమహారాజు వృత్తాంతము — పౌండ్రకవాసుదేవుఁడు

క. ఒకనాఁడు వనవిహార
ప్రకటోత్సాహంబు మెరసి ప్రద్యుమ్నకుమా
రక ముఖ్యు లలసి విమలో
దకమునకై పాడునూతిదరినుండి తగన్. 372

క. వికలాసమరూపంబునఁ
గృకలాసమొగర్చుకొనుచుఁ గృకలాసము దా
నొకటి పొడచూపదరికిన్
బెకలింపఁగ లేకయున్నఁబేర్చినవేడ్కన్. 373

వ. కృష్ణుండా కృకలాసకంబు చేరంజని. 374

చ. కరమునఁబట్టి యెత్తిన జగన్నుతదివ్యశరీరమున్ బరి
స్ఫురితసురత్నకుండల విశోభిత భూషణముల్ మనోహరాం
బరమును బూని యొక్క నరపాలకుఁడై యది శౌరిఁగాంచి ని
ర్భరసుఖవార్ధిఁ దేవి బహుభంగుల నెంచి నుతించి వేడుకన్. 375

క. ఇక్ష్వాకుకులనృపుఁడఁబా
వక్ష్వాంకమృగాదనంబభయహేతుమదీ
యక్ష్వేడ విన్నయంతనె
భిక్ష్వాకారమున విమతబృందంబేఁగన్. 376

ఆ. వె. పరమపురుష కృష్ణపరమదయానిధి
పరమయోగివంద్య పరమహంస
పరమధామయుక్త పరమశుభాకార
పరమతత్త్వమీవ పావనాత్మ. 377

వ. ఏ భవత్ప్రీతిగా జగతీసురు లగణేయంబులగుధేనువుల దానంబొనర్చితి నందు నొకరికినిచ్చిన ధేనువు నొకనికి నజ్ఞానంబున ధారవోసియిచ్చితి. అన్యోన్యమత్సరంబుననున్న యాభూమీసురులలో నొకవిప్రుండు నన్ను గృకలాసవంబగుమని శపియించెతచ్ఛాపదుఃఖంబు నీవలనంగడచితినని పల్కి యా నృపాలుండు దివ్యలోకంబునకుం జనియెనంత. 378

ఉ. పౌండ్రక వాసుదేవుఁ డురుబాహుపరాక్రమగర్వసంపదన్
గాండ్రతనంబు గాంచి మురఖండనుతోఁ గలహంబుపూని తా
వేండ్రములైన బాణముల వేఁచెదఁ జుమ్మొక భద్రదంతి యా
పుండ్ర రసాలముంబలె రిపున్ నిను నొంచెద సాహసంబునన్. 379

ఆ. వె. తెలియ నీవు వాసుదేవాహ్వయమున క
ర్తుఁడవే ధరిత్రి నుగ్రశాస
నప్రతాపకీర్తినయశాలినగు నాకు
దగుఁ బ్రసిద్ధి నెంచఁ దత్పదంబు. 380

వ. అని ఇట్లనుమాటలు దూతకుం దెలిపిన నతండు చనుదెంచి యానృపతి యాడినట్లు విన్నవించినఁ గృష్ణుండు కోపంబు మెఱయ నిట్లనియె. 381

తే. గీ. కదలివచ్చితి నిలుమను కదనమునకు
శాకినీ ఢాకినీ పిశాచములకెల్ల
విందుచేసెద పౌండ్రక విభుని మాంస
ఖండములఖండ జయలక్ష్మిఁ గాంచియపుడు. 382

వ. అనిపలికి దూత మరలనంపి జయభేరి వేయించి రథంబెక్కి యనేక బలంబులు గొలువం గృష్ణుండు కదలిన. 383

క. రెండక్షోహిణు లిరుగడ
నుండఁగఁ బౌండ్రకుఁడు నిలిచె నుగ్రతఁ గాశీ
శుండును మార్కొనియెం దా
నండనిజాక్షోహిణీత్రయంబు చెలంగన్. 384

వ. అంత గృష్ణుండు వారికి నభిముఖుండై తద్బలంబుల నురుమాడుచు
డాయం జని. 385

క. అరదంబుఁ ద్రుంచి సారథిఁ
బరిమార్చి సిడెంబునటికి పౌండ్రకుని శిరం
బురు శస్త్రనిహతిఁ ద్రుంచుచుఁ
బొరలంగాఁజేసె వృష్ణిపుంగవులలరన్. 386

ఆ. వె. కౌశికేంద్రబలము ఖండించియాతని
తల యిలాతలమునఁబెళకకుండఁ
గందుకంబు రీతిఁగాఁ దత్పురంబులోఁ
దార్పఁదత్సుతుఁడు సుదక్షిణుండు. 387

క. అభిచార హోమకృత్తిన్
రభసంబునఁ బనుప నది దురాసదచక్ర
ప్రభగెరలి తీవ్రరోష
క్షుభితమతిన్ వానిఁమ్రింగె సురలు నుతింపన్. 388

వ. అంత శౌరి తజ్జయంబుఁగాంచి సుఖంబున్నయెడ. 389

## కౌరవపాండవ సంబంధము

ఉ. భోట విదర్భ సాల్వ కురుభోజ కరూశ వరాటలాటిక
ర్ణాట దశార్ణమద్రయవన ద్రవిళాంధ్ర కళింగ చోళ పా
నాట విదేహ ఘూర్జర వనాయుఖ నాయురినాయుతంబు స
య్యాటములన్ స్వయంవరసభాంతర మంచతలంబులందగన్. 390

వ. ఉన్నవిధంబెఱింగి జాంబవతీసుతుండారాజలోకంబు చేరంజనియె. 391

క. చని సాంబుఁడు దుర్యోధన
తనయను శుభయత్నమున రథముపై నిడనా
ఘనులగు కర్ణాదులు తీ
వ్రనిశాతాస్త్రములఁ గట్టివైచిరి యతనిన్. 392

వ. తద్వృత్తాంతంబువిని కృష్ణుండాగ్రహంబుననున్న గురుండుగావున బలభద్రుండు దుర్యోధనపక్షంబున హస్తిపురంబున కేఁగి రారాజునకు నిజాగమన ప్రయోజనంబెఱిఁగించిన నతండు గర్వించి యుద్ధత వచనంబులు పలికిన సమిద్ధహలముఖంబున హస్తిపురంబు యమునలోఁ బడఁదిగుచు కృష్ణాగ్రజునకు విచిత్రాంబరాభరణంబులు మెఱయు లక్ష్మణకన్యకతోడ సాంబుని మరలనిచ్చి భీష్మాదిసహితుండై కురురాజు ప్రియంబు చెప్పిన నబ్బలదేవుండు నిజపురంబునకేఁగి తదుద్వాహంబుఁగావించె నంత. 393

తే. గీ. రాజసూయంబునకు ధర్మరాజు పిలువ
నంపనేఁగి జరాసంధునపుడు భీమ
సేనుచేనడఁగించె నా శ్రీధరుండు
తగు యుధిష్ఠిరభూవరాధ్వరమునందు. 394

క. దమఘోషనందనుండరి
దమఘోషముతోడఁ గృష్ణుఁదార్కొని యపరా
ధములొక్కశతంబపరా
ధము లెల్లన్ నవ్వఁజేసెఁ దానుద్ధతుఁడై. 395

క. ఆగోపనయన విధుఁడు త
దాగోపనయనమొనర్ప నాగ్రహమడరన్
వేగమునఁ ద్రుంచె రిపు ను
ద్వేగంబున విమతులెల్ల విఱిగి చలింపన్. 396

తే. గీ. దురములోదంతవక్త్రవిదూర సాల్వ
ముఖ్యులజయించె హరిలోకములునుతింప
రాజసూయంబు గావించెఁ బ్రౌఢిరాజ
రాజసూయంబొరల ధర్మరాజసుతుఁడు. 397

క. సూతుఁడు బ్రహ్మాసనయుతుఁ
డైతను గైకొనకయున్న హలి యుచితంబుల్
చేతోవృత్తి దలఁపక వ
రీతుని గావించెనతని ఋషులు వడంకన్. 398

వ. ఇట్లుచేసి ఋషులవలన నేతత్పాపనిష్కృతి తీర్థాచరణంబున నగునని
వినితదాచరణోన్ముఖుండై యుండెనంత ఋషియాగ విఘ్ననిరాసంబు
సేయం దలంచి. 399

క. పల్వలు కృతరిపుశోభిత
పల్వలు నిల్వలునియనుజు బలుఁడుగ్రుండై
పల్వగలంబోరి తలఁచి
పల్వగలంగొట్టి నేలపైఁబడఁద్రోచెన్. 400

వ. ఇట్లు పల్వలుంద్రుంచి కౌశికీసరయూప్రయాగ గోమతీ గండకీ విపాశా
శోణనదగయా గంగాసాగరసంగమ సప్తగోదావరీ కృష్ణవేణీ పంపాసర
శ్రీశైల వేంకటాచల కాంచీపుర రంగధామ వృషభాద్రి మధురా సేతు
తామ్రపర్ణుల దర్శన స్నానాదులం గృతార్థుండై నియమంబు మెఱయ
యాగంబు గావించెనంత. 401

## కుచేలోపాఖ్యానము

క. కులసతి దారిద్ర్యంబునఁ
బలవింపుచు నొక్కనాఁడు భర్తకుచేలుం
బిలిచి మన ప్రాణ బంధుఁడు
గల కృష్ణుఁడు గలుగ లేమిఁగందఁగ నేలా. 402

వ. ఉపాయనంబులుగాఁ బృథుకంబులుగొని కృష్ణసాన్నిధ్యంబునకుం జని
పృథుకార్తిఁదీర్పవే యనిపలికిన. 403

ఉ. ఏలికపై జుగుప్సయొనరించిన చేలము, క్షౌరకర్మమే
కాలములేని శ్మశ్రువులు కన్నుల దూషికశుష్కచర్మమై
పాలినమేనుగగ్గి తనపై కమలాగ్రజనిల్వఁబూర్ణ ల
జ్జాలసుఁడై మురారికడకాద్విజవర్యుఁడు వచ్చువేళలన్. 404

తే. గీ. వేత్రహస్తులఁగనుఁగొని వెఱచుభద్ర
దంతి ఘీంకారములువిని తల్లడించు
నెలమితో నెవ్వరెదురైన నితఁడు ప్రభుఁడ
టంచు దీవించును న్ముగ్ధుఁడగుచు నతఁడు. 405

తే. గీ. హరి కనకరత్న భవన బాహ్యస్థలమున
నిలిచి యద్భుతమైన యీ నిలయమెట్లు
చొత్తునని భీతిఁగలఁగి రాజిలువసించు
కొలువు మొగసాల చొఱలేక కొంకికొంకి. 406

క. భయముడిగి సాహసికని
శ్చయమున నా నగరు చొచ్చి తదోభజసుతా
ప్రియభాషలతోఁ జొక్కుచు
నయుతార్కస్ఫూర్తి మెఱయ నాదిమమూర్తిన్. 407

వ. కాంచియవ్విప్రుండు. 408

క. గడగడవడఁకుచుదీవన
లిడ మ్రొక్కి బహూకరించి యిల్లాలు ప్రియం
బడరన్ రత్నకలశమున
బడిబడి జలమొసఁగ శౌరిపదములు గడిగెన్. 409

వ. ఇట్లు తనపదములు గడిగి నిజపూర్వ వృత్తాంతంబు దెలుప లజ్జావనత
వదనుండై కానుక సమర్పింపనేరకయున్న కుచేలుని చేలాంచలంబున
నున్న యటుకులు భక్తపారిజాతంబైన యా కృష్ణుండు తానె పరిగ్ర
హించి యతని ననిచిన. 410

క. అప్పతిసంపద యొసఁగఁడె
తప్పదు మత్పూర్వ కలిత దారిద్ర్యము నా
యొప్పమి యేమనుకొనియెద
నిప్పుడు నావంటి దీనుఁడెందును గలఁడే. 411

వ. అని చింతించుచునతండు నిజపురంబుఁ బ్రవేశించెనంత. 412

క. కలధౌతపూర్ణ గేహం
బులు మణిసౌధములు దివ్యభూషణ నికరం
బులు మత్తద్విపనాదం
బులు భూరిసుగంధ వస్తుపూర్ణతయుఁదగన్. 413

వ. కనుపండువై రమామందిరంబైన నిజమందిరంబుఁ బ్రవేశించి భార్యా
పుత్రసహితుండై కుచేలుండు సుఖంబుననుండెనంత నొక్కనాఁడు. 414

## శ్రీకృష్ణుఁడు వృకాసురుని ఖంజించుట

చ. వృకుఁడను దైత్యుఁడొక్కఁడతివీరుఁడు నారద మౌనిఁగాంచికౌ
తుకమున మ్రొక్కినాకు దయతో నజవిష్ణుహరత్రయంబులో
సకలమునిచ్చి శీఘ్రమె ప్రసన్నతనొందెడివేల్పు దెల్పు మ
య్యకలుషమూర్తిఁగొల్చిహృదయంబునఁగల్గిన కోర్కెవేడెదన్. 415

వ. అనిన నారదుండిట్లనియె. 416

తే. గీ. బాణరావణ ముఖ్యులౌ భక్తులకు మ
హేశ్వరుఁడు వేగ ఫలమిచ్చు నిద్ధమహిమ
నట్లు గావున నద్దేవు హరుమహాను
భావుఁగొల్వుము దానవప్రభువతంస. 417

వ. అని నారదుండెఱింగించి చనిన దానవుండు పంచముఖు నభిముఖుం
జేయందలంచి. 418

క. బలునిష్ఠనసుర నిజతను
పలలము ఖండించి చిత్రభానునిలో ని
శ్చలుఁడై వేల్చి పిదపఁదన
తల యసి ఖండించి వేల్వఁదలఁచిన యంతన్. 419

క. హరుఁడు ప్రసన్నుఁడుగాఁదన
కరమూనిన వానిశిరము ఖండములై యి
ద్ధరఁబడుఁగాకని వేఁడిన
వరమిచ్చిన హరునియందె వంచనమెఱయన్. 420

వ. అతని శిరంబుపై దనుజుండు కరంబిడందలంచిన హరుండు భీతిం
బరువెత్తెనంత. 421

క. వటుఁడై హరిలంబశిఖా
వటుఁడై చనుదెంచి దైత్యవరునింగని నీ కే
మిటికింబరువిడనని త
త్కుటిలత్వము దెలియ మాయఁదొలఁకఁగఁబలికెన్. 422

క. శిరమంటివి కరమంటివి
వరమంటివి హరుఁడుపల్కు వచనంబులకుఁ
ధరలో నిల్కడగలదే
పరులవలెన్ నేఁడు నిన్ను భ్రమయించెఁ గదా. 423

వ. అని పలికి దనుజవంచనా కరణచతురుండైన యచ్చక్రి శాంబరీ విభ్రమంబుఁగల్పించి దనుజుని శిరంబునం గరంబిడు కొనంజేసిన వాఁడు భసితంబయ్యె, హరిహరులు సంతసిల్లిరంత. 424

## అర్జునుఁడు సుభద్రను గొంపోవుట

క. చోరులు బ్రాహ్మణ సురభులు
ధీరత హరియింప వాటిఁదెచ్చుటకై గో
త్రారితనూజుఁడు శస్త్రా
గారంబున కరిగి మదికిఁగడు భయమొదవన్. 425

వ. పాంచాలీ సహితుండైన యుధిష్ఠిరుంగాంచి గాండీవంబును నక్షయ తూణీరంబులుంగైకొని యాసవ్యసాచిచోరుల భంజించి నారదముని కృతమర్యాదాక్రమంబునఁ దీర్థాచరణంబు సేయుచు భిక్షుకవేషంబున ద్వారకచేరి బలభద్రానుమతంబునఁ దద్గృహంబున కేఁగి. 426

క. ఒక సొగసొక సింగారం
బొకవయ్యారంబు మెఱయ నొప్పులకుప్పై
మకరాంకు శస్త్రమనఁగాఁ
బ్రకటశ్రీఁదగు సుభద్ర భక్తింగొలువన్. 427

క. కనిమోహాంబుధిఁదేలుచు
ననురూపార్థుండు పార్థుఁడాబాలికపై
మనముప్విళ్ళూరంబై
కొన సమయాంతరము గాచికొనియుండెఁ దగన్. 428

వ. ఇట్లుండి కృష్ణానుమతంబున సుభద్రందోడ్కొని నిజపురంబునకుం జనియె నంతనొక్క నాఁడుత్సవంబున నున్న మునులు మూర్తిత్రయ పరీక్షసేయ భృగువునంపిన. 429

మ. నలువంజేరిభృగుండు మత్తునిగతిన్ వర్తించ రోషించి యా
కులుఁడౌ తద్ద్రుహిణుంద్యజించి వడిభర్గుం డాసియామేటిని
శ్చలతంగౌఁగిటిఁజేర్ప వచ్చిన నుపేక్షాదృష్టి దానుండ ను
జ్జ్వల శూలంబునఁగ్రువ్వఁబూనునతనిన్ వర్జించి వేగంబునన్. 430

క. వైకుంఠమునకుఁజనిముని
వైకుంఠునిఁజూచి కనలి వక్షముఁదన్నన్
లోకోత్తర చరితుఁడు హరి
యాకర్మందివతిపాదమల్లన యొత్తెన్. 431

వ. ఒత్తిననీవే శుద్ధ సత్త్వమూర్తివని జనార్దనుంబ్రశంసించి మగుడి చను
దెంచి భృగుండామునీశ్వరులకుఁదద్వృత్తాంతంబంతయునెఱింగించె. 432

క. పరమ శుభాకారుఁడు శ్రీ
వరుఁడే సత్త్వనిధి బ్రహ్మవాసవముఖ్యా
మరవిభుఁడు కృపాంభోనిధి
యరయఁగ నొసఁగున్ ధనాయురారోగ్యంబుల్. 433

వ. అని తలఁచి ప్రమోదంబందిరంత. 434

## ద్వారకలో శ్రీకృష్ణుని జీవితము

సీ. దీపితశ్వేతాంతరీప ప్రతీకాశ
వజ్రసంస్థాపిత వప్రవలయ
యరుణాశ్మ వైఢూర్య హరినీలగోమేధి
కాపూర్ణ చతురుచ్చగోపురాఢ్య
ప్రత్యగ్దిశా సాగర భ్రాంతి కృత్ప్రాగ
వాగుత్తరదిశాను వర్తిఖేయ
యభితశుకచ్ఛదాత్యచ్ఛ సచ్ఛాయనీ
రంధ్రతరారామరజ్యమాన
తే. గీ. యజరలావణ్యరూప జనాస్పదంబు
ప్రతి దినోత్సవసేవ నాగత సుపర్వ
యానకక్షణోత్థమణిరజోత్యంతపూర్ణ
రంగవల్లిక ద్వారక రాజధాని. 435

సీ. నిరుపమ దివ్య మాణిక్య రాజత్సహ
స్రస్తంభ జృంభవిరాజమాన
స్థాపితానంతభాస్కరమండలాయమా
నాంచిత రత్నకుడ్యాభిరామ
తారకాన్వితసంధ్యారుణాభ్రోదగ్ర
చారుముక్తాంక కాంచన వితాన
పరభయస్థాపితాసురవరామృతహేమ
కుంభ విభ్రాజి విజృంభ కలశ

తే. గీ. ఘన ఫణామణి కుండలాకారశేష
భోగి నిరుపమ సద్రత్న పుంజవేది
చంద్ర కాంతోరు సోపాన సమధికాభ
సౌధ వరలక్ష్మి యప్పురి చాలమించె. 436

వ. ఆ సౌధంబు చుట్టును మందార పారిజాత సంతాన కల్పవృక్ష హరి చందన చందన చంపక నాగపున్నాగ మాధవీ కంకేళీజంబూ జంబీర ఫల పూర చూత పనస నాళికేళ కపిత్థామలకీ ప్రముఖ నానాభూజరాజ విరాజమాన ఫలకుసుమ సంపత్సమృద్ధ మహోద్యానంబును ద్రాక్షామాల మాలతీ మల్లికా లవంగ లవలీలతావేల్లితంబై సూర్యరశ్మిసోఁకక నీరంధ్రమై మెఱయ, శుక పికశారికాముఖ్య నానావిహంగమ మధుర కూజితంబులు వీనుల విందుసేయఁ గెలంకులఁ గొలంకులు నానారత్న సోపానంబు లమరఁజుట్టును కర్పూరకదలికాతపస్వినిస్సృత ఘనసార ఖండంబులు జలంబునంబడ్డ సౌరభ్యశైత్యమాంద్యంబులు గలిగి మలయానిలంబు విసర రాజహంస కలహంస బకచక్రవాక క్రౌంచాది నానాజల పక్షికులంబు పద్మ కుముద కల్హార హల్లకేందీవరషండ మండితతరంగమాలికపై విహరించు నందునవుడు కృష్ణుండరుణోదయంబున నంతఃపురంబునమేల్కాంచి మంగళస్నానంబుచేసి దివ్యాంబరంబులు ధరియించి కస్తూరితిలకంబులు దీర్చి సంధ్యావందనాగ్నిహోత్రంబులాచరించి భూసురులకు గోహిరణ్యరత్న వస్త్రాద్యసంఖ్య వస్తువు లొసంగి తాంబూల ఫలపుష్పంబులు సమర్పించి యప్పుడు. 437

సీ. వెలిదమ్మి నిగ్గులు వెదఁజల్లు కన్నుల
ధాళ ధళ్యము ముఖశ్రీల మెఱయ
వజ్రంబు తళుకుల వన్నెలు బెళకించు
దంతముల్ చిఱునవ్వుతళ్కులీన
ముఖసౌర భాఘ్రాణమున కాభిముఖ్యంబుఁ
జెంది రాణించు నాసికము మెఱయ
మకర కుండలకాంతి మండలంబులచేతఁ
బొలుపుగాంచు కపోలములు చెలంగ
తే. గీ. భక్తజనవాంఛితార్థ సంపత్ప్రతాన
చతుర చతురోల్లసత్కల్పశాఖి శాఖ
లైన భుజములు లక్ష్మీకరాంబుజాత
కాంకితంబైన పదములు నతిశయిల్ల. 438

సీ. కాంచన నవరత్న ఖచితశోభన నవ్య
దివ్య కిరీట ముద్దీప్త నీల
కుంతలంబులు శుభ్ర కుసుమముల్ నవమణి
కాంచి కాంగదహార కంకణములు
అరుణోపలాంగుళీయకములు సామ
గానారవ మంజు మంజీరములును
పావన వైజయంతీ వనమాలికల్
శ్రీవత్స కౌస్తుభ చిహ్నములును
తే. గీ. చారు పీతాంబరము శంఖచక్ర శార్ఙ
ముఖ్య దివ్యాయుధములు సముజ్జ్వలాత
సీసుమోల్లాన కాంతియుఁ జెలఁగ శౌరి
యర్హచింతామణీ పీఠినధివసించె. 439

వ. ఇవ్విధంబున సేవ సేయు నుచితజనంబులలోనున్న సమయంబున. 440

సీ. వైదూర్య ముద్రికల్ వజ్రతాటంకముల్
కలుకైన పచ్చల కంకణములు
గిలుకు మట్టియలును గెంపుల మేఖలల్
సొగసైన రత్నాల మొగపుతీగె
సింగారములుచిల్కు సీమంత తిలకంబు
చొక్కపు ముత్తెపు ముక్కరయును
వెన్నెల నిగ్గుల వెదఁజల్లు చేలంబు
తగటుచేసిన మంచి బిగువురవికె

తే. గీ. తళుకుఁ గొప్పునఁ బారిజాత ప్రసూన
మాలికలు క్రొమ్మెఱుంగుల నెలుఁగుమేను
బెళుకుఁ జూపులు చిఱునవ్వు వెలయవచ్చె
సఖులు గొలువంగ రుక్మిణి శౌరికడకు. 441

సీ. పసిఁడితళుక్కులప్రాఁత పనులతో సిరిగుల్కు
చిలుక చందురుకావి వలువగట్టి
నునుముత్తియములు గూర్చిన పచ్చపట్టు ర
వికె చన్నుఁగవడాలు వెలయఁ దొడిగి
మొగులుపై మెఱుఁగు నా సొగసు సంపెంగ క్రొ
న్ననదండఁగీలు గంటున ఘటించి
నెమ్మోము బంగారు తమ్మిపై తేఁటినాఁ
బొలుపారు కస్తురి బొట్టువెట్టి
తే. గీ. యసమ శరుతూపులై చూపులెసఁగఁ బాద
కంజముల నందియల్ ఘలుఘల్లుమనఁగఁ
జెలులు గొల్వంగ శృంగార మలరవచ్చెఁ
జక్రిచెంతకు గుణసీమ సత్యభామ. 442

సీ. కంకణంబుల కెంపు గములు దాడిమ బీజ
ములఁబోలు కీరంబు లెలమిఁజేర
నలకభారము మేఘమని తలంపుచు వెంటఁ
జాతకంబులు ప్రేమచేతఁదిరుగ
ముఖపద్మ సౌరభంబులు దిక్కులను నిండ
మకరంద కాంక్షబంభరములెనయ
నందియలంగూడు మందయానముచూచి
యంచలు నడనేర్వ నరుగుదేరఁ
తే. గీ. జారుకుచకుంభయుక్త కస్తూరికాప
టీరకుంకుమ వాసనల్ ధారుణీస్థ
లంబు నిండంగ బెళుకునేత్రంబు లలర
జాంబవతి వచ్చె నా యదుస్వామికడకు. 443

తే. గీ. కనక వర్ణాంగరేఖయుఁ గనకపటము
కనక మాణిక్య భూషలు కనక శుకము
కనక కలశోరు కుచములు గలిగె నిలువు
కనకమై మిత్రవింద యక్కడఁజెలంగె. 444

తే. గీ. ధవళ నవపుష్ప మాలికల్ ధవళపటము
ధవళహార గుళుచ్ఛముల్ ధవళరత్న
వివిధ భూషణములు దాల్చి ధవళనేత్రి
నాగ్నజితి వచ్చెరాయంచ నడలతోడ. 445

తే. గీ. భద్రవరదంతి కుంభోరు భార సార
భద్ర చారుపయోధర భద్రనిలిచె
భద్రములు కన్నుగవయందుఁ బరిఢవింప
భద్రదారులతాసౌరభములు మెఱసి. 446

క. ఈ క్షణ కల్పిత వరశుభ
లక్షణయై నవకళా విలాసశ్రీలన్
సాక్షాన్మన్మథసాయక
లక్షితయై కృష్ణుకడకు లక్షణవచ్చెన్. 447

సీ. గండుతేఁటులపంటి కల్కిముంగురులును
బేడిసలనుబోలు బెళుకుకన్ను
లంబుజంబులఁ దేటయై మించు నెమ్మోము
ఫేనంబు జిగి దలపించునవ్వు
వరతరంగంబులై వలనొప్పు బాహులు
శంఖంబె యనియెంచఁ జాలు గళము
మంజులావర్తంబు మన్నించు నాభియు
సైకత శ్రీమించు జఘనలీల

తే. గీ. కమఠముల నీను మీగాళ్ళు గలిగి సూర్య
బింబ సన్నిభ రత్న కల్పిత విచిత్ర
కందుకముఁబూని నవ్య శృంగారరేఖ
పొందుదగఁ జక్రికడకు కాళిందివచ్చె. 448

సీ. కల్పక వల్లులో కలికిరాయంచలో
కాముని శరములో హేమలతలా
కస్తూరి మెకములో కపురంపుఁ దిన్నెలో
చక్కెర బొమ్మలో చంద్రకళలా
మరువంపు మొలకలో మాణిక్యకళికలో
చిత్తరు ప్రతిమలో చిలుకగములా
సంపెంగ దండలో చందనశాఖలో
శృంగార రసములో సిరుల గనులా

తే. గీ. యనఁగఁ బదియాఱు వేవురయ్యబ్జముఖులు
చారుకుచభార కచభార జఘనభార
భరవిలాస కళాకలాపములతోడ
నబ్జనాభునికడనిల్చి రందమంది. 449

వ. మఱియు జ్ఞానానంద స్వరూపానంత కల్యాణ గుణామృత సాగరో భయభూతి నాయక సమస్త చిదచిద్వస్తు శేషీభూతుండునైన నమ్ముకుందుండు దివ్యమాణిక్య సౌధంబున దివ్య చింతామణి పీఠంబునఁ గోటిమన్మథ లావణ్య శుభాకారుండును, గరుణాంతరంగిణీ చారు విశాల నేత్రుండును నున్నత నాసి సుకుమార కపోల శుభాలంకార కర్ణ విరాజితుండును, శరత్కాల ధవళ చంద్ర ప్రకాశ మందహాసుండును, భక్తజన రక్షణాభయహస్తుండును, జారువక్షస్థల శ్రీవత్స కౌస్తుభ మాణిక్య మౌక్తిక విచిత్ర వైజయంతీ పుష్ప తులసీ వనమాలికా ధరుండును మహావర్త గంభీర నాభియు, దివ్యచందన సౌగంధ వాసితుండును గంజకింజల్క ప్రకాశపీతాంబర ధరుండును భక్తజన హృదయాంధకార నివారక శ్రీపాదనఖ చంద్రికా వికాసుండును, దివ్య మాణిక్య ఖచిత కిరీట మకర కుండల గ్రైవేయక హారకంకణాంగుళీయక మేఖలా నూపుర ధరుండును గోటిసూర్య ప్రకాశ మానుండును నైయుండి శేష శేషాసన విష్వక్సేనాదులును నిజమూర్తులు దాల్చిన దివ్యాయుధంబులును గొల్వ నివ్విధంబున మాణిక్య స్తంభ సహస్రోజ్జ్వల మంటపంబున విలసిల్లి శ్రీభూనీళాంకలీలలైన రుక్మిణీ జాంబవతీ సత్యభామా మిత్రవిందా నాగ్నజితీ భద్రాలక్షణా కాళిందులు షోడశ సహస్ర రాజకన్యలు విచిత్రాంబర భూషణ దివ్యగంధ దివ్య మాలికాలంకృత శోభనాకార రేఖలఁ బయోధరంబు చుట్టును గర చరణాద్యవయవంబులు దాల్చిన క్రొక్కారు మెఱుంగులోయన యౌవన విలాస విభ్రమంబులు మెఱయింపుచుఁ గొందఱు శుభ్ర గంగాతరంగ శృంగార మంగళ ప్రదంబులగు చామరంబులు వీవఁ గొందఱకలంక పూర్ణ శశాంక మండలసహస్రంబులై దీపించు ధవళాతపత్రంబులు పూనఁ గొందఱు నానా రత్నపాత్రల నీరాజనంబు లర్పింపఁ గొందఱు సనాళ సువర్ణ కమలంబులు ద్రిప్పుచు మెఱయించఁ గొందఱు నవరత్న కందుకంబులును గుసుమ కందుకంబులును నానా విచిత్ర ఫలంబులును

గరంబులం గేలించి యొక వింతయొయారంబు మావఁ గొందఱు నవరత్న కీలిత కంకణ హస్తంబులపై శుకశారికాదుల నిడుకొని హరి నామాంక మధుర గీతంబులు వాడింపఁ గొందఱు తాంబూల పేటికలు వహించుకొని యగ్రంబున నిలువఁ గొందఱు కర్పూరాగరు ధూపంబులు వాసింప నివ్విధంబున నొడ్డోలగంబై యుండ నమ్మండపంబు దగ్గర సనకసనందన సనత్కుమార సనత్సుజాతులు స్తోత్రంబులు సేయఁ దుంబురు నారదాదులు మధుర గీతంబులువాడ, బ్రహ్మరుద్రులు జయ జయ స్తవంబు లొనరింప నింద్రాద్యష్ట దిక్పాలకులు సేవింప రంభో ర్వశీ మేన కాద్యప్సరస స్త్రీలు నృత్యంబులు సలుప వందిమాగధ రూపంబులననంత వేదంబులు కైవారంబులుసేయ సిద్ధ సాధ్య గరుడ గంధర్వ కిన్నర కింపురుష యక్షాది సకలదేవతలు గొలువ నంగ వంగ కళింగ మరు కాశ్మీర కాంభోజ శక కుళింద మద్ర గాంధార కేకయ ద్రవిళ వరాట ఘూర్జర సింధు భోటలాట విదర్భ నిషధేశ్వ రాదులైన రాజులు పార్శ్వంబుల మెఱయ నుద్ధవాక్రూర సాత్యకి చేకితాన కృత వర్మ భీమార్జున నకుల సహదేవ ప్రద్యుమ్నసాంబ ముఖ్యానేక బంధు వర్గ కుమారవర్గంబులు సువర్ణవేత్రహస్తులై బరాబరులుసేయ నివ్విధం బున శ్రీకృష్ణుండు నిత్య మహోత్సవంబుల భక్తజనులకు ననిష్ట నివృత్తియు నిష్ట ప్రాప్తియు నొసంగుచునుండె సమస్త శ్రీలు మెఱయ. 450

## షష్ఠ్యంతములు

క. ఏవంవిధ శుభగుణ ల
క్ష్మీవరవాస్తునకు నుగ్ర చేదిపతి మహా
గోవర్ధన శస్తునకుఁ
గోవర్ధన ధారణానుగుణ హస్తునకుఁ. 451

క. బృందావన తులసీ మక
రందాంచితలాస్య హేతురంగునకు ధృతా
మందాప్త తురంగునకుఁ
సంధాతారాతి వీర చతురంగునకుఁ. 452

క. ఉన్నత శుభరేఖాంచిత
పన్నత సురలోక సార్వభౌమున కురుసం
పన్నా నటదాగ్రహ కిం
చిన్నేత్రారుణ్య మాత్ర జితభౌమునకున్. 453

క. సంగర రంగమహోద్భట
రంగద్గాంగేయ సంగర వినిర్వాహా
భంగ సహస్రారధృతికి
మాంగల్య కలావిలాస మహితాకృతికిన్. 454

క. ముచికుంద వరదునకు నతి
రుచి కుంద ముకుళ వికాస రుచిరదనునకున్
కుచర సరోష నిశాటీ
కుచరస పానామృతైక గుణ భరితునకున్. 455

వ. సమర్పితంబుగా నా యొనర్పం బూనిన నారదీయ పురాణమునకుం
గథా ప్రారంభంబెట్టిదనిన. 456

కథాప్రారంభము

## మునులు నారాయణుని సందర్శించుట

సీ. వకుళ పున్నాగ కేతకినింబ జంబీర
పనస బిల్వాకపిత్థబదరికా క
దంబసాలార్జున దాడిమీనారంగ
మాతులుంగ లవంగ మరువకామ్ర
ఖదిర భల్లాతకీ గాలవచందన
పారిజాత నమేరు పారిభద్ర
దారు శిరీష పాటలి తాళజంబూ త
మాలయూధీ కుందమదన చంప
తే. గీ. కాది నానా మహీజ సమగ్ర మంజు
మల్లికా కుంజ పుంజ నిర్మత్సరోగ్ర
సర్వ సంతాన సంతతాశ్రయ విశేష
గణ్యమైనట్టి నైమిశారణ్యమునను. 457

సీ. కపిల వసిష్ఠ మార్కండేయ కశ్యప
కౌశిక శౌనక గౌతమాత్రి
జమదగ్ని మను కుంభజాత భారద్వాజ
వాల్మీకి భార్గవ వామదేవ
జాబాలి కుత్స వైశంపాయన క్రతు
దక్షపులస్త్య మౌద్గల్య పులహ
గర్గ పిప్పల జహ్ను కణ్వ పరాశర
శుక దాల్భ్య గాధి కుశికమృకండు
తే. గీ. వత్సరోమశ శారద్వ తౌత్సరేఖ
గాలవ వ్యాస వరతంతు కదవదండ
పర్వతాంగీరసద్రోణ బైధచరక
శృంగి ముఖ్యమహామునిశ్రేణి యపుడు. 458

క. అనుపమ మతి నేకాంతం
బున నందఱుఁ గూడిపోయి బోధకళా శో
భను ఘను నారాయణు నా
ద్యునిఁ గని తా బదరికాశ్రమోత్తమసీమన్. 459

వ. కని వేదపఠన పరాయణుండైన నారాయణునకు దండప్రణామం
బాచరించి నరునకు వందనం బొనర్చి వినుతించి యిట్లనిరి. ప్రతి
యుగంబున మౌనివై జనియించి విష్ణుభక్తి వెలయు నిన్ను నేమని
వినుతించువారము; శ్రీ నారాయణ సర్వవేదార్థ తత్త్వ నిర్ణేతవు
నీవేయని స్తుత్యుండును స్తవప్రియుండునునగు నతనితో మఱియు
నిట్లని వినుతించి రప్పుడు. 460

తే. గీ. స్వామి నారాయణరమేశ చక్రహస్త
శౌరి మ్రొక్కెదమయ్య మీ చరణములకు
సర్వశేషివి సర్వ రక్షకుఁడవీవె
యీవుదక్కంగఁ బరమాత్మ యెవ్వఁడరయ. 461

క. జననీ జనక సహస్రం
బునకంటెను వత్సలత్వమున జనులకు జీ
వనమైతి వస్మదవలం
బనమయ్యెన్ నీదుకరుణ పరమాత్మహరీ. 462

క. భవ సంతాప హరు శ్రీ
ధవునిన్ను భజించి పరమ ధామములో గౌ
రవమంది నిత్యసూరి
ప్రవరులతోఁ గూడియుండ్రు పావన మూర్తుల్. 463

మ. శరతూలంబనలంబుసోఁకినయెడన్ సందగ్ధమై పోవున
ట్లురుదుర్వారతరౌఘజాలములు మాయున్ నిన్ను నీక్షింపనో
పరమోత్తంస రమాధినాథ కరుణాపాత్ర ప్రసన్నాత్మ దృ
క్పరిపూర్తిన్ మముఁ జూడు మీపదము సంభావ్యంబుమాకెప్పుడున్. 464

క. అని వినుతించు మునీంద్రులఁ
గనిపురుషోత్తముఁడు వారిఁగరుణించి సుశో
భన మధురవచోవిస్తర
మునఁబల్కెఁ దదీయ హృదయములు గరఁగంగన్. 465

సీ. స్వాగతంబే మీకు సంయమివరులార
సుఖమమీకే మిమ్ముఁ జూచినపుడె
యానందమందితి నరయ మద్భక్తులే
మత్ప్రాణములు జగన్మహితయోగి
వరజన శ్రేష్ఠులు వాత్సల్య గుణనిధుల్
పరమ లాభంబ తత్ప్రాప్తిమీకు
యుష్మదాగమన మహోద్యమంబునకుఁగా
ర్యంబెఱింగించుఁడత్యంతభక్తి

తే. గీ. సంశ్రితత్రాణమునకునై సకలరూప
ములు వహింపుదునని కృపఁ బలుకవారు
ఘనుఁబరాశర సూనునిఁ గాంచి సన్న
చేసి నియమింప నమ్మౌనిసింహుఁడనియె. 466

వ. స్వామీ ! నీయష్టాక్షరాత్మకంబైన మంత్రంబు పరమ మంత్రంబు తన్మం త్రోపదేష్టవు నీవుగాన నేము నీ శిష్యులము. దేవదేవుండవు నీవె. గురుండవునీవె. తల్లివినీవె. తండ్రివినీవె. శ్రీమన్నారాయణా! నీకంటెఁ బరమ బంధుండు గలఁడే. ఎఱుఁగని యది యెఱింగించుటయుఁ బ్రవ ర్తింపఁజేయుటయు నీకే తగును. నీవే సమర్థుండవు. సర్వంబు నీచేతనే తెలియవలయు. పరమధామంబులలో దోషనిర్ముక్తంబైన స్థానంబెయ్యది యని విన్నవించిన భగవంతుండిట్లనియె. 467

## నారాయణగిరి మహత్వము

క. నారాయణ గిరియన సం
సారార్ణవతారకంబు సహ్యగిరికిఁ దూ
ర్పైరహిఁదగు నొకగిరి పు
ణ్యోరుస్థితి సహ్య నందనోత్తరసీమన్. 468

క. అది దక్షిణదేశంబునఁ
ద్రిదశులకు నగణ్యమై నుతింపఁగ వెలయున్
విదిత భవ దుఃఖసాగర
పద సేతువులైన శృంగపటలంబులచేన్. 469

తే. గీ. కర్మలాలసుఁడైనట్టి ఘనుఁడు తద్ధ
రాధరంబున మాధవార్చనముచేసి
తపముఁ గావించెనేని యుత్తమ పదమున
సతత సంపూర్ణ కాముఁడై సంచరించు. 470

మ. ఉపదేశంబొనరింపనే నిలుతునయ్యుర్వీ ధరాగ్రంబునం
ద పరిచ్ఛిన్నసమస్తధర్మ హృదయంబామ్నాయ సల్లోచనం
బపవర్గ ప్రథమాంకురంబు ముని విద్యాతత్త్వ సర్వస్వమ
ర్థపవిత్రంబు దలింప నగ్గిరియె లోకంబుల్ ప్రశంసింపఁగన్. 471

వ. దక్షిణోత్తర భేదంబున నాకు రెండాశ్రమంబులుగలవు సర్వోత్తరంబులు. ఆధిక్యంబున నదియ సర్వోత్తరగిరియగు గుణత్రయ భేదంబున నరులకుం బ్రకృతి భిన్నంబైన నారాయణాద్రి నిష్ఠులకు రజస్తమో గుణంబులు లేవువినుండు. 472

తే. గీ. జగతి శ్రీరంగమున శేషశైలమునను
బదరికాశ్రమ సీమను బరమపదము
నందునే వేడ్క జనియించునట్టివేడ్క
యమ్మహాగిరి నాకుఁ దథ్యమునఁగలదు. 473

ఆ.వె. శేషవృత్తి నడుచు శేషుఁడయ్యద్రి న
శేషశేషియై విశేషమందు
శ్రీనివాసునకును శేషాశనముఖుల
తోడ సేవసేయు నాఁడునేఁడు. 474

ఆ.వె. ఆదిమై ననంతుఁడయ్యె లక్ష్మణుఁడయ్యె
నంతట బలభద్రుఁడయ్యెనింకఁ
గలియుగమున నొక్క ఘనయోగివర్యుండు
గాఁగలండు దేవగణములెంచ. 475

తే. గీ. రామకృష్ణులు నన్ను నిరంతరంబు
నచటఁబూజించి కొలువ విఖ్యాతమయ్యె
జగతి నగ్గిరి యాదవ శైలమనఁగ
శేష శుభమూర్తిని సహస్ర శిఖరములను. 476

వ. వైకుంఠాద్యచ్యుత స్థాన లోకసారంబైన యా యదు శైలంబు సేవించిన
సమస్త మదీయ స్థానంబులు సేవించినయట్లగు. 477

తే. గీ. ఆద్యులగు శేషశేషాశనాదులైన
పరమ వైకుంఠవాసు లాపర్వతమునఁ
దిర్యగచర స్వరూపముల్ తెలివి దాల్చి
సంతసంబునఁ బ్రేమవర్తింతురెలమి. 478

తే. గీ. అందుఁ బ్రాకృత మనుజ మృగాండ జాది
సముదయంబులఁ గొంత దూరమునఁ గాంచి
ఘోర దుర్వార యమభట కోటులెల్లఁ
దొలఁగి మ్రొక్కుచునపుఁ డేగుదురు భయమున. 479

తే. గీ. యాదవాద్రికినేఁగెద ననుచు నాత్మ
యందు నూహించు నరుఁడు నిత్యము వసించు
నట్టి దేశంబు చొరఁగ భయంబునొంది
దూరమున నేఁగుదురు యమదూతవరులు. 480

సీ. అటుగాన మీరలయ్యద్రిపైఁ గల్యాణ
తీర్థంబగలదు నాతీర్థమునను
బుద్ధిమైమునిఁగి సమిద్ధ భవాంభోధి
దాఁటెద రదియె పుణ్యతరధామ
మాపుష్కరంబు సురాపగాయమునలు
వ్యాపించు నయ్యద్రి నణఁగు బ్రహ్మ
హత్యాది పాపంబు లధిక నాస్తిక కృత
ఘ్నమఘ విఘ్నప్రదామ్నాయ పాశ (ద)

తే. గీ. దూషక పరాంగనాసక్త ధూర్తపరధ
నాపహారక పాప భేదానురక్త
పరవి నిందా నిజస్తుతి ప్రవణులేని
ముక్తులగుదురు దోషనిర్ముక్తులగుచు. 481

సీ. పాషండ శాస్త్ర తత్పరులు శూద్రాన్నభ
క్షకులు శునక వరాహకృకవాకు
రక్షకుల్ కర్మ విక్రయపరుల్ శ్రాద్ధభో
క్తలు గ్రామయాచకుల్ దైవతస్వ
హరులు దుర్గర్వదంభాది సంయుతులు ని
రంతర కనకవా సాభిరతులు
రాజసేవైకకర్మరులాత్మ కన్యకా
విక్రయపరులు దుర్వార్త చరులు
తే. గీ. కాకవృత్తులు గోక్లేశ కరణపరులు
విప్రనిందక హరిభక్తి విరహిత శర
ణాగత ద్రోహవృష విధవానుచిత్ర
ముఖులు దద్గిరి సేవించి ముక్తిఁ గంద్రు. 482

తే. గీ. ప్రబలతరమైన తద్గిరీంద్రమున కనతి
దూరమునఁ బుణ్యసంపదపారమహిమఁ
బరఁగు నరసింహ భూధర ప్రవరమతి ప
విత్రుఁ గాఁజేయుఁ జూడనపాత్రునైన. 483

క. ఆ యెడ నతిభక్తిపరుం
డై యా ప్రహ్లాదుఁ డతిగుణాఢ్యుఁడు సులభో
పాయకృత నిఖిలలోక
శ్రేయంబుగ నన్ను శ్రీనృసింహుని నిలిపెఁ. 484

తే. గీ. అఖిల లోకోన్నతంబైన యన్నగంబు
మీఁదికెక్కిన మనుజుఁ డమేయదుర్ని
వార సంసార సాగరావర్తములను
మునుఁగఁడెన్నఁడు తన్మహాఘనతదెలిసి. 485

క. కలదొక యశ్వత్థమమృత
ఫలమై కల్యాణ తీర్థ పశ్చిమసీమ
స్థలినిఁజతుర్వర్గదమై
యలఘుతర జ్ఞానదారకాహ్వయమగుచుఁ. 486

తే. గీ. అంబరీష వికుక్షి రుక్మాంగద శుక
పుండరీకులు మున్ను దద్భూరి సౌఖ్య
మనుభవించిరి తద్భక్త జనులకేవు
రకు నిజస్థానమది రమ్యమకలుషంబు. 487

క. పొగడిన వరాహమూర్తగు
భగవంతుని భూమిఁగాంచి పరమరహస్యం
బగు శ్లోకద్వయమచ్చటి
నిగమశిఖార్థయుతముఁ మనీషనొసంగెఁ. 488

వ. ఆ వరాహ చరమ శ్లోకంబులు రెండు నివి:

శ్లో. స్థితేమనసి సుస్వస్థే శరీరే సతియోనరః
ధాతుసామ్యేస్థితేస్మర్తా విశ్వరూపంచ మామజమ్.

శ్లో. తతస్తంమ్రియ మాణంతు కాష్ఠ పాషాణ సన్నిభమ్
అహం స్మరామి మద్భక్తం నయామి పరమాంగతిమ్. 489

తే. గీ. అదియె వైకుంఠ వర్ధనంబనఁగఁ దగిన
యనఘమగుయోజనద్వయమన్నియెడలఁ
దన్మహాక్షేత్ర మెంత పర్యంతమక్షి
గోచరంబగునది వేగఁ గూర్చుముక్తి. 490

శా. అందానందమయంబనా నొక విమానాగ్రేసరం బొప్పు శ్రీ
కందంబై పరిశుద్ధ సత్త్వమయమై కల్యాణమై మ్రొక్కినఁ
జిందుఁ బాపములంటఁ దాపము విసర్జించుఁ బ్రశంసించినఁ
గుందుం దుష్టరజస్తమోగుణ నిజాంకూరోగ్ర సంసారముల్. 491

ఆ. వె. ఆది కృతయుగంబునందు వైకుంఠ మ
ధ్యముననుండి తానె యరుగుదెంచె
నవ్విమానరాజ మౌరమత్సంకల్ప
మహిమలోక సజ్జన హితముగను. 492

వ. విమాన పశ్చాద్భాగంబునఁ బ్రాకార మధ్యంబున సుదర్శనమును
లక్ష్మియునర్వకామంబుల నిచ్చుచుండు మఱియును. 493

చ. మనుజుఁడు తద్విమాన పరిమార్జన సేచన ధూపదీప మం
డనము లొనర్చెనేని ప్రకటస్థితమై ధవళాతపత్ర వీ
జనచతురంతయాన ధనసంపద గైకొని పుత్ర పౌత్ర వ
ర్ధనమునఁ జక్రవర్తియయి ధారుణినేలి విముక్తుఁడౌఁదుదిన్. 494

సీ. ఫాలభాగముననె పరమ భాగవత స
త్తము లూర్ధ్వ పుండ్ర మత్యంత నియతి
ధరియింతు రవయవస్థలముల నన్యంబు
లందునేనివహింతు రతిశయమున
వారి సంశుద్ధ భావంబు విలోకించి
వెఱతురు దానవుల్ మఱియుఁబ్రేత
భూత పిశాచోగ్ర బేతాళ జాతులు
నిలువ రగ్రంబున నిబిడశక్తిఁ

తే. గీ. దెల్లదీవి నిశ్వేత మృత్తిక హరించి
తెచ్చి మచ్ఛాసనంబున దివ్యనగము
నందు ఖగభర్త యొకగని నదియొసంగెఁ
దన్మహత్వంబు సెప్పఁ జిత్రంబుగాదె. 495

వ. సత్త్వప్రకృతిశుద్ధమృత్తికయు శుద్ధముతద్దివ్యస్థానంబును శుద్ధ సత్త్వ
మయంబు. 496

మ. యదుశైలాగ్ర శిఖాంతరంబున జగంబౌనౌననం గామిత
ప్రదయై నిర్ఝరధార యొకటి ప్రదీప్త శ్రీ మహాపావగ
ర్వదయైలోకములెల్ల నెన్నికొనఁగా వైకుంఠ గంగాఖ్యయై
పొదలున్విష్ణుపదంబునన్ వెడలియీ భూమిన్ విజృంభింపుచున్. 497

## యాదవశైలము — అచటి విశేషములు

క. తత్తీరా వాసంబునఁ
దత్తోయ స్నానదాన తర్పణవిధులున్
దత్తత్త్వస్తోత్రంబును
జిత్తస్థితిఁజేసెనేని చేకురుఫలముల్. 498

సీ. ఆ త్రివిక్రముని పాదాంభోరుహంబు పం
కజసంభవుఁడు మున్నుగడిగినట్టి
తద్వారి ధార యంధకవైరి వరమౌళి
మాలికయై నేల వ్రాలకున్న
వైకుంఠ నగరాధివాసులు కృష్ణ తీ
ర్థాభిలాషం బాత్మయందుఁ బొడమ
విరజాజలముఁదెచ్చి తిరుగఁ దత్పాదాంబు
జాతంబునకును సంక్షాళనంబు
తే. గీ. సేయఁ దత్తీర్థమెల్ల నీ శిఖరరాజ
పార్శ్వమునఁ బ్రవహించి సుపర్వ పర్వ
కల్పనాశక్తి వైకుంఠ గంగయనఁగ
సిద్ధ సంకల్పులెంచఁ బ్రసిద్ధిఁ గాంచె. 499

తే. గీ. భక్తిసార మహాయోగి భర్త మత్ప
దాంబుజస్తోత్ర పాత్రుఁ డత్యంత నియతిఁ
దత్తటంబుననన్నుఁ జిత్తమున నిలిపి
ధ్యాన మొనరించి వైకుంఠ ధామమందె. 500

వ. మఱియు నావైకుంఠ గంగాతీర్థంబుపైఁ బ్రోక్షించుకొనినఁ గామాది దోషంబులు దొలంగి శమదమాది సద్గుణంబులు సంభవింప నపవర్గంబు నొందించుటంజేసి యది యుత్తమ స్థానంబుగదా! ఆ నయన స్థానంబున నారాయణ హ్రదంబను పుణ్యతీర్థంబుగలదు. తత్తీరంబునం బునశ్చరణం బొనర్చిన వేగంబె మంత్రసిద్ధియగు. తద్దర్శన మాత్రం బునం గ్లేశంబులడంగు. తద్ధ్యానంబు జేసిన విముక్తుండగు. విష్ణు చిత్తుండు నారాయణ పదద్వయ శరణాగతుండై యచ్చట పరమ ధామంబుచేరె. నారాయణ హ్రదస్నానంబున నరకాంగారక నాశన మంత్రుఁడు. అందున నంత్యంబున హరిస్మరణంబు సేయ బుద్ధివొడమించు. ఈ నారాయణ హ్రదంబునకు దక్షిణంబునఁ గల్యాణ తీర్థంబునకు నుత్తరంబునఁ బారాశర తీర్థంబుగలదు. మన్నియోగంబుచే మద్భక్తుం డగు పారాశర్యుండు విష్ణుపురాణంబుఁ దత్తటంబున రచియించె. దాని దక్షిణదేశస్థులు మైత్రేయకుండంబంద్రు. తచ్ఛైలోత్తర భాగంబున యజ్ఞవృక్ష పరీతంబై యాదవ మహానది ప్రవహించినయది. ఇందు

ఖదిరపలాశ సమిజ్జాలంబులచేయజనంబు చేసినఁ బరమపదంబు లభించు. తత్తీరంబునందు యాదవేంద్రుండను నతండు తపంబుచేసి యింద్రపదంబునొంది పిదపం గైవల్యంబుఁగాంచె. అయ్యాదవగిరి దక్షిణ పార్శ్వంబునఁ బరిధాన శిలగల దా శిలకుం బ్రణామం బాచరించిన వారికి సురాసురులు ప్రణామంబులు సేయుదురు. శిల శుద్ధ సత్త్వ మూర్తిగాన స్పృశించిన సత్త్వగుణము వొడము. ఐశాన పాషండ కాణాదులు భూమియందు వక్రవచన క్రమంబున వేదంబులుదూషించిన నామ్నాయంబులు శిష్యులుగా నేను మానుషరూపంబున దత్తాత్రే యుండనై త్రిదండధారినై యందుఁ గాషాయంబులుగాఁ జేసిన మత్పరి ధానంబుచే శిల పరిధాన శిలయయ్యెఁ. అచ్చట నరులు కాషాయ శాటికా పరిగ్రహంబుచేసిన వారి ననుఁగా భావించి వందనంబు సేయందగు. మద్భక్తులలో నుత్తమోత్తములు వారు. శిష్యులకు వేదంబర్థయుక్తం బుగా నెచ్చట నేనుపదేశించితి నది వేదపుష్కరిణి యండ్రు. యాదవ నగానన్నభూమిని వేదపుష్కరిణి పశ్చిమ భాగంబున దర్భతీర్థంబు గలదు. మహత్తర దర్భ ప్రరోహంబులందు జనియింప నేను సన్న్యాసి రూపంబు గైకొనినాడు తద్దర్భ సంగ్రహం బెచ్చట నొనర్చితి నది దర్భతీర్థంబు. సమస్త పంచరాత్రంబును నెవ్వండు ప్రవర్తకుండు, ఎవ్వనిచేఁ బాంచకాలిక ధర్మంబు విశదంబుగాఁ జేయఁబడియెనట్టి శాండిల్యుం డచ్చట నన్ను నారాధించె నది ప్రసిద్ధ క్షేత్రంబు. తత్రత్య దర్భశయ్యాశ్రితులై సంసారధర్మంబు విడుచు వారంత్యంబున విముక్తు లగుదురచ్చట. 501

తే. గీ. తద్గిరీంద్రము దక్షిణ స్థలమునందుఁ
గలదు తీర్థోత్తమంబు విఖ్యాతమహిమ
నమరమునులు పలాశ తీర్థమని దాని
సన్నుతించిరి ధారుణీ స్థలమునందు. 502

క. పాత్రత్వ ముడిగి విశ్వా
మిత్ర మహా శాపవహ్ని మిడుకఁగఁ బుణ్య
క్షేత్రంబిదియె వసిష్ఠుని
పుత్రులఁ బావనముచేసెఁ బూని మదాజ్ఞ. 503

శా. తత్తీర్థోత్తరసీమ మించు నొకవింతఁ బద్మతీర్థంబు రా
జత్తోయోత్థిత ఫుల్లహల్లకవనీ సంపన్నమై సద్గుణో
దాత్తుండైన సనత్కుమారుఁడు తదుద్యత్పద్మపూజన్ సువ
ర్ణోత్తంసంబుననున్ భజించె సనకాదుల్ వెంట సేవింపఁగన్. 504

ఆ. వె. జగతిఁ బద్మతీర్థ సంపుల్ల పద్మాక్ష
మణికలాప దివ్య మాలికాంక
కంఠులైనవారు ఘనులు వైకుంఠోప
కంఠసౌధవీథిఁ గాంతురెలమి. 505

మ. ఘనమై పావనమై విశుద్ధతరమై కల్యాణ తీర్థంబు చ
ట్టును గానంబడి యష్టతీర్థదగనే(ఁ)ను న్నాఁడు చూపట్టి య
మ్మనురాజంబున యోగులున్ బుధులు సమ్యగ్భక్తిఁ గీర్తించు నం
తనె సిద్ధించు నభీష్టముల్ మునిఁగినం బ్రాపించవే పుణ్యముల్. 506

తే. గీ. సర్వ తీర్థములందుఁ బ్రశస్తమట్టి
తీర్థమేతన్మహా తీర్థ తీరసార
తులసికా కాండ మణిభూష వెలమిఁ దాల్చు
ఘనులఁ జూడ మహాపాతకములు దొలఁగు. 507

సీ. జనుఁడు స్థానాంతరంబునఁ జేయు పుణ్యంబు
లెలయఁ బుణ్యక్షేత్రముల నొనర్పఁ
దద్దశగుణమయి తనరు పుణ్యక్షేత్ర
కల్పిత పుణ్య సంఘముల మించు
పుష్కరంబునఁ జేయు పుణ్యంబు తచ్ఛత
గుణమయి పుష్కర గణితపుణ్య
మునకంటెను బ్రయోగమున సహస్రగుణమై
చెలఁగు పుణ్యము మహర్షి క్షేత్రమునను
తే. గీ. గోటి గుణమగు బుణ్యంబు నూటిగ శత
కోటి పుణ్యంబు యాదవ క్షోణిధరము
నందు మద్భక్త సన్నిధి నయ్యెనేని
కోటి కోటి గుణము పుణ్యకోటులెంచ. 508

వ. యాదవాద్రికిం గావుగా సుదర్శన పురుషుండు తిరుగు. యాదవ శైలా సక్తులగు మద్భక్తులం బీడించువారి దత్సుదర్శన జ్వాలా మాలిక శకలంబులంగాఁజేయుద్వాపరాంతంబునం గలిపురుషుం డచ్చటికి రానుపక్రమింప వేత్రదండ ధరులైన యమకింకరులు వారింపుదురు. వత్సరంబేని పక్షంబేని పక్షార్ధంబేని త్రిరాత్రంబేని యేకరాత్రంబేని యదుగిరినున్న యతండె మద్భక్తుం డన్యుండుగాఁడు. ఫాల్గునియందు యామంబేని, తదర్ధంబేని నన్ను నా యాదవాద్రిని సేవించిన వాని జనని స్తనంధయునిం బోలెనను వర్తింపుదురు గాన మీరచటికేఁగి నన్నుఁబూజించి పరమ భక్తులై సంసృతి తరింపఁగలరని ధర్మపరాయణులు ధర్మంబులార్జించి పునర్జన్మంబు లొందుదురు గాని యాదవాద్రి నివాసులైన వారికిఁ బునర్జన్మంబులు లేవని భగవంతుఁ డానతిచ్చిన మునులు దండ ప్రణామంబులుచేసి మాకుఁ బరమ బంధుండవును పరమగతియు నీవె యని విన్నవించిరప్పుడు. 509

క. సంక్షేపంబున నస్మ
త్కాంక్షనివర్తింప దఖిలకలి కర్దమ ని
స్సంశాశనంబు సేయు ని
దంక్షేత్రము మహిమ మాకుఁ దగఁ దెలుపదయన్. 510

వ. అనిన. 511

క. మును పద్మభవుని వలనన్
సనత్కుమారుండు దెలిసి సమ్మతిఁదచ్చె
లన మహిమ నారదునకున్
ననుపమ సద్భక్తిదెలిపె నతిహర్షమునన్. 512

వ. ఆ నారదుండు నీకు సవిస్తరంబున బోధించునని భగవంతుం డానతి యిచ్చి యంతర్ధానంబు నొందెనంత. 513

ఉ. మాలిక మాలికాభరణ మన్మథ మన్మథయోగి హృన్మణీ
శాలిక శాలికా మదవిశాల దృగంచల నూత్నచంద్ర శా
బాలిక బాలికా జనరతాయనవచ్యుత మాలికాగ్ర కం
కేలిక కేళికా వనరగీత వినీత సుధాము ధాము దా. 514

క. వసుదేవ దేవకీసుత
కుసుమాయుధ జనక వృష్ణికులమణిదావ
గ్రసనదురాసదభక్త
వ్యసన నిరసన ప్రభావవర్ధిత చరితా! 515

కవిరాజ విరాజితము

యదుకుల భూషణ శోభిత వైభవ యర్జున సారథి యోగినుతా
మదయుత చేదిమవారణసింహ సమస్త జగత్పరిపూర్ణ యశా
త్రిదశ జనావన పావనశీల సుధీజన మానస హంసవర
ప్రదగత సాంబముఖాఖిల సేవితభవ్యమహోదయ నందసుతా! 516

## గద్యము

ఇది శ్రీమత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్యపుత్ర,
కశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడు నరసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణంబునందుఁ బ్రథమాశ్వాసము.

# నారదీయపురాణము

## ద్వితీయాశ్వాసము

క. శ్రీమద్బృందావన వీ
థీ మధ్య విరాజమాన దృఢరాస క్రీ
డా మాద్య ద్వల్లవ యువ
తీ మోహకదంబ భోగతృష్ణా ! కృష్ణా! 1

వ. అవధరింపుము. 2

ఉ. చంద్రకళా కలాపరుచిజాలముతో మహతీ విపంచికా
సాంద్ర వినోదవాదన రసస్ఫురితానుభవంబుతో మహ
ర్షీంద్రుఁడు నారదుండు కమలేశ పదాంబుజసేవ నైక ని
స్తంద్రుఁడు నిల్చె మౌని జనసత్తములందఱు సన్నుతింపఁగన్. 3

తే. గీ. జ్ఞాన వైరాగ్య భక్తినిష్ఠాపరుండు
వేద సీమంత మౌక్తిక విమలమూర్తి
ఘనతపోరాశి సత్త్వైక ఖనియతఁడు ర
మేశుఁ దలరార వీణ వాయించెనపుడు. 4

తే. గీ. నలిన నేత్రుఁడు సంకీర్తనమున మెచ్చి
నట్లు విజ్ఞాన యజ్ఞ యోగార్చన ప్ర
ణామములచేత మెచ్చఁ డానందమొంది
యట్లు గావునఁ గీర్తనంబర్హ మెచట. 5

క. పరమ రసాయన మనఁదగు
నరవర జిహ్వాపరరస నవరుచి లోకాం
తరరక్ష యాగమంబుల
నరయఁగ నారాయణాహ్వాయము గమ్యంబే ? 6

తే. గీ. గరుడవాహన గుణకథా గానపరమ
గద్గదాలాపములఁ జొక్కి కడునటించు
నారదునిఁ గాంచి హర్షవాఃపూర మగ్న
మానసంబులనుండి శమంబుపూని. 7

క. అనిశ ప్రణయ రసోత్పు
ల్ల నిజేక్షణులైన మునికుల ప్రవరుల నా
ముని చంద్రుఁడు బోధ రసాం
చన మృదుభాషా విశేష సంపదఁబలికెన్. 8

తే. గీ. ఇచట మీరున్న కారణంబేమి, మిమ్ముఁ
గాంచి చరితార్థత వహించి ఘనుఁడనైతి
ననుచు నారదుఁ డడుగ మహర్షివర్యు
లద్భుతానందరసమాని యప్పుడనిరి. 9

సీ. కలివేళ నతిసమగ్రతర పుణ్యక్షేత్ర
ములలోన ముక్తికి మూలమైన
క్షేత్రమెయ్యది యందుఁజేరి వర్తించెద
మని తలపోసి నారాయణాహ్వ
పరదేవతామౌళిఁ బ్రార్థింప నారాయ
ణాద్రియేయుండు యోగ్యంబు మీకు
ననుచు సంక్షిప్త వాక్యమున నానతియిచ్చి
విస్తరంబున జగద్విదితుఁడైన

తే. గీ. నారదుఁడుదెల్పు ననియె నా[1]నలిననాభ
భక్తి సుజ్ఞానయోగి ప్రపన్నమౌని
నాయకాగ్రేసరుఁడవు నానావిచిత్ర
హరికథాలీల లెఱిఁగింపు మనఘచరిత. 10

క. నారాయణ యోగీంద్రుఁడు
సారజ్ఞుఁడు తానెయట్లు సన్నిధియయ్యెన్
జేరెన్నిఁక యదుశైలం
బారయఁ గలి దోషహారి యగుటెట్లుధరన్ ? 11

వ. ఆ యాదవ శైలంబున నేయే యధికారి శౌరిం బూజించె ? అచ్చటి తీర్థంబునకుఁ గల్యాణనామం బెట్లుగలిగె ? తచ్ఛ్వేతమృత్తిక యెందునం బ్రశస్తంబయ్యె? నరసింహుండేమి నిమిత్తంబునఁ బ్రాదుర్భవించె ? ఈః క్షేత్రంబునకు వైకుంఠవర్ధనంబను పేరెట్లు సంభవించె ? అయనవాసంబున నెవఁడు విష్ణుపదంబందె ? ఇచ్చట నపరాధంబుసేసిన వానికెట్టి దుఃఖంబుప్రాపించె ? ఆనతీయవే యని పలికిన నారదుం డుత్సుకుండై యిట్లనియె. మున్ను నేను విజ్ఞాన సంచయంబైన సనత్కుమారుని వలన

1. నలిననాభి.

వినిన యది మీకు నెఱింగించెదవినుఁడు—ఆత్మగుణ వన్నగ పరిదష్టులైనవారికి నజ్ఞాన వారణంబైన గురూపదేశమే పరమౌషధము. పరమధర్మము. పురుషోత్తము లీలచే మున్ను చరాచర విశ్వము తమోమాత్ర రూపవిశిష్టమై పరబ్రహ్మంబుఁ బొందియుండు. ప్రధాన పురుషు లనంగా నీశ్వరునికి శరీర ద్వయమాధేయత్వ విధేయత్వ శేషత్వములచే నఖిలజగంబులకుఁ దారకుండై నియంతయై శేషియైన హరికిఁదనువు గావునఁ దదాత్మకత్వముచేతఁ బ్రధానపురుషులు విశ్వంబునకుం గారణంబని నిగమంబులయందుఁ బలుకంబడియె. ప్రధానపురుషులు స్వతంత్ర కారణంబులుగారు. తత్ప్రళయ కాలము నందును బురుషులు పురుషార్థరహితులై యచిత్సదృశులై జడు లగుదురు. అంత భోగనిర్ముక్తులై ప్రకృతి సంశ్రయులైన పురుషులం జూచిన పుండరీకాక్షునకు నొకానొక యనిర్వాచ్యమైన కరుణ వొడము. వారి రక్షింప, సృజియింప నిచ్ఛయుదయించు. ఈ పురాణ పురుషుని సంకల్పంబునం బ్రకృతి మఱియు గుణంబులచే మహదాది ప్రభేదం బైన వికారంబునొందు. మహత్తహంకృతిం గల్పించు. అయ్యహం కృతి సాత్వికాది విభాగంబుదగు గుణభేదంబులచేఁ ద్రివిధంబైయుండు. సాత్వి కాహంకారంబువలన నింద్రియ సముత్పత్తియుఁ, దామసాహం కారంబువలన భూతసంభవంబునగు. ఆ రెంటికి రాజసాహంకారంబు ప్రకృతిఁ గావించు. పంచభూతంబులకు శబ్దాదు లుత్తరోత్తరాధికంబులై జనియించుంగాన మహిపంచగుణయగు. తన్మాత్రానుభూత భేదంబు సూక్ష్మస్థూల విభాగంబుననగు కలకలంబై దేహరూపంబునఁ బొడమి నట్లు తన్మాత్రారూపమే భూతత్వము నధిగమించుఁ, గార్యపరంపర సేయు. నానా విద్యాన్వితంబై కూడక వేఱవేఱయై యున్న యీ భూతంబు లండ సృష్టియందు నశక్తంబులైయుండం, గార్య పరం పరసేయ సత్యసంకల్పుండైన భగవంతుండు పంచభూతంబుల యందుఁ బంచీకరణమొనర్చి పంచభూతము లర్ధమర్ధములు తమ భాగ ములుగైకొని కడమ యర్ధమర్ధమును నాలుగు భాగములుచేసి తన పేరైన నాల్గింటనుం గూర్చుట యది పంచీకరణము. ఆకాశాదులయందు నాకాశాది వ్యవహారము స్వభావాధిక్యముచే నిష్టంబగు. దశోత్తరావరణ పరీతంబైన యండంబు పరమ పురుషుండుకనకఖండంబుఁబలె నుత్పా దించి భూతంబులచే, భూతాధిచే మహత్తుచే నీయండంబావరింపఁజేసి సమష్టిసృష్టియు, సృష్టిమొదలగు వ్యష్టిసృష్టి పిదపంగాఁ గలదు. అండ మధ్యంబునం గార్య పురుషుండు త్రయీభాగస్తూయమానుండై జలా శయంబున నధిశయించె మఱియును.

సీ. సకల నామస్తుతి సంఘటించుటకంటె
నారాయణాయను నామమొకటి
హరికిఁ బ్రియంబు వాక్యవిశుద్ధిదంబు శ్రు
త్యవలంబనంబు కామ్యప్రదంబు
సాధుకర్ణామృతసారమె వెవ్వనిజిహ్వా
యందుఁ దన్నారాయణాహ్వయంబు
పొడము నాతనియింట జలధికన్యకతోడ
నట్టి పరాత్పరుం డధివసించు
తే. గీ. అర్థమెఱుఁగకయేని నారాయణాహ్వ
నరుఁడు కీర్తించి భయపరంపరఁ దరించు
సద్గురూదిత సారార్థ సరణిఁ దెలిసి
పలుకువారల నేమని తలఁపవచ్చు. 13

సీ. నారంబు జలమయనంబుగాఁ గలుగుట
సకలలోకంబులు సన్నుతింప
అక్షరము[1] జలౌఘమంతయు నారమౌ
నది యయనంబుగా నచ్చుపడుట
నరుఁడు విష్ణువు తజ్జనవరులు నారులు
వారయనంబుగా వరలికొనుట
నల చరాచర లోకములు నారములు వాని
కయనమై సౌభాగ్య మంటికొనుట
తే. గీ. జ్ఞానశక్తి బలాదిక షడ్గుణములు
నారములు వాని కయనమై నయముగనుట
అమృతమూలంబు నారాయణాహ్వయంబు
నిర్వచింపంగఁదగుఁ ద్రయీనియతమగుచు. 14

వ. వ్యూహంబునందు వాసుదేవునికి షడ్గుణంబు లెటువలెనుండు నటువలెనే నారాయణాహ్వయంబునందును షడ్గుణంబులుండు. సంకర్షణాది భేదంబు గుణాభివ్యక్తిమాత్రంబు. జ్ఞానశక్త్యాది షడ్గుణంబులచేతను తద్భేదంబులైన కరుణాదులచేతను పరిపూర్ణుండై శ్రీమన్నారాయణుఁ డయ్యె. విశ్వాంతర్యామి బాలజఠరంబున జగంబులువోలె షాడ్గుణ్యోదరం బాశ్రయించి గుణకోటులువర్తించు. మఱియును. 15

1. అక్షరజలౌఘ—గణభంగము

చ. జలనిధి శాయియైన మధుశాసను నాభిని దివ్యమై మహో
త్పల ముదయించె నందు వితతస్ఫురితాంజలియై వినమ్రుఁడై
కలిత శుచిస్మితుండయి యొకానొక బాలుఁడు పుట్టె నాల్గు మో
ములను జతుర్భుజప్రథితమూర్తికి నిట్లు తగున్³ జనింపఁగన్. 16

మ. అని యీ రీతి దిశాంతరంబుల సమస్తామ్నాయముల్ చాట న
బ్జనివాసాంగన సత్కృపామృత రసస్నస్యంబుచే వృద్ధిఁ బొం
ద నిజప్రేమ నొనర్చె శౌరిదయయే తా నిట్లనెయుండెనో
యన నా బిడ్డనికిచ్చె నైహికసుఖంబాముష్మిక శ్రేయమున్. 17

## శ్రీహరి నాభి కమలమునఁ జతుర్ముఖ బ్రహ్మ ముదయించుట

వ. అనపాయినియగు నిందిరాదేవి ప్రార్థించిన నప్పరమాత్మ వొమ్మనిన నతండును బాల్యంబున 'నోఽమో'మ్మని పలుక నయ్యాదిదంపతులు నగిరి. అంత హరి నగుచు హరి యన్నవెనుక హరి యని పలికె. అదియ యావర్తింపుచుండె. ప్రణవంబును, బ్రణవాద్యక్షరద్వయమును "హరిః ఓమ్" అని యుచ్చరింప వేదంబున కాదిప్రణవం బయ్యె. ప్రణవంబునకుఁ గారణం బకారం, బకారంబున కర్థంబు పరబ్రహ్మంబగు నారాయణ పదంబు. ఇట్లు ప్రణవంబువలుకు నాత్మజుం గృపాదృష్టిం జూచి భగవంతుండు హర్షించి నాల్గువేదంబులు నర్థంబుతో నభ్యసింపఁ జేసె. రహస్యంబెద్దియుఁ బ్రథమపుత్రునకుఁ బ్రియశిష్యునకు నెఱిఁగింప రాని యదిలేదు గావున సర్వంబును బోధింపవలయునని యా శౌరి శరీరంబు రథంబుగా నెఱుంగుము. జీవు లయ్యుగ్యంబులుగా నెఱుంగుము. షడ్గుణంబులు గుణంబులుగా నెఱుంగుము. సర్వధర్మంబులయందు స్వతంత్రుండగానని తలంచి నన్ను నేసాధనంబును తద్బలంబునుంగా నెఱుంగుమని బోధింప బ్రహ్మ సర్వజ్ఞుండై యష్టాక్షర ప్రభావంబడిగిన నష్టాక్షర మంత్రంబు శ్రుతిదృష్టిఁ జతుర్వర్గసాధనము.

## ఓం నమోఽనారాయణాయ అను అష్టాక్షర మంత్రపుఁ బ్రభావమును శౌరి బ్రహ్మ కుపదేశించుట

బహుమంత్రంబు లేల? బహుకర్మంబు లేల? ఈ యష్టాక్షర మంత్రం బసాధారణంబయ్యు, సర్వమూర్తులయందును సాధారణంబై సహస్ర పర్యంతంబులైన మంత్రంబులలో నిదియ యుత్కృష్టంబు.

3. తలంచఁగన్.

అన్నియు నీ మంత్రంబునకే యనుకూలంబులగు. వ్యాపకంబులైన మంత్రంబులు మూఁడింటిలో నిది యుత్కృష్టంబు. దీనియందు వ్యాప్య వ్యాపక విశేషావ బోధంబు గలుగుం గాన విష్ణు గాయత్రియం దాద్యం బీ మంత్రంబు. 18

క. ఈ మంత్రశక్తి సద్గురుఁ
డే ముఖ్యుఁడు తెలుప నన్యుఁడెఱుఁగునె తెలుపన్ ?
భూమిన్ జాత్యంధుఁడు దా
నేమేనియుఁ జూప నెఱుఁగునే యంధునకున్. 19

క. [4]విమలమగు శ్రీనివాస
త్వ మసాధారణమునాకుఁదగునట్ల త్రయీ
సముదిత నారాయణ పద
మమిత మసాధారణంబు నయ్యెన్నాకున్. 20

క. నారాయణ నామము జి
హ్వారంగమునందు నిలుపు నతనికి నపవ
ర్గోరుఫలము తన్మంతకు
నారయ మంత్రాంతరంబు లవి యేమిటికిన్. 21

క. నియతాత్ముఁ డగుచు భోజన
శయనాసనయానకర్మ సమయముల మనః
ప్రియముగ నారాయణయను
శ్రియః పతి సమాఖ్య వినుతి సేయఁగ వలయున్ 22

క. ఏతన్మంత్రరహస్యము
స్వాతి సృజించెదవు సకల జగదంతరముల్
ఖ్యాతిగ నధికారాంతం
బేతెంచిన నన్ను నాశ్రయించెదు మీఁదన్. 23

## బ్రహ్మదేవుఁడు అష్టాక్షర మంత్రావృత్తి ప్రభావముచే హరపురందరాదులగు దేవతలను సృష్టించుట

క. సారతర పరమమంత్ర స
మారబ్ధావృత్తిపూని యబ్జభవుఁడు స
ర్వారంభోన్ముఖుఁడై తా
నారూఢస్థితిఁ బ్రపంచమంత సృజించెన్. 24

4. విమలయగు.

క. అక్షీణశక్తిసి విరూ
పాక్షుండన నొక్కపుత్రుఁ డతనికిఁ గల్గెన్
దక్షుఁడు హరిభక్తిరతుం
డక్షయ విజ్ఞాన వైభవాధిక్యుండై. 25

వ అంత విధాత పురందరాది దివిజస్తుతుండై దేవదేవుండన వెలసిన తనయునకు భవోత్తారకం బుపదేశించి వేదవేదాంతంబులు చదివించిన నతండైశ్వర్యంబువహించి సర్వభూతంబులకు నైహికంబులు కృప సేయుచునుండ సర్వదేవతలను, సర్వఋషులను జతుర్ముఖుండు సృజించె. బ్రహ్మ సృజించుటకు, విష్ణుండు నిల్పుటకు, రుద్రుండు హరించుటకుఁ బాల్పడిరి. మఱియును 26

క. వెలయఁగ దక్షాదులు పు
త్రులుగొల్వ సరోజభవుఁడు తోడ్తో లక్ష్మీ
లలనాధవ పదసేవా
కలనాస్థితి నాచరింపఁగాఁ జర్చించెన్. 27

## బ్రహ్మ శ్రీమన్నారాయణుని అర్చారూపమును సేవింపఁగోరుట

క. అంతం బద్మజుఁడు రమా
కాంతార్చారూపమహిమ గనుఁగొని సకలై
కాంతిక ధృతిఁ జెందెదనని
చింతించె నశేషతీర్థసీమలయందున్. 28

క. పులకించి మున్నుచూచిన
బలవన్మని [5]మానధనముఁ బరమాత్మమదిన్
దలఁపుచు సారోపనిష
త్కుల తిలకము మంత్ర మునిచి గురుమతివెలయన్. 29

తే.గీ. శమిత పాపౌఘమై శంఖ చక్ర ముఖ్య
చిహ్నములు చేతవెలయు నాశ్రితశరణ్య
భాగధేయంబనాఁదగు పరమపురుష
[6]హసితవేశాశారప్తిఁ బద్మాక్షుఁ గాంచి. 30

5. మానధనము పరమాత్మమదిన్.

6. హసితలేశోదరోప్తిమ

## శ్రీమన్నారాయణుఁడు సపరివారుఁడై దివ్యవిమానంబున బ్రహ్మకు దర్శనమొసంగుట

తే.గీ. కాహళీనాదమేదురకలకలంబు
దివ్యదుందుభి ఘోషంబు దివిఁ జెలంగె
నుపనిషన్మయ [7]పాంచజన్యోరురవము
కర్ణములునిండెఁ గల్యాణకారణముగ. 31

క. అమృతంబైన తద్ధ్వన నా
దము వీనుల సోఁకునంతఁ దామరసభవుం
డమిత జ్ఞానకళాయో
గము యోగము మానియుండెఁ గడువిస్మితుఁడై. 32

క. వెలయఁగ విష్ణువెఫలమున్
ఫలమిచ్చు నతండుననుచు భజియించెద ను
జ్జ్వలమతి నాతని నాతని
వలననె పొందెద నటంచు వాంఛించెమదిన్. 33

తే.గీ. అష్ట[8]దిఙ్మధ్య విన్వృతంబైన దివ్య
మగు ప్రకాశంబుగాంచె నయ్యబ్జసూతి
పద పదమటంచు నంతనప్రాకృత జన
మంతరిక్షంబునందు మెండై చెలంగ. 34

సీ. వేత్రహస్తులు పురోవీథిఁ గోలాహలం
బొనరింపఁ దద్వైణికోత్కరములు
నన్యగాథలుమాని నారాయణుని నభో
భ్యంతరాళమున గానంబొనర్ప
వేత్రహస్తుండయి వివిధోరుసంభ్రమో
పేతుఁడౌ సూత్రవతీశుఁ గాంచి
చండప్రచండాది సైనికుల్ తత్పార్శ్వ
భాగంబునఁ జెలంగ భక్తిగాంచి

తే.గీ. ఘనత గజసంహననగజక్రములునగు గ
జాననాదుల శేషాశనాప్తసఖుల
అబ్జజుం డాత్మనేత్రాష్టకార్చ నైక
పాత్రుఁడైయుండి యీక్షించెఁ జిత్రమహిమ. 35

---

7. పాంచజనోరురవము.
8. దిఙ్మధ్య వన్నృతంబైన

క. రుద్రానుకీర్తిభూషా
ముద్రాంక భుజాంతరున్ సమున్నతుఁ ద్రిజగ
ద్భద్రకరునీశకార్యా
నిద్రాణోద్యోగుఁ బతగనేతం గాంచెన్. 36

క. వితతఫణా మణి నీరా
జిత భగవత్పాదపద్మ స్థిరతర భక్త్యా
ధృతి విభ్రాంతశిరస్కుని
శతకోటి సుధాంశుతేజుఁ జక్రిపుఁగాంచెన్. 37

క. కమలా విభ్రమ పాండుర
కమలంబనఁ బూర్ణశీతకర జనకంబై
విమలంబగు ధవళచ్ఛ
త్రముఁ గాంచెన్ జక్రిపై నుదగ్రత మెఱయన్. 38

క. విరజామరుదంకూరో
త్కర పరిశ్రుతి మాతపట్టికామండితమై
గరుడాంకమైన యా శ్రీ
హరి విజయధ్వజముఁగాంచి హర్షమునొందెన్. 39

సీ. పరిపుల్ల మల్లికాభ్రాంత మిళింద మం
డల మండితంబై యనంత విద్యు
దాకీర్ణ మేఘజాలావృతంబైన చం
దంబున రాణించి తరుణ నీర
జాప్త సహస్ర [9]తేజోఽతిదైన్యప్రద
హేమకళిక సూచితేశ తత్త్వ
దైశ్వర్యవైభవంబై ముక్తిమార్గ ని
త్యావబోధక సకలాగమోద్ధ

తే.గీ. రణరణత్కింకిణీ ఘనరవనమిద్ధ
బద్ధకరపుట సంస్తువత్పంచహేతి
కృతజయస్వనమై మహోన్నతివసించు
హరినివాసంబుఁ గాంచె నయ్యబ్జసూతి. 40

తే.గీ. సత్యలోకస్థులైన యా సనక ముఖ్యు
లంబు జేక్షణు గరుడాంకు నపుడుగాంచి
విస్మయమునొంది రత్యంత వివశులగుచు
నంతకంతకు నానందమంకురింప. 41

9. తేజాతిదైన్య. ఈ పాఠమున అకారాంతపుంలింగ తేజపదము గృహీతము.

తే.గీ. అద్భుతంబంది లేచి యత్యంత హర్ష
సంపద వహించె నర్తించె సంభ్రమించె
భువనభూషణమైన యంభోజనేత్రుఁ
దద్విమానంబుఁగాంచి యాతమ్మిచూలి. 42

వ. అంత నప్పద్మజుని విష్వక్సేనుండు విమానంబు ముందఱ నిడుకొని మన్నించి కమలారమణుండు తులసీమాలికామోదవాసనా వాసితో రస్థ్సలుండు జగన్నాథుండానందైకార్ణవంబు నిన్నుఁ[10] గటాక్షింప నరుదెంచె భజింపు, మితండె నీకు సర్వస్వంబు, భవవార్ధితారకుండు. నీవు చేసిన తపంబు ఫలించెనన, నగ్రంబున సేనాధిపతి నారాధించి కన్నులకు ఫలంబై యన్యోన్య సల్లాపంబులాడుచు నిందిరకరసరోజంబులచేఁ బదంబులొత్త స్ఫురత్కిరీట హార కేయూరమంజీర విరాజమానంబై తదన్య మణిభూషణంబులచేత శోభిల్లి, చక్రాద్యాయుధంబులచేత విజృంభించి, వైజయంతీ [11]మాలికాభిరామణీయకంబునంగనుపట్టి పద్మామణి పీఠంబైన శ్రీవత్సంబున రాణించి, పుండరీక ధవళామ్నాయ పుష్కరేక్షణ పద్ధతియై, రాకాశశాంక సౌభాగ్యపరిభావి ముఖాంబుజంబై, కంబుగ్రీవంబై, సువిస్తీర్ణ కవాట [12]ఘటితోరస్కంబై, చతుర్భుజంబై, యుదారాంగంబై, పీతకౌశేయవస్త్రంబై, సమస్త జగచ్ఛరణ్యపదాంబుజంబైన యొకదివ్యతేజంబు వీక్షించి, తదాపాద మస్తకాంతర సౌందర్యంబనుభవించి యాపంకేరుహోద్భవుండిట్లని వినుతించె నంత. 43

క. మ్రొక్కుచు, భావింపుచు మదిఁ
జొక్కుచుఁ గీర్తింపుచుఁ వసుంధరఁజిందుల్
ద్రొక్కుచు హరిపాదాబ్జముఁ
జక్కఁగఁ దలఁదాల్చి పద్మసంభవుఁ డంతన్. 44

క. దూరమునకేఁగు పరువున
దూరంబుననుండి పరువుతోఁ జనుదెంచున్
సారెకుఁ బైవల్కల మొ
య్యారంబున [13]నెగురవైచు నానందమునన్. 45

---

10. గటాక్షించ
11. మాలికాభిరామ్యంబు నంగనుపట్టి.
12. ఘటితోరస్కంబై.
13. నెగరవైచు.

వ. ఇట్లు సంతోషసంభ్రమ పులకిత సర్వాంగుండైన చతుర్ముఖునింజూచి హర్షించి కారుణ్యరస దీర్ఘికాదీర్ఘలోచనుండై భగవంతుఁ డనుగ్రహించు నెడ దేవ విద్యాధర కిన్నరులు వినుతించిరి. అప్సరఃకాంతలాడిరి. ఉత్తాలంబులైన తాలంబులచేతను, దళితాంబరంబులైన మర్దళంబుల చేతను, నర్తక కరకంకణంబులచేతను, గంధర్వ గానంబుచేతను, సనకాది జయజయ శబ్దంబులచేతను జగద్వలయంబు శబ్దాత్మకంబై యుండె. విధాత పరమభక్తిమయి పులకించి యపౌరుషేయ వాక్యంబు లం బ్రస్తుతించె. 46

## బ్రహ్మ శ్రీమన్నారాయణుని స్తుతించుట

తే. గీ. దేవ నారాయణ నమో ఽస్తు తే రమేశ
వాసుదేవనమో ఽస్తు తే వరద సర్వ
లోకరక్షనమో ఽస్తు తే పాకవైరి
పూజ్యపాదాబ్జ [14]మాధవ భోగిశయన. 47

తే. గీ. కారణాయ నమో రక్షకాయతే న
మో నమోవరతే నమో మునిజనైక
కుశలదాయ పరేశ వైకుంఠవాసి
నే [15]నమః శ్రీనివాసాయ నిఖిలశరణ. 48

శ్లో. అచ్యుతాయనమస్తుభ్యమనంతాయచతేనమః
శాస్త్రే సమస్త లోకానాం గోవిందాయ నమోనమః. 49

శ్లో. పరాయ వ్యూహరూపాయ విభవాయ చతేనమః
అంతర్యంత్రే నమస్తుభ్య మర్చారూపాయ తేనమః. 50

శ్లో. నమస్తుభ్యం నమస్తుభ్యం నమస్తుభ్యం నమోనమః
ధారకోఽసి సమస్తానాం జగతాంచ జగత్పతే! 51

వ. అని వినుతించి మఱియు నిట్లనియె. 52

ఆ.వె. మహిమ నీవజాయ మానుండవై జాయ
మానుఁ డవనఁ దగుట మదిదలంపఁ
గర్మహేతు శక్తిగాదు ప్రాకృతశక్తి
నైనఁ గాదు సంశయంబులేదు. 53

14. కృష్ణయంభోధిశయన. సర్వసంస్కృత రచన కావున ఈ పాఠమున కృష్ణయంభోధి అనుచోయడాగమము ప్రసక్తముకాదు.

15. నమోఽశ్రీనివాసాయ అనుపాఠమున సంధిదోషము సంభవించును.

సీ. దేవతామానుజ తిర్యగాదులు నీవ
యాదిమమూర్తి త్రయంబునందు
నొకఁ డవు నీవ యీ యున్న యేమును నీవ
నీవును నీవ యీ నిఖిలజగతిఁ
దలకొని యీక్షణధ్యాన సంస్పృష్టుల
నలమత్స్య కూర్మ విహంగ మాది
రూపంబుల జనించు నా పరాత్మవు నీవ
యీ లోకములు నిర్వహింప నీవ
తే. గీ. యను యుగంబనఁ గరుణతో నవతరించి
యిట్లు విశ్వంబు నిలుపు వేల్పెవ్వఁ డనఘ
దాసుఁడనునీకు, నాకుఁద్వద్దాస్యమహిమ
వశ్యలైరి సుపర్వులో వనజనేత్ర ! 54

వ. అదిగావున సర్వలోకనాథుఁడవునీవే. సర్వవైదిక కర్మంబుల నిన్నె యారాధింపుదు. దేవతా పితృదేవతలు భవత్కాంచక పాయత్వంబు వహించినవారలు. వైదిక నమోవాక్యంబులు భవత్పదంబునందే [16]పర్యవసించుచున్నయవి. రాజులకుంజేసిన నమస్క్రియలు వారవాణంబులకుఁ [17]ప్రాపింపవు. కాన మోక్షాపేక్షులు నీకంటెనన్యుని సేవింపరు. అధికారంబులు వ్యక్తంబులైన కర్మఫలంబు లొసంగంబూనినవాఁడవు నీవే. ఏనును, శంకరుండును, నధ్వర్య సర్వదేవతలును ద్వాదా యత్తతనున్నవారమని చతుర్ముఖుండు విన్నవించినఁ బ్రసన్నుండై భగవంతుండు నీవు యుగాయుతంబు పూజించెదవు, ఆ మీఁదఁ బుత్రులచేఁబూజింపఁజేయుమనియానతిచ్చిననట్లనే కావింపుచునుండె.అంత.55

క. భావమున భగవదావి
ర్భావముగావించి నీవు పలికిన విని స
ద్భావముననుండు మిల నా
భావజగురుఁ డిడినయట్ల పరిపాలించెఁ। 56

16. పరవసింపుచున్నయది.
17. ప్రాపించవు.

## సనత్కుమారునకు బ్రహ్మ శ్రీహరియర్చామూర్తిగలదివ్య విమానం బొసఁగుట

వ. భక్తవత్సలుండైన భగవంతుండు జగంబేరీతి నానందంబుఁ బొందించె
నానతీవేయని [18]ఋషులడిగిన నారదుండిట్లనియె. 57

క. కలశాబ్ధినుండి యొకనాఁ
డలఘుండు సనత్కుమారుఁ డాసనకాదుల్
గొలువన్ నారాయణ పద
జలజ ప్రవణుం బయోజసంభవుఁ గాంచెన్. 58

ఆ. వె. కాంచిమ్రొక్కి శిష్యగణములలోఁబెద్ద
యాత్మజుండు మీకు [19]నతిదయా వి
భాస ! జ్ఞానభక్తి వైరాగ్యదాయివై
యాత్మలోఁ గషాయ మణఁచితిపుడు. 59

క. పొగడఁగ [20]సర్వాంగాన్విత
నిగమాధ్యాపనమొనర్చి నిష్ఠానియతిన్
దగి కర్మ బ్రహ్మవిచా
ర గరిమ సంశయముఁదీర్చి రక్షించితిగా. 60

క. పరమ గురుండవు నీవే
యరయన్ గురుఁ డొకఁడు గల్గఁ డన్యుఁడుమాకున్
సురహస్యార్థములన్నియుఁ
బురుషోత్తమ ! తెల్పితి వపూర్వప్రజ్ఞన్. 61

క. ఈతటి నీవు భజించు స
నాతను లక్ష్మీసనాథు నారాయణు సం
ప్రీతిం బూజించెదఁ బ్ర
ఖ్యాతతమగు తద్విమాన మర్పించుదయన్॥ 62

క. అనిన క్షణమాత్ర మబ్జా
సనుఁ డూరకయుండి శేషశాయి విమానం
బనఘ చరిత్రుండగు నా
సనత్కుమారునకు నపుడొసంగఁదలంచెన్. 63

---

18. పురుషులడిగిన.
19. నతిదయాబ్ధివాస!
20. పొగడఁగ వేదాంతాన్విత.

చ. తలఁచి సనత్కుమారుని ముదంబునఁ జూచి విరించి నాకుఁబు
త్రులు జనియింపరెందఱు బుధుల్ [21]ఘనులందఱలోన నీవు కే
వలముగ జ్ఞానభక్తి రసవాసనమించి సదామనంబు లో
పలఁ బ్రియవృత్తినుందు నిను బ్రహ్మవిదుణ్ వినుతింపశక్యమే. 64

క. సన్మతి నారాయణుఁ డా
జన్మధనంబై చరించు సాత్వికుఁడు తనూ
జన్ముఁడు వంశమహా పా
పోన్మూలనకరుఁడు పొగడ నొరులకు వశమే? 65

తే.గీ. అని విమానంబుఁ బ్రియతనూజార్పితంబు
సేయ నూహించి యొకయింత చింతనొందఁ
బుండరీకాక్షుఁ డాశ్రిత పోషకుండు
పల్కులు సుధారసముచిల్కఁ బల్కెనపుడు. 66

క. ఏల విషాదము నొందెదు
బాలక! యిది యిమ్ము పరమభాగవత సభా
మౌళిమణికి నీకిత్తు ద
యాళుత నొక దివ్యవిగ్రహముఁ గొనుమింకణ్ 67

## శ్రీహరి తన యర్చామూర్తిని మఱియొకదానిని బ్రహ్మకనుగ్రహించుట

తే.గీ. అనుచుఁ గమలా గళాభరణాంకశాలి
యైన నిజకరముననిచ్చె నాత్మ దివ్య
విగ్రహముఁ బద్మజునకు నా విగ్రహంబు
చక్కఁ దనమునకై యాత్మఁ జొక్కెనలువ. 68

తే.గీ. అందుకొని [22]శ్రీమహీ మోహనాభిరామ్య
శాలి నా దేవుఁ గొల్చె నా జలజభవుఁడు
వాణి సావిత్రియు నొనంగు వళిత లలిత
కలిత కంజాతమాలికల్ [23]గట్టవైచి. 69

21. ఘనులందఱిలోన.
22. శ్రీమహిళా మోహనాభిరామ్య—గణభంగము.
23. గట్టి.

## బ్రహ్మ యానతిచే సనత్కుమారుఁడు శ్రీహరి దివ్యవిమానమును యాదవాద్రికి తెచ్చుట

వ. అంత సనత్కుమారునింజూచి విరించి యిట్లనియె. 70

సీ. కలదు సహ్యగిరి విఖ్యాతమైనయది పు
ణ్యతరంబనాది, తదాకరమున
శ్వేతమృత్తిక విలసిల్లునచ్చట నీ వి
మానంబునిల్పు మ నూన మహిమ
నారాయణపదాబ్జ పారాయణుండవై
వఱలు శ్రీవైకుంఠవాన సౌధ
మునునుండి తానెవచ్చిన యది యతిపావ
నము, వేదనిందక నళిననేత్ర

తే. గీ. భక్తి విరహిత, నాస్తిక, భాగవత వి
దూషకాత్యంత దుర్దోష దుష్టమతుల
నీ విమానంబుఁ జూడరానీక భక్తి
నందు వర్తించుమీ కుమారాగ్రగణ్య ! 71

వ. అనినయంత. 72

తే. గీ. నవ్యవైభవమున నా సనత్కుమారుఁ
డాదిదేవు, సనాతను, నజు, నగమ్యుఁ
జెంది యుప్పొంగి కనకాద్రి శిఖరసీమ
కరుగుదెంచె నిరంతరాహ్లాదుఁ డగుచు. 73

క. అనుపమ దివ్యవిమానము
మననపరుండా సనత్కుమారుఁడు గొనిరాఁ
గనకాచల శృంగంబుల
నినకోటి సహస్రకాంతు లెల్లెడ మెఱసెన్. 74

సీ. అప్సరః కాంతలు నమరులు ననిమేష
నేత్ర సాఫల్య మెన్నిక వహించి
హరి విమానముఁజూచి హర్షాశ్రుపూర్ణత
మ్రొక్కిరి నవ్యప్రమోదలీల
ఆ విమానమునకు నగ్రంబునను వాహ
నారూఢులగుచు నింద్రాది దివజ
గంధర్వ కిన్నర ఖచరవిద్యాధర
సాధ్యులు నలువంక నవటిగొలువ

తే. గీ. నడుచునప్పుడు గాన్పించె నవ్యశార
దాంబుధర శుభ్రరూప శౌర్యాద్రిరాజ
మందునుండి యుమాజాని యరుగుదెంచి
యెదురుకొని వందన మొనర్చి యిచ్చనలరి. 75

## దివ్య విమానస్థుఁడైన శ్రీహరియర్చామూర్తిని శివుఁడు స్తుతించుట

వ. కల్పాంత నర్తకుండైన హరుండు నర్తించి యిట్లని వినుతించె. 76

సీ. [24]ఆహా ! జగన్నాథ ! యరవిందలోచన !
యరుదేర నినుగంటి నాత్మచల్ల
నయ్యె నేత్రాంబు రుహంబులు వికసనం
బయ్యె నోస్వామి ! తారాళియెంచ
వచ్చిన ధారాళ వర్షబిందువులెంచ
వచ్చిన సికతాలవంబులెంచ
వచ్చినదేవ ! భవన్నాభినీరజ
నీరజ సంభవానీకములు గ

తే. గీ. ణింపశక్యమె షాడ్గుణ్యనిధివి నీవ
విశ్వకారణమును నీవ విశ్వలోక
సత్తముండవు నీవ ప్రసన్న ముక్తి
దాయకుఁడ వీవ సకల సంధాతవీవ. 77

క. అకలంక మహిమ నా బ్ర
హ్మకిట [25]నిఖిల ప్రపంచమంతయుఁ గ్రీడా
ర్థకలితపుత్రకు లట్లనె
ప్రకట శ్రీనుండు నీకుఁ బరమాత్మ ! హరీ ! 78

మ. నిగమాంతాధ్వమహావబోధ నిధయే నేత్రే సుధీపాలినే
భృగుజాపీన పయోధరాంక [26]మకరీస్ఫీతాంసయుక్తాయతే
జగతీశాయ కృపాబ్ధయేఽవిత తురాసాహే నమస్తేనమః
త్రిగుణాతీత గుణాయ సాధుసుమనోధన్యై నమస్తేనమః. 79

---

24. హాహా!

25. వివిధ ప్రపంచమంతయు.

26. మకరిస్ఫీత.

వ. అని కమలనేత్రుఁ, గారుణ్యపాత్రు, శరణాగతసర్వస్వచరణు, నిందిరా భరణు వినుతించి వెంటనంటి యలకాపురప్రాంతంబున కరుగుదెంచి నిజశ్రవణభూషలైన వైశ్రవణ భాషలం జొక్కి నిల్చె, నంత నైహిక పరమపదంబై, మునిసమాకీర్ణంబై వెలయు బదరికాశ్రమంబుఁ జొచ్చి మునిరూపంబులనున్న నరనారాయణుల సన్నిధానంబున సనత్కుమార ప్రముఖ మునీంద్రులు తద్విమానంబు నిలిపిరంత. 80

శా. ఆ నారాయణుఁడమ్మహాశ్రమమునందత్యంత మోదంబుతో
శ్రీనాథుః దివసత్రయంబపుడు పూజించెః దదంతస్థులౌ
మౌనుల్ వచ్చిన మౌనులున్ సురలు నామ్నాయంబులః, సంతత
ధ్యానం బొప్పఁగ బాహ్యదేశముల నత్యంతంబు సేవింపఁగన్. 81

వ. అంత బదరికాశ్రమంబు వీడ్కొని చని. 82

## సనత్కుమారుఁడు యాదవాద్రిపై శ్రీహరి దివ్య విమానంబును నిలుపుట

తే. గీ. అపుడు సర్వోత్తరం బగు నద్రి యొకటి
దక్షిణాశా విభూషయై తనరు తులసి
కాననావృతయైయున్నఁగాంచి నలువ
తెలియఁజెప్పిన జాడయై తెలివిగాంచి. 83

క. ఇది దివ్యధామ నగమని
మదిలోఁగనె నా సనత్కుమారుఁడు హర్షం
బొదవః సేనాని వినుత
మిది శేషుఁడు నిదియ హరియు నిదియే యనుచుః. 84

వ. తత్పర్వత శిఖర మధ్యంబునఁ దీర్థ నిషేవితంబైన యొక దివ్యతీర్థంబుఁ గాంచి యది మహాస్థానంబంచు సర్వేశ్వరుండగుశ్రీహరి నారాధించెద ననితలంచి తత్తీర్థ తటంబునః బ్రహ్మార్చితంబైన విమానంబు నిల్పె. మున్నుధాత పూజించునెడఁ బంచలక్షయోజన ప్రమాణంబగు తద్విమానంబు పంచపురుష మాత్రారూపంబునం గాననయ్యె. భగవంతుండును స్వలీలచే భక్త పరతంత్రుఁ డుఁగాన తదంతః పరిమిత రూపంబునం గాననయ్యె. ఆయుధంబులును, దివ్యభూషణంబులును విస్తారంబులు దక్కి [27]తద్రూపాను రూప స్వరూపంబులంగాంచె. అంత. 85

27. తత్తద్రూప స్వరూపత్వంబులుగాంచె.

సీ. ఆ విచిత్రతఁజూచి యౌర శ్రీనారాయ
ణాది దేవుఁడు జగదద్భుతముగ
అప్రమేయ ప్రమేయాకారముల రెంటఁ
గనిపించె ననుచు వల్కలములంతఁ
పొడవుగా నెగవైచి పొగడి నర్తింపుచు
వర్ణనములు చేసి వందనములు
గావించి యిది యహో! కల్యాణమిదియహో!
కల్యాణ మఖిల లోకము లెఱుంగ

తే. గీ. వచ్చి వైకుంఠ నగర నివాససీమ
నుండి మమ్ముఁ [28]గటాక్షింప నుత్సహించె
ననుచుఁ దత్రత్యు లానందమంది పలుకఁ
దేజము వహించెఁ గల్యాణ తీర్థమచట. 86

తే. గీ. తద్విమానస్థుఁ డగు రమాధవుని, విష్ణుఁ
బ్రాఙ్ముఖంబుగ నిలిపి [29]తత్పాంచరాత్ర
విధి సమర్చన మొనరించి విబుధతతికిఁ
బాదతీర్థం బొసంగెఁ దద్భక్తి మెఱసి. 87

వ. హర్షించి సాష్టాంగ దండప్రణామంబు లాచరించి కోటీర రత్న మరీచి పూరంబుచేఁదోరంబుగా భగవత్పాదపీఠికా నీరాజనంబు లాచరించిన భగవంతుండు సుధామనోహరంబులగు నపాంగంబుల నీక్షించి మధుర వాక్యంబుల. 88

## కల్యాణ తీర్థోత్పత్తి

మ. ఘనతన్మించు వరాహరూపమున నీక్ష్మామండలం బెత్తి యం
బునిధిన్ గ్రుంకి కలంచి లేచునెడ [30]నా పుణ్యోద బిందుచ్చటల్
గననయ్యెన్ జగముల్ నుతింప [31]విల సత్కల్యాణ తీర్థంబు పా
వన మాద్యంబు సమస్తతీర్థ నిచయావాసంబు చర్చింపఁగన్. 89

28. గటాక్షించ.
29. తత్పంచరాత్ర.
30. [illegible]గోదబిందుచుటల్.

సీ. ఊర్ధ్వకామతఁదగి యూర్ధ్వరేతస్కులై
యజ్ఞవరాహ రూపాస్మదర్చ
నాతిశయ ప్రాప్తినందెడు వారికి
నూర్ధ్వపుండ్ర విధానమొప్పఁజేయఁ
బక్షికులాధీశుఁబనిచిన నతఁడు శ్వే
తద్వీపమున నుండి ధవళమృత్తి
కాకర్దమముఁదెచ్చి కల్యాణ తీర్థ ప
శ్చిమ భాగమున గనిచేసి నిల్పెఁ

తే. గీ. గాన యిదిమృత్తి కలకు నగ్రగణి సమస్త
దేవతామూర్తి కల్యాణ తీర్థమున ము
నింగి యీశ్వేత మృత్తికనిటల [32]తటిని
నునుప ననుపమమైన సాయుజ్య మమరు. 90

వ. ఈ కల్యాణతీర్థంబున మునింగి యధికారానురూపంబుగా ననుభజించిన వారు మత్ప్రసాదంబున నిఖిల మనోరథంబులు నొందఁగలరు. ఈ కల్యాణ తీర్థ తీరంబునఁ బైతృక క్రియలు గావించినఁ బితృగణంబులు [33]హర్షించు పుణ్య పరవృత్తి నధ్యాత్మ గుణసంపత్తి నపవర్గ పరాయణులై పెక్కండ్రు పుత్రులం బడయఁగలరు. ఈ కల్యాణతీర్థ తీరంబున యజ్ఞంబుఁ జేసిన సహస్ర గుణంబగు పుణ్యంబు సంభవించి యపవర్గంబు గాంతురు. ఈ కల్యాణ తీర్థంబున నిష్కాములై నన్ను సేవించిన యేని యభీష్టంబు లొసంగుదు. ఈ కల్యాణతీర్థ తీరంబున దానంబుఁ జేసినఁ జతురార్ణవీ పరిమిత మహీతలం బేలుచుఁజక్రవర్తియై పుత్రపౌత్రాభివృద్ధిగా వర్ధిల్లు. ఈ కల్యాణతీర్థ గర్భంబున వ్రతంబు లాచరించిన బ్రహ్మలోకంబున బ్రహ్మతో ననుమోదించుచు నుండ్రు. ఈ కల్యాణతీర్థంబునఁ గోరిన కోరికలన్నియు మత్ప్రసాదంబున ఫలియించు, ఫాల్గుని ప్రశస్తంబుగాన నా ఫాల్గునియందు సర్వ ధర్మంబులు గావించి మీరచ్చటికిం జనుదెండనిన రుద్ర ముఖ్య త్రిదశాధిపులు భగవద్వాక్యంబులు విని నిజస్థానంబులకుంజనిరి. అంత. 91

32. శిరము.
33. హర్షించి.

సీ. సనకాది ఘనయోగి జనవర్యులేను వె
న్వెంటరా నిందిరా విపులతర ప
యోధరమకరికా యుక్త భుజాంతరు
వరదైవమని యాత్మ నిరవు చేసి
పరిమితచ్ఛల చింతఁబాసి నిరంతర
పరభక్తి నియతుఁడై పద్మజాత
తనయుఁడు సేవించి తద్గిరి సంవాసి
సకల జనానీక సారదివ్య

తే. గీ. వర్య సిద్ధాంజన త్రిభువన విచిత్ర
సుకృతపాకంబు, నకృతక సూక్తిగమ్య
పరమహేశాను యదుగిరీశ్వరు నిజాత్మ
యందు భావించి హర్షించె నద్భుతముగ. 92

వ. అంత నామునీంద్రులందఱు బదరికాశ్రమంబుననుండి నారదవాక్యంబు
విని యో మహాత్మా ! భగవత్సమాగమ కీర్తనంబు విని ధన్యులమైతిమి.
శ్వేతమృత్తికా ప్రభావంబును, గల్యాణతీర్థంబునకు గంగా తీర్థంబుల
కంటె నాధిక్యంబు గలుగుటయు, వరాహరూప విష్ణు సన్నిధియుం జెప్పి
తివి. విస్తరంబుగా నానతీవేయని యడిగిన నారదుం డిట్లనియె. 93

## కల్యాణ తీర్థమహిమ—సుచరితుని కథ

సీ. వినుఁడు పురాతన వృత్తాంతమో ముని
శ్వరులార యొక మహీసురవరుండు
సుచరితుండనువాఁడు సుచరితుఁడాతని
భార్య సుశీల శోభన సుశీల
సుమతి సువృత్తి నామములఁ బుత్రులుగల
రా విప్రమణికి నాయనఘమూర్తి
సకుటుంబుఁడై కాంచె సకల తీర్థంబులు
సకల పుణ్యస్థాన చయము సకల

తే. గీ. పరమ పుణ్యాయతనములు పాండురంగ
బదరి కాశ్రమరంగ శోభన మహీధ్ర
సింహనగ కూర్మనీలాద్రి సేత్వనంత
శయన గోకర్ణ నైమిశాశ్రమ ఫణీంద్ర
శైలకాంచి కురుక్షేత్రసార మరసి. 94

వ. అంత జాహ్నవీ కావేరీ యమునా తుంగభద్రా తామ్రపర్ణీ సరస్వతీ శోణా గోదావరీ నర్మదా పయస్వినీ కృతమాలా ముఖ్యనదుల నవగాహించి యొకనాఁడు నారాయణగిరిఁజేరి కల్యాణ తీర్థంబున మజ్జనంబాచరింపక పిదప గంగకునేఁగి గంగంగానక యెచ్చటనున్న యదియని తత్రత్యుల నడిగిన వారు హరచూడా విభూషణయైన గంగంగానవా యన నెంత నిర్భాగ్యుండ. అగ్రంబుననున్న గంగా ప్రవాహంబుఁగానక యున్నవాఁడ. ఏ దుష్కృతంబొనరించితినోయని విషాదంబునొంది హరిపాద తరంగిణిం [34]ప్రార్థించుచుఁ జింతించుచున్నంత [35] నీలోత్పల శోభనయైన యొక కన్యా రూపంబునఁదాను భాగీరథివచ్చి బ్రాహ్మణోత్తమా ! యేల దుఃఖించెదవని యడిగిన నతండిట్లనియె. 95

క. సురనదిఁ గానక యంతః
కరణంబున దుఃఖమొంది కలఁగెద యత్యాం
తర విఫలతకంటెఁ దదు
త్తర దుఃఖము వేఱెకలదె తామరసాక్షీ ! 96

వ. అని విన్నవించిన గంగ పాపకర్ములకుంగానఁ బడదనిన బ్రాహ్మణుండేను పాతకి నైతినేని మోక్షోదయంబును సుఖంబునులేదు. ఆ మోక్షోదయంబును సుఖంబును, హరిపాద నదినేని సేవించి పాప సంక్షయంబు చేయక లభించదనిన గంగయిట్లనియె. 97

## కల్యాణ తీర్థమహిమను గంగానది సుచరితునకు చెప్పుట

శా. గంగావాహిని నేను నా సఖియ యీ కల్యాణి కాళింది స
త్సంగం బొప్పఁగ సర్వతీర్థ నికర స్నాతుండవై పుణ్య రే
ఖంగాన్పించిన యాదవా చలమునన్ గల్యాణ తీర్థంబునం
దుం గీర్తించి మునుంగవైతి వది దుర్దోషంబు నీ కిట్లగున్. 98

తే. గీ. ధరణి నిటువంటి పుణ్యతీర్థం బతిక్ర
మించు దుష్పాతకమునకు మేరగలదె ?
తీర్థములరాజు కల్యాణ తీర్థమింక
నీ కెఱింగింతు వినుమతి నిష్ఠఁబూని. 99

---

34. ప్రార్థించినప్పుడు చింతించునంత.

35. నీలోత్పల శోభనయైన యొకకన్యయుం దాను గన్యారూపంబున భాగీరథి వచ్చి.

మ. హరి పాదాబ్జమునందుఁబుట్టి నదులందాధిక్యముం జెందితిఁ
హరి భూదార శరీర సంజనిత [36]సర్వాంగీణవాః పూరమా
వర తీర్థంబు తదద్రిపై వెలసె భవ్యశ్రీల నారాయణుం
డురుతేజంబుననుండుఁ బ్రేమ రమతో యోగీశ్వరుల్ గొల్వఁగఁ. 100

వ. అట్లౌటఁ దత్కల్యాణ తీర్థంబు నాకంటెఁ బరమ పవిత్రంబు. 101

సీ. చాంద్ర సరోవర స్థలమునఁజైత్రంబు
నందనంత సరోవరాంతరమున
వైశాఖమునను బావనమైన తుంగ భ
ద్రా మహాతటినీ హ్రదంబునందు
ఆషాఢమున నభస్యంబున స్వామి పు
ష్కరిణిలోఁదులయందుఁ గ్కజహితుఁడు
వఱలఁ గావేరి ప్రవాహంబునందు ఫా
ల్గుణ మాసమునఁ గోటి గుణము మించు

తే. గీ. నట్టి కల్యాణ తీర్థంబునందు నపుడు
సర్వనదులుండు నందున సర్వఫలము
హరిపరాయణు లందుండ్రు పరమ నియతి
సకల తీర్థంబు లచ్చోట సంచరించు. 102

వ. అనిన విని విస్మయంబంది నిజరూపంబుఁజూపుమని విన్నవించిన దూరదేశంబు తిరిగి యలసినవాఁడ నడువ శక్తుండఁగాను పుత్రులు శిశువులు. నీవే కల్యాణ తీర్థంబవై ప్రవహింపుమని బ్రాహ్మణుండు మ్రొక్కిన యమునంజూచి నగి యాదరంబున నిలిచి యుత్తుంగ తరంగయైయున్న యాతరంగిణిం బ్రార్థించిననన్నుఁగల్యాణ తీర్థంబుగాఁ ద్రిరావృతంబుగా నుచ్చరించి మత్ప్రవాహంబున నవగాహనంబు గావించిన నభీష్టంబు లభించునని యానతి యిచ్చిన నట్లనే బ్రాహ్మణుం డొనర్చి మునింగిన యదుశైలంబును, గల్యాణ తీర్థంబును, దత్రత్యులగు మునులునుగానుపించిన విస్మయమునొందె. అంత నీవెవ్వరు ? నీవిచ్చటి కెట్లు వచ్చితివని యడుగు మునులకు నిజ వృత్తాంతంబుఁ దెలిపి యీ స్థానంబెయ్యదియని యడిగిన వారలు యదు శైలంబని యానతి యిచ్చిన నానందంబునొంది శ్రీమన్నారాయణుని సేవించి తన్మహా నగంబు నిజ నివాసంబుఁ జేసికొని, నివేదితాన్నంబును భుజించుచు నచ్చట నారాయ ణుండను నొక పుత్రునింగని యపరిగ్రహయా వల్లబ్ధోప జీవనుండై యా బ్రాహ్మణుండు 103

36. సర్వాంగిరవాః పూర.

క. నారాయణుఁడను నతఁడం
భోరుహదృగ్భుక్తశేష భోజనుఁడై స
త్వారూఢి జనులు మెచ్చఁగ
శ్రీరమణీనాథు సేవ సేయుచునుండెన్. 104

తే. గీ. అశ్మవర్షనిపాభిహృత సమస్త
సస్య సంపత్సమృద్ధియై జగతియందుఁ
బొడమె దుర్భిక్ష మొకయేఁడు పూర్ణమగుచు
ధూమకేతువు చిందులు ద్రొక్కఁదొణఁగె. 105

వ. అప్పుడతని భార్య సుశీల సుచరితుంజూచి యిట్లనియె. 106

సీ. శిశువుల సతిని రక్షించుట నీతి వా
స్తవ్యునకెట్టి దుష్కార్యకరణ
మేని కావించి స్త్రీత్వానర్థచాపల
ఫణితిఁ బల్కితిఁగాని పల్కఁదగదు
సకల ధర్మజ్ఞుండ వకట నీ వెఱుఁగని
ధర్మంబులేదు భూతలమునందు
ద్రవిడ దేశంబేలు దారిద్ర్య వారణుం
డను రాజువేఁడిన యంతకంటెఁ

తే గీ. దెలివితో నిచ్చు ననుచు బోధింపఁదనయ
సహితుఁడైపోయి యారాజు సభను దస్సి
యతఁడు కార్యవశంబున నంపకున్న
దైన్యమునఁ గొన్ని నాళ్లందుఁ దల్లడించి. 107

ఆ.వె. అంతఁ గొంతసొమ్ము హస్తగతంబైనఁ
జోరు లధ్వసీమఁ జుట్టు ముట్టి
లగుడ ఘాతశక్తి నొగిలించి దోఁచిరా
[37]విడువునంతఁ గ్రుస్సి విప్రవరుఁడు. 108

## సుచరితుని కొడుకు నారాయణుడను బాలుని వ్రతనిష్ఠ

వ. వచ్చుచు నారాయణదేవుని విడిచి వచ్చిన పాప ఫలంబు తోడనే సిద్ధించె
నని పుత్రకులకుంజెప్పుచు నిజ నివాసోన్ముఖుండయ్యె. అంత 109

37. విడుచు.

సీ. [38]ద్రవిడేశుఁ బొడగనఁ దండ్రియన్నలుఁ బోవ
మాతుల గృహమున మాతతోడ
ఆకట డస్సిశ్రమార్తుఁడై నారాయ
ణాఖ్యుఁడు చేరి భోజ్యంబు వేఁడ
అన్నంబు తల్లి పత్రాంతరమున నిడ
ననివేదితంబని యారగింప
ననిన నీవే నివేద్యము సేయుమట్లన్న
ననుమతి గావించి హరికి నొసఁగి

తే. గీ. యతని భుజియింపుమని మ్రొక్కి యంబుజాన
నార్పితోరు చతుర్విధాహారములు తృ
ణీకరించి భుజించె నాలోకవిభుఁడు
సంయమి వరేణ్యులందఱు సంస్తుతింప. 110

వ. ఇట్లు భుజించిన పాత్రంబున సిక్థంబును లేక యుండ బాలుండును హర్షించి తల్లికడకేఁగి యన్నంబు వేఁడిన మునుగొని చనిన నివేదితాన్నంబేమి య య్యెననిన నీశ్వరుండు భుజించెననుట విని మార్జాలాదుల కప్పగించి భగవంతుండు భుజించెననుట యుక్తంబేయని తర్జించి బిక్షాటనంబు సేయుమని పాత్రంబిచ్చిన. 111

సీ. ఏ గృహంబున కతఁడేఁగిన నిందిర
యాగృహంబున కవు డరుగుదెంచి
దర్విచే భైక్ష్యంబుఁ దయనొసంగిన నది
రత్నమయంబయి ప్రబల భార
సారమైయున్న నశక్తుఁడై హస్తద్వ
యంబునఁ దత్పాత్రమట వహించి
శిరమునఁబూని యాశిశువు తల్లికి నప్ప
డర్పింపఁ దత్పాత్రమంది కాంచి

తే. గీ. [39]యేడు మార్లిట్లు యిచ్చె రమేందు వదన
యెనిమిదవమాఱు ఘనమౌ నిజేష్టపాత్ర
మొకటి యిచ్చి కుమార ! నీ వేఁగుమనుచుఁ
దల్లియనిచినవచ్చు పుత్రకునిఁజూచి. 112

---

38. ద్రవిశేశు.

39. యేడుమార్లిట్లఁగ యిచ్చెర మేందువదన—ఈ పాఠమున గణభంగము.

వ. దివ్యాన్నభైక్షంబు[40]వెట్టి లోకమాతయనుగ్రహించి యనుపవచ్చిన సుశీల తానును దత్సుతుండును భుజించి హర్షించి రత్నంబులు గాంచి యక్కు- మారుం బ్రశంసించుచు ధన రక్షార్థంబుగా మేల్కొనియుండె. అంత సుచరితుండు చోర భగ్నాంగుండై యాఁకటం గృశించి పుత్రులతో గృహంబునకు వచ్చుచుండె. అట్లు వచ్చు తన భర్తంగాంచి లజ్జితయై సతి యెదుర్కొని. 113

క. సర్వాంగీణవ్రణుఁడై
దుర్విధుఁడైయున్న మగనితో వేగమె యం
తర్వేదన దొలఁగఁగఁ గుల
నిర్వాహకుఁడైన సుతుని [41]నేర్పెటిఁగింపఁ. 114

## సుచరితుఁడు పశ్చాత్తప్తుఁడై
## కల్యాణ తీర్థంబున తపస్సుచేయుట

సీ. ఎంత మూఢుండనే నిందిరా సహితుఁడై
పత్రపుష్ప ఫలాంబు భక్ష్యములు ని
వేదితంబులుసేయ మోదించి సర్వస్వ
దాయియైయున్న నారాయణుని వి
సర్జించి యన్యదేశములకు నేఁగి య
త్యల్పజనంబుల నాశ్రయింపఁ
దగునె కృష్ణఘనుండు తతకృపారసములు
గురియంగ నన్య భిక్షుకుల వేఁడఁ

తే. గీ. దెలివి లజ్జాభిమాన వృత్తినిఁ జరింప
నున్న నాకు నమస్కృతు లొక్కటైనఁ
జేయఁగా నర్థమని యాత్మఁ జింతనొంది
సుచరితాహ్వయ విప్రుఁడచ్చోట నిలిచి. 115

వ. నారాయణ భజనంబు సేయుచుం దనయుండగు నారాయణునకు వేద శాస్త్రోపదేశంబులు గావించి లక్ష్మీప్రసాద లబ్ధ సంపత్సమృద్ధిచే సదా చార సమన్వితుండై ప్రియయుం దానును గల్యాణ తీర్థంబునఁ దపంబు సేసి యచ్యుతుని మెప్పించి సహస్ర గుణితంబులుగా బ్రాహ్మణులకు

---

40. వెట్టిన సుతుండు దెచ్చిన సుశీల.

41. నేర్పెటిఁగించెన్.

భోజనంబులు గావింపుచు నున్న యా బ్రాహ్మణుని ధనవంతుడని చోరులు ప్రచ్ఛన్న వేషధారులై ముగురు లలాటంబున, నితరాంగంబుల ద్వాదశోర్ధ్వ పుండ్రంబులు గావించుకొని నారాయణ నారాయణ యనుచు, విష్ణుభక్తులంగనినఁ బ్రణమిల్లుచువచ్చువారింజూచి సుచరితుండు భుజింపఁబెట్టిన విష్ణు నివేదితాన్నంబులు భుజించి నారాయణ పదాంభోజ తీర్థపానంబొనర్చి కృతార్థులునైన వారలందఱకు మనంబున [42]సర్వోత్త రంబైన సాత్వికత్వముదయింప సాత్వికులై యేము చోరులము. భవ ద్ద్రవ్యాపహరణంబునకు వచ్చినవారము. వేషమాత్రంబుచూచి యుపచ రించితివనిన నగి, యస్మత్కాల ధనంబు నారాయణాహ్వయంబు. ఆ ద్రవ్యంబెవ్వరు హరింప సమర్థులు ? అనిన విని సంతోషాశ్రు తరంగం బులతోఁ బులకించి వందనం బాచరించి పరమపదప్రాప్త్యుపాయం బుప దేశింపు [43]మనిన నాతఁడట్ల కావింప వారు నైష్ఠికులై దేహావసానంబునఁ బరమ ధామంబు నొందిరి అంత. 116

తే. గీ. సుచరితాత్మయుఁ డంత నస్తోకమహిమ
పుత్ర పౌత్ర సతీమిత్ర పూర్ణభోగ
మంది నారాయణాంఘ్రి పరాయణాత్ముఁ
డగుచు వైకుంఠమందిర మందెఁ దుదకు. 117

క. ఈ సుచరితు సుచరిత్రం
బాసక్తిఁ విని పఠించి హర్షించిన ల
క్ష్మీ సఖతుల్య కుమారుల
చే సంతతి నిల్చి యుల్లసిల్లుదురుతుదిఁ. 118

క. ధనధాన్య సంపదల్ గలు
గు నపారముగా సుచరిత గుణసంతతికీ
ర్తన వారికి మఱి సద్గృహ
మున కేఁగిన నరుల కగును మురజిత్పదముఁ. 119

వ. అనిన నమ్మునీంద్రులు సంతోషోత్ఫుల్ల చేతస్కులై ముని శార్దూలుం డగు నారదుంజూచి కర్ణంబులకు నమృత ప్రవాహంబుగాఁ బల్కితి వింక నొక రహస్యంబు తెలుపుము. వాసుదేవ కథా ప్రసంగంబు సేయ నీకంటె నెవ్వఁడు నేర్చుననిన యుక్తకాల ప్రశ్నకరులగు మీచేత లోచన పారణయగు రూపంబున నా తలంపునఁ బొడమెనని యా నారదుం డిట్లనియె. 120

42. సర్వోత్తరంబైన సాత్వికులై
43. మనసట్ల కావింపవారు పరమధామంబునొంది రంత.

## శ్రీరామచంద్రుఁడు సీతాలక్ష్మణ సమేతుఁడై యాదవాద్రి స్వామిని పూజించుట

సీ. హరిభక్తి నియతాత్ములైన మీ రవధాన
మున వినవలయుఁ బ్రమోదమంది
యొక పుణ్య కథ మహాయోగులు మీరెఱుం
గని యదిలేదైనఁ గరుణగలిగి
యడిగితి రిట యాదవాచల సీమఁ బ్ర
శక్తి నారాయణార్చన మొనర్చి
కాకుత్థ్సవంశ శిఖామణియైన శ్రీ
రామచంద్రుఁడు జగద్రక్షకుండు

తే. గీ. వనమునకువచ్చి యొకనాఁడు వసుమతీకు
మారియును లక్ష్మణుఁడు గొల్వ మహిమమెఱసి
యమ్మహాగిరి తటమున నధివసించె
నవ్యయానంద మాత్మలో నంకురింప. 121

వ. అంత. 122

తే. గీ లక్ష్మణుండన్నఁ జూచి యుల్లమున విస్మ
యంబు దలకొన స్వేతన్నగాగ్రసీమ
మానసోపమ కాసారమౌళి యొకటి
భాసురంబయ్యెఁ జూడుమప్రాకృతంబు. 123

ఉ. [44]తత్తటియందు రత్నకలితంబగు దివ్యవిమానవీథి భా
స్వత్తులమై సమాభ్యధిక వర్జిత సుందర విగ్రహంబుతో
నుత్తమ లీలచేతఁ బురుషోత్తముఁ డొప్పుచు నున్నవాఁడు లో
కోత్తర లక్ష్మి నీవువలె నుల్లమునంగనుపట్టె నాకటఁ. 124

తే. గీ. ఆ శుభాకార కాంతి వీక్షాభిలాష
మాత్మ జనియించెనేని రమ్మనిన రామ
చంద్రుఁడపుడేఁగె జానకీ సహితుఁడగుచు
దివ్యతరమైన కల్యాణ తీర్థమునకు. 125

---

44. అత్తటియందు-వ్రాఁత ప్రతియందలి యీ పాఠమున యతిభంగము.

సీ. పూర్ణిమాచంద్ర విస్ఫురిత ముఖాంబుజు
విలసిత రత్నకుండల కలాపు
హార కిరీట కేయూర ముఖ్య విభూష
నంచిత విమలాంజనాభ దేహు
సర్వలోకాధిక సౌభాగ్య సంపన్ను
భువనార్త భూషణ భూషితంబు
నద్భుతాకార దివ్యాయుధ పరివృతుఁ
దప్తకాంచన పరిధాన శాలి

తే. గీ. నాదినారాయణునిఁగాంచి యభినుతించి
వందనముఁజేసి రఘువంశ వల్లభుండు
భూమినందన యాకర్ణ పూర్ణ నిర్ని
మేషదృష్టి నిరీక్షించి నెమ్మి మ్రొక్కె. 126

తే. గీ. లక్ష్మణానీతకమల కల్హార కుముద
కుసుమములుదెచ్చి పూజించి కొన్ని నెలలు
రఘుకులాధీశ్వరుండు నిరంతరంబు
సన్నిధానముల వసియింపఁ జక్రియనియె. 127

తే. గీ. రాక్షసానీక బాహు దర్పంబడంచి
నీ వయోధ్యకు నేతేర నిఖిలయోగి
జనులు గొల్వఁగ నిజనివాసంబునందు
నుందు నీచేతఁదగఁ బూజలందికొనుచు. 128

వ. అని యనిచెనంతఁ జతుర్దశ వత్సరంబులు వనంబుననుండి రామభద్రుండు నిజ నివాసంబునకువచ్చి తనుంబాసి చనలేక విభీషణుండు పరితపింప రంగశాయినిచ్చి యీ రంగశాయిని నన్నుంగా భావించి పూజింపుమని యనిచె. విభీషణుండేఁగిన రంగశాయి విరహ విషాదంబున రాఘవుండు వైమనస్యంబునొందఁ జతుర్ముఖుండు దివ్య విమానంబెక్కి చనుదెంచి రామచంద్రునిఁజూచి పూర్వంబున నీవు నారాయణాచలంబునఁ బూజించిన యచ్యుత దివ్యమంగళ విగ్రహంబున్నయది. తద్విగ్రహంబుఁ బూజింపుమని చెప్పి ధాత నిజలోకంబున కరిగె. ఆ రఘుపతి నగు

మోముతో సౌమిత్రిం బిలిచి నారాయణాచలంబుననున్న హరిమూర్తిం దెప్పింపుమనిన సౌమిత్రి యాంజనేయునిం బిలిచి తద్గిరి ప్రభావంబుఁ దెలిపి నియోగించిన నాతఁ డచ్చటికేఁగి సేవించి వచ్చి రాఘవస్వామి చరణంబుల కెరఁగి యిట్లనియె. 129

## శ్రీరామాజ్ఞచే హనుమంతుఁడు యదుగిరి శ్రీహరిని పూజించుచుండుట

క. ఈ రూపము నా రూపము
నేరు పఱుపరాదు, మొగము నీక్షణములు, నా
సారామృత శుభరేఖా
పారంపరి పొడవు దొడపు బాహుల నిడుపుఁ. 130

వ. అనిన రామభద్రుం డిట్లనియె. 131

తే. గీ. అనఘ నను గొల్చినట్ల యయ్యాదు నగేశుఁ
గొలువు నిరతంబు నత్యనుకూల భక్తి
నని నియోగింప నప్పు డా యనిలసూతి
యొనర నిప్పుడుఁ గొల్చుచు నున్నవాఁడు. 132

## కనకమాలినీ యదుశేఖరుల కథ

వ. తద్విగ్రహంబుం దెప్పించికొని రామభద్రుం డనేక సహస్రోపచారంబులు గావించి సేవించి పరమ ధామంబున కేఁగుచు హనుమంతుని చేతికి నిచ్చె, నతండు కుశునకు నర్పించె, నా కుశుండు నజకుల ధనంబునుం బూజించె. అంత నా కుశునకుఁ గంతస్థ కనకమాలికలతో నొక కన్య జనియింప బాంధవులు కనకమాలిని యని పిలిచిరి. అంత. 133

తే. గీ. సుదతి సుకచ సునేత్రాంత సురద సుకర
సుముఖి సుభ్రూయుగ సుగంధి సురుచిరాన
సుకుచ సువలగ్న సుశ్రోణి సుదరహాస
ఘన సువర్ణాభ కనకమాలిని చెలంగె. 134

తే. గీ. హంసగామినిఁ, బద్మవిహాసి చరణఁ,
బక్వబింబాధర, లతాంగి, భర్మకాంచి
మధుర మధురోక్తి నిపుణ రమాధవాంఘ్రి
సేవ నాసక్తచిత్తనా చెలువఁ గాంచి. 135

వ. కుశుండు సంతసిల్ల నక్కన్య ధన్యయై నారాయణ సేవఁగావించె. కుశలవు రిరువురును కుశీలవులతోఁగూడి తత్స్వామి సన్నిధిని రామాయణగానంబొనర్చుచుండిరి. అంత. 136

## సీతారాములు కుశునకు స్వప్నంబున దర్శన మిచ్చుట

మ. అలసాపాంగ విలోచనంబులు సముద్యన్నవ్యవక్షోజకు
ట్మలముల్ పూర్ణ నవీన సత్కళలు, సమ్యఙ్మంజు శోణాధరాం
చలముఁ జాలవిలాస సంపదయు మించంగంతు సమ్మోహనా
స్త్రలసద్దేవతవోలె నత్తరుణి సౌందర్యంబుతో మీఱఁగన్. 137

వ. ఆ యింతికిం దగినభర్తను విమర్శించి కానక, కుశుండు నిద్రించునంత భరత లక్ష్మణ శత్రుఘ్న సమేతుండై రామభద్రుండును, జననియైన జానకియుం గాన్పించిరి. కుశుండు కౌతూహలంబున బ్రణామంబు లాచరించిన యంతఁ దారాధిప వరాననుండై రామభద్రుండు తమోప హారులైన వచనంబులచే నాదరింపుచు యదుశేఖరుం డనువానికి నీ కన్య నొసంగుమనియె. జనకసుతయుఁ దండ్రి యొసంగిన ద్రవ్యం బక్కన్యకకుఁ బరమప్రీతి కారణంబుగా సకల వస్తువులు నక్కన్యకకు యౌతకంబుగా నిచ్చి యవ్వరున కర్పింపుమని యానతియిచ్చె. ఇట్లాజ్ఞా పించి వా రదృశ్యులైచనిరి. కుశుండు మేల్కాంచి నిజకాంతతో నీ స్వప్నంబు [45]వివరించి హర్షంబు నొందె నంత. 138

క. అరిగితి నే నాయదుశే
ఖర పాలితపురమునకు నఖండితతేజ
స్ఫురణంబున నారాయణ
గిరివర వరలబ్ధి నతఁడు క్షితి పాలించున్. 139

తే. గీ. పూర్ణశీలుండు యాదవ భూషణుండు
నాఁగ నాతని తండ్రి భూనాథమౌళి
తద్గుణానుగుణవిలాస ధన్యఁ గన్య
నోర్తు వెదకుచునుండె నత్యుత్సవమున. 140

తే. గీ. సర్వ సౌభాగ్య భాగ్య లక్షణములందుఁ
గుశ తనూజాత మెఱయుట కుశల బుద్ధి
నే నెఱింగింపఁ దద్రాజధాని కేఁగి
పరిణయముఁ జేసికొని యదు ప్రవరుఁ డేఁగ. 141

45. విన్నవించి.

సీ. నూఱు రథములు మున్నూఱు దాసులు భద్ర
గజ సహస్రము తురంగ మవరాయు
తము నవమణి నియుతంబు జాంబూనద
నిష్కకోటి సస్యనిచయశాలి
శాలి సుక్షేత్ర యోజన శతంబును ధేను
గణములు దివ్యాంశుకము లసంఖ్య
ములు భూషణ స్తోమములు పల్లకులమేయ
ము లపుడు యౌతకముగ నొసంగి

తే.గీ. కనకమాలినిఁజూచి యో కన్య నీ మ
నంబులో నున్నయది సమ్మదంబుతోడ
వేఁడు మిచ్చెద ననిన నవ్విమల గాత్రి
యతని సత్యంబుఁ బలికించి యప్పుడనియె. 142

## పుత్రికయైన హేమమాలినికి కుశుఁడు శ్రీరాముఁడు నారాధించిన శ్రీహరి అర్చామూర్తి నొసఁగుట

తే.గీ. వెలయు హరిదివ్య మంగళ విగ్రహంబు
రామచంద్రార్పితంబు తద్ద్రవ్య మొకటి
యది సమర్పించితేని నాయాత్మఁగల్గు
కామితములు ఫలించు నిక్కముగఁదండ్రి. 143

క. అన జనక తనయ వాక్యము
మనమునఁ జింతించి కుశుఁడు మధుసూదన మూ
ర్తినిఁ దతకీర్తి నతుల శో
భన విస్ఫూర్తిని నిజాత్మభవ కర్పించెన్. 144

వ. ఇట్లు కుశుం డియ్యవలసినవి యెల్ల నిచ్చినం బుచ్చుకొని యదుభూష
ణుండు యదుశేఖర కనకమాలినీ కన్యాసమేతుండై పురంబు వెడలి
చనునెడ వెదకి వెదకి మున్ను రాజు లడుగ వచ్చిన కుశుం డంగీక
రింపక పితృవచన ప్రామాణ్యంబునఁ దద్యదుభూషణ పుత్రుండగు
యదుశేఖరున కర్పించినఁ దద్రాజులు రోషంబునఁ దత్కన్యాపహర
ణంబు గావింపఁ దలంచి మార్గంబున. 145

శా. గర్వగ్రంథులు కొందఱుద్ధత మహీకాంతాగ్రణుల్ సాంపరా
యోర్విన్ దద్యదుభూషణాద్భుత భుజాగ్రోద్భూత తేజోనలా
ర్చిర్వీథిన్ శలభత్వమందిరి జయశ్రీ నాంజనేయస్ఫుర
ద్దోర్వీర్యాహతిఁగొందఱే[46]గిరి సురేంద్రుండేలు నవ్వీటికిన్. 146

వ. అప్పుడు నాకు నేత్రోత్సవంబయ్యె, నేమి చెప్పుదునయ్యాహవంబు : 147

క. హరి కరుణ గలుగు నెయ్యెడ
పరిభవ మయ్యెడను లేదు పరిపూర్తి హృదం
తరమున నుండిన వారికి
నరయఁగనెచ్చోఁ బరాజయంబులు గలవే ? 148

## వసుదేవుఁడు శ్రీహరి అర్చామూర్తిని బూజించుట

వ. యాదవ భూషణుండు దంపతుల ముందట హరిదివ్య విగ్రహంబుఁ బల్లకిపై నిడుకొని నడిపించె. అందఱు మధురాకృతియైన మధురకు నడచిరి. అట్టియెడఁ బౌరకాంతలుఁ దద్వృత్తాంతంబు విని యంతరంగంబుప్పొంగ నెదురుకొనిరి. కంకణధ్వని ఝుంకార మణిపూర శింజితంబుల చేతఁ దత్సంతోష సల్లాపంబులు గప్పంబడియె. కోణాభిహత సంక్షుభిత భేరీకుహర సంభ్రమ ఘోషంబులు వేణువీణాస్వన కర్బుర మర్దళ డిండిమ ధ్వానంబులును, కాహళ ధ్వానంబులు నన్నియెడల విజృంభింప వైతాళిక కులోద్భవులుభయవంశ ప్రశంసలు గావింప దంపతులతోఁగూడ నా జగత్పతిని నిజపుర ప్రవేశంబు సేయించె. అంత యదుశేఖరుండు కనకమాలినితోడ నర్థితాధికదాయియైన విష్ణుదేవు నర్చించి తత్ప్రసాదంబున [47]సకలైశ్వర్యంబులుంగాంచె. ఆ యదువంశంబున నిట్లు నెలకొనిన భగవంతుని యర్చామూర్తిని వసుదేవుఁ డర్చించుచుండె. నిజోదరంబున విశ్వంబుగల యాదేవుండు దేవకి జఠరంబున నుండుటయు, అన్య బంధచ్ఛేదకుండయ్యు నులూఖల బద్ధుండగుటయు, ఘంటాకర్ణమోక్ష ప్రదాయియయ్యుఁ, దానుపుత్రార్థియై తపశ్చరణంబు గావించుటయు, ముచికుంద బంధమోచకుండయ్యుఁ గాలయవనుని వలనఁ బలాయనము గావించుటయు, బ్రహ్మచర్యా పరిపాలకుండయ్యు గోపీ పరిష్వంగం బొనర్చుటయు, అన్యపుత్ర రక్షణంబును స్వపుత్ర పాలనంబును విశ్వరూపంబు చూపుటయుఁ

46. గొందఱుండిరి సురేంద్రుండున్న యవ్వీడునన్.
47. సకలైశ్వర్యములు గావించె.

బాండవ స్యందనంబునఁ జూపట్టుటయు, ననిరుద్ధ కిరీట ధారణంబును, బింఛావతంస ధరణంబును, [48]ధర్మ ప్రతిష్ఠాపన స్వీకృత మానవ రూపంబును, నవనీత చౌర్యంబును, నిత్యావ్యాహతైశ్వర్యంబును, ఉగ్ర సేన నియామ్యత్వంబును, బ్రహ్మరుద్రాధిపత్యంబును, గుర్వాది నమ స్క్రియయు మొదలైన చిత్ర విచిత్రంబులు మెఱయించుచు వర్తించె ననిన మునులు సర్వంబును నెఱుంగుదుము. కాని యా కృష్ణునకు నని రుద్ధ కిరీట ధారణంబెట్లు సంభవించెనది యెఱుంగము. దానిందెలియఁ జెప్పవే యని మును లడిగిన వారికి నారదుండిట్లనియె. 149

## శ్రీకృష్ణుని మణికిరీట ధారణ గాథ

సీ. అసురేశ్వరుండు ప్రహ్లాద పుత్రుండు వి
రోచనుండను వాఁడు రూఢయశుఁడు
కలశాబ్ధి మధ్య భాగమునందు ననిరుద్ధ
సేవ సేయుచు నతి స్థిరత నిలిచి
యొకరుండు నా హరియోగనిద్రాసక్తి
నుండఁదక్కిన మునులొయ్య నొయ్యఁ
జనఁగఁ బ్రహ్లాదాత్మజా తత్త్వ మహిమ ప్ర
భూత శక్తివహించి స్ఫుటతరాగ

తే. గీ. రంగభావంబు నొంది నిరంతరంబు
చేరి కొలుచుచుఁ దద్విష్ణు శీర్షదివ్య
మణికిరీటంబుగొని నాగ మందిరాంత
రాళ మొగిఁజొచ్చెవాఁడు దుశ్శీలుఁడగుచు. 150

వ. అంత భగవంతుఁడు రమతో మేల్కాంచిన సేవక జనంబులుచేరి హరి కిరీటంబుఁ గానక యాహరి నడిగిన నే నిద్రింపనెవ్వఁడు హరించెనో యేమియునెఱుంగననినఁ దద్వాక్యంబులు విని వారలు విరోచనుండే హరించి చనియె. ఏమందఱము నిచ్చటనే యున్నవారము, అతఁడసుర వంశోద్భవుండు, ఎల్లప్పుడు పాపంబే తలంచు, ఇప్పుడు మ్రుచ్చిలిన వాఁడై యుండియే పలాయనంబు నొందెనని నిశ్చయించి వైనతేయునిఁ బిలిచి మాలోఁబలవేగ సంపన్నుండవు నీవే విరోచనుని సాధింపుమని ప్రార్థించిన. 151

48. స్వప్రతిష్ఠారూపత్వంబును.

## వైనతేయుఁడు విరోచనుని చంపి మణికిరీటముఁ దెచ్చుట

సీ. పక్షాగ్ర విక్షేప బహుళ వాతాహతిఁ
గుల నగంబులు గలగుండువడఁగ
ఉద్ధిత వేగమహోద్ధతి శాఖ జం
బూ ప్లక్ష ముఖ్యముల్ పొడవడంగ
దుర్ధర స్ఫుటనట త్రోటి కోటీఘాటి
మేఘముల్ తునియలై మింట [49]నెఱయ
శఫ వినిర్ఘాత సంస్ఫాలనోదగ్రతఁ
దవన మండలము నెంతయును [50]సళుగఁ

తే. గీ. గూజితంబున రాకాసిగుండె లవియ
నక్షిరోషాగ్ని విస్ఫూర్తి నగ్రభ నిమ్న
గోర్మిజాలంబు తెకతెక నుడికి పొంగ
విభ్రమింపంగఁ జొచ్చెఁ బూర్వాగ్రగంబు. 152

వ. అంతఁ బాతాళాంతర కోణంబుననున్న తేజోజిత విరోచను విరోచను గాంచి మహత్తర యుద్ధంబుఁ గావించి శంకులాకోటి తీక్ష్ణంబైన చంచూ పుటంబున వాని శిరంబు వ్రయ్యలుచేసి కిరీటంబుఁగొని మింటికెగసి వచ్చుచు ముందట శ్యామలాద్భుతంబై, యా బ్రహ్మలోకంబైయున్న యొక దివ్య తేజంబుఁగాంచి విస్మయంబంది యంత. 153

### మహా మణికిరీటము

### బాలమూర్తియగు శ్రీకృష్ణుని శిరమున సరిగా కుదిరి నిలుచుట

సీ. కర్ణాంతర స్థలత్కలిత నేత్రాంచలు
వ్యత్యస్త విన్యస్త వల్గుచరణు
విమలాన నాంభోజ వితత పింఛావతం
సవిరాజమానుఁ బ్రసన్నతేజు
అనుపమ గుంజోరుహారశోభితభూషు-
గమనీయ లాంగలి కర్ణపూరు
గోపీ విలోచనాంకూర సుధా శీతు
నంచిత పూర్ణ కృపాభిరాము

---

49. నెరయ

50. సరుగఁ

తే. గీ. అధర వినిహితవంశ నాళాంతరాళ
కలిత వివర భ్రమత్కరాగ్ర కరశాఖు
నఖిలలోకైక మోహ శరాంచితాంగుఁ
బరివృతానేక బాలు గోపాలబాలు. 154

వ. వేణునాదాకర్ణనపార వశ్యార్థ దష్టతృణధేను పరివృతుండై యున్నం
గాంచి. 155

మ. అనురాగంబున నా పతంగపతి దా సార్థ ద్విలక్షోరుయో
జన దఘ్నోళ్వరు తత్కిరీటము [51] ప్రశస్యంబంచు గోపాల బా
లుని మస్తాగ్రమునందు నిల్ప ధరణీ లోకుల్ నిరీక్షింపఁ గి
ల్కానియెన్మౌళియుఁ దత్ప్రమాణముననుద్యత్పింఛధామంబుతో. 156

వ. అప్పుడు గరుత్మంతుండు విస్మయంబునం బ్రణమిల్లి క్షీరాబ్ధికి నరిగి
ముని సన్నిధానంబుననున్న భగవంతునకు విన్నవించినఁ బరమ
హర్షంబునొందెనని నారదుండుచెప్పిన మునులు సంతసిల్లిరి. అంత. 157

## నారాయణగిరికి యాదవాద్రి యను నామంబు గలుగుట

సీ. ఒకనాఁడు బలభద్రుఁ డుల్లాసమునఁ దీర్థ
యాత్రావశంబున నరుగుదెంచి
యాదవాచల శిఖరాగ్రంబునందుఁగ
ల్యాణ తీర్థంబున నాదిమౌని
గణములతోఁబెక్కు కాలంబు లందుండి
భవరోగ భేషజ భవ్యచరణు
నారాయణు భజించి చేరి చక్షుర్మనో
వాక్పూర్తిగాఁగ భవ్యమునఁ బొగడి

తే. గీ. ద్వారవతి కేఁగుదెంచి యాదవశిఖా వ
తంసమగు కృష్ణు నీక్షించి దక్షిణాశఁ
గంటి యాదవ శైలంబు కలితభోగ
భాగ్య సౌభాగ్యశీలంబు పద్మనేత్ర ! 158

---

51. ప్రశస్త్యంబంచు

క. అందు ననురక్తిఁ గంటిన్
గందర్ప సహస్రతుల్యు కాయు నమేయున్
బృందారక మౌని సభా
మందారక మైన దివ్య మంగళమూర్తిన్. 159

వ. ఆ మూర్తి యస్మద్గృహ దేవతామూర్తియకాని యితర మూర్తిగాదని ప్రశంసించినఁ గృష్ణుండిట్లనియె. 160

క. ఈరీతి నేల పల్కెదు
సీరీ! యస్మత్కుల ధనసేవధియగు ల
క్ష్మీ రమణమూర్తితో సరి
గా రూపించితివి యదునగ ప్రభునిచటన్. 161

తే. గీ. అన్న! క్రొత్తమాటలాడితివనిన నీ
తోడు నిజము నిజము దూరతరమె
కదలి చనుట భాగ్యకరమని వారించి
యరిగిరపుడు విగ్రహంబు [52]తోడ. 162

వ. అరిగి తద్దివ్య మంగళ విగ్రహంబు నారాయణగిరి హరి సన్నిధానంబున నిలిపి మూర్తి వైషమ్యంబుఁగానక కలహంబులుడిగి రామకృష్ణులు తద్విగ్రహంబు లన్యోన్యంబునుం గలసియుండె. తదన్యోన్య సంగమంబున నీ శైలంబధికోచిత వైభవంబగు రూపంబుగాంచె నదిగాన యాదవాచలంబు నందఱు సేవింపుదురు. మున్ను నారాయణగిరియై యున్న యది నాఁడు మొదలుకొని యాదవాద్రియన విలసిల్లె. ఈ యాగమంబు వినినం, బఠియించినన్ గుణవంతుఁడై, ధనికుండై, ధర్మ చారియై పితౄద్యుత్తారకుండై, నారాయణపరాయణుండైన కొడుకును, గనకమాలిని సమానయైన కన్యకంగాంచి యంతంబున వైకుంఠపదంబునందు, పెక్కులు పలుకనేల? రామకృష్ణుల కటాక్షంబున సకల సంపదలును గలుగు. వారిని దైత్యు లెదిరింప వెఱతురు. సురలు మ్రొక్కుదురు. పూర్వాపర వంశంబులు పది తరింపం జేయుంగావున నీ యాదవాద్రి శిఖరికుల శిఖరంబున మహావైభవంబున మమ్ము నుత్సుకులఁజేయు విష్ణుదివ్య రూపంబులు రెండు నుండు ననవిని మునులు నారదున కిట్లనిరి. 163

52. గాను.

## యాదవాద్రినాథు సేవించు భక్తుల కపచారము కావించిన వారికిఁ గలుగు కీడు

సీ. పరమ దయాక్రాంత భగవంత నారద
హరి యీ నగంబున కరుగుదెంచె
ననుట యస్మల్లోచనాగ్ర సాక్షాత్కార
మైన తెఱంగయ్యె ననఘమూర్తి
ధన్యతయుఁ గృతార్థత్వంబు గలిగె నీ
వచనంబు కతన నవార్య మహిమ
నైనఁ బ్రశ్నాంతరం బడిగిన శోధించి
తెలుప నేర్పరివి సందేహ మణఁగ

తే.గీ. యాదవాచలవాసి జనాళివిష్ణు
కీర్తి ధర్మప్రశస్తిమై వార్తకెక్కు
నట్టివారికి నపరాధ మాచరించు
నది యకర్తవ్య మంటి మహాత్మ! నీవు. 164

క. అది యెయ్యదియో వినియెద
మవిరళ సద్భక్తివేగ నానతి యిమ్మా!
భవరోగ వైద్య సేవా
ప్రవణాత్మక! పద్మజాత్మభవ! మునిచంద్రా! 165

వ. అనిన మునులంజూచి నారదుండు మద్గురుండు నాకు నానతియిచ్చిన క్రమంబు వినుండెఱింగించెదనని యిట్లనియె. 166

## రాజ పురోహితుండైన చతుర్వేది కథ

సీ. మున్ను ప్రాజ్ఞుఁడు నతిమూర్ఖుఁడు రాజపు
రోహితుం డత్యంత రోషపరుఁడు
మనియెఁ జతుర్వేదియను పేరనొక్కఁడు
నన్నింట నేర్పరియైన జాణ
నారాయణైక నిష్ఠారతులగు వారి
యందు శక్తి సహింపఁ డనుదినంబు
అరసి నానా దేవతార్చకులను జాల
మన్నించి కొనుచు ధర్మంబు విడచి

ఆ.వె. నియత భోజనంబు నిందించి మించ స
ర్వాతిథియను వార్త నధిగమించి
భూధరాశ్రయ పరిపూర్ణ సంపదలచే
నతిశయంబునొందె నాతఁ డంత. 167

వ. అతనికి మేధావియను పుత్రుండు ప్రథమంబునంగలిగె. అట్లనె ఘనులై
శివనామముల ముగ్గురు తనయులు పితృగుణ ప్రవీణులు జనియించిరి.
ఆ బ్రాహ్మణుండు రాజభట ద్రవ్యంబుగొని దంభంబునం బ్రతివత్స
రంబును యాగంబు గావించుచుండె. నంత నొక్కనాఁడాతఁడు పైతృ
కం బాచరించుచుండ, హరిభక్తి పరాయణుండును, వర్ణాశ్రమాచార
నిష్ఠానియత మానసుండును, నారాయణాద్రి వాసుండగుటంజేసి త్రిదశ
నమస్కృతుండును, మానావమానతుల్య ప్రమోదహృదయుండును
నగు హరిరాతుండనువాఁడు తద్గ్రామంబుఁజొచ్చి వృద్ధుండు నధ్వ
శ్రాంతుండును గాన సుతునితోఁ గూడవచ్చి వేషమాత్రా వైదికుండగు
చతుర్వేదింగాంచి బ్రాహ్మణ పరివృతుండై యుండునప్పుడు 168

క. నారాయణదేవు పదాం
భోరుహ తులసీదళములు భూసురవరకం
ఠీరవుఁ డర్పింపఁగ ని
స్సారంబుగఁజూచి కేలుసాచక యున్నఁ. 169

వ. మఱియునొకసారి యా విప్రోత్తముండు తులసీదళంబులొసంగ దరియ
వచ్చిన. 170

ఆ.వె. అంటరాకు స్నానమాడిన వాఁడనో
ద్విజకులేంద్ర ! నీవు తెరువునడచి
యంటుద్రొక్కినాఁడ వర్హంబె నీ కేల
నున్న తులసి ముట్ట నుపవసించి. 171

తే.గీ. అనుప నీతుండు నాపుత్రుఁ డతని చేతి
కొసఁగు, కాకున్న నీచేత నుండనిమ్ము !
తులసి లోకంబు లోపల దుర్లభంబె ?
యిదియు నొకవస్తువే ద్రాతినెంచి చూడ. 172

క. మెచ్చాయె నిచటి కేటికి
వచ్చితి వేగంబె తెలుపు వసుధామర ! యే
నిచ్చట సన్మంత్ర కలా
పోచ్చారణశక్తి మెఱసియుండినవాఁడ౯. 173

వ. అని బ్రహ్మబంధుండు పల్కిన నా బ్రాహ్మణుండు. 174

సీ. అర్భకుండధిక దూరాధ్వ పరిశ్రాంతి
నలసిన వాఁడింతయన్న మొసఁగు
మనియె నా హరిరాతుఁడనఘ పైత్రుకమునేఁ
డర్పింపరాదని యాగ్రహించి
యనియెఁ జతుర్వేది, యన్నంబు మాన నీ
తండులంబు లొసంగు ధర్మబుద్ధి
నన్యగృహంబున నైనను వండించు
కొనియెదఁగాని యాకొనిన యతిథి

తే.గీ. గడపకుమటంచుఁ దద్ద్విజుఁడడుగ నడుగఁ
దగునె పైత్రుక దినమునఁ దండులంబు
లైన నర్పింపననుచు గర్వాంధబుద్ధి
నా చతుర్వేది తర్జించి యాడునంత. 175

వ. అధ్వపరిశ్రాంతి నలసి బ్రాహ్మణుండు మఱియు మఱియు వేఁడుకొన నర్వాతిథియైన చతుర్వేది మఱియు మఱియు లేదన ధర్మం బెఱుంగుదు విప్రేల పలికెదవు ? నీ గేహంబున నిడక యుండిన నీబంధుగృహంబున నేని భుజియింపంజేయుమని యా భూసురవర్యుండు ప్రార్థింపఁ జతుర్వేది కృద్ధుండై నిరసించిన యేని పిశాచంబువలెఁ బలుమాఱు నడిగి పీడించెదు. ఈ నగరంబున మఱి గృహంబులులేవె? పొమ్ము! పొమ్మిచ్చటఁ దొలంగుమని తర్జించినంతట నశక్తుండై పుత్రుఁడును దానును నంగణ భాగంబునం దోఁచక నిల్చిన నా చతుర్వేది తన తనయులచేత బాహ్యభాగంబునకుం గరార్ధ చంద్ర క్రమంబునం ద్రోయించి కవాటంబు బిగియించునెడఁ గవాటవేగ సంభ్రాంతుండై బాలుండు నేలంబడిన నష్టోభవయని యా బ్రాహ్మణోత్తముండు బాష్ప గద్గద వాక్యంబులం బలుకుచుఁ గుమారుని నెత్తికొని మేను నివురుచు బుజ్జగించుచుండె. అప్పుడు. 176

క. కలుగదు క్రోధము లోభముఁ
గలుగదు గర్వంబు మదముఁ గలుగదు హరిభ
క్తులకుఁ బ్రదీపము క్రిందట
నిలుచునె ఘోరాంధకార నిచయం బెల్లన్. 177

శా. క్రూరాభీల భుజంగనాకు కుహర క్రోడంబులో నున్న, దు
ర్వారజ్వాల సముల్లసచ్ఛిఖి శిఖాగ్ర శ్రేణిలో నున్నఁ, గాం
తార వ్యాఘ్రగుహాంతరాళబిల మధ్యశ్రేణిలో నున్న మేల్
[53] సేరన్ వచ్చుటకన్న భక్తజనతా శ్రీనింద కావాసమున్. 178

తే.గీ. దరణిఁ బిత్రార్థ కల్పిత ధనము వ్యయము
సేయరాదండ్రు బుధులు చర్చించిచూడ
న ప్రధానవ్రతం బిదియనుచునపుడె
దూరతరముగ ధర్మంబు తొలఁగిపోవు. 179

తే.గీ. బ్రాహ్మణోత్తముఁ డిట్లేఁగఁ బరమహర్ష
పూర్ణుఁడై పైతృక మొనర్చె భూసుపర్వుఁ
డర్థమును విద్య రాజమాన్యతయుఁగలుగ
యుక్తము నయుక్తము నెఱుంగ నొకనివశమె ? 180

## విష్ణురాతుఁడు కావించిన భాగవతారాధనము

చ. అలసి యశక్తుఁడై ద్విజకులాధము నేఁతకు రోసి వీటిలో
వెలయఁగ నూర్ధ్వపుండ్రముఁ, బవిత్ర భుజాయుగ శంఖచక్రము
ద్రలు, నలినాక్షమాలికయుఁ దాల్చిన తద్ధరణీ సురోత్తముం
గలుష విదూరుఁగాంచి కుతుకంబున భూసురుఁడొక్కరుండటన్. 181

తే.గీ. బ్రాహ్మణోత్తమ ! పేరేమి? బాలుఁడేమి
గావలయు? నేఁడు మనసులోఁ గలఁగినట్లు
గానువించితి నాకు నిక్కముగఁదెలుపు
మనిన సర్వము నెఱిఁగింప నాదరించి. 182

వ. ఆతఁడిట్లనియె. 183

మ. హరిభక్తాంఘ్రి సరోజ రేణుకణ పూతాత్ముండనై శిష్టమం
దిర ధాన్యౌఘము ముష్టిమాత్రముగ నాతిథ్యంబునన్ వేఁడి సు
స్థిర భక్తిన్ నిజ దారపుత్రహితులన్ దీపింపఁబోషింపుచున్
బరమానందముఁ బొందియుండుదును సౌభాగ్య ప్రభావంబునన్. 184

---

53. లేరితిన్ హరిభక్తనిందక గృహంబీక్షించు కన్నన్మహిన్.

వ. అనిమఱియు నాకుం బన్నిద్దఱు నందనులు హరిద్వాదశనామంబులవారు, వారి పేరు లోకంబునం బ్రసిద్ధంబగు. నేను నారాయణున కంటె నన్య దేవతను భజింప, మద్భార్యయు నీవ్రతంబె యాచరించునది- అని విష్ణురాతుండు తన నడక విన్నవింపఁ బుత్రాన్వితుండై హరిరాతుండు తద్గృహంబునకుంజనియె. 185

తే. గీ. విష్ణుభక్త గృహావాస విభవమహిమ
విష్ణుభక్తులకే తగి వెలయుచుండు
క్షీర శర్కరలునుబోలెఁ, గ్రూరసంగ
మంబు విషనింబదళమేళనంబుఁబోలు. 186

## శ్రీహరి సన్న్యాసివేషంబున అతిథియైవచ్చి యనుగ్రహించుట

వ. అంత విష్ణురాతుని భార్య సుముఖి యనునది పరమసాధ్వి కలశంబున నుదకంబుపట్టి పుత్రుండును, దానును మజ్జనంబాడి హరిరాతుండు మాధ్యాహ్నిక కృత్యంబులుదీర్చి నారాయణ ప్రీతిగా నైవేద్యంబు నివేదించునప్పుడు శిష్యచతుష్కంబుతోఁ జరమాశ్రమి యొక్కఁడు చనుదెంచె. ఆ గృహస్థుండు నయ్యతిథిని వాసుదేవునిం బలెంబూజించి మ్రొక్కి పాద పరిమార్జనంబుఁగావించి యహోభాగ్య మహోభాగ్యమని తత్పాద తీర్థంబు శిరంబునంజల్లుకొనిన సన్న్యాసియు, నతని శిష్యులు నలువురును, అతిథియు నతని పుత్రుండు నేకవంక్తిని భుజియించు చున్న తఱి నా విష్ణురాతుని బాలుండొకండాఁకొని తండ్రికడకు వచ్చి రోదనంబు సేయందొడంగె. 187

మ. సుముఖింగన్గొనియన్న మీఘటములో శోధింపవేయంచుఁ ద
ద్రమణుండాడిన, సాధ్వివేదు కబళార్థంబైన నంచుఁ యథా
ర్థముగాఁబల్కె, మనోహరుండు మఱియుఁ దర్జించి శోధింపు మ
న్న ముదంబొప్పఁగఁ జూడనన్న పరిపూర్ణంబై ఘటంబుండినఁ. 188

ఆ.వె. బ్రాహ్మణోత్తముండు పన్నిద్దఱును సుతుల్
తాను సతియు మనసు తనివిదీఱ
నారగించిరప్పు డత్యంత సంతోష
పూర్ణహృదయులై యపూర్వ మహిమ. 189

వ. ఇట్లు ప్రతిదినంబును జతుర్విధాహారంబులు మెండుకొనియుండఁ బ్రయత్నంబున నాగతులగు వైష్ణవుల భుజియింపం జేయుచుండె. ఆ యతిథిపూజలో సుముఖియే పాత్రంబులువాడె నాపాత్రంబు సౌవర్ణంబులును, రాజతంబులునై వెలసె. సన్న్యాసి భుజించినయెడ నిరవధియైన నిధిగానవచ్చె. సన్న్యాసి వేషంబున నారాయణుండు వేదంబులు శిష్యరూపంబులై వెంటంజనుదేర నేతెంచెనఁట. పాషండివారణోద్యోగంబునఁ ద్రిదండిధరరూపంబు గాంచి మున్ను విజృంభించు దత్తాత్రేయుండని మీరెఱుంగుదురు. నారాయణపరాయణుండెవ్వని గృహంబున భుజించు నాతనిగృహంబున సాక్షాత్కారమున నారాయణుండు భుజించు. 190

## భాగవతాపచారముచే చతుర్వేది మహాపదలపాలగుట

సీ. ఆ చతుర్వేది పిత్రాద్యర్చనము సేయు
నపుడు పయః పాత్రమందు విషముఁ
గ్రక్కెనొక్క మహోగ్రకాలాహి, భోజనా
నంతరంబున మృతులైరి భోక్త
లావిప్రుఁడును భార్య యాత్మజులునుదాను
పాన భోజంబున బ్రతికిరంతఁ
దద్విజాత్మజులు పౌత్రకులంగణములందుఁ
జాటిరి పైతృకాచరణ విషము

తే. గీ. చేత గరళంబువెట్టి భజించె దుష్ట
శీలుఁడై ద్విజుఁ డంచునాక్షితి సురేంద్రుఁ
బట్టి దట్టించి రారాజభటులు కశల
మర్మములు దూలియాల్గె నాదుర్మదుండు 191

క. మేధావి వనము చొచ్చితి
రోధానమునొంద ఘోర రూపంబగు వ్యా
ఘ్రాధిపతి మ్రింగెఁ గొందఱు
భూధరమునకెక్కఁబోయి భువిఁబడునంతన్. 192

వ. తల్లియు జిహ్వాచ్ఛేదంబొనర్చుకొని పరాసుత్వంబునొందె. 193

తే. గీ. అతని కన్యక లిరువు రత్యంతభీతి
రాజదండ భయమున ద్వారంబునందు
ననల శిఖలుంచి మడిసి రట్లాపురంబు
నణఁగెఁదద్విష్ణురాతు గేహంబుదక్క. 194

వ. తత్సంబంధోపజీవులగు వారిరాజభటులు కారాగృహంబున నిలిపిన నందె వారు మృతులైరి. ఇవి యన్నియు దినత్రయంబుననయ్యె. హరిభక్తుల నవమానంబుచేసినను, గురువుల బహూకరింపకయున్నను, దుష్టుల బహూకరించినను, తనుదాబహూకరించుకొనినను సంపదలు నశించు. ఇది యైహిక దుఃఖంబు, ఇఁక నాముష్మిక దుఃఖంబులు వినుండు. 195

## మృతుఁడైన చతుర్వేది నరకప్రాప్తుఁడగుట

ఉ. క్రూరులు కాలకింకరులు ఘోరతరాజిన రజ్జుబంధ ని
స్తారితపాదుఁగా నిలిపి స్తంభముతోడ నధోముఖంబుగా
దారుణశక్తిఁగట్టి బెడిదంబుగఁ బుత్రులతోడఁగొట్టిరా
హారవవృత్తిఁదద్ద్విజ నిజాన్వయ బాంధవులుౘ జలింపఁగౘ. 196

క. సర్వాతిథి దానంతట
సర్వజనంబులు వినంగ సమవర్తి వినా
దుర్వర్తన తెలుపవె బుధ
నిర్వాహక మొఱ్ఱ వినవె! నియతగుణాఢ్యా!

క. అన్యాయం బన్యాయం
బన్యాయం బరయవే! మహాత్మా! త్రిజగ
ద్ధన్యుఁడవు సకల సురమూ
ర్ధన్యుండవు నన్నుఁగావు తండ్రీ! కరుణౘ. 197

వ. అను నా చతుర్వేదిని విడిపించి సమవర్తి యెట్లన్యాయం బయ్యెనని యడిగిన నతండు ప్రాంజలియై యిట్లనియె. 198

సీ. ఆమ్నాయములు నాల్గు నర్థయుక్తములుగాఁ
    జదివితి మీమాంస సారమెల్లఁ
నెఱిఁగి వైదికకర్మమిట్లు నెన్నికగాఁగ
    నాచరించితి జగంబౌననంగ
ఆత్మజుల్ నాకన్న నధికులు గృహిణియు
    నిత్య ధర్మాన్విత నేఁడు నాకు
బాధలేటికిఁబూర్ణ పరమదయానిధి
    [54]సమవర్తి వివరింపు శాస్త్రదృష్టి

54. వ్రాఁతప్రతిలో ఈ పాదభాగము కుండలీకరింపబడియున్నది. మూలకారుని వాక్యము శిథిలముకాఁగా ప్రతివ్రాసినవారు పూర్తిచేసినట్లు తోఁచును.

తే. గీ. శమన ! నీ యాజ్ఞ లోని వారము కటాక్ష
వీక్షమముఁగాపు మేమని విన్నవింతు
మనిన నా ధర్మరాజు న్యాయంబుఁబూని
యతని దుర్వృత్తి కలుగుచు నప్పుడనియె. 199

వ. ఓరీ! దురాత్మా! నారాయణాచలంబునుండి వచ్చిన విప్రుని నారాయణ పరాయణుండైన వానిం దిరస్కరించితివది యెఱుంగుదువో! యెఱుంగవో? పద్మారమణ పాదాబ్జవాసిత తులసీదళంబు లతండర్పించిన నది గైకొనవైతి వది యెఱుంగుదువో! యెఱుంగవో? ఓరి పాపాత్మా! బాలకుండధ్వపరిశ్రాంతుండై యుండ నద్విజోత్తముం డబ్బాలునకై యన్నంబు వేఁడిన నవమానంబు చేసితి వది యెఱుంగుదువో? యెఱుంగవో? కవాట వేగహతుండైపడి బాష్పవ్యాకులేక్షణుండైన హరిరాత బాలకుం గరుణింపవైతి వది యెఱుంగుదువో? యెఱుంగవో? రాజ కృపగలిగి గర్వించి శంఖచక్రాది ధారణంబు నిందించితి వది యెఱుంగుదువో? యెఱుంగవో? ముక్తిమార్గోప దేష్టలగు మునుల వచనంబుల ప్రమాణంబులంటివి మూఢ! యవి యెఱుంగుదువో యెఱుంగవో ? వేదంబులు నారాయణుండె పరదేవత యనవైవర్ణ్యంబొందితి వది యెఱుంగుదువో? యెఱుంగవో? నిత్యంబును రాజగోష్ఠియందు నాస్తిక ప్రశంసయు, సాధు దూషణంబును నొనర్చితి వది యెఱుంగుదువో? యెఱుంగవో? ఇన్నియు నేటికి? రాజసభను శరణాగత రక్షాధర్మంబు దూషించితి వది యెఱుంగుదువో ? యెఱుంగవో? యని పలికిన బ్రాహ్మణుండంగీకరించి కంపంబునొంది యీమహాపాపంబెట్లు తరింతునోయని మఱియు మఱియుఁ బాదంబులంబడిన శమనుండాతని కిట్లనియె. 200

క. ఈయఘములకే నెఱుఁగుదుఁ
బ్రాయశ్చిత్తంబు విష్ణుభక్తులయెడ న
శ్రేయముగఁజేయునవమతి
పాయక నిష్కృతియులేదు పాపంబునకుఁ. 201

ఆ.వె. అనిన మఱియు మఱియు నడుగులపైఁబడి
కంపమొందు విప్రుఁగాంచి నీదు
మరణవేళ నేడు మాఱులు గోవింద
యనియె విష్ణురాతుఁడతుల కరుణ. 202

## చతుర్వేది బ్రహ్మరాక్షసరూపంబు నొందుట

క. అందున ఘనయాతన లిటఁ
బొందవు దుష్కర్మవృత్తిఁ [55]బూనెదవడవిం
జెంది జనరహిత దేశము
నందుండెదు బ్రహ్మరాక్షసాకారమునన్. 203

తే. గీ. బ్రహ్మరాక్షసియగు నీదుభార్య, నీదు
పుత్రకులు గృధ్రమూర్తులై పొదలవెంట
[56]భవదభిహతినిహతజంతు భక్షణేచ్ఛఁ
దిరుగుచుంద్రువనాంతర దేశములను. 204

వ. అని శమనుండానతిచ్చిన బ్రహ్మరాక్షసవృత్తికింగడ యెయ్యదియని దీనుండై చతుర్వేది యడిగిన నెప్పుడు విష్ణుభక్తులం గాంచెద వప్పుడే తద్దేహంబు వీడ్కొనియెదవని బంధనంబు విడిపించినఁ గుటుంబ సమేతుండై పోయి యాభ్రష్ట బ్రాహ్మణుండు వింధ్యారణ్యంబున నివసించుచుండె. మధురిపుపదసేవా పరిపక్వ స్వాంతవృత్తియై యదుగిరి తటంబునున్న భాగవతునెవ్వనినేని యవమానించినఁ జతుర్వేదివలెనే నష్టుండగు ధరాతలంబున. 205

మ. హరిరాతోత్తమపుణ్య సత్కథలు నిత్యానంద సంపత్తి నె
వ్వరు విన్నన్ బఠియించినన్ హరికృపా వారాశియై వారి మం
దిరసీమన్ భుజియించుఁ, దద్విమతులెంతే నష్టులై పొల్తురు
ర్వరనెంచన్ ధనధాన్యసంపదయు నైశ్వర్యంబు మించన్దగున్. 206

వ. అనినఁ దద్బ్రహ్మరాక్షసత్వముక్తి వానికెట్లయ్యెనని మునులడిగిన నారదుఁడిట్లు తెలిపె. 207

సీ. ఫలమూలవర్జిత బహుకంట కాకీర్ణ
తత తప్తవాలుకాఢ్వ ప్రదేశ
ఘనత రారణ్య భాగంబున నాఁకొని
తనువు దూలఁగ దూరదర్శనమున
నగ్నిశిఖారుణోద్యత్కీర్ణ కేశమ
స్తకముతో వాయసతను వికార
కళలఁగృశించి దగ్ధమతినచలవర
మునుబోలి తూలైక మూర్తిధారి

55. బూనెద రణ్యానిందొక యరహిత దేశము.
56. భవదఖండాభిహత జంతుభక్షణేచ్ఛ.

తే. గీ. యతుల దుర్వార ఘోరాహియైన జిహ్వ
గలిగి పాతాళకల్ప ముఖంబుతోడఁ
[57]గోఁజ లిరువంక భయములు గులుక సెలవు
లందు మాంసంబు మెసవుచు నంతనంత. 208

వ. నిమ్న దృష్టియు, శూర్పకర్ణుండును, వక్రబాహుండును దీర్ఘశ్రేష్ఠ ఖుండును, గుక్కుటోరస్థ్సలుండును, బలలాశాతురశ్యేన శివాది సంసేవితుండును, దాళ ప్రమాణ పాదద్వయుండును, శూలఖడ్గ ధరుండును, ప్రేతచీవరావరణుండును, గర్ణావలంబికపాలుండును, గపాలమాలికాలంకారుండును, [58]భస్మోద్ధూళిత సర్వాంగుండును బాప కర్మదృష్టి గోచరుండును, నాంత్ర మాలోపవీతుండును దమనకోటి బంధుండును భైరవ స్వరుండునునై పుత్రమిత్ర భార్యాసహితుండై బ్రహ్మ రాక్షసత్వంబుఁగాంచి యనేకవర్ష సహస్రంబులు జీవకోటుల భక్షించుచునుండె. వాని దారాపుత్రులు గృధ్రరూపంబునఁ దత్పార్శ్వ వర్తులై యతండు హింసించిన జంతువుల మాంసంబులు భుజియించు చుండిరి. ఈశ్వరద్రోహులకు నిట్లనుభవించుట చాలునె నిత్య నిరయంబులుగాక ? 209

## భాగవతానుగ్రహమున చతుర్వేదికి బ్రహ్మరాక్షసత్వము తొలఁగుట

శా. ఆకాలంబున నేఁగుదెంచిరి [59]మహోద్యద్దీవిభాసుల్, నుత
శ్లోకుండొక్కఁడు సత్యనిష్ఠుఁడనఁ దేజోధర్మ సంపన్నతన్
వైకుంఠ ప్రియ నామకుండొకఁడు నన్వర్థాహ్వయ ప్రక్రియన్
లోకుల్ చూడఁజెలంగి రద్భుతగుణాలోక్య [60]ప్రభావాఢ్యులన్. 210

క. వారలు పుణ్యచరిత్రులు
నారాయణ గిరివరాధినాథ శ్రీమ
న్నారాయణ దేవాంఘ్రిన
మారాధన మాచరించి యరుదెంచుఘనుల్. 211

57. గోరలిరువంక
58. భస్మోద్ధూళన లిప్తుండును.
59. మహోదారుల్ సమగ్రోత్తమ—(యతిభంగము)
60. ప్రభావంబునన్.

సీ. ఆది కాశ్మీర దేశాగతులై యదు
శైలేంద్రు సేవించి సమ్మదమునఁ
తద్దేశమునకు నాతత భక్తిమఱలి యేఁ
గుచు హరిభక్తు లకుంఠితావ
బోధనిష్ఠులు ద్విజపుంగవులాహరి
క్షేత్రమ్మునందుండి చేరితమ్ముఁ
గలసి వెన్వెంటరాఁగా హరిఁగీర్తించి
కొనుచు వింధ్యాటవీక్షోణిఁజొచ్చి

తే.గీ. యొకతటాకమున మునిఁగి యుచితపుణ్య
కర్మములు దీర్చియధికార గౌరవమునఁ
గేశవునిఁగొల్చి విష్ణుసంకీర్తనములు
నియతిఁ గావించునంతలో నిలిచి తెలిసి. 212

వ. ఆ బ్రహ్మరాక్షసుండచ్చటఁ దిరుగుచున్నవాఁడగుట సకల మహా పాపంబులకు హరికీర్తనంబు సేయుటయే ప్రాయశ్చిత్తంబని శ్రుతి స్మృతి పురాణేతిహాసంబులు ప్రమాణంబులుగా ఆ భాగవతులు ప్రసంగ వశమున చెప్పికొనుమాటలు దూరంబుననుండి విని గృధ్రరూపులై యున్న భార్యాపుత్రులును దానును హరిభక్తి దర్శనకీర్తనంబుల హృదయంబు ప్రసన్నంబైన ఆ విష్ణుభక్త పదాంభోజసంగపూత జలంబు దృష్టిపథంబుననున్నఁ బానంబు చేసి యా రాక్షసుండు వైకుంఠ తద్భక్త భుక్తశిష్టపాత్రక్షాళనతోయ పరికీర్ణాన్నకబళంబులు భుజించి గృధ్రంబులు దాను జాతిస్మరత్వంబు నొంది వైవస్వతుఁడానతి యిచ్చిన క్రమంబుఁ దలంచుకొని విష్ణుభక్తాంఘ్రి తీర్థంబున ముక్తియె ఫలియించె; ఫలాంతరములనిన నెంత? యని భావించుచు 213

మ. అపుడుప్పొంగుచు బ్రహ్మరాక్షసుఁడు పూర్ణానందుఁడై దక్షిణా
ధిప పూర్వోక్త విశుద్ధ వైష్ణవవరుల్ [61]దీవ్యత్తనుల్ నిత్య ధ
ర్మపరుల్ భూతల భాగ్యదేవతలు సారజ్ఞుల్ మునుల్ వీరెకా!
యపరిచ్ఛేద్య మహానుభావులని తా నాత్మన్ బ్రశంసించుచున్. 214

క. మన ముల్లసిల్ల దూరం
బున దండప్రణతి చేసి పొదవెడు పాపా
త్ముని బ్రహ్మరాక్షసుం గని
ఘను లాకాశ్మీరదేశకర్తలు విప్రుల్. 215

---

61. సత్యవ్రతుల్ నిత్యధ—(యతిభంగము)

వ. ఇట్లనిరి. 216

క. నీ వెవ్వఁడ వీవనమున
కీవచ్చిన వారవెవ్వ రీ రాక్షసజ
న్మావిర్భావము నీకే
కైవడిఁ బ్రాపించె నెఱుఁగఁగాఁ బల్కుమనన్. 217

క. తనసేఁతయుఁ, దనజన్మము
తన తనయుల కథలు [62]దార తత్తత్కృతులున్
వినయమున విన్నవించెన్
మునుకొని యా బ్రాహ్మణోత్తముల కతఁడు వడిన్. 218

వ. విన్నవించి 219

## సత్యనిష్ఠుఁడు వచించిన హరినామ ప్రభావము

ఉ. ఏనెటులన్ దరింపుదు మహీసుర రత్నములార! యన్నవి
ద్యానిధి సత్యనిష్ఠుఁడను నాతఁడు పల్కెను బ్రహ్మరాక్షసుల్
శ్రీనళినాక్షకీర్తన విశేషమునన్ ఘనపాతకంబులా
యేనునుదూలు; నిల్చునిఁ కనెయ్యెడ నయ్యుపపాతకావళుల్. 220

క. నారాయణ చారిత్ర క
థారంభము మాని మర్త్యుఁడన్య కథలకున్
బ్రారంభించుట గవ్యప
యోరుచిదిగనాడి కాంచికోత్సుకుఁడగుటల్. 221

తే.గీ. మందరాచల మంథాన మథితమగుచు
సుధయమర్త్యుల జిహ్వలు సోఁకె నాత్మ
జిహ్వనుదయించి హరికథాంచితరసాయ
నంబు నరులకు సకల భాగ్యంబు నొసఁగు. 222

క. భవ దురుకాంతారాంతర
నివసన మలినాత్ములైన నీచాత్ములక
ర్ణవశాయి కథామృతమును
[63]నవిరతముం గ్రోలఁ బూతతాత్మతగలుగున్. 223

62. తన యుదారత్వంబున్.

63. నవిరతమున్ బూతవృత్తులగుదురు వేగన్.

క. దురితాహిదష్ట నరులకుఁ
బరమౌషధ మెంచిచూడఁ బద్మాకాంతా
వర కీర్తన మొకటియే
యరయఁగ నేమిటికి దేవతాంతర మహిమల్. 224

క. వెల్లిగొను దుఃఖవారిధి
కల్లోలము లుత్తరింపఁ గమలాక్ష కథా
సల్లాప యానపాత్ర స
ముల్లాసము చేతఁగాక యొక్కటి గలదే? 225

క. తాపత్రయ శమనమునకు
నోపన్ జగమెఱుఁగ నయ్యదూత్తంసకథా
లాపం[64]బొక్కటియదగు; గ
రోపమమగు నన్యదేవతోత్కర్షమిలన్. 226

తే. గీ. ఘనత నారాయణాఖ్య యొకానొకప్పు
డైనఁ గీర్తింపలేని మూఢాత్మ వదన
మరయ వల్మీక మతని జిహ్వాంచలంబు
చర్చ సేయంగ ఘోరభుజంగమంబు. 227

తే. గీ. పాపులగు మానవులకు శ్రీపతి కథాసు
ధారసప్రేమ ముదయించి తనరకునికి
యుష్ట్రపోతంబు మాకందముజ్జగించి
నింబ పత్రంబు చవిగొన నిలిచినట్లు. 228

తే. గీ. అచ్యుతానంత గోవింద యనుచుఁ దిరుగఁ
దిరుగఁ బలుకు మహాత్ములు దిరుగ రుగ్ర
పాతకాబ్ధి మహావర్త పటలమధ్య
సంతత భ్రమణైక ప్రచారములను. 229

వ. శ్రుతి కర్మ జ్ఞానంబులచేత హరి కీర్తనంబునంగల ఫలంబు లభింపదు కాన సర్వమహాపాపశాంతి కొఱకు నారాయణనామం బుచ్చరింపుమని సత్యనిష్ఠుండూరకయున్న వైకుంఠ ప్రియుండను నాతఁడోరి బ్రహ్మ రాక్షసా! నీవు నారాయణాచలంబునకు నేఁగి శిరోధార్యంబగు విష్ణు

64. బొక్కటియేని హారోపమమగు.

భక్తాంఘ్రిరేణువుచేఁ బవిత్రంబగు కల్యాణతీర్థంబు శిరంబునఁ జల్లికొని తద్గిరీంద్ర ప్రదక్షిణ నమస్కార కీర్తనంబులు గావించిన భగవంతుఁడు ప్రసన్నుండై ముక్తి నొసంగునని యానతిచ్చె. ఇట్లని వారు నిజ నివాసంబునకేఁగి రంత. 230

ఆ.వె. బ్రహ్మరాక్షసుండు భార్యయు సుతులును
గృధ్రనికరములు యదుగిరికిఁ జేరి
[65]గిరి ప్రదక్షిణంబు నెరపి తత్తీర్థాధి
వాసి పాదు పాదవారిఁ గ్రోలి. 231

మ. ఇటులన్ మానము లేను దాఁటిన రమాధీశుండు తదుస్తరో
త్కట పూర్వాఘములన్నియున్ మఱచి తత్త్వజ్ఞాన సంపత్కరో
ద్భటులై మించిన యాజయున్ విజయు నుద్యత్ప్రేమ మీఱన్ సుధా
పటలప్రాయములైన సూక్తులఁదగన్ బల్కెన్ బ్రమోదంబునన్. 232

సీ. హరిరాత ఘుననకు నపచార మొనరించి
యా చతుర్వేది భార్యకుమార
బంధు సమేతుఁడై బ్రహ్మరాక్షసుఁ డయ్యె
నట్టివాఁ డిట మదీయ పదభక్తి
వరపాద తీర్థాంబు పానంబుచేతఁ బ
విత్రుఁడై విజ్ఞాన వృత్తిగలిగి
యేతదమేయ గిరీంద్ర పార్శ్వంబున
నుత్తమమూర్తియై యున్నవాఁడు

తే. గీ. వాని మత్తీర్థములయందు వరుసతోడఁ
దీర్థమాడించి మది సేదఁదీర్చి తెండు
సింహ మెదిరిన దంతులు సెదరినట్లు
నాత్మ భక్తులయెడలఁ బాపాళి యడఁగు. 233

ఆ.వె. అమ్మహానుభావుఁ డతని బాంధవులు మ
త్తీర్థమున మునింగి దివ్యులగుచు
నాకమునఁ బురాతనాకంబు వదలి వ
ర్తించుచుంద్రు గాత ! తదీయులలర. 234

65. సిరిప్రదక్షిణంబుచేసి తత్తీర్థాధివాసి.

## హరిభక్తుల పాదతీర్థ ప్రభావము

క. అన జయ విజయులు కౌతుక
మునఁజని సంపూర్ణతేజమున గిరిసేవా
ఘనుఁడైన బ్రహ్మరాక్షసు
ననఘాత్ములు వారుగాంచి రతిహర్షమునన్ 235

క. హరి కింకర పాదాంబుజ
పరమ పవిత్రోదకాతి పావనతనులై
పరఁగిరి నారాయణు శ్రీ
ధరుఁ గీర్తింపుచు నవామృత స్తోత్రములన్ 236

వ. వారలు బ్రహ్మరాక్షసుం గని యిట్లనిరి. 237

తే.గీ. అతులసద్భక్తి లక్ష్మితో నావరాత్మ
యరసి నీకున్ బ్రసన్నుఁడౌ నభినుతింపు
మంతకంటెను దత్కటాక్షానురక్తి
గలుగనేర్చునె యెట్టి సత్కర్మములను. 238

తే.గీ. అష్టతీర్థావగాహ మట్లైన పిదపఁ
దీర్థమాడుము కల్యాణ తీర్థరాజ
తీర్థమున నంత నీవు సుస్థితివహించి
బ్రహ్మ నిష్ఠ మెలంగెదు పరమ నియతి. 239

వ. ఇట్లని విష్ణుద్వారపాలురు పల్కినఁ జదుర్వేది హర్షించి ప్రథమంబున వేదపుష్కరిణీ తీర్థంబునఁ దదనంతరంబున దర్భతీర్థంబున, నావిదపఁ బలాశతీర్థంబున, నంత యాదవ తీర్థంబున, నంతటఁ బద్మతీర్థంబున, నా వెనుకం బరాశర తీర్థంబున, నా పిమ్మట నారాయణ హ్రదతీర్థంబున, నంతట వైకుంఠ గంగాతీర్థంబున స్నానంబుచేసి మూమ్మాటు నారాయణమంత్రం బుచ్చరించి బ్రహ్మరాక్షసత్వంబు విడిచి సత్వంబు వహించి, శిఖాయజ్ఞోపవీతంబులును, దండ కమండలకుండలంబులును, దర్భాంగుళీయకంబులును, గుశాసనంబును, ధౌతోత్తరీయంబును గలిగి ధర్మపరాయణుండై, మృదుభాషియై, మృదుగతియై, మృదుమానసుండై మంత్రజపశీలుండై, సమస్త ప్రియవాదియై బ్రాహ్మణరూపంబున భార్యాపుత్రబాంధవులుం దానును దత్తీర్థ స్నానాధికారంబున లభించిన పౌర్వదైహిక విద్యా విశేషంబు హస్తామలకంబైన ఘనుండై యుండె. అంత. 240

క. కల్యాణ తీర్థమహిమ య
తుల్యంబగుఁ దత్పవిత్రతోయాప్లవుఁడై
కల్యాణమందు మనుజుని
కల్యాణ జలంబుఁ గ్రోలఁ గణఁగుదు రమరుల్. 241

క. తులసీ వరమణిమాలా
కళికలు పద్మాక్షు మాలికలు పూనిన ని
ర్మలుఁడు మహాపాపాచల
కులిశంబై మెఱయు జగము కొనియాడంగన్. 242

ఆ.వె. ద్వాదశోర్ధ్వ పుండ్రధారణార్థోత్తమ
స్థానముల గురించి జయుఁడు విజయుఁ
డవని సురవరునకు నపుడుపదేశించి
[66]యాదరించి నారలతని లెస్స. 243

క. ఘనశక్తిఁ దప్తచక్రాం
కనమా విజయుండొనర్చెఁ గౌతుకమున, వి
ష్ణునకుం జక్రాది శుభాం
కనముననే ప్రీతికాని కాదన్యమునన్. 244

తే.గీ. బ్రాహ్మణక్షత్రియోరవ్యపాద భవులు
చక్రధారణ సంపత్ప్రశస్తమహిమ
శ్రుతి నిగళితంబు నియతైకమతిఁ బ్రమాణ
మనుచు నది యాచరించుట యర్థాతరము. 245

సీ. ఆత్మభర్తకుఁ జిహ్నమగుట సత్కార్మాంగ
మైనది యని సకలాగమములుఁ
దెలియఁబల్కుట, ప్రకృతి గ్రంధి దాహకం
బగుట యాత్మకు హృద్యమై తనరుట
స్వప్రియరూపమై సంఘటిల్లుట దేహి
దేహ సంస్కారమై తేటపడుట
పరభావ హేతువై పాటించియుండుట
ప్రభవదన్య పరిహారమునఁ దగుట

---

66. యాదరంబుదీర్చియాదరమున.

తే.గీ. శమన విద్రావణంబౌట శఠులకేని
యనిశకుశలాత్ములైన చేతనులకేని
భుక్తిముక్తులు గల్గునా పూర్ణమహిమ
చక్రలాంఛన మిలఁ బ్రశస్తములఁదాల్ప. 246

తే.గీ. శంఖ చక్రాది హీనుఁడౌ జడుఁడుభోజ
నాది కర్మంబులందయోగ్యతవహించి
విష్ణుభక్తి పరాయణ విబుధవర్గ
పంక్తియుండంగఁ దగఁడు దుష్పాపియగుట. 247

క. హరిభక్తి సమేతులఁగని
ధరలోపల శంఖచక్రధారణము సభాం
తరముల నిందించిన వాఁ
డరయఁగఁ బాషండు [67]లంబ్రడు రాజన్యవరుల్. 248

వ. అంత నవ్విప్రుండు తప్తచక్రాది భూషితుండై యూర్ధ్వ పుండ్రంబులు పూని విష్ణుశక్తులను గ్రహింప నారాయణ పదాంభోజంబులు సేవించుచుఁ బుత్రదారబంధు సహితుండై యైహికంబు లనుభవించి యంత మున నిరపాయ పదంబునొందె. ఈ యదుగిరి ప్రభావంబు వినినఁ బాప నిర్ముక్తులై ముక్తినొందుదురని నారదుండు సవిస్తరంబుగా నానతి యిచ్చెనంత. 249

మ. సమరోర్వీ పరతత్త్వ సాంశయిక వాసవ్యాత్మ బోధక్రియో
ద్యమ సిద్ధాంతిత యోగశాస్త్రమయ గీతాధ్యాయమాత్రామరు
ద్ద్రుమ నిత్యానత పార్వతీరమణ విద్యుద్వాదరజ్యజ్జటా
విమలారుణ్య పునః పునః ప్రకటనా విద్యోతి పత్పల్లవా! 250

క. ఉద్ధవ నామక హృదయమ
హోద్ధవ సంధాన సౌహృదోదిత భాషా
శుద్ధ దయాంచిత భూమ స
మిద్ధత భౌమాగ్ర బల సమిద్ధత తేజా! 251

67. డంబ్రడు

మయూరవృత్తము :

పతగకేతన ! వ్రజనికేతన ! పాపశాశన ! పూతనా
సుతనుదారణ ! దురితవారణ ! నూరి తోషణ కారణా !
యతి దృగంజన ! యార్తిభంజన ! యాప్తరంజన ! యంజనా
ద్రితను భాసుర ! విదళితాసుర ! దీప్యమాన మహీసురా !

## గద్యము

ఇతి శ్రీమత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్యపుత్ర,
కాశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడు నరసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణంబునందు ద్వితీయాశ్వాసము.
శ్రీ కృష్ణార్పణమస్తు.

# నారదీయ పురాణము

## తృతీయాశ్వాసము

క. శ్రీరాధా హృదయేశ్వర
పూరిత యమునానికుంజ పుంజ విహారో
దార మనోరథ దుర్మద
కౌరవ్య మనోగ్రదావ కంబుగ్రీవా ! 1

వ. అవధరింపు మట్లు నారదుం డెఱింగించిన మునులు విని ప్రశ్నాంత
రంబునకు నుపక్రమించిరని సూతుండు శౌనకాదుల కిట్లనియె. 2

మ. ధరలోనఁ హరిభక్తకోటి కపరాధంబుల్ జనుల్ సేయఁద
ద్దురితంబుం బరిహారముం దెలిపి సంతోషంబు గావించితీ
వరయఁ లోకములెల్ల మేలనఁగ దత్తాత్రేయుఁ డామ్నాయచా
తురి పాషండులనెల్ల నయ్యదుగిరిఁ దూలించె [1]మున్నేగతిఁ ? 3

క. వర వైష్ణవ మౌళి పరా
శరుఁ డేచొప్పున నొనర్చె సన్మతి యదుభూ
ధరమున విష్ణు పురాణం
బరయఁగ నోమౌనినాథ యానతియీవే. 4

## పాషండమతభేద వచనము

వ. అనిన (నతఁడు వారికి) నిట్లనియె. కాణాదశాక్త్య పాషండ జైన ప్రముఖులు నరకాంగార వర్ధనులై విజ్ఞానం బొకానొకప్పుడు [2]చెఱచి దేహవ్యతిరిక్తంబైన యాత్మలేదు. కేవలమును[3] దేహమె యాత్మయనుట యర్థంబని తెలియంబడుచున్నదిగాన దేహానురూపంబుగా వర్తింప వలయు. తపోయజ్ఞదానయోగార్చనంబులు సేయుట వృథాయాసంబులని తత్త్వంబునం జూచువారిని మహీతలంబున మోహంబు

---

1. మున్నిగతిన్ అని వ్రాతప్రతి.
2. చెరిచి.
3. [illegible]

నొందింతురు. కొందఱాత్మ దేహభిన్నంబని యెఱింగియు నాదేహంబు నకు క్షణవినాశత్వంబు తర్కకర్కశులై పల్కుదురు. కొందఱు దేహవ్యతిరిక్తంబైన యాత్మకు నాదేహంబునందు నుండుట నంగీకరించి యంతర్యామి లేఁడందురు. కొంద ఱాపురుషుని శేషకారణంబని యంగీ కరించి బ్రహ్మఁగాని తదన్యునింగాని యొకనిఁగాఁ బ్రతిపాదింతురు. చిదచిద్రూప భేదంబున జీవేశ్వర విభాగంబు గావించి ప్రమాణసిద్ధమై సకలంబు నొక్కటియే యని పల్కు దురాత్మ తన్మాత్ర రూపంబు గాని జీవుండుగాఁ డీశ్వరుఁడుగాఁడు. ఆ దేహమునకంటె నధికంబగు వివర్తములను దానికంటె నధికముగాను[4] గొందఱు పల్కుదు రిది విష్ణుమాయా మోహితులై ప్రతిభామాత్ర శరణులై పలికిరి. ప్రవాదకు లైనవారు వాదంబులు ప్రమాణవిరోధులై నిరాలోకంబైన లోకంబును నిందించిన నంత నాజ్ఞానంబు విప్లుతంబైన కలశాంబుధియందు విష్ణు పాదంబులంబడి వేదంబులు మొఱలిడుచు మాధవా! సమస్తచిదచిద్వస్తు శేషివి నీవగుట యీ యర్థంబునందు ననాదినిధనంబులగు మేమే ప్రమాణంబు సత్త్వస్థు లిందులకుం బ్రమాత లెవ్వనికి నేతత్త్వంబు దోఁచు నాతత్త్వంబు దైవతంబంద్రు. వీనికిం బ్రమాణము పాషండ వాదములు మ్లేచ్ఛదేశనివాసు లిందులకుదేశికులైయుంద్రు. విశుద్ధుండగు నాత్మకు స్నానాదులచేత నెటుల సిద్ధియగునని స్నానాదికం బిచ్ఛా వాదంబుచేత లుప్తంబుగావించి దుర్విజ్ఞానానువర్తులచేత వర్ణాశ్రమా చారంబులు వదలియుండ్రఁ ధ్యాత్మజ్ఞానంబు లింటింట నన్యప్రకారంబున నుండుం గావున విజ్ఞానంబు నిర్వహింపవే యీశ్వరా! యని వేదంబులు విన్నవించిన శ్రీపతి యిట్లనియె. 5

మ. ధరణీమండలి నేగురుండనయి శాస్త్రంబుల్ ప్రకల్పింతు మీ
రురు తేజంబున శిష్యులై మెలఁగుఁ డన్యోన్యాను వాదంబునన్
చరితార్థత్వముగగ్లి గెల్చెదము పాషండాలి నేఁడంచు నా
హరి విద్యా నియతాత్ముఁడై మెఱసి దత్తాత్రేయుఁ డయ్యెం ధరన్. 6

సీ. కౌపీన కవచ[5] శిక్యత్రిదండ్యుపవీత
ములు పంచయాత్రంబు లలవరించి
మస్తశిఖాభిరామ్యంబును లలితోర్ధ్వ
పుండ్ర చిహ్నములు ప్రభూతలీల

---

4. గాఁనున్ను అని వ్రాతపతి.

5. శిష్యుఁ తిదండ్యుపవీత అని వ్రాతప్రతి. (యతి భంగము)

గలిగి సన్యాసియై కమలాక్షుఁ డట్లుండ
నుచిత వేదములు బహ్వృచుఁడనంగ
నాథర్వణికుఁడన నధ్వర్యుఁడన సామ
గుండన సాంఖ్యులు దండిమెఱసి

తే. గీ. యమ్మహాత్ముని శిష్యత్వ మాచరించి
యంగషట్కంబు నిజశిష్యులై చెలంగఁ
గలిగె నిజభక్తి పేరఁ బుష్కరిణి యనఁగ
నొక్కతీర్థంబు సకలలోకోత్తమంబు. 7

తే. గీ. మానవాకారములను మీమాంసధర్మ
శాస్త్రగణమును న్యాయవిస్తరము దత్పు
రాణములుమించె నా రమారమణుఁడిట్లు
ఘనత వర్తించె బహుశిష్యగణము* లమర 8

తే. గీ. జగతిఁబాషండ శింశపాషండ దావ
వహ్నియై ప్రాంతదేశ నివాసులైన
**వారి** శిక్షించె ధారుణీవలయమునను
జ్ఞానసంపత్తి వర్ధిల్ల సంఘటించె. 9

తే. గీ. రూఢి శాండిల్యుఁడను మునీంద్రుండు మున్ను
బాంచరాత్ర ప్రమాణ ప్రభావ శక్తి
నాగమార్థంబు వ్యర్థమౌనట్లొనర్చు
శఠులఁ బాషండ జనులను సంహరించె. 10

తే. గీ. రాహు దంశనమునఁబాసి యాహిమాంశుఁ
డలరుగతి మంచుతెరఁబాసి యర్కబింబ
మంబరమునఁ బ్రకాశించునట్లు జ్ఞాన
మతిశయంబందెఁ బాషండు లణఁగినపుడు. 11

## వ్యాఘ్ర వానర కిరాత సంవాదము

వ ఇట్లు పాషండఖండనంబు గావింప నన్నిదిక్కులం దిరిగి వేదంబులు కల్యాణతీర్థ తీరంబున శాండిల్యసమేతుండైన దత్తాత్రేయునింగాంచి స్వామీ! యొక యాశ్చర్యంబు చూచితిమనిన నదియేమి యని యడిగిన నొకవానరుం డరణ్యంబున నొక్కనగాగ్రంబున నుండి వ్యాఘ్ర

---

*బహుశిష్యగణము లగుచు.

భీతుండై కిరాతుండొక్కరుండు నా నగాగ్రంబునందే యుండినంతఁ గిరాతుండు నిద్రింప వానరుంబిలిచి వ్యాఘ్రంబాఁకొన్నదాన [6]నీ కిరాతుని మద్భక్షణంబుగాఁ గోరివచ్చితి నీ[7] శాఖాగ్రంబూఁచిన వీఁడు వడిన వీని భక్షించి యేఁగెదననిన (నవ్వానరుండు) భయాతురుండగుట వీని నెట్లు పడనూఁతు నుత్తములు శరణాగతులం గావందగునని యంగీకరింపకయుండె నంత నవ్వానరుండు నిద్రింప వ్యాఘ్రంబు కిరాతునిఁ జూచి నిన్ను మ్రింగవచ్చినదాన నీ వీవానరంబుఁ బడంద్రోఁచిన మెసంగి చనియెదననఁ గిరాతుండు వానరంబును[8] బడంద్రోచె (వ్యాఘ్రంబవ్వానరునిఁజూచి) [9]నిన్ను విడిచెద శాఖాగ్రంబునకు నెక్కి [10]వానిం బడంద్రోయుమని యనిచిన నమ్మహీరుహాగ్రంబునకు నెక్కి యూరకయున్న వ్యాఘ్రంబు [11]వానిం ద్రోయుమనిన వానరం బిట్లనియె. 12

మ. తగునా యీతనిఁ ద్రోవ నాకు నిఁక నత్యంతాతురుండై గృహో
పగతుండై పగతుండు వచ్చినఁ గృపాపారాయణుల్ కావఁగాఁ
*నగు నేరంబులు గల్గనీ దురవలేపాంధుండుగానీ దుర
ధ్వగుఁడై యుండిన నుండనీ మనుచులే ధర్మంబు లోకంబునన్. 13

క. అని వానరముం దగఁగా[12]
గని వచ్చితి మనుచు వేదగణములు పలుకన్
విని దత్తాత్రేయుం డ
య్యనఘుని శాండిల్యుఁగాంచి హర్షోన్ముఖుఁడై. 14

మ. హరిశిష్యుల్ నిగమంబు లీకరణి నత్యాశ్చర్యముంబొంద ని
ద్ధరలోనన్ శరణాగతావనమహాధర్మంబె ధర్మంబు త
త్పరమాత్మాశయమెల్ల నిట్టిదియె నీ భావంబునందున్ [13]మహ
త్తర మేతద్గుణ మంచుఁదోఁచెనిది సత్యంబే ప్రమాణంబగున్. 15

---

6. ఈ కిరాతుని- అని వ్రాతప్రతి.
7. యీ శాఖాగ్రం-
8. నఁ బడంద్రోఁచె--
9. ఇంక నేనియు నిన్ను
10. వీనిం
11. వీనిం
*దగు అని వ్రాతప్రతి. దగు అని యున్న యతిభంగము.
12. గన్కనివచ్చితిమి.
'కన్కను' అనుదానికి 'సంభ్రమము' అని శబ్దరత్నాకరము. కనుగొనుట అను అర్థము దీనికిలేదు. సంభ్రమమను అర్థమిచ్చుట సరిపోవుట లేదు. కావున "దగఁగాఁ గనివచ్చితి" మనియుండఁదగును. "కన్గొన వచ్చితి" మనిన యతి భంగము కాగలదు.
13. మహోతర మని వ్రాతప్రతి. ఈ రూపము అసాధువు.

తే. గీ. అరసి శరణాగతులఁ బ్రోచునదియె ధర్మ
మగుట యేము నెఱుంగుదు మనఘ తిర్య
గాత్మలకు నిట్టిగుణ మెట్టులమరె ననుచు
వేదములు పల్కె నపు డతివిస్మయముగ. 16

## నాళీజంఘుని కథ

సీ. వెలయఁ దిర్యగ్జంతువులను దిర్యగ్జంతు
వులకేని శరణాగతులను బ్రోవఁ
బరమధర్మము మున్ను భవ్యశీలంబైన
గంధర్వమిత్రమై ఘనతకెక్కు
రాజహంసంబు నాళీజంఘమను [14]పేరు
గలిగినయది సిరిగాంచి మెలఁగ
దారిద్ర్యమున ధరాతలమునఁ దిరుగుచు
నొకఁడు తత్సన్నిధినుండఁ గాంచి

తే. గీ. ద్విజుని యట్లనె [15]తోఁచెదు, దీనవృత్తి
నేలవచ్చితివిచటికి? నేమిసేయ
వలయునన బ్రాహ్మణుఁడు లేమివలన వచ్చి
నాఁడనన హంస మప్పుడిట్లనుచుఁబలికె. 17

శా. గంధర్వేంద్రుఁ డొకండు మత్సఖుఁడు విఖ్యాతుండు దీనార్థి స
ద్బంధుం డాతఁడొసంగు నీకు ధనసంపల్లబ్ధి యంచున్ స్వసం
బంధం బంతయుఁదెల్పి రమ్మనుచు సంప్రార్థింప గేహంబులో
నంధోలేశములేక స్రుక్కి చనె హంసావాస మా విప్రుఁడున్. 18

క. ఆలో నిద్రాకులమగు
నాళీజంఘంబు కంఠనాళము విప్రుం
డాలోలతఁ బిసికిన వాఁ
డా లోకముచేరె భాస్కరాలోకమునన్. 19

సీ. బ్రాహ్మణాధముఁడు తత్పలలంబు భక్షించి
నిద్రించునప్పు డా నీడజంబు
పక్షముల్ గంధర్వపతి భటుల్ వీక్షించి
విప్రుని నెమ్మోము విన్నదనము

14. పేరఁగలిగినయది
15. తోఁచెదు

గని వీఁడె హింసించెఁగా యని వాని భం
జించిరి నాకంబుచేరె [16]రాజ
హంసంబు బ్రాహ్మణుం డరిగె హంసకుమార
మందిరంబునకు శ్రీమహిమ గలిగి

ఆ. వె. యంత హంస మడిగె వయ్యమరవరుల
నన్ను నోర్చు బ్రాహ్మణవరుఁ డకట
యెందునుండె నాకు నెఱుక సేయుం డన
ననిరి నరకవాసియయ్యె ననుచు. 20

తే. గీ. అమరులకు మ్రొక్కి యా రాజహంస మాత్మ
సుకృతమున నేఁడు బ్రాహ్మణు సురపురమున
కధివసింపంగఁ గృపసేయుఁ డనుచు వారి
పాద నీరేరుహంబులఁ బడియె నంత. 21

క. నిను హింసించిన పాతకి
ననఘా! నాకమున నునుపు మంటివి యేత
జ్జనులకు నిచటికి రావ
చ్చునె? యీ కార్యంబు వలదునూ నీ కింకన్. 22

ఆ. వె. అనిన మఱియు నతఁడు ప్రార్థింప నిర్బంధ
మున సుపర్వులెల్ల ననుమతింప
నాకమునకు వచ్చె నరకాంతరము మాని
భూసురుండు దుర్గుణాసురుండు. 23

క. అనుకంపాశీలము గాం
చిన వారికి శరణమన విశేషంబునఁ బ్రో
చిన యది సువ్రతమని స
జ్జను లాడుదు రఖిలధర్మ సారజ్ఞులలోన్. 24

తే. గీ. ఒనరఁ బ్రత్యక్ష నారాయణోక్త పాంచ
రాత్ర సారాంశ మఖిలైకపాత్ర మతి వి
చిత్ర మమల పవిత్రచరిత్ర మిందు
నెంచ శరణాగతత్రాణ మింత మించు. 25

16. రాజు హంసంబు.

వ. ఇట్లన్యోన్య సల్లాపోత్ఫుల్ల మానసులైన వారి యగ్రంబునకు శిష్య సహితుండై పరాశరుండు చనుదెంచి దత్తాత్రేయునకుం బ్రణామం బాచరించి తదనుమతంబునఁ గుశలంబు విన్నవించి నిజాగమన కారణం బేదియనిన నిట్లనియె. పులస్త్య వసిష్ఠ వరదానంబునఁ దత్త్వమంతయు నాకుఁ బ్రకాశంబయ్యె. మైత్రేయునకు నది వినబుద్ధి వొడమె. నీ సర్వోత్తర దేశంబున నిలిచెద. నారాయణమునీంద్రుండు బదరి కాశ్రమంబున కంటె నారాయణాచలంబు నాకుం బ్రియం బనియె. మునిస్థానంబునుం గలదని యానతియిచ్చి యిచట విష్ణుపురాణం బితనికి బోధింపుమనినఁ దద్వచనంబునంబని వింటి. ఆ నారాయణుం డన నీవే వేదపురాణాదుల కన్నింటికి నీవే ఫలంబునేఁడు నాదృష్టికి నమృత పారణంబయ్యెనను[17] పరాశరునకు దత్తాత్రేయుం డిట్లనియె. 26

క. తత్త్వము నీ విక్కడ* విని
తత్వమున యథార్థఘటన దగ బోధింపన్
సత్త్వాధికుఁడవును సుధీ
సత్త్వాధికుఁడవును నీవె చతురత నరయన్. 27

క. ప్రియమా సర్వోత్తరమతి
శయమునసేతత్పురాణ సారంబిట్లన్
బ్రియతమమై కర్ణామృత
మయి మెఱయన్ వినియెదను నయంబుననేనున్. 28

ఆ. వె. అని యనుజ్ఞ నొసఁగ నా పరాశరముని
హరియ పరమతత్త్వ మనుచుఁదెలుప
విమల రూపమైన విష్ణుపురాణంబు
సంఘటించె శుద్ధ సత్త్వమయము. 29

సీ. తనదు కల్యాణతీర్థమునకుఁ గించిదు
త్తర భాగమున మహోదారమగు వ*
రాశరాశ్రమ మఘరాశిమాలానల
మాతీర్థమణి ప్రతీచ్యంతరమునఁ

---

17. ననుచుఁబరాశరునకు—అర్థము సరిపడదు.

* వని

దగు పంచభాగవతస్థాన మాతీర్థ
మునకెంచఁ బ్రాగ్భాగమున వరాహ
దేవతాస్థాన మా తీర్థంబు దక్షిణ
స్థలిని సీతారణ్య మలరు నచట

తే.గీ. లక్ష్మణుఁడు గట్టెఁ బర్ణశాలా గృహంబు
రామ జనకసుతా మనోరమము గాఁగ
స్థానములు నాల్గు నిట్టివి సంభవించె
నట్టి పుణ్యస్థలంబున యతివరేణ్య! ౩౦

తే.గీ. అంత మైత్రేయ సహితుఁడై యాపరాశ
రుండు శాండిల్య మౌనిశార్దూలు వినయ
శీలు నత్యంత భక్తి భూషించి యపుడు
వినయ సంపన్నుఁడై గారవించి పలికె. 31

## తులసీ హరివాసరాది మహత్త్వము

తే.గీ. ఎంచఁదగుఁ బాంచరాత్ర ప్రపంచ వక్త్ర
మీరెఱుంగనియది యింత యేనిలేదు
ఘన దయానిధి దానిలోఁ గల విశేష
మంతయును నా కెఱింగింపు మాదరమున. 32

క. శ్రుతులందుఁ గానుపించక
యతి గోప్యంబైన యర్థమది లోకశుభ
స్థితి మెఱయఁ బాంచరాత్రం
బతి ధృతి నారాయణుఁడు సమగ్రతఁ జేసెన్. 33

క. తులసీ హరివాసర ని
శ్చల మాహాత్మ్యములు విష్ణుసంతత సేవా
ఫలములునుం దద్వాసనఁ
దెలివి పడన్ నేఁడు మాకుఁ దెలుపు మునీంద్రా! 34

వ. అనిన శాండిల్యుం డిట్లనియె. భవతారకంబై సర్వజగత్కారణంబై శాంతానందంబై మహానందంబై సత్యజ్ఞానమయంబగు మహా రూపంబు గలదు. దానికంటెఁ బ్రియతరంబై వైకుంఠవాసి దృశ్యంబై గుణభాషాదులచేత నద్భుతంబై మూర్తంబైన బ్రహ్మంబు గలదు. దానియందు ననేక రూపంబులు గలవు. దాననే జీవనంబై

వరమానందంబున విహరించు. విష్ణునకు దివ్యరూపంబులనేకం బులు గలవు. వాసుదేవాదులు కొన్ని, కేశవాదులు కొన్ని, పద్మ నాభాదులు కొన్ని, లక్ష్మీగాఢోపగూఢంబులైన రూపంబులసంఖ్యం బులుగల వనురూపరూపంబుచే నేర్పడిన సర్వశ్రేష్ఠులగు లక్ష్మీనారా యణులకు దాసదాసీజనంబులైన బ్రహ్మరుద్రాది దేవతలు గలరు. నారాయణుండు సృజించి రక్షించి యంతంబున విశ్వంబు హరించు, నందునకు లీలం గారణంబు పృథివి ఘటికాయంత్ర నిత్యారోహావ రోహంబులచేఁ గర్మమాలికయందుఁ దిరుగువారిఁ జక్రాయుధుండు తత్కర్మ చక్రంబు వలన (నుండి) నివారించుం గాన తచ్చరణార్చ నంబే ప్రతిదినంబు గావింపవలయు. వర్ణాశ్రమాచారభ్రష్టులు విష్ణు పూజార్హులుగారు. మఱియును, 35

క. హరిపూజకుఁ దులసీదళ
మరయఁగ నానందకంద మదిలేకున్నన్
స్మరియించినఁదత్ఫలదం
బరవిందాక్షునకుఁ దులసి యర్హంబెందున్. 36

తే.గీ. పద్మకల్హారచంపక భర్మకుసుమ
పూజఁగావించ మెచ్చఁడంభోజనాభి
శ్రీకరంబైన నవతులసీదళములఁ
బూజఁగావింప *మెచ్చు నీ భూమిలోన. 37

వ. ఇందునకుఁ బురావృత్తం బెఱింగించెద. 38

సీ. ధర్మకేతుండను ధరణీశ్వరుఁడు మున్ను
మునివృత్తిఁజేసె నమోఘ మహిమ
ధర్మంబులన్నియుఁ దద్ధరా శాసిత
హితుఁడైన నిజపురోహితునిఁ బిలిచి
యఖిల ధర్మంబులు నఖిల వ్రతంబులు
నఖిల యజ్ఞంబులు నాచరించి
నాఁడ నారాయణనగమున నారాయ
ణార్చనం బొనరింతు ననుదినంబు

* నట్ల

తే.గీ. నిర్ధశీల ! పురాణంబులెల్ల మాధ
వార్చనంబే ప్రశస్తమౌ ననియె నాకు
విష్ణు సంతోషకారణవృద్ధి కెద్ది
సాధనము ? తెల్పవే యని సన్నుతింప 39

## ధర్మకేతుఁడనురాజు చేయు నారాయణార్చనా ప్రకారము

తే.గీ. సకల సుమములచేతఁ గాంచన సుమముల
చేత గంధాదికంబులచేత నఖిల
భక్ష్యములు వ్యంజనములు పాకశుద్ధి
విమలముగఁజేసి హరికినైవేద్య మొసఁగి. 40

వ. సేవించుమని పురోహితుండుపదేశించిన. 41

మ. కనకంబెంతయుఁదెచ్చి పద్మసుమనః కల్హారచాంపేయ కాం
చన పున్నాగ కదంబ కుంద *వకుళాంచ ద్ధూపముల్ చేసిత
ద్ఘన రత్నాంకిత పుష్పమాలికలు వేడ్కన్ మీఱఁ గల్పించి యా
ననలం బూజయొనర్చె మహీనాథుండు హర్షంబునన్. 42

వ. అంత. 43

ఆ.వె. భక్తిమైసహస్రభార ప్రమిత*నయి
వేద్యమిచ్చి యాదివిష్ణుదేవు
నభినుతించి యవనియందు దండానతి
చేసి నృత్తమాడి చెలఁగు నంత. 44

సీ. తత్కాలముననను యాభాలాభనామకుఁ
డవనీసురుండొకఁడనఘనిష్ఠ
నూని యేకాదశి నుపవాస మొనరించి
నియతవ్రతంబున నయముగాంచి
నరులు మెచ్చఁగ యోజనత్రయాంతర్హిత
దేశంబునందు నుద్దీప్తి మెఱసి
యుండి ద్వాదశి నా సముజ్జ్వల తులసికా
మాలికఁబూజించి మహిమవెలయ

* వకుళాకారంబులంచేసి (యతిభంగము)
* ఈ రూపము చింత్యము-మార్చినచో గణభంగము.

తే.గీ. నపుడు నైవేద్యమర్పించె నా మహీత
లాధినాథుండు నారాయణాద్రినాథు
భక్తిఁబూజించి యన్నంబు బ్రాహ్మణులకు
నెమ్మితోడ నొసంగి మన్నించి మించి. 45

తే.గీ. సౌధభాగంబు నా సార్వభౌముఁ
డుచిత సద్గోష్ఠి వర్తింపుచున్న యెడను
వచ్చిరిరువురు గంధర్వవరులు మింట
యదుగిరీంద్రునిఁ బాడుచు నద్భుతముగ. 46

వ. రత్నాంగద విచిత్రాంగద నామంబులం బ్రసిద్ధులగు నా గంధర్వ
వరులు నారాయణుండు రాజదత్త సువర్ణకుసుమాదికం బంగీకరింపక
యాథాలాభ దత్తంబైన తులసికామాలికయె మౌళియందుఁదాల్చెననుచు
నేఁగునెడఁ దద్వార్త విని ధర్మకేతుండు నారాయణ సన్నిధానంబుఁజేరి
యట్లనె విలోకించి విస్మయంబంది యాథాలాభుని యున్నకడకుంజని
మ్రొక్కి మధువిరోధి తత్పూజఁగైకొనుటయు నిజపూజం గైకొనకుండు
టయు నెట్లయ్యెననిన నతండిట్లనియె. 47

తే.గీ. ఏ దరిద్రుండ నర్థింప నెఱుఁగనెట్లు
వాసుదేవుని *మెప్పించువాఁడ నెట్టి
ధర్మమొనరింప శక్తుండ ధరణినాథ
ధరణితలమున నీకిట్లు [18]తగునుగాఁక 48

వ. అదియునుంగాక యాపరాత్మ తానేమి సంకల్పించుకొని యుండునో
యది తానె కల్గుచున్నయది. కించిత్తేని యకృతమయినయది యపే
క్షించఁడు గావున మహారాజా! నీచేతం జేయఁబడినయది చూడంబడక
యుండుట నిజంబనిన మఱియుం బ్రార్థించిన *నిట్లనియె. 49

మ. తులసీమాలిక వైచి విష్ణునకు సంతోషంబుఁ బుట్టించి [19]ని
చ్చలు నైవేద్యమొసంగి వందనములున్ సద్భక్తి గావించుచున్
[20]లలి నష్టాక్షరమంత్రరాజమున నుల్లంబుల్లసిల్లంగ ను
జ్జ్వల నిష్ఠాప్తి జపంబుసేయుదు మహోత్సాహంబు దీపింపఁగన్. 50

---

* మెప్పింపువాఁడ. * మరియు నిట్లనియె.

18. చెల్లుఁగాక.(యతి ?)

19. నిత్యలు.

20. ప్రోల్లస దష్టాక్షర (ప్రాస భంగము)

## భగవద్దర్శనము చేయు విధానము

తే.గీ. ఎంచ నారాయణున కంటె నితరదేవుఁ
డనుప మాష్టాక్షరంబైన యట్టి మంత్ర
మౌశికంబెను మఱియన్యమంత్ర మిందు
గురునకంటెను వేఱొక గురుఁడు గలఁడె? 51

వ. వినుము రాజ! ఏకవస్త్రంబుఁగట్టి ప్రణామంబు సేయుట, వస్త్రంబు వలెవాటు వైచుకొని మ్రొక్కుట, తైలా[21]భ్యంజనమున భజించుట, కృష్ణ కంబళ ధారణంబున నీక్షించుట, నఖకేశాది విక్షేపంబునం గాంచుట, యెదుట నిష్ఠీవనాదికంబు లొనర్చుట, పర్యంక బంధ కరణంబున మెఱయుట, [22]యాసన పరివర్తనంబున విజృంభించుట, [23]యాసన పరిగ్రహంబున వర్తించుట, లాలావిసర్జనంబున, విష్ణు కథాశ్రవణ రాహిత్యంబున, సంధ్యాహైన్యంబున, ననాచారంబున' నస్నానంబున, నన్యదేవతా గీత పుష్పార్చనంబున, నన్య దేవతా ప్రశంసంబున, విష్ణుముఖావలోకనంబు సేయక యన్యముఖావలోకనంబు సేయుచుండుటను, బానప్రదేశంబున విష్ణుభక్తితరోపచారంబున, శ్మశానంబునకు నేఁగి స్నానంబుచేసి యేనియు నర్చించుట, మూర్ఖప్రదేశంబున నైవేద్య వీక్షణంబున, నివేద్య కుసుమాఘ్రాణంబునఁ బూజాద్రవ్యాపలాపంబున, నిజబద్ధ ప్రలాపంబున, భగవద్గృహంబుననుండి ప్రమత్తుండై తనయున్నచోటికిం భగవంతునిం దెప్పించుకొనుట, కలహ ప్రవర్తనంబున నేతద్దేవతా ద్రవ్యం బన్య ప్రదేశంబునం బొందించుట, దుష్టభాజనంబుల సమర్పించుట, లేవక ప్రసాదంబు స్వీకరించుట, భగవత్సన్నిధి శయనాదికంబుఁగావించుట, తులస్యవమానంబు సంఘటించుట, యనర్హప్రసూనంబులం బూజించుట [25]యన్యులకు రహస్యం బెఱింగించుట. పుత్రాది చింతనంబున, స్త్రీ సంభాషణంబున, విష్ణుగీతాన్య గీతోపలాలనంబున, విష్ణుమందిరంబునం బ్రవర్తించుట యపచారంబుల తదపచారంబులం బ్రహ్మకల్పంబులు నరకంబనుభవించు. ఈశ్వరుండు తత్పూజయుంగైకొనం డీదోషంబులలో నొకటి యెయ్యదియైన నీయందుఁ గలిగెనోకాక యనిన విని రాజు కౌతూహలంబున. 52

21. భ్యజనమున. 22. నాసన,
23. ఆసన.

క. తులసిఁ సకల మనోరథ
ఫలదాయినిఁ దెచ్చి విష్ణుపాదాంభోజం
బులఁ బూజించెఁ హరికృప
గలిగెం దత్ క్షణమునంచె క్ష్మాపాలునకున్. 53

క. తులసీతుల సీమాంతర
ముల [26]నెందునుబొంద రఖిల పుణ్య నిధానం
బల భూత భావి వస్తువు
లిలలోఁ దత్సదృశవస్తు వెద్దియుఁ గలదే ? 54

క. తులసీకానన సౌరభ
కలితంబగు మారుతంబు గలచో యమదూ
తలు దిరుగ వెఱతు రుర్వీ
తలమునఁ దత్తులసిఁబోలు ద్రవ్యము గలదే ? 55

క. తులసీ తులసీయనుచున్
బలుకు నరోత్తముఁడు పరమ పదమున లక్ష్మీ
లలనా వల్లభపాదో
ల్లలనా కలనాది సత్ఫలంబు వహించున్. 56

సీ. దర్శనశ్రవణ కీర్తనపరిస్పర్శన
స్మరణంబులొనరించు జనులనెల్లఁ
దులసీవనము పవిత్రులఁ జేయు వెనుకటి
పదితరంబులు మీఁది పదితరములు
తులసీదళంబు లెందు వసించుఁ బద్మవ
నంబు లెచ్చటనుండు నలిననాథ
కీర్తనం బెందున వర్తిలు భాగవ
తోత్తము లేవంక నుంద్రు విష్ణుఁ

తే.గీ డచట వసియించు శంఖచక్రాబ్జ శార్ఙ్గ
హస్తుఁడై సర్వలోక ప్రశస్తుఁడై న
మస్తుఁడైకాన నీవును మనుజవర్య !
శ్రీధరార్చన తులసిచేఁజేయ వలయు. 57

---

26. నెద్దియ ?

క. తులసి యెటువలెఁ బ్రియంబగు
జలజాక్షున కట్లుప్రీతి సంపాదించుఁ
వెలయఁగ ద్వాదశి యేత
త్ఫల మేమని చెప్పఁగల నృపాలవతంసా ! 58

తే. గీ. ఘనతతోశయనము మదంగ పరివర్త
నంబు నుత్థానమ్మున సంకరంబు మెఱయు
హరిదినంబుల నుపవాస మందకున్న
హృదయశల్యంబు వెట్టినట్లైనసియుండు. 59

ఆ. వె. అనిన భగవదుక్తి యనుమాన మొనరించు
నట్టినరుఁడు బాహ్యుఁడద్దురాత్మ
సద్గుణంబులెల్ల శవవిభూషణములు
వంచకుండు వాని నెంచనేల ? 60

క. ఏకాదశి[27]వంటి వ్రతం
బేకలుషాత్ముండు సేయఁడిల నెన్నిక దా
నా కలుషాత్ముని సుకృతం
బాకడ భస్మాహుతియగు ననియెఁ శ్రుతియుఁ 61

క. గురుశాస నానులంఘన
శరణాగత [28]సుజన హరణ చక్రాయుధ వా
సరభోజనములు దురితాం
తరములకుఁ సమములనుచుఁ దలఁచిరి పెద్దల్. 62

వ. కావున శుక్లపక్షైకాదశీదినంబున నుపవసించి నారాయణ భజనంబు సేయుము. తులసీదళ సమ్మిశ్ర తీర్థంబుతో హరినైవేద్యంబు భుజించు వారు షోడక్యలాబూబింబ జంతుఫల కళింగ కరకంబులు వాసు దేవార్చనా విధికి నర్హంబులుగా వశన భక్షక ధేనుక్షీర ఘృతంబు లెప్పటికి హరికి నర్పింపఁదగదు. హవిష్యంబున విష్ణు నివేదితాన్నంబు సేయవలదు. భక్త్యాదరంబుల నారాయణ నివేదితాన్నంబు భుజించిన సంసార సాగరంబు తరియింతు రనిన శాండిల్యుని వచనంబులు విని పరాశరుండు సర్వంబు నాచరింపుచు నారాయణాచలంబున నారాయ ణానుగులైన దత్తాత్రేయ శాండిల్య మైత్రేయాదులతో నుండె ననిన విని మునీంద్రులిట్లనిరి. 63

27. కంటె. 28. జనన.

తే. గీ. ఘోర సంసారతాప నివారణంబు
చేసి పలికితి యో మునిసింహ ! యట్టి
జనుఁడు [29]వైకుంఠ గంగాంబు సక్తుఁడగుచు
యదు నగంబునఁ బరధామ మందె నెటుల ? 64

వ. అనిన నారదుం డిట్లనియె. 65

## విష్ణుచిత్తుని కథ

సీ. ఆచారపాలకుం డను బ్రాహ్మణోత్తముఁ
డొకఁడు తద్భార్య లోకోత్తరైక
ధర్మచారిత్ర వర్ధని యనునది వారు
విష్ణు పూజాసక్తి విడువ కెపుడు
వర్ణాశ్రమోచిత వరకర్మము లొనర్చి
శాస్త్రనిషిద్ధముల్ సంత్యజించి
యంభోజనేత్ర నిజాజ్ఞా విలంఘన
భీతులై నిజధర్మరీతిఁ దిరిగి

తే. గీ. రర్హతర సత్పదార్థంబు లర్పితములు
చేసి తచ్ఛేషమున నుల్లసిల్ల దేహ
ధారణమొనర్చుకొని రమాధవ చరిత్ర
సంత తాహ్లాదరసమున సంచరించి. 66

శా. ఉన్నా రారికిఁగల్గెఁబుత్రుఁడు గుణాఢ్యుం డుత్తమాచార సం
పన్నుండాఢ్యుఁడు సాధు సేవకుఁడదంభ స్వాంతుఁడక్రాంతుఁడు
త్పన్నజ్ఞానవివేకశాలి హరిసద్భక్తిప్రవీణుండు వి
చ్ఛిన్నాహంకృతి దోషవర్జితుఁడు లక్ష్మీనాథ సమ్యక్కృపన్. 67

ఆ.వె. అతని విష్ణుచిత్తుఁడనిరి సుధీవ్రత
నేత లంచితోపనీతుఁడగుచు
వేదములును శ్రుతులు వేదాంగములు వేగ
నభ్యసించె జగము లౌననంగ. 68

వ. అధ్యాత్మశాస్త్రంబు సర్వవేదియగు సన్మార్గదేశికుని వలన నెఱింగి సర్వార్థసాధనంబయిన యష్టాక్షరమంత్రంబు గాంచి విద్యలెఱింగిన తల్లిదండ్రులు వైవాహికవిధికి నుపక్రమింప విష్ణుచిత్తుం డిట్లనియె. 69

29. వైకుంఠ.

క. పరిణయమొల్లఁ బుత్రాం
తరవైభవమొల్ల బంధుతతియేనొల్లఁ
హరిపాదాంబుజ సేవా
పరతంత్రత యొకటి నాకుఁబ్రాప్యం బరయఁ. 70

వ. అని విష్ణుచిత్తుండు వైరాగ్యంబువహించి సకలముని శరణ్యంబగు నైమి
శారణ్యంబునకేఁగి యోగాసనాసీనుండై ప్రాణాయామాదిసంయుతుండై
యున్న నొకనాఁడు వేఁటవచ్చి విక్రమాభరణుండను రాజు విష్ణుచిత్తునిం
జూచి సకలగుణాభిరామయగు కన్యకనర్పించెదనని తలంచి, 71

ఉ. భూసురబాలుఁడెవ్వఁడొ యపూర్వగుణోన్నతుఁడిద్ధ దివ్యమౌం
జీ సకలాపధన్యుఁడు విశిష్టవరేణ్యుఁడు బ్రహ్మచారి యో
గాసనశాలి కృష్ణవిమలాజినధారి మదీయకన్యకీ
భాసురమూర్తి భర్తయగు భాగ్యము లెన్నటికిఁ లభించునో? 72

వ. అని చేరవచ్చి యతనింజూచి యిట్లనియె. 73

సీ. మందహాసాన్విత మధురభాషిణి విశా
లాక్షి పూర్ణేందునిభాస్య పక్వ
బింబాధర సుకేశి పేశలభ్రూనాస
కంబుకంఠి లతాంగి కంజహస్త
గుణవతి కించిదంకురిత వయోధర్మ
నిమ్ననాభి సుమధ్యనిరతిశయ ని
తంబ రంభాస్తంభ ధన్యోరుయుగళ, *సు
హల్లక పాదమోహన కపోల

తే.గీ. మత్తుమారిక మనువంశమౌళినైన
రాజ నేనిత్తు నా యర్ధరాజ్యమిత్తు
నేలు మేలగు నీకు నూహింప సుతుఁడ
ననఘ! శంకింపవలదు విఖ్యాత చరిత! 74

వ. అని బోధించిన నగుమొగముతో బ్రహ్మచారి రాజునకిట్లనియె. 75

---

* లహల్లకపాద

సీ. సగరపుత్రులు రాజ్యసంపన్మదంబునఁ
గపిలరోషాగ్నిశిఖా ప్రదగ్ధు
లగుట మాంధాత గర్వాంధుఁడై లవణదై
త్యోగ్రశూలాహతి నుక్కడంగి
యుండుట పౌలస్త్యునోడిసి *బంధించిన
కార్తవీర్యుని భుజాగ్రములు పరశు
ధారఁద్రుంగుట ధరాధ్యక్షులు ముయ్యేఁడు
మాఱులు సమయుట మహితకీర్తి

తే. గీ. బలి రసాతలమునఁ గ్రిందుపడుట నహుషుఁ
డజగరంబయి నాకలోకాధిపత్య
ముడిగి వచ్చుట తెలియవే యో నృపాల!
యెల్ల నీకన్య రాజ్యంబునొల్ల నింక. 76

చ. వలసిన వానికిమ్ము నృపవల్లభ నీ సుత నంగరేఖదాఁ
గలిగిననేమి ? నాకు నదిగానఁ గనయ్యెఁడు చర్మభస్త్రికా
తులఁ బలలాంత్రశల్యములతో నతిహేయదురుగ్రవాసనా
కలితత రోఁతయయ్యెడు నికంబలుమాఱు వచింపనేఁటికిన్. 77

వ. నృపా! నేను వైకుంఠసామ్రాజ్యంబుపై మనంబుగల్గి వర్తింపుచున్న వాఁడ
ననిన రాజు సంతోషంబునొంది చనియె, నంత బ్రహ్మచారి యుగ్ర
తపంబు సేయ నింద్రుండు కలంగి శతాప్సరోజనంబుల నియోగించిన. 78

సీ. తళతళ మెఱసె మందారమాలిక రంభ
యొయ్యారమునఁ(జూచె) నూర్వశి కుచ
కలశముల్ మెఱయించెఁ గల్యాణకౌముది
కన్నులల్లార్చి [29]యగ్రమునఁబొలిచె
నుద్యాన మాలిని యుప్పొంగె మేనక
యమృతంబు వెదచల్లి యాననమునఁ
బయ్యెద నెరిజాఱఁ బరతెంచె వీణావి
నోదిని హరిణి యామోద భరము

---

* ఖండించిన. 29. యుగ్రముగ.

తే. గీ. గ్రమ్మపువ్వుల నెఱికొప్పుఁ గప్పుకొనుచు
మురిపె మందె వసంతవల్లరి వినోద
మందిసోలసెఁ దిలోత్తమ యతివిలాస
లాలసశ్రీలఁ దనయందు మేలుచూపె. 79

వ. ఇట్లు పదుగురు మొనయై నిలుచునంత. 80

క. వనితాసేనలతోనా
ననవిల్తుఁడు దండు వెడలె నాతియుఁదానుఁ
దన మిత్రుఁడు మునిమానస
వనజంబులు *కలఁకవొంద వైభవనిధియై. 81

వ. అంత. 82

తే. గీ. సత్త్వనిష్ఠ మహాసాధుజన శరణ్య
నైమిశారణ్యమునకు మన్మథుఁడు పూర్ణ
గర్వమున నేఁగి చొచ్చె నక్కడ ననేక
సంభ్రమంబులు చేసె వసంతుఁడపుడు. 83

క. చిగిరించి పూచి కాచెఁ
నగములు కోవెలలు మ్రోసె నానా[30]వనులఁ
సొగసై ఝుంకారంబులఁ
బొగరెక్కి చరించె మధుప పుంజంబంతఁ. 84

ఆ.వె. ఏకవీరుఁడై సమిద్ధశౌర్యమున మా
కందకుసుమశరము కంతుఁ డిక్షు
కార్ముకమునఁదాల్చెఁ గాననాంతరముల
*గుఱులువైచి యార్చుకొనుచుఁ దిరిగె. 85

చ. వలపులు గ్రుమ్మరించు నిడువాలిక చూపులఁజూచి పయ్యెదల్
బెళకఁగ గుబ్బచన్ను లొకబిత్తరి లాగునఁజూపి గానముల్
పలుకులు నృత్యవాద్యములు భవ్యవిలాస కళాకలాపముల్
దొలఁకఁగ బ్రహ్మచారికడఁదూకొని నిల్చిరి చుట్టునంగనల్. 86

---

* గలుగవో వైభవనిధియై.

30. వలఇన్.

* గురులు వైచి.

తే. గీ. ఏమి చెప్పంగ మదిలోన నించుకేని
చంచలతలేక యాబ్రహ్మచారి యుండెఁ
గేశవార్పిత మతులఁ జొక్కింపఁ గలవె
మర్మభేదక కందర్పమాయలెల్ల ? 87

తే. గీ. శాంతహృదయుండు తద్బ్రహ్మచారి తన్ను
నిట్లు వంచింపఁజూచునయ్యింద్రముఖుల
విఘ్నకాపేయమున బహువిధములైన
కర్మములు సేసితిరి మీరు కలుషవృత్తి. 88

క. కాన కపులగుచు ముందఱఁ
గానక పులకండమట్లు కమ్మని మాటల్
మాని ఘన కిలకిలార్భటి
తో నిగుడుచుఁ గ్రోఁతులగుచుఁ దూలుండనుచున్. 89

క. శాపం బిచ్చినఁ బుచ్ఛక
లాపంబులతోడఁ గిలకిల ధ్వానముతో
సౌపర్వ కామినులు ల
జ్జాపరలై యేఁగి రపుడు చనియె మరుండున్. 90

క. అమరావతి నుండక యా
యమరాంగన లెల్ల నందనారామములో
భ్రమమందగ నిజతనూ వి
భ్రమ*మందఁగనపు డపత్రపం గ్రుంగి రొగిన్. 91

క. అంత వసంతుం డీవృ
త్తాంతం బంతయును దద్బలాంతకునకు న
త్యంతార్భటి నెఱిఁగించిన
సంతాపము నొంది యతఁడు చనియచ్చోటన్. 92

సీ. బ్రాహ్మణాకృతి నిల్చి బ్రహ్మచారిం గని
యర్హమే నీకు మహాత్మ ! రోష
మప్సరాంగనలు కీశాకారములు దాల్చి
నందున ఫలమేమి యయ్యెనీకు ?

---

* మందత.

నన దైవగతి నవశాత్ముండనై యిట్లు
సేసితినన సురశేఖరుండు
నిజరూపము వహించి నిలిచి మదర్ధాన
నంబు నీకిచ్చెద నాకలోక

తే. గీ. సతుల వైరూప్య మణఁగించు శాంతినొంది
యనఁ బురందర స్వర్గసౌఖ్యంబు సకల
దుఃఖదము పుణ్య మడఁగ నధోగతింబ
డంగఁ ద్రోయుట నరకఖండంబు గాదె ? 93

వ. అని బ్రహ్మచారి మఱియు నిట్లనియె. 94

తే. గీ. విశ్వరూపునిఁ జంపి యీ విశ్వమెఱుఁగ
బ్రహ్మహత్యా మహాపాప[31]బహుళ దుఃఖ
వార్ధి మునిఁగితి స్వారాజ్య వైభవంబు
గణన సేయంగ నీకు సౌఖ్యంబె యింద్ర ! 95

సీ. ఆది దూర్వాస ప్రసాద మాల్యావమా
లాతి బాధల లజ్జ నందవైతి
వమరావతీపురం బ స్యేంద్రముగ ననిం
ద్రముగాఁగ నెఱుఁగవే ధైర్యశక్తి
గలుగు కౌశికు ధాటిఁగానవే బంధించి
యార్చిన మేఘనాధాంబ కోగ్ర
ఘాత మెఱుంగవే గౌతముం డొనరించు
తదవస్థ లెఱుఁగవే దర్పమంది

తే. గీ. అన్నియును [32]మఱచితె జగంబెన్న నీదు
పట్టణం బొల్ల నింద్రత్వ పదము నొల్ల
నిత్య దుఃఖ కరంబులు నిర్జరేంద్ర !
యింటిత్రోవనె మఱలునేఁ డిన్నియేల ? 96

వ. అనిన సురస్త్రీ శాపమోచనాదికాలం బెన్నఁడయ్యెడునని ప్రార్థించిన దినత్రయంబు నన్ను నృత్యగీతాదులచే బాధనొందించుటం జేసి వర్షత్రయంబు వానరత్వంబు ననుభవింపఁగలరనిన నింద్రుండు

31. బహుల. 32. మరచితివె గణభంగము.

నిజనివాసంబున కేఁగ నమ్మహాత్ముండు విష్ణుసేవాపరాయణుండై యుండ వృషధ్వజుండు వచ్చి యిట్లనియె. 97

సీ. బ్రాహ్మణోత్తమ! నీవు బ్రహ్మచారివి వ్రతం
బేటికి? నీకిష్టమెద్ది యడుగు
మైహికాముష్మి కాత్మైశ్వర్యవై భవం
బొక్కటి వేఁడు మేనొనర నిత్తు
మత్పదంబున నుండ మది నీకుఁ బొడమిన
నదియు నిచ్చెద వేఁడు మనఘ చరిత!
యన భవబంధ సంయుతమైన పదవి యె
ద్దియు నొల్ల నావిష్ణుదేవు పదము

తే. గీ. గాని తత్ప్రాప్తి యేరికిఁగల్లుననిన,
హరియె మోక్షప్రదుండు నే నబ్జుండు
కర్తలముగాము మోక్షభాగముల కెల్ల
నరయ నాస్తంబధాత్ర పర్యంతమునకు. 98

వ. ఆ భగవంతుండు నాకును విధాతకును రక్షకుండు. పూర్వంబున నాకు బ్రహ్మ శాపవిమోచనంబు గావించె. వృకాసుర తపస్ఫూర్తికి మెచ్చి వాఁడెవ్వని శిరంబునఁదన హస్తంబుమోపిన (వాఁడు) భస్మంబు గావల యునని వరంబువేఁడిన నిచ్చితి. మచ్ఛిరంబున నునుపంజూచిన నేఁ బలాయనంబు నొంద (హరి) బ్రాహ్మణరూపంబున వచ్చి మాయవన్ని తత్కరంబు తచ్ఛిరంబున నుండంజేసి వాని హరించి నన్ను నిర్వహించె నెన్నియని తెల్పుదు నా విష్ణుండె నీకుపాస్యుండని బోధించి నిజ నివాసంబునకుం జనియె నంత. 99

తే. గీ. అబ్జజుండును జనుదెంచి యట్లపలికి
తన పదంబొసఁగ నాత్మలోఁ దలఁచునంత
నొల్లనేఁ బునరావృత్తి నొందు [33]వార
లో మహాత్మక! నీ పురి నున్నవారు. 100

వ. కావున నా పునరావృత్తి రహితపదంబు గోరుచున్నవాఁడ నని చతుర్ముఖుని ననిచి యనన్యమనస్కుండై యున్న సమయంబున సన్మార్గ దేశికుండను నిజగురుండు వచ్చిన నతండు మ్రొక్కిన నంత నతని నిష్టకుం బ్రమోదించి నారాయణాచలంబున వైకుంఠవర్ధన క్షేత్రంబున

33. వారిలో

నీ యభీష్టంబు సిద్ధించునని చనిన నా క్షేత్రంబు చేరి నారాయణ హ్రదాంతరంబున నివాసంబు చేసికొని తపంబు సేయుచుండెనంత. 101

శా. శ్వేతద్వీపనివాస మాధవ సమాసీనుల్ మునుల్ లోకవి
ఖ్యాతాయత్తుని విష్ణుచిత్తుని సమగ్రజ్ఞానదృష్టిన్ మనః
ప్రీతింగాంచి ప్రశంస సేయుచు వితర్కింపంగ హర్షించి స
ర్వాతిక్రాంత గుణాభిరాముఁడగు ప్రహ్లాదుఁ డీక్షింపఁగన్. 102

క. నారాయణగిరికి దయా
పారాయణుఁడగుచు వచ్చి బ్రహ్మజ్ఞానా
కారంబై మించిన యా
నారాయణభక్తియోగ నవ్యగుణాఢ్యున్ 103

క. నా సాగ్రగన్యస్తేక్షణు
నా సాత్త్వికచక్రవర్తి ననఘాత్ముని నా
నా సాధు వందనీయు న
నా సాధ్యుని నిత్యుఁగాంచి యపుడిట్లనియెన్ 104

తే. గీ. విష్ణుచిత్తా! నినుంజూడ వేడ్కఁగలిగి
యరుగుదెంచితిఁ బ్రహ్లాదుఁడంద్రు నన్ను
నీ మహత్వంబు విని విని నీరజాక్ష
భక్తినిష్ఠాపరత్వ మేర్పడఁగఁ గంటి. 105

వ. అనిన లేచి వందనంబొనర్చి యుపచారంబులు చేసి యన్యోన్య సల్లాపంబుల [34]నట్లన వర్తించి కొన్నినాళ్లచట నుండి. 106

క. మంగళకరమగు నొక యు
త్తుంగ నగంబెదుటఁగాంచి దోషాచర వం
శాంగారంబగు మర్త్యకు
రంగేంద్రుఁ బ్రతిష్ఠచేసెఁ బ్రహ్లాదుఁడొగిన్. 107

క. అది సింహభూధరం బని
త్రిదశులు పల్కుదురు నృహరి శ్రీకరమోక్ష
ప్రదుఁడీక్షించిన నొసఁగున్
సదయతఁ బ్రహ్లాదతుల్య సత్పుత్రమణిన్. 108

---

34. నిట్లని

క. తక్కినవారికి నగ్గిరి
యెక్కినవారికి నభీష్టమిచ్చుం జుట్టుం
ద్రొక్కినవారికిఁ గన్గొని
మ్రొక్కినవారికిని లేదె మోక్షంబరయన్. 109

వ. అప్పుడు విష్ణుచిత్తుభక్తిచే గరుడ వాహనుండుల్లసిల్లి
ప్రత్యక్షంబయిన. 110

సీ. హార కిరీటకేయూర శోభితుఁబద్మ
పత్రనిభేక్షణు భానుకోటి
భానిధిఁ జంద్రబింబ ప్రతిభానను
ననుపమ మందస్మితాభిరాము
తత నవేందీవరదళ శోభనాకారు
నంబు జోదర దశాభాధరోష్ఠు
నుచిత పీతాంబరు నుజ్జ్వల శ్రీవత్స
వక్షఃప్రదేశుఁ బావన చరిత్రు

తే. గీ. హల్లకచ్ఛాయ చరణుఁ జక్రాదినిరుప
మాయుధాంకితు శేషాశనాది వినుతు
గరుడవాహను లక్ష్మీప్రకాశమానుఁ
గాంచె నా బ్రహ్మచారి యుత్కంఠ మెఱసి. 111

వ. కాంచి మ్రొక్కి నుతించి బ్రహ్మాదిలోకంబులు నిరసించిన యమ్మహాను
భావుండు సద్యోముక్తుండయ్యెనని చెప్పిన, ఋషులు విని నారదున
కిట్లనిరి. 112

ఆ. వె. విష్ణుచిత్తు మహిమవిని మహాత్మా ! యేము
విష్ణుచిత్తులమయి[35]వెలసితిమి స
మస్తమును లభించె ననఘ నీ కరుణచే
యడుగ వలసె నొకటి యట్లనైన. 113

మ. అనఘా ! మున్ను వసిష్ఠ నందను లగమ్యంబైన శాపంబుఁగ్ర
న్ననఁ బ్రాపించిన దీనులైరనుచు నా నారాయణస్వామి వ
ల్కెనవార్యం బగునట్టి శాప మెటు లీక్షేత్రంబునం బాసెనో
ముని[36]కంఠీరవ ! తెల్పవే యనిన నామోదంబు రెట్టింపఁగన్. 114

---

35. మై. గణము ? 36. కంఠీవర ?

వ. నారదుం డిట్లనియె. 115

సీ. ఘనులు వసిష్ఠనందనులు విశ్వామిత్ర
శాపసంగ్రస్తులై సంచరించి
బ్రహ్మరాక్షసవృత్తిఁ బరగఁ జతుర్వేది
[37]యెచ్చోట ముక్తుఁడై యేఁగె వారు
నచటికినేఁగి యత్యంత దుస్తర శాప
మణఁగి దివ్యాకారులైన యది ప
లాశతీర్థము పుణ్యరాశి యాతీర్థంబు
మహిమ నుతింప బ్రహ్మకుఁదరంబె ?

తే.గీ. యమ్మహాపుణ్య తీర్థంబునందు మునిఁగి
యఘములు దొలంగి పరిశుద్ధు లగుచు వైష్ణ
వాంఘ్రిరేణువు లెగయుతీర్థాంతరముల
కరిగి రధికారులై విశిష్టాత్మభవులు. 116

వ. విష్ణుభక్తాంఘ్రి పాంసువులచే వారలపాంసులైరి. విష్ణుభక్తాంఘ్రి రేణువులచే నణువేని పర్వతంబగు. తదవమానంబునం బర్వతంబేని యణువగుం గావునఁ గొన్ని దినంబులు దత్పలాశ తీరంబున నుండి తీర్థాంతరంబుల నిరువదియొక్క దినంబు నిలిచి పాపంబులం బాసి కల్యాణతీరంబునకేఁగి తపో విద్యాశీలవయోవిశేషంబులం బెద్దయగు రోమశ మహామునింగాంచి పాదంబులంబడి నిజవృత్తాంతం బంతయు విన్నవించిన. 117

సీ. పరమ భాగవతు లేవురుఁగల రీమహా
క్షేత్రంబునందుఁ బ్రసిద్ధికెక్కి
సాత్వికులంబరీష వికుక్షి కుక్షి రు
క్మాంగద పుండరీకాఖ్యులమ్మ
హాత్ములచేఁ బూజ్యమై యొప్పెఁ దమతమ
కాలంబునందు నీఘనులు వచ్చి
యజ్ఞాన వారకంబగు తత్పలాశభూ
రుహము దక్షిణమున మహిమ వెలసి

37. యచ్చోట ముక్తులై యేఁగె. యతిభంగము.

తే. గీ. ప్రబలతరమైన కుహనా వరాహ రూప
మాత్మ నిడుకొని యర్చించి యతని వలనఁ
బూర్వ విజ్ఞాన మంది *యపూర్వ శక్తి
శుద్ధ సంకల్పులగుచుఁ బ్రసిద్ధిఁ గనిరి. 118

వ. ఇచ్చట నవ్వరాహమూర్తి భూకాంతకు శ్లోకద్వయంబుపదేశించె. ఎప్పుడేనియు భక్తియోగంబున భజియించిన వారికి నావరాహ[38]మూర్తి విజ్ఞానంబుదెలుపు, నంబరీషుండు మున్నుజ్ఞానుల నుత్తమోత్తముండు. భగవత్పాదంబులయందె యాత్యంతిక నిష్ఠనిలిపె. భగవత్పరులెవ్వని వాక్యంబేని యప్పుడ పఠింపుదురు. మున్నంబరీషుండు భగవన్నిష్ఠనున్న విఘ్నంబుసేయ నింద్రుండరుదెంచి వజ్రంబువైచినఁ బురందరా! ఏటికి వైచెదవు. గోవిందుని విడిచి యేనన్యుని భజింప. విష్ణుబలంబున నున్నవాఁడనని భక్తిపరాధీనమానసుండై యారాజు స్వేచ్ఛావరాహరూప సేవఁగావించె. భగవంతుండతనికి సర్వార్థంబులు ప్రసాదించి శరణాగత ధర్మంబుఁ దత్వంబువలన నెఱింగించి యిట్లనియె. 119

## న్యాస మాహాత్మ్యము

సీ. ఒనర విద్యలకెల్ల నుత్తమోత్తమము శ్రీ
వేదవేదాంతముల్ వివిధగతుల
విఖ్యాతమగు న్యాసవిద్య పూజ్యంబని
చాటి లోకములు ప్రశంస సేయ
శరణాగతియును న్యాసము సంవదనము న్యా
సంబు న్యాసంబుత్యాగంబు ననఁగ
సకల పురాణ ప్రశస్తంబు న్యాసంబు
పాంచరాత్రములందుఁ బ్రబలె న్యాస

తే. గీ. మఖిల ధర్మంబులను న్యాసమభిమతంబు
సర్వనియమంబులందు న్యాసంబు ఘనము
సర్వయత్నంబులందు న్యాసంబు శుభము
న్యాసమునకంటెఁగలదె యన్యతరమొకటి. 120

సీ. తపముశ్రేష్ఠంబు సత్యంబునకంటెను
తపమునకంటెను దమముయోగ్య
మాదమంబునకంటె నర్హంబు శమము శ
మంబునకంటె దానంబు ముఖ్య

* యాపూర్వశక్తి. 38. మూర్తికి.

మా దానమునకంటె నధికంబు ధర్మ మా
ధర్మరహస్యకృత్యమునకంటెఁ
బ్రవ్రజనము మహాభవ్యంబు తత్ప్రవ్ర
జనమునకంటె శస్తంబు వహ్ని

తే. గీ. వహ్నికంటెను యజ్ఞంబు వరతరంబు
మానసము యజ్ఞమునకంటె మహిత తరము
ఘనము న్యాసంబు మానసగరిమ కంటెఁ
దద్విశేషంబు లెంచంగఁ దరముగావు. 121

వ. నన్ను శరణువొంది యే నరాధిపులు వర్తింతురు వారినే శరణంబునొంది హృదయంబులో నుండుదు. మదర్పిత పరులెవ్వరు వారు నిర్భరులు. వారి నిచ్చటనేని యచ్చటనేని నిర్వహింతు. సర్వదేవతలకు నే నుత్తముండనైనట్లు సర్వ కాంతలలో నిందిర యుత్తమయైనయట్లు సర్వధర్మంబులకు న్యాసంబె ముఖ్యంబు. కర్మనిష్ఠవానికి జ్ఞాననిష్ఠ దగ దాత్మజ్ఞాననిష్ఠ శరణాగతనిష్ఠయే [39]యంశమునుఁ బోలదు. ప్రధానమగుటను మహత్తరమగుట నకించన్యసారంబున కంటె విశ్వాసంబునకంటె శరణాగతనిష్ఠయందు నా చిత్తంబు ప్రవర్తింపుచున్న యది. శరణంబని నన్నుఁగొల్చిన నరుల మనోవీథినిల్తు నిందునకు సందేహంబు లేదు. 122

క. నాయందు సకలభారము
లేయెడ నిల్పునెడ వారి నెఱిఁగి సతతముం
బాయక నే రక్షింతును
నాయత మతినిత్తు నైహికాముష్మికముల్. 123

వ. అనియిట్లు భగవంతుండు పల్క నంబరీషుండు శరణాగతమాహాత్మ్యం బిట్లని వర్ణించె. నా నలువురి వృత్తాంబులనేకంబులు గలవు. విస్తరింప నేర సంసార సంతాపాది ప్రశాంతికి [40]నిటననేకులు నివాసంబు చేసికొనిరి. కాన మీరు నిందుండి పవిత్రులు [41]గండని రోమశుండాన తిచ్చిన వసిష్ఠపుత్రులచ్చటనుండి పరిశుద్ధులై సితారణ్యసముద్భూత తులసీదళ సంచయంబున నారాయణునారాధించి పరమపదంబందిరి. ఇంకంజేయు కార్యంబు వినుండెఱింగించెద. కలియుగంబున

39. యంశమును నున్న. 40. నిట్ల. 41. గమ్మని.

మహోగ్రతరులు పాషండులు [42]ముగురు గలరు. తత్త్వపాషండులు, వృత్తిపాషండులును, దత్త్వవృత్తిపాషండులునన, తత్త్వపాషండులు కర్మంబులు విడిచినవారు. వృత్తిపాషండులు బ్రహ్మంబు విడిచినవారు. కర్మబ్రహ్మంబులు విడిచినవారు తత్త్వవృత్తిపాషండులు. వారికి కర్మబ్రహ్మంబులు లేవు. కాకున్న విపరీతంబగుంగాన వికల్పింపం బడుటం జేసి యుపాత్తజ్ఞానమాత్రంబున వైదికులవలెంబోఁతురుగాని యవైదికులు దారు కొందరు మధుసూదను నన్యదేవతా సమానునింగాఁ దలంచి మీమాంసా కబంధవరులు చెప్పుచుంద్రు. రాహుకల్పులగు వారు శిరోభాగంబు సంగ్రహింపుదురు. కొందరు యజ్వాగ్రణులు యజ్ఞంబుల నన్యదంభమూర్తులై దండకమండలంబులచేతనే తమ యోగ్యత మెఱయింతురు. భగవంతుండంతర్యామి వాసుదేవుండారాధనీయ పదాబ్జుండు వైదిక కర్మంబులొనరింప ఫలంబు గలుగంజేయునని శ్రుతియునుం బలుకు నిట్లగుటకు సకలధర్మంబులకుఁ జక్రధరుండు కర్తయై యుండుట యెఱుంగక దుష్క్రియలు సేయు మదాంధులైన విమూఢులైన దుర్దేశికులు సాధనాంతరములు గలుగ బోధించుకతనం బ్రతిభవిడిచి. 124

తే. గీ అహహ నగరాదులందు సర్వాన్నభోక్త
లగుచు సన్న్యాసులు చరింతు రందు నందు
మ్లేచ్ఛదుర్వృత్తి యాత్మలో మెఱసి బాహ్య
కృత దురాచార సంచార కీర్తిఁగాంచు. 125

తే. గీ. రాఘవుని యాజ్ఞ సౌమిత్రి రణమునందు
నింద్రజిత్తునిఁదునుమ నా యింద్రజిత్తుఁ
డతి సహాయంబు తానైయె యవనియందుఁ
గలిపురుషుఁ బాయక చరించుఁ గలుషవృత్తి. 126

క. సమిదాధాన విసర్జిత
తమవృత్తిం బ్రహ్మచారి తతి దిరుగుఁ దిగం
తములందుఁ గేవల తురం
గమ నిత్యబ్రహ్మచర్యకలన చెలంగన్. 127

క. ద్విజవరులందఱును మహీ
భుజుని నిజాజ్ఞం జరించి భూరిరణోర్విన్
భుజశక్తిం బాటింతురు
సుజనేతరులగుచుఁ గర్మశూన్యత్వమునన్. 128

42. మగురు.

క. కలిమియ యపరాధంబగుఁ
గలియుగమున నట్లుగాన ఘనులగు ధన వం
తులపై రాజులు పాపం
బులు దలఁచి ధనంబుగొంద్రు భూవలయమునన్. 129

క. ఎడయక నిజేష్టదేవత
యెడ జనకుని *యెడల తల్లియెడ గురునియెడన్
బొడమదుమోహం బింతుల
యెడఁగల్గిన యట్లుగా మహీవలయమునన్. 130

## కలియుగ ధర్మము

వ. [43]మఱియుఁ గలియుగంబున భరతాది విద్యలే కాని వేదశాస్త్ర పురాణాధ్యాత్మ విద్యలు సంభవింపవు. నవయౌవన దుర్దాంతమానసలై యువతులు ముదిసిన యత్తమామలం గైకొనరు. గుణవతులైనభార్యల విడిచి పరదారానురాగంబునం బతులు పతితులగుదురు. ధర్మార్థంబు లేశంబేని పాత్రులకు నొసంగరు. ప్రశంసార్థంబుగాని నరకోత్తారణంబైన హరిస్మరణంబు సేయరు. నరకప్రదదారస్మరణంబుగాని శూద్రద్వారపాలక వేత్రహస్త నివారితులై బాహ్యస్థలంబున నుంద్రు బ్రాహ్మణులేమి చెప్ప? రాజసేవోన్మత్తులైనవారు విష్ణుభక్తిపరాయణులు పల్కిన పల్కులెల్ల నాక్షేపింతురు. ద్విజాధములు నారాయణువర్జించి దేవతాంతర సేవకులై యుంద్రు. దుష్టద్రవ్యంబుచేత దుర్గారాధన క్రియలు హరిబాహ్యులగు నృపద్విజులు ప్రాణిహింసచేఁ గావింపుదురు. శ్మశాన దేవతార్చనంబు శ్రేయస్కరంబని యొనరింపుదురు. హరిపదంబెఱుంగక యహోరాత్రంబు స్వోదరపూరకులై నరులు వర్తింపుదురు. సమస్త జగన్నాయకుండైన నారాయణుండు గలుగఁగవు లొక్కొక్క నరాధముని వర్ణింపుదురు. స్త్రీలకుఁ బాపమతియు నతిక్లేశంబునగు. ధనహీనులైన భర్తల వర్జింపుదురు. కులకాంతలు ప్రమదలై భర్తలు గలిగియు నన్యపురుషస్పృహతో నుందురు. పర్జన్యుండల్ప వర్షంబును సస్యాల్ప ఫలంబునుంగాఁ గురియు. ఇట్లు నా రమాధీశ్వరుండు తనలీలచేత యాదవగిరినుండి తద్వేత్రహస్తులు ద్వాపరాంతంబునం గలి పురుషుండు వచ్చిన వారింపుదురు. విష్ణుపరాయణులైన వారు యదుగిరీశ్వరుని సేవింపఁ గలరని వర్ణించి మఱియు నిట్లనియె. 131

---

* నతని.

43. మఱియు వేదశాస్త్ర పురాణాధ్యాత్మ్య విద్యలు కలియుగంబున భరతాది విద్యలుగాని.

మ. స్మరియించం దురితంబులెల్ల నణఁగుఁ సాక్షాదనంతుండు త
ద్గిరి సేవించును శేషరూపమునఁ దద్దేవుం గృతంబుర్విపైఁ
బరగం ద్రేతను లక్ష్మణుండయి ప్రలంబధ్వంసి సన్మూర్తి ద్వా
పరవేళంగలివేళయుఁ గొలుచు శుంభల్లీల యోగీంద్రుఁడై. 132

వ. అట్లుగాన నారాయణుంజూచి మునీంద్రులారా! మీరు శేషాసనాద్యైశ్వ
ర్యంబు వేగంబునం బొందుండని నారదుండానతియిచ్చినఁ బరమ
సంతోషంబునొంది నారాయణగిరికేఁగ మదింగోరి పుణ్యవతియగు నా
భాగీరథి త్రివిక్రమ పాదాంభోజ మధురసంబగుదాని బహుకల్లోల
విస్తార బంధులయగుదానిం జూచి నావికోపనీతంబైన నావచేఁ
దరియించునప్పు డొక్క మహావాతంబు పడమటనుండి విసరిన నావికులు
గడపసమర్థులుగాక విభ్రాంతులైయున్న మునులు వ్యాసునింజూచి యిది
తరియింపంజేయుమనిన నమ్మహాత్ముండిది భగవదాజ్ఞయని నావికుల
మఱియుం బ్రేరించిన వారలు మఱియు నశక్తుల మనిన నాద్వైపాయనుం
డీనావ భగవంతుండే నడపు. నదీతరణ సాధనమ్ము లన్నియు
గంగలోనే యుండనిమ్మనిన వ్యాస వాక్య ప్రమాణంబున నన్నియు
వైచి ప్రపత్తి వట్టికొనియున్న నానావ తనయంతనె కూలంబుచేరె.
మునీంద్రులు విస్మయంబంది వ్యాస మాహాత్మ్యంబు గొనియాడిరంత
వ్యాసుండు వారల కిట్లనియె. 133

సీ. మనలఁ బరీక్షింప మధుసూదనుం డిట్లు
గావించె నాశ్రిత కల్పశాఖి
కడు నకించన పురస్కారంబు సేయ నా
కాంక్షించి సేయు నధ్యాత్మశాస్త్ర
సారంబులైనట్టి సకల సద్గుణ సంప
దలకు విశ్వాసంబె తలఁప చక్ర
పాణికిఁ బ్రీతి సంపత్తి కారణము సం
సారపారావారతారణైక

తే.గీ. కారణంబైన ఘనుఁడాపగా ప్రవాహ
తారణంబొనరించుటెంత? యతఁడేమి
సేయశక్తుండుగాఁడు చర్చించిచూడ
నిన్ని వర్ణింపనేల మునీంద్రులార! 134

క. అత్తఱి నత్తరిలో దిగి
యుత్తమగురు జహ్నునందనోదకమున నా
సత్తములు తీర్థమాడి మ
హత్తర కల్మములు దీర్చి రనురాగమునన్. 135

తే.గీ. సర్వమంత్రరహస్య ప్రశస్తుఁడైన
యాదినారాయణునిఁ దమయాత్మలోన
నిలుపుకొని శుద్ధచిత్తులై నిత్యకర్మ
మాచరించిరి వేడ్క నయ్యఖిల మునులు. 136

క. కొందఱు విధిచోదితులై
పొందిక నొనరిచిరి కరములు విష్ణ్వాజ్ఞా
కందళమునఁ గావించిరి
కొందఱు వైష్ణవులు తదనుకూలత మెఱయన్. 137

వ. అంత. 138

క. నలినోత్పల శోభితయై
తిలకించిన నర్మదానదీమణి నతి ని
ర్మలశక్తి గడచి తా ర
వ్వల గోదావరికి నేఁగి వరనియమమునన్. 139

వ. వర్తించునంత. 140

సీ. తత్తీరమున నన్నదాన పరాయణుం
డతిథి ప్రియుండను నతఁడు విష్ణు
భక్తి నిష్ఠాగుణ పారాయణుం డుంఛ
వృత్తియను నతండు వెలయుచుండ్రు
వారిలో నమ్మునివర్యులఁగని యతి
థి ప్రియుండా *తిథ్య దృష్టిపూని
పాటించి నిత్యంబు బ్రాహ్మణోత్తమ సహ
స్రమునకు నిడుదు భోజనము మీరు

* [illegible]

తే.గీ. మద్గృహమున *భుజింపుఁ డామ్నాయమూర్తు
లయిన మీరలటంచు నత్యంతనియతి
[43]నతఁడు ప్రార్థింప వానిపై నాదరంబు
వదలి యందఱు ననిరేకవాక్యమునను. 141

మ. హరిపారాయణవృత్తిలేని భవదీయాగార మధ్యంబునన్
ధరణీదేవ భుజింపనొల్లము సముద్యత్ప్రీతిమై దేవతాం
తర మంత్రాంతర సాధనాంతరము లాత్మంబాయు నవ్వైష్ణవాం
కురముల్ బాంధవులెంచమాకు నతియోగ్యుల్గారు సంకీర్ణకుల్. 142

క. కరవీరభుక్తి దేహ
స్ఫురణంబు హరించునట్లు పురుషోత్తమ సం
స్మరణంబులేని గృహముల
నరులు భుజింపంగ నాత్మనాశన మరయఁ 143

తే.గీ. మేలు దేహంబు విడుచుట మేలు వహ్ని
శిఖల మ్రగ్గుట శ్రీపతి సేవలేని
జడుని గేహమునందు భోజనము సేయ
మేలుగాదు జనంబులు మెచ్చరచట. 144

వ. అని యతిథిప్రియునింబలికి యుంఛవృత్తి గృహంబునకునేఁగ నంప
న్నుండనగు నాగృహంబువిడిచి యతిదీనుండగు నుంఛవృత్తి గృహంబు
నకు నేఁగి యేమి భుజించెదరోయని యతిథిప్రియుండు నవ్వె. నంత
నుంఛవృత్తి వారలంజూచి పరితోషంబునొందె. లబ్ధతుష్టయను పేరి
తత్పత్నియు నామునుల నవలోకించి చింతావ్యాకులయై కందమూల
ఫలాదికంబుల వలనన పరితృప్తిం బొందించెదనే[44]నకించన నని
[45]వితర్కించునంత. 145

తే.గీ. అప్పు డింద్రాది దివిజులకైనఁ గోరఁ
దగిన సంపద [46]గలిగె నత్యంత మహిమ
నీరజేక్షణ భక్తులు నియతులెందు
నుండ్రు సంపద లచ్చోట నుండు నిజము. 146

---

* భుజియింపుఁడా

43. ననుచుఁ। బా.

వ. ఆశ్రమోపగతంబైన సంపదంగాంచి యుంఛవృత్తి మునీంద్రులఁ దృప్తిఁ బొందించునంత వారు భుజించి సుఖాసీనులై యున్న లజ్జించి యతిథిప్రియుం డచటికి వచ్చి భయంబున వందనంబు చేసిన వానిం జూచి విశ్వామిత్రుం డిట్లనియె. 147

తే.గీ. ఉంఛవృత్తికి దారిద్ర్య మొసఁగనేమి
గలదు మందిరమున? నని గర్వ వృత్తి
నగితి మముఁజూచి పరమవైష్ణవుల యింటఁ
గమలగేహ వసించుట కానవైతి. 148

క. శ్రీనారాయణుఁడుండఁగ
దీనాత్ముని వేఁడుకొనుట [47]దీపించినక
ల్పానోకహ ముండఁగ మది
యానక శాల్మలినిఁ దలఁచి [48]యాచించుటగున్. 149

క. నారాయణుఁడుండ దురా
చారులఁ గొల్చుట సుధాబ్ధిసంగతి మదిలోఁ
గోరక లవణాకరసీ
మారతి విహరించుటలు క్రమంబునఁదెలియన్. 150

ఆ.వె. మాధవాంఘ్రియుగము మఱచి వేఱొక్కని
రక్షకుండటంచు భ్రాంతిపడుట
స్వర్ణదీతరంగజలమగ్రమున నుండ
మరుమరీచికాంబు మగ్నులగుట. 151

క. హరిఁదక్క నితరు నొక్కరు
శరణంబని తలఁచుటెల్ల సారతరంబై
తరిగలుగ భిన్నకుంభాం
తరమున నదిదాఁట నాత్మఁదలఁచుటగాదే! 152

క. కమలావిభుండు దొరకఁగ
నమరాధము నొకనిఁజేరి ప్రార్థించుట యు
త్తమ చింతామణి [49]దొరకఁగ
నమితములగు చిరిపిఱాల కాశించుటగున్. 153

---

47. దీపించినఁగ. 48. యాశించుటగున్.

49. దొరకిన.

ఆ.వె. మధువిరోధి గలుగ మానవునల్పుని
నడుగఁజూచుటెల్ల నవనియందు
హాలికుండు వార్షికాభ్రంబు మఱచి నీ
హారవారిధార లడుగు నట్లు. 154

ఆ.వె. మహిమతోఁ ద్రివిక్రమస్వామి దీపించఁ
దగునె యన్యదేవతా భజనము
కామగవి జగత్ప్రకాశమై కనుపట్టఁ
బొదుగుగల వరాహిఁబిదికి నట్లు. 155

తే.గీ. హరికి నవమాన మొనరించి యన్యునొకని
దేవతయటంచు గొలుచుట దీపముండ
నంధతమసంబు భేదించు నందునకును
మించు ఖద్యోతకాంతి గావించునట్లు. 156

తే. గీ. వాసుదేవుండు గలుగ దేవతల వెంట
భ్రాంతిఁ దిరుగుట శర్కరాపానకంబుఁ
జవి గొనక యూసరక్షేత్ర జలకణములు
ప్రచురమైయుండ జిహ్వపై రుచులుగొంట. 157

తే. గీ. పద్మనాభ సమాశ్రయపరుఁడు గాక
యన్యదేవతఁ బలుమాఱు నాశ్రయింపఁ
దలఁచియుండుట బర్బూరతరువు నీడ
నంచరించుట చందనచ్ఛాయఁబాసి. 158

ఆ.వె. అంబుజాక్షు నాత్మయందు నిల్పక యథ
మాధములఁ దలంచు టరయఁదంద్రి
నాఁటి ధనమువిడిచి నరుఁడు స్వప్నాగత
నిధి గృహంబునందు నిలిపికొనుట. 159

తే. గీ. ఆదినారాయణునిఁ బరమాత్మఁ బాసి
పరునిఁ దలఁచుట కర్పూరతరువు విడిచి
లాంగలీకంద భక్షాభిలాష వృత్తిఁ
బూని తిరుగుట గాదె యీ భూతలమున. 160

తే.గీ. పరమ పూరుషు నిజసేవఁ బాసి నీచ
దేవతాంతర సేవతోఁ దిరుగుటెల్ల
మధురపుండ్రేక్షురస రుచి మఱచి దుష్ట
మైన [50]యేరండకాండంబు లందుకొనుట. 161

తే.గీ. జడుఁడు సంకర్షణపదాంబుజములు మఱచి
తామసపు దైవసేవచేఁ దనరియుంట
యమృతమై యున్నయట్టి దివ్యౌషధంబు
మాని హాలాహలప్రీతి మరగినట్లు 162

సీ. ప్రద్యుమ్న సేవాప్రపత్తి వాటించక
రాజసదేవతా పూజనంబు
సేయుట యిత్తడి చెంగటఁగని కన
కంబుమీఁదం బ్రేమ గనక యుంట
సంకర్షణ స్తోత్రజాలంబు విడనాడి
పరదైవత స్తోత్ర పాఠమునకుఁ
జనుట మూఢాత్ముండు సచ్చూతఫలరసం
బానక వేముపై నాసపడుట

తే.గీ. యనఘు ననిరుద్ధఁగొల్వక యన్యదేవ
తలను గొల్చుట ప్రస్తుత స్తన్యముడిగి
యయ్యా జాగళకుచదుగ్ధ మాసపడుట
వినుము విప్రేంద్ర మున్నునే ననఘుఁడైన. 163

వ. వసిష్ఠాశ్రమంబునకు నేఁగి యధ్వశ్రమాతురుండనైన నారాక విని యరుంధతిం బిలిచి వసిష్ఠుండన్నపానంబుల శ్రమంబు దీర్పుమని నియోగించిన నమ్మహాసాధ్వి వచ్చునెడ నొకమహానది ప్రవహింప మరలి తద్వృత్తాంతంబు విన్నవించిన వసిష్ఠుండే ననాది బ్రహ్మచారి నైతినేని మార్గంబు చూపెడు నిట్లని ప్రార్థింపుమన నప్పరమ పావనియు నట్లనె కావించిన నత్తరంగిణి మార్గంబు చూపిన వచ్చి నాకు నన్నం బొసంగి చనుచోఁ గల్లోల భీమార్భటి మరలం బ్రవహించిన మరలి నాకు నెఱింగింప నేను నిత్యోపవాసి నగుదునేని మార్గం బిమ్మని పలిక్తిన యట్లనె ప్రార్థింప మార్గం బొసంగ నేఁగి భర్తం గాంచి పుత్రులం గనిన నీవు బ్రహ్మచారివెట్లైతివి ? సద్యస్కారంబున నా చేతనె భుజించిన

50. వేంరండ.

విశ్వామిత్రుం డెట్లు నిత్యోపవాసియయ్యె? నని యడిగిన వసిష్ఠుం డిట్లనియె. 164

సీ. నియమంబున స్వభార్య నియతుండనై యుక్త
కాలంబుననె రతికేలి సలిపి
యుండుట మఱినాకు యుక్తంబు బ్రహ్మచా
రిత్వంబు జగము వర్ణించి పొగడ
గాధిపుత్రుఁడు కమలాధిపభక్తి ని
ష్ఠాపరాయణుఁడు ప్రశస్తిగాంచి
జాత్యాశ్రయ నిమిత్త సత్కర్మములు పూని
వీత దోషముగ నైవేద్య మొసఁగి

గీ. యదియు ననిషేధకాలంబునందుఁ గృష్ణ
యనుచు గోవింద యనుచుఁ బరాత్మ యనుచుఁ
బ్రతి కబళమును నుడువుచుఁ బరిభుజించె
వాసి నటుగాన నిత్యోపవాసి యయ్యె. 165

వ. అనిన నరుంధతి విని హర్షించె నట్లుగాన హరిభక్తిలేని నీ గృహంబున భుజియింప నర్హంబుగా దుంఛవృత్తి భక్తుఁడు గావున తద్గృహంబున భుజియించితి మనిన విశ్వామిత్రు వాక్యంబులు విని యతిథిప్రియుండా విశ్వామిత్రుం బ్రశంసించి సాత్వికవృత్తి వహించి చనియె నంత నమ్మునులు గోదావరీ తీరంబుననున్న హరిణంబులు తమ్మునీక్షించిన యంతనె విమల హృదయంబులంగాఁ జేయుచు హరిణంబులుం దాముం జనించని. 166

క. అక్కడ వీరధ్వజుఁ డన
నొక్కమహా వీర వైష్ణవోత్తముఁడురున
మ్యక్కీర్తిశాలి యిచ్చెఁ
జొక్కంబగు కనకరత్న శుభ్రపటంబుల్. 167

వ. అవిగొనుచు వారలు. 168

సీ. నారాయణున కర్పణము సేయ నరుగుచోఁ
బశ్యతోహరు లుగ్రపౌరుషమున
గదియ వచ్చినవారి గాధిపుత్రుండు ద
క్షిణకరంబున నివసించె నడవి

నపుడు సహస్రసంఖ్యాతిబలోద్ధతుల్
భటులుదయించి యుత్కటనిజాస్త్ర
సమితి నోర్చిన ధరాస్థలియందు నారగిన
గాధేయు మహిమఁ దద్ఘనులు మెచ్చి

గీ. యద్భుతంబంది కొనియాడి యతులతుంగ
శృంగమండల మండిత చిత్రశాఖ
శాఖకావృతమై యక్షసాధ్యసిద్ధ
దివ్యపరమైన యదుగిరి తెలివిగాంచి. 169

క. దూరంబున నానిర్జర
వారంబులు మ్రొక్కనున్న వరమౌనులు శ్రీ
నారాయణ పదసేవా
పారాయణు లఖిలలోక పావనమూర్తుల్. 170

వ. ఇది పరమధర్మంబైనయది యని హరిధామంబుఁగని మ్రొక్కి యా
శైలంబున నధివసించి నేత్రామృతపానంబుగా నిరీక్షించిరంత. 171

సీ. ఆ నగరాజి మధ్యమున లక్ష్మీకళా
భ్యంచితమై వియదంతరాళ
సంచారకానేక సాలాభిరామమై
నానా మహీరుహోద్యాన లక్ష్మి
గనుపట్టి నిరుపమాకలిత నిత్యోత్సవ
ధ్వజ సమావృత దిశాంతమయి కాహ
ళీ భేరి దర మురళీ మర్దళధ్వాన
కలితమై జయశబ్ద మిళితమై ప్ర

గీ. శంసకామ్నాయఘోష భాస్వరము సౌధ
సౌధవిన్యస్త దీపికా సముదయంబు
నైన యొకపురిఁ గనిరి తదగ్రసీమ
నమ్మహాముని లత్యంత హర్ష మొదవ. 172

క. ధవళాతపత్ర చామర
వివిధశ్రీ విస్తరిల్ల శ్వేతద్వీపం
బువలెం గనుఁగొను గీర్వా
ణవరుల కానందరసము నల్గడలఁ దగన్. 173

సీ. అంత నమ్మునులు కల్యాణ సరోవరో
దకమున మునిఁగి యత్యంత నియతిఁ
బౌర్వాహ్ణిక క్రియల్ పాటించి యానంద
మయ మధ్యముననున్న మధువిరోధి
నాదిమూర్తి నిరామయాకారు సౌందర్య
వరసుధావార్ధిఁ బావన చరిత్రు
ననుపమశ్రీ లలితాంఘ్రి సరోజాతు
రత్నమంజీర విరాజమాను

గీ. హైమ పరిధానుఁ గౌక్షేయ కాభిరాము
జఠరమధ్య విరాజిత సమ్యగుదర
బంధు నాతురబంధు శోభన సువర్ణ
మణిమయాంగదు ఘనభుజా మహితు స్వహితు. 174

క. శ్రీవత్స వైజయంతీ
శ్రీవిలస దురస్కు నతి విచిత్రేతరభూ
షావారధామునీశ్వరు
సేవకమందారు దేవసేవిత చరణున్. 175

క. జలజ గదా చక్రాద్యు
జ్జ్వలు విలసద్వదన కమలు సంస్ఫురిత దృ
జ్నలినద్వయు నతులతరా
మల చారుకపోలభాగు మహితా భోగున్. 176

సీ. ఘనరత్నమకుట శోభనుని నాపాదమ
స్తక కళాసౌందర్య సారవీచి
కాలంఘన క్షమ కావితావ లోకను
నిగమాంత పూజితు నిత్యనిత్యు
పద్మావధూమణీ భాగ్యాధిదేవత
పశ్యజ్జనామృత పారణంబు
మూర్తి మదామ్నాయ ముఖ్యాంతరంగంబు
సేవక సందోహ జీవధనము

గీ. సకల నిశ్శ్రేయస ప్రార్థిహస్తగత ఫలము
నభినుతించి భజించి నృత్యంబు సలిపి
యనఘులై చేరి వీరధ్వజార్య దత్త
[51]విత్తమంతనివేదించి బత్తి మ్రొక్కి. 177

వ. సర్వకర్మనిర్మలులగు నమ్మునులు, సువర్ణంబు రత్నంబులు నంబ రంబులు రాజార్హంబగు నాసనంబులు చామరంబులు ఛత్రంబులు చందనాది సురభిద్రవ్యంబులు నంగీకరించినఁ గల్యాణతీర్థంబున నా కుమారులు పరమభక్తి నారాయణు సేవించిన వారలంజూచి యా దయారసాంబుధి యేను సంప్రీతిం బొందితి మిమ్ముఁగాంచి భక్తి సంక్రాంత సర్వాంగులగు భక్తులే నాకు ధనంబు. ఏను గృపారస పరవశుండం గృపయు భక్తిపరాధీన భక్తులు భక్తిపరాధీనులు భక్తియు మత్ప్రసాదంబునం బుట్టిన యది. మత్ప్రభావంబు భక్తపారవశ్యంబే కాని యితరంబు లేదు. ఏను మీతోఁబాసి వైకుంఠంబున నుండనొల్ల. ఇచ్చటనేని వైకుంఠంబుననేని మీతోఁగూడి వర్తింపుదు, నెపుడు మీర లిందుం డధికారావసానంబున వైకుంఠంబు నొందెదరు. వింధ్యారణ్యా వాసంబులగు నీ హరిణంబులు దూరంబుననుండి వచ్చినయవి. వీనికిం బరమపదంబు కృపసేసితిని. ప్రభావంబు మీకేయగు భవదన్వయంబునఁ బశువులు సురదుర్లభంబైన పరమపదంబు నొందె. తృణచర్వణంబు చేసి మదగ్రంబున సంచరించి కల్యాణతీర్థోదకపానంబుచేసి మాతృ స్తన్యపానంబు సేయఁడు గాన నిది వైకుంఠవర్ధనంబను పేరి స్థానంబున ప్రాజ్ఞుండేని పామరుండేని పశువులేని పక్షులేని నన్ను జపించిన వారు వైకుంఠంబు వృద్ధింబొందింతురు. ఎవ్వరు కళ్యాణతీర్థంబునం దానంబు సేయుదురు వారికి సహస్ర గుణితఫలం బప్పుడె కలుగు నొక్కధేనువు నేని కల్యాణతీర్థసంయుతుండై యొసంగినఁ గోటిప్రదాన ఫలంబులగు. మఱియు దరిద్రుండైన విష్ణుభక్తునకుఁ గల్యాణతీర్థతీరంబున క్షేత్రంబొ సంగినఁ దత్ క్షేత్రరేణు సంఖ్యాతంబులగు వత్సరంబులు స్వర్గంబున వసియించి యీప్సితంబు లనుభవించి యంతంబున నన్నుంగలయుఁ గాకున్న భూమియందు సార్వభౌముండై పుట్టి పిదప నన్నుంజేరు నెన్నఁటికి వాని విడనాడ. కల్యాణతీర్థ తీరంబున బ్రాహ్మణభోజనం బిడినఁ గాలత్రయంబునఁ జతుర్ముఖుండగు. కల్యాణతీర్థంబున వస్త్రం బొసంగిన శ్రీమంతులై మuయ్యేడు తరంబులవారు సంసారం బుద్ధ రింపుదురు. కల్యాణతీర్థ తీరంబున ధనం బొకనికింజాలు నట్లొసంగినఁ

51. విత్తమంతయు నటనివేదించి మ్రొక్కి. (యతిభంగము)

గల్పాంతరంబునఁ గుబేరుండై జనించు. అశ్వంబేని స్యందనంబేని గజంబేని కల్యాణతీర్థ తీరంబున నిచ్చిన స్వారాజ్యం బనుభవించి స్వారాజ్యంబు నొందు. అచ్చట మౌక్తికంబు లొసంగిన ముక్తభేద బాంధవుండై హారాలంకృత వక్షస్కుండై తారాపథంబు నొందంగ లఁడు. కల్యాణతీర్థ తీరంబునఁ గాంచన వికారంబేని రజత వికారంబేని యొసంగిన నాచంద్రతారకంబుగాఁ జంద్రలోకంబు నొందంగలరు. కల్యాణతీర్థోదకంబు ఘటంబునందెచ్చి సజ్జనుల కిచ్చిన వారి పితృ గణంబులు తృప్తింబొందు. కల్యాణతీర్థసన్నిధి బాలకుల కధ్య యనంబులు సేయించిన వక్తలై ధన్యులై మేధావులైన పెక్కండ్రు పుత్రులం గందురు. ఎవ్వరు కల్యాణతీర్థ తీరంబున నధ్యాత్మవిద్య యుపదేశింపుదురు వారు మత్సహాయంబైన యుపదేష్టృపదంబు నొందంగలరు. కల్యాణతీర్థ తీరంబునఁ దిలదానంబు చేసినఁ బాపంబులు తిలప్రమాణంబులై నాశంబునొందు. కల్యాణతీర్థంబునఁ గనకాద్య లంకృత కన్యాదానంబుఁ గావించిన ధరణీ తలంబున ధనధాన్య సంపన్నుండై పుష్టి శ్రీ భూ నీళా సంయుక్తుండైన మత్పదంబుం బొందం గలరు. కావున మునీంద్రులారా! ఇచ్చటనే యుండి నన్ను సేవింపుండని పలికి నారాయణుం డానందమయ సంజ్ఞింతంబగు విమానంబునందు రమతోఁ గూడియుండెనని నారదుండు పలికిన మునీంద్రులు హర్షంబు నొందిరంత 178

యాదవాచల మాహాత్మ్య మరసి యతుల
భక్తి పఠియించి వినువాఁడు భగవదిష్ట
తముఁడు వాని గృహంబునఁ గమలగేహ
వెలయు నాపుణ్యు ఘనుని యవిద్య తొలఁగు. 179

*యదుగిరి మహత్త్వ మెవ్వని
సదనంబున నుండు వాఁడె సత్తముఁ డతి సం
పదలాయువు నారోగ్యము
సదమల మతులైన సుతులు సకలము గలుగున్. 180

సకల జనేప్సితారములు చాల నొసంగుచు సర్వదేవతా
నికర కులాధిపత్యమున నిల్చి రమారమణుండు యాదవా
ద్రి కుహరసీమనుండి వినుతించిన వారికి నిచ్చువేడ్క నం
క్రమికమల సేవనాధిక పరిస్ఫుట రాజ్యరమా విశేషముల్. 181

*యదుగరి

మ. బలివిధ్వంసి పదాంబు జాతముల సద్భక్తిఁ నరుం డెవ్వఁడా
తులసీపర్ణ మొకానొకప్పు డిడినఁ దుష్టాంతరంగ క్రియల్
ఫలియించుఁ భజియింప ముక్తిపద సోపానంబులం బోపుచో
వెలయుఁ నందన కల్పభూజసుమనో వృష్టిచ్ఛటల్ మించుగఁ. 182

క. పటుభక్తి యాదవాచల
తటమున వరవేదఘోషతత [51]కావ్యాద్యు
త్కట నాదము విని యుద్భట
పటహధ్వనిఁగడను బరమపదమున కేఁగుఁ. 183

గీ. నిఖిలభవనైక రక్షాతి నిర్నిమేషుఁ
డైన యదుగిరి భర్త యొకప్పుడేని
కనిన వారి నిజాననకమల గంధ
కలన వైకుంఠవిభుఁడు స్వాగతము పలుకు. 184

గీ. దైవయోగంబుచేత నేధార్మికుండు
యాదవాద్రిని క్షణమేని యధివసించు
సకల కాలంబును వసించు శాశ్వతముగఁ
బరమపురుషైక గోష్ఠి నా భవ్యమూర్తి. 185

క. ఇది విని యదుశైలం బా
స్పదమున ఘనవీతరాగవర్యులు చిత్సం
పద నిల్చిరి లక్ష్మీధవ
పదముల శేషాశనాది పరిషద్గోష్ఠిఁ. 186

## ఆశ్వాసాంతము

శా. చాణూరాహ్వయమల్ల హల్లక మదస్తంబేరమా కంసని
ర్వాణారస్తమతిత్రపాలనకరాగ్రాఘాత లక్ష్మీవధూ
మాణిక్యాభరణాభిరామ యతిరాణ్మందార భూజాత ప్రా
మాణిక్య స్ఫురితాత్మబోధ చతరామ్నాయాంత మాయాంతకా! 187

క. అక్రూరవరద యదుకుల
చక్రేశ్వర లక్షణా వశంవద ధాత్రీ
చక్ర [52]వినిర్వహణోత్సుక
చిక్రింసా! ధుర్యవాగ్రుచిర మాధుర్యా! 188

51. కావాద్యుత్కట,
52. వినిర్వహణోత్సుక,

కవిరాజ విరాజితము-

దళిత రసాదర సాదర పోషిత
ధర్మసుతాది పృథాజ [53]మహా
ఖిల వదనాశన వాశనికల్ప ఫ
ణాకృత ధీకృత చంక్రమణా
కలశపయోధిశయప్రభు సన్మణి
కాంతికిరీట సమించిత పే
శల సురసామల సామల సన్ముఖ
సన్నుత సంతత ధన్యగుణా! 189

## గద్యము

ఇది శ్రీమత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్యపుత్ర
కశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడు నరసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణమునందుఁ దృతీయాశ్వాసము
సంపూర్ణము
శ్రీ శ్రీ శ్రీ
శ్రీ

---

53. మహాఖిల వదనానన వాశనికల్ప ఫణాకృతధీకృత యతి (?) చంక్రమణా!

శ్రీ

# నారదీయపురాణము

## చతుర్థాశ్వాసము

క. శ్రీమన్నాగ్నజితీ ప్రే
మామోదాంభోధి పూర్ణిమాంబుజ హరసు
త్రామ సుత సూత కృత్య ఖి
ధాముహు రాఖ్యాత పుణ్యదాక్షిణ్య గుణా ! 1

వ. అవధరింపుము నైమిశారణ్య వాసులగు మహామునీంద్రులకు సూతుండు మఱియు నిట్లనియె. మున్ను మాంధాత వసిష్ఠు నడిగిన యేకాదశీ వ్రతంబు మీకు నెఱింగించెద వినుండు. 2

క. ఏపున శుష్కార్ద్రములౌ
పాపేంధనకోటులెల్ల భస్మము సేయన్
దీపించు వహ్ని యెయ్యది
తాపస కులనాథ ! తెలుపు దయతో మాకున్ 3

సీ. మూఁడు లోకంబుల మునినాథ నీ వెఱుం
గని యది లేదు నిక్కముగఁ ద్రివిధ
కర్మ నిశ్చితము విఖ్యాతిమైనజ్ఞాత
కలుషంబులెంచ శుష్కములు జ్ఞాత
కలుషంబు లార్ద్రముల్‌గా విన్నవించితి
వార్తకెక్క నతీత వర్తమాన
భావికాలోచిత పాపేంధనంబు లే
వహ్నిచే నడఁగుఁ బావన చరిత్ర

తే.గీ. యనిన హరివాసరము నియతాత్మ మనుజుఁ
డుపవసించి హరి భజించి యుచితభక్తిఁ
గాంచి నిశినెల్లఁ దామేలుకాంచి ధనము
జూదరియుఁ బోలెఁ బాతకస్తోమ మడఁచు. 4

వ. వినుము రాజేంద్రా ! ఏకాదశీ సముద్భవానలంబుచే జన్మశతోద్భవంబులైన పాతకేంధనంబులు భస్మంబగు. హరి దివసంబువంటి దివసంబు లేదు. హరి వాసరంబున నుపవసించు తన కనేక [1]దేహంబుల పాపంబు లుడుగు. హరివాసరోపవాస షోడశాంశంబునకు నశ్వమేధ సహస్రంబులు వాజపేయ శతంబులు సమంబులు గావు. హరివాసరోపవాసంబున నేకాదశేంద్రియ కృత పాపంబులన్నియు నాశంబు నొందు. హరివాసర సమంబుగాఁ బాపంబుల వలన రక్షించునది యొక్కటి లేదు. ఒక్కొక్క వ్యాజంబున హరివాసరోపవాస మాచరించి దండధరునిం జూడఁడు. స్వర్గమోక్షప్రదంబును, శరీరారోగ్యకరంబును, సుకళత్ర సుపుత్ర లాభకారణంబును[2] నగు. మఱియును 5

క. కురు గంగా కాశీ పు
ష్కర రేవావేణికా వికర్తన తనయా
సరయూ గయాది తీర్థము
లరయన్ సరియనఁగఁ దగునె హరిదినమునకున్. 6

మ. [3]అవనీ నాయక! కల్గులోకుల కనాయాసంబునన్ నేఁడు వై
ష్ణవధామం బుపవాస జాగరము లిచ్చంజేయ నేకాదశిన్
సవిశేషంబుగ మాతృపక్ష పితృపక్ష స్వప్రియాపక్ష వం
శవతంసంబులు వార్తగాఁ బదియు మోక్షంబందుఁ దానుం దగున్. 7

క. ఏకాదశి చింతామణి
యేకాదశి కామధేను వింద్రమహీజం
బేకాదశి మోక్షప్రద
మేకాదశి వేదమార్గ మేకాదశియే.[4] 8

శా. ద్వాదశ్యుత్సవ మాచరించు నరుఁడు ద్యద్దోశ్చతుష్కంబుతోఁ
గాదే నాహిత దివ్యవాహనముతోఁ గౌశేయవస్త్రంబుతో
నాదిత్యుల్ గొనియాడ నాహరిపురోదంచన్మణీ వేదికన్
మోదంబందుచునుండు వైష్ణవ సభాముఖ్యుల్ ప్రశంసింపఁగన్. 9

1. దేహంబునం బాపంబు లుండు
2. ('ను' లేదు.)

క. హరివాసరోపవాసాం
తరమున జన్మాంతరములఁ దరలని పాపాం
తరములు[5] జననీ గర్భాం
తరవిణ్మూత్రాది లిప్తతయుఁ దొలఁగుధరన్. 10

వ. ఈ ప్రశ్నంబె నైమిశారణ్యవాసులు వ్యాసశిష్యుండగు సూతునిం జూచి మహాభారతంబు మొదలుకొని యష్టాదశ పురాణంబులు నీవెఱుంగనివి లేవు. వేదశాస్త్రపురాణస్మృతులందు లేనిది యెద్దియునులేదు. కావున సర్వంబును నీ వెఱుంగుదువు. మా హృదయంబుల నింత సంశయంబున్నది. తత్సంశయంబుదీర విస్తరంబున నెఱింగింపు. తిథి ప్రాంతంబున నుపవసింపవలయునో? తిథిమూలంబున నుపవసింప వలయునో? అందు దేవపితృ కార్యంబులకు నుపయోగించినయవి యెఱింగింపవే[6] యని యడిగిన నాసూతుండు శౌనకాదుల కిట్లనియె. తిథ్యంతంబున దేవపితృ హితంబుగా నుపవసింప వలయు. తిథి మూలంబునఁ బైతృకం బాచరింప[7]వలయు. 11

## తిథి ఫల నిర్ణయము

ఆ. వె. సాధులా ద్వితీయ షష్ఠియష్టమి భూత
తిథి హరి దివసములఁ దెలిసి పూర్వ
విద్ధయైన దాని [8]విడువనగుఁ ద్రివర్గ
కాంక్షు లుపవసింపఁ గాదు ధరను. 12

సీ. వాసిగాఁ బ్రాతి సాంవత్సరీక దశమి
పౌర్ణమాసీ దరశిభవ్యతిథులు
పూర్వ విద్ధములైనఁ బూని సేయఁగఁ దగు
నట సేయకుండిన నతఁడు ఘోర
నరకంబులందు నానావిధహానియు
సంతతిచ్ఛేద మత్యంత దురిత
దౌర్భాగ్యములఁ జెందుఁ దప్పదు మున్నంచు
ద్వైపాయనుండు తథ్యముగఁ బలికె.

---

5. న
6. యని శౌనకాదు లడిగిన నా సూతుం డిట్లనియె.
7. వలయునని
8. విడువ వలయుఁ ద్రివర్గ

తే. గీ. వెలయ నాదిత్యుఁ డుదయించు వేళయందు
నింతయేనియుఁ దిథి గల్గెనేని యదియె
పూర్ణయగు [9]నుదయముఁ బాసి పూర్ణయైన
యదియ పూర్ణయ కాఁజూడుఁ డనఘులార ! 13

వ. పారణంబునకు మరణంబునకుం దత్కాలతిథి కర్తవ్యము. పైతృకంబునకు నస్తమయవ్యాప్తియైన తిథి కర్తవ్యము. పైతృక కర్మంబున కుదయతిథి గ్రాహ్యంబుకాదు. కావున మౌహూర్తికులవలనఁ దిథి శోధింపవలయు. తిథికిఁ బ్రమాణంబులు సూర్యచంద్రులు. పూర్వవిద్ధయైన నుపవసింపఁ దగదు. స్నానపూజనంబులు యామ చతుష్కంబు వర్జించి దానకర్మంబులన్నియు శర్వరీ [10]ముఖంబునఁ జేయవలయు నిది యుపవాసవిధి ప్రకారంబు. 14

క. ద్వాదశి యల్పమయిన నరు
ణోదయమున లేచి స్నాన హోమార్చన దా
నాదికము సేయఁదగు నా
వేదజ్ఞుల కెల్ల ధర్మవృత్తి యెసంగన్. 15

క. శుద్ధిఁ ద్రయోదశి సత్క
ర్మోద్ధతిఁ బారణ [11]యొనర్చి యురుధాత్రీ దా
నోద్ధత బలమున్నత య
జ్ఞోద్ధరణ బలంబు మనుజుఁ డొందుచు నుండున్. 16

సీ. [12]అదిగాన ద్వాదశి యల్పమయినను స్నా
న పితృతర్పణము లెన్నంగ నాడి
జరపి తద్ద్వాదశి సాధింపవలయు సా
ధింపకుండిన మహోదీర్ణవర్ణ
[13]హానియు నిజధర్మహానియు నగు సమ
గ్రముగ నస్నాత సరస్వతి గతి
భూరిదోషంబులు పుట్టిన నణఁగించి
వర్తించు శ్రీహరి వాసరంబు

---

9. నుదయమున బాశ
10. ముఖంబున సేయవలయు
11. యొనర్చి యట ధాత్రీదా। నోద్ధత బలము
న్నత బలము య : జ్ఞోద్ధరణ బలంబు
12. అదిగాన ద్వాదశి యల్పమైనను స్నానపితృతర్పణమ్ము లెన్నంగ నాడి
13. హానిద నిజధర్మ హానిదయగు సమ

తే.గీ. నకును ద్వాదశియే మహోన్నత ఫలప్ర
దయగు [14]వృద్ధి దినక్షయాంతరములందు
నపరిమితభక్తి ద్వాదశియందు నుపవ
సింపఁగాఁ దగు విద్ధ వర్జింపవలయు. 17

వ. మఱియు ద్వాదశి పూర్వ సంయుతయై యొప్పుచుండునప్పు డుపవాసంబు నరులెల్లం జేయవలయు నన నుపవాసదినము పూర్వవిద్ధయై ద్వితీయ దినము నందు లేకయుండిన నేకాదశి [15]యెట్లాచరింపవలయు ననిన సూతుం డిట్లనియె. 18

తే.గీ. ద్వాదశి [16]దినమునఁ బూర్వవాసరంబు
నందు నేనియు సూర్యచక్రార్ధ మాత్ర
మొందినను బరదినమున నుపవసింప
యుక్తమై యుండు సజ్జనులుల్లసిల్ల. 19

వ. అనేకాగమ విరోధంబులు నైననేమి ? బ్రాహ్మణులు వివాదించిన నేమి ? ద్వాదశ్యుపవాసంబునుం ద్రయోదశి పారణయుం జేయవలయు. 20

తే.గీ. అరయ నేకాదశి యవిద్ధయైన నేని
శ్రవణమునఁ గూడి పాపసంక్షయ మొనర్చు
నట్టి ద్వాదశి యుపవాస మందవలయు
ఘనతమై శుక్ల కృష్ణపక్షముల యందు. 21

వ. ఏకాద[17]శీ ద్వాదశీ నిర్ణయంబు తెలిపితి మఱియుం దెలియ వలయునవి యడుగుం డనిన ఋషులు యుగాది నిర్ణయంబడిగిన సూతుం డిట్లనియె. 22

## యుగాది నిర్ణయము

సీ. అనఘాత్ములార ! యుగాదులు శుక్ల ప
క్షమునందుఁ గృష్ణ పక్షంబునందు
రెండు రెండనఁగ వర్తిల్లు వైశాఖ శు
క్ల తృతీయ[18]యుం గార్తికసిత పక్ష

14. వృద్ధిని దిన
15. యట్ల నాచరింపవలయు
16. దినమున పూర్వ
17. శి
18. యుఁ

నవమి నభస్య కృష్ణత్రయోదశి మాఘ
[19]పంచ దశమియును బావనములు
గ్రాహ్యంబు శుక్లపక్షమునఁ బౌర్వాహ్ణిక
మాపరాహ్ణికము గ్రాహ్యంబు కృష్ణ

తే.గీ. [20]పక్షమున నయనము దినభాగకంబు
సంక్రమణము షోడశాంశంబు నదియె
నిది యెఱింగి బుధోత్తము లెల్ల సకల
దానములు సేయవలయు ననూన మహిమ. 23

తే.గీ. ఉత్తరాయణ ముడిగి సూర్యుండు వేగ
దక్షిణాయనమున కేఁగు తఱి మెలంగు
మధ్యకాలంబు విషమమై మహిఁ జెలంగు
నదియె ముక్తక నామధేయము వహించు. 24

మ. తిథి సాంవత్సరికోపదేశమున బుద్ధిం జాలశోధించి సు
ప్రథిత శ్రీ నుపవాస మున్ననగు ధర్మంబుల్ శుభంబుల్ మనో
రథముల్ సద్గతులుల్, మహాదురితచర్యం బూర్వ సంవిద్ధయా
[22]తిథియందే యుపవాసమున్నఁ గలదే తేజంబు పుణ్యస్థితుల్. 25

తే.గీ. ఉత్తమోత్తమమైన గంగోదకంబు
నందు సురబిందు మాత్రంబు నందెనేని
యతి పవిత్రంబుగాని యట్లయ్యె దశమి
హరి దినమునఁ గళామాత్ర మంటెనేని. 26

తే.గీ. ఉభయపక్షముల మహోత్తముండగు కుశ
కేతుఁ డఖిల దనుజజాతి యాత్మఁ
బొంగి సన్నుతింపఁ బూర్వ విద్ధములైన
తిథుల నుపవసింపఁ దెలిపె మున్ను. 27

---

19. పంచదశమియు నివి పావనములు
20. పక్షమున నయనముం దిన భాగకంబు
22. తిథియం దినుపవాసముం గలదె తేజంబు పుణ్యస్థితుల్

సీ. తర్కింపఁగ నకాలదత్త మపాత్ర [23]ద
త్తం బసత్కాలదత్తంబు క్రోధ
దత్తంబు పూర్వవిద్ధతిథిదత్తంబును
చ్ఛిష్ట దత్తంబును[24] శ్రితజనైక
దత్తంబు పతితదత్తం బేకవస్త్ర తా
దత్తంబు జలవరదత్త మగ్ర
కీర్తన దత్తంబు కేవలాసురజన
ప్రీతికరంబు ధాత్రీస్థలమున

తే. గీ. నట్లు గావున విద్ధమౌ హరిదినమున
[25]నుపవసించినఁ బూర్వపుణ్యోత్కరంబు
లణఁగు వృషలీపతి యొనర్చినట్టి శ్రాద్ధ
కర్మమును బోలె సకలలోకములు నెఱుఁగ. 28

తే. గీ. చక్రధర నామకీర్తిన స్తవన భజన
జప్త దత్త హృత స్నాత సవన [26]ముఖ్య
ములును బోవుఁ దిథినివేధమున మహోద్భ
టాంధతమసంబు సూర్యోదయమునఁ బోలె. 29

క. ముదిసిన మగనిఁ యౌవన
మదవతులైయున్న సతులు మనసిజ కేలిఁ
గదియని యట్లనె వేధా
స్పదమగు తిథియందు ధర్మసంఘము దొలఁగున్. 30

వ. అనిన విని ఋషులు శ్రీభగవదారాధనక్రియ విస్తరంబున నెఱింగింపు మెందున హరి ప్రసన్నుండై సమీహితంబు లిచ్చుననిన సూతుండు భక్తియే ప్రధానంబు. భక్తియుక్తుండై జడుండేని భగవంతుం బూజించినఁ గ్లేశంబులణంగు. తృష నొందినవాఁడు జలంబునఁ దృప్తుండైన కరణిఁ బూజించిన మాత్రనె హరి పరితోషంబు నొందు నిందునకుఁ బాపనాశనంబగు ఋషిగౌతమ సంవాదంబు నందునైన రుక్మాంగదో పాఖ్యానంబు విన్నవించెద వినుండు. 31

---

23. దత్తంబు సత్కాల దత్తంబు
24. ("ను" లేదు)
25 నుపవసించిన పూర్వ
26. ముఖ్యములు వోవు తిథినివేధమున

## ఏకాదశీ మాహాత్మ్యము

తే. గీ. జగతి రుక్మాంగద క్షితీశ్వరుఁడు ధర్మ
పరుఁడు గలఁ డొక్కరుఁడు విష్ణు భజనశక్తి
ఘనుఁడు తచ్చక్రహస్తునిగాని యన్య
దేవత భజియింపఁడు రాజ తిలకుఁ డెలమి. 32

శా. చాటించెన్ [27]మదహస్తిపైఁ బటహముచ్చైర్ఘోషమైయుండ ది
గ్వాటుల్ ఘూర్ణిల నానృపాలకుఁడు గర్జద్దుర్మతశ్రేణి ను
ద్ఘాటించెన్ హరి వాసరంబునను భుక్తంబెవ్వఁడాశించినన్
దాటింతున్ జటులాసిచే నతని మస్తంబంచు నత్యుద్ధతిన్. 33

సీ. అష్టవర్షాధికుండైన వాఁ డెవ్వఁడేన్
బదియేండ్లదాఁక నా పద్మనాభు
దివసంబున మదీయ దేశంబున భుజింపఁ
దగదు జననినైనఁ దండ్రినైన
దారపుత్రాప్త బాంధవులనైనను బట్టి
దండింతు [28]నిటఁ జోరదండనమున
నెఱిఁగింపుఁ డిపుడు మహీసురోత్తములకు
జాహ్నవీవారి మజ్జనము సేయుఁ

తే. గీ. డబ్జనాభ కథాలాప మాలకించుఁ
డనుచు నేనాడు వచనంబు లాత్మఁబూని
నడచు మామకునకు నతినవ్య రాజ్య
భోగ మొనరింతు మత్కృపాపూర్ణ మహిమ. 34

వ. అని శుక్ల పక్షంబులఁ గృష్ణ పక్షంబులఁ బటహంబు మ్రోయించి 35

క. ఆ రాజచంద్రుఁ డిటువలె
భూరివ్రతనిష్ఠ నడపఁ బురుషులు స్త్రీలున్
సౌరిపురిఁ జేర రెన్నఁడు
శౌరి పురియ కాని పుణ్య సామర్థ్యమునన్. 36

వ వ్యాజము చేసెనేనిఁ బరమ పావనంబగు. ద్వాదశి సాధించెనేని హరి
మందిరంబుఁ జేరు. మఱియు 37

---

27. మదహస్తి పై పటహ
28. నిట చోరదండనమున

క. హరి వాసరమునఁ గుడిచిన
పురుషుల కిలలోని పాపములు ప్రాపించున్
హరి వాసరమునఁ గుడువని
పురుషుల కిలలోని పుణ్యములు ప్రాపించున్. 38

ఆ.వె. వైమనస్య మందె వైవస్వతుం డంతఁ
జిత్రగుప్త లేఖ్యపత్ర లిఖిత
దురిత పుణ్యులిపుడు [29]తుడుపులు వడిరి త
ద్విష్ణుదివస మహిమ వింతకాదె! 39

క. హరి లోకమునకు నేఁగఁగ
సురపురమును యమపురంబు శూన్యంబయ్యెన్
సురముని[30] నారదుఁ డొయ్యన
నరుదెంచి కృతాంతుఁజూచి యపు డిట్లనియెన్. 40

తే.గీ. చిత్రగుప్తుఁడు నున్నాఁడు[31] చిన్నవోయి
నరులు పావనులైరి నీ పురమునందు
యాత నాక్రందములు వొంద వనఘ ధర్మ
రాజ! యిది యెంచి చూడఁ జిత్రంబు గాదె! 41

వ. అనిన[32] రుక్మాంగద క్షితీశ్వరుం డేకాదశీ వ్రతంబు సేయుచుండ నీ రాష్ట్రంబులోఁ జాటించ నట్లనె నరులు వర్తించఁ దన్మహత్త్వంబున మల్లోకం బిట్లయ్యె. బ్రహ్మహత్యాది పాతకాన్వింతుడైన సింహంబువలె నున్నవాఁడేను కాష్ఠమయుండనై యున్నవాఁడ; నేత్ర కర్ణహీనుండునుం బోలె, సంధ్యాహీనుండైన ద్విజుండునుంబోలె, స్త్రీజితుండైన పురుషుండునుంబోలెఁ, బ్రమదాపతి యగు షండుండునుంబోలె నిర్విణ్ణుండనై యున్నవా డ, నిటువంటి లోకపాలకత్వంబు విడిచెదనని బ్రహ్మలోకంబునకు నేఁగి యేతత్కార్యంబు విన్నవించెద. స్వామి విత్తంబను భవించి స్వామికార్యంబునెడ నిర్వ్యాపారుండై యున్నవానికి నరకం బగుం గావున 42

---

29. తుడుపులు వడియెఁ ద | ద్విష్ణు దివస మహితు వింతకాదె.
30. నారదుఁ డొయ్యని యరుదెంచి.
31. చిన్నబోయి
32. ('న' కొట్టివేయఁబడినది)

ఆ.వె. అనుచు నిట్లు పలికి యంతకుం డంతకుఁ
జిత్రగుప్తు లట్లు చేష్టలుడిగి
చిత్రగుప్తుఁ డాలసింపక వెంటరాఁ
ద్రోవ నరిగె నారదుండు దాను. 43

వ. అంత 44

శా. మూర్తా మూర్తజనంబు గొల్వ నిగమంబుల్ దానయై తజ్జగ
త్కర్తృత్వ ప్రపితామహత్వముల నోంకారాఖ్యమై హంసమై
యార్తత్రాయకమై స్వయంభువయి తుర్యంబై కుశాంకంబునై
కీర్తించందగు నొక్క తేజము [33]శుభోద్గీథంబు వీక్షింపుచున్. 45

సీ. స(క)ల దివ్యులు దిగీశ్వర లోకపాలకుల్
విగ్రహంబులు దాల్చి వేదములు పు
రాణంబు లఖిలశాస్త్రములు నాకృతిఁబూని
జలధులు నదులు కాసారదీర్ఘి
కా కూపములు తటాకములు దేహములెత్తి
యశ్వత్థముఖ భూరుహములు మూర్తి
మంతంబులై సానుమంతంబు లాకార
ములతో నహోరాత్రములును బక్ష

తే.గీ. ములును మాసంబులును వర్షములును [34]దనువుఁ
బొంది సత్కర్మములు బంధములును మేను
లమరి సత్వంబును రజంబుఁ దమముఁ జాల
నంగములు దాల్చి సేవించు నంతలోన. 46

వ. శాంతరూపంబులు ఘోర వికార రూపంబులుం బరివేష్టింప నమ్మహా
విభుని సమ్ముఖంబున విన్ననై మొగంబు వంచికొనియున్న దండ
ధరునిం జూచి సభాసదు లిట్లనిరి. 47

ఉ. దండధరుం డితం డధికదైన్యముతో నరుదెంచె నిమ్మహో
ద్దండుఁ డధర్మమన్నఁ దెగు ధర్మము గల్గిన నిర్వహించు బ్ర
హ్మా(ం)డములోని మానవుల కందరకుః [35]సమవర్తిగాన ని
ట్లుండ క్షణంబు తీరదు మహోద్ధతి నిచ్చటి కేల వచ్చెనో? 48

---

33. శుభోత్తేజంబు
34. దనువులొంది
35. సమవర్తిగాన యిట్లుండ

ఆ.వె. చిత్రగుప్తుఁడేల చిత్రధర్మాధర్మ
పత్రికలు లిఖించి పట్టుకొనఁడు
వినఁ గనంగరాని వింతలు పుట్టెనో
నాకమునకు హృతజనాకమునకు 49

వ. అని యచ్చటి జనంబు లాడుకొనుచున్న సమయంబున విరించి పాదాగ్రంబుల నికృత్త మూలంబగు సాలంబునుంబోలె వ్రాలి త్రాహి త్రాహియని కన్నీరు తొరుఁగ సమ్మార్జితపటుండనైతి నని విన్నవించి నిశ్చేష్టితుండైయున్న సభయందు నొక హాలాహల శబ్దంబు పుట్టె; మఱియు 50

ఉ. స్థావర జంగమాత్మక సుశస్త జగద్వలయంబు నీతఁడే
కేవల బాధ[36]నొంచ నపకీర్తికి రోయక యెంచె నట్టివాఁ
డీవెత నుండె సత్యమగు నెన్నిక కాకిట గాధబాధచేఁ
గావె యనేకబాధ లనఁగా జనతాఘనపాప[37]మారుటల్. 51

మ. అని లోకుల్ సభనాడ నా వరుణుఁ డొయ్యన్ వారి వారించి యా
తని దండానతు శ్యామపీత నిజదోర్దండంబులన్ లేవ నె
త్తి నవీనోత్తమపీఠిపై నునిచి యెంతేవేడ్కతోఁ గాంచి మ
న్నన గావించి ప్రశంసచేసి యతిసూత్నప్రీతితో నిట్లనున్. 52

తే.గీ. ఎవ్వఁ డపకార మొనరించె నెవ్వఁ డిట్లు
బాధగాఁజేసె మార్జిత పటునిఁజేసి
యెవ్వఁ డొనరించె సర్వంబు నెఱుఁగఁ బల్కు-
వబ్జజుఁడు నీ మనోదుఃఖ మవనయించు. 53

వ. అని వరుణుండు పల్కిన శమనుండు కృతదుఃఖ శమనుండై పితామహు వదనంబుఁ జూచుచు నిట్లనియె. 54

సీ. స్వామి ! నా శక్తి తేజంబునంతయుఁ బోయె
నంతకంటెను మృతియైన మేలు
ప్రభుధనంబు భుజించి ప్రభు నియోగోపేక్షఁ
గావించు నాతఁడు కాష్ఠకీట

---

36. నొంద

37. పాప మారునే

మధిపు కార్యము తప్ప నాచరింపుచుఁ బ్రజా
ద్రవ్యంబు భుజియించు తద్దురాత్ముఁ
డబ్ద శతత్రయం బనుభవించు ననేక
నరకంబు లేలిన ధరణి నాథు

తే.గీ. కార్యమంతయు మఱచి వికారమొంది
మత్తుఁడై యున్నయట్టి దుర్మానుఁడందు
నఖిల [38]నిరయంబులును బ్రళయాంతమైన
ననుభవించు స్వకీయ కర్మానువృత్తి. 55

తే.గీ. స్వామి కార్యంబు విడిచి దుర్జాలుఁ డాత్మ
కార్యమున నున్నచో మూషికత్వమొందు
ధరణిలోపలఁ గల్ప శతత్రయంబు
కమలసంభవ ! మీ యాజ్ఞగాదె యిట్లు. 56

క. భూనాథు కార్యమంతయుఁ
దా నింటనెయుండి భృత్యతతి చేర్చిన య
ట్టా నను నియోగి [39]పాపం
బాని మహోత్కట బిడాలమై జనియించున్ 57

వ. కావున మీ యాజ్ఞ యుల్లంఘనము సేయక యింతకాలంబును బుణ్య
కర్మంబులఁ బుణ్యంబులును, బాపకర్మంబులఁ బాపంబులును ధర్మ
వేదులగు మునులతో విమర్శించి తత్తత్ఫలం బనుభవింపఁ [40]జేయు
నాకు నింక శక్యంబుగాదు వినుము. 58

సీ. ధరణిపై రుక్మాంగద క్షమాధీశుఁ డే
కాదశీ వ్రతదీక్షఁ గైకొనంగఁ
జతురబ్ధిపర్యంత జగతిలోఁ గల జను
లావ్రతమంతయు నాచరింపఁ
బాడయ్యె నేఁడు నా పట్టణంబంతయు
నితర ధర్మములు లేవెవ్వి దేవ
పూజయు నిజపితృ పూజయు భూసుర
పూజయుఁ జేయరు పుణ్యతీర్థ

---

38. నిలయంబులును

39. పాపంబూని

40. జేయ

తే.గీ. సరణిఁగానరు యోగంబు సాంఖ్య యోగ
మనఁగ [41]వినరెన్నఁడేని స్వాధ్యాయమైన
హవనకృత్యంబుఁ [42]జేయరు దివిరి వారు
హరిపదముఁ గాంచి రిట్లు నత్యద్భుతంబు. 59

వ. మనుజు లేకాదశీ వ్రతంబునఁ బితృపితామహులతోఁ బరమపదంబందు
టెంత ? వారి పితృగణంబులఁ బితృగణంబును బరమపదంబు
నొందిరి. మాతామహులట్లనె పరమపదంబు నొందిరి. బీజవిశేషంబున
భార్యాపక్షంబువారు నట్లన పరమపదంబు నొందిరి. మఱియు నిది
యెవ్వరు చేసిన పుణ్యపాపంబులు వారలేయనుభవించు వారలుగాక
యితరుల కేమి కారణంబు ? జామాతృ పుణ్యమాహాత్మ్యంబున భార్యా
పక్షంబున కిట్లర్థంబె ? ఈ నియోగంబునేనొల్ల. యజ్ఞతీర్థదానయోగ
సంయోగంబుల నిటువంటి సద్గతిలేదు. ధాత్రీఫలాను లిప్తులై వాంఛ
లుడిగి, రసభోజనోద్భవ వాంఛలు విడిచి విభ్రష్టకర్ములేని హరి
లోకంబుఁ గాంచిరి. గళరజ్జు బంధనంబుల మద్దూతలు దెచ్చినవారల
హరిదూతలు శిక్షించికొనిచనిరి. ద్వాదశాదిత్య తీవ్రతాప దుర్గమం
బైన మన్మార్గంబు భగ్నంబయ్యె నేమివిన్న వింతునింక 60

సీ. హరిపదంబునకేఁగు నధ్వంబు త్రిభువనా
ర్చితమైనయది విమర్శింప నిసుక
చల్లిన రాలదు జనులచే నీలోక
మప్రమాణం బగమ్యంబనంత
మద్భుతం బింతింత యౌనన఼గారాదు
గణుతించి చూచిన ఖర్వశంఖ
పద్మకోట్యాగముల్ బలసి కాపురమున్న
నిండదు తజ్జనమండలంబు

తే. గీ. మఱి సుకర్మస్థులును వికర్మస్థులును బ
విత్రులపవిత్రులును రమావిభుదినంబు
నందు నుపవాస మొనరించి యందుచుంద్రు
పరమధామంబు తన్మహీపాలు నాజ్ఞ. 61

41. వినం డెన్నండేని
42. జేయరు దేవవారు

మ. ధరణీనాథుఁడతండు తన్మహిమచేతం దండనీయుండు గాఁ
డురుతేజంబున వేయువత్సరము లిట్లుర్వీతలం బంతయున్
బరిపాలింప భుజాచతుష్టయముతో ధర్మాంశుక శ్రీలతో
గరుడా రోహణలీలతోఁ గనిరి తత్త్కైవల్యధామోన్నతుల్. 62

తే. గీ. అతఁడు ధరనుండెనేనితరాగ్ర వృత్తి
ధారుణీలోక మాపరధామమునకుఁ
జేర్పఁగలఁడీవు నాకు నిచ్చిన ప్రసిద్ధ
దండపట మణఁగించె నుద్దండ మహిమ. 63

మ. అరులం జ్యేష్ఠ విభావసుండు వలె దీప్తాకారులం జేయఁడే!
నరుఁడా మూఢుఁడు పుట్టనేమిటికి నన్యాయాత్ముఁడై మాతృదు
ర్భరగర్భాంతర దుర్గ నిర్భరణ నిర్భాగ్యుండు, శ్రీజన్మవి
స్ఫురణం బట్లనెకాదె కీర్తి విభవంబుల్లేక వర్తించిన్. 64

క. విద్యాబల సంపద నన
వద్యంబై పితృకులంబు వన్నెకు నెక్కం
జోద్యముగాఁ జేయని సుతు
లాద్యరజో రోగమగుదు రాజననులకున్. 65

క. ధర్మార్థకామములయెడఁ
గూర్మి మదిఁ విడిచి ప్రాతికూల్యస్థితిచే
దుర్మాదత నిలిచిన దు
ష్కర్ముని మఱి మాతృ ఘాతిగా నెంతు రిలన్. 66

ఆ. వె. పీరసూనమాఖ్య విలసిల్లె రుక్మాంగ
దక్షితీశుఁ గన్నతల్లి యొకతె
మల్లిపి ప్రతాప మార్జనం బొనరించి
యాత్మజుండు జగము లాక్రమింప. 67

వ. ఇట్లే రాజులు నడవరితండు మత్పటహాని గావించి పటహానిశ
ఘోషంబునుం జాటించి యేకాదశీవ్రతంబు నడుపుచు నున్నవాఁడెట్లు
నోర్తునని విన్నవించిన విరించి యిట్లనియె. 68

మ. ఇదియే చోద్యముగాఁగ ఖిన్నమతివై యిట్లాడుచున్నాఁడ వా
పదచో సద్గుణ మొక్కఁచోఁగలుగఁ దాపంబందినం బాతకం
బది యంచుక్ మరణాంతికంబు స్మృతిమాత్రానీత చక్రాంకస
త్పద మాసువ్రత మావ్రతంబున కసాధ్యం బెద్దియుం గల్గునే? 69

తే. గీ. అవనియందు శతాశ్వమేధావ బృథస
మంబు గృష్ణ సకృత్ప్రణామంబు జనన
మందుఁ దిరుగదశాశ్వమేధావబృథము
సేయువాఁడిందు జననంబుఁ జెందఁ డరయ. 70

క. [43]కురుకాశీగంగాదిక -
వరతీర్థాంతరములందు వలనౌనె గతుల్
హరియను నక్షరములు రెం
డురుగతినే నరుని జిహ్వా నూనిన యట్లన్. 71

ఆ. వె. శ్వపచియగునది మఱి రజస్వలయునైనఁ
బూనిక వశి సురామాంస భోజియైనఁ
దద్ద్విజుండంతమున హరిఁదలఁచి పూర్వ
పాపములఁ బాసి [44]తద్దివ్యపదముఁ గనరె! 72

సీ. ఉచ్చరించినమాత్ర నొనగూర్చుఁ గైవల్య
ముపవసించిన నీకయున్నె ముక్తి
హరివాసరమున జనార్దనుఁ బొగడి వం
దనము గావించి తత్కథలు విని వ్ర
తం బాచరింప వత్సరములు పదివేలు
గంగా తరంగిణీకాండ పూర
మున నవగాహించు పుణ్యంబు ప్రాపించు
మాకు లోకములకు మధువిరోధి

తే. గీ. జనకుఁ డేకాదశీ వ్రతశాలిఁ జూచి
యీర్ష్య సేయుట దుర్బుద్ధి యంత భాగ్య
శీలుఁడవు నిన్ను బంధించి చేతిగదలఁ
జూర్ణముగఁ జేయరైరి యో సూర్య తనయ! 73

---

43. కురి కాశీ

44. తద్దివ్యపదముఁ జెందు.

ఆ. వె. రాజ హితులఁ గాంచి రాజులకంటెనుఁ
దేజ మెసఁగ భక్తిఁ దిరుగఁడేని
[45]గర్వియైనతదధి కారిని వారలు
నిగ్రహింతు రొక్క నెపము చూచి. 74

ఆ. వె. రాజహితులు సాపరాధులైనను వారి
దండనంబు సేయఁదగునె పనుల
వారికెల్ల భూమి వల్లభు సత్కృప
[46]వార నిరపరాధు లైరిగాన. 75

తే. గీ. దండ్యులయ్యును విష్ణుతత్పరులు పరులు
దండ్యు లెన్నఁడుఁగారయో దండధర ! య
జాండ గర్భంబునందు నుద్దండమహిమ
వారి బంధులఁగాఁ జూడవలయు నెఱిఁగి. 76

క. [47]మద్భక్తుఁడైన నాభా
స్వద్భక్తుండైన నీకు సాహాయ్యక మే
[48]సద్భక్తిఁజేసెదను మురఁ
జిద్భక్తులు సేయ మాన్పఁ జెల్లదు మాకున్. 77

వ. సర్వదేవతలకు భగవంతుండాధ్యుండు. భగవద్భక్తుల నిగ్రహింపఁ దగదు. ఉభయపక్షంబులయందు ద్వాదశివాసరం బొక్కొక్క వ్యాజంబు చేతనే సాధించినవారు నీకవమానంబు చేసిన నేను నిర్వహింపశక్తుండఁ గాను. శక్తుండనై వచ్చితినేని స్వరూపహాని యగుఁగావునఁ దద్భక్త విరోధంబు సేయ వెఱతు నవినఁ గృతాంతుండు విజ్ఞాతకృతాంతుండై యిట్లనియె. 78

సీ. నీపాదములు గంటి నీరజోద్భవ నాకు
నిటువంటి యధికార మింకఁజాలు
హరివాసరవ్రత మాచరింపక యుండ
నరసి యా రుక్మాంగదావనీశు

45. గర్వియగు తదధికారిని
46. వారు
47. మద్భక్తుఁడైనయాభా। స్వద్భక్తుం డైన
48. సద్భక్తిం జేసెదను

నస్మద్విరోధి నత్యంతాంత రాయముల్
గల్పించి కలఁచి భగ్నముగఁ దద్వ్ర
తంబు దప్పించిన ధన్యుఁడనై గయా
పిండప్రదుని యట్ల పెంపు గాంతు

తే.గీ. నేతదాచార నిరతుల నింతనుండి
చూడవెఱతు హరిస్థితి చూడ్కులొక్క
వ్యాజమున నుచ్చరించిన నణఁగు మాతృ
గర్భబాధలు మత్పురిఁ గానఁ డెపుడు. 79

తే.గీ. నారదుండును గూడి విన్నపము సేయ
దండధరుఁ డంతకంతకు దైన్యమంద
నతని మన్నించుటకు నీరజాసనుండు
చింతతో నుండినపుడొక్క కొంత తడవు. 80

సీ. అలికాంత సంచల దలకాంత యలకాంత
యలకాంత కాంతలు నాత్మఁ గలఁగ
నవ్యభూషణ భూషణంబైన రూపరే
ఖా విలాసంబులు గల్గి మెఱసి
నిజమనోజాతయై నిత్యవిభ్రాంత మ
నోజాతయై పూర్ణతేజమంది
రుచిర విద్రుమల తారుణ్యంబు తారుణ్య
మును బూని మోహంపు మొలక యనఁగ

తే.గీ. నున్నఁ గమలాసనుఁడు చూచి యొఱపు నెఱప
మానసము కొంత గిలిగింతపూనఁ బ్రత్య
వాయ భయమున నిజనేత్ర వనరుహములు
భాసురజ్ఞాన భరమున మూసికొనియె. 81

## బ్రహ్మ మోహినీదేవతను బుట్టించుట

సీ. జననీ తనూజాస్నుషా భ్రాతృజాయా గు
రు ప్రియరాజ భీరువులతో స
రాగమై తగు నంతరంగంబునఁ దలంప
గాదు; సరాగమై పాదుకొనిన

చూపులనేనియుఁ జూడరాదిట్లైన
నరకంబు, శ్వపచియౌ నాత్మ, నాత్మఁ
జింతింపరాదు తత్కాంతలఁ, గాంచి చి
త్తక్షోభ మందిన తన్మహాదు

తే.గీ. రాత్మ నాజన్మకృతపుణ్య మప్పుడడఁగుఁ
దత్ప్రసంగం బొనర్చిన దశ సహస్ర
జన్మ సుకృతంబు లన్నియు సడలు నట్టి
సుకృతములు వోవ నాఖువై క్షోణినుండు. 82

వ. అది గావునఁ దద్రాగంబు వలదు; మఱియు 83

తే.గీ. తనయునకుఁ [50]బదిరెండేండ్లు దాఁటినపుడు
జననికేనియు నభ్యంగ సమయమునను
బాదము లొసంగఁ జనదు సంప్రాప్త పూర్ణ
[51]యౌవనోత్కటుఁడైనచో నాడనేల ? 84

తే.గీ. షష్టివత్సరములు దాఁటి చనిన జనని
సుతున కభ్యంజనముసేయ శుభతరంబు
శాటి దొలఁగిన నభ్యంగ సమయమునను
జనని యంగంబు వీక్షింపఁజనదు సుతుఁడు. 85

ఆ.వె. [52]తల్లి వృద్ధయైనఁ, దరుణుఁడైనను వృద్ధుఁ
డైన నాత్మజుఁడు నిజాంఘ్రు[53]లంట
నవనియందు నిడఁగ నభ్యంజనంబున
నొనరు రౌరవము తదు భయమునకు. 86

క. కరచరణంబులు దక్కం
దరుణీమణి పుత్రకునకుఁ దక్కిన యంగాం
తరములు మూయక చూపిన
[54]వరటక్రిమి పూర్ణయగుచుఁబడు నరకములన్. 87

---

50. బదియు రెండేండ్లు
51. యౌవనోత్కటుఁ డైనచో నెంచనేల
52. తల్లి వృద్ధయైన తరుణుఁడైనను
53. లిడఁగ
54. బరిత క్రిమిపూర్ణ

తే. గీ. పాదశౌచంబు స్నాన మభ్యంజనంబు
తత్స్నుషా హస్తమునఁ జేయఁదగదు చేసె
నేని యా పాపశీలుని మేను దొలఁచు
కూటముఖ కీటకంబు లక్షోభ్యశక్తి. 88

వ. అదిగాన సాభిలాషమానసంబున స్వసుతనేని వీక్షించినఁ బతితుండగు. రుచిరనాసావిలాసంబగు వ్రట్టువ మొగంబు శ్లేష్మాగారం బనియు, మేను వసామేధశ్చర్మమాంసావృతంబైన యస్థిపంజరం బనియును, నయనంబు లశ్రుబుద్బుదంబులనియు, స్తనంబులు మాంసగ్రంథులనియు, జఠరంబు మలమూత్ర పూరంబనియు, జఘనం బుదగ్రమాంస ఖండం బనియు, గుహ్యం బపానవాయు జుష్టమాత్రం బనియు, జంఘలు చర్మ భస్త్రికలనియు, నాభి నరకకూపం బనియు; నంగుళవితానంబు మాంస కణికలనియు వితర్కింపక నరుం డిట్లు వర్తిల్లెడు నని విరించి వివరించి ధైర్యం బవలంబించి యా బాలికం జూచి యిట్లనియె. 89

క. మనసునఁ దలఁచిన యట్లనె
జనియించితి శుభవిలాస సంపద నిన్నే
మన సునయన కల్పించితి
మనసునకుఁ మదనమోహ మాయా మహిమల్. 90

వ. అనిన నమ్మానసకన్య నవ్వి యవ్విరించికి మ్రొక్కి యిట్లనియె. 91

మ. సకల స్థావరజంగమాత్మక జగజ్జాలంబు మద్రూపరే
ఖకు మోహింపకయున్నె [55]నీవు నెదలోఁ గంజాతసంజాత భా
వుకముల్ గోరెదరేని ధర్మగణితవ్యుల్ భవ్యు లాత్మస్తుతుల్
ప్రకటస్ఫూర్తి నొనర్చిరేని నరక ప్రాప్తుల్ గదా మీఁదటన్. 92

తే. గీ. అయినఁ గార్యనిమిత్తమే నబ్జజాత!
చెల్లు నాత్మప్రశంసలు చేయ, సకల
మోహమూలంబుగా నీవు మొదల నన్ను
నిట సృజించితి విటఁ బనియేమి నాకు. 93

55. నీవు నొదలో కంజాంత సంజాత భావుకముల్

మ. [56]నను వీక్షించి యచేతనంబులు మహోన్మాదంబునం [57]జొక్కఁ జే
తన వస్తువ్రజముల్ గలంగవె ! సముద్యచ్ఛ్వాస నిశ్వాసతం
జని యిట్లంటినఁ జోద్యమే, యువతి వీక్షావర్ణనా ఖేలనన్
జనియించుఁ బ్రతభంగి సంగి హృదయాసంగంబు లెవ్వారికిన్. 94

మహాస్రగ్ధర.
వితత భ్రూచాపముక్తా వితథ శశిముఖీ
వీక్షణోగ్రాశుగంబుల్
ధృతి చిందన్ ధీరహృద్భిత్తికలు పలుమఱున్
దీటి నాటించఁగా, ను
ద్ధతిఁ దానెందాఁక వేడందను కనవ్రతముల్
ధైర్యమున్ లజ్జయున్ ద
క్షతయున్ దేహేంద్రియస్వస్థతయు వినయమున్
సర్వమర్త్యాళి కుర్విన్. 95

మ. సరిగాఁ బోల్తురు చంద్రబింబమని యోషావక్త్రబింబంబునే
సరసుల్ [58]కావ్యలసత్కవిత్వ విభవైశ్వర్యంబునన్ మూఢులై
ధరపై దానికి నెవ్వి [59]భ్రూవిలసనోద్యద్విభ్రమాపాంగభం
గుర వీక్షాదరహాస మోహనకళాకోపప్రసాద స్థితుల్. 96

శా. ఔరా ! జవ్వని మోహనాంగి భళిరా హా ముగ్ధముగ్ధోక్తి భా
మారత్నంబని మాటిమాటికి మదోన్మత్తుండు చింతించి యా
నీరేజానన కేళికిన్[60] మలయుఁ బూన్కిం గంతుఁడేఁచంగ, వి
ద్యారూపంబగు మంత్రదేవత తదంతర్యామియుం బోలుచున్. 97

క. తావక సురనర వర్గము
నే వెతలంబెట్ట నేర దీక్షించి మదిన్
భావించి గారవించినఁ
బూవుంబోఁడులు కలంచి పోవరె వేగన్. 98

---

56. నని వీక్షించి
57. జొక్క చేత వస్తుల్ వ్రజముల్ గలంగవె సముద్యచ్ఛ్వాసనిశ్వాసతం.
58. కావ్యులు సత్కవిత్వ
59. భూ
60. మలయ

వ. అది కావున నేకార్యంబునకు నన్ను నియోగించితి వానతీవే యని విన్న
వించిన విరించి యిట్లనియె. 99

సీ. సత్యమాడితి(వె) యసాధ్యమె నీకు నీ
భువనత్రయంబు, నీ పూర్ణశక్తి
మచ్చిత్తమేని, నీ మాయఁజిక్కఁదె ! ఘన
జ్ఞానాంకుశమున నిశ్చలత నిలిపి
నాఁడఁగాక, వయోధన నిధానమైన నీ
రూప కళాలక్ష్మి చూపి యాడి
పాడి విలాస సంపదల మించిన మనో
జాతుండు నీకు దాస్యంబు సేయు

తే.గీ. మెఱయ స్త్రీవ్యక్తులెల్ల నిర్మించినాఁడఁ
గాని యిటువంటి రూపరేఖావిలాస
విక్రమస్ఫూర్తి లోకవింత వింతలయ్యె
నింతి ! నాకైన శక్యమే యిఁక సృజింప. 100

వ. అని బహూకరించి యిట్లనియె. 101

## బ్రహ్మ మోహినికిం గర్తవ్యం బుపదేశించుట

తే.గీ. అవని విదిశాపురంబేలు నతిబలోద్ధ
తాంగదుండైన యట్టి రుక్మాంగదుండు
వరలె సంధ్యావళి యనంగ వాని భార్య
సుదృఢ సంధ్యావళీ సదాస్తుత చరిత్ర. 102

సీ. [61]ఆ రాజ సుతుఁడు ధర్మాంగదుండను వాఁడు
తండ్రికంటెను మహౌదార్యగుణము
నందధికుండు నాగాయుత బలశాలి
ధరణిఁ బ్రసిద్ధ ప్రతాప హేళి
క్షమ ధరాదేవత ఘనుఁ డాత్మజనకుఁ డా
ఢ్యుండు జంబూద్వీప మొకటి యేలె
నితఁడు సప్తద్వీప వితతధాత్రీ మండ
లంబెల్ల నేలు శౌర్యంబు మెఱసి

61. ఆరాజ సుతుఁడు

తే.గీ. తండ్రివాక్యంబు లేశంబు దాఁటఁడతుల
ధర్మశీలుండు మాతృశతత్రయైక
తత్పరాశయుఁ డన్యకాంతా విమోహుఁ
డమ్మహామహు మహిమ శక్యంబె పొగడ. 103

వ. ధర్మప్రధానుండైన యారాజు మందరాచలంబునకుఁ దురంగంబు నెక్కి-
రాఁగలండు. నీవు నచ్చట నుండి గీతంబున మోహంబు నొందించిన
హయంబు డిగ్గి గిరి నితంబంబున నిన్నుం గవయునెడ నీ దారనయ్యెద
నుదారా! నా మాట యొక్కటి చేసెదనని శపథంబు సేయుమని భ్రమ
యించి దక్షిణకరంబుఁ గైకొని కొన్ని దినంబులకు సురతాంతతాంతా
త్ముండై చొక్కి-నయెడ నగి పూర్వశపథంబుఁదలంచికొని తచ్ఛపథంబుఁ
బాలింపుమన నతం డంగీకరింపననియే నిన్నుఁ బాసి నిమునంబు
నోర్వ; [62]దశమ్యేకాదశీ ద్వాదశీ నిశాత్రయంబెల్ల నెడఁబాయుదు (ననుఁ
యౌవనోపేతయై సుముఖియైన స్వభార్యం గవయక సర్వాకాంక్షి)
యగు దురాచారుండు నరకంబు లొందు. శ్రాద్ధకాలంబు లందేనియు
నుపవిష్టులై ద్విజులు భార్యాసంగమంబుఁ గోరిన ననుభవింపందగు
నండ్రని బోధించిన నీ వ్రతంబు మానండేని నిజధృత కరవాలంబున
ధర్మాంగద శిరోనికర్తనంబు చేసి మదుత్సంగంబునఁ దచ్ఛిరంబు
నిలుపుమనినఁ బ్రాణసముండైన పుత్రుని హింసింపఁడు. బ్రాహ్మణ
వాక్యోపదేశంబున హరివాసరంబు విడుచునట్లైనఁ బూర్వమార్గంబునం
దిరుగుచు జనులు యమకింకరపాశబద్ధులై యమాంతికంబున కేఁగెదరు.
రాజును సత్యంబును నిలుపుకొనఁ దనయుని హింసించెనేనియు నశేష
కల్మషంబులంబాసి పరమధామంబుఁ జేరుననిన విని యా కమలలోచన
తండ్రివి, యాత్మజనైన నాకు నెయ్యది నామంబెట్టు మందరంబున
కేఁగుదు ననిన మోహినియను పేరు గావించి నిజశిష్యుల వెంట
నియోగించి పంచిన ధాతకుం బ్రణమిల్లి యమరులు వీక్షింపం దృతీయ
ముహూర్తంబున మందరగిరి శిఖాగ్రంబునకు డిగ్గె నప్పుడు. 104

మ. ఘనతఱ్ వాసుకి వేష్టనోత్థ శుభలేఖల్ మీఱు షడ్లక్షయో
జన విస్తీర్ణ పయఃపయోనిధి సమంచద్గద్గరీ మధ్య మం
థన మంథానత కూర్మకర్పర నిరోధ ద్రాగ్విభిన్నత్వ మొం
దని సారంబున నున్న కొండ గిలిగింతల్గ్లొల్ప నీక్షింపుచున్. 105

62. దశమ్యేకాదశీ ద్వాదశీ నిశాత్రయంచెల నెడబాయుదు. యౌవనోపేతయై

సీ. ప్రబల సురాసుర ప్రవరుల కెడలింప
నలవిగాని నగేంద్ర మరయనెద్ది ?
హరికి వ్యామగ్రాహ్యమై భుజాంగదసము
త్కృష్ట సారంబైన గ్రావమెద్ది ?
పుక్కిటిబంటిగాఁ బూర్ణదుగ్ధాంభోధి
నోలలాడెడు మహాశైలమెద్ది ?
భూత జాలావృత పురమర్దనైక వి
హార సౌధంబైన యచల మెద్ది ?

తే.గీ. దివిజులకు రచ్చ, తాపసప్రవరులకుఁ ద
పంబు పంట, సురాధిప భామలకు ర
తి ప్రవర్తన వశ్యాధిదేవత, వివి
ధౌషధంబుల కాకరం, బట్టి శిఖరి. 106

చ. అయుతమువేయు యోజనము లగ్గిరిమూలము దానియంతయే
నియతముగా వెడల్పును వినిర్మలకాంచన రత్నశృంగముల్
వియదవనీతలంబులను వింతలుగొల్పు మణిప్రభా [63]మహో
దయములు మించ ధామనిధి ధామ మడంగఁగఁజేయఁ దద్గిరిన్. 107

తే.గీ. అర్కతేజంబు దివ్యరత్నాలి గ్రోలి
యగ్గిరీంద్రంబు మెఱయ నయ్యవనిధరము
నంగలావణ్య ధాళధళ్యమున వింత
మెఱుఁగు వెట్టుచు నొకశిలమీఁద నిలిచె. 108

తే.గీ. సప్తయోజన విశ్రుత శక్రనీల
కలిత తచ్ఛిల దివ్యలింగంబు [64]మెఱయు
నది వియల్లింగ మన దశహస్తమిత మ
హోచ్చతయు [65]నిన్మడి వెడల్పు నొనరి వెలయు. 109

వ. ఆ దివ్యలింగంబు సన్ముఖంబున. 110

---

63. మహోదయమును మించ
64. మెఱయ
65. నినుమడి

శా. ఆ రామామణి మూర్ఛనల్ బెళక గీతానీకముల్ వాడె గాం
ధారగ్రామము మేళవించి శ్రుతులం దాళంబులం దంత్రులం
[66]గోరం జీఱిన నేఱుగా నమృతముల్ ఘూర్ణిల్ల శైలంబులున్
సీరైయుండఁగ వల్లకిన్ మృదుకరోన్నిద్రస్ఫురన్నైపుణిన్. 111

క. తద్గీతామృతధారలు
హృద్గోళమునాటి కరఁగి యేతెంచె సము
ద్యద్గరిమమై దిగంబరుఁ
డుద్గత కందర్పసాయకోత్పాటితుఁడై. 112

మ. తనిసెన్ మానుషభోగ సంపదలచేతం జాలఁ బెక్కేండ్లు కృ
ష్ణునిఁ బూజించె విరోధులందునిమె నక్షుద్ర ప్రతాపంబునన్
మనుజానీకముఁ బట్టి యీక యమధామంబంతయున్ విద్య నే
ర్పునఁబాడై పొగులంగఁజేసె నరుఁడే రుక్మాంగదుం డుర్వరన్. 113

సీ. అతఁ డొకనాఁడు ధర్మాంగదుఁ బిలిచి యేఁ
బాలించినట్లు భూపాలనంబు
సేయుము పుత్రుఁ డూర్జిత బలసంపద
చే సమర్థుండయి సిరి వహించు
రాజ్యభారంబు తోరంబుగా నిలుపని
రాజు కీర్తియును ధర్మంబు నణఁగు
నటువంటి సుతుఁడు గుణాఢ్యుండు గలుగ సు
ఖంబు నొందని దురాగ్రహుఁడు పాపి

తే.గీ. జనక భార భరణ దక్ష శౌర్యశాలి
యైన సూనుఁడు తద్భారమానఁడేని
చర్చసేయ నజాగళస్తన [67]సమానుఁ
డతఁడు మనుజులలో నధమాధముండు. 114

ఆ.వె. కన్నతండ్రి కంటె ఘనుఁడనఁగాఁగీర్తి
గల్గి సూర్యదీప్తి ఘనతగాంచి
భూమి వెలయునట్టి పుత్రుండు పుత్రుండు
వాఁడె యుభయవంశ వర్ధనుండు. 115

---

66. గోరం జీరిన యేరుగా నమృతముల్ ఘూర్ణిల్ల శైలంబులుం
67. సమాను నతఁడు

క. జనకున కతిఖేదముగాఁ
దనయుఁడు వర్తించెనేని తత్తనయుఁడు [68]క
ల్పనియుతము ఘోర నిలయము
ల ననయమును గూలు దుఃఖరాశి యనంగన్. 116

ఆ. వె. తండ్రిమాట యింతదాఁటక గృహమున
సకలభారములు స్వశక్తిఁ బూని
తెలివి నున్న సుతుఁడు దేవేశు సన్నిధి
నుండు దివిజులెల్ల నుల్లసిల్ల. 117

క. వెలయఁగ నిద్రాహారం
బులులేక యహర్నిశంబు భూప్రజలకునై
సలిపితి సత్క్రియ లుర్వీ
స్థలిని ప్రబుద్ధుండనైన దనుకఁ గుమారా! 118

సీ. శైవమార్గంబున సంచరించిన వారి
సౌరమంత్రోపాస్తి సలుపువారిఁ
బద్మాసనాచార పద్ధతి మనువారిఁ
బార్వతీ మతవృత్తిఁ బఱఁగు వారి
నరసి సాయంప్రాత రశనముల్ గొనువారి
నిత్యాగ్నిహోత్రులై నిలుచువారి
సతత తీర్థాసక్తి జరుగుచుండెడువారి
శ్రాద్ధకర్మనియతిఁ బ్రబలువారి

తే. గీ. బాల యువ వృద్ధ గుర్విణీ బాలికా స
రోగ వికలతరాసక్త భోగ[69]శీలు
రైన వారిని హరివాస రాభిమాన
చణులఁజేసితి శాస్త్ర విశ్వాసమహిమ. 119

వ. కొందఱిని విత్తదండనంబుగావించి కొందఱిని విద్వన్ముఖంబున శాస్త్రదృష్టిని శాసించి నిగ్రహించిన నందఱు నిరాహారులైరి. ఇందునకై ధరాతలంబున సుఖంబెఱుంగనైతి. ప్రజలు కొందఱు దుఃఖింపుదురు. కొందఱు సమ్మతింపుదురు. అటుగావున స్వహస్త పరహస్తంబులఁ బ్రజారక్షణంబు చేసిన నక్షయలోకంబులుగలవని పెద్దలానతి యిచ్చిరి. ఇంక మృగయా విహారాది భోగంబులనుభవించెద. 120

---

68. కల్పనియుత ఘోరనిలయముల
ననయమునుంగూలు దుఃఖ రాశి యనంగన్.

69. భోగశీలులైన వారిని

క. పానద్యూత సుఖంబది
యేనో మూలంబు దాని నేనొల్లఁ ద
త్పాన ద్యూతాసక్తమ
హీనుఁడు హీనుండు నరక మిది యద్భుతమే. 121

శా. ఆఖేటాటనకేలిమై నిఁక నరణ్యానీ నదీ రాజధా
నీ ఖేటర్ధి పరాక్రమాది తతులఁ వేష్టింతు భావత్కుఁడో
శ్యాఖఁ భారము నిల్పి కాంచెద నశేషస్వేష్ట భోగంబు లే
నీక్షేదంబున నున్న నాకు నిరయంబీ మీదఁ బ్రాపించెడిన్. 122

వ. అనిన ధర్మాంగదుం డిట్లనియె. 123

సీ. అఖిలభోగంబులు ననుభవింపుఁడు సుదు
ర్ధర ధరాభార మిద్ధరణిఁ దాల్చు
తావక వాక్యవర్తనమున నడుచుట
కంటె ధర్మం బొండు గలదె నాకుఁ
బితృవాక్య పాలనస్థితిలేని యితర ధ
ర్మమున నధోగతిప్రాప్తి గానఁ
గావింతు నీదు వాక్యక్రమంబున నన
రాజ సన్నిభుఁడైన రాజమౌళి

తే. గీ. వేఁట కుద్యుక్తుఁడయ్యె నావేళఁ బ్రజలఁ
బిల్చి ధర్మాంగదుండు గంభీర మధుర
భాషణంబుల లాలించి భక్తి వారి
యంతరంగంబు చిగురొత్త నప్పుడనియె. 124

మ. నను బోధించె ధరాభరంబునకు భూనాథాగ్రగణ్యుండు పు
జ్జనకుం డావచనంబు సేయుట ప్రశస్తంబైన ధర్మంబు మ
ద్ఘనతేజంబున మిమ్ము దండ ధరుఁడుఁ దండింపఁగాలేఁడు మీ
రనఘుల్ శ్రీహరిఁ గొల్వుఁడే సుకృత కర్మారంభులై నిత్యమున్. 125

వ. ఏను బితృమార్గంబునకంటె నధికంబైన యది మీకు నెఱింగించెద. జ్ఞాను లెల్లను సర్వంబు బ్రహ్మార్పణంబు సేయవలయు. మా తండ్రి శాస్త్రక్రమంబున హరిదినోపవాసంబు సలుపవలయునని యానతియిచ్చె. అదిగాక యాత్మకుం బునరావృత్తి రహితంబైనయది తద్బ్రహ్మార్పణ సంజ్ఞికంబైన విశేషంబుగల దీరెండు నవశ్యంబుగా నాచరింపవలయు నని ప్రజల మఱియు నూరడించి యహర్నిశంబును గంటికి నిద్రలేక

శౌర్యంబున నన్నిదిక్కులు విమర్శింపుచు, ధాత్రి నిష్కంటకంబుగా నేలుచు, నేకాదశి నుపవసించి ద్వాదశి సాధించి త్రివిధకర్మంబుల యందు మమత్వంబు విడిచి దేవేశుం జింతింపందగు. హవ్య కవ్యంబులు దదాత్మ యగు జనార్దనునకే సమర్పితంబులు సేయవలయు. తురీయుం డయ్యు హృషీకేశుండు నిసర్గంబున జగత్పతి యగు. స్వజాతి విర హితంబైన సన్మార్గంబు నందున్న మాధవుండే యుపాస్యుండని, పురుషోత్తముండే భోక్తయు భోక్తవ్యంబును [71]సర్వకర్మంబులందు నతని కేది నియోగం (బది) సేయందగునని మేఘధ్వానంబగు పట హంబు హస్తిమస్తకంబున మ్రోయింపుచుఁ జాటించు ధర్మాంగదు మహిమ తనకంటె నధికంబని యెఱింగియు సంధ్యావళిం జూచి హర్షించి రుక్మాంగదుం డిట్లనియె. 126

సీ. పద్మాక్షి ! చూచితే పద్మాక్షివోలె నా
నంద కందంబైన నందనుండు
జనియించె [72]మనదు వంశంబు(ల్ పవిత్రంబు)
లయ్యె మోక్షంబను నట్టి వార్త
వింటిమి గాని కన్గొంటలే దెవ్వఁడు
నెందైన మదికి నభీష్టుఁడైన
వినయసంపన్నుండు ఘనతర దృఢశౌచ
శాలి ప్రతాపి మోక్ష ప్రకాశ

తే.గీ. [73]రూపుఁడు భయాన్వవాయ ప్రదీపకుఁడగు
తనయుఁ డుదయించి సకల సత్కర్మకరణ
దక్షుఁడైయున్న వీక్షించి తండ్రి యాత్మ
యందు నానందమందుట యమృతపదము. 127

క. స్థావర జంగమ రూపం
బౌ విశ్వత్రయమునందు నతిసౌఖ్యంబో
దేవి ! సుపుత్రుఁడు జనకుని
భావమెఱిఁగి యతఁడు పూను [74]భారముఁ బూనన్. 128

---

71. సర్వకర్మంబులందున్నతని కేది నియోగంబు సేయందగు
72. మనల వంశము . . . .
73. రూపుఁడు భయకులప్రదీపకుఁడగు
74. భారముఁ బూనున్.

క. దక్షుఁడు నీరేరుహలన
దక్షుఁడు పుత్రుండు భారమానెడు నో ప
ద్మాక్షి ! మృగయా విహారా
పేక్షం దిరిగెద మహామహీధర వనులన్. 129

వ. అనిన సంధ్యావళి యిట్లనియె. 130

సీ. సత్యంబు పలికితి జననాథ ! పుత్ర సౌ
ఖ్యము శతక్రతుఫల సమధికంబు
స్వామి ! సప్తద్వీప సంవేష్టితావనిఁ
బ్రబలితి పుత్రునిఁ బ్రభునిఁ జేసి
భుజశక్తి మృగహింస పూనంగఁ దగదు జ
నార్దన ప్రీతిగా యజ్ఞములు స
మృద్ధిఁ [75]గావించు ప్రసిద్ధికి నెక్కంగ
భోగ స్పృహావృత్తిఁ బొరలక సుర

తే.గీ. నరవరానందముగను మానసము నిలుపు
మట్లు నడచిన న్యాయ మన్యాయ మధిప !
మృగయ మృగయాతనాకర మగణితముగఁ
బుత్రవంతులు మృగయాశఁ బొందరిట్లు. 131

క. హరిఁ బూజింపు మహింసా
పరమో ధర్మమనఁగ వినవె పార్థివ దోషాం
తరములఁ బొరయని మృగములఁ
బొరిగొన నిజధర్మహాని భూపాలురకున్. 132

సీ. విద్వజ్జనంబు షడ్విధ మని జీవహిం
సాఘంబు వర్ణింప నతిశయమున
మొదలి పాతకి యనుమోదించిన యతండు
ఘాతకుండు ద్వితీయ పాతకి యగు
విశసనపరుఁడు భావింపఁ దృతీయ పా
తకి యగు మాంస భక్షకుఁడు దాఁ జ
తుర్థపాతకి ఘటితోఁ బచన మొనర్చు
నతఁడు పంచమ పాతకాన్వితుండు

75. గావించు బ్రసిద్ధికి

తే.గీ. షష్ఠపాతకి విక్రియాచరణపరుఁడు
హింసచేఁజేయు తద్ధర్మ మేటిధర్మ
మది యధర్మంబె యండ్రు విద్యార్థు లెల్ల
పాపమేటికి ధర్మసంపత్తి గాక. 133

వ. అది గావున మృగహింసా సముద్భవంబైన స్వభావంబు విడువుము. మున్ను రాజులు మృగయా విహారంబుచేత నష్టులైరని బోధించిన భార్యం జూచి యిట్లనియె. 134

మ. అబలా ! నే మృగహింససేయ మృగయావ్యాజంబునన్ నిర్భర
ప్రబలాభీల నిషాద భిల్ల శబర ప్రాయాటవీసీమ ది
క్ప్రబలశ్వాపద తస్కరాది భయముల్ ప్రాపింపకుండఁ బ్రజఁ
బ్రబలంజేసెద వెంట నిర్భరధనుష్పాణుల్ ననుం గొల్వఁగన్. 135

క. తానేని తనయుఁ డేనియు
భూనాథుఁడు పూనవలయు భూభారముఁ ద
న్మానవులఁ బ్రోచి మఱి స
న్మానించని ధర్మమైన నరక మొనర్చున్. 136

వ. అని సమ్మతింపం జేసి. 137

## రుక్మాంగదుఁడు వేఁటకు వెడలుట

మ. పవనం బాకృతిఁ దాల్చె నాఁగనెఱి చౌపట్టాలు వ్రేడెంబు మేల్
రవకాల్ద్రొక్కులు మండలభ్రమణ ధారాపాత సవ్యాపస
వ్యవికృత్త్రక్రమ సంక్రమక్ర[76]మము లొప్పంజారు వాత్తేజిపై
నవనీనాథవతంస మేఁగె మృగయాయత్తైక చిత్తంబునన్. 138

మ. శతకోటి భ్రమించి బాలతరుణీజాల స్తనోత్పీడనో
ద్యతమై చక్రఘటాంకుశధ్వజసురేఖాన్వితమై నవ్యభ
వ్యతరాశోక మహీజ పల్లవనిభంబై యొప్పు [77]సవ్యేతరో
న్నత హస్తంబు మహీసుపర్వులకు నంతఃప్రీతిగాఁ జూపుచున్. 139

వ. చను నా సమయంబున. 140

---

76. క్రమము తోరంబౌర వాత్తేజిపై
77. సవ్యేతరా శతహస్తంబు

క. వడదోఁట్ల విల్లు నమ్ములు
జడకట్టిన వంకసిగలు జాగిలములు పె
ల్లడిదంబులు వేటరు ల
ప్పుడుపిడుగుం [78]దునియలట్లు మొగి నాల్చంగన్. 141

క. హరి కరికిరి గండక కా
సరగవయ తరక్షు ఋక్ష శల్యకులంగో
త్తర భీకర ఘోరవనాం
తరముల కపుడేఁగె ధరణిధవుఁ డుత్కంఠన్. 142

సీ. పరిపక్వ బహువిధ ఫలశిక్యములతోడ
[79]క్షౌద్ర వివధ సహస్రములతోడఁ
బంచషసారంగ బాలోత్కరము తోడఁ
బంజరకీరడింభముల తోడఁ
బరిరటత్సంకు శాబక వితానముతోడఁ
గస్తూరికామృగోత్కరముతోడఁ
బల్యంకికాదండ బహుదండముల తోడ
భవ్య చామర కదంబముల తోడ

తే.గీ. నేల యీనినగతి వచ్చినిలిచి కొలువు
మ్రొక్కు మ్రొక్కియొయారంపు మొనలుదీర్చి
చెంచుదొర లందఱును విన్నవించి రొక్క
వింతగానంత ధారుణీ విభుని యెదుట. 143

సీ. గావుపట్టెదఁ దొలంగక నిల్చెనేని బె
బ్బులుల నెన్నిటినైనఁ [80]బూని తెత్తు
నెలుఁగుఁ గూల్చెద నొక్క [81]యలుగున నిపుడు నా
యెలుఁగునఁ గడకడ కేఁగకున్నఁ
దగరుతాఁకుల బోడతలలుగాఁ దాఁకింతుఁ
గారుపోతులఁ గొమ్ముగములు విఱిచి
యొంటిగాఁ డెదురైన బంట పోకు మటంచు
ధాకమై విదలింతు నీ కటారి

78. దునియలట్లు పెల్లార్చంగన్. 79. క్షౌద్ర
80. బూని తెచ్చి 81. యెలుఁగున

తే.గీ. భీకరంబుగఁ దముఁ దామె పెట్టికొనిన
బిరుదు లేటికిఁ జూడు నా పెంపు సొంపు
పట్టనేటికి జముదాళి బాకు కిరుసు
సురియ విలునమ్ములున నేఁడు చూడు రాజ ! 144

తే.గీ. పులి యెలుఁగు పంది దుప్పి కార్పోతు మన్ను
జింక యన నెంత నేఁడు నాచంక నిఱికి
వేనవేలుగఁ దెత్తు నావేఁట చూడు
సామి ! బంటుతనంబును సాహసమును. 145

తే.గీ. నూటి కొక్కండు నా మూఁక పోటుబంటు
సామి ! పులుఁగైన వెలుఁగైన నేమి విడువు
కత్తియుఁ గటారి నేఁటికి కదిసి నపుడె
చంకఁగొట్టి యడంతు నిశ్శంక వృత్తి. 146

వ. అనుచు [82]వీరాలాపంబు లాడుచుండ. 147

తే.గీ. దంష్ట్రికాగ్ర సమాలగ్న తత సువృత్త
నిరుపమిత పంకపటలమై యరుగుదెంచు
నట్టిఘోరవరాహంబు నవని నాథుఁ
డప్పు డాదివరాహమౌ ననుచు విడిచె. 148

తే.గీ. కృష్ణసారాగ్ర గణ్యత కీర్తి కెక్కు
[83]దానిపై బోయ యెప్పుడు తగిలి యేయు
నపుడు మీఁదట నయ్యేడు ననుచు మాన్పె
భూవరుఁడు భక్తినిష్ఠాతి పూర్ణుఁడగుచు. 149

## రుక్మాంగదుడు వామదేవునిఁ జూచుట

వ. మఱియు నొక్కరుండు శార్దూల మస్తకంబుపైఁ దీవ్రంబులైన క్షుర ప్రదరంబులు రెండునాటి యజంబుఁజేసి విడిచె. ఒక్కఁడు కార్పోతు విషాణంబులు విరిచి పందికొమ్ము సురియచే వదనంబు గ్రుమ్మి యేకలంబులంజేసి పాఱిందగిలె. ఒక్కరుండు చమరీమృగంబులం గరంబుల బాహుమూలంబులఁ బదంబుల నంసంబుల నిఱికించుకొని

82. వీరాలాపంబు లాడుచు
83. దానిపైఁ బోయవప్పుడు తగిలి యేయ నపుడు

బిరుదుజల్లులు వైచిన కైవడి విజృంభించె. ఒక్కరుండు భల్లుకంబుం గవయించుకొని యీడ్చి కంటకలతాకుంజంబుల వత్సంబులంబోలెఁ దదీయ శిలాలతికలం గట్టివైచె. ఒక్కరుండు వ్యాఘ్రనఖంబుల శశంబు శిరోభాగంబునం గ్రుమ్మి విషాణంబులు గల్పించె. ఒక్కరుండు కురంగనాభిస్థలంబు నఖంబులంజీరి తన్మదధారలు పయింజల్లుకొని వీరరసావేశంబు దాల్చినట్లు రాణించె. ఒక్కరుండు గైరికారక్తగాత్రుండై శిఖావంతుండై లోహితాశ్వుండయ్యె. ఒక్కరుండు గండకంబుల వంశలతావలయంబులు దూలించి నర్తింపంజేసె. ఒక్కరుండెట్టు మెకంబుల నేని కరచి విదళించి శరంబునం గ్రుమ్మి కరంబునం జిమ్మి యురంబునం గ్రమ్మి విజృంభించె. ఇట్టు చలాచలలక్ష్యభేదులై నిషాదులు ముందఱ మార్గంబు చూపఁ బక్కణంబులఁ గుంజాగ్రంబుల నారవైచిన పలలంబు లంటిన చామరంబులును, సంకుమద పల్వాలంబులును, ద్రోవులైన కస్తూరికా పంకంబులును, గొండలైన కరిమౌక్తికంబులును, నేరులైన నానాఫలధాతుసధారలును, బడి మొలచిన కప్పురంపుటనంటి మొక్కలును గలుగం జూచుచు మృగయావిహారంబు సలిపిన యట్లనె యేఁగుచు మున్యాశ్రమంబులు దాఁటి యష్టోత్తర శత యోజనంబులు గడచి కదలి యశోక నాగపున్నాగవకుళ నారికేల సాలరసాల కందరాల సింధువార చందన స్యందన నీపలోధ్ర కలిద్రుమప్లక్ష ఖదిరాది నానాతరుశోభితంబై సుగంధిగంధవాహ బంధురంబైన యొక యాశ్రమంబున హుతభుక్తేజులగు మునిరాజుల వీక్షించి తురంగమంబు డిగ్గి బహుశిష్య సమేతుండైన వామదేవునిం గాంచి దండప్రణామం బొనరించిన నతండు కుశాసనంబు వెట్టించి యర్ఘ్య పాద్యంబు లిప్పించి యిట్లని వినుతించె. 150

మ. ఫలియించెన్ దపముల్ ఫలించె హుతముల్ పాత్రైకదానంబులున్
ఫలియించెఁ ఫలియించె సత్క్రియలు శ్రీపద్మాధిపార్చావిధుల్
ఫలియించెఁ ఫలియించె మజ్జనన సంపద్భాగ్య సౌభాగ్యముల్
ఫలియించెఁ నిను విష్ణుభక్తి నిధి భూపాలాగ్రణిం జూచితిన్. 151

తే.గీ. మహి సుకర్మస్థులును వికర్మస్థులును మ
హాత్మ! నీదు వ్రతంబున హరిపదంబు
గనిరి నినుఁజూడఁ జిత్తముత్తంతఁ జెందు
నంతలోననె ప్రత్యక్షమైతి భూప! 152

వ. అని వామదేవుం డానతి యిచ్చిన రుక్మాంగదుం డిట్లనియె. 153

క. ననుఁగొని యాడకుమో ముని
జననాథ ! భవత్పదాంబుజాత పరాగాం
శనిజ మహత్త్వము దలదే
జన విభుఁడ మదాంధుఁడఁ బ్రశంసార్హుఁడనే ? 154

క. ధరణి సురవర్యులం గని
పరితోషమునొంద విష్ణుభక్తి ఫలించున్
ధరణీసురవర్యులఁ గని
పరితోషము నొందకున్న ఫలియించ దిలన్. 155

ఆ. వే. అనిన వామదేవుఁ డనియె నాగృహమున
కరుగుదెంచితివి మహాత్మ ! నీ క
భీష్టమెద్ది ? [84]తెలుపు మిచ్చలు హరి దిన
వ్రతపరాయణైక మతధురీణ ! 156

వ. అనిన రుక్మాంగదుండు కరంబులు మోడ్చి యిట్లనియె. 157

సీ. తాపసోత్తమ ! భవత్పాదపద్మంబులు
గాంచునంతనె సర్వకామితములు
నాకు లభించె సన్మౌనీంద్ర ! యొక సంశ
యం బాత్మలో నున్నయది యణంపు
మనఘాత్మ ! లోకత్ర యాధిక సౌందర్య
శాలిని మద్భార్య సాధుచర్య
ననుఁ జూచు నవ్యమన్మథునిగా నా సాధ్వి
ద్రొక్కినచోట్ల నిధుల్ ప్రకాశ

తే.గీ. మందు నంటినచోఁ బాప మవియు నగ్ని
పాసి సిద్ధించు షడ్రస బహువిధాన్న
ములు భుజింతురు విప్రకోటులు ధరిత్రి
తన్మహత్త్వంబు చెప్పఁ జిత్రంబు కాదె ! 158

తే.గీ. బ్రాహ్మణోత్తములును విష్ణుభక్తులును జ
రాంధులును రోగులును వచ్చి యాశ్రయింప
నాత్మఁ గరఁగు నవజ్ఞ సేయదు తదీయ
వాక్యములు ద్రోయదు విశిష్ట వర్తనమున. 159

---

84. తెలుపు నిచ్చలు

క. ఇటువంటి సాధ్వీకడుపునఁ
గుటిలారి విభేదియైన కొడు కుదయించెన్
బటుతర మదోత్కటోద్భట
పటహోర్భటి హరి దినప్రభావము నెరపెన్ 160

సీ. నా మాట జవదాఁటఁ డేమియునేని లో
కమున సత్పుత్రుని గనినవాఁడ
నేను జంబూద్వీప మేలితిఁగాని స
ప్త ద్వీపములు నేలె బాహుశక్తి
రణమున వైరి [85]ధరాతలేంద్రుల గెల్చి
యనగ విద్యుల్లేఖ యనఁగ మించు
దాని నా కర్పించె దర్పించి విక్రమ
ద్రవిణశాలుర నయుతద్వయము ద

తే.గీ. శాధికంబున నోర్చి నిరాయుధత్వ
మందఁజేసి జయించె బాల్యమున శ్రీప్ర
భుత్వ పరరాజ్యమున కేఁగి పూని కాంచి
యేర్చి యెనమండ్రు కన్యల నిచ్చె నాకు. 161

క. దివ్యపట దివ్యభూషణ
దివ్యమణి ప్రదరములను దీపించఁగ వా
స్తవ్యం డాతఁ డొసంగెం
భవ్యంబుగ జననికిఁ శుభప్రద నిధికిన్. 162

క. అకలంకచిత్తుఁ డాతం
డొకనాఁ డీ పృథివియెల్ల నుల్లాసముతోఁ
బ్రకటముగఁ దిరిగి మత్పా
దకమలజాభ్యార్చనము ముదంబునఁ జేయున్. 163

వ. మఱియు విశేషంబునం బ్రాప్యజనంబు శిక్షింపుచు నిశాంతరంబున నప్రమత్తుండై మద్ద్వారంబుఁ గాచికొని జనుల మేల్కొలుపుచు నుండు. అప్రమేయంబులగు వైభవంబులఁ దనయుం డిట్టి మహాతనయుండు గలుగ గృహంబున శుభ భోగ్య ద్రవ్యంబులు గలవు. శుభాకార ప్రయోజనంబులు గలవు. వాజివారణరథధన ధాన్యంబు లనంతంబుగాఁ

85 ధరాతలేంద్రులఁ గెల్చి

గలవు. మదాజ్ఞాపాలకులగు పూర్వపరిజనుల మూఁకలు గలవివి
పూర్వజన్మ సుకృతంబుననో ? ఆ సుకృతంబెట్లు ప్రాప్తంబయ్యె నెఱిం
గింపవే మహాత్మా ! 164

శా. ఆరోగ్యం బనుకూలకాంత గృహభోగ్య ద్రవ్య సామగ్రి దై
త్యారాతిస్ఫుటశక్తి విద్వదతిపూజాసక్తి సత్పాత్ర దా
నారంభంబు ప్రభూత పూర్వసుకృత వ్యాపార శీలక్రియా
సారస్ఫూర్తి లభించుఁగాక యితరా సంగంబునం గల్గునే. 165

వ. అనిన వామదేవుం డిట్లనియె 166

## వామదేవుడు రుక్మాంగదునికి నాతని పూర్వజన్మ వృత్తంబుఁ దెలుపుట

సీ. నరనాథ ! పూర్వజన్మమున శూద్రుఁడవు దు
ర్దోషదుష్టుఁడవు బద్ధుఁడవు నీవు
నీభార్య దుర్గుణ నికర పూర్ణశరీర
దానితోఁ గ్రుస్సి యబ్దములు గొన్ని
గడపుచు నొకనాఁడు పుడమిపైఁ దీర్థయా
త్రాభిముఖుండవై యరిగి యచటఁ
దత్తీర్థతట సభాస్థలమునందుఁ బురాణ
గోష్ఠి సల్పుచు ధర్మగుణ విచార

తే.గీ. దృష్టి శ్రావణ శుద్ధ ద్వితీయ మొదలు
గాఁగ నాలుగునెలలు యుక్తంబుగాన
శూన్యశయన వ్రతంబు సంశుద్ధి నోచు
నతఁడు ముక్తుఁ డనఁగవింటి వధిప ! మున్ను. 167

వ. విని నిజగృహంబునకు వచ్చి తద్వ్రతం బాచరించి లక్ష్మీ సనాథు [88]జగన్నాథుం బూజించి పుష్పధూపదీపానులేపనవస్త్రంబుల నుపచారంబు చేసి విప్రుల శయ్యాదాన వస్త్రదాన భోజన దానంబులఁ దృప్తులం జేసితివి పూర్వజన్మ సుకృత విశేషంబున నేతజ్జన్మంబుననేని హరిభజనం గావింపుచు నున్నవాడ వా శూన్యశయన వ్రతంబు గృహవృద్ధికరంబు సకలపాప నాశనకరంబు లక్ష్మీకరం బిదికావింపలేనివారి గార్హస్థ్యంబు

88 జగన్నాథుం

వంధ్యాజననంబునుంబోలె నిష్ఫలంబగు. నీకు జనార్దను భక్తినిష్ఠ సర్వంబును ఫలించెనన మ్రొక్కి రాజ్యభారంబునకుఁ దనయుండు దివిరి యున్నవాఁడు. మందరనగావలోకనంబునకు నేఁగెదనని విన్నవించిన.

తే.గీ. తండ్రి ఖేదంబుఁ దీర్చి తద్వాక్య సరణిఁ
దిరుగు వానికి గంగానదీ జలావ
గాహఫలము[87] లభించుఁ దత్‌క్షణమునందె
చెప్పఁ జిత్రంబు వాని విశేష మహిమ. 169

క. గురువాక్యోల్లంఘన దు[88]
శ్చరితుఁడు (దాఁ) ద్రి పథగాంబు సంస్నాన నిరం
తర శీలుఁడైన సుకృతాం
తర మింత లభించదంచుఁ దలఁతురు విబుధుల్. 170

వ. కావున నీ వవాప్త సకలకాముండవు హరిభక్తి మహోద్దాముండ వని చెప్పి యనచినఁ దురంగంబు నెక్కి సరస్సరిద్వనోపవనశైలంబులు చూచుచు శ్వేతగిరి గంధమాదనంబు దాఁటి ముందట. 171

సీ. భాస్కర శతవిభా భాసురంబగు దాని
హరిభుజా సంఘట్టనాభి తప్త
వత్కాంచనరస ప్రవాహతఁ దగుదాని
బహువృక్ష బహుధాతు బహుమణీంద్ర
బహునిర్ఝరశ్రీల ప్రభలమించిన దాని
బహుసత్త్వనాద సంపదఁ జెలంగు
దానిఁ దేజోమయో దారామరావతీ
పురవతంసము లీలఁబూని మెఱయు

తే.గీ. దాని [89]మందర భూధరోత్తమముఁ గాంచి
యప్పు డా రూఢకాముఁడై యా మహీమ
హేశుఁడెడ యింత [90]దిరిగెడు నిచ్చఁదిరిగి
నిలిచినంతటఁ దచ్ఛైల నికరసీమ. 172

---

87. లభించు తత్‌క్షణము నందె
88. దుశ్చరితుఁడు త్రిపథ గాంబు
89. మందార
90. దిరుగు నిచ్చఁ

## రాజు మోహినిం జూచి సంభాషించుట

తే.గీ. మోహినీ మోహనాద్భుత ముఖరముఖర
సస్ఫురద్గానమున మృగశకుని నికర
మవశత వహింప వీనుల కమృతముగను
దన్మహానాదరుచి నిండఁ దాను గలఁగి. 173

క. మోహించి యా మహీపతి
[91]వాహము దిగనుఱికి గిరికి వడినుఱికి జగ
న్మోహిని మోహిని లీలా
వాహినిఁ దేజఃప్రవాహవాహినిఁ గాంచెన్. 174

వ. కాంచి 175

తే.గీ. రతియొ మాయయొ యీ నగరాజ సుతయొ
కమలగేహయొ యీ సృష్టికర్త మాన
సాభిలాషంబు స్త్రీ లీలయై నటించె
నో యనఁగఁ దోఁచె నప్పు డా తోయజాక్షి. 176

వ. అంతఁ బ్రతప్త చామీకరప్రభ నా యింతి లింగాశ్రిత త్రినేత్రునేరి మోహింపంజేయం జూచి యా క్షణంబున మోహించి మహింబడి విసంజ్ఞతం జెందినఁ దన్మోహిని కటాక్షాంచలకించిదవలోకనం బొనరించి కార్యసిద్ధి యయ్యెనని వల్లకీగీతంబు చాలించి యశోక రక్తాంగుళీ పల్లవంబులచేత మృగపక్షి గణంబుల నదల్చుచు స్వవాసనా గంధలోలంబగు భృంగజాలంబు వారింపుచు మధురోక్తుల రాజా! లెమ్ము; మూర్ఛిల్లనేటికి? నీకు నవశ్యంబు వశ్యనైతి; ధరాభారంబుఁ దృణంగా వహించునట్టి ఘనుండ వీ మోహభారంబు వహించుటెంత? నీకు నామీఁద వాంఛ గలిగిన యట్లనె నాకును నీమీఁద వాంఛ జనించె. నిజదారంబలె నేలి రమింపుమని విన్నవించిన. 177

సీ. అతి మధురోక్తి రసామృతధారలు
చెవులు సోఁకిన రాజశేఖరుండు
[92]శతపత్ర(చారు) విశాలనేత్రంబులు
చిగిరించుకొని కొంత చింతనొంది

---

91. వాహము దిగనురికి గిరికి వడినురికి

92. నేశత పత్ర విశాలనేత్రంబులు

గద్గదోక్తుల సాత్త్వికశ్రీలు రాజిల్ల
మోహిని నాత్మకామోహిని నతి
[93]పూర్ణలక్ష్మిం గాంచి, పూర్ణగాంతరముల
ననుభవించితి నాయొయారు లిట్లు

తే.గీ. నమిత సౌందర్యరేఖా సమగ్ర మహిమ
వలచి వలపింపనేర్తురే వనిత ! నీవు
వలచి వలపింప నేర్చితి వన్నె మెఱసి
మరులుగొంటి నిరీక్షణ మాత్రముననె. 178

చ. అమృతముచిల్కఁ బల్కక యొయారపుఁ జూపులఁ జూచినంతనే
భ్రమము వహించితిన్ వికచ పద్మవిభాస్య ! యనుగ్రహింపవే
యమితములైన వాంఛితములన్నియు నిత్తు శరీరమిత్తుఁ బ్రా
ణములిప్డు డిత్తు రాజ్యము ధనంబుననిత్తు జగంబు మెచ్చఁగన్. 179

చ. జలనిధి చేలయై రవిశశాకరలోచనయై లసత్కులా
చలమణి భూషయై ఘన విశాలపయోధరయై స్ఫురన్నభ
స్థల తనువై సురాలయ విశంకట మౌళియునై యధోంతరో
జ్జ్వల కటియైన భూవనితఁ జామ ! భవన్నిజదూతిఁ జేసెదన్. 180

వ. ప్రాణంబు లిచ్చువానికి గజవాజి రత్న మణి భూషణాంబరాదు లిచ్చు
టెంత? నన్నుఁ గటాక్షింపవే యన విని మధురోక్తుల నూరార్చి
యురంబునంజేర్చి యేమియు నేటికి ? నేఁ గోరిన వాంఛితం బొకటి
దయసేయవే; యనేక క్రతుకర్తయు బహుపుణ్యరాశియు భూరిద్రవిణ
దాన [94]శస్తంబునగు దక్షిణ హస్తంబు శిరంబున నుంచిన నాకుఁ
బ్రత్యయంబయ్యెడి. నీవు ధర్మశీలుండవు. సత్యకీర్తివి. అనృతంబులు
పలుకనేరవు. యమపురంబు నిర్జనంబు గావించితివని ప్రశంసించిన
రాజేంద్రుం డిట్లనియె. 181

93. పూర్ణలక్ష్మిఁగాంచి

94. శస్తంబగు

సీ. బహుభాష లేటికిఁ బ్రత్యయారంబుగాఁ
గరియాన ! దక్షిణకరము నీకు
నిచ్చితిఁ దప్పితినేని యేతజ్జన్మ
సంచిత సుకృతనాశమగు నిన్ను
వలచితి భార్యవై వర్తింపు తనువు ప
రాయత్తమై యున్న యది యపూర్వ
శృంగార నిధి ! మోహనాంగి ! నీ వెవ్వని
తనయవు మందరధరణి ధర వ

తే.గీ. రోత్తమాధిత్య కిట వచ్చియుండు టేమి
యబల ! యైక్ష్వాకువిభుఁడ రుక్మాంగదుండ
నా ఋతుధ్వజ పుత్రుండ ననఘ యశుఁడ
విదిశయేలెడి రాజ నో విమలగాత్రి ! 182

వ. ఏను మృగయావ్యాజంబున దుర్జన శిక్షయు సాధురక్ష యొనర్పుచు వామదేవాశ్రమంబుచొచ్చి యమ్మహామునివలన ధర్మరహస్యంబులు గొన్ని విని మందరావలోకనాగ్రంబుగాఁ జనుదెంచి యిచ్చట భగవద్గీతామృతంబు వీనుల విందైయున్న నేతెంచితి. నన్నుఁ గటాక్షించి ప్రత్యుత్తరం బొసంగి యనుగ్రహింపవే యనిన విని యిట్లనియె. 183

చ. అధిప సరోజసంభవుని యాత్మజనేను సరోజసూతి ని
న్నధిపతిగాఁ దలంచి మన మారఁగ నన్ను సృజించునాఁడు నేఁ
డధికులు రుద్రముఖ్య దివిజాగ్రణులున్నఁ బరిత్యజించి [95]నేఁ
డధిగత వాంఛితార్థునిఁ గృతార్థుని నిన్నుభజింప వచ్చితిన్. 184

వ. మనస్సమాధిం దపం బాచరింపుచు నృత్తగీత వాద్యంబుల శంకరు మెప్పించిన సార్థదినత్రయంబునఁ బ్రసన్నుండయ్యె. సుర దుర్లభుండైన యాపార్వతీవల్లభు నభిలషింపక యతని వలన నీప్సితంబులు గాంచితి; అన్యోన్యమోహతరంగంబులైన సంగంబు లంతరంగంబున మెలంగ విలంబంబు వలదని కరంబుఁ గరంబునఁ గీలించి యిట్లనియె. 185

క. శంక వల దధిప! నేనక
లంకఁ గుమారికను గుణకలాప కలాపన్
బంకరుహాప్తకులోద్భవ!
పంకజ భవపుత్రి దగదె పరిణయ మందన్. 186

95. నేఁడభిగత

తే.గీ. అనఘ! సుక్షతయైన కన్యను సగోత్ర
యైన కన్య ద్వితీయ దానైన కన్య
బ్రాహ్మణీ శూద్ర సంగమోత్పన్న కన్య
స్త్రీత్వవిరహిత యగు [96]కన్యఁ జెందఁదగదు 187

క. కాన ఁగులంబున గుణమభి
మానంబును గలుగు సత్కుమారీ మణి న
న్నోనృపతి! పెండ్లియాడిన
భూనుతమై నిజయశంబు పూజ్యత నొందున్. 188

వ. అనిన నట్లనె శాస్త్రోక్త ప్రకారంబున నగ్గిరియందు నుద్వహించి నగు
మొగంబున నిట్లనియె. 189

శా. నాక శ్రీ విభవోపభోగ మహిమల్ నాకల్పమైతోఁచె ము
న్నాకల్పంబు లభించినన్ జెలువ యొయ్యారంబు తేజంబు ల
క్ష్మీకౌతూహలలీల యోగ్యతయు వాసింగల్గె నీ వబ్బఁగా
నో కల్యాణి! సురేంద్ర వైభవము నా కుత్కృష్టమే చూడఁగన్. 190

ఉ. కాన భవన్మనంబున నొకానొక కాంక్షిత మెద్దిగల్గినన్
ఓ నలినాయతాక్షి! చతురోన్నతిఁ జేసెదఁ జిత్తగింపు మెం
దైనను మంద్రశైల మలయాచల మేరు మహీంధ్ర నందనో
ద్యానములన్ రమించెదవొ ధన్యత మత్పురిలో రమించెదో. 191

వ. అనిన మోహిని యిట్లనియె. 192

చ. సవతులు క్రూరచిత్త లతిసాహసలన్[97] నృమహోదయ ప్రియా!
సవతులు చూడనొల్ల విదిశాపుర మామరణాంతకంబగున్
సవతుల పోరునేఁ దెలిసి సౌఖ్యముఁగాంతునె? దాని కెవ్వియున్
సవతులు[98] నీనగేంద్రముల సంతతమున్ విహరింప నెంతయున్. 193

సీ. అనఘ పుత్రవతి సంధ్యావళి యాసాధ్విఁ
బాసి నీవేరీతి బ్రతుకువాఁడ
వతి దుఃఖమున నార్తినందితివేని నా
కధికతరార్తి యౌనట్లుగాన

---

96. కన్యఁ జెల్ల....న.
97. న్మ(?)
98. సవతులు యీనగేంద్రమున సంతతమున్ విహరింతు మెంతయున్.

నీకు సుఖంబైన [99]నెలవున నుండెద
నదియ మందరము నాఁ కాత్మభర్త
యుండినచో భార్య యుండగాఁదగు శూన్య
మైన గేహంబైన హైమనగము

తే.గీ. పెన్నిధానంబు పతి కడుపేదయైనఁ
దండ్రి గృహమున నున్న కాంతాలలామ
యంధతమసంబునందు నత్యంతనరక
మనుభవింపుచు సూకరియై జనించు. 194

వ. ఇటు నేనెఱింగి మందరంబున నుండనోపుదునే? సుఖ దుఃఖంబులకుఁ
గర్తవగు నీతోఁగూడ భవత్పురంబున కరుగుదెంచెద ననిన మనంబు
రంజిల్లి కౌఁగిటం జేర్చి యిట్లనియె. 195

క. దేవేరుల కగ్రణివై
నీవు మహాభోగవిభవ నిరతిశయశ్రీ
ప్రావీణ్యంబున నుండుదు
జీవితమునకంటె నతివిశేషము మెఱయన్. 196

క. అని రుక్మాంగద భూపతి
తన యో పద్రవము మీఁదఁదలఁచక పలుకన్
వనిత ముహుర్మంజీర
ధ్వని నగములు గరఁగ నడచె [100]ధవుఁడుం దానున్. 197

క. కొన్ని మహానీలరుచులఁ
గొన్ని మహారజతరుచులఁ గొన్ని రజతకాం
చ్యున్నతముల హరితాభలఁ
గొన్ని చెలంగంగఁ గనిరి కుధరతటంబుల్. 198

సీ. వజ్రధారాగ్ర తీవ్ర ఖురాగ్రమున ధరా
గ్రంబుఁ ద్రివ్వుచు సమగ్రత వహించి
[101]వల్గాముహుర్ముహుర్వల్గు దంశన జాత
ఫేనంబు [102]చుక్కల విధము గొనఁగ

---

99. నెలవుననుండెద యదియ
100. ధవుండుం దానున్.
101. వల్గా ముహుముహుర్వల్గు
102. చుక్కల విరద గొనగ

నాత్మేశ్వరా లోకహర్ష హేషితము త
ద్దైవతస్వరము చందంబుఁ దెలుపఁ
గనక రత్నాంకుర కాంతిచ్ఛటుల మంద
రాగ పోషిత [103]కీర పూగ మగుచు

తే.గీ. వెఱకు లీనెడి జల్లులు బిత్తరింపు
మేని చాయలు సొగసైన మెఱుఁగు పచ్చ
పల్లడము [104]తరకసము డాబా ఫిరంగు
నందమైయున్న జగతేజి నపుడు గాంచి 199

క. ఉన్నత ఖురాగ్ర ధారా
నున్నతలోర్వి విధూత నూతన గృహగో
ధి న్నొగిలి యున్నఁ గనుఁగొని
యన్నలిన హితాన్వయేశుఁ డార్ద్రహృదయుఁడై. 200

తే.గీ. అపుడు హాహా యటంచు నత్యంతకరుణఁ
గోమల మహీజ పల్లవాంకురములందుఁ
బొదిగి మోహిని దెచ్చిన యుదకధార
లపుడు చల్లించి పైఁగప్పె నార్ద్రపటము. 201

వ. అప్పుడు నేదదేరి గృహగోధిక రాజేంద్రుం జూచి యిట్లనియె. 202

సీ. నరనాథ ! శాకల నగరంబునం దొక
విప్రుని భార్య నవీన రూప
యౌవన సంపన్ననైన నన్నొల్లక
కలహించుఁ బరుష వాక్యములు పలుకు
నెవ్వరిపట్టున హితమాచరించు వాఁ
డీరీతి ననునాడ నెంతకేని
తాళి తాళఁగలేక తతదోషశీలనై
పతుల వర్జించిన పౌరసతులఁ

తే.గీ. దద్వశీకర ణౌషధాంతరము లడుగఁ
దమకుఁ బ్రత్యయమైన చందమున నపుడ
పొమ్ము [105]ప్రవ్రజ్య యొకతె యా పురముచెంత
నున్నయది దానునిగఁ జేయనోపు ననిన. 203

103. కీరవారమగుచు 104. తరకసీలు
105. ప్రవ్రజ్య యొకటి

సీ. అక్ష సూత్రంబుఁ గరాగ్రంబున వహించి
వింతగా జపముఁ గావించుదాని
బరితస్సభాసదబర్హి [106]బర్హివ్యాజ
నానిల సుఖలీలలందు దాని
నవ్యభస్మోద్ధూళనస్ఫుటధావళ్య
ధాళధళ్యశ్రీలఁ దనరుదానిఁ
గాషాయవస్త్ర సంఘటితయై దీర్ఘ జ
టామకుటం తేటగలదాని

తే.గీ. గురుతర స్తంభ శతశుభ్రకుట్టిమోరు
హర్మ్యతలమునఁ దేజంబు నందుదాని
వ్రత పరాయణశీలయై వరలుదాని
యోగినీమణిఁ గనుఁగొంటి నొక్కదాని. 204

వ. కాంచి పదములపై వ్రాల మద్భావంబెఱింగి ప్రసన్నయై చూర్ణంబును
రక్షయు నొసంగి యీ చూర్ణంబు క్షీరంబులతోఁగూర్చి భర్తకుఁ
ద్రావించిన, వాఁడు నీ దాసుండగు నీరక్ష నీవు గళంబునం దాల్చిన
నిఖిలవశీకారంబగునని నియోగించిన నేను నట్లు కావించితి. తన్మ
హిమచే భర్త దినదినంబును గృశియించి ముఖంబున వ్రణంబులుపుట్టి
తద్వ్రణంబులం గ్రిమిసహస్రంబులు వొడిమ నస్థిచర్మావశిష్టుండై
యుండి నన్నుం బిలిచి నీదాసుండనైతి నన్యగృహంబుల కేఁగ నన్నుం
గటాక్షింపవే యనిన నేను దద్యోగిని విన్నవించిన యుపశమ నౌష
ధంబు దెచ్చిఁ స్వస్థునిఁ జేసితి నంత. 205

సీ. పంచతనొంది భూపాలక! యేను దు
ర్నరకయాతనల [107]దైన్యంబుఁ గంటిఁ
దప్తతామ్రభ్రాష్ట్రతలమునఁ బదియేను
యుగములు క్రకచాళినొత్తి తనువు
ఖండించి తిలమాత్ర ఖండముల్ గావించి
వేచి పాకంబు గావించి నంత
నంతకభటులు నేనంతట గృహగోధి
కాకృతి యమునాజ్ఞ నవనిఁబుట్టి

---

106. బర్హ వ్రజనానీని సుఖలీల

107. దైన్యంబుఁగాంచి తపతామ్ర

తే.గీ. వత్సరాయుత శతదుఃఖ వనధి మునిఁగి
యున్నదాన భవత్కటాక్షోపలబ్ధి
జ్ఞాన ముదయించె నాకు నో సార్వభౌమ!
హరిపరాయణు నినుఁ జూచునంతలోన. 206

క. ధన్యయగునింతి ధరణి న
నన్యాశ్రితయగుచు భర్త యాత్మ యెఱిఁగి సౌ
జన్యమున నుండఁగాఁదగు
నన్యదురాచార ధర్మమది విడువఁదగున్. 207

క. భర్తయె దేవుఁడు గురుఁడుఁ
భర్తయెలోకంబు లోనఁ బరదైవంబుఁ
భర్తకుఁ గూర్చక [108]యుండు న
భర్తృమతికిఁగలదె తదిహపర సౌఖ్యంబుల్. 208

క. పతి మాటలోనఁ దిరుగని
సతి క్రిమికాష్ఠోపమాన సరణిం దిర్య
క్కృత యోనుల జన్మించుఁ
బతిహిత మొనరింపవలయుఁ [109]బద్మాక్షులకుఁ. 209

మ. శ్రవణ ద్వాదశినాఁటి పుణ్యమిడి రాజా! నన్ను రక్షించు త
చ్ఛ్రవణ ద్వాదశి నర్మదాసురనదీ సంగంబునం దీరమా
డు విశేషంబు జనింపఁజేయునట నీడుం గర్మజాలంబు త
ద్దివసస్నానము సర్వతీర్థ ఫలసిద్ధిం బొంద నిల్పుం ధరన్. 210

ఆ.వె. [110]దత్త కల్పధర్మ దైవార్చనాదు ల
క్షయ ఫలంబు లొసఁగు సార్వభౌమ!
విష్ణుభక్తి నియతి విజయాదినవ్రత
మెవ్వఁడాచరించు నీతనికిని. 211

క. ద్వాదశ్యుపవాసంబు త్ర
యోదశిఁ బారణము సేయ [111]నుత్తమఫల మా
పాదించు ద్వాదశాబ్ద ఫ
లాదులు దన్మహిమ యింత యం తనఁదగునే? 212

---

108. యుండిన భర్తృమతికిఁ గలదె
109. బద్మాక్షునకున్
110. దత్తజల్ప
111. నుత్తమ ఫలమా పాటించు

వ. అట్లు గావునఁ దత్ఫలంబు నాకు నొసంగి ధర్మమూర్తీ! వైవస్వతపద ధ్వంసీ! పాలించవే యని గృహగోధి పల్కిన విని మోహిని యిట్లనియె.

క. ఇలలోపల సుఖదుఃఖం
బులు దాఁజేయునవి తానె భుజియించు నరుం
డలవడఁగ క్షుద్ర యిది దు
ష్కలుషాత్మక దీనిఁ బ్రోవఁగా నీకుఁ దగునే? 214

సీ. ఇది దుష్ట దుశ్శీల యెంచ రక్షాచూర్ణ
ములఁ బతిఁగారించె[112] మూఢబుద్ధి
సాధువులకుఁజేయు సదుపకారంబు స్వ
ర్గ యశఃపదంబు లోకంబులోనఁ
బాపాత్ములకుఁజేయు బహుళోపకారంబు
ఘన భయభ్రంశ సాధనము శర్క
రామిశ్ర దుగ్ధసారంబుఁ దా(ఁగొని)పన్న
గములకుఁ బోసిన గరళమైన

తే.గీ. కరణిఁ దత్పాతకి జనోపకరణ మమరు
విడువు మీ[113]యింతిపైఁగృప, వెడలవలయు
నగరమున కాత్మసౌఖ్య మెన్నంగఁ గలదె
యన్య కార్యాంతరాసక్తి నలసియున్న. 215

వ. అనిన రాజిట్లనియె. 216

తే గీ. బ్రహ్మపుత్రివి నీ కిట్లు పలుకఁ దగునె?
సాధు జనులకు నీ దురాచారవృత్తి
యుక్తమే? యాత్మసౌఖ్య కరోద్యమమునఁ
బాతకమె కాని జ్ఞాన సంపత్తి కలదె? 217

తే.గీ. శశియు సూర్యుండు ననిలుండు[114] జగతిఁబావ
కంబు హరిచందనంబు నా కద్రుమంబు
లుత్తమంబులు నవసంఖ్య నొనరుఁగీర్తి
ఘనత నుదయించుట పరోపకారమునకె. 218

---

112. గూఢబుద్ధి 113. యింతిపై కృప

114. జగతి పావ। కంబు అరిచందనంబు నాక ద్రుమంబు। **ఉత్తములు** నవల నవసంఖ్య నొనరుఁ

సీ. అరయఁ బరోపకారార్థంబుగా నరుఁ
డత్యంత శుభవృత్తి నందవలయు
దీపింప సప్తాంతరీప మధ్యంబేలు
సార్వభౌముఁడు హరిశ్చంద్ర విభుఁడు
చండాల మందిర స్థాయియై సుతదార
విక్రయ మొనరించి వివిధ దుఃఖ
ములఁబొంది సత్యంబు [115]నిలుపుకొనియె నరో
జాసనాది సుపర్వు లభినుతించి

తే.గీ. వర మొసంగెద మనఁగ భావమునఁ దలఁచి
తరు సరీసృప యువ వృద్ధ పురుష భామి
నీ జనంబులు మత్పురి నేఁడు ముక్తి
నందఁగాఁ దగునని వారి నడిగికొనియె. 219

వ. తాను నయోధ్యాపుర జనంబుతోఁ ద్రిదివంబు నొంది యిప్పుడును గామగ విమానంబున విహరింపుచు నున్నవాఁడు. పరోపకారంబు వ్యర్థమే ? మఱియును వినుము. 220

క. అస్థిరతఁ దలఁచి నిర్జరు
లస్థిరతస్ఫూర్తి నడుగ నర్పించఁడె ధ
ర్మస్థుండైన దధీచి వ
నస్థాశ్రమ జనము లతిఘనస్థితి మెచ్చన్. 221

తే.గీ. శ్యేనమున కీఁడె మాంసంబు శిబి కపోత
రక్షణారంబు మున్నుగాఁ బక్షిపతికి
[116]జీవనం బొసఁగఁడె నిజచిత్త గరుడ
వాహనుండైన జీమూత వాహనుండు. 222

వ. అది గావున రాజు దయాళుండు గావలయు. పర్జన్యుండు శుచి స్థలంబుననేని నశుచి స్థలంబుననేని వర్షించు. చంద్రుండు చండాల పతితాదులనేని యాహ్లాదకరుండై కరంబులచే స్పృశించు నట్లగుటంజేసి సుదుఃఖితయై దుర్లిఖిత గోధికయైన గృహగోధిక, నిజపుణ్యంబులచేత, దౌహిత్రుల చేత నహుషుండునుంబోలె నుద్ధరించెదనని మోహినిని వారించి విజయానంభవవంబైన సుకృతంబిచ్చితి ననిన నంత. 223

---

115. నిలుపుకొని యేను సరోజాసనాది
116. జీవనంబొసంగండే నిజచిత్త గరుడ

మ. వరదివ్యాభరణంబు లాని యతిభవ్యంబైన నెమ్మేనితోఁ
దరుణాదిత్య సహస్రతేజమున దిగ్గామంబు లుద్దీప్తులై
పరఁగంజేయుచు యోగి గమ్యమగు శ్రీపద్మామనోనాథ మం
దిర గర్భంబునకేఁగె నిర్జ(రు)లు గీర్తింపంగ సద్భక్తిమై. 224

సీ. ఆ గృహగోధిక నట్లు కటాక్షించి
మోహినితో గంధవాహ వాహ
వాహనంబునను బర్వతవనీ పాదప
నదనదీ మృగపక్షి నగరఖేట
ఖర్వటగ్రామ దుర్గమ [117]ఘోరలక్ష్మిఁగీ
ర్తించి చూచుచు వామదేవునాశ్ర
మ ప్రాంతమున నిల్చి [118]మఱియు మఱియు మ్రొక్కి
యనిల వేగంబున నరిగి సకల

తే.గీ. ధనకనక వస్తు సామగ్రిఁదనరు నిఖిల
దేశములు గాంచి కొంచు నుదీర్ణపూర్ణ
రత్ననిధి యగు విదిశాపురంబు చెంత
నిలిచి యున్నంత దిగ్దేశ నృపులతోడ. 225

## మోహినీ సహితుండైన రుక్మాంగదుని స్వదేశాగమనము

వ. ధర్మాంగదుం డొడ్డోలగంబై యుండి చారులచే విని, యుదీచి ముఖంబున వెలుంగుచున్నది మద్గురుండు రుక్మాంగదుం డరుదెంచె. తద్వాజి తేజంబు విజృంభించెనని యెదుర్కొనం దలంచి. 226

క. జనకుం డేతెంచిన యెడఁ
దనయుండెదురేఁగి మ్రొక్కిఁదగుఁగాకున్నన్
ఘనఘోర నరకకూపం
బునఁ ద్రోయకయున్నె తపనపుత్త్రుఁడు వేగన్. 227

తే. గీ. తండ్రి వచ్చిన నెదురేఁగి దండనతు లొ
నర్చి నిలిచిన యట్టి యా నందనునకు
నడుగు నడుగుకుఁ బ్రాపించు యజ్ఞఫలము
లనుచుఁ బౌరాణికోత్తము లాడికొంద్రు, 228

117. ఘోరలక్ష్మిం గీర్తించి చూచుచు
118. మఱియు మఱియును మ్రొక్కి

వ. అనుచు వారలుందాను యోజనమాత్రంబు పాదచారంబున నెదురుకొని దండ ప్రణామంబులు చేసిన విభుండు హయంబు [119]డిగ్గ నుఱికి సుతులం గౌఁగిటం జేర్చి శిరంబు మూర్కొని యిట్లనియె. 229

సీ. ప్రజల నందఱఁ బరిపాలించితే పుత్ర !
యరుల శిక్షించితే యనఘ ! న్యాయ
[120]సముపార్జితములైన సద్వస్తుతతులఁ గో
శ గృహంబు నిల్పితే సత్యసంధ !
విప్రుల యెడల సద్వృత్తిఁ గావించితే
వేదాది విద్యల వినయశీల !
కార్య దక్షతఁ గీర్తిఁ గాంచి నిష్ఠురభాష
ణములు వర్జించితే నయధురీణ !

తే.గీ. బాహ్య చండాల గృహములఁ బాఁడి విదుకు
సురభు లుండిన మాన్పితే సుగుణమూర్తి !
నీవు పాలించు జనపద నికరములను
దండ్రి మాటల నడుతురే తనయులెల్ల. 230

సీ. అత్తమామల యాజ్ఞయందు వర్తించునే
పతిభక్తిగల వధూప్రకరమెల్ల
వరుస విప్రులతో వివాదముల్ దీర్తువే
ధేనుబృందములకుఁ దృణము జలముఁ
గలదె తులామానములు దినత్రయమున
శోధింతువే విప్రసుజన కోటి
నప్పనల్ గొని పీడ నందింపఁబోవక
యుంటివే నీవేలు నుర్వియందు

తే.గీ. నరయ నుదపానముఖ్యంబు [121]లచ్ఛికంబు
లేక యుండెనె యడిగెడు లోకులకును
భిన్న రస భిన్నఫలధాన్య భిన్నవస్త్ర
భిన్న భోజన దాతల బెట్టఁణచితె. 231

---

119. డిగ్గనురికి
120. సొపార్జితములైన
121. లచ్ఛికంబు

మ. కరులందేజుల నీవు దృష్టిగని సాక్షాచ్ఛక్తిఁ బాలించితే
వరుసం దల్లుల కెల్ల హృత్ప్రియముగా[122] వర్తించితే కీర్తిగా
నరు లేకాదశి యుండఁ జేసితె నిశానాథక్షయ ప్రాప్తులన్
గరిమం బైతృక[123] మాచరింతురె జనుల్ కర్మైక విశ్వాసులై. 232

సీ. మొదల నిద్రయనర్థ మూలంబు, నిద్ర పా
పవివర్ధనము, నిద్ర పరమనిత్య
దారిద్ర్య జనని, నిద్ర సమస్త శోకమో
హనిదానఖని, నిద్ర యాధిరాజ్య
పాలన విఘ్నసంపత్తి నిద్ర కుమార!
యపరరాత్రంబులయందు నిద్రి
మాని వర్తింతువే మానిని పుంశ్చలి
యైన లోకద్వయ మాత్మభర్త

తే. గీ. కంటనీని తెఱంగున నడఁచు, నిద్ర
రాజులకుఁగాన నీరీతిఁ బ్రబలశక్తి
నడఁచితే యంచుఁ దండ్రినెయ్యం బొసంగఁ
బలుక ధర్మాంగద క్షోణిపాలుఁ డనియె. 233

వ. స్వామీ! నీకటాక్షంబున నిట్లనె యాచరించిన పుత్రులు జగత్త్రయ వంద్యులు. కాకున్నఁదత్పాతకంబున కంతంబు గలదె? శరీరజీవన ధర్మంబులు త్వదధీనంబులు. సుతులకుం దండ్రియ దైవంబు. త్రిలోకియు నీకు సమర్పించిన ఋణంబు తీరునేయని పలుకు తనయునిం జూచి రుక్మాంగదుం డిట్లనియె. 234

చ. పలికితి వేదసమ్మత సుభాషలు పుత్రక! తండ్రికంటె భూ
స్థలమునఁ బుత్రసంతతికి దైవత మెవ్వఁడు? తండ్రిమాటలో
మెలఁగని యా కుమారకుని మీఁదట నల్గుదు రెల్లవేల్పులున్
నిలిపితి మత్కులంబు ధరణీభరణాభరణైక దక్షతన్. 235

క. భూపతులు మెచ్చ సప్త
ద్వీపంబులు నేలితివి సుధీజను లలరన్
సౌపర్వాలోక సుఖ
ప్రాపకుఁడవు నీవె నాకుఁ బావనమూర్తీ. 236

122. వర్తించితేఁ గీర్తిగా
123. మాచరించితె జనుల్ కర్మైక విశ్వాసులై.

వ. అనిన ధర్మాంగదుం డిట్లనియె. 237

సీ. ఎందెందుఁ దిరిగితి రిన్నినాళ్ళినవంశ
శేఖర! యిట్టి రాజీవగంధి
యెచ్చోటనబ్బె సమిద్ధ సూర్యాయుత
తేజంబు గల్గు నీదివ్యకాంత
నలినజాతుఁడు శిల్పనైపుణి యెల్ల నీ
రూపంబునందునె చూపెఁ ద్రిభువ
నంబున నీదృశ నవ్యశృంగారైక
లావణ్యఖనియైన లలన గలదె

తే. గీ. యంబయో కుసుమశిలీ ముఖాంబయో ల
తాంబయగు యమమాయయో యరయ నా న
ఖరశిఖాంతంబుగాఁగ [125]నీ కలికి యొప్పు
చొప్పనం దొచ్చె మున్నదే సొగసుగాక. 238

క. ఇటువంటి లోకసుందరి*
కుటిలాలక తల్లియైనఁగుతలంబున ను
త్కట భాగ్యసంపదలు నృప
పటలంబులలోన నాకు ఫలియించుఁజుమీ! 239

వ. అనిన ధర్మాంగదుం గొనియాడి రుక్మాంగదుం డిట్లనియె. 240

క. తురగారోహణరేఖా
త్వర నొకపక్షంబు నడచి తన్మంద్రమహీ
ధరమునఁ గాంచితి శోణా
ధరమున దరహాసరుచులు దలఁగెడు దీనిన్. 241

క. జనయిత్రి నీకునయ్యెడు
వనజాసన తనయ భాగ్యవతి యిదిపతిగా
ననుఁ దలపోయుచుఁదాఁ బ్రా
క్తనతీవ్రభయంకరోరు తప మొనరించెన్. 242

వ. ఇది మందరశిఖాగ్రంబున దిగంబరేశ్వరు సేవింపుచునుండ నే తన్మంజు
మంజీర శింజితంబు విని కంజాత శరశర భిన్న హృదయుండనైన

125. నీకలిత యొప్పు । చొప్పునం దొచ్చెమున్నదే సొగసుగాఁక.
* కుటిలాలకి

[126]నన్ను గారవించి మహోదారత్వంబునం దారత్వంబుఁ గైకొనియె. నేను నంగీకరించి దక్షిణకరం బిచ్చితి నంత మందరంబుడిగ్గి మూఁడవ దినంబునిచ్చటికి జనుదెంచితి నిది నీకు జనని. సంధ్యావళి సమంబు వందనంబు గావింపుమని నియోగించిన. 243

క. గురువాక్యంబున వారి ము
గురువేణిం గాంచి భక్తి యుప్పొంగ మహా
గురుభక్తి మ్రొక్కెఁ గాలా
గురు గంధిల నగర మధ్యకుంభిని యందున్. 244

వ. తనయుండు రా మోహినిం జూచి రాజు నగుచు ధర్మాంగదుండు భూపతులతోఁ గూడ నమస్కరించుట నిన్నుఁగూర్చి యకావీని ననుగ్ర హింపుమనఁ గృతాంజలియైన తనయునిం గాంచి హయంబు డిగ్గి యామోహిని భర్తృదాక్షిణ్యంబున బాహువుల నువగూహనంబు గావింపుమని చేసి యెత్తినఁ బునర్దండ ప్రణామంబు చేసి నుకుసుమ సువస్త్ర సుభూషణంబులచేతఁ దల్లినలంకరించి తన వీపునం దల్లి పదం బానించి హయంబు నెక్కించి రాజు నట్లనే కావించి రాజులుం దానును బాదచారంబున ముందఱ నడుచుచుఁ దన్మోహినిఁజూచి యిట్లనియె.

ఆ.వె. లలిత శుభ విలాస లక్షణవతులైన
సతులతోడఁ దండ్రి సకలభోగ
వైభవముల నుండ, [127]వర్తించు తనయుండు
ధన్యుఁ డఖిల లోకమాన్యుఁ డరయ. 246

క. సతి యొకతియైనఁ దండ్రికి
నతి దుఃఖప్రాప్తి దెలియ నా దుఃఖము త
త్సుతులకు లభించుఁ గావున
నితర సుఖంబులు దలంచ నేటికి నింకన్ 247

క. ఒక తల్లికిఁ బ్రణమిల్లిన
నకలంకస్ఫూర్తిఁగల్గు నతిపుణ్యంబుల్
ప్రకటమతిఁ బెక్కు తల్లుల
కొకమరి వందన మొనర్ప నొందక యున్నే ? 248

126. నన్నుఁ గారవించి
127. వర్తించుఁ దనయుండు

తే.గీ. [128]తెలివిమైఁ దల్లిఁబూజింప దినదినంబు
నక్షయఫలంబు ప్రాపించు నంత కంత
ప్రహర కాష్ఠా నిమేష సంభావ్యమాన
సుకృతరాసులు శోధింప నొకని తరమె ? 249

వ. ఇట్లు పల్కుచు విదిశాపురవీథులు దాఁటి యంతఃపురాంతరంబున నశ్వో రసంబు డిగ్గ,[129] మోహినింజూచి రాజు ధర్మాంగద గేహంబునకుం జని పూజాదులు గైకొనుమని నియోగించిన 250

క. దరహాస చంద్రికారుచి
తిరమై తగ నపుడు రాజు దేవేరి మనో
హరమైన సుతుని మణిమం
దిర సీమకు నేఁగెఁ బూర్ణతేజం బెసఁగన్. 251

క. ధగ ధగ ధిగ ధిగ లొలుకుచు
సొగసగు మణిపట్టసూత్ర శోభిత రవిబిం
బ గరీయః పర్యంకిక
దిగధీశ కుమారకుఁడు సతీమణి నుంచెన్. 252

వ. ఉంచి యంత నర్ఘ్యపాద్యంబులిచ్చి సంధ్యావళికంటె నంతరంగంబున ప్రేమ దళుకొత్త ఘనోరు జఘనస్తన యగు నా తన్వంగిని [130]వర్షాయుత సమన్వితంగాఁ దన్ను వర్షోత్పన్న బాలకల్పునింగాఁ జింతించి చరణంబులుం గడిగి శిరంబునం జల్లికొని కృతకృత్యుండ నైతినని పల్కి సర్వభోగంబులు నొసంగి క్షీరోదమథన జాత కుండలంబు లమృత ప్రభామండనంబులైప యవి, పాతాళ గర్భంబున దానవులు దాఁచిన యవి మోహిని కర్ణంబుల సంస్థాపించి యప్పు డష్టోత్తర సహస్రధాత్రీఫల నిభ శుభ మౌక్తికంబుల రచియించిన హారంబులు కంఠంబున వైచి వజ్రసంయుతంబైన శుద్ధ జాంబూనద నిష్కసూత్రంబు హారాంతరంబునం గైసేసి కరంబులం బదియాఱు మాణిక్య స్థాపిత కంకణంబులు గీలించె. మూల్యవేదులైన నరులచేత నొండొండు నిష్కకోటియని [131]విలువదేర మానూరు కేయూర నూపురంబు లొసంగి తారకాసుర సంగ్రామవిభీతి కాళికా కటి స్థలచ్యుత నానా

128. తెలివియై తల్లి పూజింప
129. డిగ్గి
130. వర్షాయత
131. విలువ దేర నోనూర కేయూర

రత్న సూత్రంబు మలయాచలంబునఁబడిన యది గ్రహించిన తమాయి యను దైత్యుండు మలయంబున నున్న వాని జయించి తెచ్చినది మోహినికి నొసంగె. హిరణ్యకసిపు భార్య లోకసుందరి శంపా సహస్రంబుఁ దొలగించు సీమంత భూషణంబు పతి వెంట నేఁగుచో సముద్ర మధ్యంబున పైచినఁ దత్సాగరంబు నిజ పరాక్రమంబునకు మెచ్చి యిచ్చె నది ధమ్మిల్లరేఖయందు నవరించె. అతి శుభ్ర వస్త్రంబులును, గంచుకంబులు నిడియె. సిద్ధ హస్తంబున దేవగిరి శిఖరంబునఁ బ్రాపించిన దివ్య మాల్య దివ్య విలేపనంబులు సమర్పించె. దివ్యద్వీప విజయ సంప్రాప్త కామవర్ధన ద్రవ్యంబులు ప్రతిపాదించె. అంత షడ్రసాన్నంబులు భుజియింపంజేసి తన్మాతృహస్తంబునం దానును భుజియించి మధుర వాక్యంబుల నిట్లనియె. 253

క. రాజోక్తి [132]నడవఁ దగునో
రాజీవాసన కుమారి ! రంజిల్లి మహా
తేజమున రాజులెల్లను
బూజార్హులు గారె సకల భువనంబులకున్. 254

గీ. రాజహిత మొనర్చు రమణి ! పట్టపుదేవి !
ప్రాతికూలవృత్తిఁ బరఁగి రాజు
మనసురాని యింతి మనుజేశుఁ గొల్చిన
జనులకెల్ల [133]దుష్ట చరితగాదె ? 255

సీ. ఆత్మేశ్వరునకు మోహంబుగా వర్తించు
చంద్రాస్యమీఁద మత్సరము సేయు
నతివ చతుర్దశేంద్రావధిగత [134]నర
కంబులఁ బడుఁ బతిఁ గడప నాడఁ
దప్త తామ్ర భ్రాష్ట్ర తలమున వేపించు
నంతకుం డటుగాన నధిప కార్య
భరణంబుచే నుండు భార్యకుఁ దగ నను
కూలతఁ బతిహిత గుణము నెరప

---

132. నడవదగనో
133. దుష్టశీల గాదె ?
134. నరకంబులఁ బడు పతి గడువనాడి తప్త

తే.గీ. హీనకేనియు స్వర్లోక మెసఁగి [135]యుండు
నీర్ష్య గర్వంబు నుడిగి [136]సమిద్ధబుద్ధిఁ
బ్రాణవల్లభు నిష్ట సపత్నిఁ జూచు
సతికి సర్వేశలోకంబు సంభవించు. 256

తే.గీ. పతిహితముగ సపత్ని సపత్ని సేవ
చేసి నిత్యంబు రంజింపఁ జేసెనేని
యట్టి సాధ్వీలలామకు నఖిలలోక
పూజితంబైన వైకుంఠపురి లభించు. 257

వ. ఇందునకు నొక యితిహాసంబు గలదు వినుము. 258

## బ్రాహ్మణ వృత్తాంతము

క. శాకల పురమున బ్రాహ్మణుఁ
డేక దురాచారుఁ డతి విహీనుఁడు వ్రతకు
ట్టాకుఁడు వానికి నొక వే
శ్యాకాంత లభించె నాత్మ హర్షంబొందన్. 259

సీ. ఆ బ్రాహ్మణద్రోహుఁ డాదరింపక యున్న
[137]వేశ్య కారించిన వికలవృత్తిఁ
జెందక తద్భార్య శీలసంపన్నయై
యా యిరువురకుఁ దా ననుదినంబు
పాదముల్గడుగు నభ్యంగన మొనరించు
సంవాహన మొనర్చు సతతనియతి
బహుకాల మీరీతిఁ బరిచర్య యొనరింప
నా వేశ్య వశ్యమోహకములైన

తే.గీ. యౌషధములు ప్రయోగింప నందు మీఁదఁ[138]
దదురు పావక భక్షణోద్ధతిని భార్య
కాగ్రహము చూపు నాగ్రహం బంటినట్లు
శాంతి యింతయు లేక దుర్జడత నతఁడు. 260

---

135. యుండు దీర్ష్యే
136. సమిద్ధ బుద్ధి ప్రాణవల్లభు
137. వేశ్యఁ గారించిన
138. దైల నిష్పావన భక్షణోద్ధతని భార్య

క. నిరత శ్రీజితుఁడగునా
ధరణీ దివిజాధమునకు దారుణత భగం
ధరరోగం బుదయించెం
బరివేదన నొందె వాఁడు పగలుఁ రేయున్. 261

క. సర్వస్వము గొని యాతని
[139]దుర్వ్యిధునిం జేసి వేశ్య తొలఁగి చనియె నా
యుర్వీసురు భార్యామణి
నిర్వేదనలేక వచ్చి నిలిచి భజించెన్. 262

వ. అప్పు డతండు చూచి లజ్జావనత మానసుండై యిట్లనియె. 263

మ. అతివా! నన్ను ననుగ్రహింపు మిఁక వేశ్యామోహ విభ్రాంతి దు
ర్మతినై నే నపరాధముల్ సలిపితిన్ రాజాస్య! సంపన్మద
స్థితి గర్వించితి బేలనై, సతుల గాసింబెట్టి మూఢుండు షం
డతఁ బాటింపుచు నుండుఁ బంచదశ జన్మంబుల్ దురాచారుఁడై. 264

క. ఘన జనులు నింద సేయఁగ
మొనసి దివాకీర్తి గేహమునఁ బుట్టునో
వనితా జనతాఖిల పా
పనితాంత నితాంత ఘోరపాపము కతనన్ 265

క. భవదీయ క్రోధాద్భుత
పవిఁ దూలితి నన్నుఁ గావు పాపాత్ముని నో
యువతీ నవతీవ్రామయ
భవతీక్ష్ణ శిలీముఖముల పాలై తినిఁకన్. 266

వ. అని పల్కు విభునిఁ జూచి యాసాధ్వి యిట్లనియె. 267

సీ. ఆత్మేశ! నీకు దైన్యము నొంద నేటికి
లజ్జించనేల యుల్లమున నాకుఁ
గోపంబు గలదె మత్కోపదగ్ధుఁడ నైతి
ననుచు నాడితివి జన్మాంతరోరు

---

139. దుర్విధునిం జేసి

[140]కలుషకృత్యముల దుఃఖములు ప్రారబ్ధంబు
లై సంభవించుఁ దథ్యముగ నట్లు
యెఱిఁగి తద్దుఃఖంబునెల్ల సహించినఁ
బురుషోత్తముఁడు వాఁడె భూతలమున

తే.గీ. నీవు చేసిన పాపముల్ నీవె యనుభ
వింపు చున్నాఁడ వా యమవేదనలను
స్వామి! కలనైన రోష విషాదవృత్తి
యెఱుఁగనని భర్త నూరార్చి [141]యింతి యంత. 268

గీ. జనక బంధుమిత్ర జన కనకము దెచ్చి
యాత్మ భర్త కిచ్చి హరినిగాఁగఁ
జిత్త వీధినుంచి సేవించి భావించి
యుపచరించి చాల నుజ్జగించి. 269

మ. మలమూత్రంబుల రోఁతదీర్చి గుదసీమాభాగ నిర్యాసదు
ర్జలఘోర క్రిమికోటి కూటము నఖ స్పర్శంబు నందార్చి క
న్నుల రేయుం బగలున్ సదానిదుర కున్కున్ లేక వేగించి యా
లలనారత్నము సేవ చేసెఁ బతియుల్లం బుల్లసిల్లం దమిన్. 270

గీ. భర్త రోగ దుఃఖభరమునఁ [142]బొగులంగ
భువనమెల్లఁ బొగులు పోల్కి సాధ్వి
తలఁచి యంత కంతఁ దాతప్యమానయై
యంతరంగసీమ నపుడు గలఁగి. 271

సీ. నిర్జరోత్తములార ! నిఖిల మాతృగణ పి
తృగణములారా ! సుధీరులార !
యారోగ్య మొసఁగుఁ డీ యాత్మేశ్వరునకు నో
చండిక ! మ న్మాంసఖండ రక్త
ధార లర్పించి యుద్ధతమత్త మహిషంబు
గావు వట్టించి యగ్రమున నిర్జ
లోప వాసములు పెక్కుండెద రేయెల్ల
సూచి కంటక సంచయా(ం)చితమగు

140. కలుష కృత్యములు దుఃఖములు

141. యింతి యెంత 142. బొగలంగ

తే.గీ. శయ్యపైఁ [143]బండెద మధురసంబుఁ గ్రోల
నాజ్యమే నొల్ల మేని కభ్యంజనం
దడవ నిమ్మింతటి మనోరథంబు నాకు
ననుచు నద్రిజఁ బూజించె ననుదినంబు. 272

వ. అంత నతండు కొన్ని నాళ్లకు రోగబాహుళ్య వైకల్యంబు నొంది త్రికటు కషాయంబు ప్రదేశిని నిల్చినఁ దదంగుళి దంశనంబు [144]గావింపఁ దత్ఖండంబునం భర్తృవదనంబు జిక్కిన స్రుక్కిక యతనితోఁగూడ దుఃఖంబు లనుభవించి మురారి లోకంబునకు నేఁగె నది గావునఁ బతిహితం బొనరించుట పతివ్రతలకు జన్మవ్రతంబు. 273

సీ. అని పల్కు తనయుని నక్కునఁ జేర్చి సం
ధ్యావళి యతని శిరోంతరము స్పృ
శించి యాఘ్రాణంబు చేసి నీ పల్కిన
వచనం బొనర్చెద వన్నె మెఱయ
నీర్ష్యతోఁ బాసి మోహిని భోజన ముఖ్య
సకలోపచారముల్ సంఘటింతు
నిన్ను నొక్కనిగని నేఁడు సూర్వురు పుత్ర
కులఁ గాంచినట్లనె వెలయఁ గలిగె

తే.గీ. బహునియమ బహునిర్జర బహుమహీశు
పర్వసేవా విధాన సంపత్తి మహిమఁ
గంటి నినుఁ బుత్రుగాఁ దమ్మికంటి వేల్పు
వంటి సాత్విక రత్నంబు [145]గెంటులేక. 274

క. శోకానుతాపకారకు
లై కనుపట్టెడు కుమారు లట నూర్వురు దు
ష్పాకులు పుట్టెడు కంటెఁ ద
దేక కుమారుండె లోకమేలఁగఁ జాలున్. 275

143. బండెదను మధురసంబు
144. గావించి తత్ఖండంబు
145. గెంటిలేక

తే.గీ. సకల లోకోపరి ప్రదేశమున నున్న
దాన నీ సద్గుణస్ఫూర్తిఁ దనయ మాన్య
ధన్య రాజావరోధి మూర్ధన్య నైతి
నూతనముగ ఫలించె నా నోములెల్ల. 276

క. సప్తద్వీప విభుఁడవై
సప్తాశ్వ నిభుండవై యశస్స్ఫూర్తిసుధీ
రావృతయై వర్ధిల్లఁగ
దృప్తారి జనంబు కలఁగి తిరిగిరి తనయా! 277

క. తనయుఁడు పుట్టిన జననీ
జనకుల కాహ్లాదకరణ సౌభాగ్య కళా
ఘనశక్తి చూపకుండిన
ననఘా! పాపాత్ముఁ డెంచ నాతఁడు గాఁడే? 278

వ. అని సూపకారజనంబు నీక్షించిన యంత షడ్రసాన్నామృతాన్న
భాండంబులు ముందర నిడునంత. 279

మ. అమృతాహారము కందమూలములు సూపాపూప హయ్యంగ వీ
నములుం జిత్రఫలోత్కరంబు పరమాన్నంబుఁ [146]రసాంచద్విశే
షము మాంగళ్యముఁ దేనె తిమ్మనము పచ్ఛళ్లాదిగాఁ గల్గు భో
జ్యము వడ్డించె నకించిదంచిత విలాసశ్రీలు దైవారఁ గన్. 280

తే.గీ. [147]పాన భాజన వేష్టిత చర్మ పాత్ర
తలమున విరించి నందన తా భుజింప
సాతకుంభాసనమున నా సాధ్వి తాళ
వృంత మొకవింత నంతంత వీవఁ దొణఁగె. 281

వ. దూరంబున ధర్మాంగదుండు పింఛపు టాలవట్టంబున విసరి భోజనా
నంతరంబునం దాంబూలంబు మడిచి యిచ్చుచు నుండ సంధ్యావళి
చందనం బలంది నవ్వుచు, నీవె ధర్మాంగదునకు జననివి కాకున్న నీ
విట్లు సేవింప నెన్నఁడుం గైకొనిన దానంగాన నినం జూచి ధర్మాంగదుం
డిట్లనియె. 282

146. రసావళ్యాశేషము మచ్ఛండియు దేనె
147. పాన భాజన చేషిత

తే.గీ. ధనదు గర్భంబునందు నీ తరళనేత్ర
వత్సరత్రయంబు వహించి వాసిఁగనియె
సాధ్వి ! భవదీయ పూర్ణప్రసాద మహిమ
వన్నె మెఱయంగ నేనింత వాఁడనైతి. 283

తే.గీ. ఇందుముఖి ! నాకు జనయిత్రు లెందఱేని
కల్గినం గల్గనిమ్ము లోకములు మెచ్చ
సాధ్వి యీ కాంత నిజఘన స్తన్య పాన
మహిమఁ బోషించె న న్నసమాన వృత్తి. 284

తే.గీ. జనని [148]ప్రసవైక వేదన జాలిఁజెందె
నన్ను నొక్కనిఁ గాంచి యెన్నంగఁ దనువు
శిథిల బంధంబుగాఁగ గాసిల్లె నాకు
నా ఋణముఁదీర్ప మఱి యుపాయంబు లేదు. 285

క. జననీ జనాంకతలమున
దిన దిన పరివృద్ధిఁ బెరిఁగితి న్నాకంబెన్
ఘనుఁ డెవ్వం డినుఁ డెవ్వం
డనఘుం డెవ్వఁడు తలంప నంబుజవదనా. 286

సీ. బాలకుమారిక భర్తృసౌఖ్యం బెఱుం
గని యట్లు జననియంకంబు నందు
మహిమ నుండక కాని మాతృసౌఖ్యముఁ గనఁ
డిట్లు మాతా పితృ పేతుఁ డొకఁడు
కలుగఁడు జగతి నొక్కట లీలఁ దల్లియం
కమునందుఁ [149]బెరిఁగిన కొమరుఁడతుల
దర్పుఁడై శంభు మస్తక చంద్రకళఁ గరం
బునఁబట్టి తివియంగ భుజబలంబు
తే.గీ. గలిగి తమకించు జనని యొకర్తు వనుప
[150]జనక హీనతనున్నఁ దజ్జనుఁడు జగము
లన్నియు హరింపఁ దలఁచు శౌర్యముననట్టి
పటిమగాదె ప్రసూస్తన్య పానశక్తి. 287

---

148. ప్రసవైక వేదనఁ జాలిఁ జెంద
149. చెరిగిన యతండు సారదర్పుఁడై
150. జనక హీనత నున్నత జజనుఁడు

క. నను సంధ్యావళి గర్భం
బునఁ దాల్చిననేమి నీకుఁ బుత్రుఁడ నేత
జ్జననికి మీకు విశేషము
మనసున వాక్కునఁ గ్రియాక్రమమునం గలదే? 288

వ. అని తనయుండు పలుక విస్మయాన్వితయై మోహిని ధర్మజ్ఞుండగు నీ వినయశీలుని యెడ విరుద్ధాచరణంబు సేయ ధర్మంబె? పితృశుశ్రూ (ష) ణంబునం దిట్టివాఁ డెందునుంగలుగఁ డితండుపుత్రుండై యేను జననియై యెట్లు ద్రోహకృత్యంబుఁగావింతునని చింతించి తనయునిం బిలిచి రాజు రావింపు మతనింబాసి నిమేషంబు నోర్వననిన శీఘ్రంబున నేఁగి చెప్పిన రాజు సంధ్యావళి సదనంబునకు నేతెంచి. 289

ఉ. హావవిలాస విభ్రమ సమన్విత యౌవన లీలదేవి సం
ధ్యావళి మెల్లమెల్లనె నమంచదురశ్మిర వీజనంబుచే
వీవ ననేక [151]భోగములు వెల్లువలై పెనుపొందఁ బాన్పుపైఁ
గేవల మన్మథాస్త్రములఁ గిన్నరకంఠి మెలంగు నంతటన్. 290

వ. రాజు పొడకట్టిన దిగ్గనలేచి పర్యంకంబున నంకంబున నిడుకొని రాజ్యభారేచ్ఛ నెట్టు వర్తింపుచున్నవాఁడవు? విశ్వవిశ్వంభరాభరణంబైన పుత్రరత్నంబు గలుగ నేటికిం గాయక్లేశంబు గుణాధికుండైన తనయునియందు రాజ్యంబు నిలుపక కష్టకృత్యంబునం దిరుగువాఁడు మహాపాతకుండుగాఁడా? కేవల ఫలభోక్తలై విషయాసక్త చిత్తులగు వారు పుత్రప్రియ భ్రాతృమంత్రి భృత్య సుహృజ్జనంబులు దక్షులు గలిగిరేని వారియందేని బలవద్వీరులయందేని భారంబు నిల్పి యనుభవింపుదురు. వ్యాధిగ్రస్తుండగు దుర్బలుండు ప్రియభోగంబులు విడిచినట్లుండితివి. నీతో నాకుఁ బ్రయోజనంబేమి? అప్రయోజనంబుగా మందరంబున నుండి యేల తెచ్చితివి? ఏను విషభోజ్య నయ్యెద; యౌవనోపేతయగు స్వభార్యను దుర్మతియై యెవ్వఁ డంగీకరింపఁడో వాఁడు దుర్బుద్ధియగు, నతనికి నది యెట్లు ప్రియురాలయ్యెడు. భార్య విడనాడిన జనులు చేసిన దాన ధర్మంబులు చెడు. ధనంబులు చెడు. రాజ్య వైభవంబులు చెడు. అనధీతంబైన శ్రుతంబు మానినయట్ల, అలసులచేత విద్య దొరకనియట్ల, భార్య యాశ్రితవ్రతంబులచేత లభించనియట్ల, యనుష్ఠాతకు దోషంబుద్భవించని యట్ల, యభక్తులకుం బ్రియుండులేని యట్ల, యజ్ఞానులకు మోక్షంబు ప్రాపించని యట్ల, యత్యాగు

---

151 భోగముల వెల్లువలై

లకు యశంబు దొరకనియట్లు, యనుద్యోగికి సుఖంబు చేకూఱని యట్లు, యభార్యునకు సంతతి జనింపని యట్లు, యనశ్వునకుఁ బృథివీపాలనంబు సంభవింపని యట్లు, యగజునకు సంగరంబు జయింప సామర్థ్యంబు పుట్టనియట్లు, యనగ్నికి మృష్టాన్నంబు సిద్ధింపని యట్లు, రిపునకుఁ బ్రియోక్తు లుదయించని యట్లు, యప్రశ్నునకు నెఱుంగంబడని యట్లు, యగమనునకు నడువ శక్తి లేనియట్లు జాగరవంతునకు భయంబు గనిపించని యట్లు, యటుగాన నన్ను ధర్మాంగదు గృహంబున విడిచి రాజ్య సుఖంబుఁ గోరెద విట్లుచితంబె యని కన్నుల బెళఁకు, మేని తళుకు, సిగ్గుకళుకు దొలఁకఁ బుత్ర సన్నిధానంబున గుణ నిధానంబన నున్న మోహినింజూచి యిట్లనియె. 291

మ. లలనా ! నేనధికారకృత్యమున నాలస్యంబుఁ గావింప ని
స్తుల మార్గశ్రమ నిద్రఁ జెందితి దరిద్రుండర్థ పుంజంబుఁ ద్రో
వల వీక్షించిన యట్ల ధర్మగుణ భవ్యశ్రీల ధర్మాంగదుం
డలఘుం డెట్లు నొనర్చె నర్చనలు నీకానందమై యుండెనే. 292

వ. అనిన మోహిని యిట్లనియె 293

సీ. ఆత్మేశ యంతఃపురాంగనల్ నన్నుద్వ
హించిన మొదలు ననేక కామ
భోగ నిరాశలై పొగులుచు నున్నవా
[152]రింక నూరార్పు హితేరితముల
వరరూపలావణ్యవతులైన జ్యేష్ఠభా
ర్యల శిరంబునఁ బ్రియమైన దా
మృత్యువుగా నిల్పి మెఱయించు వానిపై
ననురక్తిగలదె తదంగనలకు

తే గీ. నట్టి కాంతలచేతఁ బంచాస్త్రకేళి
గలదె యనుకూల సాధ్వులుగలుగ నాకు
నగునె కల్యాణలక్ష్మి నన్నట్టి సాధ్వు
లాగ్రహించిన నేరీతి నగుదు నాక్కా. 294

---

152, రింకనుల్లార్పు హితోక్తి రతుల

శా. [153]ఆసంధ్యావళి మేటిసాధ్వి మృదు వాక్యారంభ సంరంభయౌ
నీ సౌభాగ్య కళాధనంబగు భవత్స్నేహంబున న్నన్నుఁ బ్రే
మాసక్తిం గరఁగించి షడ్ర[154] సరసాఖ్యాప్తంబుగా భోజనం
బీ సొక్కింతయు లేక తానొసఁగె సౌహిత్యంబు చోద్యంబుగన్. 295

క. [155]తరుణు లిటువంటి వారలు
వరసుందరు లెందఱేని వల్లభ ! నీమం
దిరమునఁ గలుగఁగఁ దత్పద
పరాగకణతుల్యగరిమఁ బరఁగఁగ నేలా ? 296

వ. అనిన సంధ్యావళియును బుత్రుండును దగ్గరనుండ మోహిని వచనం
బులువిని రాజు లజ్జసూరకయున్న నింగితజ్ఞుఁడగు ధర్మాంగదుండు
తదవస్థ నెఱింగి సంధ్యావళీ ముఖ్యాజననులం బిలిచి కృతాంజలియై
మోహినీ రహఃక్రీడారంభపరుండై రాజు మోహించి యున్నవాఁడు.
మీరు ననుగ్రహింపుండని పల్కిన వార లిట్లనిరి. 297

క. ఈగతి నెవ్వరు పల్కుదు
రీగతి నెవ్వరిట నడతు రిది చోద్యము పు
త్రా ! గురుభక్తి పరుండవు
ప్రాగల్భ్యము నెరపి యిట్లు పలుకందగునే ? 298

సీ. ఆత్మమాంసముఁ దానెయట చవిగొను నెవ్వఁ
డనలంబుఁ గరమున నాను నెవ్వఁ
డత్యుగ్ర విషము భోగ్యంబుగాఁ గొను నెవ్వఁ
డసిచేతఁ దనతల నడఁచు నెవ్వఁ
డనుపమశిలఁ గట్టుకొని సాగరంబీదు
నెవ్వఁడు [156]పులినోట నెసఁగు నెవ్వఁ
డిభవైరి సట లూడ్చ నిచ్ఛమైకొను నెవ్వఁ
డతి [157]శితఖడ్గధారాగ్రసీమఁ

---

153. ఆ సంధ్యావళి వంటి సాధ్వి మృదువాక్యారంభ సరంభయై యీ సౌభాగ్య
కళా ధనంబుగు భవత్స్నేహంబు
154. రసాఖ్యాక్తంబుగా
155. తరుణీ; యిటువంటివారలు
156. పులినోర నెసఁగు
157. సితఖడ్గ

తే గీ. జిందు లాడెడు నెవ్వండు సిరివహించి
సవతితోఁ బ్రాణనాథుఁ డశ్రాంత గోష్ఠి
సలువ నేకాంత యేకాంత సదనసీమ
నిలిచి చూడంగ నోపు నో నృపకుమార ! 299

వ. అదియునుం గాక సర్వదుఃఖంబులకు నిదియ దుఃఖతరంబని పల్కిన
ధర్మాంగదుం డిట్లనియె. 300

తే. గీ. కలుషశీలత వాఙ్మనః కాయకర్మ
హితము సేయక తండ్రికి నెగ్గొనర్చు
నెవ్వఁ డాతఁడు నా శత్రుఁ డెంచ వధ్యుఁ
డరయ సంధ్యావళీసతి యైననేమి ? 301

క. అందఱిలో నీ మోహిని
మందరనగసీమనుండి మనుజేశ సుఖా
నందకర ప్రియ శీలతఁ
జెందినయది గాన హితము సేయఁగ వలయున్. 302

సీ. అనినఁ బుత్రునిమాట లాలించి జనను లం
దఱును లాలించి గద్గద మనోహ
రోక్తుల నీమాట యోగ్యంబు న్యాయసం
యుత మవశ్యముఁజేయ యుక్త మనఘ !
కించిద్ధనం బొసంగి భవద్గురుండును
మోహినీ కేళిఁ గ్రమ్మకొనుఁ గాత
అఖిల భోగంబులు ననుభవించి మనంబు
దృప్తిఁ జెందినయది తెలియనేల

తే. గీ. వాసికెక్కి ద్వితీయ వివాహమునకుఁ
గూడి ప్రథమ పరిణయ ద్విగుణధనంబు
లొలి సేయంగఁ దగుఁ గాకయున్న జ్యేష్ఠ
భార్య కా భర్త ఋణికుఁడై పరఁగియుండు. 303

క. పుత్రేచ్ఛ నన్యనీరజ
నేత్రం బరిణయమునంద నెక్కొని కరుణా
పాత్రంబగు జ్యేష్ఠకు ధన
మత్రత్యులు మెచ్చ ద్విగుణ మర్పింపఁ దగున్. 304

వ. అనిన విని ప్రహృష్టాంతరంగుండై ధర్మాంగదుండు. 305

సీ. ఒక్కొక్క యింతికి నొక్కొక్క కోటి పై
 మళలాకికలును గ్రామములు వేయు
నశ్వతరీయుక్త హారికాంచనమాలి
 రథము లెన్మిది సహస్రనవదాసి
కా నదీరత్నముల్ ఘనఘృత కుంభాయు
 తము తైలకుంభాయుతము నజావి
కము [158]లసంఖ్యాకముల్ సమవజ్ర రత్నాష్ట
 కంబు మాణిక్య సంఘములు తాచు

తే. గీ. [159]భూషణంబులు నమలినాశేష భూరి
హారములు చందనంబు కర్పూరములును
[160]గనక పాత్రలు మఱి పాత్రకములు గోటి
కనక కుంభాష్టశతము లుత్కంఠ నిచ్చె. 306

వ. మఱియుం గరేణువులు వింశతియు వింశతియు, నుష్ట్రంబులు [161]శతంబును శతంబును, శిబికాదండంబులు వేయును, జామరంబులు వేయును సవిశేషంబుగా నొసంగి ప్రదక్షిణం బొనర్చి మ్రొక్కి మోహినీ మోహ వారిధిం దేలియాడుమని మీర లనుగ్రహింపుండనఁ బుత్ర వాక్యంబు విని రాజేంద్రా! విదేహతనయతో రఘువీరుండునుం బోలె మోహినితో విహరింపు మీ మోహిని కుశకేతుపుత్రి మాకుం జెలియ లీర్ష్య యేమియు లే దీవుత్రుండు బోధింప మా హృదయంబులు గరంగిన యవి. యని విన్నవించిన రాజు ప్రహర్షంబునొంది ధర్మాంగదుం జూచి యిట్లనియె. 307

శా. సప్తద్వీప పరీత భూవలయ మైశ్వర్యంబుతో నేలు మ
త్యావత్రాణము దుష్ట శిక్షణము శౌర్యస్ఫూర్తి చేఁజేసి భూ
గోప్తల్ గొల్వఁగ విష్ణువాసర పరిక్షుణ్ణ వ్రతాచార సం
ప్రాప్తిం ధర్మము నిల్పు మీ సుకృత సారజ్ఞుల్ ప్రశంసింపఁగన్. 308

వ. ఎల్లప్పుడు నీవు దేశంబులు దిరుగు దానంబు వదలక కౌటిల్యంబు లెఱింగి లోకోత్కృష్టంబైన యాచారం బెయ్యది యదియ కావింపుచు

158. లసంఖ్యాతముల్
159. భూషణంబులు యామలిక క్యాషభూరి
160. గనక పాత్రమణీ పాత్రకములు
161. శతం బున శతంబును

రాజులకు విశ్వాసం బన్నియెడల వలయుం గావునఁ గోశాగార పరిజ్ఞానంబు సేయుచు నుండుము. నీవు సుతుండవైన కతన నాకు నీ జగన్మోహిని యైన మోహినితోడ విహరింపఁ బునర్యౌవన ప్రాప్తి యయ్యెడు. మనుష్య లోకంబున వృద్ధునకు సురతానురాగంబు గలుగుట హాస్యకరంబు. మేను జీర్ణంబయ్యె. శిరోరుహంబులఁ బలితంబు వొడమె. జీర్ణుండనైన నీచే నజీర్ణుండనై భోగంబు లనుభవించెద. నే నీకాంత నాకాంతంబు విడిచి నాకాంతయై వచ్చుటంజేసి భవద్బాహుగుప్తుండనై [162]బర్హినిర్ఝర దివ్యనదీ తటంబుల విహరింతు నీపురంధ్రి మత్ప్రాణంబు. దివ్యకాంత. ఏ తన్నిమిత్తంబుగా దేవతలు ఖేదంబు నొందుచుంజనిరి. దీని సంరక్షింపవలయు ననిన తండ్రి వాక్యంబులు విని యుపచారంబులు గావింప నాజ్ఞానువర్తుల నియోగించి రాజ్యభారంబు వహింపుచుండె నంత. 309

సీ. ఈరీతి ధర్మాంగ దేంద్రుండు పాలింపఁ
బాప బుద్ధులు లభింపరు జగములఁ
బుష్పఫలవిహీన భూరుహంబులు లేవు
శాలి రహిత మహీస్థలము లేదు
సకలార్తి హర పాపశమన శీతారస
దుగ్ధఘృతంబు లద్భుతముగాఁగఁ
బిదుకని మొదవుల కదుపు లెవ్వియులేవు
కలఁగి దురుక్త భాషలు వచింపు

తే. గీ. నంగనలు లేరు దుర్వృత్తులైన యట్టి
తనయులును లేరు పితృ గృహస్థాయిని యగు
కన్యయును లేదు విప్రోక్తి కలిత భవ్య
కార్యములు సేయని మనుష్య గణములేదు. 310

వ. మఱియు హరివాసరంబున నెవ్వరు భుజియింపరు వారికి సంపదలు [163]భోగదానంబులు వ్యవధానంబు నొందవు. నదులు నిదాఘంబున శోషంబు నొందునట్లు క్షీణత నొందవు. వర్షాగమ దూర్వాంకురంబులుం బోలె నక్షయంబులగు (సస్యసంపద లొంది) దస్యు భయంబులు లేక

162. బర్హనిర్ఝర

163. భోగదానంబుల వ్యదానంబు నొందవు.

(యందఱును) గృహంబుల సత్య ధర్మపరులై యఖిల భోగంబులు ననుభవింపుదురు. భూమి దున్నక పండు. శిశువులకుఁ జనుబాల పుష్టి గలదు. స్త్రీలు భర్తృ భోగ [164]కలిత లగుదురు. స్వరాష్ట్ర గుప్తిని రాజులు హర్షంబు నొందుదురు. [165]ధేనువులు గోపకులు గాయక స్వేచ్ఛా సంచారంబు చేసి వత్సప్రియలై పాలు గురియుచు [166]నిల (య)ంబులకు వచ్చు నిట్లు రామ రాజ్య ప్రకారంబున నుండు నంత. 311

## రుక్మాంగదుఁడు మోహినితో సుఖించుట

క. ఇది దిన మిది రే యిది క్షణ
మిది జామిది పక్షమనుచు నెఱుఁగక భోగా
స్పదమగు పదమన నా విభుఁ
[167]డెదమాడి సుభోగ భోగ మెసఁగ [168]రమించెన్. 312

శా. ఆ రామామణితో రమించి రవివంశాధీశుఁ డత్యంత తే
జోరమ్యత్వ దృఢత్వసత్వ బహువస్తుత్వంబులన్ శుక్లప
క్షారూఢ ద్విజరాజు వోలె నుదయంబందెన్ వధూనృత్తగీ
తారంభంబులు గాంచి తద్వనిత యాస్యస్ఫూర్తి వీక్షింపుచున్. 313

క. వరకుంభి కుంభ పీనాం
తర నీరంధ్రాతి వృత్త [169]తత్కుచము లురోం
తరమున రాయుచు ధరణీ
ధర వల్లభుఁ డమితమోహ తత్పరుఁడయ్యెన్. 314

క. ఆరోమరేఖ యాసౌగ
సా రుచిర నితంబబింబ మా యొయ్యారం
బౌరా ! రాజీవభవుం
డేరీతిం జేసెనో సమిద్ధత దీనిన్. 315

---

164. కలితు లగుదురు.
165. ధేనువుల.
166. నిలంబులకు వచ్చుచు నిట్లు
167. డిదమాడి సుభోగ.
168. రచించెన్.
169. తత్కుచములు దొంతరమున

వ. కరికరాకార రేఖకు బిరుదు గట్టిన యవి యూరువులు, విజిత శరధి సంఘలు జంఘలు, శృంగార రస ప్రగల్భంబు గుల్ఫంబు, నీ యింతి గలుగ నే నింద్రాదుల కంటెం గృతార్థుండనైతి నని హర్షించి యిది వేడిన ధర్మాంగదుండు దక్కం బ్రాణంబేని యిత్తు ననుచు మెచ్చి యష్టవర్షోపభోగ సంలబ్ధి వర్తించునంత. 316

గీ. తొమ్మిదవయేట ధర్మాంగదుండు మలయ
పర్వతోత్తమమున [170]మహా బలపరాక్ర
మాఢ్యుల ఘనుల (భువన) విఖ్యాత బలుల
గెలిచె నేవురు విద్యాధరుల రణమున. 317

సీ. అప్పన దెచ్చె విద్యాధరుల జయించి
మణులేను నిజశక్తి మహిమ నొకటి
హాటకమయ లక్షకోటి ప్రదంబగు
నొకటి సహస్ర శతోత్తమ [171]పట
దాయకం బొక్కటి తారుణ్య సంపద్వి
ధాయక నవసుధాధార లొలుకు
నొకటి [172]గృహప్రధానోత్కట ధాన్య సా
ధనమయి కీర్తిని దనరు నొకటి

తే.గీ. వ్యోమగమనంబు నొందించు నొరపు మెఱయ
నట్టి మణిరాజములు దెచ్చి యధిక శౌర్య
ధనులు విద్యాధరాగ్రణుల్ దారు నశ్రు
పూర్ణ నేత్రాంతలై తదంభోజ ముఖులు. 318

వ. వెంటరా ధర్మాంగదుండు రుక్మాంగద క్షితీశు పదంబులపై వ్రాలి వీరె యేవురు విద్యాధరులు మలయాచలంబున వీరి జయించితి వీక్షింపు మేతద్భార్యలు సైరంధ్రులయి యీ మణులచే మోహినీకాంత నలంకరింతురు. సర్వకామ ప్రదంబులై పునర్యౌవన దాయకంబులై యుండు నీమణులు దాల్చిన జీర్ణవంతులేని లావణ్యవంతు లగుదురు. ఈ మణులు [173]వళిపలిత నాశకంబులు: వస్త్రహర్మ్య సువర్ణాది చింతిత

---

170. మహాబల పరాక్ర-విక్రమాఢ్యులఘనుల విఖ్యాతబలుల.
171. పటు
172. గృహ ప్రధానోత్కటంబై ధాన్య-సాధనంబై కీర్తిఁ దనరు
173. వళితులిత నాశకంబులు.

సిద్ధి మూలంబులు. చింతామణులే కాని యితర మణులు గావు. గంధర్వులు నేనును ముప్పది దినంబులు రణంబొనర్చి నీ తేజంబున జయించి యప్పన గొంటి. ఏను సముద్రంబు ప్రవేశించి సముద్ర గర్భంబున నొక యేఁడు వర్తించితి. నాగ శతావృతమైన భోగవతి నిర్జించి యయుత నాగకన్యలం గొనివచ్చితి. ఫణిఫణా రత్నంబులు దెచ్చితి నచ్చట దానవ మందిరంబున కేఁగి యెనిమిది వేవుర దానవీ కన్యకల నాహరించితి. శతకోటి రత్నంబులు దీపార్థంబుగా నాపా దించితి. యుష్మత్పరాక్రమ పాలితుండనై రసాతలస్థితంబగు వారుణ లోకంబు చొచ్చి వరుణుం గాంచి బ్రతుకవలసెదవేని మా తండ్రి యాజ్ఞం దిరుగు మనంగ నలిగి యుద్ధసన్నద్ధుండై యొక వత్సరంబు పోరె. అతని నారాయణాస్త్రంబునం దూలించిన సమీరవేగంబులై విజితచంద్ర ప్రభాభోగంబులై యొక్కొక కర్ణంబు శ్యామంబై తృణ తోయంబులు లేక బ్రతుకు తురంగాయుతంబును బుష్కరానుజయైన త్రిలోకసుందరియగు నొక కన్యను భార్యార్థంబుగా సమర్పించె. ఇచ్చ వలసిన యవి యంగీకరింపుడు. పుత్రార్జిత విత్తంబు గ్రాహ్యంబు. శంక వలవదు. వ్యయంబు సేయుము. తండ్రియెడ నీ ధనంబు నే నార్జించితినని గర్వంబున నాడికొను పుత్రుం డా భూతసంప్లవంబుగా నరకం బనుభవించు. కుఠారంబునుం బలెఁ బిత్రధీనుండగు కుమారుం డిచ్చెనని తండ్రియు ననుకొనం దగదు. 319

సీ. తండ్రి శౌర్యంబునఁ దనయుండు సర్వంబు
[174]నార్జించు పట్టున నతని మహిమ
[175] ధాత వన్నించు నుత్కట తృణ వ్రాతంబు
పవన పూరిత చర్మ భస్త్రజలము
దరియింపఁ జేయు సూత్ర ప్రోతయగు దారు
మయయోష దిరుగు సమగ్ర శక్తి
[176]నటు గానఁ బితృశక్తి యందు రా తనయుని
తేజోబలంబులు దెలిసి చూచి

174. నార్జించు పట్టిస యతని మహిమ
175. ధాత బణంచు నుత్కట
176. నటుగాన పితృశక్తి

తే.గీ. యట్లగుట నీ జలాధీశ్వరాగ్ర పుత్రిఁ
గాంచి కరుణించి నీ యిచ్చ గలిగినట్లు
యిమ్ము పంకజ సంభవ హితకుమారి
కగ్రదాసిగ మన్నించి యవనినాథ. 320

వ. అనిన విని మాంధాత యిట్లనియె. 321

తే.గీ. కొడుకు మాటలు విని రాజ కుంజరుండు
మోహినియు నేమి తలఁచిరి మునివరేణ్య
చిత్రతరమైన యీ కథాసూత్ర మెల్ల
నీ ముఖంబున విన బుద్ధి నేఁడు పొడమె. 322

వ. అనిన వసిష్ఠుం డిట్లనియె. 323

## ధర్మాంగదుని వివాహము

శా. ఆనీతాద్భుత పుత్రసంపదలు నెయ్యంబంది వీక్షించి ని
త్యానందంబు వహించి భూవిభుఁడు శౌర్య స్ఫూర్తి సత్కీర్తి ల
క్ష్మీ నిత్యోన్నతి ధాత్రి నాజ్ఞ నడిపించెఁ వీఁడు సత్పుత్రుఁడ
న్యూనజ్ఞాన నిధాన మాధ్యతరుఁ డర్థుండంచు నూహింపుచున్. 324

క. అసమకళ సుదిన [177]సుముహూ
ర్తసువిధు నక్షత్ర తిథుల ధరణిపులెంచన్
స్వసుతునకు వివాహము సే
య సువిప్రులఁ బిలిచి ధన్యుఁడై పూజించెన్. 325

వ. పూజించి గోనిష్క సహస్రంబు లొక్కొక్కని కిచ్చి యనిచి
నిజ పురోహితునిం జూచి యిట్లనియె. 326

గీ. యౌవనోపేతుఁడగు పుత్రు నాత్మజనకుఁ
డర్థ మబ్బియును వివాహ మాచరింప
కున్న నాతఁ డగమ్యమై యున్న దుర్ని
రయముల వసింపుచుండు యుగాయుతంబు. 327

వ. అది గావున బాల్యంబుననే వివాహంబు సేయుట పితృకృత్యంబు
సుతుని నిర్వహించుట తన్ను నిర్వహించుకొనుట. సుతుండు కృత

177. సుముహూర్తసుఁడును నక్షత్ర సుతిథుల

వివాహుండైనఁ దండ్రి [178]కృతార్థుండగుటఁ బుత్రుండు గుణవంతుండేని వివాహంబు సేయవలయు ననం దద్వచనంబులు విని పురోహితుండు హర్షించి [179]సంకేతంబు లిచ్ఛామాత్రంబునం బొడమక గురువాక్యంబునం దాఁటకయున్న ధర్మాంగదునకు వరుణాత్మజా పూర్వకంబుగా నాగకన్యకల వివాహంబు చేసిన, మొదలఁ దండ్రికి మ్రొక్కి యంత మోహినికిఁ గేలుమోడ్చి తదనంతరంబ సంధ్యావళి చరణంబుల కెరఁగి నగుచు నిట్లనియె. 328

చ. గురు వచనంబుచేత మయికొంటిఁ బరిగ్రహ సత్పరిగ్రహం
బురుతర [180]భక్తియుం గురు హితోక్తియు మామక జీవనంబు ని
ర్భరతర దార సంగ్రహ నిరంతర భోగములేల నాకుఁ ద
ద్గురు పదసేవయే సుకృత గుచ్ఛము నాకము నాకు నేటికిన్. 329

వ. మనము గురు శుశ్రూష సేయందగు నన సంధ్యావళి యిట్లనియె. 330

మ. అనఘా! సంతత భోగ భాగ్య బల దీర్ఘాయుస్సమేతుండవై
జనకానుగ్రహశక్తి నీవు గలుగన్ సర్వంసహన్ శక్తి స్త్రీ
జన మూర్ధన్యత ధన్యతన్ వెలసితిన్ జాలన్ సపత్నీ సతుల్
నను మన్నించఁగ మంటి నీ మహిమ నానావైభవ స్ఫూర్తులన్. 331

వ. అని శిరంబు మూర్కొని యనిచిన నితర [181]జనయిత్రుల నట్లనె పూజించి రాజ్యపాలనంబు సేయుచు నే దేశంబునందు నే ప్రయోజనంబు నందు నేమరక వర్తించె. సర్వకార్య జాగరూక నిర్వాహుండై నిలిచె. హస్త్యశ్వరథ పదాతి పోషణంబు గావించె. దుర్గ సంరక్షణం బొనరించె. తులా మానంబులు నెలనెలకు శోధించె. పౌరజన గృహ కృత్యంబు పరిశీలించె. ఎచ్చట స్తనంధయుండు స్తన్యపానంబు లేక రోదనంబుఁ గావించు, నెచ్చట శ్వశ్రూజనావమానంబు నొంది వధూజనంబు దుఃఖించు, నెచ్చట సమర్థుండై తనయుండు గణన సేయక యుండు, నెచ్చట వర్ణసంకరం బగు, నెచ్చట గూఢ విభవులై లోకులు వర్తింతు, రెచ్చట భర్తృమతియైన యింతి కంచుక రహితయై యిల్లు వెడలి తిరుగు నెచ్చట సకేశయై విశ్వస్త గనఁబడు, నెచ్చట సకేశ

178. కృతార్థుండగుట, పుత్రుండు
179. సంకేతంబులై యిచ్ఛామాత్రంబునం బొడమక
180. భక్తియై గురు హితోక్తియె మామక జీవనంబు
181. జనయిత్వల

యగుచుఁ బుణ్యపురంధ్రి రాణించు, నెచ్చట వ్రతిక్రోధియై యుండు, నెచ్చోటి నారణ్యకుండు నగరాశ్రయుండగు, నెచ్చట ధనికుండై లోభి యగు, నెచ్చట నిర్దయుండు వసించు, నెచ్చట గోపాలుండు పురాంతర వర్తియగు, నెచ్చట ఋత్విజుండు సశాస్త్రుండు గాఁడు, ఎచ్చట దేశి కాగ్రణియగు గురుండు లేఁడు, ఎచ్చట బాలిశుండు వసించు, నెచ్చట లోహవిక్రయం బొనరింతు రెచ్చట నీలి విక్రయంబుసేయుదు, రెచ్చట నీలవస్త్ర నిషేవణంబు గావింతు, రెచ్చట మద్యపానంబు వాటింతు, రెచ్చట వృథామాంస భోజనులగుదు, రెచ్చట [182]స్వకళత్ర పరిత్యాగులు నిల్తు, రెచ్చట సకల సుర సంపూజ్యుండగు విష్ణుదేవుని విడిచి యన్య దేవతా [183]భజనంబు సేయుదు, రచ్చట నచ్చట వితర్కించి, వాఁడస్మ దీయుండు గాఁడని శిక్షింపుచున్న వాఁడని వసిష్ఠుండు మాంధాత కిట్లనియె. 332

సీ. ఇట్లు ధర్మాంగదుం డిల యేల నేనరుఁ
 డైన ధర్మము సేయు ననుఖిలేఁడు
సంతాన హీనుఁడై జనుఁడుద్భవించఁడు
 వైకుంఠ నగరాధి వాసిగాని
వాఁడు మృగ్యుండగు వసుధాజనంబులు
 తుష్టి పుష్టి దయైక దృష్టియుఁ దగి
వర్తింతు రతి తృప్తి వత్సలు చెలరేఁగ
 ఘట దొగ్ధులౌ నాల కదుపు వితుకుఁ

తే.గీ. బూర్ణమైయున్న ప్రతి భూజములకు సీమ
క్షౌద్ర పటలంబులం దనిశంబు ద్రోణ
మాత్ర మధు రసధారలు చిత్ర లీల
[184]గిలు కొనుఁ బందు దున్నక క్షేత్ర తలము. 333

సీ. [185]కృతయుగ ధర్మంబు క్రిందుఁ గావించు త్రే
 తా ద్వాపరయుగ మధ్య సమయమున
గగన మార్గము ఘనాఘన లీలఁ బొరయ సు
 ప్రభమించి చంద్ర బింబంబు మెఱయఁ

---

182. స్వకళత్ర పరిత్యాగంబులు నిల్తు
183. భజనంబు సేయుదురు యచ్చట నచ్చట 184. గిలుకొనఁ బండు
185. కృతయుగ ధర్మం బొకిందు గావింపు త్రేతద్వాపరయుగ మధ్య స్థలమున

గుంభ సంభవ కళాంకురము తక్కులు దేర
[186]నదులు మిన్నేఱులై పొదల నాశ్వి
నాంతంబు నందు దైత్యారి మేల్కొనఁగుసు
మాస్త్ర శరాయత్తుఁడై యరణ్యా

తే. గీ. సార కల్హార కమల కాసార సింధు
సంగమ మలయ మందర సహ్య వింధ్య
హేమనగ పారి యాత్ర మహేంద్ర ముఖ్య
గిరి వరంబులఁ గాంతతోఁ గ్రీడ సల్పె. 334

క. దినదిన మొక్కొక చింతను
దను లావణ్యంబు నెరపి తను నప్పుడు మో
హిని మోహము నందించఁగ
ఘనుఁ డాతఁడు మఱచె సకల కార్యాంతరముల్. 335

క. దురిత హరమైన యాశ్రీ
హరి వాసర మొకటి మఱవఁ డర్థము మఱచెన్
దరుణుల మఱచెఁ ధరణీ
భరణము మఱచెఁ జితారి భరణము మఱచెన్. 336

వ. ఇట్లు దశమి మొదలుకొని దినత్రయంబు గంధ తాంబూల పుష్పాది కంబును స్త్రీ భోగంబును విడిచి వర్జించె. పుణ్య ప్రదంబైన కార్తికంబు ప్రవేశించె. కార్తీక సమంబైన మాసంబును, కృత యుగ సమంబైన యుగంబును, వేదసమంబైన విద్యయును, గంగాసమంబైన తీర్థం బును, జల దాన సమంబైన దానంబును, ధర్మ సమంబైన విత్తం బును, సత్య సమంబైన యశంబును, నారోగ్య సమంబైన యుత్సా హంబును, [187]గేశవ సమంబైన (దైవంబును) గల్గకుండుటం జేసి కార్తికంబున విషయ ప్రవణుండేని వ్రతంబు సేయక యుల్లంఘించిన సర్వ ధర్మ బహిష్కృతుండై తిర్యగ్యోని జనించు నని వసిష్ఠుం డానతి యిచ్చిన మాంధాత యిట్లనియె. 337

186. నదులు మోయేరులై పొదల నాశ్వి సాంతంబునందు దైత్యారి మేల్కొనఁ
187. గేశవ సమంబైన గల్గకుండుటం జేసి

క. ఇటువంటి మానసమున నా
కుటిలాలకఁ గూడి రాజ కుంజరుఁడు మహో
ద్భట మోహపరుఁడు తద్ర్వత
మెటులం గావించెనందు నేమి యొనర్చెన్. 338

వ. అనిన వసిష్ఠుం డిట్లనియె నా కాలంబున రాజు పటహంబు మ్రోయ
మోహినిం జూచి నీతోఁగూడి పెక్కేండ్లు రమించితి. భవదవమాన
భయంబున నిన్ను వీడనైతి. ఒకటి సంప్రాప్త మయ్యెం జెప్పెద
వినుము. నీయందు మోహంబున ననేక కార్తికంబులు దాఁటె.
హరి వాసరంబు దక్కఁ గార్తికంబు వ్రతంబు సేయనైతి. ఇష్టా
పూర్తంబులు వ్యర్థంబులయ్యె. తన్మాస మాహాత్మ్యంబు వినుము. 339

## రాజు మోహినికి గార్తీక మాహాత్మ్యము వివరించుట

మ. మృగయాసక్తులు మాంసభోజనులు సన్మేధాస్థితిం గార్తికో
పగమాద్యంతములందు [188]మాంసభయ దంభంబుల్ విసర్జించి ప
న్నగ తల్పాలయ సీమ నుంద్రు నిరతౌన్నత్యంబుతో నందు నిం
పుగ భక్షానియమం బొనర్చు నరులన్ భూషింప శక్తుండనే? 340

క. ఇలలో ననేక దానం
బులు గల్గినఁ గల్గనిమ్ము భూరి ద్రవ్యం
బులు చిత్తాయాసకరం
బులు పోలునె దీప దానముల నిలలోనన్. 341

క. ధర భూతికాముఁడగు నా
పురుషుఁడు చేయఁదగు నందు భూరి యశశ్శ్రీ
కరమై ధర్మ గుణంబున
కిరవై యధికమగు దాన మెయ్యది యైనన్. 342

క. ఒకచోట సకల దానము
లొకచోటం దీపదాన ముత్కట పుణ్య
ప్రకటత సమములు సర్వా
ధికమౌ కార్తికమునందుఁ దెలివి నొనర్పన్. 343

188. మాంసచయ ధంభంబుల్

క. క్షితిఁ గార్తిక మాసం బ
చ్యుత నాభి సరోరుహంబు నూరిజనం బ
చ్యుత పూజసేయు నాతఁడు
శతజన్మాఘములఁ బాయు శౌరింజెందున్. 344

గీ. వసుధలో వ్రతోపవాస నియమములు
కార్తికంబునందుఁ గడపెనేని
వాఁడు దివ్యశక్తి వైమానికుండయి
తిరుగుచుండు విష్ణుదేశమునను. 345

వ. అది గావున నాపై మోహంబు వదలి హరిపూజా పరత్వంబున వర్తింపు నేను వ్రతపరుండ నయ్యెదననిన మోహిని యిట్లనియె. 346

ఉ. కార్తికమాస ముత్తమముగా నిటుపల్కితి విస్తరంబుతో
నార్తిహరంబుగాఁ దెలుపు మభ్రధునీకిటిధామ పుష్కరా
వర్తములందుఁజేసెద నవశ్యము దాని మహత్త్వముర్విపై
వార్తగఁ దద్వ్రతంబు మునివర్యులకెల్లఁ బ్రకాశమైతగన్. 347

వ. [189](అనిన మోహినికి రాజిట్లనియె.) కార్తికంబునఁ బ్రాజాపత్య చరుండై, ఏకాంతరోపవాసియై యేకరాత్రంబు నందైన షడ్రాత్ర ద్వాదశరాత్ర పక్షంబుల యందేని మాసనంబునందేని నుపవాసంబు గావించిన హరిలోక ప్రాప్తియగును. 348

ఆ.వె. ఏకభుక్త యాచితేతరేతర మహా
వ్రత మొనర్చిన నట్టివాఁడు గాంచు
నవని యెల్ల సంశయము లేదు కార్తిక
మాసరాజమునను మందయాన! 349

సీ. కార్తికంబున రమాకాంతుపూజ యొనర్చి
హరివాసర వ్రత మాచరించ
నరవరేణ్యుండు స్తనంధయుం డెన్నఁడుఁ
గాడు ప్రబోధ నీ కాలమునను

189. ("అనిన మోహినికి రాజిట్లనియె" - అనుసదిలేదు)

జాగరం బొనరించి సకల పురాణసం
　　శ్రవణంబు గావించి చక్రిఁ గొల్చి
యారాత్రి దాఁటించె నతిపాతకుండేని
　　హరిలోకమున కేఁగు నతిశయమున

తే.గీ. రమణి గర్భంబు చొరఁడు వరాహ మండ
లంబు తత్కాలమునఁ గుశలమతిఁ జూడ
సాంఖ్య యోగ ప్రభావ ప్రసక్తిఁ బాసి
యనఘ నిర్వాణ సంపద యాక్రమించు. 350

వ. కార్తికంబున సూకర మండలంబు చూచి త్రివిధ పాతకంబులఁ బాసి పునర్జన్మంబు నొందండు. కార్తికంబునఁ దైలక్షౌద్రంబులు వర్జింప వలయు. [190]కాంస్య పాత్రంబున భుజింపం దగదు. నిష్పావ భక్షణంబుచేసి సంవత్సర కృత పుణ్యంబులం బాసి [191]రాసభియోనిం బంచ దశ జన్మంబులు జన్మించు. కార్తిక [192]మాసంబున సూకర మాంసంబు భుజించిన దుర్మతి షష్టివర్ష సహస్రంబులు రౌరవంబునం బడు నా రౌరవంబులం బాసి గ్రామ సూకరంబై జనియించు. కార్తికంబున మత్స్య భక్షణంబు సేయు నతండు చండాలుండై జనియించు. కించిద్వ్రతాచరణంబు చేయువానికి నేనిం గార్తికంబున సకల పాపంబులు నడంగు. కార్తికంబున వ్రత దీక్షఁ గైకొనండేని సర్వ పుణ్యంబులు నిరర్థకంబులగు. పశు యోనియందు జనియించి మఱియుఁ గ్రిమికీటకాళియందు నుద్భవించు. కార్తికంబు వచ్చిన గృహంబున వర్తింపం దగదు. విశేషించి కార్తికి గృహంబునఁ జేయం జనదు. తీర్థాంతరంబునకుం జనవలయు. కార్తిక శుక్లపక్షైకాదశి నుపవసించి ద్వాదశి ప్రాతఃకాలంబున శుభకర్మంబు లాచరించినవానికి హరి మందిరసీమ లభించు. సంవత్సర వ్రత సమాప్తియుం జాతుర్మాస్యవ్రత సమాప్తియుం గార్తికంబునం జేయవలయు. కార్తికంబునఁ బది దినంబులు విష్ణునాభి సరోరుహం బని వెలయు; నా దినంబుల యందు నుత్తరాయణంబు గాక యున్న శుద్ధ లగ్నంబు లేకయున్న వివాహంబు లొనర్చినఁ బుత్ర పౌత్రాభివృద్ధి యగుం గానఁ గార్తిక వ్రతంబు సలుపవలయు ననిన మోహిని యిట్లనియె. 351

190. కాంస్య పాత్రంబున భంజింపందగదు
191. రాసభిర్యోనిం
192. మాంసంబున

శా. సత్యారామ [197]తటాధిరోపిత సుమాంచత్పారిజాత ద్రుమా!
యత్యైశ్వర్య విశేషపూరిత కుచేలాఖ్యాక! పాంచాలికా
సత్యార్తిక్షపణ ప్రసన్న విమల స్వాంతా! భజల్లోక సం
పత్యుల్లాస వికాసదాయి కరుణాంభఃపూర! భోజ్యాధిపా! 352

క. ఘంటా కర్ణ మనోరథ
ఘంటా పదశీల! బాణ కలుషాత్మక దో
ర్లుంటాక! వక్రిమాఖ్య [194]చి
రంటీ సౌశీల్య కల్య రక్షోరునిధీ! 353

మహాస్రగ్ధర.
[195]కకుబంతాఖ్యాక రుగ్మక్కకుదవర శుభాకార రేఖా విధానా
ధిక సౌరభ్య ప్రసాదా! స్థిర విభవఘనో దీర్ణతేజః ప్రభావా!
[196]ప్రకట స్వాంతస్థ లోకప్రచయ సకల సంపత్ప్రకాశాతి [197]హర్షో
త్సుక సచ్ఛీహృద్యశోదాస్తుత చరిత! సుధాంధోజనస్తోత్రపాత్రా! 354

## గద్యము

ఇది శ్రీమత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్యపుత్ర
కశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడు నృసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణంబునందుఁ జతుర్థాశ్వాసము
సంపూర్ణము

193. తటాదిరోపిత
194. చి। రంటాసౌశీల్యకల్య సౌభాగ్యనిధీ!
195. కకుబంతాఖ్యాక యుగ్మక్కకుభతర శుభాకార
196. ప్రకట స్వాంతశ్యలోక
197. హర్షో।త్సుక సన్మునిహృద్యశోదా

# నారదీయ పురాణము

## పంచమాశ్వాసము

క. శ్రీ మహితోపనిష ద్వి
ద్యామయ ః నిత్య ప్రకాశితైశ్వర్య శ్రీ
సామగ్రీ కార్మణ ః శ్రీ
వామాక్షీ హృదయ సదనః వనరుహ వదనా ః 1

వ. అవధరింపుము. వసిష్ఠుండు మాంధాతకు నెఱింగించిన క్రమంబున
సూతుండు శౌనకాదుల కిట్లనియె. 2

## చాతుర్మాస్య వ్రత మహత్త్వము

మ. తతి వర్ణించితి కార్తిక వ్రత మహత్త్వఖ్యాత ధర్మంబు ప్ర
స్తుతమై యుండఁగఁ దెల్పు మింక నృపచాతుర్మాస్య పుణ్యవ్రతం
బతిలోకం బనవద్య మప్రతిమ మిట్లాకాల మేదాన మీ
క్షితిలోఁ జేసినఁ బూర్ణమై వెలయు భక్తిన్ నా కెఱింగింపవే. 3

వ. అనిన. 4

సీ. వాసి నయాచిత వ్రతుఁడును నక్తభో
క్తయునైన వాఁడనురక్తి బ్రాహ్మ
ణులకు భోజన మిడి నూత్న బలీవర్ద
మొక్కటి పసిఁడితో నొసఁగవలయు
నట్లు బ్రాహ్మణ భోజనానంతరమున న
మాంస భోజనుఁడైన మానవుండు
ధేనువుదక్షిణ దీపించ నర్పించఁ
దగు నాకు లెల్లఁ జోద్యము వహింప

నుసిరికల క్రింద నిన్నియు నూర్జితముగ
నామలకములతోఁ [1]బెట్టి యర్ఘ్యముగను
నియమ మొనరించు [2]వారికి నియత ఫలప
రీత దానంబు తగ నాచరించు టొప్పు. 5

సీ. నెరయు తైలత్యాగ నియమంబునకు ఘృత
దానంబు తద్ఘృత త్యాగనియమ
మునకుఁ బయోదానమును దధిత్యాగ ని
యమమునకును హిరణ్య ప్రదాన
మట పయస్త్యాగ నియమమునకు రజత
దానంబు నా సర్వధాన్యభోజ
న త్యాగ నియమంబునకు శాలి దానంబు
భూతల్ప నియమంబునకు హంస
తూలికా కందు కాన్వితశాలి మృదుల
శయన దానంబు తక్రభక్షానియము
నకు ఘృతా పూర్ణవర భాజన ప్రదాన
మరసి కావింపవలయు నే పురుషుఁడైన. 6

గీ. మౌన నియమంబు మానిన మానవుండు
కనక ఘంటాద్వయము సముత్కంఠ తోడ
దాన మర్పించి మృదుశయ్య దంపతులకు
నొసఁగి భోజనమిడి గోవు నొసఁగవలయు. 7

శా. నిత్యస్నాయి హయంబు నీ శుభములౌ నిస్స్నేహ సంస్నాయి సం
స్తుత్యుండై ఘృతసక్తుదానమున నాద్యుల్మెచ్చఁ బుణ్యవ్రతా
న్నత్యుండౌ నఖకైశికోత్క్షణ సమానద్ధ వ్రతాచార మి
ట్లత్యంతంబు నొనర్చెనేని ముకురంబర్ఘ్యంబు దానంబిడన్ 8

క. పాదుకలు విడిచి విడి[3] విడి
పాదంబులఁ దిరుగునట్టి పరమవ్రత సం
పాదికి శుభమగు మృదుతర
పాదూదానంబు నియతి బ్రాహ్మణున కిడన్. 9

---

1. బెట్టఁరము ఫలనియమ వ్రాతప్రతి
2. వారిందన్నియుతఫల. వ్రాతప్రతి
3. వివి (?) వ్రాతప్రతి

వ. ఆపణ పరిత్యాగంబున ధేను దానంబును నామిషత్యాగంబునఁ గపిలా దానంబును దేవతాలయంబున నిత్యదీపం బర్పించిన సఘృతవాసోఽ న్వితతామ్రకాంచన దీపపాత్రంబులు విష్ణుభక్తునకు వ్రతపూర్తికి నర్పించిన నైశ్వర్యంబు ప్రాపించు. ఏకాంతోపవాసంబున వస్త్రకాంచన యుక్తంబులైన యెనిమిది హలంబులు శయ్యతోఁగూడ నొసంగందగు. త్రిరాత్రోపవాసంబు చేసిన ఛత్రోపానహాయుతమైన మణిక మర్పించి శిరాకర్షణక్షేమంబైన పచ్చని యనడ్వాహంబు నర్పింపవలయు: నేకాహ్నికోపవాసంబున నజాదానంబు సేయవలయు. ఫలాహారంబు చేసిన శాలిదానంబు గావింపవలయు శాకాహారంబు చేసిన ఘృతపూర్ణ రజత పాత్రంబు లర్పింపవలయు నివి యిన్నియు లభింపకున్న విప్ర వాక్యంబున వ్రతంబు పూర్ణంబు గావింపవలయు. విప్రవచనంబు గ్రహించి దక్షిణ యొసంగఁడేని నరకంబునంబడు. వ్రత వైకల్యంబునఁ గుష్ఠియు నంధుండు నగు. దివిజులు బ్రాహ్మణ వాక్యంబు నందే వర్తింపుదురు. తద్వాక్యంబు శ్రేయఃకాంక్షియగువాఁ డెవ్వఁ డతిక్రమించుఁ వేదాశ్రితమై పావ విమోచనంబై మాధవతుష్టి హేతువైన పరమరహస్యంబు విను మనిన మోహిని యిట్లనియె. 10

## మోహిని రుక్మాంగదుని వ్రతనిష్ఠ మాన్పించుట

మ. ఇతరం బెంచక కార్తికవ్రతము లోకేష్టంబు గావించి ప
ల్కితి రాజుల్ వ్రతదీక్ష గైకొనుట [4]లక్ష్మీహేతువేఁ యుద్ధరం
గతరంగ స్ఫురితాంతరంగ జయ విఖ్యాతిన్ మహీపాలన
వ్రతముం దానముఁ దక్కఁ జేయుదురె! పూర్వక్షోణిపాలాగ్రణీ! 11

క. చేయకు మీ వ్రత మవనీ
నాయక ! కందర్ప మోహన శితాస్త్రము నా
కాయము నాటినఁ దూలెన్
గాయము కానంగరాదె [5]గాయము లింకన్. 12

వ. అనిన. 13

క. ప్రతివచనము దోఁచక భూ
పతి యతి విస్మయముగాంచి ప్రఖ్యాత గుణ
స్థితి సంధ్యావళిఁ బిలువన్
వితత మహోపాయలైన వెలఁదులఁ బంచెన్. 14

4. "లక్ష్మీహేతువై" యని వ్రాతప్రతిలో దిద్దుబాటు కలదు.
5. కాయము లింకన్ అని వ్రాతప్రతి.

చ. పనిచిన వచ్చి రత్నగృహపాలిక బాలిక లూఁచ డోలికాం
చనమున మోహినీ [6]లకుచ చారుకుచ స్థలవర్తియై యశో
ధనుఁడగు ధర్మశోభను నుదారకళా పరిపూర్ణ చంద్రునిన్
గనుఁగొని వామభాగమున గ్రక్కున నిల్చె వరాంజలిక్రియన్. 15

వ. నిల్చి యిట్లనియె. 16

మ. ననుఁ బిల్పించితి వేమినాథ ! సకలానందంబులందావ కో
క్తినిదేశంబుల నున్నదానను సపత్నీ దుఃఖ లేశంబు లే
దనఘా ! మోహిని నాశరీరము తదీయంబైన భోగంబు మ
ద్ఘనభోగం బిఁక సంశయంబు గలదే కారుణ్య రత్నాకరా ! 17

తే.గీ. పతి సుఖం బాత్మ సుఖమని భక్తిఁబూని
తలఁచని యసాధ్వి శ్వేనియై ధరణిఁబుట్టు
నయిదు మూఁడునునైన జన్మాంతరములఁ
గాన [7]నానతి యొసఁగు మే కార్యమైన. 18

వ. అనినఁ గులశీల జన్మాద్యభిమానంబులు గల దానవని బహూకరించి కార్తిక మాసవ్రతంబు లెన్నేనియుం గడచె నీ మోహినితో రమింపఁగ మదాంధుఁడనై యుంటి. ఇంక నేనియు నీ వ్రతంబుఁ జేసెదనన్న మోహిని వారింపుచున్నది యనఁ దా నొనర్చెదనని యంగీకరించి వర కృచ్ఛ్ర సంజ్ఞంబైన వ్రతంబుఁ బూనె. రుక్మాంగదుండు నంత కుశ కేశిపుత్రిం జూచి యిట్లనియె. 19

తే.గీ. ఇంతి నీమాట చేసితి నింతనుండి
సకల భోగానుభవ మహైశ్వర్యధుర్య
పూర్ణ కామతనుండు మే పొలఁతిమీఁద
నైన నీ మీఁదఁగల ప్రేమ పూనఁ[8]గలనే ? 20

వ. అనిన మోహిని యిట్లనియె. 21

---

6. "వికుచశాలి కుశస్త వివర్తియై" అని వ్రాతప్రతి పాఠము.
7. "యానతి" అని వ్రాతప్రతిలో దిద్దుబాటు.
8. "గలదే" వ్రాతప్రతి.

చ. అతుల పరాక్రమోన్నతుఁడ వంచు గుణాఢ్యుఁడవంచు వైభవ
స్థితిగల వాఁడవంచు సురసిద్ధనభశ్చర సాధ్యనాగ య
క్షతురగవక్త్ర దానవ ముఖప్రకరంబుల నీసడించి వ
చ్చితి నినుఁగోరి మంథనగసీమకుఁ బ్రేమకు మేరయున్నదే ! 22

తే. గీ. మనసు మనసును గలిసి ప్రేమలత ననలు
గలుగ దంపతులకు నవి కామ ఫలము
లన్య చిత్తత్వమునసైన యట్టి కామ
మరయ శవసంగ మోపమ మనిరి బుధులు. 23

తే. గీ. రూప సౌందర్య శీలముల్ రూఢి కెక్క
నీవు పతివైన కతమున నెందు నాకు
దుర్లభమె మూఁడు జగములందుంగలిగిన
వైభవస్ఫూర్తి యైననో వసుమ తీశ ! 24

తే. గీ. కామినీ కుచ కుంభముల్కాముకులకు
రంబు నందొక మేరువై ప్రబలుఁ గాదె
యమృత మనఁగఁ బురంధ్రి వరాధ[9]రోష్ఠ
వరసుధారయ కాదె ! భూవర వరేణ్య ! 25

సీ. [10]కుచకుంభముల నానికొని [11]వీఁపు గీలింప
మత్త కుంభీశకుంభస్థలోరు
పటహరవాధి కోద్భట భటార్భటి దోఁచెఁ
"హరిదినంబెల్లి మీరతుల నిష్ఠ
నక్షారలవణమై యమరు హవిష్యాన్న
మొక్కప్రొద్దానరించి యువతిఁ బాసి
యవనితల్పమున మురారి పాదాబ్జముల్
దలఁపు చనన్య చింతత వహించి

9. ర్గాసు వ్రాతప్రతి.

10. 25. 26 పద్యములనడుమ "అని పలికి" అను విధముగా నొక చిన్న వచన ముండవలెను. లేనిచో నన్వయము కుదురదు.

11. "నీవు" అని వ్రాత ప్రతి. దానికి సమన్వయములేదు.

తే. గీ. ప్రాతి సాంవత్సరిక ముఖ్య పైతృకములు
తర్పణాదికములుఁ బిండ దానములు [12]గ
యా వ్రజనములు సేయక హరిదినమునఁ
దనయు లుపవాస ముండిన తఱిని జగతి. 26

వ. తత్పితృగణంబు మోక్షంబు నొందు'' ననుచుం[13] జాటి. 27

## ప్రబోధనీ మహిమ

క. ''అక్లేశకరము కార్తిక
శుక్లైకాదశి యముండు చూడ వెఱచు రో
షక్లిన్నాక్షుండై హరి
[14]విక్లబులను గావఁగాఁ దవిలి మేల్కానఁగన్. 28

తే.గీ. బ్రహ్మహత్యాది దుస్తర పాతకములు
కామ చారకృతంబులై కలిగిన యవి
యైన విలయంబు నొందు నన్యూనమహిమ
నిది ప్రబోధనియంద్రు యతీంద్రవరులు. 29

క. ఘనపాతకములు వాయఁగ
ననిశము ధర్మంబె నిల్పి హరికిఁ బ్రబోధం
బొనరింప నిది ప్రబోధని
యని పలికిరి సూరిజనము లాయా సభలన్. 30

క. ఒక నాఁడైనఁ బ్రబోధని
నకలంకత నుపవసించు నాతఁడు చన్బా
లకు లోను గాఁడు రవిబా
లకునకు మఱిలోను గాఁడు లలిత స్ఫూర్తిన్. 31

చ. మలయజ చంద్ర కుంకుమ సమగ్రముగాఁ గలపంబులందుఁ డు
జ్జ్వలత దుకూల చేలము విశాలముగా నవరింపుఁ డుత్తమా
ఖిలమణి భూషణాళి బెళఁకింపుఁడు ఫుల్ల సుగంధ పుష్పజా
తులఁ పలుపూజ సేయుఁడు యదు ప్రవరోత్తముఁ బార వీథులన్. 32

---

12. గయా వర్జనమనుట సంప్రదాయము. వ్రజనము=వెళ్లుట అనువిధముగా నెట్లో సమన్వయము కుదుర్చుకొనవలెను.

13. ''జాటి రతివ వినుము'' అని వ్రాతప్రతి

14. ''విఘంబులు గావఁగావ వివిమేల్కానఁగన్'' అని వ్రాతప్రతి

తే.గీ. ఇట్లు నడువక నాసీమ నెవ్వఁడుండు
వాఁడు వోదండ్య పథ్యనిర్వాన్యతాప్ర
ధాన వృత్తుల కర్హుఁ డుద్దండ శక్తి
నజ మహేశ్వర శక్రాదు లద్దమైన". 33

వ. అని చాటిన విని సకర్పూర తాంబూలంబు చేతిది పిడిచి, మోహినీ కుచకేళీ మహోదయంబైన హృదయంబుఁ దిగిచికొని, శయనంబు డిగ్గి; మధుర వచోఽమృతధారల మోహిని నోలార్చి "కార్తికవ్రతంబు నీ యాజ్ఞచే విడిచితి; ప్రబోధని విడువ శక్యంబు గాదు. నాతో నుపవ సింపు" మనిన మోహిని యిట్లనియె. 34

మ. ఇనవంశేంద్ర ! నిమేషమాత్రమయినన్ [15]నేనోర్వ నిన్బాసి, చే
సినమేరం గమలేశవాసర పరిస్ఫీతవ్రతాచార వ
ర్జనముద్వృత్తి నొనర్చి భోజనము పూర్ణప్రీతిఁ గావింపు కం
తు నితాంతాతతభీకర ప్రదరశక్తుల్ తాళ శక్యంబులే ? 35

వ. కావునఁ బూర్వంబు నాకొక వరం బొసంగితివి. తద్వరంబున కిది యవసరంబు. నీ వన్నృతంబు పలికెదవేని చతుర్దశేంద్ర పర్యంతంబు నరకంబు లనుభవించెద వనిన రాజిట్లనియె. 36

చ. కమలజపుత్రివై సకల కర్మములెల్ల నెఱింగి ధర్మ వి
ఘ్నమునకు నోడవైతి గుఱి గల్గిన సద్గుణరాశి నేను స
త్యముగ శిశుత్వవేళయుఁగదా భుజియింప; జరాప్త కేశశా
క్ల్యమున భుజింపనేర్తునె ? ప్రగల్భుఁడనై హరివాసరంబునన్. 37

ఆ.వె. మానవుండు ముదిమిఁబూని క్షీణేంద్రియ
బలత నుండి పాపభంజనమున
కభ్రతటిని మునుఁగ నర్హుండు గాకున్న
హరి దినోపవాసియైన మేలు. 38

ఉ. బాల్యమునందు నీవ్రతము భక్తి నొనర్చితిఁ గొంత కొంత సౌ
శీల్యము గల్గి యౌవనముఁ జెందియుఁ జేసితి దండహస్త హృ
చ్ఛల్యము గాఁగ వార్ధక విశేషమునన్ విడనేర్తునే మనో
లౌల్యమునన్ వచించితి భళా ! కలకంఠి ! భయంకరార్భటిన్. 39

15. ఇక్కడ యతి విచార్యము. దృతద్విత్వముగా నెంచినచో సరిపడును.

మ. వ్రతభంగం బొనరింపఁగాఁ దలఁప కో వామాక్షి ! నాపైఁ బ్రస
న్నత వాటింపుము రాజ్యసంపద లనూనస్ఫూర్తిఁ గైకొమ్ము త
న్మతి లేకున్నఁ దదన్యకార్య మెటులైనం జేసెదన్ నిన్ను మ
త్సుతులెల్లన్ శిబికల్వహింపఁ గొలుతున్ దత్పాదచారంబునన్. 40

మ. అది గాదేని సువస్త్ర విద్రుమ మయోద్యత్కాంచన స్తంభ రా
జ దుదాత్తామల కోరు మౌక్తిక ఫలాంచల్లోలదోలా స్థలిన్
మదిరాక్షీ ! నిను నూఁచెదన్ సొగసుగా మాణిక్య సౌధంబులో
మదిరా క్షీణము[16] సేయకింకఁ గరుణన్ మన్నించి నన్నేలవే ! 41

తే.గీ. మానవుండు (జగతిని) స్వమాంస పుత్ర
మాంసములు దిన్నఁదరియించు మత్తుఁడగుచు
హరి దినంబున భుజియించునట్టి పాప
మఖిల జన్మంబులఁ దరింపఁడనఘ చరిత ! 42

వ. కాంతా ! త్రైలోక్య హనన పాపంబును, గుహూదినంబున రతి యొనర్చు పాపంబును, భూమి యంగుళిమాత్రం బపహరించి మిథ్యా విక్రయం బొనర్చిన పాపంబును, నిక్షేపాహరణం బొనర్చిన పాపంబును, భూత తిథియందు క్షౌరంబు చేయించుకొనిన పాపంబును, హరి వాసరంబున భుజియించిన పాపంబును, షష్ఠిం దైలంబు పూసిన పాపంబును, దృతీయను లవణంబు చవిగొనిన పాపంబును, అష్టమిని మాంసం బనుభవించిన పాపంబును, విశ్వాసఘాత పాపంబును, మృత వత్సా ప్రదోహన పాపంబును, బున్నమను జూదంబాడిన పాపంబును, రవి సంక్రమణంబున సురాపానంబు చేసిన పాపంబును, గోప్రచార ప్రలోపంబు గావించిన పాపంబును, గూటసాక్షి[17] పలికిన పాపంబును, నగర క్షేత్ర గ్రామ ద్రవ్యాదులు బ్రాహ్మణున కిచ్చెదనని బొంకిన పాపంబును, నిర్ణీతంబులైనమీఁద నన్నృతాక్షరంబులు పల్కిన పాపంబును, గన్యానృత పాపంబును, నన్నృత పాపంబును, మాంసకూట మహాకూట పాపంబులును, కనకాభాసంబునందు [18]శుద్ధంబని యాడిన పాపంబును సమంబులు గాన హరి వాసరంబున నెట్లు భుజింతు ననిన మోహిని యిట్లనియె. 43

16. వ అని వ్రాతప్రతి.
17. సాక్ష్యమనుట లెస్స. "సాక్షి చెప్పువ్యవహారమున నున్నది.
18. సిద్ధంబని వ్రాతప్రతి.

తే.గీ. అవనిలో నెంచి చూడ నయాచితోప
వాస నక్తైక భుక్త ప్రవర్తనమున
దానమునఁ దద్వ్రత మొనర్చి ద్వాదశీ వ్ర
తంబు సాధింప వలయు నుత్తమ జనంబు. 44

మ. అరయన్ గర్భిణులున్ గృహస్థులును క్షీణాకారుఁడున్ బాలుఁ డా
తురులున్ వృద్ధులు, భారవాహులు, మహీంద్రుల్, యుద్ధసన్నద్ధులున్
బరమోత్కృష్ట పతివ్రతామణులు నాపన్నుల్ సమగ్రోప వా
సరతుల్గాఁ దగదంచు గౌతముఁడు వైశాఖాదిఁ బల్కెన్ ధృతిన్. 45

వ. ఎవ్వరికి నగ్ని పరిగ్రహంబు గలదు వారు గృహస్థులు. ప్రజాపాలన ప్రవణు లెవ్వరు వారు రాజులు. ఎనిమిదవ[19] మాసం బేర్పడిన యా యింతి గర్భిణియగు. అష్టవర్షాన్వితుం డెవ్వండు? వాఁడు బాలుండు. యజ్ఞ భాగోద్యతులై తిరుగ [20]నతిలంఘనంబు సేయువారు క్షీణులు. మనోవాక్కాయ కర్మంబులఁ బతిహితంబు సేయువారు పతివ్రత లింక నివియేల? ఏకాదశి నీతోఁగూడ భుజింపం బ్రీతి యయ్యెడు. లోక త్రయంబు నీ విచ్చిన నాకుఁ దృణంబు. శిరంబిచ్చిన నెంత? దక్షిణ కరంబిచ్చి పాలించకుండితివేని యీ దేహంబు విడిచెద. వర్ణాశ్రమ ములకు సత్యంబు వలయు. విశేషించి రాజులకు సత్యంబె శ్రేయో మూలంబు. 46

సీ. సత్యంబుచేతనె జలజాప్తుఁ డుదయించు
సత్యంబు చేతనె శశి వెలుంగు
సత్యంబుచేతనె జగతీతలము నిల్చు
సత్యంబుచేతనె జరుగు గాడ్పు
సత్యంబుచేతనే జ్వలనుండు దీపించు
సత్యంబుచేతనే జగములుండు
సత్యంబుచేతనే జలధివేల మెలంగు
సత్యంబుచేతనే సడలు వింధ్య

తే.గీ. మఖిల ఋతువులఁ బుష్పఫలాభివృద్ధి
సత్యముననె స్ఫురించు నీ సకల దిశలు
సత్యమున మించియున్నవి సత్యవాక్య
మశ్వమేధ సహస్ర పుణ్యమను నజుండు. 47

---

19. గర్భంబని వ్రాతప్రతి 20. యతి యని వ్రాతప్రతి

తే.గీ. సత్యహీన సురాపాయిజనుల లోన
నా సురాపాన రతులకు నమర వరులు
నిష్కృతి వచించి రనృతోక్తి నిరతుఁడైన
నీచునకు నిష్కృతి వచింప నేరరైరి. 48

వ. అనిన రుక్మాంగదుం డిట్లనియె: గౌతముండు గృహస్థునకు నేకాదశ్యుప వాసంబు వలదని పలికె నంటివి. అతండు క్షుద్రశాస్త్రీను సారంబునం బలికిన నేమి? పురాణంబులందు నిర్ణయంబు గలదు. శంఖంబుతో జలంబు ద్రావుట, కూర్మసూకర మాంసంబులు భక్షించుట పాపంబులని తెలియంబడియె నేకాదశి భోజనంబును నగమ్యాగమనంబును, నభక్ష్య భక్షణంబును నకార్య కరణంబును గో సహస్రవధ తుల్యంబని యెఱింగించె. ఏకాదశి నన్నంబె భుజింప? ఏకాదశిని బురోడాశంబును భుజియింపంగాదు. క్షీణులకు మూలఫల పయస్సోమ పానంబును, జ్వరితులకు లంఘనంబును, బాపులకు నుపవాసంబును బ్రశస్తంబను నొక కల్పంబు గలదు. మలప్రకోపంబున హరి వాసరంబు వచ్చిన భుజింపం దగదు; జ్వరమధ్యకృత పథ్యభోజనంబు సేయందగదు. చేసిన నరకంబు నొందుఁ గావున నాగ్రహంబు విడువు మిదిగాక మఱి యొకటి యెయ్యేదియేనియు రుచించినం జేసెద ననిన మోహిని యిట్లనియె. 49

క. అవనీశ! ప్రాణ మిచ్చినఁ
జవి యగునే? యేను నీవు సల్లాపములన్
నవశాల్యోదన ఫలరస
వివిధ రుచుల్ గొని భుజించి వెలయక యున్నన్. 50

తే.గీ. రాజశేఖర! హరివాసర వ్రతంబు
ఘనత వేదోపదిష్టంబు గాదు విప్రు
లగ్నిమంతులు వర్తింప రావ్రతమున
వేదబాహ్య మతంబేల విస్తరింప? 51

వ. అనినం గనలి రాజేంద్రుం డిట్లనియె. 52

సీ. బహువాద మూలమై భాషించు వేదంబు
యజ్ఞకర్మ క్రియాద్యంబు వేద
[21]మఖిల గృహస్థాశ్రమస్ఫూర్తి వేదంబు
స్మృతి మర్మవిద్యయా[22] హృద్యవేద
మమిత పురాణ రహస్య తంత్రము వేద
మాదిత్య పురుష జన్మములు జగము
లప్తైన వాఙ్మయం బంతయు నీ పురా
ణంబులయందె ధన్యత వహించె

తే.గీ. నట్లు గానఁ బురాణార్థ మధికతరము
తెలియ వేదార్థమునకంటె వెలయుననుచు
సుప్రతిష్ఠము చేసిరి సూరిగాఁబు
రాణములయందు వేదతంత్రంబు లెల్ల. 53

వ. "పరమార్థం బెఱుంగలేక యల్పశ్రుతులైనవారు మదర్థం బితిహాస పురాణ స్మృతి నిర్ణీతం బైనదానిం జెఱుతు" [23]రని వేదంబులు పలుకు. వేదంబునందు గ్రహ సంచారంబును లగ్నశుద్ధియుఁ దిథి వృద్ధిక్షయం బులుఁ గాన్పింపవు; యాజ్యాయాజ్యులు నేర్పదరు; బ్రహ్మ హత్యాదు లకుఁ బ్రాయశ్చితాదులు నిర్ణయింపబడవు. అంగంబుల నెయ్యది దీపించు నుపాంగంబుల నెయ్యది గాన్పించు స్మృతి పురాణంబుల నెయ్యది ప్రకాశించు నదియ వేదంబులు నుచ్చరించుం గావున :

"నభోక్తవ్యం నభోక్తవ్యం సంప్రాప్తే హరి వాసరే
పురాణ మన్యథాకృత్వా తిర్యగ్యోని మధాఽప్నుయాత్"

అని మొఱ్ఱ వెట్టుచున్నవి. పితృ మాతృ నింద సేయు కంటెను, గంగా స్నానంబు సేయకయుండు నంతకంటెను, హరి వాసరంబున భుజియించు నంతకంటెను, దేవబ్రాహ్మణుల దూషణంబు సేయునంత కంటెను, బ్రహ్మహత్య గావించు నంతకంటెను, పరదారాభిగమనంబు గావించు నంతకంటెను మహాపాపంబుఁ గావింప నెవ్వరితరంబు? అని యెఱింగి హరి వాసరంబున భుజియింపనేర్తునే? అనిన 54

21. ఈ పాదమునం దఖండయతి కలదు,
22. "విద్య" అని వ్రాతప్రతి. అప్పుడు యతి భంగము.
23. "ని" వ్రాతప్రతి.

## మోహిని బ్రాహ్మణుల రావించుట

మ. అతిరోషంబున ఘూర్ణికం బిలిచి నెయ్యంబొప్ప మన్నించి యా
శ్రితవిప్రావళిఁ గూర్చి యాసన సుఖాసీనాత్ములంజేసి సు
వ్రతలీలాధికులైన యా ఘనులకున్ వశ్యక్రియన్ మ్రొక్కి స
మ్మతితో వృద్ధుని గౌతముం గనిన ధర్మజ్ఞుం డతం డిట్లనున్. 55

క. ''పిలిచితి వేటికి నిపుడో
యలికుంతల! నీదు సంశయము దీర్పఁగ స
త్కుల శీలవ్రతులగు వి
ప్రులు వచ్చిరి వీరె పూర్వ పుణ్యము కతనన్'' 56

వ. అనిన మోహిని యిట్లనియె : హరి వాసరంబున భుజింప నొల్ల నని యెడి నీరాజు స్థావర జంగమాత్మకంబైన యీ జగంబునకు నన్నంబె జీవనంబు. పితృగణంబేనియు నన్నంబున హర్షించు. కర్కం ధూమాత్ర పురోడాశంబుననే దేవతలు ప్రమోదింతు రన్నమే యమృతం బని యాకాంక్షింతురు. పిపీలికా గణంబులు తండులకణంబులు గొని దుఃఖంబున బిలంబుచొచ్చు నన్నం బెవ్వరికిఁ బ్రియంబుగాదు? రాజా! నీ ధర్మంబు వదలి యతి ధర్మంబు గైకొన్నవాఁ డవ్రతయైన విశ్వ స్తయు నవ్రతుండైన యతియు నంధతమసంబునం జతుర్దశేంద్ర పర్యంతంబు వర్తింపుదురు. రాజులకు రాజ్య పరిపాలనంబు దక్క నితర ధర్మంబర్హంబె? స్త్రీలకు భర్తృశుశ్రూషయుఁ బుత్రులకుఁ బితృ సేవనంబును శూద్రులకు ద్విజ పూజనంబును రాజులకు లోకరక్షణం బును ధర్మంబులు. ఇట్టి ధర్మంబులు ప్రమోదాజ్ఞానంబున వదలినఁ బతితుండగు. అవ్యాపారయగు యువతియు, నవినీతుండగు సుతుం డును, భృత్య మంత్రి వివర్జితుండై యేకాంతశీలుండగు రాజును నప్ర తిష్ఠతో నరకంబు గాంతురు. అన్నంబునఁ బ్రాణంబును, బ్రాణంబునఁ జేష్టయుఁ, జేష్టచే రిపునాశనంబు సేయ శక్తుండునగు. ఇట్టి యన్నంబు విడిచిన క్షీణదేహుండై యే కార్యంబొనర్ప నేర్చు ననిన : 57

క. తద్వాక్యము విని యపు డా
విద్వాంసులు తథ్యమనుచు వివరించి మహీ
భృద్వేదండము శాస్త్రో
ద్యద్వచనాంకురము చూపి యనిరి ప్రియమునన్. 58

చ. శపథముఁ జేసినాఁడవు, ప్రశస్తిని శ్రీహరి వాసరవ్రత
ప్రపదన వృత్తిమై నుభయ పక్షములన్ నిజబుద్ధి చేతనే
నృపవర ! శాస్త్ర దృష్టిని వినిర్ణయమై తగియుండు నాగృహ
స్థపతులు సాగ్నులై యుభయసమ్మత పక్షములన్ భుజింపరే ? 59

వ. అదిగాన వర్ణత్రయంబును హోమోచ్ఛిష్ట భోక్తలు గావలయు. విశే
షించియు నిరంత[24]రోద్యతాయుధులైన రాజులకు నుపవాసంబు
యుక్తంబుగాదు. శాస్త్రంబేని యశాస్త్రంబేని నీవు చేసిన శపథం బస్మ
దనుగ్రహంబునఁ బూర్ణంబయ్యెడు. వ్రతభంగ దోషంబు నీకు లేదు.
విప్రసమన్వితుండవై భుజింపు. విప్రవాక్యంబు మహత్తరంబు. తద్వా
క్యోల్లంఘనంబు చేసినఁ బదియేను జన్మంబులు రాసభయోనిన్
జన్మించునన రాజు వారలం జూచి యిట్లనియె. 60

సీ. సర్వభూతములకు సన్మార్గ వర్తులై
యకట ! విమార్గస్థు లగుట దగునె ?
యతులకు విధవల కర్హంబు హరి వాస
రోపవాసంబన నుచిత మగునె ?
యదియ మిథ్యా వాక్య; మఖిల భూతములకు
హరి వాసర వ్రతం బాచరింప
నియతంబు; రాజులు నిక్కం బుపవసిం
పఁగఁ దగుఁ; బౌరాణ భవ్యగాథ

తే.గీ. సంశయంబెల్లఁ దీర్చెడు: శంఖమునను
జలముఁ గ్రోలుట, కిటికూర్మ పలలభక్ష
ణంబు సేయుట హరి వాసరంబునందు
నుభయ పక్షమ్ముల భుజింప నొప్పదనుచు. 61

క. వలదు సురాపానము వి
ప్రులఁ జంపఁగవలదు ద్యూతముల వర్తింపన్
వలదు హరి వాసరంబున
వలదు భుజింపంగఁ బాపవర్తను లయినన్. 62

24. "రోద్యాయుధు" అని వ్రాతప్రతి

వ. యతికి విధవకు నేకాదశినాఁటి యన్నంబు నింద్యంబనుట యతికిఁ బరదారాభిగమనంబు గర్హితంబనిన వర్ణాశ్రమాదుల కగర్హిత మనుటేః ఇది యుచితంబుగాదు. 63

క. దోషాకర సంక్షయమున
యోషామణిఁ గూడి భోగమొందిన శ్రీమ
చ్ఛేషశయనదిన సకృదను
పోషితమున సకలనరకములు ప్రాపించున్. 64

క. [25]అకటఁ జతుష్పదజంతువు
నకునైనను నరుఁడు భోజనము వెట్టఁగ రా
దకలంక బుద్ధియగు నరు
నకు యుక్తంబగునె? హరి దినమున భుజింపన్. 65

వ. ఉత్తరాశాస్థితులై విష్ణుభక్తి పరాయణులైన విప్రులచేతఁ జేయంబడని దురాచారం బెట్లొనర్చెద? మీ వచనంబు సేయనొల్ల. మిమ్ము నిందు లకుఁ బిల్వఁ బంపితినేః క్షీణదేహుండఁగాను. ధర్మాంగదుండు రాజ్య భారంబు వహింప నన్నెవ్వం డెదిరింప శక్తుం డిట్లెటింగి మీరీ రీతిం బల్కఁదగునే? ఒల్లనివానికిం బ్రాయశ్చిత్తం బెవ్వ రొనర్తురు తత్పా పంబు వారలకే యగును. 66

మ. సురదైతేయ ఫణీంద్ర సాధ్యముని రక్షో యక్ష గంధర్వ కి
న్నర విద్యాధర ఖేచరార్కరజనీ నాథాదులున్ విష్ణుశం
కర పద్మోద్భవ శక్రులుంగదిసి సాక్షాత్కారమై నిల్చి ధీ
పరతన్ శాస్త్రముఁ దెల్పిరేనియు భుజింపన్నేర్తునే? యుత్తటిన్. 67

క. ధర దిరిగిన నాహిమవ
ద్గిరి దిరిగిన జలధులింకి కెడసిన వైశ్వా
నరుఁడుష్ణత విడిచిన నీ
హరి వాసరసువ్రతము ప్రియంబె విడువన్. 68

చ. త్రిభువన సీమయందు వినుతింపఁ బ్రసిద్ధికి నెక్కి ధారుణీ
విభునభమించి మత్పటహ విస్ఫుట ఘోషము రత్నఖేటక
ప్రభుపుర రాష్ట్ర ముఖ్యముల బ్రాహ్మణముఖ్యులు విష్ణు వాసరా
భిభవము చేసినం గుశలఁబెట్టు నృపాలకుఁడంచు మ్రోసెడిన్. 69

---

25. "ఆకట" వ్రాతప్రతి

వ. ఈ రీతి ఘోషార్భటి మ్రోయఁ బాపం బొనర్చితినేని నీలవస్త్రాచ్ఛాది తంబై తత్పటహంబు మలినంబగు. తా నార్జించిన యశంబు తానే యడంచిన క్రిమికీటకజుష్టంబై విష్ఠాశయంబైన సూకరయోనిం బది రెండు యుగంబులు జన్మించు. హరి వాసరంబున భుజించినవాఁడు దురాత్ముండు, పాప మతి, కుకర్ముండు. వాఁడు జనింపనేల? మీది దివ్యశాస్త్రముగాదు. హరివాసరంబున భుజింపు మనువారు సత్పురుషులు గారు; భుజింపుమనినవి స్మృతులు గావు; వేదములు గావు. నాఁడు పైతృకం బాచరించినఁ బితృశేషంబు భుజించినఁ బితృతృప్తిలేదు. వైవ స్వతుండు సలేఖుండై దూతబలోపపన్నుండై హర్షంబు నొందు ననిన.

## మోహిని రుక్మాంగదుని నిందించుచు వెడలుట

సీ. ఆ మాట లాలించి యారక్తనయనయై
ధర్మ బాహ్యుఁడవైతి ధరణినాథ!
పాంశువు తద్ధర్మబాహ్యుండు సరియని
తలఁచిననేమి తత్పాంశుచయము
ఘనగర్త ఖననంబు గావింప బుద్ధిత
ద్గర్తపూర్తికి నధికతరమదియె
నీదు ధర్మంబు గాన్పించె నీకుపధాన
మేఁజేయ నాభుజ మింక నధిప!

తే.గీ. సత్యముడిగి దురాచారసరణిఁ దిరుగ
మ్లేచ్ఛుఁడవుగావు; నీతియే మ్లేచ్ఛ బుద్ధి
నడువ? నిక్ష్వాకు వంశైకనాథ! నేను
నిన్ను విడిచితిఁ బోయెదఁ గన్నయెడకు. 71

వ. ఇట్లు పలుకుచు వేగంబునలేచి యాక్రోశంబు సేయుచు గౌతమాది భూ సురులుం దానును మదిరాపానంబు మేలు రాజు సంగంబున కంటె; మల సంకరణంబు మేలు భూపతి సమాగమంబునకంటె; నీలాంబర స్పర్శనంబు మేలు మూఢుని కూటమికంటె; నుదక్యా సంస్పృష్టి మేలు దురాచారుని కేళికంటె ననుచు బాహ్యసీమకుం జనియె నప్పుడు ధర్మాంగదుండు చనుదెంచి యిట్లనియె. 72

## ధర్మాంగదుఁడు మోహిని ననునయించుట

క. రాజేమిచేసె నీకం
భోజానన ! రాజు నింద నొందించెద ప
య్యో ! జనని ! తగునె నీకీ
యోజన నిఖిలావనీ సురోత్తమ సభలన్. 73

వ. అనిన మోహిని యిట్లనియె. 74

మ. అరుణాశోక సమాకృతిన్మెఱసి చక్రాబ్జధ్వజచ్ఛత్ర చా
మర మీనాంకుశ ముఖ్యరేఖలను రమ్యంబై సువర్ణాంగద
స్ఫురితంబై తగునట్టి దక్షిణ కరాంభోజంబు పైఁజూచియీ
ధరణీ నాథుఁడు సత్యశీలుఁడనఁగాఁ దప్పెంగుమారోత్తమా ! 75

క. అదిగాన సకలభోగా
స్పదమగు మజ్జనకు రాజ్యపదమున కేనేఁ
గెదఁ ద్రిదశేంద్రాదుల నా
మది మెచ్చక వలచి వచ్చి మఱి యిట్లయితిన్. 76

వ. అన ధర్మాంగదుండిట్లనియె. 77

క. దేవీ ! నీయానతి నేఁ
గావించెద నెద్దియైనఁ గటకట ! శోకం
బీవింత చెందనేటికి ?
వేవేగ నృపాలుకడకు విచ్చేయు మిఁకన్. 78

(వ. [26]అనిన మోహిని యాతని కిట్లనియె.) 79

సీ. తనయ ! మీ తండ్రి మందరగిరి క్షోణి ధూ
ర్జటి సన్నిధాన దేశంబునందు
భార్యగా ననుఁజెంది బహుభాషియై పల్కి
బొంకెఁ గాంచన వస్త్రభూషణాంబ
రగ్రామఖేటఖర్వట గజహయ ముఖా
ఖిల వస్తువులు వేఁడఁదలచఁ దనకు
హానియౌననుచు మోహముగల్గి దేహ మే
రీతిని బలశక్తి హెచ్చియుండు

26. ఈ వచనము వ్రాతప్రతియందులేదు. గ్రంథపాతపు గుర్తులును లేవు. అయినను సందర్భము జూచిన నిది యవసరమని స్పష్టపడ గలదు.

తే.గీ. ననుచు నాత్మోపకారకంబైన కోర్కె
యొకటి తానిచ్చు వరమున కొనరఁ గోరి
బ్రాహ్మణోత్తములును నేనుఁ బ్రార్థనంబు
సేయ ననృతంబు పలికె దుశ్శీలుఁ డగుచు. 80

తే. గీ. హా ! సురాపానతుల్య కృత్యంబుగాదె
యనృత మాడుట ధర్మబాహ్యప్రవర్త
నుండు భాషింపనైన నర్హుండు గాఁడు
దోష మిఁకనైన నీతని తోడఁ గూడ. 81

వ. అనిన ధర్మాంగదుం డిట్లనియె. 82

చ. అనృతము పల్కనేరఁడు కృతార్థుఁడు మజ్జనకుండు తొల్లి, నేఁ
దనయుఁడ[27] నేడు గల్గి ననృతంబులు వల్కనె ? నీవు తాల్మి భూ
వనితవు రమ్ము రమ్మిపు డవద్యము లెంచక తల్లి ! నీకు నీ
మనసునఁ గల్గు కోర్కె లనుమానము లే దొసరింతు నెంతయున్. 83

మ. ధరణీచక్రము సర్వలోకనుత శశ్వత్కీర్తియైనట్టి మ
ద్గురు సత్యంబున నిల్చియున్నయది, దుర్దోర్దండ దండ ప్రచం
డరయోద్దండవిచండదండధరపీడల్ మాన్పె, సప్తాంతరీ
పరమారాజ్యవిభాసి ధర్మగుణ సంపన్నుండయో ! బొంకునే ? 84

వ. అన మోహిని మరలఁ జనుదెంచె నంత. 85

మ. మణివైడూర్య సమన్వితం బగుచు సమ్యగ్దివ్యరత్నావళీ
ఘృణిదీపాంకుర తేజ[28]మా పురము లాకీర్ణాంతరంబై సుల
క్షణదీర్ఘత్వ విశాలతా కలితమై కాన్పించు శయ్యన్ సమీ
క్షణముల్ మూయుచు విప్పుచున్ గలఁగి రాజన్యుండు చింతింపఁగన్.

క. చని కనుఁగొని యీ మోహిని
యనరానివి నిన్ను నాడ నర్హంబగునే
తనయుఁడ నేఁగల్గఁగ నీ
వనృతోక్తులు పల్కితివని యాడించుకొనన్. 87

27. నేను అని వ్రాతప్రతి.

28. ''మైపురము లాకీర్ణాంత'' అని వ్రాత ప్రతి

శా. కోశాగారము రాజధాని సకలక్షోణీతల ద్వీప మా
ద్యాశాచక్రసదేశదేశగజవాహానీక ముంబ్రాఁతియే ?
యీశాతోదరి కిచ్చి నిల్పు మిఁక ధాత్రీశా ! భవత్సత్యభా
షాశీలంబు ధనుర్ధరుండనయి నే సాధింతు నేవస్తువుల్. 88

సీ. శక్రపదంబిమ్ము జగదీశ ! యాశక్రుఁ
డోడినాఁడని చూడు ముగ్రశక్తి
శక్రపదాకాంక్ష సల్పదేని కృశాను
యమయాతుధాన జలాధినాథ
పవమానయక్షేశ పదములు నర్పింపు
మదినొల్లదేని బ్రహ్మపదమైన
సనకాది ఘనయోగి జనరంజమున నిరం
జనమునై యున్న నశక్యతపముఁ

తే.గీ. జేసి పద్మజు మెప్పించి సిరులతోడ
మెఱయఁ జేకొని తెత్తు నమేయ మహిమ
నదియు నర్పింతు నీవు జిహ్వాగ్రవీథి
నాడి సత్యంబు వదలుట యర్హమగునె ? 89

క. అనఘాత్మ ! సత్యవర్తన
జనని మనోరథము దీర్ప స్వరమహీభో
గినిలయములఁగలవస్తువు
లనిశంబు జయించి తెత్తు నర్పింతు ధృతిన్. 90

తే.గీ. పార్థివేశ్వర ! నీ ప్రతాపంబువలన
నవనిలోపల నా కసాధ్యంబు గలదె ?
దాసుఁడఁ దనూజుఁడ హితుండఁ దల్లి [29]నన్ను
నెయ్యది యొనర్పు మనిన నేనిపు డొనర్తు. 91

క. మజ్జననీ మజ్జీవిత
మజ్జాయా జనమునైన మహిరంజిలి వి
ద్వజ్జనము మెచ్చ నిచ్చెద
నిజ్జనములనంగ నాకు నెంత నరేంద్రా ! 92

వ. కావున నింద్రవైభవంబును, దినేంద్ర తేజంబును, గలవాఁడవు. నీకు
నీ యపయశంబు వహియింపం దగునే ? యని పుత్రుండు పలికిన
రుక్మాంగదుం డిట్లనియె. 93

---

29. "నాకు" వ్రాతప్రతి

## రుక్మాంగదుఁడు తన నిశ్చయము నెఱింగించుట

తే.గీ. అనృత మైయుండనీ వాక్య, మపయశంబు
పొందనీ; ఘోరనిరయంబుఁ జెందనీ; ము
కుందవాసరభుక్తి నేఁ గోరనొల్ల
నందనందన సత్కృపానంద మహిమ. 94

తే.గీ. అధికదుర్మేధ యిది మూర్ఖయగ్గలముగఁ
బరుషభాషలు పల్కినఁ బల్కనిమ్ము
కోరదెయ్యేదియును మహా ఘోరధర్మ
దూరనారక వీథుల త్రోవఁగాని. 95

క. క్రిమినైయనృతవచః పా
పమునన్ జనియింతు మీఁదఁ బంకజనాభో
త్తమ దినమునఁ గల్మషభో
జ్యము సేయఁగనొల్ల సకలజనులు హసింపన్. 96

సీ. ఎడసి పోనిమ్ము మోహినియు నేతద్వీర
హానలంబున మామకాంగమెటుల
నుండిన నుండనీ చండాంశు నందనో
ద్దండదండాహతి ధరణిజనులు
నరకబాధల నొంద నమ్మించినేనెట్లు
పేక్షింతు నిఖిల సురేంద్రమౌళి
తటతలంబులు ద్రొక్క ధన్యత హరి వాస
రోపోషితజనంబు [30]నొంచి విష్ణు

తే. గీ. లోకమంతయు నిందించి లోలబుద్ధి
నన్య ధర్మంబు నేనెట్టు లాచరింతు
భార్యకై కాముకుండనఁ బ్రథవహించి
యితర మొల్లదు దుర్మేధ యీ లతాంగి. 97

క. గరళము మ్రింగుదు వైశ్వా
నరు శిఖలంబడుదుఁ బడుదు[31]నని శిఖరముపై
శిర మసిఁదూలింతును శ్రీ
హరి వాసరమున భుజింప నాత్మజ! యింకన్. 98

---

30. యతిభంగము. నుంచి? 31. ఈ పాదమునం దఖండ యతికలదు

క. భూమిన్ రుక్మాంగదుఁడను
నామము నేకాదశీ దినవ్రత పుణ్య
శ్రీమహిమయుఁ గీర్తింపఁగ
సామాన్యుండనఁగ బ్రదుక శక్యంబగునే? 99

వ. అనృతంబు పలికిన నాకీర్తి యెటులైనం గానిమ్ము మోహిని నిమిత్తంబు మరలదు: హరి వాసరంబు వదలననిన తండ్రి వాక్యంబులు విని సంధ్యావళి రావించి మోహినికి మనోభంగంబు గాకుండ, రాజు హరి వాసర వ్రతభంగంబు గాకుండ నన్యోన్యానురాగంబు నొందింపు మని విన్నవించిన సంధ్యావళి మోహినిం జూచి ప్రియవచనంబుల నిట్లనియె. 100

## సంధ్యావళి మోహిని ననునయించుట

తే.గీ. అధిపు ధర్మంబుఁ దొలఁగింప నాగ్రహంబు
సేయకుము నీ మనంబులోఁ దోయజాస్య!
యమ్మహారాజు హరి వాసరాంతరముల
నన్న మనుపేరు వీనులనైన వినఁడు. 101

తే.గీ. భర్త సువ్రత మొనరింప భార్య యాత్మ
నానుకూల్యంబు వాటించి యాచరించి
యందుఁబోఁ బుణ్యలోకంబు లమితకీర్తి
వెలయు సావిత్రివోలెఁ బవిత్రయగుచు. 102

వ. మందరాచలంబున శుభకరంబగు కరంబిచ్చి కామాంధుండై మఱచి యున్ననేమి? అది నేఁ గావించెద. ఈ రాజు శైశవంబున నుండి హరి దినంబున భుజియింపఁడు. మఱియొక్కటి వేఁడుము. నన్ను, ధర్మాంగదు, రాజ్యంబును, జీవితంబునేని యిప్పింతు. వరిష్ఠనైన నేను గనిష్ఠనైన నేమి? అధికనిష్ఠం బాదంబు లొత్తెద, మ్రొక్కెదం బ్రసన్నవు కమ్ము. 103

చ. పతి ననురక్తిమై శపథపాశముల న్మెడఁగట్టి యీడ్చి యు
న్నతిమతియై యకార్యకరణంబులకుం బురికొల్పు నట్టి యా
సతి నరకంబులంబడి యసారగతిన్ బదిరెండు జన్మముల్
క్షితిపయి వల్గులీతనువుఁజెందు నిజంబు నిజంబు మానినీ! 104

ఆ.వె. ఇటుల నెఱిఁగి నీకు హితవృత్తి వాటించి
యీయకార్యకరణ మేలయనుచు
మాన్పఁదలఁచి నీకు మఱియును మఱియును
దెలుప వలసె నాకు జలజనయన! 105

ఆ.వె. ధర్మబుద్ధి చెప్పఁ దగు విరోధికి నైనఁ
జెలిమిగలుగు నెడలఁజెప్పఁ దగదె?
యదియుఁగాక పతికి నత్యంతహితవృత్తి
గలిగి యునికి మానఁ గలనె చెలిమి. 106

వ. అని సంధ్యావళి పలికిన విని నగి నీవచనంబులు ధర్మ నిబద్ధంబులగుట సేయందగు. వివాదంబు చేత ద్వంద్వ దృష్టియగునని నారదాదులచేతఁ బలుకంబడియె. హరి వాసరంబున నీ రాజు భుజింపండేని మరణాధికం బైనయొకటి సేయవలయునది నాకును దుఃఖకరంబగు నైనను నేను దైవ వశంబునఁ బలుకుచున్నదాన నాత్మహనన విషభక్షణ గిరిశృంగ పతన వ్యాళవదన చుంబన వ్యాఘ్రసింహాభిగమనంబు లెవ్వరికి నిష్టంబులు? దురుక్తా నృతవాక్య పరదారాభిమర్శనా భక్ష్య భక్షణా భోజ్య భోజన మృగయాపాన ద్యూతక్రీడన తృణకాష్ఠచ్ఛేదన లోక దండన సూక్ష్మజీవహింస నక్రీడనంబు లెవ్వరికి నర్హంబులు? ఇట్టివి యేను నతండు [32]సేయమే? యశోదాహకంబై ఘోరంబైన నరక కర్మంబు సేయండే?[33] ఏను నిర్దయనై పలుకుచున్నదాన. తండ్రి యెటువంటి భావంబుఁ దలంచుఁ దద్భావంబుననే యపత్యంబు జనియించు. రుక్మాంగద భ్రంశనార్థంబు జలజసంభవుండు నన్ను దుర్భావన సృజించెం గావున నాకు దుష్టత్వంబు గాక శిష్టత్వంబు గలదే? నీకును రాజునకు ధర్మాంగదునకుం గీర్తి యగునట్లుగా నొకటి యెఱిగించెద ననిన సంధ్యావళి యిట్లనియె. 107

ఆ.వె. ఆత్మహాని పుత్రహాని సామ్రాజ్యైక
హాని యైన నెంత నధిప వాక్య
సత్యకరణ శీలశాలి నిన్నైన నా
కకట! వెతలు గలవె యాత్మలోన? 108

---

32. సేయండే? వ్రాతప్రతి
33. ఈ రెండు వాక్యముల కన్వయము కుదురుటలేదు

తే.గీ. భర్త దుఃఖోపలబ్ధిమై( బరితపింప(
జేయు నింతి యథోగతిఁ జెంది జన్మ
సప్తతిం బూయు[33] నిరయాప్తి సడలి మూఁడు
సమలు విముఖిక్రిమి కుయోనిజని వహించు. 109

క. ధనమేని ప్రాణమేని వి
భున కడిగినయపుడె యీక పూనికతో నుం
డిన సతి విష్ఠాక్రిమియై
ఘనదైన్యముతోడ నింతి కాష్ఠిలయు నగున్. 110

## కాష్ఠ కీట వృత్తాంతము

వ. ఏను బాల్యంబున సఖీజనంబుతోడన్ మత్పితృ మహానసశాలం గోష్ఠ [35]పాలన పరుండగు పాచకుండు కాష్ఠ దళనం బొనర్పఁదత్కాష్ఠ మధ్యంబున నుండి నవనీత శుభాకారయు, నంజననిభాననయుఁ గనిష్ఠికా ప్రమాణయుఁ ద్వ్యఙ్మాంస సమావృతయునైన యొక కాష్ఠిల మెదలిన దాని భక్షింప నొక వాయసంబు చంచుపుటంబునం బొడుచు నంత నే నొక కాష్ఠంబున నదలించిన వాయసంబు విడిచి చనియె. అప్పుడా కాష్ఠిల మనుష్య భాషల నిట్లయె. 111

## సుప్రియయను స్త్రీ చరిత్రము

సీ. వినుము సంధ్యావళి మును దురితం బొన
ర్చినదానఁ గౌండిన్యుఁ డనఁగ నొక్క-
బ్రాహ్మణోత్తముఁడు శోభన ధర్మశీలుండు
గలఁడు కన్యాకుబ్జ కలిత యశుఁడు
తత్త్వజ్ఞుఁడైన యాతని భార్య నేను సు
ప్రియ యను దాననో భీరుమధ్య !
తల్లిదండ్రులును బాంధవ సమూహంబున
న్నల్లారు ముద్దుగా నాచరించి

34. "య" వ్రాతప్రతి
35. పాటక వ్రాతప్రతి

తే.గీ. సత్య కులశీల వేదశాస్త్ర ప్రసంగ
వరవధూ సంగ భంగనిర్భర తరాంత
రంగుఁడగు తద్వ్రరున కిచ్చి[36] రతులనియతి
నమ వివాహంబటంచు భూజనులు పొగడ. 112

క. మామామ యిచ్చె వర ము
క్తామణి హేమాయుతములు తతవైభవ ల
క్ష్మీ మహనీయోత్సవమున
నా మేరనెయిచ్చెఁ దండ్రి యతిమోహమునన్. 113

వ. ఇట్లు పితృశ్వశురదత్త విత్త శ్రీ ప్రమత్తనై యుండ నంతఁ గొంత కాలంబునకు నా యత్తమామలు నాకలోకంబునకు నేగి రంతం ప్రబుద్ధుండై మద్భర్త మాసద్వయంబు గడచిన రాజమందిరంబునకు నేఁగి మరలివచ్చుచు రూపలావణ్య విలాస విభ్రమంబులుగల వేశ్యలం జూచి వారలలోన సౌందర్యనిధి యగు నొక్క_ర్తు నింటికిం దెచ్చు కొని దానితో రమింపుచు విత్తంబుఁ గోలుపోయె. వర్షత్రయంబునకు జూదంబాడి నిస్స్వుండై మద్భూషణంబులు వేఁడిన నొసంగక పితృ గృహంబునకు నేఁగితి నంత గృహంబు విక్రయించె నంత నల్ప మూల్యంబునకుఁ జేను దొడ్డి తోఁట మంద మొదలు సర్వంబును నమ్మి కొనియె నంత నోడ యెక్కి_ సముద్ర తరణంబు చేసి దూరంబునకు నేఁగ వాయువశంబున నాయోడ యా మార్గంబునఁబడి యేడు యోజ నంబులు మించి చనియె నందునున్న నావికులు క్షుత్పిపాసార్దితులై పరాసులైరి. విత్తంబంతయు విడిచి దైవయోగంబున నడవిచేరి నిషాదులుం దాను నోడవిడిచి బహుశృంగ విభూషితంబై బహువృక్ష సమాకీర్ణంబై బహుపుణ్య ఫలాన్వితంబై యంబరచుంబి శిఖరంబగు నొక్క_ నగంబుఁజేరి భక్షణంబు వెదకుచు. 114

తే.గీ. అచట నొక ద్రాక్షచూచి జరామరణ[37] వి
నాశనములగు ఫలములు నవ్యమధుర
రసము లొలుకంగ భక్షించె రమ్యరుచులు
దనర నిరువది యాటింటిదనుక నతఁడు. 115

---

36. అఖండ యతి
37. "కనాశనముఃకుఫల" వ్రాతప్రతి.

తే.గీ. అంత నాతఁడు మృదుశీతలాంబుధార
నల్ల నల్లనఁ గోరి ఛాయావిశాల
సాల సాలంబుమించి పంచాశదుచ్ఛ
పురుష మానోన్నతి వహించి పొదలియున్న. 116

తే.గీ. అన్నగచ్ఛాయ నుత్తరీయంబు పఱచి
దాని మీఁదట శీతవాతంబు విసర
నిద్రవోవంగఁ దపనుఁ డస్త్రాద్రిఁ జేరె
నంధతమసంబు నిండె దిశాంతరముల. 117

## రత్నావళి వృత్తాంతము

వ. అప్పు డొక్క రాక్షసుండు కాశీపతి పుత్త్రి రత్నావళి యనునది ధౌత పాదయై పరీతశిరస్కయై నిద్రింపుచు వలయంబులు రెంటను బది రత్నంబులును, నీవియందుఁ బదియేడు రత్నంబులును, సీమంతంబున నేడు రత్నంబులును, గేయూరంబునం బదుమూఁడు రత్నంబులును బూని మెఱుపువలె నొఱుపు చూపం బతికామయై తగినపతి లేక పరి తపించుచు నున్నదాని దశాననుండు సీతంబోలె హరించి మొఱలిడ నంకంబున నిడికొని మత్పతియున్న సాలంబుచెంత సర్వైశ్వర్య సమన్వితంబై మయనిర్మిత రత్నమయ చిత్రమందిరంబై కనకశయ నాసన శోభితంబై పద్మరాగపాత్రంబై బహువృక్ష సమాకీర్ణంబై బహు భక్ష భోజ్యాభిరామంబై పరిఫుల్ల హల్లకోత్పల విభూషితహంస కారండ చక్రవాకోపశోభితతీర సారవన విరాజిత పుణ్యనదీ శోభితంబైన యొక గుహ సొచ్చి కుసుమశయ్యపై రాజకన్య నునిచె నంత నా రాక్షసుని భార్యచూచి భర్తం గనుంగొని దీని నేమి కారణంబునం దెచ్చితి వేనుండ ? నవత్నీ దుఃఖంబు సహింప నేర్చునే ? యని యాగ్రహించు గృహిణిం జూచి ప్రియభాషల లాలించి యిది భక్షణార్థంబుగా సంపా దింపఁ బడియె. ద్విజుం డొకండు దైవ వశంబున నాహారంబుగాఁ జేరిన వాఁడు. వానిం దెమ్ము భక్షించెదననఁ దద్వాక్యంబులు విని చెఱగొని తెచ్చిన యా రాజకుమారి యేకతంబున నిట్లనియె. 118

శా. మిథ్యావాక్యము పల్కె నీ విభుఁడు దుర్మేధావధానంబుతోఁ
దథ్యంబయ్యెనె నీకు ? నీదుమదిమిం దర్కించి చంచద్గుహా
వీథ్యంతస్థలి నుండ రోసి విడిచెన్ వేషంబు దూషింపుచున్
దథ్యంబింతయు రాక్షసోద్వహన కృత్యంబో సరోజాననా ! 119

వ. అనిన విని. 120

శా. క్రోధారక్త కటాక్షయై కలఁగి రక్షోభామ యీభామరే
ఖాధారాళ విలాస విభ్రమ శుభాకారంబు వీక్షించి ధై
ర్యాధిక్యంబు వహించి రక్కసి బలౌదార్యక్రియా శక్తి దు
స్సాధుం డీతఁడు పాదముంచు నిఁక నస్మన్మస్త కాగ్రంబునన్. 121

వ. అని వితర్కించి యీ జగన్మోహిని భార్య యయ్యెనేని నాకు నిలువ నవకాశంబు గలదే? సాపత్న్య దుఃఖంబు సర్వదుఃఖంబులకు దుఃఖతరంబు. భార్యాద్వయంబు గలవానికి సమతాబుద్ధిలేదు. పతికి నిష్టయైనయది సుఖంబుండు. పతికి నిష్టంబుగాని యది తిరస్కారంబు నొందుం గావున వైరనిర్యాతనంబు సేయవలయునని భర్తతో నిట్లనియె. 122

శా. రక్షోనాయక ! యీ సరోజవదనన్ రాజాత్మజన్ బాపురే।
భక్షార్థంబుగఁ దెచ్చితేని విటవిప్రాంతస్థ నిద్రాణ నూ
త్న క్షోణీసురవల్లభున్ మెసఁగు మానందంబునన్ నీకు ని
త్య క్షేమంకర శక్తియుక్తుల మితోదారంబులై వర్ధిలున్. 123

వ. అన ధవుండు పొమ్ము పొమ్ము సృక్వభాగంబు లూరుచున్న యవి యన గుహ వెడలి పదియాఱేండ్ల జవ్వనియై నిలిచి మద్భర్తం జూచి రాకాసి యిట్లనియె. 124

తే.గీ. ఏల వచ్చితి విటకు మహీసురేంద్ర !
కార్య మిచ్చట నెయ్యది గలదునీకు
నేను రాక్షసిఁ బతిరాక్ష సేంద్రుఁ డొక్క
రాజసుతఁ దెచ్చుకొని దాని రహినిఁ జొక్కె. 125

తే.గీ. నన్ను దిగనాడినాఁడు మనంబునందు
నిన్నుఁ బతిఁగాఁ దలఁచి యే నిశ్చయించి
యున్నదాన ననుగ్రహోద్యుక్తి నన్ను
నేలు దయఁజూచి నేఁడు మహీసురేంద్ర ! 126

వ. అనిన విప్రుండు ప్రియభాషల నిట్లనియె: 127

క. మనుజులు రాక్షసులకు భో
జనములు తద్గోష్ఠి యెట్లు శక్యము రక్షో
మనుజ విరోధము పూర్వం
బున నుండి జనించినయది భువనములోనన్. 128

వ. అన మదిరాక్షి మధురోక్తుల నిట్లనియె : భవిష్యద్భారత పురాణంబున హిడింబియను రాక్షసి భీమసేనుండను పాండవునకు భార్య గాఁగలదు. అతనికంటె బలాధికుండైన ఘటోత్కచుండను తనయుండు జనియింపఁ గలండు. వాని నే శస్త్రంబుల వధింపఁ దరంబుగాదు. ఇంద్రశక్తిచేత సాధ్యుండు గాఁగలఁడు. ఆశక్తి పూర్వంబున వైరోచనిజిఘాంసచే నింద్రుండు మధ్యమలోకంబునకుఁ జని శౌర్యంబున నా శక్తిఁ దెచ్చి సాలాగ్రంబున నుంచిన వాఁడదె యమర్త్యుని పైనేనిఁ బ్రయోగించిన మృతుండు గావలయు నది మత్పతి సాలాగ్రంబున నిడినవాఁడు అది నేఁదెచ్చెద నది రాక్షసుపైఁ బ్రయోగించితివేని యతం డీల్గిన మన మన్యోన్య ప్రేమాతిశయంబు లనుభవింపఁగలము. కాదేని వాఁడు నిన్ను భక్షించు. నన్ను సపత్నీ దుఃఖంబునం బొరలించుం గావున నీ యత్నంబుం దలంపు. నే ననృతంబు పలికితినేని జన్మార్జిత పుణ్యంబులు దొలంగు, బ్రహ్మహత్యాపరుల పాపంబు నొందుదు, మద్యపానం బొనర్చిన దురాత్ములైన బ్రాహ్మణుల దురితంబు నొందుదు, స్వర్ణ రత్నమే దిన్యపహారంబులు చేసిన వారి దుష్కృతంబుఁ గాంతు. ఆత్మహననంబు చేసిన వారి దుర్గతింబొందుదు, పంచమియందు గర్గరీ రవం బొనర్చిన స్త్రీల కిల్బిషంబుఁ జెందుదు. నవమిందరుచ్ఛేదంబు చేసిన వారి దుష్కర్మంబునకు లోనైయుండుదు. పర్వంబుల స్త్రీ సంగమంబు చేసినవారి వృజినంబులకు లోనగుదు. ఎవ్వఁ డుచ్ఛిష్ట సమయంబున ఘృతంబు వోయించుకొని భుజించు నెవ్వఁడు ఘృతంబు వ్రేలంబట్టి యాస్వాదించు నెవ్వఁడు దివారతం బొనర్చు వారి కల్మ షంబులకు నాలయంబై వర్తింపుదు. గృహస్థుండై వైశ్వదేవంబు సేయక భుజియించి భిక్షుకులకు భిక్షయొడంబడి పరిహరించిన వారి యఘంబునకు నాటపట్టై కనుపట్టుదు. సంక్రమణంబునఁదైల స్నానంబు గోవులచేతఁదీర్ఘ వ్రజనంబును, బరోదపానంబునందుఁ బంచ మృత్తికా పిండోద్ధరణంబు సేయక స్నానంబు చేసినవాని యంహువారంబులకుఁ జేరిక యగుదు. కుశకాశతృణంబులు దక్క శుష్కకాష్ఠంబుల దంత ధావనంబు చేసిన పంకం బనుభవింపుదు. నిజగృహంబున మొదవుం గట్టి తృణజలంబులం బోషించనివాని యేనంబులంజేకొందు. దేవార్చన యందుఁ బైతృకంబునం గాష్ఠాసనంబుననుండి యెవ్వఁ డాచరించు వాని

దుష్క్రియలకు మూలంబగుదు. ఏ బ్రాహ్మణుండు గోరహితంబుగా మహిషీగణంబు నేలుకొనువాఁడెన్ని జాములంబడు నవినే నొందుదు. చిరిఁగిన, యధౌతంబైన దగ్ధంబైన పరులు గట్టినదియైన పటంబుఁ గట్టుగొని దేవార్చనంబు సేయువాఁడేగతింబొందు నాగతిం బొందుదు. వధూవిలోకన పరదార విలోకనంబుల నెయ్యది ప్రాపించునది నాకు లభించు. సత్కథాప్రసంగంబు సేయునెడ విఘ్నం బాచరించువాఁడే లోకంబునొందు నా లోకంబు నందుదు. పారక్యమందు నజాత కుసుమంబునఁ జేయువాఁ డెచ్చటనుండు నచ్చటనుండుదు. కంచుకో పేతయగు విధవయుఁ గంచుక రహితయగు భర్తృమతియు నేజగంబుల నుండుదు రాజగంబుల నుండుదు. హీనజాతి యతండు బ్రాహ్మణ వేషంబుఁ దాల్చిన, బ్రాహ్మణుండు బ్రాహ్మణ చిహ్నంబు లేకయుండిన నే దుర్గతులం బొందుదు రా దుర్గతులం బొందుదునని పాపరాక్షసి బోధించిన నంగీకరించి ద్రవ్య లోభ రతి లోభంబులు పెనఁగొని తచ్ఛక్తి వేగంబె తెమ్మని నియోగించిన రాక్షసి చని తెచ్చెనంత. 129

క. ఘనుఁ డా రాక్షసవీరుఁడు
తనుఁ జెఱగొని తెచ్చి మదనతంత్ర క్రీడన్
బెనఁగొన వచ్చిన నా నృప
తనయ ప్రియంబొప్పఁ బలికె దనుజునితోడన్. 130

క. పరిణయము లేని కన్యను
గరిమన్ రతినల్పఁ బాత కంబని శాస్త్రాం
తరములఁ బల్కిరి ధరణీ
సురవర్యులు వినవె ధర్మసూక్ష్మ క్రమముల్. 131

సీ. అదిగాన మద్భాగ్య మట్లయినఁ గానిమ్ము
నీకు దోసములేదు నిశిచరేంద్ర !
కాముకుండవు గాన భూమీశ సంగుప్త
సౌధస్థలముఁ జొచ్చి శంకలేక
తెచ్చితి నన్ను నుద్వృత్తిమై మొదలనె
ధవుఁడు భార్యయును విద్యయు గృహంబు
విత్తంబు కష్టంబు వృద్ధి క్షయంబులుఁ
బ్రాపించు దైవకృతంబువలన

తే.గీ. నారదుఁడు తత్త్వవిద్యా విశారదుండు
నానతి యొసంగె నట్లనె యఖిలజనులు
దైవవశమున నుండఁగఁ దగు నుపాయ
ములు వృథాయగు వంధ్యారతులను బోలె 132

ఆ.వె. నీవు దక్క నాకు నిక్కంబు పతిలేఁడు
సాలసాల మూల సంప్రవేశి
యైన విప్రు నీకులాంగన చంపక
యుండెనేని తెమ్మ ఖండమహిమ. 133

తే.గీ. పావకుండును జలమును బ్రాహ్మణుండు
భర్త లరయంగ జగతిలోఁ బరిణయమున
కట్లు గాన కుశజలానలాదికంబు
లొనరకుండిన బ్రాహ్మణుం డొకఁడు చాలు. 134

మ. దనుజాధీశవతంస ! నేఁడు సుముహూర్తంబైన హోమాంతరం
బున విప్రున్ భజియుంపు మీ వనిన నా పూవిల్తుఁడెయన్ రయం
బున నేఁగెన్ ఫలియించుఁబో మనసులోఁ బూర్ణంబులౌ కోర్కులా
ఘనవిప్రున్ మడియించునో యిపుడు మత్కంజాక్షి గర్వోద్ధతిన్. 135

మ. అని చింతించుచు నేఁగుచో నదరె నవ్యంబైన నేత్రంబు న
య్యన నాత్మక్షుత ముద్భవించె, నిజదేహాకీర్ణమౌ నంబరం
బును నేలంబడియెన్ నగాగ్రమున నిప్పల్గ్రక్కె ఘూకంబు ప్ర
త్యనిలంబుల్ పలుమారు వీచె నశుభంబై తోఁచెఁ గ్రవ్యాశికిన్. 136

సీ. అవి యన్నియును నాదురాత్మకుం డాత్మలో
గణనసేయక వచ్చి కామనీయ
కస్ఫూర్తి మానుషకాంతయై భర్తృభా
ర్యాభావములను బ్రాహ్మణుఁడుఁ దాను
జోకయై మద్భర్త క్షుద్రుండు సంతత
పాపశీలుండు సపత్నిఁగాఁగ
నొక బాలరాజ కన్యక నెత్తుకొని వచ్చి
యున్నవాఁ డతని నే నొల్ల ననుచు

తే.గీ. నాఁడి కొన విని క్రోధతామ్రాక్షుఁ డగుచు
వివృత వదనంబుతోడఁ దద్వీరుఁ డుగ్ర
వాక్ప్రకారంబు బెళఁ కనవార్యశక్తిఁ
గవసి చనుదేర వెఱచి తత్కంజవదన. 137

వ. శక్తి వైవుమనుచుఁ దచ్ఛక్తిఁ దెలుప నది ప్రయోగించిన వక్షస్థ్సలంబు నాటి రాక్షసుం డీల్గెనంతఁ దచ్ఛక్తి నాకంబునకు నేఁగె. నిశాచరకాంత యేకాంత నిశాంతంబునకుం దిగిచి దివ్యమానసభోగంబు లనుభవింపు మని పయోధరంబు లాస్వాదింపుచుఁ గౌగిటం జేర్చుకొని వెనుచని వచ్చు కాంతునకుం గైదండయిడి కుచంబుల నొత్తుచు గుహలోనికింజని రాజకన్యకామణిం జూపి యిది పంచగవ్యూతి సంజ్ఞచేఁ గాశియను పురంబు గలదు. హరిహర భాస్కరులకు నాలయంబైనదది. అందు నీల్గినవారికిఁ బునరావృత్తి లభింపదు. ఆ పట్టణంబేలు రాజపుత్రి యిది. దీనిం గాముకుఁడై మత్పతి నిద్రించునెడఁ గొని తెచ్చె. దీనిఁ దండ్రి కడకుఁ జేర్చి సంరక్షించు. ఇవియే వరరత్న శయనాసనంబులేను నీ యధీన. నేను నిన్నుంగోరి వీనిం జంపించితి. వీనిం గౌమారంబునఁ బతింగా వరించియు నీ శుభాకారంబునకు మోహించి యిట్లు కావించితి నన్నుం గటాక్షించు మనినఁ దద్రాక్షసితో నిట్లనియె. 138

సీ. స్త్రీల నమ్మఁగరాదు చెలువ ! సవర్ణుఁడౌ
ప్రాణ నాయకుని సాపత్న్యశంక
సమయించితివి నన్ను సమయించు టేమి చో
ద్యంబు లావణ్య గుణాభిరాముఁ
డధికుండు నాకంటె నభిమాని యరుదేర
నీకేటి మోహంబు నీరజాక్షి !
యత్యంత భయము బాహ్యాభ్యంతరంబుల
నావహింపు చున్నయది నిజంబు

తే.గీ. చంద్రబింబాస్య ! నీకు నిష్టమగునట్లు
సేయుమిఁక నెల్లి నేఁడింకఁ జిత్తగించి
త్రుంచి భుజియించు నీవు నక్తంచరాంగ
నామణివి నీకు నిది కుల న్యాయపథము. 139

వ. అనిన 140

మ. నను నెల్లప్పుడు నేచు రాక్షసుఁ డనూనక్రోధధూమ్రాక్షుఁడై
మును, దీనిం జెఱదెచ్చె నగ్గలికమై మోహించి సాపత్న్యదుః
ఖనిరోధం బొనరించె వీఁడు మిగులం గష్టాత్ముఁ డేమందు నీ
దనుజస్త్రీ పతిఘాతశీల (?) యని యాత్మన్ నమ్మఁగా నేర్తువే? 141

వ. అయిన నేమి? నమ్మినవానిం దెగటార్చిన బ్రహ్మహత్యా పాపంబులని యెఱుంగనే? 142

ఆ.వె. నమ్మునమ్ము నన్ను నమ్మినవాఁ డని
నిన్ను నిర్వహింతు నిజమనోధి
రాజయైన యంత[38] రాత్మయుఁ బంచభూ
తములసాక్షి నీవె ధవుఁడవెంచ. 143

వ. అనినఁ దద్వాక్యంబులు సత్యంబులుగాఁ దలంచె నంత రాక్షసి నిజమందిరంబునంగల సకలధనంబులు సంగ్రహించుకొని కరేణురూపంబున బ్రాహ్మణునిం బైనిడుకొని రాజపుత్రియైన రత్నావళి నదృశ్య కరణ శక్తిం దోడుకొని తృతీయ ముహూర్తంబున శంకరాలయంబున కరుదెంచి కాశీపురంబు చూపి యిది పాపతరు కుఠారంబు. ఇది సంసార గేహ పావకంబిది షడూర్మి కూర్మ సువర్ణద్యూతం బిది కర్మ బీజోష రంబిది సద్గతిమూలం బిది పురాణంబుల వైష్ణవ స్థానంబని వర్ణింపుదురు. శంకరుం డెన్ని దివ్యతీర్థ స్థలంబులు దిరిగిన బ్రహ్మహత్య దొలంగదయ్యె నిది విడిచిన నేమి యగునో? యని ప్రార్థించిన నారాయణుం డిచ్చె నిది శివునకు. నాఁడు మొదలుకొని శివక్షేత్రం బయ్యె నిది భోగాభిలాషుల కేని మోక్షదాయకం బిందునున్న వారికిఁ గాల భైరవుం డనేక విఘ్నంబులు గల్పించు నిందు సిద్ధింబొందిన చంచలాత్ములకేని ముక్తి కరతలామలకంబగు. ఈ రత్నావళి తండ్రి ప్రతాపశాలి యీ పట్టణం బేలు నతనికి నీ కన్యక నర్పించుము. ఈ క్షేత్రంబు భుక్తి ముక్తి ప్రదాయకంబు అని విన్నవించిన విని బ్రాహ్మణుండు రత్నావళితో దిగు నంత. 144

క. పీనోత్తుంగ పయోధధర
మై నారీ లీలఁదాల్చి యా రాక్షసి సు
శ్రీ నరుగుదేర విప్రుం
డా నృప కన్యాపురమున కప్పుడు చనియెన్. 145

38 అఖండయతి.

మ. చనుచో నంత నిశీథమయ్యెఁ బురరక్షా శీలకుల్ ధావనం
బున సన్యోన్యభయంకరార్భటి సమాపూర్ణోగ్రకోలాహలం
బునఁ బెల్లార్చుచు రాజవీధికల చప్పుళ్ళాలకింపఁగఁ గ
న్గొని యా రాజకుమారి పల్కెనపు డా క్షోణీశభృత్యాళితోన్. 146

వ. మీరు వేగంబునంజని మజ్జనకుండగు రాజుతో నంతఃపురంబున నుండి మున్ను నన్నొక దురాత్ముండు రాక్షసుండు గొని చనిన నా రాక్షసుని చేత నదూషితనై బ్రదికి వచ్చితి. నాకై విచారంబు నందవలవదు. బ్రాహ్మణుం డొకండు మహానుభావుండు తోడ్తెచ్చె నతని నెదుర్కొని యర్ఘ్య పాద్యపురస్సరంబుగాఁ బూజింపుము. దైవ వశంబున శత్రుం డణఁగం డొక్కఁ డేఁడయ్యె. పితృవనంబున గతజీవుల యన్నంబు భుజించు వాయసంబునకు హవిర్భోజనంబు లభించునే? శునకంబున కుచ్ఛిష్టంబుగాక రాజార్హంబైన పంచగవ్య ప్రాశనంబు సిద్ధించునే? ఏను దద్రాక్షసునకు భార్యనై బ్రదుకనేర్తునే తల్లిదండ్రులైన మీ భాగ్యవిశే షంబున విష్ణుపాదసంప్రాప్త గంగోదకధారవలెఁ బవిత్రనై వచ్చితినని విన్నవించుఁడని పలికిన సుబాహుండను పుర రక్షాపాలుండు రాజ గృహంబున కరిగి యన్నియు విన్నవించిన నద్భుతంబగు తద్వృత్తాంత మంతయు విని రాజు మహామాత్య కళత్ర పురోహిత సమేతుండై పుర ద్వారంబున వెడలి గంగాతీరంబున నమ్లాన కుసుమాభిరామయు నను పమ మణిభూషణోద్దామయు నగు కూఁతుం గాంచి దూరంబుననుండి మొఱలిడుచు వచ్చి యక్కునం జేర్చె నంత నంతరంగంబు నిండ నా కాంత తండ్రికిం బ్రణమిల్లి ఏను ధౌతచరణనై కాళ్ళకడ శిరంబు చేర్చు కొని నిద్రింప రాక్షసుండు గొని చనియె. నన్ను వరింపదలఁచిన రాక్ష సుని నే తన్మానుషాకృతినున్న తద్భార్య సాపత్న్య దుఃఖంబున వానిపై నలిగి యతండు శౌర్యంబునం దెచ్చిన యింద్రశక్తి దైవ వశంబునం జేరిన యీ బ్రాహ్మణుని చేతికిచ్చి మడియించె. మమ్ముఁగ రేణు రూపం బునఁ దనపై నెక్కించుకొని యిచ్చటికిందెచ్చె. దీనిం బూజింపవలయు. ఈ బ్రాహ్మణోత్తముండు సద్గుణపూర్ణుండు. ఈతండె నాకుం బతి. పురాణంబుల నొకనికిం గూర్చినయది యొకనికి లభించదని పలుకుదు రితనిపై నాదు మనంబు దగిలినయది. సతీ ధర్మంబు నిట్లనెయగు. శాస్త్రాగమ నిదర్శనంబున నితనింగని యే నన్యునొల్ల. ఈ రాక్షసి

మ[త్ప్రాణంబులు నర్పించినయది. ఏతత్సమ్మతంబుగా రూపకులశీల సంప న్నుండగు నీ బ్రాహ్మణునికి నిమ్మన నట్లనె నంగీకరించి దానిం బ్రార్థించి. 147

## కాశీరాజు పుత్రికను గౌండిన్యున కిచ్చి వివాహ మొనరించుట

మ. ఇది నీ దాసి యనుగ్రహింపు కృపచే నింతీ! మనోజాత మ
ర్మదబాణంబులఁ దూలి యోర్చితివి తద్రక్షోవిభున్ నింద కా
స్పదమైయుండిన నుండనిమ్ము విలసత్సౌభాగ్య భాగ్యైక సం
పద నీ విప్రుఁడు భర్తయైన జనిసాఫల్యంబు నీ కబ్బదే? 148

సీ. మత్సుతకును నాకు మద్బాంధవులకు మ
దిష్టదైవములకు నీశ్వరివి స
పత్నీత్వ దోషసంపత్తి నుండకు మీద్వి
జాగ్రణికిచ్చితి నాత్మజాత
నిదినీకునిల్లడ యెలమితో మన్నించి
దాసిఁగా నేలుమో తల్లి! నీవు
దేహంబుఁ బ్రాణంబుఁ దీఱినయవి నేఁడు
తిరుగనిచ్చితివి సందేహమేల?

తే. గీ. యనుచు లాలించి పలికిన నాత్మ నుబ్బి
యిద్దఱము నీకుఁ దనయల మింతయేల?
నగరమునఁ బూజ నొందితి జగమెఱుంగ
నిఖిలభాగ్యంబు లభియించె నృపవరేణ్య! 149

వ. అష్టమినుండి చతుర్దశిదనుక నేడుదినంబు లుత్సవంబులు సేయవలయు నృత్తగీత వాద్య నటకీర్తన సమేతంబుగా బలిపూజాదు లర్పింపవలయు నగరంబు శృగారింపవలయు నిందున నీకుఁ గల్యాణ పరంపరావాప్తి యగునన నట్ల కావించి బ్రాహ్మణునకుఁ బరిణయం బొనరించె నంత దాసదాసీ గో మహిష హయ కుంజర యాన దివ్యవస్త్రాభరణ కనక రత్నాదులతో భటజనంబు గొలువ రాజు రత్నావళి ననిచె. రాక్షసి కరిణియై కంధరంబున నిడికొని నిజపురంబునకుం దోడ్కొని తెచ్చె. తద్గృహంబు కుబేరగృహంబునుంబోలెఁ గలితవస్తు సకల సంగ్రహంబై యుండ సపత్నీ ద్వయంబుం జూచి యేను దుఃఖింపుచు నుండ బంధు సఖీజనంబులు చేరి మర్మభేదకంబులగు పరుసని మాటల నిట్లనిరి. 150

సీ. పతి నీకు వలసెనే భామిని ధనలోభ
పరత వంచించితి భర్త నిన్ను
దీనత వేఁడనిందించి త్యజించి మీ
పుట్టిన యింటికిఁ బోయి[39] నావ
నీవు చేసిన నిత్య నీచ కృత్యంబులు
దలఁపవే చంచలత్వమున నబల!
శాశ్వతమే తండ్రి సంపద! మఱి భర్తృ
సంపద సతికి శాశ్వతము గాక

తే.గీ. యధిపుకడ కెట్టులేఁగెద వబల! లజ్జ
లేక భాషింప నోరాడు నీకు నెట్టు
లంగ సంగంబు సుఖమె? దురాత్మ! నీవు
నాట నాడిన మాట నానాఁట నరయ. 151

వ. అతండు నిన్ను గృహంబుఁ జేర నిచ్చునే? లోకవాదభయంబునఁ జొరనిచ్చిన శయ్యకుఁ జేర నిచ్చునే? శయ్యకుం జేరనిచ్చినఁ బశు సంయోగంబునుంబోలె బలాత్కార రతంబగునని యాడిన నధోముఖినై యశ్రువులు దొరుఁగ నీమణివలయంబేల యీనైతి? నీ నూపురంబేల యీనైతి? నీకటి సూత్రంబేల యీనైతి నయ్యో! యొక గవ్వయైన నిచ్చిన మన్నించుఁగా! లోభంబుకంటె దుర్గుణంబు గలదే? యని [40]తలంకుచు నతని మొగం బెట్టుకాంతు నేమని భాషింతు? తలకుం బాసిన వెండ్రుకం జేసి విడిచితి నింక నెడసిన చిత్తం బెట్లు హత్తునని విచారించుచున్న సమయంబున. 152

సీ. బంధువర్గంబు వెంబడిరా ననేకులు
వేత్రహస్తులు వృద్ధ విప్రజనులు
చామరవ్యజనవీ జనపరుల్ నలువంక
నవడిఁగొల్వఁగ సితచ్ఛత్రరాజ
మూనిపట్టఁగ భూషణోత్కర పేటికఁ
గొనియొక సైరంధ్రి మొనసి నడువ
రమణీయ కాంచన రత్నడోలికఁ దెచ్చి
జంఘాలవర్యు లాశ్చర్య శక్తిఁ

39. "నాఁడ" వ్రాత ప్రతి
40. "తలంగుచు" వ్రాత ప్రతి

తే. గీ. గనుఁగొని పురంధ్రీ! నీ పతి ఘనగుణాఢ్యుఁ
డఖిల ధనములు ఖార్యాద్వయంబుఁ గలిగి
యరుగుదెంచి భవన్మోహ భరమువలన
మమ్ముఁ బుత్తెంచెఁ దడవేల? మగువ! రమ్మ. 153

వ. అను తద్వాక్యంబులు విని లజ్జించి ప్రత్యుత్తరంబులు దోఁచక పతి గుణంబులు దలపోయుచు నున్న సమయంబున బంధువర్గంబు పతి పిలువనంపినం బోవని యది పదియేను జన్మంబులు వాయసియై జన్మించునని బోధించి డోలిక నెక్కించిన నేను భర్తృగృహంబునకేఁగి

క. కనుఁగొంటి వస్త్రరాసులు
ఘనసార కురంగనాభి కాశ్మీరజ చం
దనరాసులు (ధనరాసులు)
నినరాసులువోలె మణులు నిరుగడ మెఱయన్. 155

వ. అప్పుడెదుర్కొని మద్భర్త రాక్షసి రాజనందనలచేఁ బాదంబు లొత్తించి తనకుమామయగు రాజిచ్చిన సొమ్ములు, రాక్షసీదత్తదివ్యరత్నంబులుం జూపి యీ సొమ్మునకు[41] నీకే యాధిపత్యంబులని యన్నియు నప్పన చేసి నన్ను మన్నించె; సపత్నులుచూడ నేకశయ్య విహరించె. ఇట్లు కొంతకాలంబు వాఁటిన నేను గాలాంతరంబున నరకం బనుభవించి యీ రూపంబున జనియించితి. ఇంక వేయిమాఱులు తిర్యగ్యోనుల జనియింప వలసినయది. తన జీవితంబులు పతియెడ దాఁచెనేని బహు నరకంబు లనుభవించునని కాష్ఠకీటంబు పలికిన నేనిట్లంటి. 156

క. నినుఁ జూచిన దయపుట్టెడి
ఘనతరమగు నిట్టి పాతకంబే సుకృతం
బునఁ జను నా సుకృతం బిపు
డొనరించి జగంబు లెఱుఁగ నొసఁగుదు నీకున్. 157

వ. అనినఁ గాష్ఠకీటం బిట్లనియె. 158

క. ఇలయెల్ల దాన మిచ్చినఁ
దొలఁగఁదు నా పాతకంబు దూరతరంబై
తొలఁగును హరి వాసరమున
వెలసిన సుకృతంబువలన విమల చరిత్రా! 159

41 "మీకే" వ్రాతప్రతి

## మాఘ మాస మహిమ

వ. మఱియు మాఘమాసంబున దేవతలు తమతేజంబు జలంబుల నుంతురు. తజ్జల స్నానంబున బ్రహ్మహత్యాది పాపంబులు మొఱలిడుచుం దొలంగు. నాఁడు స్నానంబు చేసినవారికింగల సద్గతి సంగరస్థలంబున నైనలేదు. సరిన్నిర్ఝర జలంబులం దవగాహించుట యుత్తమంబు. వాపీ తటాకంబులయందు స్నానంబుగావించుట మధ్యమంబు. గృహ స్నానంబు శ్రేయోఽర్థు లగువారికిఁ జేయందగదు. శీతల జలంబునఁ బ్రాతస్స్నానంబుఁ జేయఁ బ్రశస్తంబు. క్లేశంబునంగాని సౌఖ్యంబునఁ బుణ్యంబు లభింపదు. శ్రేయస్కాముండగువాఁడు వహ్నిఁ గ్రాఁగం జనదు. హోమార్థంబు వహ్నిస్పర్శంబు సేయందగదు. సూర్యోద యంబునఁ బూర్వ దెల్లనగుట మేఘావరణంబున సూర్యుండు గానరాక యుండిన నుదయంబె కా నెఱుంగవలయు. ఉదయంబున స్నానం బర్హంబుగాదు. సరిత్తోయంబు దొరకకయున్న నవకుంభస్థితజలంబులు వాయువు రాత్రి సోఁకిన యవి తీర్థమాడిన గంగాస్నాన సమంబగు. మాఘంబున దినదిన స్నానంబుచేసి శర్కరతోఁగూడఁ దిలలు దానం బొసంగవలయు. మాఘావసానంబున బ్రాహ్మణులకు షడ్రసోపేతం బుగా భోజన మొసంగవలయును. విష్ణుమూర్తియై నిరంజనుడగు సూర్యుండు ప్రీతుం డగుంగాక యని దంపతులకు శుక్లవస్త్రంబులును సప్త ధేనువులును మోదకంబులును దిలమయంబు లగునవి ముప్పది యర్పింపవలయు నామోదకంబు లొకభాగంబు శర్కరయు మూఁడు భాగంబులు, తిలలు నారికేళ శకలంబులు మూఁడు భాగంబులును, నేలా మరీచంబులతోఁ గూడఁ జేసిన దాన శుద్ధియగు. మాఘంబు నెలయు నభ్యంజనంబు వర్జింపవలయు బ్రాహ్మణుండు.

"దివాకర ! జగన్నాథ ! ప్రభాకర ; నమోఽస్తుతే
పరిపూర్ణం కురుష్వేదం మాఘస్నానం మమాచ్యుత !"

యని సూర్య ప్రార్థనంబుచేసి యా సూర్యబింబంబు భేదించి పరమ ధామంబు నొందుం గావున మాఘస్నానంబు సేయు నతండు మోక్ష గామియగు. తన్మాసంబున శుక్లపక్షైకాదశి యందు నాదిత్యార్కంబులఁ గూడెనేని మహాపాతక నాశంబగు. నక్షత్రంబుఁ గూడకుండిన నుప వసింపవలయు. కౌరవస్థలలో యశస్కరుండగు భీముండు దరాగ్నిచే నుపవాసంబున కోర్వకుండియుఁ దన్మాసంబున నుపవసించిన మహా ఫలంబని యెఱింగి యుపవసించు. నాఁటనుండి భీమైకాదశియనం

ప్రసిద్ధంబయ్యె. ఇది మహాపాపంబు లపహరించు. కున్నృపతి దేశంబునుం బోలెఁ, గుపుత్రుండు కులంబునుంబోలెఁ గుభార్య పతింబోలె, నధర్మము ధర్మువుం బోలెఁ, గుమంత్రి రాజుం బోలెఁ, గుజ్ఞానంబు జ్ఞానంబునుం బోలెఁ, గుశౌచంబు శౌచంబునుం బోలె, నసంవాదంబు సంవాదంబునుం బోలె, నసత్యంబు సత్యంబునుం బోలె. హిమం బుష్ణంబునుంబోలె, నన్నర్థం బర్థంబునుం బోలెఁ ప్రకీర్తనంబు దానంబుంబోలె, విస్మయంబునఁ దపనంబునుం బోలె, నశిక్షచేఁ బుత్రుండునుం బోలె, దూరగతి గోగణంబునుం బోలె, సంకేతంబు పైతృకంబునుం బోలె, వివర్ధనంబున విత్తంబునుం బోలె, భీమద్వాదశి సమస్తాఘంబు లహరించు. 160

సీ. బ్రహ్మ హత్యా సురాపాన హేమస్తేయ
గుర్వంగ నాసంగ ఘోరతర మ
హా పాతకములు సయ్యన నన్నియును గూడి
ప్రాపింప హరివాసరంబె కాని
యరయఁ బుష్కర నైమిశారణ్య కురుదేశ
శమన సహోదరి జహ్నుపుత్రి
కా నర్మదాదేవికా ప్రభాసాది తీ
ర్థ జపతపో హోమ దాన మహిమ

తే. గీ. లణఁప నేరవు లోకంబు లభినుతింప
భూమిలోపలఁ గల పుణ్యములును హరిది
నవ్రతపు సుకృతముదూఁచ నయము దెలియ
సరియె హరివాసరవ్రత సారమునకు ? 161

తే. గీ. ద్వాదశీ పుణ్యవాసరోత్సవము వంటి
యుత్సవము గల్గ నేర్చునే యుర్వియందు
నజహరాదులకైన శక్యంబె దాని
మహిమ యంతయుఁ గొనియాడ మధురవాణి ! 162

వ. ద్వాదశినాఁడు హాటక వరాహ పురుషరూపంబు గావించి ఘటోపరి భాగంబున నవతామ్రపాత్రంబు నిలిపి దానియందు సర్వబీజంబులు నించి [42]సితవస్త్రంబు గట్టి సువర్ణంబిడి చుట్టు దీపంబులు వెట్టి, సురభి కుసుమంబులు నిగిడ్చి 'వరాహాయ నమ' యని పాదంబులును, 'క్రోడాయనమ' యని కటిస్థలంబును, 'గంభీర ఘోషాయ నమ' యని

42. "శీత" వ్రాతప్రతి

నాభియును, 'శ్రీవత్సధారిణే నమ' యని వక్షస్స్థలంబును, 'సహస్ర శిరసేనమ' యని బాహువులును, 'సర్వేశాయనమ' యని కంఠప్రదేశమును, 'సర్వాత్మనేనమ'యని ముఖంబును, 'సుప్రభాయనమ' యని లలాటంబును, 'శతమఘాయ నమ' యని కేశంబులును బూజించి, జాగరంబు గావించి విష్ణుమహత్త్వ ప్రతిపాదక పురాణంబులు వినుచుఁ బ్రాతఃకాలంబునఁ గుటుంబి యగు వైష్ణవునకుఁ గ్రోడ సహితసనై వేద్య పరిచ్ఛదకుంభంబు దానం బిచ్చి యంత బంధు వర్గంబుతోఁ గూడఁ బారణ చేసినఁ బునర్జననంబు నొందఁడు. జ్ఞానాజ్ఞాన కృతంబగు బహుజన్మార్జిత పాపంబును సూర్యుం డంధకారంబును బోలె హరించు నిటువంటి ద్వాదశి పూర్వజన్మంబున నాచరించినదానవు. తన్మహత్త్వంబున నీపతి యీ పుత్రుం డీ సంపద నీకు లభించె. తద్ద్వాదశీ వ్రతపుణ్య చతుర్థాంశంబు నా కిచ్చితివేని భర్తృనిమిత్త ద్రవ్యలోభ పాతకంబుఁ దరించి సద్గతిం బొందెద. నా యట్టు లెవ్వతె లోకంబున నాచరించు నది క్రిమియోని శతంబునం బుట్టి పిమ్మటఁ జండాలియై జన్మించునని విన్నవించిన దానికిఁ దత్ఫలం బొసంగితి. ఏఁ జూడ విష్ణు పురంబున కేఁగె. స్త్రీలకుఁ బతియే దైవంబు. పతిని విడిచి పితృగృహంబున కేఁగి బ్రాహ్మణభార్య కాష్టకీటం బగుట చూడవే? కుల శీలాద్యభిమానవతివి. మఱియొకటి వేడుమని పలికిన రోషంబున సంధ్యావళిం జూచి యిట్లనియె. 163

## మోహిని ధర్మాంగదుని రాజు చంపవలెనని కోరుట

సీ. సకల ధర్మాధర్మసార మీ వెఱిఁగిన
దానవు పతిహితత్వంబు కొఱకుఁ
బ్రాణ మిచ్చెదవేనిఁ బ్రాణంబనఁగ నెంత?
యంతకంటెఁ దలంప నధికుఁడైన
ధర్మాంగదునిఁ బట్టి తన చేతివాలునఁ
దలఁ ద్రెవ్వనేసి యాతల నిజాంక
భాగంబుపైఁ బక్వఫలమున్న యట్లుగాఁ
బరఁగఁబూనిన వాని శిరము నవ్య

తే. గీ. చంద్రబింబ సమంబు సశ్మశ్రుకంబు
కుండలాంకంబునైన యా గొనబు చూచి
సంతసిల్లుచు నేత్రాశ్రు జలము లేక
రాజు వర్తింప వలయునో రాజవదన! 164

వ. అనినఁ దద్వచనంబులు విని కంపించి సంధ్యావళి ధైర్యంబు పూని నగుచు శుక్ర సమీరిత గాథ పురాణంబులయందు వినంబడియె. ద్వాదశి స్వర్గ మోక్షప్రదయగు. ధనంబు విడుచు, గృహంబు విడుచు, భార్యల విడుచు, మిత్రుల విడుచు, గురుని విడుచు, బంధువుల విడుచు, తీర్థంబులు విడుచు, యజ్ఞంబులు విడుచు, ధర్మక్రియా తపస్సాంఖ్య యోగంబులేని విడుచుంగాని యుభయపక్ష ద్వాదశీ వాసరోత్సవంబు విడువఁడు. తద్ద్వాదశీ ప్రభావంబున క్షేమంబయ్యెడి. నీకు సంతోషం బుగా ధర్మాంగదుని హింసించిన సంతోషమున నుండుము. సత్యంబు వదలిన నరుండు శ్వపాక పరునకంటె నీచుండగుం గావున సత్యంబు వదలునే? యని పోయి పతి చరణంబుల వ్రాలి యిట్లనియె. 165

తే.గీ. ఎంత బోధించినను విన దీరసంబు
మించి హరివాసరమున భుజించు టొండె
తనయు ధర్మాంగదుని తల తఱంగుటొండె
కాని యెవ్వియు నొల్లదా కలుషశీల. 166

సీ. తనయునిపైఁ బ్రేమ తల్లికి నధికంబు
కనియెడి దుఃఖ ముత్కటతరంబు
తండ్రి బీజావాప ధర్మహేతువు గాని
తల్లి పాలనము వర్ధనముచేయ
నోపు లోకంబున నూర్జిత సత్యవ్ర
తంబునిల్పఁ దలంచి ధరణినాథ !
శతగుణాధిక పుత్ర సౌహార్ద మాత్మకు
వదలితి నీవు సత్పథమునంద

తే.గీ. ఘనుని ధర్మాంగదునిఁ బుత్రుఁ డనక చేతి
హేతిఁ బరిమార్చి మెడమీఁద నిడిశిరంబు
గాంచి హర్షించితేని యాకాంత కొసఁగు
వరము ఫలియించు ననియె నావశ్యకమున. 167

వ. ఇట్టి యాపత్పరంపరలు తరింపంజేయ నీశ్వరుండు గలఁడు. శిబి శ్యేనంబునకు మాంసం బీఁడె? పురందరునకుఁ గర్ణుండు చర్మం బొప్పిం పఁడె? జీమూతవాహనుండు గరుత్మంతునకుఁ బ్రాణం బొసంగఁడె? దధీచి దేవతలకు నెమ్ములు విసర్జింపఁడె? కీర్తి ధర్మంబు సత్యంబు నిలుపుకొనవలయు. ఈ మోహిని ధర్మభ్రంశంబు నొందింప విధాత నిర్మించినవాఁడు. పుత్ర హింసకునిపై దేవతలు వైముఖ్యంబు నొంద

రేని హరిపదంబు నొందెద వవశ్యంబు దృఢచిత్తుండవై సత్యంబు
నిల్పుకొమ్మని విన్నవించిన. 168

తే.గీ. అంత రుక్మాంగదుఁడు పుత్రహత్య, యాత్మ
హత్యయును జూడ బ్రహ్మహత్యాధికములు
గాన ధర్మజ్ఞు వినయ విఖ్యాతు నితనిఁ
జంపి యేలోకము భజింతు సాధ్వి! యకట! 169

వ. మందరంబున కేలపోయితి? విధిబలంబున నీ మోహిని నేల చూచి
మోహించితి? కుపుత్రుండేని యొకనిచే నీల్గినం దండ్రికి దుఃఖంబగు.
ధర్మశీలుండైన నందను నెట్లు నా చేతిహేతిచే హింసింపుదు? నేను
జంబూద్వీపంబె కాని (యీతండు) సప్తద్వీపంబులు నేలె. విష్ణుభక్తిచే
నాకంటె నధికుండు. ఏమి సేయుదు నెట్లు బ్రదుకుదు నెట్లు
తరింతు? ఏ నేఁగి స్వాంతంబు గావింతునని చేరంజని యిట్లనియె.

చ. పొరి గొనఁజాల నందనునిఁ బుణ్యకరంబగునట్టి తద్రమా
వరదివసత్రయంబు విడువన్, ననునేని కృతాభిషేకయై
పరఁగిన సాధ్వినేని యసిపాలుగఁ జేసెదఁ జేయుమన్న దు
ష్కరతర ఘోరకర్మము లసంఖ్యములైన నొనర్తు నెన్నికన్. 171

వ. ధర్మాంగదుం జంపిన నీకు నేమిలాభంబు? హరివాసరభంగంబు చేసిన
నీకు నేమి లాభంబు? దాసుండ నినుంగొల్చిన వాఁడ నెయ్యదియైనం
జేయుదు. కళితరత్నాంగుళీయక భారంబులగు కరంబులం బాదంబు
లొత్తెద నను్గ్రహింపవే! పుత్రభిక్షఁ బెట్టవే; గుణవంతుండగు పుత్ర
రత్నంబు దుర్లభంబు, హరివాసరంబు దుర్లభంబు. జాహ్నవీతోయంబు
దుర్లభంబు. జనని వాత్సల్యంబు దుర్లభంబు. సత్కులప్రసవంబు
దుర్లభంబు. వంశజ ప్రియాజనంబు దుర్లభంబు. కాంచన దానంబు
దుర్లభంబు. హరి పూజనంబు దుర్లభంబు. వైష్ణవదీక్షా నియమంబు
దుర్లభంబు. శ్రుతి సంగ్రహంబు దుర్లభంబు. వరాహక్షేత్ర వాసంబు
దుర్లభంబు. ఆత్మచింతనంబు దుర్లభంబు. గురుసత్కారంబు దుర్ల
భంబు. విష్ణునిమిత్త జాగరంబు దుర్లభంబు. పుష్కర జలంబు దుర్ల
భంబు. శిష్టసంయోగంబు దుర్లభంబు. పుత్ర సంప్రాప్తి దుర్లభంబు.
అచ్యుత భక్తి దుర్లభంబు. పథ్యాశనంబు దుర్లభంబు. మహౌషధంబు
దుర్లభంబు. వ్యాధి నిదానంబు దుర్లభంబు. మరణవేళ విష్ణు స్మర
ణంబు దుర్లభంబు. నీలవృషభ మోచనంబు దుర్లభంబు. త్రయోదశి
శ్రాద్ధ కర్మంబు దుర్లభంబు. **తిలమ**యధేను దానంబు దుర్లభంబు.

కపిలదానంబు దుర్లభంబు. హరి వాసరంబున ధాత్రీఫల స్నానంబు దుర్లభంబు. సామగ్రి గలిగి శీతోదకంబునం బ్రాత స్స్నానంబు సేయుట దుర్లభంబు. ఏదియేని మాఘ మాసంబునఁ జేయుట దుర్లభం బిట్లెఱింగి యట్లు నీ కార్యద్వయం బొనరింతు. మచ్చిరం బిచ్చెద, సంధ్యావళిని దాసిఁగా నిచ్చెద రాజ్యం బిచ్చెద ననిన విని మోహిని యిట్లనియె. 172

సీ. శత్రుఁడే నాకు నో జననాథ! ధర్మాంగ
దుండు సద్గుణశాలి దోషదూరుఁ
డతని నేటికిఁ జంప? హరి వాసరమున భు
జించి నాతో గోష్ఠిచేసి తేని
నా యభీష్టము తీరు నరనాథ! నీకుఁ బు
త్రునిమీఁద మోహంబు దోఁచెనేని
బద్ధప్రలాపముల్ వలుక నేమిటికి నే
నెయ్యది చెప్పిన హితముగాఁ ద

లంచి కావింపుమని యాదరించి పలుక
నలుక సేయక ధైర్యంపు మొలకవోలెఁ
దండ్రి కడనిల్చి ధర్మాంగద క్షితీశుఁ
డతని శాతాసి యిచ్చి యిట్లనియె నపుడు. 173

## ధర్మాంగదుండు తన్నుఁ జంపుమని తండ్రిని గోరుట

శా. ఆలస్యం బొనరింపఁ బాపము జగంబౌనౌ ననం దల్లి నేఁ
డాలోచించిన మాట సేయుము యశస్యం బాత్మసంరక్ష భూ
పాలశ్రేణికిఁ జేయఁ జెల్లు సుతుచే భార్యాళిచే సొమ్ముచే
నీ లోకంబుఁ బరంబు నీకుఁదగు నీ విట్లుం బ్రవర్తిల్లినన్. 174

క. దైన్యంబు విడువు దేహం
బన్యం బొక్కటి లభించు నా మీఁద యశం
బన్యోన్యమునకుఁ దగు సా
మాన్యుని కైవడిని నీవు మానం దగునే? 175

సీ. అవనీ సువర్ణార్థమై జననీ జన
కార్థమై ప్రమదార్థమై వసుంధ
రార్థమై యధిక కార్యార్థమై దేవ హి
తార్థమై బాలార్థమై వికల జ

నార్థమై గోరక్షణార్థమై నిజదేహ
మర్పించెనేని విఖ్యాత పుణ్య
లోకము ల్గలుగు నాలోకేశదిన భుక్తి
యర్హమే? శాస్త్ర రహస్య మిదియె

తే.గీ. సర్వమేధ మఖంబున స్వసుతుఁ బశువుఁ
జేసి వ్రేల్చిన తండ్రికి సిద్ధమై ల
భించు నుత్కృష్ట పదము గాంభీర్య ధైర్య
శౌర్యశాలివి నీ కింక శంకయేల? 176

వ. సకల ధర్మంబు లెఱింగి మా తల్లి సంధ్యావళియు నానతి యిచ్చె. తద్వాక్యంబున వర్తింపుము. మీకు నాకు మజ్జననికి యశంబగు. హరి వాసర వ్రతంబు నిలిపికొమ్మని విన్నవించిన. 177

క. తనయుని మాటలు విని యా
జననాథుం డాత్మఁ గలఁగి సంధ్యావళిఁ జూ
చిన సంపుల్ల సరోజా
ననయై వినయైక ఖేలనంబున నున్నన్. 178

మ. అసిఁగేలన్ జళిపించి యాన్నృపతి సత్యస్ఫూర్తి లక్ష్మీశు మా
నస మధ్యంబున నిల్పి వ్రేయఁదమి యూనన్ సార సంపద్గుణా
ఢ్యు సుపుత్రున్ సమయింప నేమిటికి నయ్యో! నేఁడు నా తోడఁ గూ
డి సుఖంబందు భుజింపు మీ దినమునన్ డెందంబు రంజిల్లఁగన్. 179

క. అని మోహిని పల్కిన భో
జన మిందు భుజించుకంటె సంధ్యావళి నా
తనయునిఁ జంపుట మేలని
యన ననఘుం డందుఁజాల నాందోళింపన్. 180

తే.గీ. అతని ధైర్యంబుఁ జూడ రమాధినాథుఁ
డపు డదృశ్యత నిల్చె నభోంతరమున
గరుడవాహనమున దేవఖచర సిద్ధ
సాధ్యవర్యులు తనుఁ జేరి సంస్తుతింప. 181

క. వీరుండగు ధర్మాంగదు
చారిత్రము, తల్లియైన సంధ్యావళి హృ
త్సారము రుక్మాంగదు న
త్యారంభము చూడనుండె హరి వినువీథిన్. 182

## రుక్మాంగదుఁడు సత్యపాలనకై పుత్రుని జంపఁ బూనుట

సీ. పూని మోహిని తను భుజియింపు మనుచుఁ బ
ల్మాఱు నాడఁగ ధైర్య మ్మ్మామ మెఱసి
ఖడ్గ మంకించి రుక్మ విభూషణుఁడు నిల్వ
ధర్మాంగదుఁడు పూర్ణధర్మ శక్తిఁ
దల్లిదండ్రులకు శ్రీధరునకుఁ బ్రణమిల్లి
కంఠంబుఁ దండ్రి యగ్రమున వంచి
యున్న నాకంపించె నుర్వీపయోధులు
ధ్వను లొనర్చెను మహోదగ్ర లీల

తే.గీ. వీఁచె ఝంఝానిలంబులు వేగరాలె
నుల్కలెన్నేని నిర్ఘాత యుతములగుచు
నప్పుడేమనవచ్చు బ్రహ్మాండమెల్ల
దుఃఖ పుంజంబనంగ నత్ర్రోవలయ్యె. 183

వ. అంత మోహిని వివర్ణయై దేవకార్యంబు సేయలేనైతి, జన్మంబు నిరర్థ
కంబయ్యె. మద్రూప లావణ్య పరవశుండు గాక రాజు హరి వాసరంబు
విడువక సుతుని సమయింపంజూచె. దండధరుని మొగంబెట్లు చూతుఁ?
నప్సరోజనంబులు నన్నుఁ దృణంబుగాఁ జూడరే! ఈ రా జీవ్రతంబునఁ
బరమ ధామంబు నొందెడి నితండు మన్నిమిత్తంబున సుతునిం జంపెడి
నింక నరకపాతకంబు నొందెద నని యుద్యతాయుధుండగు రాజుం
జూచి మూర్ఛిల్లిన. 184

ఉ. ఆ జగదేకవీరు గళ మంటకమున్నె సితాసితోద నా
రాజు కరంబు వట్టి రతిరాజ గురుండు ప్రసన్నమూర్తియై
- - - - - - - - - - - - - - - - - - - - - - - - - -
రాజులలోన (నెన్న) నతి రాజితకీర్తివిలోకు లెన్నఁగాన్. 185

క. ఈ ధైర్యం బీ శౌర్యం
బీ ధర్మం బీ వివేక మెన్నికగా నేఁ
డే ధాత్రీపతికిం గల
వో ధన్యుఁడ ! నీకె కాక యూహ యొనర్పన్. 186

క. శుద్ధాంతః కరణుండవు
బోద్ధవు నీవంటి పుణ్యపురుషులు గలరే?
యి ద్ధరణీ తలమున నీ
విద్ధరణీతభేరిఁ దెలిపి తే కాదశియున్. 187

శా. త్రైలోక్యంబున సద్గుణంబులు మహోదారంబులై యుండ భూ
పాలా పూర్ణయశంబు నిల్పి సుతుతోఁ బద్మాక్షితో సంతత
శ్రీలన్ సర్వ వికార దూరమయి యర్చిఃకీర్ణమై యాత్మ వి
ద్యా లాభాధికమై శుభస్థిర తరంబై యొప్పు మన్మూర్తితోన్. 188

వ. నీవును సుతుండును నిల్లాలును సమగ్రైశ్వర్య తేజంబుల నైక్యంబు
నొందుం డనిన. 189

## రుక్మాంగదుఁడు సపుత్త్ర కళత్త్రముగా ముక్తి పొందుట

సీ. అప్పుడైహిక సుఖంబంతయు విడనాడి
కోశమందిర దారకుంజర హరి
వస్తు వాహనబంధు వర్గంబు దిగనాడి
యైక్యంబు నొందఁ బోరనుచుఁ గురిసె
మందారతరు కుసుమంబులు, దివ్యదుం
దుభులు మ్రోయ నుతించి రభిమతముగ
నప్సరోంగనలు, చోద్యంబుగాఁ బాడిరి
గంధర్వవర్యు లుత్కంఠ మెఱయ

తే.గీ. నది నిరీక్షించి యంతకుం డంతలో లి
పి ప్రమార్జన మొనరించి బెగడి దిశలు
గ్రక్కతిల మొఱ్ఱలిడి యధికార మెల్ల
ననుచు సాగిలి మ్రొక్కి యిట్లనుచుఁ బలికె. 190

వ. చక్రధరా! యీ మోహిని నేకాదశీ వ్రతభంగంబు గావింపఁ గుశకే
తుండు నిర్మించినవాఁడే తత్ప్రభావంబున సతీసుత సహితుండై నీ
యందు నైక్యంబు నొందె, నా లోకంబు రహిత నానా లోకంబయ్యె.
నీ వెఱుంగనిది యెయ్యది? యని విన్నవించి కమలాసను కడకేఁగి
విన్నవించిన దివ్యవిమానంబులతో నింద్రాదులు చుట్టునుం గొలిచి రా
నవ్విధాత యెండిన నది వోలెఁ, జంద్రుండు లేని శర్వరివోలె, వాడిన
పంకజంబువోలె, నివృత్త మఖంబైన వేదికయుంబోలె, ద్రుమంబులు

లేని వనంబువోలెఁ, గలమసస్యంబులేని కేదారంబునుం బోలెఁ, ప్రభలేని దివాకరుండువోలె, గతోద్వాహంబగు మంటపంబువోలె, నవనీతంబు దిగిచిన మథనివోలె, విఱిగిన సేనయుం బోలె, నాథ రహితయైన యువతియుం బోలె, ధాన్యహీనంబగు కోష్ఠంబునుంబోలె, రాజులేని రాష్ట్రంబునుంబోలె, మంత్రిలేని రాజునుంబోలె, ధన ధాన్యం బులులేని గృహంబునుంబోలెఁ, పక్షిసంఘంబులేని గూడునుంబోలె, బద్ధసంఘుండైన భిక్షుకుండునుంబోలె, భార్యారహితుండగు గృహ స్థుండువోలె, మార్జనీపాంశు సంస్పృష్టుండైన జనుండునుంబోలె, వాదభగ్నుండగు వాదియుంబోలె, నిర్ధనుండగు పురుషుండునుంబోలె, నంధునిదీపంబునుంబోలె, వికలాంగయగు ప్రతిమయుంబోలె, శాఖలు విఱిగిన శాఖియుంబోలె, నిర్జలంబగు మేఘంబునుంబోలె, ధూమసహి తంబగు వహ్నియుంబోలెఁ, పత్నీసమేతంబుగాని గృహంబునుంబోలె, సర్వసంగంబు నొనర్చు నరుండునుంబోలె, శ్వశురావాసంబునఁ బ్రియా తిరస్కృతుండై పేదయైయున్న జామాతయుంబోలెఁ, గరి వెఱికివైచిన తామరయుంబోలె, మదంబు డిగిన కుంజరంబువోలె, భగ్నవేగంబైన హయంబునుంబోలె, శుష్కించిన సింహంబునుంబోలెఁ, గోఱలు దిగి చిన సర్పంబునుంబోలె, రెక్కలు విఱిగిన పక్షియుంబోలె, పతితుం డైన బ్రాహ్మణుండువోలె, భుజవెట్టిన లిపియుంబోలె, విస్వరంబగు యజుర్వేదంబునుంబోలె, స్వరహీనంబగు సామంబునుంబోలెఁ, పద హీనయగు ఋక్కునుంబోలెఁ, దృణసమాకీర్ణమగు మార్గంబునుంబోలెఁ, పద్మంబులులేని సరోవరంబువోలె, మమత విడువని జ్ఞానంబునుం బోలె, దంభంబునంజేయు ధర్మం నుంబోలె మోహిని తేజోరహితయై నిరుత్సాహయై చింతింప జనులు 'పుత్రహత్యాకారిణి, భర్తృఘాతిని, సంధ్యావళీ దుఃఖదాయిని' యని యాక్రోశింపం జూచి దేవత లిట్లనిరి.

ఆ.వె. శోకమందెదేల సుందరి ! చేసితి
పౌరుషంబు దానఫలము గాక
యున్న నీకుఁ గలదె ! యుర్విపై నపరాధ
వింతి ! నీకు నింత చింత యేల ? 192

సీ. దండించఁ గర్త యంతకుఁడు లోకులనెల్ల
వనజాక్ష భక్త దండనము గాన
శక్తుండుగాఁడు, నిర్జన కార్యసాధన
నియతతేజశ్శక్తి నీకె కలదు,

కలిగిననేమి విఘ్నములేక వైశాఖ
        [43]సితపక్ష మేకాదశీ దినమున
సారంబుగాఁగ విష్వక్సేన పూజఁగా
        వించెఁ దన్మహిమఁ బవిత్రుఁడయ్యెఁ,

తే.గీ. గొడుకుఁ ద్రికరణ శుద్ధిగా నడపఁజూడ
నబ్ధిజాజాని ప్రత్యక్షమె కుమార
దారసహితునిఁగా నిజ తనువునందుఁ
దాల్చుకొనియేఁగె నౌర! తద్ధర్మమహిమ. 193

క. సారతరంబగు ధర్మము
ప్రారంభించినను వేగ ఫలియించు విధి
ప్రేరణమునఁ గాకున్నన్
నేరం బింతయునులేదు నిఖిలజనులకున్. 194

తే.గీ. [44]త్రికరణంబుల నీవు పూనిక నొనర్చు
యత్న మీడేరకుండిన నబల! నీ ప్ర
గల్భతకు మెచ్చి వరమొసంగం దలంచి
వచ్చినారము తెలుపు నీ వాంఛితంబు. 195

ఉ. వంచన మింతలేక యనివారణశక్తి వంచించునట్లు యూ
హించి యొనర్పఁ గార్యమొక యింతయుఁగాక నిరర్థమైనఁ గ
ష్టించిన లాగు చూడక హసించిన యా నరుఁడందు ధాత్రిలో
నెంచఁగ గోవధాదికము లెన్నియుఁ జేసిన పాపసంఘముల్. 196

వ. కావున నీవు దేవకార్య నిమిత్తం బింత నిష్ఠురకృత్యంబు గావించితివి. ద్వాదశి మహిమ భగ్నంబయ్యె నైన నేమి? వరంబు వేఁడుమనిన మోహిని వారింజూచి యేమి సాధించితి? యమపురంబుఁ బూర్ణంబు గావించితినో? హరి దినంబున భుజింప సమకట్టితినో? రుక్మాంగదుని మోహాబ్ధి ముంచితినో? అతం డీ దండధరుని తలఁ ద్రొక్కి యప్ర మేయ గుణాఢ్యుండును నిర్మలుండును నిర్మలాశ్రయుండును హంసం బును శుచిషన్మూర్తియు, వ్యోమంబును బ్రణవంబును, జీవుండును,

---

43. "సితపక్ష యేకాదశి" ఇదివ్యాకరణముచే సాధ్యముకాదు. 'సితపక్ష మేకాదసి దినమున' అనువిధముగా నున్నచో సరిపెట్టుకొనవచ్చును.

44. ఈ పాదమున యతిభంగము. కాని పూర్వపద్యాంతముంగల ద్రుతమును బురిస్కరించుకొని "ంద్రి"గా భావించినచోఁ గుదురును.

నవ్యయుండును, నిరాధారుండును, నిష్ప్రపంచుఁడును, నిరంజనుం డును, విష్ణుండును, శూన్యుండును, వేదస్వరూపుండును, ధ్యేయుం డును, ధ్యేయవర్జితుండును, నస్తి నాస్తి వాక్యవర్తియుః, దూరవర్తియు నంతికవర్తియు, మనోగ్రాహ్యుండును, బరమధామ పురుషాఖ్యుం డును, జగత్త్రియ జనహృత్పంకజ సమాసీనుండును, దేజోరూ పంబును, నిరింద్రియుండును నగు స్వామియందు లీనుండయ్యె. కార్యంబు సాధింపక వేతనంబుగొను భృత్యుండు నరకం బనుభవించి లతాగుల్మాది రూపంబున జనించు నేను భర్తృ పుత్ర వినాశినినై యెట్లు వరంబు వేఁడుదు ననిన నిర్జరులిట్లనిరి. 197

క. నీ మదిఁలోఁగల కోరిక
నో మోహిని ! మమ్మునడుగు మొసఁగెదము యశ
శ్శ్రీ మించ నీ ఋణంబిఁక
మామీఁద ఘటింపకుండ మంజులవాణీ ! 198

తే గీ. రాజుతోఁ గూడ నతిపరిశ్రమమునొంది
యస్మదర్థంబుగాఁ గలహం బొనర్చి
యింత చేసితి విశ్వాసహితగుణమున
ననుభవింపుము తత్ఫలంబైన వరము. 199

వ. అనునంత[45] (రుక్మాంగదు పురోహితుండు) 200

## పురోహితుఁడు మోహినిపై కోపించుట

సీ. అంబుమధ్యమునఁ బ్రాణాయామ పరతమై
నబ్ద శతంబు నవ్యయు నమేయు
నారాయణుని మనోనలినంబునం దాల్చి
తద్ద్వ్రతాంతంబునఁ దజ్జలంబు
వెడలి మోహినిసేయు విపరీత కృత్యంబు
విని దేవతలఁ జూచి విపులరోష
[46] శీలయై నిపుడెంత చేసెనీ దుర్మేధ !
వేధయిట్లేల కావించె దీని ?

45. తరువాతి భాగమును బట్టి యిక్కడ నీపదముండ వలసినదిగా గానవచ్చుచున్నది
46. ఈ పాదమున యతిభంగము శక్తిమై యని మార్చినం గుదురును.

తే. గీ. సాధ్వి యౌనె ? దురాచార సత్యదూర
పరతరాశ్లీల సంతత పాపశీల
మరమొనంగుట మీకు భావ్యంబె ధర్మ
మెట్లు నిల్పెదరో నాకు నెఱుఁగఁబడదు. 201

వ. అని మఱియు నిట్లనియె. 202

క. పతిసుతఘాతిని యిది దు
ర్వ్రత యనలములోన దీని వైచినఁ గానీ
యతినిందఁగాని పాప
చ్యుతి యింతయు లేదు వినరె ! శ్రుతులన్ స్మృతులన్. 203

వ. దీని నరకంబునం ద్రోయుటకాక పుణ్యలోకంబగు నాకంబుఁ జేర్పం దగునే ? దీనికి వరమిచ్చెద మన మీకు నోరెట్టు లాడెనని మఱియు నిట్లనియె. 204

క. హరి దినమునఁ గుడువు మనుట,
సురభుల బ్రాహ్మణులఁ జంపఁ జూచుట, విప్రున్
సురఁ ద్రావు మనుట, యుష్మ
త్పురవాస నిరోధకములు బుధవరులారా ! 205

వ. హరివాసర భోజన గో బ్రాహ్మణవధ సురాపానాది పాప వచనంబు లెఱింగి పల్కినం బ్రాయశ్చిత్తంబు లేదు. ఎఱుంగక పల్కినఁ బ్రాణాయామశతంబులనేని ఏకాదశ్యుపవాసంబున నేని, సౌరకక్షేత్ర స్పర్శనంబుననేని దేవపూజార్చనంబుననేని తరించు నిదియెఱింగి హరి వాసరమున భుజింపుమనియె. భర్తృ వాక్యంబుమీఱి సద్గుణాఢ్యుండు నిజహృదయంగమ శీలుండునైన సుతుని సమయింపం జూచె, నిది స్పృశింప నర్హగాదు. దీనికి వరంబీ నుత్సహించుట దగునే ? మీరు ధర్మజ్ఞులను, న్యాయజ్ఞులను, బ్రాజ్ఞులను బాలించువారు. పాతకులంబాలింపందగునే? ధర్మంబున కాధారంబులు వేదంబులు. స్త్రీలకుఁ బతిశుశ్రూష సేయవలయునని పలికె. ఆ శుశ్రూషయన నతని యాజ్ఞ మీఱక యుండుటయే. ఆ యాజ్ఞ దాఁటినయది శాపార్హగాని యనుగ్రహార్హగాదు. బొంకింతునని వరంబువేఁడి వంచించెనిది సత్యవ్రతుండు గాన నతండు దీనికిం బాపంబుగట్టి ముక్తుండయ్యె. మఱియు నిది పాప శరీర. సకలదాన ధురంధరుని బ్రహ్మణ్యునిఁ, బ్రజారంజునుని, హరివాసరవ్రత పరాయణునిఁ, బరదార వివర్జితుని, దుష్కర్మ రహి

తుని, దుష్టశిక్షకుని, సప్తవ్యసనాపేతుని, ధర్మాంగదుని నింతచేసె, నిది వరంబునకుం దగునే? దీనిపై దేవతలేని దానవులేని పక్షంబు నిలిపిన వారినే భస్మంబుసేయుదు. తత్పక్షదోషంబునఁ బక్షపాతియు మహాపాతకుండౌనని కోపంబు మోహిని దేహంబుపైఁ బ్రయోగించి దివ్యులు ప్రార్థించు నంతనే భస్మంబు చేసెనని వసిష్ఠుండు మాంధాతకు నానతియిచ్చి మఱియు నిట్లనియె. 206

ఉ. నాకమనాగ పద్మసదనాకము నాయత భక్తినిష్ఠులా
లోకులకుం బ్రశస్తమగు లోకము పాపశరీరులైన యా
లోకులకున్ దినేశ సుతలోకముగాని లభింప దీవు సు
శ్లోకుని రాజుభక్తు నరిసూదనుఁ జేసిన చేఁత రిత్తయే? 207

## మోహిని పాపఫల మనుభవించుట

సీ. అని[47] భూమిదేవుఁడిట్లాడిన నాబోటి
నరకంబునకుఁ ద్రోయ నరకవాసు
లందఱు నిందుండ నర్హులే నీవు గు
ణాధిక ధర్మాంగదావనీశ
ధర్మజ్ఞు సత్పథస్థాయి దయాళుని
గురుభక్తిరతు దానకుశలు బంధు
పక్షు సప్తద్వీప పతి ననిచే నేఁడు
సమయింపఁజూచితి సాహసమునఁ

తే.గీ. గనలి దుర్మదసుతునైన గాసిచేయ
బ్రహ్మహత్యా శతోపమ పాతకము ల
భించునని యమ్మహాఋషు లెంచుకొందు
రట్టితత్వజ్ఞుఁజేసితివౌనె నీకు? 208

వ. ఇందు నీకు నిష్కృతిగలదే? యని వెడలంద్రోయ రసాతలంబు సొచ్చె, నా రసాతలంబున నాగకుమారులు తర్జించిన లజ్జించి దేవసభకు నేఁగి మొఱలిడుచు భువనత్రయంబుఁ దిరిగి ముసలదండాదులచే మొత్తులం బడి భవత్కార్యార్థంబుగా నింతచేసి నొచ్చితి. నాకు గతియెట్లు గలిగెడునని పరితపింప. 209

47. వాయు

చ. అరయఁగ విప్రశాప హతులై పడువారికి విప్రతాడనో
త్కరమున నీల్గువారికిని దగ్ధ భుజంగమదష్ట వజ్రపా
తరదన ఘాతభగ్నులయి తారెడు వారికి జహ్నుకన్యకా
సరిదవగాహమోపు ననిశంబును దగ్ధనపాప మాఁపఁగన్. 210

వ. అనిన మోహిని యిట్లనియె. 211

క. అటువంటి దివ్యవాహినిఁ
బటువేగముతోడ నేఁగి పడి మునిఁగినఁ ద
త్కుటిలాఘంబులు దొలఁగవు
జటిలానీకములు దొలఁగి చనుదురు చేరన్. 212

వ. అది గావున నేను హరివాసర ద్రోహిని, భర్తృపుత్ర వినాశినిని, జగ
త్త్రియ నిందితను, నన్ను నెట్లు దండించినం దగుదు నేమి సేయుదాన
నని దైన్యంబుననున్న మహేశ దివాకర సహితులగు దివ్యులు
రుక్మాంగద పురోహితుని మెల్లన శాంతినొందించి యిట్లనిరి. 213

క. నాకము పాడై యుండన్
వైకుంఠము నిండియుండ వనరుహహిత భూ
లోకము శూన్యంబగుటన్
వ్యాకులతంబొంది చేయవలసెన్ మాకున్. 214

వ. ఏము పంపిన నిమిత్తంబుననే యీ మోహిని హరివాసర వ్రతంబు
మాన్ప రుక్మాంగద సన్నిధానంబునకు వచ్చిన యదిగాని నిజతంత్రం
బున వచ్చినయదిగాదు. (రాజు) పునరావృత్తి రహితంబైన పరమ
ధామంబు సత్యంబు నిలుపుకొని చెందె. ఇది యుపకారంబె కావించిన
యది. నీవు సదాచారుండవు. తపస్విని, సర్వభూత హితుండవు.
మహానుభావులకుఁ జేసిన యప్రియంబేనియుఁ బ్రియంబేయగు. సాంఖ్య
విదులైన మునులకు లభింపని వైభవం బా రాజునకుం గలిగె.
ప్రసన్నుండవుకమ్ము. పాదహతులైనవారిని హింసింప నేటికి? అని
విన్నవించిన నిర్జరుల మన్నించి శాంతుఁడై పురోహితుం డిట్లనియె. 215

సీ. అనిమిషులార! పాపాన్విత యిది భర్తృ
దుఃఖప్రదాయిని, దుష్టశీల
స్థావరజంగ మాత్మకమైన లోకత్ర
యంబున దీనికి నధివసింప

రాదు; భూత ప్రజాక్రాంతంబుగాని దు
స్థానమెయ్యది యది తలఁచి దీని
నునుపంగఁదగు భూమి నునిచెద ననినఁ జ
రాచరజీవ సంవ్యాప్తతరము

తే.గీ. దైత్య నాగాన్వితంబు పాతాళసీమ,
యాకసము పక్షులకునెల్ల నాకరంబు,
సుకృతి గమ్యంబు, నాకంబు వికృతిఁ బాప
కర్మ నిలయంబు నరకంబు గణనసేయ. 216

వ. ఝషాదులచే సాగరంబులు వ్యాప్తంబు[48] లయ్యెడి, విహంగంబులచే మహీరుహంబు లధిష్ఠింపబడియె. ఇది యెచ్చట నుండెనేని దీని నంటిన మాత్రంబున నధోగతిం బొందుదురు. అని విప్రుండు పలికిన నెఱింగి యగుంకాక! యని మోహినిం జూచి నీకు లోకత్రయంబున నుండ నవకాశంబులేదు. దివ్యులు పాపభోక్తలు కారు; పాపసంగులుం గారు. నీవు నేయు నుపకారంబులకు శాపాపాయవరంబు దయచేసెద మని యున్నవార మిందులకు నుపాయంబు దోఁచ దనిన మోహిని యిట్లనియె. 217

ఉ. చేసితి మీర లంపిన యశేష విశేష విమోహ కార్యముల్
వాసి ననేక పాపము లవార్యములైనను ముట్టె[49] నాత్మ ను
ల్లాసము నొందె దండధరు లక్ష్మి యశేష మనుష్య వర్గముల్
డాసె సమస్త ఘోరవికటధ్వని నారకలోక వాసముల్. 218

తే.గీ. చిత్రగుప్తుండు నలసెఁ జేసేత వ్రాసి
ధర్మ సంచయ మెల్ల విధ్వస్తమయ్యె
నైనఁ బాపంబు నామీఁద నంట నిమ్ము
సంఘటించితి నేనిట్టి సాహసమ్ము. 219

వ. అయినను బురోహిత సహితులగు మీకు నంజలిఁ గావించి వేఁడెద. మీకు హితంబు చేసి పాపంబు లనుభవించిన నేమి? మఱియుం దత్పాప బుద్ధియే నాకుఁ దోఁచుచున్నది. ఏకాదశి పుణ్యఫలంబు నాకు నిడినఁ దదాధారంబున నుండెద నయ్యేకాదశి సర్వదిన పుణ్యరాశి, సర్వ పాప

---

48. "వ్యాపింపబడియెడి" నని వ్రాతప్రతి
49. "బుట్టె వ్రాతప్రతి"

ప్రణాశని, సర్వలోక ప్రదాయిని యనిన మోహిని వచనంబులు విని
శిరంబు లూఁచుచుఁ బరుషాక్షరంబుల నిట్లనిరి. 220

ఆ.వె. అడుగరాని యర్థ మడిగితి వబల ! సు
రాసురులకునైన ననుభవింప
రాదు విష్ణువాసర వ్రతఫలము నీ
కెవ్వఁ డొసఁగ శక్తుఁడెంచి చూడ. 221

క. హరి దివసఫలము డక్కన్
వరమొక్కటి వేఁడుమింక వారిజనయనా !
హరిదినము బ్రహ్మ హత్యా
దురితాయుత కోటినేని త్రోవలఁబెట్టున్. 222

వ. సర్వయజ్ఞ ఫలప్రదంబగు హరివాసర ఫలంబొసంగ మాకు శక్తిలేదది
మోక్షప్రదంబు, పుణ్యంబు, జన్మమృత్యు నికర్తనంబు. తత్ఫలంబు
వేఁడిన నీ శిరంబునఁ గులిశంబు వడియెడు ననిన మోహిని యిట్లనియె.

క. అయినన్నేమి ? ప్రియంబుగ
దయతోడం బ్రాంతవిద్ధ దశమీ సుకృతం
బయిన న్నొసఁగుఁడు నాక ని
లయులారా ! యనుచు సువికలంబుగఁ బలుకన్. 224

వ. దివ్యు లిట్లనిరి. 225

ఆ.వె. ప్రాంతవిద్ధ దశమిఁ బ్రాపించు సుకృతంబు
హరునిమాట మీఁద నబ్జసూతి
జంభునకు నొసంగె సంతత బలశాలి
యైనఁ దత్ఫలమున కర్హుఁడగునె ? 226

వ. అనిన మోహిని యిట్లనియె. దశమీ ప్రాంతంబున దివాకరుం
డుదయించినది మొదలు హరిదినంబది యసురులకు నొసంగిరి.
సూర్యోదయ విహీనంబైన దృశ్యాదృశ్యచరచరంబై దశమితోఁ గూడిన
హరిదినం బగ్ని విహార కాలార్హం బదియె వధూత్థాపన [50]కాలంబు,
గోదోహన కాలంబు, పక్షి సన్నాద లోలంబు, సర్వదేవ విరామ
కారణంబు, మార్జనిగ్రహణ సమయంబు, ద్వారోద్ఘాటనవేళ, ప్రతి
వీక్షిత స్నానావసరంబు, వాదిత్ర నినద సంకులంబు, తద్దశమితో

50. "మూలంబు" అని వ్రాతప్రతి.

నేకాదశి కూడెనేని యది నాకు నివాసంబుగా నొసంగుఁడు ఉదయంబున హరివాసరంబును వేఁడ వైనతేయోదయంబున వేఁడెద. మునిదగ్ధనై[51] యిష్టార్థంబుగా నీ ప్రాంతంబు వేఁడెదనీ వలయు నిధి యీకుండిన వేయితునియ లయ్యెదనని కులిశంబుచేత విచ్ఛిన్నయైన తన్మోహిని పలుకు వచనంబులు విని దిగంబర పురోగములైన యా నిర్జరులందఱు విమర్శించుకొని యమదర్శనార్థంబుగా, వైకుంఠ ధ్వంస నార్థంబుగాఁ, బాషండ వృద్ధ్యర్థంబుగాఁ, బాపసంజన నార్థంబుగా, దత్పురోహితుని వలన ననుజ్ఞఁగొని మోహినింజూచి యిట్లనిరి. 227

## దేవతలు మోహినికి స్థానమును కల్పించుట

సీ. అఖిలలోక విమోహనార్థంబుగా నీకు
నుండ నర్హంబగుచున్న ధామ
మా దశమీప్రాంత మదియె ప్రత్యూష దు
ష్టము హరిదిన సంయుతము ఘటింప
జంభదుష్టము గాదు సకల దానవ దైత్య
గమ్యంబుగాదు యోగ్యంబు గాదు
సురలకు, నందు సుస్థిరలీల విహరింపు
మా కాలమున మాధవార్చనంబు

తే.గీ. సేయు మనుజుల సుకృతంబుచెందు నింక
సంశయంబంద నేటికి సారసాక్షి!
దేవకార్యార్థమై నీవు తిరిగినట్టి
తత్ప్రయాసంబు ఫలియించుఁ దరళనేత్ర! 228

క. ఆదిత్యోదయ హీనత
నా దశమీ ప్రాంతమున్న హరి దివసముగా
నాదటఁగైకొని యుండెడు
నా దుర్మదు ఫలము నీకు నర్పించు నిఁకన్. 229

వ. సూర్య హీనంబగు దశమీ ప్రాంతం బేకాదశీ మిశ్రంబు నాశంబు నొందించిన నుపవాసవ్రత దాన జాగరణంబులచే నార్జించిన పుణ్యంబు

51. నైష్యర్థంబులుగా నని వ్రాతప్రతి.

నీకగు. అప్రభాతాంకితంబై యంతర్దశమీ గర్హితంబై దృశ్యాదృశ్యత హరి దినంబునుం గూడియున్న నరుఁడు సేయు సుకృతంబు నిష్ఫలం బగు. ఇట్టి దశమీ ప్రాంతంబుననుండి జగంబుల మోహంబు నొందిం పుచు తాఁబడిన పాటులన్నియు మఱచి మోహిని హర్షించుచుండు. యముండు తత్పాతకుల శిక్షించుటకుఁ బటాక్షరలిపి పుట్టెడి. అది దేవ దానవులచేత నలంఘ్యంబగు. రవి సంప్రయుక్త దశమీయోగంబు భువనత్రయంబునఁ బ్రసిద్ధంబు. ఆ యోగయుక్తదశమిం బటస్థితయై దృశ్యాదృశ్య సంజ్ఞ వర్తించునదియై మోహిని యనుభవించుకొని తత్పటంబునందు లిపి గావింపుచు నిజస్థానంబున నుండునని యముండు పలికి దేవతలుం దానును నాకలోకంబునకేఁగె. మోహినియు జగన్మోహినియై దినేశహీన దశమీప్రాంతంబున నుండెనని వసిష్ఠుండు మాంధాతకు నెఱింగించి మఱియు. 230

సీ. పాప నాశనము శోభన మీ పురాణంబు
రుక్మాంగద చరిత్ర రుక్మచేల
భక్తి గమ్యము జగత్ ప్రాప్యంబు సర్వదుః
ఖక్షయ కరము విఖ్యాత తరము
సంతతాయుష్య యశస్య ప్రశక్యంబు
సర్వశత్రు విఘాత శక్తియుతము
శ్రోతవ్యము, మహీశ సూనులకెల్ల జ
యప్రదం బధిక యోగ్యంబు భూమి

తే.గీ. సురుల కర్హంబు సంతాన సుఖకరంబు
నర్థదాయక మెంచ నర్థార్థులకును
నఖిల విద్య లొసంగుఁ దదర్థి తతికి
నిది మహా పుణ్య చరితమూహించి పొగడ. 231

వ. ఈ రుక్మాంగద చరిత్రంబు రాజసూయ ఫలప్రదంబు. ఇది నీ కెఱిం గించితి ననిన వసిష్ఠునకు మ్రొక్కి పరమానందంబునొంది మాంధాత యేకాదశీ నిశ్చయం బెఱింగి ద్వాదశీ మహోత్సవం బాచరింపుచు నుండె. 232

## ఆశ్వాసాంతము

మ. అమితోద్యద్యమశార్జున ద్రుమదమాహంకార ధౌరేయ దు
ర్దమ ! సాళ్వద్రుమ రుక్మి కాలయవనాద్యక్షుద్ర దుర్వాహినీ
శమనోదగ్ర మహోగ్ర ! శుక్ర రుచి రాజత్తీవ్రతేజః ప్రభా
కుముది న్యాప్తకులావతంస ! చరమాంగుష్ఠ్యుద్ధృతోర్వీధరా ! 233

క. శకటారి బల నిషూదన !
నికటారి జలజయుగోనీయ వరత్వ
ప్రకటన సంయోజిత ది
క్ప్రకట నవోల్లాసరత్న ! కాంచీధామా ! 234

భామిని. సత్యభాషణా ! సాధు పోషణా !
నిత్యజీవనా ! నిర్మలావనా !
దైత్య సూదనా ! ధర్మమోదనా !
స్తుత్యబోధనా ! దోషశోధనా ! 235

## గద్యము

ఇది శ్రీ మత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్యపుత్ర
కశ్యపగోత్ర పవిత్ర శ్రీ మదల్లాడు నరసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణంబునందుఁ బంచమాశ్వాసము
సంపూర్ణము

# నారదీయ పురాణము

## షష్ఠాశ్వాసము

క. శ్రీజైవాతృక వంశాం
భోజోత్కరమిత్ర ! భువనపూర్ణ చరిత్రా !
రాజీవనేత్ర ! నిరుపమ
భోజేశ సుతాకళత్ర ! బుధజనమిత్రా ! 1

వ. అవధరింపుము. 2

సీ. ... ... ... ... ... ...
... ... ... ... ... ...
... ... ... ... ... ...
... ... ... ... ... ...
......ధావాహినీ ప్రవా.........
హతరంగములు పంకమణఁచి పూర్ణ
హరిభక్తివోలె భవాతంకములు మాన్చె
నత్యంత మహిమ మాకందఅకును

2ఆ.వె. సుధసుపర్వలోక సుపదమై క్లేశంబు
లడఁచుఁ దావకీనమైన వాక్య
రూపసుధ దినంబు రుచిగొన నస్మదా
ప్యాయనంబు చేసె ననఘ చరిత ! 3

---

1. వచనము తరువాత "ఇట నొక పత్రము కానరాదు" అని యొక పత్రము మూలమునందే లుప్తమైయున్నట్లు ప్రతి వ్రాసినవారు పేర్కొనిరి.

2. ఆటవెలది గీతముగా పేర్కొనఁ బడినది.

ఆ.వె. కథకు లెందఱైనఁ గల్గినఁ గల్గనీ
పూని తెల్పనిమ్ము పుణ్యకథలు
సర్వబోద్ధలైన [3]జను(ల) బోధించె నీ
దివ్య వాఙ్మయైకతేజ మనఘ. 4

తే.గీ. తామసోక్తి నిబంధన తామసులకు
రాజసోక్తి నిబంధన రాజసులకు
సాత్వికోక్తి నిబంధన సాత్వికులకుఁ
బరమబోధం బొనర్చు నేర్పరివి నీవు. 5

తే.గీ. సాత్వికోక్తి విరుద్ధార్థ సరణియైన
యట్లనే పల్కుపల్కుదు వదియు ననఘ!
తామసాధీనశాస్త్ర బోధనము కొఱకుఁ
గాని స్వాభావికార్థంబుగాదు నీకు. 6

క. అమరున్ జ్ఞానము సత్వగు
ణమునను లోభము రజోగుణమున మహామో
హమదములు తమో గుణమున
నమితస్థితి ననుచు శౌరి యానతి యిచ్చెన్. 7

తే.గీ. తామసాది పురాణజాతములనైన
నెద్ది సర్వోత్తమంబని యెంచఁ బడియె
నఖిల నామాంతరంబుల నదియ విష్ణు
తత్వము తదంతరాత్మయై తగుటఁ జేసి. 8

క. భగవన్మహిమాంభోనిధి
యగణిత తద్బోధవీచియై మెఱయఁగ జ్ఞా
న గుణామృత రస బిందువు
లొగి నాప్యాయన మొనర్చుచున్నవి మాకున్. 9

తే.గీ. ఔర భగవన్మహిమ వార్ధి యతి గభీర
తర మపారంబు సద్గుణోద్యత్ప్రవాహ
మమృత రసము హిమాంశుండవైన నీక
తంబునన్ వెల్లివిరిసె నిద్ధరణిలోన. 10

3. జనులు

తే.గీ. చంద్రుఁడవు నీవు చంద్రిక సరస సూక్తి
సంతతి చకోరముల మేము సారసాక్ష!
సత్కరుణ జ్యోత్స్న నీవంటి సాత్త్విక ప్ర
వర్తనుఁడు గల్గ నేర్చునే వన్నె మెఱసి. 11

క. అల భగవంతుఁడు మాపైఁ
గలఁడని తలఁచితిమి యట్లు కాకున్న తఱిన్
గుల విద్యా సంపదలం
దలకొనదే గర్వమెల్లఁ దత్త్వజ్ఞనిధీ! 12

తే.గీ. కలిత విద్యాకుల ధనోత్థగర్వ పటల
జాత సంఛన్నదృష్టుల మైతిమేని
నిన్ను వీక్షింపఁగల మెట్లు నిఖిల ధర్మ
పద విశేషోపదేష్టవై పరఁగియున్న. 13

వ. అనిన సూతుం డిట్లనియె. 14

## సూతుఁడు బ్రహ్మజ్ఞాన తత్త్వమును బోధించుట

మ. కులమాచారము విష్ణు (పాద)[4] భజనాంకూరైక[5] సద్భక్తి ని
శ్చలమౌ న్యాసలవంబులేని యతి నిస్సారాత్ముఁడన్ హీన దు
ష్కులుఁడన్ నేఁడు మఖంబునందుఁ బరిషద్గోష్ఠిన్ విజృంభించుటల్
గలదే మద్గురు శక్తి నట్టి గురులోకస్వామిఁ గీర్తించెదన్. 15

సీ. జగతిపై బ్రహ్మనిష్ఠావిధి జ్ఞాత లె
[6]వ్వనిఁ జూచినను నిజేక్షణము ద్రిప్పి
జల మార్జనముచేసి చను దురాహీనుని
సాత్త్వికోత్తముఁ జేసి సకల మునులు
బ్రహ్మ పీఠమునందుఁ బట్టము గట్టిరే
యాశ్రమంబునకైన నర్హవృత్తి
చాలదు విప్రవంశజుఁడఁగా నెన్నిక
విద్వాంసుఁడనుగాను విష్ణుపాద

4. అక్షర లోపము పూరింపఁబడినది. 5. కూరైక. (మూ)

6. ఎవ్వనిఁ జూచి నిజేక్షణములఁ ద్రిప్పి....(మూ) ఇందు సీస పాదము పూర్తి కాలేదు, అంతేకాక ఆఱవ గణము జగణమైనది.

తే.గీ. పద్మ భృంగత్వమా లేదు పరమనియతి
తత్వ విజ్ఞాపనైక కృత్యంబు నాకు
నిమ్మహాత్ముల కెఱఁగించు నిట్టి మహిమ
మద్గురుస్వామి కృపనని మఱియు మ్రొక్కి. 16

వ. ఇట్లనియె. 17

తే.గీ. సర్వ ధర్మాదిహేతువౌ చక్రధరుఁడు
స్వామి విశ్వ ప్రపంచ ప్రశస్త జనులు
వాను లీ సభలోనఁ దద్దైవ తత్వ
మెఱుఁగ కుండిన నా పీఠ మెక్కఁగలనె. 18

క. మానసమా వెఱవకు ముద
మానుము తద్బ్రహ్మపీఠి నాత్మేశేచ్ఛా
ధీనము లనన్యశేషము
లైన యవి సమస్తములగు నావస్తుతతుల్. 19

ఆ.వె. బ్రహ్మ పీఠమెక్కి ప్రాజ్ఞుల ముందఱ
గర్వరోగలిప్త గాత్రుఁ డగుచు
బ్రోడతనము చూపఁ [7]బూన నౌద్ధత్వమ
[8]యంద్రు తత్వవేదులైన మునులు. 20

వ. అదిగాన తదౌద్ధత్యంబు భగవ దనుగ్రహంబున మాకుం బ్రాపించదని సన్మార్గ రహస్యవేదియై యిట్లనియె. 21

సీ. సత్క్రియావంతులు సకలాగమాంత పా
రగులు బ్రహ్మజ్ఞులు (న)గు మహాను
భావులు మీర లీ ప్రశ్నాంతరంబు మ
మ్మడుగుట విహితంబొ యవిహితంబొ

7. బూను
8. మంద్రు

తెలియదు ధర్మసందేహ మిప్పుడు పుట్టి
న యది దానినడంచి నవ్యశక్తి
9తెలి పర్వనోదయాళులు గుణాఢ్యులు సర్వ
భూత సుహృత్పరాత్మాతి నిశ్చ

తే.గీ. లాంతరంగులు సర్వజ్ఞు లతులయశులు
రాజు నడచిన యట్లనె ప్రజలు నడుతు
రట్లు గావున ఘనులు మీరల్పతరుఁడ
నైన వినిపింతుఁ దగు సత్ప్రియంబు సేయ. 22

తే.గీ. అనుచు వైష్ణవ దాసుండనైన నాకుఁ
జిత్త మలరించి వాగ్రూపసేవ చేసి
పెద్దల నిరంతరంబు మెప్పింపఁ గలిగె
భళిర నాకయ్యె జన్మసాఫల్య మిపుడు. 23

క. భగవద్భక్తులకుఁ బ్రియం
బుగ సత్కర్మం బొనర్చు పురుషుని జన్మం
బగణిత గుణసంపత్తిం
దగునండ్రు మదిం దలంచి తత్వజ్ఞుఁ డిలన్. 24

తే.గీ. ఆత్మవేదులు కర్మ మర్హంబె సేయ
నండ్రు కొందఱు సూరులయ్యాత్మవేదు
లైనవారికిఁ గర్మమర్హంబె సేయ
నండ్రు కొందఱు సూరులత్యంతమహిమ. 25

క. ఈ యిరువురి వచనంబులు
నే యెడనల్పులగు జనుల కెఱుఁగఁబడకయే
శ్రేయోమూలంబై య
త్యాయతమై ధర్మ సంశయం బుదయించున్. 26

## విష్ణు మహిమ

వ. తత్సంశయ విషయ ద్రుమోన్మూలన మారుతంబగు నస్మదాచార్యో
పదిష్ట నిశ్చయంబు విన్నవించెద. పరమాన పరజ్ఞాన పరానంద పర

9. తెలివిపర్వనోదయాళులు గుణాఢ్యులు సర్వ (యతి, గణ భంగములు).

శేషత్వంబులు జీవులకు స్వభావంబది యెఱింగి చేసిన కర్మంబు తన యదిగాదు. కావున విష్ణు ప్రీతిగ సత్కర్మం బొనరింప వలయు. దేహేంద్రియ మనః ప్రాణాదులకన్న వేరై సుఖచిద్ఘనుండై యపహతాశేష పాపచయుండై, విజరుండై, విమృత్యుండై, విశోకుండై, విజిఘత్సుండై, వితృష్ణుండై సత్యకామత్వాది గుణసంపన్నుండై సూక్ష్మత్వంబు నొందియు నాతత చిత్ప్రభం జెంది సర్వాంతర్గత శక్తిత్వంబువలన, నభేద్యుండు నదాహ్యుండు నక్లేద్యుండు నశోష్యుండునునై, నిత్యశుద్ధ సుఖానందగుణ బ్రహ్మామృతాబ్ధి నోలలాడుచు సర్వానందయిత్వ బ్రహ్మానంద శేషత్వ లక్షణుండై దేవ నర పశు పాదప శరీరాకృతి భేదంబులు [10]పొందు జీవునికిని వికర్మ జనితంబులు [11]కర్మంబనాద్యవిద్యవలనం బుట్టె, నా యనాద్యవిద్య యనాద్య చిదన్వయంబువలన నయ్యెడు నట్లు జీవుం డవిద్యా కర్మవాసనచే మహదాది శరీరాంత వికారకలితా నాత్మ త్రిగుణ ప్రధానావృతుండై తత్కృత విభ్రముండై యేను దేహుండనను నహంకారంబు పూని, దేవత్వ నరత్వ గోత్వ బ్రాహ్మణత్వేశ్వరత్వ భోగిత్వ సిద్ధిత్వ బలత్వ సుఖిత్వంబులు వహించుకొని, యజనం బొనర్చెద, నిచ్చెదం బ్రమోదించెదనని విమోహంబు వలనం బలుకుచుఁ బరమాత్మైక ధర్మ స్వాతంత్ర్య సద్గుణంబులు తనయం దారోపించుకొని సర్వంబు తనకొఱకేయని చింతించు(చుండు) కొందఱు సూరి చేతనులు సర్వ వ్యాప్తామలానంద స్వరూపంబైన పర బ్రహ్మంబె సర్వానంద దాయకంబనియు నితనియందు వర్తించు నఖిలంబునుం బ్రకాశించునని(యు) వితర్కింపుచుఁ బరబ్రహ్మామృతాంబుధి నోలలాడుచు లీలాభోగ విభూతస్థులై రమింపుదురు. త్రిగుణ ప్రకృతి లీలా విభూతి, షడ్గుణ ప్రకృతి భోగవిభూతి. ఇవి రెండును పర బ్రహ్మాశ్రితంబులు. గగనంబున నభ్రశశిమండలంబులు వోలె నధరోత్తర భావంబున లీలా విభూతి భోగవిభూతులు మెఱయు. మహామాయ యవిద్య నియతి మోహినీ ప్రకృతి వాసనయన లీలావిభూతి పరమ వ్యోమ పరమధామాది సంజ్ఞలం గలయది భోగ విభూతి. ఈ రెండు విభూతులు నాత్మలతోఁగూడ భగవచ్ఛేష రూపంబులగుం గానఁ గర్మంబులు తనవిగా వీశ్వరునివి. చేతనాచేత నాత్మకంబగు విశ్వంబు విష్ణు శరీరంబునుం గావున తత్క్రియలు విష్ణ్వధీనంబు లగునని మఱియు నిట్లనియె. 27

10. అర్థాన్వయము కొఱకు "పొందు" ఉండవలయును.

11. కర్మంబన నాద్య విద్యవలన,

## ఆత్మ - దేహాదులు

తే.గీ. ఆత్మ దేహాదులకును వేఱనియు నిరత
సచ్చిదానంద లక్షణస్థాయి యనియుఁ
బరమపుంశేషతైక స్వభావవృత్తి
యనియు నెఱిఁగిన యతఁడు సుమ్మాత్మవేది. 28

వ. ఏతద్ద్రవ్యమె యాత్మకు విజ్ఞాన సమాశ్రయమై యుండు నా ద్రవ్యమాత్మకు దేహ మట్లనె విశ్వమంతయుఁ బరబ్రహ్మకు దేహంబై యుండు నని ధ్యానం బొనర్చిన యతం డితరాపేక్షలేక మోక్షంబు నొందు. క్షరము ప్రధాన మమృత మక్షరము (జీవుండా) క్షరాత్మలను హరి యొక్కఁడె పరిపాలింపుచునుండు. భోక్త భోజ్యము ప్రేరకుండునని యెఱింగి యందుచేత నమృతత్వంబు నొందు. "క్షరం ప్రధాన మమృతాక్షరమ్మ''నియెడి యుపనిషద్వాక్యంబు గలదు. మఱియు నొకరుండె సర్వప్రాణులందు వ్యాపించి యంతరాత్మయై కర్మాధ్యక్షుండై సర్వభూతాదివాసుండై సాక్షాద్ద్రష్టయై చిత్స్వరూపుండై కేవలుండై నిర్గుణుండై యుండునను 'ఏకోదేవ సర్వభూతేషు' అనియెడి యుపనిషద్వాక్యంబు గలదు. మఱియు నాకార రహితంబై యవ్రణమై యజరమై, శుద్ధమైన తేజము వెలుంగు నా తేజము కవియు మనీషియు పరిభూ, స్వయంభూ నామాన్వితంబునునై యనేక కాలంబు లాధాతతథ్యంబు వలన నర్థంబు లొనర్చునను 'సపర్యగాచ్ఛుక్రమకాయ మవ్రణమ్మ'ను ఉపనిషద్వాక్యంబు గలదు. మఱియుఁ బెక్కండ్రైన నిత్యులైన జీవులకు నిత్యుండైన చేతనుండు భగవంతుఁ డొక్కరుండే కామంబు లిచ్చుచుండు నతని ధీరుండైన బ్రాహ్మణుం డెఱింగి ప్రజ్ఞాశక్తి నిలుపుకొనవలయు నని పలుకు "నిత్యో నిత్యానామ్'' అనియెడి యుపనిషద్వాక్యంబు గలదు. మఱియుఁ దత్త్వత్రయ జీవనంబులైన యుపనిషద్వాక్యంబులు గలవు. 29

## పరబ్రహ్మ తత్త్వము

సీ. తత్త్వత్రయం బనాదగుఁ జిద చిత్పర
బ్రహ్మ భేదంబునఁ బ్రథితమగుచుఁ
జిదచిచ్ఛరీరత చెప్పంగఁ దగుఁ బర
బ్రహ్మంబె పూర్ణమౌ పరమ తత్త్వ

మొక్కటియని యాగమోక్తుల నొక వంకఁ
బరమ విజ్ఞానులు ప్రస్తుతింపఁ
జిదచిచ్ఛరీరమై సిరులరాణించు త
ద్బ్రహ్మము రూపింపఁ దద్బ్రహ్మమునకు

తే.గీ. నాకృతియ లేదనుటకు యతోఽన్యథార్త
మను మహోక్తినిషేధకంబయ్యెఁ బీన
వక్షుఁ డంచు మఱియు విశాలాక్షుఁ డంచు
శ్రీరఘూత్తము నాత్మఁ గీర్తించుకతన. 30

సీ. బద్ధులైన నికృష్టభావులు సంసార
భాజనంబులు జగద్భర్తయేని
బద్ధుఁడై యుండినఁ బ్రభువనిపించునే
బహువిధంబుల నెంచ బంధనార్థ
చోరుల విడిపించు పౌరుషం బొనరిన
వాడు ప్రభుండన వన్నె కెక్కుఁ
గాన నిబద్ధుండుగాఁ డెందుఁ బ్రభువు త
న్నిష్ఠుఁ[12]డై యున్నవానికి హితోప

తే.గీ. దేశ మొనరింతు రార్యులు తేజమిచ్చి
యంబుజాసను నిర్మించి యాగమములు
తెలిపె నే దేవుఁ డాత్మబుద్ధి ప్రసక్తి
యట్టిదేవునిఁ గొల్తు నేననియె శ్రుతియు. 31

క. సర్వవశగతుని దేవుని
సర్వాధిపు సర్వభూత సామ్రాజ్యనిధిన్
సర్వాంతర్యామిని హరి
సర్వజ్ఞుని నెఱిఁగి ముక్తిసంపద గాంచున్. 32

వ. ఇందునకు "యో బ్రహ్మాణా విదధాతి పూర" మ్మను నుపనిషద్వా
క్యంబు గలదు. 33

---

12. కన్నిష్ఠు

క. అరయఁగ బహిరాదరణముఁ
బొరయక యావరణమగుచు భువనంబులలోఁ
బరఁగిన యధ్వరమూర్తిన్
హరి గొల్చిన మోక్షలక్ష్మి యబ్బకయున్నే. 34

వ. బ్రహ్మ మొదలు మహాపురుషునిఁ గాను దమోతీతునింగాను ఆదిత్య వర్ణునిగాను సర్వరూపములును సఁగ్రహించి సర్వనామములుం గలిగి యున్నవానిఁ గాను [13]నుదాహరించెను. శుక్రుండు నాల్గుదిక్కుల నట్లన చాటె నటువంటివాని నెఱుంగుటె మోక్షోపాయ మగును. అన్య మార్గంబు లేదని [14]వేద పురుషునే నెఱుంగుదునని పల్కెడు "వేదాహ మేతం పురుషం మహంతమ్" అనియెడి శ్రుతి వాక్యంబు గలదు. 35

క. భవపాశ బంధకుండును
భవపాశ విమోచకుఁడును బ్రహ్మము కైవ
ల్య విభవదాయకుఁడు వి
ష్ణువె యగు వేదాంత దివ్యసూక్తుల నెంచన్. 36

తే.గీ. అర్కునివలన నారోగ్యమాయె నలుని
వలన సిరియును శంకరువలన బోధ
[15]మచ్యుతు వలన ముక్తియు నందవలయు
ననఁగ నుపనిషదుక్తి యుక్తార్థముగను. 37

వ. అనిన విని ఋషులు పరమహర్ష సమేతులై సూతునకు మఱియు నిట్లనిరి. ప్రహ్లాదుండు పూర్వ జన్మంబున నారాయణ నిష్ఠాపరుండై యుండి మఱియును 38

## బ్రహ్మ విద్యా రహస్యము

క. ప్రాజ్ఞుఁడు ప్రహ్లాదుం డన
నజ్ఞులకును బ్రహ్మవిద్య యది పుట్టెను న
త్యజ్ఞుఁ డగు దైత్యునకు శా
స్త్రజ్ఞుం డా ధీరుఁ డెట్లు జనియించెఁ దగన్. 39

క. ఇలలోన బ్రహ్మ విద్యా
కలితులకుఁ బునర్భవములు గలుగవు పరుఁడై
వెలయు హరి నెఱిఁగి మృత్యు
ప్రళయముఁ దాఁటునని శ్రుతి తిరంబుగఁ బలికెన్. 40

13. ఉదహరించెను 14. వేదపురుషుండేనెఱుంగుదు, 15. మచ్యుతనివలన గణభంగము,

వ. అట్లు ప్రహ్లాదుండు పూర్వ జన్మార్జిత బ్రహ్మవిద్య గలిగియుండియు దైత్య వంశంబున నెట్లు జన్మించె నా హిరణ్యాక్ష హిరణ్యకశిపులు మున్ను వైకుంఠ ద్వారపాలకులని నీ వలన వింటిమి. శ్రీ విష్ణు ధామంబు పునరావృత్తి రహితంబని పార్థసారథి "యద్గత్వాన నివర్తంతే తద్ధామ పరమం మమ" అని యానతిచ్చె "ఏష దేవోపమో బ్రహ్మపథానేన పరంగతా ఇమం మానవ మావర్తంతే'' యను శ్రుతి యున్నయదిగాన పునరావృత్తి రహితంబని పార్థస్ఫురద్ధాములగు వారికిఁ బునరావృత్తి యెక్కడిదియని కొందఱాడుదురు. కొందఱు పునర్జన్మ హేతువైన యా లోకము తత్వత్రయజ్ఞానహీనులై విష్ణు కర్మ నిరతులై పుణ్యఫల మనుభవించు వారికి భోగస్థానంబు గాని యప్రాకృత దివ్యధామంబు గాదని చెప్పుదురు. జయ విజయులు ద్వారపాలకులైన శ్రీ వైకుంఠము స్వర్గ మనిపించుకొనిన భోగస్థానంబుగాని యప్రాకృత దివ్యధామంబుగాదని కొందఱు చెప్పుదురు. జ్ఞానలోకం బయ్యేనేని త్రిపాద్విభూతి పాంచ భౌతికాత్ములైన సనకాదులకుఁ బ్రాప్యంబుఁ గాదదియునుంగాక యర్చిరాది మార్గంబున నాత్మబల విద్యా విశేషంబున, సప్తావరణంబు లతిక్రమించి విరజం దోఁగి పూర్వదేహంబులు వదలి లింగ విగ్రహరహితులై పీతవసనులై యమానవకర స్పర్శంబువలన నావిర్భూత స్వశక్తికులై పరమ వ్యోమంబునఁ బరమానందంబునఁ బరమాత్మతో నిత్యానవధికానంద భోగ మాత్ర సదృక్షత్వంబును, తద్దివ్య రూపానురూపానురూప మాత్ర స్వరూపత్వంబును బొంది స్వనిత్యదాస్యైక రసాత్మత్వాది సద్గుణంబులుం బరానవధిక స్వామ్యంబులు ననుభవింపుచుఁ దత్స్వభావానురూపైక ప్రీతికారితంబైన భగవన్నిత్యకైంకర్యంబునందు రమింపుచుం బ్రేమ గద్గదావలోకనంబుల నొండురులం జూచుచు నొకరొకరి విరోధింపక యుంద్రు. తల్లోకస్థుండైన యొకా నొకని కేనియు ద్రోహం బాచరింపరు. సనకాదు లా ధామంబున నుండి [16]ప్రత్యద్వారపాలకులతో నసూయపడి శాపం బిచ్చి రది యప్రాకృతంబగునే? ప్రాకృత లోకంబునుండి పునరావృత్తి గలుగుటం జేసి వారలకు విరుద్ధంబుగాదని కొంద ఱాడుదు రది మాకు సమ్మతంబైనను మాకు నడుగం దగినయది గలదది యడిగెదము. ఇంకను, 41

16. ప్రత్యద్వారపాలకులు

తే.గీ. భాగవత మందిరంబులఁ బరమశాంతి
గాని క్రౌర్యంబులేదు లోకంబునందు
సాత్వికోత్తమ మూర్తియౌ చక్రధరుని
పాదపద్మంబు లాత్మలోఁ బాయకున్న. 42

సీ. జగతిపై ఋషుల యాశ్రమపదంబు లశాంతి
గాని క్రౌర్యములేదు ధేనువత్స
హరిణవత్సంబుల నాఘ్రాణ మొనరించి
యాత్మవత్సలకోడ వ్యాఘ్రికాదు
లూధ స్స్రవద్దుగ్ధ మొయ్య నొయ్యన నిచ్చు
బ్రహ్మపుత్రులు శాంతిపరులు ఘనులు
సనకాదులత్యంత సాధులు వైష్ణవ
ద్వారపాలకుల నుద్ధతి శపింపఁ

తే.గీ. దగునె భగవన్నిరంతర దాస్యనిష్ఠు
లైన దౌవారికులు సనకాది సాత్వి
కోత్తముల కవమతిసేయ యుక్తమగునె
సంశయంబెల్లఁ దీర్పవే సాధువర్య! 43

మ. జలజాతాక్షుఁడు విశ్వమంతయు మనస్సంకల్ప మాత్రంబునన్
గలిగించన్ వెలయించ నొంచ నతిలోకంబైన సామర్థ్య మ
గ్గలమై చొప్పడి మించినట్టి హరి లోకైకప్రభుం డెట్లు నా
త్మ లసద్ధామమునందునుండి హరి మర్త్యశ్రీ ధరన్ నిల్చెనో. 44

సీ. పంచాననంబును బాంచజనము నైన
యాకార మేటికి హరి వహించె
నుక్కు కంబముననే యొప్పున నుదయించె
ద్విభుజుఁడై యున్న యాదితిజుగెల్వ
బహుబాహుఁడై యెట్లు పాటించె నివియు న
న్యంబులు నెఱిఁగించు మస్మదీయ
సందేహ విషమహీజముల నిశ్చయతపం
బున నోర్వ నీకంటె ఘనుఁడు గలఁడె

తే.గీ. ధన్యుఁ బౌరాణికమణి మీ తండ్రిఁ జూచి
హృషిత రోమాంకురములతో నెసఁగి రోమ
హర్షణాఖ్య [17](నా)సంగె నవ్యాసమౌని
యట్టి ఘనుని కుమారుండ వనఘ చరిత ! 45

క. నీవును నటువలెనె య(మిత)
పావనుఁడవు తత్వబోధ పరిశిష్ట శుకాం
తేవాసివి సులభము నీ
కా విశ్వప్రశ్ననిశ్చయంబు [18]మహాత్మా ! 46

తే.గీ. చెలఁగి నారాయణోదయాచలము మీఁదఁ
బ్రబలు తత్తత్వ నిశ్చయ పద్మమిత్రుఁ
డలరు భవదాది ధాతృపర్యంత విబుధ
విష్ణుపదగతదీప్తిచే వెలయు దిశల. 47

స్రగ్ధర :-

సూతాపుణ్య ప్రసూతా! సుచరిత భరితా!
శుద్ధసత్వోప దేశో
ధ్ధూతాభ్యాసక్రియావిస్ఫురిత బుధమనోం
భోజభావ్యంబు దుస్త
ర్కాతిస్ఫీతానువృత్యత్యవధివి పథ దూ
రాతిదూరంబునై వి
ఖ్యాతంబా తత్వబోధంబధితముగఁ జే
యంగ నీకంటె నేరీ ! 48

మ. శ్రుతికల్లోల సముద్గమోద్భట రసస్ఫూర్తిన్ విజృంభించి య
న్వితవేదాంత విచారసారమణియై విద్యానదీ విభ్రమాం
చిత(మా) సద్గురు సంప్రదాయ జలధిన్ శ్రీవిష్ణు శాస్త్రాంబువుల్
రతిమైఁ [19]గ్రో(లి) ఘనుండవైతివి చికిత్సాభావ మిష్టార్ష్ణవే. 49

---

17. నెసంగె (రోమహర్షణుఁ డను పేరు వ్యాసునకులేదు కావున నాసంగెగా మార్పు గావింపబడినది.)

18. మో 19. లె.

చ. నిగమ శిరోనిరూపణము నేర్పున నిక్కొనరించి హేయతా
విగళిత సద్గుణ ప్రథిత విష్ణు పదాంబుజ భక్తియుక్తిమై
పొగడిక నొందు మౌనిగణపుంగవు లాడిన ప్రశ్న భాషణం
బొగి విని కశ్యపోక్తమగు నుత్తర మక్కథకుండు నిట్లనున్. 50

సీ. అద్భుతంబౌర పూర్ణార్థులు ముక్త సం
శయులయ్యు మీరు సంశయమునందు
టంతయు లోకహితార్థమై విష్ణు పా
దాబ్జ సేవకులైన యట్టి మీరు
దక్కస్వార్థైక తత్పరులైన యా జను
లడిగెదమని యెవ్వరభిలషింతు
రవనిలోఁ బుండరీకాక్ష పాదాబ్జష
ట్పద చిత్తులగు బుధుల్ పరమనియతి

తే.గీ. బ్రహ్మ విద్యాప్రకార సంప్రశ్నమెల్ల
మీరలడిగిన కైవడిఁ దారునడిగి
సంశ్రయింతురు తత్త్రయీ సారసేవ
చేసిరో చేయకున్నారొ చిత్రమహిమ. 51

క. ధరమీరడిగిన గతి మ
ద్గురుఁడు గురుండైన యాత్మగురుపారాశ
ర్యరుచి విజిత సూర్య మహో
త్తర ధుర్యునుతించి యడిగెఁ దద్భ్రమ ముడుగన్. 52

తే.గీ. షడ్గుణైశ్వర్య సంపన్న! సాధువర్య!
వేద వేదాంత విద్యారవింద సూర్య!
ముక్త్యుపాయ ముఖద్వార మోహకాంధ
కార మెడలించి కరుణించఁ గదవె తండ్రి! 53

వ. భవాదృశ బ్రహ్మ విత్పాద పద్మసేవాసుధ లేక క్షామ మానసహంసు లైన వారికిఁ బ్రజ్ఞా జ్ఞప్తి పుష్టత యెక్కడిది. యజ్ఞాది శ్రుతివలన బ్రహ్మవిద్య కర్మాంగకంబె యని వినంబడియె. ఆ బ్రహ్మవిద్యకు

నశ్వంబునకు గమన సాధనంబులుంబలె బ్రహ్మవిద్యకు సర్వాపేక్ష యుంగలదని 'సర్వాపేక్షాచ యజ్ఞాది శ్రుతే రశ్వవత్'ని సూత్రం బొనర్చితివి. అయినను నొక సందేహంబుగల దడిగెద. 54

సీ. యాజ్ఞవల్క్యాదికులైన బ్రహ్మర్షులు
జనకాదులైన రాజన్య ఋషులు
ఘనతమై కర్మాంగక బ్రహ్మవిద్య ల
ధిష్ఠించి శౌరిఁ జెందిరి [20]క్రవ్యాద
వృత్రాదు లగు దైత్యపుంగవుల్ గోపకాం
తలు ముకుందుని మనస్థాయిఁ జేసి
కల్పితా కల్పాంగక బ్రహ్మవిద్య న
చ్యుత పదం బందిరి సొంపుమీఱ

ఆ.వె. కఠినులగు హిరణ్యకశిప హిరణ్యాక్ష
ముఖ్య రాక్షసులు నమోఘ నిత్య
భావనల నిషిద్ధ పద్ధతిఁ బాసి శ్రీ
పతిపదంబుఁ గనిరి పరమ నియతి. 55

సీ. అల హిరణ్యక హిరణ్యాక్షులు వాసుదే
వ ద్వారపాలకు ల్వారుపరమ
ధామంబునందుండి తలఁగి యధఃపాత
మందుట యేమి బ్రహ్మ తనుజాతు
లగు సాత్వికులు సనకాది యోగీంద్రులు
ప్రాకృతు లట్లు నే భగవదాప్త
దౌవారికులమీఁద దర్పించ నేటికి
శాస్త్ర విజ్ఞాన సంస్కారహీను

తే.గీ. లలుగఁ దగుఁగాక హరి భక్తులైన ఘనుల
యెడల సురద్రావి మాంసంబు లిచ్చు మెనఁగి
మద వికారముచేత నున్మత్తులైన
చెనటు లెట్లొనరించినఁ జెల్లుఁగాక. 56

20. క్రవ్యాధు.

క. అతి సాత్త్వికు లల్పకు లవ
మతి చేసిన నదె సహించి మన్నింతు రప
స్మృతి మంతుఁడెంత చేసిన
హితులగు వారలకు రోష మేగతిఁ గల్గున్. 57

క. భగవల్లోకంబునఁ ద
ద్భగవంతుఁడు భగవదాప్త పరిచారకులున్
భగవద్భక్తులకే వా
సిగవత్సకు మొదవు చన్ను చేపిన యట్లన్. 58

సీ. ఇటువలెనె యుండ నిందిరా నాయక
భక్తులై వెలసిన బ్రహ్మపుత్రు
లరుదేర వారికి నవమాన మొనరించి
నవమానమున నుండ నయమె యాత్మ
నఖిల కృత్యములు బ్రహ్మాధీనమని నమ్మి
యాశ్రమాంతరముల యందునున్న
యధిగత పరమార్థులైన వారలకు ను
ద్దీప్తమై మూర్తీభవించు శాంతి

తే.గీ. హరి పదంబున నుండుట యద్భుతంబె
శుద్ధ సత్త్వాబ్ధిఁ జంద్రమస్స్ఫూర్తి నొందు
పరమ విభుని మదమున కోపంబు నుగ్ర
శాపమును గల్గ నేర్చునే శాంతులకును. 59

మ అతి సందేహదవాగ్నిఁ దొట్రుపడి వేదాంతీభముల్ నేడు సం
తత సంతాపము నొందుచోట నితరుల్ తత్త్వజ్ఞలే తంద్రి యా
తత వేదాంతరహస్య నిశ్చయ సుధో ధన్వత్సుధాధామ య
ద్యత విద్యాహ్వాయచంద్రికా రుచిని మత్తాపంబు వారింపవే. 60

క. అని తనయుఁడు తను నడిగిన
ఘనుఁ డా మునివరుఁడు సుప్రకాశార్థముగా
విని హర్షగద్గద స్వన
మునఁ బల్కెన్ బాష్పపులకముల్ [21]తిలకించన్. 61

---

21. తిలకించున్.

## వేదాంత రహస్యము

క. పౌత్రుఁడవు పరాశరులకుఁ
బుత్రుండవు నాకవేదపుంజమవు దయా
పాత్రుఁడవు శక్తినప్త్రవు
చిత్రితమే నీకుఁ బల్కఁ జెల్లదె యిచటన్. 62

మ. అలఘుస్ఫూర్తి వశిష్ఠ వంశనిధి వీ వాత్మాను రూపంబుగాఁ
గళ లుప్పొంగఁగఁ బ్రశ్న చేసితివి సాక్షాద్బ్రహ్మవిద్యా సుధా
కలశాంభోనిధి వెల్లిగా సుతుఁడవై కైవల్యసీమా విశ్రం
ఖల సామ్రాజ్య విభుండవై పలికినం[22]గావే మహాహృద్యముల్. 63

క. నందనుఁ డెన్నఁడు నడుగఁడు
విందుఁడై నన్ను బ్రహ్మవిద్య యనుచు నే
సందేహింపఁగఁ బరమా
నందం బొనరించితివి మనంబున కనఘా! 64

క. భగవద్భక్తి పరాయణు
లగువారలు తండ్రికొడుకు లాత్మేశ్వర పా
ర్శ్వగులైన వారి కంటెను
మిగులం బ్రియతములు గుణ సమృద్ధి నుతించన్. 65

క శ్రుతు లన్నియును శిరస్స
మ్మితములుగాఁ జదివి ద్విజుఁడు మీమాంసాది
స్థితిచే శ్రీహరిఁ దెలిసిన
యతఁడుసుమీ తత్త్వవేది యనఁగ ధరిత్రిన్. 66

సీ. సత్సర్వగ సుఖ విజ్ఞాన స్వరూపుని
సర్వసాక్షి నకల్మష ప్రభావు
సతత చిద చిదాత్మ సకలవస్తు శరీరు
నఖిల కర్మావ బోధాధికారి
యోగ్యఫలప్రదు నుచ్ఛ్రిత వాత్సల్య
జలధి శ్రీపతి సర్వశక్తి నతి కృ
పాంబురాశిని మహోదారుని ననఘుని
సకల లోకారాధ్య చక్రహస్తు

---

22. గాదే

తే.గీ. సార సౌశీల్య గుణ సుధాసాగరంబు
శాంతు భగవంతుఁ బన్నగశాయిఁ గాంచి
భక్తి నాత్మఁదలంచి యాసక్తినెంచి
యున్న విప్రుని విప్రత్వ ముత్తమంబు. 67

క. సాంగోపనిషత్పూర్వక
ముంగావేదములు చదివి మురజిత్సేవా
సంగంబు లేని విప్రుఁడు
వెంగలి తజ్జన్మమెల్ల విఫలంబెంచన్. 68

తే.గీ. స్వప్రియునియందుబలె మహేశ్వరునియందుఁ
బ్రేమ గోపన మొనరించి యా మహేంద్ర
ముఖ్య దివిజుల కుపచారములు ఘటించు
బాహ్యవృత్తిని [23]శ్రుతి నతి భావమునను. 69

క. శ్రుతి నిరతము పరుఁడగు న
చ్యుతునందు నసాత్వికునకు నుల్లము నిలువన్
బ్రతినన్ సర్వామర సం
తతి కంతర్యామిఁగాఁ బ్రశంసించఁదగున్. 70

క. ఎవ్వని కెయ్యది హితమై
నివ్వటిలుం దాని నెఱిఁగి నిరత హితుండై
యవ్విధమునఁ బలుకుచు మన
ముప్పొంగారంగ మెలఁగుచుండఁగ వలయున్. 71

మ. జ్వరపూర్ణుండు నిజప్రియార్థ గుణసంభన్నౌషధం బిచ్చు శ్రీ
కర సద్వైద్యుని యౌషధంబు లతియోగ్య శ్లాఘ్యముల్ ద్రావి వి
జ్వరుఁ డౌనట్లు రజస్తమః కలిత సత్వస్వేష్ట దేవస్తుతిం
గురు రాట్సత్వ హితోపదేశ మహిమంగూడున్ మహాధామమున్. 72

23. శృతి,

సీ. సత్వ రజస్తమ స్సంజ్ఞికంబగు గుణ
త్రయముదాను ద్రివత్క్రృతమయి యున్నఁ
గుటిల రజస్తమో గుణముల గణసత్వ
సత్వగుణస్ఫూర్తి సంభవించు
నొకవేళ యది గాన నుత్కట సంసార
వర్తియయ్యును మోక్షవాంఛ సేయు
నా సత్వగుణమున నంతయు మోక్షోద
యంబైన సూరి జనంబు మోక్ష

తే.గీ. హేతు వడిగిన నుపదేశమిత్తు రార్యు
లందునకు మాట వేదంబె యనుచు[24]నంద్రఁ
గానవేద పథోపదేశాను వృత్తిఁ
దిరుగువారికి మోక్షంబు సిరి లభించు. 73

సీ. గురు తమోగుణ రజోగుణ సముద్రేక ద
శల్ప్రాప్తమై యున్న సంత్యజించి
సత్వవేశమున నాశ్వాసింపుదురు శ్రుతి
స్వార్థమౌ ననుచు నా జనులు స్వాత్మ
సమశీల గురుముఖాబ్జంబులవలనఁ ద
చ్ఛ్రుతిపరంపర బ్రహ్మ రుద్ర శుక్ర
వరుణాదిపరముగా వర్ణించఁగనివార
లందఱుఁ గర్తవేయని తలంతు

తే.గీ. [25]రంతరాత్మకు నెంచ నన్యామరత్వ
రూపములు వేఱుగా వని రూఢి మెఱయ
నాచరింతురు దేహాన్యమైన యాత్మ
దేహ మనిన తెఱంగునఁ దెలివిలేక. 74

చ. ధరపయిఁ బౌండ్రకుం డనఁగఁ దామస సాత్వికుఁడైన దైత్యశే
ఖరుఁడు ముముక్షుఁడై మహిమఁ గైకొని సత్వగుణోదయంబునన్
దిరుగుచు వాసుదేవ పరదేవుఁడ వీ వవతారమంది భూ
భరణ మొనర్చినాఁడ వని బాలురు వల్కఁగ సమ్మతించినన్. 75

24. నంద్రు
25. లంత.

క. చింతించి 'యచ్యుతో౽హమ
నంతో౽హం హరి రహమ్మురారి రహం శ్రీ
కాంతో౽హ'మ్మను నాతని
నంతం బందించె దానవాంతకుఁ డంతన్. 76

క. రాజులు నిజరాజ్యరమా
తేజఃకాంక్షులను గని వధించు పగిది ల
క్ష్మీజానియుఁ బరు లాత్మ
శ్రీజయ సంపదలు గోర శిక్షించు నిలన్. 77

క. భువిలో నంతర్యామి
ప్రవిశుద్ధాంత స్స్వరూపభావము లక్ష్మీ
ధవు స్వస్వరూపవిభవం
బవినీతుఁడు తనకు ననిన [26]నణఁగకయున్నే. 78

క. తనకుఁ దనునేలు స్వామికిఁ
బనుపడిన విలక్షణ స్వభావత్వ మెఱిం
గి నిరత మత్యను [27]కూలై
క్య నియతిఁ బాటించెనేని యాత్మజ్ఞులకున్. 79

వ వేఱైన వస్తువులకు నైక్యమనఁగా మనముల నన్యానుకూలములై యుండుటే, వస్తుద్వయ మొకటియై యుండుటగాదు. అది యెట్లంటేని. భేదముల్ వలికి వేదవాక్యములు నిరోధించుం గనుక విభిన్న వస్తుద్వయ మేకమనుట విరుద్ధము. వస్తుద్వయము వేఱేయనుట విరుద్ధము గాదు. జీవాత్మ పరమాత్మలకు నైక్యంబు చెప్పెడి వాక్యంబులకున్న భేదము చెప్పెడు వాక్యంబులకును నిటువలెనే యర్థంబు. అర్థ ప్రకరణ లింగౌచిత్య దేశకాలాదుల చేతంగాని కేవల శబ్దంబువలన నర్థంబు నిర్ణయము సేయరాదు. అది యెటువలె నన్న 80

## జీవాత్మ - పరమాత్మల యైక్యము

తే.గీ. కానుపించిన దంపతి కలహబంధు
కలహ భేదైక్యరూప వాక్యములువోలె
శ్రుతి సముదితైక్య భేదంబు లతిశయమున
స్వోచితార్థ గతంబులై యుండు నెపుడు. 81

26. యణగకయున్నె 27 కులై.

క. ప్రకట విభేదాభేదఘ
టక రూపశ్రుతులు నూత్కటంబుల మిథ్యా
రకములు తెలియందగునె
న్నికనని బోధాయనుండు నియతిం బలికెన్. 82

క. క్షితిలో నెంచ నభేద
శ్రుతియన్నిట నాత్మ భేదరూప నిషేధ
స్థితినున్న భేదవాక్యము
లతి బాధ్యతరంబులగుచు నడఁగక యున్నే. 83

వ. భేదాభేద ఘటక భేదంబునఁ ద్రివిధంబులైయుండు వాక్యంబు లటుగాన సమస్తావస్థ చిదచిద్విశిష్టతత్పరంబులైన యవి యభేద ప్రధానంబులు. విశేషణాది భేదోపజీవితంబులైన యవి భేదప్రధానంబు లిట్లని యెఱుంగందగిన యభిప్రాయంబు గలిగిన యవి ఘటకరూపంబులగు శ్రుతులు. హరికి సమస్త చిదచిద్వస్తు శరీరత్వాదికంబును బలుకు కల్యాణ గుణ తత్పరంబులైన యవి సగుణ వాక్యంబులు. హరికి హేయ గుణ రాహిత్యంబు పలుకునవి నిర్గుణ వాక్యంబులు. అట్లు గాకున్న నన్యోన్య కలహంబున నన్యోన్యతర బాధ్యత్వంబునఁ దద్వాక్యంబుల కగు నట్లౌటఁ దద్వాక్యంబులకు బోధనీయ భేద వివేచనంబు సార్థంబుగా నెఱుంగవలయు. ఈ మార్గంబున వేదాంత తాత్పర్య విషయంబని హరిని నమ్మియున్నవార లాత్మ సంతోషకులు. సర్వ భూతంబులును హరి శరీరంబులును దద్భూతహితైకరతులైనవారు విశ్వమూర్తికిఁ బరమ ప్రియులైనవారు తన్మనస్కులై తదాలాపులై తదీయ ప్రియసత్కర్ములై తదిష్టితములైన వారలు పరమ ధామంబున రమింపుదురు. 84

తే.గీ. శుకభవల్లీల వేదాంత సుఖ నిరూప్య
రమ్యతత్వత్రయేశ పరత్వ శుద్ధ
శేముషీయుక్తులై దయాశీలురైన
నాత్మ విద్యామృతాస్వాదు లగుచునుండ్రు. 85

శా. సంసారోగ్రతర జ్వరామయ భవస్ఫారైక తాపత్రయో
ధ్వంసోన్మూర్ఛితబుద్ధులౌ నరులకున్ స్వస్వోచితార్థగ్ర మీ
మాంసా కల్పిత తత్పరార్థధిషణామ్నాతంబుగా నుత్తముల్
సంసేవించి హితోపదేశ మొనరింపం జూతు రశ్రాంతమున్. 86

వ. అని మఱియు వ్యాసభగవంతుం డిట్లనియె. 87

తే.గీ. ఎన్నిక( దమోగుణంబుతో నున్న సత్వ
గుణముచే( ద్రోవ(బడిన తద్గుణ నిజ స్వ
భావమున సంచరింప నపార మహిమ(
దేజరిల్లునె విగత సందేహబుద్ధి. 88

క. ధర నీవతి శుద్ధాంతః
కరణుండవు సుప్రబోధ కలితు(డవు దయా
పరు(డవు విద్యాసుధ సు
స్థిర హృదయు(డ వగుచు( గ్రోలు చెప్పెద నింకన్. 89

## మోక్షోపాయతహితము

క. ఇతిహాస పురాణ విబ్బం
హిత సర్వోప నిషదు క్తి నిష్టార్థపరి
ష్కృతమై మోక్షోపాయత
హితమై మను బ్రహ్మవిద్య యిరు తెఱ(గులగున్. 90

వ. అది యెట్లంటేని. 91

సీ. న్యాసంబనంగ నుపాసనంబన(గ నా
రెండును దనరు నారెంటిలోన
న్యాసంబనంగ యాగాది సంజ్ఞికముపా
సనమన(గ (నది) ప్రజ్ఞాదికంబు
వేదో క్తములు న్యాస విద్యయే దేహంబు
నందు( బ్రాపించు( దదంతమైన
ఫల మిచ్చుచుండు నుపాసనంబునను బ్రా
రబ్ధ కర్మములు సర్వములు జనక

తే.గీ. ఫలమొసంగ దుపాసనా బంధకంబు
లెంచ( బ్రారబ్ధ కర్మంబు లిట్లు న్యాస
విద్య( బ్రారబ్ధ కర్మముల్ చోద్యమంద
నడ్డకట్టువు ఫల మిచ్చు నప్పుడవియు. 92

క. జర యగ్నిహోత్రమై తగు
మరణంబవభృథము న్యాసమతి నిష్ఠునకున్
బరికింప న్యాస విద్యా
పరిచితి వర్తింప క్షిప్రఫలము లభించున్. 93

మ. అల ఖట్వాంగుఁడు విష్ణురాతుఁడును నిత్యన్యాస విద్యాధిరూ
ఢులు వీరంచు నుతించి మౌనిసభ నార్యుల్మెచ్చఁగాఁ దత్త్వ వే
దులలో ముఖ్యుఁడవీవె పల్కితి కృతార్థుల్ గారె వారెన్నికన్
కుల శీలాద్యభిమాన సంపదల లోకుల్గాంచిరే మోక్షముల్. 94

వ. ఖట్వాంగుఁడను రాజర్షి ముహూర్తాయుః ప్రమాణం బెఱింగి సర్వంబు విసర్జించి హరింజెందె. పరీక్షితుండు సప్తాహంబు జీవితావధిగాఁ దెలిసి నిఖిలంబుం బరిత్యజించి యపవర్గంబుగాంచె నట్లగుట న్యాస విద్య సర్వఫల ప్రద. మఱియు. 95

క. ఆరయ భీష్మాదులు శ్రీ
నారాయణదేవుఁ గృష్ణు నానాబుధ లో
కారాధ్యు భక్తిఁ గొల్చి యు
దారంబగు పరమ ధామమందిరి వేడ్కన్. 96

వ. అనిన శుకుం డిట్లనియె. 97

సీ. భగవంతుఁడవు పరబ్రహ్మణ్యుఁడవు సం
పూజనీయ చరణాంభోజుఁడవు స
మిద్ధబుద్ధి ననుగ్రహింపుము నన్ను లో
కంబులో నెఱిఁగియుఁ గాముకుండుఁ
దలపఁడజ్ఞాన కుతర్క ప్రతారితుం
డై [28]దోషముం దెలియని జనంబు
లాడెడు చోట నే నడిగెద నీ ప్రశ్న
మీ యపరాధంబు లిటు సహింపు

తే.గీ. మిది రహస్యార్థ మనుచు నే మొదలఁ దలఁచి
యిదియ యడుగఁగఁ దలఁచితి నింతకంటె
నెద్ది ప్రశ్నాంతరంబు సమీప్సిత ప్ర
దాయకము నిత్యముక్తి ప్రదాయకంబు. 98

28. దోష మింతెని,

శా. పారాశర్య మహాముని ప్రవరరూప బ్రహ్మవిద్యా సుధా
పారావారమునందుఁ బుట్టి యతి విభ్రాంతాత్మ మోహాంధుఁ బా
తారంభంబునఁ జిక్కి యీ శుక కళాఢ్యత్ముండు శ్రీ విష్ణుఁడై
యారూఢాధిక సంశయుం డనఁగ నర్హాంబౌనె వర్తించఁగన్. 99

వ. అది గావున సంశయ మీ రీతి నణఁగు నా రీతిగా నానతిమ్మని మఱియు
నిట్లనియె. 100

సీ. దేవుఁ డెవ్వరుఁడు తద్దేవునకు రహస్య
మెయ్యది యది - - - - -
విననయ్యె నెఱింగించి ఘనమోహ మే రీతి
నణగు నా రీతిఁ జోద్యముగఁ దెలుపు
గురుఁడవు నేఁడు నాకురుశక్తితోఁ బల్కు
మశ్రద్ధ ధానుండు నజ్ఞుఁడును వి
మూఢుండు సంశయాత్ముండు నష్టుఁడటంచు
భక్తాబ్ధిశశిరమాభర్త యనియెఁ

తే.గీ గాన నాత్మ వినాశైక కారణంబు
మన్మనోద్దైన్య మణగించు మదిఁ దలంచఁ
దద్రహస్యోపదేశార్థ దాన మొసఁగి
శిష్యుఁడఁ దనూభవుఁడఁ బదసేవకుండ. 101

క. అని వినుతింపుచు నప్పుడు
తనయుఁడు వలుకంగఁ బలికె ద్వైపాయన స
న్మునివరుఁడు తద్రహస్యా
ర్థ నిమిత్త మహోపదేశ తాత్పర్యంబుల్. 102

## పరబ్రహ్మ రహస్యార్థము

మ. వినుమో పుత్రక! యేకచిత్తమున నీ విద్యా రహస్యంబు శి
ష్యునకున్ నమ్మికగల్గు వానికి గురుండోపున్ బ్రసాదింపఁ బా
వన మన్మత్కుల విత్త మీ ఘన[29]రహస్యంబీ మహావిత్తమో
యనఘా! నీకు లభించుఁ బ్రాప్యమనుభోగ్యంబున్ ఘనంబున్ దగన్.

---

29, రహస్తంబీ.

క. అని తనయుని నుల్లార్చుచు
మునిభగవద్దీసుధాబ్ధి ముఖ్యతర ప్ర
శ్న నిశాకరరుచిఁ బొంగఁగ
మునికొని హర్షంబు పూర్ణముగ నిట్లనియెన్. 104

సీ. ప్రథితేతిహాస పురాణోప బృంహితో
పనిషన్మతము పరబ్రహ్మ పరమ
ధామాక్షరాది పదవిశిష్ట సంజ్ఞక
మాగమేతరదూగమనఘ తరము
పారాతిగ గుణాబ్ధి యారూఢ దుస్తార్కి
కోలూక తర్కనేత్రోష్ణదీప్తి
యన ననాది త్రిగుణావ్యక్త సువ్యక్త
కాలవిలక్షణ కలితమై ప్ర

తే గీ. వర్తికారణమై యలభ్యమును నైన
పరమ పదవై భవామృతోత్కరకళాయు
తాయుతాశాంశదేశ మత్యద్భుత ప్ర
కారమున నెఱిఁగింతు విఖ్యాతి వినుము. 105

మ. అగణేయ ప్రళయార్కచంద్ర దహనోద్యత్తేజముల్ చూడఁ ద
ద్భగవద్ధామ నిరీక్ష సేయునెడ నల్పద్యోతఖద్యోతముల్
తగఁ బూర్జైత దనంతలోక మహిమోత్కర్షంబు వర్ణింపుచో
గగనప్రాకృత దివ్యలోక మహిమల్ కారాగృహ ప్రాయముల్. 106

తే.గీ. సాధు లప్రాకృతాకాశ చరవరాగ
జేయ జీవగుణమ్ముల నెమ్మిఁ జూచి
ప్రాకృతాకాశచర జీవలోకమేక
గృహ నివాసం బటంచుఁ దర్కించు కొంద్రు. 107

క. పరమవ్యోమము చూచినఁ
బరమ జ్ఞానులకుఁ దోఁచుఁ బ్రాకృతలోకాం
తర మెల్ల సూక్ష్మ సూచ్యాం
తర రంధ్రమువలె విచిత్రతరమై యంతన్. 108

సీ. తర్కించి చూడ విద్యాలోక పట్టణ
గ్రామవుం స్త్రీ సౌధ గజతురంగ
పశుమృగ ఖగవన పాథోధికాసార
కూప వాపీతటాకోపవన వి

హార పర్వతములు నన్యవస్తువులు బ్ర
హ్మానందమయము లత్యద్భుతములు
స్వస్వోచితాశేష సద్గుణ సామగ్రి
శాశ్వతంబై యుండు సంస్తుతింపఁ

తే.గీ. ప్రాకృతాప్రాకృతార్థ సౌభాగ్యమునకు
నంతరంగం బెంచికొన నెంతయైనఁ గలదు
తెలివి మెఱసిన సత్యావిదీప్సితార్థ
మానమింతింతయనుట క్రమంబుగాదు. 109

ఆ. వె. తత్పదస్థ విషయతతులెల్లఁ బ్రాకృతా
ర్థములయట్లు [30]మోహితములుగావు
పూతహృదయులెంచ నేతత్స్వభావవి
ద్యోతకంబు లగుచునుండుఁ గాని. 110

సీ. స్వాభావికాద్భుతాంచ దపార సౌందర్య
వరసుధా సింధు భావమునఁ దనరి
శ్రీశానుకూలైక్య శీలభోగంబులఁ
దత్పద ద్రవ్య సంపద లొసఁగుట
చిత్రంబుగాదు విచిత్రముల్వస్తుశ
క్తులు సర్వభావ శక్తులు నచింత్య
సంతతజ్ఞాన గోచరములు గొన్ని వ
స్తువులలోఁ గొన్ని వస్తువులు కొంద

తే.గీ. ఱకు మనః ప్రియములుగొందఱకును విరతి
పుట్టఁగాఁ జేయు జడములై భువనములును
పరమపద లోకనిత్యాత్మ భాగ్య మహిమ
యజహరాదులకైన శక్యంబె పొగడ. 111

వ. "అత్రాయం పురుషః పరంజ్యోతి రూపం సంపద్య స్వేనరూపేణాభి నిష్పద్యతే" [31]అవహతపాప్మా విజరోవ మృత్యుర్విశోకో విజిఘత్సో విపిపాసన సత్యకామ సత్[32]సంకల్పయనునవి యప్రాకృతలోకముం బొందిన ముక్తజీవునికి నష్ట గుణంబులు సంపన్నంబులై యుండును. మఱియు ప్రకృతి శరీర తిరోధాన పూర్వకంబగునది జ్యోతిరన్వయము.

---

30. మోహాతములు 31. యవహతపాప్మా 32. సకల్ప

అదియె ముక్తి. [33]అంతర్యామి స్వరూప మాత్రంబు ముక్తిగా దెన్నఁ దదన్వయంబు గలుగుటంజేసి యదియెట్లన్న భూస్థితంబులైన పక్షులు తమకు నపూర్వప్రాప్తములైన యద్రిశృంగంబులు నిజోపాయంబున నెక్కఁగతినప్రాప్త్యూర్ధ్వగమనంబునకు న్యాసోపాసనంబులు సాధించి యవిద్యా జనిత దేహ సంబంధముం బాసి యపూర్వ పదంబు నొందుట యా పరంజ్యోతి సంబంధము. 112

తే.గీ. తెలివగఁ ద్రిపాద్విభూతి నతిక్రమించి
యే పురుషుఁడుండు శుద్ధ సమిద్ధ మహిమ
నాతఁ డాద్యుండు పరమాత్మ యవ్యయుండు
ఘనతరుండు పరంజ్యోతి యనియె శ్రుతియు. 113

తే.గీ. ఘనతరాత్యుక్త మూర్ధ్వ లోకములనెంచ
విశ్వతః పృష్ఠమై మహావిమలమై ప్ర
సన్నమై మించు వైకుంఠ సంజ్ఞవిష్ణు
దేహమనఁగఁ బరంజ్యోతి తెలిసి చూడ. 114

వ. అవధీరిత కందర్పకోటి లావణ్యంబు నగణ్యంబును స్వాభావికా నవధి కాసంఖ్యేయ స్వగుణోల్లసితంబును భావపంకిల సద్రత్న విమలా కరణౌషధంబును జేతస్తే నిశేశిత్వావిర్భావాద్భుత భేషజంబును శ్రీశ స్వాభావికాశేష శేషిత్వానుభావావహంబును శేష శేషి స్వభావానుభవ ప్రీతివర్ధనంబును దత్ప్రతికారితాశేష తత్కైంకర్యక సాధనంబును, శేషస్వభావానురూపవృత్తి ప్రీతేశ దర్శనంబును దద్దర్శనమహాహ్లాదా మృత సంప్లవనావహంబును శ్రీ సశేషత్వాధిగతజన నిత్యానంద దాయకంబును నగు పరతత్వం బెఱింగి దర్శన ప్రవేశనంబు లొనర్ప నెవ్వ రుత్సహింతురు వారు శూరులు. ఆ శూరులు తద్విద్యా ప్రభా వంబున నర్చిరాది మార్గంబునఁ బరంజ్యోతిం గాంచి తత్ప్రసక్తిచే నిత్యనిర్వృతులై యావిర్భూత స్వరూప స్వభావులును స్వాత్మేశ దర్శనులును దద్దర్శన సముద్దేశ కైంకర్యేచ్ఛాత్త విగ్రహులును దదను రూపాభిమత దివ్యాలంకార సింధువులును హేయ నిష్యందరహితులును హేయాహ్లాద వివర్జితులును దద్బ్రహ్మలోక విషయాభోగోద్రిక్తేశ భక్తియుక్తులును ననాది నిధనానందమయ నిత్యాత్మ సహచరులును దత్ప్రతికారితాశేష తత్కైంకర్య రసార్ణవంబులును; బరబ్రహ్మాత్మ

33. యంతర్యామి

భూత తదో్వ్యమోజ్జ్వలతల్లోక నివృత్పురవరాదిస్వాత్మారామాను
[34]మో(దను)లై యుండుట వేదాంత సిద్ధాంతోత్థిత వైభవంబు పరవ్యోమ
లోకంబు నుతింప నెవ్వఁడు సమర్థుండు ? 115

మ. వరవిజ్ఞాన రహస్య వాసనల భావ్యంబై మహద్ధామ వి
స్ఫురదానందద లోకమండలఘనౌజోరాశియై ఫుల్ల నీ
రరుహాభంబగు నంతరాళమున సారంబైన వైకుంఠ స
త్పురమొప్పున్ నవకర్ణికాకృతిఁ దదాప్తుల్చూచి వర్ణింపఁగన్. 116

తే.గీ. అమిత జనపద వరవైభవాన్వితంబు
నతి విపుల మండలమునైన యప్పురంబు
కమలకర్ణికయనుబోలి కానుపించెఁ
బురములెన్నేని దళములై పొలుపు మెఱయ. 117

తే.గీ. గురుపరవ్యోమధామ వైకుంఠలోక
మునకు నావరణములేను ఘనతమెఱయ
నిత్యశుద్ధసుఖాత్ములై నివ్వటిల్ల
బ్రహ్మలోకంబు లెన్నేనిఁ బ్రబలునందు. 118

వ. అని వ్యాసభగవంతుఁ డానతిచ్చినఁ శుకుం డిట్లనియె. 119

క. ఏ యే యావరణంబుల
నే యే లోకంబు[35]లుండు నెఱిఁగింపుము నా
కా యుపనిషదుక్తుల విని
యాయజముఖ్యులు నిజాలయస్పృహ విడువన్. 120

## పంచావరణాగణ్య నియత లోకములు

క. అనిన విని యక్కుమారున
కనఘాత్ముండగు పరాశరాత్మజుఁడు ననా
తన పంచావరణాగ
ణ్య నియత లోకములఁ గొన్నినయమునఁ బలికెన్. 121

సీ. ప్రథమావరణమునఁ బ్రాచిమై వైకుంఠ
వైభవంబునమించు వాసుదేవ
లోకంబు రవిగణాలోకమై భృత సాధు
వారమై విమల నానారసాబ్ధి

34. మోనై. 35. లొండు.

పరిఘమై నానావిభాసిత నవరత్న
శైలమై నానాప్రసన్న శిల్ప
పాదపంబై యతిభవ్య నానాజన
పదమునై నానావిధానమాన
గ. నగర నానాచతుర్దంత నాగ వాయు
వేగ నానాహయానేక విపులహైమ
శృంగ నానార్ధధేనువై సిరి వహించి
[36]... ... ... ... ... ... 122

దండకము :—

మఱియు మఱియుఁ దివ్యలోకంబు వర్ణింప శక్యంబె ? క్రీడా మృగంబుల్ ఖగంబుల్ శ్రుతుల్ విశ్రుతుల్గాఁ బఠింపంగ బుంస్త్రీమణీ చిత్ర సౌధోరుకేళీగృహారామ హైమాంతరాళ ప్రభల్ మించఁ దద్బ్రహ్మ విద్యానవద్యామృతానంద నందత్సుధావాహినీ సత్ప్రవాహాంతరంబుల్ చెలంగంగ [37]రాజత్తనూకాంచి సౌందర్యముంజూచి లక్ష్మీశ సద్భక్తులుం జిత్తమెట్లుండునోయంచు భీతిల్లి రంజిల్లు తద్వివ్యదాకార రేఖావిలాసాప్సరోబృందముల్ సంతతానందకందంబులై మించఁ దద్విభ్రమాలోకనోద్బుద్ధ లక్ష్మీశ సద్భక్తి పుంవర్గముల్ మీరఁ దద్దివ్యపుంవర్గ లక్ష్మీశ కైంకర్య సౌభాగ్యముల్ చూచి యుద్బుద్ధమై నిత్య సూరి ప్రసన్న స్ఫురద్భక్తి సంపత్సుధాధార లుప్పొంగఁ దల్లీలలన్ నిశ్చలానంద సంభూత సాకారసామగ్ర గీతామృతంబుల్ ప్రవాహంబుగా నిండఁ దత్సామగీత స్వకర్ణోద్వృత్తభక్తి స్ఫురత్కీరశారీపికోద్యద్వచః కూజితాలాపముల్ పిక్కటిల్లన్ సదాచార్యుఁడుం బోలె శ్రీశాంఘ్రి భక్తి ప్రకాశంబు గావింపుచుం బ్రహ్మవిద్యా ప్రసన్నేశపూర్ణ ప్రసాదంబునుం బోలె మోహంబు భేదింపుచున్ మోహ విధ్వంసముంబోలె నారూఢ సంసారతాపౌఘ శీతాంశువై సొంపు గావింపుచుం దద్భవాపాయముం బోలె లక్ష్మీశ సేవా సుధోజ్జృంభ మేపారనేవంవిధాజన్మ సిద్ధాగణేయాతి రాజద్గుణాంభోధివై యాజన్మ సిద్ధోత్కటాత్మానుభూతిం బ్రవర్తించి తా నాత్మబోధార్కుఁడుం బోలెఁ తద్వాస్తవాకార సందర్శకత్వంబు సంధించి యాత్మేశ శేషత్వశేషిత్వ సంబంధవద్వాస్తవాకారధీ గోచరంబైన సాక్షాత్కృతి స్ఫూర్తియుంబోలె లక్ష్మీశ సేవా సుధోజ్జృంభ

36. నాల్గవ పాదములేదు. 37, రాజిత.

మేహార సేవంవిధాజన్మసిద్ధా గణేయాతి రాజ ద్గుణాంభోధి వైవాసిత ద్వాసుదేవాగ్రలోకంబు రాణించు సాక్షాత్సుఖోపాదక శ్రీలఁ దన్మధ్య దేశంబునన్ నొప్పు మధురనగరీరత్న మారాధ సంఖ్యేయ స్ఫురద్రత్న సారావళీ మూర్తులం బ్రోల్ల లత్తోరణోద్యత్కవాటంబులన్ శుభ్ర లీలా భ్రవర్ణంబులై నిత్యముక్తేందు బింబంబులుంబోలెఁ బాటిల్లుతత్స్ఫాటిక స్ఫూర్తులుంగల్గు తద్గోపురంబుల్ మణీహాటక శ్రీలఁజూపట్టు రత్నావళీ హర్మ్యజాలంబు నిండార దీపించుఁ బ్రాకార చక్రాంతరాళాన్వితానల్ప కల్పద్రుమారామ సామగ్రియున్ సాంద్ర చంద్రోపలానేక కేళీ గృహానేక శైలాలియుం జారుతీర స్ఫురద్రత్నరంభా విజృంభంబులై నవ్య చామీకరాంభోజ జాలంబులై, విభ్రమ భృంగ సంగీత రాజన్మణేహల్ల కౌఘంబులై తన్మహాలీల నీలోత్పలాకర్ణ పూరంబులై తత్సుధా ధామ శుభ్ర ప్రవాహంబులై సంతత స్వచ్ఛ మత్స్య ప్రకాండంబులై భవ్య దీవ్యత్పరబ్రహ్మవిద్యా వధూసేవ్య లక్ష్మీ మహేశాన మూర్తుల్వలెన్ వింతలై యుండి యాత్మ శ్రుతి శ్రుత్యధిష్ఠానమాత్రాభిభూతైకమందాకినీ కీర్తి సౌరభ్య సంపూర్తి గాన్పించి శ్రీ వాసుదేవానుకూలైక్య రుచ్యర్థ యాదోగణాపూర్ణ భాగంబులై యుండి కూజిల్ల నచ్ఛక్ర చక్రాంగ ముఖ్యంబు నీ దోద్భవాకీర్ణతీరంబులై భాసుర స్వర్ణమాణిక్య సోపాన లక్ష్మి న్విజృంభించు కాసారముల్ తోరమై మించఁగా నిత్య[38]ముక్త్య వ్సరస్నిద్ధ సంబంధమై తేజరిల్లంగఁ దత్పట్టణాలంక్రియా రూపమై మధ్యభాగంబునంగల [39](యా)రామ ముద్య(ద్రు)[40]చిన్మించి సౌందర్య మున్ విశ్వరూప ప్రభావంబునుం గల్గి విష్ణుండు తేజంబుతోనుండు శుభ్రాంశు కోటిస్ఫురత్సౌధవారంబు లా రాజధానీ రమాకాంత కాత్మీయ సౌభాగ్య మర్పించు నేతత్పుర శ్రీసముద్భూత నానామణి జ్యోతి రుల్లానమభ్రంబుపై నిండి యూర్ధ్వస్ఫుర న్నూత్న తేజోజగచ్ఛంక గావించు నేఁ డొక్కచో నింద్రచాపంబు లెన్నేనియుం గూడి నందత్పురీ నూత్నరత్నావళీ వ్యోమయానంబులం బోలఁగాఁ జాల నవ్వీటిలోనన్ మృగంబుల్ ఖగంబుల్ సదాపుం వధూసంచయం బాదరింపన్ దద గ్రంబునన్ విష్ణు చేష్టానుకారంబపారంబుగాఁ జేయనో మాధురా మాధురోల్లాన ఈశానుభూతిక్రియాశర్మదాయావదాత్మ్యంబు మాకుం బ్రసాదింపవే యంచుఁ దన్మంగళా శాసనం బింపుతోఁ జేయువా రెవ్వ రాయుత్తముల్ హేయనిష్యంద దూరాత్ములై హేయ భోజ్యంబులుం బాసి బ్రహ్మామృతానంద రూపేంద్రియార్థానుభూతిన్ విజృంభించి శ్రీశాసనాంభోరుహ శ్రీవికాసైక సేవాఫలప్రాప్తిమైనున్న తత్ప్రీతి రూపా

---

38. ముక్తేస్నర స్నంధ 39. ....., 40. ద్రుచి

మృతానందముంజెంది తత్సపర్యంతరాలం క్రియా పూర్ణహస్తాబ్జులై సేవ గావింప నూహించితచ్చేషతైక స్వభావానురూపాత్మవృత్తిన్ సదా వాసు దేవాంతరం గానుకూల స్వరూపంబులన్ నిల్చి ప్రాసాద సౌధావరోధ స్థలీ వీథులందున్ విశేషంబునన్ రత్నవల్లీ శలాకోపక్లప్తోరు సన్మార్జనీ హస్తులై కొంద అచ్చోటు దారూడ్చుచుం దద్రజోరంజితాకారులై కొందఱింపొందఁగా నుంద్రు తీడించి శుంభన్మణీశాతకుంభస్ఫురద్గంధ గంధోద్భటాంభోలవంబుల్ సమంతాద్విజృంభంబుగాఁ జల్లుచున్ గొంద ఱుత్సాహముం బొంద ముక్తామణీ చూర్ణముల్ తెచ్చి చూర్ణంబుగా స్వస్తికాదుల్ ప్రశస్తంబుగాఁ బెట్టి తద్రంగవల్లీ కలాపంబుఁ గావింపుచుం గొంద ఱుద్దీప్తులై యుంద్రు మాణిక్యమాల్యాంకురార్ద్రాశ్రికరశ్రీలు తత్ప్ర దేశంబులం జల్లుచుం గొంద ఱానందులై యుంద్రు రత్నప్రదీపంబులుఁ బుష్పముల్ సత్ఫలంబుల్ సమగ్రంబుగాఁ జందనాంభస్సమాపూర్ణ కళ్యాణ కుంభంబులేవంకలన్ నిల్పుచున్ గొంద ఱుప్పొంగ నానామణీ రూపరంభాది పుణ్యద్రుమంబుల్ బహిర్ద్వారసీమన్ నియోగింపుచుం గొంద ఱానందముం జెంద శ్రీవత్సవక్ష స్స్ఫురద్వైజయంతీ కలాపం బుతో నవ్య ముక్తామణీ ధామకాలంకృతాజ్జోరు కంఠంబుతోఁ జారు శోణాధరాపాటల ప్రస్ఫురద్దంతరోచి ప్రభిన్నస్మితాపాంగ వీక్షా విలా సంబుతో మాంసలాంసాను[41]రూపాయిత ప్రస్ఫురత్కర్ణపాళీ విభూషా పరామృష్ట[42]గండస్థల శ్రీలతో నూత్న కర్పూర గంధాన్వితోచ్ఛ్వాస [43]పూర్ణోత్తరోష్ఠోచితోత్తుంగ నాసా విలాసంబుతో మందహాసంబుతో సద్విశాలాయతాపాంగవీక్షామృతోల్లోల జాలంబుతోఁ దత్కళాపూర్ణ సౌందర్య నిర్యన్మరంద ప్రసక్త ద్విరేఫోపమానాలక శ్రీసమాజుష్ట భవ్యాననచ్ఛాయతో నవ్యకుసుమ ధమ్మిల్లభారంబుతోఁ గాంతి పుంజీ భవద్రత్న రాజత్కిరీటంబుతోఁ జిత్రవైడూర్య రాజన్మహాకుండల శ్రేణితో నూర్ధ్వపుండ్రంబుతోఁ గంఠభాగోల్ల సత్కౌస్తుభస్ఫూర్తితో దివ్య నానాయుధోదార బాహాచతుష్కంబుతో భవ్యయజ్ఞోపవీతోరు హారాళితో హైమభూషా కదంబంబుతోఁ దప్తచామీకరాభాంశుక స్ఫూర్తితో రమ్య పీతాంబరా నద్ధసద్రత్న కాంచీవిశేషంబుతో మంజు మంజీరపాదాబ్జ తేజంబుతో నద్భుతాగార శృంగారపూరంబుతో సూరి వర్యాగ్ర శ్రీ దృక్చకోరామృత ద్యోతకాంతీ ప్రవాహంబుతో మించు కల్యాణమూర్తిన్ విలోకించు పాలించు నవ్వాసుదేవున్ నిరీక్షించి శ్రీమద్వికుంఠాధినాథుండు తా నిత్యముక్తాళితోఁ జాల మోదించు దద్వా సుదేవైక లోకంబు చక్రాంకితుల్ చేరి సేవింతు రెల్లప్పుడున్. 123

41. రూయత 42. గంధస్థల 43. పూర్ణోతరోష్టాచితోత్తుంగ.

## వైష్ణవుల వైశిష్ట్యము

క. తనువునఁ జక్రాంకము సే
యని మనుజాధములు గలుగు నావేశము లెం
చన వైష్ణవములు దద్దే
శ నివాసుల వైష్ణవులు నసాత్త్వికు లెంచన్. 124

సీ. ఉరు శుద్ధసత్త్వమయుండు విష్ణుఁడు విష్ణు
భక్తులు సాత్త్విక ప్రవరులా ర
జస్తమోమయ దేవ సముపాసన మొనర్చు
వారల సాత్త్వికుల్ వారి యిండ్ల
నాపద వచ్చిన నన్నపానాదులు
వలువదు భుజియింప వలసెనేని
యతఁ డధఃపాతంబునందు నూర్ధ్వపదాను
[44]గతుఁడు విష్ణుండు లోకములు నట్లె

తే.గీ. యుచ్చతరము లధఃపాత మొనరఁ జేయు
సకల దుఃభోగములు నవైష్ణవ జనాన్వ
యంబు నట్ల నధఃపాత మనన వైష్ణ
వాన్వయంబు జగంబుల నరసి చూడ. 125

క. నందీశ్వర శాపంబున
నిందింతురు భాగవతుల నీచాత్మకులై
కొందఱు విప్రులు వారికి
సందిగ్ధమెదంబెడంద సద్దండనముల్. 126

తే.గీ. వరగుణాధికులైన యా వైష్ణవులకుఁ
బ్రాతికూల్య మొనర్చిన ఫల మగమ్య
మైన దారిద్ర్య మిది చాల ననుభవించి
మఱియు నట్ల యొనర్తు రున్మత్తులగుచు. 127

క. తగునే విని సహియించుట
భగవద్భాగవత నింద పాపిష్ఠులు త
ద్భగవద్ద్రోహులు వారలె
యగుదురు మఱి వారికన్న నన్యులు గలరే? 128

---

44. గతులు.

క. హరి నిందసేయు పాతక
వరు లుండినచోట నరక పదమాక్షిత్రాం
తరమునను శుద్ధ వైష్ణవ
వరులు నిమేషాంతరంబు వలవదు నిలుపన్. 129

తే.గీ. ధర న సాత్త్విక దేవ ప్రధానమైన
యదియసాత్త్విక తీర్థమౌ నందునుండఁ
దగదు సాత్త్వికులకు విష్ణుధామ మెద్ది
యదియె సర్వప్రదము తగునందునుండ. 130

సీ. తదధీనవృత్తిమై దనువు గల్గిన యన్ని
నాళ్లు శ్రీహరి సేవనం బొనర్చి
సౌఖ్యంబు నొంది యసాత్త్విక దేవతా
భజనంబు చేసినఁ బాయు సత్త్వ
గుణ మెల్ల నా సత్త్వగుణము పోయిన నధః
పాతంబునందు దుష్పాతకముల
వైష్ణవవర్యుఁడ వైష్ణవ సంవాస
సంభాషణముల దోషంబుఁ గాంచు

తే.గీ. శ్రౌత కర్మంబు స్మార్త కర్మంబు నడుపు
నయ్యనూచానుఁ డగు విప్రునైన వైష్ణ
వాన్వయునిఁ గానివానిఁ గల్యమునఁ జూచి
చన దసాత్త్వికునకు నమస్కార మెనఁగ. 131

క. వైష్ణవుఁ దెగడిన నెదుట న
వైష్ణవుఁ గని మ్రొక్కినన్ భవధ్వంసకుఁడౌ
విష్ణుని నిందించిన యన
హిష్ణుఁడు వాఁ డెంచఁ బతితుఁ డేమనవచ్చున్. 132

చ. హరి భజనంబు సేయక దురాత్ముఁడసాత్త్విక తత్త్వదేవతాం
తర భజనంబుఁ జేసి వసుధాస్థలి నంత్యజుఁడై వసించు దు
శ్చరితుని వానిఁ జూచినను సమ్మతి నంటిన మాట లాడినన్
నరు లొక వైష్ణవుంగని ఘనస్థితి మ్రొక్కి స్పృశింపఁగాఁ దగున్. 133

తే.గీ. యముఁడు సర్వ స్మృతేతిహాసార్థ తత్వ
వేదియగు వైష్ణవాగ్రణి విష్ణు లాంఛ
నాన్వితుఁడు నా కుపాస్యుఁడౌ ననుచుఁ బలికె
సంభ్రమంబున నిజభట జనులతోడ. 134

చ. శమనుఁడు బాహుమూలములఁ జారు సుదర్శన పాంచజన్య చి
హ్నములు ముకుంద నామములు నాలుక రమ్యతరోజ్వలోర్ధ్వపుం
డ్రము నుదుటం గళంబున స్ఫురద్విచల న్నలినాక్ష మాలికా
కముగల వైష్ణవుంగని ప్రగల్భమతిన్ నుతిసేయు సుస్థితిన్. 135

వ. ఇది మొదలుగా నే తద్వాక్యోప బృంహిత మహోపనిషదా ద్యుపని
షత్తుల యందును హరి లాంఛనంబు వహింపఁగా వలయునని వినం
బడియె మరియు. 136

## హరి లాంఛన వివరణము

శ్లో. దక్షిణేతు భుజే విప్రోభిభృవద్వై సుదర్శనమ్
సవ్యేతు శంఖం బిభృయాదితి బ్రహ్మవిదో విదుః 137

శ్లో. ధృతోర్ధ్వ పుండ్రం కృత చక్రధారీ
విష్ణుం పరంధ్యాయతి యో మహాత్మా
స్మరేణ మంత్రేణ సదాహృది స్థితమ్
పరాత్పరం యన్మహతో మహాత్మమ్॥ 138

సీ. క్షితి సురోత్తముఁడు దక్షిణ భుజమున సుద
ర్శనము నా వామ భుజంబునందు
శంఖంబుఁ దాల్చుట చనునని బ్రహ్మ వే
దులు పల్కుదురు భక్తితోడ నూర్ధ్వ
పుండ్రంబుఁ జక్రంబు పూని సద్గుణ మహి
యస్త్వంబునొంది సమగ్ర శక్తిఁ
బరఁగు విష్ణుని [45]పరాత్పరుని హృదంతర
స్థాయిఁ గావించి సంతతము మంత్ర

45. పరాపరుని

తే.గీ. మున స్వరమ్మున ధ్యానించి వనజగర్భ
శంకరేంద్రాదులకు[46] లేని సకలపూర్ణ
పరమ ధామంబుఁ గాంతురు పరమ ధామ
భూమమానిత్యశూరులు పొగడికొనఁగ. 139

వ. మఱియుఁ బురాణోత్తరంబులం బలుకంబడియె. 140

తే.గీ. వహ్ని సంతప్త చక్రంబు వైష్ణవాగ్ర
వరుని శోధించి తద్భుజద్వయము నందు
మూలముల చిహ్న మొనరింప మూల మఖిల
వర్ణముల కచ్యుతావాసవాసములకు. 141

వ. మఱియు భగవంతుఁ డానతి యిచ్చిన యూర్ధ్వపుండ్ర ధారణ
క్రమంబు వినుము. 142

తే.గీ. అమలమును బార్శ్వమూలాగ్ర మధిక ఋజువు
లైన పుండ్రంబు మత్ప్రియం బగుటఁ జేసి
యట్టి విమలోర్ధ్వ పుండ్రముల్ సాంతరములు
గా నొనర్చిన నాకు [47]నా గాములగును. 143

క. అచ్ఛిద్రకోర్ధ్వ పుండ్రం
బిచ్ఛావిధితో వహించు నెవ్వఁ డతం డా
పచ్ఛటలం బొంది సదా
విచ్ఛిన్నాఘనిరయైక వింశతి మునుఁగున్. 144

శా. దండాకారము నూర్ధ్వపుండ్రము సముద్దండంబుగా భూసురేం
ద్రుం డత్యుత్తమశీల వైష్ణవ కులాగ్ర్యుండైన సచ్ఛిద్రమై
యుండన్ బూరమతిన్ నమోంతములుగా యోజించి లక్ష్మి కళ
త్రుండౌ మేలనఁ గేశవాదులకు ధారూఢిన్ వహింపన్ దగున్. 145

తే.గీ. భూమి నచ్ఛిద్రముగ నూర్ధ్వపుండ్రమే ద్వి
జాధములు దాల్తు రచ్చోట హరియు సిరియు
నధివసింపంగ మీరు వా రతి విమూఢు
లైహికాముష్మిక సుఖంబు లందలేరు. 146

---

46. క. 47. న.

ఆ. వె. అంతరాళ యుక్తమగు నూర్ధ్వ పుండ్రంబు
నడుము శ్రీ నికేతనంబు కమల
హస్తఁ దలఁచి యచట హారిద్ర చూర్ణోర్ధ్వ
రేఖ నిలువఁ దగు హరి ప్రియుండు. 147

క. ఏవం విధ భగవచ్ఛి
హ్నావిర్భావమున వచ్చు హరి కైంకర్య
ప్రావీణ్య గణ్య వైదికు
శ్రీవైష్ణవుఁ గాంచి వినుతి సేయఁగ వలయున్. 148

క. చిదచిద్వస్తు శరీరిన్
హృదయస్థు రమేశు నీశు నెఱిఁగి హితార్థ
ప్రదుఁడైన వైష్ణవోత్తము
పదములు సేవింప ముక్తిపథము లభించున్. 149

## వైష్ణవ ప్రతికూలానుభయ భేదములు

సీ. గురుభక్తిమైఁ బ్రతికూలాను కూలాను
భయ భేదముల నేరుపడిన చేత
నుల నెఱింగి సుధీజనుండు నిజాధిక
రోచితంబుగఁ దగు నాచరింప
నుపనిషన్మత వాక్య యోజన నూహించి
హరి సమాధిక రహితాత్ముఁ డనిన
మునుకొని దుర్మానమున సహింపని వారు
ప్రతికూలు రత్యంత భవ్యవృత్తి

తే.గీ. నది సహించిన ననుకూలు రాత్మవేదు
లవియు రెండు నెఱుంగక హరి తదన్య
దేవతాతుల్యు లనుచు బుద్ధిం దలంచు
నట్టి నీచాత్ముల నుభయు లవనియందు. 150

చ. గొనకొని మున్ను మున్నె ప్రతికూలురఁ జూచిన భీషణాహులం
గనిన తెఱంగునం దొలఁగఁ గాఁదగు నయ్యనుకూలురం బ్రశో
భన కుసుమాళి గన్గొనిన బాగున రంజిలఁగాఁ దగుం ఘనుం
డ నుభయులం గనుంగొని తృణాగ్రములంచుఁ దలంపఁగాఁ దగున్.

తరల. క్షుధితుఁడైనను రాజపుత్రుఁడు ఘోర వైరి గృహాశనం
బధిగమింపని యట్ల వైష్ణవుఁ డార్తుఁడై ప్రతికూలురన్
మధు విరోధి విరోధులన్ మదమత్తులన్ భజియించి తా
నధిక సంపద నందఁగాఁ దగదండ్రు తత్త్వ విదుత్తముల్. 152

తే.గీ. ఒనర నీశానుకూలురై యున్న సాధు
జనులఁ దచ్చిత్త విక్షేప శంకఁ జేసి
రూపణీయ స్వభావాను రూప భోగ్య
భోగములకు నిరోధింపఁ బూనఁదగదు. 153

క. నిపుణుండను భయ సంపద
నుపజీవించు[48]కొను యనికి యొప్పదు విష్ణుం
డపరిమిత విభవుఁ డాశ్రితుఁ
గృపతో రక్షింపఁడే యకించనుఁ డగుటన్. 154

క. దాసానుదాస రక్షా
భ్యాసముగల హరి యుపేక్షయందునె చిత్తో
ల్లాసమున నమ్మియుండుట
దాసులకుం దగుఁ బ్రపత్తి తాత్పర్యములన్. 155

క. భగవత్సంకల్పంబున
భగవత్ప్రతికూల జనులు భవ దుఃఖములన్
దగులుదు రామీఁద మఱియుఁ
దగులంగల రఖిల మోహ తప్తాత్మకులై. 156

వ. అర్జున సారథియగు కృష్ణుండు మద్ద్వేషుల నరాధముల సంసారంబునం ద్రోచెద నాసురయోనులం జనియింపం జేసెద నని యానతి యిచ్చె నట్లు గావున భగద్ద్వేషి పదార్థోపజీవనంబు వైష్ణవున కనర్థకంబు. విష్ణు ద్రోహకారణం బగుటంజేసి దద్ద్రవ్యంబు విడువందగును.

సీ. ఎవ్వని వలన మున్నెవ్వఁ డర్థముఁ గాంచు
నల్పమేనియు మఱి యధికమేని
యొకనాఁడు తనకు నీకున్న నాతని నిష్ఠు
రోక్తులాడిన బాధ నొందఁ జేయు

---

48. కొని

నటుగాన లక్ష్మీశ్వరానుకూలోప జీ
వనుఁ డర్థకామము ల్పెనగొనంగ
నిజ ధర్మమున నైన నిష్ఠురోక్తులు వల్కఁ
జెల్లదు తాపంబు జెందుఁగాన

తే.గీ. నిష్ఠురోక్తుల చేత నస్వీత భక్తి
నిత్యవాత్సల్య జలరాశి నిరతిశయ ద
యా రసోద్యత్కటాక్షు మురారి సర్వ
దర్శిఁ గలుగంగఁ జేయుట తథ్య మరయ. 158

వ. ఇందున కిందిరావిభుం డిట్లనియె. 159

క. హెచ్చిన మత్సర గుణమున
మచ్చక్రాంకితుని ద్వేషమదకటు [49]పురుషా
త్యుచ్చారణములఁ గలచన
సచ్చరితుఁడు మద్విరోధి సందేహంబే ? 160

వ. ఇది గావున స్వశరీరోద్ధులైన హరిప్రియుల నిరోధించిన నీశ్వర నిరోధంబు నట్లయని శ్రుతియు నానతి యిచ్చె యమభయుల స్వశరీర పోషణార్థ మాశ్రయించెనేని వైష్ణవుండు భగవంతుండు గలుగుట మఱచితినని వర్ణించవలయు. విశ్వంబునకు భగవంతుండు రక్షకుం డగుట శ్రుతి సిద్ధంబు. నిర్భరుండై శ్రుతి నిత్య సంతుష్టుండై శ్రీశ ప్రియవిధులు సేయవలయు ననన్యులై నన్నుఁ జింతింపుచునే జను లుపాస్తి గావింపుదురు. వారి యోగక్షేమంబు నేను వహింతునని కృష్ణుం డానతి యిచ్చెం గావున వైష్ణవులు నిత్యపూర్ణులు వినుము.

## వైష్ణవ నియమములు

సీ. జగదీశ్వరునకును స్వాతిక సర్వశ
క్తిత్వ స్వజన రక్షకత్వ సత్కృ
పాబ్ధిత్వ సంతతోదారత్వ సత్వస
ర్వజ్ఞత్వములు సమగ్రములు గాఁగఁ
దెలియఁజేయు శ్రుతి స్మృతి పురాణ వేద శి
ఖేతిహాసంబుల నెఱిఁగి దాన
నిశ్చితాత్మకుఁడయి నిరపేక్షుఁడయి నిరం
జనుఁడయి హరి సమాశ్రయణ భోగ

49. పురుషోత్యు.

తే.గీ. నిరతుఁడయి నిర్భరుండయి నిత్యహర్ష
శీలుఁడై శుచియై నిరాశీర్విశేషుఁ
డయి స్వవర్ణాశ్రమ వయోదశాంతరోరు
కర్మములు విష్ణు సంతుష్టిగా [50]నొనర్చ. 162

వ. శుద్ధ దేహేంద్రియ మనఃప్రాణాది వృత్తియై యన్వహంబును నిజ పూర్వజన్మానుగత కర్మానురూప ప్రాప్తార్థసంచయుఁడై శ్రీశ విషయక సంప్రీతి పూర్వకంబుఁగాఁ దద్దేహోచిత సేవలు గావింపుచుఁ గృత కృత్యుండై యవిద్యా వివర్జితుండై భగవజ్జన్మ కర్మంబులు వినుచుఁ బర్వంబులనుత్సుకుండై గీత తాండవాదిత్రంబులు భగవత్పురో భాగంబునఁ గావింపుచు ప్రేమ గర్భంబులగు మహోత్సవంబులు సేయుచు మహోత్సవంబుల భగవత్సేవా సమాగతుల నెదుర్కొని యతి ప్రీతిం బ్రణమిల్లి కౌగిటఁ జేర్చి యుపాయనంబు లర్పింపవలయు, సమర్పించి తత్సమాశ్లేషహృష్టుండై తత్పుత్రుఁడుం బలెఁ బులకాంకు రంబులతోఁ బ్రఫుల్ల వదనాబ్జముతో నుత్సవాలంకృతంబైన నిజ గృహంబునకుఁ దోడ్కొని పోయి స్వపుత్ర దారా భృత్యులతోఁ బ్రణ మిల్లి సుఖాసనార్ఘ్యపాద్యాద్యుపచారంబు లొనర్చి భగవద్భుక్త శేషాన్న పాన తృప్తులం జేసి హస్తప్రక్షాళనానంతరంబున గంధమాల్య తాంబూ లంబులు సమర్పించి సుఖాసీనులగు వారలం జూచుచుఁ దద్భుక్త శిష్టాన్నంబు తోయసంస్కృతంబగునది భుజించి హస్త పాద ప్రక్షా ళనంబు గావించుకొని ద్విరాచమనం బొనర్చి శుచియై నారాయణదేవ ధ్యానానంద నిర్భరుండై యెన్నఁడు హరి సాక్షాత్కారం బగునని కన్నులు మూసుకొని యంతఁ గన్నులు దెఱచి శుద్ధ సత్వరూపంబగు హరి రూపంబు గానక తత్ప్రసంగార్థియై యత్యంతాతురుండై తజ్జనాం తకం బాశ్రయించవలయు. మఱియు 163

క. శ్రీమన్నారాయణ చరి
తామృతరసధారఁ గ్రోల నర్హము భక్త
స్తోమములఁ గూడి జ్ఞాన
శ్రీమహిమం ద్రికరణముగ శిష్టజనంబుల్. 164

50. నర్చ.

తే.గీ. వాఙ్మనః కాయకర్మ ప్రవర్తనముల
వాసి కెక్కఁగ శ్రీ వైష్ణవ ప్రియంబు
సేయఁగాఁ దగు నదియ నారాయణ ప్రి
యంబు చేసిన యట్లు సత్యంబు దలఁప. 165

మ. తగు నధ్యాత్మ యదోపదిష్ట భగవద్ధర్మంబు లత్యంతమున్
భగవత్ప్రీతి వివర్ధనంబులు సులభ్యంబుల్ విరుద్ధాన్య ధ
ర్మగుణ ధ్వంసకముల్ తదీయపద చర్చాసీమ సంక్షేప మిం
పగునే చక్కఁరచేత నుండియుఁ బ్రకోష్ఠాలేహనంబుం బలెన్. 166

మ. విమలజ్ఞాన ధురీణుఁడౌ శుకున కా వేదాంత వాక్యార్థత
త్త్వము బోధించిన శంకితాత్ముఁ డయి భీతత్వంబుతో నుండ వ
శ్యముగా నచ్యుతలోక సద్గుణ కథల్ సంక్షిప్త వాక్య ప్రసం
గములం దెల్లముగాఁగఁ బల్కె మునిలోకస్వామి హర్షంబునన్. 167

సీ. వత్స ! ధన్యుండవు శ్రీవత్స వత్సాధిక
వత్సలత్వము గలవాఁడ వగుట
నవనిపై వస్తు యాథార్థ్య గోచరము నీ
బుద్ధి గాకున్న సమిద్ధ మహిమ
సంక్షేపమున రమేశ్వర వర్ణనము విన
నెట్టిచ్చగించితి విట్లు నుండి
యజ్ఞసంజాత దీర్ఘాయువు కోటి వ
త్సరంబులు గలుగు నుత్తములకైనఁ

తే.గీ. బ్రాప్తమై యుండునే పరబ్రహ్మ లోక
వర్ణనము సేయఁ దత్పారవశ్య జాత
హర్ష రసమునఁ దద్వర్ణనామృతాబ్ధి
మునిఁగి లోకంబు లెఱుఁగనే ననఘచరిత. 168

క. ఆ విష్ణుపదము యావ
జ్జీవము వర్ణించు పూర్ణశీలు రగణ్య
ప్రావీణ్యంబున పారం
బావంతయుఁ దెలియఁజాల రన్యులవశమే. 169

ఆ. వె. అరయ నీకు నాకు నంతరం బెంతేనిఁ
గలదు స్వసుఖమాత్ర కలితవృత్తి
నేను సర్వలోకహిత వృత్తి నీవు నీ
కిట్లు తగదె సంగ్రహేచ్ఛ నేఁడు. 170

## వైకుంఠలోకము – ఆవరణ పంచకము

వ. ఈ పరబ్రహ్మలోక వర్ణనంబు సేయ నేరికి శక్యంబు గాదు. కావున సంగ్రహంబున నెఱింగింపు మని యడిగితివి. ఏనును సంక్షేపంబునం బల్కెదఁ. ఇది వినువారికి బుద్ధియు నోజస్సుఖ వివృద్ధియు కార్య సిద్ధియు నగు. విశేషంబున మరియు వైకుంఠ లోకంబు వర్ణించెద వినుము. ప్రాగవాచిని శ్రీ లోకంబును బశ్చిమంబున శ్రీ వైకుంఠంబు నకు దక్షిణంబున నిత్యానందంబు నిధియు సద్భక్త వరదుండు నగు సంకర్షణ విభుండుండు. ఆ సంకర్షణ లోకంబునకు పశ్చిమంబున నిర్మలానంద నీరధి నిత్యంబునగు సరస్వతి లోకంబులఁదగు ప్రత్యగ వాచి[51]ని సరస్వతి లోకంబున కుత్తరంబునఁ బ్రద్యుమ్న లోకంబు చెలంగు. ప్రతీచీనయుతార్కేందుప్రభ దీపించి నిర్మల శర్మదంబై ప్రద్యుమ్న పదంబు దగ్గర రవి దిక్కున నిత్యాప్సరోఽలంకృతంబై రతిలోకంబు విరాజిల్లు. తత్ప్రాచీన నిరుద్ధలోకంబు రాజించు నుదీచిం బ్రకాశించి యానందవారిధి యగు నా యనిరుద్ధ లోకంబునకుఁ బ్రాచి యగు విదిక్కున సద్గుణ సాగరంబగు శాంతిలోకంబు విజృంభించు. ఇవి చతుర్వ్యూహంబులు నాలుగు శ్రీ కళలు. నాలుగును బ్రదక్షిణ క్రమంబునఁ బ్రాచ్యాద్యష్ట దిక్కులం బ్రకాశించు నీ వ్యూహాష్టకంబు ప్రథమావరణంబున నుండు. 'మధ్యే మధ్యేత్వ సంఖ్యే యా స్తత్ద్వ్యూహా'[52]మ్మనిన శ్రుతివలన ననేక వ్యూహంబులు గలవు. ద్వితీయా వరణంబునం బ్రాచ్యాది దిక్కుల వరాహ జామదగ్న్య శ్రీ నరసింహ రఘువల్లభ శ్రీధర వామన హయగ్రీవ వాసుదేవ లోకంబులు గలవు. తదధిపతులు విభవేశ్వరులు నిత్యులు. వీరు వ్యూహాష్ట విశిష్ట శ్రీవైకుంఠేశ్వర ప్రీతి సాధనంబైన బ్రహ్మ విద్య నర్వాచీన ప్రాకృత భూముల నవతరించి ప్రకాశింపఁ జేయుదు రీ మూర్తులం గొల్చిన నపవర్గంబు లభించు. తృతీయావరణంబున నెనిమిది దిక్కుల పాంచ జన్య ముసల చక్ర ఖడ్గ గదాశార్ఙ్గాది వైజయంతంబులు నిలుచు. నిత్యాన వధిక నిరతిశయానందం బగు భగవత్సేవ గావించు. చతుర్థావర ణంబునఁ గుముద కుముదాక్ష పుండరీక వామన శంఖకర్ణ సర్ప

---

51. చే. 52. యనిన

నేత్ర సుముఖ సుప్రతిష్ఠితులు నిత్యులు. నిత్యముక్తులతో నీశ్వరు నారాధింపుదురు. పంచమావరణంబున నింద్రానల దండధర నిరృతి యాదసాంపతి గంధవాహధనేశానులు నిత్య నిర్జరు లుండుదురు. ఇది యావరణ పంచకంబు. 171

సీ. చండ ప్రచండు లుద్దండ వైభవులు ప్రా
గ్ద్వారపాలురు బ్రహ్మతత్వ నిధులు
భద్రసురభద్రులు భద్రమూర్తులు దక్షి
ణ ద్వారపాలు రానంద నిధులు
జయ విజయులు సత్వసంపద్ఘనులు ప్రతీ
చ్య ద్వారపాలురు శౌర్య నిధులు
ధాతృ విధాతృ లుత్కటతేజు లుత్తర
ద్వారపాలురు మహా ధన్యనిధులు

తే.గీ. వీర లెనమంద్రు సంతతోదారయశు ల
నాదిని ధనులు పూర్ణ విద్యాభిరాము
లఖిల సంపత్సమృద్ధంబులైన స్వస్వ
లోకముల నుండుదురు మహోత్సేకములను. 172

సీ. ఆతత కోటిసూర్య ప్రకాశులును గో
టీందు కళానందహేతితనులు
సర్వజ్ఞు లుత్తముల్ సత్య సంకల్పులు
సర్వాప గుణ రూప సార తరులు
హేయ నిష్యంద రహితులు హేయ హార
వర్జితుల్ బ్రహ్మ విద్యార్జితాత్మ
తానందరస విషయాను భవోత్సవుల్
తాదృగ్విషయ విబోధ ప్రబుద్ధ

తే.గీ. పరమ పురుషాంఘ్రి భక్తి సంపన్న గుణులు
సిద్ధ తద్భక్తికారితాశేష తత్త్వ
సాద కృత్కర్మరతులు ప్రసన్న పరమ
పద పతి ముఖాబ్జ తేజోఽనుభావసుఖులు. 173

శా. దివ్యోదార విచిత్రగాత్రులు ఘనుల్ దివ్యోరుగంధాన్వితుల్
దివ్యాచ్ఛాదన దివ్య భూషణయుతుల్ దివ్యస్రగభ్యంచితుల్
దివ్యోద్దండ తరాయుధాంకిత కరుల్ దివ్యావతంసుల్ విభుల్
దివ్యోపాస్య శుచిస్మితాస్యు హరి నెంతేఁ గొల్తు రశ్రాంతమున్. 174

మ. విమలంబై తగు నింద్రలోక నికటోర్విన్ బన్నగారాతి లో
కము తల్లోకమునందు వేదములుదాత్తాది స్ఫురస్స్ఫూర్తిగాఁ
గ్రమకుండై పఠియించి పక్షిపతి నిర్యత్సామగాన స్వర
క్రమ నవ్యామృతధారలం దనుపుఁ దద్బ్రహ్మంబు నశ్రాంతమున్. 175

వ. తృతీయావరణ బహిర్దేశంబున విష్వక్సేను లోకంబు గలదు, వినుము. 176

సీ. తన లోకమున నుండి తత్పరమాత్మ ప్రి
యప్రభావముఁ గాంచి యతులశక్తి
యుక్తుఁడై యాత్మ భుజోపరిన్యస్తేశ
సామ్రాజ్య [53]భరితుఁడై ప్రసన్న మహిమ
వైకుంఠపతి యొద్ద వాసుదేవా ద్యతి
శాంత విఖ్యాత సర్వావరణ ని
వాసోక్త దేవతావరుల సంసేవింపఁ
జేయించు మెఱసి నారాయణాంఘ్రి

తే.గీ. నిత్య సేవానుకూలతా నిరతిశయ ర
సానుబంధైక హృదయుఁడై యఖిల తత్వ
బోధకుండైన సేనాని పూనియుండు
నరిభయంకరతర వేత్రహస్తుఁ డగుచు. 177

సీ. పంచావరణలీల భాసిల్లు వైకుంఠ
నగరంబు నడుమను నతి విచిత్ర
రత్నమంటపమున రమణీయ మాణిక్య
సింహాసనమును లక్ష్మి వసుంధ
[54]రానీళలు భజింప జ్ఞాన బలైశ్వర్య
వీర్యతేజచ్ఛక్తి విమల మహిమ
నిస్సమాభ్యధికుఁడై నిత్యముక్తానంద
వారాశి శీతాంశు వైభవమున

53. భరతుఁడై 54. శా.

తే.గీ. నప్రమేయత స్వాభావికానవధిక
నిరుపమాతిశయైకతనివ్వటిల్లి
తత్త్వవిత్సూరి పరిషత్సదానిషేవ్య
మానుఁడైయున్న పరమాత్మ మదిఁ దలంచె. 178

సీ. నతత కాలత్రయ చక్ర చంచద్గుణ
త్రయవేష్టి కాదిమ ప్రకృతినంటి
[55]తన దవిద్యా కామకర్మాది వాస[56]నా
రేణు మండితులై పరిభ్రమించి
రుచిర బోధానంద రూఢిగనియు ననా
త్మిక భ్రమాకూలులై చలించి
సత్యకామత్వాది సద్గుణాన్వితులయ్యు
నంతరంగమున దైన్యము వహించి

తే.గీ. నీరు గప్పిన నివ్వులై నిష్ప్రభత్వ
పూర్తి పరధామలోకోపభోగ భోగ్యు
లయ్యు నామాయఁ జెంది కర్మాది భేద
ములఁ బ్రవర్తిల్లు సంతతమును దలంకి. 179

సీ. హేయమౌ నిది యుపాధేయమౌ నిదియని
స్వాంతంబులో వివేచనము లేక
హేయముల్ గొని యుపాధేయముల్ విడుచుచు
క్షుత్పిపాసా మోహ శోక రోష
గత జరామరణ నిష్కాతీతులగుచు శ్రు
తి స్మృతులై యస్మదీయ నిరుప
మాజ్ఞ చెల్లఁగనీక యంత నుల్లంఘించి
యపరాధశతము లత్యంత శక్తి

తే.గీ. చే నొనర్చుచు నిరయముల్ చేరి మఱియుఁ
[57]బథ్యములు చేసి వేదనలు బడలియున్న
రోగు లట్లనె సంసార రుగ్మ భగ్న
హృదయులైయున్నవారల నెఱిఁగి చూచి. 180

55. క, 56. సి.
77 ...

వ. కరుణా సింధుండగు వైకుంఠాధిపతి పరమ దయాళుండై విషాదంబు నొంది రమతో నిట్లనియె. 181

సీ. పద్మలోచన పరబ్రహ్మ లోకాధి వా
సు లచేతనుల నెల్లఁ జూడు నిత్య
నిర్మల కర్మాబ్ధి నిరవధిక విలో
లత నున్నవా రకలంక మహిమ
బద్ధులఁ జూడు తాపత్రయావిద్ధుల
నెలఁత నీతోడ వినిత్యముక్త
నరులతో సిరిగల్గు నామ స్వరూప రూ
పో భయ గుణభూతులు భయవిధ మ
తే.గీ. దాత్మ వర్గోప భోగ భోగ్యామృతాంబు
రాశియై యుండఁ జూడ ధర్మంబె నాకుఁ
బ్రాకృతా ప్రాకృత జనులు పరమ హితులు
సముఁడ నే నందఱకును వాత్సల్య శక్తి. 182

వ. నిత్యముక్తోపభోగ్య స్వరూప గుణాధికము ప్రాకృత చేతనులకుం బ్రకాశంబు గావింపకున్నఁ బ్రబుద్ధులగు పుత్రుల నాదరించి బాలకుల నుపేక్షించిన తండ్రి చందంబగు. పరబ్రహ్మలోక స్వామిత్వంబును నాకు యాతన గావున నీ వైభవంబు సంకోచంబు నొందించి ప్రాకృత లోకంబుల నధివసించెద నని రమతోడం గూడి ప్రాకృత లోకంబుల స్వలోకంబులు గల్పించుకొని యుండెడి, నాలోకంబులు సనకాదులకు సుగమంబులు. ఇతరులకు మహాపుణ్యంబు లొనర్చినను దుర్గమంబులు. ప్రాకృత దేహులైన సనకాదులకు స్వసంకల్పాను రూపంబున నిజరూపంబుఁ జూపెనని పల్కిన మఱియు శుకుం డిట్లనియె. 183

సీ. హరి పరవ్యోమంబునందు దీపించె నే
రూపంబుచేత నా రూపముననె
ప్రాకృత పదమునఁ బ్రాపించె నెట్ల న
తి వ్యవహితము తాదేశపథము

లే కలహంబు ననేక దేశంబున
నుండి యొక్కరుఁడె భుజోరు శక్తి
దున్నుట తగునె యద్భుతముగఁ బ్రాకృతా
ప్రాకృత పదములం బరమ పురుషుఁ

తే.గీ. డొక్కఁతటి దివ్యతరమైన యొక్క రూప
మునను యుండిన యట్లుగా ననుట దోఁచె
నదియ యుక్తంబు వలెఁ గాననయ్యె మూర్త
మనుట నుభయపద ప్రాప్తి మనుట యెట్లు? 184

వ. హరికి నే రూపంబు చూడనయ్యె నా రూపంబు భయ స్థలస్థితంబుగాదు. శక్తి విశేషముచే నా రూప మక్కడను మఱియు నొక దిక్కుననుం బ్రకాశించుం గాక యని యంటిమా రెండు స్థలములయందుఁ దాఁచిన యొక వస్తువు దా నొక్క స్థలముననే యుండుట నిజం బిట్లుండి రెండవ దిక్కుననున్న యవి యని తోఁచుట భ్రాంతి ఖగం బొక్క పరి భూనభః ప్రదేశంబులఁ గానుపించునె యుభయ పదస్థితి యీశ్వరునకు మూర్తత్వక్షతియగుం గావున దుస్తర్క ప్రభవంబగు నస్మన్మనో దోషంబుఁ దీర్పవే కృపాబ్ధి భగవత్తత్వ విద్యచేనని శుకుం డడిగిన నగు మొగంబున విష్ణుశక్తి విజ్ఞాన ధుర్యుండగు పారాశర్యుం డిట్లనియె. 185

## విష్ణు మహిమ – ఉభయ పదప్రాప్తి

తే గీ. తథ్య మెంచ మహాద్భుతా తర్క్య బోధ
శక్తి యీశ్వరునకుఁ గల్గ జగతి మీఁద
ఘటము పటముగఁ గావించు ఘనుఁడు తత్ప్ర
శస్తమహిమకుఁ దర్కావసరము గలదె? 186

క. సంకల్పమాత్రమునఁ గా
ర్యాంకురములు వొడుమఁ జేయునట్టి సమర్థుం
డోంకారమూర్తి శ్రుతి పద
సంకేతుం డితరు లతనిసములే యెంచన్. 187

తే.గీ. లోక సామాన్య లక్షణాలోచనమునఁ
దెలిసి దృష్టాంత హేతువుల్ దెచ్చి యిప్ప
రేశ్వరుని నిశ్చయించువా రెవ్వ రట్టి
జనులు మూఢులు శాస్త్రముల్ చదివిరేని. 188

వ. కులాలుండు ఘటకార్యకర్తయై ప్రత్యక్ష ప్రమాణంబున దుఃఖంబు నొందినట్లు విశ్వకర్తయగు నీశ్వరునకుఁ గర్తృత్వంబువలన దుఃఖిత్వానుమానంబులేదు. మూర్తంబునకు నంశత్వంబు ప్రత్యక్షంబున నెవ్వం డనుమానంబు గావించు మానాంతర విరోధంబైన నొక్కయెడ సామాన్యానుమానంబు లేదట్లన నీశ్వరునియందు సామాన్యానుమానంబు లభించనందునకు శ్రుతియు విష్ణునకు "అపాణిపాదోజ వనో గ్రహితాపశ్యంత్య చక్షుః సశృణోనకం నః సవేత్య వేద్యం నచసశ్య వేత్తా తమాహు రగ్ర్యం పురుషం మహాంతమ్ నకస్య కార్యం కరణం చ విద్యతే సతత్స మశ్చాభ్యధికశ్చ దృశ్యతే పరాస్యశక్తే ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీజ్ఞాన బలక్రియాచ'' యనిన నది హస్తంబులు లేక పట్టును. పాదంబులు లేక పఱువెత్తును. చక్షువులులేక చూచును. కర్ణంబులులేక వినును. అవేద్యంబైన యది యెఱుంగును. తన్నొకం డెఱుంగలేఁడు. అతండు మహాపురుషుండని యెంతురు. అతనికిఁ గార్యకరణంబులు లేవు. అతనికి ముంచు నధికుండులేఁడు. అతని శక్తి వివిధంబైన యదియై స్వాభావికంబులు జ్ఞానబల క్రియలు. అతని వినుతింపనలవి యగునె. భగవంతుని శక్తు లవాఙ్మానస గోచరంబులని పురాణంబులం జెప్పంబడియె. ఉత్పత్తి స్థితి లయంబులయందు సర్వశక్తులు భగవంతునికే కలవు. శ్రుతి స్మృతులే తదర్థ నిర్వాహకంబులై యుండు. 189

తే.గీ. సత్య సంకల్ప విభవుఁడౌ స్వామియందుఁ
గలుగ దీ లోకసామాన్య కల్పనంబు
గాన భగవత్స్వరూప మెక్కడను బొడమ
దెందుఁ గాన్పింపఁ డెందుండఁడెంచి చూడ. 190

మ. కనునా విష్ణుఁడు కరరంధ్రములచే ఘంటాది శబ్దంబు లా
ఘనుఁడే చూడ్కులచే వినున్ సకల వాక్యశ్రేణులే తత్పురా
తన నిర్నిశ్వసనీయులై భవముచేతం బ్రాకృతాంగంబు లా
గున భావింపక యప్రమేయమని లోకుల్ చర్చ సేయందగున్. 191

మ. ఇది వేదాంతరహస్య సారము హరిస్వేచ్ఛాను రూపంబు న
మ్మది మొప్పన్ మదినమ్మి పూర్వభవ సమ్యక్పుణ్య పాప ప్రప
న్నదృఢాభ్యంతరుఁడై విపద్దశలలోనం బాసినదోర్భగ నం
పదలింపొంద భజింపుచుండ్రు పరమ బ్రహ్మంబు నేకాగ్రతన్. 192

వ. ఇట్లేక రూపంబున నీశ్వరుం డన్నియెడల నుండుట చోద్యంబె. అప్ర తర్క్యాద్భుత శక్తియగు విభుండని విశ్వసించి హతదురితులై వామదేవాదులు కొందఱు వాసుదేవ పరాయణులై యుండ్రు. మఱికొందఱు మును లఖిల హేయప్రత్యనీక కల్యాణైకతా నశ్వేతర సమస్త వస్తు విలక్షణానంత జ్ఞానానందైక స్వరూప నిత్యనిరతి శయౌజ్జ్వల్య సౌందర్య సౌగంధ్య సౌకుమార్య లావణ్య యౌవనాద్యనంత గుణనిధి యగు భగవంతుండు నాత్త విగ్రహంబులై శుద్ధ సత్వాత్మ పరంబులై శుద్ధ కళ్యాణగుణ సాగరంబులై నిత్యముక్త సేవితంబులైన పర వ్యోమనిలయ సకల విభూతులను వీక్షించి తత్సదృశానేక రూపం బులు గావలయునని యిచ్ఛామాత్రంబు వలనం గలిగిన శుద్ధ సత్త్వ రూప దివ్యవిభూతులతోడం గూడం బ్రకృతి సృష్టి యవస్థయందున పంచీకృతాత్మకములైన మహాభూతములయందుఁ బరబ్రహ్మ లోక వ్యూహ విభూతులతోఁ దా నవతరించి యక్కడను స్వస్వరూపాత్మ జ్ఞాన సంపన్నులగు దివ్యయోగీంద్రులకుం దక్కఁ దక్కిన వారలకు సేవింప నలవికాదని విలోకించి పంచీకృత మహాభూతారబ్ధ భూముల యందుం బ్రవేశించి స్వప్రియవ్రతచారులై కేవలులైన వారిచేత సేవిం పంబడుచున్నవాఁడై కృతార్థుండ నైతినని తలంచి మహౌదార్య సుశీ లత్వ వాత్సల్యాది నిజసద్గుణంబులతోఁ గూడినవాఁడై సర్వదేవ వేద హృదయాహ్లాదముచే సిద్ధ చతుర్దశ మహాలోకంబులందు శ్రీ వైకుంఠ శ్వేతద్వీప క్షీరాబ్ధులయందును సవితృ మండల మధ్యమమునందు శ్రీ నృసింహ రామకృష్ణాది విభవావతారంబుల శ్రీరంగ శ్రీ పురు షోత్తమ శ్రీ వేంకటాచల కాఞ్చ్యాహోబిల బదరికాశ్రమాదుల యందును దత్తద్గ్రామగృహార్చ విగ్రహ సాలగ్రామాది మూర్తులయందును జేతనా చేతనాంతర్బహిఃపూర్ణుండై సేవక జనుల నభీష్టాకృతులు ధరించిన వాఁడై సకలేప్సితంబు లొసంగుచు శుభైకదాన స్వలీలాబ్ధియందు విహరింపుచున్నవాఁడని యందురు. ఈ ఋషుల మతంబు నందున్న శుద్ధ సత్వాత్మకత్వాది స్వగుణాంబుధి దివ్య దేహములచేత సర్వ స్థల ములయందును భగవంతునికి సన్నిధానముగల దనియెడి నిశ్చయం బున నిట్లుండి యే స్వామి నిత్యముక్తైక భోగ్యుండగు నా స్వామియె స్వకీయ దివ్యమంగళ విగ్రహ విభూతులచేత సనకాదులయిన స్వప్రియులకుఁ బ్రసన్నుండయ్యె ననుట యుక్తంబు.

మ. అని యిట్లాత్మగురుండు వల్కనట సాష్టాంగంబుగా మ్రొక్కి య
త్యనఘుండా పరమార్థవేది బహుళాకారుఁడై తాఁబునః
పునరుద్బుద్ధ శిరఃప్రకంప నయనాంభోహర రోమాంచ లాం
చనుఁడై భవ్య పరాశరాత్మజ విశిష్ట స్తోత్రదృష్టిం దగన్. 194

వ. ఈయజుర్వేదంబు సత్వదవాఙ్మానసవిత్తముండవై నన్నెఱుంగక యట్లు "సహోవాచ వ్యాసః పారాశర్య" యని నిస్వోదీరితార్థంబునందు నీ వచనము ప్రమాణంబుగాఁ బలికె నింతకంటె నిన్ను నెట్లు నుతింప వచ్చు నీవే లోకోత్తరుండ వగుట. 195

సీ. శ్రీమించు తత్పర వ్యోమంబునందుండి
యవతరించి నిమీలి తాత్మకంబు
లగు మహాభూతంబులందు వరవ్యూహ
ములతోఁ బ్రకాశించి యలఘు కరుణ
సనకాదులకు నిట్లు కననయ్యె ననుచు మీ
రానతి యిచ్చితి రదియె విస్త
రముచే నెఱింగింపు సముఁదీశ్వరుఁడు సర్వ
భూతములకు నట్టి పురుషమౌళి

తే.గీ. యూర్ధ్వలోకాధి వాసులై యున్న యజహ
రాదుల నుపేక్షగావించి యగ్రముననె
యట్టి సనకాదులకును బ్రత్యక్షమయ్యె
బుధులు వైషమ్య మనరెట్లు బుద్ధిఁ దలఁచి. 196

తే.గీ. సర్వభూతంబులను నేలు స్వామి ఘనుఁడు
సర్వభూత సంహృత్తు తజ్జనులలోన
నెట్లు గావించెఁ గొంద ఱీ యెడల సంత
తాధిగతమైన సౌహార్ద మాత్మలోన. 197

క. అని యనితర సౌమ్యంబుగఁ
దనయుఁడ ప్రశ్నంబు సేయఁదగునని హర్షం
బొనరం బారాశర్యుం
డనియెన్ వస్తుస్థితి ప్రమార్థము గాఁగన్. 198

## సర్వేశ్వరుని సర్వజనేచ్ఛానువృత్తి

క. సర్వసమత్వ గుణంబును
సర్వసుహృత్త్వంబుగలుగ సర్వేశ్వరుఁడే
సర్వజ్ఞుండగుఁ గావున
సర్వజనేచ్ఛానువృత్తిఁ జాలనటించున్. 199

వ. ఆ యిచ్ఛ రెండు విధంబులగు బద్ధముముక్షుమతి మతిభేదంబున నందు.

క. కనుఁగొని దేహాద్యన్యం
బును జ్ఞానానంద లక్ష్మిపూర్ణమునగు నా
త్మను దదనాత్మ తగ నచే
తనుఁడునుమీ బద్ధుఁడనఁగ ధారుణిలోనన్. 201

సీ. ఆ బద్ధ జనుఁడు క్రమానురూపార్థ స్పృ
హావలంబనమున నంటియుండు
ననిశంబు నాత్మ దేహాది వివేక సం
పత్తిదేహాదులు బంధకంబు
లని ముముక్షుండు నిత్యము తద్వివేకాను
రూపార్థములమీఁద రుచివహించు
మూఢుండు దుఃఖైకమూలంబు భవమని
యూహించఁ డాత్మలో మోహశక్తి

తే.గీ. నలముముక్షువు భవనిరాసార్థహేతు
వుల నిరీక్షించు నిత్యంబు దెలిసిభావము
లందు నుండిన యునికి కారాంతరముల
యందు నుండిన యునికని యన్వయించు. 202

ఉ. శ్రీవిభవుఁ డాత్మలో నుభయ చేతన నూతన చిత్తవృత్తి స
ద్భావములో నెఱింగియును భ్రాంత మనోరథమీఁడు రోగ దు
ర్భావన తల్లి పుత్రకుఁ దపథ్యముఁ గోరిన నీనియట్లు త
త్కేవల మోక్షకాంక్షుల కుదీర్ణత నీఁడల యోగసిద్ధులన్. 203

సీ. స్వామి నిర్హేతు వాత్సల్యసింధువు బద్ధు
లైన చేతనుల నిజాత్మఁ దలఁచి
స్వాపరవృత్తి సంప్రాపకార్థంబులై
ప్రబలు స్వర్గంబు స్వారాజ్యపదము

కైవల్యముననంగఁ గలిగిన యవియెల్ల
నొనఁగుచునుండియు నొక్కచోట
నవినశ్వరములు హేయంబులు తుచ్ఛంబు
లల్పతరములను నరుచిపుట్టఁ

తే.గీ. జేయునవి రెండు మది విమర్శించి ముక్తి
పదముఁ గోరంగవలయు సద్భావశక్తి
నిట్లు కోరిన పరమాత్మ కెంచి చూడఁ
గలదె వైషమ్యబుద్ధి లోకంబులోన. 204

సీ. త్రివిధజీవ నిజేచ్ఛ తెలివి కర్తుమకర్తు
మన్యథాకర్తుం సమర్థశక్తిఁ
దనర నీశ్వరుఁడు తద్వాత్సల్యమునఁ ద
దిచ్ఛానువృత్తిమై నెనఁగియుండుఁ
బరమయోగీంద్రులు భవ్యులు సనకాదుఁ
లా రమాజాని పాదాంబుజాత
భక్తి నిష్ఠాశక్తి ప్రబలినకైవడి
బ్రహ్మాది నిర్జర ప్రవరులకు ల

ఆ.వె. భించ దట్లుగానఁ బ్రీతియందటియందుఁ
గలుగనెపుడు వార్ధికన్యకా క
శత్రునకును నిది విచిత్రంబుగా దెంచఁ
దత్స్వభావగుణమె తలఁచనెపుడు. 205

తే.గీ. అఖిల చేతన సముఁడు పరాత్మ విషముఁ
డౌనె తదభీష్టసిద్ధిదుఁ డయ్యెనేని
తనయులకు నెల్ల సముఁడైన తండ్రి తత్త
దిష్ట మొక లేశమేనియు నిచ్చినట్లు. 206

వ. అనిన శుకుం డిట్లనియె. 207

మ. సనకాదుల్ఘన యోగులబ్జజ సుతుల్ స్వధ్యానమప్రియా
యనఘుల్ విష్ణునిఁజూడఁ గోరుట నిజంబౌ నట్లుకాకున్నఁ బ్రా
క్తన వాణీశ మహేశ్వరాదుల కశక్యంబైన తద్దేవ ద
ర్శన మెట్లౌఁ దగు విష్ణువత్సలతయున్ సంసేవ కైశ్వర్యమున్. 208

క. ఈరీతిన్ సులభత్వో
దారత్వ మహత్వసత్వ ధన్యత్వగుణో
దారుండగు నాశ్రిత మం
దారముహరిఁ గొలువలేక తడఁబడుదుమయో. 209

సీ. అనుపమ బ్రహ్మవిద్యా ప్రసన్నేశ ప్ర
సాదగుణోద్బుద్ధ శక్తులగుచుఁ
బద్మ సంజాతాండ బహిరంత రంబులఁ
దిరుగుచుందురె పూర్ణధీప్రశస్తి
వాసికెక్కఁగ భగవత్త్వాల రూపాను
భవరాగమున యోగు లవరతంబుఁ
జిత్రంబుగాన పంచీకృత భూతాంత
రంబులందు ననర్గళంబుగాఁగ

తే.గీ. వర్తిలుచుఁ గోటి సూర్య విస్ఫురిత కోటి
చంద్ర సాంద్రకళానంద సౌరభమున
నామయమునైన తత్పరవ్యోమలోక
ధామమున కేఁగి హరి నెట్లు ప్రేమఁగనిరి. 210

క. అటువంటి యోగివర్యుల
నెటువలెఁ గరుణించె వార లీ విష్ణువుతో
నెటువంటి గోష్ఠి చేసిరి
పటు విజ్ఞానమునఁ దెలియఁ బలుకుమునాకున్. 211

వ. తజ్జన ప్రియమైనదియు నేతదన్యంబున నానతి యిమ్మని యడిగి యతి వినయంబునఁ గృతాంజలియై నిల్చిన తనయునిఁ గౌగిటం జేర్చి వ్యాసుం డిట్లనియె. 212

## సనకాదులను విష్ణువు కరుణించిన విధము

తే.గీ. వత్స! యవధానముననను శ్రీవత్స లాంఛ
నాది శుభకథ శ్రుతి సుఖంబై తనర్చ
బ్రహ్మ విచ్ఛిత్తి శంకావిభంజనముగ
నీకు నెఱిఁగింతు వినుము తదేకబుద్ధి. 213

సీ. ఘనతరమయి యసంఖ్యమయి బ్రహ్మలోక
మౌనట్టి పరవ్యోమ మరయ నెద్ది
యదియ విశుద్ధ తత్త్వాఖ్యతత్త్వంబు సు
షిరమున నావిించి చెలఁగెనది త్రి
పాద్భూతితదురు త్రిపాద్భూత్యధో భాగ
మధ్యదేశైక సమాశ్రయమునఁ
దగునతర్క్యాద్భుత తరశక్తికంబుగ
వ్యయమునసైన కాలాఖ్యతత్త్వ

తే.గీ. మది యధోముఖ చక్రమైయంటి తిరుగుఁ
బరగుఁ దదవస్థ లీ మధ్యభాగనాభి
మిళితమై త్రిగుణాత్మయై మెలఁగ [57]నాయ
జాదులకునైన నెఱుఁగ శక్యంబెదాని. 214

మ. ప్రమదావృత్త కులాల చక్రగత మృద్భావంబునన్ యోగి స
త్తములోహో యని యెంచి చూడఁగఁ దదుద్యత్కాల చక్రభ్రమ
క్రమభేదంబులఁ గాంచు విక్రియ లనేకంబుల్ తరంబే యజా
సముదారత్వము మెచ్చ నీశ్వర నిజేచ్ఛాధీనమై యుండఁగన్. 215

తే.గీ. అజ వికారంబు నొందిన యది యసృష్టి
యజవికాసంబుతో నుండునదియ యునికి
యజకు సంకోచమన నెద్ది యదియె వేల
యఖిల లోకార్థమైన బ్రహ్మండమునకు. 216

మ. చిరకాలంబుగ నాది సిద్ధకలితా చిద్రూపమో నాయజన్
బరితో వ్యాప్తి ననాదిచేతనులు తద్బద్ధస్వశక్త్యాత్మలై
తిరమై యుందురు తధ్య మీ విహితశక్తిజ్వాల కీల్యంశ వి
స్ఫురణందంత మనోచితార్థ కరణంబుల్ మాని యెల్లప్పుడున్. 217

వ. మఱియు ననేకరూప ప్రకృతి రూపస్వభావోదిత విభ్రాంతులై స్వాతి
రిక్తంబులైన భగవచ్ఛేషతైకాకృతులై ప్రాగ్భవీయ కర్మానురూప
దుఃఖాతి హేతువులగు దేహేంద్రియ మనః ప్రాణాదులయందు నాత్మా

57. నజ రాదులకైన.

త్మీయతత్వ సమ్మోహంబునొంది దేహాది ప్రతికూలానుకూల రాగ ద్వేషాది వి క్రియలు మఱియు మఱియుం జెందుచు నష్టస్వచేతనోన్న త్యంబున లక్ష్మీశాజ్ఞోల్లంఘనాపరాధరూప పాపానురూపంబులైన దండంబులుగాంచి దుఃఖార్తులై యసుఖంబులయందు సుఖ భ్రాంతి వహించి మరుమరీచికలుగని మృగంబులు పయఃపానేచ్ఛం దిరిగినట్లు తిరుగుచు దుఃఖైకఫలక్రియలు సేయుచు సుఖంబుంగోరు జంతువులం గాంచి దుఃఖైకహేతువగు ప్రపంచంబులయంబు నొందింపఁ జూచి జలంబున జలబుద్బుదంబునుం బోలె భౌతికంబులు భూతంబుల యందును భూతంబులు తన్మాత్రల యందును దన్మాత్రలను దామ సాహంకారమందు నింద్రియంబులను దైజసోర్జిత సాత్వికాహంకారము నందు నహంకారము మహత్తునందు మహత్తు నవ్యక్తంబునందు నవ్యక్తంబు నక్షరంబునందు నక్షరంబు నజశబ్ద వాచ్యంబగు తమ సంబునందు స్వజ్ఞానశక్తి సూక్ష్మాంగ లేశంబు చేతనంబుగాఁ జేసి బద్ధా సంఖ్యేయ చిద్గర్భంబగు తమంబు చూచి పరమ విస్మయంబు నొంది హరి పరమదయాళుండై సన్నిధి సేవించు నిందిరం జూచి యిట్లనియె. 218

క. వలఁ దగిలిన మీనంబులు
వలె జీవగణంబు లాజవంజవజాలం
బులఁ బడి తిరుగం జూచినఁ
గలఁగదె హృదయ మిపుడెట్టి కట్టిడికైనన్. 219

సీ. తెలివితో వీర లాత్మీయ స్వభావమిం
తయుఁ దారెఱుంగరు తత్వబుద్ధి
దేహేంద్రియ ప్రాణధీమనోన్వితులై
యున్మత్తులున్న యట్లుండి స్వాను
రూప వృత్తియునైన రూపించఁగానేర
రల ప్రసుప్తులయట్ల విలయమంది
మణులు దుష్పంక నిమగ్నంబులై నిజ
ప్రభఁ బాయునట్లు సౌభాగ్య మెడలి

తే.గీ. యుందు రటుగాన స్వస్వభావోచిత సుఖ
మనవధికముగఁ బొందు సమర్థు లెందు
గారు హతులై రి కటకటా ఘనతమోవి
లీనులై నష్టులై యుండనౌ [58]నెట్లు చూడ. 220

క. అనిశతమోలీనతఁ జే
తను లతిదుఃఖము వహింపఁ దత్పరమవ్యో
మ నివాసంబున నుండఁగ
మనసగునే నాకు నెన్ని మార్గములంచున్. 221

మ. అనిశంబున్ బ్రజదుఃఖ శోక భయ మోహభ్రాంతులై పాఱశో
భన భాగ్యోదయ సంపదల్గనియె నా తద్భర్త పూర్ణుండు యా
తనలం గొందఱు కొందఱుత్కట సుఖౌదార్యంబులన్ మించ నే
పునఁ దర్భర్తయు నర్థపూర్ణుఁడగు సంపూర్ణుండుగాఁ డెంచినన్. 222

ఉ. ఎంచఁగ నెవ్వ రెవ్వరికి నెయ్యది యిష్టతమంబు దాని న
భ్యంచిత శక్తి నిత్తు హృదయంబు గరంగఁగఁ జూడ నీవు ని
ర్వంచన సత్కృపా మహిమ వారికి దేహములున్ స్వశక్తులున్
మించ నొసంగి కోరికలమేయముగా నొనరింతు నిత్తఱిన్. 223

తే.గీ. స్వగుణ సౌభాగ్య మిట్లాత్మసతికిఁ దెల్పి
సృష్టి సంకల్ప మాత్రలోఁ జేయునంత
జగములపు డుద్భవించె నాశ్చర్యమంద
నఖిలమును బూర్వమున నున్నయట్లచేసె. 224

సీ. అఖిల లోకంబులు నద్భుతం బొప్ప సృ
జించి యా సత్కృపాశీలుఁ డాత్మ
నాభి గర్భోద్భూతుఁడై భూతిమెఱయు చ
తుర్ముఖ బ్రహ్మ చతుర్దశోత్త
మ బ్రహ్మ విద్యా సమన్విత స్థానంబు
నందధికారిగా నన్వయించి
వేద దృష్టంబైన విమల మార్గంబున
నిర్మించు నీవని నియత కరుణ

58. నౌనె

తే.గీ. నానతి యొసంగె శుద్ధ సత్వాత్మకమును
నిత్య నిరవధికానంద నిర్మలంబు
నైన నిజపదమతనికి నపుడు చూపి
సమ్మదంబొనరించె నా చక్రధరుఁడు. 225

తేగీ. రుచిర నిరవద్యమగు స్వస్వరూప రూప
తద్గుణాధికములు చూపి తత్సమగ్ర
భక్తి బ్రహ్మాండ లోకాధిపత్య మొసఁగి
యంతఁ దచ్ఛక్తిఁగసన నదృశ్యత వహించె. 226

మ. తనకుం జేయఁగ నిచ్చగింపఁబడ సత్కర్మంబు లెన్నేని న
య్యనఘుం డబ్జభవుండు శ్రీరమణ సేవార్థంబుగాఁ జేసి త
ద్ఘనుఁ బూజించి యహంకృతుల్ వదలి సద్భావంబుతో నుండఁగా
సనకాదుల్జనియించి రా విభునకున్ సర్వాధికుల్ సాత్వికుల్. 227

వ. అని చెప్పి వేదవ్యాసుండు శుకునిం జూచి మఱియు నిట్లనియె. 228

సీ. ఆ చతుర్ముఖుఁడు బ్రహ్మ జ్ఞానులగు సన
కాదుల స్వర్ధునీప్రాంతచరుల
నలువురి సంసార నావ మాత్ర విసృష్టి
రహితుల నద్భుతార్క ప్రభాంక
కనుల నాత్మానాత్మ తత్వవివేకుల
హరి భజన శ్రవణార్చనాది
పరులఁ బ్రాగ్భవ సముత్పన్న పరబ్రహ్మ
విద్యా సుధారస విమలురయ్యుఁ

తే.గీ ప్రస్ఫుటారబ్ధ కర్మానుభవముకొఱకు
జననమున మించు కమలసంజాతఁ బాసి
నీ మనోహర భక్తుల నిఖిల సద్గు
ణాభిరాములఁ జూచి యయ్యబ్జభవుఁడు. 229

వ. తదాకారంబులు తత్తేజంబులు తద్విజ్ఞానంబులు నిరీక్షించి యేవంవిధి
సృష్టిఁ గావింపుఁ డనఁ బ్రణమిల్లి వా రిట్లనిరి. 230

మ. తరమే మాకిది నీకు మా యెడలఁ బుత్రస్నేహ మీవేళ సు
స్థిరమై యున్నదొ లేదొ లేనియెడ నీ దేహంబు లింకేల న
శ్వరముల్ గల్గిరయేని సౌఖ్యమిదు సాక్షాత్సౌఖ్య మీ సృష్టియో
హరి సద్భావనయో మహాత్మ యిది నేఁ డత్యాదృతిం దెల్పవే. 231

శా. దేహాత్మైక మతిభ్రమాబ్ధి పతితుల్ దీనాత్మకుల్ పుత్ర దా
రోహాసువ్రతదుష్ట కర్మ నిరతుల్ యుక్తేతరానేక రూ
పేహాసక్తులు దుష్టమానసులు మీ రెట్లన్నఁ బాటింతురా
శ్రీహర్యర్చన లాత్మవేదులకుఁ జర్చింపంగ సత్కర్మముల్. 232

వ. మఱియు వినుము కర్మంబులకు వైషమ్యంబు గలదే. విద్వాంసునికి నుత్తరోత్తర కర్మంబు లభించదు. వానికి నాఖోధః కర్మనిష్ఠ యుక్తం బగు నుత్తరకర్మ నిష్ఠ యుక్తంబుగాదు. పాయసాన్నభోజన క్రియా దక్షుఁడు మాతృస్తన్యం బిచ్చసేయని యట్లు సర్వ క్రియాఫల బ్రహ్మ భావన సుఖవేదియైన భక్తుండు పితృ మతంబైనంగాని సృష్టి క్రియ యిచ్చయింపఁడు కావున. 233

సీ. నిత్యకర్మములఁ బూని కనాద్యమొనరప
క తదుత్తరంబగు కర్మమెల్ల
నాచరింపఁగఁ దగదనును శాస్త్రంబులు
కామ్య క్రియల కిట్లుగాదు మేరు
విలను సంధ్యాకర్మహీనుఁ డనర్హుండు
సకల కర్మముల కెంచఁగ నశుచిత
ప్రాపించునే మా కనర్హత సృష్టి గా
వింపనినాఁ డటు విమల చరిత

గీ. యనిన శ్రీశ ప్రసాదావహాతి భక్తి
శేముషియుఁగల్గు నంచు నాశీర్వదించి
జలజ సంభవుఁ డంత నా సనకముఖ్య
పరమ భాగవతుల నాత్మఁ బ్రస్తుతించి. 234

వ. మంగళాశాసనంబు చేసి యనిచిన వారలు ప్రణమిల్లి కృతాంజలులై యానంద బాష్పంబులు దొరుగగం దండ్రిఁ జూచి మృత్యువక్త్రంబు వెడలితి మని తలంచికొని వాయువేగ మనోవేగంబులం జని నిర్మల

స్వాంతులై తమ తండ్రి యనుగ్రహంబున నాఁడు మొదలుకొని హేయ రూప సాంఖ్యేయ కల్యాణగుణ సాగరంబై సర్వానంద స్వస్వరూపాను ప్రతిభ రూపైక స్వరూపంబై సద్బ్రహ్మాకశాత్మ శంభుశివాది నామ గంబై యసాధారణ నారాయణ వాసుదేవాది కాహ్వాయంబై జగద్బీ జంబై మోక్ష ప్రదంబై ప్రసిద్ధంబై నిత్యానవధికానంద స్వరూపంబై నిఖిలాశ్రయంబై సర్వానందకారియైన బ్రహ్మంబు భావించి. 235

సీ. వెలయుచుఁ దన్మనస్కులు తదాలాపులు
తత్సపర్యులు తత్పద ప్రవణులు
తద్గుణరక్తులు తద్భక్తినిష్ఠులు
నగుసనకాదు లత్యంత ఘనులు
పంచ షడ్వత్సరప్రాయ బాలకమూర్తు
లవికారులు జితేంద్రియత్వ ఘనులు
త్రిభువనంబుల దేవదేవాంఘ్రి భక్తగో
ష్ఠి ప్రపూజలుగాంచి శ్రీ కళత్ర

తే.గీ. సత్కథామృతంబు వినుచుఁ జపులు గొనుచుఁ
జక్రధర భక్తి విముఖాత్మ సభలనైన
నధివసింపరు విష్ణు తత్వావబోధ
పూర్తి యొనరించుకొనుచు నపూర్వశక్తి. 236

తే.గీ. వాద జల్పవితండోపపాదిశక్తి
వార లొక్కొక్కచోటన వైదికుల జ
యించి కావించినపుడు లక్ష్మీశ హృదయ
రంజనంబైన తన్మతభంజనంబు. 237

క. హరునిసభ నజునిసభ సుర
వరుసభ వరున భగవదతి వైభవములు వి
స్ఫురిత న్యాయంబులు సు
స్థిరములుఁగాఁ జేసి మహిమ దీపించి రిలన్. 238

వ. చెలఁగి వేదాంత దర్శన స్థితులచేత వారు దేవ ప్రకృతులతోఁ గూడఁ దద్వేదాంత దర్శనంబు మహాన్యాయంబులచే సంస్థాపించిరి. అసుర ప్రకృతు లెఱుంగరైరి. మఱియును. 239

చ. అలఘులు వీతరాగులు శుభాన్వితదేహులు ఖ్యాతి లాభ లా
జులు గొన రామయావిగత శాంతికినై యతి సాధులైన వై
ద్యులువలె భూమిఁ ద్రిమ్మరుచుఁ బూర్ణ దయాగుణవారి రాసులై
కలఁగిన జీవకోటి కుపచార మొనర్చుచు బోధ సంపదన్. 240

తే.గీ. మహిమచేఁ బదవాక్య ప్రమాణ వేదు
లగు మహాత్ము లవజ్ఞ సేయంగ నాసు
ర ప్రకృతివార లాత్మ సారంబులేక
ప్రీడమై హరి సద్గోష్ఠి విడిచి యుంద్రు. 241

క. వామన దితిజాసుర ర
క్షోముఖ్య సభాంతరములకుంజని వారిం
బ్రేమంగని తెల్పిరి త
త్తామసులకు శ్రుతివిరుద్ధ ధర్మ మతంబుల్. 242

సీ. ఆ కళావిద్యల నసురుల వశ్యుల
గాఁ జేసికొని మహాఖలసమాశ్ర
యమునఁ దదిష్ట గోష్ఠ్యంతరంబున వారి
వలన సత్క్రియలంది వారలుండి
తావదుత్పన్న దుర్ధర గర్వ పర్వత
శిఖర సమారోహ చిత్రతర మ
హోన్నతులై యిట్లు యుక్తేతరంబులు
వల్కుచు మూఢస్వభావు లగుచు

తే.గీ. నాదిమౌనులు వైదికుల్ వేద నిగది
తార విశ్వాస దుర్జ్వరాహత మహౌజు
లగుచు ఘన సన్నిపాతంబు లందినట్లు
వింతకల్పన లెల్లఁ గల్పింతురిలను. 243

వ. వేదాంత మతమునకంటె నన్యమగు మతము మంచిదిగాదని తెలియక
యీ వేదాంత మతము నాదరించక యీ ప్రకారమునను స్వగోష్ఠీనిష్ఠ
లైన ఛాందసులైన వారి మనస్సులను నల్పులైన వారల నతి
కల్పనులైన మోహంబు నొందించి రప్పుడు. 244

సీ. మహిని సురాచార్య మతము లోకాయత
మతమును సౌగతమతము ఖార
తీశ మతంబు మహేశ మతంబును
జైమిని మతమును జైనమతము
కాణాదమతమును గౌతమ మతమును
గపిల మతంబును ఘనతకెక్క
నంతకంటెను బ్రశస్తంబె వేదాంత మ
తంబు సభాసమ్మతంబె తెలియ

తే.గీ. నభ్ర పుష్పోపమంబు వేదాంతమతము
తన్మహాసౌర భాఘ్రాణ తత్పరాభి
మాన మాయామిళిందాయమాన మాన
మానవులు గొందరుంద్రు దుర్మత్సరమున. 245

తే.గీ. అద్దురాత్ములు పలికిన ట్లపుడె నమ్మి
యందుఁబడి యా సురాత్ములై యఖిల జనులు
వైదికాచార విముఖులై వైష్ణవులును
విష్ణుదేవుని నిందించి విమతులైరి. 246

వ. బాహ్యులతోఁ గుదృష్టులతోఁ గూడి వేద విప్లవంబు సేయుచు నపన్యాయంబుల దురాగమంబుల వేద విత్పక్షంబు లపనయింపుచు వేదాంతాభిమత న్యాయ కులిశ భగ్నమానసులయ్యుఁ దత్క్రోధ మోహాంధులై నిర్దయులైనట్టు వైభం బొనర్తురు. కొందఱు మహాభుజాబలులై మందమతులై సైన్యంబులచే భూమి చలింపంజేయు దురాత్ములచే భంగంబు నొంది యలబ్ధశరణులై సత్పురుషు లట్టి దురాత్ములనే శరణంబుగా వేడుకొనుచుఁ దన్మతప్రశంసఁ జేయుచుఁ దదిచ్ఛానుగుణ వృత్తులై 'యావత్కాలే నాస్తి మర్యాద' యను నీతి నంగీకరించి మధ్యములు బ్రదుకుదురుత్తములైన మహానుభావులు నిగమాంత నిషేధకులైన వారి నాశ్రయించి బ్రతుకుటకంటెఁ దనుత్యాగంబు సేయుట మేలని బాహ్య దృష్టులులేని దేశంబునకుం జని నైమిశాదిపుణ్య క్షేత్రంబుల విజ్వరులై పరబ్రహ్మోపనిషద్భావనం గొందఱు ప్రవర్తిల్లుదురు. ప్రవృద్ధములై సంసార బంధకంబులై నిశ్శ్రేయస విరోధులైన బాహ్యకు దృష్టి మతంబులచేత నీ హారపటలంబులచేఁ గప్పఁబడిన

భానుమండలంబులుం బోలె నేతద్ధర్మత హితంబైన తత్వ విజ్ఞానా మృత ధీధితి మండలంబు వైకుంఠనాధునిచే సాక్షాత్కారంబున శ్రుత్యంతక్షీర సాగరమువలన సముద్భూతసారంబై విధాతకు నుప దేశంబయ్యె నది యెఱింగి హేయప్రతిభటాసంఖ్యేయ సుగుణ పరి చిత్స్వత్స్వరూప వమాధికరహిత గుణంబులను వేదాంతంబులు తాము ప్రశంసించి విశ్వపావనంబులయ్యె మఱియు. 247

సీ. రూపమీద్భశము స్వరూపమీ దృశము గు
ణౌఘ మీదృశము విఖ్యాత విభవ
సౌభాగ్యభర మీ దృశం బంతరాత్మత్వ
సామర్థ్యగుణ మీ దృశంబు సకల
ఫలదాయకోత్తమ బ్రహ్మ విద్యాతత్వ
మహిమ యీ దృశము సమగ్రవేద
వేదాంతశాస్త్ర పురాణాది సమ్మతం
బై జగంబులను విఖ్యాతి నొంది

తే.గీ. సతత బుధసమ్మతంబైన మతము లోక
విస్ఫుట విగానశంకాతి విధురమయ్యె
నిప్పు డీ కృతయుగమున నెంచఁ జొప్పు
దప్పె బాహ్యోద దుర్వాద తర్కములను. 248

వ. మఱియు నుపనిషత్పక్షంబున కాక్షేపంబు పుట్టించి ప్రాణ సంహార పర్యంతంబు ననుదినంబును భయంబు నొందించి ఖలులు సత్పురుషుల చేతఁ దత్పక్షంబు విడిపించిరి. కొందఱు బాహ్యమత విషాబ్ధినింగిరి. కొందరు నూరునూరులు వహ్నివపరీతంబులైన భవనంబులు విడిచిన యట్లు నిజదేశంబులు విడిచి చనిరి. బాహ్యగమ్యదేశంబుఁ బ్రవేశించి నూరులు మఱికొందఱు దీనులై కానంబడక విష్ణువును భజించిరి. సంసార విష వారాశియందు నమృతంబైన వేదాంత దర్శనంబు తద్ద్వేషోదధి నిమగ్నంబై యుండిన విషయకాంక్షులగు సురలకు వేదాంత విచారంబులు వలువదు. సాత్వికు లాసుర భయంబున వేదాంతంబు నుడవ వెఱతు రది గావున వైష్ణవుల కిచ్చుట నిలువం జనదని సనకాదులు హరి మాయాప్రభావంబు ప్రశంసింపుచు బ్రహ్మాం డంబు వెడలి మహాభూతావరణంబునకుం జని. 249

సీ. అచ్చట నచ్చట నతి దయాంభోరాశి
వైకుంఠనాథ నివాస మహిమ
కని కని చనియొక కల్యాణ దివ్యధా
మము చెంతనున్న సమగ్రమతుల
పంచషడ్వత్సరార్భకుల లక్ష్మీశ భ
క్తిరస సమాస్పదనిరత జనిత
శునగరోమాంచకసుకుల రమాధీశ
లోక సౌభాగ్యవిలోకనోత్సు

తే.గీ. కేక్షణులఁ దత్పదస్థజనేక్షణ ప్ర
ణయకృతాంజలి పుటల వినమ్రమతుల
బ్రహ్మపుత్రులఁ జూచియభ్యర్చనంబు
చేసి జయవిజయులు నుతి చేసియపుడు. 250

సీ. ఆది భూతంబైన యా వరుణునకు నా
నలువురఁ బరమ వైష్ణవుల నొప్ప
గింప నాతఁడు భక్తిఁ గీర్తించి పూజించి
శంకుకర్ణునకు నాక్షణమె చూపె
నాతఁ డభ్యర్చించి యట గదాదేవి స
మ్ముఖము గావింప నమ్మునులఁ జాల
వలగొని యుపచారము లొనర్చి శ్రీధర
స్వామి సన్నిధి చేర్చ సమ్మదమున

తే.గీ. నమ్మహాత్ముల కుపలాలనాదికంబు
మొదలుగావించెఁ బ్రద్యుమ్నమూర్తి కడకుఁ
దెచ్చి యావేల్పు ఘనదివ్య తేజులైన
వారి వైకుంఠపతి యొద్ద వరుస నిలిపె. 251

వ. నిల్పిన సేవించి యుపాసీనులై పరబ్రహ్మానంద సింధువులగు జయాది
కుల వెంట నిక్షురస వీచికా సంగతి నిక్షు రసాంబోధినింబోలె నీశ్వర
సాక్షాత్కారంబు గలిగి నిరంతరానందంబు వహించి యున్నప్పుడొక
యనిర్వాచ్యానందంబు గాంచి సాంద్ర చంద్రాతపాతంత్ర చకోరంబు
లుంబోలె విజ్వరత్వంబు నొంది యీశ విగ్రహ విన్యస్త దృష్టులై
యనిమిషత్వంబు వహించి రప్పుడు. 252

సీ. తనముఖశ్రీ చూచి తనియని వారి న
నన్యభోగానక్తులైన వారి
భ్రాంతిఁ బొందనివారి నెంతయు స్వస్వరూ
పాది యధ్యాత్మ బోధాత్ములైన
వారిఁ గర్మజ్ఞాన వైరాగ్య జనిత ని
జాంఘ్రి భక్తిశ్రీల నలరు వారిఁ
దద్ధ్రువత్వ విశదత్వ ప్రియత్వావస్థ
గలవారిని సుబుద్ధి నలరు వారి

తే.గీ. సజ్జనులఁ జాల రక్షించి స్వభజనాతి
దూరగాసుర సంవాస దుఃఖ సహన
యత్నముల వాసియాగమాంతానుగుణ న
యంబులను వారివర్గంబు లణఁచు వారి. 253

క. మాన్య ఘనులైనవారి న
పన్యాయాధిగ ధురీణపరవాది దిగు
క్తిన్యక్కారణ చణదా
ధ్వన్యత వర్తించి యుత్సవమునగువారిన్. 254

తే.గీ. త్యక్త బాహ్యాదిసల్లాపు లగుచుఁ దృప్తి
నెరసి యాఖ్యాత మెఱిఁగించి యిచ్చఁదలఁచి
హర్ష గద్గద రవపులకాశ్రుపూర్ణు
లగుచు సాష్టాంగ నతి నిచ్చ నలరువారి. 255

చ. అనఘుఁడు నాల్గు హస్తముల నక్కునఁ జేర్చి శిరంబులెత్తి మూ
ర్కొని పద సంశ్రితాంచదుపగూఢరసాంబుధి నోలలాడి హృ
ద్వనజము లుల్లసిల్ల ననివారితయోగపదాధిరాజ్యల
క్ష్మి నిబిడమై చెలంగ నభిషేకముచేసె ముదశ్రుధారలన్. 256

తే.గీ. తద్రమయు నా సునందనంద ప్రబల ము
ఖులు మహాత్ములు నిత్యశూరులును బరమ
పారిషదులును బొగడి యపార మహిమఁ
జాల మన్నించి మన్నించి సంభ్రమించి. 257

వ. దివ్యాప్సరోజనంబుల నియోగించిన వారలంకించిన దివ్యోపచారం
బుల నుప్పొంగి వారలతోఁగూడ నాదరించి వాత్సల్య సౌలభ్య గుణాబ్ధి
యైన నారాయణదేవుఁడు ప్రోషితాగతాపత్యాది సాధారణప్రీతి నుపలా
లించిన దయాళువులై యాత్మేశ దివ్య విగ్రహ కళానుధాబ్ధి మునింగి
యాత్మేశ దిదృక్షావీచి వేగంబునం దేలి క్రియాంతరంబులు మఱచి
కృతకృత్యులై యూరకయుండి సముద్వద్భగవత్ప్రీతి కర్ష ప్రేరితాం
తరంగులై హర్ష పూర్వస్వమనస్తటాకానంద హరి పరివాహంబులగు
తద్గుణస్తవంబు గావింప నుపక్రమించి రంత. 258

గ ద్య ము :

పరమ పురుష! జితంతే శ్రీనిధే! విశ్వ చిదచిద్వస్తుధారక! సర్వ
వస్తు శరీర! స్వోచిత సర్వాభిధాన తత్సర్వతత్వోత్కర్షార్థ శ్రుతతాత్ప
ర్యార్థగోచర సద్బ్రహ్మైకాశాత్మ శివ నారాయణ పదాన్వితా! సతాత్పర్య
వేదాంత ప్రతిపాదిత మోక్షప్రదత్వ విఖ్యాత చరిత్ర! ఆత్మదాయక
యహేయ తత్వం విముఖాత్మక స్వప్రభాఽవ్యయ, అవ్యయజ్ఞాన
జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్యతేజోభిరామ పూర్ణవాత్సల్య సౌలభ్య సౌశీ
ల్యాది గుణోన్నత యుక్తోపాయస్వరూప! ఏతద్గుణమాంగల్యప్రద!
అనాద్యనంత సంశుద్ధ సర్వ మంగళవిగ్రహ, శరత్ఫుల్లారవిందాంత
చ్ఛదోపమ పదాంభోజ శుభ్రద్యుతి నఖ జ్యోత్స్నాక్రాంతాంఘ్రిజిత
పంకజశోణాంఘ్రి ద్యుతి సంఛిన్నసాంద్రేందు నిభసన్నఖశోణ శుభ్ర
శ్యామలాంఘ్రి నఖతద్గుల్ప దీప్తిమిశ్ర పూర్వభాగోద్య దింద్రాయుధ
ఖనోపమసురాగ శుక్లకృష్ణాంఘ్రినఖ తద్గుల్ఫ సంఛిన్న దీప్తికలిత
పాదానత శోణ గంగా యమునా విభ్రమ శ్రీపాణిపల్లవాభిఖ్యా ద్విగు
ణీకృత పదద్యుతే బద్ధ పీతాంబరాంచల చుంబితాంఘ్రి నఖద్యుతే
చారుపీతాంబర బహిస్ఫురజ్జంఘోరు ప్రకాశ హేమాంశు కోపరిస్ఫాయ
త్కటిసూత్ర ప్రభాంచిత నాభికాసార సోపానవళీ పదుత్పల్లవోదర
శ్రీ భూ భోగ్యాంగ మధ్యస్థసీమ రోమావళిరాజిత నుశాణఖచితా
నర్ఘ్యమణి యుగ్మోపమస్తన విశాలోరస్థల స్ఫాయత్కౌస్తుభా భరణ
ప్రభాస్వదానాభిలంబి స్థూలముక్తాభరణచ్ఛవే శ్రీ భూ సంభోగ
పిశునాజాను బాహార్గళ మహా భుజనిత్యావధీరితారక్తాబ్జ దళపాణితల
ప్రభాజిత రక్తోత్పలదళ స్ఫురత్కరనఖావళీ రత్నాంగుళీయకా నర్ఘ్య

కటకాంగదభూషిత కంబుగ్రీవార్పిత మహాధన రత్నవిభూషణ మాంస లాంస స్ఫాయత్కరపాశస్ఫుర న్మకరకుండల స్మిధిగ్ధింద్ర నీల వీజక ప్రస్ఫుర ద్విద్రుమాధర విరాజితోత్తరోష్ఠానురూపోత్తర సునాసిక శిరః పరివేష్టనోత్సవోద్యం, జానాంబుజేక్షణ శ్రోతవారిత పాశ్చాత్యసాంగోపాంగా మవేక్షణ సితాంభోజదళ న్యస్త హరినీలాభ తారక బహిస్ఫురత్తార కోస్రరాజ పద్మ విరాజిత ప్రోద్యద్దీప్తి ఘనీ నీలకేతు భ్రూవిభ్రమ భ్రమ విశాలఫాల విలసనచ్ఛుభ్రోర్ధ్వతిలక ద్యుతే వికచద్వదనాంభోజ భ్రమదానీలకుంతల మహేంద్ర నీల నీలోద్భాసి కేశపాశ మందార మాలికాంచిత కోటి సూర్య ప్రతీకాశ మకుటోచ్ఛ్రిత మస్తకశుభ్రస్మేరాస్య సుశిర సుకేశ సుశిఖాలక సుఫాల సుభ్రూయుగళ సుకర్ల సులోచన సునాస సుకపోల సువిమలోష్ఠ సుచుబుక సుకంఠ సువిశాలోరస్క సుఖోన్నత భుజప్రభో! స్వాజాను బాహో సుకరతరసుపాణే, సునఖాంగుళే, సుమధ్య మనురోమాళే సునాభి జఘనస్థలశోభనా పరభాగాతి సుందరోరు కటిస్థల సుజాను జంఘా గుల్ఫాతిసుందరాంఘ్రి యుగాంబుజ సుపాద నఖరజ్యోత్స్న సుశ్రీశోభన విగ్రహ సధ్యాత్వ భ్రమర స్తోమ ప్రభాకర శుభాకృతే విజయీభవ. 259

సీ. ఆ పూర్ణశక్తి స్వరూప రూపగుణంబు
లిటువంటివి యని తా నెఱుఁగలేక
యాగమాంతము లెల్ల నప్రాకృతములంచుఁ
దెలిపిన నాత్మలోఁ దెలివిలేక
కొందఱు మూఢులు గురుతత్వ ధీహిత
భావతావన్మాత్ర దేవతోప
నిషదాగమములు కొన్ని యెఱింగి కొనిస్వమ
నీషానుసారైక నియతమహిమ

తే.గీ. సమయములు చేసి రత్యంత సాహసమున
నఖిలవేదాంత తత్వ రహస్య సార
మది వివేకింప లేక దురాత్ములగుచు
నిట్లు కావింపుచున్నావా రేమి చెప్ప. 260

## విష్ణువునకు సనకాదులు విన్నవించుట

వ. మఱియు సనకాదు లిట్లు విన్నవించి రనంతకోటిసూర్య దివ్య ప్రకాశ స్వరూప లీలా నిత్య విభూతి స్థాయివై నారాయణ వాసుదేవ విష్ణు శివ శంభు నామంబులఁ బూర్ణ బ్రహ్మంబవు. జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజష్షడ్గుణైశ్వర్య సంపన్నుండవు. దేశకాలవస్తు పరిచ్ఛేద రహితుండవు. స్వాధీన త్రివిధ చేతనాచేతనుండవు. అనాది దివ్యమంగళ విగ్రహుండ వనంతకోటి మన్మథ దివ్యలావణ్యుండవు. శ్రీ భూనీలా సేవ్యుండవు. నిత్య ముక్త దర్శనీయుండవు. దివ్యర్షి హృత్పుండరీక విహారివి. అనంత కల్యాణ గుణసాగరుండవు. దేశకాల వస్తు పరిచ్ఛేద రహితుండవునైన నిన్నుఁ గొందఱు నిర్విశేష స్వభావంబైన చిన్మాత్రునింగాఁ జెప్పుదురు. వస్తు స్థితి స్వాత్మాభిన్న స్వరూపునింగాఁ దలంతురు. నీకు నుపనిషద్వేద్యంబైన హేమ దివ్యమంగళ విగ్రహం బుపాస్త్యర్థంబుగా నారోపింతురు. కొందఱు చిన్మాత్ర బ్రహ్మంబు నకు విశేషంబులు కలుగంజెప్పుట యజ్ఞానంబయ్యెజ్ఞానంబు బ్రహ్మ స్వరూపం బయ్యెనేని భ్రాంతి నిత్యంబగును. అయ్యజ్ఞాన కల్పంబైన వస్తువు బ్రహ్మంబునకంటె నన్యంబయ్యెనని యద్వైతంబు గూడదు. బ్రహ్మంబునకంటె వేఱై మఱియుఁ గల్పింపఁబడిన యజ్ఞానంబు కల్పకంబై చిన్మాత్రాశ్రయం బౌట న్విట్లుండి యన్యంబయ్యెనేని దానికి నాకార నామంబులు ప్రకాశింప కుండుటంజేసి యంగీకరింపరు. ప్రత్యక్షాదులచేతను గలదనియెడు బుద్ధి గలగెనా సత్యంబు గావున కల్పింపఁదగిన యదియనుట యుక్తంబుగాదు. ప్రత్యక్షాదుల చేతనే లేదనియెడి బుద్ధి గలిగెనేని యది లేకుండుట సిద్ధంబయ్యె. ప్రత్యక్షాది ప్రమాణ గుణంబు దానిం దెలియించు నదియుంగాదు. తెలియించని యదియునుంగాదని యంటిమేని యదియుం బ్రమాణంబెకాదు. జ్ఞాత యైనవాఁడు తెలియందగిన వస్తువు నొక్క విధంబునం దెలిసి తెలియనివాని బోధింపఁబూను నజ్ఞాన కల్పక బుద్ధి ప్రకాశకం బని యెడు నదియుంగూడ దిప్పు డద్వైత మతంబునందు భ్రాంత్యుపాదాన కారణంబు నిర్వచించి చెప్పరాదు గాన నజ్ఞాన కల్పకభ్రాంతి యజ్ఞానంబ యనంగలిగెనేని యంటివేని వ్యుత్పత్తియందు నన్యోన్యాశ్రయ చక్రాశ్రయ దోషంబులు వచ్చునని యుక్త దోషశాంతికినై యజ్ఞానంబు

స్వపర నిర్వాహకం బంటిమేని యద్వైత మతంబునందు నజ్ఞానంబు తానును బరంబు గలదనునది సంభవింపదు. అజ్ఞానంబు గలిగెనా యద్వైతంబుఁ జెఱచు నిందుకు సందేహంబు లేదు. సత్వంబైన తనకుఁ సత్యంబైన పరంబునకు నిర్వాహత్వంబు చెప్పవచ్చు నద్వైత మతంబునందు నజ్ఞానంబు తాన సత్యంబు గనుక పరంబున సత్యం బగుటంజేసి స్వపర నిర్వాహం బొనఁగూడదు. సన్మాత్ర బ్రహ్మంబు నందు నారోహింపఁ బడిన యజ్ఞానంబు బ్రహ్మధిష్ఠాన సత్వంబుచేత సత్యమై ప్రకాశింపుచున్నయది గావున నారోపిత సత్వంబుచేత ద్వైత భంగంబులేదని యంటివా యన్వయించిన సుతదారోపహేతు వివేకంబు లేకయుండుటం జేసి యీ ప్రకారంబుగాదా యజ్ఞానంబు బ్రహ్మంబు నందు నారోపింపఁ బడియెనని యది భేదప్రమోపాధి గాదు. ముఖం బునకంటె వేరై కాన్పించు దర్పణంబు ముఖ భేద భ్రమంబునందు పాధియైనట్ల జ్ఞానంబు బ్రహ్మంబునకంటె వేరై భేదంబు దోఁచిన యది గాదు. కావున నుపాధియుఁ గాదు. శుక్తియందు నారోపింపఁబడిన రజతం బా శుక్తికంటె వేరై తోఁచని యట్ల బ్రహ్మంబునందు నారోపిం పంబండిన యజ్ఞానంబు బ్రహ్మంబున కంటె ముకురంబువలె స్వైకతా నత్వ భంగంబునంజేసి యజ్ఞానం బుపాధియగునని బ్రహ్మంబున కంటె వేఱైన సత్తయును వేఱైన జ్ఞానంబును లేనిదానికి నుపాధింపం దగదు. సన్మాత్ర బ్రహ్మ మాయాజ్ఞానంబుఁ గల్పించు నదియును జ్ఞానంబుఁ గల్పించునదియును నంటిమేని సన్మాత్ర బ్రహ్మంబు తా నటువంటిదికాదు కావునఁ గూడదు. ఇటులంగాక బ్రహ్మంబె యజ్ఞాన నత్తాజ్ఞప్తులు పుట్టించెనేని ముక్తి సంభవింపకపోవు నద్వైతి యంబైన సన్మాత్రంబునకుఁ బరంబువలన నిటువంటి బుద్ధి పుట్టించు టయునుం గూడదు కావున పరంబునకు స్వతస్సత్వంబు గలిగెనేని యద్వైతంబు సత్తని వల్కరాదది కావున. 261

శా. కుబ్జానిర్భర రామణీయక కళాకూలంకషోల్లాస గో
గుబ్జావప్రద సత్కృపాంబునిధి రక్షోమానదానోగ్రచ
క్రా బ్జార్యస్త్రవిరాజమాన భుజసద్యస్కాల సంసేవకా
స్యాబ్జాంభోరుహమిత్ర దృష్టి కులరక్షాయత్తచిత్తాంబుజా ! 262

క. భోజ్యాధమ మన్మథ సా
మ్రాజ్యాధిక భోగభాగ్యమతిసజ్జన సం
పూజ్యాతుల వైభవ దితి
జాజ్యాగ్రహ నిత్యజాగ్రదరి రాజేంద్రా. 263

మాలిని.

సమసమద విదారీ! సద్గుణోల్లాసదారీ
సమధికగుణభావా! సారవిద్యా ప్రభావా!
కుముదహితకులేశా! కుంఠితాఘౌఘలేశా!
సమధిక జయహారీ! సౌరభూజాపహారీ! 264

## గద్యము

ఇది శ్రీ మత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్య పుత్ర
కశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడు నరసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణంబు నందు షష్ఠాశ్వాసము
సంపూర్ణము.

# నారదీయ పురాణము

## సప్తమాశ్వాసము

క. శ్రీ మహిత సత్యభామా
ప్రేమాస్పద ! సదయ హృదయ ! భీకరదనుజ
స్తోమాబ్ధి బాడబానల !
నామస్మృతి సుప్రసన్న ! నందోత్పన్నా ! 1

వ. అవధరింపుము సూతుండు శౌనకాదుల కిట్లనియె. 2

క. జీవించిన జీవేశై
క్యాపన్నత నరుఁడు 'తత్త్వమస్యా'ది వచో
రూపమున నెఱిఁగి తద్భే
దోపాధియు సత్య మనుచు నుండఁడు వాఁడున్. 3

తే.గీ. ఏక గగనంబు భిన్నమై యెసఁగుచో ను
పాధి తద్భిన్నముం దదభ్యాస విరహి
తంబునై కానుపించు తత్సాధుతతికి
ఘటపటాదిక మెట్లు నిక్కముగనట్లు. 4

తే.గీ. అరయ నేకాత్మ భేదంబునం దుపాధు
లమరు తద్భిన్నములు తదధ్యాసరహిత
ములు నయిన యవియె యుక్తములగుఁ దదప
రంబు లన్నియు యుక్తేతరంబు లగును. 5

వ. సుధాకర ద్విత్వధీహేతువై శాస్త్ర నిశ్చితంబైన కాచాది నేత్రదోషము శశియందు నారోపింపం బడినయది యదికాదు; తద్విత్వధీహేతువైన తత్కారంబు స్వసత్వముచేతనేకాని చంద్రోపితముగాదని కొంద ఱిప్రకారంబున నౌపాధిక బ్రహ్మభేదంబుల నవలంబించి వేదాంతములను దద భేదబోధకముల నిర్వహింతురు; బ్రహ్మమునందు బద్ధముక్తాది భేదము

నౌపాధికమే యనియు, నాత్మమిథోభేదమును నాత్మేశ్వర భేదమును
నీ ప్రకారముననే యౌపాధికమని స్వీకరించి యయ్యైక్యము స్వాభా
వికమని చెప్పుదు; రుపాధులగు వైచిత్ర్యము గలుగఁగా నాత్మయందు
వైచిత్ర్య భేదము గలదు; శేషశేషిత్వాదిరూపము వేదోక్తివలన
నుపపన్న మగుచునుండు; ముక్తియందైనచో నౌకానౌక భేదమును
లేదని తలంచిరి కొందఱు. కొంద ఱుపాధివలన బ్రహ్మ స్వరూపంబు
నందు భేదంబు లేదందుఱు; మఱియు, 6

మ. జను లా బ్రహ్మము శ్రౌతమౌ, మఱి నిరంశంబౌ, నభేద్యంబు నౌ
నన, భిన్నంబుగఁ జేయ శక్యమగునే? సాంశంబులౌ భూరుహా
ద్యనికాయంబులు భేద్యతం దగుఁ గుఠారాద్యంబులన్; వ్యోమభే
ద నిమిత్తంబు ఘటాదికం బెటులనౌఁ? దర్కింపనట్లన్ ధరన్. 7

సీ. నభము సాంశంబొ యెన్నఁగ నిరంశంబొ సాం
శంబైన యది నిదర్శనము గాదు;
చర్చ సేయంగ నిరంశంబైన తద్విభే
దమునందు విస్రంభ మమరి యున్నె!
యభ్రంబరూపక మస్పర్శ మద్రవ్య
మరయ భిన్నోపాధ్యవార్యశక్తిఁ
దగి భిన్న మగుచు నేత్ర త్వగింద్రియముల
చేఁ గ్రహింపఁగరాదు; జిహ్వానాస

తే.గీ. శ్రోత్రములను గ్రహింపంగ సూటి కాదు;
కేవల మనోభిగమ్యమై కీలుకొనదు
బహిరుపాధి మతంబు నభంబు దలఁపఁ
దద్విభేదంబుఁ జెప్పఁ జిత్రంబు గాదె! 8

తే.గీ. ఎంచ ననుమానశక్తి గ్రహింతు రనిన
వ్యాప్తహేతువు లేదు ఘటాద్యుపాధి
భిన్నమున భంగపడుటకు భేదకాగ
మంబు నైనను లేదు భూమండలమున. 9

సీ. అటువంటి వచనంబు లరయ నొక్కొకచోట
సమయానుభాషణ సరణిఁ గల్గు;
నాత్మైక్య నిశ్చయం బమరిన వెనుక భే
దౌపాధికత్వ వాక్య ప్రసక్తి
యుక్త మాత్మాద్వైతయుక్తి యిప్పుడు ముని
శ్చితముగా దిట విమర్శించి చూడ;
నాయధిష్ఠానన మధ్యాసితోపాధి
యద్వైత రంజితంబయ్యె నిప్పు:

తే.గీ. డట్లు కావున నేత్రకాచాది దోష
కలితచంద్ర ద్వితీయ స్వకల్పనంబు
బలెనె యాత్మద్వితీయతా ప్రాప్తిదోష
మూల మనరాదు నిశ్చయమున నెఱింగి. 10

తే.గీ. సర్వభూతైక కర్తయు సర్వగుండు
సర్వభూతాంతరాత్మయు సర్వకర్మ
సంచయాధ్యక్షుఁడును సర్వసాక్షిచేత
నిర్గుణుఁడు కేవలుఁడు సత్వనిధి విభుండు. 11

వ. అనిన నీ శ్రేష్ఠంబైన వాణి యాత్మనిష్ఠులకుఁ దత్వగోచరంబు;
మఱియు. 12

సీ. సర్వభూతంబులు జనియింపకున్న దే
వుని కింత గూఢత దనరియున్నె ?
సర్వభూతంబులు జనియింపకున్న స
ర్వవ్యాప్తతయును దత్స్వామి కగునె ?
సర్వభూతంబులు జనియింపకున్నఁ ద
దంతరాత్మత్వభాగ్యంబు గలదె ?
సర్వభూతంబులు జనియింపకున్న స్వ
జ్యాది కర్మాధ్యక్షుఁడగుట చనునె ?

తే.గీ. సర్వభూతాది ......................
..........................
..........................
.......................... 13

వ. ..............................................................................................
నని పరీక్షవాకు లాడకు; అట్లు గాకుండెనేని తత్పదంబు విమ్మట శుక్తియందుఁ బుట్టెనని పలుకంబడ దిట్లు దేహాద్యచిద్వస్తువుల యందు నజ్ఞభ్రాంతిచేతం బలుకంబడిన యివి యుత్పన్నంబు, త్వం పదంబు దానియందు ననిన శబ్దవేది యవగతంబు సేయండె; పదం బెక్కడ వ్యుత్పన్నంబగు తద్వాచ్యంబదె యనుట; శ్రుతికి వ్యాకరణం బంగంబు; దానికి సూత్రపాణిని; ఇతండు యుష్మదస్మత్పదంబులచేత నవాచులనియును 'శ్రోతామాంతా' యని వేదోక్త చేతనాన్యంబనందగు; చేతనుండు వేదోక్తిచేతను భిన్నంబగుటచేత నావస్తువునందు వైదికులు త్వమహమ్మని ముఖ్యవృత్తిచేతం బ్రయోగింపుదురు; ఉద్దాలకుండు శ్వేతకేతుని నచిరశ్యనింగా నెఱింగి త'త్వం' పదంబులచేత నను వాదంబుచేసె; వానికి నచిద్వాచిత్వం బెక్కడిది ? యయినను త్వం పదం బభిన్న ముఖ్య విజ్ఞాతుండైన జ్ఞాతయందు వ్యుత్పన్నం బనిన నందువలన నేమియయ్యెడు ననిన: విను, మచిద్విశేషంబునకుఁ దత్త్వహానివలన జ్ఞాతృత్వంబులేదు; అచిద్విశేషంబులెవ్వి కాన్పించు జ్ఞానశాలురై జ్ఞాతకుఁ ద్వంపద వాచ్య ప్రమాణంబుచేత నామీఁద దాని చేతానాత్మానులక్ష్యంబుచేసి, వానికి నిక్కడ నేకత్వబోధనంబునందు స్థూల సూక్ష్మావస్థ సర్వప్రత్యద్భూతేశ్వరైకత్వంబగును; తావన్మాత్రం బుననె జీవబ్రహ్మైక్యంబు సంభవింపదు; అన్యస్థలంబున జీవ పరమాత్మలకు భేదంబు సిద్ధంబగు.

[1]శ్రుతిః. "క్షరం ప్రధాన మమృతోఽక్షరః ?
క్షరాత్మనా విశతే దేవమేకం,
భోక్తా భోజ్యం ప్రేరితారం చమత్వా
జుష్టస్తస్మాదమృతత్వమేతి."

యనిన శ్రుతివలన సిద్ధంబగు; జీవబ్రహ్మలు దేహ దేహివత్త్వంబుల చేతం బ్రసిద్ధిఁగాంచిరి; అంతర్యామి బ్రాహ్మణాదులయందునది గావునఁ

1. శ్రుతిః; "క్షరం ప్రధాన మమృతాక్ష హరహః
క్షరాత్మనావిశతే దేవ ఏకం
భోక్తా భోజ్యం ప్రేరితారం చమత్వా
జుష్టేస్తత స్తనామృతత్వ మేతి. (మూ)

జిదీశ్వరులకు భేదంబగు; నిట్లైనం గొందఱు సాధులకు స్వేశాభేద వాక్యంబులు తదావేశ తత్స్నేహ వికారంబులవలన నక్షరంబులగు నిశావేశంబుల వలన విరించాది ముఖంబులయందు నీశత్వసద్వాక్యం బులు గ్రహావిష్టముఖంబునందు 'సోఽహమితి' వాక్యంబులుం బలె సమ్మతంబులైన యవి ; అపాస్యస్నేహ వికృతివలన స్వైశైక్య వాక్యంబులు సత్పురుషులకైక్యంబు దెల్పునని యీ వేదాంతంబు లోకానొకచోట భగవద్దేహారిత రితతేహంబై 'త్వమస్మి'త్యాది భాష ణంబులయందు నెఱింగించు నట్లుగాకుండిన శంభుత్వాభిప్రాయంబుచేత నీశుని 'స ఇదం సర్వం సోఽహ' మ్మనియును విశ్రుత్వంబు చెప్పఁ బడును; దీపతేజంబు గృహవ్యాప్తంబై యున్నచో దాని వెలుంగు గృహస్థిత ద్రవ్యంబును దద్గృహంబునఁ దేజోమయంబని చెప్పుదురు; తేజంబుపోయిన వెనుక మందిరం బంధకారావృతంబయిన నంధ కారంబయని యందురు; ఇత్తెఱంగున విశ్వైక్యోపనిషద్వాక్యంబులకు గతి గలిగియుండుటంజేసి యైక్యవాక్యంబులకు శ్రుత్యేపకావగత మహ దాద్యచేత నైక్యవాక్యంబులకు ముఖ్యార్థహీనత యెక్కడిది ? సమస్త చిదచిద్వస్తు శరీరకుండై సర్వనామంబులుంగల యీశ్వరునియందు నహంత్వ మిత్యాది పదంబులును ముఖ్యంబు లంతర్యామి బ్రాహ్మణాదు లైన వారలశేష చిదచిద్వస్తు శరీరైక పరైకత భేదశ్రుత్యవిరుద్ధంబై యంగీకరింపం దగినయది యని రిట్లు గావున చిదచిదీశ్వరులకు మిథోభేదం బుపనిషత్సిద్ధంబై వేదపారగులచేత స్వీకరింపఁ దగిన యది. 14

క. స్వామీ! యిద్ధరనంతర
మీమాంసా సంప్రవృత్తి మెఱసిన విబుధుల్
తామసులై వాదింపఁగ
నా మూర్ఖులు బాహ్యులట్ల నాడఁగఁ దగదే? 15

తే.గీ. శ్రుతి నిరూపిత యుష్మత్స్వరూప రూప
గుణకలాపంబుల నెఱింగికొనుట కేరి
తరము భవదీయ కరుణాసుధాతరంగ
మహిమ లేకున్న స్వామి! రమాకళత్ర! 16

సీ. సకల వేదప్రవర్తకుఁడైన యట్టి ప
దృజుఁడంతవాఁడ తామసము రాజ
సమునైన యాత్మకల్పమునందుఁ దత్త్వవి
పర్యయంబంది ప్రాగ్భణితసాత్త్వి
కప్రకాశిత నిజకల్పంబునందు నా
తోమ్మదీరితంబులైయున్న యాగ
మాంత తాత్పర్య భూమ్యంతయుష్మత్పార
గోక్తు లుల్లంఘించి యుక్తి తప్పి

తే.గీ. సాత్త్వికేతర తత్కల్ప సమయములను
హరునిఁదను నింద్రముఖ్యుల నా పరాత్మ
యనుచుఁ బలికెఁ బురాణాళి; పరమ మూఢు
లైన యన్యులు పలుకుట యరిది యగునె? 17

తే.గీ. అక్కటా! యేమి సేయుదు రహహ బద్ధు
లైన జీవులు త్రిగుణమాయం గలంగి
తలఁపుదురు పల్కుదురు చేష్టితము లొనర్తు
రప్పుడు గుణానురూపంబులై చెలంగ. 18

తే.గీ. తత మహోజ్వర దోష సంతప్తులైన
నరులఁబోలె నచిద్బద్ధనరులఁ బరమ
కారుణికుఁడైన ఘనుఁ డనుకంపఁ బ్రోవ
వలయుఁ దనదయ మిక్కిలి వాసికెక్క. 19

ఆ. కరుణఁ దనకు నెంతగలిగిన బద్ధుండు
బద్ధుఁడైనవాని బంధముడుగఁ
జేయలేదు చర్చసేయు నశక్తుని
కరుణ నిష్ఫలంబుగాదె జగతి. 20

ఆ. ఆప్తులై పరస్సహస్రుల ముక్తులు
నిత్యులెన్న నిత్య నిర్మలాత్మ
లిద్ధమతులు యతులు హేయప్రతిభటు లి
ట్లెంచ వారిచేత నేమియగును? 21

వ. అఖిలహేయ ప్రతిభటత్వంబు నీసొమ్ము 'తమేవ విధి' త్యాది 'మృత్యు మేతీ' త్యాది వేదవాక్యంబ విద్యావిషయభూతుండ నిన్ను నేహేయ ప్రతిభటునింగాఁ బలికె నవివేకగ్రస్తంబైన లోకత్రయంబు నిలువుము. యుష్మతత్త్వ విద్యాసుధచేత జీవులం బ్రోవవే దయాపయోధి! యని శ్రుతి స్మృతులచేత నీ తత్త్వంబు సత్త్వ ప్రకల్పితులైన యుత్తములు విశ్వసింపుదురు; రాజసులు తామసులు ప్రత్యక్షానుమానంబులచేఁ గాని విశ్వసింపరు; తత్ప్రత్యక్షానుమానంబు ప్రకారంబు స్ఫుటంబుగా నీ వెఱుంగుదువు. ఆ ప్రకారంబునకు యత్నంబుచేసి బద్ధుల రక్షింపవే పరవ్యోమ నాయకా! మహాభుజా! 22

తే.గీ. సాధు లెవ్వరు ధ్యాన గోచరముగాఁగ
నిన్నుఁ బురుషోత్తమునిఁ జూడ నియతిఁ గోరి
మీఱుదురు వారు దృక్సమున్మీలనమున
నైన నినుఁ జూడఁ గోరుదు రాదిపురుష! 23

వ. ఎన్నఁడు నిన్నుఁ బ్రసన్నవదనుఁ గర్ణాయతలోచను, విశాల ఫాలన్యస్తోర్ధ్వతిలకుఁ, గేశవుఁ, గేశపాశకించిన్నట త్పారిజాత మాలికాలంకారు, ననేక కోటిసూర్య ప్రతీకాశ కిరీటాశ్రితమస్తకు, సుభ్రూనాసా విలాసుఁ, జారుశ్రుతిస్ఫురన్మకరకుండలు, శోభనోత్తరోష్ఠు, శుచిస్మితు, సుకపోలు, నరుణాధరు, సుదంతు, సురుచిర చుబుకప్రదేశు, సుభ్రూభంగ గమ్యాశ్రితోదయు, సుగ్రీవు, సూన్నతస్కంధు, జాన్వాయత చతుర్భుజు, సుపాణి, స్వంగుళి, సునఖరు, సుప్రకోష్ఠు, సుభూషణు, సువిశాలోన్నతోరస్కు, శుద్ధ శ్రీవత్సలాంఛను, శ్రీ భూనీళాంక సంయోగు, సుపిశునస్వనులేపన స్ఫురన్మణిస్తను, రాజత్కౌస్తుభ వన మాలికాశోభితు, నాభిపద్మాయతస్ఫార నానాహార విభూషణు, సురోమ రాజి సువళీసుపల్లవ తలోదరు, సుహేమాంబర సంఛన్న జఘనోరు కటిస్థలు, సుజాను జంఘాగుల్ఫపాణి పాదాంగుళు, శ్రీమత్పద జ్యోత్స్నాధ్వస్తాజ్ఞాన తమస్సమూహు, నానందమయమంటప నాగభోగాసనాసీను, సునందనంద ప్రముఖ సురపారిషద సేవితు, దివ్యచామర వాతేషద్ధూత యజ్ఞోపవీతు, నుత్తరీయ పరివేషచ్ఛన్న భూషామణి దీధితిముక్త బ్రహ్మేంద్ర రుద్రాద్యమర పరివృతుఁ, బ్రపన్నాత్మాను

రూపార్థప్రదస్మేరావలోకను మా కన్నులు దెరచి చూడంగలిగెడు నని కోరిన మమ్ము ననుగ్రహింపవే యని సనకాదులు విన్నవించినఁ బ్రసన్నాననుండై సాక్షాత్కృత విగ్రహుండై భగవంతుం డిట్లనియె :

## విష్ణువు సనకాదులకు సమాధానము చెప్పుట

సీ. ప్రథిత వేదాంత తాత్పర్య మహానిధి
సిద్ధాంజనములై ప్రసిద్ధిఁ గాంచి,
వరసాధుజన సత్త్వవాక్య మితిజ్ఞాత్వ
పిశునంబులై చాలఁ బెంపుఁ గాంచి,
యాత్మీయ భక్తి రసార్ద్రింబులై మద
ర్థైక ప్రయోజనోత్సేక మంది,
యంచిత స్వాభావికానవధికసవి
శేషత్వకారులై సిరి వహించి,
తే.గీ. తనరు భవదీయ సూక్తి సుధారస ప్ర
వాహములఁ దృప్తిఁ బొందితి వాంఛదీర
నో మహాయోగివరులార! యుత్సవంబు
లయ్యె నంతోషమందితి నాత్మలోన. 25

వ. అని మెచ్చి మఱియు నిట్లనియె: 26

సీ. అస్మత్ప్రయోజనం బఖిలలోకాభి ర
క్షణమొ; మీరలు నట్లైకాఁగఁ బల్కి-
తిరి; యెవ్వరేని సద్వృత్తి స్వార్థారంభ
రహితులై మఱి పదార ప్రయోజ
నాసక్తిఁ బొరలుదు రట్టి జనులను మ
దాప్తులఁ బోషింతు ననుదినంబు;
స్వార్థపరత్వ మన్యార్థైకవిరతియుఁ
బూనిన జడుల దుర్బుద్ధి జడుల
తే.గీ. నరయ లోకహితార్థంబు నస్మదభిమ
తార్థమునుగాఁగ నేఁడు మదగ్రసీమ
నిగ్రహానుగ్రహ క్రమ నిపుణులైన
ఘనులు మీరిట్లు పలికితి రనఘులార! 27

మత్తకోకిల-

మీరు మీఱఁగఁ బల్కు వాఙ్మయమే జగంబుల నెవ్వరిం
పార సంధ్యల మత్స్యమీపమునందు నుండి పఠింతురా
సారవేదుల నుద్ధరింతుఁ బ్రసన్నశక్తిని వారి సం
సారవేదులఁ జేయ నీనుతి సంస్మరించెదరేనియున్. 28

ఆ. ఔర ! భళి! మదీయతానుసంధాన సు
ఖాబ్ధి విహరణోత్సుకాత్ములైన
మిమ్ముఁ బ్రోచుటెంత మీ రాత్మవేదితు
లస్మదర్థ పూర్ణులైన ఘనులు. 29

వ. బ్రహ్మాండంబులో నున్న జీవులకు నెన్నియెన్ని మిథోవాదంబులయ్యెః పరతత్త్వంబైన నాయందు వారలకు నేమి తోఁచెః వేదాంత వాక్యంబులస్మత్ప్రకాశంబులై కలిగియుండ విరుద్ధ వాదోదయం బేమివలన నయ్యెః మద్భక్తులలో నొకటి తక్కఁ దక్కిన యది తత్త్వవిప్లవంబు సేయ నెయ్యది సమర్థంబు దాని దండించెద నెఱింగింపుఁడు; మీకుఁ బైశున్యదోషంబు ప్రాపింపదని భగవంతుం డానతి యిచ్చిన. 30

క. తచ్ఛంకార్త బహుక్రియ
లచ్ఛిన్న బహుప్రకారులగు కాలాదుల్
తచ్ఛక్తులయుతకోట్య
ర్కచ్ఛవి యగు విభున కెరఁగి కరములు మోడ్చెన్. 31

వ. మోడ్చి యిట్లని విన్నవించె: ''దేవదేవా! యుపనిషదతర్క్యాసంఖ్యేయ శక్తిక! యహేయానంత సుఖ చిత్స్వరూప ! యపార సద్గుణ ! యనాద్యంత సంశుద్ధ పరమవ్యోమ పదాలయ ! చతుర్విధ చతుర్వ్యూహ ! శ్రీనిశేషవ్యజితాఖిల ! యష్టదిగీశ్వరాకార ! తల్లోకావృత! సర్వప్రద ! శంఖచక్రగదాంభోజ ముసలాసిధనుశ్శ్రీగర్వితదివ్యరూప ! లోకావృత సమాశ్రయ ! యనాదినిధనా ! యనంత శక్తులును శుభ విగ్రహులు నైన కుముదాదులచేతను ననాది సురేశ్వరులైన యింద్రాదుల చేతను, ననాద్యంతానంత పరబ్రహ్మలోక సుఖాబ్ధులైన నిత్యులచేతను నిత్యమును సేవింపఁ బడువాఁడవు; నిర్ద్వంద్వనిష్ఠ నిర్వాణ ! లోక పాలక ! సర్వజ్ఞ ! సత్యసంకల్ప ! సత్త్వైశ్వర్య ! యఖిలేశ్వర ! సేనానాయక భుజలీలాధి గతోపితైశ్వర్య సాగర ! యప్రయత్న శ్రుతా

నాది కాలప్రకృతి సత్క్రియ దయాదత్తాగ్నిపురుష ! కర్మస్వాతంత్ర్య ! పాహి నమస్తుభ్యం హృషీకేశ నమస్తుభ్యం జగత్పతే ! చిదచిద్వస్తు రూపాయ చక్రిణే నమస్తుభ్య''మ్మని కాలప్రకృత్యాత్మాదృష్టశక్త్యాద్యధి దేవతలు విన్నపంబుసేయ భగవంతుండు ప్రసన్నుండై యిట్లనియె : 32

సీ. నిత్యదేవతలార ! నిక్కం బెఱింగింపు
డీ బద్ధదేహుల కెందువలన
దత్త్వ విప్లవ మయ్యెఁ దగనికాలంబున
వేదాంతములు గల్గి వెలసియున్న
బ్రథితశక్తిని జతుష్పాద్ధర్మ శాలియౌ
కృతయుగంబునన సంగతము కాదె
[1]తత్త్వ విప్లవముఁ దత్కలికాలమున కది
యుచితంబు కలివేళ నుండు ధర్మ

తే.గీ. వృషభ మదిరుగ్ణ పాదమై వివిధ దోష
సిద్ధమైన రజస్తమో వృద్ధిబుద్ధి
[2]యల్పమై యున్కి కాలోచితా చరణము
గాదె కలికాలమునకు దుష్కలుషమునకు. 33

వ. అది యెట్లయ్యె వెఱవక చెప్పుండని సర్వ విద్యాధిపతియగు శ్రీపతి సనకాదులకు స్వజ్ఞాన దార్ఢ్యంబు గలుగ నానతియిచ్చిన మాయా ప్రకృతి దేవత యీశ్వర కలిత మని తెలిసి, కృతనతియై యిట్లని విన్నవించె. 34

సీ. అవధారు దేవ ! నన్నా కాలశక్తిని
యోగింప బహువిధోద్యోగలీల
బరిణమింపుచునుండుఁ బరిణమింపుచునుండఁ
గల కాలశక్తి యేగతిఁ దలంచు
నది భవదాజ్ఞఁగా నౌదలఁ దాల్చినే
నీయవస్థఁ జరింతు నీవిధమున
నగు నవస్థయుఁ ద్వదీయత్వంబునకు మేర
యై నేఁడు మత్స్వభావానురూప

---

1. తత్త్వవిప్లవమున దత్కలికాలమునకది.
2. యల్పమైయునికి కాలోచితాచరణము.

తే. గీ. షుగుచు నను సుఖ మొందించు నాత్మగర్భ
మూఢ చేతనులైన [3]దుర్మోహదుష్ట
కర్మలను స్వవిలాస వికాస పరులఁ
జేరి యట్లు వినోదింపఁ జేయుదాన
నఖిలజగతి నీవెఱుంగనియదియుఁగలదె ? 35

వ. పూర్ణకాముండవై శ్రీభూనీళామనోహరుండవగు నిన్ను నేను వినోదింపఁ జేసెద; లీలచేతం జూచితి నీవె స్వాభావానవధికాప్రభావుండవైన నీకు శేషతైకస్వభావము కలిగి భవల్లీలారసోచితనై దేహేంద్రియ మనఃప్రాణాద్యవస్థారూప విక్రియ నగు నన్నుంజూచినవారై స్వస్వరూపస్వభావజ్ఞానవర్జితులు కొందఱే ప్రకృతి స్వార్థవిలాసయగు నచిత్తని తలంతురు; వారు తద్గురభిమానానురూపాదృష్ట ప్రచారులు రాజలీలోచితయై రసావహయై రాజావనరము చూచి పోవుచున్న తద్రాజకులజయై తన్నిరీక్షణైకపరయై విలాసైకావలోకనములు గల రాజాస్థాన కాంతను క్షుద్రవిటులుంబలెఁ జూచి కామార్తులై తముం దముం గోరుచున్నదానింగా దానిం దలంచినవారై తద్రాజభృత్యుల చేతం బలె దుర్వ్యాపారోచిత దండంబులను దద్భృత్యులైన భూపాల కాలాద్యుల చేత నధోగతులం బొందుదురు; దేవమద్గర్భస్థాత్మలకు స్వస్వభావావివేకితయిది మొదలైనయది; ఆయవివేకిత యనాదిభ్రమ కారణ; మీశ్వరా! ఇది గాన వీరికి నిందు విభ్రాంతి నాచేతఁజేయం బడదు; ఆత్మేశ్వరా! నీ లీలా రసోదయమునందు నేనేమి సేయుదాన భవదర్థనైన యేననేకప్రకారములను యత్నము సేయందమము రజము సత్త్వముననియెడు మూఁడు గుణంబులు స్ఫురించును; తద్గుణోదయమాత్రము చేత మద్గర్భస్థాత్మబుద్ధులందుఁ గర్మఫలోదయంబులైన వివిధ భావంబులు పుట్టుచున్నయవి. 36

ఆ. ఏ ననాది నెంచ నీ జీవులును నాదు
లన్వయమున నాది యరయ మద్గు
ణాతతప్రకల్పితైత త్తిరోధాన
మును ననాది వేదములు గణించు. 37

వ. కావున. 38

3. దుర్మతులదుష్ట.

తే. గీ. చర్చసేయ ననాది నిజస్వరూప
ఘనతిరోధాన మంది చేతనులు నేఁడు
విశ్రుతంబుగ స్వోచిత వృత్తి దెలిసి
వెలయ కతిమూఢులై యుండు విక్రియతను. 39

సీ. మద్గుణోద్రేక సమగ్రత కించిదు
న్మీలితమతులై యమేయవస్తు
విజ్ఞానమునకు సద్వృత్తి నుద్యోగించి
తత్త్వనిశ్చయోదయమునంద
శక్తులై కామదోషమునఁదద్వస్తువు
లాత్మీయము లటంచు నాత్మఁదలఁతు;
రతిబోధశక్తి ప్రభాప్తేయమై [4]పోరు
సత్త్వసిద్ధి భవత్ప్రసక్తిఁ జెంది
తే. గీ. పూర్ణ యాదృచ్ఛికాజ్ఞాత పుణ్యమూల
ఘనసదాగమములు సముత్కంఠఁ జదివి
నిజనిజేతర తత్త్వముల్ నిఖిలములు నె
ఱింగికొందురు చేతనుల్ సంగతముగ. 40

క. అది కావున నోదేవా
త్వదీయులైనట్టి నిఖిల తను భృత్తులకున్
మదుదీర్ణ వృత్తిఁ దలఁచిన
యది యుపకారంబె కాక యపకారంబే? 41

సీ. నేఁడు ముక్తునినేని నిత్యునినేని నే
నాత్మనా భావించి యాభవాంధ
కూపంబులోఁబడఁ గుమ్మితినేని యా
యపరాధము వహింతు; నట్ల సేయ
చిపితా విర్భూత రూపాత్మ సంబాద
నమునకు శక్తిలేశమును లేదు;
నాకు నభివ్యక్తమై కనుపట్టిన
యనలంబు గప్పునే యరణి గాన

4. సోరుచు.

తే.గీ. యుష్మదాజ్ఞా విలంఘన వ్యుత్క్రమములు
కలిగెనా యవి దండించి కావు; శుద్ధిఁ
జెందెద నటంచుఁ దననిజశీలమెల్ల
విన్నవించుచు మఱియు నవ్విభున కనియె. 42

వ. నీ వడిగిన ప్రశ్నం బిదియును నొకలీల గాని నీకు నజ్ఞత లేదు; సర్వజ్ఞుండు సర్వవేత్తయునని యాగమాంతంబులు పలికినఁ బరవస్తువవగుస్వాభావిక జ్ఞాననిధివైన నీకు నజ్ఞానం బెక్కడిది? కృతయుగంబునఁదత్త్వ విధిప్లవంబు యుక్తంబు గాదది స్థిరం బయ్యెనేని దానియందుఁదద్దోష వృద్ధి తత్త్వబుద్ధిక్షయోచితంబు. 43

మ. చనవే రోగము లొక్కయౌషధమునన్ సన్నక్షయ ప్రాప్తియో
జనపంకాంబు కళంకముల్ కతక బీజవ్యాప్తిచేఁ బాయవే
ఘనసత్త్వోదయమైనఁ దూలదె తమోగర్వంబు తద్వృద్ధి త
త్త్వనిబోధక్షయహేతువై మెఱయదే తత్తత్క్షయావస్థలన్. 44

మ. పరమాత్మా ! హరి ! మీ యనుగ్రహమునం బద్మాసనుండందె న
త్యురుసత్త్వంబు తదీయశక్తి మిముఁ దా నుల్లంబులో నిల్పి త
త్పరుఁడై సత్త్వ వివృద్ధిగా తగె వివృద్ధంబైన సత్త్వంబునన్
స్థిరవిజ్ఞానులఁ గాంచె నంత సనకాది శ్రేష్ఠులన్ జ్యేష్ఠులన్. 45

మహాస్రగ్ధర :-

సనకాదుల్ శుద్ధసత్త్వుల్ శమకలితులు యుష్మత్పదధ్యాననిష్ఠుల్
మనసాజ్ఞాయి ప్రబుద్ధుల్ మననఘనులు యుష్మత్పదాంభోజభక్త్యా
గ్రసమగ్రుల్ నిన్ను నీభక్తిజనుల గరిమం గాంచి సౌఖ్యంబు నొందం
గనియాసర్వాత్మలున్ దుఃఖమునఁ గనల భూఖండముం జూచియంతన్.

వ. వారలు నిట్లే యనుభవంబు నొందవలయు నని యీభూమిం జరింపుచు నందఱికిని సాంఖ్యంబగుంగాక యని యజ్ఞానరోగోపశమనంబగు త్వదీయజ్ఞానభేషజంబు భవరోగులకెల్ల నొసంగి రందుఁ గొంద అధికులై కలంగిరి మఱియును. 47

ఉ. కాకముల ట్లసహ్యములు గాఁక కువాదము లాచరింప నీ
లోకము లాకులంబులయి లోలతనుండు మనోహర ధ్వనిన్
గోకిల పాకముల్ పలుకు కోపునఁ బల్కఁడు రాగమాంతు లా
పాక మెఱుంగలేకఁ బెడ బాగులఁ జూచిరి బాహ్యు లందఱున్. 48

## ధర్మాధర్మాభిమాన దేవతలు, ఆత్మప్రవృత్తి ప్రకారముఁ దెల్పుట

వ. నాకును వేదాంత సుచికిత్సకుల వలన దోషరహితులుగాఁ గలరు, ఒక ముహూర్తంబు సహింపుండని కాలాభిమాన దేవత పల్కిన నస్మిత్తాన నుండె ధర్మాధర్మాభిమానదేవతలం జూచిన వారలు ప్రణమిల్లి యాత్మ ప్రవృత్తిప్రకారం బిట్లని విన్నవించి రప్పుడు మాకు సాక్షి యనంత శాఖ వేదాభిమానము గల్గిన నిత్యదేవత. ఈ నిత్య దేవత పల్కినపల్కు శంకించరాదు; నిరామయ మైనది; మానదకలకిది సాక్షి యగుట స్వభావ శిష్టమీ దేవత యాజన్మసిద్ధ తత్త్వజ్ఞానాభిమానస యైనది; పరమార్థయై సమగ్రయై యవ్యభిచారియై యున్న భవత్పాద భక్తి గలుగుటచేత నిత్య సుఖం బందియున్నయది;యటువంటిదేవతత్వత్పాదపద్మగాదోద్రిక్తభక్తి సుధాంబుధి యందు నుప్పొంగి భవత్సౌభాగ్యామృత సాగరము సొచ్చి యప్రాకృతానంత కల్యాణచిత్సుఖ మనుభవింపుచు నిత్యులనుముక్తులం జూచుచుఁ బ్రమోదించినయదియై బద్ధులను దేవత [5]కటాక్షింపని చందంబునఁ దానును నిరీక్షింపక యనాది త్రిగుణానాత్మాచ్ఛాదితాజ్ఞాన చిద్బలము వలన దేవ నర తిర్యక్స్థావర ప్రభేదదేహంబులు వహించిన వారలం జూచి కరుణగలిగి వారికింగా నిట్లనియె : స్వామీ ! ఈయాత్మలకు దేవతోద్దేశ విరహితమైన యీకర్మము హితము విశుద్ధోపదేశాది దేశప్రాప్తోచితాంగకమై సత్కాలోచితమైన యీకర్మంబు ప్రాకృతంబు వైకృతంబునై రెండు తెఱంగులయ్యె నది వర్ణాశ్రమ వయోవస్థావేశాది ప్రవిభావికమై తపోదాన పూర్తంబులచేఁ జేయంబడెనేని శ్రేయస్సునిచ్చు; సుతానుక్షణ ధ్వంసియైన నేనీస్వస్తి తీక్షణమునందె చోదితమై యుద్దేశ్య దేవతను బ్రసన్నఁ గావించిన తత్ఫలము నధికారికి [6]నిప్పింపఁ గలదు; ఆ దేవతవేరు మఱొక వస్తువ యెందుఁ బ్రయోగించెనేని తచ్ఛబ్దవాచ్య యైన దేవత [7]యాయర్థమయ్యెడిది సిద్ధము; తానెఱుంగనియంతమాత్ర మునసె యీ దేవతకు నజ్ఞానంబులేదు ; హవిరావిగ్రహణ దేవతా వాచకంబులైన శబ్దములచేతఁ జెప్పఁబడిన దేవత జ్ఞానము గలదియై తనుం బూజించెడివారికొఱకు తత్పూజ భక్తిప్రసన్నయై శుభమునిచ్చు; నజ్ఞులు తఱచుగాఁ బ్రయోగించిన మాత్రంబున నది వానికి నర్థంబు గాదు; మఱి యేమి[8]యనఁ దత్త్వజ్ఞులైనవారు బోధించిన నెఱుంగంబడు; నిటువలెం గాకుండెనేని యతిప్రసంగంబౌ; నది [9]యెట్లన: నజ్ఞులైనవారు పెక్కుమాఱు లహంపదము దేహంబునందుఁ బ్రయోగించిన యంత

5. కటాక్షించని; 6. నిప్పించ;
7. యార్థ. 8. యంటె; 9. యెట్లంటే;

మాత్రమ్మున వానికి నది యర్థంబుగాదు; మఱియేమి [10]యన చేతనుం డందేయర్థంబు నర్థతత్వాలోచనచేత నటువలె నహంపద వాచ్య నిర్ణయ మటువలెనే తద్దేవతా వాచి పదవాక్య నిర్ణయ [11]మగు నిటువలెఁగాఁగా నాత్మానాత్మ సమస్త వస్త్వంతరాత్మవైన నీకుఁ దత్తచ్చతుర్థ్యంత పదోద్దేశ్యత్వంబు తెలివిపడును ప్రత్యంతాలోచన చేతన తెలిసి యీ యగ్నీంద్రాది పదోద్దేశ్యదేవతాక మఘాభిద ముందఱ క్రియలు వల్కెను; ఎవ్వండెవ్వని నుద్దేశించి యేతద్ద్రవ్యంబు నిచ్చును వాఁడు వాని వలనఁ దద్ద్రవ్యత్యాగ సదృశఫలమందు నన్యుని వలన లేదటన్నను త్స్వర్గనయో వేదవాక్యంబు ఘాతింబొందింపు చున్నయది యని యీ యజ్ఞంబునందు నాయికయైన యుద్దేశ్య దేవత యాగఫల ప్రదయని లిఙ్మదులు ధాత్వర్థ కార్యంబుచేత దృఢాన్వయములై లోకంబున వేదంబునఁ బరుని బోధింప షయములై ముఖ్యార్థ సంకట మైనప్పుడముఖ్యవృత్తి చేత న్యార్థవరంబులగును; భావార్థవశ్య కార్యత్వ బోధనంబునందు సంకట మేమి కాలాంతర ఫలప్రాప్తి కొఱకై దేవత పూటయై కల్పింపఁ బడియెను; తెలియంబడిన వహ్న్యాది దేవతలు మాయచేత బంధంబు నొందె నా ఫలప్రదానా స్వాతంత్ర లయ్యేనేని త్వదావేశంబున నా ఫలంబు వినుసమర్థులౌ చున్నయవి; యంగవేదియైన పాణిని యజిధాతువును దేవపూజ యందు విధించెను; రాజపూజాఫలంబు రాజుంబలెను ప్రీతయైన దేవత యర్థికొఱకు స్వపూజాఫల [12]మీయంగలదు; రాజపూజచేతఁ గాలాంతర ఫలప్రదమైన ధర్మంబు గలదాయని యన, లేదు; జనకాజ్ఞస్వకీయులను రక్షింపఁ గలయది యని స్మరించి యీ ప్రకారంబున నేకాలాంతరంబున దేవుండు స్వసేవియైన యర్థికొఱకు ఫలంబు నిచ్చును; కర్మమే ఫలప్రదంబుగా; దట్లు కాకుండెనేని యరాజక దేశంబు నందు స్వైరా స్వైరవిహారులైనవారికి నాస్వైరాస్వైర విహారంబులే దుఃఖకరంబు లీవలయు నవి యిచ్చట భూమియందు లేదనియెడు నీ యభిప్రాయంబు గలదియై వేదాభిమాన దేవత భవత్పూజారూపమైన కర్మ మగ్రంబునం జెప్పెను; కర్మమే ఫలప్రదంబు గాదనియుం బలికెను; దేవతయై కర్మఫల ప్రదగాదనియును బలికెను; వైపరీత్యంబునఁ గర్మ కాండమె దేవత నొకానొక దిక్కున నా దేవతయె ఫలప్రదయని చెప్పను; తద్దేవతోక్తమైన వేదాభిమాన దేవతాభిప్రాయంబు తండ్రి వలన విని శుకుండిట్లనియె. 49

10. యంచే. 11. మవు. 12. మియ్యం గలదు.

సీ. మదిలోన వేదాభిమాన దేవతకు ని
యాకూత మిట్లుండ నందు ద్విజులు
వైమనస్యమునంద వచ్చు నేరీతిని
వేదోక్త కర్మముల్ వివిధములయి
యమర విశ్వైక వస్త్వంతరాత్మకుఁ డైన
విష్ణువునకుఁ బ్రీతివెలయఁ జేయు;
నాతండె కర్మఫలాదు లీనేర్చువాఁ
డనిరి కొందఱు; కొంద ఱతనిఁ గొల్చి

తే. గీ. యలఘుమతులకు నిట్లు కాదనిరి; కొంద
ఱాత్మపక్షాను గుణము లౌనట్టి నయము
లాడి; రొక కొంద ఱిట్లు కార్యాన్వయంబె
యనిరి సిద్ధాన్వయంబు గాదనుచు భ్రమసి. 50

వ. ఇట్లు లోకానుసారంబున వేదంబునందేని యర్థం బెవ్వ రెఱుంగుదురు? వారికి నాగమంబు కేవల సిద్ధమైన దానిని బోధించు ననియెడు వాక్యం బెక్కడిది? 'గామాన' యేత్యాది వాక్యేష్ట గవానయ నాదుల చేత నన్వితార్థంబులు బోధించు నీ వాక్యంబు పదంబుల నీలోకంబునం గల దిదిగాన వేదంబునందేనియుఁ గార్యాన్వయంబు బాసి కించిత్తేని యన్యపదంబులకు స్వార్థనిష్ఠత్వంబు లేదనుట నిశ్చయ మందు మంత్రార్థవాదములకుం బలె నుపనిషత్తులకును గార్యాన్వితార్థ నిష్ఠత్వంబు గాని సార్థైక [13]నిష్ఠత్వంబు లేదు; మత్కార్యంబు యాగాదికంబు గాని యుపాస్తి గాని యుచితంబగు నుపాస్తి బుద్ధులకు యదార్థత్వనియమ మనియెడు నదియును లేదు; యోషిదగ్నియాది వాక్యవాక్యంబులకుంబలె నుపనిషత్తులకు యధాప్రతీత సిద్ధార్థ [14]నిష్ఠత్వమును నియతంబు గాన వేదాంత మీమాంసారంభము[15]ను గాక పోవు నిటుగాన బుధుఁడు తద్వాక్యంబుఁ బ్రమాణంబు చేసి యెవ్వని బోధించు [16]నిట్లని యుండఁగా దేవత[17]యును ద్రవ్యముంబలెఁ గార్యశేష త్వముంబొందునని కార్యమే కామజనంబులకు నిష్టమైన ఫలం బిచ్చు; నందు క్షణధ్వంసియైన కార్యంబు కాలాద్యంతరభావియైన ఫలంబు

13. నిష్టత్వంబు 14. నిషత్వమున్నునియతంబు
15. న్ను 16. నిట్లనుండంగా 17. న్ను

నీను సమర్థంబుగా దస్థిరంబుగాదు స్థిరంబుగా విధిచేత నిశ్చయింపఁ బడియె నిది మొదలుగాఁ గల దాని నెవ్వరు పల్కుదురు వారు జైమిని మతానుగులు; మఱి[18] యేమే యనియును పలుకుదురు వారు జైమిని మతస్థులు. ఆ వేద ప్రవర్తకుండైన యా జైమినిముని వేదాభిమాన దేవతా కూత విపరీతమైన యీ మత మెట్లు చేసెను? వైదిక శేఖరుండవై నయోతంత్రీ యపన్యాయతమో భాస్కర సునయో క్త్యసిధారచే నీ సంశయంబుఁ ద్రెవ్వం జేయుమని కుమారుఁడైన శుకుండు పల్కిన [19]ప్రశ్న భాషణంబులఁ గన్నులు వికసించి వేదాభిమాన దేవతా కూత తత్త్వవేదియైన వ్యాసుం డిట్లనియె.

వత్సా ! యీ దుర్వాదృగ్వాది జన్మనిమిత్తంబు నీ వెఱింగి యును దద్వాక్యంబులకు క్షుద్ర నయార్థిత్వ ప్రసిద్ధి కొఱకు నడిగితివి, విను; మిటువలె వాదించు వాదులం బూర్వంబునందు నందికేశ్వరుని చేత శపింపఁ బడిన దేవద్వేషులు భూమియందుఁ బెక్కండ్రు నిర్భాగ్యద్విజులై కుమేధస్సులై పుట్టి యయథాభిదైక దేశలేశులై తోఁచినట్లు వేదార్థ నిర్ణయమునందు నింతయనియెడు పరిమితి నివేదనంబునందు నింతయన్న [20]పరిమితిని, కూపకూర్మ సమానాభిమానులై వేదాంత సాగరంబుల నసంఖ్యేయంబులఁగా నెఱుంగక దేవమాయామోహితులై తలంచిరి; సమస్త వేదంబులును గార్యపరమే కావలయునని తన్ని యంబునం బలికి వేదంబునందును బదవాచ్యబుద్ధిలోక వ్యుత్పత్తి మూలమైనదియె; కార్యానన్విత సిద్ధార్థ విషయమై లోకంబునందుఁ బద సంగతి లేదు. మఱియేమి[21]యన: కార్యాన్వితంబైన కార్యమునం దేరి జాద్యన్యతమాభిధ యగు నటుగాన మంత్రార్థ వాదంబులకును గార్యాన్వితార్థత యనియెడు హేతువువలన సమస్త వేదంబులును గార్యపరంబు; శ్రేయస్సును గార్యపరమే; శ్రుతితాత్పర్య గోచరమైన శ్రేయస్సు దానికంటె మఱియొకటికాదు; కామ్యార్థంబు నందును గార్యాన్నమైన స్వర్గాది సంజ్ఞత ఫలమెద్ది గలదది యానుషంగిక ఫల; మిష్టమైన దాని నిచ్చుచున్న ప్రభువైన రాజుంబలె మాకుఁ గార్యమే ప్రధానంబు; ద్రవ్యంబుబలెఁ గార్యంబు గూర్చి దేవతలు ప్రధానం బులుగారు; వారలకు భోక్తృత్వము[22]ను యాగప్రసన్నత్వమును[23] యాగ ఫలదాయకత్వము[24]ను వేద నివేదదూషకులు చెప్పుదు; రింతియెకాదు

18. యేమేయనియున్న; 19. ప్రశ్నభాషణంబులు;
20. పరిమితినిన్ని; 21. యంటేను;
22. న్న; 23. న్న; 24. న్న;

నిదచిద్రూప విశ్వనియామకుండైన వాఁడును లేదా తనయందు నను పపన్నతంబైన ప్రత్యక్షంబుగాని యనుమానంబుగాని లేదు; శ్రుతికిఁ గార్యానన్విత సిద్ధార్థంబునందుఁ బ్రామాణ్యంబులే దిది గనుక సర్వే శ్వరునియందు నేమియును బ్రమాణంబుగా దనిరి; వేదాద్యభాగ తాత్పర్యన్యాయ సూచకుండైన జైమినిముని యభిప్రాయంబు నెఱుం గని దుర్బుద్ధులు నందికేశ్వర శాపాను రూపకేవల కర్మలైరి; వారల్ప బుద్ధులైన బ్రాహ్మణులును వారిని వైదికులంగాఁ దలంచి ప్రతిపదంబున నంధలగ్నాంగులుంబలె నవలంబించి కర్మలగ్నులగుదురు; పుత్రా! వారి బుద్ధిమాంద్యంబుఁ దెలిసి దేవతలు యాత యామంబులగు కర్మంబులు చేసి దుఃఖపడుచున్న వారికిట్లని దుఃఖమందుదు రగ్ర జన్మలైన యాద్విజులకు బుద్ధిమాంద్య మయ్యె; నాశ్చర్యం బెవ్వరు వేదకృత్స్న తాత్పర్యంబునందే తలంచిరి, కార్యమాత్ర పరత్వ మయ్యెనేని కృతికి నెట్లు సమ్మతమై సిద్ధించెడిని ? ప్రయోజన పదార్థావ బోధకత్వంబు శ్రుతికి సమ్మతంబు విచారించుచుండ సుఖమే లోక ములయందుఁ బురుషార్థమై సమ్మతమగు దుఃఖహాని యయ్యెనేని జనులచేతం దనయంతనె యంగీకరింపఁ బడదు; దుఃఖానువృత్తి యందు దుఃఖం బనుభవింప నిష్టంబుగాని యది యని తనయంతనె దుఃఖహాని పురుషార్థంబు గాదు. [25]సుఖమైన తనయంతనె పురుషార్థమై తగు; నీ ప్రకారంబునను సుఖపురుషులచేతం బ్రార్థింపంబడునని దానికిఁ బురుషార్థత్వంబు యుక్తంబు; ఇతరంబున[26]కైనచో లేదు. దానికిఁ బారంపర్యంబు చేతగాని సాక్షాత్తు గాని పురుషార్థిత్వ మాపే క్షిత మని పురుషార్థ మగుటచేత మితమని యుండఁగా నిటువలెఁ బారంపర్యముచేతఁ గాని సాక్షాత్తు గాని పురుషార్థమై సమ్మతంబు గాని యా కార్యంబు తనంతటనే పురుషార్థ మెట్లగు? ఎవ్వరికిఁ గేవల కర్మమే శ్రేయం [27]బగును; సుఖంబును శ్రేయంబుగాదు; తద్ధేతువును శ్రేయంబుగాదు; దుఃఖవిలయంబును శ్రేయంబు గాదు. వారు దుర్భగు లెవ్వరికి సర్వకార్యంబులు నశ్రేయః ప్రతిపాదకత్వ సుఖ బ్రహ్మ ప్రసక్తి కొఱకగును వారలె సుభగులు బుధులు; ఏమి చేయుదుము; పరబ్రహ్మంబైన విష్ణు వెవ్వరికిం బ్రసన్నుండగుచున్నవాఁ డాప్రాణి విశేషంబులు దయచేతను బుద్ధు లెవ్వరు తన్నిర్హేతుక కారుణ్య విష యలు గాని వారికి బుద్ధులు స్ఫురింపవు: లోకములు న్నెఱుంగరు.

---

25. సుఖమైతే.

వేదార్థం[28]బయిన మిక్కిలియు స్నెఱుంగరు; సర్వ శబ్దంబులకును లోకంబులయందుఁ గార్యాన్వితార్థత గల దాలిఙాదికంబునకు లౌకికంబునందుఁ గార్యాన్వితార్థత్వంబు లేదు గాని లౌకికమైన 'గామాన' యేతి వాక్యంబునం దానయము కార్యంబుగా దాపద మేమిటిచేతఁ గార్యాన్వితార్థ మయ్యెడి, నేకవాక్యంబు నందుఁ గార్యద్వయంబు లేదే - కార్యద్వయంబు చేత నా పదంబులకు నన్యోన్యాన్వయం బయ్యెడి; తత్పదంబులకును గార్యాన్వితార్థత యయ్యెడిని; కార్య పదంబున కంటె నన్యపదంబు సమస్తలంబుల యందును గార్యాన్వితార్థత్వంబు విడువదనియును బ్రకారంబుగాక యుండం [29]జూచుటం బట్టుండియును నియమంబు లేదు! లిఙోలోట్ట వ్యావృతమయోగులైన పదంబులకే వాక్యత్వ మనియును నియమంబులే దన్యములైన పదంబులకును వాక్యత్వము చూచినారము గనుక 'కింతేస్తే వేద విద్యతి' యనియెడునది ప్రశ్న వాక్యంబు; తదుత్తర వాక్యమయ్యెనేని 'యస్త్యేవమేవేతి' యనియెడునది యీ ప్రశ్నోత్తర వాక్యంబులకు లిఙాద్యన్వయం బెక్కడిది? వక్తల యందు భూతవాక్యంబుల యందు సిద్ధివ్యుత్పత్తి విషయమై యుపాయంబులు గలుగుచు నుండఁగాను, బరులచేత నేమి యాకాంక్షాద్యనుబంధంబుగల తిఙ్సుబంత కదంబకము వాక్యవ్యవహారంబునకు నంగమై యుండునది; లోకవేదంబులయందు భూతవర్తమాన భవిష్యత్ప్రత్యయ సమభినైష్య ద్విజయ వ్యాహృతుల యందునేని లిఙాద్యన్యతమముతోడం బదంబులకు నవ్యగన్వయంబు లేదే! యన్వయముచేత నావాక్యంబులు కార్యార్థంబులు సాక్షాత్తున నయ్యెడిది; భూతవాక్యంబుల యందును లిఙాద్యన్వయ మెటుగాన సర్వవాక్యంబులును భూతార్థంబులుగా నిశ్చయింపఁ బడుచుండ లోకంబులందును వేదంబులందును భూత వాక్యంబులకు సిద్ధి [30]నిష్ఠ యగును; లిఙాద్యన్విత వాక్యంబులచేఁ గార్యార్థ [31]నిష్ఠత యగు నిట్లని యోగ్యాన్వితంబులైన వాక్యంబు లందు నాద్యంబైన సంగతి సంగ్రహం బా సర్వ వాక్యంబులందు గార్యత్వం బుద్ధిప్రవర్తిక యైనదిగా దిష్ట సాధనతా బుద్ధికిం తత్ప్రవర్తన హేతుత్వంబు సమ్మతంబు; కృతి యోగ్యేష్ట హేతుత్వబుద్ధియె యుభయ సమ్మతంబు; కార్యబుద్ధి[32]యైనచోఁ ద్యాజ్య; ముభయసమ్మతముగా దిదిగాన సర్వవాక్యంబులును గార్యార్థంబులే యనియెడు నది యుక్తంబుగాదు; వ్యుత్పత్తియు నటు

28. బయితే.  29. జూచుటం బట్టుండిన్ని.

30. నిష్ట.  31. నిష్టత.  32. యైతే.

వలెనే; ఆ వ్యుత్పత్తి లోకవేద భేదంబులచేత ద్వివిధంబై యుండు నా రెంటిలోన మొదలి లౌకిక వ్యుత్పత్తి ప్రత్యక్ష భేదంబుచేత నిష్పన్న మైన యది: యన్యంబైన యీ వైదిక వ్యుత్పత్తి యాగమంబుచేత నైనయది; ఆ మూక బాలకులు జన్మంబు మొదలుకొని నయనములు దెఱచి ప్రతి దివసంబు నందును దృశ్యములు చూచుచు నున్నవారలై కార్యంబునందు స్వపర వైషమ్యంబు దెలిసి తలిదండ్రులం జూచి దైవ వశంబునం బ్రథమవాసన గలవారలై యంతదాత యనియు నంబి యనియుఁ దన్నామంబులం బల్కుదురు. సత్సంజ్ఞా సంజ్ఞా సంబంధ జ్ఞాన జిజ్ఞాసులైన స్వకీయులచేత 'మీ తండ్రి యేఁడీ' యనియు 'మీ తల్లియేది' యనియు నడుగంబడిన నా బాలకు లా తండ్రినిం దల్లినిఁ దర్జనిచేత నిరూపించి తాతాంబేత్యాది శబ్దములకు నా వాక్యంబునందుఁ గార్యాన్వితార్థ గలదా? వారికిం బ్రథమ శబ్దమగుటం జేసి మున్ను గార్య పదాన్వయము లేదు; ముందఱను దత్కాలంబు నందును దావన్మాత్రపదోక్తిం బట్టుండి లేదంతకంటె ముందఱి కాలంబుల యందును యాహియహి యనియెడి భాషణము పూర్వకాలిక వాక్య కార్యాన్వయావహమై వ్యాప్తమై యున్న యదియుం గాదు; సమస్త ప్రవర్తనంబుల యందును గార్యతావగతివలననే హేతుత్వ మని పలుక మదిగాన వ్యాహార సంభ్రమ మనియును గార్యాన్వయ మితంబునందును ద్యశబ్దార్థ సంగమ బుద్ధి ప్రాగ్భవీయాత్మ పుణ్యాను రూపకాల సమిద్ధ శక్తిగల సంజ్ఞే సంజ్ఞాన్వయోల్లేఖి ప్రథమ జ్ఞాన హేతువైన సవికల్పక సంజ్ఞితమైన ప్రత్యక్షంబుచేతం జేయంబడినయది; నిఘంటు ప్రముఖంబులైన యుపాయంబులచేతను గార్యాన్వయంబు విడిచి వీనికిని వినామంబు లగుచున్నయవి యని బోధించువారి చేత వాక్కులకు సిద్ధ బోధకత్వంబు ప్రవర్తించునని మనుష్యులకు [33]'బాధ యంతీతి వాం సాహ్ని (?) ఛందాంసి' ఇత్యాది వైదికంబులైన నిర్వ చనంబులచేత సిద్ధమాత్రాన్వయ బుద్ధి వాక్కులకు నయ్యెడునది గానఁ బద మొకానొక యెడం గార్యానన్వితంబైన యర్థంబును జెప్పు నొకా నొకయెడం గార్యయుక్తార్థంబునుం జెప్పుమని నిర్ణయంబు సేయుట యుక్త మిది గాన మంత్రార్థ వాదంబులకును గార్యాన్వయంబు విడిచి యే స్థలంబునందుం దమలోఁ దమకు నన్వయంబు దృష్టమైనయది యదియందుఁ గార్యంబునందును బ్రమాణత యంగీకరింపఁ బడిన యది. స్వర్గాదికంబునందుఁ బదార్థములకు సార్థ [34]నిష్ఠత మానాంతర

---

33. నిష్టత.

34. 'బాధయంతీతి సాహ్నిఛందా' నిత్యాది.

ప్రాప్తిబాధ రహితమైన యది యర్థయుక్త మౌటచేత నేవిధులకు వారి చేత శ్రుతమైన యర్థముగల వాక్యమునందును బ్రమాణతా శంక పోఁగొట్ట దదియును నీ ప్రకారంబునను బ్రమాణోపనిషత్తులకును వారలచేత నందుచేతనే ప్రమాణత్వశంక పోఁగొట్టంబడియె, నను నయంబున మానమదిగా ననుపనిషన్మీమాంసారంభ సంభ్రమంబును న్యాయమైనయది యీ ప్రత్యక్షానుమానంబులు విశ్వచిదచిద్వస్తు నాయకునియందుం బ్రమాణంబులుగా వానాయకుని యందు సమీచీన న్యాయోప బృంహితంబులైన వేదాంతంబులే ప్రమాణంబు లదిగాన యాశ్చర్య శక్తికుండైన యాస్వామి సర్వవేదాంత రాత్మాధిష్ఠితంబు లైన ముఖంబులచేతను బ్రీతుండై తత్ఫల మిచ్చుటకై సమర్థుండు; జైమినియందు జైనవీరులయందు మొదలు సత్పురుషులకు విశ్వాసంబు పుట్టింపుచున్నవాఁడై యతివాదంబుచేతం గరైత్రక ప్రాధాన్యాది కంబును సూచించె నదిగానఁ దదతి వాతోద్ధత శ్రద్ధాజడమతులై తత్కార్యము తనయంతనె ప్రధాన మని తలంతురు; పుత్రా! వారలు పూర్వ దుశ్శాపతాప జ్వర వికారులై ప్రలాపించుచున్నవారలం జూచి సత్పురుషులైన వారలు తద్వాక్యంబు లాచరింపరు; సాంగంబులై సరహస్యంబులైన వేదంబులు చదివి వ్యుత్పత్తి లేశజనిత తద్వేదార్థ వివేకరేఖలు గలవారై తద్బోధ శోధన నయములను గురుముఖంబుల వలనం దెలిసి యశేష మూర్తియైన స్వామిని సుగమార్థంబుగా నెఱుంగంగలరు. 51

మ. హరిపాదాబ్జ యుగంబు గొల్చి సరహస్యాశేష వేదస్ఫుర
త్పురుషోత్తంస నిజాశయం బెఱిఁగి యుద్బోధామృతాస్వాదులై
పరమోత్కృష్టులఁ జేసి తత్పదరజః పట్టాభిషేకంబుతో
దురసంతామరు లెన్నఁడుండెదరొ సాధుల్మెచ్చ వీతార్థులై. 52

మ. అని యీ రీతి దయాళు దివ్య నివహాత్యంతైక శోచ్యక్రియా
ఘన దుర్బోధ విపిష్ట చిత్తుల వృథాగర్వాంధులన్ వేదవి
త్తనిరోధార్థకరాత్ములం గని వినీతత్వంబునన్ మ్రొక్కుమ
న్నన నీక్షించి ప్రియంబు వల్కఁదగ దెన్నన్ సజ్జనుం డెన్నఁడున్. 53

సీ. షడ్గుణైశ్వర్యాది సంపన్న వేదవే
దాంత తాత్పర్య విద్యాపయోధి
ప్రబల కుదృష్టి దుర్వాక్య సంజాతమౌ
మద్భ్రాంతి యణఁగె సేమంబు గంటె

వెలయ ధర్మాధర్మ విద్యాభిమానదే
వతల విజ్ఞాపనం బతులశక్తి
సనకాదులు వినంగ శౌరి యాలించియే
మనియె నాసనకాది యతుల మఱియు

తే. గీ. నాకృపానిధి సౌందర్య మపుడు గనిన
వారి నేమని మన్నించి వాసికెక్కఁ
దత్త్వ విజ్ఞాన లీలానిధాన మూర్తి
యన్నియును మాకు నెఱిఁగింపు మాదరమున. 54

క. అని సుతుఁడు పల్క నాతని
ఘనబుద్ధి పరాత్మ తత్త్వకలితజ్ఞానా
భినవ సుధాద్యభిముఖయై
కని మనియె నటంచు మౌని కరఁగుచు ననియెన్. 55

సీ. పుత్రక! నేఁడు నీబుద్ధి యేమనిన ను
తింపుదు నీవె సాత్వికుఁడ వాకు
దృష్టివాక్యోద్ధూత తీవ్రవవిఘ్నంబు ల
న్నియు నొంచి సత్కథానియతి గనియె
నెవ్వరియందుఁ బరేశు కృపాసింధు
వమలయై ప్రవహించు నట్టి ఘనులు
సకలాంతరాయముల్ శక్తి మీఱి తరించి
తత్కథా సుధఁ గ్రోలఁ దలఁతు రాత్మ

తే. గీ. నచ్యుతునకుఁ బ్రియంబైన యట్టి కర్మ
మచ్యుతాప్రియమైన యట్టి కర్మ
మమరు ధర్మంబు నాయధర్మము నటంచు
మేర దెల్పుచుఁ దచ్ఛ్రుతిస్మృతులు పల్కె. 56

సీ. శస్త్రంబులే నప్రశస్త్రంబు లేని ధ
ర్మా ధర్మములు సేయునంతలో శ్రు
తిస్మృత్యుభయ సముద్దీపిత స్వర్గదు
ర్గతి మర్త్య రూపలోకములు గాంచి

తదధీశ్వరాజ్ఞా పితస్థితి సుఖ దుఃఖ
ములు రెండు చెందుదు రలఘు శక్తి
35 ప్రబలి ధర్మాధర్మ బహుళ దానాధికా
రులప్రభువులఁ జాలఁ బ్రోదినేసి

తే.గీ. యాత్మసంకల్పమున నీయదార్థములు ఘ
టించ నెల్లప్పుడును నియమించు ధర్మ
దేవతయు నాయధర్మాధి దేవతయును
భగవ దిచ్ఛాను వృత్తి సంపత్తి కతన. 57

వ. ధర్మాధర్మాభిమాన దేవతలు శ్రుతిపారగులచేత నిట్లని పలుకంబడి
యెను; వేదపురుషాభిప్రాయ సందర్శన మగు తద్విజ్ఞాపనంబు తెలియ
నవధరించి నవ్వుచు ద్విజులఁ జూచి భగవంతుం డిట్లనియె. 58

-శౌరి సనకాదులకు కర్మకాండాది విషయంబు లెఱింగించుట-

క. జిజ్ఞాసువులై మీరలు
ప్రాజ్ఞులు నన్నడుగఁ జూచు పద్ధతి దోఁచెన్
జిజ్ఞాస వాదమఁజేయును
సుజ్ఞానమె మత్ప్రసాదశోభన లీలన్. 59

క. బ్రహ్మవిదుత్తంసులు స
ద్బ్రాహ్మణ సత్తములు పూర్ణభగవద్భక్తుల్
బ్రహ్మం బిట్లాడిన విని
జిహ్మేతకులై యడిగిరి చేతోగతులన్. 60

క. సర్వోత్తమ హరి స్వాఖిల
సర్వాత్మానాత్మ వస్తు సంధాయక! నిన్
సర్వము నడిగెద మిపుడో
సర్వేశ్వర! నీదు కరుణ సాధ్వస ముడుగన్. 61

క. సేయుఁడిది సేయకుండిది
పాయక ముని గర్మకాండ పరిచిత విధుల
త్యాయతిఁ బల్కఁగ సేయం
జేయక యుండన్ సమర్థశీలురె మనుజుల్. 62

35. ప్రబలి ధర్మాధర్మ దానాధికారుల –

వ. అనీశ్వరాత్ములై కర్మములందు స్వతంత్రులు గాని వారికిఁ గర్తృత్వ
మెక్కడిది? పాణిని ''స్వతంత్రః కర్తా'' యనఁడు గాన. 63

ఆ.వె. ఫలము కర్తృగామి పరికింప ననుచు మీ
మాంసకులు వచింతు రఖిలకర్మ
ఫలము కర్తలగుచుఁ బరఁగిన నరులకు
నన్వయించునే నిరంతరంబు. 64

క. వెలయఁగ నఫలాన్వయులకుఁ
గలుగునె కర్మాధికార కల్పన కర్మం
బుల నైశ్వర్యముఁ గాంచుట
పొలుపుగ నధికార మనిరి బుధవరు లెల్లన్. 65

సీ. అందఱు నసమర్థు లగుదురు నరులు రో
గాది పీడితు లసమర్థు లందు
విధి చెప్పఁబడదు భావింప వారికి నధి
కారంబు లేదు లోకమునఁ గొంద
ఱతిసింహబలులు కామామయార్థితు లతి
కామార్థితులు విధిక్షములు వారు
సతతరజః క్రోధజ వికార వశమున
నిరపత్ర పాత్ములు నిర్దయులును

తే.గీ. నీచవృత్తులు నగుచు వినిశ్చితంబు
[36]గా నిషిద్ధక్రియల్ సేయఁ బూనువారి
[37]త్రిగుణ కాననా వచ్ఛిన్నధీబలాతి
కామరోగుల నియమించఁగాఁ దరంబె? 66

వ. దేవా! స్మృతి సహిత వేదమత్వదాజ్ఞ యని వింటిమి భ్రాంతుల
నాజ్ఞాపించు స్వామి యట్టి వివేక వంతుండగు. 67

మ. 'అతి చిత్రార్థము లౌ శృతిస్మృతులు మాయాజ్ఞల్ తదుల్లంఘన
స్థిత మద్ద్రోహ' మటంచు నాడితిరి లక్ష్మీనాథ! తద్ద్రోహదు
ర్మతులందెల్పుచు మీఱినం దెగుచు సమ్యగ్భక్తియై నిల్చు సు
వ్రతుఁడౌ స్వామియు నెన్నిచందములు విభ్రాంతుండు గాకుండునే? 68

36. గానిషిద్ధక్రియలే సేయఁ బూనుఁ
37. స్వాత్రిగుణ కానాద్యచ్ఛన్నధిబలాతి

తే.గీ. అబుధు లసమర్థులు ననర్థులైన వారు
నిందు నధికార యోగ్యత నందఁ గలరె?
యనుచు మామానసములు మోహాంబురాశి
[38]మగ్నము లగుచునున్నవి మఱియు మఱియు. 69

క. హరి సత్త్వసత్త్వ వేదివి
పరమ దయానిధివి మోహబంధాంతరసం
హరణైక కారణం బగు
వర విజ్ఞానంబు దెలుపు వాత్సల్యమునన్. 70

వ. ఈ యనుయోగాపరాధంబు సహింపవే యని విన్నవించిన సనకా
దుల తత్త్వ శుద్ధికి మెచ్చి యిట్లని యానతి యిచ్చె నప్పుడు. 71

సీ. వెరపకుఁడీ యోగివిభులార! [39]మీరలు
త్తములు మీ కెఱిఁగింతు దయ దలిర్ప
స్వాధీనమగు విశ్వమంతయు నదిగాన
నరుల బోధించెదఁ బరమ నియతి
దీపించు నాదుశ్రుతిస్మృతి శక్తి గొం
దఱు ప్రవర్తింపఁ గొందఱు నివృత్తి
యంద తత్ప్రాగ్భవీయానేక కర్మాను
[40]రూప పురాణాదు లేవు చూప

తే.గీ. ధరణి మద్దత్తమైన స్వాతంత్ర్య శక్తి
తత్కృతార్థ ఫలావహత్వము వహించు
సత్యసంకల్పత సదా ప్రశస్త మగుచు
... .... ... 72

క. అరణి గతానల శక్తి
స్ఫురణంబును బోలె బద్ధ పురుషుల శక్తి
స్ఫురణము ప్రకాశ మందదు
పరిపూర్ణజ్ఞానమహిమ బద్ధం బగుటన్. 73

---

38. మగ్నము లగుచున్న యవి
39 మీరు ఋషిస;
40. రూప తత్త్వపురాణాదు లేపు చూప

తే.గీ. సత్త్వ గుణము రజోగుణ స్థగితమైనఁ
బెరసి లోభాది సంజ్ఞిత స్పృహ జనించు
సత్త్వ గుణము తమోగుణ స్థగితమైనఁ
బృథివి మోహాజ్ఞతాధిక స్పృహజనించు. 74

తే.గీ. రజత శుక్తి నయార్థ విభ్రాంతి మోహ
మనిరి యఖిలార్థ వేదులౌనట్టి సూరు
లది యెఱుఁగకున్కి నజ్ఞాన మనిరి కొంద
రాగమాంత విశారదులైన ఘనులు. 75

వ. సమస్తాత్మలకును జ్ఞానశక్తిచేతనే వివిధ క్రియలు నగు నజ్ఞులకుఁ గాలకర్మ మాయాశక్తి సాపేక్షయైన నిజశక్తిచేత సుఖాది ప్రాప్తిహేతు సర్వక్రియలు నగును; మఱియు నాకును నాదాసులైన నిత్యముక్తులకును కేవలధీ శక్తుల చేతఁ గాలకర్మ మాయా శక్త్యనపేక్షాక్రియలగును. 76

తే. గీ. జగతి సర్వాత్మలకు జ్ఞానశక్తి తత్స్వ
భావసిదంబు దానిచేఁ బ్రబలి యుంద్రు
కర్త[41]లెల్లరు సత్యసంకల్పు లనఁగ
నియతి దర్కింప నిది శాస్త్ర నిర్ణయంబు. 77

తే. గీ. విశ్వ సృష్టి స్థితిలయాది వివిధ కర్మ
ములకు స్వాతంత్ర్య మగునెట్ల మొదల శేషి
నైన నా కిట్లశేష వృత్త్యంతరముల
నాత్మలకు నైన స్వాతంత్ర్య మమరి యుండు. 78

సీ. అవిగాన మఱి నియమ్యత నున్నయట్టి యా
త్మల నన్నిటిని సదామ్నాయ శక్తి
బోధింతు ననయంబు పొందదు తత్తదా
త్మహిత ప్రధాన సమర్థ నిత్య
నైమిత్తికాదులు నడిపెడిచో నిత్య
కర్మంబు నిజశక్తి గలుగు కొలఁది
జేయఁగాఁ దగు శాస్త్రశిష్టాచరణములు
గలవశక్త్యాత్ముఁడై కర్మ లెల్లఁ

41. లెల్లను.

తే.గీ. దత్సమర్థుండు వలెఁ బూనఁ దగదు కర్మ
నిష్కృతికినై సమర్థత నిర్ణయించి
రార్యు లాకామ్య కర్మంబు లట్లు శక్తి
[42]గాదు ధర్మోదయము తనకడ్డవడును. 79

వ. కామ్యకర్మ సుకరంబుగా వేదంబు లుపాయంబు కామప్రేరిత చేతస్కుల కెఱిఁగించునది; ఆత్మ ప్రామాణ్య జ్ఞాపనారంబుకొఱకె యట్లు గాకున్నఁ గాముకుండు వేదప్రామాణ్యంబు విశ్వసింపండు; భ్రాంతాజ్ఞాపనము నందు నియంతకు నవివేకత్వంబు లేదు; భ్రాంతుండై కూపంబునం బడియెడు వానిం బడవలదని నియోగింతురు బుధులు వారి భర్జింతురు; దయలేని వారలా వారు? విన నెఱుంగ కించిత్తెవ్వరు సమర్థులు? భ్రాంతులైనంగాని వారి నుద్దేశించి శుభాశుభంబులయందు విధినిషేధంబులు బోధింపందగు; చేయుఁడు సేయవలదను మాటలు వినియుక్త వృత్తులగుదు రెవ్వ రతిభ్రాంతమతులై కామరోగులై యుంద్రు; వారు క్రూరభైషజ్యంబులచేతనుంబలె దండనంబుల చేత విభ్రాంతిం బొందకయుం డ్రెవ్వరు సన్నిహిత విషార్ఝూచ్యాద్యతివృద్ధులయందు శిరఃపాదాదవిదాహంబు సేయుదురు వారు భ్రాంతులాయనయు లాయదిగానయనాద్యచిదాచ్ఛన్న బుద్ధులై భ్రమంబు నొందువారలకు న్నాజ్ఞాపనాదులు సేయు ప్రభుండనైన నాకు నీతి యెక్కడిది? మఱియు నెవ్వరు స్వాస్వాతంత్రతను మచ్ఛక్త్యపేక్షయైన దాని ననపేక్షంబుగాఁ దలంతురు వారు స్వాస్వాకర్మబద్ధులై యుండి రెవ్వరా స్వాతంత్రత మత్స్వశక్త్యవేక్షంగాఁ దలంతురు వారు స్వాకర్మామలాత్ములై భవబంధంబులం బాయుదురు. 80

సీ. త్వరతో ననాద్యచిద్బంధంబు విడిపించి
జనుల నిల్పఁగ నాకు శక్తి గలిగి
యుండినయేని తదూర్జిత స్పృహ యాద
రింపుదు వాత్సల్యమింపు మెఱయఁ
దత్త దాత్మ విషయో ద్యన్మహేచ్ఛాను సా
రమున మెల్లనె భవారంభ మణఁచి
మత్పదంబున వారి మన్నించి వెలయింతు
నతి మహోదారుండ నైన యేను

42. గాదు ధర్మోదయము తన కడ్డవడఁ దగును

తే.గీ. కామితార్థ [34]ప్రదాన దీక్షావ్రతమున
నర్థులకుఁ బరిణామహితార్థ మిచ్చు
నట్లు యొసఁగఁ దలంచనేన పరిణామ
హితము యోగీంద్రులార మీ రెఱిఁగి కొంద్రు. 81

క. పరిణామహిత మనంగా
నరయఁగ భవనాశహేతు వగు నెన్నికఁగాఁ
బరిణామాహిత మనఁగాఁ
బరగున్ భవబంధ కృత్యపద కారణమై. 82

వ. ఇట్లు నాకు స్వాధీన విశ్వత్వ ముపనిషత్తులు పలికె నట్లనే నాకుఁ గర్మకాండంబును సావకాశం బయ్యె నిందునకు సందేహంబు [44]లేశం బును లేదు; నన్ను నెవ్వి యమగవలయు రహస్యం బడిగెద రది యెఱింగింతు వినుండు. 83

మ. హరి వేదూక్తి ననాద్యజావృత నిజాత్మాంత ప్రబోధ ప్రభా
పరమాజ్ఞాజ్ఞ జనాంతరాత్మయయి సంభ్రాంతాత్ములన్ సద్విష
గ్వరుఁ డాయుశ్శ్రుతి శక్తి రుగ్మిఁబలెఁ బ్రాక్కర్మోచిత ప్రక్రియా
గరిమందా నియమించుటం గొలువఁగాఁ గాంక్షింతురయ్యుత్తముల్. 84

ఆ.వె. ఘనత నిట్లు కర్మకాండాగమాంత వా
గ్రూప వేద హృదయ రూప మెఱుఁగు
భవ్యులకును గర్మఫలము లొసంగునా
యందుఁ బుట్టు భవము లడఁచుఁ దలఁపు. 85

చ. హరి గరుణించి యిట్లు తమకానతి యిచ్చిన వీతమోహులై
పరువడి మ్రొక్కి మ్రొక్కి బహుభావములంగొని యాడియాడి హృ
త్పరిగత సంశయం బుడిగి ప్రాంజలులై యతిలోక శేఖరో
త్తరు లతిశోకశీలుఁ డగు తత్పరమేశ్వరుఁ గాంచి రంతటన్. 86

వ. ఇట్లని వినుతించిరి. 87

---

43. ప్రధాన.
44. వేదంబును.

ఆ.వె. దేవ దేవ! స్వామి! దివ్య విజ్ఞానప్ర
దాన దక్ష! యాత్మదాన ధుర్య!
నీదు ధామ మెట్లు నేమెట్లు బ్రహ్మాది
దుర్లభంబు మాకు దొఱకు టెట్లు? 88

క. స్వామి! యకించనులము మీ
శ్రీమత్పాదాంబుజములు సేవించి మహో
ద్దామజ్ఞాన సుధాబ్ధిన్
నేమంబున నీదుకరుణఁ జెందితి మెట్లున్. 89

వ. మనోవ్యథ తీఱెను; దుర్జ్వరంబువలె నున్నయది యొకటి బ్రహ్మాండో
దరవర్తులైన ధీరులు యుష్మద్విరోధులైన యసురులచే బాధనొంది
వర్తించిరి; తత్సాధు ద్రోహంబువలన వారికి నప్పుడే ఘోరయాతన
లెటువంటివిగాఁ గలవో వారి నెవ్వఁడు రక్షించు భవద్దర్శనానంద
సాగరంబున మునింగి యింత కాలంబు మఱచితిమి; ముందర మర
మేమోభవ పయోధి మునింగి తెప్పలేక యున్న మమ్ముంగావు; ప్రసన్న
పారిజాత! నీవు దక్క నెవ్వరని విన్నవించినఁ బ్రసన్నాస్యుండై
సనకాదులతో భగవంతుం డిట్లనియె. 90

## శౌరి సనకాదులకు మోక్షప్రాప్తి విధానం బెఱింగించుట

సీ. యోగీంద్రులార! మీ రుత్తముల్ వినుఁడు మ
దాత్మగతంబైన యాదురాభి
మామకులైన మీ మానసంబులఁ బ్రతి
బింబించి కాన్పించెఁ బెద్దయగుచు
నల మామక జనంబు లంతయు నేనును
బ్రాప్తకాలమ్ము స్వభావముననె
యైన లోకానుగ్రహార్థత నన్యుఁడా
దుఃఖంబుచే నతి దుఃఖ మంది

తే.గీ. యుండుటలు పూర్ణకాముల కుచిత వృత్తి
యార్తులగు వారిఁ జూచి తారార్తులైత
[45]దార్తి మాన్పఁ దలంచెద రట్లు గాన
[46]మోహతాపంబులకు నింక మోడ్పు గలదె! 91

45. దార్తి మాన్ప దలంతు రట్లుగాన
46. మోహతాపముల కింత మేరకల దె

తే.గీ. దుర్జనాజ్ఞానతమ ముఖోద్భూత శక్తి
యైన సుజ్ఞాన భానునిచే నడంచి
నిల్చెద మహాత్ములార సునిశ్చితాత్మ
[47]లై మనోవ్యథ నొందకుఁ డనఘులార! 92

క. ఏ మూఢులు నిగమైక
ప్రామాణ్యము విశ్వసించి [48]పాటింపరు నే
నా మూఢులఁ దెల్పెద న
న్నాపైఁ బ్రత్యక్షమునఁ దదనుమానమునన్. 93

తే.గీ. [49]అఖిల వేదాంత వేద్య విశ్వాత్మ శీల
మైన మత్సత్త్వ విజ్ఞాన మసురులకు జ
నింపఁ జేసెద మన్మనో న్నిద్ర శక్తి
ఘనతరంబైన సంసృతి క్రమమునందు. 94

క. ఏ సంకల్పంబుల నేఁ
జేసినను ఫలానుమేయ సిద్ధంబులు ప
ద్మాసన ముఖ్యుల కనుపమ
ధీ సంపన్నులకు నైనఁ దెలియఁగ వశమే! 95

సీ. ఇట్టి నా సంకల్ప మెఱుఁగక యున్న సా
ర్వజ్ఞ భంగము గాదు వనజ సంభ
వాదుల కెఱ్ఱఁగంగ నలవికానిది యెఱుం
గక యున్న నజ్ఞతగా దెఱుంగ
వచ్చినయది బుద్ధివలన నెఱుంగక
యున్నచో నజ్ఞత యొగి నశక్య
మయిన కార్యము సేయఁగను శక్తుఁడు గాని
యతఁడు దక్షుఁడు గాఁడె యరసి చూడ

47. లై మనోవ్యథ
48. పాటించరు.
49. అఖిల వేదాంతవేద్య విశ్వాత్మైక శీల.

తే.గీ. [50]మునుపు గలుగు ఘటమునట్లు వెనుకఁ గలుగు
నది యకార్యంబు కార్యంబు ననఁగఁ బ్రాగ
భావకాప్రతియోగియై పరఁగి యుండు
నర్థ శాస్త్ర పరిజాత లరసిచూడ. 96

సీ. ఏఁదక్క నితరుల కెఱుఁగంగ రాకుండఁ
జేసితి నేనె విచిత్రమైన
మామక సంకల్ప మహిమ తద్భక్తిమై
మత్తత్త్వధీసుధా మధురరసము
లసురులఁ గ్రోలింతు నతిరోగ శిశువులఁ
జక్కెర యనుచు నౌషధముఁ దల్లి
ద్రావించు నట్లు తత్త్వజ్ఞాన [51]ముదయింప
బోధించునట్టి దుర్బోధమతుల

తే.గీ. నబ్జజాండాంతరావాస మపనయించి
యిచ్చటనె యుండుఁ డీమేర తెనని జగము
వెలయఁ జేసిన దనిక తద్విధము మీకు
నాదరంబున నెఱిఁగింతు ననఘులార! 97

మ. అలసుజ్ఞానులు నాకు నిష్టతము లత్యంతంబు మీరట్టివా
రలలో మిక్కిలి నాప్తు లౌట మిముసారస్ఫూర్తి వంచింపఁబో
ధలవోదగ్రత చేతనీ భవనయంత్రం బంతయుం బూనెదం
గలదే మాయిక నాటకంబు గడపంగా దుష్కరం బెద్దియున్. 98

క. [52]నామాయా మయ మోహిని
పామర దానవుల భ్రాంతి పఱచుట యఱుదే!
నామాయఁ దెలియఁ జిత్రము;
సామాన్యుల కెల్ల నెఱుఁగ శక్యంబగునే? 99

సీ. మన్మిత్రు కింకరుల్ మాననీయులు మన్ని
యోగంబు కతన ననూనయశులు
సత్య సంకల్పు లాసుర వంశమునఁ బుట్టి
తత్సమాకారేంగిత ప్రకార

50. మునుపు గలుగు ఘటమట్ల వెనుకఁగలుగు
51. ముదయించ.
52. నామాయా యొగి మోహిని.

శక్తి గుణోదయ సంపద తద్దైత్య
జాతికి నెల్ల విశ్వాస మొదవ
దీపించి బాహ్యకు దృష్టి సమ్మతమైన
మతమునఁ బ్రియతమస్థితి వహించి

తే.గీ. నిష్ప్రియులు నిర్దయులు నతినీచతరులు
నగుచు ఘోరతర క్రియ లాచరించి
వైష్ణవ ద్రోహబుద్ధిమై వార్తకెక్కి
సాధు దూషణ పరిచితాచారు లగుచు. 100

వ. అవైష్ణవులం బోలె నాయందు ద్వేషంబు గావింపుచుఁ గపటంబునం దిరుగుచు, జితత్రిలోకాధిపతులై జగత్త్రయంబున ఖ్యాతి నొందుచుఁ దామసులు తన వారన తామసోపాస్య చరణులై వారలకుం బ్రత్యయంబుగా బ్రహ్మరుద్రాద్యుపాస్తి గావించి వారల వలన బహువరంబులు గావించి యత్యాద్యైశ్వర్య పరాక్రమ వయోనిధులై విరోధులుం బలె నటించి మత్పదాంభోజంబు లందెదరు. బాహ్యంబున నసురతా ఖ్యాతికై సురల బాధించెద రందు నొక్కరునకు. 101

ఉ. ఔరస పుత్రుఁడై శ్రుతి శిఖార్థము లాడుచు మామకుం దొకం
డీరస మొప్పఁ దండ్రిఁ గవయించఁగ మీఁదనె తేర్పు వాదులన్
సూరుల గెల్చి శౌరి నిదె చూపెద నెందు నటంచు నాడినం
జేరి మహోగ్ర వీరనరసింహనిజాకృతిఁ గాంచి నిల్చెదన్. 102

ఉ. అంతట నన్నుఁ గాంచి పరమాత్మ సమస్త చరాచరంబు లి
ట్లెంతయు దానయౌననుచు నాసుర వీరులు నిర్ణయించఁ బా
దాంతిక సీమ వారి విగతాసులఁ జేసెద నట్టి వేళ న
న్నెంతయుఁ జూచుచుం దనువు లీవి భజింతురు బ్రహ్మభావమున్. 103

క. పాటిల్లెడు నీ మాయా
నాటక సూత్రంబునందు నా ప్రతిహారుల్
మేటులు జయవిజయులు ని
త్యాటోపులు మత్ప్రయోజనాయత్తు లిలన్. 104

తే.గీ. మత్ప్రియైక ప్రయోజనుల్ మన్నియోగ
గరిమఁ గృతయుగమున దితికశ్యపులకు
నల హిరణ్యకశిపు హిరణ్యాక్షు లనఁగఁ
గలిగెదరు ఘోర వీరరక్షః ప్రవరులు. 105

తే.గీ. అందు నగ్రజుఁడు హిరణ్యకశిపుఁ డతని
యవరజుండు హిరణ్యాక్షుఁ డతిరజస్త
మఃప్రకృతు లుగ్రశౌర్యులు మత్తులప్ర
మత్తు లసురలు భజియింతు రట్టి ఘనులు. 106

## ప్రహ్లాదుని చరిత్రము

సీ. ప్రహ్లాదుఁ డనఁగ సద్భాగవతోత్తముం
డాదైత్యునకు సుతుఁడై జనించు
ధర్మవత్సలుఁ డనాఁ దనరిన బ్రాహ్మణుం
డతఁడు పూర్వభవంబు నందు నీశ
తత్త్వధీమూలమై తనరు నకామ్యక
ర్మములు బాహ్యాంగమై యమర శమద
మాది సద్గుణరాజి యంతరంగంబగు
భక్తి నాయందుఁ గన్పట్టై నిలిచి

తే.గీ. భూమి ప్రారబ్ధకర్మముల్ భోగమక్ష
యింపఁ జేయుచు మత్ప్రేరితేద్ధ బుద్ధి
నుండి బ్రాహ్మణ సభయందు నొక్కనాఁడు
తనదు విద్యావిలాస మంతయును నెఱపి. 107

చ. అనఘునిఁ గర్మకాండరతుఁడై తగు నుత్తము ధర్మబంధు సం
జ్ఞుని మునివాది నొక్కని యశోనిధి డగ్గఱి యాగమాంత శో
భనమత మార్గధుర్యత సభాస్థలి గెల్చిన నాతఁ డాగ్రహం
బున శపియించె దైత్యకుల ముఖ్యుఁడ వయ్యెద వంచు నుగ్రతన్. 108

క. శాపం బొసంగి పశ్చా
త్తాపంబు వహించి మౌని ధర్మ వివేకో
ద్దీపితుని బ్రహ్మ విద్యా
రూపుని నెట్లాడితిని నరోషాత్ముఁడనై. 109

వ. అని కలంగి యిట్లనియె. 110

మ. అపరాధంబు సహింపు సాధుజను లత్యంత క్షమాసార [53]ధ
ర్మపరుల్ దత్కృపఁ జూతు రెవ్వరిఁ దలంపన్ నన్ను మన్నించు మ
స్రపయోనిం జనియించినం గలుగు పూర్ణ బ్రహ్మ విద్యావివే
క పరత్వంబని శాంతి నొందఁ బలుకంగా నమ్రుఁడై యంతటన్. 111

వ. ప్రతీకారంబు వర్జించి విప్రుం డిట్లనియె. 112

క. శంకించి కలఁగ భగవ
త్సంకల్పానుగుణమైన జననంబున కా
తంకంబౌ నని మునిపతి
నంకించి నుతించి యేగె నాద్విజుఁ డంతన్. 113

వ. తద్విప్రుండు హిరణ్యకశిపునకుం దనయుండై జనియించి రాక్షసులలో
ధర్మ స్థితితో నడచుఁ గృతయుగంబునఁ; ద్రేతాయుగంబున రావణ
కుంభకర్ణులై వారలు జనియించిన విభీషణుండై నయోక్తులఁ దత్త్వంబు
బోధించు; ద్వాపరమ్మున వారు శిశుపాల దంతవక్త్రులై యుదయించిన
క్రతుసభాస్థలి సహదేవుండై తత్త్వబోధ నిరూపణంబు సేయంగలండు;
తత్త్వజ్ఞులైన బుధులు నాసురయోనులైన వారల జయించెదరు; కలి
యుగంబున మఱియు. 114

క. కలియుగ చతుర్థ పాదా
కలితశ్రీ నసుర యోనిగతులౌ దుర్మా
ర్గుల శిక్షించెద దండన
ములచేఁ దగఁ గల్కినై విభుత్వము మెఱయన్. 115

తే.గీ. ప్రబల బలమున నరసింహ రామకృష్ణ
కల్కి సంజ్ఞల నాల్గు యుగంబులందు
వెలయ దుర్జన శిక్ష గావింతుఁ బూర్ణ
వైభవంబున నిర్జరవరులు పొగడ. 116

53. ధా ర్మములం -

క. ప్రకటంబగు మాయానా
టక సూత్రము నడప నతిదృఢ స్థితి గలనే
నొక సూత్రధారుఁ డను హృ
ద్వికలతయిుఁక నేల విడువుఁడు మీరల్. 117

మ. బలవత్తేజులు మీర లొక్కరతిఁ దద్బ్రహ్మాండ మధ్యంబులోఁ
గలలోకంబులు చూచి సాత్త్వికుల ముఖ్యజ్ఞానులం గాంచి ని
స్తుల బోధంబున నూరడించి ఘనముక్తుల్ మెచ్చ నేతెంచి మా
కెలమిన్ నాఁ డెఱిఁగించి నప్పుడె మనోభీష్టంబుఁ గావించెదన్. 118

వ. అని సర్వేశ్వరుం డానతి యిచ్చినఁ దన్నియోగంబునం బరిభ్రమించి ప్రణమిల్లి నుతించి పరమ వ్యోమంబు నందుండి డిగ్గి యేతద్గుణ ప్రశంస చేయుఁచు, బ్రహ్మాండాంతస్థ లోకంబులు చూచి సాత్త్వికుల దుఃఖస్థితియు నసురుల సుఖస్థితియుం గనుంగొని మరలి హరిపదంబున కేఁగి యప్పుడు పరమవ్యూహ వ్యోమలోకంబులు గడచి ప్రతీచ్యద్వారంబుకడ జయవిజయులు నిజప్రాప్తి నివారకులై యుగ్రగదాధరులై పరమపురుషాజ్ఞోల్లంఘనంబు సేయుచు నున్నవారలుంబోలె నున్నవారల నందాత్తసలోకాభిప్రవేశ విహితోద్యములైన వారల నందోదర సజ్జనార్తిక్షయ తత్పరులై యిట్లనిరి: ద్వారపాలకులారా! ఉచితములైన మా మాటలువినుండా మీరు పరమానందయుతై శ్రీశ శేషత్వమును మీ యందు ననుసంధించి యథోచితముగా ద్వారమునందు నున్నవారు; శేషేచ్ఛ ననువర్తించి యశేష చేతను లుండందగును; మీరు స్వోదరావశ్య కార్యార్థ స్థితి యిచ్చయించి నట్ల యున్నారు; శేషియైన భగవంతుని తత్తా దృగిచ్ఛ యుల్లంఘించి యిక్కడ నేటికి నున్నవారు? విశుద్ధ సత్త్వ ప్రకృతి మాత్రేశాస్త్రైక సంశ్రయమై రజస్తమోగంధశూన్యమై, ప్రాకృతా గమ్యతేజంబై యున్న యీ దివ్య ధామంబు నందు మీకరంబుల నున్న యీగదలకుం బ్రయోజనం బేమి? శ్రీశ దివ్యాయుధాదులకు నాశ్రితావనము నిచ్చుట కృత్యము; సర్వార్తి బీజనాశకమైన యీధామంబున నార్తులైన వారలు లేరు; క్షేమాభయామృతపదయైన యీధామంబున నజరామర మహాసాల

దౌవారకాదికము కేవలము పరిచ్ఛదము సభయంబులైన ప్రాకృత
లోకంబుల సాల దౌవారికాదిక యుభయత్రాణంబును బరిచ్ఛదం
బును మున్నగు వాహనాయుధ పరివారదౌవారిక సహితుండై హరి
స్వాశ్రితాశ్రితార్తి వినివారణ కారణం బగు చక్రి యత్యుత్కటార్త
లోకాభిరక్షణేచ్ఛ నుండుట యెఱింగి మీ రిక్కడ నుండక నేటికి నాసుర
జన్మంబు లొందుండని సనకాదులు శపియించుట విని దయాబ్ధియు
భక్తవత్సలుండును నగు నీశ్వరుండు. 119

సీ. సర్వహస్తోద్ధృతస్ఫార పీతాంబరాం
చలుఁడయి తత్తదాసమయమునకు
ననుగుణంబుగ సిరిహస్తావలంబ మీ
యఁగ ధరానీళ లొయ్యారమునను
జంద్ర ప్రభాంచిత చామరంబులు వీవ
నాలోనఁ జికురాననాబ్జుఁ డగుచు
మందహాసమున నమందాత పత్ర ద
నంత ఫణామణికాంతు లెసఁగ

తే. గీ. మణికిరీటద్యుతులు దిశామండలంబు
దండి [54]మెఱయింప గగనాంత తార లనఁగ
మౌళిఁ గీల్కొని మందార మాలికలు పు
టంబుఁ గొనఁ బుండరీక నేత్రంబు లలర. 120

సీ. బొమసన్నచేత నుత్తముల ననుగ్రహిం
పుచు మహిమాబ్ధియై పొంగి యూర్ధ్వ
పుండ్రంబుతో నవ్యపులకాంకురములతోఁ
గమలాముఖాంబు జాఘ్రాణలోల
నాసలోచారు కర్ణ విలంబి మకరకుం
డలములతో సముజ్జ్వలిత హార
కేయూర కౌస్తుభాంకిత మూర్తితో ఘన
శ్రీవత్సలలితోరుచిత్ర వైజ

54. మెఱయించ.

తే.గీ. యంతితో మణికాంచితో నమలహేమ
సారయజ్ఞోపవీతంబుతో రహించి
దీప్త మంజీరకావస్థఁ దిత్తిరీయ
నిగమనాదంబుతో వచ్చి నిలిచి నిలిచి.[55] 121

తే.గీ. అపుడు సనకాదులకుఁ బ్రత్యక్ష మగుచుఁ
దన్మహాయోగి మస్తకోదార భృంగ
సంగత పదాంబుజాతుఁడై చక్రహస్తుఁ
డభ్ర గంభీర భాషల ననియె నంత. 122

వ. మద్ద్వారపాలురు మత్పూర్వ సంకల్ప వైభవ మాయా నాటకంబున నధో లోక చక్రంబుఁ బ్రవేశించి యీ శాపంబున నట్ల యవతరించి తరించెదరు. మీరు వగవొందకుండని యూరడించి తద్ద్వారపాలుర నట్లనె నియోగించి సత్యసంకల్ప విభువుండై స్వస్థత నుండి యేత దీశ్వర సంకల్పంబు సాధుల కెల్ల నెఱింగింప సనకాదులు బ్రహ్మాండస్థ లోకంబులకుం జని రంత సత్యసంకల్పంబులచేత భగవత్పదంబున నుండి వచ్చి కశ్యపుని యందు స్వాంశలేశంబులఁ బ్రవేశించి. 123

శా. ఆ దౌవారికులున్ యదృచ్ఛఁజని సాయంవేళ భర్తం గనం
గా దిక్క్రీడల నుల్లసిల్లు దితియం దాత్యంతిక స్వేచ్ఛమై
నాదిత్యుల్ వడఁకన్ హిరణ్యక హిరణ్యాక్షాఖ్యులంబుట్టి స్వ
ర్గాదుల్ తేజముఁ గాంచి యేలిరి ప్రతాపాహంక్రియా సంపదన్. 124

వ. వారు బాహ్యంబున నుపనిషత్పదంబు తిరస్కరించిన యట్ల వర్తించి రందు. 125

క. ఆ జిష్ణుఁడు విష్ణుఁడు ఘో
రాజి హిరణ్యాక్షు నోర్చె యజ్ఞ వరాహం
బై జనియించి సముద్భట
తేజంబున వాఁడు పొందె దివ్య పథంబున్. 126

---

55. ఈ పాదము తరువాత 'నెనిళముఖ్యులు ముందఱ బరాబరులు సేయ' అని కలదు. గ్రంథపాతము కానోపును.

క. తన యనుజుని నోర్చిన యా
ఘను నోర్చెద ననుచుఁ దజ్జగద్వలయమునన్
దనుజేంద్రుఁడు ద్రిమ్మరి య
య్యనఘునిఁ గనలేక విస్మయాన్వితుఁ డగుచున్. 127

తే.గీ. తిరిగి యాత్మీయ మగు రత్నపురికిఁ జేరి
సార్వభౌముం డనంగ రాజ్యంబు కంట
కంబుగా నేలె దైతేయ కల్పశాఖి
యమరనాయక హృద్భల్లమైన మహిమ. 128

శా. ఆ దైత్యుం డొకనాఁడు పుత్రుఁడగు ప్రహ్లాదున్ నిరీక్షించి శౌ
ర్యోదారుం డగు విశ్వతో వదను నాద్యున్ విష్ణు నత్యుగ్ర తే
జున్ దావానలు శ్రీనృసింహు ఘనరక్షోభంబునుం గాలమృ
త్యోదగ్ర గ్రహభేదిఁ జూపఁగని వాఁడొందెన్ బరబ్రహ్మమున్. 129

వ. అన శుకుండు తండ్రిం జూచి హిరణ్యకశిపుండు హిరణ్యాక్ష విరోధి వెదుకుచుఁ దద్విరోధి యగు హరి నిరీక్షించె నంటివి. అది సవిస్త రంబుగా నెఱింగింపవే యని యడిగిన నిజభజనోపాయనుండగు ద్వైపాయనుం డిట్లనియె. 130

తే.గీ. ఎంత మధురంబొ యింతయు నెఱుఁగరాదు
హరిమహిమ బహువారంబు లనుభవించి
యును రసజ్ఞులు మఱిక్రొత్త యనుచు మఱియు
ననుభవింపఁ దలంపుదు రాదరమున. 131

వ. రమ్యవస్తువుల రమ్యత్వము మఱియు మఱియు ననుభవింప బుద్ధి వొడమించు నది రమ్యత్వము. భగవన్మహిమేతరమైన రమ్యత భ్రాంతినైన రమ్యత్వము. భగవన్మహిమ రమ్యత ప్రామాణ్యముచేత నైన రమ్యత్వ మగును. 132

తే.గీ. ఇట్లగుటాభగవన్మహిమేతరమగు
మహిమ యాబద్ధులకు నభిమతము నిశ్చ
లాత్మవిదులకు నీశమాహాత్మ్యమేయ
భీష్టతమ మగు జగతిలో నెంచిచూడ. 133

వ. పెక్కుమారులు వలుకఁ బడియె; నీ చేత వినంబడియె; నైనను మఱియుఁ దద్వివక్షాసుధ యిచ్చట నాకుఁ జవికొల్పుచున్న యది; ఈశావిష్కృత గురుసత్కృపచే నైన యే వివక్షచేత నీ ప్రకారమున హరికథ మాకు రుచించు నయ్యావివక్ష కొఱకు మఱియు మఱియు నమస్కారంబులు. 134

మ. తగఁ బ్రహ్లాద హృదీశ దేవ మహిమోదంచత్సుధాపూర్ణవా
ర్ధి గురుజ్ఞాన తఱిన్నివిష్టులగుచున్ గ్రీడింతు రార్యుల్మృతా
క్తగతిన్ బాహ్యకు దృష్టి దర్శన మనోగ్రవ్యాధులౌ వారికిన్
స్వగదంకార మహౌషధంబులు నృసింహస్వామి చారిత్రముల్. 135

క. తనర నహోబల నరసిం
హుని మహిమార్ణవము పొంగి యుండుం బ్రహ్లా
దనిబిడవాద విధుసుధా
శనఘన చంద్రికల నెల్లకాలము గలుగన్. 136

వ. తాపనీయా ద్యుపనిషద్ధితానుష్టుపు పరిస్ఫుటంబు లయి హేమప్రతి ఘటంబులగు గుణంబు లెవ్వరికివి యతండు దక్క నెవ్వండు సాధుల రక్షించు నజ్ఞానతమస్తోమ దివాకరుండగు నహోబల నరసింహునకుం బ్రణమిల్లి హిరణ్యకశిపు ప్రహ్లాదసంవాదం బెఱింగించెద వినుము. 137

సీ. ఎన్నిక వేద మహీధర ప్రాగవా
చీ భాగమున నతి శ్రేయమగుచు
నతలాఖ్య లోకపర్యంతాది విపులాంత
రంబైన తగు నహోబలంబు పరమ
పదకల్పమై ధరాభాగ మణిచ్ఛటా
కల్పమై నిర్జిత కల్పమై ప్ర
కాశితానంద సంకల్పమై శుభలీల
నాద్యమై తనరారు నందులోన

ఆ. ఘనతఁ దగు హిరణ్యకశిపున కొకరాజ
ధాని దానిపేరు దనరు రత్న
పురియనంగ రత్నపూరిత సాలమై
యతల రత్నమాళి యని నుతింప. 138

క. ఆపురిఁ జొప్పడు నున్నత
గోపురములచేత నవ్యగోపుర మనఁగా
గోపురములలో లక్ష్మీ
నూపురమై వెలసె బుధజను లొ్కానియాడన్. 139

వ. మఱియు నప్పురంబు మేరుకోశసమానయై మేరూత్తుంగశృంగయై సభా విజితమేరువై రత్నశృంగహేమ ప్రాకారకోష్ఠకక్షేపణాదులచే మాయా బలదురాసదంబై వెలయు మఱియు. 140

తే. గీ. వాసవు జయించి నందనావాసతరులు
బాహ్యతలముల నిల్పి తద్భయము వలన
నవి యరణ్యానులై చుట్టు నాక్రమించ
మించి దీపించెఁ దన్నగరాంచలముల. 141

తే. గీ. వాసి కెక్కి త్రివిక్రమ వాసచరణ
నఖ వినిస్సృత యగు మహానది తదీయ
పరిఘయై యుండె నరిభయంకరము గాఁగ
నప్పుర మహత్వ మెంచఁగ నలవి యగునె? 142

క. మధు రామలోదకములై
సుధ లొల్కు సరోవరములు సొంపగు నచటన్
బుధు లెన్నఁగ బహిరంత
ర్నిధులై మానస సరస్తిణీకారరుచిన్. 143

క. అనిమిష ఋషి దామంబులు
ఘనుఁ డాతం డాక్రమించి కైకొన నా గో
ధనములు కామగవీకులు
జనితంబు లభీష్ట మగుచు సతతము నందున్. 144

క. హెచ్చుగ సురజయ కలితా
త్యుచ్చైశ్శ్రవో ముఖోత్తమ హయముల్
మెచ్చఁగ నైరావతము
ఖ్యోచ్చండోద్దండ హస్తియూథము లచటన్. 145

సీ. ప్రవిజితదిక్పాల పట్టణానీతసు
మంగళ వస్తు సామగ్రి మెఱసి
యప్సరస్సిద్ధ విద్యాధర కిన్నర
కింపురుషాది సంకీర్ణ మగుచు
నమరావతియుఁ బోలి యబ్జభవోపమ
బ్రాహ్మణుల్ మనునిభరాజవరులు
వైశ్రవణాదిక వైశ్యులు కాలాంత
కనిభనాయకులు ప్రకాశ మందఁ

తే. గీ. జిత్రగుప్తోపమాన సచివులు గలిగి
యఖిల లోకంబులు నుతింప నతిశయిల్లె
నతల లోక నిధాన గర్భాంతరాళ
సమధి పూరితశౌర్య విత్తమయి మించి. 146

తే. గీ. శతదళోచ్ఛ్రాయ విస్తార సారరత్న
మంటపస్తంభ యగు దాని మహిమ లెంచ
నజహరాదులకేనియు నలవికాదు
ఘనతఁ గొనియాడ నింత పట్టణము గలదె? 147

ఉ. ఆ వరరాజధాని నసురాగ్రణి శ్రీ నరసింహ దేవతా
భావిశుభావతారము ప్రభావము [56]మున్నియెఱింగి నిల్చి ధా
త్రీవలయంబు బెగ్గడిల దిగ్విజయం బొనరించెఁ బెక్కు మా
ర్గా విభునాజ్ఞ యింద్ర వరుణాది సుర ల్తలఁదాల్చి కొల్వఁగన్. 148

వ. మాయసుర వీరుం డగువాఁడు లోక ప్రత్యయార్థంబుగా దుష్కర
తపంబు చేసి పద్మసంభవుఁ బ్రసన్నుం జేసికొని యిష్టవరంబు
లిట్లని వేఁడుకొనియె. 149

## హిరణ్యకశిపుండు బ్రహ్మవలన వరంబులు వడయుట

సీ. ఓ దేవ కరుణాపయోధి నాకప్రతి
పత్త్రతాదయి కాధిపత్య మొసఁగు
మమర గంధర్వ యక్షాసురోరగ సిద్ధ
గరుడ విద్యాధరఖచరసాధ్య

56. మున్నెఱిం౯.

కిన్నరదానవ కింపురుషాదులు
దివ్యాయుధముల నెదిర్చి మాయ
పనిపూని మఱియును పంచమహా భూత
ములు ఖానిలోర్వ్యరాంబు శిఖినామ

తే. గీ. ములు విరోధించి దీకొని మొనసెనేని
గ్రామ్యపశువన పశునగర ఖగమృగము
గాని స్త్రీపున్నపుంసకగణ మెదిరిన
భయము లేకుండ వలయునో పరమ పురుష. 150

వ. నిలయాంతర్ బహిరంత స్థ్సలముల నక్లేద్యునింగా నదాహ్యునింగా నశోష్యునింగాఁ జేసి భూమియందు నాకాశమునందు నమస్తమైన వారిచేత నిర్భీతునిం గావించవే స్వామీ భవత్కటాక్షంబున. 151

తే. గీ. ఘనుఁడ నయ్యెద నత్యసంకల్ప నిత్య
తనుఁడ నయ్యెద మఱినిరాతంక కీర్తి
ధనుఁడ నయ్యెద నోదేవతావరేణ్య!
యినుఁడ నయ్యెద లోకంబు లెల్ల నెఱుఁగ. 152

సీ. అఖిలేశ సర్వలోకాధి పారాధ్యుఁడ
నయ్యెదఁ ద్వదను గ్రహంబు వలన;
నీఁక సభార్యుండ నయ్యెద; సపుత్రుండన
య్యెద; సభృత్యుండ నయ్యెద; సకీర్తి
నయ్యెద; నీఁకను దేవాసుర మానుషం
బగులోక తతి మదాయత్త మనఁగ
నత్యంత ధన్యుఁడ నయ్యెద; మత్పితా
మహుఁడవు నీవు సమ్మతి నొసంగు

తే. గీ. మన్య భయమునఁ గాదు మహాప్రతాప
శాలినైనట్టి నాదివ్యశక్తి నీకుఁ
దెలివివడనేఁడు త్రిభువన స్థితిలయములు
తలఁచినప్పుడె కావింతు దైత్యమహిమ. 153

ఉ. ఆ తేజంబటులుండ నిమ్ము భవదీయాశీర్వచః ప్రాప్తిమై
ఖ్యాతింజెందెద సద్గురుల్ నిజశిశూత్కర్షాను కూలైక సం
ప్రీతిం దీవన లిచ్చుచోఁదగునె సుస్భీతాయురా రోగ్యముల్
సాపత్యంబునఁ గల్గఁగోరుటలు మత్స్వామీ దయాంభోనిధీ! 154

క. ఈలోకములన్నియు నే
నేల సమర్థుండ నైన నెన్నిక సుదయా
శీలుండవు గురుఁ డన్వయ
శాలివి యిఁకని మ్మనుజ్ఞ నత్కృపమెఱయన్. 155

వ. నాకు నిట్లు కోరినయట్లనే వరంబు లొసంగు నీయాజ్ఞం జరించెద నని తత్తపోబలంబున నచేయంబగు వరంబు వేఁడిన నప్పద్మజుం డిట్లనియె. 156

మ. క్షితిలో దైత్యకులాధి నాయక! స్వతస్సిద్ధంబు నీ విక్రమో
గ్రత; వీరారి దురాసదంబు; తపముం గావించి తా మీఁద; సు
స్థితి నీకేనిట నేమి దుర్లభము దర్శింపం గులాచార సు
వ్రతముల్ దప్పకు నాపితామహత సారంబై విజృంభింపఁగన్. 157

వ. నన్ను మన్నించి సేవించితివి; నేను బ్రసన్నుండనైతి; సకలార్థ వాసంబగు నీకు మఱియు నాశీర్వాదంబులు గావించితి. నీవు కోరిన కోరిక లెల్ల మున్నె నీయందు నున్నయవి; పునః ప్రార్థనంబు సేయుట సిద్ధసాధనంబు; మహావీరా! శూరపరంతప! వరంబులు గైకొనుము; నిన్నెవ్వరు వారింప శక్తుం డని మనంబునం గలంగియుఁ గృత్రిమ వికాసంబు మొగంబునం దొడము బలాత్కార వరం బొసంగి యంతర్ధానంబు నొందె; వాఁడును బ్రహ్మవరోద్బుద్ధాగాధ వీర్యపరాక్రముండై యంతర్హితుండైన విరించికి దండప్రణామంబు లాచరించి నిజపురంబునకుం జనియె. 158

సీ. అంత హిరణ్యాక్షుం డత్యంత దృఢ తపో
బృంహిత విభవుఁడై పెచ్చుపెరిగి
తన పట్టణము వోలె ధన్యత మూఁడులో
కములు నేలె నుదారకర్మ శక్తి;
మును వైదిక ప్రభఁ దనరి సామాత్యపు
రోహితుండై తత్త్వ రూఢి మెఱయు
వైదికుల్ బోధింప వేదనిర్దిష్ట మా
ర్గంబునఁ బ్రజనేలి ఘనత వెలయు

తే.గీ. తన మహిమ సర్వ సత్త్వ సంతతి చెలంగ
ధరణిఁ బాలించె నురుధన ధాన్య వృద్ధి
మున్నుఁ గనకంబుగా నాజ్ఞ మధువిరోధి
చక్రమును బోలి జితదిశా చక్రమునను. 159

ఆ. అంతరంగమునను హరి భక్తియును బహి
రంగమునను నవజ్ఞ యత్నములను
గా నటించి దైత్యగణముల నందఱ
మోసపోవఁ జేసె నాసురారి. 160

తే.గీ. సంశయాన్విత వస్తుల శాస్త్రమే ప్ర
మాణ మగుఁగాన వరశాస్త్ర మహిత మతులు
బాహ్యవృత్తి కువృత్తియై పరఁగి యున్నఁ
దలఁచి రాతని సద్గుణోత్తరుని గాను. 161

మ. భువనోత్కృష్టున కాసురారి మణికిన్ బుత్రీమణిన్ దేవతా
యువతీ మోహిని నిచ్చెనంత నపు డయ్యుత్తాన పాదావనీం
ద్రవతంసంబు వివేక సద్గుణలసత్కల్యాణఁ గల్యాణి వై
ష్ణవి నత్యుత్తమ పుణ్యలగ్నమున హస్తంబందె దైత్యుం డిలన్. 162

తే.గీ. మణిమయోజ్జ్వల దాస్థాన మండపమున
నుత్సవాగత శాస్త్రవాదోత్కన త్క
దంబములతోడ నప్పు డాదైత్య మౌళి
యఖిల దర్శన సిద్ధాంత మరయఁ జూచి 163

సీ. చామర గ్రాహిణి సంధూత చామరా
నిలము హల్లోల కుంతల ముఖాంబు
జంబు కుండల మణి చాకచక్యమున న
లంకరింపుచు నలకంబు మహిమ
కల్యాణ సమయ యోగ్యంబగు కామ రూ
పముఁ దాల్చి లలిత శోభా విలాస
రూప లావణ్య కలాపయౌ కల్యాణి
యాకార గర్వంబు నపనయించి

తే.గీ. యట విజృంభించి సకల సిద్ధాంత సార
విధుల మోహంబు నొందించు విధము దోఁప
సర్వ సమ్మతమైన దర్శనము మాకు
నెద్ది యెఱిఁగింపు డింక మీరెఱిఁగి నట్లు. 164

మ. అని యాదైత్యవరేణ్యుఁ డిట్లడుగుచో నంతన్ మతాహం క్రియా
జనితాత్మాగ్రహులై సదుత్తరము లశక్యంబు గాకున్న నీ
ర్ష్యనవారోద్ధతులై తలాతలిని కేశాకేశి బోరాడి య
న్నన పార్థంబులు పల్కఁ వాదుల సభానాథుం డతం డిట్లనున్. 165

వ. మహాత్ములారా! మీరు సర్వసమ్మతంబైన మతంబు నాకు నెఱిఁగింప
శక్తులు గారు; మీలో నెవ్వండే నొక్కఁడు నెఱింగించు నందాఁక
నామతంబు వినుం డెఱింగించెద. 166

క. ఏ నఖిల లోకనాథుఁడ
నే నాత్మజ్ఞుండ ఘనుఁడ నే నరకల్ప
శ్రీ నిత్యపూర్ణ విభవుఁడఁ
బూని ననుం గొల్వుఁ డింక భూసురులారా! 167

క. సర్వామ్నాయాభీష్టత
సర్వామర వరుఁడఁ గాన సర్వార్థ రస
న్నిర్వేశ మంద నేత
త్సర్వఫలంబులు నొసంగ శక్యము నాకున్. 168

వ. అఖిలమును నేనె; నా కంటె నన్యం బెద్దియును లేదన్యంబు గల
దనుట వేదోక్తంబు గాదు; ద్విజులమైన మనకు వేద మప్రమాణ
మనరాదు; వేద ప్రామాణ్య విసంవాదము బహువాదులకుం గలదని
వినంబడియె; లోకాయతసౌగతకాణాదులు ప్రత్యక్షానుమానంబులే
ప్రమాణంబు లగుంగాని మఱి లేదందురు; జనులు స్పష్ట మనంగ
ప్రమాణ ద్వయమేకాని యన్య ప్రమాణంబు లేదందు; రానలుగురు
నాడు మాట లన్నియు నేకంబులై యుండవు; గౌతమాదులును
వేదము పృథక్ప్రమాణ మందురా? గౌతమాదులు వేదములు పౌరుష
వాక్యములందురు; మఱి కొంద అపౌరుషవాక్యంబు లందురు;
పుంవాక్య పక్షమందు వేదంబులకు గుణాన్వితత్వంబును; దోషాన్వి

తత్త్వంబునుం గలవు. గుణాన్వితత్త్వంబు వలన మానతయు దోషాన్వి తత్త్వంబువలన నమానతయు నగు; నిశ్చితంబైన మానత లేదు; పుంవాక్యత్వ పక్షంబునందు బోధకంబులకుఁ బ్రామాణ్యంబు గలదు: అప్రబోధంబులగు తద్వాక్యంబుల కమానత్వంబు స్వతస్సిద్ధం బతి ప్రయాసంబు; నబోధకత్వంబునందుఁ దత్తాత్పర్య నిశ్చయంబులేదే కనిశ్చితతాత్పర్యంబునకు నన్య దూషితత్వంబు గానంబడియె; కాన యాగమవాక్యంబులు స్వతఃప్రమాణం; బధిష్ఠించిన బుధులచేత నుపనిషత్తులకు సిద్ధవస్తు విషయంబైన ప్రామాణ్యం బంగీకరింపం బడదు; సిద్ధమునందుఁ బ్రామాణ్యంబు నిశ్చయింపుచు నున్న వేదాంత తాత్పర్య వినంవాదులగు వేదాంతులలో నెవ్వరిచేతఁ దదర్థంబు నిరూపింపం బడియె నెంత పర్యంతము వేదాంత వాక్యము లకు నిదియర్థంబని స్ఫుటంబగు; స్ఫుటంబుగ నాకెవ్వం డుపదేశించు నంత పర్యంతంబు సర్వేశ్వరుండన నేది నుండు. 169

సీ. మద్భయంబున నేడు మారుతంబులు విసరు
దినరాజు మిక్కిలి [57]తేజమందుఁ
బావకుండు వెలుంగు బలభేది పాలించు
మృత్యువు ధరణిపై మించి తిరుగుఁ
దత్పద్మజాత పౌత్రత నున్న మచ్ఛక్తి
తత్పద్మజున కన్న ధరణి మెఱయు
ధాతృ పుత్రుండయ్యుఁ దనరందె రుద్రుండు
తద్ధాతకంటె నుదగ్ర మహిమ

తే. గీ. సర్వమునకును నియతి నీశ్వరుఁ డనంగ
వేఱె యొక్కరుఁ డున్నాఁడె వెలిచియుండ
నప్రతీప ప్రతాప సమగ్రుఁ డెవ్వఁ
డతఁడె యేలిక జగముల కన్నిటికిని. 170

ఆ. నాకు లేని శక్తి లోకపితామహుఁ
డిచ్చినాఁడె తపము మెచ్చినాఁడ
నాదిసిద్ధమైన యాదర్శకాంతి వి
స్ఫుటము సేయు చికిలి యటులుకాక 171

---

57. తేజునందు.

తే. గీ. కాన నేనును స్వప్రసిద్ధ కలిత సర్వ
శక్తి యుక్తుండ నైన యీశ్వరుఁడ నస్మ
దాజ్ఞచే లోకములకు సర్వాగమములు
నీశత వహించె నిఁక నిన్ని యెంచనేల? 172

క. ప్రత్యక్షేశ్వరుఁడును నే
నత్యాజ్యం బగు మదాజ్ఞ నష్టభ్రములై
నిత్య వినంవాదో ద్భా
తాత్యంతాగ్రహము మానుఁ డాత్మలయందున్. 173

వ. అని వారలకు నుచిత సత్కారంబులు చేసి పనిచి వివాహోత్సవాహూత
దైత్యసురాసురవరులం బూజించి యిట్లనియె: 174

సీ. ప్రాణమిత్రులు మీరు బాంధవు ల్వినుఁడు జ
న్మస్థితిలయము లెన్నటికిఁ జేయ
విశ్వంబునకు నేన విభుఁడ నార్తులఁ గావఁ
బ్రాఁపు శక్తుండ నీశ్వరుఁడ నాదు
శాసనంబున నుండి స్వస్వరాజ్యాధికా
రంబుల వెలయుఁ డారవియు శశియు
నైన నభోవీథి నరుగంగ వెఱతురే
నంగీకరింపక యన్యు లెంత

తే. గీ. యనుచు దితికశ్యపులను భవ్యత భజించి
యజుఁడు భారతియును బోలె హరుఁడునుమయుఁ
బోలెఁ గల్యాణియును దాను బూర్ణభోగ
విభవముల నుండె దైతేయవీర వరుఁడు. 175

వ. ఇటు వివిధ భోగంబు లనుభవించుచు భోక్త హరియని లోనం దలం
పుచు స్వేశ శేషత్వ దృష్టి జనితప్రీతిం జనింపంబడుచు బాహ్యుండు
నుంబోలె బాహ్యంబున మాయానాటక సూత్రంబున నడపుచుఁ జార్వా
కుండునుంబోలె దేహాత్మాభేద సూచకక్రియలు గావింపుచుఁ గైశికివృత్తి
కామినులం గూర్చి కబ్బంబు లొనర్పుచు, ''కాము కేషు సుఖాలాభ''
యనుచు నొకానొకచోటం బల్కుచు జగంబు శూన్యశేషంబని మాధ్య
మికుండునుంబోలె నుచ్చరింపుచు, బహిర్దేశంబున స్వేష్టవస్తువులు
చూడని యట్లుండి హృదయంబున భావించు యోగియునుంబోలె

సర్వంబు నంతరంగంబుననే చూచుచు, బాహ్యంబున లేదని యాడుచు స్మృతిభావార్థ మాత్రముచేతం దదిష్టోపభోగంబులు లేకుండుట యెఱింగినవాఁడునుం బోలె శ్రోత్రత్వగాదికం బెద్ది యది నన్నుం గూర్చినయది యని యొకానొకచో నెరపుచు, విషయంబు లస్థిరంబులని వర్ణింపుచు, సర్వంబును క్షణికంబని సౌగతసంతోష కారిణియై యుదాహరింపుచు, మోక్షమాత్రంబునందు బలోదితంబులైన సామాన్యతోదృష్టవాదంబులచేతఁ గాణాదుండునుం బోలె నొక్కచోఁ దఱచు వేద విరుద్ధంబులు ప్రసంగింపుచు, నాక్షపాదుండునుం బోలె వేద సంజ్ఞి తాగమావృత్తిచేఁ దత్తాత్పర్యబహిర్భూతంబగు దానిం దర్కంబున నొకానొకచో వాదింపుచు, భోజనకర్మంబులకు స్థావరాత్మ హింస యంగీకరించియు, నాజ్ఞా సిద్ధశ్రౌతహింస జైనుండుబోలె దూషింపుచు నేత్రంబులు మూసుకొని హరిందలంచి బాహ్యార్థ విముఖుండగు నొక్కచోఁ దన యనన్యాధీన భావం బతివాదంబున నుతింపుచు నాకు నీశుండు లేఁడని సాంఖ్యవాది యగు కపిలుండునుం బోలె భాషింపుచు వేదాచార విరుద్ధంబు లేని యనుష్ఠేయంబులని సామసాచారంబున శైవుండునుం బోలె నొకానొకచోట వంచింపుచుఁ గర్మంబులకుఁ బురుషాకారంబు శ్లాఘ్యంబని దేవతలకుఁ బ్రాధాన్యంబని జైమినియుంబోలె నుపన్యసింపుచు నిట్లు వర్తింపఁ దత్తన్మతస్థులు స్వస్వమతస్థుండని తలంచిరి; బాహ్యంబున దైత్యుఁ డంతరంగంబునం బరమ వైష్ణవుండై వర్తించు నమ్మాయావి వలన. 176

## ప్రహ్లాదుని జననము

సీ. ఆతని దేవేరి యాత్మజు నొక్కనిఁ
గనియె నాతండు ప్రాక్కృతు ముఖముల
శమదమాదుల మించి జనియించి ఘనమైన
హరిభక్తి యితర జన్మాంతరమున
నతిరోహితంబుగా నాత్మపూర్వోత్తరా
ఘౌఘం బణంగించి యప్రధృష్య
లబ్ధతేజమునఁ బ్రారబ్ధకర్మము ల
త్యద్భుత విద్యచే ననుభవించి

తే.గీ. వాది దుస్తర్క విషభూజ వనదవాగ్ని
యైన దృష్టితమ స్సహస్రాంశుఁడై సు
దృష్టిమతవార్ధి చంద్రుఁడై దిక్కులం బ్ర
కర్షమున హర్ష మొనరించి ఘనత మెఱయ. 177

తే.గీ. ఆత్మలో నెంచి తండ్రి ప్రహ్లాదనామ
మతని కొనరించె దితియుఁ గశ్యపుఁడు వచ్చి
పౌత్రునకు జాతకర్మాది భావుకములు
సమ్మతంబునఁ గావించి చనినయంత. 178

క. మోదమున రత్నపురిఁ బ్ర
హ్లాదోదయమాత్ర కృత మహా విభవమునన్
శ్రీదయితున కపరాజిత
యై దీపించెన్ జగంబు లద్భుతమందన్. 179

మ. పరిపూర్ణాద్భుత విశ్వరూప విమల బ్రహ్మైకతత్త్వార్థ త
త్పరసత్త్వాభవపూర్ణభోగమున నా ప్రహ్లాదుఁ డుత్పన్నుఁడై
హరి భక్తాగ్రణియై బుధు ల్పొగడ భూర్యధ్యాత్మ విద్యాధురం
ధరుఁడై యుండియుఁ బ్రాకృతాత్ముఁడువలెం దానుండుగంభీరతన్. 180

ఆ.వె. పుట్టు మొదలఁ బలుకఁ బూని శ్రీహరి దివ్య
నామముల సనాతన ప్రసిద్ధ
ముత్తమోత్తమ మగు నోంకార మని జిహ్వఁ
బలుకఁ దొడఁగె దైత్యపతి సుతుండు. 181

వ. ఓం తత్సత్పదములను మూఁడు నిర్దేశంబులు పరబ్రహ్మంబునకుం గల వవి సర్వజన మంగళ ప్రదంబులగు వానిలో నాద్యంబగు నోంకారం బాయోంకారంబు త్రిపద వాక్యంబు; వ్యాస విద్యా ప్రకాశంబు, నందు నకారణంబు చతుర్థ్యంతం బగు, ప్రథమపదంబు రక్షకాయ యను పదంబునకుఁ బర్యాయంబు, దానికి నుకారం బవధారంబు, మకారంబు జీవవాచకంబైన ప్రథమాంత పదంబు అవరక్షసే యను ధాతువున డప్రత్యయ నిమిత్త కటి లోపంబైన నుజత్పత్తియైన చతుర్థ్యంతంబా యను పదంబు నిచ్చె; సుబ్లోపమైన సమాసమందు గుణంబైన ఓ యని యుండి హల్మాత్రమకారములో సంహితయైన

బిందువుగానో మనువాక్యము శ్రుతి దృష్టి కనీనిక యగు మకారార్థంబు పంచవింశమ నీశ్వరాత్మైకధీబలంబకారార్థంబున ననేకొని యన్యంబు నకు లేదని యుకారార్థంబు శ్రుతి సమ్మతంబు బ్రహ్మంబునకె యను నుపనిషత్ప్రవణంబునకు నేతదర్థం బనుట నిశ్చయించి న్యాసంబు పలన వినియోగంబు చేసి స్వరక్షక పరబ్రహ్మ నామ మోమ్మని స్మరింపుచు నొకానొకప్పుడు హంసహంస యని సంభోధింపుచు హంస రూపమును స్వహృత్పద్మచందంబుల ననుచరింపుచు నర్ధవేదిగావున నాదినుకారంబును మధ్యంబున మకారంబు నాకారం బంతంబునంజేయక పలికె; నకతంబులగు చతుర్వింశతి తత్త్వంబులకు విలక్షణుండై పంచవింశకుండు సోహం సోహం బగు నంతర మనువు నుచ్ఛ్వాస నిశ్వాస భవంబైన దాని హంసంబై శ్రీశ పాదాబ్జైక్యభోగ్యండైన తనకు వాచకంబుగ నెఱింగి జీవించి హంసప్రణవ మంత్రంబులచేత నంతర్బహిర్దేశంబుల నహర్నిశంబును సర్వేశ్వర రూపంబులు స్వభా వంబున భావింపుచు నొకానొకప్పుడు బ్రహ్మానుభవామృతవర్షంబున నవ్వుచు నొకానొకప్పుడు బద్ధులఁ జూచి యార్ద్రచిత్తుఁడై దుఃఖింపుచు నట్లు ప్రారబ్ధ పుణ్య పాపరాసులు క్షయింపం జేయుచు సుఖదుఃఖాను భవంబులఁ గాలక్షేపంబు గావింపుచు నిరంతర స్వాంతనసరోహంసం బగు హరి భజింపుచు నొక్కనాఁడు. 182

క. తనయునకు ముద్దుగుల్కెడు
తనయునికి శుభంబుగాఁగఁ దలిదండ్రులు హృ
ద్వనజముల నుల్లసిల్లుచు
దినదినమును వింత వింత దీపించు తఱిన్. 183

క. బాలక తతితోడను జం
బాలకలానీలదేలి పరితస్ఫుటలం
బాలక కేళికమైనా
బాలకమణి విష్ణుభక్తిపరుఁడై నిల్చెన్. 184

క. దాదు లిడు వస్తువు సనం
దాదులు మెచ్చంగ నతఁడుదారోదంచ
న్మోదమున స్వస్వతనుఁడై
యాదేవున కర్పితముగ నాత్మ నొనర్చెన్. 185

తే.గీ. జనులు స్వోద్దేశ విహితోపచారములు ప్రి
యంబుతోఁ జేయ స్వమూర్తి యగుచు స్వాంత
రాత్మ నిలిచిన హరికి సమర్పితముగ
నర్భకుం డాతఁడు దలంచె నతి నియతిని. 186

తే.గీ. అప్పు డుచ్చావసముఖ్య కర్మాంతరంబు
లిన్నియు నిజాంతరాత్మ సేయింప నేఁడు
సేయుచున్నాఁడ నని జ్ఞానసిద్ధి చేసి
కలిత సత్కర్మతా శక్తిఁ గాంచి మించె. 187

సీ. వాసిగా మృద్బలీవర్ధంబుల నొనర్చి
కృత్రిమ తంత్రినాకీర్ణదామ
ములఁ దిప్పు హరి విశ్వమును ద్రిప్పు నీక్రియ
నని తలంచుచు గృహస్థాశ్రమస్థు
కర్మముల్ పూని తత్కల్పితాన్నాదికం
బుల కల్పితేశ్వర పూజఁ జేసి
యర్పితంబులు సేయనతఁడు కల్పంబులు
దెలిసి తేజము గల్గు దివ్యభవన

తే.గీ. ములు ప్రకల్పించి కల్పిత బుధుల నెదురు
కొని ప్రణామంబు లిడి మదిఁ గోర్కులొసఁగు
నంతఁదద్భుక్త శేషంబు లారగించు
భగవదనుకూల సద్భక్తిఁ బరిఢవించు. 188

వ. మఱియుఁ గృత్రిమ మఖంబులు గావించి భగవదర్పితంబులు
సేయుచు నుత్సవంబున. 189

## ప్రహ్లాదుని విద్యాభ్యాసము

చ. అనుపమలీల నిట్లు తిరుగాడెడు నా ఘనయోగి మౌళికిన్
జనియె సమాచతుష్కము నిశాచరుఁడై దవయేఁడు చొచ్చినన్
దనయునిఁ జూచి సత్క్రియలసంఖ్యములై తగఁజేసి సంతసం
బొనరఁగ నక్షరాభ్యసన యోగ్యత గాంచి సభాంతరంబునన్. 190

శా. చండామార్కుల శుక్రపుత్రున మహాశాస్త్రజ్ఞులం బ్రాజ్ఞులన్
పాండిత్యప్రతిభా విజృంభితుల సంప్రార్థించి విద్యావహో
ద్దండశ్రీ విలసిల్ల నాతనయుఁ బంతంబొప్ప శిక్షించుఁ డీ
తండుత్కృష్టుఁడు శిష్యుఁడైనఁ దగు సుద్యత్కీర్తి మీకెప్పుడున్. 191

వ. అని యొప్పగించిన గురుగృహంబున కేగి కతిపయదినంబులకు సకలవిద్యలు నభ్యసించి మీకు గురుదక్షిణ యిప్పించెద నని తోడ్కొని తండ్రిచే ననేక గురువస్తువు లిప్పించి గురులుం దాను జనకుని యాజ్ఞను నుచితాసనంబులఁ గూర్చున్న యెడ సత్కర్మంబులలో నెయ్యది యోగ్యంబు? ఏ విద్య గ్రాహ్యంబు? ఎఱింగింపు మనిన నంజలిచేసి ప్రహ్లాదుండు. 192

ఉ. శ్రీ నిరతంబుగా నవధరింపుము దేవ! మహాత్మ! నీమహా
స్థానమునందు వాదు లురుసార వచోగుణ దోషవేదులు
న్యూనత నున్నవారు మహిమోన్నతి స్వస్వమతంబెకాని య
న్యైన గ్రహింపఁ జాలరు తదన్యమతంబులు గర్వితాత్ములై. 193

వ. ఇట్లన్న నేమి? వీరల నుల్లంఘించి వైదిక కర్మంబును సద్విద్యయు విన్నవించెద. 194

ఆ. ఏది బంధకంబు గాదిది సత్కర్మ
మరయ మోక్షమునకు నయ్యెనెద్ది
యది సువిద్య దుఃఖ మన్యకర్మము శిల్ప
మన్య విద్య నిశ్చయముగ వినుము. 195

వ. అనిన దండ్రి యిట్లనియె. 196

మ. తనరన్ బంధ మనంగ నెద్దియగుఁ దద్బంధంబుఁ గల్పింప సా
ధనమేకర్మ మసాధనం బనఁగ వార్తన్మించు నేకర్మ మిం
పున మోక్షంబున నెద్ది విద్య యనఁగా నౌనెద్ది యీరెంటికిన్
ఘనమై మించిన సాధ్యసాధనత నాఁగా నెద్ది చర్చింపఁగన్. 197

వ. అని దైతేయుం డడిగినఁ బ్రహ్లాదుం డిట్లనియె నాత్మ యనంగ స్వాభావికానంద చిచ్ఛక్తి యగునది యేజ (?) యనఁ ద్రిగుణాంచితయై

యనాద్యయె దుర్వికార యైన యది జీవబుద్ధి విక్రియాహేతువైన త్రిగుణానాద్యనాత్మయొక్క సంబంధ మెద్ది యది రజస్తమోగుణో ద్రిక్తసాధనయైన కర్మ బంధనము వేదవిహితంబులు సేయక యుండుట, వేదనిషిద్ధంబులు సేయుట ఈశ్వరాజ్ఞోల్లంఘనంబు. తదాత్మకంబైన కర్మంబు తమోగుణ రజోగుణ ప్రసవకారణము; శ్రుతిస్మృతిచోదితమై సదనుష్ఠితమై ఫలసంగత్యాగ పూర్వకమైన కర్మ మబంధక మది యేమియన నచ్యుతాంఘ్రిసద్భక్తికిఁ జేరువనే యుపకారమై ప్రయాజాదిక మాగ్నేయాదికంబునకుం బలె మలప్రక్షాళనంబు వలన మణికి జ్యోత్స్నయే ప్రకారంబునం జేయంబడదు కలిగియున్న యదియె యభివ్యక్త మౌట యెటువలె నినాయావిర్భావము లేనియది పుట్టదు. హేయగుణ ధ్వంసంబువలన నవబోధాది గుణములు ప్రకాశించుఁ గాని నడుమన్ జనింప దని యాత్మకు నిత్యత్వంబుల జీవేశ్వర తత్వాధి మూలంబునై శ్రుతిచోదితంబు లగు కర్మంబులచేతనుం గూడిన యీశానస్మృతి విద్య యని వినంబడిన యది; ఈ విద్య బుధులకు విష్ణుం డుపాస్యుండని చెప్పుచున్నయదియై సేవింపం దగిన యీశ్వరుని వ్యత ప్రియకాంతయుం బోలెఁ బ్రకాశింపంజేయు భక్తిరూప యగు నీ విద్యచేతఁ జూపంబడి హరి తన దాసునికి బంధంబు మాన్పి సంతోషం బందించు నా యీశ్వరుండు హేయ ప్రత్యానికాసంఖ్యేయ కల్యాణ గుణసాగరంబును, శ్రీ భూ నీళా దీయపతియుఁ జిద చిద్విశ్వనాయకుండును నగు నీశ్వరునికి నే తచ్చి ద్రూపంబగు ప్రపంచంబు స్వశరీరం బని యుపనిషన్మతము నని యతంబైన నతండు సర్వ చిదచిద్వస్తు వ్యాప్తత్వముచేతఁ బ్రపంచంబు దానయై యుండునని వేదాంతంబు లాయన వైభవంబు బోధించు చున్నయవి; ఇందుఁ గొందఱు గ్రహావిష్టులుం బలె నిశానిష్టచేతను లెంత పర్యంతంబు తదాదేశము లంత పర్యంతంబె; ఈశు లన్య ప్రకారంబున నీశులు గారని తా నడిగిన ప్రశ్నంబులకు నుత్తరంబులు సెప్పిన నాత్మజ సూక్తి భానుప్రభాస్ఫుటాలోకిత తత్త్వమార్గుండై యంతరంగంబున హర్షించి తద్దంభదైత్యుండు బహిరంగంబున నసుర సంగ్రహంబున కాగ్రహించె నప్పుడు. 198

శా. కోపాటోప విజృంభమాన కుటిలోద్ఘూర్ణస్ఫుట భ్రూకుటీ
క్షేపోగ్ర ప్రళయానలాద్భుతశిఖా కీర్ణంబులై నేత్రముల్
దీపింపన్ దశనాంచలోత్కట కిటోదీర్ణారవోద్భిన్న సా
టోపారాతి మనస్కుఁడై దితి కులాఢ్యుం డంతలో నిట్లనున్. 199

క. గురుసుతు లని మిము నమ్మితి
పరుసంబులు పల్కఁ నేర్పి బాలుని మీరల్
వర విద్యానిధిఁ జేసితి
రురుమతి మా కాప్తులౌదు రోహో యనినన్. 200

సీ. అప్పు డా గురుసుతు లసురేంద్రుఁ డల్ల న
ర్ఘాసనంబులు డిగ్గి యధిప తెలిసి
పలుకుము ప్రభుఁడవు ప్రభుఁ డెట్లు నాడిన
నంద మౌనని యిటు లంటి వేమొ
నీ తనూభవునకు నేఁడు వైదిక మతి
శిక్షింప మా జన్మ సిద్ధమే గ్ర
హావేశబంధమో యనఘాత్మ! యెటువంటి
గ్రహము సోఁకిన జీవగణములటుల

తే.గీ. నాడుచుండ నవైదికులందు వైది
కగ్రహంబు ప్రవేశించికాదె యిట్లు
నెదుటఁ బలికింపు చున్నది యిట్లు నీస
భాసదులతో విమర్శింపుమా సురారి! 201

తే. గీ. ఒనర విశ్వాసపాత్రమై యున్న భార్గ
వాన్వయంబునఁ బుట్టి నీ కభిమతంబు
గాని మత ముపదేశింపఁ గలమె యంత
రంగ బహిరంగముల దానవాధినాథ! 202

వ. అని. 203

తే.గీ. సమ్మతింపుము గురుహిత సత్యశౌచ
నియమము నిరర్థమౌ నింక నేఁటినుండి
కాన మదినమ్మి సుతుని వికారమూల
మరసికొను మింకనేని దైత్యాధినాథ! 204

వ. అని పల్కఁ గురుపుత్రుల వచనంబులు విని నమ్మి వారికిం బ్రణమిల్లి
సురారి సుతునిం జూచి యిట్లనియె. 205

క. గురు లానతి యియ్యని యీ
వరవైదిక విద్యయట్ల ప్రాపించెను వ
త్స! రహి వహింపుచు బుధజను
లరయఁగ నిట్లాడ యెట్టు లభిమత మయ్యేన్. 206

తే. గీ. బాహ్యవాదాభిమానులై బహుసుధీరు
లాగమాంత మంతం బన్న నద్భుతముగ
నింద సేయుదు రది యెట్లు నీకు భోగ్య
మయ్యె వారలకంటె జ్ఞానాధికుఁడవె? 207

క. కడను బృహస్పతి ముఖ్యులు
జడులే వేదాంత మనిన సహియింపరు చౌ
వ్వడఁదద్దోషము లెఱిఁగిరి
విడిచిరి నీవా మతంబు వెలయించెదవే? 208

వ. అనినఁ బ్రహ్లాదుం డిట్లనియె. 209

సీ. దైత్యేంద్ర! నమ్ము మద్వచనంబు ప్రాగ్భవ
గురుదత్తమై నిరంకుశత మెఱయ
నీమతి గురుపుత్రు లెఱుఁగ రింతయు శ్రుతి
ప్రామాణ్య విశ్వాస పరత వైది
కాచారరుచియు వేదాంత వేద్యుండైన
హరియందు భక్తి యనల్పతపము
నందుఁ గల్గక తా ననాదినిధ నంత
తానందశాఖియై జ్ఞానపుష్ప

తే. గీ. మై యమృతరస మై భవ్యమైన వేద
కల్పకము సులభమె దుష్టకల్మషాసు
ర ప్రకృతులకు నెల్ల సారంబు దెలుప
నాత్మ చర్చింపుమా దానవాగ్రగణ్య! 210

క. శ్రుతిహితకర మని మతి యా
దృతిఁ బల్కిరి సభలయందు దేవప్రకృతుల్
శ్రుతి యహితం బని పల్కిరి
యతి నీచులు లోకవిశ్రుతు లసురప్రకృతుల్. 211

క. సత్త్వ ప్రధానమతులు సు
దీత్వంబున నెంచిచూడ దేవప్రకృతుల్
సాత్త్వికు లసురప్రకృతు ల
సాత్త్వికులు రజస్తమోవిసంకీర్ణమతుల్. 212

తే. గీ. జ్యోత్స్నయందుఁ జకోరముల్ సొంపుగాంచుఁ
గలుగు నాత్మ నులూక మాగమము లట్ల
వీని దేవప్రకృతికిని వేడ్కతోడఁ
మకిలుకొను క్రోధ మాసురప్రకృతికెల్ల. 213

క. ఖలుల కిటులైన దిక్కున
వెలసినకృతి కల్పలతిక విడువఁదగునె సా
ధులు మఱి యాత్మప్రకృతిని
ఫలము గొనుట కాశ్రయించి బ్రతుకం దగదే? 214

క. తెలివిగల యా గురుప్రభు
తులు జడులే సద్విరోధి దుర్మతభంగం
బులకై మోనము సేయం
దలఁచినపక్షంబు లవియ తత్పరములగున్. 215

సీ. ఆదివేదోక్త ధర్మాచరణైకసం
ప్రాప్తతేజస్కులే యంతనుండి
దేవాది బాధ లుద్దేశించి యత్నంబు
గావింతు రెవ్వరు గర్వశక్తి
నటువంటి సౌదర్శనాధిపతి త్రిపు
రేశాది దుర్మతుల్ హెచ్చియున్న
తత్తేజ మడఁగింప ధరణిపై మోహనా
గమములు కల్పింపఁగడఁగి రప్పు

తే. గీ. డమరగురు బుద్ధ కణభుగర్హజ్జినేంద్ర
గౌతమాదులు సాధులోక ద్వేషద్ప
మంబు గావింప బాహ్యశాస్త్రంబు లెల్ల
మేరమీఱఁగఁ గొన్ని నిర్మించి రంత. 216

క. పరమనియతిఁ బ్రాగ్భవములు
గురులవలన వింటిఁ గథలు గుఱిగా విద్వ
త్పురుషులు శ్రేయోర్థు లగుచుఁ
దిరిగిరి తన్మోహశాస్త్ర ధిక్కారములన్. 217

క. నారాయణుఁ డుండఁగ మఱి
వేఱొకని వరుం డటంచు వివరించు దురా
చారులు పాషండులు ని
స్సారులు దద్గోష్ఠి విడువఁ జను ధన్యులకున్. 218

తే.గీ. ధర శ్రుతిస్మృతి వైరుధ్యతరము చైత్య
సేవనాదిక కర్మముల్ సేయుచుంద్రు
చాల నెవ్వరు తన్మూఢజనులు పాప
రతులు చర్చింపఁగా వికర్మస్థు లనఁగ. 219

శా. ప్రోఢ ల్బాడకయుండ లోన విషయంబు ల్చాల భోగించి దు
ర్వ్రీడం బాహ్యమునన్ విరక్తులపలెన్ ద్వేషింపుచుం డెప్పుడున్
బైడాల వ్రతికుల్ బిడాలము పయఃపానాభిలాషంబులో
నాడన్ క్షీరఘటంబు డగ్గఱియు నైరాశ్యంబు గొన్నట్లుఁగన్. 220

క. పరులఁ దపింపం జేయం
బరధన విద్యాకులాది భాసురతేజ
స్స్ఫురణంబు లెన్నుకొనువాఁ
డరయన్ శఠుఁ డనఁగ మించె నతినీచమతిన్. 221

క. వేదానుకూల నన్యా
యాది ప్రతికూల దుర్ణయంబులచేఁ బా
పోదితదుశ్శాస్త్రముల
త్యాదరమున విను విమతుల హైతుకు లరయన్. 222

క. ఘన దైవ పౌరుషాగత
ధన మంతయు నాశ్రితజనతతి వీడ్కొని తా
ననుభవమునకుం గొనుపా
పని కృష్ణుఁడు జగతిలోన బకవృత్తి యగున్. 223

సీ. ఇటులనె ఘనులకు నిష్టతమంబు లౌ
బాహ్యమతంబులు బహువిధములఁ
దెలియ నపన్యాయములకు మూలంబులు
గానా కెఱుంగ యోగ్యములు గావు;
పొంధు లంధులు గూడి బహుసహస్రములైన
తెరువు గానక యున్న దృష్టి గలుగు
నతనిచేఁ గడతేరునట్లుగా నాచేతఁ
గడతేరుదురు మూఢకలుషమతులు

తే.గీ. బాహ్యపక్షంబు లెల్ల నసత్పక్షములని
నీకు భ్రమమయ్యెనేని యానీచమతుల
తోడ సంవాద మొనరింతుఁ జూఁడు నేఁడు
నాదు మహిమయె శ్రీజగన్నాథు మహిమ. 224

క. తత్తన్మతాభినో
ద్వృత్తులగు నవైదికు లవిధేయులఁగా నే
హత్తింతున్న్యాయో
దాత్తోక్తులచేత సమ్మతార్థము గాఁగన్. 225

ఆ.వె. అని ప్రతిజ్ఞ చేసి యావైదికాగ్రణి
తండ్రి యెదుట నిలిచె ధన్యపీఠి
నభయ దాన పంజరాకృతి యగు శౌరి
నాత్మయందు నిల్పునతిశయమున. 226

సీ. అంత నద్వైతేయుఁ డాత్మజు ప్రతి నస
త్యము సేయఁ దలఁచి యుదగ్రబుద్ధి
గురు సుగత కాణాద గిరిశార్హ దక్షపా
ద విరించి కపిలశాస్త్రజ్ఞ వాది
పరుల నందఱఁ బిల్చి వాదింపుఁ డితనితో
భవదీయ పరశాస్త్ర పర్వతంబు
లితఁ డాత్మసునయేంద్ర హేతిచేఁ జూర్ణంబు
గావింపఁ దలఁచె మీఘనత మెఱసి

తే. గీ. తర్క కర్కశ వాక్కశోదర్క మహిమఁ
బూని గెలిచితిరేని ననూన శక్తి
మిమ్ము మన్నింతు వెలయింతు మేదినీత
లమున మీమతముననె హృద్యముగ నడుతు. 227

## ఆశ్వాసాంతము

శా. బర్హా పీడ విరాజమాన! కమలా ప్రాణేశ! నిత్యస్తువ
ద్బర్హీవక్త్రికిరీట జుష్టవిలస త్పత్ప్రీత భక్తావళీ
గర్హాభంజన! లోకరంజన! శుభాకారోత్తమాచార పూ
జార్హస్తోత్ర పవిత్రరాజదనుకంపా పాత్ర! చిన్మాత్రకా! 228

క. శరణాగత భరణాదర
హరితాంబర శంబరాంతకాయుత తేజా!
మురసూదన! పురభేదన
వరసాధన వర్ణరూప ధారణచతురా! 229

మాలిని: విదితదురవలేపా! వీతదోషాదిరూపా!
విదితసదనులాపా! విశ్వధర్మానురూపా!
కధఘన శుభరూపా! కల్పితానేక రూపా!
కధఘన రదురాపా! కల్యచూడాకలాపా! 230

## గద్యము

ఇది శ్రీమత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్య పుత్ర
కశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడు నరసింహ ప్రణీతంబైన
నారదీయపురాణంబు నందు సప్తమాశ్వాసము
సంపూర్ణము

# నారదీయపురాణము

## అష్టమాశ్వాసము

క. శ్రీ మాన్య జాంబవత్క
న్యా మానస రాజహంస! హంసోత్తంసా
రామవసంత గుణాశ్రయ!
సోమాన్వయవర విభూష! శోభనవేషా! 1

వ. అవధరింపుము. సూతుండు శౌనకాదులకు హరికథా సుధాప్రవా
హంబు వెల్లివిరియ నిట్లనియె ననిన వారలు నిజశాస్త్ర ధౌరంధర్య
ప్రాగల్భ్యంబున వచ్చి నిలిచిన యప్పుడు. 2

క. పూర్ణ బ్రహ్మానందో
దీర్ణ పరంజ్యోతి రిద్ధతేజో మహిమా
కీర్ణ శుభాకారశ్రీ
నిర్ణిద్ర స్ఫూర్తిసుతుఁడు నిలిచెన్ సభలోన్. 3

వ. నిలిచి 4

సీ. పాషండ మతగర్వ పర్వతంబుల మీఁద
దంభోళియై మహోద్ధతి వహించి
చార్వాకమత మహా సాగరావళి మీఁద
నౌర్వానలస్ఫూర్తి నాక్రమించి
బౌద్ధ దంతావళోద్భట ఘటార్భటి మీఁద
సింహరాజంబు ప్రసిద్ధి నెదిరి
జైన మహారణ్య సంఘాతముల మీఁద
నతుల దావానలంబై స్ఫురించి

ఆ. కపి లాక్షపాద కాణాద వైరించ
మతఘనాంధతమస మండలార్క
మండల ప్రకాండ ఖండ నోద్దండత
నట జయించె నా *కయాధ సుతుఁడు. 5

---

* హిరణ్యకశిపుని భార్య.

వ. అప్పుడు యుక్తులు తోచక ప్రతివాదులు భంగంబు నొంద సుధాతరంగంబులైన వాక్కుల విజృంభించి యున్నయెడ దండ్రి రోషోద్ధతుండై యున్న భగవత్ప్రభావం బెఱింగింప నిట్లనియె. 6

క. వినుము జనక! నిజసేవక
జనకల్పకమైన యట్టి చక్రియశము శో
భనమతులు వారు సన్నుతు
లనిశంబు నొనర్చి ముక్తులైరి ధరిత్రిన్. 7

వ. అది యెట్లంటేని వాసుదేవపరంబైన జపంబు జపియించి మున్నర్భకుండైన ధ్రువుండు ధ్రువస్థానంబున బ్రహ్మాది దివిజులకంటె మీఁదట నుండె నది యెఱింగించెద వినుము. 8

## ధ్రువుని చరిత్రము

తే. గీ. భవ్యవైభవుఁ డుత్తానపాదుఁ డనఁగ
నాప్తబంధుండు మనవు గుణాధికుండు
సాధురక్షణచణ శక్తి చక్రధరుఁడు
దుష్టశిక్షణ చణశక్తి ధూర్జటియును. 9

క. ధ్రువుఁడు తనకుం దనూభవుఁ
డవుట మహాధన్యుఁ డయ్యె నారాజున్ వై
ష్ణవ బంధుత్వంబు మహా
ధ్రువ పూర్వతపః ఫలంబు దొరకక యగునే. 10

సీ. ధర్మాత్ముఁడైన యుత్తానపాదున కతి
నీతి శీలునకు సునీతి యనఁగ
సురుచి యనంగఁ దేజోరాసులైన భా
ర్యలు గలరిరువు రుదారమతులు
వారిలో సురుచిపై వర్తిల్లు మోహంబు
రాజ చంద్రునకు సర్వజ్ఞ నిధికి
నప్రియమై యున్న యాసునీతికి ధ్రువుఁ
డను విష్ణుభక్తి నిష్ఠాధికుండు

ఆ.వె. గలిగె నాసురుచికి గారాపు బిడ్డఁడౌ
త్కృష్టుఁడు మోహరాశి కవితమూర్తి
తండ్రి తొడలమీఁద నాముద్దు గులుకంగ
ధ్రువుఁడు చేరవచ్చి వివశుఁడైన. 11

వ. ఉత్తానపాదుండు సురుచికి నోడి యుపేక్షించిన. 12

క. పతి చాగఁ దెలిసి సురుచియు
నతిగర్వ గ్రంథి యగుచు నాధ్రువుఁ గని నీ
చతనుస్న నీకుఁ దగునా
తతమగు సుచ్చైర్మనోరథంబో వత్సా! 13

క. నీ కిది ప్రియమై యుండిన
నా కడుపునఁ [1]బుట్టి యతిఘనంబగు తపమీ
లోకములు మెచ్చఁ జేసినఁ
జేకూరుంగాక చింత చేసిన గలదే. 14

మ. అతియోగ్యత్వము నీకుఁ గల్గినను నేఁడయ్యో సపత్ని తనూ
జత దూష్యత్వము నొందినాఁడ వతులైశ్వర్యంబుచే రాజు నీ
చతరుంగా నినుఁజూచె; విత్తు లధికశ్లాఘ్యంబులైనన్ నిరా
కృతముల్ గావె ఘనోషరస్థలుల నాకీర్ణంబుగాఁ జల్లినన్. 15

క. ఈ రాజాంకమునకు సుకు
మారుఁడు శూరుండు నా కుమారుఁడు దగు; వీఁ
డేరాజగు నీధరణీ
భారమునకు; నీకు నింకఁబాత్రత గలదే? 16

వ. అనిన రాజు నట్లనే సమ్మతించిన సామర్ష దుఃఖాశ్రుధారోరస్కుండై
మాతృగృహంబునకు నేఁగి తల్లి యడిగిన, సురుచి దుర్వచనంబులు
విన్నవించిన, వ్యథనొంది సునీతి మెల్లన నిట్లనియె. 17

ఆ.వె. అన్న! దుఃఖమేల యా సురుచి యథార్థ
మైన యట్లపల్కె; నల్పభాగ్య
నాముదారి గొల్వ నట్లొట కాత్మప
రాధమది సహింప నర్హ మనఘ! 18

1. బుట్టినఁ బుట్టి.

వ. కావున నాపదలు ప్రాపించిన ధైర్యంబు వదలక యనుభవింప వలయు; రాజు తండ్రి; సురుచి తల్లి; వీరిపై నలుగుదురే? సురుచి తపంబుచేసి పార్వతి రుద్రునకుం బలె మీ తండ్రికిం బ్రియకాంతయై నది. పెద్దల యెడ నైచ్యంబు చేసిన [2]నది నీకు ననాయుష్కరంబు. మత్తనూజుండవైన కతన రాజోత్సంగంబు గోరం దగునే? వారి కంటె నాధిక్యంబు గోరెదవేని హరిం బూజింపు; మతని యనుగ్రహంబున బ్రహ్మాదుల కైశ్వర్యంబు గలిగినయది; యన విని హర్షించి తల్లి కిట్లనియె. 19

సీ. అంబ! కృతార్థుండనైతి నే సకలకా
మప్రదుండైన యామధు విరోధి
గలిగె నాసకలలోకస్వామిఁ బాయక
కొలిచి సర్వామరస్థల పదోష
రి స్థానవీథి వర్తించెద; నమ్మహీ
నాయకాంక తలము నాకుఁ దగదు
మద్భ్రాతకే కాని; మౌనివర్తనమున
కబ్జజాదుల కలభ్యమగు నట్టి

తే.గీ. పదముఁ గోరెదఁ; జూడు మద్భాగ్యమహిమ;
నీ తనూజుండనైతి మహీతలమున
నాకలోకంబు నందును నన్ను నెంచ
నధివసించెద నుచ్చైః పదాంతరమున. 20

వ. అని పల్కి వెడలి పురోపవనంబున సప్తర్షులం గాంచి వారిం గాంచుటయే భగవదనుగ్రహంబుగాఁ దలఁచు కొని యా యవమానంబు వారికి విన్నవించి “హిరణ్య గర్భపురుష ప్రధానావ్యక్త రూపిణే, ఓం నమో భగవతే వాసుదేవాయ శుద్ధ జ్ఞాన స్వరూపిణే” యగు నీ మంత్రంబు వార లుపదేశించిన యమునాతీరమధు వనంబున జపించుచు నీశ్వరుండు సాక్షాత్కారంబున హృదయస్థుండై కానుపించ దేవత లనేక విఘ్నంబు లొనర్చినం దరించి బాహ్యంబున సకలాత్మ భూతుండై యట్లే దేశకాలాద్యుపాధి రహితుండై ఘనచిత్ప్రకాశుండై నిలిచిన యప్పరమపురుషునిం గని తర్ష వర్షవాత మహోష్మభవశరీర దుఃఖంబులు మఱచి ధ్యానంబుఁ గావించిన యప్పుడు గరుడవాహనారూఢుండై నిలిచి. 21

2. నవి నీకు నాయుష్కరంబు.

క. హరి మెఱసె రత్నమౌళ్యు
త్తరుఁడై నూతన [3]ఘనాంబుద స్ఫూర్తులతో
స్ఫురదుదయాచల [4]మత్సర
నిరతిన్ బాలర్కుతోడి నీలాద్రియనన్. 22

ఆ.వె. అతని యాననము సమంచిత కుండల
ద్వయ విభాసి యగుచుఁ దనరె నికట
విలసదుచితకాంతి వెలయు బాలారుణ
ద్వయ సుపార్శ్వ నవ్యవనజ మనఁగ. 23

క. తగఁ గౌస్తుభమణి బింబిత
మగు జగము వహించి నిలుచు నచ్యుత రూపం
బగణేయ విశ్వరూపా
ధిగతంబై నిలిచినట్లు తేజము నందెన్. 24

క. చిత్రతర రత్నభూషా
పాత్రములై శౌరిదివ్య బాహువులు నిజ
స్తోత్రహిత [5]ఫలదన వపు
ష్పాత్రత్వ సురద్రుశాఖలై దీపించెన్. 25

క. శ్రీ మంతములై తత్పద
తామరసము లమరె నఖరధామముతో ను
ద్దామజ్ఞాన సుకృత కీ
ర్త్యామోద శ్రీలు నతుల కర్పించుగతిన్. 26

వ. ఈ రీతి విజృంభించిన నయ్యీశ్వరుండు ధ్రువునిం గాంచి దంతాంశు సంజ్ఞామృత ప్రవాహంబుచే గాత్రరేణువుం దొలంగింపుచు వరంబుఁ గొనుము. మద్ధ్యానాం చితేంద్రియ నిగ్రహంబున; [6]దుష్కరమనో నిరోధంబునం జేసిన తపంబునకు మెచ్చితి. వాయు నిరోధంబుచేసి నా యందుఁజిత్తంబు నిలిపినవాని మదాజ్ఞచే సుదర్శనంబు రక్షించు. సాధుబుద్ధి యగు నీవంటి ప్రపన్నుండు మన్మాయ జయించి బ్రహ్మ పరాయణుం డయ్యెనేని వానికి వరంబు లిచ్చుబుద్ధి నన్నుఁ ద్వరసేయు చుండు నని యానతి యిచ్చిన నచింత్యమానంబై మూర్తంబై ముందర

3. ఘనాఘన. 4. వరమత్సరమున బాలార్క.
5. ఫలదసపుష్పాత్రత్వ. 6. దుష్కర్మ.

నున్న చతుర్భుజ బ్రహ్మంబుఁ గాంచి యేమి సేయుదు నెట్లువినుతింతు నెట్లు సేవింతు నని యూరకయుండి హర్షాశ్రుపూర్ణుండై 'స్వామీ! ప్రసన్నుండవు గ'మ్మని యతిప్రయాసంబునం బలుకుచుండి దండ ప్రమాణం బాచరించి వణంకుచుఁ బులకించి యున్న యతనిఁ గరంబుల నెత్తినఁ దత్స్పర్శ హర్షోపచయంబున స్తవశక్తి గొంత మెఱయ మూర్తి [7]మద్వాగ్ జ్ఞాన నిభంబైన శంఖంబున నమృతబిందువు దొలంక ముఖమార్జనంబు గావించిన మున్నే విమలంబైన చిత్తంబునఁ త్రిభువన గురు శంఖ చక్ర స్పర్శజన్యజ్ఞాన భానుండు స్ఫురింప నిట్లని వినుతించె. 27

సీ. జయ జయ లసమాన శంఖచక్రాసి శా
ర్ఙ్గ గదా [8]గ్రహణ భుజాగ్ర ప్రభావ
జయ జయ నిజదాన జనయోగ్య బహు కామ
భువనత్రయమయ సంపూర్ణ విభవ
జయ జయ సర్వాత్మ సంభూత భావజ్ఞ
సర్వ శరణ్య శాశ్వత వరేణ్య
జయ జయ దైత్యభంజన ఘన ప్రకృతి పూ
రుష కాల సంయుక్త రూప నాథ

తే. గీ. ఒక్కరుఁడ వీవె నిఖిలలోకోదయా వ
నాంతకారణమైన మహామహుండ
వొక్కరుఁడ వీవె సకలలో కోత్తరుఁడవు
కలిత శుభమూర్తి యెంచ నొక్కరుఁడ వీవె. 28

వ. ఇదిగాన నీ తత్త్వంబు నెవ్వ రెఱుంగుదురో స్వామీ! యవికృత నిజ రూపుండ వగుట నీకు వివిధ భావము మాయచే విరుద్ధంబు గాదు. దినకర కరజాల [9]మూషరస్థాన సంగంబున నవికృతమేనియు నిజరూప వికారంబు వహించునట్లు నీ రూపంబు వైకృతంబును గారణంబునన వినంబడియె. ఆ వైకృత రూపము జగత్తని వేదంబులు పలికె. కారణం బగు నవి బ్రహ్మమును, సత్తునని విన్నవించు; నట్టి దేవ వంద్యంబులైన యీ రెండు రూపంబులు భజించెద. విశ్వమూర్తీ! నిన్ను వేదంబులు దశశతముఖునింగా, సహస్రాక్షి పాదునింగాఁ బలికె. మఱియును సహస్రముఖపాదాక్షి బాహూరునింగాఁ బలికె.

7. మహాగజ్ఞాన. 8. గ్రణి. 9. మూషక.

వితతునింగా నణువుంగాను దీర్ఘునింగాను పలికె. బ్రహ్మభూతుండవై వితత విమలరూపుండవైన నీయందు నివిశ్రుతము వేఱైయున్న యదియుంబోలెఁ జూడంబడి స్వాశ్రయాభిన్నం బయ్యె. జల మయం బగు ఫేనంబు గాన్పించి లయకాలంబున వేఱుగాని యట్లు వివిధ రూపంబు లన్నియు నిన్నుం గలయు. లోకంబులలో నగణిత పృథు శక్తివై యుత్పథస్థుల నాశంబు నొందింపుచుఁ బ్రణత జనంబుల ననంత జ్ఞాన దానంబులం బోషింపుచు నిన్ను సేవింపని వారిని ధన తనయ వధూజనంబులచే మోహంబు నొందింపు చుండుదు. నీ స్వేచ్ఛనే త్రిజగ దుదయ నాశంబులగు సకల స్వజన కామోత్పా దంబును, ఖలజన వ్యాపాదనంబును జేయుట స్తుతియింప వలయు; ననికాశ యగణిత గుణ సిద్ధుండవైన నిన్ను నుతించనేర. వంద నంబు సేయనేర. కందనిభా ! శంఖంబు పూని యిందు నిభాననంబై సుందరావలోకనంబై సుచారంబై బృందారక జనవందితంబై సురూపంబైన నీరూపంబు సేవించెద. ఉత్తమ స్థానంబుఁ గోరి తపంబు సేయుచు సాధుమునీంద్రగోప్యుండవైన నిన్నుఁ గంటి కాచంబు వెదకుచు దివ్యరత్నంబు కాంచిన యట్లు కృతార్థుండనైతి. అపూర్వ దృష్టంబులైన నీ పాదపద్మంబులు గంటి విడువం జాలఁ గామంబులొల్లఁ గల్ప వృక్షంబుఁ జేరి [10]తుషామాత్రంబు వేఁడం దగునా? మోక్షబీజంబవగు నిన్ను శరణంబు నొంది, బహిస్సుఖంబులను భవించునా రత్నఖని తనకు సిద్ధించినఁ గాచమయ భూషణంబు యుక్తం బగునా ? యుష్మత్పాదాబ్జ భక్తి యెల్లప్పుడు నాకు లభింప వరంబి మ్మివరంబే మఱియు మఱియు వేఁడెద నని యాత్మసందర్శన లబ్ధదివ్యజ్ఞానంబునం బలుకు నతనిం గాంచి భగవంతుం డిట్లనియె. 29

సీ. విను రహస్యము వత్స ! విష్ణు నారాధింప
ఫల మీతనికి నేమి గలిగె నంచు
జను లాడు కొనుదు రసాధు వాదంబు లి
ట్లైది లభింపక యుండ; నిష్టమైన
యుత్తమ స్థానమే నొకటి నీకిచ్చెద నీకుఁ
గల్పాంతమున మన్నికాయ సీమ
యందెద వఖిలగ్రహాధార భూతుండు
వైకల్పకాల ధ్రువాధి లక్ష్మిఁ

10. తృషా.

తే. గీ. గాంచి సర్వైక వంద్య భాగ్యము వహించి
మత్ప్రసాదంబు వలన ధర్మగుణ శీల
యైన మీ తల్లి వరనీతి యాసునీతి
గారవింపంగ నిఖిల విఖ్యాతి నుండు. 30

మ. అని లాలించి నిజాలయంబునకు నత్యంత ప్రసన్నైక హృ
ద్యనిరీక్షన్ నిజదాసుఁ దామరలి యత్యాసక్తి నీక్షింపుచున్
జనమింటన్ సురసిద్ధ సాధ్యవరులంచత్కల్ప భూజాత నూ
తన సూనంబులు భోరునం గురిసి రుద్యద్భక్తిమై నంతటన్. 31

క. పరమ పద మందె నీగతిఁ
బరమానందమున ధ్రువుఁడు; పరమాత్మ కృపా
పరుఁడై ప్రసన్నుఁడైనన్
గరము నసాశాన్యవస్తు గణములు లేవే! 32

## ప్రహ్లాదుఁడు తండ్రికి భగవత్ప్రభావం బెఱింగించుట

ఆ.వె. హరి ప్రసన్నమూర్తి యగుట ననేక వి
ఘ్నములు గలవు భజనకాలముననె
యలసతయును నిద్ర యతిభయంబులును గా
మాతురతయు మదము నాదిగాఁగ. 33

క. తరియింపరావు విఘ్నం
తరములు హరిభజనవేళ; దర్వీకర శే
ఖరమస్తక రత్నమువలె
దొరకునె సుకృతులకుఁ గాక దుర్లభము లిలన్. 34

క. అరయఁగఁ గ్రోధాదులు శ్రీ
హరి కల్పమహీరుహమున కావరణంబుల్
దొరకంగ నీవు వానిన్
నిరసించిన యట్టి భాగ్యనిధికిం దక్కన్. 35

క. అరిషడ్వర్గ మహాఫణి
పరిగుప్త దురాప చక్రపాణి నిధానం
బిరు విద్యనొందు వారిన్
నిరతము సేవింతు నిత్యనిర్మలు రగుటన్. 36

తే.గీ. హరి భజించుట దుష్కరంబని యుపేక్ష
సేయువాఁడతి నీచుండు శ్రీవిభుండె
యంతరాయంబు లణఁగించు నమ్మహాత్ము
శరణమని కొల్వఁ బ్రాపించుఁ బరమ పదము. 37

క. శ్రద్ధాతిశుద్ధభావ ని
బద్ధాచ్యుత భజన శుద్ధి బ్రాపించి యఘా
నద్ధాంతరాయములు చను;
నిద్ధ మహాదీపశిఖల నేగవె తమముల్? 38

వ. అని మఱియు నిట్లనియె. 39

ఉ. నాలుక గల్గియుం దురితనాశనకారణ విష్ణు కీర్తన
శ్రీలు వహింపఁ డెవ్వఁడ సుశీలుఁడు వాఁడు; విముక్తసౌధరా
ప్కేలికి నెక్క నిచ్చెన యకించి దుదారతఁ గల్గ నెక్కఁడే
బాలిశుఁ డట్టి మూఢుని నపాయరతుం దలఁచంగఁ బాపముల్. 40

తే.గీ. కాన గోవింద మాహాత్మ్య కథల యందు
నిరుపమానంద మొంది వర్ణించి సన్ను
తించి నర్తించినట్టి యా నియమపరుఁడు
పరమ భక్తుండు ఘనుఁడు సద్భాగవతుఁడు. 41

క. జలజాక్ష భక్తులం గని
పులకాంకురములు వహించు పురుషున కవియే
వెలలేని వజ్రకవచము
నలుగడ దురితాస్త్రచయము నాటునె వానిన్. 42

క. హరి దివ్య కథాశ్రవణాం
తరమున నానంద బాష్పధారలు వడి యాం
తర తాపత్రయ దహన
స్ఫురణంబులు మాన్పు నెట్టి పురుషులకైనన్. 43

వ. అని యప్పుడు ప్రహ్లాదుండు భక్త్యాహ్లాదంబునం బలికిన భగవత్ప్ర
భావంబు విని హిరణ్యకశిపునకు భగవదిచ్ఛవలన రజస్తమోద్రే
కంబున గర్వోత్సేకంబు వొడమ నంత. 44

మ. అతిరోషోద్భటుఁ డా హిరణ్యకశిపుం డాటోపతేజోమహో
ద్ధతి హుంకారము సేయునంతనె భయోద్భ్రాంతిన్ వణంకెన్ శచీ
పతి; భూభృద్గహనాంతరాళపతి విభ్రంశంబు దాల్పించె దే
వతలెల్లం జలియించి మ్రొక్కిరి భయవ్యాలోల చిత్తంబులన్. 45

క. మునివరులు ధ్యానయజ్ఞ జ
ప నియమ సముపాసనములు పాటింపక యా
తని మనసు పట్టి మధుసూ
దను వైభవ మాత్మయందె తలఁచిరి భీతిన్. 46

క. అతి దుఃఖశీలుఁ డని విని
యతనిని నిందించరైరి యాత్మజ్ఞులు శ్రీ
పతి కర నఖరచయముచే
దితి నుండెడువాఁడు గాన దితిజుండైనన్. 47

వ. ఇట్లు హిరణ్యకశిపుం డంతరంగంబునం గ్రోధ వార్ధి తరంగంబులు వెల్లివిరియ నిజకుల శత్రుండైన పుత్రునిం గాంచి చేరంబిలిచి. 48

క. ఉరమునఁ జేర్చి కుమారక !
పరమరహస్యంబుఁ దెలిసి పలికితి భళిరా !
తిరుగం బలుకుర మాధవ
హరి కృష్ణ ముకుంద శౌరి యచ్యుత యనుచున్. 49

వ. ఇటువంటి హాస్యదురుక్తులు పలికినవారిని శిక్షించి రాజ్యంబు వెడలం ద్రోయించితి; నీ వెచ్చట వింటి వనిన నిర్భీతుండై తండ్రితో నిట్లనియె. 50

మ. ఇటులం బల్కకు మెన్నఁడేని నసురాధీశా ! ఘనైశ్వర్య సం
ఘటనామూలము దుర్భవాగ్ని శమనాకాలాభ్రమౌ నచ్యుతో
త్కట మంత్రం బతిహాస్యమన్న భయశోకగ్రస్తుఁడై దేవతా
తటినిన్ స్నాన మొనర్చినం గలుగునే తండ్రీ ! పవిత్రత్వముల్. 51

వ. కావున హాస్యం బనినఁ బాపంబు దీర నేనుమారులు కృష్ణా యని స్మరింపుము. మాయ సృజించిన జనులను దారుప్రతిమలంబోలెం

ద్రిప్పుచు నున్నవాఁడు. తదీశ్వరశక్తిం బాసి నిమేషోన్మేషంబుల యందేని సమర్థుండు గాఁడు. నీ వసాధువచనంబులు వినక సర్వేశ్వరుని వేఁడుకొనుము. పూర్వపాపంబు లేనియుం దొలంగు. ఈ యైహికంబు సుఖంబుగాఁ గోరుచున్నవాఁడవు. తద్దుఃఖం బెఱింగించెద. 52

## ప్రహ్లాదుఁడు తండ్రికి భవదుఃఖ స్వరూపం బెఱింగించుట

సీ. కేవల బహుమలా కీర్ణమౌ జనని గ
ర్భంబున సౌకుమార్యము వహించి
యుల్బంబులో స్రుక్కియుండి సంభుగ్న క
రాస్థి పృష్ఠాధికుం డగుచు మర్త్యుఁ
డత్యామ్ల కటు [11]సుతీక్ష్ణాక్షారత్యుష్ణ లవణంబు
లగు తల్లి భుజియించు నట్టి [12]భోజ
నముల వేదనలంది నలఁగి నిజాంగ ప్ర
సారణాకుంచన శక్తి లేక

తే. గీ. యనిశ మలమూత్రపంక లిప్తాంగుఁ డగుచు
జన్మశతముల చైతన్య సరణిఁదలఁచి
పరితపించుచు నిజకర్మబంధనమున
గర్భ దుఃఖంబు గాంచు నగ్రంబు నందు. 53

వ. ప్రాజాపత్యవాతపీడ్యమానాస్థిబంధనుండై ప్రబల సూతిమారుతంబులచే నధోముఖుండై క్లేశంబున మాతృజఠరంబు వెడలి మహామూర్ఛనొంది బాహ్యవాయు సంస్పర్శంబున విజ్ఞాన భ్రంశంబు నొంది శరీరంబు కంటకంబులం బొడిచిన యట్లు, క్రకచంబులం జీరిన యట్లు వేదన లంది పూతి వ్రణంబులతోఁ గ్రిమియుం బోలె ధరణిం బడి కండూయన పరివర్తనంబుల యందు ననమర్థుండై స్నానపానాదికంబుల యందేని పరేచ్ఛంగాని తాఁ జేయ నశక్తుండై కీట దంశాది బాధల నొందియు వారించుకొన దక్షుండుగాక పొత్తుల పయిం బవళించి దుఃఖంబు లనుభవించు బాల్యంబున మూఢాంతఃకరణుండై యజ్ఞాన తమశ్ఛన్నుండై యే నెవ్వండ? నెచ్చటికి నేఁగుచున్న

---

11. సుతీక్ష్ణ లవణంబులగు. 12. వస్తుభోజ.

వాఁడ ? నే రూపంబువాఁడ ? నేబంధంబున బద్ధుండ నైనవాఁడ ? కారణం బెయ్యది ? కార్యం బెయ్యది ? యకార్యం బెయ్యది ? వాచ్యం బెయ్యది ? యవాచ్యం బెయ్యది ? ధర్మం బెయ్యది ? యధర్మం బెయ్యది ? కర్తవ్య మెయ్యది ? యకర్తవ్య మెయ్యది? గుణదోషంబులు గలయది యెయ్యది ? యని తెలియక శిశ్నోదర పరాయణుండై కార్పాసబీజంబు తంతు కారణ పక్షౌఘంబులచేతం బోలె నానా దుఃఖంబులచేతం బరిప్లుతుండై యుండు. యౌవనంబున నర్థార్జన దుఃఖంబుల నర్థావన దుఃఖముల నృపాలాదులచేత నర్థ వ్యయ దుఃఖంబులం బొరలుచు వ్యర్థోద్యోగంబు నంది యణంగుచు నుండును. 54

క. పుత్ర కళత్ర క్షేత్ర సు
మిత్ర ధనాద్యములచేత మెలఁగిన సుఖముల్
చిత్రముగ నున్న కైవడిఁ
జాత్రములే ధర్మ సౌఖ్య భాగ్యక్రమముల్. 55

సీ. ఈ భవంబుల యందునెన్నెన్ని యోనుల
జనియించు విగత విజ్ఞానుఁ డగుచు
నలరి తత్తద్యోనులందు వైరాగ్యంబు
నందండు సుఖముగా ననుభవించు
నరకంబులోపల నలఁగి దేహముమీఁది
యాస మానఁడు నిరాయాస బుద్ధి
నాత్మ జాయాతన యాగారపశు ధన
ద్రవిణ బాంధవమైత్రిఁ దగిలి యాత్మ

తే. గీ. యందుఁ దను మెచ్చుకొనుచు నత్యంతదురిత
కోటు లొనరించుకొనుచు దుష్కృతి తాత్ముఁ
డగుచు సంసారచక్రంబునందుఁ దిరుగు
మానవుఁ డగమ్యతర దేవమాయ కతన. 56

తే. గీ. ఆత్మలో దారపుత్రధనాది మోహ
ములు మహాదుఃఖతర బీజములు చెలంగి
తనువు భేదించి వెడలి చేతనుని ప్రాయ
మునఁ దపింపఁగఁ జేయు నమోఘశక్తి. 57

తే.గీ. స్థిర మహాదుఃఖవాహిని సింధువయ్యె
ముదిమి యెన్నియవస్థలఁ బొదలు మృత్యు
భీతి సన్నిహితంబుగఁ బెక్కులేల
వార్ధకము వంటి దుఃఖ మివ్వసుధ గలదె? 58

వ. మఱియు వహ్న్యంబు వాతాసి మృగాహి పక్షి పశ్వాదులచేత జననకు మృతిభయంబు ప్రాపించు నింక నిన్ని యననేల? నెయ్యదియు జనులకు నాశకరంబె. నాశహేతువులు కాని దేశకాలంబులును లేవిట్లు భవంబున విమర్శింపుచు సుఖం బెఱుంగమి నెట్లు వితర్కించిన దుఃఖకరంబులే యగును. 59

సీ. ఆధ్యాత్మికంబును నాధిభౌతికము నా
నాధిదైవికమన నమరియుండుఁ
దాపత్రయంబందుఁ దనరు నాధ్యాత్మిక
మగు నది శారీరక మనఁగ మాన
సంబన రెండయి జరగుఁ బీనస శిరో
రోగ భగంధరాశోజ్వరోగ్ర
గుల్మ శూల శ్వాస కుష్ఠాతిసారాది
కంబయి శారీరకంబు వెలయు!

తే.గీ. మానసిక మెంచి చూడఁ గామ మద లోభ
మాన విద్వేష భయరోష మత్సరావ
మాన శోక దురీర్ష్యా మమత్వ మూర్ఖ
తా దురాచరణంబు లిద్ధరణిలోన. 60

క. మృగ ఖగ మనుజ పిశాచో
రగ రాక్షస ముఖ్య పీడ ప్రాపించినచో
నగు నాధిభౌతికంబన
నగణేయంబైన తాప మతి చిత్రముగన్. 61

క. శీతోష్ణ వర్ష విద్యు
ద్వాతాంబు ముఖ ప్రభూత బహుతాపము వి
ఖ్యాతముగ నాధిదైవిక
మై తగు శాస్త్రక్రమమున నారసి చూడన్. 62

సీ. స్థావర క్రిమి జలచర పక్షి పశు నర
దేవ ధర్మాత్మ ముక్తి పరజాతి
క్రమమున నెంచఁగఁ బ్రథమంబు లవి ద్వితీ
యంబుల కన్న సహస్ర భాగ
సమధికంబులును సూక్ష్మంబులు సూక్ష్మసూ
క్ష్మంబులు సూక్ష్మతరంబు లట్ల
సుస్థూలములు స్థూలసుస్థూలములునునై
స్థూల తరంబులు లీల మెఱయు

తే.గీ. కర్మబంధ నిబంధ నోత్కటములైన
ప్రాణు లుండని చోటు [13]విశ్వంబునందుఁ
గలదె యంగుళి కాష్టమ కళయునైన
నిర్ణయించిన నీధరణీతలమున. 63

వ. దేహాంతరంబునఁ గొన్ని యాతనల నొంది దేవ నర పశు పక్షి తిర్య
క్స్థావరత్వంబులు గాంతురు. వాచిక కర్మదోషంబునఁ బశుత్వ మృగ
త్వంబులును, మానసిక కర్మదోషంబున నంత్యజత్వంబును, శారీర
కర్మదోషంబున స్థావరత్వంబు నొందుదురు మఱియు. 64

సీ. అతిభయంకరులైన యమకింకరులు క్రోధ
తామ్రాక్షులై వేగఁ దారసిల్లఁ
గని వివశత నొందఁగా వారు యాతనాం
గంబులో నిల్పి దుష్కర్మ గళము
కఠిన పాశంబులఁ గట్టి యీడిచి తెచ్చి
రాజభటులు సాపరాధులఁబలెఁ
దూలించి సంతప్త తాలుకాన్విత కాప
థంబున నడిపింపఁ దాప మంది

తే.గీ. యపుడు క్షుత్తృష్ణ లుదయించ నతికశాప్ర
హారములు వీఁపుపై నాడ నత్యశక్తి
నిర్జర స్థలముల వెంట నిలువనీక
తరుముకొని పోవ మూర్ఛిల్లి తేరితేరి. 65

13. లోకంబు నందు.

తే. గీ. ఒనర నవతి నవసహస్ర యోజ నాధ్వ
ముద్ధతంబుగ మూఁడు ముహూర్తములను
శమన భటు లిరువురు మహాసాహసికులు
యమ నివాసంబుఁ జేర్తురు యాతనలకు. 66

సీ. నిబిడోల్ముకచ్చట నిజమాంసచయముఁ గా
వించి యుగ్రతఁ దినిపించి రొక్క
యెడ నొక్కరునిచేతఁ దొడిమడ నొనఁగించి
రుగ్ర మహోర్భటి నుగ్రలోహ
ముఖ గృధ్రములచేత ముహురాంత్ర కృంతనం
బొనరించి, రధిక మహోగ్ర సర్ప
వృశ్చిక దంశాది వివిధ దంశనముల
వేదన లందించి, ద్వీప మహీధ

తే. గీ. రాగ్ర పాదంబుగాఁద్రోఁచిరంబు గర్త
రుద్ధులం జేసి యాయుధ విరుద్ధులైన
విడువ కంతంత బాధించి వేగఁ గనలి
శమన దూతలు దుర్వారశక్తి మెఱసి. 67

వ. తమిస్రాంధతా మిస్ర రౌరవాదులైన యాతనల నరులనేని, నారుల నేని యన్యోన్యసంగ దోషంబునం బొందింతురటుగాన సర్వ జగత్పూర్ణుండైన భగవంతుని భజించిన సకల దోషంబులు నణంగు మఱియు, 68

క. పలుకుట కుడుచుట కట్టుట
నిలుచుట తిరుగుట సుఖించి నిద్రించుట, లో
కులకు హరిప్రేరణమునఁ
గలిగినయవికాని వేఱె కలుగవు తండ్రీ! 69

వ. కావునఁ దామసబుద్ధి విడిచి పూర్వంబునం జేసిన హరి పూజనంబుల లభించిన మహైశ్వర్యం బనుభవింపు చున్నప్పుడుం బూజింపుము. కృతఘ్నుండవు గాకుము. సర్వేశ్వర కల్పితస్వభావంబు విడువ శక్తుండు లేఁడు గానఁ దండ్రియేని గురుండేని యహిదంష్ట్రాగ్రంబు పయి వ్రేలు చాపిన వారింప వలయునని న్యాయంబునం బలికితి, నీ యపరాధంబు క్షమింపు మని పాదంబులం బడినఁ దద్దైత్యపతి యిట్లనియె. 70

## హిరణ్యకశిపుఁడు హరిభక్తి వీడుమని ప్రహ్లాదుని మందలించుట

సీ. తగునె నీకు నశక్తిధరణీసురోచిత
కర్మంబు సేయ మద్గర్భమున జ
నించియు ధూర్తులౌ నీరజేక్షణ పక్ష
జనులు వచించు నిస్సార బుద్ధిఁ
బలికితి వీరీతి బ్రాహ్మణ దుర్గోష్ఠి
వలకద శోభన కళకు మూల
మస్మత్కులోచితమైన తేజము నీకు
నెవఁడు తప్పించె నిద్ధశక్తి

తే. గీ. మణి జపాసూన సంగతి మాడ్కి సంగ
దోషమున సంభవించు తద్గుణము నిజ కు
లాభి వృద్ధికిఁ దనవారి నాచరించి
తిరుగుటయ నీతి యిఁకనేని తెలియఁ జూడు. 71

క. హరి పక్ష క్షపణాధిక
తరతేజము మత్కులోచితం బగు బిరుదా
హరిఁ జేరి కొల్చితివి యా
పురుషాధము నట్లు లజ్జఁ బొందక వత్సా! 72

చ. సకల జగత్ప్రభుండ నగు సాహసశాలికి నాకుఁ బట్టివై
యకట! భజింప నేమిటికి నన్యుని? నెక్కిన వానికిన్ మదో
చ్చకరివరంబు కొంచెమగు సామెత గాఁగఁ బరోక్తి నిష్ఠన
ర్భకుఁడవు గాన మన్మహిమ పౌరుషమింతయుఁ గాన వేమనన్. 73

ఉ. నాకు ప్రభుండు లేఁ డఖిలనాథుఁడ నేనె; ప్రతాపశాలినై
యేకరథంబుగా జగములేలు నితండె ప్రభుండు, దేవుఁడున్
లోకగురుండు నిస్సమబలుండు; గుణాఢ్యుఁడ; నేనె యిన్నిటన్
శ్రీకరమూర్తినై వెలసి చిత్రవిచిత్రత నుంటి వేడుకన్. 74

వ. దేవతలలో విష్ణుదేవుం డనంగ దేవోత్తముం డొకండు గలండు. శంబ
రుండువలె మాయగలవాఁ డతనిఁ బెక్కుమారులు జయించితి,

నాకంటె నాతఁ డధికుండని నీకే ద్విజులు బోధించిరి ? వారిం బోద్రోఁచి తెమ్ము, భాషించెద; విష్ణుం డెట్లు యట్లనే సర్వోత్కృష్టుండ, నతని విడిచి నిజకులోచిత శౌర్యంబు వహించి, యోరి ! సింహకిశోరంబ ! దేవ మృగవ్రజంబులతో నుండ నర్హంబె నీకు ? నీ పౌరుషంబు చూపు మనిన నంజలిచేసి ప్రహ్లాదుండు తండ్రి కిట్లనియె. 75

సీ. దైత్యేంద్ర ! యిన్నియుఁ దగుఁ ద్రిజగజ్జయ
సంపద నీకు; నోస్వామి ! నేఁడు
ప్రాకృతుండవు నీవు పరమాత్మయైన యా
హరి నిజాంశంబున నవతరించి
యిట్లు యుండక యున్న నీ శౌర్యమీ శక్తి
యీ మహైశ్వర్యంబు నేలకలుగు !
నిది వితర్కింపక యేల పల్కితివి బ్రా
హ్మణ గోష్ఠి విడుమని యన్నృత భాష ?

తే. గీ. యంధతమసబిలము చొచ్చునపుడు దీప
మెట్లు దిగనాడ వచ్చు ? సమిద్ధమత్స
రాన్విత ద్వేషమున నిట్టులాడఁ దగునె
యకట నీకిది ధర్మమే యసురనాథ ! 76

వ. సన్మార్గ దర్శనంబునకుం దనకన్నులు దానె చెఱచుకొనిన వాఁ డమృతాస్వాదఫలం బగు సాధుసంగంబు విడిచిన వాఁడు; భవోద్దీపనానలంబైన ఖలసంగంబు నొందవచ్చునే ? విష్ణుండు సర్వమయుం డగు నందునేనియు ద్విజులు ప్రధానతనువులు; వారి విడిచి వృథా జన్మంబు గావించుకొనం దగునే ? గోబ్రాహ్మణులు పరదేవతలు; హవిర్మంత్రస్వరూపు లొకచో మంత్రంబు లుండు. ఒకచో హవిష్యంబు లుండు. విష్ణు శక్తి బ్రాహ్మణాధారంబు. సమస్త జగదాశ్రయం బైనయది. విప్రుల నాశ్రయించి దేవయోనులు బ్రతుకుదురు. దేవతల కేని పరదేవతలైన బ్రాహ్మణులకు నెవ్వఁడు వందనంబు సేయండు ? బ్రాహ్మణులు జగద్రథంబు నడుప నక్షంబు లైనవారు. మ్రొక్కినఁ బూజించినఁ దలంచిన రక్షింపుదురు. నరులకు గోబ్రాహ్మణుల కంటె దృష్టాదృష్టహితంబు లేదు. దర్శన స్పర్శన కీర్తనంబులచే గోబ్రాహ్మణులు పాపంబులు హరింపుదురు. నిత్యోపపాపాగ్ని నవశులైన జనుల నీలోకంబులు మ్రింగవే గోబ్రాహ్మణులు వారింపక యున్న భవవ్యాధిక్లిష్టులైన వారికి దివ్య జ్ఞానౌషధం

బొసంగి రక్షించు. దైత్యులకు గోబ్రాహ్మణులు విష్ణు పరమపద నిధానంబుఁ దెలుపు సిద్ధాంజనంబు మూర్తులు; గోబ్రాహ్మణుల నిర్లెఱుంగని వాఁడు నిర్విషాణ పశువనిన విని హిరణ్యకశిపుం డాగ్రహించి వెడనవ్వు నవ్వి యిట్లనియె. 77

మ. అవురా ! యెంత మహాద్భుతం బిది ! ఘనుం డస్మత్కులాంభోధి సం
భవుఁ డీ బాలుఁడు తా బిడాల మెలుకన్ బ్రార్థించినట్లన్, భుజం
గవితానంబు మయూరముం బొగడురేఖన్, శ్రీ మనోనాథు ను
త్సవ లీలన్ వినుతించ నిట్టిదియె మందత్వంబు దుర్బుద్ధియున్. 78

క. మత్సుతుఁ డవయ్యు నీవు ని
రుత్సవమతి నజ్ఞునట్ల యుండి, విహీనా
స్మత్సేవకుల నుతించెదు
మత్సాహస ధైర్య శౌర్య మహిమలు వినవే ? 79

క. వాయసము చూతవనమునఁ
బాయక వర్తించి నింబ ఫలకాంక్షకునై
యా యడవిఁ దిరిగి నట్లున్
బాయునె హరి నెఱుఁగుదువె దురాత్మక ! యనుచున్. 80

సీ. మనకు నీ హరి నుతి వినుట యుక్తమె ? యెందు
నున్నవాఁ డాహరి ? యోరి ! తంతు
జాలంబు లేకయ, చేలంబు నేసిన
గతి, నభిత్తిని చిత్రకర్మ కలన
గావించి నట్టులు, గగన పుష్పము సౌర
భాఘ్రాణ మొనరించు నట్టుల, నిర్వి
షయుఁడైన శ్రీహరి సన్నుతించెదవు శి
శుత్వంబు నొంది యశుద్ధ బుద్ధి;
తే. గీ. సూక్ష్మదృష్టుల మా హరిఁ జూడ; మల్పుఁ
డెవ్వరుఁ డెఱుంగు మాకంటె ? నీదురుక్తి
విడువు మని నిందసేయు నా విభుని గాంచి
జ్ఞాన పాథోధియైన యాసూనుఁ డపుడు. 81

ఆ.వె. కనలి చెవులు మూసుకొని, తను మాత్ర బా
లకుఁడు; వాఁడు, చాపలమున భిన్నుఁ
డగుచుఁ, బరమగుప నిరంతరాహితుఁడైన
గురుఁ డవార్యుఁ డనుచుఁ గొంత నిలిచి. 82

వ. సత్యంబు నీవెఱుంగక యుండుట మునీంద్రుల కేని యెఱుంగం బడదు. జడస్వభావుం డజడస్వభావుని నెఱుంగునె? అతం డకల్పనుండు. నీవు బహు కల్పనుండ వతండు నిగూఢ తత్త్వము. నీవు ప్రకటార్థ దర్శివి. ఏ దేవులకు జ్ఞానంబుచేతఁ బరా యణుండైన విధాత కేవల చక్షురాదికము గావించె నాదేహులు కారుణ్య మాత్రంబై యతీంద్రియుండైన యతని నెట్లు నెఱుంగుదురు? మనం బతని నెట్లెఱుంగు? మాత్సర్యదంభస్మర పంకలిప్తంబైన యదిగాన నేనును లెస్సగా నెఱుంగ. సుఖాత్మయై సర్వమయుండైన యతని నెఱింగిరేనియు భేద ప్రావీణ్యము లేదు. నిశ్చయ మితండె విభుం డనవలయు. మాలిన్యంబు వహించిన మది శుద్ధ జ్ఞానం బెఱుంగనేరదు గాన వైరాగ్యంబను జలంబుచేత మాలిన్యంబు గడిగి కొని కొందఱెఱుంగుదురు. ఈశ్వరుం డస్మదాదుల కెట్లు గోచరుం డయ్యెడు. మాత్సర్య లోభ స్మరదోష శిష్యులమైన యేము విష్ణుని నెఱింగితి మేని నష్టాంగయోగ తంత్రంబులచేతఁ బర్ణభుజులైన మునులకు వృథాయాసంబుగాదా మేమన్ననో తాదృగ్గతి కాంక్షులమై యతి మాయా వృథాహతాశులమై యా యజు నెఱుంగ మొకా నొకప్పుడు కించిత్తు నెఱింగితిమేని యప్పుడే మాయ గప్పుచున్న యది. అది యెట్లంటేని విష్ణు దర్శనంబునకు మఱియుం గారణంబు వినుము. 83

తే.గీ. జ్ఞానమున కావరణము మత్సర పటంబు
తన్మహామత్సరంబు నేత్రములఁ గప్పు
కొనిన కతమున విష్ణువు గనక యునికి
నీకు సహజంబు గాదె యోనిర్జరారి! 84

వ. కన్నులు గప్పుకొనిన వాఁడేమి గనియెడి. భక్తి పూతుండవై చూచితివేని భగవంతుని సిద్ధాంజనాసక్త నయనుండై సిద్ధుండు దివ్యౌషధంబుఁగన్నట్లు గనియెదవు. స్వమాయచే సమస్త లోకములును

వశము చేసుకొనినయేని యీశ్వరుండు కేవల భక్తిచేతనే వశ్యం
డగును. 85

తే. గీ. అఖిల సుఖభాజనంబగు నా పరాత్మ
నొల్లక సమస్త దుఃఖాబ్ధి నొంది మునిగి
జనుఁడు మూఢాత్ముఁ డగుచు శోచ్యత వహించు
నేమి చెప్పుదు దైత్యకులేశ ! యింక. 86

మ. అటులం బుత్రుఁడు వల్కఁ దండ్రి పటుగర్వాభీలుఁడై భ్రూకుటీ
కుటిలాటోప పరిస్ఫుటోత్కట కటుక్రోధోద్భటాస్యంబుతోఁ
జటులోద్భర్జన వర్జమాఘునునిపై సంధించె నాత్మార్థ నా
నటదుద్భూత నృసింహ భావిభవ సన్నాహంబు సూచింపుచున్. 87

వ. ఆ మూఢుండు గోవింద శరణ్యుండైన సుతుని భటులచే నిజాయుశ్శే
షంబునుంబోలెఁ ద్రోయించి, తద్గురుని వక్రంబుగాఁ జూచి పొమ్మ
పొమ్మ లెస్స లెస్స; ఈ శిశువు నిట్లనే చేసితి వనిన మహాప్రసాదం
బని నిజ గేహంబునకుం జని విష్ణుని విడిచి దైత్యు ననుచరించు
కొని యుండె; నంత నద్దైత్యుం డా బాలకుని గురుని యింటనుంచి
యప్పగించిన గురుభక్తి భూషణుండై వాఁ డశేష విద్యా విశేషంబుతోఁ
గౌమారంబుఁ గాంచె; నాస్తిక్యం బసాధురతియుఁ గౌమారంబున
లోకులకుం గలుగు. ఆ కౌమారంబున బహిర్విరక్తియు నంతరం
గంబున హరి భక్తియుం గలిగి సకలకళల నితఁడు పూర్ణుండు గాక
మున్నె ప్రకాశితానంద పదంబైన జ్ఞానచంద్రుండు సమస్త కళలుం
బోషించె. జ్ఞానచంద్రునకు క్షయంబును, రాహు ముఖలయంబును
దోషాన్వితత్త్వంబునుం బ్రాపింపక యెల్లప్పుడు నుదయించి కళంకము
లేక హృత సర్వతాపశక్తియై ప్రకాశింప దైతేంద్రభయంబున గురుండు
బోధింపకమున్న బ్రహ్మంబు సాక్షాత్కారం బయ్యె. సహస్రమార్గం
బుల వెలుంగు హరిప్రసాద దీపంబున సకలంబునుంగాంచె. గురూప
దేశంబు మహామతికేటికి ? మూఢమతికింగాక; నిరామయునకు
నౌషధంబేటికి నుత్కట రోగ భావికింగాక యని విమర్శించి 88

క. సంపూర్ణ కళాలక్ష్మీ
సంపన్నుండైన సుతు నిశాచరపతి వీ
క్షింపుచు నానందము నను
కంపయు నుప్పొంగఁ బలికెఁ గడుమన్ననతోన్. 89

తే.గీ. బాల్యమున నీవు బ్రాహ్మణప్రవరు లాడు
నిష్ఠురోక్తి పరంపర నీఱుగప్పు
నిప్పువలె నుండి ప్రభలేక, నేఁడు వత్స !
జాడ్యమంతయుఁ దేరి తేజమున నుంటె. 90

సీ. అజ్ఞాననిధియైన యట్టి బాల్యము వోవ
నీహారముక్తుఁడౌ నీరజాప్తు
పగిది నుండిన నిన్ను బ్రాహ్మణు లేరీతిఁ
జేరి బోధింతు రశీల పథముఁ
బ్రాయంబునందుఁ దద్బ్రాహ్మణులే నిన్ను
నిట్లు శిక్షించిరి హిత మెఱింగి;
రాజ్యభార దురంధరత నీవు గైకొన్న
సుఖమున నుండెద శుభము లొంది;

తే. గీ. యఖిల దుష్కంటక నివృత్తి నవనినేలు
నీ మహైశ్వర్య మీక్షింప నెమ్మిపుట్టె;
గురుఁడు నినుమెచ్చె విద్యాధికుండ వనుచు
వీనులకు నది విన నేఁడు వేడ్కయయ్యె. 91

తే.గీ. శత్రు దారిద్ర్య మెల్ల లోచనములకును,
సుతుని సూక్తులు చెవులకు, వితత యుద్ధ
రంగ రంగద్వ్రణంబు గాత్రంబునకు, స
ముద్యదభిమానులకును మహోత్సవములు. 92

వ. అని యిట్లు. 93

క. నికృతప్రజ్ఞా సంపద
వికటంబుగఁ దండ్రి వలుక విని నిశ్శంకా
త్మకుఁడై ప్రహ్లాదుఁడు యో
గికులాగ్రణి యుత్సవంబు గీల్కొనఁ బల్కెన్. 94

క. శ్రోత్రములకు విష్ణుకథా
పాత్రప్రథితోక్తులే యపారోత్సవముల్
చిత్రముగ నెట్లు పల్కిన
శ్రోత్రార్థమె యన్యమది సుదృష్టం బగుటన్. 95

తే.గీ. నీతిసూక్తియు శ్రావ్యంబు; నియతకావ్య
కథలవియుశ్రావ్యములు, మహాకఠిన ఘోర
ఘన భవోత్కట దుష్టాఘ కక్షవహ్ని
హరి నిరూపింతు రనిన సభాంతరమున. 96

తే.గీ. భవ్యమగు బద్ధమేని నబద్ధమేని
హరి నిరూపించునట్టి వాక్యంబు సాధు
జనులు పాటింతు; రది యతిశ్లాఘ్యమగుచు
నాగమోక్తుల కంటె విఖ్యాత మగును. 97

క. అనిశము నిజ సంస్కృతి వ
ర్ధనమగు నయ్యర్థశాస్త్ర తత్త్వం బేలా?
తన తనువు నాటుకొను శ
స్త్రనికాయాభ్యాన గరిమ సంగత మగునే? 98

వ. నీతి ప్రకారంబుల సంపదలు గలవు. వానిచే బాహ్యమతులు పుట్టు.
నా బాహ్యమతులచే దృఢనిబద్ధుండై భవాంభోధి మునుంగు దుర్మతి
యైన వాఁడు; దరిద్రునకును మమతా బంధనంబులు గలవు.
వీతరాగులు కొందఱు తద్భవ వార్ధిఁ దరింతురు. అది గావున
సంపదలు నీతి శాస్త్రంబు వలన సుఖంబుగాఁ గైకొనం దగదు.
దుష్టౌషధాదికమువలన వ్యాధు లణంపం దగునే? ఏ శాస్త్రంబున
భవాభిధాన శాత్రవుం డణంగు. ఆ శాస్త్రంబు విద్వాంసులు మహా
స్త్రంబు వీరభటుండునుంబోలె స్వీకరింపుదురు. 99

సీ. నీతి శాస్త్రం బేల నిశిచరనాయక
వరఁగు నీతులకు సంపదలు ఫలము;
విష్ణుమయ భువన వీధులలోపల
సాధన భేదంబు సంభవింప
దనిశంబు కర్తృసాధన సాధ్య భేదమే
నియుఁ గలదది మృషానిర్ణయంబు
సంపదలెన్నేని సాధ్యంబు లాయెనా
యిందున వానికి నేమిఫలము

తే.గీ. ప్రతిదిన క్లేశమార్జన పాలనముల
నట్లుగాపున ధన బాంధవాది రూప
లక్ష్మి విద్యుచ్చలంబు; చలంబుగాక
యున్న సంసార రుచి బుధుం డొందకున్నె. 100

క. అదిగాన బాహ్యలక్ష్మిన్
మదిఁదలఁచిన యట్టి దుష్టమతులకు సర్వ
ప్రదుఁడైన శ్రీవిభుండే
మొదలన్ సేవ్యుండు నీతిమూలం బగుచున్. 101

క. కారుణ్య సాగరం బగు
నారాయణుఁ డిచ్చు నిజజన మనోఽనుస్మృతిన్
బేరుగ బాహ్యాభ్యంతర
సారతరోదార సకల సంపల్లీలన్. 102

క. లీలాసృష్ట జగత్త్రయు
శ్రీలక్ష్మీనాథు హృదయసేవ్యుఁ గృపావ్యా
లోలు రమాపతిఁ గొలువక
జాలింబడి యొకని గొల్చు జడుఁడు ఘనుండే. 103

క. అని సుతుఁడు పల్క దితినం
దనుఁ డుద్భటతప్తతైలధారలలో వా
రి నిషేకం బొనరించిన
యనూన రోషాగ్ని కన్నులంటఁగఁ జూచెన్. 104

## హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని హింసింప భటులం బనుచుట

వ. చూచి యతి భయంకరులైన నిజకింకరులం బిలిచి వీని నింతింతలుగా విశసించుండు. ఎట్లు రక్షించునో యని యప్పుడే హరి సంస్తవంబు చేసిన ఫలం బనుభవించుం గాక; కాకోలూకకంక గృధ్రంబులకు వీని మాంసం బాహారంబుగా నొసంగం జేయుఁడు హరి స్తవంబు విడిచె నేని విడువుండని నియోగించిన. 105

ఉ. ఉద్యతశస్త్రులై దనుజయోధులు తర్జనభరనాది వా
క్యోద్యమ రోషసాహస బలోద్ధతి శస్త్ర పరంపరన్మహా
విద్యుదనీకము ల్గురియ, వ్రేటులఁ బోటులఁ జేయ బాలుఁ డు
ష్ణద్యుతివోలె నుండె మధుశాసన శక్తిని వజ్రదేహుఁడై. 106

మ. కరుణాంబోధి ప్రసన్నుఁడై నిజకరాగ్రస్పర్శ సక్తిన్ నిశా
చరరాట్పుత్రుని మేనిపై నిపుర వజ్రప్రాయుఁడై యుండి దు
ర్భర తద్వీరభటోగ్ర శస్త్రదురభేద్యస్ఫూర్తి వర్తించె; దు
స్తర రక్తవ్రణ వేదనాజనిత బాధారేఖ లేదింతయున్. 107

తే. గీ. అపు డకృత్రిమ రసశీలుఁడైన భాగ
వతశిరోమణి జ్ఞానాధివాసమూర్తి
ఘనునిఁ బ్రహ్లాదు సాంతరంగ ప్రసాదుఁ
జక్రహస్తుండు రక్షించెఁ జక్రధార. 108

క. అసమజ్ఞానాధికుపై
నసురాయుధపాళి వ్యర్థమై యచలాంచ
ద్బిసరుహాశకలంబుల గతి
వసుధాస్థలిఁ బడియె దివిజవరులు నుతింపన్. 109

క. భీకర తాపత్రయ శ
స్త్రాకంపిత హృదయుఁడైన యా భాగవతున్
బ్రాకృత శస్త్ర పరంపర
లేక మహోద్ధతుని వైవ నేమొనరించున్. 110

క. హిమ మనలముఁ దిమిరం బ
ర్యముఁ బన్నగములు విహంగమాధిపు నెదురన్
దమకించినట్ల దైత్యా
ధము లెదిరి యొనర్చు క్రూరతర కృత్యంబుల్. 111

తే. గీ. కాలకూట లయానల కాలరాత్రి
దండధర వజ్రధర పాశధరులు గూడ
ననఘు నెదురించలేరు దేవారి మశక
కోటు లెన్నేనియునుఁ గూడుకొనిన నెదురె? 112

ఆ.వె. హరి పరాత్మ యాత్మనధివసింపకయున్న
జనుల బాధ[14]వెట్టు సంతతంబు
నుగ్రతాప రాక్షసగ్రహ రోగంబు
లరయ నేమిసేయు నతని కరుణ. 113

క. పరమ పరాపరుఁ డగు నీ
శ్వరు[15]నత నిజగన్మయుఁ బ్రసన్నజ్ఞాన
స్ఫురణమున నెఱుఁగు నాతం
డరయంగ సర్వాధికుఁడు కృతార్థుఁడు ధరలో. 114

క. ఆ యల్పవీరదైత్య ని
కాయము ప్రహ్లాదు [16]నెదురఁ గదలింపంగాఁ
జేయపు నిజపద భజనో
పాయంబున, మేరునగముఁ బరుసము వోలెన్. 115

వ. అంత నాతని తేజంబు విని సంతాపంబు నొంది కొంత తడవు చింతించి స్ఫురద్గరళంబులైన యురగంబులం బిలిచి యవిరళం బగు గరళంబున దైత్యకులద్రోహియగు వీని నా తనయుండని చూడక హింసింపుఁ డని నియోగించిన. 116

క. అనివార్యరోష భీషణ
ఘనతరమరుదశనతీవ్ర గరళోద్భట సూ
తన దంష్ట్రాగ్నిని ఫణిసూ
దనకేతన భక్తిరతుఁడు తలఁకక నిలిచెన్. 117

వ. మఱియు నయ్యురగంబులు గరచి విదళించి యమునాహ్రదంబునం గృష్ణునిం జుట్టుకొనిన కాళియాహియుంబోలె హరిప్రేషితగరుడశత విదళితంబులై నెత్తురులు గ్రక్కుచు స్రుక్కుచు గోఱలు విఱిగి ఫణంబు లొరగి యొడలు చిఱిఁగి భోగంబులు వగుల నాదైత్యపతిం గాంచి దేవా! భవదాత్మజు నిట్టట్టుసేయ శక్తులముగాము. నీ వింత ఘనునిం గన్నవాఁడవు. మున్ను విషదృష్టిం జూచిన సముద్రంబు లింకు నద్రులు భసితంబులౌ నిదియేమి వింతయో! బాహ్యంబున మృణాళ మృదులం[17]బయ్యు నంతరంగం[18]బున దంభోళి ధారాకఠోరం

14. లిట్టి. 15. నతని. 16. నెదురఁ.
17. బగు. 18. బగు.

బతని యంగంబని విన్నవించిన మంత్రులుం దానునుజింతించి యితండు దండ సాధ్యుండు గాఁడని సాంత్వనమునం బిలిచి సుతునితో నిట్లనియె. 118

సీ. ప్రహ్లాద ! దుష్టస్వభావుండవైన, నా
కాత్మజుండవు నిన్ను హాని సేయఁ
దలఁచిన నామది దయవుట్టె; భీకరో
రగదైత్యపతుల దుర్వారశక్తి
వెలిపింపఁ బంచితి; విశసించుమనిన ని
న్నెవ్వరు రక్షింతు ? రిప్పుడే న
నుగ్రహించితి; నిన్ను నిగ్రహానుగ్రహ
శక్తునిఁగా నాత్మ సమ్మతింపు;

తే. గీ. పేరు పెంపును రూపంబు బిరుదులేని
హరి భజింతి; విఁకనైన నతని విడువు;
రాజదయ నిత్యమని నమ్మరా; దకార్య
కరణమున శిక్షసేయుదు రరులువోలె. 119

వ. కావున నస్మద్విరోధి నాశ్రయించి యేమి యనుభవించెదవు ? తన యంతనె సకలవైభవంబులు గలిగి యున్నవాఁడవు; మూర్ఖతవదలు మని తండ్రి పలికిన విగుర్వవచనంబులు విని పరమ భాగవతుం డిట్లనియె. 120

ఉ. వాసిగ నీవుపల్కు నయవాక్యము లన్నియు వేయుమార్లు నేఁ
జేసెద; నింక నాత్మబలచింతనలేక పరాశ్రయంబుచే
గాసిలనేల వీఁడు ? రిపు గంథము లందివి హృద్యసంపదన్
ఖాసిలునట్టి వాక్యములు; పల్కక యుండినఁదోఁచు నెప్పుడున్. 121

వ. అరివర్గ[19]మన నరిషడ్వర్గంబుగాని వేఱెలేదు. పాపతరంబైన యీయరి షడ్వర్గంబు స్వాధీనంబగు నానందంబుఁ బొందనీయదు. కామాది వంచితుండై యీ జనుండు ప్రకృతియుక్తంబగు స్త్రీ ప్రసంగంబున భ్రాంతుండై పితృ మాతృ పక్షంబు వదిలినట్లు శ్రీమన్నారాయణుని వదలియుండు. వేయింట నొక్కరుండు విరక్తుండై హరి భజనంబు

19. మంది.

సేయ స్మరాదులు తృషిత[20]సురభి నిహ్రదంబు చేరకయుండ మూర్ఖులు వారించిన యట్లు వారించు; నీ రిపుపక్షంబు విడిచెద. తండ్రీ! ఎయ్యది యాత్మీయబలంబని పలుకం బడియె నది విష్ణు బలం; బా విష్ణుండె సకలాత్మభూతుండు; తదన్యసేవ పరసంశ్రయము; శత్రుల విడిచెద; పరుల భజింప; నీశ్వర బలంబే నా బలంబు; తత్ప్రతిజ్ఞయుష్మత్ప్రసాదంబున సత్యంబగుం గాత. శ్రీహరి నామ రూపంబు లేనివాఁడని దోషయుక్తంబుగాఁ బలికిన నేమి? యదియును గుణవంతంబె యగు; స్వసనామరూపశాలి యగు నతం డెట్లు సేవింపం దగు? సనామరూపత్వ విముక్తికొఱకు ననామరూపంబై యవికృతం బైన తేజంబు సేవింపందగు. కార్పణ్యంబు విడుచుటకుఁ గార్పణ్యంబు గలవాని సేవింపందగదు. కార్పణ్యంబు లేని ధన[21]వంతు సేవింపం దగదు. అస్థూలంబై యహ్రస్వంబై యనణువై యదీర్ఘమై యనామ రూపంబైన యనంతవస్తు వెయ్యది యదిభవ భీరువులైన వారిచేత సేవింపందగు; నదియ బ్రహ్మంబును, విష్ణువును; ఆ తేజంబునేఁ గోరుదు; నతిగుహ్యంబై పరమ యోగి యోగ్యంబై పరతత్వ నిష్ఠం జెందిన యీ కథ యిట్లుండనీ నోరికిం దగని కబళంబు గ్రహింప శక్యంబై అనామరూపుండైనను పుణ్య సహస్రనామంబు లందని లీలా ధృత శ్రీమదనంతశక్తిం దనరి, దుష్టాంతకుండై, శిష్టజనేష్టదాతయైన, హరి సేవింపందగు. హరి సహస్రనామంబులయందు నొకటి దలఁచిన నొకటి కీర్తించినఁ దత్ఫలం బింత యంత యనిన వారిని దేవతలు నిందింతురు. పరబ్రహ్మంబైన యీ విష్ణువు హుతాశన రూపంబునేని వైష్ణవ రూపంబునేని భిన్నోపదేశులైన మునులు స్మరించి, యమృత త్వంబు నొందుదురు. కొందఱా యీశ్వరుని రూపంబులు విధిక్రమం బున సేవించి స్మరించి కాలమృత్యువుం దరింపుదురు; స్థావర జంగ మంబులై పృథగ్విధంబులైన నామ రూపంబులన్నియు నా విష్ణు రూపంబులే; ప్రపంచ రూపుండైన విరాట్పురుషుండు నతండె; యిది విస్మయకరంబె; [22]ఫణులు దైత్యులు చెనకలేక యుండుట విష్ణుని మాయ; యతనిచేతనే కల్పితంబై(న యది) యతనిశక్తి నెట్లు

20 సురభి నిర్హ్రాదంబు చేరకయుండు. 21. వంతుండు.

22. ఫణంబులు.

నాక్రమించంగలదు ? ఇంద్రజాలం బెఱింగిన నరుండు గరిపించిన యుగ్రపన్నగంబు లతని భయంబు నొందింపంగలవే ? ఇట్లు సర్వ కామప్రదుండై భవాబ్ధి తరణియైన విష్ణువును ద్వేషింపుచు నాత్మ ద్రోహులై యవివేకులు ఖగంబులు పక్వవనంబులు విడిచి తిరిగి నట్లు చరింపుదురు. సత్కార్యంబైన నసత్కార్యంబైన ప్రభుప్రేరణ చేతనే కావించి విచిత్ర కర్మానుగత బుద్ధి నంధులై యస్వతంత్రులై యేమేమి గావింపరు ? గురునియెడ క్షోభకరంబైన వాక్యంబు నాకుఁ బలుకుట యుక్తంబుగాదు. న న్ననుగ్రహింపుమని మ్రొక్కి యేమి యైన నేఁజేసిన యది నే ననుభవించెదనని యూరకయున్న దైత్యుండు నన్నిదిక్కులు నీక్షించి మాయా భేదంబున నిట్లనియె. 122

సీ. ఎంత మూఢుఁడు [23]వీఁడు; నీక్షింతిరె వీనిఁ
బోషించిన ఫలంబు ? బుద్ధి దప్పెఁ;
బ్రతికూలములు నాకుఁ బల్కెడు; వీని వా
క్యంబులయందు సారంబు గలదె ?
అన్నియుఁ బరికింపనౌర యోరి దురాత్మ
భాషించెదవు మూఢ భణితి నిట్లు;
నా కంటె మంత్రి రత్నంబుల కంటె యు
క్తిని గుశలుండవే ! తనయ ! నేఁడు ?

తే. గీ. ముదిసి రోగ విశీర్ణాంగములఁ గృశించు
వాఁడు పల్కినఁ దగుఁగాక వయసు గలిగి
రాజ పుత్రుండవై నవ్యరమణులుండి
యూర్వశికిఁ గ్లీబుఁడునుబోలె నునికిఁ దోచె. 123

క. మందాత్మ ! నీవు ధార్మికు
చందంబునఁ బల్కెదవు మృషా వచనంబుల్
[24]నిందించెదు నేఁ బరమా
నందంబునఁ బల్క దైత్యనాయకు లుల్కన్. 124

వ. కాంతాకేలిరసోజ్జ్వలంబులైన విషయంబు లనుభవింపు; మాయువు వృథ నేయకుము ; సాభిలాషదృష్టులై మదించిన ముదితలతో

---

23. వీనినీక్షించి. 24. నిందించెదు నే పరమా.

రమింపుము; బ్రహ్మానుభవంబు శ్లాఘ్యంబు గాదని యెప్పుడు మదిం దలంపవు; మృగయాద్యూత గీత రసానుభవంబు చేసి వివేక శిక్షా గురువుల ముందర మున్ను పల్కిన యట్లు పల్కనేరవు; మద్భుజాబలగత భౌమ దివ్య విషయంబు లనుభవింపుము; [25]నిధానంబుపై నధిష్ఠించి దైన్యంబు చెప్పుకొననేల? అటు పల్కెద వేనిచ్చిన సుఖంబు విడిచి యుపేంద్రుని వలన నేమి యనుభవించెదవు? నా యాజ్ఞ శిరంబునం దాల్చిన దేవేంద్రునిం జూడవే? యని హిరణ్యకశిపుండు పల్కినం దన్మంత్రులు "రాజపుత్ర! యీ మహారాజు ననుగ్రహంబు మాకుం గలుగ మమ్ము నాశీర్వదింపుం"డని ప్రార్థింపుదురు. చంద్రుండు భూషాకాలంబుల వేగంబె దర్పణంబై యుండక విళంబంబుచేసినం గళల మొత్తించు, వరుణుండు స్వాదుసిత మధురంబులగు జలంబుఁ గలశంబున నిడుకొని పానార్థంబుగా వెను వెంటం దిరుగు; దూరస్థకృత్యంబునకు ననిలంబు దూతంజేసిన సదా తిరుగుచు సదాగతియన్న పేరు సార్థంబుగాఁ జేసికొనియె; ఇటువంటి యేకవీరుండైన దైత్యరాజునకుం బుత్రుండవై పుట్టి క్షీణతరులైన దేవతలలోఁ దానునొక్కరుండైన విష్ణుని నెట్లాశ్రయించెదవని పల్కిన.

## ప్రహ్లాదుఁడు హరి స్మరణ మహిమను గొనియాడుట

క. ప్రచుర విశృంఖల మతులగు
సచివులుఁ దండ్రియును బల్కు జడవాక్యంబుల్
రుచియించక నిజధర్మ
ప్రచయమునకు నప్పుడంతరాయంబైనన్. 126

క. వారిఁగని మీకు సరిగా
భూరిగతిం బలుక బుద్ధి పొడమదు; నేని
ట్టూరక యున్న ననాదర
మేరీతిఁ దరింతు మీర లెఱుఁగరె? జాణల్. 127

క. సర్వ గతుఁడైన మాధవు
నిర్వాణ ప్రభుఁ దలంచి నిలిచినచో నా
గీర్వాణులు చేసిన యం
తర్విఘ్నములు గురు జనులు దప్పింతురిలన్. 128

25. నిధానంబవై యధిష్టిం ? .

క. శ్రేయములకు బహువిఘ్నము
లేయెడ; శ్రేయస్తమమగు నీశ్వరభజనం
బాయత బహువిఘ్నాద్యద
పాయంబులు సంతతంబు నంటకయున్నే. 129

తే.గీ. కంస సూదనుమీఁద నొకానొకనికి
నొకయెడ మనంబు తిరమయియుండు ధాత్రి;
నఖిల విఘ్నాంతరములు శ్రీహరి హరించు
హరిణ పోతము శార్దూలవరమువోలె. 130

తే.గీ. నిరత సర్వేశ భావనా నిష్ఠుఁడైన
వాని నిష్టార్థమొసఁగు దేవతలుఁ గలఁతు;
రతి దురాత్ములు రాక్షసులైనఁ గలఁతు;
రెలమి గురులైన వారించి కలఁతు రెపుడు. 131

క. దుర్లంఘే దృశ విఘ్నము
నిర్లక్ష్యముగాఁగ నిలిచి నిఖిలాత్మకునం
తర్లక్షితుఁ జేసిన, సు
చ్చైర్లోకమునందు నతఁడు సర్వాధికుఁడై. 132

క. నీచతరశీలుఁడ వగుట
నీచతర రసజ్ఞులైన నీమంత్రులచే
నేచెవిని బడిన వాక్యము
లేచిత్తము లాత్మవిఘ్నహేతువు లగుటన్. 133

చ. సుతహితుఁడైన తండ్రి నిజసూనుని దుర్విషయాను భూతికిన్
మతిఁ బొడమంగఁ జేయుట క్రమంబగునే? సువిచారనీతిసు
స్థితివలె నాడఁగాఁ దగునె? ధీరహితుల్ తముఁదామె భోగవ
హ్నితతిఁబడంగఁ ద్రోయుచురె నెక్కొని తద్విరతాత్మవృత్తులన్. 134

తే.గీ. అంధులెల్లఁ బురఃస్థితమైన యట్టి
యంధువునఁ దామె కూలుదు రనఁగ నేల?
నొక విధంబునఁ గడితేరుచున్న నన్ను
విషయ వారాశిలో ముంప వేడ్కయగునె. 135

క. నిరయాధ్వంబులఁ దిరిగెడు
నరులకు జ్ఞానోపదేశ నవ్యవివేకాం
తరమునఁ ద్రిప్పెడు నాతఁడె
పరమగురుఁడు తండ్రి యాత్మబంధుఁడు వెలయన్. 136

క. విషయములు సుఖకరములని
విషయాంతరములఁ జరించు వీరుండె మహా
తృషమృగ తృష్ణలు గని [76]బ
ల్విషకాంక్షకు మృగము లేఁగు విధమున నుండున్. 137

క. అగణిత విషయగ్రాహం
బగు భవవారాశి చూచి యాత్మఁ గలఁగి స
ర్వగుఁడైన విష్ణుఁ డను తె
ప్పగలుగఁ దరియింప, ముంపఁ బాడియె తండ్రీ! 138

క. తను దానె విషయలోలత
మనుజుఁడు వర్తింప దాని మఱపుటఁ దగునే
యనలము బాలుఁడు పట్టఁగఁ
జనుచో నంగారమొనఁగఁ జనునే తండ్రీ! 139

వ. ఇంద్రియార్థముల యందుం బంచేంద్రియంబులం బ్రవర్తిల్లఁ జేయుచు నశిక్షులైన కుపుత్రులచేఁ దండ్రియుంబోలె నష్టుండగు; స్వభిన్నునింగా నీశ్వరుని వేఱుగాఁ దలంచిన వాఁడు విషయార్థప్రత్యగాత్మయైన యీశ్వరు నెట్లు సేవించు? యామ్యదిశకుం బోయినవాఁడు మేరు నగంబు విలోకించునే? విషయమోక్ష మార్గంబులు పరస్పర విరుద్ధంబులు; లోకమార్గంబున నడచిన నాకమార్గంబున నడువవచ్చునే! తండ్రీ! విషయానుభవంబునందు దుఃఖ పరంపరగాని శాంతిలేదు; బ్రహ్మ మొక్కటి యశాంతికరంబు నీవు విషయానుభవంబు సుఖంబని యుంటివి; బహుదుఃఖ మిశ్రంబై యల్పంబగుటం జేసి యది దుఃఖంబే; నాశదాహాహరణ శంకామిశ్రంబై బహుప్రయాస సాధ్యంబై యల్పంబైన విషయసుఖంబుఁ గాల్పనా? నింబచూర్ణకృతంబైన ముద్ద యెంత స్వల్పగుణంబైన నది భక్షించు నెవ్వఁడు సుఖంబు నొందు?

76. పర్విష.

నిట్లనే విషయసుఖంబు; పర్వతం బెన్ని యెడలం ద్రవ్వినఁ శ్రమంబె కాక సుఖంబు గలదే? అటువలెనే కాచమణికాని దివ్యమణి దొరకదు; కాముకుండు బాహ్యసుఖాసక్తుండగు; గురూదిత వేదాంత విచారంబు సేయు నందాఁకనే కృపణజనుండు బాహ్యసుఖంబు ఘనంబని తలంచు; మఱియు 140

సీ. త్రిభువనంబును నేలి దీపించు నీవంటి
ఘనుని యానందంబు మనుజతతికి
నగుఁ బరమానంద; మా పరమానంద
బహుకోటిగుణిత సంపత్ప్రవృత్తి
సంపూర్తి మెఱయుఁ బ్రాజాపత్యమైనట్టి
యమ్మహానంద మత్యతిశయమున;
నమరు బ్రహ్మానంద మానంద తతులు త
దానంద కర్ణనార్ధార్థ కోటి

తే.గీ. భాగసమములుగా పెంచ; బ్రహ్మమైన
యట్టి యానంద మజర మనంత మనఘ
మన్నిటికి వేఱైయె నిత్యమై చెలంగు
నట్టి బ్రహ్మ సుఖం బగు హరిఁ దలంప. 141

క. హరి సంస్మృతి మాత్రంబునఁ
బరమానందంబు లెల్లఁ బ్రాపింపఁగ; ను
ర్వర నల్పసుఖము నెవ్వం
డరయుఁ బరిక్షీణ చంచలాత్ముఁడు దక్కన్. 142

తే.గీ. చరణయుగళంబు జ్ఞానలేశంబు గలిగి
దుర్లభుండైన యా యనంతుని భజింపఁ
బాడి యామీఁద రోగాద్యుపద్రవంబు
లెల్లఁ జెందక మున్నె మహీతలమున. 143

తే.గీ. వెంటఁ గాపెంతయును లేక వికట ఘోర
కాననంబున కేఁగి యొక్కరుఁడు చోర
గణము తనుఁ జుట్టుకొని భయోత్కంప మొంది
యున్న నెవ్వఁడు రక్షించునో మహాత్మ! 144

ఉ. కాన సుఖస్థితిన్ నిలువఁ గల్గిన యప్పుడె దుర్గతి క్రియా
హానికినై భజింపఁ దగు నంబుజనేత్రు; రమాకళత్రు; భ
క్తానిశ సత్ఫలప్రదు; బుధాత్మమనోత్సవమూర్తి; విష్ణు, లో
నూనిన భక్తిచే మఱి నరోత్తముఁడైన ఘనుండు ధన్యుఁడై. 145

క. ఈరీతిఁ బల్కఁ విని యమ
రారి సహింపక మదోత్కటాహంకృతిఁ దాఁ
జీరుకము చూత కిసలా
హారముఁ గొని యసహమానమై యున్నగతిన్. 146

## హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని[redacted] గజములఁ ద్రొక్కించుట

వ. అపుడు పూర్వాపర పరామర్శశూన్యుండై క్రోధానల వ్యాకులుండై యతిదుర్దమంబులగు దిగ్గజంబులం బిలిచి యీకులద్రోహిని వధింపుఁడు. హతుండై మద్భుజాబలాహతులైన వారల విలోకించుం గాక; అల్ప కార్యంబు నందు నియోగించితినని లజ్జించ వలవదని యానతి యిచ్చిన విని చని. 147

శా. శుండాదండము లెత్తి మొత్తి, రదన క్షుణ్ణాంగుఁగాఁ గ్రుమ్మి యు
చ్చండాంఘ్రిస్ఫురితాహతిం జిదిమి, చంచద్ఘోర ఘీంకారముల్
దండిన్ బద్మభవాండ మండల సముద్దండార్భటిన్ నిండ ది
క్పుండాలంబులు తత్కయాధుతనయుం గ్రూరోద్ధతిం దాఁకినన్. 148

మ. కులశైలంబులు నాగవేధులు మహాక్రూరంబులై యొప్పఁగా
బల సంపత్తి యనల్పమై నిగుడ, శుంభద్ఘోర దిఙ్నాగముల్
జలజాక్షున్ హృదయంబులో నిలిపి యుచ్చైర్గౌరవాటోపముల్
గల ప్రహ్లాదుఁ దరల్పలేక నిలిచెన్ గంభీర ఘోరంబుగన్. 149

సీ. అంత దిక్కరులు రోషాటోపమునఁ గ్రూర;
దంత శూలములఁ దద్దైత్య బాలుఁ
దత పూర్వతనువులై యతివేగమునఁ గ్రుమ్మ;
దంతముల్ విరిగి యా ధరణిఁ బడి; మ

దోరుధారలు వోయి, ధారాళతర రక్త
ధారలు దొరఁగ, నార్తస్వనమున
రోదసీకుహరంబు భేదింప, దుర్భయ
కంపంబుచే దైత్యకర్త బెదర,

తే.గీ. ననలమును శలభంబులు, నద్రిరాజు
దంశము; లిభంబు నజము; లాత్మజ్ఞులోక
ములునుబోలెఁ దెరల్ప వా జలజనాభ
భక్తినిష్ఠాపరాయణు భవ్యు నతని. 150

వ. అప్పుడు. 151

క. దైత్యుల రమ్మని యంతట
దైత్యవరేణ్యుండు మీరు దహనజ్వాలా
ద్ధత్యంబున నణఁచుండని
యత్యంతాగ్రహముతోడ ననిచె న్వేగన్. 152

వ. వారు చని. 153

శా. కాష్ఠాచక్రము కంపమంద నమలోగ్రస్ఫార రోషాగ్నిచేఁ
గాష్ఠానీకము తైలవాహినులఁ దోఁగంజేసి దుర్జ్వాలికా
కాష్ఠాభీల మహానలచ్ఛటల మ్రగ్గం ద్రోచినం భీతులై
కాష్ఠాధీశులు వేగఁ గన్నదరి వీగం జొచ్చి రత్యుద్ధతిన్. 154

వ. ఇట్లు మహాభీలజ్వాలా కరాళంబైన యుగాంతానలంబునుం బోలె ననంతానలంబుప్పొంగఁ దదంతరంబు చొచ్చి జలశాయిం దలంపుచు నంతర్బలంబున జగన్నాయకుండు నాయందుఁ గలండని చింతింపుచు నున్న ననలంబు శాంతిమొందె. అంత జలంబులం దోఁగినయట్లనున్న నసురులు విస్మయం బంది మఱియుఁ గ్రాలుకొనం జేసిన పొనుంగుపడి సాధుశిష్యుండు గురుని యొద్దంబలె, సర్పంబులు వినతాసుతుని యొద్దంబలె, హరిధ్యానపరాయణుండైన యతని యొద్ద నిరంగారంబై యుండె; భవాగ్ని తపింపం జేయలేదు, వైష్ణవులం బ్రాకృతాగ్ని తపింపంజేయ గలదె ? అట్లుగాన నతండు సుఖంబున నుండుటవిని యారాజు రోషించి మృత్యుజిహ్వాభీలంబైన కరవాలం బెత్తి వైవం జూచిన పురోహితు లతనిం జూచి యంజలిఁజేసి యిట్లని వినుతించి రప్పుడు. 155

క. శూరుం దపు నీవసిఁ గొని
దారుణగతి వచ్చునపుడు ధరణీవణంకున్
సారె మెఱుఁగండు నీదు కు
మారుఁడు సుకుమారుఁ డితని మన్నించు నృపా! 156

తే.గీ. చాలు రోషంబు [27]వీనిపై శశము మీఁద
సింహపోతంబుఁ దాఁ దాఁకఁ జేసినట్లు;
తాళు మిందునకొక్క యత్నం బొనర్చి
యతని రక్షించు మింక దైత్యాధినాథ! 157

సీ. అర్భకుం డతఁడు దండార్హుండు గాడతి
జడుఁడు నీ సుతుఁడయ్యెఁ జాల నసుఖ
మందుచున్నవాఁ; డత్యంత కారుణ్య
పాత్రు డింతటనైన బహువిధముల
బుద్ధిగాఁ జెప్పి, యుద్బుద్ధంబులైన యు
పాయము ల్బోధించి ప్రాజ్ఞుఁ జేసి
నిర్వహించెద మతినిపుణతరోక్తుల;
నవి వినకున్న దురాత్మ మదియ
తే.గీ. శాప మిచ్చెద; ముడుగుమీ సాహసోక్తి
స్వామి! యీతండు శస్త్రాశి సమయకునికి
యద్భుతముగాదు, తద్బలోదయము: దాని
యౌషధంబు నెఱుంగుదు మసురనాథ! 158

క. అన్నియు నన నేటికి లో
కోన్నతశీలుఁడవు తావకోగ్ర క్రోధో
త్పన్నపరాధమున కితం
డెన్నిక నర్హుండె దానవేశ్వర! యింకన్. 159

తే.గీ. అని కుమారునిఁ దోడ్కొని యపుడు తత్పు
రోహితులు విజనస్థలి నూహ సేయఁ
జనిరి; యావత్ప్రణాశనుఁ జక్రహస్తు
నతఁడు మదిలోఁ దలంపుచునచట నిలిచె. 160

---

27. యితనిపై.

వ. నిలిచి గురుగృహంబున శ్రుతి విహరణ పాన భోజనాదుల హరిం దలంపుచు బాహ్యకృత్యంబున జడుండువోలె వితర్కింపుచు జగం బంతయు ననంతమయంబుగాఁ జింతింపుచు నున్న యా ప్రహ్లాదునిం జూచి గురుకుల సహవాసంబులగు బాలురు శ్రుతిపఠనంబుఁ జాలించి యిట్లనిరి. 161

చ. దితికుల మౌళిపుత్ర ! భవదీయ చరిత్రమ భోగలోభసం
గత; మదిగాన నీ మదినొకానొక తేజము వింతచేసి సం
తతపులకాంకురచ్ఛటలు దాల్చితి; చెప్పఁగ వచ్చెనెట్టు లీ
స్థితి ? యెఱింగింపు నీ మహిమ శ్రీకరమై జగముల్నుతించఁగన్. 162

క. దితిసుత సంప్రేషిత వ
క్రతరోగ్ర భటాహివహ్నికరి బాధలు లే
కతి సుఖమున నుండి తివీ
వితర సుఖప్రీతి నొందుదేమి కుమారా ! 163

## ప్రహ్లాదుఁడు దైత్యకుమారులకుఁ బరమార్థం బెఱింగించుట

వ. అనిన విని మహానుభావులారా ! మీరలడిగినయట్లనే నాకు నన్యాభిలాషంబులేదు. ధనజన రమణీ విలాస రమ్యంబైన యది భవంబు; దాని వర్జింపవలయునో ? సేవింపవలయునో ? విబుధులం బరామర్శిం పుండు; మొదల జననీ జఠరంబులో నున్నవా రనుభవింపు దుఃఖంబు వినుండు; కుటిలతనువులై, సదాగ్నితప్తులై, వివిధ పూర్వజన్మంబులు తలంపుచు నమేధ్య పంకలిప్తుండనైతి. పూర్వంబున నీశ్వరస్మరణంబు సేయనైతి; బహువిధ బహుజన్మ ఖేదంబు లనుభవించి నిజహితం బాచరించుకొన లేనైతి; మూఢుండనైతి; మాతృభుక్త మహోగ్రకటు లవణామ్లరసంబులచే దేహంబుతపింపుచున్న యది; యనవకాశంబువలన నచలంబైన దుఃఖంబు ప్రాప్తించె; ఇదె హరిని మఱచిన ఫలంబు; కారాగృహంబునఁ జోరుండు వోలె జరాయువిట్క్రిమి మూత్ర హేయంబైన మాతృగర్భంబునం బద్ధుండనైతి; ఒకానొకప్పుడేని ముకుంద పాదస్మృతి సేయలేనైతి; నింకనేనియు నితరవాంఛలుడిగి హరిభజనంబు చేసెద; నెన్నఁడు గర్భంబు వెడలుదునప్పుడె పూర్వ మూఢత్వంబువదలెద ననికోరుచు దారు బద్ధంబైన పశువు బంధనచ్యుతిఁ

గోరునట్లు మాతృగర్భ నిర్గమంబుఁ గాంక్షింపుచు, తృషితుండు తటాకంబు నపేక్షించినట్లు పరిభ్రమించుం గాన, గర్భంబులో నున్నతఱి సౌఖ్యంబు లభింపదు; గర్భంబు వెడలినయప్పుడు బాహ్యానిలస్పర్శనొంది, తల్లియుం దాను మూర్ఛనొంది, బహుదుఃఖంబు లనుభవించి, సేదదేరి, గర్భంబులోఁగల జ్ఞానంబు మఱచి, మున్ను గోరిన యాశలు విఫలంబులై, యురస్థమృత్యుని భోగవాంఛలుంబలె, లభింపవు; యోగియైన మునియుంబోలె గర్భంబున నన్నియు నెఱింగి బాహ్యంబున విస్మృతి నొందు; జాగర సుషుప్త్యవస్థల యట్ల గర్భ బాహ్యప్రదేశంబుల వర్తించు మఱియు. 164

తే.గీ. పృథుల బాహ్యానిలాసి నిర్భిన్న బోధ
వృక్షనవ్యాంకురములోలి వెడలి వచ్చు
నల్పమున కల్పమునునైన యట్టి జ్ఞాన
మదివి వృద్ధి వహించు దేహంబు తోడ. 165

తే.గీ. శాస్త్ర సత్సంగతోయ సేచన సమృద్ధిఁ
జెలఁగు జ్ఞానాంకురముఁ బ్రోదిచేసి, చెట్టుఁ
గట్టి, పొదలిన యట్టి వృక్షంబు వలన
మోక్షఫల మందుదురు మౌని ముఖ్యవరులు. 166

తే.గీ అర్థ కామానుగతులైన యట్టివారి
యాత్మలోఁ గలునట్టి జ్ఞానాంకురంబు
ప్రబల వర్షానలప్రతప్తమయి విఫల
మై మరణ ఖడ్గ విచ్ఛిన్నమై చలించు. 167

క. జననంబును మృతియుఁ బున
ర్జననంబుఁ బునర్మృతియును సాంద్రముగాఁ గూ
ర్చిన మౌలిక కడతేరదు
ఘన విజ్ఞానాసిచేత ఖండించఁ దగున్. 168

వ. ప్రసంగంబున బాల్యదుఃఖం బెఱింగించితి; నాధివ్యాధులచేఁ బీడింపం బడి పల్కc సమర్థుండుగాఁ దంతఁ గ్రీడాసక్తుండై మజ్జన భోజనాది పరేచ్ఛచేఁ గ్లేశంబునొంది యుండు; పురుషార్థబుద్ధిచే నెద్దియేనియు నన్యులతో హాస్యంబు గావించు; వృథాశ్రమార్తుండగు; నిది బాల్యంబు

నందునైన యజ్ఞత; యౌవనంబున నగుసుఖం బెఱింగించెద వినుండు, పంచశరుండును బంచేంద్రియంబులు బాధింప నతి దుర్లభంబులైన యవి యాత్మంగోరుచు నర్థంబువలన, భార్యాదులవలనఁ బరితోషంబు నొందుచు, నిజదారధనాదులం బరితుష్టినొందిన, విభవంబుల సుఖం బనుభవింపఁడు; విభవంబులన్నియు ననిత్యంబు; లీ విభవంబులు చనిన గోటిగుణితంబగు దుఃఖంబు ప్రాపించు; దారపుత్ర ధనంబుల యందు నెవ్వండు లోలుండగు నదియ దుఃఖంబు; తద్దుఃఖ మహా తరువులకు బీజంబులు హృదయంబున నాటిన నవికాలంబునందుఁ దనువు భేదించి మొలక లెత్తుపర్యంతమును దుఃఖాన్వితులగు ధన దారపుత్రుల నాత్మజ్ఞుండు గానివాఁడు పరిగ్రహించి గ్రీడించు; నమంత్రజ్ఞుఁడు వ్యాళ శిశువులం బట్టిన తెఱంగున, జీర్ణంబైన నావ మహాబ్ధి నాశ్రయించినయట్లు, విచ్ఛిద్యమానమాహోన్నతశాఖి శాఖ నెక్కిన మాడ్కిఁ గేవల నశ్వరంబులగు విషయంబులు భజియించి, దుఃఖంబు లనుభవించుంగాన, నీ యౌవనంబున నేని సుఖంబులేదు; వార్ధకంబున దుఃఖంబేమి సెప్పుదు? నాది వ్యాధి మహానదులకు నర్ణవంబగు; ఇంతియకాదు; సర్వావస్థలయందును సుఖంబులేదు; మఱియును, 169

ఉ. పుత్రులు లేకయున్నయెడ పూర్ణతరోత్కట ఘోరదుఃఖముల్
పుత్రులుగల్గి సద్గుణ విభూతి వహింపకయున్న దుఃఖముల్
పుత్రు లకాల ధర్మమునుబొందిన యట్టి యవాచ్యదుఃఖముల్
పుత్రులు గల్గినంతనె యపూర్వసుఖంబులఁ బొందనేర్చునే? 170

క. దార సుత బంధు మిత్రా
పార మహాసంపదలును బహుదుఃఖములౌ
తారాధిప మధుమంద స
మీరాదులు విరహిజనుల నేఁచు తెఱఁగునన్. 171

క. చొప్పడ నెన్నివిధంబులఁ
దప్పదు మది మృత్యుభీతి; దానసుఖంబే?
యెప్పుడొ యెవ్వని చేతనొ
యిప్పుడొ యీ వెనుకనో మహీవలయమునన్. 172

క. అనలోదకాన్న పానా
హి నిషాద మృగ ఖగ పశు సమీరాదులచే
ననిశంబు మృతి లభించున్
జనులకుఁ దద్గణన సేయ శక్యంబగునే ? 173

మ. వికలాంగత్వము, మాంద్యముం బధిరతావేశంబు రోగంబులుం
బ్రకటంబైన నరాధము ల్మనములోఁ బ్రాణంబులన్ రోసియు
న్నకటా ! తద్విషయానురాగమున సహ్యం బౌట చిత్రంబె? కా
ముకులై తద్విషయానురక్తులగు నా మూఢుల్ ప్రమాణంబులే. 174

క. కావున నతి దుఃఖద భవ
సేవ యొనర్తురె ప్రసన్నచిత్తులు మీరల్
భావజ్ఞు లెఱుఁగరే యీ
ప్రావీణ్యము మెఱసి యిట్లు పలుకందగునే. 175

వ. ఇంతియకాదు. ద్విపాత్త్వంబు నొందియు నార్తింజెందుట కల్మికి నిది సంప్రాప్తంబె కర్మవిపాక భేదంబున నానావిధ యోనులంజెందవలయు. నానావిధావస్థలు మనచేతనే చూడంబడియె. కర్మవశంబునం జీవులు సంసార వనంబునం జరింపుచు నిత్యభీతిమై పాపవ్యాఘ్రసింహా భీలవృక భక్ష్యంబులేని, నృపవధ్యులేని యగుదురు; నిష్కారణప్రియ హస్తిశునకంబులై బద్ధంబులై యుండ్రు; పశువులై దుఃఖంబున భారంబు వహింతు; రపరాధంబులేకయ పర ఖేలనార్థంబుగా మేష కుక్కుటంబులై యుద్ధంబుఁ గావింతు; రిదిమొదలుగాఁ గర్మానుగత యోనులంబొందిన వారి దుఃఖం బింతింత యనవచ్చునే ? దైత్య పుత్రులారా ? యిది జంగమ రూపదుఃఖంబు. స్థావరత్వ రూపంబునఁ గష్టతరంబౌనో కాదో ? ఇట్లని తలంచిన భవంబున సుఖాంశంబులే దెప్పుడెప్పుడు విచారించిన నప్పుడప్పుడు సంసారంబు దుఃఖమయంబు; దీనికి సాధుజనులుచౌర రతత్త్వవిదులైన మూఢులు వహ్నియందు శలభంబులుంబోలె సంసారంబునం బడుదురు. సుఖముంబలెఁ గాన్పించిన యీ భవంబునందుఁ బడుట యుక్తంబె ? గత్యంతరంబు లేక యన్నాభావంబునఁ గృశించిన వారికిఁ బిణ్యాకతుషాదిఖాదనంబు తగు. పూర్ణునకుం దగునే? శ్రీపతి పాదపద్మద్వంద్వార్చనా ప్రాప్య

నాద్యబ్రహ్మానందంబు నవ్యంబతాప మిశ్రంబు సర్వజన సాధారణంబు గలదు; తదర్చనంబు మోక్షప్రదంబు; అక్లేశ ప్రాప్యంబైన యీ మహాసుఖంబు విడిచి యెవ్వండన్య సుఖంబుఁగోరు? రాజ్య వైభవంబు విడిచి భిక్షాశనంబు సేయుట సుసాధనంబైనం బ్రహ్మ సుఖంబు గలుగు; విషయాసక్తుండైన వాఁడు జాత్యంధుండు; బుధులు తనుంజూచి దుఃఖించిన భవంబునందే విహరింతు రెట్లు? భవంబు దుఃఖమయంబుగానెఱింగి హరి భజనంబుఁగావింపుడు. తద్భజనంబున నపరోక్షంబైన సంస్కార ఫలంబు మీకు లభించు. మఱియు 176

చ. వెలయు నసార ఘోరభవ వృక్షమునందు రమాధవార్చనా
ఫలము జనించె నొక్కటి; ప్రపన్న సుసాధ్యము తత్ఫలంబు; ని
వ్వలఁదను వెత్తకుండిన నవశ్యము గల్గదు దేహమేఁగినన్
గలుగునె లింగదేహ మటుగాంచిన జీవులకుం బ్రసిద్ధిగన్. 177

క. ఇదియెఱిఁగి బాహ్యసుఖసం
పదగల జనుఁ డచ్యుతాంఘ్రి భజనము సేయన్
దుది ముట్టి జన్మ ఫలమా
పదలుడుపుం గాకయున్నఁ బతితుం డరయన్. 178

శా. సంసారంబున నుండియే హరి పదాబ్జాంతంబు లర్చించి త
త్సంసారంబు నధోగతిం జరవునే తావత్ప్రసంగంబునన్
సంసిద్ధంబగుఁగాక మీకు జనులెంచంగాఁ గృతఘ్నత్వ మా
సంసారం బిపు డాక్రమించునె ప్రశస్తంబైన నీ ధామమున్. 179

క. అనియెఱిఁగి మానసాబ్జం
బున నీశ్వరు శంఖచక్ర భూరిగదా శో
భన బాహుభక్తియోగం
బునఁ గొల్వఁగ వలయుఁ గామములు విడిచి జనుల్. 180

తే.గీ. సర్వభూతంబు లందున, శక్తి గలుగ
వారిపై మైత్రి నిలువఁగావలయు; రోష
కామముల మీఁద రోషంబు గలుగవలయుఁ
గనవలయు శత్రులని రోష కామములను. 181

మ. ప్రతిమా రూపములందుఁ జక్రధరు నర్చాలీలమైఁ గొల్చి శ్రీ
పతి సర్వాంతరవాసిఁగా దనెడు దుష్ప్రజ్ఞం జన ద్వేషులై
క్షితిదేవోత్తమ పాదము ల్గొలిచి తచ్ఛీర్షంబుమీఁదం బదా
హతిఁ గావించిన యజ్ఞు నట్ల ఘనపాపాంబోధి మున్గున్ వగన్. 182

వ. మీరు నాస్తికులు, భవసింధు నిమగ్నులైనవారు గాన మీకు నెఱింగించెద. మునీంద్ర జుష్టంబైన జ్ఞానంబును త్రయీమార్గనర్థంబైన జ్ఞానంబు నకు ననన్యభావం బంగీకరింపవలయు; నెద్దియైన మనంబున నానా విధంబుగా దోఁచియుండు నదియుఁ బ్రయత్నంబున నొక్కటియే; బ్రహ్మం బాత్మాకార్యంబగుటంజేసి బ్రహ్మంబె కానెఱుంగందగు. దాని నొకానొకప్పుడు మఱువరాదు. మలినంబైన మనంబు బృథక్కుఁగా దెలిపి యాత్మను మోసపుచ్చు; నిది మనస్స్వభావంబు. ఇది యప్ర మత్తులై యెఱింగి తత్ప్రతికూలంబుగానే యాచరించి దానిని గ్రహింపవలయు; ఎవ్వండు వస్తువు విభిన్నంబుగాఁ జూపుచు మలాఢ్యంబైన మనస్సుఁ బ్రవర్తిల్లం జేయునో వాఁడా మనంబునకు మాలిన్యంబు భవవిభావ మాలిన్యంబైన వాసన యని యెఱింగి యా వాసన వొడమకుండ మనో నిరోధంబు సేసి శోధింపవలయు; నెవ్వండు వస్తువు విభిన్నంబుగాఁ జూపుచు నందు నభేదదృష్టియై ప్రయత్నుండై యుండునో వాఁడు మాలిన్యంబు దప్పి సుఖియగు. పూర్వస్థిత మాలిన్యప్రణాశనంబున మనంబు దృఢంబై ప్రశుద్ధ బోధనంబు నొందు. ప్రశస్తంబగు నా మలప్రణాశనంబు మనంబు నిరోధింపక పుట్టదు, గాన మనోనిరోధంబు సేయవలయు; మనోనిరోధంబనంగా మనంబు నిర్విషయంబై యుండుట ? ఇదిసేయ దుష్కరం; బుపాయం బులంగాని సాధింపరా; దా యుపాయంబు లైదు తెఱంగులైన గుణం బులై యుండు; జ్ఞాన ధ్యానంబును మనోనిరోధంబును, మానసోపా యంబును వాయుబంధనంబును నివృత్తిచిత్తుండై హృదయంబునకు వెలియై నాథసేవ సేయుట ననంగ; ప్రపంచంబు ద్వివిధ భూబాహ్యంబు, నాభ్యంతరంబునని; ధన దారాదికము బాహ్యంబు; గౌణధ్యానాదికం బాభ్యంతరంబు; బాహ్యంబు వదలవలయు. కించిద వలంబనంబు సేయక మనంబు బాహ్యత్యాగి గానేరదు. వ్రజంబులో నుండి గోవ్రజంబులో నొకధేనువుం దోచిన మరలి మరలి పూర్వ

స్థలంబునకే పరువెత్త నన్యపశువుతో లంకెవైచి తెచ్చి పూర్వస్థలంబు మరచియున్న పర్యంతంబు లంకెతో నుంచి తత్పూర్వస్థలంబు మరచిన లంకె విడుతు; రిట్లనే విచక్షణులు నీతిఁ దర్కించి గౌణధ్యానాదియోగంబునన్ మనంబు బాహ్యేంద్రియంబుల వలన మరలింపవలయు; నిజమనంబునకు నిర్విషయత్వం బనందగునీ క్రమంబు ప్రకారాంతరంబునం గాదు. క్రమంబునంగాని యున్నతపదంబు నెక్క సమర్థుండుగాఁడు; క్రమంబు దక్కి యెక్కెనేని యధఃపథంబు నొందు; తత్కర్మంబు సేయుచుఁ, దత్కర్మంబు గావింపుచు, శంఖ చక్ర గదాధరు యమాది గుణసంపన్నుఁ, ధ్యానించి యాక్రమంబునఁ బరపు ధామంబునొందు. మీరు నాకుఁ బరమమిత్రులు లోకరహస్యం బెఱింగించెద; సత్సంగమంబున విష్ణుకథలు వినుచు జగంబు విష్ణుమయంబని యెఱింగి సర్వజనులయెడ మైత్రిగావింపుఁడు. విషయంబులయందు దోష దృష్టి పూని, సర్వక్లేశ నివారకుండైన విష్ణువును స్మరింపుచు, సత్సంగంబులేక యుండెడు విష్ణు విముఖులం గూడక, యొంటిమైనుండి, యా విష్ణు విముఖులం దూషింపక, యిష్టప్రాప్తి విపత్తులాత్మకు సమానంబుగాఁ జూచుచు, నెయ్యదియు సంకల్పింపక, యెల్లప్పుడు బ్రహ్మ జిజ్ఞాసం బూని, యపర రాత్రంబుల లేచి యాొచిత్యంబున "నాత్మ యెటువంటిది ? దేహం బెందుననైన యది ? మనం బే చందంబున వర్తించు ? దశానిలంబు లెట్టివి ? యక్షంబుల కుద్యద్వృత్తు లెటువంటివి? ఆత్మ పరమాత్మలకు భేదంబెట్లు? ఎవ్వనిచే నీ విశ్వంబు సృజియింపంబడియె ? నా విశ్వం బెవ్వనిచే ధరియింపబడియె ? వేదంబుల తాత్పర్యం బెట్టిది ? బంధం బన నెటువంటిది? మోక్షంబన నెటువంటిది ? శ్రోత, మంత ద్రష్టవక్తయునన నెవ్వండు? జనకుం డెవ్వండు? సర్వగతమై నిత్యమైన యానందమేల కనిపించదని గహనాంతమైన బ్రహ్మమునున్న సద్వృద్ధుల మఱియు మఱియు నడుగుచు నన్నియెడలఁ బ్రభుండు ప్రకటంబుగాఁ దోఁచ, స్వప్నదశయందు మనంబు హరియందు నిలిపి రమింపవలయు; తానే యతని నన్వయించి పశువభ్యస్త గృహంబునకుం బోయినయట్లు చనవలయు; సత్పథవర్తులైన వారికి హరి ప్రసన్నుండగు; విమలజ్ఞానపురస్సరంబై దుర్లభంబైన నిజపదంబు హరి కృప సేయునంత, దుర్గమ యోగ తంత్రంబునం జరించు వారికిఁ దత్త్వంబు బుద్ధి క్రమంబునంబొడము.

పరలోకమునందు నీ ఫలములేదు. పెక్కులేటికి ? భవాంబుధిఁ దరింపఁ
జేయు హరియ పరంబైన పరాయణంబు; శతసహస్రంబుగాఁ బల్కెద;
హరియే పరంబైన పరాయణము; మీరు నన్నస్త్రాదిఘాతంబుల
నొంపక జయించితివనుట విస్మయంబె? అణిమాదిసిద్ధు లీశ్వరస్మృతి
విఘ్నంబులు; విష్ణు సేవియైన జనునకు విముక్తియే సత్ఫలంబు.
తదంతరాయంబు లీ సర్వసిద్ధులు నని. 183

సీ. అపుడు యోగీశ్వరుండైన దయాబ్ధి ప్ర
హ్లాదుండు పలికిన నాత్మ నలరి
ధన్యతఁ గనిరి; కొందఱు దితిజేశ్వరు
కడకేగి భయమునఁ గంపమొంది
''యధిప నీ సుతుఁడు మా కందఱకును దత్త్వ
విద్య బోధించెఁ బ్రవీణుఁ డగుచు;
ధ్యానంబు, జ్ఞానంబు, హరిముక్తి యనియెడు
వచన మొక్కటియే కేవలము పల్కు;

తే.గీ. నతని సన్నిధి నుండ నెట్లగునొ యనుచు
నేగుదెంచితి'' మనిన సమిద్ధ రోష
చటుల ధూమ్రాక్షుఁడై నిశాచర విభుండు
గరము దెప్పించెఁ బాపసంగరముఁ బూని. 184

## హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని విష ప్రయోగాదులచే బాధించుట

క. సూద కదంబము రమ్మని,
సూదకభోజ్యాదులందు నొనరిచి, సుమన
స్సూదన మని గరళము మధు
సూదన సహితునకును భక్తి శూన్యత నొసఁగెన్. 185

ఆ.వె. అపుడు వాసుదేవుఁ డతి భక్తి నెప్పటి
యట్ల తన్ను దితి సుతాగ్రయాయి
యాత్మఁ దలఁప గరళము జ్ఞాతదత్త మ
జ్ఞాత జీర్ణమై యెసంగఁజేసె. 186

ఆ.వె. గరముఁ బ్రమింగి నిర్వికారుఁడై యుండు ప్ర
హ్లాదుఁ జూచి దైత్యుఁ డతివికార
మందెఁ; దథ్య మరయ నది తనకే విష
మై తనర్చె నప్పు డద్భుతముగ. 187

సీ. కనలి ప్రహ్లాద రక్షకుఁడైన దేవుని
నెఱుఁగక యంత దైత్యేంద్రుఁడదరి
క్రోధాంధుఁడై యతిక్రూరత నిజపురో
హితు నిరీక్షించి మహేర్ష్య తోడ
"నతి మూఢులార! ఖరాసిచే వీని ఖం
డించ వారించి మద్వంశనంబు
చేసితిరిఁక మిమ్ము శిక్షించి పిదప నీ
కుల నాశకునిఁ బట్టి కూల్తు" ననినఁ

తే.గీ. దద్ద్విజులు వాని సాహసోద్ధతి యెఱింగి
స్వామి ! కావింతు మే మభిచార కర్మ;
మందున హుతాశనుఁడు తృప్తినొంది దుష్ట
కృత్యఁగృత్తి వినిర్మించుఁ గిల్బిషమున. 188

క. తంత్రముల వెలయు నస్మ
న్మంత్రంబుల శక్తి చూడు మనుజాశన ! యా
హంత్రము మీఁద బిడాలము
సంత్రానము లేక యురుకు చందముఁ జూపున్. 189

వ. అని ప్రహ్లాదుని నేకాంతంబునం దోడుకొని చని యిట్లనిరి. 190

సీ. రాజకుమార ! సర్వజ్ఞ ! మహాభాగ !
నీ బల సంపత్తి నేఁడు గాన
వచ్చె; శస్త్రేచ్ఛ పావక నాగ విషముఖ్య
ములచేత బ్రతికితి; మూర్ఖుఁడైన
దైత్యేంద్రుఁ దంప నుద్ధత శక్తి నీ ధైర్య
మణఁగింపఁ బూనియు, హరి పదాబ్జ
సేవకు నిన్ను హింసింప నుపేక్షించి
హితము చెప్పెదము సమిద్ధ బుద్ధి

తే.గీ. నిందిరేశ స్తవంబు సహింపఁ దసుర
వరుఁడు; నీవును వద లవవ్వాసుదేవు;
నతని సద్భక్తి మెఱసి నీ యంతరంగ
మునఁ జరించుట నీతియై పొడమె మాకు. 191

వ. అసురవర్యులు నిజప్రయత్నంబున నిన్ను వధింపలేరు; వైష్ణవుండ వన్యవధ్యుం; డన్యులచే మేము ప్రేరేపింపంబడితిమి. సూక్ష్మబుద్ధియైన మీ తండ్రి మా బలం బెఱుంగు; నతండు నియోగింప వచ్చి నిన్ను పేక్షింప శక్తులముగాము; గుణరహితులమైన మాచేత నీవు వధ్యుండవగుదువు; పరాధీనులము; నీకు జీవనోపాయం బొక్కటి గలదు; హరి నుతింపక రాజును నుతింపుము; హరిని మానసంబుననే పూజింపుము; మానసపూజ శ్రేయస్సాధనము; నీవు క్రోధంబు నొందకున్న నొక హితంబు చెప్పెదము; సత్కుల ప్రసూతుండవు, రాజాధిరాజాత్మజుండవు, వజ్రదేహుండవు, యౌవన సంపన్నుండవు, రాజలక్షణ లక్షితుండవు, ఆలంబనం బితృద్వేషియగు హరియందు భక్తి వలవ'' దనిన దుర్జాతి బృంహితంబులైన విప్రవాక్యంబులు విని "యహో! మాయ'' యని పల్కి క్షణంబు తలయూచి విస్మయా నిమేషేక్షణుండై కించిద్విక్రోధ్నతాననుండై ద్విజులం జూచి ప్రహ్లాదుండు "హరి పూజనంబునకుఁ గాలం బకాలంబు చూతురే? సాధువేదాంత సిద్ధాంత నిరూపితంబగునది యెయ్యది యదియకాలం; బీరీతిమాటికిం బలుకం జగదు; మీరు గురు వర్యులు; సుఖకరంబుగఁ బలుకుండు; మహైశ్వర్య మత్తులైన యజ్ఞులకు నిట్లంబలుకందగు; వేదవేదులైన విప్రులకు మీకు నెట్లు నోరాడెడు: తథ్యము పలికెద మని ప్రతినచేసి శిష్యవత్సలురైన గురులచే నకాలంబున విష్ణుభక్తి వదలుమని పలుకవలసె; భవదావాగ్ని తప్తుండై విష్ణు ప్రహాదసమాశ్రయంబుఁ జేసిన జనునకు నెయ్యది కాలము? తాపత్రయానలజ్వాలాజ్వలితమైన దేహమందిరంబు విష్ణు భక్తిరసంబున శాంతిఁ బొందింప వలయుంగాక, కాలం బెవ్వ డీక్షించు? యజ్ఞకాల, దానకాల, జపకాలంబులు గలవుగాక! సర్వేశ భజనంబునకుఁ గాలంబు కలదే? యాజన్మ మరణ పర్యంతంబు విష్ణు భజనంబు సేయుచు మహానుభావులు క్షణము విఘ్నంబైన దుఃఖింతురు; దగగొన్న పశువు పానంబు సేయుచు నంతరంబు వడనీని యట్లనే విష్ణు భజనంబు గావింపుచు భవక్లేశంబు నొందు ప్రపన్నులు వర్తింపుదురు; మఱియు 192

క. పలుకులఁ బొగడుచు, మనమునఁ
దలపుచుఁ, బడి మ్రొక్కుచున్, ముదంబందఁగఁ గ
న్నుల బాష్పంబులు గ్రమ్మఁగఁ
గల యాయువు హరికి నిచ్చి కాంతురు ధీరుల్. 193

తే.గీ. అన్యభయమున సర్వేశు నఖిల వరదు
నెట్లు వినుతింప కుండుదు; నితఁడు దక్క
జనుల నెవ్వఁడు శాసించు ? సర్వమునకు
నతఁడు శాసిత విప్రకులాఢ్యులార ! 194

ఉ. ఇంతియ కాదు ప్రాణభయమేర్పడ మానవుఁ డబ్ధి కన్యకా
కాంతు నుతింపఁగాఁ దగు; నకారణ బంధుఁడు దాత, దైవ, మ
త్యంతహితుండు, తండ్రి, పరమాత్మ గుణాఢ్యులఁ బ్రోచు, దుష్టులన్
బంతముతో హరించుననపాయ మహోన్నత పుణ్యశీలుఁడై. 195

తే.గీ. అతని సంకీర్తనం బతి స్వల్పఫలము,
తెగువతో విడు మంటివి; తగునె నీకు ?
దత్ఫలం బింతయనుచుఁ గీర్తనము సేయఁ
గలఁడె శంకరుఁ ? డది వినఁగలఁడె ధాత ? 196

క. మా తండ్రి యిప్పుడలుగన్
హేతువు మఱి యెక్కడిది ? రమేశ్వర కథనం
బీ తఱిఁ బలుకుము మేఘము
చాతక మాశించునట్లు చయ్యనఁ గంటిన్. 197

తే.గీ. భవదభిప్రాయమిది యార్తిఁ బడినవేళ
హరి భజించు మనుట దురాశాంతరంబు
లివిసకల జంతువులు వెలయింప బ్రతుకు
నిత్యమే ? యెన్నఁడే మౌనొ నిర్ణయింప. 198

మ. ధరనత్యంత సుదుర్లభం బగు నరత్వంబందియున్ మూఢుఁడై
దురభిప్రాయ తఁదాడి యెక్కికరముల్ దూలన్ ధరంబడ్డ య
ట్లురుశక్తిన్ సుఖియై మురారి మదిలో యోజింపఁగాలేఁడు; దు
స్తర రోగాతురుఁడై భజింపఁగలఁడే తద్దుఃఖ జాడ్యంబులన్ ? 199

క. ఆతురుఁడనై యొనర్చెద
నాతతమై, మెఱయ శ్రేయమందెద నని యీ
బూతైన యాశ లన్నియు
యాతనలకుఁ ద్రోవలందు రార్యోత్తంసుల్. 200

క. అతియుక్తి గురుఁడు చెప్పిన
హితమగు నది సేయవలయు నియతమునున్ సా
ధుతరుఁడు; హితేతరంబుల
సతత గురు ప్రియములైన జడుఁ డొనరించున్. 201

వ. అటుగాన గురూక్తమైన విష్ణు భజన పరిత్యాగంబు సేయ నొల్లనని పలికిన దైత్య యాజ్ఞికులైన మాంత్రికులు రోషించి పావకోదితకృత్తిచే హత్య చేసెదమని భర్జించినఁ బ్రహ్లాదుం డిట్లనియె. 202

మ. తగదాస్థానమునందు జేయ నురు మంత్రస్తోమ విక్షోభ; మి
పగ గావించుట మీకు ధర్మమె? నిజవ్యాపాదనా శక్తికృ
త్తి గుణింపం బనియేమి; లేవె యితరాధిక్యంబు లెన్నేని? హె
చ్చుగ నాయుఃపరిపూర్తి గల్గునెడ నెచ్చోనుండు నీకృత్తియున్. 203

శా. కాలాత్మాభిహితుం గలంచి యణఁగంగాఁ జేయు కృత్యాదికా
ఖిలక్రూర గ్రహంబు లీలగను గన్పింపంగ నాకృత్తి యా
కాలోత్తాల మహానలంబు త్రుటియై కాన్పించు నిద్ధాత్రిలో
నేలా కారణమున్నఁ దప్పునె ఫలం బింతే వితర్కించినన్. 204

వ. ఇట్లను నప్పుడు. 205

## దానవ పురోహితులు ప్రహ్లాదునిపైఁ గృత్తిం బ్రయోగించుట

శా. క్రోధగ్రస్త వివేకులై ద్విజులు దుష్కర్మాత్ములై మంత్రగ
ర్వాధిక్యంబునఁ బొంగుచున్ హవనముద్యద్భక్తిఁ గావింప దు
స్సాధస్ఫారతరస్ఫులింగములలో సక్రోధమై కృత్తిసం
బాధాటోపముతోడ నార్చుచు వడిన్ బ్రహ్లాదు ధట్టింపుచున్. 206

వ. అప్పుడు సకల భువనంబులు గ్రక్కదల నార్చుచు శూలంబుఁ ద్రిప్పి ప్రహ్లాదుని నాటించినఁ దజ్జ్వాలాస్ఫూర్తి హరి భక్తి రసాంబుధియైన యతని వలన శమియించె; వహ్నిం గలసిన యుల్మకంబుల చొప్పున నేర్పడక జీవుండు బ్రహ్మంబుబలెఁ గలిసియుండెనంత. 207

తే.గీ. విష్ణు తేజోమయుండగు విభునియందు
నగ్ని తేజోమయంబైన యా త్రిశూల
మైక్యమందెఁ బరాత్మ జీవాత్మఁ గలసి
వెలుఁగా దోఁచకున్నట్లు విస్మయముగ. 208

ఆ.వె. సర్వభోజి విప్రజన్మంబు ధ్యానహీ
నుండొనర్చు జపము, దండిన వ్ర
తమునఁ జదువు వేదతతియును బోలెఁ ద్రి
శూల మఫలమయ్యె బాలునందు. 209

క. ప్రకట వివేక జ్ఞానా
ధికుఁడగు ప్రహ్లాదుఁ గృత్తి తెగనేయక యా
ప్రకృతి మహోత్తమ పురుషుని
నకలంకుని నెదురలేని యట్లన యుండెన్. 210

సీ. కేవల వ్యర్థమై కృత్తి శిలాహత
శిలవోలె నెగసి రోషించి క్రోధ
సన్నద్ధ లగుచు నా స్థానంబునందుఁ బ్ర
యోగంబుఁ జేసిఁ యత్యుగ్రులైన
ద్విజులపై నంగార దీధితుల్ గ్రమ్మంగ
హీన దక్షిణయజ్ఞ మెట్ల నట్ల
నపు డధోగతిఁ ద్రోయ, హస్తముల్ శిరమున
దాల్చి వస్త్రములు విదల్చుకొనుచు

తే.గీ. దాడి వార లఖండ రోదనముతోడఁ
గేలనసిఁ బూని త్రిప్పుచు బాలకుండు
తానె ఖండించుకొనిన చందమునఁ గావ
దిక్కులేక మ్మహాత్మ నుతించి మ్రొక్కి. 211

ఆ.వె. ''మాకు దిక్కులేదు; మా యపరాధంబు
గాఁచి మమ్ము నిట్టి కరుణనేలు;
కృత్తివచ్చె, నుగ్రకృతియయ్యె; నంతత
కృత్యభిజ్ఞ! నిలుపు సత్యమహిమ.'' 212

వ. అప్పుడు. 213

క. ఘనుఁ డాతఁడు పరదుఃఖము
తన దుఃఖమువలెఁ దలంచి దయఁబూని మనం
బునఁ గలఁగి దుర్వ్యథాకం
పనతనుఁడై యుండి శాంతభావముతోడన్. 214

క. మేరుసమ దుఃఖకోటు ల
పారంబుగఁ దన్నుఁ బొదువఁ బ్రాజ్ఞుఁడు మది ని
స్సారాన్యదుఃఖలేశము
దూరంబున వినినఁ గనిన దుఃఖించు దయన్. 215

క. ధరణీసుర పరిరక్షా
పరుఁడై ప్రహ్లాదుఁ డార్తబాంధవు, లక్ష్మీ
వరుఁ దలఁచి కావవే యని
శరణాగతుఁ డయ్యెఁ బరమ సంతోషమునన్. 216

శా. నే నిన్నాత్మఁ దలంచు పుణ్యమున నో నీరేజనేత్రా ! పురా
తన దుర్మంత్ర బలార్దితావని సురోత్తంసావలింగావు; మా
త్మ నిదేశంబున లోకముల్ సదసదుద్యత్కార్యముల్ సేయఁ బూ
నిన వారెన్నిక నట్టి లోకములకున్ నేఁ డున్నవే దోషముల్. 217

వ. అదిగాన ననీశ్వరులైన వీరిం గావుమని ప్రార్థించిన విష్ణు ప్రసాదం బునఁ దద్కృత్తి శాంతి నొందె; నంత బ్రాహ్మణులు దైత్యుకడ కేఁగి లజ్జావనత వదనులై యున్న రాజు ఖిన్నుండై పుత్రునిం బిలిచి హర్షిం చినట్లు "ప్రహ్లాదా ! నీవు శంబరుని కంటెను మాయ లెఱుంగుదువు; బ్రహ్మ బలోజ్ఝితయైన కృత్తిని గెలిచితివి; బ్రహ్మబలంబునకంటె మన యాసురబలంబే శ్రేష్ఠం బనిపించితివి; మదాత్మజత్వ మాత్రంబున నీకెంత బలంబుగల్గె? మదాచారంబున నడచితివేని బలవంతుఁడవయ్యెద; వీ వైష్ణవశక్తులకు నంతరంబు చూప నీయందు నీ మాయ లన్నియుం బ్రయోగించితి; బ్రాహ్మణు లందఱును వైష్ణవులే కాన శస్త్ర సర్పాగ్ని దిగ్దంతి విషకృత్త్యాదులచే సహజ బలంబు నష్టంబుగాదు. రాక్షసుల మన్నించు" మనఁ బ్రహ్లాదుండు నగి ప్రాంజలియై "యేల మోహంబు నొందించెదవు? మహాకుల ప్రసూతుండవు; శ్రీవిష్ణువు నెఱుంగవే? మద్భావంబు పరీక్షసేయ నిట్లు పలికితివి; మీ తాత విష్ణు నాభికమలం

బున జనించినవాఁడు; నీవెఱుంగక యున్న విష్ణు నెవ్వ రెఱుంగుదురు? విష్ణు ప్రభావంబునందు నీ కీ విశ్వాసముగల; దది పరీక్షింప సుత ప్రియుండవైన నీవు సర్పాదులఁ బ్రయోగించి నాకు భగవద్విశ్వాసంబు గల్పించితివి; నామీఁద దయగల్గఁగానే భగవంతుని విడువుమని నీవనిన కతన నాగ్రహంబు పుట్టెను; బాలుఁడు సేయు మనిన పనిసేయండు; అట్లు గాన నే బాలుండ; విష్ణువును విడువను; మోక్షంబు గోరఁగాఁ గృత్యాదులచే నవధ్యత్వ మాంతరీయక ఫలం బమృతమునకునై సముద్రము మథింపగాఁ బారిజాతాదికము దొరికినట్లు; గాననిట్లు మోక్షైక చిత్తులమై యత్నము సేయుచున్న మాకు దివ్యసిద్ధులు లభించెను; పుణ్యమువలనఁ బుణ్యఫలముగల; దందున నల్పులు సంతుష్టులగుదురు; మహామతి ముక్తియేకోరు; సురపతి యమృతముంబలె; నింక నిన్ని యననేల? నీవెంత చేసిననవి నన్ను నేమిచేసె? హరిస్మరణంబు గూడదని చలంబునం బల్కినవేమి! నీ మాట నీ మనంబునకు వచ్చునె? మనస్సునకు వచ్చిన మాటయే పల్కుండేని యాత్మచోరుండు; నీకు విష్ణువునెడఁ జలమాత్సర్యం బులయందు నేమియపరాధము? నీ స్వభావమది; చరాచర జగత్యంతః ప్రవర్తకుండై యచరుండైన విష్ణువు నవిద్యాంధు లెవ్వరు గెల్చెద! రనన్య మనస్కులై భజించిన వారు గెల్తురు; ఇంక నీకు నేమి విన్నవించెద'' ననిన మాటలు శిష్టుండు పతిత మందిరంబునం బోలెఁ జొరవయ్యె; నప్పుడు 218

## హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని మందిరాగ్రమునుండి త్రోయించుట

సీ. అసురనాయకుఁడు క్రోధావేశ విస్మృతా
ర్వాక్తనశ్రముని, తద్వైష్ణవా వ
తంసు, నవధ్యుఁగాఁదలఁచి క్లేశము నంది,
జంకి, నిజాస్థానచయ మహోచ్చ
చిత్ర నత్ప్రాసాద శృంగంబు మీఁదట
నుంచి, యాతనిఁబడ నుగ్రశక్తిఁ
ద్రోయింప నవ్వేళఁ ద్రోయజనయనుండె
తానని యాత్మ నెంతయును నిలిపి

తే.గీ. యవ్యయానందమయుఁడై నిజాత్మ యెఱుఁగ
కధివసింపంగ నపుఁ డమ్మహాత్ముఁ దెలిసి
సర్వగుఁడు వాయుదేవుండు సంభ్రమమున
మెల్ల మెల్లనె చేర్చె భూమీ తలంబు. 219

క. స్పర్శనుఁడు తత్తనూసం
స్పర్శనమున నతి పవిత్ర భావైకపరా
మర్శనమును, దద్వైభవ
దర్శనమును గల్గెననుచు ధన్యత వెలిఁగెన్. 220

మ. ........................................
........................................
భజన ప్రత్యుపకారసిద్ధి మెఱయన్ క్ష్మాకాంత తద్విష్ణు దా
సజనాగ్రేసరుఁ బూనె దన్మహిమలెంచన్ నాకు లీక్షింపఁగన్. 221

వ. అప్పు డద్ధరణీదేవి యిట్లనియె. 222

మ. [అతి మూఢుండయి తండ్రి సౌధశిఖరం బందుండి త్రోయింప దుః
స్థితుఁడౌ నిన్ను] స్పృశింప నిన్ను నొడువన్ సేవింపఁ బూజింప వ
చ్చితి; నిన్నున్, నను బూను[నట్టి] హరి సాన్నిధ్యంబునన్ నిల్చి నే
ధృతిమై నిన్ను భరింప నోపుదునె యీతేజం[బు సామాన్యమే]. 223

వ. ............................................లుగు
ఫలము; త్వాదృశ సంస్పర్శన మందుట దేహము గాంచిన ఫలము; భవాదృశనుతి జిహ్వాఫలమును; మౌన భావగతులు దుర్లభులు; నది సహ........................................
........................................
నేఁ బవిత్రనైతి; మున్ను యజ్ఞవరాహ సంగంబున నాకు దివ్యశక్తి గలిగె; నది నాకొక వింతయై యున్నయది; నిన్నంటినఁ బున రుద్బుద్ధమాయె; నందున సకల లోక........................
........................యందు నీవంటి పరమ భాగవతు లొండు రెండడుగులు పెట్టినంతనె సామర్థ్యంబు గలదు. 224

మ. అలఘు స్ఫూర్తులమిమ్ముఁ జక్రధర పూర్వార్చా కృతిశ్రేణులన్
మ.......................................
.......................రూపమున శశ్వత్కీర్తి శేషాంశమై
జలజాక్షుండు శిరంబుల న్నిలిపె భాస్వన్మూర్తి నన్నెప్పుడున్. 225

క. నరలోకంబు కృతార్థతఁ
బరగెన్ నీయున్న కతనఁ బావన! నిను నే
[భరియించి నీదు చరణా
బ్జ రజోలేశంబు సోఁకి పావితనైతిన్.] 226

వ. నీవు నరలోకంబున జనించిన కతన నంతకలోకంబు హ్రస్వంబు నొందె; ననంతలోకంబు వృద్ధి నొందె; భవత్కీర్తనాలోక నా ధూత పాతకులైన నరులు హరి లోకం[బునకుం బోయి నిన్ను సన్నుతింప వెన్నుండు నీ భక్తి తాత్పర్య విశేషంబు] వినియె; నిట్లు వృద్ధినొందె దని చింతించు నీవంటి పరమ భాగవతుల గుణంబులు పద్మజునకు నగమ్యంబులు; నేనెఱుంగనేర్తునే? మీ ప్రభావంబు భాగవ[త శిరోమణు లకుంగాక నన్యుల]కు గోచరమే! మూర్ఖ మూర్ఖుండైన మీ తండ్రి యచింత్య శక్తియైన నిన్నెఱుంగడు. నిన్నుఁ దలంచిన యంతనె యాపదలు దొలంగు.......................
.......................................
.......................................
బయ్యెనంతఁ బ్రహ్లాదుండు దయామృత దృష్టిం జల్లం జేసిన నందఱు సుఖంబు వహించిరి; శంబరాదులైన దుష్టదైత్యులు లజ్జావనత వదనులై లేచి చనిరి; యా శంబరుని, దైత్యరాజును నిందింపుచుఁ బురజను లార్తిం బాసియుండిరి. రాజును శంబరుండు నన్యోన్య దైన్యంబులం బరితపింపుచు నుండి రంత. 227

సీ. సంశోషకుండను శతదైత్యు నొక్కని
నసిలరూపంబైన యతనిఁ దలఁచి
ప్రహ్లాదు మడియింపఁ బఱపిన, వాఁడు త
త్తనువులో నడఁగఁ, దద్దైత్య భార్య

మొఱపెట్టుకొనుచు, నమోఘబిలోత్సాహ
సంపద వ్యర్థమై జడతనున్న
యా హిరణ్యకశిపు నంఘ్రులఁబడి "స్వామి!
యాత్మేశ్వరుండు ప్రహ్లాద తనువు

తే.గీ. నందు జీర్ణించిపోయెఁ, గాలాయసంబు
తప్తమై యున్నఁబడు నీరధారవోలె;
నేమి చిత్రంబొ కాని నేఁ డిమ్మహాత్ము
తనువులోపల పుంగ్రహోదయము దనరె". 228

వ. అనిన విని కలంగి నిజకులాంగారంబైన ప్రహ్లాదు నిట గురు గృహంబున కనిచి తాను నంతఃపురంబు సొచ్చి పరితపింపుచునున్న వృద్ధ మంత్రులు "తేజోధికుండైన ప్రహ్లాదునిం బ్రార్థించి, ప్రసన్నునిం జేసికొని, సామ్రాజ్యంబు లనుభవింపు మన నానన్న మృత్యుండు గాన వారిం దర్జించి మఱియు నొక కార్యంబు విచారించి. 229

## హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని నాగపాశబద్ధునిఁ జేసి సముద్రమునఁ ద్రోయించుట

శా. రక్షోవీరులచేత నద్భినహిరాడ్రజ్జుచ్ఛటాబంధ దు
ర్వ్యక్షేపం బొనరించి వైష్ణవమణిన్ వేగంబె త్రోయించినన్
సాక్షాత్సత్వగుణాంకురంబనఁగ నా చక్రాయుధ ధ్యాన ని
ష్ఠాక్షుణ్ణాత్మకుఁడైన యా ఘనుని వేడ్కన్ వేలకుం జేర్చినన్. 230

క. తను లవణాంబుధిఁ ద్రోయుట,
యనిమిష నక్రాది జలచరానీకంబుల్
మును మున్నె తొలగిపోవుట,
ఘనుఁ డసురకుమారుఁ డాత్మఁ గానకయుండెన్. 231

వ. అప్పుడు పన్నగశాయి యనుజ్ఞం బన్నగారి బంధనంబులు కబళించె, సముద్రుండు రత్నంబులు కానుకదెచ్చి సమాధినిష్ఠనున్న హరిప్రియుని సేవించి "స్వామీ! నన్నుఁ గటాక్షింపవే యేనదీనుండ; నీవు జనింప నీ రాక్షసకులంబు చంద్రునిచే నంబరంబు వోలె విమలంబయ్యె" ననం గన్నులు విచ్చి చూచిన మ్రొక్కి సముద్రుం డిట్లనియె. 232

తే. గీ. అసుర లహిపాశబంధ మగ్నాంగుఁ జేసి
నిన్ను నాలోన వైచిన నిర్మలాత్మ!
నిప్పు మ్రింగిన నరునట్లు నిన్ను నాదు
గర్భమున నుండి త్రోచితిఁగడకు నిపుడు 233

క. ఉరగవర పాశబంధము
లురగాహితుఁ డుక్కడంచె నుగ్రోద్ధతిమై;
హరిభక్తి పుణ్యసంపదఁ
బురుషులకు లభించవే యపూర్వయశంబుల్. 234

వ. అని రత్నంబులు సమర్పించి "హరిం బూజించి; హరిభక్తుల నుపేక్షించిన వారికిఁ బరమధామంబు దూరంబు; రత్నోపాయనంబులచే నీకుఁ గర్తవ్యం బెద్దియు లేదు భా..............................
*...................................................
దెరచుకొని ప్రసన్న వదనుండును: గమలాయతాక్షుండును, దీర్ఘబాహుండును, సుకపోల నాసికాభాగుండును, నుదారతేజోనిధియు నప్రమేయుండును, గదాసి శంఖాంబుజ శోభనాంగుండును, సుదృశ్యసీమాపర సేతుభూతుండును, సర్వేంద్రియాహ్లాదన దివ్యమూర్తియుఁ, ద్రిలోకీవితత ప్రతిమూలంబును, గురు పరమగురుండును, నాథనాథుండుమ నగు విభునిం జూచి విస్మయ భీతి హర్ష ప్రకంపంబులంది, యది స్వప్నంబుగాఁ దలఁచి స్వప్నంబునందేని యీశ్వర సాక్షాత్కారం బయ్యెడునని, ప్రహర్షార్ణవ మగ్నచేతస్కుండై మఱియు నానంద మూర్ఛం జెందిన, నీశ్వరుండు ధరణి యందుంజేర్చి యంకంబున నిడుకొని, సర్వజనైక బంధుండుగాన మెల్లనె కదల్చి కరపల్లవంబునన్ స్పృశించి, మాటికి, జననియుంబోలె నాలింగనం బొనర్చినఁ గొంతసేపునకుఁ ప్రహ్లాదుండు కన్నులు తెఱచి విస్మయానిమేషుండై జగన్నాథుం దప్పక చూచిన సుధామాధుర్యసారంబులైన వాక్కుల "వత్సా! భయంబు నొందకు" మని యూఱడించినఁ గృష్ణాంగస్పర్శ సౌరభ్య సురూప వచనామృతంబులచే నక్షగణంబు హృతంబైన యాత్మ సంభావనంబు నొందక నిజమనోభృంగంబు పరువెత్తె; శ్రీశభక్తాబ్జసంగియై యతి లుబ్ధంబైన; నే నెవ్వండ నెచటనున్న వాఁడ" నని

* ఇక్కడ ఒక పేజీ వచనము మఠ్కలో లేదు.

యెఱుంగక కన్నులు మూయుచుఁ దెఱచుచు నొక వింత సంతోషంబు వహించి, గోవింద దర్శనంబు సేయు నతని యవబోధంబు క్షణంబు గాన్పించుచు, క్షణంబతిరోధానంబు నొందుచు, సాభ్రవ్యోమేందు మండలంబుగతిఁ బ్రకాశించె; నంతం జూచి క్షణంబు చింతించి "యితని వాక్కునఁ బృథివియు నగ్నియు నితని ప్రాణంబున నంబరంబు నని లంబును, నితని చక్షువున రవియు దివియు, నితని శ్రోతంబున దిశలు శశియు, నితని మనంబున నంబువు, వరుణుండునుం దగుటఁ జూచి శ్రీమద్విభూతిం దనరు నితండు సర్వోపనిషదర్థంబు, మహాప్రభు" వని పునఃపారవశ్యంబుగాంచి తెలిసి శ్రీశాంకశాయియైన తన్నుం దడవుటకు నెఱింగి భయ సంభ్రమంబుల లేచి ప్రసన్నుండవు కమ్మని మ్రొక్కి బహుయజ్ఞుండై యల్పపూజోక్తి నాచరింపండయ్యె; నప్పుడుగదా పద్మాసి శంఖధారి యభయహస్తం బిచ్చి చేపట్టె; స్పర్శసుఖైదితంబైన భుజంబున నిడికొనినఁ గరాబ్జస్పర్శనాహ్లాదగళదశ్రుండై కంపంబు నొంద మఱియు నిట్లనియె. 235

## విష్ణువు ప్రత్యక్షమై ప్రహ్లాదు ననునయించుట

చ. "గురుతరమూర్తి నంచు" ననుఁగూర్చి భయంబును సంభ్రమంబు వే
మరుఁ దగదీకు నిట్టిది సమస్తము నాకు ప్రియంబుగాదు మ
త్పరమహితంబు సేయుట యభవ్యము సేవ్యముఁ, బూర్ణకామ్యతం
బరగిన నాయెడ న్నిలిచి పల్కిన పల్కులు నాకు హృద్యముల్. 236

తే.గీ: సతత ముక్తుండనయ్యుఁ బ్రసన్న భక్త,
భక్తి సుస్నేహరజ్జు ప్రబద్ధ బుద్ధి
నైతి; నజితుండనయ్యు జితాత్మనైతి;
వశ్యకృత్యుండనైతి నవశ్య మహిమ. 237

తే.గీ. త్యక్త బంధు ధన స్నేహతంతుఁ డగుచు
నెమ్మి నాయందు సద్భక్తి నిలుపవలయు;
నతఁడు నాకును మరియు నే నాతనికిని
గాన మా కెవ్వరు నిజాప్త ఘనులులేరు. 238

వ. నిత్యుండును బూర్ణకాముండును నగు నాకు జన్మంబులు వివిధంబులు గలవు; సర్వేష్టదానంబు లొనంగుదు; నీకు నెయ్యది ప్రియంబది తెలుపు

"మనినఁ బ్రహ్లాదుండు ప్రాంజలియై యుత్ఫుల్ల దృష్టిచేఁ జతుర్భుజుం జూచి" భవత్పదార విందంబులు చూచుకంటె నాకు మరియు నొక వాంఛ గలదె? బ్రహ్మాది దుర్లభంబైన యుష్మత్పదాంభోజ దర్శ నామృతంబున మచ్చిత్తంబు తృప్తింబొందదు; మరియు నొకటి గల్గెనేని ప్రార్థించెదఁ; గల్పాయుత శీతంబులనైన యుష్మత్సాక్షాత్కారాహ్లాద సముద్ర తరంగంబుల నోలలాడు నాకు నితర సుఖంబులు రుచియిం పవుగాన నేనితరంబులు వేడనొల్ల; నని విన్నవించిన సుధారసప్రవా హంబులగు వచనంబుల మోక్షలక్ష్మీ సామ్రాజ్యంబునందుఁ బట్టంబు గట్టి భగవంతుం డిట్లనియె. 239

తే.గీ. నీవు పల్కిన యట్లనే నిజము నాకుఁ
ప్రియముగా నొక్క వరము సంప్రీతి నడుగు;
మఖిల లోకంబులందు నీ యట్టి ధీర
చిత్తుఁడెవ్వఁడు గలఁడు చర్చించి చూడ. 240

వ. అనఁ బ్రహ్లాదుం డిట్లనియె. 241

క. ఉరగేంద్ర వేత్ర నాయక
గరుడాదులలోన నొకనిఁ గానను దేవా!
కరుణించుము, నీ దాసుఁడ
శరణాగతవత్సలా! ప్రసన్నాత్మ! హరీ!. 242

వ. అనిన నీశ్వరుం డిట్లనియె; "నీకు సంకటంబు ప్రాపించిన యది; యేను నిన్ను నిర్వహింపం జనుదెంచినవాఁడ; నీవు భృత్యత్వంబు వేడితివి; నీవె నేఁగాఁ దలంచియున్నచో నిది యుచితంబె? వేరుగాఁ జూచుట యెందులకు నేనె యెఱుంగుదు; నీవు గోరిన యది మద్భక్తి; నీకుం గోరందగిన యదిగాదు. నీకు స్థిరంబైన యదియె; మరియు వరం బులు వేఁడుమని యనుగ్రహించినఁ బ్రహాదుం డిట్లనియె. 243

తే.గీ. నాథ! భవదీయ పదభక్తి నాకు నిచ్చి
నాడఁవో యియ్యవో నీవు! వేఁడికొనిన;
నట్టి సద్భక్తి దొరకిన నదియె నాకుఁ
గామ గవి; యన్యవరకాంక్ష ఘనతరంబె? 244

తే. గీ. పరమ సద్భక్తియే నాకుఁ బ్రాప్యమనఘ!
యదియ మరియును మఱియు నాయాత్మయందుఁ
బొడమె; నెపుడుఁ జతుర్వర్గమును లభింపఁ
జేయుఁ జిత్రంబుగాదె చర్చించి చూడ. 245

వ. కావున నేఁ బరమ భక్తిం గోరుచున్నవాఁడ; భక్తిమంతుండె యధికుండు మహాభయముక్తుండైన మాత్రంబున నా భక్తి యెంత యాధిక్యంబు! నీయందు హాస్యానాదర మాయలచేతనేని నిలిపిన భక్తి నరులకు నింద్ర పదంబు లభింపంజేయు; సాత్త్వికభక్తియయ్యేనేని యేమి చెప్ప? భవ ప్రేరిత భక్తి, భవఘోరాబ్ధిని మునుంగు వారికి నుత్తారణరజ్జువు, మాయా తమశ్ఛన్న బ్రహ్మానంద మహానిధి చూడంగోరిన వారికి యుష్మద్భక్తియే సిద్ధదీపిక; భవశర్వరియందు జ్ఞానదీపంబు మల్చుకొని నిద్రించువారికి యుష్మద్భక్తియ సూర్యదీప్తి; సకలేష్టంబులకు జన్మ భూమి; యనిష్టంబులకు వహ్నిశిఖ; మోక్షలక్ష్మికిం బ్రియసఖి; నీవు దయసేయక దుర్లభంబు; నాథ! యుష్మద్భక్తి సాత్త్వికియై స్థిరయై నిల్చుంగాత! నిన్ను నుతింతు, నర్తింతు, హర్షింతు'' ననిన భగవం తుండు ప్రియోక్తుల నిట్లనియె. 246

సీ. ''ప్రియవత్స! నీకు నభీష్ట మెయ్యదియది
ప్రాపించు; సుఖమున బ్రతుకుమింక;
నంతర్హితుండనై యరిగిన ఖేదంబు
నొందకు; క్షీరాబ్ధి నున్నయట్లు
నీ హృదయంబున నిల్తు; లక్ష్మికి నాకు
భక్తహృదయమె శోభన గృహంబు;
వైకుంఠదుగ్ధాబ్ధి వాసవర్ణన నిత్య
శోభయె తెలియ; రక్షోభయములు

తే. గీ. తలఁగఁజేయుదు దారుణ తనువుగాన
మందిరము నిలుపుకొనఁగమనుజ సింహ
మూర్తిననుఁ జూచెదవు; భక్తి మూఁడు దివస
ములకు ననియేఁగె విస్మయమున భజింప. 247

క. అంతట నానందాశ్రుదృ
గంతంబులఁ గంపమంది హరిఁగానక దు
శ్చింతం బొరలుచు ఖేదా
నంతరమున ధైర్యలక్ష్మియందె న్వెగన్. 248

క. హరిసంస్పర్శన వీక్షణ
పరిపూత శరీరుఁడైన ప్రహ్లాదుఁ గరాం
తరములఁ జూడగ వచ్చిన
కరణి దివాకరుఁడు దయనగంబున నిల్చెన్. 249

క. గిరినుదయించిన యంతనె
హరియించె దిశాతమంబు లర్కుఁడు సర్వే
శ్వర భక్తిచేత నుత్కట
దురితములు జగంబులోనఁ దొలగించు గతిన్. 250

క. తరణిఘట జన్ముఁడును దు
స్తర తిమిరాంబోధి గ్రోలఁ దత్తత్సుజనాం
తర తీర్థ నిర్మలత్వము
స్ఫురితంబయ్యెం దిగంతములహో! యనఁగన్. 251

ఆ. సారసాప్తుఁజూచి చక్రవాక ఖగంబు
హర్షమందె; నాపరాత్ముఁ గాంచి
యోగివరుఁడు మోదమందిన కైవడి
నంతరంగమునఁ బ్రియంబుఁదోఁప. 252

ఆ. అర్కుఁడా జలాశయంబులఁ బ్రతిబింబ
మంది పెక్కు మూర్తులయ్యె; క్షేత్ర
ములన నార్ద్ర శీలములునుగా మెఱయ స
ద్గుణత వహించి తనరునట్లు. 253

క. నలినములు సజ్జనుల వలె
జలజాప్త పరేశమూర్తి సంపద వెలసెన్
కలఁగె న్నీలాబ్జంబులు
జలజాక్షుని కథలఁ దామస జనంబు వలెన్. 254

వ. అంతఁ బ్రతిబుద్ధజనస్వనంబు చెవులు సోఁకిన మేల్కని నిజపురంబు నకుంజని హరిస్మృతి బలంబున నన్ని దిక్కులు హరిగానే వితర్కిం చుచు, నడుగడుగునఁ దొట్రువడుచు, హర్షింపుచు నగ్రంబున హరి నీక్షించిన యట్లు జయజయ స్వనంబులు పలుకుచు, హరిఁ జూడక యార్తినొందుచుఁ జరించె; సోత్కంఠుండై నాటనుండి శ్రీ శహ్యాతాంత

రంగుండై లోకజాడ్యహతుఁడై యలౌకికుండై జడునట్లు దురితంబు లడంచుచు మంగళంబుల రమ్మని పిలుచుచు ననంత నామంబులు, గానంబు సేయుచు, నచ్చటనాడుచు, "శ్రీ గోవింద! కేశవ! ముకుంద! శ్రీవల్లభ ! శ్రీనాథ ! శ్రీవైకుంఠ ! సుకంఠ ! కుంఠితఖల ! స్వామి ! యకుంఠోదయ ! శుద్ధధ్యేయ ! విధూతధూర్త ! ధవళశ్రీక ! మాధవ ! యధోక్షజ ! శ్రద్ధాబద్ధ ! నీయందు నాకు బుద్ధి జనింపఁజేయవె, యచ్యుతగుణా ! అచ్యుతకశేశ ! సకలేశ ! శ్రీధర ! ధరాధర ! విబుధ జనబుద్ధ ! యాదరణచారణ ! వినీలఘననీల ! శ్రీధర ! గుణాకర ! సుభద్ర బలభద్రకర్ణ సుఖవర్ణన ! సుఖార్ణవ ! మురారి ! స్వర్ణరుచిరాంబర! సుపర్ణరథ! యర్ణవనికేతన! భవార్ణవ భవభయంబు మాన్పవే! గుణగణార్ణవ ! నమస్తే ! యని పాడుచుఁ దదప్రాప్తి గాఢదుఃఖాశ్రు గద్గదుండై పొరలుచు, మొఱలిడుచు, విస్మితజనులు తనుంజుట్టుకొని నరకపతిత జనులకు భవచ్చరణ స్మరణంబు శరణంబు; భవవైతరణి పతితుండనై దీనుండనగు నన్ను నేల నిరీక్షింపవు ? నీయందు భక్తిఁ బుట్టింపుచు, నీవె భవాబ్ధిమునుంగనీక రక్షింపవే ! క్లేశంబు నొందితి దయాపరమూర్తీ ! నీకు దయగల్గదేని కర్మవశాహతుండనౌదు. కామ క్రోధమదాద్య మిత్రనివహ ప్రోత్సారితోన్మాద విశ్రాంత కుపితధృతి హర దుర్నిగ్రహాదూర ఘోరైకాదశేంద్రియ ఖలనంబులచే నార్జితంబైన కర్మంబు, శిశువనై యొక్కరుండ ననుభవించుచున్నవాఁడ; నీకు దయ లేకున్ననే నెట్లు గడతేరుదు ; మానంబు శిరంబుపై పాషాణంబు; మాత్సర్యంబు వలద్గరళజ్వాలామాలిక; క్రోధంబు కంటిలో నెరుసు; భవనామకాంతారంబునందు మనోజవటుండు బుద్ధ్యాఖ్యయష్టిహరించె; ముక్తిసరణియెట్లు తరించెద"నని ప్రహ్లాదుండు పలుకవిని యద్భుత వైరాగ్యంబునకుం గొందఱశ్రువులు విడిచిరి; కొందఱు మ్రొక్కిరి. లీలచేఁ గొందఱు హాస్యంబు చేసిరి; కొందఱు భక్తింగాంచిరి; కొందఱు విస్మయంబు నొందిరి; కొందఱు మూఁకలు మూఁకలై చూచుచు దురితంబులం దొలంగిరి; గోవింద కీర్తనానంద నిర్భరుండై కీరన నర్తన గానంబుల జనులపై స్పృహలేక తిరిగె; అర్కుండు లోకతమోభేదార్థంబు దిరిగినట్లు సంచరించె; నప్పుడు సముద్ర ముద్రామగ్నాయాతుండైన యాప్రహ్లాదుం జూచి జనులు విస్మయం బందిరి; దైత్య

పతికి వార్తవైచిన వారలె విన్నవించిన నతండు విస్మయంబంది మృత్యు వుంబోలె రావించిన వచ్చి, సభయందు నాసన్న మృత్యుండైన వాని; నాయుర్జలధి వలన దేహపర్యవతారణంబునకుఁ గృతోద్యోగుండై యమ వీక్షణంబునకు యవనికామాత్రంబైన వాని నీలాంశుమిశ్ర మాణిక్య ద్యుతిచ్ఛన్నుండైనవాని, ధూమాగ్ని శిఖావ్యాప్తుండైనవాని, మలినాంగ ద్యుతిధ్వాంతచ్ఛాదితా భరణచ్ఛవియైన వాని, విష్ణు నిందాజాత మూర్తాఘగ్రస్యమాన లక్ష్మీకుండైన వాని, దంష్ట్రోత్కట ఘోరఘోషణ ఘనచ్ఛవి కుమార్గదర్శి యమదూత నిభులైన భటులతోఁ గూడినవాని, దవస్పృష్ట దవనాంతస్థకింశు కారుండైన వానింజూచి, ఖిన్నుండైన వాని దూరంబునం బ్రాంజలియై పీఠంబుననుండి క్రుద్ధుండైనవానిం జూచి తలవంచుకొనిన, దైత్యుండు భర్జించి "మూఢ! మద్వాక్యంబు విను మింక నిన్ను నెద్దియుం బలుక" నని చంద్రహాసం బంకించి సభాజనంబు కంపంబు నొంద "హరిని విడిచెదవో! యసింద్రెవ్వఁ జేయుదునో!" యని పల్కు మూర్ఖుని క్రోధంబు చూచి రక్షోగణంబు నేఁడు ప్రహ్లాదుండు హతుండు నయ్యెడునని పల్కు సమయం బున హిరణ్యకశిపుండు క్రోధారుణిత నేత్రుండై కుమారునిం జూచి యిట్లనియె. 255

తే.గీ. "ఎచట వెదకియు నేఁగాన నిన్నినాళ్లు;
నధికుఁ డంటి, నిరాకారుఁడైన వాని
సర్వగతుఁడంటి, త్రిభువనస్వామి యంటి,
వెందుఁ జూపెదు హరిఁ జూపు మింక మూర్ఖ!" 256

వ. అని "స్తంభంబునం జూపు" మని ఖడ్గంబున స్తంభంబుం దాటించిన. 257

## నృసింహావిర్భావము

సీ. పట పటత్కటు సముద్భట పటుధ్వని విశీ
ర్యద్ఘన స్థూణా సభాంతరంబు
చట చటన్నట దుగ్రచటులరంగ స్ఫులిం
గాచ్ఛాద్యమాన గృహాంగణంబు

తట తట స్ఫురదురోదైతేయ శలభసం
ఘాతప్రతాప నిర్భర తరంబు
కట కట దంష్ట్రాగ్ర ఘట్టిత కహకహో
త్తర్జనగర్జాతి దుర్జయంబు

తే.గీ. భూరిభూషణ తీవ్రదంభోళి ఘోర
సార వారుసటాచ్ఛటా సంకులంబు
సంభ్రమా దభ్రధరణీ తలాభ్రతలము
వీరనరసింహ రూప మావిర్భవించె. 258

మ. అతి ఘోరార్భటి నా నృసింహుఁడు సహస్రాత్యుగ్ర బాహావళీ
శతకోటి స్ఫుటతీవ్రదీప్త నఖరచ్ఛాయల్ విజృంభింపఁ ద
ద్దితిజుంబట్టి నిజాంకమధ్యమున నెంతే నిల్పి చీరెన్ మహా
ద్భుతభీభత్సము లొప్పనప్పుడు ప్రదీప్తోరాంతరాళంబునన్. 259

వ. ఇట్లు తద్ఘోర నృసింహరూపంబు నున్నయెడ బ్రహ్మ రుద్ర దిక్పాలాది సమస్త దేవతలు ముందర నిందిర నిడుకొని వచ్చి దగ్గరఁజేరన్ వెఱచి ప్రాంతంబున నున్న ప్రహ్లాదుం దగ్గరం బిలిచి నిన్నుఁ గటాక్షింప వచ్చిన భగవంతునిం బ్రసన్నుంగాఁ జేయుమనఁ బ్రహ్లాదుండు వికసిత వదనుండై జనకుని కడ కేఁగు బాలకుని చందంబున నిర్భీకుండై వచ్చినం గౌఁగిటం జేర్చి శిరంబు మూర్కొని నాకతంబున నింత యలసితివిగా యని యుపలాలింపు చున్నప్పుడు. 260

సీ. కెందమ్మి రేకులఁ జిందించు కన్నులు
కరుణారసంబు పొంకంబు నెఱపఁ
జారు వజ్రాంకురచ్ఛటలైన సటలురు
దివ్యకిరీటమై తేజరిల్లు
నాంత్రమాలిక లచ్ఛహార వల్లికలట్లు
విమల వక్షోవిభాగమున మెఱయఁ
దద్వినూతనరక్తధారలు పైఁజింది
రక్తచందన చర్చరంగు చూప

తే. గీ. జలధి కన్యాకుచోపరిస్ఫార సార
ఖాసురోదార కుంకుమ పత్రభంగ
ఖరనఖరకాంతులెనయ నుగ్రతరమనుజ
సింహుఁ డప్పుడు లక్ష్మీనృసింహుఁ డయ్యె. 261

వ. అంతఁ బ్రహ్లాదుండు తన తండ్రి భగవంతునిచే ముక్తుండయ్యెనని హర్షించి ప్రణమిల్లి యతని గాత్రంబున నరసురాసురాదులను, శిరంబున బ్రహ్మాండోపరిభాగంబును, గన్నుల లయార్కపావకుల, నాస్యబిలంబునఁ బాతాళంబును, దంష్ట్రలశేషాదులను, భుజద్రుమస్కంధంబుల బ్రహ్మరుద్రులను దిగీశ్వరులను, హృదయంబున నంబరంబును నంబరంబున విద్యుద్విలాసంబును నంఘ్రుల భూమియుం, దేహద్రవంబున వారిధులు రోమంబుల వనంబులు, శల్యంబుల నదిసంఘంబులు, నభేద్య మాయాచర్మంబున సర్వగాత్రంబుల దేజంబును గాంచి భక్తులకు నీశ్వరుం డప్రకాశుండుగాడు గావునఁ జూచి పరమానందంబు నొందె; నంత దివిజులు మఱియు బ్రహ్మరుద్రాదులు సమ్మతించి రప్పుడు. 262

## దండకము

శ్రీమన్మహాదేవతా సార్వభౌమా! హరీ! సర్వమౌనీంద్ర సందోహ సంకల్పితానేక యజ్ఞక్రియాసాధనా! స్తోత్రపాత్రా! ఖరోద్యన్నఖోత్కృత్తదైతేయ! చంచద్దయాదృక్తరంగా! ప్రసన్నాంతరంగా! మహావీరదుర్వార రక్షోగ్రణీ దుస్తిరస్కారభీతాత్మధా మచ్యుతానేక యజ్ఞక్రియాదూర! పద్మాసనాద్యాతి తేయాప న్నార్థా ప్రసిద్ధానుకంపా! ప్రకాశీకృతోచ్చండ దీవ్యన్నృసింహావతారాగ్ర సారధ్వనీ భిన్న ఘోరాభ్రతారా! నిజాంగ ప్రవిచ్ఛేదభీతి ద్రవద్ఘోర రక్షోగ హేద్ఘోష భేరీరవాధః క్రియాసారమై, క్షోణిభృత్పక్షవిచ్ఛేద కాలస్ఫురద్ఘట్టనోదగ్ర దంభోళి దుర్ఘోరమై, భీమకల్పాంత ధారాధరోత్తర్జితోర్జత్స్ఫురచ్చండగర్జానుకారంబునై యున్న నీ గరదుర్జేయమో తండ్రి! భక్తావళీనిర్జితా! పాపసంవర్జితా! యోగిలోకార్జితా! వార్ధికన్యాకుచాలింగనోల్లగ్నసత్కుంకుమాంకచ్ఛటానేక శంకాకరోనంక శోణోపల శ్రీసమావిద్ధపూర్ణేందుబింబ స్ఫురద్వృత్త సంస్థూల పాండూరు ముక్తామణీ దివ్య

హారా(!) లసద్దివ్యహారానిబద్ధ త్రిలోకైకభారా ! సమారబ్ధ దైత్య ప్రహారా ! భవాఘౌఘలీలాపహారా ! సముద్యన్మహాదాన వానీకసంహార కారా ! యుగాంతత్రిలోకాపహారా ! యశేషానుభృత్పుణ్య పాపక్రియా రూప దండాదికక్షామితప్రోల్లసత్కాల చక్రక్రమాకల్పితారంభ విభ్రాజిత స్థావరాత్మ స్ఫురద్విశ్వదాద్ధోరణోద్దండ ! వేధోండ సద్భాండ నిర్వాహనత్కుంభకారా ! నిరస్తాఖిలాంతర్వికారా ! విచిత్ర ప్రకారా ! త్రిలోకైకసాలానుకారా ! యవేద్యాంచితాకార ! ధిషాన్య సద్భోజ్య మాత్రప్రకాశోరు సంతోష యోగీంద్ర పూర్ణాబలోద్ధూత పంచాయుధో న్మాద నిద్రాది దారాత్మజస్నేహ దుర్లోభ లాభాబ్ధిబంధచ్ఛిదాలబ్ధ సౌఖ్యోల్ల సద్యోగయోగ్యాగ్రణీ సన్నిధానా ! త్రిలోకీనిదానా ! నిరస్త ప్రధానా ! నమాయావితానా ! సుశుద్ధాభిధానా ! ముఖంబుల్ సరోజంబులై బాహువుల్ సన్మృణాళంబులై కేశజాలంబు శైవాలమై, హల్లక స్తోమముల్ మాంసఖండంబులై తత్తనుత్రాణముల్ ఫేనజాలంబులై, యొప్పు ప్రత్యర్థి సేనాసరోమధ్య వీధిన్మదోన్మత్త దంతావళ శ్రీ విజృంభింపవే స్వామి ! దుష్టప్రభేదీ ! విశిష్టానుమోదీ ! నిజశ్రేణి దుర్దోష హారీ ! సదాభక్తవాంఛాప్రదా! దేవ! నిర్వ్యాంఛ మాయామహానాటకానీక నిత్యక్రియా సూత్రధారా ! నిజాంఘ్రిస్ఫురద్దివ్య గంగాంబుధారా ! మధుక్రవ్య భుగ్రక్తధౌతాసిధారా ! సునిష్కామ ! సంపూర్ణకామా ! ముకుందా ! నమస్తే నమస్తే నమః. 263

క. అని యానందాశ్రులు తమ
కనుగవపైఁ జిప్పతిల్లఁగా నాదివిష
జ్జనములు వినుతించి జనా
ర్దను వలన వరంబులంది రంజిలి రంతన్. 264

తే. గీ. దేవతలు చూడఁ బ్రహ్లాదు దివ్యతేజు
నఖిలదైతేయ వీరరాజాభిషిక్తుఁ
జేసె, భాగవతోత్తముఁ జేసె, భక్తి
నిలువఁజేసె జగము వర్ణింపఁజేసె. 265

వ. అంతఁ బ్రహ్లాదునకు ననేక వరంబులిచ్చి త్రిలోకశాంతిఁ గావించి సద్వా ద్యంబులు మ్రోయ నిజధామంబునకు నేఁగె ననిమిషులు పరమానందంబున నిజమందిరంబులకుం జనిరి మరియు. 266

క. పరమర్షులు నరసింహుని
చరితము నరసింహహృత విశంకట దోషాం
తర దోషాంతర వల్లభ
చరితమువలెఁ బొగడరైరి స్వాంతములందున్. 267

వ. దొరకొని లోకవాదంబులు బలవంతు లాడుకొందురు. యోగీంద్రులకు వృథాయాసంబులు; వీరలే కర్మంబులు చేసిన సద్గతిఁగాంచిరి? యజ్ఞంబులు చెరచి విప్రర్షుల భంజించి మత్తులైన దైత్యులు పరేశునివలన మృంతింజెంది భవాబ్ధిముక్తులైరి; ఏ మార్యులమౌట, ధృత సచ్చరిత్రుల మౌట, బహిస్థితులమైతిమి; దైత్యులు విష్ణు సద్గతి నొందిరి; దురాత్ముండు భృత్యహస్త్యశ్వరథాదులతో నీశ్వరుని పూర్వంబుల నారాధింపనోపు; నొకానొక భక్తినిరతుండు ప్రహ్లాదునికంటె నధికుండని, కృతార్థుండని తీర్థాంతరంబులకుం జనిరి. ప్రహ్లాదుండు భగవదాజ్ఞను రాజ్యంబు సేయుచుఁ దద్రాజ్యభోగతృష్ణ నొందక, జ్ఞానాచ్యుతాంఘ్రి భక్తిరాజ్యం బనుభవింపుచుండె; నీచరిత్రంబు వినిన వారికి రోగగ్రహదారిద్ర్య తాపంబు లణంగు ' ననిన విని నైమిశారణ్య మహర్షులు సూతునిం జూచి యిట్లనిరి. 268

శా. ఆదైతేయుఁడు శౌరిగాఁ దలఁచి యార్యాదిత్యయజ్ఞక్రియా
సాదం బెప్పుడుఁజేయ నాగమము లాచ్ఛాదించు తచ్చక్రహ
స్తా దేశంబులటంచు భోజన పిపాసారంభ నిద్రా విహా
రాదుల్సేయుచు నమ్మురాంతక విరోధార్థంబు మానుం డిలన్. 269

క. అతిబద్ధ మత్సరంబున
నతఁడుద్ధతిఁ గలలనైన హరిగెల్చిరణ
క్షితిఁ దరమితిననిఁ హర్షా
న్వితుఁడై యంతఃపురమున నృత్యములాడున్. 270

తే. గీ. అతడు హాశ్యాంతరములకు హరికథామృ
తంబు వీనులు చొరనిచ్చు తలఁచు నామ
ధేయములు జిహ్వఁజేర్చు విధేయులైన
భృత్యవర్గంబుఁదాను నిర్భీకుఁడగుచు. 271

తే.గీ. ఇట్లు దైత్యేశ్వరుని క్రోధమెల్ల కార్య
ములయెడను శ్రీరమాజాని తలఁపఁజేసె
సద్గురుఁడు సంతతజ్ఞాన శాలియైన
నరుని బోధించి నిలిపిన సలుపు మెఱయ. 272

వ. అటుగాన క్రోధావిష్కృతంబైన హరిస్మృతియు దైత్యునిందలంపంజేసె నేమి చెప్పుదు. వీఁడు దశాననుండై శిశుపాలుండై జనియించి రామ కృష్ణావతారంబులచేఁ బొలిసి పునర్జన్మంబు నొందఁడు. కృష్ణాశ్రయం బైన క్రోధంబును, గృష్ణాశ్రయంబైన కామంబును, దైత్యులకు గోపిక లకు మోక్షహేతువు. కేవల కామక్రోధములు జనుల కథఃపాత హేతువులహిదంష్ట్రలయందు సుధయుంబలె, చోర హస్తంబు లందు ధనంబునుంబలె స్మరరోషంబులచేత నొంద రీ ముక్తికినేమి యద్భుతంబు-కారణంబు హరి స్మృతియే. ఆ హరి స్మృతియే స్మర ద్వేష భక్తి విశేషంబులయం దుదయించు; నిష్టంబులు గాకయు నౌషధంబులు ద్రావి రోగి యారోగ్యంబు నొందినట్లె నరుండు హరి స్మృతివలన భవబంధంబులు వాయు; ద్వేషంబుననేని మృదర్థంబుగా భూమింద్రవ్వి నిదానంబు గనిన యట్లజ్ఞుండు కామక్రోధంబులనేని హరిస్మరణంబు చేసి మోక్షంబునొందు. అప్రయత్నంబుననేని ద్వేషం బున నేని వైచిన ననలంబు కక్ష్యాంతరంబు దహించిన యట్ల నాద రంబున నర్చించినం గిల్బిషంబులంబాయు; నజ్ఞుం డశ్రద్ధనైన సుధా పానంబు చేసి వజ్రకాయుండైన యట్ల శుద్ధభావుండేని ముక్తుండగు. ఇది వస్తుస్వభావంబు. సూర్యుండు తమోనాశనంబునకు, శీతశాంతికి నన లంబునైన యట్లు, సర్వేశ్వరుండు లీలాప్త హృదయుండై ద్వేషులకు మోక్షం బొసంగను, అనురక్తులకు నిష్టవరంబులొసంగను సన్నద్ధు డైనవాఁ డద్దేవయోగంబునకంటె భక్తియోగంబు ప్రశస్తంబు; ఘోరం బులైన మోక్షవిఘ్నంబులవలన హరి తానే రక్షింపుచునుండుఁగాన నిటు వంటి కరుణాసింధువు నాశ్రితవత్సలు నెవ్వం డాశ్రయింపండు? పాపా త్ముండైన యాత్మద్రోహి యాశ్రయింపండు గాక! సదాసూర్యుండు బహుయోజన సహస్రంబు లక్షణంబునఁ బోవుచు వేగంబునం జనుల యాయువు క్షయింపంజేయు; నార్తప్రమత్త సుప్తవ్యాధితులైన వారి నుష్ణధాముండు హ్రాసంబు నొందించుంగాని విడంబంబు సేయండు.

వేగవంతంబైన కాలచక్రంబుచే సదాత్రిప్పంబడి జీవుండు యోని సహస్రంబుల జనియింపుచుండుఁ గాని నరుండై యుండుట నిత్యంబు గాదు; జనుండొప్పు యెల్లియో యెల్లుండియో మృత్యు వాసన్నంబని యెఱుంగఁడు; జన్మ మరణ నరక క్లేశంబులు ధ్రువంబులు స్వాస్థ్యంబులేదు గాన బ్రతికినయన్నినాళ్లు హరిభజనంబు సేయవలయు ననేకజన్మంబులు గాంచి కర్మభూమిని మనుజుండై జనియించుట నెన్నండిటువంటి జననంబునొంది వృథాప్రయత్నంబున నుండుట దగునె? నరులలో విప్రత్వంబు నొందుట మిగుల దుర్లభంబు. తద్విప్రత్వంబు నొందియు హరిభజనంబు లేక యుండుట దగునె? వ్యాధి వ్యాఘ్రగ్రస్తంబైన తాపత్రయమహోగ్ర మృగసింహ భయంబైన సంసారాతి వనంబునందు నరునికి రక్షాన్వేషనంబు సేయక క్రీడించఁదగునే? విషయ వ్యాధి మహాసర్పంబులతో భవ తరుకోటరంబులనుండి పురుషుం డనుగ్రహంబున నిర్భయుండై గరుడవాహను నాశ్రయింపక యుండంజెల్లదు గానఁ దొల్లి సురరూపంబున సుధాపానంబు సేయుచు విఘ్నంబు శంకించు రాహువునకైన యట్లు భజింపుచు శంకించిన హరిదుర్లభుండగు మనంబునం దలంపవలయు; కరంబునఁ బాదార్చనంబు సేయవలయు; శ్రోత్రంబుల దత్కథలు వినవలయు; దద్యశంబు భావింపవలయును; నేత్రంబులఁ దత్ప్రియులైన వారింజూడవలయు; పాదంబులఁ దత్పుణ్యక్షేత్రంబులు ద్రొక్కవలయు; నిట్లన్ని దినంబులు గడుపుచునుండువాఁడు బ్రతికిన యతండు అట్లు సేయండేని వాఁడు జీవచ్ఛవంబు మక్షి కామ శక కాక ముఖ్యంబులైన క్షుద్రజంతువులు కోటుల కొలందులు బ్రదుకవే! కామ మోహంబులు విడిచినవారు వైష్ణవులు. యోజన శతంబులనున్న మర్త్యుండైన గంగాతరంగిణీ నిజాంఘ్రి సంస్పర్శ పవిత్రయైన దానిం దలంప నఘశతంబులు దరింపంజేసిన నారాయణు భజింపుఁడు. హరి భజనం బెవ్వండుసేయు నతండె సమస్తజనుల పాపంబులు హరించు. దీపంబులు లేక యుండిన గృహంబులనేని దిననాథుం డుదయించి తమంబు హరించునట్లు సందర్శన స్పర్శన పూజనంబులచేతఁ గుశలుండైన భాగవంతుఁడు విష్ణు ప్రతిమయుంబోలెఁ దమంబులు హరింపుచు దీపంబుంబలె బరహితం బాచరింపవలయు లోకంబున. 273

క. అనిన విని శౌనకాదులు
మనమున హర్షించి దైత్య మథన కథావ
ర్ణన సంశ్రవణ కుతూహల
జనితోల్లాసమునఁ జనిరి సంరంభమునన్. 274

మ. సతత స్వాశ్రితసుందిరాంతరము హుస్సంగోప్యగోత్రాగ్రణీ
రతి సంధాన విచిత్ర మోహన కళారా సేహసే హాస్మర........
.................................. 275
................................

క. గోపతి గమనస్తోత్రా!
గోపతి కృతవర్షధృత సుగోత్రచ్ఛత్రా!
గోపాంగనాకళత్రా!
గోపార్భకవత్సరూప! గురుతర సూత్రా! 276

మాలిని
కుముదహితకులేశా! కోటి సూర్యప్రకాశా!
విమలకమలనేత్రా! విస్ఫురన్నీలగాత్రా!
భ్రమర చికురజాలా! భక్తచిత్తాబ్జఖేలా!
సమదఖిలవిదారీ! సర్వలోకాపహారీ! 277

## గద్యము

ఇతి శ్రీమత్కంజర్ల కొండమాచార్య
పాదారవింద మిళిందాయమాన చెన్నయామాత్యపుత్ర
కశ్యపగోత్ర పవిత్ర శ్రీమదల్లాడ నరసింహ ప్రణీతంబైన
నారదీయ పురాణంబునందు నష్టమాశ్వాసము
సర్వంబును సంపూర్ణము.

వాఙ్మయ మహోధ్యతు, కళా-ప్రపూర్ణ

డాక్టర్ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి పరిశోధనా రచన

# నారదీయపురాణ అమృతనవనీతం-మహామథన సారామృతంలో

## ఉదాహృతాలైన సంస్కృతాంధ్ర గ్రంథాలు

అద్భుత రామాయణం

అనంతుని ఛందస్సు (తె)

గణపతి (గణేశ)

చండిక

### గమనిక

ఉదాహృత గ్రంథాలలో "దుర్జన ముఖ చపేటిక" అన్న ఖండన మండన గ్రంథాలు విభిన్న రచయితలు రచించినవి రెండున్నాయని గుర్తించాలి.

"ముక్తాఫల" సంకలన గ్రంథానికి వ్రాయబడిన "కైవల్య దీపిక" వ్యాఖ్యను చేర్చుకోవాలి.

బెంగాలీ భాషలో రచింపబడిన "బెంగాలీ సాహిత్య చరిత్ర" గ్రంథాన్ని చేర్చుకోవాలి.

"పురాణనిరీక్షణ" గ్రంథం మహారాష్ట్ర గ్రంథంగా గుర్తించాలి.

---

విశ్వైవక్యోపనిషత్తు

ఉప పురాణాలు

అంగిరస

ఆది

ఆదిత్య

ఔషనస

కల్కి

కాపిల

కాళీ

కౌమార

బృహన్నారదీయ

బ్రహ్మాండ

భవిష్యోత్తర

భాగవత

భార్గవ

మానవ

మారీచ

మాహేశ్వర

లింగ

వారుణ

వాశిష్ఠ
విష్ణుధర్మ
విష్ణు ధర్మోత్తర
శివధర్మ
సనత్కుమార
సాంబ
సౌర
స్కాంద

**ఉప వేదాలు**

అర్థ (శాస్త్రం) వేదం
ఆయుర్వేదం
గాంధర్వవేదం
ధనుర్వేదం

**ఉప స్మృతులు**

ఆశ్వలాయన
కంద
క్రతు
కపింజల
కాణాద
కాత్యాయన
కాశ్యప
గోభిల
జనక
జాతుకర్ణ్య
జాబాలి
నాచికేతు
పైఠీన
బోధాయన
యాజ్ఞవల్క్య
లౌగాక్షి

విశ్వామిత్ర
వ్యాస
శాంతన
సనత్కుమార
కల్పాలు
కామశాస్త్రం
కుమారసంభవం (సం) (తె)
కుమారసంభవ విమర్శ (తె)
ఖగోళ శాస్త్రం
గర్గ సంహిత
ఛందశ్శాస్త్రం
తంత్ర శాస్త్రం
దశకుమార చరిత్ర (తె)
దుర్జన ముఖ పద్మ పాదుక
దుర్జన ముఖచ పేటిక
నక్షత్రములు (తె)
నా ఆకాశవాణి ప్రసంగాలు (తెలుగు-సంస్కృతం)
నారదీయపురాణం (తె)
నిరుక్తం
నిర్వచనోత్తర రామాయణం (తె)
నృసింహ పురాణం (తె)
న్యాయ శాస్త్రం

**పత్రికలు**

ఆంధ్రప్రభ (దిన)
కృష్ణాపత్రిక (వార)
గోలకొండ పత్రిక (దిన)
త్రిలిఙ్గ (మాస)
భారతి (మాస)
సుభాషిణి (మాస)
పురాణ నిరీక్షణ

**పురాణాలు**

అగ్ని
కూర్మ
గరుడ
దేవీభాగవత
నారద
పద్మ
బ్రహ్మ
బ్రహ్మకైవర్త
బ్రహ్మవైవర్త
బ్రహ్మాండ
బ్రాహ్మ
భవిష్యత్
భాగవత
మత్స్య
మార్కండేయ
లింగ
వరాహ
వామన
వాయువ్య
విష్ణు
శివ
స్కాంద
ప్రభావతీ ప్రద్యుమ్నం (తె)
ప్రాతిశాఖ్యలు
ప్రౌఢవ్యాకరణము (తె)
బృహన్నారదీయం (తె)
బ్రహ్మ సూత్రాలు
బ్రాహ్మణాలు
భగవద్గీత
భాగవతం (తె)
భాగవతామృతం
భాగవత సందర్శనం
భారత రచనలో వెల్లివిరిసిన కవితాప్రాభవం (తె)
మంత్ర శాస్త్రం
మహాభారతం (సం) (తె)
మార్కండేయ పురాణం (తె)
మార్గ-దేశి (తె)
మీమాంస శాస్త్రం (పూర్వ-ఉత్తర)
ముక్తాఫలం-సంకలన గ్రంథం
యోగశాస్త్రం
రామాయణం
విద్యారణ్యుల వేద (సాయన) భాష్యం
వేదాంతం

**వేదాలు**

అథర్వవేదం
ఋగ్వేదం
కృష్ణ యజుర్వేదం
శుక్ల యజుర్వేదం
సామవేదం
వైశేషికదర్శనం
వైష్ణవ తంత్రం
వ్యాకరణశాస్త్రం
శిక్షాశాస్త్రం
శిల్పశాస్త్రం
శ్రీవిరూపాక్ష — శ్రీరామ— శాసనములు— ఆరవీటి వంశ చరిత్ర (తె)
షష్ఠ్యంతాలపుట్టుపూర్వోత్తరాలు— వ్యాసం (తె)
సప్తసంతానాలలో కృతి సతియా ? సుతయా ? (తె)
సంఖ్యాశాస్త్రం
సాంఖ్యదర్శనం

## సూత్రగ్రంథాలు

అగస్త్య శాకల్య
అగ్నివైశ్య
అనువాక సంఖ్య
ఆపస్తంభ
ఆశ్వలాయన
ఇష్టకాపూరణ
ఉపలక్షణ
ఉబ్దశాస్త్ర
ఋగ్యజుస్సు
కాత్యాయన
కూర్మ లక్షణ
కౌండిన్య
కాపీత
క్రమసంఖ్య
జైమినీయ
ద్రాహ్యాయన
నిగమ
పార్శ్వద
ప్రతిజ్ఞ
ప్రవరాధ్యాయ
ప్రసవోదాన
బోధాయన
భాగలక్షణ
భారద్వాజ
మాధ్యందిన
యజ్ఞపార్శ్వ
వాధూల
వైఖానస
శరణవ్యూహ
శాకల్య శాంభవీయ
శుల్బ
శౌనకీయ
శ్రాద్ధకల్ప
సత్యాశాఢి
హిరణ్యకేశి
హేత్రిక

## స్మృతులు

అంగిరస
అత్రి
ఆపస్తంభ
ఆశ్వలాయన
ఉపనస
గౌతమ
దక్ష
పరాశర
ప్రాచేతన
బృహస్పతి
బ్రహ్మ
మను
యమ
యాజ్ఞవల్క్య
యోగీశ్వర
లిఖిత
విష్ణు
శంఖ
శాతాతప
సంవర్త
హారీత

# సవరణలు

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 4 | 3 | శ్రీకరవు | శ్రీకరంపు |
| 5 | 9 | సూరులే | సూరుల్ |
| 16 | 27 | దతిదీనుని | డతిదీనుని |
| 23 | 26 | హారిని | హారి |
| 28 | 1 | నిర్ఘ | నిర్ఝ |
| 30 | 10 | గట్టించి | ఘట్టించి |
| 30 | 11 | వైచివైచి | నవచి నవచి |
| 34 | 27 | ద్రిప్పియార్చి | నార్చిత్రిప్పి |
| 40 | 7 | తాచినట్లు | తాము తాచినట్లు |
| 43 | 18 | మందరాగధృతి | మందరాగాధృతి |
| 44 | 20 | బోలె | బోలె |
| 51 | 11 | సయోజ్ఘిత | సయోజ్ఝిత |
| 53 | 5 | స్యమంత | శ్యమంత |
| 64 | 24 | దేవి | దేలి |
| 84 | 28 | డెన్నఁడు తన్మహో | డెన్నఁడుఁ దన్మహో |
| 94 | 23 | జేరెన్నిఁక | బేరెన్నిఁక |
| 99 | 26 | శార ప్తి | శరాప్తి |
| 130 | 28 | దాత్రి | ధాత్రి |
| 140 | 3 | వారవెవ్వరి | వారలెవ్వరి |
| 142 | 6 | నికరములు | నికరము |
| 152 | 5 | వయ్యమరవరులు | నయ్యమరవరులు |
| 192 | 24 | ధల్మహానియు | ధర్మహానియు |
| 199 | 1 | చిత్ర ధర్మా దర్మ | చిత్ర ధర్మా ధర్మ |
| 202 | 11 | దుల్భర | దుర్భర |
| 202 | 12 | వర్తించిన్ | వర్తించినన్ |
| 212 | 26 | సూల్య దీప్తి | సూర్య దీప్తి |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 232 | 12 | గలదె | గలవె |
| 234 | 29 | విజయా సంభవవంబైన | విజయా సంభవంబైన |
| 245 | 2 | కభ్యంజనం | కభ్యంజనంబు |
| 268 | 23 | గలనే ? | గలనె ? |
| 275 | 13 | పరమారం | పరమార్థం |
| 292 | 14 | భజియుంపు | భజియింపు |
| 294 | 27 | పయోధధర | పయోధర |
| 319 | 11 | మెన | మైన |
| 334 | 10 | విందుఁడై | విందుండై |
| 353 | 13 | ప్రతికూలానుభయ | ప్రతికూలానుకూలానుభయ |
| 358 | 12 | నిరుద్ధలోకంబు | అనిరుద్ధ లోకంబు |
| 361 | 26 | వేదనలు | వేదనల్ |
| 364 | 24 | కర రంధ్రములచే | కర్ణ రంధ్రములచే |
| 366 | 2 | బహుళ్ఘాకారుఁడై | బహుళార్థాకారుఁడై |
| 366 | 3 | నయనాంభోహర | నయనాంభోరోహ |
| 367 | 19 | భావములందు | భావమందు |
| 377 | 20 | వైభం | వైభవం |
| 406 | 21 | సరసహాస్యా సేష | సరసహాస్యాశేష |
| 437 | 1 | పుత్రున | పుత్రుని |
| 440 | 4 | యెట్టుల | నెట్టుల |
| 449 | 4 | బాలర్కు | బాలార్కు |
| 461 | 29 | గ్రో బ్రాహ్మణుల | గో బ్రాహ్మణుల |
| 461 | 30 | గ్రో బ్రాహ్మణులు | గో బ్రాహ్మణులు |
| 470 | 2 | బిలిచి | దలచి పిలిచి |
| 472 | 13 | బత్రికూలములు | బ్రతికూలములు |
| 478 | 22 | శాంతి మొందె | శాంత మొందె |
| 481 | 15 | జానాంకురము | జ్ఞానాంకురము |
| 481 | 21 | విచ్ఛిన్న | విచ్ఛిన్నమై |
| 499 | 8 | సర్వో | సర్వో |
| 503 | 27 | కీరన | కీర్తన |
| 507 | 24 | బ్రహోదు | బ్రహ్లోదు |